బుట్టల గుట్టలా!

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి ముంచంగిపుట్టు మండలంలో జరిగే సంతలకు రైతులు కూరగాయల బుట్టలను జీపులు, ఆటోలకు పరిమితికి మించి వేలాడదీసి తీసుకొస్తున్నారు. లక్ష్మీపురం, వనుగుమ్మ, గత్తురమండ, బడేల్, పనస ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక రైతులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఓ జీపు కనిపించని విధంగా ఇలా చుట్టూ బుట్టలు వేలాడదీశారు.
– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అరకులోయలో గురువారం 8.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. జి.మాడుగుల 9.3, ముంచంగిపుట్టు 9.5, డుంబ్రిగుడ 9.7, పెదబయలు 10.3, హుకుంపేట 10.6, పాడేరు 10.8, చింతపల్లిలో 12.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు.

పాఠశాల సముదాయాలకు కొత్త హంగులు

జిల్లాలో స్కూల్ కాంప్లెక్సులు :	116
కంప్యూటర్ల విలువ :	రూ. 77.72 లక్షలు

రాజవొమ్మంగి ఉన్నత పాఠశాలలో వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థలో కూటమి ప్రభుత్వం అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. పాఠశాల సముదాయ కేంద్రాలకు కొత్త కంప్యూటర్లు సమకూర్చింది. గతంలో నివేదికలు రూపొందించడానికి ఉపాధ్యాయులు అంతర్జాల కేంద్రాలపై ఆధారపడేవారు. బిల్లుల చెల్లింపునకు సొంత నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల అవసరమైన సామగ్రి, రూటర్లు అందజేయడంతో ఉపశమనం లభించింది. ఇప్పటికే స్కూల్ కాంప్లెక్సులలో టీఎల్ఎం, రవాణా భత్యం, ఇతర ఖర్చులకు రూ. లక్ష నిధులను విడుదల చేశారు. గతంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించేటప్పుడు పథకాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల సమగ్ర ప్రగతి, ఇతర అంశాలను జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించాల్సి ఉండటంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం కొత్త కంప్యూటర్లు రావడంతో పాఠశాలల నిర్వహణ, ఇతర సమాచారం ఉన్నతాధికారులకు అందించడంలో సహాయపడుతుంది.

★ ఒక్కో సముదాయానికి సుమారు రూ. 67 వేల చొప్పున మొత్తం రూ. 77.72 లక్షల విలువ చేసే కంప్యూటర్, స్టేషనరీ అందజేశారు. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాల సదుపాయం, నెట్‌వర్క్ మార్పుచేర్పులకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది.

» **విద్యార్థుల ప్రగతి తెలుసుకోవచ్చు:** స్కూల్ కాంప్లెక్సు పరిధిలో ఉపాధ్యాయులకు కంప్యూటర్లు అందించడంతో సమస్య పరిష్కారమైంది. సమాచారం సక్రమంగా అందించడానికి, విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.
– డాక్టర్ స్వామి నాయుడు, జిల్లా ప్రాజెక్టు అధికారి, సమగ్ర శిక్ష

వడివడిగా విస్తరణ అడుగులు

“ పాడేరు పట్టణ ప్రధాన రహదారి విస్తరణ ప్రక్రియ పట్టాలెక్కనుంది. దీర్ఘకాలంగా జాప్యం జరుగుతూ వస్తున్న విస్తరణ పనులు సత్వరం ప్రారంభించి ఆర్థిక సంవత్సరం చివరకు పూర్తిచేసేలా ఆర్అండ్‌బీ అధికారులు కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం సాధ్యమైనంత త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తిచేసేలా ముందుకు సాగుతోంది.
– న్యూస్‌టుడే, పాడేరు పట్టణం ”

ఆక్రమణలు తొలగించాక ప్రధాన రహదారి

■ అంబేడ్కర్ కూడలి నుంచి పాడేరు ప్రధాన రహదారి, మండల పరిషత్తు కార్యాలయం మీదుగా నక్కలపుట్టు వరకూ సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర రహదారిని ఆర్అండ్‌బీ శాఖ విస్తరించనున్నారు.

■ సంయుక్త కలెక్టర్ బంగ్లా నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా చింతలవీధి పెట్రోల్‌బంకు వరకూ సుమారుగా ఆరు కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) అథారిటీ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మించనున్నారు. ఈ మేరకు ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించే పనిలో ఉన్నారు.

■ **పెరిగిన వాహన రద్దీ:** పాడేరు జిల్లా కేంద్రమయ్యాక ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఇందుకు తగినట్టు వ్యాపార, వర్తక కార్యకలాపాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. పట్టణంలో ముఖ్య కూడళ్లు అయిన అంబేడ్కర్, ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు ప్రధాన రహదారి పొడవునా వాహన రద్దీ పెరిగింది. పర్యాటకంగా వంజంగి పేరుపొందడంతో రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకుల తాకిడి ఎక్కువైంది. దీంతో అరకులోయ పట్టణ తరహాలో ప్రధాన రహదారికి ఇరువైపులా డివైడర్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రించాలని అధికారులు భావించారు. దీనికి తగ్గ సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సైతం సిద్ధం చేశారు. అంచనాలు రూపొందించి ఆర్థికశాఖ అనుమతికి సమర్పించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి పాడేరు పట్టణంలో సువిశాలమైన రహదారుల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. రోడ్డు విస్తరణకు అవసరమైన స్థల కేటాయింపు, సర్వే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

■ **విస్తరణ తప్పనిసరి:** పెరుగుతున్న రద్దీ దృష్ట్యా పాడేరు పట్టణ ప్రధాన కూడళ్ల విస్తరించడం అనివార్యమైంది. దీనికి సంబంధించి ఇప్పటికే రహదారులకు ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలాల్లోని ఆక్రమణలు తొలగించాం. విస్తరణకు ప్రాథమిక అంచనాగా రూ. 42 కోట్ల వరకూ ఖర్చవుతుందని ఆర్థికశాఖకు ప్రతిపాదించాం. అనుమతులు వచ్చిన తక్షణమే పనులు ప్రారంభిస్తాం.
– బాలసుందరం, ఈఈ, ఆర్అండ్‌బీ, పాడేరు డివిజన్

వైద్యశాఖలో ఇంటి దొంగలు

నల్లబజారులో మందుల విక్రయాలు?

పాడేరు, న్యూస్‌టుడే: కంచే చేను మేస్తే అన్న చందంగా తయారైంది జిల్లా వైద్యాశాఖాధికారి కార్యాలయ పరిధిలోని డ్రగ్ స్టోర్‌లో (మందు నిల్వల కేంద్రం) పరిస్థితి. ఓ ఉన్నతాధికారి సహకారంతో డ్రగ్స్ స్టోర్‌లో ‘కొవిడ్’కు కేటాయించిన మందులు పక్కదారి పట్టాయని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ప్రజా సంఘాలు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. దీనిపై విచారణ చేపట్టాలని ఆర్‌డీఓ లోకేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. గురువారం వైద్యశాఖ అధికారితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫార్మసిస్టును ఆర్‌డీఓ పిలిపించి విచారణ జరిపారు.

★ కొవిడ్ సమయంలో జిల్లా వైద్యశాఖ కార్యాలయం పరిధిలోని డ్రగ్ స్టోర్‌కు రూ. కోట్లాది విలువైన మాస్కులు, శానిటైజర్లు, ఇతర మందులు సరఫరా అయ్యాయి. వాటిని జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి పంపిణీ చేయాల్సి ఉంది. ఈ మందులను ఓ ఉన్నతాధికారి పరోక్ష సహకారంతో నల్లబజారులో విక్రయించేసినట్లు ఫార్మసిస్టుపై కలెక్టర్‌కు ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీల కార్యాలయాలకు చేరాల్సిన ఫర్నిచర్, ఇతర సామగ్రిని పక్కదారి పట్టించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో పలు అంశాలపై విచారణ చేపట్టారు. డ్రగ్ స్టోర్‌లో మందు నిల్వలు, సరఫరా చేస్తున్నప్పుడు, స్టాక్ వచ్చే సమయంలో రసీదులు, ఇతర దస్త్రాల నిర్వహణను పరిశీలించారు. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు నివేదించనున్నారు. దీనిపై ఆర్డీవో లోకేశ్వరరావును ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా.. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఫార్మసిస్టును పిలిపించి విచారణ చేపట్టినట్లు చెప్పారు.

మన అడవుల్లో పులులున్నాయా?

నర్సీపట్నం గ్రామీణం, చింతపల్లి, న్యూస్‌టుడే: పులులు, ఇతర జంతువుల గణనకు అటవీ సిబ్బంది సమాయత్తమవుతున్నారు. నాలుగేళ్లకోసారి ఈ గణన నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 8 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గతంలో జంతుగణన పుస్తకంలో నమోదు చేసేవారు. ఈ ఏడాది నుంచి ఆధునిక సాంకేతిక విధానం ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. దీనికోసం నర్సీపట్నంలో అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా చింతపల్లి డివిజన్‌లోని సిబ్బందికి లంబసింగిలో శిక్షణ ఇచ్చారు.

డిసెంబరు ఒకటి నుంచి గణన

సాంకేతిక విధానం ద్వారా లెక్కింపు

లెక్కింపు ప్రక్రియ ఇలా.. తొలి మూడు రోజులు సిబ్బంది నిర్దేశిత ఐదు కిలోమీటర్ల పరిధిలో కాలినడకన తిరుగుతూ పులుల సంచారానికి సంబంధించిన ఆనవాళ్లను గమనిస్తారు. తదుపరి ఐదు రోజులు చిరుతలు, ఎలుగులు, అడవి కుక్కలు తదితర మాంసాహార జంతువులను గుర్తిస్తారు. జంతువులు నేరుగా కనిపిస్తే ఫొటో తీస్తారు. లేదా పెంటికలు, చెట్ల రాపిడిలు తదితర ఆనవాళ్లను గుర్తిస్తారు. అడవుల్లో సంచరించే పశువుల కాపరులు, అడవులకు దగ్గరగా గ్రామాల్లో నివసించే ప్రజల నుంచి సమాచారం సేకరిస్తారు. తిరుగు ప్రయాణంలో ఎన్ని వృక్షాలు ఉన్నాయి. అవి ఏయే రకాలని అంచనా వేస్తారు.

▌జిల్లాలో 2022లో పులి సంచారం కలకలం రేపడం తెలిసిందే. నర్సీపట్నం మండలం మెట్టపాలెం ప్రాంతంలో ఓ పశువును చంపేసింది. తరవాత విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో ఈ పులి సంచారం కనిపించింది. ఇప్పుడు దాని జాడలేదు.

▌ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు వద్ద ధారకొండలో పులి తిరుగుతోందని పలువురు గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రూఢీ కాలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో దశాబ్దాల క్రితం నాలుగు చిరుతల సంచారం ఉన్నట్లు గుర్తించారు.

▌ఏడాది క్రితం మాకవరపాలెం మండలం యరకన్నపాలెంలో కణుజు మాంసం స్వాధీనం చేసుకున్నారు. రాచపల్లిలో ఓ రైతు పొలంలో చెట్ల పరిశీలనకు వెళ్లిన అటవీ సిబ్బందికి కణుజు కొమ్ములు దొరికాయి. ఇలా అక్రమంగా వన్యప్రాణుల వేట సాగుతోంది.

★ జిల్లాలో పులులు, ఇతర జంతువుల గణనకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ప్రొఫార్మాలో కేంద్రానికి పంపుతామని చింతపల్లి డీఎఫ్‌ఓ వై.వి.నరసింహరావు తెలిపారు.

డివిజన్ల వారీగా అటవీ విస్తీర్ణం (హెక్టార్లలో)

☛ పాడేరు	19,78,729
☛ చింతపల్లి	1,97,18,102
☛ రంపచోడవరం	2,82,846

త్వరితగతిన జల్‌జీవన్ పనులు

పాడేరు, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి గురువారం సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జి.మాడుగుల నుంచి 13 కిలోమీటర్ల దూరంలోని నేరేడుబంద గ్రామానికి స్ప్రింగ్ సోర్స్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి విభాగం ఇన్‌ఛార్జి డీఈ టి.చంద్ర, ఏఈ సీహెచ్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల ఆదేశాల మేరకు చేపట్టే అన్ని రకాల ప్రక్రియలు, అంశాలపై బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొన్నారు. జిల్లాకు సంబంధించిన అన్ని అంశాలను వెల్లడించారు. బీఎల్‌ఓలకు రెండు విడతలుగా శిక్షణ పూర్తి చేశామన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకుంటున్నామని చెప్పారు. ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఇన్‌ఛార్జి ఆర్‌డీఓ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్.. చిత్రంలో ఇన్‌ఛార్జి జేసీ తిరుమణి శ్రీపూజ, ఇన్‌ఛార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు

కోటేశ్వరికి లోటే రానివ్వం!

కన్నవారు లేని యువతి వివాహానికి ఊరంతా ఒక్కటై..

రావికమతం, న్యూస్‌టుడే: వివాహం జీవితంలో వచ్చే అరుదైన ఘట్టం. తల్లిదండ్రులు, బంధుమిత్రులు కలిసికట్టుగా జరిపించే వేడుక. చిన్నప్పుడే తల్లిదండ్రులు దూరమైన ఓ యువతికి.. అయినవారు లేని లోటు లేకుండా ఊరంతా అండగా నిలిచింది. జరుగుతోంది తమ ఇంటి పెళ్లివేడుక అన్నట్టుగా ప్రతి ఒక్కరూ ఆమెకు అండగా నిలిచారు. పెళ్లి ఖర్చులు మొదలుకొని, సారె పెట్టడం వరకు పుట్టింటివారికి ఏమాత్రం తగ్గకుండా ఏర్పాటు చేశారు. అన్నవరం దేవస్థానంలో గురువారం రాత్రి దగ్గరుండి పెళ్లి చేయించేందుకు మహిళలు, జనసేన యూత్, పెద్దలు తరలివెళ్లారు.

★ చినపాచిల గ్రామానికి చెందిన కేశంశెట్టి కోటేశ్వరి తల్లిదండ్రులు కేశంశెట్టి అప్పారావు, సత్యవతి బాల్యంలోనే మృతిచెందారు. సోదరులు కూడా లేకపోవడంతో అక్కాబావల సంరక్షణలోనే పెరిగింది. ఏడో తరగతి వరకు చదువుకున్నాక మధ్యలోనే మానేసింది. తదనంతరం వేర్వేరు పనులు చేసుకుంటూ జీవనం సాగించింది. కట్నకానుకలు ఇచ్చి పెళ్లిచేసే ఆర్థిక స్థోమత అక్కాబావకు లేదు. కోటేశ్వరిని పెళ్లి చేసుకోడానికి వి.మాడుగుల మండలం గొటివాడకు చెందిన నగేష్ ముందుకొచ్చాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితిలో ఆమెకు ధైర్యం చెబుతూ చినపాచిల గ్రామమంతా ఏకమైంది. తమ ఊరి ఆడబిడ్డకు ఏ లోటులేకుండా ఘనంగా వివాహం జరిపించాలని నిర్ణయించారు.

కొనుగోలు చేసిన సారె సామగ్రితో మహిళలు

వధూవరులు కోటేశ్వరి, నగేష్

★ గ్రామస్థులే పెళ్లి ఖర్చుల నిమిత్తం సుమారు రూ. 50 వేలు సమీకరించారు. అంతా కలిసికట్టుగా వేడుకలో పాలుపంచుకున్నారు. పెళ్లి కుమార్తెను చేయడం నుంచి మాంగళ్యధారణ వరకు ఖర్చులన్నీ వారే చూసుకున్నారు. సారె సామానుగా బీరువా, వాషింగ్ మిషన్, దివాన్ కాట్, పరుపులు, కుర్చీలు, ఇత్తడి, స్టీలు సామగ్రి తదితరాలు కొనుగోలు చేశారు. వివాహ వేదికను అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం వద్ద నిర్ణయించారు. యువతికి వివాహం జరిపించే విషయంలో స్థానిక జనసేన యూత్ సభ్యుడు మచ్చా రాజు, గ్రామ యువత అన్నీ తామై ముందుండి నడిపించారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

గౌతమ్

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో జరిగిన ఇంటర్నేషనల్ వాల్యూ ఎడ్యుకేషన్ ఒలింపియాడ్ పోటీల్లో పెదబయలు మండలం ఏకలవ్య పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి కొర్రా గౌతమ్ జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. ఈ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. వీరిలో 12 మంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గౌతమ్ ఒక్కరే ఉన్నాడు. ఈనెల 30వ తేదీన దిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్‌యాదవ్ చేతులమీదుగా బహుమతి అందుకోనున్నట్లు ప్రిన్సిపల్ అమిత్ కుమార్ ఆనంద్ తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపల్, తల్లిదండ్రులు అభినందించారు.

నాణ్యతకు తూట్లు.. దారంతా గోతులు

మన్యంలో రహదారుల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవతో 2021లో రంగిలిసింగి పంచాయతీ మారుమూల కుట్టి గ్రామానికి శాశ్వత బీటీ రోడ్డు మంజూరైంది. గుత్తేదారు ఈ పనులు పూర్తిచేయడానికి రెండేళ్లు తీసుకున్నారు. అయిదేళ్ల గడువు పూర్తవ్వక ముందే రోడ్డు గుంతలమయంగా మారింది. నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని గిరిజనులు చెబుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొంటున్నారు. గుత్తేదారు ప్రస్తుతం పైపైన మెరుగులు అద్ది చేతులు దులుపుకొన్నారు.
– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

పంట లేక మండుతున్నాయి!

కార్తికం ముగిసినా దిగిరాని కూరగాయల ధరలు

అనకాపల్లి, అరకులోయ, న్యూస్‌టుడే

ఏటా కార్తికమాసంలో చాలా మంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ కారణంగా ఈ నెలలో కూరగాయలకు డిమాండ్ ఎక్కువై ధరలు పెరుగుతుంటాయి. కార్తికం ముగిశాక మార్కెట్‌లో ధరలు దిగివస్తాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. కార్తికం ముగిసినా కూరగాయల ధరలు దిగివస్తున్న పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను దెబ్బకు పలు ప్రాంతాల్లో వేసిన కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఈ ప్రభావం ధరలపై కనిపిస్తోంది. బీర నుంచి బీన్స్ వరకు అన్నింటి ధరలూ అధికంగానే ఉన్నాయి. కూరగాయల ధరలు వింటేనే గుండె గుభేలుమంటోందని పట్టణ మహిళలు బి.మంజుల, కె.కళావతి ఆవేదన వ్యక్తం చేశారు.

« జిల్లాలో సబ్బవరం, కశింకోట, అనకాపల్లి, సీతానగరం, వెంకుపాలెం, తీడ ప్రాంతాల్లో రైతులు బీర, వంకాయలు ఎక్కువగా సాగు చేస్తారు. స్థానికంగా పంట లేకపోవడంతో విజయవాడ, సికింద్రాబాద్, బెంగుళూరు నుంచి రప్పిస్తున్నారు.

« గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలికూర, చుక్కకూర సాధారణంగా రూ. 10కి నాలుగు కట్టలు ఇస్తారు. గతవారం వరకు ఒక కట్టే ఇచ్చేవారు. ప్రస్తుతం అనకాపల్లి, నాగులాపల్లి, తుమ్మపాల ప్రాంతాల నుంచి ఆకుకూరలు మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో ధరలు కాస్త తగ్గినట్లు వర్తకులు తెలిపారు. ప్రస్తుతం మూడు కట్టలు ఇస్తున్నారు. « మునగకాడ ఒకటి రూ.25 నుంచి రూ.30కి విక్రయిస్తున్నారు. తుపానుకు చాలా ప్రాంతాల్లో చెట్లు విరిగిపోయాయని రైతులు తెలిపారు.

« అనకాపల్లిలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఉంది. ఇక్కడి నుంచి జిల్లాలోని చోడవరం, ఎలమంచిలి, నర్సీపట్నం, అచ్యుతాపురంతోపాటు విశాఖ నగరంలోని గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెంకు కూరగాయలు సరఫరా చేస్తారు. మార్కెట్ రోజుకు మొత్తం 1,500 క్వింటాళ్ల కూరగాయలు అవసరం కాగా.. ప్రస్తుతం 1,100 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నట్లు వర్తకులు చెబుతున్నారు.

తారెక్కిస్తున్న టమాటా : ప్రస్తుతం జిల్లాలో టమాటా సాగు తక్కువగా ఉంది. డిసెంబరు మొదటి వారం నుంచి జిల్లాలో ఈ పంట సాగు చేస్తారు. దిగుబడి చేతికి రావాలంటే మరో రెండు నెలలు ఆగాలి. ప్రస్తుతం మదనపల్లి, బెంగుళూరు నుంచి సరకు వస్తోంది. తుపాను కారణంగా మదనపల్లిలోనూ చాలావరకు పంట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

కూరగాయలు	కేజీ ధర రూ.లలో
టమాట	70
తెల్ల వంకాయలు	60
నల్ల వంకాయలు	70
బీరకాయలు	80
దొండ	50
చిక్కుడు	80
క్యాబేజి	35
క్యారెట్	60
బీన్స్ పిక్కలు	150
మిర్చి	50
ఆనప ఒకటి	30

48 గంటల్లో ఉపాధి జాబ్ కార్డు

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 48 గంటల్లో నూతన జాబ్ కార్డు పొందేందుకు వెసులుబాటు కల్పించింది. గతంలో జాబ్ కార్డు పొందాలంటే నానా అవస్థలు పడేవారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగేవారు. జాబ్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు సైతం ఇబ్బందులుండేవి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఈ-కేవైసీతో అర్హులైన శ్రామికులకు 48 గంటల్లో కొత్త జాబ్ కార్డు అందజేసే ప్రక్రియ మొదలైంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పిస్తే.. మండల కార్యాలయం నుంచి మరుసటి రోజుకే జాబ్ కార్డు నకలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. సభ్యుల పేర్ల నమోదు, చిరునామా చేర్పులు, మార్పులకు సైతం ఆదేశాలందాయి. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ విధానం వరంగా మారనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియ మొదలైంది. జిల్లావ్యాప్తంగా 8671 కుటుంబాలకు సంబంధించి 22,135 మంది కూలీల వివరాలు జాబ్‌కార్డుల్లో నమోదు చేసినట్లు జిల్లా డ్వామా ఏపీడీ విద్యాసాగర్ తెలిపారు.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం పవన్‌కుమార్ తెలిపారు.

సంత్రాగచ్చి- యలహంక (02863/64) : డిసెంబరు 4 నుంచి 25 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, మర్నాడు తెల్లవారుజామున 2.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 2.45 గంటలకు బయలుదేరి యలహంకకు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబరు 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు యలహంకలో బయలుదేరే రైలు, అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 11.07 గంటలకు బయలుదేరి సంత్రాగచ్చికి వెళ్తుంది. యశ్వంత్‌పూర్ నుంచి రాకపోకలు సాగించాల్సి రైలును యలహంకకు మార్పు చేశారు.

ఆటో ప్రమాదంలో మహిళ మృతి

చింతూరు, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌ను ఆటో ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మోతుగూడెంకు చెందిన కొందరు లక్కవరం నుంచి మోతుగూడెం గురువారం రాత్రి ఆటోలో వెళ్తున్నారు. సుకుమామిడి సమీపంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేగి మంగ (45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదానికి గురైన ఆటో

డొంకరాయిలో షూటింగ్ సందడి

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు డొంకరాయిలో రవితేజ హీరోగా నటిస్తున్న సినిమా చిత్రీకరణ గురువారం జరిగింది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను హీరో రవితేజ, బేబీ నక్షత్ర, ఇతర నటులపై దర్శకుడు శివ నిర్వాణ చిత్రీకరించారు. ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే విద్యార్థులకు అరటి పండ్ల పంపిణీ, వయోజన విద్య తదితర అంశాలను చిత్రీకరించారు. చిత్రీకరణను వీక్షించడానికి డొంకరాయి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

హైస్కూల్ వద్ద షూటింగ్‌లో రవితేజ

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

హుకుంపేట, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీపూజ పేర్కొన్నారు. సూకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. బాలల విద్యా సామర్థ్యాలు తెలుసుకున్నారు. అనంతరం వంటగది, విద్యార్థుల హెల్త్ కార్డులు, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. వేడి నీరు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. పీఓ మాట్లాడుతూ.. పాఠశాలలను నిత్యం శుభ్రంగా ఉంచాలన్నారు.

విద్యార్థులతో కలిసి పాఠం వింటున్న పీఓ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

వై.రామవరం, న్యూస్‌టుడే: వై. రామవరం మండలంలో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి. వెంకటరమణ తెలిపారు. విద్యుత్తు తీగలకు దగ్గరలోని చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చింతపల్లి, గూడెంకొత్తవీధిలలో రేపు..

చింతపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 29న చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఈఈ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ విద్యుత్తు ఫీడర్ లైన్లలో మరమ్మతులు, నిర్వహణ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రెండు మండలాల్లోని అన్ని గ్రామాలకూ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

వైద్య శిబిరం నేడు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో జిల్లా పోలీసులు, మైత్రీ మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో ఈనెల 28న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఎండీ యాసీన్ తెలిపారు. సీలేరు రామాలయం కూడలి వద్ద నిర్వహించనున్న ఈ శిబిరంలో వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. ఉచితంగా మందుల పంపిణీ, భోజన సదుపాయం ఉంటుందన్నారు.

మెనూ అమలు తప్పనిసరి

వసతిగృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న పీవో

రంపచోడవరం, గంగవరం, న్యూస్‌టుడే: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బచ్చు స్మరణ్‌రాజ్ గిరిజన సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహాల్లో వేడివేడి ఆహారం, కాచిచల్లార్చిన నీరు, పాలు, గుడ్లు, మాంసం, కూరగాయలు అందించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. అనంతరం తామరపల్లి, నూనెపల్లి మార్గాలను పరిశీలించారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఈఈ చైతన్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటకు చెందిన శోభా నందిని (19) మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణా కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడి నుంచి కళాశాలకు వెళ్తోంది. ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈమెకు ఓ వ్యక్తితో ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అదే ఇందుకు కారణం కావచ్చునని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ పేర్కొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

మన్యంలో మంచుదుప్పటి

రాజవొమ్మంగిలో 516-ఈ జాతీయ రహదారిపై గురువారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. 8 గంటలు దాటినా మంచు తెరలు వీడలేదు. పొగమంచు వల్ల వాహనదారులు లైట్లు వెలిగించి రాకపోకలు సాగించారు. చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. సీలేరులో చలితీవ్రత ఒక్కసారిగా పెరిగింది. గురువారం 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల వరకూ మంచుతెరలు వీడటం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. – న్యూస్‌టుడే, రాజవొమ్మంగి, సీలేరు

సీఎంకు రుణపడి ఉంటాం

తోటపల్లిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తెదేపా నేతలు

ఎటపాక, న్యూస్‌టుడే: రంపచోడవరం జిల్లా ఏర్పాటుపై ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని, ఆయనకు రుణపడి ఉంటామని ఎటపాక తెదేపా నాయకులు పేర్కొన్నారు. తోటపల్లిలో గురువారం సమావేశమయ్యారు. సీఎం, ఎమ్మెల్యే శిరీషాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెదేపా మండల అధ్యక్షులు పుల్లయ్య, అరకు పార్లమెంట్ కార్యదర్శి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, చందు, రాజేష్, జనసేన మండల అధ్యక్షులు గంగాధర్, కూటమి నాయకులు మల్లేశ్వరరావు, పాయందేవి, మాధవరావు పాల్గొన్నారు.

సీతపల్లిలో సమావేశమైన తెదేపా నాయకులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ప్రకటించడం హర్షణీయమని బాపనమ్మతల్లి ఆలయ కమిటీ ఛైర్మన్ కుంజం బాపన్నదొర, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కోసు నాగన్నదొర పేర్కొన్నారు. గురువారం సీతపల్లిలో తెదేపా శ్రేణులు సమావేశమయ్యాయి. వారు మాట్లాడుతూ.. ఈప్రాంతవాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు పోలవరం ప్రత్యేక జిల్లాను ప్రకటించారన్నారు. జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. తెదేపా నాయకులు షేక్ మీరా, కోసు రాజన్నదొర, కొమరం రామన్నదొర, బలిజ నాగిరెడ్డి, బొరగ సంకురుదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంస

విద్యార్థిని కళ్యాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు మురళిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జావెలిన్ త్రోలో జాతీయస్థాయికి ఎంపికైన కిముడు కళ్యాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు మురళిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు గురువారం సన్మానించారు. నుర్మతి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న కళ్యాణి.. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్-17 అథ్లెటిక్స్ జావెలిన్ త్రో విభాగంలో రెండో స్థానాన్ని దక్కించుకుని.. జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన మాక్ అసెంబ్లీ పోటీల్లో కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సతివాడ హేమంత్ సాయి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఐటీడీఏ పీవో శ్రీపూజ చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నాడు. గురువారం ప్రిన్సిపల్ నర్సింహమూర్తి, వైస్ ప్రిన్సిపల్ శంకర్, ఎంపీపీ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు విద్యార్థి హేమంత్‌సాయిని అభినందించారు.

హేమంత్ సాయిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు

పర్యాటక ప్రాంతాలు వెలవెల

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలోని సందర్శిత ప్రాంతాల వద్ద సందర్శకులు అంతంత మాత్రంగానే ఉంటున్నారు. ప్రస్తుతం సీజన్ అయినప్పటికీ కేవలం వారాంతపు రోజుల్లో పర్యాటక రద్దీ కనిపిస్తోంది. గురువారం అరకులోయకు తక్కువ సంఖ్యలో పర్యాటకులు విచ్చేశారు. గిరిజన మ్యూజియం, వ్యూపాయింట్, కాఫీ తోటలు, పద్మాపురం ఉద్యానాల వద్ద పర్యాటకుల రద్దీ తక్కువగానే కనిపించింది.

వ్యూపాయింట్ వద్ద అంతంతమాత్రంగా పర్యాటకులు

లింగ వివక్ష నిర్మూలనకు కృషి

జీకేవీధిలో మహిళలు, అధికారుల ర్యాలీ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: లింగ వివక్ష నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో రమణబాబు సూచించారు. వెలుగు, స్వయం శక్తి సంఘాల ఆధ్వర్యంలో గురువారం జీకేవీధిలో హింసకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. లింగ ఆధారిత హింసను ప్రోత్సహించవద్దని కోరారు. వెలుగు ఏపీఎం సూర్యారావు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, వెలుగు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలని.. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గురువారం వంగసార, కొత్తపాలెం పాఠశాలలతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ సునీత, కళాశాల ప్రిన్సిపల్ గోవిందు, ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, వరలక్ష్మి కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వంగసార విద్యార్థులతో ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి

కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

నాయకులతో సమావేశమైన తహసీల్దార్ అన్నాజీరావు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: మండలంలో కొత్తగా 11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు. మండలంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1,200 మంది కంటే అధికంగా ఓటర్లున్న చోట అదనంగా కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనికోసం రాజకీయ నాయకుల సలహాలు, సూచనలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలపై శిక్షణ

పెదబయలు, న్యూస్‌టుడే: అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ(దిల్లీ) ఆధ్వర్యంలో ఆరోగ్య వికాస కేంద్రాల ద్వారా అందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించడంపై ఎంపిక చేసిన సిబ్బందికి పెదబయలులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ మూడురోజులపాటు కొనసాగుతుందని ప్రోగ్రాం మేనేజర్ కిరణ్ తెలిపారు. ప్రిన్సిపల్ ఇనిస్టిగేటర్ డాక్టర్ వై.ఎస్. కుసుమ, ప్రాజెక్టు సీనియర్ కన్సల్టెంట్ వర్మ, దిలీప్‌కుమార్, నీలాశాంతి, వైద్యాధికారులు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న ప్రోగ్రాం మేనేజర్ కిరణ్

నిధులు కేటాయించాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: కొండరెడ్ల అభ్యున్నతికి ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని కొండరెడ్ల చింతూరు డివిజన్ అధ్యక్షులు ముర్ల కనకారెడ్డి విజ్ఞప్తి చేశారు. జీడిగుప్పలో గురువారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త జిల్లా ఏర్పాటు హర్షణీయమన్నారు. చింతూరు ఐటీడీఏను బలోపేతం చేస్తే ఆదివాసీల అభ్యున్నతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. శ్రీనివాసరెడ్డి, జగపతిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, గణపతిరెడ్డి, చిరంజీవిరెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొండరెడ్ల సంఘ నాయకులు

పినకోటలో అడవిదున్నలు ప్రత్యక్షం

అనంతగిరి, న్యూస్‌టుడే: మారుమూల పినకోట గ్రామానికి కూతవేటు దూరంలోని అటవీ ప్రాంతంలో గురువారం అడవిదున్నలు ప్రత్యక్షమయ్యాయి. పినకోట నుంచి బొర్రాపాలెం వెళ్లే రహదారిలో గురువారం మధ్యాహ్నం ఇవి గుంపుగా కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. తరచూ గ్రామ సరిహద్దుల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గత ఏడాది ఇదేవిధంగా ఈ దున్నల గుంపు గ్రామం వైపు వచ్చి ఓ వ్యక్తిపై దాడి చేశాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

30న ఎలమంచిలిలో జాబ్‌మేళా

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉద్యోగాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలమంచిలి ఎస్‌జీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 కంపెనీలతో నిర్వహించే ఈ మేళాకు పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదువుకుని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సున్న యువతీ, యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను https:///naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న రిఫరెన్స్ నంబరుతోపాటు బయోడేటాలు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 81425 65416 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K
✆ 96402 58899, 96404 68899.

అదిగో జాగా.. వేసెయ్ పాగా!

జాతీయ రహదారి ఆనుకొని అక్రమ నిర్మాణాలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో ఎక్కడ సెంటు స్థలం కనిపించినా అక్రమార్కులు వాలిపోతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)కి చెందిన ఖాళీ స్థలాల్లోనూ పాగా వేస్తున్నారు. రహదారి పక్కన సెంటు స్థలం రూ. లక్షల్లో పలుకుతుండటంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. జాతీయరహదారి అభివృద్ధి, విస్తరణ సమయంలో భూములు, స్థలాలు కోల్పోయి.. పరిహారం పొందిన వారే మళ్లీ ఆయా స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. తొలుత తాత్కాలికంగా షెడ్లు, పాకలు వేసి.. తర్వాత కొంత కాలానికి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు.

జిల్లాలో 68 కి.మీ. పొడవున జాతీయ రహదారి ఉంది. పలు ప్రాంతాల్లో ఎన్‌హెచ్‌ఏఐకు ఖాళీ స్థలాలున్నాయి. వీటిపై పర్యవేక్షణ కరవవడంతో కబ్జాలకు గురవుతున్నాయి. రోడ్డు పరిధిలో సెంటు స్థలం కూడా రూ. 15 లక్షలకు పైనే పలుకుతోంది. దీంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

★ అనకాపల్లిలోని డబుల్ ట్రంపెట్ అండర్ బ్రిడ్జిని ఆనుకొని ఒక ప్లైవుడ్ దుకాణం ఏర్పాటు చేశారు. అలాగే మరో పక్క టింబర్ డిపో పెట్టారు. వాస్తవానికి అండర్ బ్రిడ్జి పక్కన కనీసం పది మీటర్ల స్థలం వదలాలి. కానీ.. ప్లైవుడ్ తయారీ సముదాయాన్ని నిర్మించేశారు. దీనిపై ఆక్రమణలపై గతంలో ఫిర్యాదులు అందడంతో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు.

అనకాపల్లి-గాజువాక మార్గంలో జాతీయ రహదారికి ఆనుకుని నిర్మాణం

★ అనకాపల్లి నుంచి గాజువాక వైపు వెళ్లే రహదారిలో కొప్పాక, సిరసపల్లి, మారేడు పూడి, సాలాపువానిపాలెం, లంకెలపాలెం వద్ద జాతీయ రహదారి వెంబడి భారీగా ఆక్రమణలు చేసి దుకాణ నిర్మాణాలు చేపట్టారు. కొత్తూరు కాలేజీ జంక్షన్ నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట నడుమనా ప్రభుత్వ జాగాలు కబ్జాకు గురవుతున్నాయి.

★ అనకాపల్లి నుంచి సబ్బవరం నడుమ రేబాక పంచాయతీలో సర్వే నం. 10-2, 41-3లోని భూములు ఆక్రమణకు గురయ్యాయి. రేబాక, కాపుశెట్టిపాలెం, పొడుపులమ్మ తల్లి ఆలయ ప్రాంతాల్లో గతంలో హైవే కోసం భూములు కోల్పోయిన వారికి పరిహారం లభించింది. రహదారి నిర్మాణానికి వినియోగించగా పక్కన కొంత స్థలం మిగిలింది. గతంలో ఎవరైతే పరిహారం పొందారో.. వారే ఇప్పుడు ఆయా స్థలాలను ఆక్రమించేస్తున్నారు. పక్కా నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశంలో హైటెన్షన్ విద్యుత్తు లైన్లు, భూగర్భ పైపులైన్లు ఉన్నాయి. ఆక్రమణదారులు అవేవీ పట్టించుకోవడం లేదు.

నోటీసులు ఇస్తున్నాం

"జాతీయ రహదారికి ఆనుకుని అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలు, షెడ్లను గుర్తిస్తున్నాం. ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఇచ్చిన గడువులోగా స్థలాలను ఖాళీ చేయకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ప్రభాత్ రంజన్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ, విశాఖపట్నం

పులుల గణనపై సర్వే

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలో డిసెంబరు 1 నుంచి పులుల గణనపై సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు డీఎఫ్‌ఓ నరసింహారావు తెలిపారు. 2026 అఖిల భారత పులుల గణన కార్యక్రమం అమల్లో భాగంగా గురువారం డివిజన్ పరిధిలోని అటవీశాఖ అధికారులు, సిబ్బందికి కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లకు ఒకసారి పులుల గణన జరుగుతుందన్నారు. డిసెంబరు 1 నుంచి 8 వరకూ అటవీ అధికారులు, సిబ్బంది అడవుల్లో పులుల సంచారానికి సంబంధించి సర్వే నిర్వహిస్తారన్నారు. పులులతో పాటు అడవుల్లో సంచరించే ఇతర వన్యప్రాణులకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తారన్నారు. దీనికి అనుసరించాల్సిన సాంకేతిక పద్ధతులు, విధానాలను డీఎఫ్‌ఓ వివరించారు. రేంజి అధికారులు అప్పారావు, ప్రశాంతికుమారి, వెంకటరావు, సింహాచలం పాల్గొన్నారు.

ఉత్పత్తితో వేతనాలను ముడిపెడితే ప్రతిఘటిస్తాం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో ఉత్పత్తితో వేతనాలను ముడిపెడుతూ ఈనెల 15న విడుదల చేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని.. లేకుంటే ప్రతిఘటిస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. ప్రధాన పరిపాలన భవనం ఎదుట గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ధర్నా నిర్వహించారు. ఉద్యోగులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా పూర్తి వేతనాలు చెల్లించకుండా కార్మికులను అర్ధాకలితో పస్తులు పెడుతున్నారని.. అదీ చాలక ఇపుడు ఉత్పత్తితో ముడిపెట్టడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో డి. ఆదినారాయణ, కె. ఎస్.ఎన్.రావు, పి.వి. రమణమూర్తి, ఎం. రాజశేఖర్, యు. రామస్వామి, జె. అయోధ్యరామ్, సిటూ జిల్లా నాయకులు ఎం. రామారావు, పాడి త్రినాథ్, సీహెచ్. సన్యాసిరావు, డి. అప్పారావు, డి.వి. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకుల ధర్నా

అనిశా వలలో వీఆర్‌ఓ

అనకాపల్లి, న్యూస్‌టుడే: భూముల మ్యుటేషన్‌కు లంచం తీసుకుంటూ వీఆర్‌ఓ ఎం.సూర్యనారాయణ గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. అనిశా డీఎస్పీ ఎన్.ఎస్.ఎస్.రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... అక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు సంజీవరావు మే నెలలో మృతిచెందారు. ఆయన పేరునున్న మూడున్నర ఎకరాల భూమిని భార్య దేముడమ్మ పేరు మీదకు మార్చడానికి సెప్టెంబరు నెలలో దరఖాస్తు చేసుకున్నారు. అక్కిరెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న సూర్యనారాయణ భూమిని మ్యుటేషన్ చేయాలంటే రూ. 50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితులు విషయం అనిశా దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్‌ఓ బాధిత రైతు కుటుంబం నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా గురువారం పట్టుకున్నారు.

అది 'కార్లా... చూడండి'!!

రాజగోపురం ఎదురుగా నిలిపిన వాహనాలు

వాహనాలు నిలిపేదిక్కడ..

- ★ రాజగోపురం ఎదురుగా
- ★ జోడుభద్రాలు ప్రాంగణం
- ★ గజపతి సత్రం మార్గం
- ★ వసతి గృహాల ప్రాంతం
- ★ హిల్‌టాప్ రహదారి
- ★ పాదాలమ్మ గుడి ప్రాంగణం ద్విచక్ర వాహనాలకు
- ★ లోవతోట
- ★ అన్నదానం భవనం సమీపంలో

★ ఇవి నిండిపోతే వైకుంఠవాసుల మెట్ల మార్గం, హిల్‌టాప్ రహదారి కొండపైకి వాహనాలు మళ్లిస్తున్నారు. కొన్నిసార్లు ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా భక్తులు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ సింహగిరిపై ట్రాఫిక్ సమస్యలొస్తున్నాయి.

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం వచ్చే భక్తులకు స్వామిని దర్శించుకోవడం కన్నా వాహనాల పార్కింగ్ చోటు వెతుక్కోవడానికి అధిక సమయం పడుతోందని వాపోతున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సొంత వాహనాల్లో వచ్చే వారు గణనీయంగా ఉంటున్నారు. సింహగిరికి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు.

అరకొర వసతులు: అప్పన్న కొండకు నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సుమారు 1,500 వరకు నాలుగు చక్రాలు, 3 వేల వరకు ద్విచక్రవాహనాలు వస్తున్నాయి. కానీ, 250 కార్లు, 500 ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు మాత్రమే సింహగిరిపై స్థలం అందుబాటులో ఉంది. రద్దీ రోజుల్లో భక్తుల దర్శనానికి కనీసం రెండు గంటల సమయం పడుతోంది. అనంతరం పార్కింగ్ నుంచి వాహనాలను బయటకు తీసుకురావడం భక్తులకు కష్టతరంగా మారింది. ప్రముఖులెవరైనా వస్తే రాజగోపురం వరకు వాహనాలను తీసుకెళ్తున్నారు.

ముందస్తు ప్రణాళికతో ఉపశమనం..: అప్పన్న కొండకు వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా రాబోయే ముప్పై ఏళ్ల అవసరాలకు తగినట్లు పార్కింగ్ ప్రాంగణాలను అభివృద్ధి చేయకుంటే అవస్థలు తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు. సింహగిరిపై ఉన్న ఖాళీ ప్రదేశాలను సద్వినియోగం చేసుకోవడం లేదని విమర్శలున్నాయి. తొలుత పార్కింగ్ ప్రదేశాలను నిర్మించి ఇతర నిర్మాణాలపై దృష్టి సారించి ఉంటే ప్రయోజనకరంగా ఉండేదన్న సూచనలొస్తున్నాయి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మార్గశిర మాసం తొలి గురువారం కావడంతో పాతనగరంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచే భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అర్చకులు వేద మంత్రాలతో వివిధ పూజలు, హోమం, క్షీరాభిషేకం పూర్తి చేసి, అమ్మవారిని అలంకరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ శోభారాణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ★ అమ్మవారి దర్శనానికి ఉచితంతో పాటు, రూ.100, రూ.200, రూ.500 టికెట్లను దేవస్థానం అందుబాటులో ఉంచింది. ఉచితం, రూ.100, రూ.200 క్యూలైన్లలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. భక్తులకు జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం చేశారు. ★ టౌన్‌కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్‌ను మళ్లించారు. క్షేత్రస్థాయిలో భద్రత ఏర్పాట్లను సీపీ శంఖబ్రతబాగ్చీ పర్యవేక్షించారు.

కొండ గుడి ఉత్సవాలు రేపటి నుంచి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగరంలోని పాతపోస్టాఫీసు సమీప విశాఖపురి మేరీమాత పుణ్యక్షేత్రం మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నవంబరు 29 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకు నవదిన ప్రార్థనలు నిర్వహించి, 8న ప్రధాన ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్నే స్థానికంగా 'కొండ గుడి' పండగ అని పిలుస్తుంటారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్డ్	184	206
స్కిన్‌లెస్	210	216

మేమున్నాం.. మీకు తోడుగా
పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి పూజారిపాకలు, వేటుకూరు, పీఎంకోట, ఇవ్వంపల్లి, భీమవరం మీదుగా చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ మార్గంలో ప్రయాణాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – గొర్లె మురళీకృష్ణ, వేటుకూరు, ✓: ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. – చైతన్య, డీఈఈ, గి.సం.ఇంజినీరింగుశాఖ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయం ముందున్న భవనంపై ఏడాది క్రితం చెట్టు కూలి శిథిలమైంది. అందులోనే మండల ఇంజినీరు, విద్యాశాఖ గోదాము నిర్వహిస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేయించాలి. – కామేష్, స్థానికుడు, ✓: భవనం మరమ్మతులకు చర్యలు చేపడుతున్నాం. – ధర్మారావు, ఎంపీడీఓ, ముంచంగిపుట్టు

అరకులోయ, న్యూస్‌టుడే: పెదలబుడు పంచాయతీ పానిరంగిని గ్రామంలో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు. కాలువల్లో చెత్తా చెదారాలు నిండిపోయాయి. – డొంబురదర్, ఉపాధ్యాయుడు, పానిరంగిని, ✓: గ్రామంలో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం. కాలువల్లో పూడిక తీయిస్తాం. – సత్యన్నారాయణ, ఈవో పీఆర్డీ, అరకులోయ

శిక్షణ సరే.. యంత్రాలిచ్చేదెప్పుడు?

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి వివిధ పథకాలు అమలు చేస్తోంది. చదువుతో సంబంధం లేకుండా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో అతివలు స్వయంగా ఉపాధి పొందడానికి వీలుగా 3 నెలలపాటు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తోంది. కోర్సు పూర్తయ్యాక మిషన్, శిక్షణ ధ్రువపత్రాలు ఇస్తామని ప్రకటించడంతో ఔత్సాహికులు ఉత్సాహంగా ముందుకొచ్చారు. తొలివిడతలో చేరిన అభ్యర్థులు రెండు నెలలుగా మిషన్ల కోసం ఎదురుచూస్తున్నా ఫలితం లేకపోయింది.

అల్లూరి జిల్లావ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో కుట్టు శిక్షణ ఇచ్చారు. ఒక్కో కేంద్రంలో 70 మంది అభ్యర్థులను చేర్చుకున్నారు. చింతపల్లి పరిధిలో గ్రామ సచివాలయం వద్ద మహిళలకు

చింతపల్లిలో కుట్టుశిక్షణలో మహిళలు

శిక్షణ ఇచ్చారు. రెండు నెలల క్రితం ఈ కార్యక్రమం పూర్తయింది. రోజూ రెండు విడతల్లో శిక్షణ ఇచ్చారు. మిషన్ కుట్టడం, వస్త్రాలు కత్తిరించడం, మహిళ అభిరుచికి అనుగుణంగా వినూత్న విధానాల్లో కుట్లు, అల్లికలు నేర్పారు.

★ శిక్షణ పూర్తయినా కుట్టు యంత్రాలు, ధ్రువీకరణ పత్రాలు అందజేయకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ కారణాలతో కొందరు మధ్యలో మానేశారు. 90 శాతం మంది పూర్తి శిక్షణ పొందినట్లు అధికారులు తెలిపారు. ధ్రువపత్రాలు లేకుండా రుణాలు ఎలా వస్తాయని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

★ శిక్షణ తరగతుల్లో 75 శాతం హాజరు ఉండి.. నైపుణ్యం పొందిన వారికే కుట్టు యంత్రాలు, ధ్రువపత్రాలు, స్వయం ఉపాధికి 50 శాతం రాయితీతో రూ.2 లక్షల వరకు పెట్టుబడి రుణం ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారి జాబితాను బీసీ కార్పొరేషన్ ఉన్నతాధికారులకు పంపామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అభ్యర్థులకు అందజేస్తామని బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారులు తెలిపారు.

ఘాట్‌రోడ్డో నిర్వహణ పనులు

స్పందనకు వందనం

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ ఘాట్‌రోడ్లో ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారి అధికారులు చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో ఈనెల 24న 'ఘాటీలో గుండెదడ' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు. ఘాట్‌రోడ్‌లోని అనంతగిరి నుంచి చిలకలగెడ్డ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పొదల తొలగింపు పనులు గురువారం నుంచి ప్రారంభించారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు రాజవొమ్మంగిలో ప్రజాదర్బార్

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఐఐసీ డైరెక్టర్, తెదేపా మండల అధ్యక్షుడు జి.పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి వి.గంగాధర్ గురువారం తెలిపారు. మండలంలోని 19 పంచాయతీల్లోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావొచ్చన్నారు.

మూడేళ్లుగా ముప్పుతిప్పలు

పెదబయలు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే మార్గం ప్రయాణికులు, వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు సుమారు మూడేళ్ల క్రితం ఈ రహదారి విస్తరణ చేపట్టారు. మధ్యలో కల్వర్టుల కోసం అసంపూర్తిగా వదిలేశారు. ఆయా ప్రదేశాల్లో రాళ్లు తేలి నరకాన్ని తలపిస్తున్నాయి. చిట్రాయిపుట్టు- సంపంగిపుట్టు, తమరాడ- అడుగులపుట్టు, కొత్తపుట్టు- కుజభంగి మధ్యలో ఈ పరిస్థితి ఉంది. కల్వర్టుల నిర్మాణానికి మూడేళ్లు పడుతుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

కొత్తాపుట్టు-కుజభంగికి మధ్యలో ఇలా..

రైతుల ఇంట సిరుల పంట

మన్యంలో ఆహారధాన్యాల సాగు ఆశించిన దిగుబడులు ఇవ్వడంతో రైతుల ఇంట ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ ఏడాది రైతులు వరి, రాగి, సామ తదితర ఆహార పంటలు సాగు చేశారు. ముంచంగిపుట్టు మండలంలో 36 వేల ఎకరాల్లో వరి, రాగి, సామ పంటలు పండించారు. మాకవరం, ఏనుగురాయి, కిలగాడ, దారెల, బంగారుమెట్ట, జర్రెల, జర్జుల, కరిముఖిపుట్టు, కుమడ, కించాయిపుట్టు పంచాయతీల్లో వరి మంచి దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. ఏనుగురాయి పంచాయతీలోని కొండపడ, తడ్డాపల్లి, బొండాపుట్టు, మాలిపుట్టు గ్రామాల్లో నూర్పులు ముమ్మరం చేశారు. ఈ సమయంలో వాన పడకుండా చూడాలని గ్రామదేవతలకు పూజలు చేశారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

కొండపడలో ధాన్యం గాలిపోతలో గిరిజనులు

మూగజీవాలతో ముచ్చెమటలు

పెదబయలులో ప్రధాన రహదారిపై మూగజీవాలు వాహనదారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. రహదారికి అడ్డంగా ఉండిపోయి.. ఎంత హారన్ మోగించినా కదలకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి.. ప్రధాన రహదారిపై మూగజీవాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

అసంపూర్తి పనులు.. తప్పని అవస్థలు

మన్యంలోని పలు చోట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల నిర్మాణాలు పొదలచాటున దర్శనమిస్తున్నాయి. రూ.లక్షల ఖర్చుతో చేపట్టిన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయక నిధులు వృథా అయ్యి విద్యార్థులకు ఉపయోగపడటం లేదు. కరిముఖిపుట్టు పంచాయతీలోని నందిమెట్టలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాన్ని గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. దీనికి రూ.38 లక్షలు మంజూరు చేశారు. రూ.5 లక్షలు విడుదలచేశారు. పునాదులు వేశారు. మరుగుదొడ్లకు పిల్లర్లు వేసి బోరు తవ్వించారు. భవనాల నిర్మాణం పూర్తి చేయక పునాదులు, పిల్లర్ల చుట్టూ తుప్పలు పెరిగి దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు వంటషెడ్డులో, గ్రామస్థులు ఏర్పాటుచేసిన పాకలో చదువు సాగిస్తున్నారు. భవనాల నిర్మాణం పూర్తి చేసి పాఠశాలకు వసతి కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

నందిమెట్టలో పునాదుల చుట్టూ పెరిగిన తుప్పలు

బాధిత కుటుంబానికి సాయం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొండపల్లి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సూరిబాబు కుటుంబాన్ని గురువారం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, సిబ్బంది పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచి జగన్నాథం, ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు వితరణ

కూనవరం, న్యూస్‌టుడే: భీమవరంలో గురువారం కృష్ణార్జునరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు బియ్యం, సబ్బులు అందించారు. నడవలేని వారి ఇంటికి వెళ్లి వస్తువులను అందించారు. కొన్నేళ్లుగా పేద వృద్ధులకు, అగ్నిప్రమాద బాధితులకు కృష్ణార్జునరావు చేతనైన సాయం అందిస్తున్నారు.

సర్వసభ్య సమావేశం 29న

కొయ్యూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29న ఎంపీపీ రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరవ్వాలని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని చెప్పారు.

ఏపీఎఫ్‌డీసీ ఎండీతో చర్చలు నేడు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డీసీ) ఎండీ శ్రీధర్ దృష్టికి శుక్రవారం కాఫీ కార్మికుల సమస్యలను తీసుకెళ్లనున్నట్లు సీఐటీయూ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ గురువారం తెలిపారు. ఎండీ శుక్రవారం చింతపల్లిలో పర్యటించనున్నారన్నారు. ఇటీవల కాఫీ కార్మికుల సమస్యలను విజయవాడ వెళ్లి ఆయనకు వివరించామన్నారు. కూలీతోపాటు పండ్ల సేకరణ ధరల పెంపు, తోటల్లో సిబ్బంది నియామకం తదితర విషయాలను ఆయనతో చర్చించనున్నట్లు వివరించారు.

పొట్లాయిని ముంపు గ్రామంగా గుర్తించాలి

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం ముంపు గ్రామంగా పొట్లాయిని గుర్తించి సర్వే చేయించాలని గ్రామస్థులు గురువారం చింతూరు ఐటీడీఏ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గతంలో వచ్చిన వరదలకు గ్రామం ముంపునకు గురైందని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని ఐటీడీఏ అధికారులను కోరారు.

ఆకతాయిల ఆగడాలతో అవస్థలు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఆకతాయిలు చేస్తున్న తుంటరి పనులకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామగిరిలో ఆత్మకూరు కాంతారావు పొలంలో సాగునీటికి ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్ గొట్టాలకు ఆకతాయిలు రంధ్రాలు పెట్టారు. నీరు వృథాగా పోతోంది. రైతులు మరమ్మతులు చేసుకుంటున్నారు. గిరిజన రైతులను ఇబ్బందిపెడుతున్న ఆకతాయిలను త్వరలో పట్టుకుని గుణపాఠం చెబుతామని శ్రీరామగిరి భూ పోరాట సమితి సభ్యులు తొడం రాజు, సత్యనారాయణ, రాము, సతీశ్ తదితరులు హెచ్చరించారు.

గిరి రైతుల అభ్యున్నతే ధ్యేయం

కోరాపల్లిలో రైతన్నా మీ కోసం కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

డుంబ్రిగుడ, పెదబయలు, న్యూస్‌టుడే: గిరి రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ దన్నేరావు అన్నారు. పోతంగి పంచాయతీ శీలంగొందిలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యాన రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. బొంగదారి, సుందుపుట్టు, గొందికోడాపుట్టు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. సీఎం సందేశ పత్రాలను రైతులకు అందించారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: బొడ్డగండి పంచాయతీ మంగంపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ మాట్లాడుతూ.. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని రైతులను గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. ఎస్సై వెంకయ్య పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ సభ్యులు వెంకట్రావు, కళావతి, రాఘవరెడ్డి రైతులకు నవ ధాన్యాలు అందజేశారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలం కోరాపల్లి గ్రామంలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందజేసిందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

గంగవరం, న్యూస్‌టుడే: మోహనాపురంలో తెదేపా మండలాధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, ఇ.రామవరంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మొల్లేరులో పీఏసీఎస్ ఛైర్మన్ పాము అర్జున్ ఆధ్వర్యంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాలు నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని ఏవో చక్రధర్ పేర్కొన్నారు. రాజవొమ్మంగిలోని విద్యానగర్‌లో రైతన్నా.. మీ కోసం కార్యక్రమం నిర్వహించారు.

మొల్లేరులో..

విధుల్లో అలసత్వం తగదు

సీనియర్ అసిస్టెంట్ వేతనం నిలిపివేత

అరకులోయ, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యాధికారి కృష్ణమూర్తి నాయక్ హెచ్చరించారు. మాడగడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్ రెండు రోజుల వేతనాన్ని నిలిపేయాలని ఆదేశించారు. విధులకు ఆలస్యంగా హాజరైన అటెండర్‌ని మందలించారు. రోగులకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో సుఖ ప్రసవాలు, న్యుమోనియాపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

మాడగడ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీచేస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్

దూరవిద్య పీజీ పరీక్షల్లో చూచిరాతలు?

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం దూరవిద్య పీజీ పరీక్షల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరుగుతోందని సమాచారం. ఒక్కో విద్యార్థి నుంచి ఒక పేపరుకు రూ. 1000 వరకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముందుగా ప్రశ్నపత్రాలు లీక్ చేస్తున్నారని తెలిసింది. పాడేరు పట్టణంలోని జిరాక్స్ షాపుల్లో పీజీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు జిరాక్స్ తీయిస్తున్నారు. కొంతమంది పీజీ విద్యార్థులు డబ్బులు తీసుకుంటున్నా.. పూర్తిగా రాయించడం లేదని చర్చించుకుంటున్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి సహకరించండి

అనంతగిరి, న్యూస్‌టుడే: పాఠశాల భవన నిర్మాణానికి అందరూ సహకరించాలని.. అది బాలల భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం లాంటిందని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు పేర్కొన్నారు. రొంపల్లి పంచాయతీ గాదిల్లోవా గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణంలో ఇరు వర్గాల వారి మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో పాఠశాల నిర్మాణం తాత్కాలికంగా నిలిచిపోయింది. దీంతో సుమారు 30 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎంఈఓ బాలాజీ, ఏటీడబ్ల్యూఓ వెంకటరమణతో కలిసి జడ్పీటీసీ సభ్యుడు కాలినడకన గ్రామానికి వెళ్లారు. అభివృద్ధి పనులకు అడ్డుకట్ట వేయటం సమంజసం కాదని పేర్కొన్నారు. భవన నిర్మాణాన్ని అడ్డుకోమని స్థానికులు చెప్పారు. దేవన్న పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న గంగరాజు, అధికారులు

చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యం

ఎటపాక, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యమని గౌరిదేవిపేట జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, పోలీస్ అధికారి కేశబోయిన ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రసాద్‌ను సత్కరించారు. ఉపాధ్యాయులు లక్ష్మీ, అర్జున్, సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారి ప్రసాద్

విద్యార్థులకు పోషకాహారం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: విద్యార్థులకు సంపూర్ణ పోషకాహారంతోపాటు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి కె.కృష్ణమూర్తి సూచించారు. సుజనకోట పంచాయతీలోని కుమ్మరిపుట్టు, సుజనపేట, తలాబుతోట, నర్సిపుట్టు, ఏనుగరాయి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. బాలల విద్యా సామర్థ్యాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధనకు వినియోగిస్తున్న పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులతో ఎంఈఓ కృష్ణమూర్తి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాడేరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. అరకులోయ, పాడేరు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున అర్జీదారులు వచ్చి ఫిర్యాదులు అందించారు. రహదారులు, తాగునీటి పథకాలు, కేజీబీవీ ఉద్యోగుల బకాయి వేతనాలు, ఉపాధి కల్పించాలని వినతిపత్రాలు వచ్చాయి. ఈ ఫిర్యాదులన్నీ సంబంధిత అధికారులకు అందించి తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తెదేపా అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణరాజు, దారెల సర్పంచి పాండురంగస్వామి, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగికి చెందిన అబ్దుల్ (20) ఈనెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సౌర విద్యుత్తు పథకానికి రాయితీ

పెదబయలు, న్యూస్‌టుడే: ఇంటిపై సౌర విద్యుత్తు పథకం ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తు సిబ్బంది పేర్కొన్నారు. గురువారం పెదబయలులో ర్యాలీ చేశారు. దీనివల్ల విద్యుత్తు ఆదా అవుతుందన్నారు. స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం నుంచి పలువీధుల్లో ర్యాలీ చేశారు. డిప్యూటీ ఈఈ ఎల్‌బీ ప్రసాద్, డీఈఈ వేణుగోపాలరావు, ఏఈఈ సురేష్, జేఈ రాంబాబు, ఎల్ఐ అప్పలరాజు, ఎల్‌ఎం సోమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పెదబయలులో విద్యుత్తు సిబ్బంది ర్యాలీ

గొంతెండిపోతోంది

ఎటపాక, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామ సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కాకా అర్జున్, లక్ష్మీపురం మాజీ సర్పంచి రత్తమ్మ మాట్లాడుతూ ప్రజలు గత కొన్ని రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, బుద్దుల భద్రయ్య, వెంకటరావు, రాము, జయమ్మ, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ఖాళీ బిందెలతో మహిళలు, గ్రామస్థుల నిరసన

సందడిగా వనసమారాధన

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అటవీ ప్రాంతంలో వనసమారాధన ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం చిన్నిబాబు, డిప్యూటీ వార్డెన్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన

చలిలో ప్రయాణికుల పడిగాపులు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో మరమ్మతులకు గురైంది. డ్రైవరు డిపో గ్యారేజ్‌కు బస్సు తీసుకెళ్లి గంట సమయమైనా తిరిగి తీసుకురాకపోవడంతో ప్రయాణికులు చలిలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ వెంటనే వేరే బస్సు ఏర్పాటు చేసి ప్రయాణికులను పంపించారు.

జోలాపుట్‌లో అంధకారం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని జోలాపుట్‌లో బుధవారం నుంచి అంధకారం అలుముకుంది. బంగురుపడ గ్రామం వద్ద బుధవారం విద్యుత్తు స్తంభంపై చెట్టు పడిపోవడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రాజెక్టు ఎస్‌ఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరావు గురువారం అక్కడకు వెళ్లి విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ పనులు పరిశీలించారు. గ్రామం సమీపంలో ఇష్టానుసారంగా అక్రమ విద్యుత్తు కనెక్షన్‌లు తీసుకున్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ మార్గంలో అడవి పందుల కోసం ఏర్పాటుచేస్తున్న వైర్లతో ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈఈ సివిల్ కురేష ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనులు పర్యవేక్షిస్తున్న ప్రాజెక్టు ఎస్‌ఈ తదితరులు

డ్రైవింగ్ లైసెన్స్ ఉండాల్సిందే

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని జీకేవీధి సీఐ సుధాకర్, ఎస్సై సురేష్ హెచ్చరించారు. పూజారిపాకలు గ్రామంలో గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనానికి అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పక ఉండాలన్నారు. నిబంధనలు పాటించాని చోదకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీకేవీధిలో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు

రంపచోడవరంలో యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయుల నిరసన

రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించడం దారుణమన్నారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జీవో నం. 46ను ప్రవేశపెట్టి రాత్రి వేళల్లో కూడా విధులు నిర్వహించాలని ఆదేశించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. యూటీఎఫ్ నాయకులు కృష్ణయ్య, ఆదిరెడ్డి, సనాతనబాబు, సూరిబాబు, మహేష్, విశ్వరాజ్ పాల్గొన్నారు.

బోధనేతర పనులు రద్దుచేయాలి

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను బోధనేతర పనులకు బాధ్యులు చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వరరావు అన్నారు. పాడేరు ఐటీడీఏ కార్యాలయం ప్రధాన గేటు వద్ద గురువారం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉపాధ్యాయులు, యూటీఎఫ్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీన గిరిజన సంక్షేమ డైరెక్టర్ నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు రాత్రి 9 నుంచి 12 గంటల వరకు విధులు నిర్వహించాలని, ఉదయం 6 గంటలకు తప్పనిసరిగా ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మూడో వంతు ఉపాధ్యాయులు రాత్రి పూట బస చేయాలని ఆదేశించడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యంపై సైతం ఉపాధ్యాయులని బాధ్యుల్ని చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జిల్లా సహాయ అధ్యక్షులు చిట్టిబాబు, ధర్మారావు, పి.దేముడు, ఎస్.కన్నయ్య, రఘునాథ్, చీకటి నాగేశ్వరరావు, శ్రీను, ఎస్ గంగాధర్, ఎల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఐటీడీఏ ప్రధాన గేటు వద్ద..

(c) eenadu

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజధాని పనులు వేగవంతం చేస్తాం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గోరంట్ల(గుంటూరు), న్యూస్‌టుడే: అమరావతి రాజధాని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, త్వరలోనే భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సీఆర్‌డీఏ కార్యాలయంలో గతవారం నిర్వహించిన సమావేశంలోని అంశాలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పెమ్మసాని గురువారం మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తూనే రాజధాని అమరావతి పనులను వేగంగా పూర్తి చేస్తామన్నారు. వీలైనంత త్వరగా రాజధానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తి చేసే దిశగా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్దేశిత గడువు ప్రకారం పనులు వేగంగా జరగాల్సిందేనన్నారు.

స్వామివారికి హారతి

మహా ప్రాకార నిర్మాణ భూమిపూజకు వస్తున్న సీఎం చంద్రబాబు, ఈవో అనిల్ సింఘాల్

వేంకటా చలపతి.. శోభిల్లేను అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఆధ్యాత్మికశోభ వెల్లివెరిసింది. వెంకటపాలెంలో శ్రీవారి ఆలయాన్ని రూ.260 కోట్లతో అభివృద్ధి చేయడానికి మరో అడుగు పడింది. తితిదే వేద పండితుల మంత్రోచ్చారణలు.. మంగళవాయిద్యాల నడుమ ద్వితీయ మహా ప్రాకార నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. తితిదే తరహాలో ఆలయాన్ని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. వేద పండితులు నిర్వహించిన హోమాల పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

భిన్నత్వంలో ఏకత్వం... మతసామరస్యాన్ని చాటుతూ విభిన్న వర్గాల మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. వీరికోసం తితిదే ఉచిత బస్సులు ఏర్పాటు చేసింది. అందరికీ లడ్డూ ప్రసాదం, అల్పాహారం, భోజనం, తాగునీరు, మజ్జిగ అందజేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, రైతులు, రైతుకూలీలు హాజరయ్యారు. **- న్యూస్‌టుడే, తుళ్లూరు**

తితిదే బోర్డు సభ్యులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, బోర్డు ఛైర్మన్ బీఆర్‌నాయుడు, సభ్యురాలు సుచిత్రా ఎల్ల, మంత్రులు రామనారాయణరెడ్డి, మనోహర్ తదితరులు



1 నుంచి ఏసీ బస్సు ఛార్జీల్లో 10% రాయితీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: డిసెంబరు 1 నుంచి 20వ తేదీ వరకు (ఆదివారాలు మినహాయించి) అమరావతి, ఇంద్ర ఏసీ బస్సు ఛార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం ఒక ప్రకటనలో తెలిపారు. టోల్‌ఫీజు తదితరాలు అదనమని పేర్కొన్నారు.

రూట్	బస్సు	ప్రస్తుతం	1 నుంచి
గుంటూరు-బీహెచ్ఈఎల్	అమరావతి	₹ 870	₹ 790
గుంటూరు-బీహెచ్ఈఎల్	అమరావతి	970	880
గుంటూరు-బీహెచ్ఈఎల్	ఇంద్ర	700	640
తెనాలి- బీహెచ్ఈఎల్	ఇంద్ర	770	710
తెనాలి-విశాఖపట్నం	ఇంద్ర	960	880

నిలకడగా పసుపు ధరలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు ధరలు నిలకడగా ఉన్నాయి. ఈ నెల మొదటి వారంలో కొమ్ములు, కాయ రెండూ క్వింటాలుకు రూ.11 వేల నుంచి రూ. 13,900 వరకు ఉండగా సగటున రూ. 12,360గా నమోదైంది. రెండో వారంలో గరిష్ఠ ధర రూ. 13 వేల వరకూ వెళ్లింది. కొమ్ములు, కాయ రెండింటి సగటు రూ. 12 వేలుగా ఉంది. మూడో వారంలో కొమ్ములు సగటు ధర రూ. 12,400 ఉండగా కాయ రూ. 12,625 పలికింది. చివరి వారంలో కొమ్ములు సగటు ధర రూ. 12,500గాను కాయ రూ. 12,190గా ఉంది. గురువారం కొమ్ములు 466 క్వింటాళ్లు, కాయ 253 క్వింటాళ్ల క్రయవిక్రయాలు నమోదయ్యాయి.

అనుమతివ్వండి.. అభివృద్ధి చేస్తాం

ఈనాడు - అమరావతి

గుంటూరులో ఆర్‌అండ్‌బీ రోడ్లపై జీఎంసీ దృష్టి

కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతి

ఓ వైపు గుంతలతో ఇబ్బందులు.. మరోవైపు ప్రమాదాలతో అవస్థలు. . వెరసి గుంటూరు నగర పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారులపరంగా చాలాకాలంగా సమస్యలు నెలకొన్నాయి. జీఎంసీ సొంత నిధులతో అభివృద్ధి చేయాలనుకున్నా నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. అటు ఆర్‌అండ్‌బీ నుంచి చాలాకాలంగా నిధులు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో చర్చించిన జీఎంసీ యంత్రాంగం... ఆ రోడ్లను తామే అభివృద్ధి చేస్తామని ప్రతిపాదించింది. ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి లేఖ రాయగా.. అక్కడి నుంచి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అభ్యర్థన వెళ్లింది.

- నగరంలోని ఆర్‌అండ్‌బీ రహదారులు: 10
- వాటి పొడవు: 47.27 కిలోమీటర్లు.
- కార్పొరేషన్ పరిధిలోని రోడ్లను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేస్తున్నా.. ఆర్‌అండ్‌బీపరంగా ఆ పరిస్థితి లేదు.

ఎక్కడెక్కడంటే.. (అంకెలు కిలోమీటర్లలో....) ★ బీఆర్‌స్టేడియం నుంచి చుట్టుగుంట కూడలి వరకు - 3.27 ★ చుట్టుగుంట కూడలి నుంచి జీఎంసీలోని నరసరావుపేటరోడ్డు - 9.70 ★ లాడ్జిసెంటర్ నుంచి అమరావతిరోడ్డు - 5.40 ★ బీఆర్‌స్టేడియం నుంచి ఎన్‌హెచ్-16 వరకు నందివెలుగు రోడ్డు - 3.50 ★ బీఆర్‌స్టేడియం నుంచి పొన్నూరురోడ్డు - 5.50 ★ ఏటుకూరు రోడ్డు - 4.40 ★ చుట్టుగుంట నుంచి ఎన్‌హెచ్16 వరకు చిలకలూరిపేట రోడ్డు - 3 ★ గుజ్జనగుండ్ల కూడలి నుంచి పలకలూరురోడ్డు - 4.50 ★ బస్టాండు నుంచి మంగళగిరి రోడ్డు - 5 ★ ఆర్టీవో కార్యాలయం నుంచి అడవితక్కెళ్లపాడురోడ్డు - 3

అధికారులేమన్నారంటే.. జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో 'ఈనాడు' మాట్లాడగా.. ప్రభుత్వం అనుమతిస్తే కీలకమార్గాల ఆధునికీకరణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి మాట్లాడుతూ.. ఆమోదం వచ్చాక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు.

మతం ఏదైనా మానవత్వమే ముఖ్యం

మసీదులో మంత్రి లోకేశ్ తదితరులు

తాడేపల్లి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మతం ఏదైనా మానవత్వం ముఖ్యమని, మెరుగైన సమాజం కోసం నైతిక విలువలను పెంపొందించుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిలోని ఆర్టీసీ బస్సు డిపో రోడ్డులో ఉన్న పావురాల కాలనీ వద్ద రూ.2 కోట్లతో నిర్మించిన నూరుమసీదును ఆయన ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. 2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధానమంత్రి మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. మనలో చిచ్చు పెట్టేందుకు కొంతమంది ప్రయత్నిస్తుంటారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. 2019లో దేవుడు పరీక్ష పెట్టాడని, ఆ సమయంలో ఎంతోమంది ఎగతాళి చేశారని... కృషి, పట్టుదలతో విజయం సాధించానని చెప్పారు. పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తితిదే బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెదేపా గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్పీ జిందాల్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వారం రోజులుగా వ్యక్తిగత సెలవులో ఉన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం తిరిగి విధుల్లో చేరారు. వెంకటపాలెంలో తితిదేకి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండో ప్రాకార నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. బందోస్తులో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకాపా నిర్లక్ష్యం...

అటకెక్కిన నిర్మాణం..

నిర్మాణ శిథిలాలతో అంబేడ్కర్ భవన్ ప్రాంగణం

తెదేపా హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి 2014లో అంబేడ్కర్ భవన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. జీ+3 నిర్మాణంతో మొదటి అంతస్తులో స్టడీ సర్కిల్, గ్రంథాలయం, రెండో అంతస్తులో ఫంక్షన్ హాల్, మూడో అంతస్తులో భోజనశాల ఏర్పాటు చేసి.. బడుగు, బలహీనవర్గాల నిరుద్యోగులకు ఉద్యోగ శిక్షణ ఇవ్వాలనే సంకల్పించింది నాటి తెదేపా ప్రభుత్వం. దీనికోసం రూ.5 కోట్లు మంజూరు చేసి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు నిర్మించింది. తర్వాత వైకాపా ప్రభుత్వం వచ్చాక ఐదేళ్ల పాటు పనులు అటకెక్కాయి. నిర్మాణ దశలో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో తలుపులు, కిటికీలు శిథిలమయ్యాయి. చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగుతూ కళావిహీనంగా మారింది. అంబేడ్కర్ భవనాన్ని పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని నిరుద్యోగులు కోరుతున్నారు. **- ఈనాడు గుంటూరు, న్యూస్‌టుడే, నగరంపాలెం**

పూర్తయిన నిర్మాణాలు పాడైపోతూ లోపల మట్టి పేరుకుని కళావిహీనంగా..

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నిర్వహించనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునే గడువును డిసెంబరు 3వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌ఛార్జి డైరెక్టరు కె.మయూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 7న ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు 10వ తరగతి, డిగ్రీ మార్కుల లిస్టు, స్టడీ సర్టిఫికెట్, కుల, వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతపరిచి గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 0863-2358071 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యాలకు నెలవు.. పరిశోధనల కొలువు...

KL (DEEMED TO BE UNIVERSITY) VIJAYAWADA | KLH (DEEMED TO BE UNIVERSITY) HYDERABAD ● Azeez Nagar ● Bowrampet

ఆధునిక సాంకేతిక విద్యా సౌరభం

కెఎల్ విశ్వవిద్యాలయం

ప్రపంచ సాంకేతిక సవాళ్లకు అనుగుణంగా... సమగ్ర నైపుణ్యాల అభివృద్ధి దిశగా కెఎల్ యూనివర్సిటీ విద్యా ప్రణాళిక

ఉన్నత విద్యా రంగంలో మేరు శిఖరం 46 వసంతాల కెఎల్ యూనివర్సిటీ

ENGINEERING PROGRAMS

CSE | CS&IT | AI&DS | ME | CE | EEE | ECE | IOT | BT

M.TECH PROGRAMS: ALL ENGINEERING PROGRAMS

B.TECH - LATERAL ENTRY : ALL ENGINEERING PROGRAMS

MHS PROGRAMS:

BBA | BCA (HONS) | B.COM (HONS) | BBA-LL.B.(HONS) | BA WITH CIVIL SERVICES ORIENTATION | B.ARCH | B.SC ANIMATION & GAMING, FOOD TECHNOLOGY (HONS) | B.SC (HONS) AGRICULTURE | B.PHARMACY | PHARM-D | MCA | MBA

RECOGNISED AS CATEGORY 1 UNIVERSITY BY UGC, STATUTORY BODY OF MHRD | nirf 26 AMONG ALL UNIVERSITIES

నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పన దిశగా క్యాంపస్‌లోనే పరిశ్రమల ఏర్పాటు..

- పరిశోధనలకు అగ్ర ప్రాధాన్యం
- 75 లక్షల అత్యధిక ప్యాకేజీతో రికార్డు
- 16 సంవత్సరాలుగా అర్హులైన విద్యార్థులకు 100% క్యాంపస్ ప్లేస్‌మెంట్స్
- 2025 విద్యా సంవత్సరంలో 8000 మందికి పైగా విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్స్
- శాటిలైట్స్ ప్రయోగాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు..
- విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకులలో జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు
- విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన దిశగా క్యాంపస్ ప్రాంగణంలోనే కంపెనీల ఏర్పాటు..
- మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా 100 కోట్ల రూపాయల విలువైన స్కాలర్‌షిప్స్ ద్వారా ఫీజులో రాయితీ..
- జె ఇ ఇ మెయిన్స్ లో 98 పర్సెంటైల్ దాటిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ కింద 100% ఫీజు మినహాయింపు..
- విదేశాల్లోనూ ప్రఖ్యాత కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్న విద్యార్థులు..
- విద్యార్థులకు అనువైన, సౌలభ్యకరమైన విద్యా విధానం..
- పారిశ్రామిక, పరిశోధనాత్మక శిక్షణ
- విద్యా ప్రణాళిక, ప్లేస్‌మెంట్స్ అంశాల్లో విదేశీ యూనివర్సిటీలు, కంపెనీలతో ఒప్పందాలు

మెరిట్ విద్యార్థుల కోసం కె ఎల్ యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కె ఎల్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థసారథి వర్మ, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు

Pre-Placement offer for 2026 batch
B. Lakshmi Sailaja
B.Tech-CSE
Secured Super Dream Offer in a reputed MNC with
CTC: 58 Lakhs
internship stipend of 1.25 Lakhs per month

PROUDLY ANNOUNCING 8000+ PLACEMENT OFFERS IN 2025

75 LAKHS CTC HIGHEST PACKAGE OFFERED BY TOP MNC

8.1 LAKHS CTC MEDIAN PAY PACKAGE

5000+ Unique Placements in 500+ Companies During 2025 Academic Year

IMPECCABLE PLACEMENT TRACK RECORD SINCE 2005

Marquee Companies with Salaries around	60 Lakhs
Super Dream Companies with Salaries around	40 Lakhs
Dream Companies with Salaries around	10 Lakhs

నింగిలోకి 3 శాటిలైట్స్

కె ఎల్ యూనివర్సిటీ విద్యార్థుల ఆవిష్కరణ



DIRECTOR OF ADMISSIONS 949 036 1111

KL Engineering Entrance Exam -Phase 1 NOV 27th to DEC 5th 2025

100 CRORES SCHOLARSHIP FOR MERIT STUDENTS

Apply Now www.kluniversity.in

ADVERTISEMENT

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేలా వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల సంస్థ అధికారులతో మాట్లాడారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లాలో వరికోతలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయని, ఈ క్రమంలో రైతులకు ఇబ్బంది లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం రానున్న వారం రోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సరిపడా సంచులు, వాహనాలను పౌరసరఫరాల శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ తహసీల్దార్లు అందుబాటులో ఉంచాలన్నారు. మద్దతు ధర కంటే తక్కువకు దళారులకు ధాన్యం అమ్మకాలు జరగకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకుల ద్వారా జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

తెనాలి ప్రాభవం నిలిపేందుకు యువత శ్రమించాలి

పరిచయ సంచికను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి ప్రాభవం నిలిపేందుకు యువత పాటుపడాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తెనాలి ప్రచురణలు, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం తెనాలి సంయుక్తంగా గురువారం తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో నిర్వహించిన 'పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు'కు భారత జ్యోతి పురస్కారం ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ఈ పట్టణం అపారమైన ప్రతిభా విశేషాలు కలిగిన వారికి నెలవు. జైఆంధ్రా ఉద్యమ కాలంలో, చదువుకునే రోజుల్లో తెనాలి కేంద్రంగా చేసుకుని రాష్ట్రమంతటా తిరిగాం. అనేక గ్రామాల్లో రైతులు, ప్రజలు ఎంతగానో సహకరించారు. గతంలో పాఠశాలల్లో తోట పని, నీతి కథలు చెప్పడం వంటి తరగతులు నిర్వహించే వారు. వాటిని కొనసాగించాలి. మాతృ దేశపు ప్రజల కష్టాలు కామేశ్వరరావును కదిలించాయి. అందుకే ఆయన సేవా మార్గం ఎంచుకున్నారు. ఆయన జీవితాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి' అని సూచించారు. రాష్ట్రంలో నడుస్తున్న అంగన్‌వాడీలు, డ్వాక్రా సంఘాలకు దుర్గా కామేశ్వరరావు పరోక్షంగా స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. సంకుచిత ఆలోచనల గల వారి మధ్య సేవ చేసే నాలాంటి వారు ఆగిపోవాల్సి వచ్చిందన్నారు. తెనాలి సాంస్కృతిక రాజధాని అని కీర్తించారు. మాతృమూర్తిని, మాతృ భాషను కాపాడుకోవడాన్ని వజ్ర సంకల్పంగా తీసుకుని పనిచేస్తున్న వారు ఈ కార్యక్రమానికి రావడం గొప్ప విశేషమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సాహితీ వేత్త వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. పురస్కార గ్రహీత ఒక శక్తి అని కీర్తించారు. హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్ మాట్లాడుతూ.. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, పురస్కార గ్రహీత కామేశ్వరరావు దేశం, సమాజం పట్ల గల ప్రేమను ఆచరణలో చూపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పరిచయ సంచికను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పురస్కార గ్రహీత సేవా కార్యక్రమాలపై రూపొందించిన లఘుచిత్రం ఆకట్టుకుంది. శ్రీనివాస కూచిపూడి నృత్య కేంద్రం విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించింది. కుమార్ పంప్స్, మోటార్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డబుల్ హార్స్ సంస్థ అధినేత మునగాల శ్యామ్‌ప్రసాద్, నిర్వాహకులు చిలువూరు సురేష్, నల్లూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

RAMOJI GLAMPING

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

ఆవిష్కర్తలుగా ఎదగండి

కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్, సీఈఓ ధాత్రిరెడ్డి

తాడేపల్లి, న్యూస్‌టుడే : ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగ్రామ్ స్పార్క్ ఉపయోగించి ఆవిష్కరణకర్తలుగా ఎదగాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని మయూరి టెక్‌పార్క్‌లోని రతన్ టాటా ఇన్నోవేషన్‌లో ఆర్‌టీఐహెచ్ ప్రధాన ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగ్రామ్ స్పార్క్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఆవిష్కరణ, ఆధారిత వ్యవస్థాపకతకు పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై రాష్ట్రం దృష్టి సారించిందని తెలిపారు. సామాజిక పరివర్తన, ఆర్థికవృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో వ్యవస్థాపకులది కీలకపాత్ర అని పేర్కొన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఆవిష్కరణకర్తలు తమ భావాలను మెరుగు పరుచుకునేందుకు రియల్ టైమ్ ఫీడ్‌బ్యాక్‌పై స్పష్టమైన దృష్టితో స్పార్క్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.

3న జాబ్‌మేళా

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ తదితరులు

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డిసెంబరు 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ తెలిపారు. తన క్యాంప్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులో ఈ మేళా ఉంటుందన్నారు. 900 ఉద్యోగాలకు ప్రముఖ కంపెనీలు ముఖాముఖిలు నిర్వహిస్తాయని తెలిపారు. రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనాలుంటాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, మాజీ కార్పొరేటర్ గోళ్ల ప్రభాకర్, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కిల్కారీ కాల్స్‌తో గర్భిణులకు సూచనలు

నగరంపాలెం, న్యూస్‌టుడే: కిల్కారీ సేవల కాల్స్ అందరికీ రావాలంటే ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల వివరాలను సకాలంలో కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో కిల్కారీ సేవలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ కిల్కారీ కాల్స్ నమోదు చేసుకున్నప్పుడే గర్భిణులు పూర్తి సమాచారాన్ని తెలుసుకోగలరన్నారు. కిల్కారీ కాల్‌లో ఏఎన్‌సీ, పీఎన్‌సీ సేవలు, హైరిస్కు సూచనలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు, బర్త్‌ప్లాన్, రక్తహీనత, ప్రమాదకర లక్షణాలు, టీకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బాలింతలు, గర్భిణులకు కావాల్సిన సమాచారం అందుతుందన్నారు. గర్భిణి 4వ నెల మొదలు కొని బిడ్డకు ఏడాది వయసు వచ్చేవరకు నెలకు ఒకసారి వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. ఫలితంగా మాతా శిశు మరణాలు తగ్గుతాయన్నారు. గర్భిణులు, బాలింతల చరవాణుల్లో కిల్కారీ నంబర్‌ను సూపర్‌వైజర్లు సేవ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, పీవో ఎన్‌సీడీ డాక్టర్ రోహిణీరత్నశ్రీ, డీపీహెచ్ఎన్‌వో ఇన్‌ఛార్జ్ డాక్టర్ కె.ప్రియాంక, అధికారులు రవికుమార్, ఎన్.సురేష్, కిల్కారీ ప్రాంతీయ ప్రోగ్రాం అధికారి బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షల్లో కాటూరి విద్యార్థినుల ద్వితీయ స్థానం

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే : ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని కాటూరి వైద్య కళాశాలకు చెందిన వైద్య విభాగం విద్యార్థినులు డాక్టర్ బి.ప్రణిత, డాక్టర్ కె.సాయి తనూజ పీజీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరులో నిర్వహించిన కమ్యూనిటీ మెడిసిన్ రేడియాలజీ, ఈఎన్‌టీ విభాగంలో వీరు ప్రతిభ చూపారు. వారిని కళాశాల ఛైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరక్టర్ డాక్టర్ సైైరారావు, డీన్ మోహన్‌రావు, ప్రిన్సిపల్ చైతన్య అభినందించారు.

డాక్టర్ కాట్రపాటి సాయి తనూజ

ప్రణీత

In Memory of the Diamond Jubilee of LOYOLA PUBLIC SCHOOL, Nallapadu, Guntur and following the Legacy of St.Ignatius' Pedagogy in Education, as a Token of Love and Gratitude. Hearty Welcome to Alumni of Loyola Public School on 29-11-2025, SATURDAY at 4.30 P.M. GOD BLESS US!

LOYOLA PUBLIC SCHOOL, GUNTUR · 60 YEARS OF LEGACY IN EDUCATION · Diamond Jubilee Celebrations

loyolapublicschool.lps@gmail.com

☎ : 91216 06671

Management

పర్యావరణ పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టండి

ఐటీసీ హోటల్‌లో కంపోస్టింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణయ్య

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు మరింత పటిష్ఠ చర్యలను చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. గుంటూరులోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. రింగ్‌రోడ్డులోని ఐటీసీ హోటల్‌ను సందర్శించి వంటశాల వ్యర్థాల నిర్వహణ విధానాలను పరిశీలించారు. హోటల్ నుంచి ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడానికి రోజుకు 200 కిలోల సామర్థ్యం కలిగిన ఆర్గానిక్ వేస్ట్ కంపోస్టింగ్ యంత్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హిందూస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను సందర్శించారు. ఏపీలో సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధికి స్థిరమైన రీసైక్లింగ్ వ్యవస్థలు అత్యంత అవసరమన్నారు. నగరశివారు ప్రాంతాల్లోని కాల్వల్లో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ నజీనాబేగం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అమరావతి - తుళ్లూరు దారికి మహర్దశ

అమరావతి: అమరావతి నుంచి తుళ్లూరు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. అమరావతి నుంచి వైకుంఠపురం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PERSONAL CLASSIFIEDS

N. లక్ష్మి, హైకోర్ట్ అడ్వకేట్ & సైకాలజిస్ట్, హైదరాబాద్. క్రిమినల్ కేసుల నిపుణులు. ఉచిత న్యాయ సలహాల కొరకు సంప్ర: 80193 43834.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT.వృద్ధులకు, పేషెంట్లు సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

GENERAL

రాజధాని అమరావతిలో గజం 5000/- & 10000/- రాజధానిలో ఎకరం పొలం 70 లక్షలు, గుంటూరులో డూప్లెక్స్ విల్లా 1.60 Cr. Ph: 90523 45356.

JOBS

WANTED Pro'sfor Jr.College Chirala for Details ✆ 80088 12235 send resume to wat'sapp:8328387500 attend Interview on1-12-25by 10AM.

Wanted Female Computer Operator, Timings: 9Am-6pm ★ Eclat Health Services, Arundalpet, Guntur ✆ 99514 42111.

యజ్ఞ హాస్పటల్ బాపట్లలో పనిచేయుటకు డ్యూటి డాక్టర్లు, అనుభవజ్ఞులైన నర్సింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించవలసిన. ✆: 79897 85865.

WANTED HDFC BANK కొరకు చీరాల పరిసర ప్రాంతాల యందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. లలితా ఫైనాన్స్ లింక్స్ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆7729989278

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవం గల వారు కావలెను. జీతము: (15K to 20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

ఆర్ డాక్టర్ హాస్పటల్, గోరంట్ల, గుంటూరు నందు మేనేజర్, నర్సింగ్ స్టాఫ్, PRO's కావలెను. రెజ్యూమ్ వాట్సాప్. 79814 50441.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆ 96402 58899, 96404 68899.

ప్రముఖ మార్కెటింగ్ సంస్థకు పార్ట్‌టైమ్ స్టాఫ్ కావలెను. నెలకు ₹ 5,000, డెలివరీ బాయ్స్, స్టూడెంట్స్, హౌస్ వైఫ్స్, వీక్లీ బోనస్. 98487 33026.

ప్రముఖ అగ్రగామి సంస్థలో పార్ట్‌టైం/ఫుల్‌టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి. అధిక కమీషన్ సంపాదించుకోండి, విద్యార్హత: 10th. Age:30-65 సం|| 9963590104.

FACULTY/ TEACHERS

WANTED: Principal To Run the School, Qul: PG+ B.Ed., need Sy. Experience, Salary: 40 to 50K, Cont: Buchi Reddy Palem Nellore (Dt.) ✆ 94401 22213.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

తుళ్లూరు, న్యూస్‌టుడే : నేడు అమరావతిలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి కేంద్రమంత్రితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. వీవీఐపీలు, వీఐపీల పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లను గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రముఖుల రాకపోకలు, పార్కింగ్ స్థలాలు, రాకపోకల నియంత్రణ, సమావేశం స్థలం వద్ద భద్రత, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు సౌకర్యాలు, అగ్నిమాపక, మెడికల్ ఎమర్జెన్సీ తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్, ఎస్పీ చర్చించారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వండి

రైతులకు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : రైతుల చేతుల్లోనే దేశ ఆహార భద్రత ఉందని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక విభాగ ప్రధాన అధికారి శ్రీధర్ అన్నారు. కిసాన్ పట్వాడా కార్యక్రమం కింద గుంటూరు రీజియన్‌లో రైతులకు, స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.60.25 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రైతు అభివృద్ధే దేశాభివృద్ధి అని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో ఆహార ధాన్యాలు ఎక్కువగా పండిస్తున్నారని చెప్పారు. కౌలు రైతులు ఎక్కువ మంది ఉన్నారని.. వారికి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రుణ సదుపాయం వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ రితీష్‌కుమార్, ఆర్ఎం కిరణ్‌రెడ్డి, డీఆర్ఎం చంద్రమౌళి, చీఫ్ మేనేజర్ వి.వెంకటేశ్వరరావు, నాబార్డు డీడీఎం శరత్‌బాబు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	35,654
అమ్మకాలు:	33,916
నిల్వలు:	12,710

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	10,000-17,500
నంబర్ 5	11,000-15,300
341	10,500-17,300
సూపర్10	11,500-16,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,600
బాడిగ	10,500-17,600
దేవనూరు డీలక్స్	11,000-17,000
ఆర్మూర్	10,000-13,700

ఏసీ కామన్ వెరైటీ

334	11,000-17,200
నంబర్ 5	10,500-15,800
341	12,000-17,400
4884	12,000-14,000

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,500-15,300
బాడిగ	11,000-17,700
దేవనూరు డీలక్స్	10,500-16,500
తాలు	5,200-8,200

\- న్యూస్‌టుడే, మిర్చియార్డు

విస్తీర్ణం మేరకే ఎరువుల విక్రయాలు

గోరంట్ల: రసాయన ఎరువుల అమ్మకాల్లో డీలర్లు ప్రభుత్వం సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎరువుల విభాగం సహాయ సంచాలకులు డాక్టర్ రాజన్ అన్నారు. గుంటూరులో ఇండియన్ పొటాష్ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోని ఎరువుల టోకు, రిటైల్ డీలర్లకు అవగాహన సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్ మాట్లాడుతూ ఎరువుల వ్యాపారం, అమ్మకాలు, నిల్వ తదితర అంశాల్లో కేంద్ర ప్రభుత్వం పరిస్థితులకు అనుగుణంగా మార్పులు తీసుకొస్తోందన్నారు. వాటిని వ్యాపారులు పాటించాలన్నారు. ఈ పోస్ యంత్రాలు 3.3 వర్షన్‌కు మారాయని, డీలర్లు యంత్రాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు విక్రయించే విషయంలో మార్పులు వచ్చాయని, సాగుచేసిన విస్తీర్ణంమేరకు ఎరువులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే తీసుకున్న ఎరువుల బస్తాల వివరాలను పరిశీలించుకుని, గరిష్ఠ పరిమాణం దాటకుండా విక్రయించాలని సూచించారు.

న్యాయ సహాయం కోసం వస్తే.. మహిళతో అసభ్య ప్రవర్తన

వైకాపా లీగల్ సెల్ సభ్యుడు వెంకటేశ్వర శర్మపై కేసు

పటమట - న్యూస్‌టుడే: ఓ మహిళకు భర్తతో ఉన్న విభేదాలను తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించాడు ఆ న్యాయవాది. ఈ విషయంలో న్యాయ సహాయం కోసం వచ్చిన ఎస్టీ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేసేందుకు ప్రయత్నించాడు... వైకాపా లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాది. చివరకు ఆమె ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

★ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఓ మహిళ, ఆమె భర్త... ఇద్దరూ కూలి పనులకు వెళ్తుంటారు. తాగుడుకు బానిసైన అతడు.. నిత్యం ఆమెను హింసించేవాడు. దీంతో భర్తతో కాకుండా విడిగా ఉంటోంది. ఈ వివాదానికి సంబంధించి న్యాయ సహాయం కోసం సోదరుడితో కలసి గురువారం విజయవాడలోని వైకాపా న్యాయ విభాగం సభ్యుడైన వెంకటేశ్వరశర్మ ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా.. న్యాయవాదికి ఆమె వివరాలు చెబుతుండగా. వేరుగా మాట్లాడాలని చెప్పి.. ఆమె సోదరుడిని బయటకు పంపాడు. న్యాయవాది వెంకటేశ్వరశర్మ.. మహిళ చున్నీ లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. న్యాయవాది ఇంటి బయటకు ఆమె ఏడుస్తూ వచ్చింది. వెంటనే సోదరుడితో కలసి డయల్ 112కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న మాచవరం స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను, న్యాయవాది వెంకటేశ్వరశర్మను స్టేషన్‌కు తీసుకొచ్చారు. 'వెంకటేశ్వర శర్మ తనకు డబ్బులు ఇస్తూ. . అసభ్యంగా ప్రవర్తించాడని' ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై మాచవరం పోలీసులు న్యాయవాదిపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ (1) కింద కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

నాటు వైద్యం వికటించి విద్యార్థిని మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే : కడుపు నొప్పికి చేసిన నాటు వైద్యం వికటించి.. బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పేరేచర్లకు చెందిన 16 ఏళ్ల బాలిక నల్లపాడు పరిధిలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వారం కిందట ఆమెకు కడుపునొప్పి వచ్చింది. బంధువులు గుంటూరు సర్వజనాసుపత్రి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు కిడ్నీలో రాళ్లు ఉన్నాయని, మంచి నీళ్లు ఎక్కువగా తాగాలని చెప్పారు. ఈ క్రమంలో బాలిక తిరిగి ఇంటికి వచ్చింది. చుట్టుపక్కల వారి సూచనల మేరకు నాటు వైద్యం చేశారు. (కొండ పిండి ఆకు తినిపించారు) ఈ క్రమంలో విపరీతమైన కడుపు నొప్పి రాగా 24న మరోసారి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున బాలిక మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై అఘాయిత్యం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై గురువారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంటరు చదువుతున్న బాలికతో వెంకటాద్రిపేటకు చెందిన ఎలక్ట్రికల్ పనులు చేసే రాజేష్ (22) పరిచయం పెంచుకొని ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. అక్టోబరు 4న ఆమెను వెంట తీసుకెళ్లాడు. బాలిక కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు పోలీసు బృందాలు తెనాలి, ఒంగోలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో గాలించాయి. సాంకేతిక పరిజ్ఞానంతో రాజేష్ ఆచూకీ గుర్తించాయి. అతను తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను పోలీసులు నమోదు చేసుకున్నారు. ఆమెను వైద్య పరీక్షలకు జీజీహెచ్‌కు పంపించారు. యువకుడిపై అపహరణ, అత్యాచారం, పోక్సో సెక్షన్లు నమోదు చేశామని సీఐ వీరయ్యచౌదరి తెలిపారు.

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

తెనాలి

•తెనాలి •పొన్నూరు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి టౌన్: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం తెనాలి మండలం కొలకలూరు, గుడివాడ గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వ్యవసాయ అధికారులు విజయబాబు, సుధీర్‌బాబు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఏఎన్‌యూ: ఏఎన్‌యూలోని గణాంక శాస్త్రంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కాంతం గురువారం ప్రారంభించారు. విద్యార్థుల కోసం గణాంక విభాగంలో నూతనంగా 20 కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఆచార్యులు శ్రీనివాసరావు, చందన్, వాసుదేవరావు, రోశయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ. (క్వింటా)

అత్యధికం: 1400
అత్యల్పం: 1200
సగటు : 1000

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఉపన్యసించి.. బహుమతులు సాధించి..

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏజీఎమ్, ప్రిన్సిపల్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: హావభావ సహితంగా ఎంచుకున్న అంశంపై విశ్లేషణాత్మక ఉపన్యాసాలతో విద్యార్థులు అబ్బురపరిచారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం తెనాలి గంగానమ్మపేటలోని నారాయణ ఉన్నత పాఠశాల్లో 'విద్యార్థుల జీవితాలపై చరవాణుల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. సత్య ఇషాన్ (7వ తరగతి), నాగ అభిరామ్ (7వ తరగతి), మోనశ్రీ (10వ తరగతి) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలువగా ఏజీఎమ్ డి.శివ నాగరాజు, ప్రిన్సిపల్ నన్నపనేని నాగలక్ష్మి విజేతలను అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు.

బాలల ఆరోగ్యానికి భరోసా

'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

పరీక్షలు చేస్తున్న వైద్యులు ప్రియాంక, ఏసుబాబు, మోతీలాల్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. తెనాలి జిల్లా ఆసుపత్రి, సత్వర చికిత్స కేంద్రం, యూపీహెచ్‌సీ, మలేరియా సబ్ యూనిట్ కార్యాలయ వైద్యులు, సిబ్బంది, మున్సిపల్ ఆరోగ్యాధికారి సేవలు అందించారు. మొత్తం 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యురాలు వేముల ప్రియాంక తెలిపారు. 70 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు చేసినట్లు చెప్పారు. దంత సమస్యలతో బాధపడుతున్న 50 మందిని పరీక్షించి.. అవసరమైన వారిని తెనాలి జిల్లా ఆసుపత్రికి రమ్మని సూచించినట్లు వైద్య నిపుణులు మోతీలాల్ తెలిపారు. 20 మంది తలనొప్పి, 20 మంది జలుబు, అలర్జీ, జ్వరం, దగ్గు, కంటి ఒళ్లు, కాళ్ల నొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న 110 మందికి పరీక్షలు చేసి మందులు అందించినట్లు మున్సిపల్ ఆరోగ్యాధికారి మొవ్వా ఏసుబాబు పేర్కొన్నారు. వీరిలో కొందరిని జిల్లా ఆసుపత్రికి వెళ్లాలని సూచించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఉమాకాంత్ తెలిపారు. శ్రీశైల జక్క సేవా సమితి తెనాలి సభ్యులు ఎం.పూర్ణ, శ్రీవెంకటేశ్వర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ తెనాలి అసోసియేషన్ అధ్యక్షులు జవ్వాజి వెంకట కృష్ణారావు, నరసింహారావు, కోశాధికారి యజ్ఞప్రసాద్ ఉచితంగా మందులు అందించారు. మొవ్వా సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, వ్యాయామ ఉపాధ్యాయిని వసంత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కె.డెంటల్ టెక్నీషియన్ కె.రాహుల్, చింతల పుష్పలత, బి.మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, వేణుగోపాల్, నవీద్, 12 మంది ఏఎన్‌ఎంలు, 10 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహార, డెంటల్ కిట్లు పంపిణీ చేస్తున్న దాతలు

విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యురాలు నేహారెడ్డి

కొల్లిపర, న్యూస్‌టుడే: సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో 'ఈనాడు-ఈటీవీ' పాత్ర కీలకమని తహసీల్దార్ సిద్ధార్థ కొనియాడారు. కొల్లిపర మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఈనాడు-ఈటీవీ నేతృత్వంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రూ.25 వేలు విలువైన పోషకాహార పొడి టిన్నులు, డెంటల్ కిట్లను మండల ఆర్యవైశ్య సంఘం, దాత మున్నంగి రామలక్ష్మణరావు, మరో దాత ఎం.మల్లికార్జునరావు అందజేయడం హర్షణీయమన్నారు. వైద్యురాలు రేణి నేహారెడ్డి 63 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి.. ఎత్తు, బరువు, రక్తనమూనాలను సేకరించారు. కొల్లిపర శివారు గుడిబండివారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి కిట్లు పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో భార్గవ, ఎంఈవో2 ఝాన్సీలత, ఎస్ఆర్‌వో ఆదినారాయణరెడ్డి, సంఘ అధ్యక్షులు అన్నవరపు రమేష్, ప్రధానోపాధ్యాయులు చింతమనేని బాలకృష్ణ, టి.శ్రీలత, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

'సాంకేతికతను సద్వినియోగం చేసుకుందాం'

గెలుపొందిన విద్యార్థినులతో ప్రిన్సిపల్, హెచ్ఎం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని ముందంజ వేద్దామని విద్యార్థులు ఉపన్యసించారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం తెనాలి సుల్తానాబాద్‌లోని భాష్యం ఉన్నత పాఠశాల్లో 'విద్యార్థుల జీవితాలపై చరవాణుల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో వారు తమ అభిప్రాయాలు వెల్లడించారు. మేఘన (7వ తరగతి), తేజోమయి (8వ తరగతి), సుమబాల (7వ తరగతి) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలను ప్రిన్సిపల్ మణికాంత్ దత్, ప్రధానోపాధ్యాయిని నాజ్‌నీన్ జిగర్, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు అభినందించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు.

ఆక్రమణలు తొలగించండి

దుకాణదారులకు సూచనలిస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రజల రాకపోకలకు అడ్డుగా, కాలువలను దాటి ముందుకు వచ్చిన ఆక్రమణలను తొలగించాలని సీఐ సాంబశివరావు సూచించారు. ఆయన గురువారం మారీసుపేట, చెంచుపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి దుకాణదారులతో మాట్లాడారు. పలువురు రౌడీషీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ప్రవర్తనపై కుటుంబ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తీరు మార్చుకోవాలని సూచించారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

కరపత్రాలను ప్రదర్శిస్తున్న సబ్ కలెక్టర్ సంజనాసింహ

కొల్లిపర: ధాన్యం కొనుగోలులో సమస్యలను అధిగమిస్తున్నామని.. రైతులు విశ్వసనీయతను కోల్పోవద్దని సబ్‌కలెక్టర్ సంజనాసింహ పేర్కొన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని చివలూరు రైతుసేవా కేంద్రాన్ని (కొనుగోలు కేంద్రం) ఆమె పరిశీలించారు. బస్తాలకు పట్టిన ధాన్యం ఎగుమతులకు రెండు రోజులుగా జాప్యం నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవాకేంద్రంలో, మిల్లర్ల మధ్య తేమశాతం వ్యత్యాసానికి కారణాలు గుర్తించాలని రైతులు కోరారు. తేమశాతం, యంత్రాల పనితీరును పరిశీలిస్తామని, గోతాలు అందుబాటులో ఉన్నాయని, రవాణా సమస్యలను పరిష్కరిస్తున్నామని ఆమె రైతులకు భరోసానిచ్చారు. దళారీలకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించొద్దని సూచించారు. అనంతరం వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఏవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శివరామకృష్ణ సేవలు ఎనలేనివి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: సీపీఐ నాయకుడు, సినీ మాటల రచయిత బొల్లిముంత శివరామకృష్ణ సేవలు ఎనలేనివని పలువురు కళాకారులు కొనియాడారు. గురువారం పట్టణంలోని ఓ సమావేశ హాలులో నిర్వహించిన శివరామకృష్ణ జయంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి, ఇస్కఫ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కృష్ణ, వెంకట్, రఘునాథరావు, వెంకటేశ్వరరావు అభ్యుదయ గీతాలు ఆలపించారు.

తెలుగు మాట్లాడండి.. సంప్రదాయాలు పాటించండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెలుగులో మాట్లాడి.. సంప్రదాయాలను కాపాడాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విద్యార్థులకు సూచించారు. తెనాలి వచ్చిన ఆయన్ను గురువారం పలువురు నాయకులు, అధికారులు, పాఠశాలల విద్యార్థులు మర్యాద పూర్వకంగా కలిశారు. సబ్ కలెక్టర్ సంజనాసింహ, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తహసీల్దార్ గోపాలకృష్ణ, భాజపా నాయకులు, ఆయన సహచరులు కలిసిన వారిలో ఉన్నారు. ఆయన రాజ్యసభ మాజీ సభ్యులు యడ్లపాటి వెంకట్రావు స్వగృహంలో బస చేశారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి గులాబీ పూలు ఇస్తున్న విద్యార్థులు

తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో గుంటూరు-బాపట్ల ప్రధాన రహదారిలోని పురపాలక సంఘ కార్యాలయం నుంచి తెలగపాలెం రామమందిరం వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. అనేక ప్రమాదాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం కొంత కాలం కిందట రహదారి నిర్మాణ పనులకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు రోడ్డు భవనాల శాఖ ఏఈ గోగినేని శ్రీనివాసరావు వెల్లడించారు.

అవగాహన.. అప్రమత్తతతో సైబర్ నేరాల అదుపు

మాట్లాడుతున్న సీఐ నిసార్ బాషా

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అప్రమత్తతో సైబర్ నేరాలను అదుపు చేయొచ్చని.. ప్రతి ఒక్కరూ నేరాల నియంత్రణపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సైబర్ విభాగ సీఐ నిసార్ బాషా తెలిపారు. తెనాలి జేయంజే మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫోన్లలో వచ్చే తెలియని సందేశాలకు స్పందించవద్దని చెప్పారు. మీరు నేరం చేశారంటూ, అరెస్ట్ చేశామంటూ వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని, తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని గుర్తించాలన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలని.. అటుపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని వివరించారు. హెడ్ కానిస్టేబుల్ రాజ్‌కిశోర్, ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్లిన్, అధ్యాపకులు దాసరి విజయలక్ష్మి, అరుణ సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూసా నిధులు ఖర్చు చేయండి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి కేంద్రం విడుదల చేసిన రూసా నిధులను వెంటనే ఖర్చు చేయాలని జాతీయ ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. దిల్లీలో మంగళ, బుధవారం జరిగిన రూసా సమావేశానికి ఏఎన్‌యూ నుంచి రిజిస్ట్రార్ సింహాచలం, సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్ హాజరయ్యారు. రూసా 1.0లో మిగిలిన డబ్బులను డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని.. వచ్చే ఏడాది మార్చి 31లోపు 2.0 డబ్బులను ఖర్చు చేయాలని దిశానిర్దేశం చేసినట్లు వారు తెలిపారు.

అభ్యంతరం లేని భూములకు పట్టాలు

'ఈనాడు' ఫోన్ ఇన్‌లో తహసీల్దార్ కృష్ణకాంత్

పెదకాకాని, న్యూస్‌టుడే



అభ్యంతరం లేని భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు పట్టాలు ఇస్తామని తహసీల్దార్ పరాశరం కృష్ణకాంత్ తెలిపారు. ఇళ్ల స్థలాలు లేనివారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. గురువారం నిర్వహించిన 'ఈనాడు ఫోన్ ఇన్' కార్యక్రమంలో వీఆర్వోలు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొని ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

? ఉప్పలపాడులోని సర్వే నంబరు 193/1ఏ లోని ఎకరం భూమి నిషేధిత భూముల జాబితాలో ఉంది. దాన్ని తొలగించడం లేదు. **- వేల్పూరి సామ్రాజ్యం**

✔ కొన్ని రోజుల కిందటే నివేదికను కలెక్టర్‌కు పంపించాం. ఆమోదం తెలపగానే తొలగిస్తాం.

? కొత్త రేషన్ కార్డు మంజూరు చేయండి **- షేక్.ఫిరోజ్, నంబూరు, - గడ్డం శౌరి, తక్కెళ్లపాడు**

✔ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోండి. కొత్తగా వివాహమైన వారికి మంజూరవుతున్నాయి. ఇబ్బందులు ఉంటే నాకు ఫోన్ చేయండి.

? తక్కెళ్లపాడులోని సర్వే నంబరు 497లో 2 ఎకరాల 66 సెంట్ల భూమి ఉంది. 1బీ, అడంగల్‌లో 10 సెంట్లు తగ్గింది. **- నరహరి చౌదరి**

✔ ఇప్పటికే భూమికి కొలతలు వేశారు. కొంత తగ్గినట్లు గుర్తించాం. హద్దుదారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం.

? నంబూరులోని సర్వే నంబరు 300లో ఉన్న నా 2 ఎకరాల భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారు. దాన్ని తొలగించండి **- కె.ప్రభాకర్**

✔ ధ్రువీకరణ పత్రాలను సంబంధిత వీఆర్వోకు ఇవ్వండి. నేను పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాను.

? ఉప్పలపాడులో సర్వే నంబరు 553లోని భూమి ఆన్‌లైన్లో దేవాదాయశాఖ భూమిగా ఉంది. కానీ అది పట్టా భూమి. **- సురేష్‌బాబు**

✔ ఇప్పటికే ఆ సర్వే నంబర్లలో ఉన్న పట్టా భూములను సబ్ డివిజన్ చేశాం. త్వరలో సమస్య తొలగనుంది.

? శంకర కంటి ఆసుపత్రి వద్ద కాలువ ఆక్రమణకు గురైంది. నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. పెదకాకాని సుందరయ్య కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు మంజూరు చేయండి **- నన్నపనేని శివాజీ**

✔ ఆక్రమణ తొలగించాలని అధికారులను ఆదేశించాను. సుందరయ్య కాలనీలో అభ్యంతరం లేని భూమిలో ఉన్న ఇళ్లకు పట్టాలు సిద్ధం చేస్తున్నాం.

? ఉప్పలపాడులో సర్వే నంబరు 110/ఎలో ఎకరం భూమిని కొన్నేళ్ల కిందట నా తండ్రి పేరుపై డీకే పట్టా ఇచ్చారు. నా పేరుపై ఆన్‌లైన్ చేయమని దరఖాస్తు చేసినా పట్టించుకోవటం లేదు. **- నల్లమోతు కోటేశ్వరరావు**

✔ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని నన్ను కలవండి. న్యాయం చేస్తాను.

పిండ మార్పిడి విధానంలో పశువులకు గర్భధారణ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: గత రెండేళ్లలో రాష్ట్రంలోని 300 పశువులకు పిండ మార్పిడి విధానంలో గర్భధారణ చేసినట్లు పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గురువారం తెనాలి పశువైద్యశాలలో నిర్వహించిన 'పశువులకు పిండమార్పిడి విధానంలో గర్భధారణ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పిండం ఖరీదు రూ.5 వేలని.. అవగాహన కోసం పశుగణాభివృద్ధి సంస్థ వారు రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు 100 పశువులకు పిండ మార్పిడి విధానంలో గర్భధారణ చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఆ సంస్థ ఈవో డాక్టర్ వై.సుధాకర్, పెదరావూరు పశుసంవర్ధకశాఖ పెదరావూరు డివిజన్ డీడీ డాక్టర్ పద్మావతి, ఏడీ డాక్టర్ నరేంద్రబాబు, తెనాలి, చేబ్రోలు పశువైద్యశాలల ఏడీలు బొంతునాగిరెడ్డి, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ జాబ్ మేళాలో ౯౦ మందికి ఉద్యోగాలు

తుళ్లూరు: తుళ్లూరులోని ప్రాంతీయ సీఆర్డీఏ కార్యాలయంలో 400 ఉద్యోగాలు భర్తీ చేయటానికి గురువారం జాబ్ మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఏపీ సీఆర్డీఏ నిర్వహించిన ఈ జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 206 మంది హాజరయ్యారు. 90 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన వారికి ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్డీఏ కో- ఆర్డినేటర్లు వెంకట్, త్రివేణి, శేఖర్ సంస్థల ప్రతినిధులతో కలసి నియామక పత్రాలు అందించారు.

'మహిళా రిజర్వేషన్లను అమలు చేయండి'

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా రిజర్వేషన్లను అమలు చేయకుండా వివిధ పాలకవర్గ కమిటీల నియామకం జరుగుతుందని.. రిజర్వేషన్లు అమలు చేయాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త షేక్.ఖలీల్ కోరారు. తెనాలిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. చట్ట సభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. సంబంధిత నాయకులు సమన్వయ సమావేశాల ద్వారా ముందడుగు వేయాలని సూచించారు.

పీజీ పరీక్షల నోటిఫికేషన్ రద్దు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ కళాశాలల్లో సిలబస్, ప్రవేశాలు, 90 పనిదినాలు పూర్తి కాకుండానే పీజీ పరీక్షల షెడ్యూల్ విడుదలపై 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నెల 25న విడుదల చేసిన పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. స్పాట్ అడ్మిషన్స్, ప్రవేశాల ప్రక్రియ పూర్తైన తర్వాత రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇచ్చే షెడ్యూల్‌ను అనుసరిస్తామని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

విశిష్ట నంబరు తప్పనిసరి

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, పక్కన రమణకుమార్

పెదకాకాని, న్యూస్‌టుడే: ప్రతి మహిళా రైతుకు విశిష్ట నంబరు తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయ యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గుడిపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. పెదకాకానిలో గురువారం మహిళా రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే కాలంలో ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలు, ప్రోత్సాహకాలకు ఈ ప్రత్యేక నంబరు ఉండాలని సూచించారు. భూమి పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నంబరు తీసుకోవాలన్నారు. ఏవో రమణకుమార్, రైతు సేవా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల

జట్టుకు ట్రోఫీ అందిస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న అంతర కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా ఇంజినీరింగ్ కళాశాల నిలిచింది. రెండో రోజైన గురువారం నిర్వహించిన తుది పోటీల్లో ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ, నరసరావుపేట వాసవీ డిగ్రీ కళాశాల ద్వితీయ, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు రిజిస్ట్రార్ సింహాచలం బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. అనంతరం వచ్చే నెల 22 నుంచి 25 వరకు కాలికట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే జట్టును ప్రకటించారు. మొత్తం 18 మంది సభ్యులను ఎంపిక చేశారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య లింగరాజు, డాక్టర్ సూర్యనారాయణ, కమిటీ సభ్యులు శేషగిరిరావు, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ పి.శివరామకృష్ణ, టోర్నమెంట్ నిర్వాహకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పరిధిలోని 1వ వార్డులో రహదారిపై గొయ్యి ఏర్పడింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. **- కె.సుబ్బారావు, 1వ వార్డు.** ✔ మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **-షేక్ హసీనా, సహాయ ఇంజినీరు.** ? పొన్నూరు పరిధి 11వ వార్డులోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. **- పి.రామారావు. 11వ వార్డు .** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

☛ పట్టణ పరిధిలోని 20వ వార్డు శివారులో చెత్త పేరుకుందని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో శుభ్రం చేయించారు. ☛ 31వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

స్పందనకు వందనం

వర్మీ కంపోస్టు వాడకంతో నాణ్యమైన పంటలు

ఎరువు తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: వర్మీ కంపోస్టు వాడకంతో భూసారం పెరిగి.. నాణ్యమైన పంటలు పండుతాయని విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫణీంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని వడ్లమూడిలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో 3వ రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎరువు తయారీపై అవగాహన కల్పించారు.

కొత్తరెడ్డిపాలెంలో...

చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు కొత్తరెడ్డిపాలెంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త దివ్యతేజమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. స్థానిక కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

తక్కెళ్లపాడు(పెదకాకాని), న్యూస్‌టుడే: తక్కెళ్లపాడులోని గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అమ్మవారి పునః ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూజలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు

క్రైమ్ కార్నర్

ఆటో దగ్ధం

కొల్లిపర, న్యూస్‌టుడే: మండల పరిధి వల్లభాపురానికి చెందిన పాటిబండ్ల సుబ్బారావు తన ఇంటి ముందు నిలిపిన ఆటో దగ్ధమైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం కిరాయికి వెళ్లి వచ్చి రాత్రి ఇంటి ముందు ఆటో నిలిపిన కాసేపటికి బయటకు వచ్చి చూడగా.. ఆటో దగ్ధమవుతూ కనిపించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాలో జమచేయని నగదు రికవరీలో తాత్సారం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: బ్యాంకు నుంచి తీసుకున్న రుణం చెల్లించాలని గ్రూపు అధ్యక్ష, కార్యదర్శులకు అందించగా.. వాటిని వారి అవసరాలకు వాడుకున్నట్లు తెలిసి సిరి వెన్నెల ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఇటీవల సబ్ కలెక్టర్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ప్రతినెలా చెల్లింపుల వివరాలు అడిగి తెలుసుకోవాల్సిన సభ్యులు ఆ పని చేయలేదు. వీటిని వారి నుంచి రాబట్టడంలో తాత్సారం జరుగుతుండటంతో సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గ్రూపు సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్పీల మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి కారణమని చెప్పొచ్చు. ఉన్నతాధికారుల పరిశీలనలో ఈ విషయం బయటకు రాకపోవడం అనుమానాలకు తావిస్తుంది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని రాజుల కాలనీకి చెందిన ఉషను హత్య చేసిన కేసులో నిందితుడైన విజయ్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జనార్దనరావు, సీఐ మల్లికార్జునరావు గురువారం తెలిపారు. ఆమెతో సహజీవనం చేస్తున్న విజయ్ అనుమానంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని.. విచారణలో అతను నేరాన్ని అంగీకరించాడని చెప్పారు. నిందితుడిని తెనాలి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని. . గుంటూరు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగిని అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యంపై గురువారం రాత్రి ఫిర్యాదు అందిందని తెనాలి రెండో పట్టణ పోలీసులు తెలిపారు. ఐతానగర్‌కు చెందిన దంపతులు తెనాలిలోని వేర్వేరు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరి వేతనాలతో కిస్తీలు చెల్లించేలా ఇల్లు తీసుకున్నారు. అయితే వీరిలో భర్త బ్యాంకు ఉద్యోగం కోసం శిక్షణ నిమిత్తం గత రెండు నెలలుగా ఉద్యోగానికి సెలవు పెట్టారు. తన ఒక్క వేతనంతో నెలవారి కిస్తీలు చెల్లించడం కష్టంగా మారిందని, వెంటనే ఉద్యోగంలో చేరాలని మహిళ భర్తను కోరగా.. బ్యాంక్ ఉద్యోగ పరీక్షల అనంతరమే తాను చేరతానని ఆయన సమాధానం చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన మహిళ మూడు సంవత్సరాల తన కుమారుడితో బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో వ్యక్తి...

గంగానమ్మపేటకు చెందిన టింబర్ వ్యాపారి, ఇంటికి వచ్చిన తర్వాత అర్ధరాత్రి వరకు చరవాణిలో మాట్లాడుతుండటంతో తరచూ దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో సెప్టెంబరు 6న విజయవాడలో వేడుకకు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఈరోజు వరకు తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సీతా సమేత శ్రీరామచంద్రమూర్తికి పుష్పయాగం

విజనంపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే : మండలంలోని విజనంపాడు శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో జరుగుతున్న 61వ రామనామ సప్తాహ మహోత్సవాల్లో ఉప్పుటూరి సాంబశివరావు, ఎంపీటీసీ సుజాత దంపతుల సమక్షంలో స్వామికి పుష్పయాగం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు.

అలంకరణలో స్వామి

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

పెదనందిపాడు, న్యూస్‌టుడే : రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె, బ్యాంక్ బరోడా అధికారులు రితేష్‌కుమార్, కిరణ్‌రెడ్డి, చంద్రమౌళి, నాబార్డు డీడీఎం శరత్ బాబు, లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ మహిపాల్ రెడ్డితో కలసి రైతన్న మీ కోసం కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు.

మండల సచివాలయాల అధికారిగా వెంకట్రావ్

దుగ్గిరాల, న్యూస్‌టుడే : గ్రామ, వార్డు సచివాలయ మండల అధికారిగా వెంకట్రావ్ గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉద్యోగులు అభినందించారు.

బాలుర భవితకు తోడ్పాటు

వైద్య పరీక్షలు.. ఆరోగ్య సూచనలు

ఈనాడు మీతోడు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : నువ్వు ప్రతి రోజూ ఒక గుడ్డు తప్పనిసరిగా తినాలి అంటూ ఒక విద్యార్థికి.. నువ్వు ఉండాల్సిన బరువు కంటే ఎక్కువ ఉన్నావు.. కాబట్టి రోజూ కనీసం అరగంటైనా ఆడాలి, లేదంటే వ్యాయామం చేయాలి అంటూ మరో విద్యార్థికి.. ఇలా పలువురికి దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ సూచనలు, సలహాలు ఇచ్చారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని జయ రత్నరాణి పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయిని రాధాకుమారి తోడ్పాటుతో బాలురకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తొలుత డిప్యూటీ హెచ్ఈవో వంకదార సుబ్బారావు, సీహెచ్‌వో బుజ్జి, ఆరోగ్య కార్యకర్తలు ప్రమీలారాణి, లీలాకుమారి, ఆశా కార్యకర్తలు విమల, సుగుణకుమారి, సునీత, మాధవి విద్యార్థుల ఎత్తు, బరువు, తల, ఛాతి కొలతలు సేకరించారు. అనంతరం ప్రతి ఒక్కరికి రక్త పరీక్ష చేసి హిమోగ్లోబిన్ ఎంత శాతం ఉందో నమోదు చేశారు. తర్వాత డాక్టర్ రెహమాన్ వైద్య పరీక్షలు చేశారు. దగ్గు, జలుబు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షించారు. వారికి ఏయే మందులు అవసరమో సూచించగా సిబ్బంది వాటిని అందించారు.

విద్యార్థి ఆరోగ్యంపై వాకబు చేస్తున్న డాక్టర్ రెహమాన్, పక్కనే హెచ్ఎం జయ రత్నరాణి

ఆరోగ్య నియమాలు పాటించాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే : ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని మండల వైద్యాధికారి ప్రియంవద అన్నారు. పెదనందిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక రోటరీ క్లబ్ సహకారంతో 191 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని.. అప్పుడే అనారోగ్యం దరి చేరదని చెప్పారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని.. బయట పదార్థాలను తినవద్దని, పరిశుభ్రమైన తాగునీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాదస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ సుజ, రోటరీ ఛైర్మన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదనందిపాడు : విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ప్రియంవద

అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా..

• 'రైతన్న సేవలో' పేరిట కార్యక్రమాలు
• గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు చేసిన మేలు వివరించేందుకు ఆ శాఖ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తవుతోంది. ఈ మధ్య కాలంలో కూటమి సర్కారు చేసిన అభివృద్ధి పనులు, అందిస్తున్న సేవలు, పలు రకాలుగా అందించిన ఆర్థిక తోడ్పాటు వంటి అంశాలపై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈనెల 24 నుంచి 29 వరకు కార్యక్రమం చేపట్టనున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్తున్నారు. రైతన్న సేవలో- మన మంచి ప్రభుత్వం అనే పేరుతో కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు.

వివరాలు ముద్రించి...

ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టిన భారీ సాగు నీటి ప్రాజెక్టుల ఆశయం, వాటి ఖర్చు, ఉపయోగం అనేక రకాలుగా అందిస్తున్న డిజిటల్ సేవలు, పలు రకాలుగా అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు, పంట ఉత్పత్తుల కొనుగోలు, రాయితీ ద్వారా యాంత్రీకరణ, బిందు సేద్యం పరికరాలు, నాణ్యమైన విత్తనాలు అందజేత, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి వివరాలు, ఉద్యాన పంటలకు అందించే ఆర్థిక తోడ్పాటుకు అయ్యే నిధులు, డిజిటల్ సేవలు, పాడి రైతులకు అందించే ప్రోత్సాహం వివరాలు, ఆక్వా రైతులకు విద్యుత్తు రాయితీ ద్వారా కలిగే ప్రయోజనాలు, సంచార రైతు బజార్ల ఉపయోగం వంటి పనులకు చేస్తున్న ఖర్చు, రైతులకు కలిగే ప్రయోజనాలు కరపత్రాల్లో పొందుపరిచారు.

మేడికొండూరులో కరపత్రాలు చూపుతున్న వ్యవసాయ అధికారులు, నాయకులు

☛ అధికారులు, నాయకులు కలిసి ప్రజలకు ఈ విషయాలు వివరిస్తారు. తర్వాత వ్యవసాయ అధికారులు ఆయా రైతుల వివరాలు ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారు. దీంతో ఈ ప్రక్రియ పూర్తవుతుంది.

☛ తాడికొండ నియోజకవర్గం తుళ్లూరు మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిల్లో 14 గ్రామాలు సీఆర్‌డీఏ పరిధిలోకి వెళ్లాయి. మిగిలిన వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెద్దపరిమిలో మాత్రమే వ్యవసాయ భూమి ఉంది.

జోష్ నింపిన మంత్రి నారా లోకేశ్ పర్యటన

మంగళగిరి, మంగళగిరి గ్రామీణ, న్యూస్‌టుడే : మంత్రి, మంగళగిరి శాసనసభ్యుడు నారా లోకేశ్ పర్యటన సందర్భంగా తెదేపా శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అడుగడుగునా ఆయనకు నీరాజనాలు పలికారు. బాణసంచా కాల్చి పూలతో బ్రహ్మరథం పట్టారు. అధికార, అనధికార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో అందజేశారు. ఆత్మకూరులోని గంగానమ్మ గుడిని మంత్రి నారా లోకేశ్ సందర్శించి.. పూజలు చేశారు. మంగళగిరి గౌతమబుద్ధ రోడ్డులో ఓ హోటల్ ప్రారంభించారు. తెలుగు మహిళ, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

★ మంగళగిరి గ్రామీణ పరిధిలో ఆత్మకూరులో దివంగత ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను లోకేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, తెదేపా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి, తెదేపా గ్రామ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, మండల అధ్యక్షుడు కొమ్మా సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

★ మంగళగిరి పట్టణ పరిధిలోని రాజీవ్ సెంటర్ ఏరియా సత్యభామ సిల్క్స్ అండ్ హ్యాండ్లూమ్స్‌ను మంత్రి ప్రారంభించారు. అక్కడి సిబ్బందితో ఫొటో దిగారు. మంగళగిరి ఆటోనగర్ ఏరియా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిస్మిల్లా మటన్ హౌస్‌ను లోకేశ్ ప్రారంభించారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన నారా లోకేశ్, పక్కన నేతలు

గంగానమ్మ ఆలయం వద్ద మంత్రి నారా లోకేశ్‌కు హారతి పడుతున్న మహిళలు

ఆత్మకూరులో ఎన్టీఆర్, డాక్టర్ ఎమ్మెస్సెస్ విగ్రహాల ఆవిష్కరణకు వచ్చిన కార్యకర్తలు

ఒరిగింది.. ఎప్పుడైనా కూలుతుంది

పెదవడ్లపూడి గ్రామ చింతల కుంట సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్తు స్తంభం ఒక వైపు ఒరిగింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో ద్విచక్ర వాహనదారులు, రైతులు భయంభయంగా(?) రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

కాకుమాను విద్యార్థికి అభినందనలు

కాకుమాను: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమం చేపట్టింది. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కంకణాల శ్రీకాంత్ అందులో పాల్గొన్నాడు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపై సూచనలను ధైర్యంగా ప్రస్తావించి.. మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసలు అందుకున్నాడు.

చెత్తబండి.. మూలన పెట్టారండి

దామరపల్లిలో చెత్త బండి మూలకు చేరింది. చెరువుకు సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద దీన్ని నిరుపయోగంగా పడేశారు. ఓ పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర నినాదంతో ప్రతి వారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారి పక్కన వ్యర్థాలు మురుగు కాలువల్లోకి చేరి ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిల్వ ఉంటోంది. అధికారులు స్పందించి చెత్తబండిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, తాడికొండ

నిధులున్నా.. పనుల్లో నిర్లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా పసుపు వ్యాపార రీత్యా పేరున్న దుగ్గిరాల మార్కెట్ యార్డుకు వెళ్లే దారి దయనీయంగా ఉంది. పలుచోట్ల గుంతలమయంగా తయారైంది. లారీలు, ట్రాక్టర్లు వెళ్లాలంటే కష్టతరంగా మారింది. యార్డు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు పాలకవర్గం దాదాపు మూడు నెలల క్రితం తీర్మానం చేసింది. సుమారు రూ.4 కోట్ల విలువైన పనులు చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. అయితే యార్డు ఖాతాలో నిధులు రూ.2.6 కోట్లు ఉన్నాయి. వీటిలో సిబ్బంది జీతాలకు కొంత మొత్తం ఉంచినా కనీసం రూ.2 కోట్లతో పనులు చేయవచ్చు. రైతులకు ఎంతో అవసరం. యార్డు నుంచి వచ్చే ప్రతి పైసా అన్నదాతల కోసమే ఖర్చు చేయాల్సి ఉంది. - **దుగ్గిరాల, న్యూస్‌టుడే**

అధ్వానంగా దుగ్గిరాల యార్డు దారి

గ్రంథాలయం వద్ద మంత్రి సెల్ఫీ

తాడేపల్లి : మంగళగిరిలో దివంగత ఎన్టీ రామారావు శంకుస్థాపన చేసి శాఖా గ్రంథాలయాన్ని ఆధునికీకరించగా అక్కడ మంత్రి నారా లోకేశ్ సెల్ఫీ తీసుకున్నారు. 1986 ఏప్రిల్ 4న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి తెదేపా మంగళగిరి తొలి ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్మెస్సెస్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఆ శిలాఫలకం వద్ద లోకేశ్ సెల్ఫీ తీసుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

మేడికొండూరు, న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ అధికారి రాధిక సూచించారు. మండలంలోని ఎన్ఆర్ఐటీ కళాశాల ఆధ్వర్యంలో విశదలలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలకు గురువారం ముఖ్య అతిథిగా రాధిక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకం చట్టరీత్యా నేరమని, వాటి బారిన పడితే అనర్థాలకు దారి తీస్తుందని సూచించారు. విద్య ఎంతో గొప్పదని, చదువులో రాణిస్తే ఉన్నత స్థాయికి చేరవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ సంజయ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, ఏవో సీతారామయ్య మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశదలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు, అధికారి రాధిక

విద్యార్థులకు రూ.50 వేల ఆర్థిక సాయం

తాడేపల్లి, న్యూస్‌టుడే : తెదేపా తాడేపల్లి మాజీ అధ్యక్షుడు, మారుతీ ఫౌండేషన్ ఛైర్మన్ జంగాల సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా లింగంశెట్టి అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అమరావతి కరకట్ట మార్గంలోని చిగురు బాలల ఆశ్రమంలో చిన్నారుల మధ్య కేకు కోశారు. అసోసియేషన్ అధ్యక్షుడు లింగంశెట్టి కిషోర్, తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ అనాథ బాలలకు అల్పాహారాన్ని అందజేశారు. ఉండవల్లిలోని కార్యాలయం వద్ద పారిశుద్ధ్య, రిక్షా, ముఠా కార్మికులకు వస్త్రాలు అందజేశారు. ఆత్మకూరు పీజీఎం చిల్డ్రన్స్ హోమ్‌కు వాషింగ్ మిషన్, 25 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించారు. ప్రాతూరు రోడ్డులోని కొండ పావులూరి గార్డెన్‌లో నిర్వహించిన వేడుకల్లో పది మంది పేద విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున రూ.50 వేల సాయం అందించారు. తెదేపా తాడేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, తెలుగు రైతు పార్లమెంట్ అధ్యక్షుడు కళ్లం రాజశేఖరరెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

పంట ఉత్పత్తులు కొంటాం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : నూతక్కి గ్రామ పరిధిలో రైతులు పండించిన ప్రతి గింజను కూటమి ప్రభుత్వం కొంటుందని ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పంటను ప్రభుత్వం కొనడం లేదని వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. త్వరలో పంట కొనుగోలు ప్రారంభమవుతుందని రైతులకు హామీ ఇచ్చారు.

నగదు జమ చేయడంపై హర్షం

ప్రత్తిపాడు (కాకుమాను) : ప్రభుత్వం కొన్న నల్లబర్లీ పొగాకు నగదును రైతుల ఖాతాలో జమ చేయడంపై జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పొగాకు కొని రైతులను ఆదుకుందని చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరాంప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షుడు సదాశివరావు, సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీఆర్డీఏ జాబ్ మేళాలో 90 మందికి ఉద్యోగాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే : తుళ్లూరులోని ప్రాంతీయ సీఆర్డీఏ కార్యాలయంలో 400 ఉద్యోగాలు భర్తీ చేయటానికి గురువారం జాబ్ మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఏపీ సీఆర్డీఏ నిర్వహించిన ఈ జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 206 మంది హాజరయ్యారు. 90 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన వారికి ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్డీఏ కో- ఆర్డినేటర్లు వెంకట్, త్రివేణి, శేఖర్ సంస్థల ప్రతినిధులతో కలసి నియామక పత్రాలు అందించారు.

అభ్యర్థికి నియామక పత్రం అందిస్తున్న అధికారులు

రాజ్యాంగ స్ఫూర్తిని ఆచరణలో పెట్టాలి

గుంటూరురూరల్ : యువత రాజ్యాంగ స్ఫూర్తిని ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుందని కళాశాల అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన వేడుకలు గురువారం ముగిశాయి. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు లీజుకు ఇవ్వొద్దు

తాడేపల్లి, న్యూస్‌టుడే : అసైన్డ్ భూములను లీజుకు ఇస్తే లక్షలాది దళిత కుటుంబాలు భూమిని కోల్పోతాయని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జెల్లీ విల్సన్ అన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో ఉన్న భూపరిపాలనా రాష్ట్ర కార్యాలయం ఎదుట ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూముల అక్రమ బదలాయింపులను నిలిపివేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి అవుల శేఖర్, వి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP. No. 47/2023 in OS No. 575/2022

Between

శెట్టి అంజమ్మ ...D.H.R

V/s

పయ్యావుల రాంబాబు, S/o అప్పయ్య, R/o మూడు పంపుల వీధి, ఇందిరానగర్ మంగళగిరి పోస్టు& మండలం, గుంటూరు జిల్లా. ... JDR

పైనంబరు EP నందు J.D.R అయిన మీకు Order-21, రూల్-66 నోటీసుల నిమిత్తం శ్రీకోర్టు వారి నుండి అనేక పర్యాయములు సదరు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుట వలన ఈ పేపరు ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది.23/12/2025న వాయిదా అయి వున్నది. కావున మీరు ది.23/12/2025న ఉ॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి యెదుట స్వయంగా కాని, ప్లీడరు గారి ద్వారాగాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుగొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలముగా తెలియ పరచడమైనది.

శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

వాయిదా. 23/12/2025

సాలిమెట్ల అరుణ లత కుమారి, D.H.R. తరపు న్యాయవాది
మంగళగిరి. Cell. 77991 42837

శ్రీవారి ఆలయానికి మరో 25 ఎకరాలు కేటాయించాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే : అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంకటపాలెంలో తితిదే నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయానికి మరో 25 ఎకరాలు కేటాయించాలని గురువారం వెంకటపాలెం గ్రామస్థులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ పంపారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

మేడికొండూరు : మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని చిరతన గండ్ల అనూష హాకీ పోటీల్లో ప్రతిభ చూపింది. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 24 వరకు అండర్-14 విభాగం రాష్ట్ర స్థాయి బాల, బాలికల పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున అనూష పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రధానోపాధ్యాయిని జయప్రద, వాయామోపాధ్యాయిని వాణీ సుశీల ఆమెను అభినందించారు.

అనూషతో ఉపాధ్యాయినులు

క్విజ్‌లో కళాశాల విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లి : తాడేపల్లి మండలం పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 7న నిర్వహించిన పోటీల్లో విజేతలైన మేఘన, అస్లాం, జాన్సీలను ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

ఎస్ఆర్ఎంలో ఆధునిక ఆసుపత్రి ప్రారంభం

తుళ్లూరు : అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్మించిన ఆధునిక మెడికల్ సెంటర్‌ను గురువారం విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ ప్రారంభించారు. ఆసుపత్రితో 24 గంటలు విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులకు వైద్య సదుపాయం అందించేలా ఐదుగురు వైద్యులు, ఏడుగురు శిక్షణ పొందిన నర్సింగ్ ఉద్యోగులను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ కుమార్, గురు ప్రీత్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శన

వట్టిచెరుకూరు : విజనంపాడులో కిట్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్రదర్శన చేశారు. వారికి ఎన్ఎస్ఎస్ ధ్రువపత్రాలను కళాశాల సంచాలకుడు హరిబాబు, ప్రిన్సిపల్ బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి సుధాకర్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుల్లడిగుంట (వట్టిచెరుకూరు) : మండలంలోని పుల్లడిగుంట వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శ్రుతి, అనిత గుంటూరు నగరం నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పుల్లడిగుంట శివారులో ఎదురుగా గారపాడు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. వీరికి గాయాలు కాగా గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

మేడికొండూరు : రాష్ట్ర భాజపా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మేడికొండూరు మండలం కొర్రపాడుకు చెందిన వైవీ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

19, 20 తేదీల్లో సంకల్ప్- 2025

సంకల్ప్ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కళాశాల ఛైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్ : గుంటూరు రూరల్ పరిధిలోని కళ్లం హరనాథరెడ్డి కళాశాలలో గురువారం సంకల్ప్- 2025 గోడప్రతులను గురువారం కళాశాల ఛైర్మన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వచ్చే నెల 19, 20 తేదీల్లో ఇది నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఉమాశంకరరెడ్డి, బీఎస్‌బీ రెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగుకు విరామం

కాకుమాను, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు సాగుకు విరామం ప్రకటించిందని ఏఓ సుధాకర్ తెలిపారు. కాకుమాను మండలంలో నల్లబర్లీ పొగాకు పంటను రైతులు సాగు చేయకూడదని చెప్పారు. పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారని, ఇందులో తహసీల్దార్, ఎస్సై, ఏఓ ఉంటారని, ఎక్కడైనా పొగాకు సాగు చేస్తే వెంటనే దున్నిస్తారని చెప్పారు. పొగాకు బదులుగా శనగ, మొక్కజొన్న, మినుము, పెసర, జొన్న సాగు చేయాలని ఆయన కోరారు. స్థానిక రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పారిశ్రామిక విజ్ఞానయాత్ర

పెదనందిపాడు : పెదనందిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ రీటెయిల్ కోర్సు విద్యార్థులు గురువారం పారిశ్రామిక విజ్ఞానయాత్రకు చిలకలూరిపేటకు వెళ్లి అక్కడ ఒక షాపింగ్ మాల్ సందర్శించినట్లు గైడ్ టీచర్లు సుధాకర్, లిల్లీ పుష్ప పేర్కొన్నారు. విద్యార్థులు పలు ప్రశ్నలు వేసి విషయాలు తెలుసుకున్నారని వారు చెప్పారు.

జూద స్థావరంపై దాడి

ప్రత్తిపాడు (కాకుమాను) : మండలంలోని కోయవారిపాలెంలో ఓ ఇంట్లో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి.. ఆరు సెల్‌ఫోన్లు, రూ.8,040 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరహరి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? మా గ్రామంలో మంచినీటి చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల ఎక్కువ మంది సంపూర్ణ ఆరోగ్యం పొందుతారు. -వి.రమేష్, విజనంపాడు

✔ త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తాం. - నార్నె రాజ్యలక్ష్మి, సర్పంచి, విజనంపాడు

- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

అన్నదాత సుఖీభవతో రైతులకు మేలు

తాడికొండ, న్యూస్‌టుడే : తాడికొండ మండలం మోతడకలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు కంచెర్ల సాంబశివరావు ప్రతి ఇంటికి తిరిగి అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం : గుండాలపాడులో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి వాసంతి మాట్లాడుతూ ప్రభుత్వం నీటి భద్రత డిమాండ్ అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించటంపై రైతులకు వివరించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda

స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ వెర్టికల్, బరోడా కార్పొరేట్ సెంటర్ సి-26, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
e-mail : wfd.bcc@bankofbaroda.co.in

షోకాజ్ నోటీసు (SCN)

మెస్సర్స్ శ్రీ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, శ్రీ పరికూటి వెంకటేశ్వర రావు, నెం. 28-02-23, సాయిబాబా గుడి, కంకరగుంట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. రిజిస్టర్డ్ ఆఫీస్: డి. నెం. 54-281, షాప్ నెం. 56, రెవెన్యూ వార్డ్ నెం. 24, అన్నపూర్ణ కాంప్లెక్స్, విజయవాడ రోడ్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్. ఫ్యాక్టరీ/గోడౌన్: డోర్ నెం. 180/1, పాత డోర్ నెం. 11-589, కొత్త డోర్ నెం. 11-582, శ్రీ వాసవి ఎస్టేట్స్, డి బ్లాక్, పాత అసెస్‌మెంట్ నెం. 1370, కొత్త అసెస్‌మెంట్ నెం. 1023011370, రెవెన్యూ వార్డ్ నెం. 11, సూర్య నారాయణ నగర్, రత్నాల చెరువు, మంగళగిరి టౌన్, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

మా బ్యాంక్ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా పరిగణించడానికి క్రింది కారణాల దృష్ట్యా మీకు షోకాజ్ నోటీసు SCN జారీ చేయాలని ఆదేశించింది: 1. సంస్థ యొక్క ఖాతా స్టేట్‌మెంట్ పరిశీలించగా, మీరు వ్యాపార లావాదేవీలకు సంబంధం లేని వ్యక్తులకు (వివిధ తేదీలలో వివిధ విడతలలో సుమారు రూ. 40.50 లక్షలు) గణనీయమైన మొత్తాన్ని బదిలీ చేసినట్లు వెల్లడైంది. 2. బ్యాంక్‌కు తనఖా పెట్టిన ఆస్తులను (అంటే స్టాక్స్) బ్యాంక్‌కు తెలియజేయకుండా తొలగించడం జరిగింది మరియు ఆ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతా ద్వారా మార్చలేదు. మీ ఈ మినహాయింపు/కమీషన్ ఆర్‌బిఐ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ట్రీట్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్ లోని క్లాజ్ 3(1)(టి)(బి)(బి) & (డి) - నిధుల మళ్లింపు & ఆస్తుల తొలగింపు పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం, ఈ SCN మీకు ది. 20.11.2025 తేదీన జారీ చేయబడింది.

ది. 21.11.2025 తేదీన, పైన పేర్కొన్న చిరునామాలకు పంపిన SCN డెలివరీ కాకుండా తిరిగి వచ్చింది, అందువలన దీనిని వార్తాపత్రికలో ప్రచురించడం జరుగుతున్నది. మీరు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఎందుకు వర్గీకరించబడకూడదో తెలియజేస్తూ, పైన ఇచ్చిన చిరునామాకు 21 రోజులలోపు మీ లిఖితపూర్వక వివరణను సమర్పించవలసిందిగా కోరబడింది. పై తెలిపిన గడువులోగా మీ వివరణ అందని పక్షంలో గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించే ప్రక్రియను కొనసాగిస్తుంది.

సం/-
తేది: 20-11-2025 (డి.వై. జనరల్ మేనేజర్)

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda

స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ వెర్టికల్, బరోడా కార్పొరేట్ సెంటర్, సి-26, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
e-mail : wfd.bcc@bankofbaroda.co.in

షోకాజ్ నోటీసు (SCN)

మెస్సర్స్ గౌతమ్ ట్రేడింగ్ కంపెనీ, శ్రీ పరికూటి వెంకటేశ్వర రావు, నెం. 28-02-23, సాయిబాబా గుడి, కంకరగుంట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. రిజిస్టర్డ్ ఆఫీస్: డి. నెం. 54-281, షాప్ నెం. 56, రెవెన్యూ వార్డ్ నెం. 24, అన్నపూర్ణ కాంప్లెక్స్, విజయవాడ రోడ్, గుంటూరు-522001. ఫ్యాక్టరీ/గోడౌన్: శ్రీ వాసవి ఎస్టేట్స్, ఇ బ్లాక్, డి. నెం. 11-582, రెవెన్యూ వార్డ్ నెం. 11, సూర్యనారాయణ నగర్, రత్నాలచెరువు, మంగళగిరి, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

మా బ్యాంక్ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించడానికి క్రింది కారణాల దృష్ట్యా మీకు షోకాజ్ నోటీసు SCN జారీ చేయాలని ఆదేశించింది: 1. సంస్థ యొక్క ఖాతా స్టేట్‌మెంట్ పరిశీలించగా, మీరు వ్యాపార లావాదేవీలకు సంబంధం లేని వ్యక్తులకు (వివిధ తేదీలలో వివిధ విడతలలో సుమారు రూ. 86.65 లక్షలు) గణనీయమైన మొత్తాన్ని బదిలీ చేసినట్లు వెల్లడైంది. 2. బ్యాంక్‌కు తనఖా పెట్టిన ఆస్తులను (అంటే స్టాక్స్) బ్యాంక్‌కు తెలియజేయకుండా తొలగించడం జరిగింది మరియు ఆ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతా ద్వారా మార్చలేదు. మీ ఈ మినహాయింపు/కమీషన్ ఆర్‌బిఐ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ట్రీట్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్ లోని క్లాజ్ 3(1)(టి)(బి)(బి) & (డి) - నిధుల మళ్లింపు & ఆస్తుల తొలగింపు పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం, ఈ SCN మీకు ది. 20.11.2025 తేదీన జారీ చేయబడింది.

ది. 21.11.2025 తేదీన, పైన పేర్కొన్న చిరునామాలకు పంపిన SCN డెలివరీ కాకుండా తిరిగి వచ్చింది, అందువలన దీనిని వార్తాపత్రికలో ప్రచురించడం జరుగుతున్నది. మీరు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఎందుకు వర్గీకరించబడకూడదో తెలియజేస్తూ, పైన ఇచ్చిన చిరునామాకు 21 రోజులలోపు మీ లిఖితపూర్వక వివరణను సమర్పించవలసిందిగా కోరబడింది. పై తెలిపిన గడువులోగా మీ వివరణ అందని పక్షంలో గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించే ప్రక్రియను కొనసాగిస్తుంది.

సం/-
తేది: 20-11-2025 (డి.వై. జనరల్ మేనేజర్)

(c) eenadu

గుంటూరు తూర్పు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేయండి

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: రోజురోజుకు విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు అందిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందని జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీ మోహన్ అన్నారు. జేకేసీ కళాశాల ఐక్యూఏసీ, జేసీ న్యాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ ద్వారా బోధన అనే అంశం మీద రెండురోజుల కార్యశాల గురువారం ప్రారంభమైంది. డాక్టర్ నెక్కంటి శ్రీనివాస్ వివిధ అంశాల్లో ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జేసీ న్యాయకళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి, జేకేసీ ప్రిన్సిపల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు కిలో రూ.లలో..: టమాట 52, వంగ 33, బెండ 31, పచ్చిమిర్చి 42, కాకర 40, క్యారెట్ 61, క్యాబేజీ 30, బీర 28, దొండ 40, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుడు 62, దోస 32, పొట్ల 33, చామ దుంప 25, మునగ 10, గోంగూర 12, తోటకూర 15, చుక్కకూర 14, క్యాప్సికం 25, బీట్‌రూట్ 42, కీర 30, క్యాప్సికం 84, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 50, సొర 16, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

? బీఆర్ స్టేడియం సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ఆర్టీసీ బస్సుల్ని రోడ్లపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకొంటున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులొస్తున్నాయి. - నాని, చౌత్రాసెంటర్
✔ ఆయా ప్రాంతాల్లో సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటాం.
-సామ్రాజ్యం, జిల్లా ప్రజారవాణా అధికారి

? ఏటుకూరురోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఆటోలు నిలుపుతున్నారు. పోలీసుల తనిఖీలు లేవు. - సుధాకర్, సంగడిగుంట
✔ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులను నియమించి ఆటోలు నిలుపుదల కాకుండా చర్యలు తీసుకుంటాం. -అశోకకుమార్, ట్రాఫిక్ సీఐ

? పాతగుంటూరులోని బాలాజీనగర్ పరిసర ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉంది. విలువైన ఫ్రిజ్‌లు, టీవీలు పాడైపోతున్నాయి. - హరిబాబు, మణిహోటల్ సెంటర్
✔ లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. -మస్తాన్, విద్యుత్తు ఏఈ

? కొండయ్యకాలనీలో సైడు కాలువల్ని శుభ్రం చేయడం లేదు. వ్యర్థాలు పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
-నవీన్, సుద్దపల్లిడొంకరోడ్డు
✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

★ ఆర్టీసీ బస్టాండులో మ్యాన్‌హోల్‌కు గురువారం అధికారులు మరమ్మతులు చేయించారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' చిత్ర కథనానికి వారు స్పందించి మూత ఏర్పాటు చేసి, చుట్టు బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

నిర్లక్ష్యానికి నిదర్శనం ఈ పనులు

న్యూస్‌టుడే - గుంటూరు నగరం

నగరంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేస్తున్నా.. గుత్తేదారులదే ఇష్టారాజ్యం. పనుల్లో నాణ్యత లేదు.. సీసీ రోడ్ల నిర్మాణంలో పాటించాల్సిన నిబంధనలకు దిక్కులేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి రెడ్డిపాలెంవైపు ఉన్న రోడ్డును విస్తరించి సీసీ రోడ్డుగా మార్చే పనులు చేపట్టారు. 2024 ఫిబ్రవరిలో ఎన్నికలకు కొన్ని నెలల ముందు హడావుడిగా ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవి పట్టాలెక్కాయి. గతంలో సగం రోడ్డు నిర్మించగా... ప్రస్తుతం మిగిలింది సీసీ రోడ్డుగా మారుస్తున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభాలున్నాయి. వీటిని తొలగించకుండానే గుత్తేదారుడు నిర్మాణ పనులు చేస్తున్నారు. విద్యుత్తు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగాల అధికారుల మధ్య సమన్వయం లోపించటంతో 20 నెలలుగా స్తంభాలు మార్చే పని చేపట్టలేదు. ప్రస్తుతం మిగిలి ఉన్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తున్నప్పటికీ అడ్డుగా ఉన్న స్తంభాలను అలానే ఉంచేశారు.

రహదారి విస్తరించి రెండేళ్లు గడిచినా తొలగించని స్తంభాలు

విద్యుత్తు స్తంభాలు తొలగించకుండానే నిర్మించిన సీసీ రోడ్డు

ఉపన్యసించారు.. విజేతలుగా నిలిచారు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉపన్యసించారు. సీహెచ్ మీనాక్షి ప్రథమ, బి.జిత్యశ్రీ ద్వితీయ, డి.మహతి తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల హెచ్ఎం కె.బాలకృష్ణ బహుమతులు అందించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు, ఏఓ బి.బాను, వైస్ ప్రిన్సిపల్ కె.వి.కోటేశ్వరి విజేతలను అభినందించారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బహుమతులు సాధించిన వారితో హెచ్ఎం బాలకృష్ణ తదితరులు

భద్రత ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో శుక్రవారం పలు జాతీయ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరవుతున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సీఆర్డీఏ ప్రాంతంలో ఎస్పీ భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ప్రముఖుల భద్రత, వీవీఐపీల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ, సమావేశ స్థలాల వద్ద భద్రత చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. డీఎస్పీలు మురళీకృష్ణ, శ్రీనివాసరావు, సీఐలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్డీఏ ప్రాంతంలో ఎస్పీ వకుల్‌జిందాల్ తదితరులు

నిర్లక్ష్యంగా ఉన్న గుత్తేదార్లను తొలగించండి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా ఉన్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులుతో ఆయన గురువారం కలిసి పలు అంశాలపై చర్చించారు. కొంతకాలం కాంట్రాక్టు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అవసరమైతే అలాంటి వారిని తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలన్నారు. బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ ఐలాండ్, నాజ్ సెంటర్, హిందూ కళాశాల సెంటర్ వద్ద ఐలాండ్లను సుందరీకరించాలన్నారు. పాతగుంటూరు, డీఎస్‌నగర్ ప్రాంతాల్లోని హిందూ శ్మశానవాటికల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని, వెంటనే ఆయా పనులు ప్రారంభించాలని కోరారు.

డివైడర్ల మధ్య మొక్కలు

పాతబస్టాండు సెంటర్లో డివైడర్ల మధ్య మొక్కలు నాటేందుకు తవ్వకాలు చేస్తున్న సిబ్బంది

పట్నంబజారు, న్యూస్‌టుడే: నగర ప్రధాన రహదారుల వెంబడి డివైడర్ల మధ్యలో మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన 'విభాగినిలో పచ్చదనం ఆనవాళ్లేవి' కథనానికి వారు స్పందించారు. బస్టాండు సెంటర్ నుంచి ఎన్టీఆర్ బస్టాండు వరకు గుంతలు తవ్వుతున్నామని, అనంతరం మొక్కలు నాటుతామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

ఏపీ ఎన్జీవో నగర కార్యవర్గ సమావేశం

గోరంట్ల న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సంఘం గుంటూరు నగర కార్యవర్గ సమావేశం జిల్లా కోర్టు రోడ్డులోని కార్యాలయంలో గురువారం జరిగింది. గ్రామ, వార్డు సచివాలయాల ఏఎన్ఎంలకు కేవలం వైద్యారోగ్య శాఖకు సంబంధించిన విధులను మాత్రమే కేటాయించేలా రాష్ట్ర నాయకత్వంతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షులు సూరి, కార్యదర్శి కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

మందుల ధరల్లో జీఎస్టీ తగ్గింపు ఏదీ?

అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

పట్నంబజారు, న్యూస్‌టుడే: కేంద్రం కొన్ని వస్తువులు, మందులపై జీఎస్టీ తగ్గించినా.. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల పూర్తిగా అమలు కావడం లేదు. సూపర్ జీఎస్టీ పేరుతో ఇటీవల వాణిజ్యపన్నులశాఖ అధికారులు సైతం పలు రకాల నిత్యావసర సరకులు, మందులు ఇతరత్రా వస్తువులపై జీఎస్టీ తగ్గిందంటూ విస్తృత ప్రచారాలు చేశారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి రెండేళ్ల నుంచి లక్ష్మీపురంలోని ఒక మందుల దుకాణంలో ప్రతి నెలా ఔషధాలు కొనుగోలు చేస్తున్నారు. సెప్టెంబరు 2న కొన్ని మందులు కొనుగోలు చేయగా రూ.3,470 లకు దుకాణదారుడు బిల్లు ఇచ్చారు. అక్టోబరు 3న అదే షాపులో అవే తరహా కొనుగోలు చేయగా సదరు నిర్వాహకుడు రూ.3,473 బిల్లు జారీ చేశారు. సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీ శాతాలు తగ్గినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో తాను అక్టోబరులో కొనుగోలు చేసిన మందుల ధరలు తగ్గుతాయని భావించగా... పాత బిల్లుపై రూ.3 అదనంగా చెల్లించాల్సి రావడంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. దీనిపై వాణిజ్యపన్నులశాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు ఆ మందుల దుకాణంలో తనిఖీ చేశారు. సెప్టెంబరు 22న తేదీకి ముందు జారీ చేసిన బిల్లులో మందుల కొనుగోళ్లపై 20 శాతం డిస్కౌంట్ ఇచ్చినట్లు చూపి, ఆ తరువాత తేదీ నుంచి జారీ చేసిన బిల్లులపై 13 శాతం డిస్కౌంట్ జారీ చేసినట్లు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు గుర్తించారు. దీనిపై దుకాణదారుడిని ప్రశ్నించగా.. మాకు ఇష్టం వచ్చినట్లు డిస్కౌంట్లు ఇస్తామంటూ సమాధానం ఇచ్చారు. మందుల కొనుగోళ్లపై తగ్గిన జీఎస్టీ శాతాలు అమలు చేయకుండా.. నికర ధరపై డిస్కౌంట్లు తగ్గించినట్లు బిల్లుల్ని తయారు చేసి వినియోగదారుల్ని మోసగిస్తున్నారనడానికి ఈ ఉదంతమే నిదర్శనం.

పదో తరగతి నమూనా ప్రశ్నపత్రాల ఆవిష్కరణ

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే : 2026 మార్చిలో జరగనున్న ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యేందుకు, ఎక్కువ మార్కులు సాధించడానికి దోహదపడేలా రూపొందించిన నమూనా ప్రశ్నపత్రాల బుక్స్‌ను మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు గురువారం సంఘం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో అనుభవం, నైపుణ్యం కలిగిన సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలను రూపొందించారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కమిటీ సభ్యులు ఎ.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ వ్యాపార ధోరణితో కాకుండా విద్యార్థుల అభివృద్ధికి దోహదపడే లక్ష్యంతో నిర్ణీత రుసుముతో వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ యూటీఎఫ్ కార్యాలయాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సమగ్ర సర్వే వేగంగా పూర్తిచేయండి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా జరుగుతున్న సమగ్ర సర్వేను పూర్తి చేయాలని, నోడల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆకులవారితోటలోని 83, 84 వార్డు సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, సర్వే ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి తమకు కేటాయించిన క్లస్టర్‌లో ప్రజలకు సర్వే అంశాన్ని వివరించి, నిర్దేశిత విధానంలో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యదర్శులు ఏపీ సేవా పోర్టల్ ద్వారా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే పౌరసేవలు పొందేలా ప్రభుత్వం రూపొందించిన పుర మిత్ర, మన మిత్ర యాప్‌లను కూడా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సచివాలయ భవన సమస్యలను కార్యదర్శులు, నోడల్ అధికారి వివరించగా, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో నోడల్ అధికారి పోలేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరు మెయిన్‌రోడ్డులోని శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం 45వ కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు బేతనబొట్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం జరిపారు. మహిళలు నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. వేడుకల్లో బొలిశెట్టి అశోక్‌కుమార్, జూలూరి చంద్రశేఖర్, బచ్చు రమేష్, జూలూరి బాల తదితరులు పాల్గొన్నారు.

గేటు వేస్తే అంతేనా?

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

సీతానగర్ నుంచి నెహ్రూనగర్‌కు వెళ్లే రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. సీతానగర్ రైల్వేగేటు వేసిన తర్వాత ఎప్పుడు తీస్తారో ఎవరూ చెప్పలేని పరిస్థితి. దీంతో రెండువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. రైలుగేటు తీశాక ఒక్కసారిగా వాహనాలు పోటీలు పడటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సమీపంలో న్యూగుంటూరు రైల్వేస్టేషన్, రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డు ఉన్నాయి. ఇటుగా విశాఖ, కోల్‌కతా, చెన్నై, కేరళ, తమిళనాడు, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికుల రైళ్లతోపాటు గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవి రావటానికి చాలా ముందుగానే గేటు వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రైలు వెళ్లినా చాలా సేపటి వరకు గేట్లు తీయడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదేమని అక్కడ రైల్వే సిబ్బందిని అడిగితే రైలు న్యూగుంటూరు రైల్వేస్టేషన్ లోపలకు వెళ్లాలని, ఆ తర్వాత అధికారులు ఆదేశాలతో గేటును రిలీజ్ చేస్తేనే తాము తీయగలమని సమాధానమిస్తున్నారని వాహనచోదకులు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో గూడ్స్‌షెడ్‌లోని రైలు ఇంజిన్ పట్టాలు మారే క్రమంలోనూ గేటు వేసి చాలా సేపటి వరకు తీయకపోవడంతో సమస్యగా మారుతోంది. రైలుగేటుకు ఇరువైపులా ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఒక్క కానిస్టేబుల్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఆ ట్రాఫిక్‌లో చిక్కుకొని సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరాలు, ఆసుపత్రులకు వెళ్లాల్సినవారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది.

ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు అమలు చేయాలన్న ఉత్తర్వులను కేంద్రం వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నగర కార్యదర్శి ముత్యాలరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సంఘాల ఏర్పాటుకు అవకాశం లేకపోవడం, సమ్మె చేసే హక్కు లేకుండా లేబర్‌కోడ్‌లు రూపొందించారన్నారు. నగర కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ ఎనిమిది పని గంటలను 10 నుంచి 13 గంటలకు తీసుకొచ్చారన్నారు. లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు యాసిర్‌ఖాన్, బాషా, వెంకటేశ్వరరావు, అజిల్, సలాం, షమ్మీ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు కొలతలు

కొండయ్య కాలనీలో ఇళ్ల స్థలాల కొలతలు తీస్తున్న అధికారులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల్లో నివాసం ఉంటూ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల స్థలాలకు గురువారం అధికారులు కొలతలు తీశారు. పాతగుంటూరులోని బాలాజీనగర్, కొండయ్యకాలనీ పరిసర ప్రాంతాల్లో దాదాపు 40 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆర్.ఐ. కరీముల్లా, అర్బన్ ల్యాండ్ సీలింగ్ సర్వేయర్ సునీల్‌లతోపాటు, సిబ్బంది కొలతలు తీశారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల్లో నివాసం ఉంటున్న వారు రిజిస్ట్రేషన్ కోసం డిసెంబరు నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇళ్ల దస్తావేజుల నకళ్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు నకళ్లతో సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్‌ఛైర్మన్ రామచంద్రరాజు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే : గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ప్రత్యేక శిబిరాన్ని గురువారం ఆకులవారితోటలో ప్రారంభించారు. శిబిరం డిసెంబర్ 3 వరకు జరుగుతుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ రామచంద్రరాజు హాజరై వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజసేవ, ప్రకృతి పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ వాలంటీర్లు తమవంతు కృషి చేయాలన్నారు. భవిష్యత్తు తరానికి పర్యావరణహిత సమాజాన్ని అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్. ద్వారా సమాజ సేవ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.కె.బి.ఎం.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజావలి, పర్యావరణ వేత్తలు తిరుపతిరెడ్డి, ఐటీసీ ప్రతినిధి కె.నారాయణ, తుమ్మల నాగేశ్వరరావు, డివిజన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యం.సంతోష్‌కుమారి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు.

ఆ 21మందికీ న్యాయం చేయాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: వివిధ గ్రామ సచివాలయాల్లో పని చేస్తూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికై ఉపాధ్యాయులుగా నియమితులైన 21 మంది వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు... మిగిలిన డిపార్ట్‌మెంట్ల నుంచి ఎంపికై వచ్చిన వారితో సమానంగా 3.10.25 ఎఫ్ఎన్ తేదీతో రిలీవింగ్ ఉత్తర్వులు జారీ చేసి వారికి న్యాయం చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.బసవలింగారావు, జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖలీద్ ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులుగా నూతనంగా విధుల్లో చేరిన వారిలో కొందరు పూర్వ డిపార్ట్‌మెంట్ నుంచి 3.10.25 ఎఫ్ఎన్‌తో రిలీవింగ్ ఉత్తర్వులు పొందారన్నారు. 21మంది వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు మాత్రం 13.10.2025 నుంచి నూతన బాధ్యతల్లో చేరేలా రిలీవింగ్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనివల్ల వారు సర్వీసులో 10 రోజులు వెనుకబడినట్లయిందన్నారు.

ఏం పనులో ఏమో..!

ఆరు నెలలు తిరక్కుండానే పగుళ్లు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

విషయం: కుందుల రోడ్డు జంక్షన్‌లో స్వామి వివేకానందుడు విగ్రహం ఐలాండ్ పనులు విస్తరణ, అభివృద్ధి పనులు

ఎప్పుడు చేశారు: ఈఏడాది జూన్‌లో

ఎలా జరిగాయంటే: ఆరు నెలలు కూడా పూర్తికాకుండానే.. అప్పుడే గ్రానైట్ పగిలిపోయి ఊడిపోతున్నాయి...

వ్యయం ఎంతంటే: ఈ పనులతోపాటు పక్కనే కల్వర్టు నిర్మాణానికి సుమారు ఏడున్నర లక్షల రూపాయలు

స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఐలాండ్‌కు వేసిన గ్రానైట్ ధ్వంసమై ఊడిపోతుందిలా...

ఎందుకిలా: ఈ ప్రాంతంలో 10 సంవత్సరాల కిందట స్వామి వివేకానందుడు విగ్రహాన్ని వివేక భారతి కమిటీ వారు ఏర్పాటు చేశారు. 2015, ఏప్రిల్ 19న దాన్ని ఆవిష్కరించారు. ప్రధాన కూడలి కావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతాయని వివేకభారతి వారు ఐలాండ్ విస్తరణ వంటి పనులు చేపట్టలేదు. ఉన్నంతలో చిన్నపాటి ఐలాండ్‌ను పటిష్ఠంగా ఏర్పాటు చేశారు. దశాబ్ద కాలంగా అది చెక్కు చెదరలేదు. జూన్‌లో చేపట్టిన ఐలాండ్ విస్తరణ, అభివృద్ధి పనుల్లోని గ్రానైట్ పగిలిపోయి ఊడిపోతోంది. దీన్ని బట్టి అర్థమవుతోంది పనులు ఎలా జరిగాయో..

అడగకపోయినా: వివేకా భారతి కమిటీ వారు ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఐలాండ్ విస్తరణ చేపట్టాలని అడగలేదు. అధికారులు ఎందుకు హడావుడిగా ఈ పనులు చేపట్టారో వారికే తెలియాలి. మరోవైపు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అనుతులిచ్చే విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరించాలని పదేపదే చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ ఇక్కడ అధికారులు ఎవరి మెప్పు కోసం ఐలాండ్ విస్తరణ చేపట్టారని ఓవైపు వివేకాభారతి కమిటీ వారు, మరో వైపు వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు. పోనీ చేపట్టే పనులు అయినా నాణ్యంగా చేశారా అంటే అదీ లేదు. ఐలాండ్ పెంచడంతో భారీ వాహనాలు మలుపు తిరిగే క్రమంలో ఢీకొట్టి గ్రానైట్ ధ్వంసమై ఊడి పోయి కళా విహీనంగా తయారవుతోంది. జీఎంసీ అధికారులు స్పందించి ధ్వంసమైన గ్రానైట్ రాళ్లను అతికించేలా చర్యలు తీసుకోవాలని వివేకా భారతి కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు.

కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వై.వి.సుబ్బారావు

గుంటూరు పశ్చిమ : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా వై.వి.సుబ్బారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని వెల్లడించారు.

టెన్నిస్ విజేతకు ఎస్పీ అభినందన

అహ్మద్‌కు టెన్నిస్ బ్యాట్ అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: టెన్నిస్‌లో గుంటూరు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మొహిద్దీన్ బాషా కుమారుడు షేక్ అహ్మద్ ప్రతిభ చాటాడు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అండర్-17 విభాగ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ తన కార్యాలయంలో అతడిని అభినందించి టెన్నిస్ బ్యాట్‌ను బహుమతిగా అందించారు.

బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రదర్శన

గోరంట్ల, న్యూస్‌టుడే: బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, డీఆర్వో ఖాజావలి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, ఛైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా (Bank of Baroda)
స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ వెర్టికల్, బరోడా కార్పొరేట్ సెంటర్, సి-26, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
e-mail : wfd.bcc@bankofbaroda.co.in

షోకాజ్ నోటీసు (SCN)

మెస్సర్స్ శ్రీ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, శ్రీ వరికూటి వెంకటేశ్వర రావు, నెం. 28-02-23, సాయిబాబా గుడి, కంకరగుంట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. రిజిస్టర్డ్ ఆఫీస్: డి. నెం. 54-281, షాప్ నెం. 56, రెవెన్యూ వార్డ్ నెం. 24, అన్నపూర్ణ కాంప్లెక్స్, విజయవాడ రోడ్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్. ఫ్యాక్టరీ/గోడౌన్: డోర్ నెం. 180/1, పాత డోర్ నెం. 11-589, కొత్త డోర్ నెం. 11-582, శ్రీ వాసవి ఎస్టేట్స్, డి బ్లాక్, పాత అసెస్‌మెంట్ నెం. 1370, కొత్త అసెస్‌మెంట్ నెం. 1023011370, రెవెన్యూ వార్డ్ నెం. 11, సూర్య నారాయణ నగర్, రత్నాల చెరువు, మంగళగిరి టౌన్, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

మా బ్యాంక్ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించడానికి క్రింది కారణాల దృష్ట్యా మీకు షోకాజ్ నోటీసు SCN జారీ చేయాలని ఆదేశించింది: 1. సంస్థ యొక్క ఖాతా స్టేట్‌మెంట్ పరిశీలించగా, మీరు వ్యాపార లావాదేవీలకు సంబంధం లేని వ్యక్తులకు (వివిధ తేదీలలో వివిధ విడతలలో సుమారు రూ. 40.50 లక్షలు) గణనీయమైన మొత్తాన్ని బదిలీ చేసినట్లు వెల్లడైంది. 2. బ్యాంక్‌కు తనఖా పెట్టిన ఆస్తులను (అంటే స్టాక్స్) బ్యాంక్‌కు తెలియజేయకుండా తొలగించడం జరిగింది మరియు ఆ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతా ద్వారా మార్చలేదు. మీ ఈ మినహాయింపు/కమీషన్ ఆర్‌బిఐ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ట్రీట్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్ లోని క్లాజ్ 3(1)(టి)(ఐ)(బి) & (డి) - నిధుల మళ్లింపు & ఆస్తుల తొలగింపు పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం, ఈ SCN మీకు డి. 20.11.2025 తేదీన జారీ చేయబడింది.

డి. 21.11.2025 తేదీన, పైన పేర్కొన్న చిరునామాలకు పంపిన SCN డెలివరీ కాకుండా తిరిగి వచ్చింది, అందువలన దీనిని వార్తాపత్రికలో ప్రచురించడం జరుగుతున్నది. మీరు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఎందుకు వర్గీకరించబడకూడదో తెలియజేస్తూ, పైన ఇచ్చిన చిరునామాకు 21 రోజులలోపు మీ లిఖితపూర్వక వివరణను సమర్పించవలసిందిగా కోరబడింది. పై తెలిపిన గడువులోగా మీ వివరణ అందని పక్షంలో గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించే ప్రక్రియను కొనసాగిస్తుంది.

సం/-
తేది: 20-11-2025 (డి.వై. జనరల్ మేనేజర్)

బ్యాంక్ ఆఫ్ బరోడా (Bank of Baroda)
స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ వెర్టికల్, బరోడా కార్పొరేట్ సెంటర్, సి-26, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
e-mail : wfd.bcc@bankofbaroda.co.in

షోకాజ్ నోటీసు (SCN)

మెస్సర్స్ గౌతమ్ ట్రేడింగ్ కంపెనీ, శ్రీ వరికూటి వెంకటేశ్వర రావు, నెం. 28-02-23, సాయిబాబా గుడి, కంకరగుంట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. రిజిస్టర్డ్ ఆఫీస్: డి. నెం. 54-281, షాప్ నెం. 56, రెవెన్యూ వార్డ్ నెం. 24, అన్నపూర్ణ కాంప్లెక్స్, విజయవాడ రోడ్, గుంటూరు-522001. ఫ్యాక్టరీ/గోడౌన్: శ్రీ వాసవి ఎస్టేట్స్, ఇ బ్లాక్, డి. నెం. 11-582, రెవెన్యూ వార్డ్ నెం. 11, సూర్యనారాయణ నగర్, రత్నాలచెరువు, మంగళగిరి, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

మా బ్యాంక్ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించడానికి క్రింది కారణాల దృష్ట్యా మీకు షోకాజ్ నోటీసు SCN జారీ చేయాలని ఆదేశించింది: 1. సంస్థ యొక్క ఖాతా స్టేట్‌మెంట్ పరిశీలించగా, మీరు వ్యాపార లావాదేవీలకు సంబంధం లేని వ్యక్తులకు (వివిధ తేదీలలో వివిధ విడతలలో సుమారు రూ. 86.65 లక్షలు) గణనీయమైన మొత్తాన్ని బదిలీ చేసినట్లు వెల్లడైంది. 2. బ్యాంక్‌కు తనఖా పెట్టిన ఆస్తులను (అంటే స్టాక్స్) బ్యాంక్‌కు తెలియజేయకుండా తొలగించడం జరిగింది మరియు ఆ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతా ద్వారా మార్చలేదు. మీ ఈ మినహాయింపు/కమీషన్ ఆర్‌బిఐ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ట్రీట్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్ లోని క్లాజ్ 3(1)(టి)(ఐ)(బి) & (డి) - నిధుల మళ్లింపు & ఆస్తుల తొలగింపు పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం, ఈ SCN మీకు డి. 20.11.2025 తేదీన జారీ చేయబడింది.

డి. 21.11.2025 తేదీన, పైన పేర్కొన్న చిరునామాలకు పంపిన SCN డెలివరీ కాకుండా తిరిగి వచ్చింది, అందువలన దీనిని వార్తాపత్రికలో ప్రచురించడం జరుగుతున్నది. మీరు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఎందుకు వర్గీకరించబడకూడదో తెలియజేస్తూ, పైన ఇచ్చిన చిరునామాకు 21 రోజులలోపు మీ లిఖితపూర్వక వివరణను సమర్పించవలసిందిగా కోరబడింది. పై తెలిపిన గడువులోగా మీ వివరణ అందని పక్షంలో గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించే ప్రక్రియను కొనసాగిస్తుంది.

సం/-
తేది: 20-11-2025 (డి.వై. జనరల్ మేనేజర్)

(c) eenadu

గుంటూరు పశ్చిమ

టెన్నిస్ విజేతకు ఎస్పీ అభినందన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: టెన్నిస్‌లో గుంటూరు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మొహిద్దీన్ బాషా కుమారుడు షేక్ అహ్మద్ ప్రతిభ చాటాడు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అండర్-17 విభాగ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ తన కార్యాలయంలో అతడిని అభినందించి టెన్నిస్ బ్యాట్‌ను బహుమతిగా అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897
స్పందనకు వందనం

★ గుండారావుపేట ప్రధాన వీధుల్లోని కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సిబ్బందిని పంపి పూడిక తొలగింపజేశారు.
★ రైలుపేట ప్రధాన వీధుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుందంటూ స్థానికులు సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలు తొలగించారు.
-న్యూస్‌టుడే, నగరంపాలెం

ప్రసంగం..ప్రశంసనీయం..!

విజేతలతో హెచ్ఎం నవీన్‌చౌదరి తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థి జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై నిర్వహించిన ప్రసంగం పోటీల్లో కదిర యశ్వంత్, షేక్ అలీషా, తన్నీరు నాగలక్ష్మిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. హెచ్ఎం వి. నవీన్‌చౌదరి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

వీధుల్లో వెలిసిన క్రిస్మస్ నక్షత్రాలు

వేళాంగిణీనగర్ ప్రధాన ద్వారం వద్ద..

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: క్రైస్తవులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 25 నుంచి అడ్వెంట్ ఆరాధనలు పాటిస్తున్నారు. క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో రోజూ ఉదయం 5 నుంచి 6 గంటలు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. డిసెంబరు 25న క్రిస్మస్ వరకు చర్చిల్లో ప్రార్థనలు చేస్తారు. క్రీస్తు జన్మదినానికి గుర్తుగా గుంటూరు నగరంలోని వీధులు, ప్రధాన రహదారుల పక్కన క్రిస్మస్ నక్షత్రాలతో కూడిన ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. క్రీస్తు రాకకు గుర్తుగా క్రైస్తవుల గృహాల పైన స్టార్లు ఏర్పాటు చేసుకున్నారు.

బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రదర్శన

గోరంట్ల, న్యూస్‌టుడే: బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, ఛైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏం పనులో ఏమో..!

ఆరు నెలలు తిరక్కుండానే పగుళ్లు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

విషయం: కుందుల రోడ్డు జంక్షన్‌లో స్వామి వివేకానందుడు విగ్రహం ఐలాండ్ పనులు విస్తరణ, అభివృద్ధి పనులు

ఎప్పుడు చేశారు: ఈఏడాది జూన్‌లో

ఎలా జరిగాయంటే: ఆరు నెలలు కూడా పూర్తికాకుండానే.. ఐలాండ్ గ్రానైట్ పగిలి పోయి ఊడిపోతున్నాయి...

వ్యయం ఎంతంటే: ఈ పనులతోపాటు పక్కనే కల్వర్టు నిర్మాణానికి సుమారు ఏడున్నర లక్షల రూపాయలు

స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఐలాండ్‌కు వేసిన గ్రానైట్ ధ్వంసమై ఊడిపోతుందిలా..

ఎందుకిలా: ఈ ప్రాంతంలో 10 సంవత్సరాల కిందట స్వామి వివేకానందుడు విగ్రహాన్ని వివేక భారతి కమిటీ వారు ఏర్పాటు చేశారు. 2015, ఏప్రిల్ 19న దాన్ని ఆవిష్కరించారు. ప్రధాన కూడలి కావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతాయని వివేకభారతి వారు ఐలాండ్ విస్తరణ వంటి పనులు చేపట్టలేదు. ఉన్నంతలో చిన్నపాటి ఐలాండ్‌ను పటిష్ఠంగా ఏర్పాటు చేశారు. దశాబ్ద కాలంగా అది చెక్కు చెదరలేదు. జూన్‌లో చేపట్టిన ఐలాండ్ విస్తరణ, అభివృద్ధి పనుల్లోని గ్రానైట్ పగిలిపోయి ఊడిపోతోంది. దీన్ని బట్టి అర్థమవుతోంది పనులు ఎలా జరిగాయో..

అడగకపోయినా: వివేక భారతి కమిటీ వారు ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఐలాండ్ విస్తరణ చేపట్టాలని అడగలేదు. అయినప్పటికీ అధికారులు ఎందుకు హడావుడిగా ఈ పనులు చేపట్టారో వారికే తెలియాలి. మరోవైపు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వని విషయంలో అధికారులు ఆలోచించి వ్యవహరించాలని సమీక్షలో చెబుతున్నారు. అయినప్పటికీ ఇక్కడ అధికారులు ఎవరి మెప్పు కోసం ఐలాండ్ విస్తరణ చేపట్టారని ఒకవైపు వివేకభారతి కమిటీ వారు, మరో వైపు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పోనీ చేపట్టిన పనులు అయినా నాణ్యంగా చేశారా అంటే అది లేదు. ఐలాండ్ పెంచడంతో భారీ వాహనాలు మలుపు తిరిగే క్రమంలో ఢీకొట్టి గ్రానైట్ ధ్వంసమై ఊడిపోయి కళా విహీనంగా తయారవుతోంది. జీఎంసీ అధికారులు స్పందించి ధ్వంసమైన గ్రానైట్ రాళ్లను అతికించేలా చర్యలు తీసుకోవాలని వివేకా భారతి కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్‌ఛైర్మన్ రామచంద్రరాజు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే : గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ప్రత్యేక శిబిరాన్ని గురువారం ఆకులవారితోటలో ప్రారంభించారు. శిబిరం డిసెంబర్ 3 వరకు జరుగుతుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ రామచంద్రరాజు హాజరై వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజ సేవ, ప్రకృతి పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ వాలంటీర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. భవిష్యత్తు తరానికి పర్యావరణహిత సమాజాన్ని అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్. ద్వారా సమాజసేవ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.కె.బి.ఎం. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజావలి, పర్యావరణ వేత్తలు తిరుపతిరెడ్డి, ఐటీసీ ప్రతినిధి కె.నారాయణ, తుమ్మల నాగేశ్వరరావు, డివిజన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యం. సంతోష్‌కుమారి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు.

జీజీహెచ్‌లో పోలీసు ఔట్ పోస్టుకు స్థలం కేటాయింపు

ఈనాడు కథనానికి స్పందన

నగరంపాలెం: జీజీహెచ్‌లోని అత్యవసర వైద్యసేవల విభాగంలో ఉన్న పోలీసు ఔట్‌పోస్టును శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో కూల్చివేయాల్సి ఉండడంతో అక్కడ పనిచేసే సిబ్బంది జీజీహెచ్ ఆవరణలో మరో చోట స్థలం కేటాయించాలని పలుమార్లు ఆసుపత్రి ఉన్నతాధికారులను సంప్రదించారు. అయితే స్థలం కేటాయింపు జాప్యం కావడంతో నగరపాలక సంస్థ అధికారులు ఔట్‌పోస్టు స్టేషన్‌ను కూల్చివేస్తామని తెలిపారు. దీంతో ఏమి చేయాలో తెలియని స్థితిలో పోలీసు సిబ్బంది ఉండిపోయారు. దీనిపై ఈనెల 19న 'ఎక్కడుండాలి..ఎలా పర్యవేక్షించాలి' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీంతో ఆసుపత్రి ఉన్నతాధికారులు జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం ఎదురుగా ఉద్యానం, పార్కింగ్ ప్రాంతంలో ఔట్ పోస్టుకు స్థలాన్ని కేటాయించారు. దీంతో త్వరలోనే నూతన పోలీసు ఔట్‌పోస్టు నిర్మాణ పనులు సాగనున్నాయి.

ఏపీ ఎన్జీవో నగర కార్యవర్గ సమావేశం

గోరంట్ల: ఏపీ ఎన్జీవో సంఘం గుంటూరు నగర కార్యవర్గ సమావేశం జిల్లా కోర్టు రోడ్డులోని కార్యాలయంలో గురువారం జరిగింది. గ్రామ, వార్డు సచివాలయాల ఏఎన్ఎంలకు కేవలం వైద్యారోగ్య శాఖకు సంబంధించిన విధులను మాత్రమే కేటాయించేలా రాష్ట్ర నాయకత్వంతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షులు సూరి, కార్యదర్శి కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధర వరలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజారులో ధరలు(కేజీ ఒక్కింటికి రూ.ల్లో) టమాట 52, వంగ(సన్నాలు) 64, బెండ 32, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 46, క్యాలిఫ్లవర్ 25, క్యాబేజీ 30, క్యారెట్ 59, దొండ 33, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 60, దోస 32, సొర 24, పొట్ల 35, అరటికాయ 10, పెద్దచిక్కుడు 120, చామదుంప 24, మునగ 14, బీట్‌రూట్ 42, కీరదోసకాయ 30, బీన్స్ 50, క్యాప్సికమ్ 79, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 25, అల్లం 80, వెల్లుల్లి 110.

తెదేపా హయాంలోనే నగరాభివృద్ధి

శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు నగరాభివృద్ధి తెలుగుదేశం పార్టీతో ముడిపడి ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఏర్పడిన దగ్గర నుంచి గుంటూరు నగరానికి సిటీ లుక్ వచ్చిందంటే తెదేపా అధికారంలో ఉన్నప్పుడే జరిగిందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రూ.16.44 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవి, మేయర్ రవీంద్ర భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధిని అటకెక్కించారు.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఘోరంగా వైకాపా ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ప్రజల కోరిక మేరకు రోడ్లు, డ్రెయిన్లు..ఇలా ప్రతి అభివృద్ధి పనికి వెంటనే అంచనాలు తయారు చేయించి నిధులు మంజూరు చేయించడంలో మేయర్ రవీంద్ర సహకారం అభినందనీయమన్నారు. ఒక్క 39వ డివిజన్‌లోనే రూ.9 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.పద్మశ్రీ, ఈరంటి వరప్రసాద్, తెదేపా నాయకులు సింగంశెట్టి వీరయ్య, ఖాదర్‌బుడే, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

సర్వే వేగంగా పూర్తిచేయండి

దస్త్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా జరుగుతున్న సమగ్ర సర్వేను వేగంగా పూర్తి చేయాలని, నోడల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆకులవారితోటలోని 83, 84 వార్డు సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, సర్వే ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి తమకు కేటాయించిన క్లస్టర్‌లో ప్రజలకు సర్వే అంశాన్ని వివరించి, నిర్దేశిత విధానంలో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యదర్శులు ఐడీ కార్డులను తప్పనిసరిగా ధరించాలన్నారు. నగర ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే పురపాలక సేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పురమిత్ర, మన మిత్ర యాప్‌లను కూడా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సచివాలయ భవన సమస్యలను కార్యదర్శులు, నోడల్ అధికారి వివరించగా, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో నోడల్ అధికారి పోలేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పదో తరగతి నమూనా ప్రశ్నపత్రాల ఆవిష్కరణ

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే : 2026 మార్చిలో జరగనున్న ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యేందుకు, ఎక్కువ మార్కులు సాధించడానికి దోహదపడేలా రూపొందించిన నమూనా ప్రశ్నపత్రాల బుక్స్‌ను మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు గురువారం సంఘం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో అనుభవం, నైపుణ్యం కలిగిన సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలు రాశారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ వ్యాపార ధోరణితో కాకుండా..విద్యా రంగ అభివృద్ధికి దోహదపడాలనే లక్ష్యంతో రేటు నిర్ణయించినట్లు తెలిపారు. ఇవి యూటీఎఫ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అడుగడుగునా గుంతలతో అవస్థలు

బాలాజీనగర్‌లో రోడ్డు ఇలా...

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలకసంస్థలో విలీనమైన రెడ్డిపాలెం గ్రామం పరిధిలోని బాలాజీనగర్‌లో రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. ఏ రోడ్డు చూసినా అడుగుకో గుంత అన్నట్లుగా ఉంది. సీసీ రోడ్లు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేసినా జీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి అమరావతి రహదారి, సరస్వతికాలనీ 9వ లైన్ వైపు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. గుంతలను దాటుకుని ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు వాహనదారులతోపాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రారంభానికి నోచని ఆసుపత్రి ప్రధాన గేటు

నగరంపాలెం, న్యూస్‌టుడే: శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో జీజీహెచ్‌లోని అత్యవసర వైద్యసేవల విభాగం పాతగేటును కూల్చేశారు. దాని స్థానంలో కొత్త గేటు నిర్మాణం రెండు వారాల కిందట పూర్తైంది. కానీ గేటును తెరవకపోవడంతో ఆసుపత్రిలోకి వచ్చే రోగులు, అంబులెన్స్‌ల చోదకులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం రెండు గేట్లు అందుబాటులో ఉండగా, కేవలం ఒక గేటు నుంచి రాకపోకలతో అవస్థలు పడాల్సి వస్తోందని రోగులు, డ్రైవర్లు, సిబ్బంది వాపోతున్నారు. నూతనంగా నిర్మించిన గేటు ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

ఇదేనా..స్వచ్ఛ సర్వేక్షణ..!

కృష్ణనగర్ కుందులరోడ్డులో వ్యర్థాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరపాలక సంస్థకు ర్యాంకు వచ్చిందని చెబుతున్నా..ప్రధాన రహదారులను వ్యర్థాలు ముంచెత్తుతున్నాయి. కృష్ణనగర్ కుందుల రోడ్డును ఇటీవల కోట్లాది రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ వస్తుందని..ర్యాంకులు ఇస్తుందని డంపర్‌బిన్లు తొలగించారు. వ్యర్థాలు రోడ్డు మీదకు చెల్లాచెదురుగా చేరుకుంటున్నాయి. దీంతో పారిశుద్ధ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు దుర్వాసన భరించ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది డంపర్‌బిన్లను ఏర్పాటు చేయమని మొత్తుకుంటున్నా పాలకులు, అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. వారికి వచ్చే ర్యాంకులు సరే..తాము రోగాల బారిన పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వై.వి.సుబ్బారావు



గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా వై.వి.సుబ్బారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేయండి

మాట్లాడుతున్న మురళీమోహన్

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: రోజురోజుకు విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు అందిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందని జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ అన్నారు. జేకేసీ కళాశాల ఐక్యూఏసీ, జేసీ న్యాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ ద్వారా బోధన అనే అంశం మీద అధ్యాపకులకు రెండురోజుల కార్యశాల గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిపుణులు డాక్టర్ నెక్కంటి శ్రీనివాస్ వివిధ అంశాల్లో ఏఐ ఉపయోగించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జేసీ న్యాయకళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి, జేకేసీ ప్రిన్సిపల్ పి. గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సాంబశివరావు, జేసీ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. హెచ్.సుధాకరబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు క్రీడలు దోహదం



విజేతలతో జంపని సుబ్బారావు, రామానాయుడు తదితరులు

పట్టాభిపురం: విద్యార్థులకు క్రీడలతో సంపూర్ణ వికాసం సాధ్యమవుతుందని చిప్స్ కళాశాల ప్రొఫెసర్ జంపని సుబ్బారావు పేర్కొన్నారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతనలో క్రీడాదినోత్సవం జరిగింది. విజేతలకు బహుమతులు అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, సమయపాలన అలవడుతుందన్నారు. అవి లక్ష్య సాధనకు దోహదం చేస్తాయన్నారు. కిట్స్ కళాశాల ప్రొఫెసర్ రామానాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతమైన పౌరులుగా ఎదగడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో చిప్స్ కళాశాల ప్రొఫెసర్ వల్లూరు రవి, ప్రిన్సిపల్స్ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు నేరవార్తలు: రాజధాని ప్రాంతంలో శుక్రవారం పలు జాతీయ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరవుతున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సీఆర్‌డీఏ ప్రాంతంలో ఎస్పీ భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ప్రముఖుల భద్రత, వీవీఐపీలు రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణ, సమావేశ స్థలాల వద్ద భద్రత చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. డీఎస్పీలు మురళీకృష్ణ, శ్రీనివాసరావు, సీఐలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

రెండో స్థానంలో నిలిచిన యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల క్రీడాకారులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల వేదికగా మూడ్రోజులపాటు సాగిన పోటీల్లో ఆతిథ్య కృష్ణవేణి కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌ను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. ఒక్కో పాయింట్ సాధించడంలో నువ్వానేనా అన్నట్లు ఆటగాళ్లు ప్రాణం పెట్టి పోరాడారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీలకు విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 20 జట్లు హాజరు కాగా నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్లు ఫైనల్‌కు చేరాయి. నాలుగుసెట్ల పాటు సాగిన మ్యాచ్‌లో విజయం కృష్ణవేణి డిగ్రీ కళాశాలను వరించింది. మూడో స్థానం కోసం బాపట్ల ఆర్ట్స్, సైన్స్ కాలేజీ, ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల జట్లు తలపడగా.. బాపట్ల కళాశాల విజయం సాధించింది. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఎన్‌యూ యోగా కోఆర్డినేటర్, ఆచార్య బి.సూర్యనారాయణ మాట్లాడుతూ శారీరక మానసిక వికాసానికి, యువత భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవడానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ నాసరయ్య, ప్రముఖులు డాక్టర్ వెంకట్రావు, గౌరీశంకర్, పి.శ్రీనివాసరావు, ఆదిబాబు పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు


ఒప్పంద పత్రాలతో రామకృష్ణమూర్తి, అమిత్ కుమార్‌చౌదరి తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన అధునాతన సాంకేతిక నైపుణ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని ప్రగ్యాత్మిక సంస్థ సీఈవో రూపమ్ ఝా అన్నారు. గురువారం హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రగ్యాత్మిక సంస్థ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి అధ్యక్షత వహించారు. నోకియా బెంగళూరు సంస్థకు చెందిన వెంకటసూర్య, డాక్టర్ ఆర్.హఫీజ్ బాషా ప్రసంగించారు. ప్రగ్యాత్మిక సంస్థ సీటీవో అమిత్ కుమార్‌చౌదరి కళాశాలతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశారు. కళాశాల డైరెక్టర్ పీఎం ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ టైల్స్ మేస్త్రీ మృతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టైల్స్ మేస్త్రీ మృతి చెందినట్లు నల్లపాడు ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోరంట్లకు చెందిన గణేష్‌రెడ్డి(20) టైల్స్ పని చేసుకుని జీవిస్తున్నాడు. ఆయన ఈనెల 25న ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని చిల్లీస్ సెంటర్ నుంచి రెడ్డిపాలెం వైపు వెళ్తుండగా గాంధీ విగ్రహం వద్ద మలుపు తిరిగే క్రమంలో వేగాన్ని అదుపు చేయలేక ప్రమాదశాత్తూ దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈమేరకు గణేష్‌రెడ్డి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు అమలు చేయాలన్న ఉత్తర్వులను కేంద్రం వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నగర కార్యదర్శి ముత్యాలరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సంఘాల ఏర్పాటుకు అవకాశం లేకపోవడం, సమ్మె చేసే హక్కు లేకుండా లేబర్‌కోడ్‌లు రూపొందించారన్నారు. నగర కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ ఎనిమిది పని గంటలను 10 నుంచి 13 గంటలకు తీసుకొచ్చారన్నారు. లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు యాసిర్‌ఖాన్, బాషా, వెంకటేశ్వరరావు, అజిల్, సలాం, షమ్మీ పాల్గొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**
ఫ్రెస్ట్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ వెర్టికల్, బరోడా కార్పొరేట్ సెంటర్ సి-26, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
e-mail : wfd.bcc@bankofbaroda.co.in

షోకాజ్ నోటీసు (SCN)

మెస్సర్స్ శ్రీ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, శ్రీ వరికూటి వెంకటేశ్వర రావు, నెం. 28-02-23, సాయిబాబా గుడి, కంకరగుంట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. **రిజిస్టర్డ్ ఆఫీస్:** డి. నెం. 54-281, షాప్ నెం. 56, రెవెన్యూ వార్డ్ నెం. 24, అన్నపూర్ణ కాంప్లెక్స్, విజయవాడ రోడ్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్. **ఫ్యాక్టరీ/గోడౌన్:** డోర్ నెం. 180/1, పాత డోర్ నెం. 11-589, కొత్త డోర్ నెం. 11-582, శ్రీ వాసవి ఎస్టేట్స్, డి బ్లాక్, పాత అసెస్‌మెంట్ నెం. 1370, కొత్త అసెస్‌మెంట్ నెం. 1023011370, రెవెన్యూ వార్డ్ నెం. 11, సూర్య నారాయణ నగర్, రత్నాల చెరువు, మంగళగిరి టౌన్, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

మా బ్యాంక్ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించడానికి క్రింది కారణాల దృష్ట్యా మీకు షోకాజ్ నోటీసు SCN జారీ చేయాలని ఆదేశించింది: 1. సంస్థ యొక్క ఖాతా స్టేట్‌మెంట్ పరిశీలించగా, మీరు వ్యాపార లావాదేవీలకు సంబంధం లేని వ్యక్తులకు (వివిధ తేదీలలో వివిధ విడతలలో సుమారు **రూ. 40.50 లక్షలు**) గణనీయమైన మొత్తాన్ని బదిలీ చేసినట్లు వెల్లడైంది. 2. బ్యాంక్‌కు తనఖా పెట్టిన ఆస్తులను (అంటే స్టాక్స్) బ్యాంక్‌కు తెలియజేయకుండా తొలగించడం జరిగింది మరియు ఆ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతా ద్వారా మార్చలేదు. మీ ఈ మినహాయింపు/కమీషన్ ఆర్‌బిఐ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ట్రీట్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్ లోని క్లాజ్ 3(1)(టి)(ఐ)(బి) & (డి) - నిధుల మళ్లింపు & ఆస్తుల తొలగింపు పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం, ఈ **SCN** మీకు **ది. 20.11.2025** తేదీన జారీ చేయబడింది.

ది. 21.11.2025 తేదీన, పైన పేర్కొన్న చిరునామాలకు పంపిన **SCN** డెలివరీ కాకుండా తిరిగి వచ్చింది, అందువలన దీనిని వార్తాపత్రికలో ప్రచురించడం జరుగుతున్నది. మీరు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఎందుకు వర్గీకరించబడకూడదో తెలియజేస్తూ, పైన ఇచ్చిన చిరునామాకు 21 రోజులలోపు మీ లిఖితపూర్వక వివరణను సమర్పించవలసిందిగా కోరబడింది. పై తెలిపిన గడువులోగా మీ వివరణ అందని పక్షంలో గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించే ప్రక్రియను కొనసాగిస్తుంది.

సం/-
తేది: 20-11-2025 (డి.వై. జనరల్ మేనేజర్)

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**
ఫ్రెస్ట్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ వెర్టికల్, బరోడా కార్పొరేట్ సెంటర్, సి-26, జి-బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా ఈస్ట్, ముంబై-400051.
e-mail : wfd.bcc@bankofbaroda.co.in

షోకాజ్ నోటీసు (SCN)

మెస్సర్స్ గౌతమ్ ట్రేడింగ్ కంపెనీ, శ్రీ వరికూటి వెంకటేశ్వర రావు, నెం. 28-02-23, సాయిబాబా గుడి, కంకరగుంట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. **రిజిస్టర్డ్ ఆఫీస్:** డి. నెం. 54-281, షాప్ నెం. 56, రెవెన్యూ వార్డ్ నెం. 24, అన్నపూర్ణ కాంప్లెక్స్, విజయవాడ రోడ్, గుంటూరు-522001. **ఫ్యాక్టరీ/గోడౌన్:** శ్రీ వాసవి ఎస్టేట్స్, ఇ బ్లాక్, డి. నెం. 11-582, రెవెన్యూ వార్డ్ నెం. 11, సూర్యనారాయణ నగర్, రత్నాలచెరువు, మంగళగిరి, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.

మా బ్యాంక్ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించడానికి క్రింది కారణాల దృష్ట్యా మీకు షోకాజ్ నోటీసు SCN జారీ చేయాలని ఆదేశించింది: 1. సంస్థ యొక్క ఖాతా స్టేట్‌మెంట్ పరిశీలించగా, మీరు వ్యాపార లావాదేవీలకు సంబంధం లేని వ్యక్తులకు (వివిధ తేదీలలో వివిధ విడతలలో సుమారు **రూ. 86.65 లక్షలు**) గణనీయమైన మొత్తాన్ని బదిలీ చేసినట్లు వెల్లడైంది. 2. బ్యాంక్‌కు తనఖా పెట్టిన ఆస్తులను (అంటే స్టాక్స్) బ్యాంక్‌కు తెలియజేయకుండా తొలగించడం జరిగింది మరియు ఆ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ ఖాతా ద్వారా మార్చలేదు. మీ ఈ మినహాయింపు/కమీషన్ ఆర్‌బిఐ యొక్క ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ట్రీట్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్ లోని క్లాజ్ 3(1)(టి)(ఐ)(బి) & (డి) - నిధుల మళ్లింపు & ఆస్తుల తొలగింపు పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం, ఈ **SCN** మీకు ది. **20.11.2025** తేదీన జారీ చేయబడింది.

ది. 21.11.2025 తేదీన, పైన పేర్కొన్న చిరునామాలకు పంపిన **SCN** డెలివరీ కాకుండా తిరిగి వచ్చింది, అందువలన దీనిని వార్తాపత్రికలో ప్రచురించడం జరుగుతున్నది. మీరు ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఎందుకు వర్గీకరించబడకూడదో తెలియజేస్తూ, పైన ఇచ్చిన చిరునామాకు 21 రోజులలోపు మీ లిఖితపూర్వక వివరణను సమర్పించవలసిందిగా కోరబడింది. పై తెలిపిన గడువులోగా మీ వివరణ అందని పక్షంలో గుర్తింపు కమిటీ మిమ్మల్ని ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా వర్గీకరించే ప్రక్రియను కొనసాగిస్తుంది.

సం/-
తేది: 20-11-2025 (డి.వై. జనరల్ మేనేజర్)

(c) eenadu

తితిదే బోర్డు సభ్యులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, బోర్డు ఛైర్మన్ బీఆర్‌నాయుడు, సభ్యురాలు సుచిత్ర ఎల్లా, మంత్రులు రామనారాయణరెడ్డి, మనోహర్ తదితరులు

మహా ప్రాకార నిర్మాణ భూమి పూజకు వస్తున్న సీఎం చంద్రబాబు, తితిదే ఈవో అనిల్ సింఘాల్

వేంకటా చలపతి.. శోభిల్లేను అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వెంకటపాలెంలో తిరుమల తిరుపతి తరహాలో శ్రీవారి ఆలయాన్ని రూ. 260 కోట్లతో అభివృద్ధి చేయడానికి మరో అడుగు పడింది. తితిదే వేద పండితుల మంత్రోచ్ఛారణలు.. మంగళవాయిద్యాల నడుమ ద్వితీయ మహా ప్రాకార నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు.

- న్యూస్‌టుడే, తుళ్లూరు

ఈనాడు అమరావతి
కృష్ణా

శుక్రవారం నవంబరు 28, 2025

పన్నుగప్పి.. దందా!

రూ.1.75 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

ఈనాడు, అమరావతి

పన్నులు చెల్లించని విదేశీ సిగరెట్లు.. విజయవాడ, సమీప ప్రాంతాలకు భారీగా వచ్చేస్తున్నాయి. పారిస్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ లేబుల్ పేర్లతో ఉన్న రూ.1.75 కోట్ల విలువైన అక్రమ విదేశీ సిగరెట్లను.. తాజాగా వాణిజ్య పన్నులశాఖ సిబ్బంది పట్టుకున్నారు. విజయవాడ డివిజన్ 01 సిబ్బంది ఆధ్వర్యంలో భవానీపురం పార్శిల్ కార్యాలయం, గొల్లపూడిలో ఐదు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ అట్కిన్సన్ పాఠశాల సమీపంలో ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో.. ఏకంగా 23 పెద్ద కార్టన్లను పట్టుకున్నారు. మూడో డివిజన్‌లో మచిలీపట్నం సర్కిల్ ఆధ్వర్యంలో దాడులు చేసి.. తోట్లవల్లూరు రోడ్డులోని గోదాములో మరో 90 కార్టన్ల సరకు గుర్తించారు.

రూ.కోటి వరకూ ఖజానాకు రావాలి..

సిగరెట్లపై 28 శాతం పన్ను చెల్లించాలి. అందుకే.. అక్రమార్కులు.. వక్రమార్గాల్లో పన్నులు చెల్లించకుండా విదేశీ బ్రాండ్ సిగరెట్లను దిగుమతి చేసుకుంటున్నారు. తాజాగా దొరికిన సరకులో.. ఒక్కో సిగరెట్ ప్యాకెట్‌పై రూ.50 ఎమ్మార్పీ ఉంది. పంచనామా ద్వారా మొత్తం ప్యాకెట్లను లెక్కించి.. రూ.1.75 కోట్ల సరకుగా తేల్చారు. పన్ను, దానికి సమానంగా జరిమానా చెల్లించాలి. ఈ లెక్కన.. 28 శాతం చొప్పున రూ.50 లక్షల పన్ను, మరో రూ.50 లక్షల జరిమానా కలిపి.. రూ.కోటి వరకూ సర్కారు ఖజానాకు రావాలి.

తోట్లవల్లూరు: పట్టుకున్న సిగరెట్ ప్యాకెట్ల కార్టన్లు..

అక్రమ సరకు తెచ్చిన కంటైనర్

నేపాల్ సరిహద్దుల నుంచి... నేపాల్, బిహార్ నుంచి ఈ సరకును రోడ్డు మార్గంలో కంటైనర్లు, లారీల్లో ఇక్కడికి తెచ్చినట్లు అధికారులు గుర్తించారు. సరకు తమదేనని కొందరు యజమానులు వచ్చినట్లు సమాచారం. సిగరెట్ ప్యాకెట్ రూ. 20 అనీ.. అయితే ఎమ్మార్పీ రూ.50 ముద్రించినట్లు చెబుతున్నట్టు తెలిసింది. ఈ సరకును వేలం వేయాలని నిర్ణయించారు. వీటిని తెచ్చిన కంటైనర్ అధికారుల ఆధీనంలోనే ఉంది.

దొరుకుతున్నది నాలుగో వంతే.. విజయవాడ పరిధిలోని డివిజన్ 01, 02 సహా అందరినీ వారి కార్యాలయ పరిధిలో కాకుండా.. పక్కనున్న ప్రాంతాలకు తనిఖీలకు పంపిస్తున్నారు. ఎవరి డివిజన్‌పై వాళ్లకే అవగాహన, పూర్తి పట్టు ఉంటుంది. పక్క డివిజన్ వాళ్లు ఇక్కడి కొచ్చి తనిఖీలు చేస్తుంటే.. వీళ్లు సహకరించడం లేదు. అలాగే వీళ్లు వేరేచోటకు వెళ్లినా అదే తీరు. దీంతో అక్రమంగా దిగుమతయ్యే సరకులో.. అధికారులు పట్టుకుంటున్నది నాలుగో వంతూ ఉండదనే విమర్శలు వస్తున్నాయి.

మేమింతే.. పనులు చేయమంతే!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ముఖ్యమంత్రి, మంత్రులు అనుశీలన చేస్తున్నా.. అధికారులు హెచ్చరించినా మచిలీపట్నం హార్బర్ పనుల్లో పురోగతి కనిపించట్లేదు. వైకాపా హయాంలో బిల్లులు రాక పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్ హార్బర్ పనుల్లో అలసత్వంపై గుత్తేదారు సంస్థ, పర్యవేక్షణాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 15 నాటికి అంతర్గత రోడ్లు, ప్యాకింగ్, నిల్వలు ఇతర సముదాయాలు పూర్తి చేసి మత్స్యకార పడవలకు అడ్డంకులు తొలగించాలని దిశానిర్దేశం చేశారు. అయినా నిర్మాణ సంస్థ తీరు మారలేదు. ఈ ఏడాది సెప్టెంబరులో పనులు పరిశీలించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు నెలాఖరులోపు పనుల్లో పురోగతి కనిపించకుంటే ఒప్పందం రద్దు చేస్తామని హెచ్చరించారు. మూడు నెలలవుతున్నా ఫలితం లేదు.

మరో రెండేళ్లా..?

వైకాపా హయాంలో అనుభవం లేని సంస్థకు పనులు కట్టబెట్టడం, వారు మరో సంస్థకు సబ్‌కాంట్రాక్టు ఇవ్వడంతో పనులు సాగలేదు. 2021లో హార్బర్ పనులు ప్రారంభించగా 2023 మార్చి నాటికి పూర్తి చేయాలి. అప్పటి మంత్రులు, అధికారుల కక్కుర్తితో గడువు పెరిగిందన్న విమర్శలు ఉన్నాయి. హార్బర్‌లో జెట్టీలు మినహా ఏ పనులూ పూర్తి స్థాయిలో జరగలేదు. సముద్రం నుంచి హార్బర్ వద్దకు పడవలు వచ్చేందుకు వీలుగా నిర్మిస్తున్న బ్రేక్‌వాటర్ నిర్మాణాలు నేటికీ కొలిక్కిరాలేదు. హార్బర్‌లో ప్యాకింగ్, రేడియో కమ్యునికేషన్, ఐస్, కోల్డ్ స్టోరేజ్ తదితర భవనాలు సైతం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. రోడ్లు, నీటి ట్యాంకులు తదితర పనులన్నీ పునాదుల్లోనే ఉన్నాయి. ★ రోజుకు కనీసం 300 మందికి పైగా పని చేస్తే తప్ప అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తవడం కష్టం. కానీ గుత్తేదారు సంస్థ రోజుకు 70 మందితోనే పనులు చేయిస్తూ కాలం వెళ్లదీస్తోంది. ఇలాగైతే మరో రెండేళ్లయినా హార్బర్ నిర్మాణం కష్టమని అధికారులు చెబుతున్నారు. ★ పాత మొగ వద్ద పూడిక పేరుకుపోయి పడవలు ధ్వంసమవుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. ★ పనుల పురోగతిపై స్థానిక మంత్రి, కలెక్టర్, మారిటైమ్ బోర్డు నుంచి గుత్తేదారు సంస్థపై ఒత్తిడి లేకపోవడంతో నిర్మాణాల్లో జాప్యం వీడట్లేదని తెలుస్తోంది.

నిర్మాణ సంస్థ: ఎంఆర్‌కేఆర్
వ్యయం: రూ.421కోట్లు
విస్తీర్ణం: 56 ఎకరాలు
జరిగిన పనులు: 69శాతం
గడువు: 1) 2023 మార్చి,
2) 2024 సెప్టెంబరు
3) 2026 మార్చి

నత్తనడకన మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం

అసంపూర్తి పనులతోనే ఫిషింగ్ హార్బర్

నిత్యం నీటి పరీక్షలు చేయాలి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిత్యం తాగునీటి పరీక్షలు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. పాతరాజరాజేశ్వరీపేటలో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలకు శుద్ధి జలాన్ని డబ్బాల్లో అందించాలనీ.. నిత్యం నీటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరా పైపులైన్లను మార్చి, కొత్తవాటిని అమర్చాలని ఆదేశించారు. ఇంటింటికీ ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు.

ఈనాడు ప్రాపర్టీ షో-2025 లోగో ఆవిష్కరణ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ బృందావన కాలనీ ఎ కన్వెన్షన్ సెంటర్లో ఈ నెల 29, 30 తేదీల్లో 'ఈనాడు' ప్రాపర్టీ షో -2025 నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లోగోని టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న సన్‌సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ భాష్యం కిరణ్‌కుమార్, పవర్డ్ బై హరివిల్లు ప్రమోటర్స్, డెవలపర్స్ సీఈవో జాస్తి ప్రసన్నకుమార్, గోల్డ్ స్పాన్సర్ వీఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి ఎన్.నారాయణరెడ్డి, సిల్వర్ స్పాన్సర్ చతుర్భుజ ప్రాపర్టీస్, ఇన్‌ఫ్రా ఎండీ కె.నాగేశ్వరరావు, ప్రతినిధి హనుమాన్‌లు ఆటోనగర్ స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్స్‌లోని 'ఈనాడు' కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 'ఈనాడు' పాఠకులకు నాణ్యమైన వార్తలను అందించడంతో పాటు సొంతింటి కలను సాకారం చేసుకునే వారి కోసం కొన్నేళ్లుగా ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది కొనుగోలుదారులు, స్థిరాస్తి సంస్థలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న భాష్యం కిరణ్‌కుమార్, జాస్తి ప్రసన్నకుమార్, హనుమాన్, సీహెచ్‌కే కిషోర్‌కుమార్, నాగేశ్వరరావు, నారాయణరెడ్డి

వందేభారత్‌కు స్లీపర్ బోగీలు

ట్రయల్ రన్ విజయవంతం..

విజయవాడ రైల్వే: వందే భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండడంతో వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టబోతుంది. ఇప్పటికే విజయవంతంగా ట్రయల్స్ పూర్తి చేయగా ఎప్పుడు పట్టాలెక్కిస్తారోనని ఆసక్తిగా ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. మెరుగైన, సురక్షిత ప్రయాణం అందించేందుకు తొలి వందే భారత్ స్లీపర్ రైలును త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

అత్యాధునిక సౌకర్యాలు.. తొలి స్లీపర్ రైలు ప్రయాణికులకు ఉన్నతస్థాయి సౌకర్యాలు, వేగం రెండింటినీ అందిస్తుంది. ప్రయాణికుల సౌకర్యం, భద్రత విషయంలో రాజీపడకుండా వందే భారత్ స్లీపర్ రైలు ర్యాక్‌లను రూపొందించారు. ఇప్పటికే పలు స్థాయిల్లో పరీక్షించారు. ట్రయల్స్ తర్వాత సీట్లు, బోగీలకు సంబంధించి పలు మార్పులు చేశారు.

విజయవాడ డివిజన్ మీదుగా.. ఈ రైళ్లు విజయవాడ డివిజన్ మీదుగా నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముందుగా రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ-సికింద్రాబాద్, విజయవాడ-విశాఖకు తొలి రైళ్లు నడపనున్నారు. అన్ని అనుకూలిస్తే డిసెంబర్‌లో ప్రారంభించేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తుంది.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం: ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్ విజయవాడ ఆదేశాల మేరకు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డిసెంబరు 3లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, సాధికారత అధికారి జి.రమేష్ గురువారం తెలిపారు. డిసెంబరు 7న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని.. ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడ గొల్లపూడిలోని స్టడీసర్కిల్‌లో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 14 రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయంలో, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కార్యాలయాలు మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడల్లో సంప్రదించాలని సూచించారు.

ఆరు నెలల్లో పైవంతెన నిర్మాణం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ ప్రజల ట్రాఫిక్ సమస్యను పైవంతెన నిర్మాణంతో మరో ఆరు నెలల్లో శాశ్వతంగా పరిష్కరిస్తామని మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. స్థానిక పామర్రు రోడ్డులో నిర్మాణంలో ఉన్న పైవంతెన పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావులతో కలిసి ఎంపీ గురువారం పరిశీలించారు. గుత్తేదారు, జాతీయ రహదారుల శాఖ అధికారులను కలిసి పైవంతెన నిర్మాణం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం 70 శాతం పూర్తయి చివరి దశకు చేరుకుందన్నారు. చిన్న సాంకేతిక సమస్యలు మరో 15 రోజులలో పూర్తి అవుతాయన్నారు. పార్లమెంటు సభ్యునిగా గుడివాడ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నామన్నారు. వంతెనకు అనుసంధానంగా పట్టణంలోని ప్రధాన రహదారులను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయడం కోసం ప్రతిపాదనలు పంపామని, త్వరలో నిధులు విడుదల అవుతాయన్నారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధికి అత్యధికంగా నిధులు తెచ్చిన బాలశౌరి గుడివాడ ప్రజల గుండెలలో శాశ్వత ముద్ర వేసుకుంటారన్నారు. నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, చేకూరు జగన్ మోహన్‌రావు, నిమ్మగడ్డ సత్యసాయి, యార్లగడ్డ సుధారాణి, పంచకర్ల అమర్, మజ్జి శ్రీనివాసరావు, సాయిన రాజేష్, వేమూరి త్రినాథ్, వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వల్లభనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పైవంతెన గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ బాలశౌరి

బతుకు బండి.. బిక్కుబిక్కుండి

గ్రామాల్లో వ్యవసాయ పనుల నిమిత్తం మహిళా కూలీలు ప్రాణాలు పణంగా పెట్టి ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఒకే ట్రాలీ ఆటోలో దాదాపు 15 నుంచి 20 మందిని ఎక్కిస్తున్నారు. ఏమాత్రం ఆటో బోల్తా పడినా తీవ్రగాయాల పాలవుతున్నారు. గన్నవరం మండలం ముస్తాబాద నుంచి కేసరపల్లి వెళ్లే రోడ్డులో కనిపించిన దృశ్యమిది.

- ఈనాడు, కృష్ణా

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి స్వాగతం

న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం: అమరావతి పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి విమానాశ్రయం చేరుకున్న కేంద్ర మంత్రికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, భాజపా నాయకులు పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరాం, చిగురుపాటి కుమార స్వామి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి డి.రొనాల్డ్‌రోస్, జిల్లా ఆడిట్ అధికారి సూర్యభాస్కరరావు, విమానాశ్రయ డైరెక్టర్ ఎమ్.లక్ష్మీకాంతరెడ్డి, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ నోవాటెల్‌కు బయలుదేరి వెళ్లారు.

నిర్మలాసీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

మితిమీరిన వేగం.. మింగుతోంది ప్రాణం

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో వాహనంతో రోడ్డెక్కితే క్షేమంగా తిరిగి వస్తామనే నమ్మకం కొరవడింది. రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఎలాంటి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా పలువురు మైనర్లు కూడా ఇష్టారీతిన దూసుకొస్తున్నారు. అసలే ఇరుకిరుకు రోడ్లు.. దీనికితోడు నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మితిమీరిన వేగ నియంత్రణలో పోలీసులు విఫలం అవుతున్న వేళ.. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

ప్రకాశ్‌నగర్‌లో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (పాతచిత్రం)

అడ్డదిడ్డంగా నడుపుతున్నారు..

★ రెండు వారాల కిందట.. ప్రకాష్‌నగర్‌లో రాత్రి వేళ ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చి.. రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. ★ భానునగర్‌వాసి రాజారావు.. ఇటీవల అల్పాహారం కోసం బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా.. అతివేగంగా ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలైన రాజారావు చికిత్స పొందుతూ మరణించాడు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్న గుణదల పోలీసులు, బాలుడి తండ్రిపై కేసు పెట్టారు.

నగరంలో రోడ్డు ప్రమాదాల తీరిది (జనవరి–అక్టోబరు 31)

526	ప్రమాదాలు
423	మరణాలు
148	గాయాలు

ప్రమాద కారణాలలో అతి వేగంతో జరుగుతున్నవే అధికం. నగరంలో రద్దీ రోడ్లపై కూడా స్పోర్ట్స్ బైక్‌లతో శరవేగంగా నడుపుతున్నారు. రాత్రుళ్లు పట్టపగ్గాలు లేకుండా వ్యవహరిస్తున్నారు. బైక్ రేసింగ్‌లతో హడలెత్తిస్తున్నారు. మత్తులో ఇష్టానుసారం నడిపి దారిన పోయే వారి ప్రాణాలు తీస్తున్నారు. తాగి నడపడంతో 20 శాతం పైగా చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ యువకులు చేస్తున్నవే. గతంలో రాత్రి పూట, నిర్మానుష్య రోడ్లపై కనిపించే ర్యాష్ డ్రైవింగ్.. ఇప్పుడు రద్దీవేళల్లోనూ తారసపడుతోంది. బాగా రద్దీగా ఉండే బందరు రోడ్డు, ఏలూరు రోడ్లపైనా ఏమాత్రం భయం లేకుండా అతివేగం, స్నేక్ డ్రైవింగ్ చేస్తున్నారు. తమ కళ్ల ముందే చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు కనీసం ఆపడం లేదు. పోలీసులకు పట్టదనే ధీమాతో ఇష్టారీతిన వాహనాలు నడిపేందుకు తెగిస్తున్నారు.

20%

ఫిట్‌నెస్ గుట్టు.. కమీషన్ల కనికట్టు

ఏజెంట్లు, ఏటీఎస్ కేంద్రం నిర్వాహకుల కుమ్మక్కు

ఈ ఆటో 2013లో కొనుగోలు చేశారు. వాహనం ఇంజిన్ అవసాన దశకు చేరుకుంది. వాహనం బాడీ మొత్తం తుప్పు పట్టింది. దాన్ని బయటికి కనపడకుండా రబ్బరు మ్యాట్లతో కప్పి మాయ చేశారు. నిబంధనల ప్రకారం ఈ వాహనానికి ఫిట్‌నెస్ పత్రం జారీ చేయడం కుదరదు. ఏజెంట్ రూ.7వేలు వసూలు చేసి అడ్డగోలుగా ఫిట్‌నెస్ పత్రం ఇప్పించారు.

హనుమాన్‌జంక్షన్ ఆటో వాలా నున్న ఏటీఎస్ కేంద్రంలో ఫిట్‌నెస్ ధ్రువపత్రానికి ఏజెంట్‌ను సంప్రదించారు. రూ.3వేలు ఖర్చవుతుందన్నారు. చలానా రూ.944 కదా అంతెందుకు అంటే 'అమాయకుడిలా ఉన్నావే.. పై నుంచి కింద వరకు ఇచ్చుకుంటేనే కదా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఆలస్యం కాకుండా వచ్చేది' అన్నారు. చేసేది లేక అడిగింది ఇచ్చారు.

నున్న ఏటీఎస్(ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్)లో ఫిట్‌నెస్ ధ్రువపత్రం మంజూరులో దోపిడీ రాజ్యమేలుతోంది. వాహన స్థితి ప్రమాణాలకు తగ్గట్టుగా ఉందా లేదా అన్నది అనవసరం. ముడుపులు అందాయా లేదా అన్నదే ముఖ్యం అన్నట్లు దందా సాగుతోంది. ఏజెంట్ల ముసుగులో కొందరు నిర్వాహకులు వాహనదారులను దోచుకుంటున్నారు.

అడ్డగోలు తీరిది..

✪ వాహనాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా లేదా అని నిర్ధారించేందుకు సమయానికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. ✪ ఇందులో టైర్ల అమరిక, ఇంజిన్ పనితీరు, వేగం, హారన్ శబ్దం, బ్రేక్, అండర్‌ఫిట్, హెడ్ లైట్స్ తదితర పరీక్షలు చేస్తారు. ప్రమాణాలకు తగ్గట్టు ఉంటేనే ఫిట్‌నెస్ ధ్రువపత్రం మంజూరు చేయాలి. ✪ నున్న ఏటీఎస్ కేంద్రంలో కనీస ప్రమాణాలు లేని వాహనాలకు సైతం అడ్డగోలుగా పత్రాలు ఇచ్చేస్తున్నారు. ✪ ఏజెంట్లు, ఏటీఎస్ కేంద్రంలో కొందరు సిబ్బంది కుమ్మక్కై కథ నడిపిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా వస్తేనే పరీక్షలు లేదంటే కొర్రీలు పెడుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. ✪ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలోనే ఏజెంట్లు వసూళ్ల కథ ముగిస్తున్నారు. ✪ చలానా కట్టాల్సింది రూ.950లోపే అయినా ఒక్కో వాహనదారుడి నుంచి రూ.2500 నుంచి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. వీరి కమీషన్ల కక్కుర్తి వల్ల కాలుష్యం తీవ్రత, రహదారి ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది.

బాధ్యులపై చర్యలు

ప్రస్తుతం ఏటీఎస్ కేంద్రాలు ప్రైవేటు నిర్వహణలో నడుస్తున్నాయి. ఈ కేంద్రాలను కమిషనర్ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధిరుల దృష్టికి తీసుకువెళ్తాను. అధికంగా వసూలు చేస్తున్న ఏజెంట్లు, వారితో కుమ్మక్కైన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మోహన్, డీటీసీ

– ఈనాడు, అమరావతి

పెట్టుబడుల పేరుతో విశ్రాంత ఉద్యోగికి టోకరా

రూ.78.5 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సరైన డీమ్యాట్ ఖాతా ఉంటేనే పెట్టుబడులు పెట్టాలని.. ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడులకు ఎక్కువ మొత్తంలో ఆదాయం వస్తుందని ఎవరైనా చెబితే నమ్మవద్దని పోలీసులు చెబుతున్నా.. అమాయకులు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్ల తియ్యని మాటలతో.. విజయవాడకు చెందిన ఒక విశ్రాంత ఉద్యోగి (77) నుంచి రూ.78.5 లక్షలు కొట్టేశారు. వివరాల్లోకి వెళితే.. మొగల్రాజపురానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నటరాజన్ గుల్జార్ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 22న అతని చరవాణి వాట్సాప్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని అందులో ఉంది. దాన్ని క్లిక్ చేయగానే.. వెంటనే ఒక వ్యక్తి అతని చరవాణికి ఫోన్ చేశాడు. పెట్టుబడులకు ఎంతెంత లాభాలు వస్తాయో తియ్యని మాటలతో ప్రలోభపెట్టాడు. ఆ మాటలు నమ్మిన వృద్ధుడిని 'స్టాక్ మార్కెట్ లెర్నర్స్ 2' అనే ట్రేడింగ్ గ్రూపులోకి చేర్చారు. ఫోన్ చేసిన వ్యక్తి.. లాభాల గురించి విపరీతంగా చెప్పడంతో ఆయన పూర్తిగా నమ్మేశారు. అవతలి వ్యక్తి చెప్పిన విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా, బంధన్ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, యూకో బ్యాంకులకు చెందిన మొత్తం 12 ఖాతాలకు విడతల వారీగా రెండు నెలల్లో రూ.78.5 లక్షలు పంపారు. తర్వాత యాప్‌లోని తన ఖాతాలో కనిపిస్తున్న డబ్బులను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా.. అవి రాలేదు. మోసపోయినట్లు గుర్తించిన ఆయన.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

(c) eenadu

ఈవీఆర్ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలు

● ఎన్టీఆర్ వైద్య సేవ రికార్డులు రాష్ట్ర కార్యాలయానికి తరలింపు
● ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక

గుడివాడ, న్యూస్‌టుడే

గుడివాడలోని ఈవీఆర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పేరుతో చేస్తున్న అక్రమాలపై బాధితురాలు యాళ్ల సావిత్రి ఫిర్యాదుపై ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎస్‌బి.సతీష్ కుమార్ బృందం గురువారం ఆసుపత్రిలో తనిఖీలు చేసింది. చికిత్సల దస్త్రాలను పరిశీలించి సంబంధిత రికార్డులను రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. 'ఈవీఆర్ చారిటబుల్ ట్రస్టు పేరుతో ఉచిత గుండె జబ్బుల చికిత్స శిబిరం నిర్వహించి రోగులకు చేయని చికిత్సను చేసినట్లుగా బాధితులకు తెలియకుండా సంతకాలు తీసుకుంటున్నారు. అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవకు దరఖాస్తులు చేసి భారీగా ధనార్జనకు పాల్పడుతున్నారు. ఎవరైనా గుర్తించి ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోండటంటూ దబాయిస్తున్నారు' అని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బాధితురాలు ఆసుపత్రి అక్రమాల గుట్టురట్టు చేశారు. దీంతో ఎంతకాలం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవకు దరఖాస్తులు చేస్తున్నారు? ఎంత మేర బిల్లులు చేసుకున్నారు? రోగులకు చేయని చికిత్స చేసినట్లు చూపి ఎంత మేర అక్రమార్జనకు పాల్పడ్డారో విచారణ చేస్తున్నారు.

బాధితులుంటే ఫిర్యాదు చేయండి..

ఈవీఆర్ ఆసుపత్రిలో జరిగిన ప్రభుత్వ వైద్య సేవల నిధుల దుర్వినియోగంపై తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రమశిక్షణ కమిటీకి సిఫారసు చేస్తూ నివేదిక పంపామని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త ఎస్‌బి.సతీష్ కుమార్ తెలిపారు. ఇలా రోగులకు తెలియకుండా వారికి చేయని చికిత్సలు చేసినట్లు గుర్తిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఈవీఆర్ ఆసుపత్రికి తాత్కాలికంగా ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపేస్తున్నామని తెలిపారు.

గతంలోనూ ఆరోపణలే

ఈవీఆర్ సిబ్బంది గతం నుంచీ ఇలాంటి నిధుల దుర్వినియోగంలో సిద్ధహస్తులని పలువురు ఆరోపిస్తున్నారు. కరోనా సమయంలో రోగుల నుంచి అక్రమంగా వసూళ్లకు తెగబడినట్లు విమర్శలు ఉన్నాయి. గుడివాడ పరిసర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కరోనా చికిత్స కోసం రావడంతో డబ్బులు సరిపోలేదని అతడి లారీని స్వాధీనం చేసుకున్న సంఘటనపై అప్పట్లో వివాదం జరిగింది. బాధితుల ఫిర్యాదుతో ఆసుపత్రిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధంకాగా... ఈ క్రమంలో అప్పటి వైకాపా మంత్రి అండతో బయట పడినట్లు సమాచారం. ఇక్కడ ల్యాబ్‌లోనూ పలు అక్రమాలు జరుగుతాయని ఆరోపణలున్నాయి.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి పటిష్ఠ ప్రణాళిక: సంజయ్‌దత్

మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవాన్ని సాధించేందుకు పటిష్ఠ ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి సంజయ్‌దత్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీలోని ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తుల నుంచి కింది స్థాయి కార్యకర్త వరకు అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. పార్టీలో 'ఉమీద్' జరిగాలని, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి బూత్ స్థాయి అధ్యక్షుడి వరకు అంకిత భావంతో పని చేసే వ్యక్తులను ఎన్నుకోనున్నట్లు చెప్పారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉండే వ్యక్తి పార్టీలోని కింది స్థాయి కార్యకర్తలతో చర్చించే విధంగా ఉండాలన్నారు. పార్టీకి జవాబుదారీగా ఉండాలని, పారదర్శకంగా పని చేయాలన్నారు. మండల, గ్రామ, బూత్ స్థాయి అధ్యక్షులు తమ బాధ్యత నూరు శాతం నెరవేర్చే వ్యక్తులై ఉండాలని పేర్కొన్నారు. పార్టీలో అధికారాన్ని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళ, యువతకు అప్పగించాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల కోసం పార్టీలోని కింది స్థాయి వ్యక్తి నుంచి అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. పార్టీ క్యాడర్ నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు సమాచారాన్ని సేకరిస్తామన్నారు. డిసెంబరు 8న నివేదిక అధిష్ఠానానికి సమర్పిస్తామన్నారు. సమావేశంలో మచిలీపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అబ్దుల్ మతీన్, అవనిగడ్డ, పెడన ఇన్‌ఛార్జి అందె శ్రీరామమూర్తి, శొంఠి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీసీకి హాజరైన కలెక్టర్, ఎస్పీ, జేసీ

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ బాలాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు తెలిపారు. ధాన్యం సేకరణ, గంజాయి వ్యసనాలపై అవగాహన, అన్న క్యాంటీన్లు, పారిశుద్ధ్యం, సానుకూల దృక్పథం తదితర అంశాలపై నిర్వహించిన వీసీకి కలెక్టరేట్ నుంచి వీసీకి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ నవీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ధాన్యం రవాణాకు 3,715 వాహనాలు వినియోగిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లతో పోలిస్తే ఇప్పటికే అత్యంత గరిష్ఠంగా 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు.

త్వరలో ఏడు ఏఈఆర్వో ఖాళీల భర్తీ.. జిల్లాలో ఖాళీగా ఉన్న ఏడు సహాయ ఓటర్ల నమోదు అధికారుల(ఏఈఆర్వో) పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేకానంద్‌కు తెలిపారు. ఎన్నికల ప్రధాన అధికారి గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీసీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెడన, మోపిదేవి, బంటుమిల్లి, కృత్తివెన్ను, కోడూరు, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో తహసీల్దార్లు లేరన్నారు. త్వరలో వాటిని భర్తీ చేస్తున్నట్లు చెప్పారు.

☛ **ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే మెగా పేరెంట్, టీచర్ సమావేశం..** డిసెంబరు 5న జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్‌కు తెలిపారు. శశిధర్ గురువారం కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మెగా సమావేశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈసారి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను కేవలం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.

స్వామికి వసంతోత్సవం

ఉభయ దేవేరులతో స్వామివారు

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కల్యాణోత్సవాల మూడో రోజైన గురువారం వసంతోత్సవం, అవభృథ స్నానోత్సవం వేడుకగా జరిపారు. అనంతరం ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు మహాపూర్ణాహుతి నిర్వహించారు. రావిపాటిపాలెం వరకు గ్రామోత్సవం జరిపించారు. భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వామి సేవలో ఉన్నతాధికారి

మోపిదేవి: ఉభయ తెలుగు రాష్ట్రాల ఇన్వెస్టిగేషన్ టెక్నాలజీ శాఖ అధికారిణి సి.కవిత గురువారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించారు. నాగపుట్టలో పాలుపోసి హారతులు సమర్పించారు. ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు స్వామి చిత్రపటం అందించారు.

కూచిపూడి నాట్యకళాపీఠంలో ప్రవేశాలు ప్రారంభం

కూచిపూడి, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీసిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళాపీఠంలో 2025 - 2026 విద్యాసంవత్సరానికి సంబంధించిన నాట్య ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీన వరకు 133మంది ప్రవేశదరఖాస్తులు అందించారు. అందులో ఎంపీఏ కూచిపూడినాట్యానికి 28, యక్షగానానికి 18, సాత్వికాభినయానికి 10, సర్టిఫికెట్ కోర్సుకు 47, డిప్లొమాకు 30మంది చొప్పున ఆన్‌లైన్‌లో దాఖలు చేశారు. సెంట్రల్ అడ్మిషన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ విద్యార్థుల దరఖాస్తులను, నాట్యాన్ని పరిశీలించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ నల్లగుళ్ల వెంకటేశ్వరరావు, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదాంతం వెంకటదుర్గాభవాని(సంగీతం), పసుమర్తి హరనాథశాస్త్రి(మృదంగం), గ్రంథాలయ పాలకుడు ఏలేశ్వరపు ఫణికుమార్ పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంలో కలెక్టర్ వివిధ సూచనలు చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు తక్షణమే ఇస్తున్నట్లు వివరించారు. పీఎం విశ్వకర్మయోజన, ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్(పీఎంఈజీపీ) పథకాలకు సంబంధించి దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేయడంతో పాటు యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ కింద వచ్చిన 120 దరఖాస్తుల్లో 30 మందికే రుణాలు మంజూరు చేశారని, వచ్చే సమావేశం నాటికి మిగిలిన అందరికీ ఇవ్వాలని సూచించారు. మౌలిక వసతుల కోసం లీగల్ మెట్రాలజీ వద్ద 18, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో 14, ఏపీఐఐసీలో 13, భూగర్భ జలశాఖలో 3 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడాన్ని ప్రశ్నించారు. జిల్లాలో 26 యూనిట్లకు రూ. 4.30 కోట్ల రాయితీలు మంజూరు చేసినట్టు చెప్పారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ వెంకట్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు సరిపడా ఇసుక అందించాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక కొరత లేకుండా వినియోగదారులకు సరిపడా లభించేలా చూడాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో నిర్మాణ అవసరాలకు ఇసుక కొరత రానీయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఇసుక స్టాక్ యార్డుల్లో నిల్వలు పెంచాలన్నారు. అనుమతులు ఉన్న రీచుల్లోనే సెమీ మెకనైజ్డ్ యంత్రాలతో తవ్వకాలు చేపట్టాలన్నారు. కృష్ణా నదికి వరదలు తగ్గిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా మరో నాలుగు రీచ్‌లు గుర్తించి టెండర్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని రీచుల్లో ప్రస్తుతం 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్టు గనులశాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ సత్యనారాయణ, గనులశాఖ ఏడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ కొండారెడ్డి, ఇరిగేషన్ కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సోమశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ, నవోదయలో పోస్టులకు దరఖాస్తులు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కేంద్రీయ విద్యాలయ సంఘటన్, నవోదయ విద్యాలయ సమితిలో 14,967 బోధన, బోధనేతర పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయ మచిలీపట్నం ప్రిన్సిపల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రీయ విద్యాలయ పరిధిలో 9126 పోస్టులు, నవోదయ విద్యాలయ సమితిలో 5841 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. కేవీఎస్, ఎన్వీఎస్ తరపున సీబీఎస్ఈ ఈ నియామకాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్స్, ప్రిన్సిపల్స్, వైస్‌ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీలు, ప్రాథమిక ఉపాధ్యాయులు, ప్రత్యేక విద్యా బోధకులు, లైబ్రేరియన్లు, వివిధ అడ్మినిస్ట్రేటివ్ పోస్టులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు బీఈడీ, సీటీయాటీ, ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఎంఈడీ విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు సీబీఎస్ఈ, కేవీఎస్, ఎన్వీఎస్ అధికారిక వెబ్‌సైట్ల నుంచే దరఖాస్తులను సమర్పించాలన్నారు.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే వర్ల

అధికారులు, రైతులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గురువారం మండలంలోని రాపర్లలో రైతన్నా మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో ఐదు విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఘంటసాల కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కె.గోపాలస్వామి మినుముపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏడీఏ బి.స్వర్ణలత, ఏవో వి.శివనాగరాణిలు ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. అనంతరం రైతన్నా మీకోసం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కాజ్‌వే మార్గం పునఃనిర్మాణానికి సాయం

గోవర్ధన్

పాతఎడ్లంక(అవనిగడ్డ గ్రామీణం): ఇటీవల వచ్చిన వరదలకు పాతఎడ్లంకకు గ్రామస్థులు రాకపోకలు సాగించే ప్రధాన కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి దాని పునఃనిర్మాణానికి ప్రవాసాంధ్రుడు, తెదేపా నాయకుడు బొబ్బా గోవర్ధన్ ముందుకు వచ్చారు. గురువారం తెదేపా నాయకులు పర్చూరి దుర్గాప్రసాద్‌తో కూడిన నేతలు గ్రామస్థులతో కలిసి పనులను ప్రారంభించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ౹కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

'అధికారుల లబ్ధి కోసమే అణగదొక్కుతున్నారు'

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: వెటర్నరీ అధికారులు తమ లబ్ధి కోసం పారా వెటర్నరీయన్లను అణగదొక్కుతున్నారని ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా ఛైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.వీరబాబు, కోఛైర్మన్ వై.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏపీ వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ వ్యాఖ్యలను ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 3వేలమందికి పైగా పారా వెటర్నరీయన్స్ గత 50 సంవత్సరాల నుంచి వివిధ హోదాల్లో శాఖ అభివృద్ధికి పని చేస్తున్నారని పేర్కొన్నారు.

జీవిత ఖైదీల విడుదల

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి ఇద్దరు జీవిత ఖైదీలు గురువారం విడుదలైనట్లు కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ ఓ ప్రకటనలో తెలిపారు. బిక్కవోలు మండలం కొమ్మరిపాలేనికి చెందిన కటికిరెడ్డి నాగేశ్వరరావు (68) 2011 మార్చిలో హత్య, నగదు దోపిడీ చేసిన కేసులో కేంద్ర కారాగారానికి వచ్చాడు. ఇతను 14 ఏళ్ల రెండు నెలల శిక్ష అనుభవించగా సుమారు ఆరేళ్ల కాలం శిక్ష సత్ప్రవర్తన కారణంగా తగ్గింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాలకు చెందిన మద్దూరి సువర్ణరాజు తన భార్యను చంపిన కేసులో 2010 జులైలో కారాగారానికి వచ్చాడు. 14 ఏళ్ల తొమ్మిది నెలల ఏడు రోజులు శిక్ష అనుభవించగా సత్ప్రవర్తన కింద ఆరేళ్ల శిక్ష తగ్గింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

వడ్లమన్నాడు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని వడ్లమన్నాడు వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన నాగబోయిన విజయలక్ష్మి(55) బుధవారం వడ్లమన్నాడులోని కుమార్తె ఇంటికి వచ్చి గురువారం తెల్లవారుజామున స్వగ్రామం వెళ్లేందుకై రైలు కోసం రైల్వేస్టేషన్‌కు బయలు దేరింది. అల్లుడు కొణతం శివకృష్ణ ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని వెళ్తుండగా సింగరాయపాలెం వెళ్తున్న రొయ్యల లారీ స్థానిక ఆస్పత్రి వద్ద పక్క నుంచి ఢీకొట్టింది. విజయలక్ష్మి లారీ వెనుక చక్రం కింద పడటంతో తలకు తీవ్రగాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్.ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

నన్ను వేధిస్తున్నారు: హోంగార్డు ఆవేదన

మచిలీపట్నం క్రైం, అవనిగడ్డ, న్యూస్‌టుడే: 'ఠాణా పరిధిలో రేషన్ బియ్యం, బెల్టు దుకాణాలు, జూద క్రీడలను అడ్డుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం నేను చేసిన తప్పా.. నేను దళితుడిగా పుట్టడం నేరమా? ఓ సామాజిక వర్గానికి చెందిన హోంగార్డు ఎస్సైలను సైతం బెదిరిస్తున్నారు. నేను తక్కువ సామాజిక వర్గానికి చెందినవాడినని వేధిస్తున్నారు. నేను నిజాయితీ పరుడినని చెప్పట్లేదు. హోంగార్డులుగా ఎక్కడ పనిచేసినా సులువుగా రూ.20వేలు సంపాదించుకుంటాం. అవనిగడ్డ సబ్ డివిజన్‌లో పోలీసు శాఖలో అక్రమాలు చేస్తున్నారు. కొందరు సహ ఉద్యోగులు వేధిస్తున్నారు' అంటూ ఓ హోంగార్డు (ప్రస్తుతం ఇనుకుదురుపేట ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రాజేశ్) సెల్ఫీ వీడియోలో పలు ఆరోపణలు చేశారు. మోపిదేవి ఠాణాలో మరో హోంగార్డు తనను వేధిస్తున్నాడని ఎస్పీకి వీడియో పెడుతున్నట్లు చెప్పుకొచ్చారు. తన ఆవేదనను ప్రజాప్రతినిధి.. అవనిగడ్డ డీఎస్పీకి చెప్పినా పట్టించుకోలేదన్నారు. 'గతంలో అవనిగడ్డ, మోపిదేవి, ప్రస్తుతం ఇనకుదురుపేట ఠాణాలో విధులు నిర్వహిస్తున్నాను. నాలుగు నెలల నుంచి ఇక్కడ కూడా వేధిస్తున్నారు. ఉన్నతాధికారి చెప్పిన విధులు నిర్వహిస్తున్నా.. సామాజికవర్గం పేరుతో.. వసూళ్లు చేస్తున్నావంటూ.. పలు అనుమానాలతో మరో హోంగార్డు వేధిస్తున్నారు' అని వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం -ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న హోంగార్డు సెల్ఫీ వీడియోపై సమగ్ర విచారణ చేస్తాం. విధి నిర్వహణలో తాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని.. సహ ఉద్యోగుల నుంచి వేధింపులు తట్టుకోలేక పోతున్నానంటూ వీడియోలో తెలిపారు. ఇది మా దృష్టికి రాగానే వెంటనే విచారణ చేయాలని సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ చేశాం. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

చికిత్స పొందుతూ వ్యవసాయ సహాయకుడు మృతి

సాయి కిరణ్ (పాతచిత్రం)

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉయ్యూరు మండలం గండిగుంట-1 సచివాలయంలో వ్యవసాయ సహాయకుడు ఉప్పటాల సాయి కిరణ్ (24) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. తిరువూరు మండలం రాజుపేట సొంత గ్రామం. తండ్రి బాల్యంలోనే చనిపోవడంతో తల్లి కూలీ పనులు చేసుకుంటూ చదివించారు. ఉద్యోగం చేస్తూ తనకు అండగా నిలుస్తున్న సమయంలో ప్రమాదం రూపంలో తమ కుమారుడు దూరం కావడం పై తల్లి నాగమణి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న సాయికిరణ్ మృతిపై గండిగుంట గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైకాపా నేత కొండారెడ్డికి రిమాండ్

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో విశాఖపట్నం నగరానికి చెందిన వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డికి ఎంఎస్‌జే కోర్టు రిమాండ్ విధించింది. డ్రగ్స్ కేసులో అరెస్టు అయి విశాఖలో రిమాండ్‌లో ఉన్న నిందితుడిని మాచవరం పోలీసులు గురువారం పీటీ వారెంట్‌పై విజయవాడలోని ఎంఎస్‌జే కోర్టులో హాజరుపరిచారు. కొండారెడ్డికి డిసెంబరు 5 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి సత్యానంద్ ఉత్తర్వులిచ్చారు. అనంతరం రిమాండ్ నిమిత్తం విశాఖలోని కేంద్ర కారాగారానికి తరలించారు.

ముగ్గురి ముందస్తు బెయిళ్లు డిస్మిస్

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల ముందస్తు బెయిళ్లను కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో పరారీలో ఉన్న తేలప్రోలు రాము, యర్రంశెట్టి రామాంజనేయులు, వజ్రకుమార్‌లు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై గత వారం విచారణ ముగిసింది. వీటిపై గురువారం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో వీరి పాత్ర ఉందనీ, వీరిని విచారించాల్సి ఉందనీ, ముందస్తు బెయిళ్లను తిరస్కరించాలనే ప్రాసిక్యూషన్ వాదనలతో న్యాయాధికారి ఏకీభవిస్తూ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

In Memory of the Diamond Jubilee of
LOYOLA PUBLIC SCHOOL, Nallapadu, Guntur and following the Legacy of St.Ignatius' Pedagogy in Education, as a Token of Love and Gratitude.
Hearty Welcome to Alumni of Loyola Public School on
29-11-2025, SATURDAY at 4.30 P.M. GOD BLESS US!
loyolapublicschool.lps@gmail.com
☎ : 91216 06671
Management

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూపు, VJA, వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/పంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 96767 01122, 97047 41122

REAL ESTATE

రాజధాని అమరావతిలో గజం 5000/- & 10000/- రాజధానిలో ఎకరం పొలం 70 లక్షలు, గుంటూరులో డూప్లెక్స్ విల్లా 1.60 Cr. Ph: 90523 45356.

FLAT FOR SALE

కాసా TVS, అశోక్‌నగర్ బందరు రోడ్డుకి ప్రక్కన నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 76800 70510.

TADIGADAPA

తాడిగడప బస్సు రోడ్డును అనుకొని WF 2 ఫ్లోర్ నెలకు 20,000 అద్దెవచ్చు 3 BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర. PH No- 83099 39009.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

RAMAVARAPPADU

FLAT FOR SALE
✔ 363 SQYRDS
✔ 65 UDS FOR EACH FLOOR
✔ 5 FLOORS
✔ 4BHK EACH FLOOR
✔ 2500 SQRFT EACH FLOOR TOTAL
✔ PLINT 2100 SQRFT EACH FLOOR
✔ 10 CAR PARKS TOTAL
✔ 2 FOR EACH FLAT
✔ PRICE : 4500/- PER SFT. (SLIGHTLY NEGOTIABLE)
✔ BRAND NEW LUXURY HIGH QUALITY CONSTRUCTION AT A VERY AFFORDABLE PRICE
✔ READY TO OCCUPY
Contact : 8333911102 8712123344, 9390311148
Ramvarapadu Inner Ring Road, Back Side of Innotel, Opp. Raguram Steels

PLOT FOR SALE

5999/- to 13999/- వెస్ట్‌బైపాస్‌కి 1Km అంబాపురం K తాడేపల్లి G కొండూరు గన్నవరం కంకిపాడు బందరురోడ్‌లో 2/3BHK విల్లాస్ ✆ 83749 36634

TO LET

3BHK Flat for Rent with Good ventilation. 4th Floor Krishna Estates Apart. Srinivasanagar Bank Colony VJA ✆ 70322 18743

కుంచనపల్లిలో, మారుతి రెసిడెన్సీ నందు, 5వ ఫ్లోర్‌లో,తూర్పు ఫేసింగ్‌తో 2బెడ్‌రూమ్, విశాలవంతమైన హాలు, పూజరూమ్, కార్‌పార్కింగ్‌తో అద్దెకు కలదు. ఫ్యామిలీకి/ ఉద్యోగస్తులకు ప్రాధాన్యత. ✆ 98494 97403

JOBS

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama & Vijayawada and Car Drivers. ✆ 94324 54545.

మచిలీపట్నం బైపాస్‌రోడ్‌లోని కృష్ణవేణి ITI కాలేజ్‌లో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ చదివినవారు కావలెను. కాలేజీ ఆవరణలో ఉచితవసతి. ✆ 98486 79360

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆ 70320 60786

ప్రముఖ కార్పొరేట్ కంపెనీలో 15,000/- జీతం+ ఇన్సెంటివ్స్ మరియు 50K నుండి లక్ష రూపాయలు సంపాదన కావలసినవారు సంప్ర|| ✆ 94929 74872.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. A:25-30Y, Sal:18-25K Qul డిగ్రీ ✆ 99495 58181, 81215 58181

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆ 96402 58899, 96404 68899

FACULTY/ TEACHERS

WANTED: Principal To Run the School, Qul: PG+ B.Ed., need Sy. Experience, Salary: 40 to 50K, Cont: Buchi Reddy Palem Nellore (Dt.) ✆ 94401 22213.

Wanted English, Social, PS & Computer Teachers. Cont: Kommareddy (EM) High School, Bantumilli, Krishna Dist. ✆ 98480 63355.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

అనర్గళ ఉపన్యాసం.. అద్వితీయ విజయం..

విజేతలతో వైస్‌ఛైర్మన్, ఉపాధ్యాయులు

పోటీల్లో విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట): విద్యార్థులు ఏ పోటీలు నిర్వహించినా పాల్గొనడం అలవర్చుకుంటే మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడతాయని నగరంలోని ఇకె బాలికల విద్యాలయ వైస్ ఛైర్మన్ ఎల్.రమేష్ అన్నారు. ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించగా వివిధ తరగతుల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో బి.బాంధవీస్నిగ్ధ (9వ తరగతి), ఎం.హరిప్రియ(8వ తరగతి), వై.జ్యోత్స్నప్రియ (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు వైస్ ఛైర్మన్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ సాయిపంకీర్త, ఉపాధ్యాయులు ఎండీ అబ్బుల్, పి.శ్రీనివాస్, కె.ఫణికుమార్ తదితరులు బహుమతులు అందజేశారు. విద్యాలయ ఛైర్మన్ సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు విజేతలకు అభినందనలు తెలిపారు. ఈనాడు సంస్థలు విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.

ధర వరలు

టమాట 53, వంగ 24, బెండ 36, పచ్చిమిర్చి 40, కాకర 36, క్యాబేజీ 26, క్యారెట్ 64, దొండ 32, బంగాళదుంప 31, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 50, దోస 28, సొర 20, అరటికాయ 7.6, చిక్కుళ్లు 95, బీర 30, చామదుంప 26, మునగ 20/18, కంద 42, బీట్‌రూట్ 44, కీరదోస 30, బీన్స్ 65, క్యాప్సికం 80, అల్లం 60, చిలకడదుంప 40, కొత్తిమీర 22/11, పుదీనా 20/15. శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

సినిమాలు

రేవతి: రివాల్వర్ రీటా
మినీరేవతి: ప్రేమంటే
సిరికృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి
సిరివెంకట్: ఆంధ్రా కింగ్ తాలూకా
-న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందన వందనం

✦ నగరంలోని బొజ్జిపేటలో రోడ్డు పక్కన వేసిన చెత్తను తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యను స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ✦ నగరంలోని రాజుపేటలో రహదారి పక్కన అంతర్గత డ్రెయిన్‌లో వ్యర్థాలు మేట వేసుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. -న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

పకడ్బందీగా పారిశుద్ధ్య చర్యలు

పెడన, న్యూస్‌టుడే: పైడమ్మ తల్లి ఉత్సవాల్లో పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎండీ ఖాజా అలీ కోరారు. డిసెంబరు 4 నుంచి 14 వరకు 1వ వార్డులోని అమ్మవారి ఆలయం వద్ద జరుగనున్న ఈ ఉత్సవాలకు భక్తులు వేలాదిగా హాజరుకానున్న నేపథ్యంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఉత్సవాలకు అదనపు కార్మికుల్ని తాత్కాలికంగా నియమిస్తామని కౌన్సిలర్ కటకం ప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీ కిషోర్, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అరుదైన అవకాశం.. అందుకుంటేనే ఫలితం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

నగరంతో పాటు పెడన ప్రాంతాల్లో ఉన్న అనధికార లేఅవుట్లలో స్థలాలను అవగాహన లేక కొనుగోలు చేసినవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఈ సమస్యలను గుర్తించిన కూటమి ప్రభుత్వం వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఇచ్చింది. చాలా తక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో గడువును పొడిగించడంతో పాటు నిబంధనలను సడలించారు. అక్రమ లేఅవుట్లలో నిర్మించిన భవనాలను కూడా క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై నగరవాసులకు అవగాహన కల్పించేలా అధికారులు కార్యాచరణ చేపట్టారు.

బందరు నగరం

300కు పైగా దరఖాస్తులు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో బందరు, పెడన నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేశారు. వీరికి నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ముడ అధికారులు, సిబ్బంది, పోలీసులు వెళ్లి యంత్రాల సాయంతో ఆ లేఅవుట్లను ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. అలాంటివి ఆయా ప్రాంతాల్లో చాలాచోట్ల ఉన్నాయి. కేవలం బందరు నగర పరిధిలోనే 40 వరకు అనధికార లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిల్లో స్థలాలు కొనుగోలు చేసిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. వాటి అనుమతుల కోసం ఎన్ని తిరిగినా ఇబ్బందులు పడుతున్నారు. వారందరికీ ఇది మంచి అవకాశం. ఇప్పటివరకు నగర వ్యాప్తంగా 300కు పైగా దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి 40 వరకు ఆమోదం తెలిపినట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అక్రమ లేఅవుట్ల యజమానులు సర్వేయర్లు, లైసెన్స్‌డ్ ఇంజినీర్లతో ప్లాన్లు తయారు చేయించుకుని నిర్దేశించిన అపరాధ రుసుములో 50 శాతం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్థలం కొనుగోలు చేసి వారు వ్యక్తిగతంగా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సిబ్బంది తనిఖీ ప్రక్రియ పూర్తిచేసిన తరువాత మిగిలిన 50శాతంతో పాటు 14శాతం ఖాళీ స్థల ఖరీదు చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు.

ప్లానుకు విరుద్ధంగా నిర్మించినా..

అనధికారికంగా నిర్మించిన భవనాలతో పాటు తీసుకున్న ప్లానుకు విరుద్ధంగా చేపట్టిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నగర వ్యాప్తంగా అలాంటివి 450 నుంచి 500 వరకు ఉంటాయన్నది అధికారుల అంచనా. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోవడానికి వచ్చే ఏడాది జనవరి 23 వరకు, నిబంధనలను విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు మార్చి 17వరకు గడువు ఉంది. ఎవరికివారు స్పందించి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

చెక్కు అందజేస్తున్న వేదవ్యాస్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

గూడూరు: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గండ్రం గ్రామానికి చెందిన గుడివాడ హనుమకుమారి ఇటీవల ఖరీదైన శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఆయన సీఎం సహాయనిధికి సిఫార్సు చేయించగా ప్రభుత్వం రూ.4,28,785 విడుదల చేయగా ఆ మొత్తాన్ని చెక్కురూపంలో అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ వెంకట్రావు, నాయకులు ముద్దినేని వెంకటేశ్వరరావు(కొండ), పడవల మోహన్‌త్రినాథ్ పాల్గొన్నారు.

'వైకాపా పాలనలో అవినీతిపై విచారణ జరపాలి'

భాస్కరపురం (మచిలీపట్నం): తిరుమలలో వైకాపా పాలనలో జరిగిన అవినీతిపై జగన్మోహన్ రెడ్డి, ఆయన బంధువులపై విచారణ జరపాలని తెదేపా సీనియన్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ డిమాండ్ చేశారు. గురువారం సిడింబి అగ్రహారంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు సిట్ విచారణలో తేలిందన్నారు. వైకాపా నాయకులు శ్రీవారి ప్రసాదాలు, ఆస్తులు, నిర్మాణాల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తితిదే మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి తాజాగా పరకామణి కేసులో సిట్ విచారణకు హాజరుకావడం, వై.వి.సుబ్బారెడ్డి కల్తీ నెయ్యి వ్యవహారంలో సిట్ ఎదుట హాజరుకావటాన్ని ప్రస్తావించారు. సమావేశంలో తెదేపా నాయకుడు పడమట నాగరాజు పాల్గొన్నారు.

అన్నదాతల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

గూడూరు, న్యూస్‌టుడే: అన్నదాతలను అన్నివిధాలుగా ఆదుకుని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. గురువారం కంచాకోడూరు గ్రామంలో నిర్వహించిన రైతన్నా నీకోసం కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రైతులకు డ్రోన్‌లను కూడా రాయితీపై అందిస్తున్నందున వినియోగించుకోవాలన్నారు. డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, సర్పంచి కోళ్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత, కొనకళ్ల తదితరులు

సీతారామపురం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని గురువారం సీతారామపురంలో నిర్వహించారు. మచిలీపట్నం మండల తెదేపా అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు సాంకేతికత గురించి రైతులకు వివరిస్తారని, డ్రోన్ల వినియోగాన్ని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. ఏ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉందో తెలుసుకోవడం రైతు బాధ్యతన్నారు. కార్యక్రమంలో సీతారామపురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఈడే రాంబాబు, గ్రామ తెదేపా అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వరరావు, మురారి శ్రీను, పామర్తి కృష్ణ, ఎం.నాగప్రసాద్, పామర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై రైతుకు వివరిస్తున్న వెంకటేశ్వరరావు

దారిలో గొయ్యి..చూసి అడుగెయ్యి

నగరంలోని జిల్లా గ్రంథాలయ సమీపంలో రోడ్డు పక్కన తవ్విన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఓ టెలీకాం సంస్థకు సంబంధించిన కేబుల్ వైర్లు ఏర్పాటు చేసేందుకు తవ్విన గుంతలు పనులు చేసిన అనంతరం పూడ్చడంలో అలసత్వం ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

రోడ్డుపై డ్రెయిన్ వ్యర్థాల కుమ్మరింత

నందమూరు-జింజేరు పంచాయతీరాజ్ రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నందమూరుకు సమీపంలో ఒక మాజీ ప్రజాప్రతినిధి చెరువుల కోసం రోడ్డును ఆక్రమించి డ్రెయిన్ తవ్వుతున్నారు. ఈ తవ్వకాల్లో వచ్చిన బురదను రోడ్డుపై డంప్ చేస్తున్నారు. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ రహదారికి ఇరువైపులా చిననందమూరు, పెద నందమూరు, జింజేరు, గౌడపాలెం, అచ్చయ్యవారిపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. దీనిపై మండల పరిషత్తు ఏఈ ధర్మయ్య స్పందిస్తూ రహదారిపై వ్యర్థాలు వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. - న్యూస్‌టుడే, పెడన

నిర్మించారు.. వదిలేశారు

మచిలీపట్నం పాతరైల్వేస్టేషన్ సమీపంలో ఉల్లింగిపాలెం వెళ్లే రహదారి పక్కన ఉన్న సామూహిక మరుగుదొడ్డి అలంకారప్రాయంగా మారింది. రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులతో పాటు స్థానికులకు ఉపయోగంగా ఉంటుందన్న ఉద్దేశంతో తెదేపా హయాంలోనే దీనిని నిర్మించారు. ప్రారంభంలో సిబ్బందిని నియమించి పర్యవేక్షించినా తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి దానిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

విస్తరించేదెప్పుడో..తొలగించేదెన్నడో?

నగరంలోని పోర్టురోడ్డు విస్తరణలో జరుగుతున్న జాప్యం కారణంగా నగరవాసులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సగం మేర విస్తరించి వదిలేశారు. ఆ సమయంలో రహదారుల మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. బాలసాయి డిగ్రీ కళాశాల సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
-మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టు

రోడ్డు మధ్యలో స్తంభం

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు, పాల్గొన్న అతిథులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని జగన్నాథపురంలో సుభద్ర బలరామసమేత జగన్నాథస్వామి ఆలయ ధర్మకర్త మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్‌గా గంపల దుర్గాభవాని, సభ్యులుగా దేవగుప్తాపు సత్యవాణి, అడపాల సత్యకుమారి, కూతాడి జయలక్ష్మి, బత్రాజు వెంకట మహాలక్ష్మి, ముత్యాలపల్లి సత్యనారాయణ, కాజా ఫణీంద్ర, బత్తిన అగస్తేశ్వరరావు, తంగిరాల మిథున్వ్యాస్, బృందావన సుధీర్‌బాబుతో ఆలయ ఈవో మాధవీలత ప్రమాణ స్వీకారం చేయించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్ తోట భవానీ, పలు ఆలయాల ఛైర్మన్లు లంకిశెట్టి నీరజ, దేవనూరి వీరబాబు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, కూటమి నాయకులు మరకాని పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తెరిచేదెలా.. పాఠకులు వచ్చేదెలా?

న్యూస్‌టుడే, బంటుమిల్లి

బంటుమిల్లిలోని గ్రంథాలయం గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. సరైన నిర్వాహకుడిని ఉన్నతాధికారులు కేటాయించకపోవడంతో రోజుల తరబడి తెరుచుకోని పరిస్థితి నెలకొంది. నవంబరు నెలలో ఒక్క రోజు మాత్రమే పాఠకుల హాజరు రికార్డులో నమోదవడం గమనార్హం. అందులోనూ గ్రంథాలయ స్వీపర్ సంతకమే మూడు నాలుగు సార్లు ఉంది.

రోజూ 8గంటలకు తెరవక..: విశ్రాంత ఉద్యోగులు, పలువురు వృద్ధులు ఉదయం రోజూ వార్తా పత్రికలు చదవడానికి వస్తారు. శుక్రవారం మినహా రోజూ ఉదయం 8 గంటలకు గ్రంథాలయం తేరుచుకోవాలి. కానీ ఆవిధంగా తెరుచుకోవడం లేదు. మండల కేంద్రంలో అసలు ఇది ఉందా అనే పరిస్థితి నెలకొంది. ఈ నెలలో గంధ్రాలయ వారోత్సవాలు కూడా ఇక్కడ జరిగాయా అన ప్రశ్న నెలకొంది.

పాఠకులు లేక ఖాళీగా..

తెరుచుకోని గ్రంథాలయం

ఒత్తిడిని అధిగమించడంతో పాటు మానసిక ప్రశాంతతకి పుస్తక పఠనం ఎంతో ఉపకరిస్తుంది. నిర్వాహకుడు పూర్తిగా అందుబాటులో ఉంటే యువత, విద్యార్థులు, మహిళలకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. ప్రస్తుతం అద్దె భవనంలో గ్రంథాలయం నడుస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు దీనిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంది. పూర్తి స్థాయిలో తెరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మచిలీపట్నం (గొడుగుపేట): ఇంటాక్ మచిలీపట్నంశాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని నాగార్జున హైస్కూల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభచాటుకున్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ కన్వీనర్ డా.శ్రీనివాసరావు, ప్రతినిధులు సయ్యద్‌పీర్, శేషు, దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు అగ్నిప్రమాదంలో రూ.18 లక్షల ఆస్తి నష్టం

గుడివాడ: గుడివాడ బైపాస్ రోడ్డులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వలివర్తిపాడు శాఖలో ఈనెల 25న జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.18 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బ్రాంచి మేనేజర్ వై.భాగ్యరేఖ గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో విద్యుదాఘాతం వలన జరిగిన ఈ ప్రమాదంలో కంప్యూటర్లు, తదితర సామగ్రి దగ్ధం కావడంతో ఈ నష్టం జరిగిందని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై పరస్పర కేసులు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ముఖ్య కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి సంబంధించి అనుచిత వ్యాఖ్యలపై చిలకలపూడి స్టేషన్‌లో పరస్పర కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. రాజ్యాంగ దినోత్సవ ఫ్లెక్సీపై వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ ఓ వర్గం మనోభావాలు దెబ్బతినే విధంగా నగరానికి చెందిన ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టింగులు పెట్టాడంటూ సంఘ నాయకులు చిలకలపూడి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్లెక్సీపై ఫొటోలు వేయించుకున్న వారిపైనా కేసు నమోదు చేశారు.

వృద్ధురాలిపై దాడి.. చోరీ కేసులో నిందితుని అరెస్ట్

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ఓ వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో గొలుసు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇనగుదురుపేట స్టేషన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సీఐ పరమేశ్వరరావు వివరాలు వెల్లడించారు. శివగంగ ప్రాంతానికి చెందిన వృద్ధురాలైన కృష్ణవేణి 25న తెల్లవారుజామున 4 గంటల సమయంలో తాను పనిచేస్తున్న హోటల్‌కు వెళ్లేందుకు ఖాళీగా వెళ్తున్న ఆటో ఎక్కింది. దగ్గర దారిలో తీసుకెళ్తానంటూ నిర్మానుష్యంగా ఉండే పాత బైపాస్ రోడ్డులోకి తీసుకువెళ్లిన ఆటో డ్రైవర్ ఆమె తలపై ఇనుపరాడ్‌తో కొట్టి మెడలోని బంగారు గొలుసు చేజిక్కించుకుని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 24 గంటల వ్యవధిలోనే సీసీ ఫుటేజీ ఆధారాలతో నిందితుడైన ఆటోడ్రైవర్ వీరంకి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

డిసెంబరు ఒకటి నుంచి కోటిపారాయణ సప్తాహ మహాయజ్ఞం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బాబాప్రసాద్, అర్చకులు, భక్తులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని చింతగుంటపాలెం నాగేశ్వరస్వామి ఆలయంలో డిసెంబరు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు శ్రీ లలితా సహస్ర నామ కోటి పారాయణ సప్తాహ మహాయజ్ఞం జరుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్యక్రమ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవంలో రోజూ లలితాసహస్రనామ కోటి పారాయణ జరుగుతుందని, 6వ తేదీ సాయంత్రం శాంతి కల్యాణం, 7వ తేదీ లలితాసహస్రహోమం, రుద్రహోమం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు చేబ్రోలు మురళీమనోహర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోశాల శంకుస్థాపన మహోత్సవం

హాజరైన పురప్రజలు

పెడన, న్యూస్‌టుడే: హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెడనలో చేపట్టిన గోశాలకు గురువారం ఉదయం శంకుస్థాపన జరిగింది. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయం పక్కగా దాతల సౌజన్యంతో చేపట్టిన ఈ గోశాల నిర్మాణానికి పురప్రముఖులు శింగరాజు శ్రీనివాసరావు, ధరిత్రి దంపతులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు, నాదెళ్ల తరుణ్య, తోట లక్ష్మీనారాయణ, లింగం లక్ష్మీ నరసింహ, నందం హరినాథ్, తోట హరిబాబు తదితరులు పాల్గొన్నారు. గోశాల నిర్మాణానికి శ్రీనివాసరావు దంపతులు పదిసెంట్ల స్థలాన్ని విరాళంగా అందజేశారు. గోశాలను త్వరితగతిన అందుబాటులోకి తెస్తామని ఐక్యవేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

పొలాల్లోకి వెళ్లిన నీరు

ఉధృతంగా ప్రవాహం.. రైతుల్లో కలవరం

పెడన, బంటుమిల్లి: బంటుమిల్లి ప్రధాన కాలువ(బీఎంసీ)లో బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో రైతులు కలవరం చెందారు. ఈ కాలువలో అత్యధికంగా 600 క్యూసెక్కుల వరకు ప్రవాహ స్థాయి ఉంటుంది. ఆ స్థాయిని దాటి 700 వరకు వెళ్లడంతో బంటుమిల్లి మండలం సాతులూరు బంగ్లా వద్ద కాలువ గట్టు పైనుంచి నీరు ప్రవహించి సరిహద్దు వరి పొలాల్లోకి ప్రవేశించింది. అప్రమత్తమైన రైతులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఈ కాలువ గుడ్లవల్లేరు మండలం కౌతవరం నుంచి ప్రారంభమై కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం వరకు దాదాపు 65 కి.మీ ప్రవహిస్తుంది. లక్ష ఎకరాలు సాగులో ఉంది. పామర్రు మండలం బల్లిపర్రు లాకుల నుంచి వచ్చిన నీటి ప్రవాహం కౌతవరం, కమలాపురం లాకులు దాటి బంటుమిల్లి మండలం వరకు చేరుకుంది. నీటి ప్రవాహాన్ని అదుపులోకి తీసుకొచ్చి రైతులకు నష్టం జరగకుండా చూశామని నీటిపారుదలశాఖ బంటుమిల్లి సెక్షన్ ఏఈ రాజ్యలక్ష్మీ చెప్పారు. కమలాపురం లాకుల నుంచి కొంత నీటిని బీఎండీ కాలువలోకి మళ్లించారు. నీటి ప్రవాహం ఒక్కసారిగా రావడానికి దారితీసిన కారణాలు తెలియాల్సి ఉంది.

రహదారి నాణ్యత పరిశీలన

పెడన: పెడన మండలం నడుపూరు-ఆర్వేపల్లి గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డు నాణ్యత ప్రమాణాలను పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ దుర్గాభవానీ గురువారం పరిశీలించారు. ఈ రహదారిని జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.1.32కోట్లతో 2.7కి.మీ పొడవున నిర్మించారు. నాణ్యత పరిశీలనలో భాగంగా రహదారి నమూనాలను సేకరించిన అధికారులు విజయవాడలోని క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నమూనాలు సేకరిస్తున్న అధికారులు

రెవెన్యూ అధికారులూ సమయపాలన పాటించండి

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఆర్వో కె.చంద్రశేఖరరావు అన్నారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. తహసీల్దారు లక్కాప్రగడ శశికుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు

క్లీన్ అండ్ గ్రీన్‌తో స్వచ్ఛాంధ్రప్రదేశ్

చినగొల్లపాలెం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగును మరింత మెరుగుపర్చాలని మండల తెదేపా అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు పేర్కొన్నారు. గురువారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పండ్లమొక్కలు, పూలమొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా ప్రధాన కార్యదర్శి యాదవరెడ్డి, శ్రీనివాసరావు (కొండ), సూరగాని బ్రహ్మం, కొక్కిలిగడ్డ పరమేశ్వరరావు, తిరుమాని బలరాముడు, దుర్గాప్రసాద్, బాలరాజు, రాముడు, వెంకటేశ్వర్లు, శామ్యూల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న చెన్నకేశవరావు, నాయకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు IDBI బ్యాంకు లిమిటెడ్ పోరంకి బ్రాంచి మేనేజరుగారి సంజాయిషీ మేర యిచ్చు ప్రకటన ఏమనగా మచిలీపట్నం టౌన్, ఇంగ్లీషుపాలెం కాపురస్తులు అబ్దుల్ జావిద్ S/o బషీర్ అహ్మద్ గారు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటు బ్యాంకు నందు కుదవపెట్టుకొని ఋణము పొందుటకు గాను అర్జీ పెట్టుకొనియున్నారు. సదరు అబ్దుల్ జావిద్ గారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మచిలీపట్నం టౌన్, రాజుపేట కాపురస్తులు 1) నూకల లక్ష్మీ నాగసాయి సందీప్, S/o సురేష్, మచిలీపట్నం, ఈడేపల్లి కాపురస్తులు 2) మాదాసు నాగబాలాజీ, S/o సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం టౌన్ కాపురస్తులు 3) వినుకొండ నాగవెంకట అనిల్‌కుమార్, S/o వెంకటేశ్వరరావు, మచిలీపట్నం, మాచవరం కాపురస్తులు 4) అగస్త్య మారుతీకృష్ణ ప్రసాద్, S/o వెంకటేశ్వరరావు, విజయవాడ అర్బన్, కృష్ణలంక కాపురస్తులు 5) బెల్లపు లక్ష్మణ్‌కుమార్ S/o వెంకటస్వామి, చల్లపల్లి మండలం, పెదప్రోలు గ్రామ కాపురస్తులు 6) శ్రీమతి యడ్లపల్లి ధనలక్ష్మి, W/o సాంబశివరావు, హైదరాబాద్ ముషీరాబాద్ కాపురస్తులు 7) శ్రీమతి కప్పెర విజయవాణి, W/o వెంకటనరసింహారావు, మచిలీపట్నం, వలందపాలెం కాపురస్తులు 8) కేసన బాలసాయినాథ్, S/o లక్ష్మీప్రసాద్, మచిలీపట్నం, వలందపాలెం కాపురస్తులు 9) కేసన కీర్తిశ్రీ, D/o లక్ష్మీప్రసాద్ మరియు మచిలీపట్నం, రాజుపేట కాపురస్తులు 10) శ్రీమతి నూకల సీతామహాలక్ష్మి, W/o (లేటు) పాండురంగారావు గార్ల వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలుచేయు నిమిత్తమై ఒప్పందం కుదుర్చుకొనియున్నారు.

పై వారలు సదరు ఆస్తిని క్రయ దస్తావేజు నెం. 24017/2024, 24019/2024, 24020/2024, 24021/2024, 24023/2024ర్లుగా పొందిన దస్తావేజులలో తెల్పిన O.S. నెంబర్లు, లోక్ అదాలత్ అవార్డు నెంబర్లు తప్పుగా వ్రాయబడినందున ది. 20-11-2025న సవరణ దస్తావేజు నెం. 9241/2025, 9242/2025, 9243/2025, 9244/2025, 9245/2025ర్లుగా మరియు O.S. నెం.39/2024, 81/2024, 43/2024ర్లుగా, లోక్‌అదాలత్ కేసు నెం. 602/2024, 599/2024, 553/2024ర్లుగా సవరణ కాబడిన అట్టి ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన లావాదేవీలు గానీ, వారసత్వపు హక్కులుగానీ వున్న యెడల 7 రోజులలోపు వ్రాతపూర్వక ఆధారములతో తెలుపగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు పరిగణలోకి తీసుకొనబడవు.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం స.రి.వారి యిలాకా, మచిలీపట్నం టౌన్, మాచవరం, R.S. నెం. 180/2, మున్సిపల్ వార్డు 15, డోర్ నెం. 15/337-A రు గల చ.గ. 3222.18లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు: తూర్పు: సాధు గాంధీ లేఅవుటు పార్కు స్థలం వైపు ఈ ఆస్తి ప్రహరీగోడ, దక్షిణం: అ. 30లు వెడల్పు రోడ్డు వైపు ఈ ఆస్తి ప్రహరీగోడ, పడమర: కుంచె లక్ష్మీ వగైరాల స్థలం వైపు ఈ ఆస్తి ప్రహరీగోడ, ఉత్తరం: సాధు గాంధీగారి స్థలం వైపు ఈ ఆస్తి ప్రహరీగోడ.

పసుమర్తి సూర్యప్రకాష్
అడ్వకేట్, గొడుగుపేట,
మచిలీపట్నం, సెల్: 98661 27503.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రతిభకు ప్రోత్సాహం

దావాజీగూడెం జడ్పీ పాఠశాలలో..

పెద్దఅవుటపల్లి జడ్పీ పాఠశాలలో విజేతలతో విజయలక్ష్మి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం దావాజీగూడెం, ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్‌ఎల్.శ్రీమన్నారాయణ, పి.అక్షయ, వి.తేజశ్రీ.. బి.మురగన్, బి.షారోన్, వి.నాగమణికంఠ నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు ప్రేమావతి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు.

పోరంకి, న్యూస్‌టుడే : పోరంకి శ్రీకృష్ణవేణి జూనియర్ కాలేజీలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన శ్రావ్యలత, గాయత్రి, అభిరాంరెడ్డిలకు ప్రిన్సిపల్ వి.భూలక్ష్మి, స్వాతి, దివ్యప్రసన్న బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

బహుమతులు అందుకున్న వారితో ప్రిన్సిపల్ భూలక్ష్మి తదితరులు

మాతృవందనం.. గర్భిణులకు వరం..

ఉయ్యూరు, న్యూస్‌టుడే

గర్భిణులకు 'ప్రధాన మంత్రి మాతృ వందన యోజన' ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అర్హులైన గర్భిణులు తమ వివరాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకుంటే ఈ పథకం అందుతుంది. దీని ద్వారా మొదటి ప్రసవానికి రూ.5 వేలు, రెండో ప్రసవానికి రూ.6 వేలు అందిస్తారు. గర్భిణులకు విడతల వారీగా ఆర్థిక సాయం అందించడంతో పాటు గర్భిణులు ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహార వస్తువులు సైతం అందిస్తారు. తగిన ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకుంటారు. గర్భిణుల పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు నిరంతర పర్యవేక్షిస్తారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉయ్యూరు పట్టణ సెక్టార్‌లో..

సెప్టెంబరు 2025 నుంచి ఇప్పటి వరకు వివరాలు

అంగన్‌వాడీల సంఖ్య	34
మొదటి కాన్పు	58
రెండో కాన్పు	26

అంగన్‌వాడీలకు బాధ్యతలు: ☛ పీఎం మాతృ వందనం యోజనకు సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపు, ఎంపిక ప్రక్రియను గతంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించేది. తాజాగా ఈ బాధ్యతలను ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు ప్రభుత్వం అప్పగించింది. గత లబ్ధిదారుల నమోదు.. అర్హులైన వారిని గుర్తించే బాధ్యత స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకుంటారు. ఉయ్యూరు పురపాలిక సంఘం పరిధిలో ప్రస్తుతం 84 మంది ఈ పథకంలో ఉన్నారు. ☛ గర్భిణిగా నమోదైన 5 నెలల లోపు రూ.2 వేలు, అన్ని రకాల టీకాలు వేసుకుంటూ సరైన పరీక్షలు చేయించుకుంటే 9 నెలల లోపు మరో రూ.2 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవమైతే రూ.1 వెయ్యి అందిస్తారు. ☛ రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం రూ.6 వేలు బాలింత ఖాతాలో జమ చేస్తారు.

ఎంపిక చేసిన వారికే గుర్తింపు: గర్భిణులకు 18 ఏళ్ల ఏడు నెలలు నిండితేనే మాతృ వందనం పథకం ఆర్థిక సాయం పొందేందుకు అర్హులని ఉయ్యూరు అర్బన్ సెక్టార్ పర్యవేక్షకురాలు రాఘవమ్మ తెలిపారు. అర్హులు బ్యాంకు ఖాతాలు తీసుకొని దానికి ఆధార్, ఫోను నంబర్లు లింక్ చేయాలి చెప్పారు. స్థానిక రేషన్ కార్డులో, పోషణ్ ఖాతాలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

రైతులు వాణిజ్య పంటలు పండించాలి

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే : రైతులు ఆహార పంటలతోపాటు వాణిజ్య పంటలు కూడా పండించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. గురువారం తాడిగడప పొలాల్లో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి 'రైతన్నా మీకోసం' కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా అంతర పంటలు బీర, అరటి పంట దిగుబడులను ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన ప్రభుత్వ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడేప్రసాద్, అధికారులు

విద్యుత్తు ఉండని ప్రాంతాలు నేడు

రామవరప్పాడు, న్యూస్‌టుడే : విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ఎనికేపాడు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 మధ్య ఎనికేపాడులోని డీమార్ట్ పరిసర ప్రాంతాలు, కొడాలి వారి వీధి.. ప్రసాదంపాడులోని ఎస్‌ఆర్ సెంటర్, ఆత్మకూరు బజార్, ఎన్టీఆర్ విగ్రహం వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పరమేశ్వర్ గురువారం తెలిపారు.

పోరంకి, న్యూస్‌టుడే : పోరంకి సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్ధిఖ్‌నగర్, కట్టరోడ్డు, బందరు రోడ్డు, ఏవీఎం గార్డెన్సు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్తు మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

నున్న, న్యూస్‌టుడే : ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ 57వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ- సూరంపల్లి గ్రామంలో ఏరీస్ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. విజయవాడ ఫ్యాక్టరీలో 200 మందికి పైగా స్థానికులకు అన్నదానం చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాల్లో ఏరీస్ సంస్థ వారు రైతు సదస్సులు నిర్వహించారు. వాతావరణంలోని మార్పులతో పంటల్లో వచ్చే సమస్యలను, ఏరీస్ ఉత్పాదనల ప్రాముఖ్యతను వివరించారు. వివిధ వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు, రైతు సదస్సుల్లో లక్ష మందికి అన్నదానం చేపట్టారు. రైతు సదస్సులకు హాజరైన అన్నదాతలకు క్విజ్ కార్యక్రమం ద్వారా ఏరీస్ వారి పోషక ఉత్పత్తులు, శౌర్య బ్యాటరీ స్ప్రేయర్లు బహుమానంగా అందజేశారు. సంస్థ ప్రతినిధి జయప్రదీప్ సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ ఏరీస్ రైతు సంక్షేమానికి, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

అన్నదానం చేస్తున్న ఏరీస్ సంస్థ సిబ్బంది

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి సీడీపీవో సీహెచ్.నాగమద్దావతి గురువారం తెలిపారు. అల్లాపురం- 2(ఓసీ)లో అంగన్‌వాడీ కార్యకర్త, బీబీగూడెం- 1(బీసీ-ఏ), కొత్తపేట(బీసీ-డీ), అల్లాపురం- 1(ఎస్సీ-సీ), అల్లాపురం- 2(ఓసీ), బుద్ధవరం- 3(బీసీ-డీ), దుర్గాపురం(ఓసీ), బూతిమిల్లిపాడు(ఎస్సీ-సీ), పొట్టిపాడు- 2(బీసీ-డీ), కాకులపాడు- 1(ఓసీ), కాకులపాడు- 2(ఎస్సీ-సీ), మల్లవల్లి- 2(బీసీ-ఏ), కొత్తపల్లి- 2(బీసీ-ఈ), కేసరపల్లి- 3(ఎస్సీ-సీ), గారపాడు- 1(ఎస్సీ-సీ), ఆత్కూరు- 5(ఓసీ), పెద్దఅవుటపల్లి- 2(ఓసీ), పొణుకుమాడు(ఓసీ-ఈడబ్ల్యూఎస్), దావాజీగూడెం- 1(ఎస్సీ-సీ), ఆరుగొలను- 3(ఓసీ), చిన్నఆవుటపల్లి- 2(బీసీ-డీ)లో సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. స్థానికురాలు 21-35 ఏళ్ల లోపు వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 6 దరఖాస్తులకు చివరి తేదీగా ప్రకటించిన సీడీపీవో. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బిజిలి శ్రీనివాస్, సాయిలలిత 72 మంది విద్యార్థులకు పలు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. పలువురు విద్యార్థులకు దగ్గు, జలుబు, ఐరన్ లోపంతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలను పరీక్షిస్తున్న వైద్యులు శ్రీనివాస్, సాయిలలిత

ఈనాడు మీతోడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముస్తాబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీహర్ష, పాఠశాల హెచ్‌ఎం పార్వతీ పర్యవేక్షణలో విద్యార్థినులకు వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై సిబ్బంది సీతారామయ్య, టి.మాధవిలత, ఎస్.దుర్గాభవానీలతో కలిసి డా.శ్రీహర్ష అవగాహన కల్పించారు.

గన్నవరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో..

కేసరపల్లి శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం కేసరపల్లి శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయా పూజల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరీ దంపతులు, పుణ్యాఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్ కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివకల్యాణం, భారీ అన్నసమారాధన జరిపారు. ఏఎంసీ ఛైర్మన్ జి.నరసయ్య, నాయకులు ఎమ్వీ.లక్ష్మీప్రసాద్, మాధవన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు, జాస్తి విజయ భూషణ్ కుమార్ దంపతులు

ధాన్యం కొనుగోలులో ఇబ్బంది పెట్టొద్దు

ఉయ్యూరు, ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని.. ధాన్యం సేకరణలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. ఉయ్యూరు పురపాలక సంఘం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం రైస్ మిల్లర్లతో ఏర్పాటైన సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఇప్పటికే రైతుల ఇబ్బందులపై అనేక అంశాలు తన దృష్టి వస్తున్నాయని చెప్పారు. రైతులు సైతం తేమ శాతం తగ్గే విధంగా ఆరబెట్టి మిల్లులకు తోలాలని పేర్కొన్నారు. రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లై జిల్లా మేనేజరు శివరామప్రసాద్, ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు పురపాలిక కార్యాలయంలో మిల్లర్లతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ నవీన్

★ **రికార్డులను పరిశీలన:** ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ గురువారం పరిశీలించారు. రికార్డుల నెలవారీ నివేదికలు, సర్వేల పురోగతి, డిస్పాచ్, టూర్ రికార్డులను తనిఖీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

✦ కానూరు మురళీనగర్ మెయిన్‌రోడ్డులో కొన్ని రోజులుగా మురుగు నిలిచి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయంపై స్పందించిన కమిషనర్ నజీర్ సిబ్బందిని పంపి పూడిక తీత పనులు చేయించి సమస్య పరిష్కరించారు. ✦ తాడిగడప వసంతనగర్‌కట్టపై కొన్ని రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన మున్సిపల్ ఈఈ భూషణం సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ✦ తాడిగడప విద్యానగర్‌లో కొన్ని రోజులుగా చెత్త తీసుకు వెళ్లడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకు రాగా.. స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. **– న్యూస్‌టుడే, కానూరు, తాడిగడప**

? గన్నవరం మండలం చిక్కవరంలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. **- శ్రీనివాసరావు, పాఠకుడు** ✔ సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- స్వర్ణలత, ఎంపీడీవో గన్నవరం**

? ఉంగుటూరు మండలం లంకపల్లి శివారులో కోళ్ల వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో బాటసారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. **- మల్లేశ్వరరావు, స్థానికుడు** ✔ వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పిస్తాం. **- సత్యకుమార్, ఎంపీడీవో, ఉంగుటూరు** – న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

వీడియో కాన్ఫరెన్స్‌లో అమెరికా విద్యార్థులు, భరత్‌చంద్

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

పెనమలూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అమెరికాలో స్థిరపడిన తెలుగు కుటుంబాలకు చెందిన విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడానికి ఆసక్తి చూపుతున్నారని సాఫ్ట్‌వేర్ నిపుణుడు అత్తలూరి భరత్ చంద్ తెలిపారు. ఆయన అమెరికాలోని సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నారు. గురువారం స్వగ్రామం పెనమలూరులోని జడ్పీ హైస్కూల్ సందర్శించి అమెరికాలోని విద్యార్థులతో ఇక్కడి పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్, ఏఐపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. రోబోటిక్స్, ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటి పనులు, వ్యవసాయం, కారు డ్రైవింగ్, రవాణా తదితర రంగాల్లో పెనుమార్పులు రానున్నాయన్నారు. అమెరికాలో స్థిరపడిన అనేక కుటుంబాలకు చెందిన పాఠశాల స్థాయి విద్యార్థులు తమ స్వగ్రామాల్లోని విద్యార్థులకు ఆయా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, కిలారు శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్ నేడు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం కాకులపాడులో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి షాహిద్‌బాబు గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కాకులపాడు సహకార సంఘం భవనం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద ఉన్న శివాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీహరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయానికి బాపులపాడుకు చెందిన వేమూరి హరిబాబు, నాగమణి దంపతులు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, గూడవల్లి చిన్నా, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, తదితరులకు ఈ మొత్తాన్ని అందించారు. వీటితో స్వామి వారికి వెండి పళ్లెం, శఠారి సమకూర్చాలని దాతల కుమారులు జగదీష్ బాబు, మనో వెంకటేష్ ఆలయ కమిటీకి సూచించారు.

నగదు అందిస్తున్న దాతలు

మరమ్మతులు చేసి.. వెతలు తీర్చండి

బాపులపాడు మండలం రేమల్లె గ్రామాన్ని 16వ జాతీయ రహదారితో అనుసంధానం చేసే ఒద్దులమెరక రోడ్డు పలు చోట్ల పాడైంది. వీరవల్లి కోమటిగుంట చెరువు నుంచి పోలవరం కుడికాల్వ వంతెన వద్ద రేమల్లె చేరుకునే ఈ మార్గాన్ని తెదేపా హయాంలో తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో రైతులు, గ్రామస్థులకు రాకపోకలు సులభతరంగా మారాయి. ప్రస్తుతం ఈ మార్గంపై అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. **– న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

చెత్త డబ్బాలు ఏర్పాటు చేయరూ..

పోరంకి బందరు రోడ్డు నుంచి రామాపురం కాలనీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా నివాసితులు రోడ్లపై చెత్త పడేస్తున్నారు. చెత్తను పురపాలిక సిబ్బంది మూడు రోజులకు ఒకసారి తీసుకెళ్తున్నారు. దీంతో కుక్కలు వ్యర్థాలను రోడ్లపై వదిలేస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డస్టుబిన్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, పోరంకి**

ప్రపంచంలో టాప్-5 నగరాల్లో అమరావతి

కానూరు, న్యూస్‌టుడే : అమరావతి నగరాన్ని ప్రపంచంలో టాప్-5 నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీ సీఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం సిద్ధార్థ డీమ్డు విశ్వవిద్యాలయంలో సివిల్ విభాగం నేతృత్వంలో 'స్మార్టు సస్టెయినబుల్ సిటీస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వికసిత భారత్ లక్ష్యంగా, అమృత్ వంటి కార్యక్రమాలతో స్మార్టు నగరాలకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఏపీ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ ఇంజినీర్ సీహెచ్ ధనుంజయ మాట్లాడుతూ.. అమరావతిలో అత్యాధునిక టెక్నాలజీలను వినియోగించి నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. సివిల్ విభాగం విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జి నిమిత్తం అమరావతిలో నిర్మాణాలను పరిశీలించాలన్నారు. సివిల్ విభాగాధిపతి వి.మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 100 పరిశోధన పత్రాలు ఈ సదస్సు వచ్చాయని వాటిల్లో 54 పత్రాలను ఆమోదించామని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ వై.నాగభూషణరావు, జాయింట్ సెక్రటరీ ఎస్.విష్ణు, ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రోవైస్ ఛాన్స్‌లర్ ఏ.వి.రత్నప్రసాద్, డైరెక్టర్ బావినేని పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న ఏపీసీఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణారెడ్డి, సి.హెచ్.ధనుంజయ తదితరులు

విద్యార్థులకు శిక్షణ అభినందనీయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : అమరావతిలో విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన బృందంలో సభ్యుడైన రేమల్లె జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొర్రా శ్రీనివాసరావుని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు చెందిన 175 మంది విద్యార్థులతో ఈ నెల 26న నిర్వహించిన మాక్ అసెంబ్లీ అందరిని ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించడంలో మెరుగ్గా వ్యవహరించారంటూ లోకేశ్ ప్రశంసించడం మర్చిపోలేని అనుభూతి అని శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కాటూరు (ఉయ్యూరుగ్రామీణం), న్యూస్‌టుడే : విద్యావంతులు, ఉపాధ్యాయులు ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి బాల్య వివాహ రహిత రాష్ట్రంగా మార్చాలని ఎంపీడీవో జీవీస్వీ శేషగిరిరావు అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ✦ ఉయ్యూరు మండలం ఆకునూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ ఎస్సై కె.సురేశ్‌బాబు పాల్గొన్నారు.

కంకిపాడు: బాల్య వివాహలతో కలిగే అనర్థాలను తల్లిదండ్రులు గుర్తించాలని కంకిపాడు సీఐ మురళీకృష్ణ సూచించారు. గురువారం కంకిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్' అవగాహన సదస్సులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దీనిలో హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరంలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వంద రోజుల ప్రత్యేక క్యాంప్‌లో భాగంగా గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల, స్రవంతి హైస్కూల్‌తో పాటు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వెలుగు కార్యాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి హుండీ ఆదాయం రూ.11.09 లక్షలు

యనమలకుదురు, న్యూస్‌టుడే : యనమలకుదురులోని శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో జులై 7 నుంచి నవంబరు 26వ తేదీ వరకు హుండీల ద్వారా రూ.11.09 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో భవానీ తెలిపారు. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో 9 హుండీల ఆదాయం లెక్కించారు. ఇన్‌స్పెక్టర్ ఏ.సుజన్‌కుమార్ పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. పోలీసు, రెవెన్యూ, దుర్గాశివసాయి సంఘం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

స్థలదాతకు సన్మానం

ఉప్పులూరు (కంకిపాడు), న్యూస్‌టుడే : ఉప్పులూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాత అన్నే పద్మనాభరావును గురువారం స్థానిక పాఠశాల్లో సన్మానించారు. సర్పంచి లాంసోనియా, ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య, హెచ్‌ఎం ఉషారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు పడవల మధుసూదనరావు, కె.సుబ్రహ్మణ్యం, కె.రాజేష్, ఎస్.ప్రసాద్, రామారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాత పద్మనాభరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ముంపొస్తే.. మునగడం ఖాయం!

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

సకాలంలో నీరందించడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. సమయానికి నాట్లు పడి, ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కానీ వరస తుపాన్లు రైతాంగాన్ని వణికిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొస్తుందో, లేదోనన్న ఆందోళన అన్నదాతలకు నెల రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గత అనుభవం దృష్ట్యా ప్రస్తుత దశలో వర్షాలు పడితే పైరు తుడిచి పెట్టుకుపోతుందని కర్షకులు భయపడుతున్నారు. నష్ట తీవ్రత తగ్గించేలా కాల్వలు, బోదెలను బాగుజేయాల్సి ఉన్నా యంత్రాంగం ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ చేపట్టక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్చరికలతో గుబులు.. గన్నవరం నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాల్లో కలిపి దాదాపు 60 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో అధికంగా డెల్టా ప్రాంతంలోనే ఉంది. ప్రస్తుతం ఈ పొలాల్లో 70 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. మిగతావి సిద్ధంగా ఉన్నాయి. ఈ నెలాఖరుకు కోతలు ముమ్మరం కానున్నాయి. కానీ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికలు అన్నదాతలకు గుబులు పుట్టిస్తుంది. ముఖ్యంగా బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో వరి సాగు మొత్తం కాల్వల కిందే ఉండటంతో ముంపునకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది.

రామన్నగూడెం వద్ద ప్రధాన డ్రెయిన్‌లో దట్టంగా గుర్రపు డెక్క

ప్రధానమైనవి ఇవే.. బుడమేరుతో సహా పలు ప్రధాన మురుగు కాల్వలు నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. మురుక్కోడు, పిల్లికోడు, నడుంకోడు, పెరికీడు డ్రెయిన్- 1, 2 వంటివి ఇందులో ప్రధానమైనవి. పొలాలకు సమీపంలో ఉండే ఈ కాల్వలు ప్రస్తుతం అధ్వానంగా ఉన్నాయి. వాస్తవానికి ఖరీఫ్ సీజన్‌లో అన్ని మురుగు కాల్వలను నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా శుభ్రం చేయాల్సి ఉండగా, నామమాత్రపు కార్యాచరణతో 'మమ' అన్పించేశారు.

లోపించిన ప్రణాళిక.. ముందుగా సాగు నీరిస్తే తుపాన్ల ప్రభావంతో పంట కోల్పోయే ప్రమాదం నుంచి రైతులు తప్పించుకుంటారనే ఆలోచనతో ప్రభుత్వం నీరందిస్తుంది. కానీ అధికారులు మాత్రం కనీస ప్రణాళిక కూడా లేకుండా కాల్వల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

డాక్యుమెంట్స్ పోయినది

నా క్లయింట్ మొహమ్మద్ కరిమున్నీసా భర్త మొహమ్మద్ నసర్, డోర్ నెం: 6-365, శ్రీలంకకాలనీ, వుయ్యూరు గ్రామం, మరియు మండలం, కృష్ణాజిల్లా వాస్తవ్యులైన వారి సంజాయిషీ తో తెలియజేయునది.
ది.24-11-2025వ తేదిన 11.30లకు వుయ్యూరు బస్టాండు దగ్గరలో డాక్యుమెంట్స్ పోయినవి.సదరు సంచిలో ఐదు ప్రామిసరీ నోటులు సంతకములు చేసినవి మరియు 25 సంతకములు చేసిన 933016 నుండి 933040 వరకు గల బ్లాంక్ చెక్కులు ఎస్.బి.ఐ బ్యాంకు వుయ్యూరు శాఖకు చెందినవి. నా క్లయింటు వద్ద నుండి జారీపడి పోయినది.ఎంత వెదకిన దొరకలేదు. కావున దొరికిన వారు పై గల నా క్లయింటు అడ్రసుకు గాని, ఈ దిగువ గల నా అడ్రసు గాని తెలియజేయ గలరు. డాక్యుమెంట్స్ దుర్వినియోగ పరచినచో నా క్లయింటు తీసుకొనబోవు చట్టపరమైన సివిల్,క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలం గా తెలియచేయడమైనది.
ఇట్లు:- పి.రాంబాబు, న్యాయవాది
వుయ్యూరు-521165
కృష్ణాజిల్లా, ఫోన్: 9393524999

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

'గుంటూరు వెళ్లి రక్తమిచ్చారు'

అవనిగడ్డ: చల్లపల్లి మండలం మంగళాపురానికి చెందిన పరుచూరి వెంకట్రావుబాబుకు గుండె శస్త్ర చికిత్స అత్యవసరంగా చేయాల్సిన అవసరం ఏర్పడటంతో గుంటూరు రమేష్ ఆసుపత్రిలో ఉన్న ఆతనికి రక్తం అత్యవసరంగా కావాల్సిన పరిస్థితి వచ్చింది. సమాచారాన్ని అందుకున్న 'మన అవనిగడ్డ బ్లడ్ డోనర్స్' సేవా స్ఫూర్తితో ముందుకు వచ్చి ముగ్గురు కార్యకర్తలు గుంటూరు వెళ్లి అవసరమైన రక్తం అందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం): రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మాదివాడ రత్నారావు, అధికారి జయప్రద, ఏవో శుభాకాంక్ష పాల్గొన్నారు.

నేరుగా మిల్లర్ల దగ్గరకు వెళ్లి నష్టపోవద్దు

కొత్తవరం(గుడ్లవల్లేరు): రైతులు నేరుగా మిల్లర్ల వద్దకు వెళ్లి నష్టపోవద్దని, ఆర్బీకే, కోఆర్డినేటర్ అధికారి ద్వారానే ధాన్యం విక్రయాలు చేసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గురువారం ఆయన కౌతవరం, పసుమర్తిపాలెం, వెణుతురుమిల్లిలో నిర్వహించిన 'రైతన్నా...మీకోసం' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రైతులతో మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవి కుమార్, సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి యుగంధర్, కొప్పినేని పిచ్చేశ్వరరావు, జగన్మోహన్‌రావు, ఈడే కృష్ణ, చిట్టి బొమ్మ నరసింహారావు, పాల్గొన్నారు.

ఘంటసాల: వాతావరణ మార్పులతో రైతులు పచ్చి వడ్లను యంత్రాలతో కోయవద్దని ఇన్‌ఛార్జి ఏవో డి.అనూష తెలిపారు. గురువారం మల్లంపల్లి రైతుభరోసా కేంద్రం వద్ద 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి బెల్లంకొండ ఉమలేశ్వరరావు, ఈవో సుబ్రహ్మణ్యం, వీపీఏ, పాల్గొన్నారు.

వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం): రైతులకు అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు చెప్పారు. వేకనూరులో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏవో శుభాకాంక్ష, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందనకు వందనం

☛ అవనిగడ్డ రెండో వార్డు గొల్లపల్లి సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన కొడుతోందని ఆ ప్రాంత ప్రజలు మణికంఠ, సుబ్బారావు వినతి మేరకు చర్యలు తీసుకున్నారు.

☛ అవనిగడ్డ మండలపురంలో ప్రధాన రహదారి వెంట ఉన్న చెత్తను తొలగించాలని వీరాంజనేయులు, రాము 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావుని కోరగా గురువారం చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. - న్యూస్‌టుడే, అవనిగడ్డ

రహదారులకు త్వరలో రూ.2 వేల కోట్లు

దేశాయిగుంటలో సిమెంట్‌రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే రాము

వెణుతురుమిల్లి(గుడ్లవల్లేరు): త్వరలో గ్రామాలను కలిపే రహదారుల అభివృద్ధికి రూ.2 వేల కోట్లు మంజూరు కానున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. గురువారం వెణుతురుమిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇప్పటికే రూ.4 వేల కోట్ల ఉపాధి నిధులతో గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు నిర్మించామని తెలిపారు. ఇక గ్రామాలను కలిపే కనెక్టివిటీ రహదారుల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించారని, త్వరలో అవి మంజూరు కానున్నాయని వెల్లడించారు. అందులో రూ.60 కోట్లు మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని గ్రామాలకు రానున్నాయని వివరించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలసి సిమెంట్‌రోడ్లు, వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్, శాయన పుష్పావతి, ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవి, కొప్పినేని పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరాలు

ఈనాడు మీతోడు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని, చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని వేకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రియాజ్ చెప్పారు. అవనిగడ్డ పంచాయతీ శివారు కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో వేకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో వైద్య శిబిరం జరిగింది. 27 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్ష చేశారు. ఎవరిలోనూ రక్తహీనత లేదని ధ్రువీకరించారు. నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చిన తగ్గిన విద్యార్థిని డాక్టర్ పరీక్షించి పూర్తిగా తగ్గినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు వేముల రమేష్‌బాబు, సూపర్‌వైజర్ కమ్మిలి తారక రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఎంపీహెచ్‌ఏ (ఎం) పి.రఘు, స్వాతి, అంజలి, ఆశా కార్యకర్తలు సంపూర్ణ, కుమారి పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ రియాజ్

వెంట్రప్రగడ జడ్పీ హైస్కూల్‌లో..

పెదపారుపూడి, న్యూస్‌టుడే: రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం.హరికిషోర్ అన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మండలంలోని వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు రకాల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్ని పరీక్షిస్తున్న వైద్యులు సందీప్

తోట్లవల్లూరు ప్రాథమిక పాఠశాలలో..

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు సాయిప్రసన్న పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ చిన్ననాటి నుంచే ఆరోగ్య సూత్రాలు పాటిస్తే భవిష్యత్తులో రోగాలకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీవో రవికాంత్, ఎంఈవోలు 1,2 వెంకటేశ్వరరావు, సురేష్, హెచ్‌ఎం.ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఏఎన్ఎంలు కిరణ్‌కుమారి, లక్ష్మీ, ఆశాలు బుజ్జి, రనీలా, విజయనిర్మల, స్వాతి పాల్గొన్నారు.

శిబిరంలో డాక్టరు సాయిప్రసన్న, పక్కన ఎంపీడీవో రవికాంత్, ఎంఈవో 1,2 వెంకటేశ్వరరావు, సురేష్

రైతులకు తప్పదా ఈ ఆందోళన

కూచిపూడి, న్యూస్‌టుడే: అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుపాన్ ప్రభావంగా వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని కోసూరు, మొవ్వ, బట్లపెనుమర్రు, అవురుపూడి, పాలంకిపాడు, కూచిపూడి తదితర గ్రామాలలో కొందరు రైతులు కోలుకుని కోత కోసి రహదారులపై ఆరబెట్టారు. గతవారం రోజులుగా మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు రైతన్నలు హడావిడిగా ఎదురు చూస్తున్నారు. అయితే లారీలు, సంచులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమి లేక తక్కువ ధరకు దళారీలకు అమ్ముకునేందుకు పోటీ పడుతున్నారు. అయితే కొందరు రైతులు తేమ ఎక్కువగా ఉందని తక్కువ ధరకు అడుగుతున్నా దిక్కుతోచని స్థితిలో అమ్ముకుంటున్నారు. కోసూరు ప్రాంతంలో రహదారులపై ధాన్యం నిల్వలు బారులు తీరాయి. లారీల కోసం బరువెక్కిన గుండెలతో పలువురు రైతులు ఎదురు చూస్తున్నారు.

మొవ్వలో ఆరబెట్టిన ధాన్యాన్ని సరిచేస్తూ..

ఆక్రమిస్తే చర్యలు తప్పవు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : రైతులకు సంబంధించిన మార్క్‌ఫెడ్ భవనాన్ని అనుమతులు లేకుండా ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని సహకార సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.అలంకార్ సూచించారు. స్థానిక మహిళ మార్కెట్ భవనాన్ని ఆక్రమించి మీరెవ్వరికి సంబంధం లేదని పాలక వర్గ సభ్యులకు హెచ్చరికలు చేసింది. దీంతో అధ్యక్షుడు రావులపల్లి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భవనాన్ని గతంలో వృద్ధాశ్రమం నడపటానికి ఇచ్చారని, ఆ భవనాన్ని తమకు ఇప్పించాలని స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి ఆదేశాలకు మేరకు అలంకార్ స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి సదరు సభ్యులను పిలిపించి గురువారం విచారణ నిర్వహించారు. సభ్యుల నుంచి పలు వివరాలు నమోదు చేసుకున్నానని, ఈ నివేదికను కో-ఆపరేటివ్ అధికారికి అందజేస్తానని తెలియజేశారు.

సభ్యులను విచారిస్తున్న అలంకార్

బాలల ప్రతిభ అద్వితీయం : మండలి

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: ఆత్మరక్షణ విద్య అంశాలలో బాలబాలికల ప్రతిభ అద్వితీయమని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆయన కార్యాలయంలో సైకె పోటీలో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన స్థానిక ఈశ్వర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. బి.శ్రీకేషిక్, జి.పూజితవల్లి, డి.హర్షవర్ధన్, కె.జాన్విక ఇషి, బి.విఖ్యాత్‌రామ్, టి.అభిషిక్త్, కె.భార్గవి వివిధ విభాగాల్లో పతకాలు సాధించారన్నారు.

అంగన్‌వాడీల పనితీరు లోపభూయిష్ఠం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల పనితీరు లోపభూయిష్ఠంగా ఉండి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నారని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఉలవలపూడి సర్పంచి పామర్తి కన్యభాస్కరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమయపాలన దారుణంగా ఉందని, పురుగుపట్టిన కందిపప్పును గర్భిణులకు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న సీడీపీవో, సూపర్‌వైజర్‌లపైనా ఆయన మండిపడ్డారు. కిందనుంచి పై వరకూ మీరంతా ఒకటేనని, వచ్చిన సరకులు పంచుకుంటారని తీవ్ర విమర్శలు చేశారు. గ్రామాలలో బెల్టుషాపులు విపరీతంగా పెరిగిపోయాయని, చినగొన్నూరు గ్రామంలో 5 దుకాణాలున్నాయని సర్పంచి కోటప్రోలు నాగు ధ్వజమెత్తారు. ఎంపీపీ కొడాలి సురేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఇమ్రాన్, శాఖాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా చండ్ర పుల్లారెడ్డి వర్ధంతి

కోడూరు (అవనిగడ్డ): స్థానిక మార్క్సిస్టు విజ్ఞాన కేంద్రంలో చండ్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అమర వీరుల స్థూపాల వద్ద పార్టీ జెండాలు ఎగురవేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకర్ వీరాంజనేయులు, నడకుదురు నరసింహారావు, సింగోతు నాగేంద్రరావు, అరుణోదయ నేత సుధాకర్, మాల్యార్, రాకేష్, కె.సతీష్, లంకేశ్వరరావు, కుంచే అంజిబాబు, అరుంధతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి చండ్ర పుల్లారెడ్డికి జోహార్లు అర్పిస్తున్న నాయకులు

బాల్యవివాహాలు అనర్థదాయకం

పామర్రు, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు అనర్థదాయకమని పామర్రు సీఐ సుభాకర్ అన్నారు. గురువారం స్థానిక జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ సుభాకర్

క్యాండిల్ మార్చ్‌లో ఎంపీడీవో ఆనందకుమారి, సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి తదితరులు

మొవ్వ(కూచిపూడి): బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమే కాకుండా నేరమని కూచిపూడి ఎస్ఐ పి.శిరీష అన్నారు. మొవ్వ శ్రీమండవ కనకయ్య జడ్పీపాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాసవ్య మహిళా మండలి జిల్లా ప్రాజెక్ట్ సమన్వయకర్త సిహెచ్.ఉషారాణి, దివ్య, ఇన్‌ఛార్జి హెచ్ఎం శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

చల్లపల్లి: బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో ఆనందకుమారి అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్ వివాహ్ ముక్త భారత్ ప్రచారానికి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చల్లపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో క్యాండిల్ మార్చ్, ప్రతిజ్ఞ వేడుకలు గురువారం నిర్వహించారు. కృష్ణా జిల్లా కోఆర్డినేటర్ సి.హెచ్.ఉషారాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నందివాడ, గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలు, వాటిని ఎదుర్కొనేందుకు చట్టపరమైన నిబంధనలపై ఎస్.ఐలు సత్యనారాయణ, శ్రీనివాస్ అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. వెణుతురుమిల్లిలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు గ్రామస్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు.

సత్తాచాటిన విద్యార్థులు

పతకాలు సాధించిన చిన్నారులతో కోచ్‌లు సుబ్బు, జాహ్నవి, పి.ఈశ్వర్, పి.విశ్వ

చల్లపల్లి, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో ఈ నెల 23, 24వ తేదీల్లో జరిగిన 8వ ఏపీ స్టేట్ లెవెల్ సైకె మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో చల్లపల్లి సుబ్బు తైక్వాండో వారియర్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు పతకాలు సాధించి సత్తా చాటారు. అండర్-11 లోబో విభాగంలో రెండు బంగారు పతకాలు, ఐదు కాంస్యం, ఎనిమిది రజతం, అండర్-18 లోబో విభాగంలో మూడు బంగారు పతకాలు, ఒక కాంస్యం, ఒక రజత పతకం సాధించారు. కటా విభాగంలో అండర్-18 ఏరో సైకర్ గ్రూపులో మూడు బంగారు పతకాలు, ఏరో సైకె మిక్స్‌డ్‌డబుల్ విభాగంలో రెండు బంగారు పతకాలు, అండర్-14 విభాగంలో రెండు కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను, కోచ్ మాస్టర్ కె.సుబ్బు, కె.జాహ్నవిలను కృష్ణా జిల్లా సైకె ప్రెసిడెంట్ మాస్టర్ పి.ఈశ్వర్, కార్యదర్శి మాస్టర్ పి.విశ్వలు అభినందించారు.

అస్తవ్యస్తంగా ఆటోనగర్ రహదారులు

గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

గుడివాడలోని ఆటోనగర్ అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. సర్వీసు రోడ్లు ఏకంగా కందకాలను తలపిస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే రహదారిలోని గుంతలను అంచనా వేయలేక పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాస్తవానికి గతంలో ఆటోనగర్ రహదారులు పటిష్ఠంగానే ఉండేవి. కానీ గుడివాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుంచి భారీ వాహనాల రాకపోకల రద్దీ ఇక్కడ అధికమైంది. దారి మళ్లింపు కార్యక్రమమంతా ఆటోనగర్ రహదారుల పైనే పడింది. దీనికి తోడు అధిక వర్షాలు పడటంతో రహదారులు ఆకృతిని కోల్పోయాయి. నిత్యం వేలాది మంది ఈ ఆటోనగర్ రహదారుల పైనే తమ గమ్యస్థానాలకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానిక పెదకాలువ సెంటర్ వద్ద మచిలీపట్నం ప్రధాన రహదారిని ఫ్లైఓవర్ పనుల నిమిత్తం మూసి వేయడంతో దారి మళ్లింపులో భాగంగా ఆటోనగర్ రహదారులపై మరింత భారం పడింది. వాటికి తాత్కాలిక మరమ్మతుల విషయంలో అధికారులు స్పందించకపోవడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చించకపోతే అసాంతం ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొంటుంది.

దెబ్బతిన్న అంతర్గత రహదారి

గ్రంథాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న పాఠకులు

గ్రంథాలయ పాఠకుల నిరసన

అవనిగడ్డ: స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని సాయంత్రం 5.30 గంటలకు మూసేస్తున్నారని గురువారం సాయంత్రం గ్రంథాలయం ముందు పాఠకులు, విద్యార్థులు నిరసన తెలిపారు. ఉదయం 8నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచాలని కోరారు. గ్రంథాలయాధికారి వెళ్లిపోయిన వెంటనే పై అంతస్తుకు తాళం వేస్తున్నారని, ఆన్‌లైన్ క్లాసులు ఉన్నాయని చెప్పినా కూడా వినిపించుకోవడం లేదన్నారు. వీరిలో డీఎస్సీ, టెట్‌లకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు కూడా ఉన్నారని చెపుతున్నారు. భాజపా నాయకులు తుంగల వెంకటగిరి, బోగాధి చంద్రశేఖర్ మద్దతు తెలిపారు.

రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశువైద్య శిబిరం

కౌతవరం(గుడ్లవల్లేరు): మండలంలోని కౌతవరం శివారు పసుబొట్లపాలెంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్.చిననరసింహులు, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు సంయుక్తంగా ప్రారంభించారు. ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు మందులు పంపిణీ చేశారు. పోతురాజు, వైద్యులు హనుమంతరావు, లీనాశ్రీ, పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారి నరసింహులు

చింతలమడలో చెరువు కట్టల తొలగింపు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ చింతలమడలోని డ్రెయినేజీ పోరంబోకు భూముల్లో వివాదాస్పదమైన చెరువు కట్టల తొలగింపు సమస్య గురువారం కొలిక్కి వచ్చింది. డ్రెయినేజీ వెంబడి రొయ్యలు, చేపల పెంపకానికి సంబంధించి చెరువు తవ్వడంతో రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి, డ్రైనేజీ ఈఈ కిరణ్‌బాబు, డీఈఈ బాబూనాయక్, ఏఈ చిరంజీవిల ఆధ్వర్యంలో పొక్లెయిన్, జేసీబీలతో చెరువు కట్టలను గురువారం తొలగించారు.

బ్యాంకు అగ్నిప్రమాదంలో రూ.18 లక్షల ఆస్తి నష్టం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ బైపాస్ రోడ్డులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వలివర్తిపాడు శాఖలో ఈనెల 25న జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.18 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బ్రాంచి మేనేజర్ వై.భాగ్యరేఖ గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో విద్యుదాఘాతం వలన జరిగిన ఈ ప్రమాదంలో కంప్యూటర్లు, తదితర సామగ్రి దగ్ధం కావడంతో ఈ నష్టం జరిగిందని తెలిపారు. ఈమేరకు హెడ్ కానిస్టేబుల్ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వేమవరం(గుడ్లవల్లేరు) : మండలంలోని వేమవరం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పెడన మండలం ముచ్చినగుంటకు చెందిన ఏడుకొండలు కుమారుడుతో కలసి గుడివాడ నుంచి స్వగ్రామం వెళుతుండగా వేమవరం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆయన్ను 108లో గుడివాడ ఆస్పత్రికి తరలించారు.

అవసరం మేరకే కృత్రిమ మేధ వినియోగించాలి

అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో..

గుడివాడ, న్యూస్‌టుడే: మానవుని మేధస్సు అత్యంత గొప్పదని, దాన్ని వినియోగించకుండా నేడు కృత్రిమ మేధపై ఆధారపడితే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని, అవసరం మేరకే ఉపయోగించాలని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్.కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో 'ఈనాడు ప్రతిభా పాటవ పోటీ'లలో భాగంగా 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్‌లో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాసం పోటీలు గురువారం నిర్వహించారు. ఈపోటీలలో విజేతలుగా ఏ.హెచ్.ఎన్.ఎస్.ఎస్.లక్ష్మి ప్రథమ, ఏ.జాన్ వెస్లీ ద్వితీయ, కె.అక్షిత తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ బి.ఎస్.ఎస్.పద్మజ, అధ్యాపకులు బహుమతులు ఇచ్చి అభినందించారు.

☛ రాజేంద్రనగర్‌లోని ఎస్‌జీఆర్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం అనే అంశంపై నిర్వహించిన ఈనాడు ప్రతిభా పాటవ ఉపన్యాసం పోటీలలో జి.నాగసాయి, బి.అజయ్, డి.ఆషా సువర్ణలు తొలి మూడు స్థానాలు సొంతం చేసుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు డి.ఎస్.శ్రీనివాసన్, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఎస్‌జీఆర్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం....

పెదపారుపూడి: సెల్‌ఫోన్ మోజులో పడి విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని పెదపారుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్.ఎం జె.వనజాక్షి అన్నారు. గురువారం ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించగా వివిధ తరగతుల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులు బి.దుర్గాభవాని (9వ తరగతి) ప్రథమ, పి.వెంకట నాగలక్ష్మి (10వ తరగతి) ద్వితీయ, ఎన్.దానప్రియ (9వ తరగతి) తృతీయస్థానాలు సాధించారు. వారికి వనజాక్షి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, మరియమ్మ, లావణ్య పాల్గొన్నారు.

బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉగాదిలోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

చల్లపల్లి, న్యూస్‌టుడే: లబ్ధిదారులు ఉగాదిలోపు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పోతురాజు తెలిపారు. చల్లపల్లిలోని ఎన్.టి.ఆర్.కాలనీలో పీఎం ఆవాస్ యోజన లబ్ధిదారులతో గురువారం మాట్లాడారు. గృహాలు నిర్మించుకునే అర్హులైన పేదలు ఈ నెలాఖరులోపు దరఖాస్తులను సచివాలయాల్లో సమర్పించాలన్నారు. ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, ఏఈ ధర్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్జీవోల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ ఎన్జీవోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఎన్జీవో హోంలో గురువారం నిర్వహించారు. సంఘ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేపీ రావు, జి.రాజేంద్రప్రసాద్‌ల ప్యానెల్ ఒకటి మాత్రమే నామినేషన్లు దాఖలు చేయగా ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. దీంతో ఉపాధ్యక్షులుగా తాడి పాపయ్య, విక్టర్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా నిర్మల, విద్యావతి, కే.మనోజ్, టి.వెంకటాద్రి, ఎన్.రమేష్, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లా నాయకుడు షేక్ ఫరీద్ భాషా ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లి కృష్ణ పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. దీంతో గెలుపొందిన వారిని జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.వెంకటేశ్వరరావు, అభినందించారు.

జీవీ అకాడమీ విద్యార్థుల అన్నదానం

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక మచిలీపట్నం రోడ్డులోని జీవీ అకాడమీ విద్యార్థులు గురువారం వాసవీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించి, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఘంటసాల భరతుడు, అకాడమి ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బాలబాలికలు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం నవంబరు 28, 2025

వేంకటా చలపతి.. శోభిల్లేను అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వెంకటపాలెంలో తిరుమల తిరుపతి తరహాలో శ్రీవారి ఆలయాన్ని రూ. 260 కోట్లతో అభివృద్ధి చేయడానికి మరో అడుగు పడింది. తితిదే వేద పండితుల మంత్రోచ్ఛారణలు.. మంగళవాయిద్యాల నడుమ ద్వితీయ మహా ప్రాకార నిర్మాణానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు.

- న్యూస్‌టుడే, తుళ్లూరు

పన్నుగప్పి.. దందా!

రూ.1.75 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

ఈనాడు, అమరావతి

‘పన్నులు చెల్లించని విదేశీ సిగరెట్లు.. విజయవాడ, సమీప ప్రాంతాలకు భారీగా వచ్చేస్తున్నాయి. పారిస్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ లేబుల్ పేర్లతో ఉన్న రూ.1.75 కోట్ల విలువైన అక్రమ విదేశీ సిగరెట్లను.. తాజాగా వాణిజ్య పన్నులశాఖ సిబ్బంది పట్టుకున్నారు. విజయవాడ డివిజన్ 01 సిబ్బంది ఆధ్వర్యంలో భవానీపురం పార్శిల్ కార్యాలయం, గొల్లపూడిలో ఐదు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ అట్కిన్సన్ పాఠశాల సమీపంలో ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో.. ఏకంగా 23 పెద్ద కార్టన్లను పట్టుకున్నారు. మూడో డివిజన్‌లో మచిలీపట్నం సర్కిల్ ఆధ్వర్యంలో దాడులు చేసి.. తోట్లవల్లూరు రోడ్డులోని గోదాములో మరో 90 కార్టన్ల సరకు గుర్తించారు.’

తోట్లవల్లూరు: పట్టుకున్న సిగరెట్ ప్యాకెట్ల కార్టన్లు..

అక్రమ సరకు తెచ్చిన కంటైనర్

నేపాల్ సరిహద్దుల నుంచి... నేపాల్, బిహార్ నుంచి ఈ సరకును రోడ్డు మార్గంలో కంటైనర్లు, లారీల్లో ఇక్కడికి తెచ్చినట్లు అధికారులు గుర్తించారు. సరకు తమదేనని కొందరు యజమానులు వచ్చినట్లు సమాచారం. సిగరెట్ ప్యాకెట్ రూ.20 అనీ.. అయితే ఎమ్మార్పీ రూ.50 ముద్రించినట్లు చెబుతున్నట్లు తెలిసింది. ఈ సరకును వేలం వేయాలని నిర్ణయించారు. వీటిని తెచ్చిన కంటైనర్ అధికారుల ఆధీనంలోనే ఉంది.

రూ.కోటి వరకూ ఖజానాకు రావాలి..

సిగరెట్లపై 28 శాతం పన్ను చెల్లించాలి. అందుకే.. అక్రమార్కులు.. వక్రమార్గాల్లో పన్నులు చెల్లించకుండా విదేశీ బ్రాండ్ సిగరెట్లను దిగుమతి చేసుకుంటున్నారు. తాజాగా దొరికిన సరకులో.. ఒక్కో సిగరెట్ ప్యాకెట్‌పై రూ.50 ఎమ్మార్పీ ఉంది. పంచనామా ద్వారా మొత్తం ప్యాకెట్లను లెక్కించి.. రూ.1.75 కోట్ల సరకుగా తేల్చారు. పన్ను, దానికి సమానంగా జరిమానా చెల్లించాలి. ఈ లెక్కన.. 28 శాతం చొప్పున రూ.50 లక్షల పన్ను, మరో రూ.50 లక్షల జరిమానా కలిపి.. రూ.కోటి వరకూ సర్కారు ఖజానాకు రావాలి.

దొరుకుతున్నది నాలుగో వంతే.. విజయవాడ పరిధిలోని డివిజన్ 01, 02 సహా అందరినీ వారి కార్యాలయ పరిధిలో కాకుండా.. పక్కనున్న ప్రాంతాలకు తనిఖీలకు పంపిస్తున్నారు. ఎవరి డివిజన్‌పై వాళ్లకే అవగాహన, పూర్తి పట్టు ఉంటుంది. పక్క డివిజన్ వాళ్లు ఇక్కడి కొచ్చి తనిఖీలు చేస్తుంటే.. వీళ్లు సహకరించడం లేదు. అలాగే వీళ్లు వేరేచోటకు వెళ్లినా అదే తీరు. దీంతో అక్రమంగా దిగుమతయ్యే సరకులో.. అధికారులు పట్టుకుంటున్నది నాలుగోవంతూ ఉండదనే విమర్శలు వస్తున్నాయి.

ఫిట్‌నెస్ గుట్టు.. కమీషన్ల కనికట్టు

ఏజెంట్లు, ఏటీఎస్ కేంద్రం నిర్వాహకుల కుమ్మక్కు

ఈ ఆటో 2013లో కొనుగోలు చేశారు. వాహనం ఇంజిన్ అవసాన దశకు చేరుకుంది. వాహనం బాడీ మొత్తం తుప్పు పట్టింది. దాన్ని బయటికి కనపడకుండా రబ్బరు మ్యాట్లతో కప్పి మాయ చేశారు. నిబంధనల ప్రకారం ఈ వాహనానికి ఫిట్‌నెస్ పత్రం జారీ చేయడం కుదరదు. ఏజెంట్ రూ.7వేలు వసూలు చేసి అడ్డగోలుగా ఫిట్‌నెస్ పత్రం ఇప్పించారు.

విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన ఆటో. ఫిట్‌నెస్ పరీక్షకు నున్న ఏటీఎస్ కేంద్రానికి తీసుకొచ్చారు. రేడియం స్టిక్కర్లు ఉన్నా మళ్లీ ఇలా అంటించి డ్రైవర్ దగ్గర రూ.100 వసూలు చేశారు. ఇలా రోజుకు దాదాపు 300 నుంచి 400 వాహనాలకు అవసరం ఉన్నా లేకున్నా స్టిక్కర్లు వేసి రోజుకు రూ.40వేలకు పైగా దండుకుంటున్నారు. ప్రశ్నించిన వారికి ఫిట్‌నెస్ పత్రం రాకుండా కాళ్లరిగేలా తిప్పిస్తున్నారు.

నున్న ఏటీఎస్(ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్)లో ఫిట్‌నెస్ ధ్రువపత్రం మంజూరులో దోపిడీ రాజ్యమేలుతోంది. వాహన స్థితి ప్రమాణాలకు తగ్గట్టుగా ఉందా లేదా అన్నది అనవసరం. ముడుపులు అందాయా లేదా అన్నదే ముఖ్యం అన్నట్లు దందా సాగుతోంది. ఏజెంట్ల ముసుగులో కొందరు నిర్వాహకులు వాహనదారులను దోచుకుంటున్నారు.

అడ్డగోలు తీరిది..

✪ వాహనాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా లేదా అని నిర్ధారించేందుకు సమయానికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. ✪ ఇందులో టైర్ల అమరిక, ఇంజిన్ పనితీరు, వేగం, హారన్ శబ్దం, బ్రేక్, అండర్‌ఫిట్, హెడ్ లైట్స్ తదితర పరీక్షలు చేస్తారు. ప్రమాణాలకు తగ్గట్టు ఉంటేనే ఫిట్‌నెస్ ధ్రువపత్రం మంజూరు చేయాలి. ✪ నున్న ఏటీఎస్ కేంద్రంలో కనీస ప్రమాణాలు లేని వాహనాలకు సైతం అడ్డగోలుగా పత్రాలు ఇచ్చేస్తున్నారు. ✪ ఏజెంట్లు, ఏటీఎస్ కేంద్రంలో కొందరు సిబ్బంది కుమ్మక్కై కథ నడిపిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా వస్తేనే పరీక్షలు లేదంటే కొర్రీలు పెడుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. ✪ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలోనే ఏజెంట్లు వసూళ్ల కథ ముగిస్తున్నారు. ✪ చలానా కట్టాల్సింది రూ.950లోపే అయినా ఒక్కో వాహనదారుడి నుంచి రూ.2500 నుంచి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. వీరి కమీషన్ల కక్కుర్తి వల్ల కాలుష్యం తీవ్రత, రహదారి ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది.

బాధ్యులపై చర్యలు

ప్రస్తుతం ఏటీఎస్ కేంద్రాలు ప్రైవేటు నిర్వహణలో నడుస్తున్నాయి. ఈ కేంద్రాలను కమిషనర్ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధిరుల దృష్టికి తీసుకువెళ్తాను. అధికంగా వసూలు చేస్తున్న ఏజెంట్లు, వారితో కుమ్మక్కైన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మోహన్, డీటీసీ

– ఈనాడు, అమరావతి

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre, Bunder Road, Vijayawada
Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 99590 21800

నిత్యం నీటి పరీక్షలు చేయాలి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిత్యం తాగునీటి పరీక్షలు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. పాతరాజరాజేశ్వరీ పేటలో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలకు శుద్ధి జలాన్ని డబ్బాల్లో అందించాలనీ.. నిత్యం నీటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరా పైపులైన్లను మార్చి, కొత్తవాటిని అమర్చాలని ఆదేశించారు. ఇంటింటికీ ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు.

ఈనాడు ప్రాపర్టీ షో-2025 లోగో ఆవిష్కరణ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ బృందావన కాలనీ ఎ కన్వెన్షన్ సెంటర్లో ఈ నెల 29, 30 తేదీల్లో ‘ఈనాడు’ ప్రాపర్టీ షో -2025 నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లోగోని టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న సన్‌సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ భాష్యం కిరణ్‌కుమార్, పవర్డ్ బై హరివిల్లు ప్రమోటర్స్, డెవలపర్స్ సీఈవో జాస్తి ప్రసన్నకుమార్, గోల్డ్ స్పాన్సర్ వీఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి ఎన్.నారాయణరెడ్డి, సిల్వర్ స్పాన్సర్ చతుర్భుజ ప్రాపర్టీస్, ఇన్‌ఫ్రా ఎండీ కె.నాగేశ్వరరావు, ప్రతినిధి హనుమాన్‌లు ఆటోనగర్ స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్స్‌లోని ‘ఈనాడు’ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ‘ఈనాడు’ విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ‘ఈనాడు’ పాఠకులకు నాణ్యమైన వార్తలను అందించడంతో పాటు సొంతింటి కలను సాకారం చేసుకునే వారి కోసం కొన్నేళ్లుగా ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది కొనుగోలుదారులు, స్థిరాస్తి సంస్థలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న భాష్యం కిరణ్‌కుమార్, జాస్తి ప్రసన్నకుమార్, హనుమాన్, సీహెచ్‌కే కిషోర్‌కుమార్, నాగేశ్వరరావు, నారాయణరెడ్డి

వందేభారత్‌కు స్లీపర్ బోగీలు

ట్రయల్ రన్ విజయవంతం..

విజయవాడ రైల్వే: వందే భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండడంతో వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టబోతుంది. ఇప్పటికే విజయవంతంగా ట్రయల్స్ పూర్తి చేయగా ఎప్పుడు పట్టాలెక్కిస్తారోనని ఆసక్తిగా ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. మెరుగైన, సురక్షిత ప్రయాణం అందించేందుకు తొలి వందే భారత్ స్లీపర్ రైలును త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

అత్యాధునిక సౌకర్యాలు.. తొలి స్లీపర్ రైలు ప్రయాణికులకు ఉన్నతస్థాయి సౌకర్యాలు, వేగం రెండింటినీ అందిస్తుంది. ప్రయాణికుల సౌకర్యం, భద్రత విషయంలో రాజీ పడకుండా వందే భారత్ స్లీపర్ రైలు ర్యాక్‌లను రూపొందించారు. ఇప్పటికే పలు స్థాయిల్లో పరీక్షించారు. ట్రయల్స్ తర్వాత సీట్లు, బోగీలకు సంబంధించి పలు మార్పులు చేశారు.

విజయవాడ డివిజన్ మీదుగా.. ఈ రైళ్లు విజయవాడ డివిజన్ మీదుగా నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముందుగా రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ-సికింద్రాబాద్, విజయవాడ-విశాఖకు తొలి రైళ్లు నడపనున్నారు. అన్ని అనుకూలిస్తే డిసెంబర్‌లో ప్రారంభించేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తుంది.

గురుకులం.. విజ్ఞాన విహారం

విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానమూ అందాలి. ఇందుకోసం ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు సైతం ప్రైవేటుతో పోటీ పడుతున్నాయి. ప్రత్యేకంగా బస్సు వేసి రెడ్డిగూడెం మండలం రంగాపురం గురుకుల పాఠశాల విద్యార్థులను రానుపోను 140 కి.మీ ప్రయాణించి విజయవాడలోని బాపూ మ్యూజియం, ఇతర దర్శనీయ ప్రాంతాలకు తీసుకొచ్చారు.

-ఈనాడు, అమరావతి

కంట్లో పడితే.. కాస్త తడబడితే..

ఇబ్రహీంపట్నం-జూపూడి రోడ్డులో నిత్యం బూడిద లారీలు, కంకర టిప్పర్లు తిరుగుతుంటాయి. వాటిపై కవర్లు కప్పకుండా తీసుకెళ్తుండడంతో రోడ్డుపై కంకర రాళ్లు పడుతున్నాయి. లారీల వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలో బూడిద పొడి పడుతోంది. కంకర రాళ్లపై వాహనాల టైర్లు పట్టుతప్పి కిందపడిపోతున్నారు. జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది వీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, లారీల యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి

అడుగు దివ్యమై.. వెలుగు భవ్యమై!

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను కలెక్టర్ లక్ష్మీశ విచ్చేసి ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతులు... చక్కని చిరునవ్వుతో.. కొండంత ఆత్మవిశ్వాసంతో... క్రీడల్లో భాగస్వాములై సరిలేరు మాకెవ్వరు అని చాటిచెప్పారు.

- విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

పెట్టుబడుల పేరుతో విశ్రాంత ఉద్యోగికి టోకరా

రూ.78.5 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సరైన డీ మ్యాట్ ఖాతా ఉంటేనే పెట్టుబడులు పెట్టాలని.. ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడులకు ఎక్కువ మొత్తంలో ఆదాయం వస్తుందని ఎవరైనా చెబితే నమ్మవద్దని పోలీసులు చెబుతున్నా.. అమాయకులు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు తియ్యని మాటలతో.. విజయవాడకు చెందిన ఒక విశ్రాంత ఉద్యోగి (77) నుంచి రూ.78.5 లక్షలు కొట్టేశారు. వివరాల్లోకి వెళితే.. మొగల్రాజపురానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నటరాజన్ గుల్జార్ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 22న అతని చరవాణి వాట్సాప్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని అందులో ఉంది. దాన్ని క్లిక్ చేయగానే.. వెంటనే ఒక వ్యక్తి అతని చరవాణికి ఫోన్ చేశాడు. పెట్టుబడులకు ఎంతెంత లాభాలు వస్తాయో తియ్యని మాటలతో ప్రలోభపెట్టాడు. ఆ మాటలు నమ్మిన వృద్ధుడిని ‘స్టాక్ మార్కెట్ లెర్నర్స్ 2’ అనే ట్రేడింగ్ గ్రూపులోకి చేర్చారు. ఫోన్ చేసిన వ్యక్తి.. లాభాల గురించి విపరీతంగా చెప్పడంతో ఆయన పూర్తిగా నమ్మేశారు. అవతలి వ్యక్తి చెప్పిన విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా, బంధన్ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, యూకో బ్యాంకులకు చెందిన మొత్తం 12 ఖాతాలకు విడతల వారీగా రెండు నెలల్లో రూ.78.5 లక్షలు పంపారు. తర్వాత యాప్‌లోని తన ఖాతాలో కనిపిస్తున్న డబ్బులను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా.. అవి రాలేదు. మోసపోయినట్లు గుర్తించిన ఆయన.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మితిమీరిన వేగం.. మింగుతోంది ప్రాణం

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో వాహనంతో రోడ్డెక్కితే క్షేమంగా తిరిగి వస్తామనే నమ్మకం కొరవడింది. రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఎలాంటి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా పలువురు మైనర్లు కూడా ఇష్టారీతిన దూసుకొస్తున్నారు. అసలే ఇరుకిరుకు రోడ్లు.. దీనికితోడు నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మితిమీరిన వేగ నియంత్రణలో పోలీసులు విఫలం అవుతున్న వేళ.. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

నగరంలో రోడ్డు ప్రమాదాల తీరిది (జనవరి-అక్టోబరు 31)

526	ప్రమాదాలు
423	మరణాలు
148	గాయాలు

ప్రకాశ్‌నగర్‌లో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (పాతచిత్రం)

అడ్డదిడ్డంగా నడుపుతున్నారు..

★ రెండు వారాల కిందట.. ప్రకాష్‌నగర్‌లో రాత్రి వేళ ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చి.. రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. ★ భానునగర్‌వాసి రాజారావు.. ఇటీవల అల్పాహారం కోసం బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా.. అతివేగంగా ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలైన రాజారావు చికిత్స పొందుతూ మరణించాడు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్న గుణదల పోలీసులు, బాలుడి తండ్రిపై కేసు పెట్టారు.

20%

ప్రమాద కారణాలలో అతి వేగంతో జరుగుతున్నవే అధికం. నగరంలో రద్దీ రోడ్లపై కూడా స్పోర్ట్స్ బైక్‌లతో శరవేగంగా నడుపుతున్నారు. రాత్రుళ్లు పట్టపగ్గాలు లేకుండా వ్యవహరిస్తున్నారు. బైక్ రేసింగ్‌లతో హడలెత్తిస్తున్నారు. మత్తులో ఇష్టానుసారం నడిపి దారినపోయే వారి ప్రాణాలు తీస్తున్నారు. తాగి నడపడంతో 20 శాతం పైగా చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ యువకులు చేస్తున్నవే. గతంలో రాత్రి పూట, నిర్మానుష్య రోడ్లపై కనిపించే ర్యాష్ డ్రైవింగ్.. ఇప్పుడు రద్దీవేళల్లోనూ తారసపడుతోంది. బాగా రద్దీగా ఉండే బందరు రోడ్డు, ఏలూరు రోడ్లపైనా ఏమాత్రం భయం లేకుండా అతివేగం, స్నేక్ డ్రైవింగ్ చేస్తున్నారు. తమ కళ్ల ముందే చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు కనీసం ఆపడం లేదు. పోలీసులకు పట్టదనే ధీమాతో ఇష్టారీతిన వాహనాలు నడిపేందుకు తెగిస్తున్నారు.

సరిహద్దున వారధి.. సమకూరే దారిది

■ చకచకా ముక్త్యాల-మాదిపాడు వంతెన నిర్మాణం

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య చేపట్టిన ముక్త్యాల- మాదిపాడు వంతెన పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చాక వేగం పుంజుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.60.54 కోట్ల అంచనాతో చేపట్టిన పనులు నత్తలా సాగాయి. ఇటీవల రెండు జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారుల ప్రత్యేకశ్రద్ధతో పనులు ముందుకు సాగుతున్నాయి. ✪ జగ్గయ్యపేట మండలం ముక్త్యాల, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడుల మధ్య కృష్ణా నదిపై చేపట్టిన వారధి నిర్మాణం ఇప్పటికి 10 శాతమే పూర్తయ్యింది. ✪ రానున్న వేసవిలో పనులు వేగవంతమయ్యేలా ఆర్అండ్‌బీ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ✪ 480 మీటర్ల పొడవు, 14.80 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. ✪ మొదటి స్తంభాన్ని మాదిపాడు వైపు నుంచి మొదలుపెట్టి చివరి ఎబెండ్‌మెంట్‌ను జగ్గయ్యపేట వైపు నిర్మిస్తారు. ✪ ప్రస్తుతం పల్నాడు జిల్లా వైపు నుంచి చేపట్టిన పి1, పి2 నిర్మాణాలు పూర్తయి శ్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. * 12 స్పాన్లుగా సాగే వంతెన నిర్మాణంలో పది స్పాన్లను 35 మీటర్ల వెడల్పుతో, మధ్యలో రెండు స్పాన్లను జల రవాణాకు అనుకూలంగా.. 55.20 మీటర్ల వెడల్పు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ✪ ఆర్‌సీఎల్ ఎత్తు 17 మీటర్లు, వంతెనపై ఇరువైపులా 2.5 మీటర్ల నడకదారి ఉండేలా రూపుదిద్దుకోనుంది. ✪ మాదిపాడు వైపు అర కి.మీ అప్రోచ్ రోడ్డు సరిపోతుండగా జగ్గయ్యపేట వైపు 2 కి.మీ. మేర అప్రోచ్ రోడ్డు అవసరం కావడంతో భూసేకరణ పూర్తి కావచ్చింది.

నిర్మాణంలో వంతెన

‘ఈ వంతెన సాకారమైతే అమరావతి పరిధిలోనే కాక ఆంధ్ర, తెలంగాణల మధ్య కూడా రవాణా అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం ప్రమాదకరంగా సాగుతున్న పడవల ప్రయాణం బాధలు తప్పుతాయి. ఈ సీజన్‌లో ఐదు స్తంభాలను పూర్తి చేసి 2026లో వంతెనను పూర్తిగా అందుబాటులోకి తేవాలనేది లక్ష్యం.’

ధాన్యం సేకరణ వేగవంతం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం సేకరణను వేగవంతం చేసినట్లు జేసీ ఎస్.ఇలక్కియా తెలిపారు. గురువారం మండలంలోని కేతవీరునిపాడు, అంబారుపేట గ్రామాల వద్ద ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మునగచర్ల వద్ద రైస్ మిల్లును సందర్శించి.. దస్త్రాలు తనిఖీ చేశారు. ధాన్యంలో తేమశాతం, తూకం నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో టార్పాలిన్ పట్టలు, తేమశాతం పరిశీలన యంత్రాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, తహసీల్దారు ఎన్.సురేష్‌బాబు, మండల ఏవో గింజుపల్లి నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ డీటీ రామ్మూర్తి రెడ్డి, రైతుసేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో
డైరెక్ట్ వీవర్స్ ప్రదర్శన మరియు అమ్మకం
వివాహ సీజన్ ప్రత్యేకం
29 నవంబర్ నుండి 7 డిసెంబర్
శ్రీ శేషసాయి కళ్యాణ వేదిక, బందర్ రోడ్డు, విజయవాడ
భారతదేశం నలుమూలల గల 150+ సర్టిఫైడ్ వీవర్స్ & బెస్ట్ డిజైనర్స్ నుండి
భారతదేశం నలుమూలలా ప్రామాణికమైన & నమ్మకమైన సిల్క్ & కాటన్ చీరలు వీవర్స్ ధరకు మాత్రమే
అన్ని లేటెస్ట్ వెరైటీలు & కొత్త డిజైన్‌లు
సిల్క్ & కాటన్ శారీ | డిజైనర్ వేర్ | ఎథ్నిక్ వేర్ | కుర్తీ & డ్రెస్సెస్ | ఫ్యాషన్ జ్యూయలరీ | హ్యాండ్ క్రాఫ్టెడ్ టెక్స్‌టైల్స్

M: 9441987009 | Entry Free | All UPI Online / Debit & Credit Cards Accepted

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

సృష్టి నిందితురాలికి బెయిల్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ ఇతర నగరాల్లో కలకలం సృష్టించిన హైదరాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డా.నమ్రత (ఏ1 నిందితురాలు) గురువారం బెయిల్‌పై మహిళా జైలు నుంచి విడుదలయ్యారు. సరోగసీ, ఇతర అంశాలపై ఆమెపై 8 కేసులు నమోదయ్యాయి. అన్ని కేసుల్లోనూ న్యాయస్థానాల నుంచి బెయిల్ లభించింది. ఆగస్టులో ఈమెను నగరంలోని గోపాలపురం రాణా పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణించడం ద్వారా విభిన్న ప్రతిభావంతులు.. సకలాంగులకు ఏమాత్రం తీసిపోబోమని నిరూపించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన తోడ్పాటు అందిస్తే ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకుంటారన్నారు. అందుకు నిదర్శనమే.. ఇటీవల అంధుల టీ20 క్రికెట్ ప్రపంచకప్ విజయమన్నారు. భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రికెటర్లు టి.దీపిక, కరుణకుమారిలను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహకార సంస్థ ఛైర్మన్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు అవసరమైన సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పరుగు పందెంలో దివ్యాంగ విద్యార్థినులు

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వి.కామరాజు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జూనియర్, సీనియర్ (స్త్రీ, పురుషుల)విభాగాల్లో చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, రన్నింగ్, ట్రైసైకిల్ రేస్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ పర్యవేక్షకురాలు ప్రశాంతి, పలు పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

RAMOJI GLAMPING

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు కోరారు. ఎన్టీఆర్ జిల్లా సమగ్ర

మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

జీవన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు నుంచి అమలుకాబోయే వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అదనపు సమయాన్ని కేటాయించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. వెనుకబడిన సబ్జెక్టుల బోధనకు అదనపు సమయం కేటాయించాలని కోరారు. త్వరలో అందుబాటులోకి రానున్న స్మార్ట్ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. బ్రిడ్జ్, మోడల్ పేపర్లపై పూర్తి అవగాహన కల్పించి, గ్రేడ్ తక్కువ ఉన్న విద్యార్థులను తప్పనిసరిగా పాస్ అయ్యేలా చేయాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు 550 నుంచి 600 మార్కులు సాధించేలా ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉమర్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తింపునకు చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై చర్చ

పాయకాపురం, న్యూస్‌టుడే : క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన లినాక్ పరికరం ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావులు మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. దీనికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. క్యాన్సర్ లక్షణాలను నాశనం చేసేందుకు ఉపయోగించే లినాక్ పరికరం ఏర్పాటుకు ప్రత్యేకంగా బంకరు ఆసుపత్రి

సమావేశంలో మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహనరావు

ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. నిధులను రప్పించి ఆ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి గృహం ఇబ్బందులను కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఔషధ నియంత్రణ శాఖ భవనాన్ని తాత్కాలికంగా ఉపయోగించుకునేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. పాత ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు వైద్య సేవల విస్తరణలో భాగంగా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. సేవలు పొందేవారి సంఖ్య భారీగా పెరిగిందని, విస్తృత పనులకు సుమారు రూ.80 కోట్ల వరకు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారని.. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. పీజీ వైద్య సీట్ల పెంపునకు తగినట్లుగా కేంద్రం నుంచి వచ్చిన నిధుల వినియోగం, ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టిన పనులు వివరాలను తనకు నివేదించాలని డీఎంఈ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎంఈ రఘునందన్‌రావు, అదనపు డీఎంఈ వెంకటేశ్, ఆర్థో విభాగాధిపతి శ్యామ్, అంకాలజిస్టు విభాగాధిపతి నెహ్రూ, రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

దసరా స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా అధికారులు దసరా ఉత్సవాల స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం డిసెంబరు 11 నుంచి 15 వరకు నిర్వహించే భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సీపీ రాజశేఖరబాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్‌లతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకొని లోపాలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరు లక్షల మంది భవానీ దీక్షాధారులు విరమణ సందర్భంగా వచ్చే అవకాశం ఉందని. . అందుకు తగిన విధంగా గిరిప్రదక్షిణ, హోమగుండాలు, ఘాట్ల వద్ద ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. 36 సెక్టార్లు ఏర్పాటు చేసి ప్రతి సెక్టారుకు ప్రత్యేక అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. పది వేల మందికి పైగా కలశ జ్యోతుల ఊరేగింపుగా దీక్షాధారులు వస్తారని అంచనా వేశామన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. 3 వేల మంది పోలీసులతో పాటు 3 వందల సీసీ కెమెరాలతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల తరహాలో భవానీ దీక్షల విరమణ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 14 కౌంటర్ల ద్వారా లడ్డు ప్రసాదాల విక్రయం, 24 గంటలు కేశఖండన శాలలో భక్తుల తలనీలాలు సమర్పించేందుకు నాయీబ్రాహ్మణులు సహకరిస్తారన్నారు. 20 లక్షల లడ్డు ప్రసాదాలను భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ షీరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

క్యూలైన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పాతరాజరాజేశ్వరీపేటలో డయేరియా అనుమానిత లక్షణాలు..!

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: విజయవాడ పాతబస్తీ 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరీపేట అల్లు అప్పలనాయుడు నగర్ ప్రాంతానికి చెందిన ఏ.వినోద్‌కుమార్ పోలీసు శాఖలో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ 15 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. తొమ్మిది రోజులు కిందట కార్పొరేషన్ సరఫరా చేసే మంచినీటిని తాగి విరేచనాలు, నీరసం, వాంతులు అవ్వడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన భార్య, తల్లికి లక్షణాలు బయట పడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడి వైద్యులు వాటిని డయేరియా లక్షణాలుగా అనుమానిస్తున్నారు. మంచినీటి పైపులైన్లు కాలువల పక్కనే ఉన్నాయని.. వాటి వల్లే కలుషిత నీరు అవుతుందని వినోద్‌కుమార్ ఇప్పటికే కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్థానిక ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

కేసు గుర్తించలేదు - డీఎంహెచ్‌వో

పాతరాజరాజేశ్వరీపేటలో అనుమానిత అక్యూట్ డయేరియా డీసీజ్(ఏడీడీ) కేసు నమోదు కావడంతో సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ.. వినోద్ కుమార్ భార్య 26 ఏళ్ల మహిళ స్వల్ప లక్షణాలతో ఉండి చికిత్స అవసరం లేకుండా కోలుకున్నారని, అదే కుటుంబంలో వారంతా కూడా కోలుకున్నారని వివరించారు. ఇవి డయేరియా లక్షణాలు కావని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ముందు జాగ్రత్తగా 14 వైద్య బృందాలు ద్వారా 1,234 గృహాల్లో 3,745 ఇంటింటి సర్వే నిర్వహించామని తెలిపారు. ఎక్కడా ఏడీడీ కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. మూడు స్వల్ప లూజ్ మోషన్ కేసులు మాత్రమే నమోదయ్యాయని.. వారు కూడా కోలుకున్నారని చెప్పారు. సురక్షిత తాగునీటి కోసం ట్యాంకర్లు, బబుల్ క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. వైద్య బృందాలు ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్, జింక్ మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ మంచి నీటితో పాటు పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరుస్తుందని వివరించారు. రంగుమారిన నీటి నమూనాలను ప్రయోగశాలకు పంపించామన్నారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి స్వాగతం

అమరావతి పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి విమానాశ్రయం చేరుకున్న కేంద్ర మంత్రికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, భాజపా నాయకులు పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరాం, చిగురుపాటి కుమార స్వామి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి డి.రొనాల్డ్‌రోస్, జిల్లా ఆడిట్ అధికారి సూర్యభాస్కరరావు, విమానాశ్రయ డైరెక్టర్ ఎమ్.లక్ష్మీకాంతరెడ్డి, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ నోవాటెల్‌కు బయలుదేరి వెళ్లారు. **- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం**

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

భోజనం పెట్టలేదని భక్తులపై దాడి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులపై కొందరు దాడికి పాల్పడ్డారు. కర్రలతో దాడి చేయడంతో ఒకరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన హరిదాసు రత్తయ్య, కుటుంబసభ్యులు, ఇతరులు అమ్మవారి దర్శనానికి గురువారం ఆలయానికి వచ్చారు. అమ్మవారి సత్రాల్లో ఉండి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సమయంలో స్థానిక మహిళ వచ్చి భోజనం పెట్టమని భక్తులను అడగడంతో వారు నిరాకరించారు. దీంతో ఆమెతో పాటు మరో ఇద్దరు దాడి చేసి కర్రలతో కొట్టారు. దీంతో రత్తయ్య తలకు తీవ్ర గాయం కాగా, వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నందిగామలో ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. చికిత్స అనంతరం ఒంగోలుకు వెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులపై తరచూ దాడులు జరుగుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆలయం వద్ద భక్తులకు రక్షణ కల్పించేలా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గాయపడిన రత్తయ్య

కార్మికుల హక్కులు కాపాడేందుకు కృషి

పటమట, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం గుణదలలోని ఓ హోటల్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అసంఘటిత రంగ, గిగ్ వర్కర్లను సామాజిక భద్రత కిందకు తీసుకురావడంతో లక్షలాది మందికి రక్షణ లభిస్తుందన్నారు. మహిళలకు మాతృత్వ సెలవులు, అవసరమైతే ఇంటి నుంచే పని సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. పరిశ్రమలతో సమన్వయం పెంచి.. ఉద్యోగావకాశాలు, పెట్టుబడులు పెరిగేలా చూస్తున్నామని తెలిపారు. కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు మాట్లాడుతూ.. నూతన లేబర్ కోడ్స్‌లో ఉద్యోగులకు వార్షిక ఆరోగ్య పరీక్షలు, పరిశ్రమల్లో భద్రత కమిటీలు తప్పనిసరన్నారు. కార్మిక శాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు, పరిశ్రమల డైరెక్టర్ మోహన్‌రావు, కార్మిక శాఖ అధికారులు లక్ష్మీనారాయణ, ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సుభాష్. పక్కన శేషగిరిబాబు, చంద్రుడు తదితరులు

ఏమరుపాటుగా ఉన్న ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీలు

పోలీసుల అదుపులో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఏమరపాటుగా ఉన్న ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన నలుగురిని కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్‌స్టేషన్ ఔట్‌పోస్ట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రైమ్ ఎస్సై భానుప్రసాద్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్ రాజేంద్ర బోస్లే, కవితా భగవాన్ బోస్లే, మంజు పవార్ బోస్లే, భవన్ ఆనంద్ బోస్లేలు.. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో సామాన్య ప్రయాణికుల్లా వ్యవహరిస్తూ ఏమరపాటుగా ఉన్న ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులు అపహరిస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 22న మహారాష్ట్ర నుంచి విజయవాడ చేరుకున్నారు. రద్దీ ప్రదేశాలపై రెక్కీ నిర్వహించి, 23న బస్‌స్టేషన్‌కు చేరుకుని బస్సు ఎక్కుతున్న ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.44వేలు అపహరించారు. 25న ఇద్దరు మహిళా ప్రయాణికుల హ్యాండ్ బ్యాగ్‌లను దొంగిలించి సుమారు 50 గ్రాముల విలువైన ఆభరణాలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కృష్ణలంక పోలీసులు కేసులు నమోదు చేపట్టి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బస్‌స్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాల పుటేజీల సాయంతో ఆధారాలు సేకరించారు. అందిన సమాచారం మేరకు ప్రకాశం బ్యారేజీ సమీపంలోని సీతమ్మవారిపాదాల వద్ద నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు. . నిందితులు మహారాష్ట్ర పార్ధీ గ్యాంగ్‌కు చెందినట్లుగా నిర్ధారించారు. వారి నుంచి రూ.44వేల నగదు, సుమారు రూ.5లక్షల విలువైన 50గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన కృష్ణలంక పోలీసులు, క్రైమ్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో ఎస్సై గిరిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై భానుప్రసాద్

వైకాపా నేత కొండారెడ్డికి రిమాండ్

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసులో విశాఖపట్నం నగరానికి చెందిన వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డికి ఎంఎస్‌జే కోర్టు రిమాండ్ విధించింది. డ్రగ్స్ కేసులో అరెస్టు అయి విశాఖలో రిమాండ్‌లో ఉన్న నిందితుడిని మాచవరం పోలీసులు గురువారం పీటీ వారెంట్‌పై విజయవాడలోని ఎంఎస్‌జే కోర్టులో హాజరుపరిచారు. కొండారెడ్డికి డిసెంబరు 5 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి సత్యానంద్ ఉత్తర్వులిచ్చారు. అనంతరం రిమాండ్ నిమిత్తం విశాఖలోని కేంద్ర కారాగారానికి తరలించారు.

ముగ్గురి ముందస్తు బెయిళ్లు డిస్మిస్

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల ముందస్తు బెయిళ్లను కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో పరారీలో ఉన్న తేలప్రోలు రాము, యర్రంశెట్టి రామాంజనేయులు, వజ్రకుమార్‌లు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై గత వారం విచారణ ముగిసింది. వీటిపై గురువారం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో వీరి పాత్ర ఉందనీ, వీరిని విచారించాల్సి ఉందనీ, ముందస్తు బెయిళ్లను తిరస్కరించాలనే ప్రాసిక్యూషన్ వాదనలతో న్యాయాధికారి ఏకీభవిస్తూ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

LOYOLA PUBLIC SCHOOL, GUNTUR — 60 Diamond Jubilee Celebrations

In Memory of the Diamond Jubilee of LOYOLA PUBLIC SCHOOL, Nallapadu, Guntur and following the Legacy of St.Ignatius' Pedagogy in Education, as a Token of Love and Gratitude. Hearty Welcome to Alumni of Loyola Public School on 29-11-2025, SATURDAY at 4.30 P.M. GOD BLESS US!

loyolapublicschool.lps@gmail.com

☎ : 91216 06671

Management

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూపు, VJA, వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/ పంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 96767 01122, 97047 41122

REAL ESTATE

రాజధాని అమరావతిలో గజం 5000/- & 10000/- రాజధానిలో ఎకరం పొలం 70 లక్షలు, గుంటూరులో డూప్లెక్స్ విల్లా 1.60 Cr. Ph: 90523 45356.

FLAT FOR SALE

కాసా TVS, అశోక్‌నగర్ బందరు రోడ్డుకి ప్రక్కన నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 76800 70510.

TADIGADAPA

తాడిగడప బస్సు రోడ్డును అనుకొని WF 2 ఫ్లోర్ నెలకు 20,000 అద్దెవచ్చు 3 BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర. PH No- 83099 39009.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

RAMAVARAPPADU

FLAT FOR SALE
- 363 SQYRDS
- 65 UDS FOR EACH FLOOR
- 5 FLOORS
- 4BHK EACH FLOOR
- 2500 SQRFT EACH FLOOR TOTAL
- PLINT 2100 SQRFT EACH FLOOR
- 10 CAR PARKS TOTAL
- 2 FOR EACH FLAT
- PRICE : 4500/- PER SFT. (SLIGHTLY NEGOTIABLE)
- BRAND NEW LUXURY HIGH QUALITY CONSTRUCTION AT A VERY AFFORDABLE PRICE
- READY TO OCCUPY

Contact : 8333911102 8712123344, 9390311148 Ramvarapadu Inner Ring Road, Back Side of Innotel, Opp. Raguram Steels

PLOT FOR SALE

5999/- to 13999/- వెస్ట్‌బైపాస్‌కి 1Km అంబాపురం K తాడేపల్లి G కొండూరు గన్నవరం కంకిపాడు బందరురోడ్‌లో 2/3BHK విల్లాస్ ✆ 83749 36634

TO LET

3BHK Flat for Rent with Good ventilation. 4th Floor Krishna Estates Apart. Srinivasanagar Bank Colony VJA ✆ 70322 18743

కుంచనపల్లిలో, మారుతి రెసిడెన్సీ నందు, 5వ ఫ్లోర్‌లో,తూర్పు ఫేసింగ్‌తో 2బెడ్‌రూమ్, విశాలవంతమైన ఫ్లాటు, పూజరూమ్, కార్‌పార్కింగ్‌తో అద్దెకు కలదు. ఫ్యామిలీకి/ ఉద్యోగస్తులకు ప్రాధాన్యత. ✆98494 97403

JOBS

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama & Vijayawada and Car Drivers. ✆ 94324 54545.

మచిలీపట్నం బైపాస్‌రోడ్‌లోని కృష్ణవేణి ITI కాలేజ్‌లో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ చదివినవారు కావలెను. కాలేజీ ఆవరణలో ఉచితవసతి. ✆ 98486 79360

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆70320 60786

ప్రముఖ కార్పొరేట్ కంపెనీలో 15,000/- జీతం+ ఇన్సెంటివ్స్ మరియు 50K నుండి లక్ష రూపాయలు సంపాదన కావలసినవారు సంప్ర|| ✆ 94929 74872.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. A:25-30Y, Sal:18-25K Qul డిగ్రీ ✆99495 58181, 81215 58181

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆96402 58899, 96404 68899

FACULTY/ TEACHERS

WANTED: Principal To Run the School, Qul: PG+ B.Ed., need Sy. Experience, Salary: 40 to 50K, Cont: Buchi Reddy Palem Nellore (Dt.) ✆ 94401 22213.

Wanted English, Social, PS & Computer Teachers. Cont: Kommareddy (EM) High School, Bantumilli, Krishna Dist. ✆ 98480 63355.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

కొండపల్లి పోస్టాఫీస్ రోడ్డులో మురుగు కాలువ నిండిదని స్థానికులు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పారిశుద్ధ్య అధికారి శ్రీను స్పందించి కార్మికులను పంపించి ఆ ప్రాంతంలోని కాలువల్లో పూడిక తీయించారు.

స్థానిక చెరువు బజార్‌లోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

★ తిరువూరు 18వ వార్డు డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రసాదరావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

? కొండపల్లి కిల్లా రోడ్డు నాలుగు రహదారుల కూడలిలో ఉదయం 8 నుంచి 9 మధ్య తీవ్రమైన రద్దీ ఉంటోంది. ఈ సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. **- దామెర్ల నరసింహారావు, స్థానికుడు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. **- లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సై - న్యూస్‌టుడే, కొండపల్లి**

? జి.కొండూరు బీసీ కాలనీలోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. **- రామకృష్ణ గ్రామస్థుడు** ✔ సిబ్బందితో కాలువలు పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. **- బసవ లింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

ప్రజాదర్బార్ నేడు

జి.కొండూరు : స్థానిక సామాజిక భవనం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. మండలంలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పల బంధం 72వ కి.మీ నియంత్రిక నుంచి 800 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల చేసినట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

గొల్లపూడి, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం పరిధిలో పని చేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ లక్ష్మీశ ఉత్తర్వులు జారీ చేశారు. గొల్లపూడి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఎం.స్వరూపారాణిని రెడ్డిగూడెం, ఎనికేపాడు పంచాయతీ కార్యదర్శి సోమా విద్యాధర్‌ను విజయవాడ గ్రామీణ మండలం డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అన్నదానం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని ఐడియాస్ సేవా సంస్థలో గురువారం విజయవాడ ఏరీస్ ఆగ్రోస్ కంపెనీ స్థాపించిన రోజు సందర్భంగా వృద్ధులు, అనాధ పిల్లలకు అన్నదానం చేశారు. సంస్థ డైరెక్టరు అవ్వారి శౌరి తదితరులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ వేంకటేశ్వరుని కల్యాణం

అన్నేరావుపేట(రెడ్డిగూడెం), న్యూస్‌టుడే : అన్నేరావుపేటలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం గురువారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. రాత్రికి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి కె.రామ్‌చంద్ ప్రత్యేక పూజలు చేశారు.

ఆశలు వదులుకుని.. చేలను దున్నేసి

అలవిగాని నిబంధనలతో పత్తి రైతులు బెంబేలు

మైలవరం, న్యూస్‌టుడే

మేమింతే.. మా నిబంధనలు మారవంతే.. అంటున్నారు భారతి పత్తి సంస్థ (సీసీఐ) అధికారులు. వర్షాలతో పంట దిగుబడి, నాణ్యత తగ్గడంతో దిగులు చెందుతున్న పత్తి రైతులకు సీసీఐ నిబంధనలు అలవిగాని విధంగా తయారయ్యాయి. పేరుకు కేంద్రాలు ప్రారంభించినా, నాణ్యత లేమి పేరిట కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో యార్డు వైపు చూసేందుకు అన్నదాతలు వెనుకాడుతుంటే, వచ్చిన ఒకరిద్దరూ తిరిగి బయటకు తీసుకెళ్తున్నారంటే సీసీఐ తీరును అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా పత్తి పంటను అధిక వర్షాలు దెబ్బతీశాయి. తీతల సమయంలో మొంథా తుపాను ముంచెత్తగా, తొలి తీత నష్టపోయారు. తర్వాత తీతల సమయానికి అంతంత మాత్రంగానే దిగుబడి ఉండగా, వర్షాల ప్రభావం కొంత నాణ్యతపై పడింది. అప్పటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో, క్వింటా రూ.5 వేల చొప్పున బయట వ్యాపారులకు విక్రయించారు.

బయటకు తరలించేందుకు బుట్టలతో పత్తి ఎగుమతి చేస్తున్న కూలీలు

క్వింటా కూడా.. : పేరుకు కేంద్రం తెరిచినా, వారి నిబంధనల మేరకు నాణ్యత గల పత్తిని తేవడం లేదంటూ కొనుగోలు చేయడం లేదు. పైగా రైతులే నేరుగా యార్డుకు కేటాయించిన గుంటూరులోని జిన్నింగు మిల్లులకు తరలించుకో వచ్చంటూ సూచనలు ఇస్తున్నారు. దాంతో చిన్న సన్న కారు రైతులు అంత దూరం వెళ్లినా, నాణ్యత పేరిట తిరస్కరిస్తారన్న భయంతో గ్రామాల్లోని వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం నాణ్యత ఉన్న పత్తిని క్వింటా రూ.6,200ల చొప్పున వ్యాపారులు కొంటున్నారు. ఆ ధర సైతం నష్టం కలిగిస్తున్నా, ప్రత్యామ్నాయం కానరాక విక్రయిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఎకరానికి సరాసరి 10 క్వింటాళ్ల దిగుబడులు ఆశించిన రైతులకు 5 క్వింటాళ్లు మించి రావడం లేదు. దాంతో పెట్టుబడులపై ఆశలు వదులుకుని కాయలున్నా, చేలను దున్నేసి మొక్కజొన్న సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగో వంతు పత్తి చేలు ఎండుముఖం పట్టాయి.

తిరస్కరిస్తే దిక్కెవరు?

కౌలుకు సాగు చేస్తున్న పొలం నుంచి తెచ్చిన పత్తిని, నాణ్యత లేమి పేరిట సీసీఐ కొనడం లేదు. చేసేది లేక, తెచ్చిన దాన్ని ఖమ్మం జిల్లాలో విక్రయించుకోవడానికి తీసుకెళ్తున్నాను. కూలీలతో పత్తిలో కాయను వేరు చేయించుకునేందుకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వమే నాణ్యత పేరిట తిరస్కరిస్తే రైతులకు దిక్కెవరు.

- గద్దె వెంకటేశ్వరరావు, రైతు, సబ్జపాడు

సబ్సిడీపై డీఏపీ విక్రయాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం సబ్సిడీ ధరలతో రైతులకు అందిస్తున్న ఎరువులు తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలని కొటికలపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం అధ్యక్షుడు యేడ్లూరి వెంకట శివరావు సూచించారు. పరపతి కేంద్రానికి మంజూరైన 25 టన్నుల డీఏపీ, తదితర ఎరువుల విక్రయాలను ఆయన గురువారం ప్రారంభించారు. రైతుల అవసరాల మేరకు మూడు నుంచి ఐదు బస్తాల వరకు డీఏపీతో పాటు ఎరువుల ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరపతి కేంద్రం త్రిసభ్య కమిటీ సభ్యులు, కేంద్రం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో జాబ్ మేళా

కొండపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆదేశాల మేరకు కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. దీనికి పదో తరగతి చదువుకున్న వారితో పాటు పీజీ, ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులని చెప్పారు. జాబ్ మేళాకు వచ్చే వారు అర్హత ధ్రువపత్రాల నకళ్లు తీసుకురావాలని చెప్పారు. వివరాలకు 79016 10174, 91548 18200 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

అనర్గళ ఉపన్యాసాలతో బహుమతులు

మైలవరం : ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో కరస్పాండెంట్ మల్లికార్జునన్, సిబ్బంది

విస్సన్నపేట : విజేతలతో పుల్లారావు, ఉపాధ్యాయులు సాయి సురేష్, చరణ్య

మైలవరం, న్యూస్‌టుడే : సమకాలీన అంశాలపై అనర్గళ ఉపన్యాసాలతో ప్రతిభ చాటిన విద్యార్థులు బహుమతులు సాధించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో 10వ తరగతి విద్యార్థిని కురుమెళ్ల దీపిక, 9వ తరగతి విద్యార్థులు షేక్ షఫియా, ఓబులరెడ్డి హరిత వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. కరస్పాండెంటు మల్లికార్జునన్, సిబ్బంది దీవెన్, నాగయ్య, పవన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ఎ.దీపిక(9వ తరగతి), కె.లయ హారిక(9వ తరగతి), ఎం.ఉద్విత (7వ తరగతి) విద్యార్థులు ప్రతిభ చాటి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్ నాగ పవన్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. స్కూల్ ఇన్‌ఛార్జి ఎ.పుల్లారావు, ఉపాధ్యాయులు ఎ.సాయి సురేష్, ఎం.చరణ్య పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో అనారోగ్యాలు అధికం

కొండపల్లి, న్యూస్‌టుడే : పోషకాహార లేమి, జీవనశైలిలో చోటు చేసుకున్న మార్పులతోనే అనేక వ్యాధులు సంభవిస్తున్నాయని వైద్యులు విజయవాణి, రాథోడ్ తెలిపారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో కొండపల్లి బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆహార అలవాట్లను మార్చుకోవడంతో వయసుకు మించిన వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. కౌమారంలో ఉన్న విద్యార్థినులకు వస్తున్న సమస్యలకు కారణం ఆహారం, జీవనశైలి మార్పుల వల్లనే అన్నారు. అన్ని విషయాల్లో క్రమశిక్షణ కలిగి ఉంటే భవిష్యత్తును అనుకున్న విధంగా మలచుకోవచ్చున్నారు. విద్యార్థినుల్లో అత్యధికులు నేత్ర సమస్యతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో లయన్స్ క్లబ్ వీఆర్‌కే నగర మహిళా ఆధ్వర్యంలో పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని మాజీ సర్పంచి అమ్మాజీ తెలిపారు. వైద్యులు విజయ్ కుమార్, మాజీ సర్పంచి అమ్మాజీ, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఏఎన్ఎం కామేశ్వరి, ఆశాలు రాజ్యలక్ష్మి, శివపార్వతి, ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు విజయవాణి, రాథోడ్

వైద్య శిబిరంలో బారులు తీరి ఇలా..

క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఆటలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ ఎ.రవినాయుడు వివరించారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కేతనకొండలోని శ్రీస్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో గురువారం ఆయన గురుకుల్ ఒలింపిక్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్వామి నారాయణ గురుకుల్ పాఠశాల యాజమాన్యం జిల్లా స్థాయిలో గురుకుల్ ఒలింపిక్స్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖోఖో వరల్డ్ ఛాంపియన్ శివారెడ్డి, స్వరూప్ దాస్ స్వామీజీ, కృష్ణమూర్తి దాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వందనం స్వీకరిస్తున్న రవినాయుడు, నిర్వాహకులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో గత మూడ్రోజులుగా ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో ప్రతి రోజు నాలుగు లీగ్ మ్యాచులు జరుగుతున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. గురువారం నాలుగు మ్యాచులు నిర్వహించగా, అందులో ఒక మ్యాచు సమాన స్కోర్లతో డ్రాగా ముగిసినట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ పి.సుభాష్ బాబు, ఏరియా లీడర్ ఎం.ఉపేంద్ర తదితరులు అతిథులుగా హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న సుభాష్‌బాబు, నాయకులు

ఆ రేటు చెల్లించకపోతే అంతే ఇక!

కొండపల్లి పురపాలికలో అనధికారంగా నగదు వసూలు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

★ కొండపల్లికి చెందిన ఓ అపార్టుమెంటు నివాసితులు వ్యర్థాలను పడేయడానికి మలుపు వరకు వెళ్లాల్సి వస్తోంది. అందుకు చెత్తను బండిలో వేసుకెళ్లాలని సిబ్బందిని కోరారు. అపార్టుమెంటు కింద ఉంచిన తర్వాత దాన్ని బండిలో వేయాలంటే నెలకు రూ.300 కడితేనే తరలిస్తామని వారు చెప్పారు. ఈ విషయాన్ని అపార్టుమెంటు వాసులు పురపాలిక కార్యాలయంలో చెబితే అవును నిజమే.. రూ.300 కడితేనే జరుగుతుందన్నారు. దీంతో చేసేది లేక నగదు చెల్లించారు.

★ శ్రామిక నగర్ ఫంక్షన్ హాల్ వద్ద డ్రమ్ము నిండా చెత్త పేరుకుంది. దాన్ని తొలగించాలంటే రూ.వెయ్యి కడితేనే తీస్తామని సిబ్బంది చెప్పారు. చేసేది లేక ఫంక్షన్ హాల్ నిర్వాహకులు నగదు చెల్లించి పని చేయించుకున్నారు.

కొండపల్లి పురపాలిక పరిధిలోని పారిశుద్ధ్యం తదితర పనులకు ఓ రేటు ఉంటుందన్నది వాస్తవం. ఆ రేటు చెల్లించకపోతే పనులు జరిగే పరిస్థితి లేదు. ఇది స్థానికంగా ప్రతి ఒక్కరూ తెలుసుకుంటున్న విషయం. శుభకార్యాలు జరిగిన సందర్భంలో కొందరు అల్లరి చేసే వారికి సమర్పించుకుంటున్నట్లే పారిశుద్ధ్యంకు కొంత చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఆ రేటు ఎంత అనేది వారు సూచించిన పట్టీ మేరకు ఉంటోంది. అలా చెల్లింపులు జరిగితే గానీ పనులు జరగవు.

కొండపల్లి రహదారి పక్కన చెత్త

కొన్ని డివిజన్లకే..: పురపాలికలో పూర్తి స్థాయి పారిశుద్ధ్య పనులు కొన్ని డివిజన్లకే పరిమితమయ్యాయి. పురపాలికలోని రెండు ప్రాంతాలకు కలిపి 29 డివిజన్లు ఉన్నాయి. అయితే అజమాయిషి చెల్లించుకునే కౌన్సిలర్లకే ఆయా డివిజన్లలో పనులు అవుతున్నాయన్నది సత్యం. వారి ఆధ్వర్యంలోనే పురపాలిక సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇతర డివిజన్లలోని ప్రధాన వీధులకే పారిశుద్ధ్యం పరిమితమైంది. పురపాలికలోని రెండు ప్రాంతాలకు కలిపి 186 పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరిలో వివిధ పనులకు కొందరిని వేరు చేయగా 155 మంది మాత్రమే పారిశుద్ధ పనులు నిర్వహిస్తున్నారు. వీరు కూడా కొన్ని డివిజన్లకే పరిమితం కావడంతో ఇతర చోట్ల పనులు చేసే వారికి డిమాండ్ పెరిగింది. దీంతో చెత్త ఎత్తాలన్నా.. తరలించాలన్నా.. రుసుము చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రుసుము ఏమీ లేదు : చెత్త తొలగింపునకు, పారిశుద్ధ్య పనులకు ఎటువంటి చెల్లింపులు లేవు. పురపాలిక పరిధిలో చెత్త పన్ను వసూలు చేయడం లేదు. ఈ విషయాన్ని ప్రజలు అందరూ గమనించాలి. **- వెంకటరత్నం, పురపాలిక ఇన్‌ఛార్జి**

దుగ్గిరాలపాడు, గంగినేని సర్పంచుల చెక్ పవర్ రద్దు!?

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్ రద్దు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు గురువారం జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. గతంలో ఈ రెండు గ్రామాల్లో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపిస్తు పీజీఆర్ఎస్‌లో దాఖలు అయిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ఇందుకు కారణమైన గంగినేనిపాలెం సర్పంచి పిల్లి రామారావు, దుగ్గిరాలపాడు సర్పంచి జడ రాంబాబులకు మూడు నెలలు చెక్ పవర్ రద్దు, పంచాయతీ కార్యదర్శి డి.రామకృష్ణని సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులిచ్చారు. దుర్వినియోగమైన నిధులు సర్పంచులు 50 శాతం, కార్యదర్శి 50 శాతం చెల్లించాలని, తదుపరి ఆయా గ్రామాల్లో నిధులు వినియోగానికి ఎంపీడీవోకు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయమై డీఎల్‌పీవో రాఘవన్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఎటువంటి ఆర్డర్ కాపీలు తమకు అందలేదని చెప్పారు. డీపీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

బూడిద రవాణాతో తీవ్ర కాలుష్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్ నిర్లక్ష్య ధోరణితో రూ.కోట్లు గుత్తేదారులు ఆర్జిస్తుంటే.. రోగాలు ప్రజలు భరిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి మహేష్ అన్నారు. బూడిద చెరువు రోడ్డులో బూడిద లారీలను స్థానికులు గురువారం అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బూడిద రవాణా అవుతున్నప్పుడు రహదారులపై పడటంతో పాటు తీవ్ర కాలుష్యం వెదజల్లుతుందన్నారు. గత నెలలో బూడిద రవాణా నిలిచిపోవడంతో కాలుష్యం సాధారణ స్థాయికి చేరుకొని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఎంతో ఆనందించారన్నారు. గతంలో బూడిద మాఫియాకు చెందిన వ్యక్తులు, ఇప్పుడు సంస్థ గుత్తేదారుడు బూడిద రవాణా చేసే క్రమంలో నిర్లక్ష్యం వహిస్తూ కాలుష్యం ఏర్పడటానికి కారణమవుతున్నారన్నారు. దీనిపై ఎన్టీటీపీఎస్ యాజమాన్యం స్పందించి మొబైల్ టీంను ఏర్పాటు చేయాలన్నారు. తెదేపా నాయకులు ఫణి, గాంధీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం మహేష్ తదితరులు

'తిరుమల పవిత్రత దెబ్బతీయాలనే ప్రయత్నం'

గొల్లపూడి, న్యూస్‌టుడే : తిరుమల పవిత్రతను దెబ్బతీయాలనే తాడేపల్లి ప్యాలెస్ అజెండాను వైవీ.సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి అమలు చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తితిదేలో చేసిన పాపాల వల్లనే వైకాపాకు 11 సీట్లు వచ్చాయని ఆరోపించారు. పరకామణి దోపిడీ నుంచి కల్తీ నెయ్యి వరకు అనేక అక్రమాలు జరిగాయన్నారు. పరకామణిలో భక్తులు ఇచ్చిన కానుకలను అడ్డగోలుగా దోచుకున్నారన్నారు. తితిదే మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి చేసిన పాపాలు, అక్రమాల నుంచి తప్పించుకోలేరని తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న దేవినేని

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

జి.కొండూరు, న్యూస్‌టుడే : కవులూరు గ్రామంలో మానసిక ఆరోగ్య సమస్యలపై వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ కేశవ్, కౌన్సిలర్ ఝాన్సీ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు మానసిక కుంగుబాటుకు గురి కాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలు సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది బట్టపర్తి స్వాతి, ప్రియాంక పాల్గొన్నారు.

కవులూరులో అవగాహన కల్పిస్తున్న కేశవ్

శ్మశానవాటిక ఏర్పాటు చేయండి

మైలవరం, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా తమ గ్రామంలో శ్మశానవాటిక లేక వాగు వెంబడి అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామని మండలంలోని సబ్జపాడుకు చెందిన ఎస్సీలు వాపోయారు. తమ ఇబ్బందులు తొలగేలా శ్మశాన వాటిక ఏర్పాటు చేయించాలంటూ వారంతా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ దరియాను కలిసి వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బి.శరత్, ఎం.ప్రభాకర్, సుదర్శనం, కోటేశు, స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీలు

చికిత్స పొందుతూ వ్యవసాయ సహాయకుడి మృతి

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉయ్యూరు మండలం గండిగుంట-1 సచివాలయంలో వ్యవసాయ సహాయకుడు ఉప్పుటాల సాయి కిరణ్ (24) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. తిరువూరు మండలం రాజుపేట సొంత గ్రామం. తండ్రి బాల్యంలోనే చనిపోవడంతో తల్లి కూలీ పనులు చేసుకుంటూ చదివించారు. ఉద్యోగం చేస్తూ తనకు అండగా నిలుస్తున్న సమయంలో ప్రమాదం రూపంలో తమ కుమారుడు దూరం కావడం పై తల్లి నాగమణి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్న సాయికిరణ్ మృతిపై గండిగుంట గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవతో రైతులకు ఆసరా

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు ఆసరా కలుగుతుందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పొందుగలలో తెదేపా నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. రామారావు, రాజగోపాల్, శివబాబు, వెంకటేశ్వరరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : మండలంలోని ఆంజనేయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి పాల్గొన్నారు. పంట దిగుబడి, గిట్టుబాటు ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

పొందుగలలో కరపత్రాలు చూపుతున్న తెదేపా నాయకులు, రైతులు

ఆంజనేయపురం: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : అఖిల భారత కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, రాజస్థాన్ రాజ్యసభ సభ్యుడు నీరజ్ డాంగి కోరారు. గురువారం తిరువూరు రాజీవ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకే జిల్లా, నగర కమిటీల అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరసా రాజీవ్‌రతన్, జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీరజ్ డాంగి, వేదికపై నాయకులు

నిబంధనలు అతిక్రమించ రాదు

విస్సన్నపేట: మండల కేంద్రంలోని మెడికల్, రేషన్, పెట్రోల్ బంకులను తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను అతిక్రమించ వద్దని తప్పక పాటించాలని సూచించారు. డీటీ నాగరాజు, ఆర్ఐ సుజాత, వీఆర్వోలు పాల్గొన్నారు.

తాతకుంట్ల: రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మికల్యాణి

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : గంపలగూడెం మార్కెట్ యార్డులో, తిరువూరు మండలం రోలుపడిలో ఆరబెట్టిన ధాన్యాన్ని ఆర్డీవో కె.మాధురి గురువారం పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను సాగుదారులకు వివరించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని రెడ్డిగూడెం తహసీల్దార్ జె.సుశీలాదేవి పేర్కొన్నారు. గురువారం నాగులూరు, రంగాపురం, రెడ్డిగూడెం, మద్దులపర్వ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఏవో డి.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి నరేంద్ర కుమార్, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

రంగాపురం: ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న వెలగపూడిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పసుపులేటి నాగ వెంకటేష్ పాల్గొని ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కుటుంబం వెంకటేష్‌ని అభినందించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం కె.రెడ్డయ్య గైడ్ టీచర్ యన్.కాశి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు: మాక్ అసెంబ్లీలో కీలకంగా పని చేసిన ఎ.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు మేడుకొండూరు నరసింహారావును రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు

నాగ వెంకటేష్‌ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

(c) eenadu

విజయవాడ తూర్పు

డీసీపీ ఆకస్మిక తనిఖీ

స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న కృష్ణకాంత్ పటేల్

కృష్ణలంక: డీసీపీ కృష్ణకాంత్ పటేల్ గురువారం సాయంత్రం కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని దస్త్రాలు, పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ పావన్‌కుమార్, సీఐ ఎస్‌హెచ్‌వో నాగరాజు, స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

★ నాలుగో డివిజన్ శ్రీనగర్ కాలనీ తిమ్మరుసు వీధి ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పొంగుతున్నాయని స్థానికుడు రాజేశ్వరరావు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. ఏఈ దీక్షిత్ స్పందించి.. పూడిక తీయించారు. ★ మూడో డివిజన్ కరెన్సీనగర్, శ్రీరామచంద్రనగర్ కాలనీ ప్రాంతాల్లో వీధి దీపాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికుడు భగవాన్ 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు స్పందించి.. సమస్య పరిష్కరించారు. ★ ఐదో డివిజన్ క్రీస్తురాజపురం 5-12/64 విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడంలేదని స్థానికుడు సుబ్బారావు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. ఏఈ ప్రభాకర్ స్పందించి.. కొత్త దీపం ఏర్పాటు చేయించారు.

-న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ఎట్టకేలకు మూత ఏర్పాటు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నాలుగో డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో ప్రధాన రహదారి మలుపు వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న వైనంపై 'ప్రమాదం...పట్టించుకోరే..' శీర్షికన 'ఈనాడు'లో శనివారం ప్రచురితమైన కథనానికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్-3 ఏఈ దీక్షిత్ స్పందించారు. గొయ్యిపై మూత ఏర్పాటు చేయించారు.

స్పందనకు వందనం

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

అన్నదానం చేస్తున్న ఏరిస్ సంస్థ సిబ్బంది

నున్న, న్యూస్‌టుడే: ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ 57వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ- నూజివీడు గ్రామంలో ఏరిస్ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. విజయవాడ ప్యాక్టరీలో 200 మందికి పైగా స్థానికులకు అన్నదానం చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాల్లో ఏరిస్ సంస్థ వారు రైతు సదస్సులు నిర్వహించారు. వాతావరణంలోని మార్పులతో పంటల్లో వచ్చే సమస్యలను, ఏరిస్ ఉత్పాదనల ప్రాముఖ్యతను వివరించారు. వివిధ వ్యవసాయ, ఆనాద శరణాలయాలు, రైతు సదస్సుల్లో లక్ష మందికి అన్నదానం చేపట్టారు. రైతు సదస్సులకు హాజరైన అన్నదాతలకు క్విజ్ కార్యక్రమం ద్వారా ఏరిస్ వారి పోషక ఉత్పత్తులు, శౌర్య బ్యాటరీ స్ప్రేయర్లు బహుమతులుగా అందజేశారు. సంస్థ ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ ఏరిస్ రైతు సంక్షేమానికి, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

స్పందించండి.. కార్డు తీసుకోండి!

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పేద, మధ్య తరగతి కుటుంబాలను అధికారులు గుర్తించి రేషన్‌కార్డులు అందజేశారు. ఆయా లబ్ధిదారులకు చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం బియ్యం, నిత్యావసరాలు సరఫరా చేస్తోంది. అయితే అలా వచ్చిన బియ్యం అర్హులకు అందడం లేదు. పక్కదారి పడుతున్నాయి. ఈ పరిస్థితిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టింది. అయితే వీటిని ఇంకా కొందరు తీసుకోవాల్సి ఉంది. త్వరగా స్పందించి తీసుకోవాలని పౌరసరఫరాల శాఖాధికారులు కోరుతున్నారు.

ఇతర ప్రాంతాల వారే ఎక్కువ..

తూర్పు నియోజకవర్గంలోని 21 డివిజన్ల పరిధిలో 87 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. 66,567 మంది కార్డుదారులు ఉన్నారు. ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. కార్డుదారుల ఇళ్లకు వెళ్లి సిబ్బంది, రేషన్ డీలర్లు అందజేశారు. అనంతరం బియ్యం కోసం రేషన్ దుకాణానికి వచ్చిన వారికి ఇచ్చారు. ఇలా ఇప్పటి వరకు 61,182 మందికి పంపిణీ పూర్తయ్యింది. అయితే నగరం కావడంతో ఉపాధి కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారిలో ఎక్కువ మంది కృష్ణలంక, రాణిగారితోట, మొగల్రాజపురం, గుణదల తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరికి కూడా రేషన్‌కార్డులు అందజేశారు. కొందరు తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లిపోయారు. మరికొందరు పెనమలూరు, గన్నవరం, విజయవాడ మధ్య నియోజకవర్గాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఇలా 5,385 మంది వరకు ఉన్నారు. వారి వివరాలు సిబ్బంది సేకరించి సమాచారం అందిస్తున్నారు.

నియోజకవర్గంలో..	
కార్డులు:	66,567
పంపిణీ:	61,182
శాతం:	92.19

అందరికి అందజేసేలా చర్యలు

గతంలో ఇక్కడ ఉండి రేషన్‌కార్డులు తీసుకున్నారు. వివిధ కారణాలతో ఇతర జిల్లాలు, ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారికి ఫోన్‌చేసి తెలియజేశాం. పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా అందజేసేలా చర్యలు తీసుకుంటాం. కార్డుదారులు సహకరించాలి.

-శ్రీనివాస్, పౌరసరఫరాలశాఖ ఏఎస్‌వో

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎంపీ శివనాథ్

పటమట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి అందించడం ద్వారా రాష్ట్రంలోని పేదలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకుంటున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 51 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.32 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఇప్పటి వరకు 400 మంది రూ.3.45 కోట్ల మేర లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు సొంగా సంజయ్‌వర్మ, కేశినేని, గొర్రె శ్రీనివాస్ చక్రవర్తి, వల్లభనేని నరసింహాచౌదరి, మాదిగాని గురునాథం, పరిశపోగు రాజేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి


గుణదలలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: సొంత స్థలం ఉన్న వారి గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఉచితంగా అందజేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో సుమారు 4వేల మంది వరకు ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతానికి 70 మంది మాత్రమే చేసుకున్నారన్నారు. స్థలం లేని వారు ప్రతి శుక్రవారం తమ కార్యాలయంలో జరిగే ప్రజా దర్బార్‌లో పాల్గొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమ్మిశెట్టి వాసు, తాడి బాబూరావు, ముమ్మనేని ప్రసాద్, ఈశ్వర్, చెన్నుపాటి గాంధీ, గద్దె రమేష్, గల్లా రవి, ఉషారాణి, కోమలి, దేవానంద్ పాల్గొన్నారు.

★ వైద్య చికిత్సలు చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందించి.. ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మూడో డివిజన్ గుణదల సాయి మెస్ ప్రాంతంలో వైద్య సహాయ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.26,36,919 విలువైన 30 చెక్కులను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు.

సెమీ ఫైనల్స్‌లో బాస్కెట్‌బాల్ జిల్లా జట్లు

బాలుర క్వార్టర్ ఫైనల్స్‌లో పోటీపడుతున్న క్రీడాకారులు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ అండర్-19 బాలబాలికల పోటీల్లో ఆతిథ్య ఉమ్మడి కృష్ణా బాలబాలికల జట్లు సెమీఫైనల్‌లోకి ప్రవేశించాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో కృష్ణా జట్టు లీగ్ దశలో పూల్ విజేతలుగా నిలిచాయి. గురువారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ బాలుర విభాగంలో కృష్ణా జట్టు 38-2 తేడాతో చిత్తూరుపై, అనంతపురం జట్టు 60-39 తేడాతో విశాఖపై, తూర్పుగోదావరి జట్టు 31-24 తేడాతో కర్నూలుపై, పశ్చిమగోదావరి జట్టు 34-25 తేడాతో గుంటూరు జట్టుపై విజయం సాధించారు.. బాలికల విభాగంలో కృష్ణా జట్టు 24-9 తేడాతో చిత్తూరుపై, అనంతపురం జట్టు 22-10 తేడాతో గుంటూరుపై, తూర్పుగోదావరి జట్టు 30-5 తేడాతో విజయనగరంపై, పశ్చిమగోదావరి జట్టు 21-4 తేడాతో విశాఖపై విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పోటీలు శుక్రవారం ముగియనున్నాయి.

ఉపన్యసించి.. విజేతలుగా నిలిచి

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న లిటిల్ బ్రెయిన్స్ డైరెక్టర్ ఫణిప్రసాద్, ప్రిన్సిపల్ సుధాప్రవీణ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): ప్రతి నిమిషం ఎంతో కీలకంగా మారిన ప్రస్తుత తరుణంలో చదువులకు విద్యార్థులు దూరంగా ఉండి, విజ్ఞానం పెంపొందించుకోవాలని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల డైరెక్టర్ ఫణిప్రసాద్ ముక్కవి అన్నారు. సిద్ధార్థనగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం'అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనర్గళంగా ప్రసంగించి ఆకట్టుకున్నారు. ఎం.విద్యాసాయిశ్రీ(పదో తరగతి), జె.వైష్ణవిశ్రీ (తొమ్మిదో తరగతి), పి.ఋషిచౌదరి (ఎనిమిదో తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి డైరెక్టర్ ఫణిప్రసాద్, ప్రిన్సిపల్ ఎం.సుధాప్రవీణ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

డ్రెయిన్ ఇలా.. మురుగు పారేదెలా..?

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంతంలో డ్రెయిన్‌లో మురుగు పారడం లేదు. కాలువ చుట్టూ పిచ్చిమొక్కలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు పారుదల లేక పోవడంతో దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయ సహాయం కోసం వస్తే.. మహిళతో అసభ్య ప్రవర్తన

వైకాపా లీగల్ సెల్ సభ్యుడు వెంకటేశ్వరశర్మపై కేసు

పటమట - న్యూస్‌టుడే: ఓ మహిళకు భర్తతో ఉన్న విభేదాలను తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించాడు ఆ న్యాయవాది. ఈ విషయంలో న్యాయ సహాయం కోసం వచ్చిన ఎస్సీ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేసేందుకు ప్రయత్నించాడు... వైకాపా లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాది. చివరకు ఆమె ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

★ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఓ మహిళ, ఆమె భర్త... ఇద్దరూ కూలి పనులకు వెళ్తుంటారు. తాగుడుకు బానిసైన అతడు.. నిత్యం ఆమెను హింసించేవాడు. దీంతో భర్తతో కాకుండా విడిగా ఉంటోంది. ఈ వివాదానికి సంబంధించి న్యాయ సహాయం కోసం సోదరుడితో కలసి గురువారం విజయవాడలోని వైకాపా న్యాయ విభాగం సభ్యుడైన వెంకటేశ్వరశర్మ ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా.. న్యాయవాదికి ఆమె వివరాలు చెబుతుండగా.. వేరుగా మాట్లాడాలని చెప్పి.. ఆమె సోదరుడిని బయటకు పంపాడు. న్యాయవాది వెంకటేశ్వరశర్మ.. మహిళ చున్నీ లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. న్యాయవాది ఇంటి బయటకు ఆమె ఏడుస్తూ వచ్చింది. వెంటనే పోలీసులకు కలసి డయల్ 112కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న మాచవరం స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను, న్యాయవాది వెంకటేశ్వరశర్మను స్టేషన్‌కు తీసుకొచ్చారు. 'వెంకటేశ్వర శర్మ తనకు డబ్బులు ఇస్తూ.. అసభ్యంగా ప్రవర్తించాడని' ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై మాచవరం పోలీసులు న్యాయవాదిపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 75 (1) కింద కేసు నమోదు చేశారు.

WALK - IN - INTERVIEW

Ameya Plantations is a reputed plantation company engaged in commercial Sandalwood Plantation and in the process of creating a Benchmark in India. To Strengthen our ambitious growth plan, we need the following to join our CRM Team.

1) CRM Executives : 4 Numbers Male/Female MBA who possess very good communication and analytical skills. They should be fluent English, Telugu and Hindi. Age below 35 years.

2) Graphic Designer : An experienced Graphic Designer to design various designs and AI knowledge is a must.

Attractive salary and performance linked incentives are offered.
Meet us with your CV between 10 AM to 5 PM on 29th or 30th of Nov 25.

Ameya Plantations
2nd Floor, Opp to TARNAKA Restaurant, Mogulrajapuram, Vijayawada – 10. Mobile: 7399667777

టిడ్కో గృహాలకు పూర్వ వైభవం తెస్తాం

రాణిగారితోటలో అర్జీలు స్వీకరిస్తున్న క్రాంతికుమార్

కృష్ణలంక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకు పూర్వ వైభవం తెస్తామని తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. రాణిగారితోట 18, 2వ డివిజన్లలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెదేపా హయాంలో పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టగా.. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. లక్షలాది గృహాలు నిర్మించి పేదలకు ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొక్కిరాల తిరుపతయ్య, దేవళ్ల శ్రీనివాసరావు, మైలాబత్తుల పీరయ్య, గోళ్ల శాంతిబాబు, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, బలగాని శ్రీను, పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చోరీకి గురైన చరవాణుల అప్పగింత

చరవాణిని యజమానికి అందిస్తున్న డీసీపీ కృష్ణప్రసన్న, పక్కన ఏసీపీ రాజశేఖర్, సీఐ దుర్గాప్రసాద్

విజయవాడ నేరవార్తలు: ఎవరైనా చరవాణులు పోగొట్టుకుంటే.. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న పేర్కొన్నారు. పోయిన చరవాణులను గురువారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో వాటి యజమానులకు అప్పగించారు. ఇప్పటి వరకు 5 విడతల్లో 2,300 మంది చరవాణులను రికవరీ చేసి, యజమానులకు ఇచ్చారు. తాజాగా ఆరో విడతలో 167 చరవాణులను స్వాధీనం చేసుకుని అప్పగించారు. యజమానులు ఎంతో సంతోషించారు. కష్టపడి కొనుక్కున్న ఫోన్లను దొంగలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగానే రికవరీ చేసి అప్పగించడం ఆనందం వ్యక్తం చేశారు. డీసీపీ మాట్లాడుతూ.. మీ ఆస్తి రక్షణ.. మా బాధ్యత అని పేర్కొన్నారు. చరవాణి పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. దానిని బ్లాక్ చేస్తారు, తర్వాత ట్రేస్ చేసి తిరిగి తీసుకురావచ్చన్నారు.

ఉచిత కంటి వైద్య సేవలు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మొగల్రాజపురంలోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఇక్కడ శిక్షణ తీసుకుంటున్న 150 మందికి మ్యాక్స్ విజన్ ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్న వారికి కళ్లజోళ్లు సిఫార్సు చేశారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పారా క్రీడా పోటీలు

బహుమతులు గెలుపొందిన పారా అథ్లెట్లతో దుర్గా నాగేంద్ర, డీఎస్ఏ శిక్షకులు

విజయవాడ క్రీడలు: స్థానిక ఐజీఎంసీ స్టేడియం, డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంల్లో డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా క్రీడా పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ 54 కేజీల కేటగిరిలో పి.శ్రీనివాస్, డి.భాస్కర్, 65 కేజీల కేటగిరిలో కె.శివకుమార్, ఎస్.ఆంజనేయులు, ఎస్.శివప్రసాద్ వరుసగా ఒక్కో కేటగిరిలో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. చెస్‌లో పి.శ్రీనివాస్ ప్రథమ, డి.భాస్కర్ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. పురుషుల బ్యాడ్మింటన్ ఎస్ఎల్-3 కేటగిరిలో ఎం.అప్పారావు ప్రథమ, పి.శివ ద్వితీయ, ఎస్ఎల్-4 కేటగిరిలో ఎం.గణేష్ ప్రథమ, కె.నాని ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ అధికారి కాకర్ల కోటేశ్వరరావు.. పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం కార్యదర్శి డి.దుర్గానాగేంద్ర, పలువురు డీఎస్ఏ శిక్షకులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

టెట్ నుంచి మినహాయింపు కోరుతూ వినతి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి.. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చట్టసవరణ చేయించాలని గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్‌కు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్సీ మనోహర్‌కుమార్ గురువారం వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలని, విద్యాహక్కు చట్టంలో సెక్షన్23(2)కు సవరణ చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, గౌరవ అధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్, ఎ.గోపాలకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, షేక్ బాజీ, ఎండీ హజ్రుతుల్లా, ఎంఎం సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

పటమట, న్యూస్‌టుడే: గొర్రె సత్యవతి ఛారిటబుల్ ట్రస్టు అధినేత, తెదేపా ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె శ్రీనివాస్ చక్రవర్తి ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ చేతుల మీదుగా మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు నేడు

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ రమేశ్

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మేకా రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీన్, ఎంబీఏ విభాగాధిపతి ఆచార్య రాజేశ్ సి.జంపాల మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వేమూరి బాబూరావు, కార్యక్రమ సమన్వయకర్త ఎండీఎస్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 95వేల సంతకాలు

పటమట, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా తూర్పు నియోజకవర్గంలో 95 వేల సంతకాలను పూర్తి చేసినట్లు వైకాపా జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. గురువారం గుణదలలోని జిల్లా వైకాపా కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో సిబ్బంది అజిత్ నాయక్, సిద్ధార్థ చౌహాన్ అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనారోగ్య సమస్యలు, ఇబ్బందులపై అవగాహన కార్యక్రమం మొగల్రాజపురంలోని వీరమాచనేని పద్మయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య, సీబీఎస్ఈ ప్రతినిధి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని వ్యాపార సంస్థలు, థియేటర్లు, ఆసుపత్రుల యాజమాన్యాలు.. అగ్ని ప్రమాదాల నివారణపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని నగర పాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారులు అన్నారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు సింగ్‌నగర్‌లోని సినిమా థియేటర్లను గురువారం వారు సందర్శించి అగ్నిప్రమాదాల నివారణకు యాజమాన్యం తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ పరికరాలు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు మాల్యాద్రి, కె.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

మధ్యాహ్న భోజనం పరిశీలన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నందిగామ డీవైఈవో శ్యామ్‌సుందర్ తనిఖీ చేశారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆయన భోజనాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. దాతల సహకారంతో పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని పావనికి సన్మానం

పెనుగంచిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రేగండ్ల పావనిని పాఠశాల సిబ్బంది సన్మానించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని జలజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బాలికకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం నందిగామ డీవైఈవో శ్యామ్‌సుందర్, ఎంఈవో రవీందర్, పాఠశాల కమిటీ ఛైర్మన్ రామారావులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ విద్యార్థినిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

❖ కంచికచర్ల ప్రణీత కాలనీలో తాగునీటి కుళాయి వద్ద పైపు పగలడంతో నీరు వృథాగా పోతోందని కాలనీకి చెందిన రామ్మోహనరావు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు స్పందించి.. పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ❖ చెవిటికల్లు ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని గ్రామానికి చెందిన వెంకట్రావు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ కార్యదర్శి నానిబాబు స్పందించి.. సమస్య పరిష్కరించారు. ❖ కంచికచర్ల అరుంధతీ కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని కాలనీకి చెందిన జాన్ డేవిడ్ 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. విద్యుత్తు ఏఈ దిబ్బయ్య స్పందించి.. సమస్య పరిష్కరించారు. ❖ పరిటాల మసీదు సమీపంలో వీధి దీపం వెలగడం లేదని షేక్ రజాక్ 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. విద్యుత్తు శాఖ ఏఈ దిబ్బయ్య స్పందించి.. కొత్త దీపం ఏర్పాటు చేయించారు. **-కంచికచర్ల, న్యూస్‌టుడే**

కూరగాయల ధరలు పైపైకి..!

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట, వత్సవాయి, న్యూస్‌టుడే: వర్షాలకు కూరగాయలు, ఆకు కూరల తోటలు దెబ్బతిన్నాయి. డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేక ధరలు రెట్టింపయ్యాయి. కిలో కూరగాయలు అర్ధశతకం పైగా ఉండటంతో మధ్య తరగతి ప్రజలు కొనుగోలుకు అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో మొంథా తుపాన్‌కు కృష్ణానది, మునేరు ఒడ్డున సాగుచేస్తున్న కూరగాయలు, ఆకుకూర తోటలు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. రెండు నెలల కిందట ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం రెండింతలయ్యాయి. నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట రైతుబజార్లు ఉండగా.. వాటిలో ధరల కంటే బయట మార్కెట్లో ఇంకా అదనంగా ఉంటున్నాయి.

పాతకంచలలో సాగులో ఉన్న ఆకుకూర మడులు

దీక్షల కాలం కావడంతో..

★ అయ్యప్ప, భవానీ, తిరుపతమ్మ, శివదీక్షల కాలం కావడంతో కూరగాయల వాడకం పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టు సరకు దొరకడం లేదు. రెండు మాసాల క్రితం కిలో బెండ రూ.22 ప్రస్తుతం రూ.36, టమాట కిలో రూ.22 ఉండగా ప్రస్తుతం రూ.54కు పెరిగాయి. కిలోకు రూ.20-30 ధర పెరిగింది. ఒక్కో సొరకాయ రూ.15 నుంచి రూ.25కు చేరింది. గృహిణులు కూరచేయాలంటే హడలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆకు కూరలకూ పెరిగిన గిరాకీ

ఆకుకూరలు సాగు చేస్తున్న రైతులు ఇటీవల మొంథా తుపాన్‌కు బాగా నష్టపోయారు. మునేరు, నల్లవాగు వరదకు ఆయా తోటలు మునిగి కుళ్లిపోయాయి. పాతకంచల, కీసర, ముచ్చింతాల రైతులు తిరిగి విత్తనాలు కొనుగోలు చేసి బచ్చలి, తోటకూర, మెంతికూర వంటి ఆకుకూరలు సాగుచేస్తున్నారు. గతంలో చిన్నపాటి ఆకుకూర కట్ట రూ.2 కాగా ఇప్పుడు రూ.4కు చేరింది. బచ్చలి, తోటకూర, పాలకూర, మెంతికూర ధరలు రెట్టింపయ్యాయి.

భారంగా మారింది

గతంలో కూరగాయల కొనుగోలుకు నెలకు రూ.వెయ్యి సరిపోయేవి. ప్రస్తుతం రూ.3 వేలు ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిగుబడి తగ్గడం, వర్షాలతో ధరలు పెరిగాయి. సామాన్యులకు భారంగా ఉంది.

- ములకలపల్లి సుధాకరరావు, తోటరావులపాడు

బజ్జీ మిర్చి ధర రెట్టింపు

హోటల్ నిర్వహిస్తున్నా. గతంలో కిలో బజ్జీ మిర్చి రూ.40 కాగా ప్రస్తుతం రూ.80కు చేరింది. ధరలు పెరుగుదలతో హోటల్ నిర్వహణ భారంగా మారింది. గృహిణులకు ఇంటి బడ్జెట్ పెరిగి ఇబ్బందులు పడుతున్నారు.

-చింతా రమాదేవి, ముప్పాళ్ల

ఉపన్యాస పోటీల్లో ప్రతిభ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ ప్రతిభ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్‌ప్రభావం' అన్న అంశంపై ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జి.పూర్ణశ్రీ(పదో తరగతి), ఎస్కే నజ్‌రీన్ (తొమ్మిదో తరగతి), కె.ఉపేంద్ర (ఏడో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ ఎండీ షేర్‌అలీ, ప్రధానోపాధ్యాయుడు ఎండీ మస్తాన్ అందజేశారు.

విజేతలతో షేర్‌అలీ, మస్తాన్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో గురువారం ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పి.అభిషేక్ శామ్యూల్, కె.గీతాకృష్ణవేణి, మహ్మద్ సుభానాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎస్.ఆర్.ఎస్.శ్రీనివాస్, నిర్వాహక ఉపాధ్యాయులు పి.విజయలక్ష్మి బహుమతులు అందజేసి అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

మురుగు.. రహదారిపై పరుగు!

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే: కీసరలో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పలుచోట్ల మురుగు రహదారులపై పారుతూ వాహనదారులు, స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. స్వర్ణ టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై పారుతున్న మురుగుతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గండేపల్లి మార్గంలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి మురుగునీటి పారుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కీసర టోల్ ప్లాజా వద్ద ఇలా..

ఈతకొలను నిర్వహణ, శిక్షణ బాధ్యత అప్పగింత

పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, ఛైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట ఇండోర్ స్టేడియం ఆవరణలోని ఈతకొలను నిర్వహణ, అందులో శిక్షణ ఇచ్చే బాధ్యతను జగ్గయ్యపేటలోని డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్‌కు అప్పగించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రలు అసోసియేషన్ వ్యవస్థాపకులు, శిక్షకుడు పొట్టబత్తిని పాండురంగారావుకు అందించి అభినందించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై కొలను నిర్వహణ విషయంలో ఉన్న సందిగ్ధత తొలగి.. పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రాగలదన్నారు. కార్యక్రమంలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర క్రీడాపోటీల్లో పాల్గొని..దిల్లీలో జరిగే జాతీయ క్రీడలకు అర్హత సాధించిన జంపాన శారద, ఎడ్ల వెంకటరమణమ్మలను వీరు అభినందించారు.

కల్లాల్లోనే ధాన్యం కొనుగోళ్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లోనే కొనుగోలు చేస్తారని జాయింట్‌కలెక్టర్ ఇలక్కియా తెలిపారు. మండలంలోని అనిగండ్లపాడు, గుమ్మడిదురు గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం నిల్వలను గురువారం నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణతో కలిసి ఆమె పరిశీలించారు. రైతులతో ప్రత్యేకంగా మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం తీసుకుని మిల్లుల వద్దకు వెళ్లనక్కర్లేదన్నారు. అధికారులే వచ్చి కల్లాల్లో ధాన్యం పరిశీలించిన అనంతరం తూకాలు వేయించి మిల్లుకు పంపిస్తారన్నారు. అనంతరం 48 గంటల్లోపు రైతులకు డబ్బులు వస్తాయన్నారు. అన్నదాతలకు అవసరమైన గోనె సంచులు, రవాణాకు అవసరమైన ట్రాక్టర్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. తేమ శాతం తగ్గే వరకు కల్లాల్లో ఆరబెట్టాలని కోరారు. అధిక తేమ శాతం ఉంటే ఇబ్బందులు వస్తాయన్నారు. మధ్య దళారులను ఆశ్రయించవద్దని, నేరుగా మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలు వస్తే వెంటనే రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పారదర్శకతతో సేకరణ జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కొనుగోళ్లు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీను, డిప్యూటీ తహసీల్దారు నాగుల్‌మీరా, ఏడీఏ సీహెచ్ భవానీ, ఏవో రామసుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అనిగండ్లపాడులో ధాన్యంను పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియా, ఆర్డీవో బాలకృష్ణ

అన్నదాతల గుండెల్లో తుపాను

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాన్ భయం అన్నదాతలను వణికిస్తోంది. మొంథాతో ఇప్పటికే నష్టపోయిన రైతులు.. సంకట సమయంలో మరో ముప్పు పొంచి ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో నూర్పిడి చేయిస్తున్నారు. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ట్రాక్టర్లతో మిల్లులకు తరలిస్తున్నారు. వర్షం కురిస్తే మిగిలిన పంట దక్కదనే భయం వారిని వెంటాడుతోంది. మాగల్లు, అంబారుపేట, కేతవీరునిపాడు గ్రామాల్లో వరిపంట నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి.

మాగల్లులో ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న ట్రాక్టర్లు

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు మక్కపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. దీంతో ఇటుగా ప్రయాణించే వాహనదారులు, గ్రామంలోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే ఖమ్మం, వరంగల్, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి వచ్చే భక్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళ గుంతలు కనిపించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని..దీనివల్ల అనేక మంది గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేస్తామని ఏడాది కాలంగా అధికారులు చెబుతున్నా..ఫలితం కనిపించడం లేదు. త్వరగా మరమ్మతులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిలో భారీ గుంత

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని పెద్దవరం గ్రామంలో గురువారం డీఎంఎఫ్ నిధులు రూ.40 లక్షలతో ఎస్సీ కాలనీలో సామాజిక భవనం, చెర్వుకొమ్ముపాలెంలో తెదేపా నాయకుడు ఇంటూరి సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ముత్యాలమ్మ ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంపునకు కృషిచేస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రక్స్ బయోటెక్ పరిశ్రమ ఎండీ గోగినేని రవిచంద్ర, తెదేపా నాయకులు వీరంకి వీరాస్వామి, సీతయ్య, జమల్లమూడి విష్ణు, కడియాల శేఖర్, పెమ్మసాని శ్రీనివాసరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

ప్రజాప్రతినిధి చొరవ.. ప్రజలందరూ మురవ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: అనిగండ్లపాడు రోడ్డుకు ఎంపీటీసీ సభ్యురాలు పొందూరు విజయలక్ష్మి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. ఇటీవల భారీ వర్షాలకు వచ్చిన వరదలకు పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పలుచోట్ల దెబ్బతింది. దీనివల్ల వాహనాలు, ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయించట్లేదు. దీంతో ఎంపీటీసీ సభ్యురాలు చొరవ తీసుకుని సొంత నిధులతో గుంతల్లో గ్రావెల్ పోయించారు. రాకపోకలకు అనుకూలంగా రోడ్డును సిద్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లంకొండ నరసింహారావు, పొందూరు శ్రీనివాసరావు, తోట గోపి పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ వద్ద ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి

వాసవీ పెనుగొండగా నామకరణంపై హర్షం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండను వాసవీ పెనుగొండగా నామకరణం చేయడంపై ఏటిపట్టు గ్రామాల ఆర్య వైశ్య సంఘ నాయకుడు చిలకల వెంకటజనార్దన్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల మనోభావాలను గౌరవించి.. మార్పు చేసిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా పడిపూజ మహోత్సవం

వెల్లంకి (వీరులపాడు): మండల పరిధి వెల్లంకిలో అయ్యప్పస్వామి మహా పడిపూజ మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తల్లపురెడ్డి వంశీకృష్ణ, మధుకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో వందల సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొని భజనలు చేశారు. విద్యుత్తు దీపాల వెలుగులో పద్దెనిమిది మెట్ల అయ్యప్ప వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణమయ్యప్ప' నామస్మరణతో ప్రాంగణం మారుమోగింది.

వీధి దీపాలకు మరమ్మతులు

నందిగామ: స్థానిక ముక్కపాటినగర్‌లో వీధి దీపాలకు గురువారం మరమ్మతులు చేశారు. ఆ ప్రాంతంలో రాత్రుళ్లు చీకటిగా ఉండటంతో హైవేపై ప్రమాదాలు జరుగుతున్నాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి స్థానికులు చెప్పగా.. ఆమె స్పందించి.. సమస్య పరిష్కరించారు. అనంతరం వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వాణి, నాయకులు విజయమ్మ, కృపారావు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఆరోగ్యంపై అవగాహన.. పరీక్షలతో భరోసా

ఈనాడు మీతోడు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరాల నిర్వహణ

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. వైద్యాధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండేందుకు పాటించాల్సిన సూత్రాలపై అవగాహన కల్పించారు.

పోషకాహారం.. పరిశుభ్రతే ముఖ్యం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: బాలలు చిన్నప్పటి నుంచి పోషకాహారంపై ఇష్టం పెంచుకొని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే..90 శాతం వ్యాధులు దరిచేరవని భూచవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కీర్తి రెడ్డి సూచించారు. జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కీర్తిరెడ్డి సిబ్బందితో వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు పలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థిని గుర్తించి అధికారులకు తెలిపారు. మరో ఇద్దరు వయసుకు తగినంత ఎదుగుదల లేకపోవడాన్ని గుర్తించారు. పాఠశాలలో 64 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో పది మందికి దగ్గు, నలుగురికి జలుబు, మరో పది మందికి చర్మ సంబంధిత వ్యాధులు గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమానికి వికలాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరావు సహకారం అందించగా..ప్రధానోపాధ్యాయిని కిలారి నాగమణి ఆధ్వర్యంలో ఏఎన్ఎం త్రివేణి, ఎంఎల్‌హెచ్‌పీలు మణి, స్వాతి, ఆశా వర్కర్లు, 104 సంచార వైద్యశాల సిబ్బంది సేవలందించారు.

మల్కాపురం ప్రభుత్వ పాఠశాలలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కీర్తిరెడ్డి

పరిటాల జడ్పీ హైస్కూల్‌లో సూచనలిస్తున్న వైద్యురాలు మధురిమ

పరిటాలలో 170 మందికి పరీక్షలు

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే: పరిటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో కంచికచర్ల పీహెచ్‌సీ వైద్యురాలు కె.మధురిమ, వైద్య సిబ్బంది పాల్గొని 170 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు శర్మ, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

జయంతి(వీరులపాడు), న్యూస్‌టుడే: మండల పరిధి జయంతి గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్)లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. తహసీల్దారు పి.రవికుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో విక్రయించాలని సూచించారు. తద్వారా మద్దతు ధర పొందవచ్చన్నారు. అనంతరం ధాన్యం కళ్లాల్లోకి వెళ్లి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చీదిరాల భారతరెడ్డి, ఆడిటర్ అరుణ్‌కుమార్, కార్యదర్శి రాఘవయ్య, ఉప తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

వడ్లు తూకం వేస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. గురువారం మండలంలోని చెర్వుకొమ్ముపాలెం గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల సాగుకు సమృద్ధిగా సాగునీరు, ఎరువులు అందించడంతో పాటు పండించిన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వీరంకి వీరాస్వామి, ఇంటూరి సీతారామయ్య, జమల్లమూడి విష్ణు, పెమ్మసాని శ్రీనివాసరావు, గర్మిడి సురేష్, కడియాల శేఖర్, కుటుంబరావు పాల్గొన్నారు

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

తిమ్మాపురం(వీరులపాడు): విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం ఎంపీపీ పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠశాలలో సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

గణేష్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వత్సవాయికి చెందిన ఎం.గణేష్ డిసెంబర్ 1న జరగనున్న రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు జగ్గయ్యపేట మినీ స్టేడియం శాప్ కోచ్ గోపి తెలిపారు. విజయవాడలో గురువారం జరిగిన జిల్లా పోటీల్లో ఎస్ఎల్4 కేటగిరీలో విజేతగా నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించినట్లు వెల్లడించారు.

ఉద్దంటి వాసుకు సత్కారం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేటలోని పురాతన వరదరాజస్వామి దేవాలయం ట్రస్టీగా నియమితులైన ఉద్దంటి వాసును గురువారం నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూమాటి కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలో విగ్రహాల ఆవిష్కరణ

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెం ఉన్నత పాఠశాలలో ధ్వంసమైన మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాల స్థానంలో దాతల సహకారంతో కొత్తవి ఏర్పాటు చేసి, గురువారం ఆవిష్కరించారు. కొత్త సుభాష్‌చంద్రబోస్ సోదరులు, కామేశ్వరరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విగ్రహాలను వితరణగా అందజేయగా విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ ఆవిష్కరించారు.

❖ మాక్ అసెంబ్లీకి హాజరైన విద్యార్థి వల్లపు అరవింద్‌ను సత్కరించారు. ❖ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు జయశ్రీ, శ్రీనివాస్ దంపతులు, రత్నకుమారి, బర్మావతు నాగేశ్వరరావులు, 2010-11లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు 30 కుర్చీలను బహూకరించారు. సర్పంచి మార్కపూడి వెంకట్రావమ్మ, ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నారాయణ, ఎస్ఎంసీ ఛైర్మన్ జాన్ కోటయ్య పాల్గొన్నారు.

విగ్రహాలను ఆవిష్కరించిన చంద్రమౌళి, వాసిరెడ్డి ప్రసాద్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లగిరిపై కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం జయవిజయుల విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేశారు. గతంలో అవి ఆలయం లోపల ఉండగా ప్రస్తుతం బయట పునఃప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొత్త హనుమేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో మండల దీక్షలు పూర్తయిన అయ్యప్పమాలధారులకు ఇరుముడుల వేడుక నిర్వహించారు. నందిగామ కుమార క్షేత్రంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ముంచెత్తుతున్న వరదలు.. మూసుకుపోతున్న వాగులు!

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వాగులు గతంలో ఎన్నడూ లేని విధంగా సమీప గ్రామాల ప్రజలను బెంబేలెత్తించాయి. అనేక గ్రామాల వారు వరదలతో అల్లాడారు. కంచికచర్ల మండలంలోని ఏనుగుగడ్డ, చెవిటికల్లు లక్ష్మయ్య, తోళ్ల, శుద్ధ వాగులు వర్షాలు కురిసిన సమయంలో వరదతో పోటెత్తి భారీ నష్టం కలుగజేస్తున్నాయి. రెండు నెలల క్రితం కంచికచర్ల సమీపంలోని వాగులో ఓ వ్యక్తి గల్లంతై చనిపోయారు. దశాబ్దాలుగా వాగుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుర్రపు డెక్క, కంప చెట్లతో అధ్వానంగా మారాయి. మరికొన్ని చోట్ల ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ కారణంగానే ముంపు సమస్యలు తలెత్తున్నాయని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుల పరీవాహక ప్రాంతాలను శుభ్రం చేసి వరద నీటిని సక్రమంగా వినియోగించినట్లైతే పంటలకు ముంపు సమస్యలు తప్పి.. సాగునీటి ఇబ్బందులు సైతం కొంత మేర తీరే అవకాశముంది. కూటమి ప్రభుత్వం వాగుల సమగ్ర నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కంచికచర్ల బైపాస్ వద్ద గుర్రపు డెక్కతో నిండి..

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ప్రసంగించి.. బహుమతులు సాధించి..

విజేతలతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ కొత్తపేట హిందూ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. విద్యార్థులు షేక్.అహ్మద్(8వ తరగతి), పి.చైతన్య(10వ తరగతి), జి.జస్విత(10వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అరుణకుమారి, దేవకీ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే సంపద

ఈనాడు మీతోడు

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గణేష్, పక్కన వైద్యురాలు సుజిత, ఆసుపత్రి సిబ్బంది

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఆరోగ్యమే మనిషికి అసలైన సంపదని జీఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.ఎన్. గణేష్ అన్నారు. విద్యాధరపురం లేబరు కాలనీలోని జీఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో 'ఈనాడు', 'భవానీ హాస్పిటల్స్' సంయుక్తంగా గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు పలువురు విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లు, ఆరోగ్యంపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు 'ఈనాడు' సంస్థ ముందుకు రావడం ప్రశంసనీయమని చెప్పారు.

విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న వైద్యురాలు సుజిత, సిబ్బంది

వైద్యురాలు సుజిత మాట్లాడుతూ.. దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎదుగుతున్న క్రమంలో వచ్చే మార్పులు, ఆరోగ్యం పట్ల అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భవానీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.చంద్రశేఖర్, చీఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.దిలీప్, దయానా, ప్రియ, సింధు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

★ పాతరాజరాజేశ్వరీపేట ప్రధాన రహదారి మార్గం వెంట మురుగు కాలువలో పూడిక తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. ★ సామారంగం చౌకీ రామాలయం వద్ద మురుగు కాలువలో పూడిక పేరుకుని తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? పాతరాజరాజేశ్వరీపేట ప్రధాన రహదారి వెంట మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. ★ మహంకాళి ఆలయం వీధిలో మురుగునీరు కారణంగా తీవ్ర దుర్వాసన వస్తోంది. **- సాంబశివరావు, రాజ్యలక్ష్మి స్థానికులు** ✔ పూడిక తీయించి, శుభ్రం చేయిస్తాం. **- రంగారావు, స్థానిక శానిటరీ అధికారి**

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

చరవాణుల అప్పగింత

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎవరైనా చరవాణులు పోగొట్టుకుంటే.. సీఈఐఆర్ (సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న పేర్కొన్నారు. పోయిన చరవాణులను గురువారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో వాటి యజమానులకు అప్పగించారు. ఇప్పటి వరకు 5 విడతల్లో 2,300 మంది చరవాణులను రికవరీ చేసి, యజమానులకు ఇచ్చారు. తాజాగా ఆరో విడతలో 167 చరవాణులను స్వాధీనం చేసుకుని అప్పగించారు. డీసీపీ మాట్లాడుతూ.. మీ ఆస్తి రక్షణ. . మా బాధ్యత అని పేర్కొన్నారు. చరవాణి పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. దానిని బ్లాక్ చేస్తారని, తర్వాత ట్రేస్ చేసి తిరిగి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ బి.రాజశేఖర్, సీఐలు గుణరామ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్పందించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

ప్రైజర్‌పేట రోడ్డుకు మరమ్మతులు

చిట్టినగర్ నుంచి నగరంలోకి వెళ్లే ప్రైజర్‌పేట ప్రధాన రహదారిలో గోతులకు మరమ్మతులు చేస్తున్నారు. అడుగడుగునా గోతుల వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చర్యలు తీసుకున్నారు. ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, చిట్టినగర్

కల్వర్టులకు.. చిట్టినగర్‌లోని పలు ప్రాంతాల్లో కల్వర్టులపై సిమెంటు దిమ్మెలు దెబ్బతిని ప్రమాదభరితంగా మారిన నేపథ్యంలో ఈనెల 21న 'ఈనాడు' పశ్చిమ పేజీలో 'దెబ్బతిన్న కల్వర్టులు.. రాకపోకలకు ఇక్కట్లు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనికి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. నామినేషన్ పద్ధతిలో గుత్తేదారుకు టెండర్ల ప్రక్రియ అప్పగించారు. కల్వర్టు నిర్మాణం చేసి

అందుబాటులోకి తీసుకొని రానున్నారు. మరుపిళ్ల చిట్టి పార్కు ఎదురువీధిలో పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, చిట్టినగర్

లేబరుకాలనీలో పిచ్చి మొక్కల తొలగింపు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : లేబరుకాలనీలో ప్రజారోగ్యానికి ఆందోళనకరంగా మారిన పిచ్చిమొక్కలను పారిశుద్ధ్య సిబ్బంది పొక్లెయిన్‌తో గురువారం తొలగించారు. కాలువలో పేరుకుపోయిన సిల్టును తీసి తరలించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. ఈనెల 27న 'అధ్వానంగా లేబరు కాలనీ పారిశుద్ధ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు స్పందించారు. సిబ్బందితో కలిసి పనులు చేయించారు. సమస్య పరిష్కరించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

దేశ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం

మాట్లాడుతున్న రామ్‌లాల్

భవానీపురం, న్యూస్‌టుడే: దేశంలో నిర్మాణాత్మకంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని ఆర్ఎస్ఎస్ అఖిల భారత సంపర్క్ ప్రముఖ్ రామ్‌లాల్ పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని ప్రముఖులతో రామ్‌లాల్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామ్‌లాల్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. భాజపా నాయకుడు పాతూరి నాగభూషణం, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ జి.వి. రామారావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఆటలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ ఎ.రవినాయుడు వివరించారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కేతనకొండలోని శ్రీస్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో గురువారం ఆయన గురుకుల్ ఒలింపిక్స్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్వామి నారాయణ గురుకుల్ పాఠశాల యాజమాన్యం జిల్లా స్థాయిలో గురుకుల్ ఒలింపిక్స్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కేతనకొండ పాఠశాల రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. ఖోఖో ప్లేయర్ రాంపెయిడ్ శివారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే క్రీడా కోటలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. గురుకుల్ పాఠశాల కార్యదర్శి స్వరూప్ దాస్ స్వామీజీ, కృష్ణ మూర్తి దాస్ స్వామి తదితరులు ప్రసంగించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాత నారాయణ స్వామికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు రవి

దాత సాత్విక్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఎం.నారాయణ స్వామి రూ.1,01,116, చందానగర్ నివాసి సాత్విక్ రూ.1,01,116 విరాళాలను వేర్వేరుగా గురువారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థాన సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థాన సూపరింటెండెంట్ చంద్ర శ్రీనివాస్, వేదపండితుడు కోట రవి వారికి విరాళ రసీదులతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలి'

గవర్నర్‌పేట: సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం గవర్నర్‌పేటలోని స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఒక డీఏతో మంజూరు చేసిన ప్రభుత్వానికి రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.వి.శివ ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్‌పై నగదు రహిత వైద్యసేవలు, స్లాబ్ రేటును రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం, రూ.లక్ష లోపు మెడికల్ బిల్లులను జిల్లా పరిధిలో మంజూరు చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు రక్షిత నీరు అందించేందుకు సహకారం

రక్షిత నీటి ప్లాంట్ ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గణేష్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు రక్షిత నీరు అందించడంలో సంపూర్ణ సహకారం అందిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. లేబరు కాలనీలోని జీఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు రక్షిత నీరు అందించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆర్ట్స్ ప్లాంట్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వసంతకుమార్, సుబ్రహ్మణ్యం, జ్యోతి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.ఎన్.గణేష్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల ప్రయోజనాలపై రాజీపడం

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగుల ప్రయోజనాలపై రాజీపడమని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి భరణి భానుప్రసాద్ తెలిపారు. రానున్న 8వ వేతన సంఘంలో అన్ని అలవెన్సులు కలిపి కనీస వేతనం రూ.54 వేలు డిమాండ్ చేస్తున్నట్లు గురువారం సంఘ్ కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు ఎన్‌పీఎస్, యూపీఎస్ కన్నా పాత పింఛను విధానానికే తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. కార్మికుల సంక్షేమం, ప్రయోజనాలపై సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య దిల్లీలో నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ్ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు నాయకులు యడ్ల నాగేంద్రబాబు, అల్లంశెట్టి రమేష్, డేగల శ్రీనివాస్, కొయ్య రమణారెడ్డి, ఎం.ఎస్.రావు, కె.సుకుమార్, శ్రీనివాసరావు, బాలాజీ, శ్యామ్ హాజరయ్యారు.

సిబ్బంది కొరత.. రోగులకు అవస్థ

చిట్టినగర్, న్యూస్‌టుడే

చిట్టినగర్ సమీపంలోని సర్కిల్-1 కార్యాలయం ప్రాంగణంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రక్త పరీక్షల నమూనా సేకరించేందుకు

డివిజన్లు	: 46, 47, 48
జనాభా	: సుమారు 25 వేలు
ఆసుపత్రి ఎక్కడ	: సర్కిల్-1
వైద్యం పొందేవారు	: నెలకు 2 వేలకు పైనే
అవసరం	: ల్యాబ్ ఏర్పాటు

సర్కిల్-1లోని పట్టణ ఆరోగ్య కేంద్రం

ల్యాబ్ టెక్నీషియన్ 6 నెలలుగా లేరు. దీంతో రోగులకు రక్త పరీక్షలు ఎదురు చూడక తప్పడం లేదు. రోగ నిర్ధారణకు ప్రాధాన్యం ఉన్న రక్త పరీక్షలకు ల్యాబ్ టెక్నీషియన్ ఏర్పాటు చేయడంలో వైద్య విభాగం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

రక్త పరీక్షలకు ఎదురుచూపులు

★ కేఎల్‌రావు పార్కు రోడ్డులోని ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్‌ను ఇక్కడి ఆసుపత్రికి 2 రోజులకు ఒకసారి పంపిస్తున్నారు. దీంతో ఎవరికి సరైన సమయంలో రిపోర్టులు ఇవ్వలేని పరిస్థితిలో రెండు ఆసుపత్రులపై ప్రభావం చూపుతుంది. రక్త పరీక్షలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కొందరు తమ ఆవేదనను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

పట్టించుకోవడం లేదు

మేము కేఎల్‌రావునగర్‌లో నివాసం ఉంటున్నాను. మధుమేహం పరీక్షల కోసం సర్కిల్-1 కార్యాలయంలోని ఆసుపత్రికి వెళ్లాను. రక్త పరీక్షలు చేసే వారు లేకపోవడంతో మరుసటి రోజు రావాలని సూచించారు. పనులు మానుకొని మళ్లీ వెళ్లాను. రక్త నమూనా తీసుకొని మూడు రోజులకు రిపోర్టు ఇస్తామని చెప్పారు. కూలీ పనులు వదిలేసి ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా. మధుమేహం మందులు వాడలేని పరిస్థితి. ఇంత దారుణంగా ఆసుపత్రి తీరు ఉంటే ఏ ఒక్క అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. **- కె.కల్పన, గృహిణి**

ప్రైవేట్ క్లినిక్‌లో అధికంగా వసూలు

పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వాలు తీసుకునే చర్యలు వాస్తవ క్షేత్ర స్థాయిలో సమస్యలు పట్టించుకోవడం లేదు. రక్త పరీక్షలు చేసే టెక్నీషియన్ 6 నెలలుగా లేరు. ఆసుపత్రికి వెళ్తే మందులు ఇస్తున్నారు తప్పా.. రక్త పరీక్షల ఆధారంగా మందులు తీసుకోలేక పోతున్నాం. వెళ్లినప్పుడల్లా ల్యాబ్ టెక్నీషియన్ లేరని సిబ్బంది చెబుతున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తే అధికంగా నగదు వసూలు చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- వై.శాంతి, గృహిణి**

రూ.33.92 లక్షల ఎల్‌ఓసీల అందజేత

లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఛైర్మన్ విల్సన్

భవానీపురం, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి భరోసా కల్పిస్తున్నదని ఏపీ తెలుగు, సంస్కృతి అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి సహకారంతో మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను భవానీపురంలోని కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. వాగు సెంటర్‌కు చెందిన దూండేటి రూ.2.29 లక్షలు, ప్రైజర్‌పేటకు చెందిన జాన్‌బాషాకు రూ.3.82 లక్షలు, రామలింగేశ్వర నగర్‌కు చెందిన శీలంకుమారికి రూ.4.50 లక్షలు, ఖుద్దూస్‌నగర్‌కు ఉమ్మడి గాంధీకి రూ.10 లక్షలు, 38వ డివిజన్‌కు చెందిన కగ్గా నాగేంద్రమ్మకు రూ.13.31 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీకి వినతిపత్రం అందజేస్తున్న శంకర్ నాయక్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రత్యేక పంచాయతీలుగా 80 శాతం గిరిజనులు ఉన్న గ్రామాలను ప్రభుత్వం గుర్తించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీకి ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వి.శంకర్‌నాయక్ గురువారం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వాలు 500 మందికి పైగా గిరిజనుల ఉన్న గ్రామాలు, తండాలు, గూడెంలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనుల అభివృద్ధికి దోహద పడిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ నిర్ణయం అమల్లోకి వస్తే గిరిజన సమాజానికి రాజకీయ, సామాజిక, ఆర్థికంగా మేలు చేకూరుతుందని తెలిపారు. అర్హత కలిగిన గిరిజన గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ హోదా కేటాయించే దిశగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేడు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రైల్వే కోచింగ్ డిపోలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సంఘం డివిజనల్ కార్యదర్శి బి.వి. నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సంఘం జోనల్ అధ్యక్షుడు అంగడి వినోద్, కార్యదర్శి దాశరథి కృష్ణ, విజయవాడ సీనియర్ డీపీవో ప్రేమ్‌కుమార్ లకావత్, సీనియర్ డీఎంఈ సంజయ్, పలువురు రైల్వే అధికారులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా పారా క్రీడా పోటీలు

బహుమతులు గెలుపొందిన పారా అథ్లెట్లతో డీఎస్‌ఓ దుర్గ నాగేంద్ర, డీఎస్‌ఏ శిక్షకులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియం, డీఆర్‌ఆర్‌ఎంసీ ఇండోర్ స్టేడియాల్లో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా ఆటలు, క్రీడా పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ 54 కేజీల కేటగిరీలో పి.శ్రీనివాస్, డి.భాస్కర్, 65 కేజీల కేటగిరీలో కె.శివశంకర్, ఎస్.ఆంజనేయులు, 72 కేజీల కేటగిరీలో బీవీఎస్ ఆంజనేయులు, ఎస్.శివప్రసాద్ వరుసగా ఒక్కో కేటగిరీలో తొలి రెండు స్థానాలు సాధించారు. చెస్‌లో పి.శ్రీనివాస్ ప్రథమ, డి.భాస్కర్ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పురుషుల బ్యాడ్మింటన్ ఎస్‌ఎల్-3 కేటగిరీలో ఎం.అప్పారావు ప్రథమ, పి.శివ ద్వితీయ, ఎస్‌ఎల్-4 కేటగిరీలో ఎం.గణేష్ ప్రథమ, కె.నాని ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కర్ర కోటేశ్వరరావు.. పతకాలు బహూకరించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై పద్మారావు

చిట్టినగర్, న్యూస్‌టుడే: తప్పిపోయిన బాలుడిని కొత్తపేట పోలీసులు వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. ఏలూరు జిల్లా పాతూరు గ్రామం సాయిబుపేటకు చెందిన నాగుల్‌మీరా, మీరాబీ దంపతులు ఈనెల 27న మహంతిపురం, రాఘవరెడ్డి రోడ్డులోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతంలో బంధువుల వివాహానికి వచ్చారు. వారి 4 ఏళ్ల కుమారుడు షేక్ జాహిద్ ఆడుకుంటూ నైజాంగేటు ప్రాంతానికి వెళ్లి దారి మార్చి పోయాడు. బాలుడి కోసం తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై పద్మారావు సిబ్బందితో గాలించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.

ప్రజా సమస్యలపై పోరాటం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సైనికుడిలా పోరాడిన యోధుడు, సీపీఐ సీనియర్ నాయకులు ప్రత్తిపాటి లాజర్ అని ఆ పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. 47వ డివిజన్ ఉప్పలపాటి రామచంద్రరాజు వీధిలో సీపీఐ నాయకుడు ఆర్.మైఖల్ అధ్యక్షతన గురువారం ప్రజా నాయకుడు లాజర్ 25వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాయకులు ఆర్.యాకోబు, నజీర్, పిచ్చయ్య, ప్రభుదాస్, సోమేశ్వరరావు, సూరిబాబు, వెంకటేశ్వరరావు, అలాభక్షు, రామారావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు భవిష్యత్తుకు పునాదులు

విజేతలతో కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, ప్రిన్సిపల్ కృష్ణవేణి, క్రీడా విభాగాధిపతి హేమచంద్రరావు

చిట్టినగర్, న్యూస్‌టుడే: క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు భవిష్యత్తుకు పునాదులని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి. కృష్ణవేణి పేర్కొన్నారు. ఈనెల 24న నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషులు, మహిళలు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు పలు బహుమతులు కైవసం చేసుకున్నారని తెలిపారు. వి.రక్షిత, సి.హెచ్. సిద్విన్‌కుమార్‌లు బంగారు పతకాలు సాధించగా, బి.సత్య. వి.పావని, యు.దీపక్ రజతం, ఎం.నందిని కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు వివరించారు. త్వరలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే దక్షిణ భారత స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు రక్షిత ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను, క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్, ఏవో వి.నారాయణరావు అభినందించి సత్కరించారు.

మొబైల్ బారికేడ్స్‌తో ట్రాఫిక్ నియంత్రణ

ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగంకు బారికేడ్లు అప్పగిస్తున్న ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ నీలకంఠరెడ్డి, జేడీ డాక్టర్ మంజుల, ఏసీపీ రామచంద్రరావు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: మొబైల్ బారికేడ్స్‌తో ట్రాఫిక్ నియంత్రణతో పాటు సమాజ చైతన్యం కలిగించేలా చేయడం అభినందనీయమని ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వంద మొబైల్ బారికేడ్లను నగర ట్రాఫిక్ విభాగానికి అందజేశారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సామాజిక బాధ్యతగా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. డ్రగ్స్, ఎయిడ్స్ వల్ల జీవితాలు ఏవిధంగా నాశనం అవుతాయో బారికేడ్లపై స్లోగన్స్‌తో రూపొందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐలు పాల్గొన్నారు.

మరుపిళ్ల సేవలు చిరస్మరణీయం

మహంతిపురంలో నగరాల యువజన సంఘం ఆధ్వర్యంలో

చిట్టినగర్, విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య యోధుడు, మాజీ శాసనసభ్యులు మరుపిళ్ల చిట్టి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడేల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పిళ్లా ఆనంద్‌కుమార్ అన్నారు. మరుపిళ్ల చిట్టి 128వ జయంతి సందర్భంగా మహంతిపురం, ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న చిట్టి విగ్రహానికి, చిట్టినగర్ కూడలిలోని విగ్రహానికి పోతిన రమేష్, బెవర మురళీకృష్ణ, తమ్మిన హరిబాబు తదితరులు నివాళి అర్పించారు. ★ 47వ డివిజన్ తెదేపా అధ్యక్షులు నాగోతి రామారావు ఆధ్వర్యంలో గుర్రం కొండ, ఏపీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్

పాతబస్తీలో..

చిట్టినగర్ కూడలిలో..

సుకాశి కిరణ్, బెవర సాయిసుధాకర్, లోకేశ్ పాల్గొన్నారు. ★ భాజపా చిట్టినగర్ మండలం అధ్యక్షుడు దేవిన హరిప్రసాద్ ఆధ్వర్యంలో చిట్టినగర్ కూడలిలోని చిట్టి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొని పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు శివకుమార్ పట్నాయక్, మురళి పాల్గొన్నారు. ★ పాతబస్తీ రమణయ్య కూల్‌డ్రింక్స్ సెంటర్‌లో చిట్టి విగ్రహానికి కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీ, ఎం.రాజేష్, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

WALK - IN - INTERVIEW

Ameya Plantations is a reputed plantation company engaged in commercial Sandalwood Plantation and in the process of creating a Benchmark in India. To Strengthen our ambitious growth plan, we need the following to join our CRM Team.

1) CRM Executives : 4 Numbers Male/Female MBA who possess very good communication and analytical skills. They should be fluent English, Telugu and Hindi. Age below 35 years.

2) Graphic Designer : An experienced Graphic Designer to design various designs and AI knowledge is a must.

Attractive salary and performance linked incentives are offered. Meet us with your CV between 10 AM to 5 PM on 29th or 30th of Nov 25.

Ameya Plantations
2nd Floor, Opp to TARNAKA Restaurant, Mogulrajapuram, Vijayawada – 10. Mobile: 7399667777

(c) eenadu

విజయవాడ మధ్య

విజేతలకు బహుమతులు అందిస్తున్న సాంబశివరావు, అనసూయాదేవి, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిన్నారుల ఉపన్యాసం.. మంత్రముగ్ధం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని చక్కటి ఉపన్యాసాలు ఇచ్చారు. ఎం.లేపాక్షి (9వ తరగతి), ఎం.భావన సాయి శ్రీనాగలక్ష్మి(10వ తరగతి), ఎం.పల్లవి(9వ తరగతి) వరుసగా తొలి మూడు స్థానాల్లో గెలుపొందారు. ప్రిన్సిపల్ టి.సాంబశివరావు, ఉపాధ్యాయులు టి.అనసూయాదేవి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

నిరుపేదల ఇంటి కల నెరవేరుస్తాం

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్: స్థానిక వాంబేకాలనీ ఎక్స్.ఎల్. ప్లాంట్ వద్ద ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వెల్లడించారు. ఆయా ఇళ్లల్లో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను గురువారం ఆయన వీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం 314 ఇళ్లను ఎవరికీ కేటాయించలేదని దుయ్యబట్టారు. దీనివల్ల అవి శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా ఇళ్లను నిరు పేదలకు అందించి.. వారి కల నెరవేరుస్తామని వివరించారు. వాటిల్లో అవసరమైన సదుపాయాల కల్పనకు అధికారులు ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ గోపాల కృష్ణమూర్తి, ఏఈ సతీష్, తెదేపా 33వ డివిజన్ ఇన్‌ఛార్జి ఘంటా కృష్ణమోహన్, డివిజన్ అధ్యక్షుడు బంగారు నాయుడు, ప్రధాన కార్యదర్శి బుదాల సురేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రంగా నీటి రేవు

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల ఒకటో డివిజన్ లెనిన్‌నగర్ రైవస్ కాలువ గట్టుపై ఉన్న నీటిరేవును అధికారులు గురువారం శుభ్రం చేశారు. మొన్నటి వరకు ఇది చెత్తకుప్పలతో నిండిపోయింది. పాములు, విష పురుగులకు నిలయంగా మారింది. దీనిపై ఈ నెల 25న 'నీటి రేవును శుభ్రం చేయరూ' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించారు. చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కాలువలో నీరు తగ్గిన తర్వాత గుర్రపుడెక్కను పూర్తి స్థాయిలో శుభ్రం చేస్తామని అధికారులు తెలిపారు.

చోరీకి గురైన చరవాణుల అప్పగింత

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎవరైనా చరవాణులు పోగొట్టుకుంటే.. సీఈఐఆర్ (సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న పేర్కొన్నారు. పోయిన చరవాణులను గురువారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో వాటి యజమానులకు అప్పగించారు. ఇప్పటి వరకు 5 విడతల్లో 2,300 మంది చరవాణులను రికవరీ చేసి, యజమానులకు ఇచ్చారు. తాజాగా ఆరో విడతలో 167 చరవాణులను స్వాధీనం చేసుకుని అప్పగించారు. యజమానులు ఎంతో సంతోషించారు. కష్టపడి కొనుక్కున్న ఫోన్లను దొంగలు దొంగిలించారని.. పోలీసులకు ఫిర్యాదు చేయగానే రికవరీ చేసి అప్పగించారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ బి.రాజశేఖర్, సీఐలు గుణరామ్, దుర్గాప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యజమానికి చరవాణి అందిస్తున్న డీసీపీ కృష్ణప్రసన్న. పక్కన ఏసీపీ రాజశేఖర్, సీఐ దుర్గాప్రసాద్

భక్తులకు అన్నదానం

పాయకాపురం, న్యూస్‌టుడే : పాయకాపురం నాలుగుస్తంభాల సెంటర్, నాగార్జున స్కూల్ రోడ్డులోని శివాలయం వద్ద అయ్యప్ప, శివమాల, భవానీ, గోవింద మాలధారణ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామని శ్రీమణికంఠ భక్త బృందం సభ్యులు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయుడు సిద్ధార్థ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2006వ సంవత్సరం నుంచి ఏటా అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

భయపడుతూనే ప్రయాణాలు..!

ఆర్‌యూబీ వద్ద ప్రమాద ఘంటికలు

మధురానగర్, న్యూస్‌టుడే

మధురానగర్ ఆర్‌యూబీ వద్ద రక్షణ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. సర్వీసు రోడ్డులో నుంచి వాహనాలు ఆర్‌యూబీలోకి పడిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తయి ఏళ్లు గడిచి రాకపోకలు జరుగుతున్నా.. పొంచి ఉన్న ప్రమాదాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. సర్వీసు రోడ్డులో రెండు వైపులా గోడలు నిర్మించకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

గోడ నిర్మాణంలో నిర్లిప్తత

దుర్గాపురం వైపు నుంచి మధురానగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకునేందుకు సర్వీసు రోడ్లు నిర్మించారు. వీటిని అనుసంధానం చేస్తూ ఆర్‌యూబీపై నుంచి రోడ్డు వేశారు. అక్కడ సర్వీసురోడ్డుపై పై వరకు గోడ కట్టకుండా వదిలేశారు. రెండు వైపులా ఖాళీగా ఉంది. పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఖాళీ ఉందన్న విషయం ఎవరికీ తెలియడం లేదు. ఏ వాహనమైనా పిచ్చిమొక్కలకు పక్కగా వచ్చిందంటే.. అదుపు తప్పి పైనుంచి ఆర్‌యూబీలోకి పడిపోయే ప్రమాదం ఉంది.

పిచ్చి మొక్కల పక్కనే ఆర్‌యూబీ ఉంది

ఆర్‌యూబీ నుంచి నిత్యం రాకపోకలు ఇలా..

- ద్విచక్ర వాహనాలు : 12వేల నుంచి 15 వేలు
- కార్లు : 500
- బస్సులు : 30

అజాగ్రత్తగా వెళితే.. అంతే..

బారికేడ్లు దాటితే... పైనుంచి పడిపోతారు.

రైల్వేస్టేషన్‌కు వచ్చే వివరాలు..

- మధురానగర్‌లో ఆగే రైళ్లు :8
- ప్రయాణికుల సంఖ్య : సుమారు 400 మంది
- ఆటోలు : 60
- ద్విచక్రవాహనాలు : 100

మధురానగర్ రైల్వేస్టేషన్‌కు నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. వీరంతా దుర్గాపురం వైపు నుంచి సర్వీసు రోడ్డులోకి వచ్చి.. స్టేషన్‌కు చేరుకుంటారు. ఆటోలు సైతం ప్రమాదకరమైన ప్రాంతం వద్దే తిరుగుతుంటాయి. ఏ డ్రైవరైనా అజాగ్రత్తగా ఉన్నా.. గోడలేని చోట నుంచి కిందకు జారిపడిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు.. ఒక వైపు మాత్రమే ట్రాఫిక్ బారికేడ్లు పెట్టారు. అవి పూర్తి రక్షణ ఇవ్వలేని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పెను ప్రమాదాలు జరగక ముందే.. యుద్ధప్రాతిపదికన రక్షణ గోడ నిర్మించాలని అందరూ కోరుతున్నారు.

కీర్తనలు పాడుతున్న సాయి విఘ్నేష్

అలరించిన గాత్ర కచేరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీసద్గురు సంగీత సభ 32వ వార్షికోత్సవాలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. సాయి విఘ్నేష్ తన గాత్ర కచేరితో శ్రోతలను ఆకట్టుకున్నారు. వర్ణం, సరసీరుహాసన, సమగానలోలే, వద్దు సుమీ.. చెప్పితిని, శశివదన, చెంత నేసదా, అడిగి సుఖము, రసిక రంజని, నీ సరివారిక, తిల్లానా.. కీర్తనలతో ప్రేక్షకులను రంజింపజేశారు. వయోలిన్‌తో పప్పు జ్ఞానదేవ్, మృదంగంతో వె.సద్గురు చరణ్, ఘటంతో ఎం.హరిబాబులు చక్కని సహకారం అందించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, సహాయ కార్యదర్శి జె.ఎస్.ఎస్.ప్రసాద్ శర్మలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడు బి.హరిప్రసాద్, కోశాధికారి వి.ఆర్.సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో సంగీత ప్రియులు పాల్గొన్నారు.

రంగు రంగుల పుష్పాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు

అలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఘనంగా షష్ఠి ఉత్సవాలు

మధురానగర్, న్యూస్‌టుడే : మధురానగర్‌లో స్వయంభువుగా వెలసిన బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం మహిళలు వివిధ రకాల పుష్పాలతో పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు రంగావఝల ప్రసాద్, ధర్మకర్తలు గోపాలకృష్ణమూర్తి, శ్యామల దంపతులు లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు పుష్పార్చన నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.

‘సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలి’

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : త్వరలో పీఆర్‌సీ కమిషన్ వేసి సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం గవర్నర్‌పేటలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఒక డీఆర్ మంజూరు చేసిన ప్రభుత్వానికి రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎస్.పి.శాస్త్రి ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గ ఉపసంఘ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్‌పై నగదు రహిత వైద్య సేవలు, స్లాబ్ రేటును రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం, మెడికల్ బిల్లులను మంజూరు చేయాలని... ఈ ప్రతిపాదనలను 60 రోజుల్లో పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాపర్టీ ట్యాక్స్ రద్దు, పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం వాలిడేషన్ యాక్ట్ ఉపసంహరించుకోవాలని... లేని పక్షంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.నాగరాజు, ఆర్.రామమూర్తి, కె.ఎస్.హనుమంతరావు, వి.గురురాజారావు, జి.జేమ్స్, బి.లోకనాథ్, ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాస్త్రి, చిత్రంలో నాగరాజు, రామమూర్తి, హనుమంతరావు, గురురాజారావు

ఉపకార వేతనాల అందజేత

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : గోర్తి సత్యవతి ఛారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో ట్రస్టు అధ్యక్షుడు గోర్తి శ్రీనివాస చక్రవర్తి పుట్టిన రోజు సందర్భంగా 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.రెండు వేల చొప్పున ఎమ్మెల్యే ఉమా చేతుల మీదుగా ఉపకార వేతనాలు అందజేశారు. కేకు కోసి అందరికీ పంచారు. సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై తుపాకీ ఎక్కడ..?

విజయవాడలోని లాడ్జిలో గాలింపుపై దృష్టి

గల్లంతైన 9ఎంఎం పిస్టల్ | భానుప్రకాష్‌రెడ్డి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్ వ్యసనానికి బానిసై.. రికవరీ బంగారాన్ని తాకట్టు పెట్టి సస్పెండైన హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఎస్సై భానుప్రకాష్‌రెడ్డి సర్వీస్ తుపాకీ(9ఎంఎం పిస్టల్) అదృశ్యంపై ఉన్నత స్థాయి విచారణ కొనసాగుతోంది. తనకు ఏపీలోని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో ఏఈగా ఉద్యోగం రావడంతో విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆయన కోరిన నేపథ్యంలో.. రికవరీ బంగారం తాకట్టు, సర్వీస్ తుపాకీ మాయమైన విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తుపాకీని మొదట పోలీస్ స్టేషన్‌లో పెట్టగా పోయిందని, అనంతరం తాను ఉంటున్న హిమాయత్‌నగర్‌లోని ఇంట్లో ఉంచగా కనిపించలేదని చెప్పాడు. ఆ తర్వాత మే నెలలో విజయవాడకు పీసీబీ ఏఈ ఉద్యోగ పరీక్షను రాయడానికి వెళ్లినట్లు, ఈ క్రమంలో అక్కడి ఉంచి తన సొంతూరు రాయచోటికి వెళ్లినపుడు ఎక్కడో పోయి ఉంటుందని విచారణలో వెల్లడించాడు.

లాడ్జిలో బ్యాగులో పెట్టి.. ఎస్సై భానుప్రకాష్ రెడ్డి పీసీబీ ఏఈ పరీక్ష రాయడానికి విజయవాడకు వెళ్లినప్పుడు ఓ లాడ్జిని అద్దెకు తీసుకున్నాడు. తనతోపాటు సర్వీస్ తుపాకీ, పుస్తకాలు, వ్యక్తిగత వస్తువులున్న బ్యాగు అక్కడే పెట్టానని, ఆ సమయంలో పిస్టల్ పోయిందని చెప్పారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చాక నాలుగు రోజులకు ఎస్సై మళ్లీ అక్కడికి వెళ్లడం అందుకు బలాన్ని చేకూర్చుతోంది. లాడ్జిలోనే తుపాకీ పోయి ఉంటుందని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. దాని ఆచూకీని గుర్తించి స్వాధీనం చేసుకోవడానికి శాంతిభద్రతలు, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కూడిన రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు విజయవాడ వెళ్లి లాడ్జి సిబ్బందిని విచారించనున్నారు. సీసీ కెమెరాలు సేకరించి విశ్లేషించనున్నారు.

న్యాయ సహాయం కోసం వస్తే.. మహిళతో అసభ్య ప్రవర్తన

వైకాపా లీగల్ సెల్ సభ్యుడు వెంకటేశ్వరశర్మపై కేసు

పటమట - న్యూస్‌టుడే: ఓ మహిళకు భర్తతో ఉన్న విభేదాలను తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించాడు ఆ న్యాయవాది. ఈ విషయంలో న్యాయ సహాయం కోసం వచ్చిన ఎస్టీ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేసేందుకు ప్రయత్నించాడు... వైకాపా లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాది. చివరకు ఆమె ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

★ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఓ మహిళ, ఆమె భర్త... ఇద్దరూ కూలి పనులకు వెళ్తుంటారు. తాగుడుకు బానిసైన అతడు.. నిత్యం ఆమెను హింసించేవాడు. దీంతో భర్తతో కాకుండా విడిగా ఉంటోంది. ఈ వివాదానికి సంబంధించి న్యాయ సహాయం కోసం సోదరుడితో కలసి గురువారం విజయవాడలోని వైకాపా న్యాయ విభాగం సభ్యుడైన వెంకటేశ్వరశర్మ ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా.. న్యాయవాదికి ఆమె వివరాలు చెబుతుండగా.. వేరుగా మాట్లాడాలని చెప్పి.. ఆమె సోదరుడిని బయటకు పంపాడు. న్యాయవాది వెంకటేశ్వరశర్మ.. మహిళ చున్నీ లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. న్యాయవాది ఇంటి బయటకు ఆమె ఏడుస్తూ వచ్చింది. వెంటనే సోదరుడితో కలసి డయల్ 112కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న మాచవరం స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను, న్యాయవాది వెంకటేశ్వరశర్మను స్టేషన్‌కు తీసుకొచ్చారు. 'వెంకటేశ్వరశర్మ తనకు డబ్బులు ఇస్తూ.. అసభ్యంగా ప్రవర్తించాడని' ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై మాచవరం పోలీసులు న్యాయవాదిపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ (1) కింద కేసు నమోదు చేశారు.

చిరస్మరణీయులు.. ఘంటసాల

మాట్లాడుతున్న సత్యనారాయణ

సంగీత విభావరికి హాజరైన ప్రేక్షకులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఘంటసాల చరిత్రను రేపటి తరాలకు తెలియచేసే ప్రయత్నంలో భాగంగా 'ఘంటసాల' బయోపిక్ నిర్మించిన రామారావుని అభినందించడం కళాకారుల బాధ్యత అని నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానంద కళావేదికపై 'ఘంటసాల' సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న సందర్భంగా రెండో రోజైన గురువారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఘంటసాల జీవిత చరిత్ర సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. తెలుగు సినిమాకు ఎనలేని సేవలు అందించి.. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. గాయకులు గుడిపాటి హరికృష్ణ, చంద్రశేఖర్, సుధారాణి, విష్ణుప్రియ, మధు, జోసఫ్ తదితరులు ఘంటసాల పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. వ్యాఖ్యాతగా డేవిడ్‌రాజు వ్యవహరించారు.

బాల్య వివాహాలు నివారిద్దాం

ప్లకార్డులతో విద్యార్థినులు

పాయకాపురం, న్యూస్‌టుడే : బాల్య వివాహాల నివారణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.బాలరాజు సూచించారు. గురువారం వాసవ్య మహిళా మండలి సారథ్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలు సమాజానికి పెద్ద సవాలుగా మారాయని చెప్పారు. అలాంటి ఎక్కడైనా జరుగుతుంటే.. ఆపాలని కోరారు. వాసవ్య మహిళా మండలి కోఆర్డినేటర్ జె.హృదయరాజు, సభ్యులు అమల, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

మాచవరం : స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ (డబ్ల్యూఈసీ) ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైట్ ఛాయిస్, అడ్వాన్స్‌డ్ గ్రూప్ ఆఫ్ హెల్త్ కేర్ సౌజన్యంతో నిర్వహించారు. డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ ఆరోగ్యకర చర్మం కోసం తగినంత ప్రొటీన్లు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. ఆందోళన, ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, కాలుష్యం, పోషకాహార లోపం, ఇతర ఆరోగ్య సమస్యల వల్ల జుట్టు రాలుతుందని చెప్పారు. పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ.. దంత, నోటి సమస్యలకు అత్యాధునిక లేజర్ చికిత్స అందుబాటులో ఉందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, కన్వీనర్ కె.అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాలల హక్కుల సాధనకు పోరాటం

ఎన్నికైన కార్యవర్గంతో రామకృష్ణ

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : మాల హక్కుల పరిరక్షణ సమితి(ఎం.హెచ్.పి.ఎస్) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని గురువారం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పి.రామకృష్ణ వ్యవహరించారు. ఎన్.ఎం.కె.గోపాలరావును రాష్ట్ర అధ్యక్షుడిగా, మరో ఆరుగురితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మాలల విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను దెబ్బతీస్తున్నాయని వాపోయారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను ఏకపక్షంగా స్వీకరించడం, నూతన రోస్టర్ విధానం అమలు చేయడం.. తమ సామాజికవర్గానికి అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. మంద కృష్ణ మాదిగ ఇచ్చిన సమాచారం ఆధారంగా చేసిన వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సంఘీయులపై అధికారపక్షాల అణచివేత పెరుగుతోందని వాపోయారు. వీటిపై పోరాటాలకు సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేయకపోవడం, పీపీపీ విధానం పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం తగదన్నారు.

అంతరిక్షంలో అద్భుతాలు తెలుసుకోవాలి

విద్యార్థులతో నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది

గాంధీనగర్, న్యూస్‌టుడే : అంతరిక్షంలోని అద్భుతాలను విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె.నాగేశ్వరరావు కోరారు. నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) నిర్వహిస్తున్న అంతరిక్ష గృహ నిర్మాణ పోటీల్లో పాల్గొంటున్న సత్యనారాయణపురంలోని శ్రీచైతన్య విద్యార్థులకు గురువారం నాసా కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక శ్రద్ధతోనే విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానాన్ని తెలుసుకోగలరని చెప్పారు. అక్కడ మానవులు నివసించడానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భారతీయులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు తమ ప్రతిభతో దేశాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ సంధ్యారాణి మాట్లాడుతూ.. అంతరిక్ష శాస్త్రం పరిశోధనలతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దేశం గర్వించదగ్గ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఎం నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భార్యకు వేధింపులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న వ్యక్తిపై మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణలంకకు చెందిన ఓ యువతి (33)కి వివాహం కాగా.. భర్తతో విబేధాల కారణంగా విడాకులు తీసుకున్నారు. తర్వాత షేక్ కరీ ముల్లా అనే యువకుడికి వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. ఈ క్రమంలో ఒక మహిళ ఫోన్ చేసి, తాను కరీ ముల్లాతో పది సంవత్సరాలుగా కలిసి ఉంటున్నానని చెప్పడంతో భర్తను నిలదీసింది. పెద్దలంతా సర్ధిచెప్పడంతో ఆమె హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చేసింది. ఏడాదిన్నరగా భర్తతో కలిసి కృష్ణలంకలో ఉంటున్నారు. తన భర్త వివాహేతర సంబంధం మానలేదని తెలిసి అత్తకు చెప్పగా.. ఆమె తన కుమారుడికే వత్తాసు పలికింది. ఘటనపై బాధితురాలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి చేయూత

చుట్టుగుంట, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో పేద ప్రజలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఒకటో డివిజన్‌కు చెందిన వృద్ధురాలు తలశెట్టి శివకుమారి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. చుట్టుగుంటలోని అనిల్ న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు రూ.లక్ష విలువైన వీల్‌ఛైర్, ఇతర ఉపకరణాలు, మందుల ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును గురువారం ఎమ్మెల్యే అందజేశారు. పీ-4 పథకంలో భాగంగా సహాయం చేయగలిగే వారు.. పేదల సంక్షేమానికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి అధినేత అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

మధురానగర్ : ప్రేమిస్తున్నానంటూ బాలికతో అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, అడ్డుకున్న డ్రైవర్‌పై దాడి చేసిన యువకుడిపై గుణదల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన ఓ బాలిక (17) ఇంటర్ మొదటి సంవత్సరం చదివి మానేశారు. తల్లి ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నారు. గురువారం బాలికను పాఠశాల బస్సులో పంపించారు. మధురానగర్ వద్దకు రాగానే గౌతం (22) అనే యువకుడు బస్సును ఆపి బాలికతో అనుచితంగా ప్రవర్తించాడు. ప్రశ్నించిన చోదకుడిని కొట్టాడు. ఇది గమనించిన స్థానికులు అక్కడకు వెళ్లి... యువకుడిని పట్టుకున్నారు. 112 నంబరకు ఫోన్ చేయటంతో గుణదల పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేశారు.

WALK - IN - INTERVIEW

Ameya Plantations is a reputed plantation company engaged in commercial Sandalwood Plantation and in the process of creating a Benchmark in India. To Strengthen our ambitious growth plan, we need the following to join our CRM Team.

1) **CRM Executives : 4 Numbers** Male/Female MBA who possess very good communication and analytical skills. They should be fluent English, Telugu and Hindi. Age below 35 years.

2) **Graphic Designer :** An experienced Graphic Designer to design various designs and AI knowledge is a must.

Attractive salary and performance linked incentives are offered.
Meet us with your CV between **10 AM to 5 PM on 29th or 30th of Nov 25.**

Ameya Plantations
2nd Floor, Opp to TARNAKA Restaurant, Mogulrajapuram,
Vijayawada – 10. Mobile: 7399667777

ప్రకటన

నా క్లయింటు ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, రామానగర్, బావాజీపేట, ఫస్టులైను, డోర్ నెం.24-10-25రు కాపురస్థులు కనుమూరు రంగారావు గారి కుమారుడు నాగరాజు గారు, కారుమంచి కొండలరావు గారి కుమారులు దుర్గానాగేంద్రరావు, మురళీమోహన్, వాసుదేవశర్మ, కృష్ణమూర్తి మాటూరి వెంకటేశ్వరరావు గారి దత్తత కుమారుడు వెంకట రామారావు వీర్ల తరుపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంటు కారుమంచి శ్రీరామచంద్రమూర్తి గార్లకు చెందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కొనదలచి కొంత పైకము బయనాగా చెల్లించి యున్నారు. ఈ దిగువ షెడ్యూలు ఆస్తి కారుమంచి కొండలరావు గారికి క్రయ దస్తావేజు నెం.1209/1939రుగా సంక్రమించగా తదుపరి వారు జీవితకాలములో వారు జీవించియుండగనే దిll25-05-1982వ తేదీన, దిll16-01-1984వ తేదీన నెం.10/1984రుగా గల వీలునామాను రిజిష్టరు చేయించి మరి ఏ ఇతర వీలునామాను వ్రాయకుండ అదివే ఆఖరి వీలునామాగా ఉంచి దిll05-03-1997వ తేదీన పరమపదించినారనియూ, వారి మరణానంతరము వీలునామాలోని అంశములను అనుసరించి పైన తెలిపిన వారసులు మరియు రామతులసమ్మ గారలు జాయింటుగా స్వాధీనపరచుకొని తదుపరి రామతులసమ్మ గారు వారికి గల జాయింటు హక్కును గురించి ఏ విధములైన లిఖిత పూర్వకములైన ఏర్పాట్లు చేయకుండానే దిll 14-01-2007వ తేదీన ఇంటెస్టేట్‌గా పరమపదించినారనియు, వార్ల మరణాంతరము పైన తెలిపిన వారలు జాయింటుగా స్వాధీన పరచుకొని నా క్లయింటుకి విక్రయించదలచినారని తెలియచేయుచున్నారు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఏ విధములైన చెల్లదగు అభ్యంతరములు. కోర్టు జప్తులు, ఇంజక్షన్లు, భాగలబ్ధ తగాదాలు వగైరాలు ఏదైనా వున్నచో ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు ఈ దిగువ తెలిపిన అడ్రస్‌నకు రిజిష్టరు పోస్టు తిరుగుటపా ద్వారా పంపవలసినది లేనిచో అభ్యంతరములు లేవని ఎంచి నా క్లయింటు పైన తెలిపిన వారికి పూర్తి క్రయ ధనమును చెల్లించి వారిచే సంబంధిత రిజిస్ట్రారు వారి ఆఫీసులో క్రమమైన విక్రయ దస్తావేజును రిజిస్టరు చేయించుకొనగలరు. తదుపరి వచ్చు క్లయిములు, అభ్యంతరములు నా క్లయింటు ను ఏవిధముగాను బైండు చేయజాలవు ఆస్తి షెడ్యూలు: లోగడ కృష్ణాజిల్లా, ప్రస్తుత ఎన్.టి.ఆర్.జిల్లా విజయవాడ, గాంధీనగర్, రామానగర్, ఆంధ్రరత్నరోడ్డు, మునిసిపల్ వార్డు నెం.26రు రెవిన్యూ వార్డు నెం.14రు, రీసర్వే నెం.38రు, ఎన్.టి.ఎస్.నెం.81, పాత అసెస్‌మెంట్ నెం.1562 దరిమిలా అసెస్‌మెంట్ నెం.113690రు ప్రస్తుత డోర్ నెం.24-3-27రు దాఖలా స్థిరాస్థికి హద్దులు:- తూర్పు: మాటూరి వెంకటరామారావు వగైరాల ఆస్తి. దక్షిణం: ఆంధ్రరత్న రోడ్డు అనే మున్సిపల్‌రోడ్డు. పడమర: ద్రోణంరాజువారి వీధి అనే మున్సిపల్‌రోడ్డు. ఉత్తరం: పెందుర్తి వెంకట రామయ్య గార్ల వగైరాల ఆస్తి. పై నాలుగు హద్దుల మధ్య చ.గ.216 లు లేక చ.180.604ర్లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి కట్టడములు అందలి యావత్తు రైజ్ మెంటు హక్కులతో సహా.

పి. రామమోహనరావు, దామ లక్ష్మణ కుమార్, అడ్వకేట్స్,
డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

'తొలి గురువారం' పూజలకు పోటెత్తిన భక్తులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మార్గశిర మాసం తొలి గురువారం కావడంతో పాతనగరంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచే భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వేకువజామున పసుపు కుంకుమలతో అభిషేకం చేశారు. అర్చకులు వేద మంత్రాలతో వివిధ పూజలు, హోమం, క్షీరాభిషేకం పూర్తి చేసి, అమ్మవారిని అలంకరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ శోభారాణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

దర్శనాలకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

★ టౌన్ కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్‌ను మళ్లించారు. క్షేత్రస్థాయిలో భద్రత ఏర్పాట్లను సీపీ శంఖబ్రతబాగ్చీ పర్యవేక్షించారు.

పాలాభిషేకం చేస్తున్న భక్తులు

★ అమ్మవారి దర్శనానికి ఉచితంతో పాటు, రూ.100, రూ.200, రూ.500 టికెట్లను దేవస్థానం అందుబాటులో ఉంచింది. ఉచితం, రూ.100, రూ.200 క్యూలైన్లలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. భక్తులకు జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం చేశారు.

48 గంటల్లో ఉపాధి జాబ్ కార్డు

చీడికాడ, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 48 గంటల్లో నూతన జాబ్ కార్డు పొందేందుకు వెసులుబాటు కల్పించింది. గతంలో జాబ్ కార్డు పొందాలంటే నానా అవస్థలు పడేవారు. కుటుంబ సభ్యుల పేర్ల నమోదుకు సైతం ఇబ్బందులుండేవి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఈ-కేవైసీతో అర్హులైన శ్రామికులకు 48 గంటల్లో కొత్త జాబ్ కార్డు అందజేసే ప్రక్రియ మొదలైంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పిస్తే.. మండల కార్యాలయం నుంచి మరుసటి రోజుకే జాబ్ కార్డు నకలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

కోటేశ్వరికి లోటే రానివ్వం!

కన్నవారు లేని యువతి వివాహానికి ఊరంతా ఒక్కటై..

రావికమతం, న్యూస్‌టుడే: వివాహం జీవితంలో వచ్చే అరుదైన ఘట్టం. తల్లిదండ్రులు, బంధుమిత్రులు కలిసికట్టుగా జరిపించే వేడుక. చిన్నప్పుడే తల్లిదండ్రులు దూరమైన ఓ యువతికి.. అయినవారు లేని లోటు లేకుండా ఊరంతా అండగా నిలిచింది. జరుగుతోంది తమ ఇంటి పెళ్లివేడుక అన్నట్టుగా ప్రతి ఒక్కరూ ఆమెకు అండగా నిలిచారు. పెళ్లి ఖర్చులు మొదలు కొని, సారె పెట్టడం వరకు పుట్టింటివారికి ఏమాత్రం తగ్గకుండా ఏర్పాటు చేశారు. అన్నవరం దేవస్థానంలో గురువారం రాత్రి దగ్గరుండి పెళ్లి చేయించేందుకు మహిళలు, జనసేన యూత్, పెద్దలు తరలివెళ్లారు.

★ చినపాచిల గ్రామానికి చెందిన కేశంశెట్టి కోటేశ్వరి తల్లిదండ్రులు కేశంశెట్టి అప్పారావు, సత్యవతి బాల్యంలోనే మృతిచెందారు. సోదరులు కూడా లేకపోవడంతో అక్కాబావల సంరక్షణలోనే పెరిగింది. ఏడో తరగతి వరకు చదువుకున్నాక మధ్యలోనే మానేసింది. తదనంతరం వేర్వేరు పనులు చేసుకుంటూ జీవనం సాగించింది. కట్నకానుకలు ఇచ్చి పెళ్లిచేసే ఆర్థిక స్తోమత అక్కాబావలకు లేదు. కోటేశ్వరిని పెళ్లి చేసుకోడానికి వి.మాడుగుల మండలం గొటివాడకు చెందిన నగేష్ ముందుకొచ్చాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితిలో ఆమెకు ధైర్యం చెబుతూ చినపాచిల గ్రామమంతా ఏకమైంది. తమ ఊరి ఆడబిడ్డకు ఏ లోటులేకుండా ఘనంగా వివాహం జరిపించాలని నిర్ణయించారు.

కొనుగోలు చేసిన సారె సామగ్రితో మహిళలు



వధూవరులు కోటేశ్వరి, నగేష్

★ గ్రామస్థులే పెళ్లి ఖర్చుల నిమిత్తం సుమారు రూ. 50 వేలు సమీకరించారు. అంతా కలిసికట్టుగా వేడుకలో పాలుపంచుకున్నారు. పెళ్లి కుమార్తెను చేయడం నుంచి మంగళసూత్రధారణ వరకు ఖర్చులన్నీ వారే చూసుకున్నారు. సారె సామానుగా బీరువా, వాషింగ్ మిషన్, దివాన్ కాట్, పరుపులు, కుర్చీలు, ఇత్తడి, స్టీలు సామగ్రి తదితరాలు కొనుగోలు చేశారు. వివాహ వేదికను అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం వద్ద నిర్ణయించారు. యువతికి వివాహం జరిపించే విషయంలో స్థానిక జనసేన యూత్ సభ్యుడు మచ్చా రాజు, గ్రామ యువత అన్నీ తామై ముందుండి నడిపించారు.

అదిగో జాగా.. వేసెయ్ పాగా!

జాతీయ రహదారి ఆనుకొని అక్రమ నిర్మాణాలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో ఎక్కడ సెంటు స్థలం కనిపించినా అక్రమార్కులు వాలిపోతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)కి చెందిన ఖాళీ స్థలాల్లోనూ పాగా వేస్తున్నారు. రహదారి పక్కన సెంటు స్థలం రూ. లక్షల్లో పలుకుతుండటంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. జాతీయరహదారి అభివృద్ధి, విస్తరణ సమయంలో భూములు, స్థలాలు కోల్పోయి.. పరిహారం పొందిన వారే మళ్లీ ఆయా స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నారు. తొలుత తాత్కాలికంగా షెడ్లు, పాకలు వేసి.. తర్వాత కొంతకాలానికి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు.

జిల్లాలో 68 కి.మీ. పొడవునా జాతీయ రహదారి ఉంది. పలు ప్రాంతాల్లో ఎన్‌హెచ్‌ఏఐకు ఖాళీ స్థలాలున్నాయి. వీటిపై పర్యవేక్షణ కరవవడంతో కబ్జాలకు గురవుతున్నాయి. రోడ్డు పరిధిలో సెంటు స్థలం కూడా రూ. 15 లక్షలకు పైనే పలుకుతోంది. దీంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

అనకాపల్లి-గాజువాక మార్గంలో జాతీయ రహదారిని ఆనుకుని నిర్మాణం

★ అనకాపల్లి పట్టణ పరిధిలోని డబుల్ ట్రంపెట్ అండర్ బ్రిడ్జిని ఆనుకొని ఒక ప్లైవుడ్ దుకాణం ఏర్పాటు చేశారు. అలాగే మరోపక్క టింబర్ డిపో పెట్టారు. వాస్తవానికి అండర్ బ్రిడ్జి పక్కన కనీసం పది మీటర్ల స్థలం వదలాలి. కానీ.. ప్లైవుడ్ తయారీ సముదాయాన్ని నిర్మించేశారు. ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. కానీ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు.

★ అనకాపల్లి నుంచి గాజువాక వైపు వెళ్లే రహదారిలో కొప్పాక, సిరసపల్లి, మారేడు పూడి, సాలాపువానిపాలెం, లంకెలపాలెం వద్ద జాతీయ రహదారి వెంబడి ఆక్రమిత స్థలాల్లో దుకాణ నిర్మాణాలు చేపట్టారు. ఇవి ఇంకా విస్తరిస్తున్నారు. కొత్తూరు కాలేజీ జంక్షన్ నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి వద్దా ప్రభుత్వ జాగాలు కబ్జాకు గురవుతున్నాయి.

★ అనకాపల్లి నుంచి సబ్బవరం నడుమ రేబాక పంచాయతీలో సర్వే నం. 10-2, 41-3లోని భూములు ఆక్రమణకు గురయ్యాయి. రేబాక, కాపుశెట్టిపాలెం, పొడుపులమ్మ తల్లి ఆలయం ప్రాంతాల్లో గతంలో హైవే కోసం భూములు కోల్పోయిన వారికి ఎన్‌హెచ్‌ఏఐ నుంచి పరిహారం లభించింది. రహదారి నిర్మాణానికి వినియోగించగా పక్కన కొంత స్థలం మిగిలింది. గతంలో ఎవరైతే పరిహారం పొందారో.. వారే ఇప్పుడు ఆయా స్థలాలను ఆక్రమించేస్తున్నారు. ఇక్కడే హైటెన్షన్ విద్యుత్తు లైన్లు, భూగర్భ పైపు లైన్లు ఉన్నాయి. ఆక్రమణదారులు అవేవీ పట్టించుకోవడం లేదు.

నోటీసులు ఇస్తున్నాం

జాతీయ రహదారికి ఆనుకుని అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలు, షెడ్లను గుర్తిస్తున్నాం. ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఇచ్చిన గడువులోగా స్థలాలను ఖాళీ చేయకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ప్రభాత్ రంజన్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ, విశాఖపట్నం

సులభంగా.. సత్వరంగా..

పాయకరావుపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు కనెక్షను పొందాలంటే సవాలక్ష నిబంధనలు, ఛార్జీల మోత ఉండేది. ఇకపై ఆ కష్టాలకు చెల్లుచీటి పడినట్లే. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతో 'ఈజ్ ఆఫ్ లివింగ్' కార్యక్రమం చేపట్టారు. దీనిలోభాగంగా కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని నిర్ణయించారు.

గతంలో 30 మీటర్ల దూరం దాటితే స్తంభాల ఖర్చు వినియోగదారుడే భరించాల్సి వచ్చేది. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత రుసుం నిర్ణయించేవారు. ఇప్పుడు విద్యుత్తు కనెక్షను తేలిగ్గా, ఆర్థిక భారం తక్కువగా ఉండేలా ఈపీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాల మేరకు కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని ఈఈ రాజశేఖర్ తెలిపారు.

కొత్త విధానం ఇలా: ఒక కి.మీ. పరిధిలో ఇప్పటికే విద్యుద్దీకరణ పూర్తయిన ప్రాంతాల్లో 150 కిలోవాట్ల వరకు లోటెన్షన్ (ఎల్‌టీ), హైటెన్షన్ (హెచ్‌టీ) కనెక్షన్లు కోరే వారికి స్తంభాలు, ఇతర అదనపు ఛార్జీలు ఉండవు. గృహావసరాల (ఎల్‌టీ) కనెక్షను ఒక కిలోవాట్‌కు రూ.1,500, ఒకటి నుంచి 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2,000 చెల్లించాలి. 20 నుంచి 150 కిలోవాట్ల వరకు ప్రతి కిలోవాట్‌కు అదనంగా రూ.12,600 చెల్లించాలి. 500 వాట్ల వరకు రూ.800, 500 నుంచి 1000 వాట్ల వరకు రూ.1500 చెల్లించాలి.

★ వాణిజ్యానికి 250 కిలోవాట్ల వరకు రూ.600, 251 నుంచి 500 వరకు రూ.1,000, 501 నుంచి 1 కిలోవాట్ వరకు రూ. 1800 కట్టాలి. ఒక కిలోవాట్‌కు పైగా 20 కిలోవాట్ల వరకు రూ.1800తో కలిపి అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేలు చెల్లించాలి.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం పవన్‌కుమార్ తెలిపారు.

సంత్రాగచ్చి- యలహంక (02863/64) : డిసెంబరు 4 నుంచి 25 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, మర్నాడు తెల్లవారుజామున 2.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 2.45 గంటలకు బయలుదేరి యలహంకకు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబరు 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు యలహంకలో బయలుదేరే రైలు, అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 11.07 గంటలకు బయలుదేరి సంత్రాగచ్చికి వెళ్తుంది. యశ్వంత్‌పూర్ నుంచి రాకపోకలు సాగించాల్సి రైలును యలహంకకు మార్పు చేశారు.

చర్లపల్లి- బ్రహ్మపుర (07027/28) : డిసెంబరు 5 నుంచి జనవరి 30 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు చర్లపల్లిలో బయలుదేరే రైలు, మర్నాడు తెల్లవారుజామున 3.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 3.45 గంటలకు బయలుదేరి బ్రహ్మపుర వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబరు 6 నుంచి జనవరి 31 వరకు ప్రతి శనివారం ఉదయం 11.30 గంటలకు బ్రహ్మపురలో బయలుదేరే రైలు, సాయంత్రం 4.45 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 4.47 గంటలకు బయలుదేరి చర్లపల్లికి వెళ్తుంది.

పంట లేక మండుతున్నాయి!

కార్తికం ముగిసినా దిగిరాని కూరగాయల ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే

ఏటా కార్తికమాసంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ కారణంగా ఈ నెలలో కూరగాయలకు డిమాండ్ ఎక్కువై ధరలు పెరుగుతుంటాయి. కార్తికం ముగిశాక మార్కెట్‌లో ధరలు దిగివస్తాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. కార్తికంలో ముగిసినా కూరగాయల ధరలు దిగివస్తున్న పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను దెబ్బకు పలు ప్రాంతాల్లో వేసిన కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఈ ప్రభావం ధరలపై కనిపిస్తోంది. బీర నుంచి బీన్స్ వరకు అన్నింటి ధరలూ అధికంగానే ఉన్నాయి. కూరగాయల ధరలు వింటేనే గుండె గుభేలుమంటోందని పట్టణ మహిళలు బి.మంజుల, కె.కళావతి ఆవేదన వ్యక్తం చేశారు.

« జిల్లాలో సబ్బవరం, కశింకోట, అనకాపల్లి, సీతానగరం, వెంకుపాలెం, తీడ ప్రాంతాల్లో రైతులు బీర, వంకాయలు ఎక్కువగా సాగు చేస్తారు. స్థానికంగా పంట లేకపోవడంతో విజయవాడ, సికింద్రాబాద్, బెంగుళూరు నుంచి రప్పిస్తున్నారు.

« గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలికూర, చుక్కకూర సాధారణంగా రూ. 10కి నాలుగు కట్టలు ఇస్తారు. గతవారం వరకు ఒక కట్టే ఇచ్చేవారు. ప్రస్తుతం అనకాపల్లి, నాగులాపల్లి, తుమ్మపాల ప్రాంతాల నుంచి ఆకుకూరలు మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో ధరలు కాస్త తగ్గినట్లు వర్తకులు తెలిపారు.

« మునగకాడల ధరలు బాగా పెరిగాయి. ఒకటి రూ. 25 నుంచి రూ. 30కి విక్రయిస్తున్నారు. తుపానుకు చాలా ప్రాంతాల్లో చెట్లు విరిగిపోయాయని రైతులు తెలిపారు.

« అనకాపల్లిలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఉంది. ఇక్కడి నుంచి జిల్లాలోని చోడవరం, ఎలమంచిలి, నర్సీపట్నం, అచ్యుతాపురంతోపాటు విశాఖ నగరంలోని గాజువాక, స్టీల్ ప్లాంట్, కూర్మన్నపాలెంకు కూరగాయలు సరఫరా చేస్తారు. మార్కెట్ రోజుకు మొత్తం 1,500 క్వింటాళ్ల కూరగాయలు అవసరం కాగా.. ప్రస్తుతం 1,100 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నట్లు వర్తకులు చెబుతున్నారు.

దారెక్కిస్తున్న టమాటా : ప్రస్తుతం జిల్లాలో టమాటా సాగు తక్కువగా ఉంది. డిసెంబరు మొదటివారం నుంచి జిల్లాలో ఈ పంట సాగు చేస్తారు. దిగుబడి చేతికి రావాలంటే మరో రెండు నెలలు ఆగాలి. ప్రస్తుతం మదనపల్లి, బెంగుళూరు నుంచి సరకు వస్తోంది. తుపాను కారణంగా మదనపల్లిలోనూ చాలావరకు పంట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

కూరగాయలు	కేజీ ధర రూ.లలో
టమాట	70
తెల్ల వంకాయలు	60
నల్ల వంకాయలు	70
బీరకాయలు	80
దొండ	50
చిక్కుడు	80
క్యాబేజి	35
క్యారెట్	60
బీన్స్ పిక్కలు	150
మిర్చి	50
ఆనప ఒకటి	30

మన అడవుల్లో పులులున్నాయా?

డిసెంబరు ఒకటి నుంచి గణన
సాంకేతిక విధానం ద్వారా లెక్కింపు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పులులు, ఇతర జంతువుల గణనకు అటవీ సిబ్బంది సమాయత్తమవుతున్నారు. నాలుగేళ్లకోసారి ఈ గణన నిర్వహిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 8 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గతంలో జంతు గణన పుస్తకంలో నమోదు చేసేవారు. ఈ ఏడాది నుంచి ఆధునిక సాంకేతిక విధానం ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. దీనికోసం నర్సీపట్నంలో అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా చింతపల్లి డివిజన్‌లోని సిబ్బందికి లంబసింగిలో శిక్షణ ఇచ్చారు.

లెక్కింపు ప్రక్రియ ఇలా.. తొలి మూడు రోజులు సిబ్బంది నిర్దేశిత ఐదు కిలోమీటర్ల పరిధిలో కాలి నడకన తిరుగుతూ పులుల సంచారానికి సంబంధించిన ఆనవాళ్లను గమనిస్తారు. తదుపరి ఐదు రోజులు చిరుతలు, ఎలుగులు, అడవి కుక్కలు తదితర మాంసాహార జంతువులను గుర్తిస్తారు. జంతువులు నేరుగా కనిపిస్తే ఫొటో తీస్తారు. లేదా పెంటికలు, చెట్ల రాపిడిలు తదితర ఆనవాళ్లను గుర్తిస్తారు. అడవుల్లో సంచరించే పశువుల కాపరులు, అడవులకు దగ్గరగా గ్రామాల్లో నివసించే ప్రజల నుంచి సమాచారం సేకరిస్తారు. తిరుగు ప్రయాణంలో ఎన్ని వృక్షాలు ఉన్నాయి, అవి ఏయే రకాలని అంచనా వేస్తారు.

- జిల్లాలో 2022లో పులిసంచారం కలకలం రేపడం తెలిసిందే. నర్సీపట్నం మండలం మెట్టపాలెం ప్రాంతంలో ఓ పశువును చంపేసింది. విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో ఈ పులి సంచారం కనిపించింది. ఇప్పుడు దాని జాడలేదు.
- ఇటీవల అల్లూరి జిల్లా ధారకొండలో పులి తిరుగుతోందని పలువురు గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రూఢీ కాలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో దశాబ్దాల క్రితం నాలుగు చిరుతల సంచారం ఉన్నట్టు గుర్తించారు.
- ఏడాది క్రితం మాకవరపాలెం మండలం యరకన్నపాలెంలో కణుజు మాంసం స్వాధీనం చేసుకున్నారు. రాచపల్లిలో ఓ రైతు పొలంలో చెట్ల పరిశీలనకు వెళ్లిన అటవీ సిబ్బందికి కణుజు కొమ్ములు దొరికాయి. ఇలా అక్రమంగా వన్యప్రాణుల వేట సాగుతోంది.

★ జిల్లాలో పులులు, ఇతర జంతువుల గణనకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ప్రొఫార్మాలో కేంద్రానికి పంపుతామని చింతపల్లి డీఎఫ్‌ఓ వై.వి.నరసింహారావు తెలిపారు.

జిల్లా అడవుల సమాచారం

అటవీ రేంజ్	విస్తీర్ణం (హెక్టార్లలో)
అనకాపల్లి	12542.99
ఎలమంచిలి	11690.42
చోడవరం	16952.75
కృష్ణదేవిపేట	15953.29
నర్సీపట్నం	21233.11

మ్యుటేషన్‌కు లంచం మెలిక

అనిశాకు చిక్కిన వీఆర్‌ఓ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: భూముల మ్యుటేషన్‌కు లంచం తీసుకుంటూ అనకాపల్లి మండలానికి చెందిన వీఆర్‌ఓ ఎం.సూర్యనారాయణ గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. అనిశా డీఎస్పీ ఎన్.ఎస్.ఎస్. రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు సంజీవరావు ఈ ఏడాది మే నెలలో మృతిచెందారు. ఆయన పేరనున్న మూడున్నర ఎకరాల భూమిని భార్య దేముడమ్మ పేరు మీదకు మార్చడానికి సెప్టెంబరు నెలలో దరఖాస్తు చేసుకున్నారు. అక్కిరెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న సూర్యనారాయణ మొత్తం 24 సర్వే నంబర్లుగా ఉన్న మూడున్నర ఎకరాల భూమిలో 19 సర్వే నంబర్లలో మ్యుటేషన్ చేశారు. మిగిలిన భూమిని మ్యుటేషన్ చేయాలంటే రూ. 50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితులు విషయం అనిశా దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనల మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఓ బాధిత రైతు కుటుంబం నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

వీఆర్‌ఓ సూర్యనారాయణ

ప్రతి పనికీ సెప 'రేటు'

అనకాపల్లి పట్టణం, నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

భూ వ్యవహారాల్లో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో అవినీతి బాగోతం పెచ్చుమీరుతోంది. దీనిపై ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా వీఆర్‌ఓలు అవినీతిలో తగ్గేదేలే అన్నట్లుగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రతి పనికి ప్రత్యేకంగా ధర నిర్ణయించి తమకు చెల్లించాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి గ్రామాల వీఆర్‌ఓగా పనిచేస్తున్న ఎం.సూర్యనారాయణ వ్యవహార శైలిపై గతంలోనే పలువురు ఫిర్యాదులు చేశారు. చేయి తడపనిదే చిన్న పని సైతం చేయకుండా వేధిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. భర్త చనిపోవడంతో ఆయన పేరున్న భూమిని తన పేరు మీద మ్యుటేషన్ చేయాలని వితంతువు దరఖాస్తు చేసుకుంటే ఆమె దగ్గరా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు అవినీతి నిరోధక శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయనపై వలపన్ని పట్టుకున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ రెవెన్యూ సిబ్బంది తీరు ఇదేరకంగా ఉందని.. అందినకాడికి దోచుకోవాలన్న భావనతో వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామంలోనూ ఓ వీఆర్‌ఓ ఇలాగే భూమి మ్యుటేషన్ కోసం రూ. 20 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఆ తరవాత రెవెన్యూ ఉన్నతాధికారులు సిబ్బంది తీరు మార్చుకోకపోతే సహించబోమంటూ హెచ్చరికలు జారీ చేశారు. కానీ రెవెన్యూ సిబ్బందిలో ఎలాంటి మార్పు రాలేదనడానికి తాజా ఉదంతం నిదర్శనంగా నిలుస్తోంది.

1064కి ఫోన్ చేయండి

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేయించుకోవడానికి ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఏ అధికారి డబ్బులు లంచం అడిగినా నేరుగా అనిశా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. లేకుంటే టోల్‌ఫ్రీ నంబరు 1064కి ఫోన్ చేయవచ్చు. ప్రభుత్వ అధికారులతో పనిచేయించుకోవడం ప్రజల హక్కు. దీనికి డబ్బులు డిమాండ్ చేస్తే ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించవద్దు. మమ్మల్ని సంప్రదిస్తే డబ్బులు అడిగిన వారికి బుద్ధిచెప్పేలా తగిన చర్యలు తీసుకుంటాం. అవినీతి నిర్మూలనకు అందరూ సహకరించాలి.

– రమణమూర్తి, డీఎస్పీ, అనిశా, విశాఖపట్నం

30న ఎలమంచిలిలో జాబ్‌మేళా

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉద్యోగాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలమంచిలి ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 కంపెనీలతో నిర్వహించే ఈ మేళాకు పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదువుకుని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సున్న యువతీ, యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను https:///naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న రిఫరెన్స్ నంబరుతోపాటు బయోడేటాలు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 81425 65416 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భవితపై భయంతో బలవన్మరణం!

❖ సంపాదించిన మొత్తం కోల్పోయిన భర్త
❖ మాట వినలేదన్న క్షణికావేశంతో భార్య ఆత్మహత్య

కృష్ణదేవిపేట, నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి నష్టం చిచ్చుపెట్టింది. ఆర్థిక ఇబ్బందులు దంపతుల మధ్య మనస్పర్ధలకు దారితీశాయి. ఇది కాస్తా ముదిరి మాటామాటా పెరగడంతో క్షణికావేశానికి లోనైన భార్య ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న వీరిద్దరి మూడున్నరేళ్ల బిడ్డ తల్లిలేనివాడయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్న ఇన్‌ఛార్జి ఎస్సై రామారావు కథనం ప్రకారం... గొలుగొండ మండలం కొంగశింగికి చెందిన విశ్రాంత నేవీ ఉద్యోగి అరిట ప్రసాద్ (36) పదవీ విరమణ తరవాత వచ్చిన డబ్బు దాదాపు రూ. 20 లక్షలతో షేర్లు కొనుగోలు చేసి పూర్తిగా నష్టపోయాడు. పదిహేనేళ్లకు పైగా నేవీలో ఉద్యోగం చేసిన దాచుకున్న డబ్బు షేర్లలో కోల్పోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చలేక ఊళ్లో అల్లరిపాలయ్యాడు. పదవీ విరమణ తరవాత అందిన సొమ్ముతో ఆనందంగా జీవిద్దామన్న తన మాట భర్త పెడచెవిన పెట్టడంతో బుధవారం రాత్రి భర్తని నిలదీసింది. ఇప్పటికే ఇల్లు గుల్లయిందని, భవిష్యత్తు అగమ్యగోచరమైందని.. ఎంత చెప్పినా మారేలా లేడని మనస్తాపానికి గురైన భార్య లక్ష్మీపార్వతి (26) గదిలోకి వెళ్లి గడియపెట్టుకుని ఉరి వేసుకుందని ఎస్సై వివరించారు. ఎంతకూ తలుపు తీయకపోవడంతో భర్త చుట్టుపక్కల వారిని పిలుచుకు వచ్చాడు. అందరు కలిసి తలుపు బలవంతంగా తెరిచారు. అప్పటికే ఆమె మరణించినట్టు ఎస్సై తెలిపారు. దీనిపై రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామానికి చెందిన లక్ష్మీపార్వతి తల్లి పప్పలకుమారి గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు. మృతదేహాన్ని మరణోత్తర పరీక్షల నిమిత్తం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

లక్ష్మీపార్వతి (పాత చిత్రం)

అన్నదాత ఆనందమే ధ్యేయం

ధాన్యం ఎగుమతి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టరు విజయ కృష్ణన్

దేవరాపల్లి, న్యూస్‌టుడే: అన్నదాత ఆనందంగా ఉంటే అందరికీ శుభం జరుగుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపెంటలో కలెక్టరు విజయకృష్ణన్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేస్తోందన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామని, దళారుల మాటలకు మోసపోయి, ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. కలెక్టరు విజయకృష్ణన్ మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం దిగుబడి పెరిగినందున ప్రస్తుతం మంజూరు చేసిన కొనుగోలు కేంద్రాలు చాలకపోతే అదనంగా మంజూరు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బందితో పాటు దానికి సంబంధిన అధికారులు బాధ్యతగా పనిచేసి, రైతుల నుంచి ఎలాంటి ఆరోపణలూ రాకుండా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు జలాశయం పరిస్థితిని ఎమ్మెల్యేకు, తనకు వివరించడం ద్వారా అత్యవసర నిధులు మంజూరు చేయించామన్నారు. రైతుసేవా కేంద్రం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన కాటాను ప్రారంభించారు. వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.జి.కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజరు జయంతి, ఆర్‌డీఓ ఆయీషా, జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాజ్యోతి, డీఎల్‌డీఓ మంజులవాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి, మాజీ ఎంపీపీ భాస్కరరావు, జనసేన అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, తెదేపా నాయకుడు గోవిందరావు, సర్పంచి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రైవేట్ పాఠశాలల్లో వసతులపై పరిశీలన: డీఈఓ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు, రక్షణ చర్యలను పరిశీలిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు పేర్కొన్నారు. అనకాపల్లి ఏఎం ఏఎల్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, నిర్వాహకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సగం మంది కూడా హాజరు కాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రతి యజమాని, సిబ్బంది నిబంధనలు తెలుసుకుని పక్కాగా అమలు చేయాలన్నారు. కమిటీ అన్ని పాఠశాలలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి నివేదిక ఇస్తుందన్నారు. నివే

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు

దిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా వ్యాయామోపాధ్యాయులు ఉండాలన్నారు. పిల్లల రక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి ప్రేమ్‌కుమార్ నత్తనారాయణ మాట్లాడుతూ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు బకాయిలన్నీ వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఎ.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేద్దాం

రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో అయిదో స్థానంలో ఉన్న జిల్లాను మరింత మెరుగైన స్థానంలోకి తీసుకువెళ్లడానికి కృషి చేద్దామని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు కోరారు. డివిజన్, మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లిని ప్రథమ స్థానంలో నిలిపే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్లామన్నారు. డిసెంబరు 5న జరిగే మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకునే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.



సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్, రొమాంటిక్ రిట్రీట్‌కు గ్లాంపింగ్ వేదిక చేసుకోవచ్చు.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభవాన్ని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు,

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఉయ్యాలలో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఫోటోలు.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కబుర్లు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్‌మిశ్రా

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేలా చొరవ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా చొరవ చూపాలని ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్ మిశ్రా అన్నారు. అనకాపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సుశాంత్ మిశ్రా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా పోరాడుతున్నారన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున కృషి చేయాలన్నారు. ఓట్ల చోరీలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, పీసీసీ పరిశీలకులు మేడా సురేష్, బోడ్డ వెంకట్, బోయిన భానుమూర్తి, అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య సీఎం రమేష్ తల్లికి అంత్యక్రియలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ (83) అంత్యక్రియలను గురువారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామమైన పోట్లదుర్తిలో బుధవారం తెల్లవారుజామున సీఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ తుదిశ్వాస విడిచారు. కుమారులు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, సురేష్, రాజేష్ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను నిర్వహించారు. రమేష్ ఇంటి నుంచి పార్థివదేహానికి అంతిమయాత్ర నిర్వహించి పెన్నానది తీరం వద్ద దహన సంస్కారాలు జరిపారు.

హాజరైన ప్రముఖులు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి కొల్లు రవీంద్ర, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, పంచకర్ల రమేష్‌బాబు, గంటా శ్రీనివాసరావు, బొజ్జల సుధీర్‌రెడ్డి, ...

కన్నతల్లి రత్నమ్మ అంతిమయాత్రలో పాడెను మోస్తున్న ఎంపీ సీఎం రమేష్

సభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు.

రత్నమ్మ మృతికి సంతాపం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఎంపీ సీఎం రమేష్ తల్లి చింతకుంట రత్నమ్మ మృతికి అనకాపల్లిలో భాజపా నాయకులు సంతాపం తెలిపారు. ఎంపీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రత్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, గేదెల సత్యనారాయణ, గల్లా రాజేశ్వరరావు, భానుమతి పాల్గొన్నారు.

అడ్డురోడ్డులో డయాగ్నోస్టిక్ సెంటర్ సీజ్

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులోని జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను వైద్యారోగ్యశాఖ అధికారులు గురువారం సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్సరే, ఈసీజీ పరీక్షలు నిర్వహించడం, బిల్లుల సక్రమంగా నిర్వహించకపోవడం, బయోవ్యర్థాలు నిల్వచేసే బిన్స్ లేకపోవడం తదితర కారణాలతో దీనిని సీజ్ చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డిఆర్‌ఓ హైమావతి, ఉప అధికారి వీరజ్యోతి జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. గతంలో రెండుసార్లు నోటీసులు ఇచ్చినా, నిర్వాహకులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో తహసీల్దార్ రమేష్‌బాబు సమక్షంలో వైద్య సిబ్బంది ల్యాబ్‌కు నోటీసు అందించి తాళాలు వేసి, సీజ్ చేశారు. దీనిపై నిర్వాహకులు దాట్ల ఉమాదేవి ల్యాబ్ ముందు కుర్చీని నిరసన తెలిపారు. బల్క్‌డ్రగ్‌కు భూములు ఇవ్వలేదని పేపర్లతో హోంమంత్రి అనిత, జిల్లా అధికారుల కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఈ పనిచేశారని ఆరోపించారు.

సీజ్ చేసిన జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి స్పష్టం చేశారు. సీహెచ్.ఎల్.పురంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడగా పలువురు తాగునీటి సమస్య, పథకం డబ్బులింటున్నా అంగన్వాడీ ఆయన దృష్టికి తెచ్చారు. మండల పరిషత్ నిధుల నుంచి మరమ్మతు చేయిస్తానని ఏఈని వెల్లడించారు. సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేయాలన్నారు. ప్రజల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ వీటిని పక్కాగా వినియోగించాలన్నారు. ఈ విషయంలో ప్రజల సహకారం తీసుకోవాలని సూచించారు. మండలంలో పరిస్థితిపై ఎంపీడీఓ చైతన్యతో మాట్లాడి ఆరా తీసుకున్నారు.

ఎంపీడీఓ చైతన్యతో మాట్లాడుతున్న సీఈఓ నారాయణమూర్తి

సచివాలయ విధులపై ప్రత్యేక శ్రద్ధ

స్పందనకు వందనం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సచివాలయ విధులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు ఎంపీడీఓ చిన్నారావు తెలిపారు. 'గాడి తప్పిన సచివాలయ వ్యవస్థ' శీర్షిక 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. హరిపాలెం సచివాలయాన్ని ఆయన సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. ఇక్కడ పనిచేస్తున్న ఇంజినీరింగ్ సహాయకుడు ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారని, మడుతూరు పంచాయతీ కార్యదర్శి ఇన్‌ఛార్జిగా ఉన్నారని, మిగిలిన వారు క్షేత్రస్థాయి

హరిపాలెం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చిన్నారావు

విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా దరఖాస్తులు తీసుకునేందుకు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం, సూర్యనారాయణ, ఉపసర్పంచ్ సీతారామ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళకు అసభ్య సందేశం... కేసు నమోదు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్లలో ఓ పత్రిక విలేకరి ('ఈనాడు' కాదు)గా పని చేస్తున్న కె.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ గురువారం రాత్రి తెలిపారు. ఓ ఫొటోతోపాటు, అసభ్య పదజాలంతో వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసి, పరువుకి భంగం కల్పించారని, ఇదే మండలంలో వీఆర్వోగా పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

అరకొర ఆర్టీసీ బస్సులతో అగచాట్లు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులు పెంచాలని ఐద్వా నాయకులు గురువారం నిరసనకు దిగారు. అచ్యుతాపురం కూడలిలో ఐద్వా ఆధ్వర్యాన స్త్రీశక్తి పథకంలో మహిళకు బస్సులు పెంచాలని నినాదాలు చేశారు. బస్సుల కోసం మహిళలు రోడ్డుమీద గంటలకొద్దీ నిరీక్షిస్తున్నారన్నారు. ఎలమంచిలి నుంచి విశాఖ వెళ్లే బస్సులను పెంచాలన్నారు. ఉచితం కావడంతో డ్రైవర్లు బస్సులు ఆపడం లేదన్నారు. అచ్యుతాపురం కూడలిలో బస్సుస్టాప్ లేకపోవడంతో దుకాణాల ఆలయానికి వెళ్ళి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఐద్వా నాయకులు రొంగలి లక్ష్మి, ఈశ్వరమ్మ, లక్ష్మి, భవానీ, జ్యోతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా నాయకులు, మహిళల నిరసన

యువతలో మార్పుతోనే మెరుగైన సమాజం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మెరుగైన సమాజం కోసం యువతలో మార్పు రావాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం అభివృద్ధి మండలి డీన్ కృష్ణ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాశ్ డిగ్రీ కళాశాలలో గురువారం అటానమస్ కళాశాల నూతన పరీక్షా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాశ్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డీన్ కృష్ణ

ఆటోలో మహిళ బ్యాగ్ చోరీ

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆటోలో తోటి ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్ నుంచి నగదు, బంగారం చోరీ చేసిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చినముషిడివాడ సప్తగిరినగర్‌కు చెందిన వి.లలిత గత నెల 18న నగరానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చినముషిడివాడ వెళ్లేందుకు ఎన్ఏడీ కూడలిలో ఆటో ఎక్కారు. అప్పటికే ఆ ఆటోలో ఇద్దరు మహిళలున్నారు. చినముషిడివాడలో దిగిన తర్వాత లలిత హ్యాండ్‌బ్యాగు చూసుకోగా బ్యాగులోని సుమారు రూ.60వేల విలువైన చెవిదుద్దులు కనిపించలేదు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై సూరిబాబు దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనలో కె.కోటపాడు మండలం గొట్లాం గ్రామానికి చెందిన రావుల గంగోత్రి, కొత్తవలస దరి చీడివలస గ్రామానికి చెందిన మేకల అప్పలనరసమ్మలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

న్యాయం జరిగేవరకూ పోరాడతాం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి సచివాలయ ఉద్యోగి ఎం నారాయణ మరణంపై పూర్తి స్థాయిలో విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకూ పోరాడుతామని ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ... గుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఉమామహేశ్వరరావు, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఆర్.రామచరణ్, కె.ఉమామహేశ్వరరావు అన్నారు. అనకాపల్లిలో గురువారం వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

అద్దెకు ఉంటున్నవారిని ఇంట్లో పెట్టి తాళం

ఎలమంచిలి: తండ్రి తనకు ఇవ్వాల్సిన బాకీ చెల్లించలేదనే కోపంతో కూతురు ఆయన ఇంట్లో అద్దెకుంటున్న వారిని నిర్బంధించిన ఘటన గురువారం ఎలమంచిలిలో జరిగింది. ఎస్సై సావిత్రి కథనం ప్రకారం.. కొత్తపేటలో బద్ది ధనలక్ష్మి, వరప్రసాద్ దంపతులు ముసిలి నాయుడు ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇంటి యజమాని, ఆయన కూతురు వెంకటరత్నం మధ్య కొంత కాలంగా డబ్బుల విషయంలో గొడవ జరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన బాకీ చెల్లించలేదన్న కోపంతో కూతురు, ఆమె భర్త తండ్రి ఇంట్లో అద్దెకు ఉంటున్నవారిని అదే ఇంట్లో నిర్బంధించి బయట తాళం వేశారు. ధనలక్ష్మి దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటరత్నం, బాబ్జీలపై కేసు నమోదు చేశామన్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Honda Amaze -2013 Model, Maruti Swift Dzire-2018 Model, Hyundai Grand I10 -2018 Model. Cars Available for sale. Contact Phone: 8886635055.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUILDING CONSTRUCTION

LRS BPS LRS
Contact for BPS/LRS Plan Approvals
PILLA BRAHMAJI RAO
Rtd. Building Inspector
GVMC PRESENT LICENSED SURVEYOR
✆92904 41348

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121 Sq.Yds. Cellar + G+1 Building for sale. East Facing Excellent Vastu. Prime Location. 22K Rents Guaranteed. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురంకి అతిచేరువలో 100చ॥గ॥ స్థలం కేవలం 5,50,000/- మాత్రమే. 30అ॥రోడ్డు, NH-16కు దగ్గర్లో. స్పాట్ రిజి. Contact Ph: 7780686073, 9676241297.

TAGARAPUVALASA

Thagarapuvalasa Y Jn & Near Raghu college, NH facing plots @ Dakammarri VUDA approved, Ready to construct. ✆ 9992273747.

GENERAL

ఉడా అప్రూవ్డ్ లేఅవుట్ నందు ఇంటిస్థలం అమ్మకానికి కలదు 200 చ॥గ॥ 13.99 లక్షలు మాత్రమే, స్పాట్ రిజిస్ట్రేషన్ మరియు బ్యాంకు లోను. Cont: 9390893787.

JOBS

Required a Manager in Vehicle Finance Company 5-7 Yrs. Exp. in Vehicle Finance Company (2&3 Wheeler Recovery) Contact: 9182018251.

Wanted Accountant for Construction Company with Knowledge in Tally, Excel, Word. 2+ yrs. Exp. Now! Ph: 9963453919.

Marketing Executives 30K, Telecallers 15K, Digital (GMP, Web, Social Media seo) 20K. Contact: 9381756318, 9948011609.

Wanted Receptionist (F) Age 30 Above, Any Degree, English & Hindi Must; Collection Executives (M) @ Akkayyapalem. 9348738659.

WANTED
A Well Established Org. Starts New Projects in 2 States. Urgently Required in AP State, VSP Branches.
❖DIVISIONAL MANAGERS: M/F
Qlf: Retd. Gazetted Officers.
Monthly Package: 1,60,000 (Salary + Allowances Negotiable)
INTERVIEWS ON : 28th & 29th - Nov-25
INTERVIEW TIMINGS 10.00 AM to 7PM
Con: Y.K. Rao
DOCTORS COLONY, VSP
Ph: 8121100599

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు స్త్రీ/పురు॥ కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు/ హౌస్‌వైవ్స్‌కి ప్రాధాన్యత. ఫిక్స్‌డ్ శాలరీ+ కమీషన్ Contact Ph: 8885866999.

మహీంద్రా ట్రాక్టర్ వారి అనకాపల్లి, తగరపువలస బ్రాంచ్‌లలో పనిచేయుటకు మెకానిక్స్, హెల్పర్ (ఐటిఐ, టెన్త్ క్వాలిఫికేషన్ మరియు ఎక్స్పీరియన్స్), సూపర్‌వైజర్, స్పేర్ పార్ట్స్ సేల్స్ మెన్ (డిగ్రీ/ DAE/ DMEతో పాటు ఆటోమొబైల్ రంగంలో అనుభవం గలవారు) కావలెను. సంప్రదించండి: శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్, అనకాపల్లి, Contact సెల్: 80085 77055, 80085 77078.

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి ప్రస్తుతం ఉన్న రోడ్డు ద్వారా 19KM (ఫ్యూచర్‌లో స్ట్రెయిట్ రోడ్డు వల్ల 11KM లోపు) విజయనగరం రైల్వే స్టేషన్‌కి 5KM బస్టాండ్‌కి, ఐనాక్స్‌కి, షాపింగ్ సెంటర్స్‌కి 4 లేదా 4.5 Kms దూరంలో విజయనగరం- రాయపూర్ హైవేకి, వైజాగ్- విజయనగరం హైవేకి 800 మీ. దూరంలో కార్నర్‌లో VMRDA & RERA అప్రూవల్ ప్లాట్స్ కమీషన్ బేసిస్‌లో సేల్స్ కొరకు మార్కెటింగ్ ఉద్యోగం చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నాం. Contact Phone Number: 6302273234.

వాంటెడ్ మార్కెటింగ్ మేనేజర్స్ M/F-3 ఉమెన్ యాడ్ ఎగ్జిక్యూటివ్స్-5 డిటిపి /Tally ఆపరేటర్-2 జీతం 15000 to 28000+TA, DA ✆ 8465870102.

వైజాగ్ రెస్టారెంట్‌లో పనిచేయడానికి యువకులు కావలెను (వెయిటర్‌లు) భోజనం & వసతి కల్పించబడును అనుభవం అవసరం లేదు ✆ 9676575827.

మా వైజాగ్ బ్రాంచ్‌కు సూపర్‌వైజర్లు, వర్కర్లు కావలెను. ఇండియన్ పెస్ట్ కంట్రోల్, మద్దెలపాలెం, భారత్ పెట్రోల్ పంప్ ఎదుట, వైజాగ్. ✆ 83670 33999.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, all (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal: 18-25K, Age 35లోపు, స్పాట్ జాయిన్ ✆ 7995439539.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

మెస్‌లో వంటచేయుటకు లేడీస్ /జెంట్స్ కావలెను. * Cleaning చేయుటకు స్త్రీ /పు॥ కావలెను. Ct: గుంటూరు మెస్, శంకరమఠం రోడ్. Ph: 8179439944.

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైవ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9676595920.

స్కూల్ టీచర్స్ & హెల్పింగ్ టీచర్స్ 20 నుండి 45 వయసున్న స్త్రీలు అర్జెంటుగా సంప్ర॥ జీతం 15 వేలు - 25 వేలు గాజువాక/కూర్మన్నపాలెం ✆ 8096767935.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయతీ

బంగారం శతమానం అప్పగింత

రావికమతం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు వదిలివెళ్లిన బంగారం శతమానంను తిరిగి వారికి అందజేసి బస్సు డ్రైవర్ నిజాయతీని నిరూపించుకున్నాడు. మేడివాడకు చెందిన ముచ్చకర్ల శ్రీను నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో అవుట్ సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం గాజువాకకు చెందిన ఓ వ్యక్తి రూ.75 వేల ఖరీదు చేసే అరతులం బంగారం శతమానంను విశాఖపట్నం నుంచి నర్సీపట్నం వస్తున్న బస్సులో పోగొట్టుకున్నాడు. ప్రయాణికుడు ఇంటికి వెళ్లి చూసుకోగా సంచిలో శతమానం లేకపోవడంతో వెంటనే నర్సీపట్నం డిపో యాజమాన్యానికి సమాచారం అందించాడు. అప్పటికే బస్సు నర్సీపట్నం డిపోనకు చేరుకుంది. డ్రైవర్ బస్సు దిగే ముందు అంతా చూడగా బస్సులో బంగారం శతమానం పడివుండటాన్ని గమనించారు. అదే సమయంలో వస్తువు పోగొట్టుకున్న ప్రయాణికుడికి సంబంధించిన వ్యక్తి రావడంతో అతడికి అందజేశారు. డ్రైవర్ నిజాయతీని ఆర్టీసీ యాజమాన్యం, ప్రయాణికుడి బంధువులు, మేడివాడ గ్రామస్థులు అభినందించారు.

బస్సు డ్రైవర్ ముచ్చకర్ల శ్రీను

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్డ్	184	206
స్కిన్‌లెస్	210	216

అధిక లోడ్‌తో వెళ్తున్న క్వారీ లారీకి జరిమానా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జలగల మదుము వద్ద అధికలోడ్‌తో వెళ్తున్న క్వారీ లారీని గురువారం పోలీసులు గుర్తించారు రూ.58 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం- అగ్రహారం వద్ద గురువారం మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. తుని వైపు నుంచి విశాఖ వెళ్తున్న లారీ, వరికోత యంత్రాన్ని తీసుకువెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరికోత యంత్రం రహదారిపై పడిపోగా, ప్రమాదానికి కారణమైన లారీ వెనక్కి వెళ్లి, టూరిస్టులతో వస్తున్న బస్సును ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు.

జాతీయ రహదారిపై పడిన వరికోత యంత్రం

కెనరా బ్యాంక్ Canara Bank
సిండికేట్ Syndicate

అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, డి.నెం.28-14-1, మొదటి అంతస్తు, మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం - 530020. ఫోన్ : 8332956773 & 7095199455
ఇ-మెయిల్ : cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) మరియు 9(1) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.16.12.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం : తేది.16.12.2025, మ॥01.00 గం. నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 15.12.2025, సా॥ 06.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 15.12.2025, సా॥ 06.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఎఆర్ఎమ్ బ్రాంచ్, విశాఖపట్నం మెస్సర్స్ సౌత్ సెంట్రల్ షాపింగ్ మాల్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు పార్ట్‌నర్స్ : 1. శ్రీ వెంకటేశ్వర రావు మామిడి (మేనేజింగ్ పార్ట్‌నర్), 2. శ్రీ రాజ వరహాలు మామిడి (పార్ట్‌నర్), 3. శ్రీమతి అమ్మాజీ మామిడి (పార్ట్‌నర్), 4. శ్రీమతి సరస్వతి మామిడి (పార్ట్‌నర్), 5. శ్రీ వెంకట సునీల్ దొడ్డి (పార్ట్‌నర్), 6. శ్రీ వెంకట మణికంఠ సురేష్ మామిడి (పార్ట్‌నర్). బకాయి మొత్తం : రూ.1873.99 లక్షలు + వడ్డీ + ఇతర ఖర్చులు	ఆస్తి-1: విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, పంచాయితీ ఆఫీస్ ప్రక్కన, పాయకారావుపేట, పాయకారావుపేట మెయిన్ రోడ్డు, సర్వే నెం.98/2బి లోని వార్డు నెం.13, మెయిన్ రోడ్డు వద్ద 450 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో పాత అసెస్మెంట్ నెం.2895 మరియు కొత్త అసెస్మెంట్ నెం. 4648, పాత డోర్ నెం.13-92 మరియు కొత్త డోర్ నెం.18-4తో, సెల్లార్ మరియు జి +3 తో కూడిన భవనం. క్రింది అంతస్తు 1875 చ॥అ॥లు, మొదటి అంతస్తు 1875 చ॥అ॥లు, రెండవ అంతస్తు 1875 చ॥అ॥లు, మూడవ అంతస్తు 1875 చ॥అ॥లు., హద్దులు: డీడ్ ప్రకారం. ASSET ID : 200034758400; CERSAI ID:400034816652	రూ. 637.00 లక్షలు	రూ. 63.70 లక్షలు
	ఆస్తి-2: ఐటమ్ నెం.1: తూర్పుగోదావరి జిల్లా, అతికవానిపాలెం పంచాయితీ మరియు తుని ఎస్ఆర్ఓ పరిధిలో, తుని మండలం, అతికవానిపాలెం గ్రామం వద్ద ఎస్.నెం.122/2 = 3872 చ॥గ॥లు (ఎ.0.80 సెంట్లు), 122/1ఎ = 1306.8 చ॥గ॥లు (ఎ.0.27 సెంట్లు), 122/4ఎ = 1452 చ॥గ॥లు (ఎ.0.30 సెంట్లు), 122/4బి = 1355.2 చ॥గ॥లు (ఎ.0.28 సెంట్లు) లతో నాలుగు ఐటమ్‌లుగా గల 7986 చ॥గ॥లు (ఎ.1.65 సెంట్లు లేదా 0.668 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు : డీడ్ ప్రకారం. ASSET ID: 200059627343; CERSA ID: 400059090770. ఐటమ్ నెం.2: తూర్పుగోదావరి జిల్లా, అతికవానిపాలెం పంచాయితీ మరియు తుని ఎస్ఆర్ఓ పరిధిలో, తుని మండలం, అతికవానిపాలెం గ్రామం వద్ద ఎస్.నెం.122/2 = 5178.8 చ॥గ॥లు (ఎ.1.07 సెంట్లు), 122/4ఎ = 1452 చ॥గ॥లు (ఎ.0.30 సెంట్లు), 122/4బి = 1210 చ॥గ॥లు (ఎ.0.25 సెంట్లు) లతో మూడు ఐటమ్‌లుగా గల 7840 చ॥గ॥లు (ఎ.1.62 సెంట్లు లేదా 0.656 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు : డీడ్ ప్రకారం. ASSET ID: 200059627343; CERSA ID: 400059090770. ఐటమ్ నెం.3: తూర్పుగోదావరి జిల్లా, అతికవానిపాలెం పంచాయితీ మరియు తుని ఎస్ఆర్ఓ పరిధిలో, తుని మండలం, అతికవానిపాలెం గ్రామం వద్ద ఎస్.నెం.122/2ఎ = 6485.6 చ॥గ॥లు (ఎ.1.34 సెంట్లు), 122/4ఎ = 1113.2 చ॥గ॥లు (ఎ.0.23 సెంట్లు), 122/4బి = 1113.2 చ॥గ॥లు (ఎ.0.23 సెంట్లు) లతో మూడు ఐటమ్‌లుగా గల 8712 చ॥గ॥లు (ఎ.1.80 సెంట్లు లేదా 0.729 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు : డీడ్ ప్రకారం. ASSET ID: 200059627343; CERSA ID: 400059090770.	రూ. 632.00 లక్షలు	రూ. 63.20 లక్షలు
	ఆస్తి-3: విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, సర్వే నెం.145/8ఎ లోని వార్డు నెం.9, పాయకారావుపేట మెయిన్ రోడ్డు వద్ద 71 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో పాత అసెస్మెంట్ నెం.1272, పాత డోర్ నెం.9-119/1 మరియు కొత్త అసెస్మెంట్ నెం. 1734, కొత్త డోర్ నెం.13-84తో, క్రింది అంతస్తు, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తులతో కూడిన భవనం. క్రింది అంతస్తు 933.33 చ॥అ॥లు, మొదటి అంతస్తు 933.33 చ॥అ॥లు, రెండవ అంతస్తు 933.33 చ॥అ॥లు., హద్దులు: డీడ్ ప్రకారం. ASSET ID : 200034757803; CERSAI ID: 400034816054.	రూ. 91.00 లక్షలు	రూ. 9.10 లక్షలు
	ఆస్తి-4: విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, సర్వే నెం.143/1 లోని వార్డు నెం.10, పాయకారావుపేట మెయిన్ రోడ్డు వద్ద 106.66 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో పాత అసెస్మెంట్ నెం.1357 మరియు కొత్త అసెస్మెంట్ నెం.1811, పాత డోర్ నెం.10-72 మరియు కొత్త డోర్ నెం.14-23తో, క్రింది అంతస్తు, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తులతో కూడిన భవనం. క్రింది అంతస్తు 666.66 చ॥అ॥లు, మొదటి అంతస్తు 666.66 చ॥అ॥లు, రెండవ అంతస్తు 666.66 చ॥అ॥లు., హద్దులు: డీడ్ ప్రకారం. ASSET ID : 200034758286; CERSAI ID: 400034816538.	రూ. 119.00 లక్షలు	రూ. 11.90 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.09.12.2025, ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8332956773 & 7095199455.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్న వాటికి రూ.10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్న వాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ.50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ : "https://baanknet.com/eauction-psb", హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051, ఇ-మెయిల్ : support.baanknet@psballiance.com

తేది : 24-11-2025, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: రాజు వెడ్స్ రాంబాయి, సత్యనారాయణ స్క్రీన్2: స్కూల్ లైఫ్, పర్తిసాయి: ప్రేమంటే, షిర్డిసాయి: రివాల్వర్ రీటా, రామచంద్ర: 12ఎ రైల్వేకాలనీ, సత్యనారాయణ స్క్రీన్1: ఆంధ్ర కింగ్ తాలూకా, వెంకటేశ్వర: మఫ్టీ పోలీస్, అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ స్క్రీన్-1 ఆంధ్ర కింగ్ తాలూకా, స్క్రీన్-2: రివాల్వర్ రీటా

ఉచితంగా కళ్లద్దాల పంపిణీ

మునగపాక: శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఇటీవల కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న 22 మంది రోగులకు గురువారం ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. మునగపాకలో గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరందరికీ నెల రోజుల క్రితం నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి శ్రీజైన్స్ స్టోర్సు ఆర్థిక సహకారంతో ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. గణేష్ ఫౌండేషన్ సంస్థ కన్వీనర్ దాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

జంపపాలెం పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు, దాతలు

ఎలమంచిలి గ్రామీణం: జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని దాతలు పోలమరశెట్టి వెంకట్, నూకరత్నం దంపతుల ఆర్థిక సాయంతో విశ్రాంత ఉపాధ్యాయులు బి.లక్ష్మణరావు, అబ్దుల్లాతో కలిసి ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ శిలపరశెట్టి ఉమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

ఎలమంచిలి గ్రామీణం: పట్టణంలోని రామారాయుడుపాలెం, కొత్తపాలెం, కట్టుపాలెం, సోమలింగపాలెం, దిమిలి రోడ్డు, పాత జాతీయ రహదారి, రైల్వేస్టేషన్ రోడ్డు, మండలంలోని పీఎన్ఆర్ పేట, బయ్యవరం, పులపర్తి, పురుషోత్తపురం, కృష్ణాపురం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం, రేగుపాలెం, లైనుకొత్తూరు గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తూరు, నెహ్రూచౌక్ (అనకాపల్లి), కొత్తూరు, సంపతిపురం, చిన్న సంపతిపురం, వేటజంగాలపాలెం, ఎస్.వెంకుపాలెం, సత్యనారాయణపురం, కూండ్రం, కుంచంగి, తుమ్మపాల తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ ఎస్ రామకృష్ణ తెలిపారు.

పట్టుదల, నిబద్ధత విజయానికి సోపానాలు

కశింకోట, న్యూస్‌టుడే: నిబద్ధతతో చదివి పది పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గంటా యువసేన ప్రతినిధులు గొంతిన గంగాధరరావు, జెర్రిపోతుల నూకునాయుడు ఆధ్వర్యంలో గురువారం బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 9, 10 విద్యార్థులకు పరీక్షాసామగ్రి, మ్యాప్ పుస్తకాలు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పోలారపు త్రినాథ్, దాడి జగన్, పాఠశాల కమిటీ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

కశింకోట, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా మద్యం తాగే వారిపై ఎటువంటి రాయితీలు లేకుండా చర్యలు కొనసాగుతాయన్నారు. కశింకోట పోలీసు స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై తాగి వాహనాలు నడుపుతున్నవారిని ఎస్సైలు కె.లక్ష్మణరావు, వి.మనోజ్‌కుమార్ తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎర్రవరంలో పాముకాటుకు వృద్ధురాలు మృతి చెందింది. ఇంటి పరిసరాల్లో శుభ్రం చేస్తుండగా దొమ్మెటి అప్పలనర్స (65) గురువారం మధ్యాహ్నం పాముకాటుకు గురైంది. ఏదో పురుగు కుట్టిందని పక్క ఇంటి మహిళకు చెప్పి ఇంట్లోకి వెళ్లి నిద్రపోయింది. కొంత సమయం తరువాత పక్క ఇంటి మహిళ గమనించి వెళ్లి చూసింది. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. 108 సిబ్బంది వచ్చేసరికి మృతి చెందింది.

ప్రయోగశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

పాయకరావుపేట: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో మూడు ప్రయోగశాలల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఇక్కడి ఉన్నత పాఠశాలలో సహా బాలికల కళాశాల నిర్వహిస్తున్నారు. ప్రయోగశాలల ఏర్పాటుకు రూ.68 లక్షలు కేటాయించారని సమగ్రశిక్ష ఈఈ నరసింగరావు తెలిపారు. డీఈ గణేష్, ఏఈ మూర్తి, తెదేపా మండల, పట్టణ శాఖ అధ్యక్షులు చింతల ప్రదీప్ పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఈ నరసింగరావు

కష్టాలు తీరనున్నాయి..

అడ్డురోడ్డు నర్సీపట్నం రోడ్డు పనులకు మార్గం సుగమం

నక్కపల్లి, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటైన అడ్డురోడ్డు - నర్సీపట్నం మార్గం కష్టాలు తీరనున్నాయి. ఈ పనులు ప్రారంభించినా, అనివార్య కారణాలతో నిలిచిపోగా తిరిగి పూర్తి చేసేలా మంత్రి అనిత చొరవ చూపారు. వచ్చేనెలలో మొదలుకానున్నాయని సంబంధితశాఖ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కి తెలిపారు. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వరకు నిత్యం పదుల గ్రామాల నుంచి వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అడ్డురోడ్డు నుంచి దార్లపూడి వరకు ఉన్న సుమారు పది కిలో మీటర్ల మార్గం దారుణంగా దెబ్బతింది.

ఘాట్ మార్గంలో ఈ కష్టాలకు త్వరలోనే చెల్లు

1. వైకాపా పాలనలో దీన్ని పూర్తిగా విస్మరించగా, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి అనిత చొరవ చూపి దీనికి నూతన అభివృద్ధి బ్యాంకు (ఎన్‌డీబీ) కింద రూ.24 కోట్లు నిధులు మంజూరు చేయించారు.
2. ఏడాది క్రితం గుత్తేదారు రహదారి విస్తరణ పనులు చేపట్టి, దార్లపూడి వద్ద 300 మీటర్ల మేర భారీ కాంక్రీట్ నిర్మించారు. దీంతో ఏళ్ల తరబడి పడుతున్న కష్టాలకు తెరపడుతుందని అంతా భావించినా.. సాంకేతిక, ఇతర సమస్యలతో పనులు ఆపేశారు.
3. నాలుగైదు నెలలపాటు ఆగిపోగా, వర్షాకాలంలో రాకపోకలు సాగించడానికి జనం అవస్థలు పడ్డారు. సమస్యను గుర్తించిన మంత్రి అనిత ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఘాట్‌రోడ్డు ప్రాంతంలో 3.25 కి.మీ. పనులకు మరో టెండర్ వేస్తున్నారు.
4. మిగిలిన 6.15 కి.మీ. చేయడానికి పాత గుత్తేదారు సిద్ధమయ్యారు. 25 కి.మీ. పరిధిలో ఘాట్ రోడ్డును 5.5 మీటర్ల మేర విస్తరించి, రక్షణ గోడ దెబ్బతిన్న ప్రాంతంలో 50 మీటర్ల మేర భారీ రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. మిగిలిన 6.15 కి.మీ.. రహదారికి రూ. 20 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

పనులు జరిగేదిలా

- మొత్తం రోడ్డు: 9.4 కి.మీ.
- నిధులు రూ. 24 కోట్లు
- కల్వర్టులు: 2 పైపు, 4 బాక్సు
- సీసీ రోడ్డు: 300 మీటర్లు

తొందర్లోనే పూర్తి: ఈ రోడ్డును వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దీన్ని పూర్తి చేయించే బాధ్యతనాదే. సాంకేతిక ఇబ్బందులతో ఆలస్యమైంది. త్వరగా పూర్తి చేయిస్తాం. – వంగలపూడి అనిత, హోంమంత్రి

పట్టణ వాసులకు పరిశుభ్రమైన తాగునీరు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ వాసులకు శుభ్రమైన తాగునీరు అందించే పనులు శరవేగంగా సాగుతున్నాయి. అగనంపూడి నుంచి అనకాపల్లికి శుద్ధిచేసిన తాగునీటిని పైప్‌లైన్ల ద్వారా అందించే పనులకు 2019లో రూ.32 కోట్లతో పైప్‌లైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతంగా చేపట్టేలా స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టి సారించారు. ఎంపీ సీఎం రమేష్ జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి ఇక్కడ చేపట్టాల్సిన తవ్వకం పనులు వేగవంతం చేయించారు. లంకెలపాలెం, అగనంపూడి ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. అనకాపల్లి మండలంలో మూడు చోట్ల ఎస్ఎస్ (చిన్న వంతెన)లు కట్టాల్సి ఉంది.

పైప్‌లైన్ల పనులు

దీంతోపాటు సాలాపువానిపాలెం వద్ద తవ్వకాలు చేయాలి. ఈ పనులు దాదాపుగా 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో మిగిలినవి పూర్తిచేసి ఫిల్టర్ చేసిన తాగునీటిని అనకాపల్లి పట్టణ వాసులకు అందించేలా అధికారులు త్వరితగతిన పనులు చేపడుతున్నారు.

82వ వార్డు రహదారి పనులు ప్రారంభం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ 82వ వార్డు పరిధిలో కొన్నేళ్లుగా నిర్మాణం కాని రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. దుర్గాలాడ్జి వీధి, చవితిన వీధిలను కలుపుతున్న మార్గం ముళ్ల కంపలు, వ్యర్థాలతో నిండిపోయింది. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. వార్డు ఇన్‌ఛార్జి ఆళ్ల రామచంద్రరావు, తెదేపా నాయకులు పోలారపు త్రినాథ్, ఆకుల నానాజీ తదితరులు గురువారం రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు.

పంచాయతీకి గూడు కరవు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

పాయకరావుపేటలో పంచాయతీకి గూడు కరవైంది. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన పంచాయతీ కార్యాలయం ఉండేది. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో పేటలో సచివాలయాలను నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టారు. దీనికోసం పాత పంచాయతీ కార్యాలయాన్ని కూల్చేశారు. కొత్తగా నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం రూ.40 లక్షలు కేటాయించింది. దీంతో జీ+2గా భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనిలోనే రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిర్మాణం ప్రారంభించిన తర్వాత కొన్నాళ్లకు పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో రాజాగారివీధిలో వేంకటేశ్వర స్వామి కోవెల పక్కన అద్దె భవనంలోకి గ్రామసచివాలయాన్ని మార్చారు. ఇరుకు భవనంలోనే అర్జీలు ఉన్న కొద్దిపాటి ఖాళీలోనే టెంట్ వేసి పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్యాలయం నిర్వహణకు ఇబ్బందులు వస్తున్నాయి. రికార్డులు భద్రపరచడం సమస్యగానే మారింది. అధికారులు భవనాల నిర్మాణం పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిలిచిన భవనం పనులు

కుక్కలు బాబోయ్.. కుక్కలు

గ్రామాల్లో వీధి కుక్కలు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా రోడ్లపై వీటి సంచారం పెరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నక్కపల్లి నుంచి రాజయ్యపేట వెళ్లే మార్గంలో అనేక చోట్ల ఇవి గుంపులుగా తిరుగుతున్నాయి. వాహనాలకు ఇవి అడ్డురావడంతో ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. ఉపమాక రోడ్డులో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఇటుగా నిత్యం హెటెరోకి వెళ్లే ఉద్యోగులతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం బయటకు వెళ్లే వారంతా రాకపోకలు సాగిస్తుంటారు. నక్కపల్లి, ఉపమాక, న్యాయంపూడి, అమలాపురం, వేంపాడు, గొడిచెర్ల, డీఎల్‌పురం, చినదొడ్డిగల్లు, పెదతీనార్ల తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. – న్యూస్‌టుడే, నక్కపల్లి

దయనీయంగా సోమలింగపాలెం రోడ్డు

ఎలమంచిలి: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెం ప్రధాన కూడలిలో సిమెంట్ రహదారి దయనీయంగా మారింది. ఈ రోడ్డు కింది మట్టి కోతకు గురికావడంతో పగిలిపోయి కూలిపోయింది. ఇంత దారుణంగా ఉన్నా కూలిన సిమెంట్ రోడ్డును తొలగించలేదు. కనీసం ఆ ప్రాంతంలో మట్టి అయినా వేయలేదు. ఈ మార్గంలో రావాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. పేరుకు ఆదర్శ గ్రామమైనా రోడ్డు ఇంత అధ్వానంగా ఉన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే దీనికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అల్లేస్తున్న నిర్లక్ష్యం

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల శివాలయం ఎదుట విద్యుత్తు స్తంభం తీగలకు పిచ్చి మొక్క అల్లేసింది. ఈ కారణంగా చిన్న గాలి వీచినా సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. తీగలకు ఉన్న పిచ్చి మొక్కను తొలగించమని సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్తు తీగలకు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

కోటవురట్లలో..

ఇరుముడులతో మాలధారుల పయనం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. మూలమూర్తి, ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. మండల దీక్షలో భాగంగా మాల ధరించిన భక్తులకు ఇరుముడి కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమల, రాజమహేంద్రవరం సమీపంలోని ద్వారపూడి, విశాఖ షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయాలకు బయలుదేరి వెళ్లారు. వీరికి ఆలయ కమిటీ ఛైర్మన్ కటకం లక్ష్మణరావు, ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ, గురుస్వాములు రెడ్డి, సాయి తదితరులు అన్ని సదుపాయాలు కల్పించారు.

రద్దీగా రైళ్లు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీ పెరిగింది. ఎలమంచిలి నుంచి రెండు రోజులుగా వేల సంఖ్యలో భక్తులు బస్సులు రైళ్లలో బయలుదేరి వెళ్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి నాలుగు వేల మందికి పైగా భక్తులు బయలుదేరి వెళ్లారు. భక్తులతో ఎలమంచిలి రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోతోంది. బొకారో ఎక్స్‌ప్రెస్‌లో నిల్చోవడానికి కూడా ఖాళీలేని విధంగా ఉంది. గేట్ల వద్ద వేలాడి మరీ ప్రయాణిస్తున్నారు. చాలా మంది ప్రయాణికులు రైలు ఎక్కకుండానే కదిలిపోవడంతో చైన్‌లాగి ప్రయాణికులు ఆపుతున్నారు. ఇలా రోజూ ఇక్కడ రైలు అరగంటకు పైగా నిలిచిపోతోంది. యాత్రకు ప్రత్యేకంగా ప్రైవేటు బస్సులు వేస్తున్నారు. ఈ ఏడాది అయ్యప్ప భక్తుల సంఖ్య పెరిగిందని గురుస్వామి గణేష్ చెప్పారు. ఇరుముడితో బయలుదేరే భక్తులను సాగనంపడానికి కుటుంబ సభ్యులంతా స్టేషన్‌కి తరలివస్తున్నారు.

విశేష అలంకరణలో అయ్యప్పస్వామి మూలమూర్తి

కనకమహాలక్ష్మికి మహిళల నీరాజనాలు

కశింకోట, న్యూస్‌టుడే: మార్గశిరమాసం తొలి గురువారం పురస్కరించుకొని కనకమహాలక్ష్మీ మహిళలు నీరాజనాలు పట్టారు. కశింకోట గవరపేటలో కొలువైన అమ్మవారికి అర్చకులు వెలవలపల్లి బాబ్జీ ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం క్షీరాభిషేకం, కవచాలంకరణ, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు.

ఎలమంచిలి: కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ఛైర్మన్ కొఠారు సాంబశివరావు తొలిపూజలు చేశారు. అర్చకులు కోటేశ్వరశర్మ మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్.రాయవరం: కర్రివానిపాలెం కనక మహాలక్ష్మి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు.

ఎలమంచిలిలో అమ్మవారికి పూజలు

వైభవంగా పసల మారమ్మ పండగ

కర్రివానిపాలెంలో..

మూలపేటలో గంగాలమ్మ

బీఆర్టీనగర్‌లో నల్లమారమ్మతల్లి

మునగపాక, న్యూస్‌టుడే: అరబుపాలెంలో గురువారం పసలమారమ్మ పండగ ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలంతా పిండివంటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచి బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శరగడం సూర్యనారాయణ, బొడ్డేడ గంగాధర్, వందలాది మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.

✦ మూలపేట గంగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లక్ష పసుపు కొమ్ములతో అలంకరించి పూజించారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: పిసినికాడ పంచాయతీ బీఆర్టీ నగర్ గ్రామ దేవత నల్లమారమ్మ ఆలయంలో మూలమూర్తి నల్లమారమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయంలో సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి విగ్రహ దాత ఆడారి వెంకట అప్పారావు, సుకన్య దంపతుల చేతులమీదుగా దీన్ని ప్రతిష్ఠించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ, ఆలయ కమిటీల ప్రతినిధులు, కోలాటం, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భారీ స్పీడ్ బ్రేకర్‌తో వాహనదారుల ఇబ్బందులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని విజయరామరాజు పేట రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన భారీ స్పీడ్ బ్రేకర్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు రాకుండా బ్రిడ్జి వద్ద గడ్డర్ ఏర్పాటుచేశారు. దీన్ని ఢీకొట్టుకుని క్వారీ వాహనాలు వెళ్తున్నాయి. తరచూ జరుగుతున్న సంఘటనలను అరికట్టేలా వాహనాల వేగాన్ని నియంత్రించేలా భారీ స్పీడ్ బ్రేకర్‌లను ఇక్కడ ఏర్పాటుచేశారు. ఎవరో చేసిన పొరపాటుకు తాము బలైపోతున్నామన్నట్లు భారీ స్పీడ్ బ్రేకర్‌లు వాహనదారులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతాన్ని గురువారం జనసేన నాయకులు పరిశీలించి ఇక్కడి సమస్యను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనాల పాట్లు

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: గొడిచెర్ల కొత్తూరు వద్ద రైల్వే వంతెన కింద చేస్తున్న రహదారి నిర్మాణంలో వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు నాయకులు రైల్వే అధికారులను కోరారు. ఇక్కడ రహదారి దెబ్బతినడంతో పనులు చేస్తుండగా, రోడ్డు ఎత్తును పెంచుతారని తెలుసుకుని మెరక గ్రామాలకు చెందిన నాయకులు ఇక్కడకు చేరుకున్నారు. ఈ వంతెన కిందనుంచే మెరక గ్రామాలకు పాఠశాల బస్సులు, ఇతర రవాణా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రహదారి ఎత్తు పెంచితే వాహనాలు వంతెనకు తగిలే ప్రమాదం ఉందని సంబంధిత గుత్తేదారుతో పాటు, అధికారులకు తెలిపారు. ఎత్తు కారణంగా వాహన రాకపోకలు నిలిచిపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని వివరించారు. సంబంధిత అధికారులు మాట్లాడుతూ కేవలం మరమ్మతులు చేస్తున్నామని, రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నానేపల్లి రాఘవ, ప్రగడ మాణిక్యం, చందిన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయండి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో తెదేపా వార్డు అధ్యక్ష, కార్యదర్శులను భాగస్వాములను చేయాలని ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గొర్లె నానాజీ కమిషనర్‌ను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులకు తెదేపా నియమించిన అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి గురువారం మున్సిపల్ కమిషనర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో తాము పాలు పంచుకునేలా చేయాలన్నారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు తమకు సమాచారం అందించాలని కోరారు. కరణం రవి కుమార్, కొఠారు సాంబశివరావు, రామకృష్ణ, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కి వినతిపత్రం అందిస్తున్న తెదేపా నేతలు

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి చేనేత కాలనీలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం మార్గం లభించింది. దీర్ఘకాలంగా స్థానికులు పడుతున్న పారిశుద్ధ్య కష్టాలకు తెరపడింది. హెటెరో యాజమాన్యం చొరవ కాలనీ వాసుల్లో ఆనందాన్ని నింపింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ కాలనీ లోతట్టుగా ఉండటంతో ఇళ్ల నుంచి వచ్చిన వాడుక నీరంతా ఇక్కడే నిలిచిపోతోంది. దీంతో ఇక్కడున్న నాలుగు వీధుల్లో జనం తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొద్దిపాటి వర్షానికే ఇదంతా చెరువులా మారిపోయేది. మురుగులా మారి దోమలు, పందులకు ఆవాసంగా ఉండేది. ఈ సమస్యపై స్థానికులు చాలాసార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో స్థానిక యువకులు, నాయకులు కలిసి హెటెరో ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో స్పందించిన యాజమాన్యం సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చింది. దీంతో రూ. అయిదు లక్షల వరకు వెచ్చించి సుమారు 100 మీటర్ల పొడవైన భారీ కాలువతో పాటు, ఓ కల్వర్టు నిర్మాణ పనులు చేయించారు. ఇప్పటికే కాలువ పని పూర్తి చేశారు. కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. కాలువ పైభాగంలో పలకలు వేయనున్నారు. కొద్దినెలల క్రితం కాలనీలో గణపతి ఆలయం వద్ద హెటెరో ఆధ్వర్యంలోనే కాలువను నిర్మించారు. తాజా పనులతో కాలనీకి ఇన్నాళ్లగా వేధిస్తున్న మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో నిర్మించిన భారీ కాలువ

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని పంట కాలువలో చెత్త వేస్తున్నారు. దీంతో కాలువలో నీరు పాడైపోతోంది. రైతులు ఇబ్బంది పడుతున్నారు. – పి.సతీష్, ఎలమంచిలి, ✓: మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడాం. చెత్త కాలువలోకి పోయకుండా చూడాలని. మురుగు కూడా పంట కాల్వలోకి రాకుండా చూడమన్నాం. దీనిపై లేఖరాస్తాం. – సాయిప్రశాంతి, డీఈఈ, జల వనరుల శాఖ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని దిమిలిరోడ్డులో రోడ్డుకి ఇరువైపులా వాహనాలు నిలిపివేసి వెళ్లిపోతున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – పి.శైలజ, ఎలమంచిలి, ✓: వాహనాలు నిలపకుండా చర్యలు చేపడతాం. సమస్య పరిష్కరిస్తాం. – సావిత్రి, పట్టణ ఎస్సై, ఎలమంచిలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఏఎంసీ కాలనీలో చేపల మార్కెట్ వద్ద అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించగలరు. – రాజేష్, అనకాపల్లి, ✓: పరిశుభ్రత చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – రవికుమార్, జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని అంబేడ్కర్ కాలనీ రోడ్డు గుంతలు పడింది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ప్రమాదాలు జరుగుతున్నాయి. – పి.రాజు, స్థానికుడు, ✓: గుంతలు పూడ్చిస్తాం. రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని నేరెళ్ల కాలువలో పూడికతో నిండిపోయింది. దీంతో మురుగు పారడం లేదు. పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. – జి.గోవింద్, పాయకరావుపేట, ✓: కాలువను శుభ్రం చేయిస్తాం. పూడిక తీయిస్తాం. – వినయ్, ఏఈ, జలవనరులశాఖ

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: గవరపాలెం కర్రివానివీధిలో రహదారిపై ఇసుక వేస్తున్నారు. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. – పీవీ రామారావు, అనకాపల్లి, ✓: రహదారులపై ఇసుక వేయకుండా చర్యలు తీసుకుంటాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్, అనకాపల్లి

మెరుగుపడిన రహదారి

స్పందనకు వందనం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్‌లోని మురుగుకాలువ సమస్యను జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి పరిష్కరించారు. కాలువ నుంచి నీరు లీకవ్వడంతో రహదారి మురికిమయంగా మారుతోంది. 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకురాగా వెంటనే బుధ, గురువారాల్లో పనులు చేయించి పరిష్కరించారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు వద్ద ఉన్న ఇళ్ల మధ్యకు చేరిన మురుగును పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన గురువారం వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. డ్రైనేజీలోంచి వస్తున్న మురుగును ఖాళీ స్థలాల్లోకి చేరకుండా అడ్డుకట్ట వేశారు.

సొంతసొమ్ముతో రైతుల కల్లాలకు వెలుగులు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకకు చెందిన తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గ్రామంపై అభిమానంతో మూడు నెలల క్రితం తన సొంతసొమ్ముతో రైతుల కల్లాల్లోకి వెళ్లే రోడ్లలో వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. మునగపాకలో 80శాతం మంది రైతులే. చీకట్లోనే కల్లాలకు రాకపోకలు సాగిస్తున్న వీరి కోసం వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేస్తున్నారు. ఇప్పటికే ములబందగోడి రైతు సంఘం, తంపరిమూల ప్రాంతాల్లో వందకు పైగా వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. పేటకట్టుమూలలో గురువారం 51 వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రారంభించారు. రైతుల కోరిక మేరకు మిగతా ఏడు మూలప్రాంతాల్లోనూ వీధిదీపాలను ఏర్పాటుచేస్తానని సాయికృష్ణ తెలిపారు. సాయికృష్ణను రైతులు అభినందించారు. పేటకట్టుమూల రైతు సంఘం అధ్యక్షుడు మళ్ల జగ్గ అప్పారావు, వార్డు సభ్యుడు బొడ్డేడ సోమరాజు, కార్యదర్శి శివ అప్పారావు, టెక్కలి పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

పేటకట్టుమూల ప్రాంతంలో వీధి దీపాల ఏర్పాటు

(c) eenadu

నర్సీపట్నం
• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** రివాల్వర్ రీటా, జనతా బార్, స్కూల్ లైఫ్, రాజు వెడ్స్ రాంబాయి, **ఆడి 2:** ది గర్ల్ ఫ్రెండ్, రాజు వెడ్స్ రాంబాయి, నాట్ ఆల్ మూవీస్ ఆర్ ది సేమ్ డ్యూయల్ **ఆడి 3:** ఆంధ్రా కింగ్ తాలుకా, **ఆడి 4:** జూటోపియా, ఆంధ్రా కింగ్ తాలుకా, **బంగార్రాజు:** ప్రీ వెడ్డింగ్‌షో, **రాజు:** జింగిరి, **చోడవరం:** శ్రీసాయిలక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలుకా సాయిలక్ష్మి: శివ, **పూర్ణా:** 12ఎ రైల్వే

నర్సీపట్నం సీఐగా గఫూర్



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం సీఐగా ఎస్.కె.గఫూర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం ఆయన అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో వేకెన్సీ రిజర్వు(వి.ఆర్)లో ఉన్నారు. గతంలో ఆయన నర్సీపట్నం గ్రామీణ సీఐగా పనిచేశారు. పాడేరు, ఎలమంచిలిలోనూ సీఐగా పనిచేశారు. ఆ స్థానంలో ఉన్న జి.గోవిందరావు వి.ఆర్.కు వెళ్లనున్నారు.

బాలాలయంలోకి అమ్మవారు

నర్సీపట్నం అర్బన్: అబీద్‌కూడలిలో నూకాంబికా అమ్మవారికి నూతనంగా ఆలయ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో పాత ఆలయంలోని అమ్మవారిని గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ఆవరణలోని బాలాలయంలోకి తరలించారు. సభాపతి అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి, ఆలయ కమిటీ ఛైర్మన్ కొరుపోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు. గతంలో అయ్యన్న కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళం ఇవ్వడంతో ప్రభుత్వం రూ.40లక్షలు విడుదల చేసింది. ఈ నిధులతో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ పద్మావతి

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట వద్ద బొడ్డేరు గెడ్డలో ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ భారీ నీటి పథకంతోపాటు చోద్యం, గుజ్జుమాను పాకల దరి వంతెనలు పునాదులు దెబ్బతింటున్నాయి. – సత్యనారాయణ, లింగంపేట

✓: అక్రమ ఇసుక తవ్వకాల వ్యవహారం తమ దృష్టికి రాలేదు. వెంటనే వీఆర్ఏలను అక్కడకు పంపించి పరిస్థితిని పరిశీలించి అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేస్తాం.– శ్రీనివాసరావు, తహసీల్దార్

తుప్పలు తొలగించారు

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేటలో ప్రధానరహదారి నుంచి నూకాలమ్మ ఆలయానికి వెళ్లే దారికి ఇరువైపుల ఏపుగా తుప్పలు పెరిగాయి. దీనిపై ఈ నెల 27న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఉపాధి కార్మికులతో తుప్పలు తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

ఊరంతా ఊడ్చుతున్నా.. జీతాల ఊసేలేదు!

దేవరాపల్లి, న్యూస్‌టుడే

కోడికూయక ముందే నిద్రలేచి ఊరిలోని చెత్తాచెదారాన్ని ఎత్తి పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులకు వేతనాల వెతలు తప్పడం లేదు. ఊరంతా ఊడ్చినా ఇంటి కెళ్లి కడుపు నిండా గంజినీరైనా తాగలేని పరిస్థితి ఉంది. విధుల్లో తేడాలొస్తే కఠినంగా చర్యలు తీసుకొనే అధికారులు, పాలకులకు పారిశుద్ధ్య కార్మికుల జీతాల కష్టాలు పట్టడం లేదు.

తెల్లవారక ముందే వీధుల్లోని చేరుకొని ముందురోజంతా పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రంచేసి పనిముగించుకునే సరికి ఉదయం 10గంటలు దాటుతుంది. మళ్లీ మధ్యాహ్నం 2 గంటలకు తప్పక విధులకు హాజరవుతారు. భరించలేని దుర్వాసన వస్తున్నా కుళ్లిన కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, వీధికాలువల్లో పూడికతీత తదితర పనులను చేయాల్సి ఉంటుంది. పొట్టకూటి కోసం ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా రోజంతా పనిచేసి గూటికి చేసుకుంటారు. దీనికితోడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ కార్యక్రమాలకు హాజరయ్యేటప్పుడు అక్కడ ఏర్పాట్లు చూడటం తదితర పనులు అదనంగా తోడవుతాయి. ఎంతటి ఇబ్బందులు ఉన్నా విధులు నిర్వహించే వీరికి జీతాల చెల్లింపుల్లో మాత్రం శ్రద్ధ కనిపించడం లేదు.

దేవరాపల్లిలో పరిస్థితి: మండల కేంద్రం దేవరాపల్లి మండలంలో ఏకైక మేజరు పంచాయతీ. ఇక్కడ 12వేలకు పైగా జనాభా ఉంది. ప్రధాన గ్రామంతోపాటు బంగారమ్మపాలెం, సంతతోట, ముత్యాలమ్మపాలెం, అల్లిపురం, చిన్నంనాయుడు నగర్ వంటి శివారు గ్రామాలున్నాయి. జనాభా పెరుగుతుండటంతో గ్రామం మరింత విస్తరిస్తోంది. ఇంత జనాభా కలిగిన గ్రామంలో కేవలం 18 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు.

జీతాల కోసం ఎదురుచూపులే : ఈ పంచాయతీలో ఏళ్ల తరబడి ఒప్పంద ప్రాతిపదికన 18 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో ముగ్గురు మినహా వేర్వేరు పనులు చేస్తుండగా కేవలం 15 మంది మాత్రమే పారిశుద్ధ్య పనులు చేస్తుంటారు. ఒక్కొక్కరికి కేవలం రూ.9,500 జీతంగా ఇస్తారు. ఆ మొత్తం కూడా ఇవ్వకుండా గత మార్చి నుంచి బకాయిలు పెట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు.

వీధుల్లో తుడిచిన వ్యర్థాలను ఎత్తి బళ్లలో వేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

త్వరలో పరిష్కరిస్తాం..

మార్చి నుంచి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నమాట వాస్తవమే. ప్రతి ఏడాది వారికిచ్చే జీతానికి 5శాతం పెంచి ఇస్తుంటాం. ఇలా పెంచిన వేతనాలకు సంబంధించిన ఫైలుని జిల్లా పంచాయతీ అధికారికి పంపించాం. అక్కడి నుంచి నేటి వరకు మాకు రాలేనందున ఆలస్యం అయ్యింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఈ సమస్య పరిష్కరిస్తాం.
– అనంత ఉమాదేవి, విస్తరణాధికారిణి, దేవరాపల్లి పంచాయతీ

ఉత్సాహం.. ఉపన్యాసం

'ఈనాడు - ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: చరవాణి వినియోగం మితిమీరడంతో చదువులు నాశనమవుతున్నాయని దీనిని పక్కన పెడితే విద్యలో ప్రగతి సాధ్యమని విద్యార్థులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఇవి జరిగాయి. స్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.వి.మాధవి పర్యవేక్షణలో వీటికి ఉపాధ్యాయిని కె.విజయకుమారి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన కూనిశెట్టి తేజేశ్వరి, రుత్తల తేజశ్రీ, మాసాడ జయశృతిలకు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.పద్మ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎ.హిమబిందు, ఎల్.శైలజ పాల్గొన్నారు.

ఉపన్యాసం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.పద్మ

గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి

నాతవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో గుర్తించిన పనులను తక్షణం చేపట్టాలని ఉపాధి హామీ ఏపీఓ కొండాజీ పేర్కొన్నారు. వ్యవసాయ పనుల కోసం 2 నెలలు పనులు నిలుపు చేశామని ఇపుడు మళ్లీ చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లో మేట్‌లు, శ్రామికులు అవగాహనతో పనులు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ ఈఆర్థిక సంవత్సరం ముగింపు లోపున 100 రోజుల పని కల్పిస్తున్నట్టు తెలిపారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

చెరకు సీజన్ వచ్చిందంటే ఒకప్పుడు గోవాడ చక్కెర కర్మాగారం పరిధిలోని తూనిక కేంద్రాలు చెరకుతో కళకళలాడేవి. ఇప్పుడు అలాంటి ఛాయలు ఏమీ లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. యార్డుల్లోని భవనాలు, మైదానం, తూకం కేంద్రాల గదుల వద్ద తుప్పలు ఏపుగా పెరిగిపోయి కళావిహీనంగా మారాయి. గోవాడ చక్కెర కర్మాగారానికి నియోజకవర్గంలోని చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల నుంచి సింహభాగం చెరకు రైతులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం చెరకు సాగు గిట్టుబాటు కాకపోవడం, కర్మాగారం గానుగాట సాగక రైతులకు సొమ్ము సాగుపై మక్కువ తగ్గింది. నియోజకవర్గ పరిధిలో చెరకు విస్తీర్ణం భారీగా తగ్గింది. రైతులు ఇతర పంటలు, సరుగుడు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పండించిన చెరకును బెల్లం తయారీకి ఉపయోగించి మరికొంత వ్యాపారులకు విక్రయిస్తున్నారు. – చీడికాడ, న్యూస్‌టుడే

ఖాళీగా దర్శనం ఇస్తున్న మైదానం

సాగుదారులకు న్యాయం చేయండి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: రాచపల్లి రెవెన్యూలోని సర్వే నంబరు 737లో భూములు కోల్పోయిన సాగుదారుల కుటుంబాలకు పరిహారంతోపాటు పట్టాలతో ఉపాధి కల్పించాలని నాయకులు అధికారులను కోరారు. 737లో ఎం.ఎస్.ఇ. పార్కు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు 410 ఎకరాలు సర్వే చేసి సాగుదారులను గుర్తించారు. ఈ మేరకు గురువారం రాచపల్లి రామాలయం వద్ద అధికారులు గ్రామసభ ఏర్పాటు చేశారు. సర్వేలో గుర్తించిన వివరాలను వెల్లడించారు. పలువురు సాగుదారులు తాము సాగులో ఉన్నంత భూమి రికార్డుల్లో నమోదు చేయలేదని సుమారు 30 మంది ఫిర్యాదులు చేయగా వాటిని సరి చేశామన్నారు. వాటిని సరి చేసి ఎవ్వరికీ అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ఆక్రమణలు ఉన్నా పక్కాగా అమలు చేయాలని అడిగి, మీదీ రమణ అన్నారు. అప్పుడు తాము పయనీరు పరిశ్రమ ఏర్పాటు సమయంలో భూములు, నివాసాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు మూడువందల ఎకరాల భూములు ఏపీఐఐసీ సంస్థ పేరున నమోదు కావడంతో 15 ఏళ్లుగా రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నర్సీపట్నం, మాకవరపాలెం తహసీల్దార్లు ప్రసాదరావు, వెంకటరమణ, సర్పంచి అమ్మాజీ, జడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, ఎంపీటీసీ సభ్యుడు యర్రాపాత్రుడు పాల్గొన్నారు.

సాగుదారు జాబితాను విడుదల చేసిన అధికారులు, నాయకులు

అడిగిన వారికి నీడను కల్పిద్దాం..

చోడవరం, న్యూస్‌టుడే: అర్హులై ఉండి ఇళ్లు కట్టుకుంటామని ముందుకొచ్చిన వారందరికీ పక్కా గృహాలు మంజూరయ్యేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. నిబంధనల పేరిట పేదలను ఇబ్బంది పెట్టకూడదన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నియోజకవర్గస్థాయి గృహ లబ్ధిదారుల సర్వేపై సమీక్ష జరిగింది. గృహనిర్మాణ సంస్థ డీఈఈ (ఇన్‌ఛార్జి) ఉమాశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్షకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. నాలుగు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇంటి స్థలం వద్దే పునాదులు తీస్తేనే వెరిఫికేషన్ చేస్తామని చెబితే చాలా మంది ఇబ్బంది పడతారన్నారు. బేస్‌మెంట్, లింటల్ లెవెల్, రూఫ్ లెవెల్‌కు వచ్చిన ఇళ్లను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా 2014-19లో గృహాలు మంజూరై నిర్మాణాలు చేపట్టిన వారికి గత ఐదేళ్లలో బిల్లులు చెల్లించలేదు. వారి విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సర్వే చేయాలన్నారు. ఎంపీపీ గాడి కాసులమ్మ, ఎంపీడీవోలు పి.వి.అంజనేయులు, కె.శివ, సీతారామచంద్రమూర్తి, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ నియోజకవర్గ స్థాయి సమీక్షలో ఎమ్మెల్యే రాజు, అధికారులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: బలిఘట్టం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు స్థానిక విద్యుత్తుశాఖ డివిజనల్ ఇంజినీరు అప్పారావు పేర్కొన్నారు. బలిఘట్టం, బయ్యపురెడ్డిపాలెం, మెట్టపాలెం, చిన్నపలం, ఏటిగైరంపేట తదితర ప్రాంతాల్లో లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాడుగుల, గాదిరాయి సబ్‌స్టేషన్‌ల్లో ఉన్న గ్రామాలన్నింటికి మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని నర్సీపట్నం విద్యుత్తు ఏఈ అప్పారావు తెలియజేశారు.

దట్టంగా కురుస్తున్న పొగమంచు

చలి పులి

రెండు రోజులుగా చలి, పొగమంచు తీవ్రత పెరిగింది. మన్యం ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి ప్రాంతాల్లో ఉదయం 9గంటల వరకు చలివీడలేదు. సాయంత్రం 4 గంటలకే మళ్లీ మొదలవుతుంది. దట్టంగా కురుస్తున్న పొగమంచు కారణంగా ఈ ప్రాంతం మన్యాన్ని తలపిస్తోంది. – చీడికాడ, న్యూస్‌టుడే

లింగవివక్ష చూపకూడదు

రోలుగుంట, న్యూస్‌టుడే: అన్నిరంగాల్లోనూ స్త్రీ, పురుషులు అనే వ్యత్యాసం లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని ప్రాంతాల్లో లింగవివక్షను ఉండని మండల మహిళాసమైక్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఇందులో ప్రజలకు అవగాహన కల్గేలా నినాదాలు చేశారు.

రోలుగుంటలో ర్యాలీ

మొక్కలు మాయం... కుండీలు పదిలం !

జిల్లాలోని ఏకైక భారీ సాగునీటి ప్రాజెక్టు నాతవరం సమీపంలోని తాండవ జలాశయానికి అనేక మండలాల నుంచి సందర్శకులు వస్తుంటారు. ఆది, మంగళవారాల్లో గట్టు దిగువన అమ్మవారి ఆలయానికి భక్తులు వస్తుంటారు. వీరంతా అపార జలరాశిని చూస్తూ ఉల్లాసంగా గడిపేందుకు గట్టు పైకి వస్తుంటారు. ఈ నేపథ్యంలో అక్కడ ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించేందుకు కుండీల్లో అందమైన మొక్కలు ఉండేవి. ప్రస్తుతం అవన్నీ ఎండిపోయాయి. గతంలో బోరు నుంచి ఎక్కువగా నీరొచ్చేదని, నీరు తగ్గిపోవడంతో మొక్కలు తడిపేందుకు వీలు కావడం లేదని కాపలాదారులు చెబుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల వంటి సదుపాయాలు లేవు. ప్రాజెక్టు కమిటీ, అధికారులు స్పందించి సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం గ్రామీణం

మొక్కలు లేకుండా ఉన్న కుండీలు

విశాఖడెయిరీ నిధులతో షెల్టర్ నిర్మాణం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగులలో దేవీ ఆలయం వద్ద భక్తుల నిదురకు విశాఖ డెయిరీ నిధులు రూ.5 లక్షలతో షెల్టర్ నిర్మాణానికి ఎంఎంపీలీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోటార్ యూనియన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఆలయ గౌరవ అధ్యక్షుడు శ్రీనాథ శ్రీనివాసరావు, ఆలయ అధ్యక్షుడు కొండలరావు, దంగేటి సూర్యారావు, శీరంరెడ్డి సూర్యనారాయణ, సర్పంచి యడ్ల కళావతి గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న గ్రామపెద్దలు, రమాకుమారి

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

రావికమతం, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్ రహిత సమాజం కోసం పోలీసులకు అందరూ సహకరించాలని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కేజీవీ అగ్రహారం శివారు యర్రబందలో గంజాయి నిర్మూలనపై గురువారం గ్రామస్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గతంలో కంటే చట్టాలు మరింత పటిష్ఠంగా ఉన్నాయని చెప్పారు. గంజాయి రవాణా చేసినా, గంజాయి రవాణాదారులకు సహకరించినా కఠిన శిక్షలు తప్పవన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏవైనా అక్రమ కార్యకలాపాలు జరుగుతుంటే తెలియజేయాలన్నారు. రావికమతం ఎస్.ఐ రఘు వర్మ, యర్రబంద తెదేపా నాయకుడు రౌతు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయాలి

రోలుగుంట, న్యూస్‌టుడే: ఈనెల 28 నుంచి రెండురోజులపాటు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో జరిగే ఉపాధ్యాయుల క్రీడాపోటీలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ఎంఈఓ జగ్గారావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలకు సంబంధించి ఉపాధ్యాయులకు నిర్దేశించిన నిబంధనలు విధిగా పాటించాలని ఎంఈఓ సూచించారు.

మద్యం మత్తులో వీరంగం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వీరంగం చేసిన సిరపరపు శివ స్వామినాయుడిపై కేసునమోదు చేశామని కె.కోటపాడు ఎస్ఐ దనుంజయ తెలిపారు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా వాహనాన్ని ఆపి తన భర్తపై దాడి చేసినట్లు ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి శివస్వామినాయుడిని అరెస్ట్‌చేసి రిమాండుకు తరలించామన్నారు. ఇదివరకు ఇలాంటి చర్యలకు గతంలోనూ పాల్పడినందుకు రౌడీ షీటు తెరవనున్నట్లు పేర్కొన్నారు.

అంతటా ఆధ్యాత్మిక వైభవం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో కొలువైన లక్ష్మమ్మ కోవెలలో మార్గశిర మాసోత్సవాలను గురువారం నుంచి వేడుకగా జరిపేందుకు కమిటీ ఏర్పాట్లను చేసింది. తొలి మార్గశిర మాస గురువారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులతో కోవెల ఆవరణ సందడిగా కనిపించింది. ఆలయ కమిటీ ఛైర్మన్‌ నున్న గోపాలం, సభ్యులు గూనూరు సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : తారువలో అభయాంజనేయ స్వామి వారి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. గ్రామ పురోహితులు కాసు బాబు, తిమిరాం శివాలయ అర్చకులు పాకల కామేశ్వరరావు మంత్రోచ్ఛరణ మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

రావికమతం: గుమ్మళ్లపాడులో రామాలయం నిర్మాణానికి గురువారం అంకురార్పణ జరిగింది. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం వేద పండితులు కశింకోటకు చెందిన రామాచార్యులు పర్యవేక్షణలో శంకుస్థాపన నిర్వహించారు. సర్పంచి బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, శ్రీను, గ్రామస్థులు ఆర్థిక సహాయం అందించారు.

వెండి తాపడం బహూకరణ

చోడవరం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం రోడ్డులోని ఆంజనేయ స్వామి మందిరంలో సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్‌కు వెండి తాపడం, రజత మకర తోరణం, ఉత్సవ విగ్రహాలను సమకూర్చారు. జలవనరుల శాఖ విశ్రాంత ఉద్యోగి ఆదిరెడ్డి రామునాయుడు - కాసులమ్మ కుటుంబం 800 గ్రాములతో తొడుగును చేయించి అందజేశారు. భక్తుల నుంచి రూ.1.5 లక్షలు రాగా వాటిలో రూ.60 వేల వ్యయంతో వస్తువులు చేయించి అలంకరించారు.

వెండి ఆభరణాల అలంకరణ

కె.కోటపాడు, న్యూస్‌టుడే : గొండుపాలెంలో భక్తులు సమకూర్చిన రూ.10 లక్షల వెండి ఆభరణాలతో గురువారం దండుముత్యాలమ్మతల్లి విగ్రహాన్ని అలంకరించారు. ఆభరణాల్లో కిరీటం, అభయహస్తం, వెండి భరిణల, పాదపీటము, కర్ణ తలాటములు ఉన్నాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

నాతవరం, న్యూస్‌టుడే: చమ్మచింత జడ్పీ పాఠశాల విద్యార్థిని అప్పన స్నేహను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు అభినందించారు. మాక్ అసెంబ్లీ నిర్వహణ కోసం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్నేహ జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని క్విజ్ పోటీలోనూ మంచి ప్రతిభ చూపించిన సందర్భంగా ప్రశంసాపత్రం, మెడల్ బహూకరించారని స్నేహ తండ్రి, ఉపాధ్యాయులు రాంబాబు పేర్కొన్నారు.

స్నేహను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు

నిత్యావసరాల అందజేత

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సకురువీధికి చెందిన ఆనపర్తి నూకాలమ్మ, ఈశ్వరమ్మ కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలు, దుప్పట్లను గురువారం సద్భావన బృందం అందజేసింది. సబ్‌రిజిస్ట్రార్ గీతాలక్ష్మి కుమార్తె మనుహాసిని జన్మదినం సందర్భంగా వీటిని అందజేసినట్లు బృందం సభ్యురాలు దేవరపల్లి కుమారి తెలిపారు. డా.బి.ఆర్.అంబేద్కర్ ట్రస్టు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి నడుపూరి సన్యాసిరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రేమసమాజం, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఖండేలి వెంకటరావు, జుంజూరి అప్పారావు, భూపతి రాజు, మచ్చులింగం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అమృతేశ్వర నృత్య అకాడమీలో శిక్షణ పొందిన 40 మంది చిన్నారులకు గురువారం పెదబొడ్డేపల్లి సరస్వతీదేవి ఆలయంలో గజ్జెపూజ, నటరాజ పూజ నిర్వహించిన అనంతరం వివిధ భక్తి గీతాలకు తొలి ప్రదర్శన ఇచ్చారు. వీరందరికీ ఆలయ ప్రతినిధి బాబూరావు మాస్టారు జ్ఞాపికలు అందజేశారు. నృత్య శిక్షకురాలు ఎం.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో రైతన్నా.. మీకోసం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నేటి నుంచి రైతన్నా మీకోసం అనే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని పొంగలిపాక గ్రామంలో గురువారం సాగులో పంచ సూత్రాలు తదితర అంశాలపై రైతులకు వివరించి, కరపత్రాలు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్, గ్రామ సర్పంచి నాయన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు మైచర్ల, కింతలి పీఎసీఎస్ ఛైర్‌పర్సన్ ఉండూరు దేముడు, నీటిసంఘం అధ్యక్షుడు బంటు మల్లునాయుడు, కూటమినాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని, గ్రామంలో నిలిచిపోయిన పలు అభివృద్ధి భవనాలను ప్రజాప్రతినిధులతో కలసి అధికారులు పరిశీలించడం జరిగింది.

రైతులకు కరపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో అప్పారావు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నాతవరం, న్యూస్‌టుడే: నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పదో తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని జనసేన పార్టీ నియోజకవర్గం బాధ్యులు రాజాన సూర్యచంద్ర పేర్కొన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలోని పది విద్యార్థులకు గురువారం స్టడీమెటీరియల్‌ను అందజేశారు. గతేడాది పార్టీ నుంచి స్టడీ మెటీరియల్ పంపిణీ మంచి ఫలితాలనిచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన తక్షణ కార్యక్రమాలను ఉపాధ్యాయులకు తెలియజేస్తే సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో తాండవ ఛైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, మండల అధ్యక్షులు వెంకటరమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చూపిస్తున్న విద్యార్థులు

ఆదివాసీలకు కుళాయిల ద్వారా తాగునీరు

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడు శివారు కల్యాణపులోవ గ్రామానికి సమీపంలో నివసిస్తున్న పీవీటీజీ ఆదివాసీ కుటుంబాల వారికి తాగునీటికి ఇబ్బంది లేకుండా మంచినీటి ట్యాంకు నిర్మించి కుళాయిలు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కల్యాణపులోవలో జల్‌జీవన్ నిధులు రూ. 33 లక్షలతో ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి నీటి సరఫరా చేసినా ట్యాంకు సక్రమంగా పనిచేయక నీరు అందడంలేదు. దీంతో ఆదివాసీ మహిళలు కిలోమీటరు దూరంలోని కొండ గెడ్డ, పొలాల్లోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. తాగునీటి ఇబ్బందులపై ఆదివాసీ మహిళలు ఇటీవల కాలంలో పలుమార్లు ఆందోళనలు చేయడం జరిగింది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి కొత్తగా బోరుతీయించి వాటర్ ట్యాంకులోని నీటిని ఎక్కించి గురువారం నుంచి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు.

కుళాయిల వద్ద నీరు పట్టుకుంటున్న పీవీటీజీ మహిళలు

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **ఆంధ్ర కింగ్ తాలూకా**

స్క్రీన్-2 - **రాజు వెడ్స్ రాంబాయి**

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: వాడచీపురుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల తిక్కవానిపాలెం, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, ఊటగెడ్డపాలెం, దళాయిపాలెం, దోసూరు గ్రామాలకు ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం

భాగవత సప్తాహం గురించి వివరిస్తున్న చీమలపాటి వెంకటరమణమూర్తి

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే : నాయుడుతోట సమీప రవినగర్‌లోగల శ్రీ బాలత్రిపురేశ్వరి పీఠం నిర్వాహకులు దివాకరుణి శ్రీరామచంద్రశేఖర్ శర్మ సన్నిధానంలో గురువారం భాగవత సప్తాహం ప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. బ్రహ్మశ్రీ చీమలపాటి వెంకటరమణమూర్తి భక్తులకు భాగవత సప్తాహం ప్రాధాన్యతను వివరించారు. వారం రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: **?** : సబ్బవరం మండలం గొట్టివాడ జగనన్న కాలనీలో మురుగు కాలువలు లేవు. శ్మశాన వాటికకు దారి లేక ఇబ్బందులు పడుతున్నాం. **-రమేష్, గొట్టివాడ.** ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలు పరిష్కరిస్తాం. **-సాలాపు మీన, సర్పంచి, గొట్టివాడ**

వేపగుంట, న్యూస్‌టుడే: **?** : జీవీఎంసీ 93వ వార్డు ఇంజినీర్స్ కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. **-రాజారావు, ఇంజినీర్స్‌కాలనీ** ✓: ఇంజినీర్స్ కాలనీలో వెలగని వీధి దీపాలను పరిశీలించి తగుచర్యలు తీసుకుంటాం. **-హరిబహదూర్, ఏఈ, జీవీఎంసీ జోన్-8**

పెందుర్తి, న్యూస్‌టుడే: **?** : జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి దుర్గా ఆదర్శనగర్‌లో ఎన్‌పీ/2సీ/5 స్తంభానికి ఉన్న వీధి దీపం గత పదిహేను రోజులుగా వెలగడం లేదు. రాత్రి వేళ చీకట్లో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. **-మహేశ్, దుర్గా, ఆదర్శనగర్** ✓: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలోనే మరమ్మతు చేయిస్తాం. **- సోమేశ్, వీధి దీపాల నిర్వహణ ఏఈ, 96వ వార్డు.**

గురుకుల బాలికలు.. యోగాలో మెరికలు..

పరవాడ, న్యూస్‌టుడే

మండలంలోని తానాం జ్యోతిబాపులే గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు యోగాలో రాణిస్తున్నారు. వీరు ప్రిన్సిపల్ రమామోహిని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రమం తప్పకుండా యోగాలో పట్టు సాధించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించి డిసెంబరు మూడో వారంలో పలు రాష్ట్రాల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతల మనోగతం వారి మాటల్లోనే.

★ యోగా వల్ల ఏకాగ్రత, చురుకుదనం పెరిగింది. తల్లిదండ్రులు సతీష్, అన్నపూర్ణ వ్యవసాయ కూలీలు. స్వగ్రామం దేవరాపల్లి మండలం వడ్రపాలెం. 250కి పైగా ఆసనాలు వేస్తా. అండర్-17 రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో పసిడి పతకం సాధించి మహారాష్ట్రలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. రాష్ట్ర స్థాయిలో 12స్వర్ణం, 10 రజత, 6 కాంస్య పతకాలు సాధించా. **- బి.వైష్ణవి. 9వ తరగతి**

అక్కలిద్దరూ యోగాలో రాణించడంతో ఆసక్తి పెంచుకున్నా. తండ్రి కనకారావు వ్యవసాయకూలీ. తల్లి వరలక్ష్మి గృహిణి. స్వగ్రామం తానాం. ఇటీవల అండర్-19 ట్రెడిషనల్, రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో 2 పసిడి పతకాలు సాధించి పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందా. రాష్ట్రస్థాయిలో 3 పసిడి పతకాలు, జిల్లాస్థాయిలో ఒక స్వర్ణం, రెండు రజత, కాంస్య పతకాలు సాధించా. **-హారిక, ఇంటర్ ద్వితీయ సంవత్సరం**

★ తండ్రి మహేశ్వరరావు సెక్యూరిటీ గార్డు. తల్లి వరలక్ష్మి టైలర్. స్వగ్రామం అనకాపల్లి. ఇటీవల అండర్-19లోని అర్టిస్టిక్ పెయిర్ యోగా పోటీల్లో పసిడి పతకం సాధించి పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించా. 80 ఆసనాలు వేస్తా. యోగా టీచర్ కావడమే లక్ష్యం. **-పి.రామసాహితి, పదోతరగతి**

★ నాలుగేళ్లుగా సాధన చేస్తున్నా. స్వగ్రామం వేపగుంట. అండర్-17 రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో పసిడి పతకం సాధించి మహారాష్ట్రలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. ఇప్పటి వరకు 8 స్వర్ణ, 10 కాంస్య, 10 రజత పతకాలు సాధించా. 2026లో జపాన్‌లో జరిగే ఏషియన్ పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యం. **-కౌశిక, 9వ తరగతి**

మూడేళ్లుగా సాధన చేస్తున్నా. స్వగ్రామం సబ్బవరం సమీప మొగలిపురం. తండ్రి అక్కునాయుడు లారీడ్రైవర్. తల్లి పూర్ణిమ గృహిణి. ఇటీవల జరిగిన అండర్-14 అర్టిస్టిక్ సోలో, రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో 2 పసిడి పతకాలు సాధించి త్వరలో దిల్లీలో జరిగే యోగా పోటీలకు ఎంపికయ్యా. రాష్ట్ర స్థాయిలో ఒక స్వర్ణం, జిల్లా స్థాయిలో రెండు పసిడి పతకాలు సాధించా. **-ఝాన్సీలక్ష్మి, 8వ తరగతి**

అనర్గళ ఉపన్యాసం.. దక్కిన బహుమానం..

ఉపన్యాసమిస్తున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులందించిన కళాశాల యాజమాన్యం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఉపన్యాస కళతో నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయని చినముషిడివాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల డీన్ ఎం.శ్రీనివాసు అన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విద్యార్థులు జి.సాయిజేస్విత (ప్రథమ), ఎస్కే అబ్దుల్ ఖాదర్(ద్వితీయ), ఏబీసీ సిద్ధార్థ్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు డీన్ శ్రీనివాసు, ప్రిన్సిపల్ పి.రాజుబాబు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

రహదారి భద్రతపై అవగాహన

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్‌టుడే: జేఎన్ ఫార్మాసిటీలోని అడ్మిరాన్ ఫార్మా కంపెనీలో గురువారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

ఆక్రమణల పరిశీలన

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: చీమలాపల్లి ప్రాథమిక పాఠశాల ఆక్రమణలను విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర రావు, ఈఈ డి.వి.నరసింహారావు గురువారం పరిశీలించారు. ఈనెల 11న 'ప్రహరీ నిర్మించక... ఆక్రమణలు ఆగక' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ సర్వశిక్షా అధికారులు స్పందించారు. ఆక్రమణలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పెద్దలు అయితఎర్రయ్య, రాములు పాఠశాల పరిస్థితులను అధికారులకు వివరించారు. ఇక్కడ గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు నివేదించి ఆక్రమణలను అడ్డుకునేందుకు కృషిచేస్తామన్నారు.

దర్పణం

దుర్గంధం బెడద

సబ్బవరం, న్యూస్‌టుడే: 88వ వార్డు వెదుళ్ల నరవ శివారు కొత్తూరులో కొద్ది రోజులుగా మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం వెంటాడుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

గోతులు తవ్వారు.. పనులు మరిచారు

పెందుర్తి రాజుచెరువు ప్రాంతంలో ఇలా..

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని పెందుర్తి - ఆనందపురం రహదారిలో భూగర్భ విద్యుత్తు తీగల పనుల కోసం తవ్విన గోతులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో ఇటీవల విద్యుత్తు తీగల ఏర్పాటు కోసం రహదారి పక్కన గోతులు తవ్వి పనులు పూర్తయ్యాక వాటిని తిరిగి పూడ్చే పనులు పది రోజులుగా జరగడం లేదని స్థానికులు తెలిపారు. రహదారిని ఆనుకుని ఉన్న గోతులను దాటుకుని ఇళ్లు, దుకాణాలకు రాకపోకలు సాగించాల్సి వస్తోందంటున్నారు. ఒకవేళ అదుపు తప్పి పడిపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులతో హెచ్ఎం ప్రమీల, ఉపాధ్యాయ సిబ్బంది

ఇస్లాంపేట (పరవాడ), న్యూస్‌టుడే: జడ్పీ హైస్కూల్లో పరిచయ, ప్రాథమిక పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని ఉపాధ్యాయ సిబ్బంది తెలిపారు. దక్షిణభారత్ హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేటలో ఇటీవల ప్రచారక్ సోఫియా, తబస్సుమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పరీక్షకు పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు హాజరై ఉత్తీర్ణత సాధించారు. వీరిని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం జి.ప్రమీల అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది రాజేష్, సాజిదాబేగం, మహమ్మద్ హక్, ఆనందరావు, రావు, రిజ్వాన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మహాలక్ష్మీ దేవికి మార్గశిర మాస పూజలు

మహాలక్ష్మీ దేవికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సబ్బవరం, న్యూస్‌టుడే: దేవీపురం రాజరాజేశ్వరీదేవి పీఠంలో మార్గశిర మాస పూజలు ఘనంగా జరిపారు. గురువారం మహాలక్ష్మీ దేవికి అష్టమాతృకాభిషేకం లక్ష్మీ అష్టోత్తర శత నామావళితో కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. నిర్వాహకులు కె.ప్రభాకర్ మాట్లాడుతూ మార్గశిర మాసంలో డిసెంబరు 4న విద్యారణ్యస్వామి సంపుటిత సూక్త హోమం, డిసెబరు 11న స్వర్ణ మహాలక్ష్మి త్రిశతి నామావళి హోమం, డిసెంబరు 18న మహాలక్ష్మీ సహస్రనామావళి హోమం జరుగుతాయన్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని సేవించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మహాలక్ష్మి అమ్మవారు

దేవాడ(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి టి.దేవాడ గ్రామంలో గురువారం శ్రీకొత్త మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ గ్రామపెద్దలు, నాయకులు, కమిటీ ప్రతినిధులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సంప్రదాయ ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

మాట్లాడుతున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆ మేరకు గురువారం చినముషిడివాడలోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి వార్డు, గ్రామ సచివాలయం పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేయాలన్నారు. మారుమూల ప్రాంతాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. శక్తి యాప్‌పై విస్తృతంగా ప్రచారం చేసి మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న బాలలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో గురువారం గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. బాలబాలికలు వారి తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలకు పాదపూజ చేశారు. అనంతరం బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సున్నం వేసేందుకు వచ్చి చోరీ

వివరాలు వెల్లడిస్తున్న నేర విభాగం ఎస్ఐ డి.సూరిబాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: సున్నాలు వేయడానికి వచ్చి చోరీ చేసిన నిందితులను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి గురువారం పెందుర్తి నేర విభాగం ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత గోశాల దరి సింహపురి లేఅవుట్‌కు చెందిన ఎం.నూకరాజు గత నెల 9న భార్యతో కలిసి ఊరు వెళ్లి వచ్చారు. ఇంట్లో భద్రపరిచిన ఆభరణాలు చూడగా కనిపించలేదు. దీంతో పెందుర్తి నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో నూకరాజు ఇంట్లో సున్నాలు వేయడానికి వచ్చిన పొట్నూరు వినోద్‌కుమార్ (32) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి సుమారు రూ.5లక్షలు విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

హైమాస్ట్ దీపం ఉన్నా..లేనట్లే..



సబ్బవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో ఉన్న హైమాస్ట్ విద్యుత్తు దీపం గాలికి తిరిగిపోయి ఆకాశం వైపు వెలుగులు పంచుతోంది. సంబంధిత అధికారులు వెంటనే దీన్ని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతులు గురువారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సీనియర్ సహాయకుడు వి.సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి

సంకల్ప్-2026 విద్యా సామగ్రి అందిస్తున్న ప్రిన్సిపల్ శిరీషారాణి

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇంటరులో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శిరీషరాణి అన్నారు. పబ్లిక్ పరీక్షలకు ఇంకా 3 నెలలు మాత్రమే ఉన్నందున తీసుకుంటున్న చర్యలపై ఆమె గురువారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఫిబ్రవరి 23 నుంచి ఈ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. తమ కళాశాలలో 590 మంది విద్యార్థులు ఉన్నారని వారిని ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 'సంకల్ప్-2026' మెటీరియల్‌ను అధ్యాపకులు ఉదయ్‌కుమార్ తదితరులతో కలిసి ఆమె విద్యార్థులకు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే : పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఎస్.హర్షవర్ధన్, సోమేశ్వరరావు పాల్గొని కాలనీవాసులకు క్యాన్సర్ స్క్రీనింగ్, ఈసీజీ, మధుమేహం, బీపీ, తదితర ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 160 మంది కాలనీవాసులు పాల్గొన్నట్లు కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత భవిత

విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులంతా బాల్యం నుంచే ప్రణాళికతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలోని కెరియర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకుని చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. పదోతరగతి కీలకమని పరీక్షలు బాగా రాసి శతశాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్సై విజయకుమారి

పరవాడ, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని పరవాడ ట్రైనీ ఎస్సై విజయకుమారి అన్నారు. పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. డీఐఈవో వినోద్ బాబు, పలువురు అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: గంజాయి కేసుకు సంబంధించి పరారీలో ఉన్న నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ కేసుకి సంబంధించిన నిందితుడు పాంగి గోవింద్ (30) అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగుపుట్టు మండలానికి చెందినవాడు. గత ఏడాది జులై నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పెందుర్తి కూడలిలో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు

సిద్ధం చేసిన ఖోఖో కోర్టులు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వేదికగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయి. బాలబాలికల జట్లకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈవో అప్పారావునాయుడు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో క్రీడా మైదానాన్ని తీర్చిదిద్ది, క్రీడాకారులకు తగిన వసతులు ఏర్పాట్లు చేసినట్లు హెచ్ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 పాత జిల్లాల నుంచి 13 బాలుర, 13 బాలికల ఖోఖో జట్లు హాజరు కానున్నాయన్నారు. వీటి నిర్వహణకు వివిధ కమిటీలు ఏర్పాటు చేసి 80 మందిని సభ్యులుగా నియమించినట్లు చెప్పారు.

కన్నీటి వీడ్కోలు

జననం: 25-04-1947

మరణం: 27-11-2025

కీ॥శే॥ శరకం అరుణ గారు

W/o (లేటు) శరకం సూర్యనారాయణ మూర్తి గారు

Sr. Manager (Communications), Airport Authority of India

మా మాతృమూర్తి కీ॥శే॥ శరకం అరుణ గారు తేది. 27-11-2025 గురువారం నాడు మానుండి భౌతికంగా దూరమైనారని తెలియజేయుటకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

కుమారుడు - కోడలు : శరకం వెంకటేష్ - స్వర్ణ

కుమార్తెలు - అల్లుళ్ళు : పెంటకోట లీలా - భాస్కరరావు (లేటు)

యల్లపు జగదీశ్వరి - సూర్యనారాయణమూర్తి

ఆళ్ళ వరలక్ష్మి - శ్రీనివాస్

మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు మునిమనుమరాళ్ళు

అంతిమయాత్ర: తేది. 28-11-2025 శుక్రవారం

ఉదయం 9 గం॥లకు పెందుర్తి, పులగానిపాలెం రోడ్డు, శివాలయం జంక్షన్‌లో గల మా స్వగృహము నుండి బయలుదేరును. సెల్: 90323 82206

(c) eenadu

పెన్నానదిలో వరుసగా ఇసుక ట్రాక్టర్లు

ఇసుక తవ్వకాలు.. నిబంధనలకు నీళ్లు

అడ్డూఅదుపు లేకుండా తరలింపు

పామిడి, న్యూస్‌టుడే: పెన్నానది ఇసుక అక్రమార్కులకు వరంగా మారింది. మండల పరిధిలోని వంకరాజుకాలువ, కండ్లపల్లి, కొనేపల్లి, కత్రిమల పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇసుకను యథేచ్ఛగా గుంతకల్లు, అనంతపురం, గుత్తి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జాతీయ రహదారి మీదుగా..

జాతీయ రహదారిపై యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. పెన్నాపరివాహక ప్రాంతాల నుంచి రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. నదిలో నీరు అడుగంటుతోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అక్రమార్కులు ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు

ఇసుకను తరలించే ట్రాక్టర్ డ్రైవర్లకు వాహనచోదక పత్రాలు లేకుండానే నడుపుతున్నారు. ఈక్రమంలో గ్రామాల మీదుగా విపరీతమైన వేగంతో వెళ్తున్నారు. ట్రాక్టర్‌లో ఇసుక వేశాక చుట్టూ ఎలాంటి పట్టలు కప్పకుండా తీసుకెళ్తున్నారు. దీంతో గాలికి ఇసుక రేణువులు వాహనదారుల కళ్లల్లో పడుతున్నాయి. ట్రాక్టర్ల దూకుడుతో స్థానికులకు రాత్రిళ్లు కంటిమీద కునుకులేకుండా పోతోంది. అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి అనంతపురం మీదుగా బిలాస్‌పూర్‌-యలహంక మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే డివిజన్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు డిసెంబరు 2 నుంచి 31 వరకు మంగళ, బుధవారాల్లో ప్రయాణించనున్నాయి. (08261) ప్రతి మంగళవారం బిలాస్‌పూర్‌లో ఉదయం 11 గంటలకు బయలుదేరి మంత్రాలయం, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం మీదుగా బుధవారం సాయంత్రం 6.30కు యలహంక చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు (08262) ప్రతి బుధవారం రాత్రి 9 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో శుక్రవారం తెల్లవారుజామున 4.30కు బిలాస్‌పూర్ చేరుకుంటుంది. రెండు, మూడు తరగతుల ఏసీ బోగీలతో పాటు స్లీపర్, జనరల్ బోగీలతో రైలు ప్రయాణించనున్నాయి.

చిన్న పొట్లాలు.. విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు!

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఇటీవల చాపకింద నీరులా గంజాయి విస్తరిస్తోంది. పోలీసు నిఘా సక్రమంగా లేక అక్రమ రవాణాదారులు రెచ్చిపోతున్నారు. చిన్నపొట్లాల్లో చుట్టి సరఫరా చేస్తున్నారు. ఇటీవల పట్టుబడిన ఏడుగురు గంజాయి ముఠా పెద్దఎత్తున నగరంలోనూ, శివారు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

విశాఖ ఏజెన్సీ నుంచి..

గతంలో కొందరు పాత నేరస్థులు విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదికి పైగా గంజాయి ఊసే లేకుండా ఉండేది. అంతా సద్దుమణిగిందనుకుంటున్న సమయంలో మళ్లీ రవాణా, విక్రయాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది.

● అనంత నగరం పాతూరులోని కొన్ని కాలనీలతోపాటు రాజీవ్‌కాలనీ, కురుగుంట, చంద్రబాబు కొట్టాల, పల్లిగుండ్ల కాలనీ, నందమూరినగర్, అనంతసాగర కాలనీ, టీవీ టవర్, మున్నానగర్ ప్రాంతాల్లో అధికంగా గంజాయిని యువకులు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పట్టుబడిన నిందితులు సైతం ఆ కాలనీలకే చెందినవారే కావడం గమనార్హం.

బృందాలుగా..

● నగరం నుంచి నేరుగా విశాఖపట్టణం, తూర్పుగోదావరి, విజయనగరం కొండప్రాంతాలకు వెళ్లి కొందరు కొనుగోలు చేస్తున్నారు. రైళ్లలో తనిఖీలు ఉండవనే కారణంతో నిర్భయంగా రవాణా చేస్తున్నారు. మత్తుపదార్థాలు అలవాటున్న యువకులను బృందాలుగా ఏర్పాటు చేసి.. వారికి గంజాయితో పాటు డబ్బులిచ్చి కాలనీలకు చేరవేస్తున్నారు.

● ప్రైవేటు కళాశాలల వసతి గృహాల్లోకి యథేచ్ఛగా గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం. అనంత నగర శివారులోని ఓ కళాశాల సమీపంలో గంజాయి పొట్లాలు, చాక్లెట్లను విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. కొందరు విద్యార్థులను మధ్యవర్తులుగా పెట్టుకుని హాస్టళ్లలోకి పంపుతున్నట్లు తెలుస్తోంది.

నిరంతరం నిఘా అవసరం

గతేడాది నగరంలో గంజాయి వ్యసనం కల్గిన విద్యార్థులను పోలీసులు గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించారు. విద్యాలయాల వద్ద ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీలు నిత్యకృత్యంగా మారితే తప్ప గంజాయి వినియోగాన్ని అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది.

పట్టుబడిన గంజాయి పొట్లాలు

గట్టి చర్యలు చేపట్టాం

- శ్రీనివాసరావు, డీఎస్పీ, అనంతపురం

ఏడాదిన్నరగా రైళ్ల తనిఖీలు చేసి గంజాయి చాక్లెట్లు పట్టుకున్నాం. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల వద్ద దృష్టి సారించాం. ఇప్పటికే దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశాం.

ఆక్రమణదారులకు అధికారుల అండ!

భూకబ్జాపై చర్యలకు యంత్రాంగం ఉదాసీనత

ఈనాడు, అనంతపురం: ప్రభుత్వ భూముల్ని మింగేసిన ఆక్రమణదారుల పట్ల రెవెన్యూ యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. కబ్జా అని చెప్పిన అధికారులే చర్యలు తీసుకునేందుకు మాత్రం వెనకాడుతున్నారు. అనంతపురం గ్రామీణ మండలం ఇటుకలపల్లి పరిధిలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కంటితుడుపుగా బాధ్యులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే అధికారులు మౌనం వహిస్తున్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగింది?

ఇటుకలపల్లి పరిధిలోని సర్వేనంబరు 248లో 9 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని గతంలో దోబీఘాట్‌కు కేటాయించింది. ప్రస్తుతం బోర్డు ఉన్నప్పటికీ ఎవరూ వినియోగించుకోకపోవడంతో ఖాళీగా ఉంది. దీనిపై కన్నేసిన ఓ ఎంపీపీ ఆక్రమించేసుకున్నాడు. ముందుగా ఆత్మకూరు మండలానికి చెందిన వ్యక్తి పేరుతో రికార్డులు సృష్టించాడు. తర్వాత అతని నుంచి కొనుగోలు చేసినట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేందుకు సిద్ధం కాగా స్థానికులు ఫిర్యాదు చేశారు. బాధ్యులిద్దరికీ ఈ ఏడాది మార్చిలోనే నోటీసులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● ఇటుకలపల్లిలో ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది. గ్రామంలో భవిష్యత్తు అవసరాలకు అది మాత్రమే మిగిలింది. ఇంకా రికార్డుల్లో కబ్జాదారుల పేరే కొనసాగింపుతో అంతర్యమేంటో అర్థం కావడం లేదు. సర్కారు భూమిని కబ్జా చేసిన సదరు ఎంపీపీకి ప్రస్తుత ప్రభుత్వంలో పలుకుబడి ఉండటంతో తనపై చర్యలు లేకుండా జాగ్రత్త పడుతున్నాడు.

ముక్కుపచ్చలారని కొడుకుపై ముద్దులెన్నో గుమ్మరించి మురిపెంగా చూసిన తల్లి.. బుడిబుడి అడుగుల వెనకే పరిగెత్తుతూ కాలు కందనీయకుండా రక్షించిన ఆమె లాలన.. నిరంతరం శరీరంలోని అణువణువూ తన బిడ్డ గురించే ఆలోచించిన ఆ మనసు.. ఎందుకో మూగబోయింది. ఏ కన్నీళ్లు చుట్టుముట్టాయో, ఏ వేదన మరణ శాసనం రాసిందో.. తాను లేకపోతే బిడ్డ బతకలేడని చేయకూడని ఘోరాన్ని తన చేతులతోనే చేసింది. బిడ్డను చంపేసి చివరకు తానూ ఆత్మహత్య చేసుకుంది.

భర్త రవి, కుమారుడు సహస్రతో అమూల్య

నీవే నేనని.. నేను పోతే నీకెవరని?

● కొడుకును చంపి.. ఆత్మహత్య చేసుకున్న మహిళ
● భర్త రామగిరి మండల డిప్యూటీ తహసీల్దార్

అనంత నేరవార్తలు (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో గురువారం రాత్రి ఘోరం జరిగింది. ఓ మహిళ తన మూడున్నర ఏళ్ల వయసున్న కుమారుడిని చంపి, తాను ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. బోయ అమూల్య (30), బోయ రవి దంపతుల కుటుంబం నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియానికి ఎదురుగా ఎల్ఐసీ కాలనీ రిషితేజ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. వీరికి మూడున్నరేళ్ల కుమారుడు సహస్ర ఉన్నాడు. భర్త రవి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి భార్య అమూల్య తమ ఫ్లాట్లో ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే గదిలోనే చాప మీద చిన్నారి మృతి చెంది ఉన్నాడు. పిల్లాడి మెడపై గాయాలు ఉన్నాయి. పక్కనే కత్తి పడి ఉండటంతో తల్లే తొలుత కుమారుడిని చంపి, తర్వాత తాను అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన భర్త.. ఇంటి ప్రధాన తలుపు వేసి ఉండటంతో భార్యకు పలుమార్లు ఫోన్ చేశాడు. సమాధానం లేకపోవడంతో అపార్టుమెంటువాసులు, ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ ఘటనా స్థలానికి చేరుకుని ప్రధాన తలుపు, పడకగది తలుపులు పగలగొట్టి తెరిచి లోపలికి వెళ్లారు. ఘటనపై భర్తతోపాటు స్థానికులను విచారించారు. మృతదేహాలను సర్వజన వైద్యశాలకు తరలించారు. అఘాయిత్యానికి కారణాలు తెలియరాలేదు. మృతురాలిది కర్నూలు నగరం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదును బట్టి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. భార్యాభర్తలు రెండు రోజుల క్రితం గొడవపడినట్లు తెలిసింది. ఇద్దరి మధ్య మనస్పర్థల కారణంగానే ఘోరానికి పాల్పడి ఉంటుందని సమాచారం.

మొండికేసిన పీఏబీఆర్ గేటు

నీరు విడుదలలో మరింత జాప్యం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ అత్యవసర గేటు (షట్టర్) మొండికేసింది. పైకి ఎత్తడానికి శతవిధాల యత్నిస్తున్నా ఇంచు కూడా కదల్లేదు. ఐదు రోజులుగా శ్రమిస్తున్నారు. హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈలు కవిత, శ్రీనివాసులు, ఏఈ ఓబిరెడ్డి, తదితరులు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. సుమారు ఇరవై మంది సిబ్బంది విశ్వప్రయత్నం చేస్తున్నా గేటు కదలకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక అధికారులు తలపట్టుకుంటున్నారు. చివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు ప్రధాన సహాయకుడు కేవీ కృష్ణారావు, రాష్ట్ర జలవనరుల మెకానికల్ విభాగం సెంట్రల్ డిజైనర్ సంస్థ(సీడీఓ) ఈఈ విజయ్ శరత్, ఏఈ ప్రదీప్‌తో కూడిన సాంకేతిక అధికారుల బృందం పీఏబీఆర్ జలాశయానికి వచ్చింది. కుడి కాలువ సర్వీసు, అత్యవసర గేట్లను నిశితంగా పరిశీలించారు. వారి సమక్షంలోనూ అత్యవసర గేటును పైకి ఎత్తడానికి యత్నించినా ఫలితం శూన్యం.

గేటు వద్ద హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావుతో చర్చిస్తున్న అధికారులు కృష్ణారావు, విజయ్‌శరత్, తదితరులు

కర్ణాటక నుంచి ఇంజినీర్లు

ఆఖరు ప్రయత్నంగా అత్యవసర గేటుకు పెద్ద రంధ్రాలు పెట్టి నీటిని విడుదల చేయాలని భావిస్తున్నామని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు. కర్ణాటకలోని మంగళూరు నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు సమాచారం అందించారు. వారు శుక్రవారం రాత్రికి అనంతకు చేరుకునే అవకాశం ఉంది. శనివారం నిర్దేశిత పనులకు శ్రీకారం చుడతారు. గేటుకు పెట్టే రంధ్రాల ద్వారా నీటిని విడుదల చేస్తారు. సుమారుగా 2.5 టీఎంసీలు కుడికాలువ ఆయకట్టు, చెరువులకు ఇవ్వాలని నిర్ణయించారు. తాగునీటికి కనీసం మూడు టీఎంసీలను నిల్వ చేస్తారు. మొత్తమీ ప్రక్రియపై సీఈ నాగరాజు ఆరా తీస్తున్నారు. తాజా అంచనాల ప్రకారం కుడి కాలువకు నీటి విడుదలలో మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది. అన్నీ సవ్యంగా సాగితే ఈనెల 30న నీరు విడుదల చేసే వీలుంది.

రైతుల్లో ఆందోళన

పీఏబీఆర్ డ్యాంలో ప్రస్తుతం 5.386 టీఎంసీలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 700 క్యూసెక్కులు ఉండగా.. 460 క్యూసెక్కులు తాగునీరు, విద్యుత్తు ఉత్పత్తి.. తదితర వాటికి వినియోగిస్తున్నారు. రోజురోజుకు నీటి మట్టం పెరగడంతో జలాశయం వెనుక పంట పొలాలు మునిగే ప్రమాదం ఉందని రైతుల్లో ఆందోళన నెలకుంది. దీంతో డ్యాంలో నీటి మట్టాన్ని తగ్గించే చర్యలు తీసుకున్నారు. సీఈ నాగరాజు ఆదేశాల ప్రకారం జలాశయం క్రస్ట్ గేటు ఒక అర్ధ అడుగు పైకి ఎత్తి దాదాపు 300 క్యూసెక్కులు దిగువన ఉండే ఎమ్పీఆర్‌కు వదిలారు.

సమీక్షిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

అనంతపురం (మూడో రోడ్డు), న్యూస్‌టుడే: డిసెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. గురువారం జిల్లా కోర్టులో పోలీసు, రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీ కాబడిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు రాజీ చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రాజీకాదగిన క్రిమినల్ కేసులు డిసెంబరు 13న జరుగు జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. అడిషనల్ జిల్లా జడ్జి సత్యవాణి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్, జూనియర్ సివిల్ జడ్జిలు బాల కోటేశ్వరరావు, హారిక, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి పాల్గొన్నారు.

స్వామీ.. కోనేర్లు బాగయ్యేనా?

అనంతపురం (లక్ష్మీనగర్), న్యూస్‌టుడే: పలు ఆలయాల పరిధిలోని కోనేరుల పునరుద్ధరణ పనులపై డ్వామా అధికారులు దృష్టి సారించటం లేదు. నెలలు గడుస్తున్నా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరమ్మతు పనులు పూర్తి చేయని దుస్థితి. శిథిలావస్థకు చేరిన వాటిని గుర్తించి.. బాగు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మరమ్మతులు చేపట్టాలని రెండు నెలల క్రితమే సర్కారు ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు అధ్వానస్థితికి చేరిన కోనేరులను అధికారులు గుర్తించారు. పూడికను తీసేందుకు పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ నిధులను వినియోగించాలని... కూలీలతో పనులు చేయించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మండల ఇంజినీర్లు పరిశీలించి.. అంచనాలను తయారు చేసి పంపించారు. పొడవు, వెడల్పును బట్టి పునరుద్ధరణకు రూ. 80 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని నివేదించారు. ఇప్పటిదాకా పెన్నోహోబిలంలో ఒకటి, లేపాక్షిలో ఒక కోనేరు పనులు చేశారు. అనంతపురం జిల్లాలో గుర్తించినవి 57, శ్రీసత్యసాయిలో 17 కోనేర్లు ఉన్నాయి.

‘ఉపాధి హామీ’ ఇచ్చినా ఊసేలేని పనులు

● పూడికతీత పనులు చేపట్టడానికి భారీ క్రేన్‌లను వినియోగించాల్సి ఉంది. అవి అందుబాటులో లేకపోవడం, ఉపాధి కూలీలు కోనేరులో పనులు చేసేందుకు ముందుకు రావటం లేదని అధికారులు చెబుతున్నారు.

అనంతపురం జిల్లాలో గుర్తించినవి: అనంతపురం, ఆత్మకూరు, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె, గుత్తి, శింగనమల, గుంతకల్లు, కూడేరు, కుందుర్పి, పెద్దపప్పూరు, యాడికి, యల్లనూరులో ఒకటి చొప్పున.. కంబదూరు, పామిడి, తాడిపత్రిలో రెండు చొప్పున, బుక్కరాయసముద్రం, కణేకల్లులో 3 చొప్పున, ఉరవకొండ 5, వజ్రకరూరు 6, పెద్దవడుగూరు 11, విడపనకల్లులో 10 కోనేరులను మరమ్మతుల కోసం గుర్తించారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..: అమరాపురం, బత్తలపల్లి, బుక్కపట్నం, చిలమత్తూరు, కనగానపల్లి, లేపాక్షి, పుట్టపర్తి, సోమందేపల్లి, తాడిమర్రిలో ఒకటి చొప్పున, రొళ్ల, నల్లచెరువు 2, కదిరి 4 చొప్పున మరమ్మతులు చేయాల్సి ఉంది.

గుంతకల్లు మండలం తిమ్మాపురంలోని కోనేరు దుస్థితి

అవసరమైన చర్యలు చేపడతాం

- సలీంబాషా, విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఉపాధి హామీ పథకం కింద పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పలు కోనేరుల్లో నీరు ఉండటంతో మరమ్మతులు చేసేందుకు వీలు కావటం లేదు. త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. కొన్ని పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తిరస్కరించారు.

ఎందుకిలా చేశావు మావయ్యా..!

■ బావపై కోపంతో నాలుగేళ్ల మేనల్లుడి దారుణహత్య

కదిరి పట్టణం, నంబులపూలకుంట, తలుపుల, న్యూస్‌టుడే: చేయి పట్టుకొని నడిపిస్తుంటే మావయ్యకు తానంటే ఎంత ప్రేమో అని ఆ నాలుగేళ్ల బాలుడు మురిసిపోయాడు. అడిగినవన్నీ కొనిస్తుంటే తానే లోకమనుకున్నాడు. బైకుపై షికారుకు తీసుకెళ్తుంటే సంబరపడిపోయాడు. ముళ్లపొదల్లోకి తీసుకెళుతుంటే మావయ్య అనే ధీమాతో వెంట నడిచాడు. గొంతుపై చేయివేసి నులుముతుంటే మామే కాలయముడని తెలుసుకోలేకపోయాడు. ఎందుకిలా చేశావు మావయ్యా.. అని అడగాలనుకున్నా, అప్పటికే ఊపిరి ఆగిపోయింది. ఈ విషాద ఘటన శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం మరికొమ్మదిన్నె వద్ద చోటుచేసుకుంది. హత్యోదంతాన్ని గురువారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఘటనా స్థలంలో రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

చిన్నారి హర్షవర్ధన్

గొంతు నులిమి చంపేశాడు..

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గరికిపల్లిలో ఉంటున్న చంద్రకళ, గంగాధర్‌ల కుమారుడు హర్షవర్ధన్(4). బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. ఈమేరకు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం బాలుడి మృతదేహాన్ని గరికిపల్లికి 24 కిలోమీటర్ల దూరంలోని నంబుల పూలకుంట మండలం మరికొమ్మదిన్నె వద్ద ముళ్లపొదల్లో గుర్తించారు. బాలుడి మేనత్త భర్త ప్రసాద్ ప్రణాళిక ప్రకారం ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి హతమార్చాడు. గంగాధర్‌పై కక్షతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమారుడి చికిత్సకు బావ గంగాధర్‌ను ప్రసాద్ సాయమడిగాడు. అంతకుముందు గంగాధర్ డబ్బు సాయం చేశాడు. తన వద్ద ప్రస్తుతం డబ్బు లేదన్నాడు. మరోవైపు ప్రసాద్‌కు ఆయన భార్యతో ఏర్పడిన గొడవలో సర్దిచెప్పకపోవడం కోపం తెప్పించింది. ఈ నేపథ్యంలో గంగాధర్‌పై కక్ష తీర్చుకునేందుకు పథకం ప్రకారం హర్షవర్ధన్‌ను ఎత్తుకెళ్లి గొంతు నులిమి హత్యచేసి ముళ్లపొదల్లో పడేశాడు. త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని ఎస్పీ వివరించారు. అదృశ్యం కేసును పోలీసులు హత్య కేసుగా మార్చారు.

ఓటర్ మ్యాపింగ్‌పై దృష్టి సారించాం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అనంత జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా (సర్) ప్రక్రియపై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, ఈడీటీ..వంటి కేడర్లకు ఒక్కరోజు శిక్షణ కల్పించామన్నారు. జిల్లాలో ఇప్పటికే 25.91 శాతం ఓటర్లకు సంబంధించి మ్యాపింగ్ చేశామన్నారు. కొత్తగా 330 పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. వీటికి కొత్త బీఎల్వోలను నియమించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఇప్పటికే బీఎల్వోలకు కొత్త ఐడీలను ఇచ్చామని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో నూతన పాఠ్యాంశాలు

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనిత

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో నూతన పాఠ్యాంశాలు అమలు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత పేర్కొన్నారు. సీడీసీ డీన్ ఆచార్య రామగోపాల్ అధ్యక్షతన గురువారం ఎస్కేయూ అనుబంధ కళాశాలలు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో నూతన సిలబస్ రూపొందించామన్నారు. ప్రతి విభాగానికి చెందిన ఛైర్మన్లు, అధ్యాపకులు డిగ్రీ పాఠ్యాంశాలు విద్యార్థులకు అవసరమేయ్య విధంగా రూపకల్పన చేశారన్నారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడానికి, ఉపాధి పొందడానికి అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేశామన్నారు. పారిశ్రామిక రంగాలతో అనుసంధానం చేస్తూ సిలబస్ రూపొందించామన్నారు. పరీక్షల విభాగం పర్యవేక్షణ అధికారి శ్రీరాములు నాయక్, ఆచార్య మునినారాయణప్ప పాల్గొన్నారు.

అరటి టన్ను రూ.7500కు కొనుగోలు చేస్తాం

యాడికి, న్యూస్‌టుడే : అరటి దిగుబడి టన్ను రూ. 7500 కొనుగోలు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారిణి ఉమాదేవి పేర్కొన్నారు. యాడికి మండలంలోని రాయలచెరువు, లక్షుంపల్లి, చందన గ్రామాల్లో పంటకోత చేపట్టిన తోటలను గురువారం ఆమె పరిశీలించారు. లోకల్ రకం అరటిని కిలో ఐదు, ఆరు రూపాయలతోనూ, ఐఎన్ఐ, కమల్ రకాలను టన్ను రూ. 7500లతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అరటి పంటకు సిగటోక తెగులు సోకకుండా తోటలో కలుపు మొక్కలను తొలగించాలన్నారు. ఈ తెగులు రకరకాలుగా వ్యాపిస్తుందన్నారు. వీటికి నివారణకు ప్రొపిజోల్, కార్బండజం, మంకోజబ్ మిశ్రమం చేసి పిచికారీ చేయాలని సూచించారు. తెగులు వ్యాపించకముందే నివారణ చర్యలు ముఖ్యమని రైతులకు అవగాహన కల్పించారు. వీహెచ్ఏ జయలక్ష్మి, వీఏఏ పవన్ పాల్గొన్నారు.

రైతులకు భరోసా ఇస్తున్న ఉద్యానశాఖ అధికారిణి ఉమాదేవి



తానా అంతర్జాతీయ సమ్మేళనానికి ఆహ్వానం

జయశ్రీ శైలజ

గుంతకల్లు: అమెరికాకు చెందిన తానా ఈనెల 30న నిర్వహించనున్న (అంతర్జాలంలో) అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి గుంతకల్లు మండలం తిమ్మాపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇరువురు బాలికలు ఎంపికయ్యారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జయశ్రీ, శైలజలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ రెడ్డి, తెలుగు పండితుడు చంద్రమోహన్ తెలిపారు. బాలికలు ఇరువురు ఇంతకుముందే తానాకు వారి కథలను తెలియజేయడంతో సమ్మేళనంలో పాల్గొనడానికి ఎంపిక చేశారన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో పరిమళించిన క్రీడాకారుల ప్రతిభ

పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ పాటవాలతో పతకాలు సాధించారు. కోనసీమలో జరిగిన ఈ పోటీల్లో ఆటగాళ్లు ప్రత్యర్థులను చిత్తుచేసి పతకాలతో సగర్వంగా తిరిగొచ్చారు. బాలుర విభాగంలో కేఎండీ రియాన్ సూరజ్ బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. టీమ్ ఈవెంట్‌లో జి.గౌతం, ఎం.కార్తిక్, రియాన్ సూరజ్‌లు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. శాబర్ టీమ్ ఈవెంట్‌లో రాకెట్ల జడ్పీ ఉన్నత పాఠశాల బాలురు దర్శన్, హర్షవర్ధన్, సి.వసంత్‌లు కాంస్య పతకాలు సాధించారు. బాలికల ఫాయిల్ విభాగంలో వందన, అంజనా మనోజ్ఞ, ఎ.మానస, సురేఖలు, శాబర్ విభాగంలో నందిని, ఎ.అంకిత, విజయలక్ష్మి, కె.నందినిలు మూడో స్థానంలో నిలిచారు. పతకాలతో తిరిగొచ్చిన క్రీడాకారులను జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, ఫెన్సింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, డీఎస్ఏ ఫెన్సింగ్ శిక్షకుడు ప్రతాప్, పీడీలు చంద్రశేఖర్, రవికుమార్‌లు అభినందించారు.

నేడు కదిరిదేవరపల్లి పరిధిలో రైల్వే ట్రాక్ పరిశీలన

కంబదూరు, న్యూస్‌టుడే: కదిరిదేవరపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం సాధారణ ట్రాక్ పరిశీలన చేసేందుకు బళ్లారి నుంచి కంబదూరుకు రైలు రానున్నట్లు సంబంధిత నైరుతి రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మధ్యాహ్నం రైలు వచ్చే సమయానికి మూగ జీవాలతో పాటు ప్రజలు ట్రాక్‌పై లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

RAMOJI GLAMPING

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

నేటి నుంచి ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీలు

లక్ష్మీనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సులను ఈ నెల 28 నుంచి డిసెంబరు 4 వరకూ తనిఖీలు చేస్తామని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో బస్సుల్లో ప్రధానంగా భద్రతాపరమైన అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్లు ఏర్పాటు వాటి పనితీరు, రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. బస్సులను నిబంధనలకు అనుగుణంగా నడపాలని తెలియజేస్తూ యజమానులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించే తనిఖీల్లో బస్సుల్లో లోపాలున్నా, రికార్డులు సక్రమంగా లేకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జ్యోతుల పరస.. భూతప్పల ఉత్సవం

భక్తరపల్లి, జిల్లడగుంటలో బ్రహ్మోత్సవాలకు వేళాయె..

అలంకరణలో జిల్లడగుంట ఆంజనేయస్వామి

ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మడకశిర (గ్రామీణం), న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వాములను భక్తులు కొలుస్తున్నారు. వ్యాసరాయలు అప్పట్లో ఈ భక్తరపల్లిలో తిరిగారని, ఆ సమయంలో భోజనం వండుకునేందుకు మూడు సాలిగ్రామాలను పొయ్యిగుండ్లుగా పెట్టి భోజనం వండారని, అప్పట్లో ఒక సాలిగ్రామ ఇక్కడే ఉండిపోయిందని అందులోనే లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించారని పెద్దలు, అర్చకులు చెబుతున్నారు.

ఈనెలాఖరు నుంచి డిసెంబరు 8 వరకు

ప్రతి ఏడాది డిసెంబరు మాసంలో భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో ప్రధాన ఘట్టం జ్యోతుల పరస, భూతప్పల ఉత్సవం. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారు.

- ఈనెల 30న అంకురార్పణ, డిసెంబరు 1న ధ్వజారోహణం, 2న పవమాన హోమం, 3న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 4న బ్రహ్మరథోత్సవం, 5న జ్యోతుల పరస, భూతప్పల ఉత్సవం, 6న పూలపల్లకి, 7న కంబాల నరసింహస్వామికి జ్యోతుల ఉత్సవం, 8న వసంతోత్సవం.

భక్తితో నైవేద్యం

బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టం భూతప్పల ఉత్సవం. జిల్లడగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి భూతప్పలను ఊరేగింపుగా తీసుకొచ్చి నైవేద్యం సమర్పిస్తారు. అక్కడి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునే క్రమంలో మొక్కుబడి ఉన్న భక్తులు తడిబట్టలతో స్వామివారు వచ్చే దారిలో అడ్డంగా పడుకుంటారు. భూతప్పలు భక్తులపై నడుచుకుంటూ వెళ్తారు. వారి కాలి స్పర్శ తగిలితే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని... సంతానం కలుగుతుందని, పెళ్లి జరుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటారు.

వీఆర్‌కు యాడికి సీఐ

యాడికి, న్యూస్‌టుడే: యాడికి యూపీఎస్ సీఐ ఈరన్నను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఇక్కడ గతేడాది ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ నెల జిల్లా ఎస్పీ జగదీశ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సమయంలో నేరాల నియంత్రణ, దస్త్రాల నిర్వహణ అసంపూర్తిగా ఉండటం తదితర లోపాలు వెలుగుచూశాయి. పరిపాలన విభాగంలో భాగంగా ఉన్నతాధికారుల నుంచి వీఆర్‌కు పంపుతూ గురువారం ఆదేశాలు అందాయి. ఇక్కడికి ఇన్‌ఛార్జిగా పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్యను కేటాయించారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ గడువు పెంపు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గత బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబరు 3 వరకు గడువు పొడిగించారని సంచాలకులు ఖుష్బు కొఠారి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 7న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది.

రైతులకు ఆదాయం పెంచడమే లక్ష్యం

మాట్లాడుతున్న కేంద్ర నోడల్ అధికారి సుజాత శర్మ, కలెక్టర్ ఆనంద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అన్నదాతలు నష్టపోకుండా మార్కెటింగ్ ఆధారంగా ఆదాయం పెంచడమే లక్ష్యం. మంచి దిగుబడి వచ్చే పంటలనే సాగు చేసేలా వారిలో అవగాహన కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శి, పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం నోడల్ అధికారి సుజాత శర్మ పేర్కొన్నారు. గురువారం అనంత పర్యటనకు ఆమెకు కలెక్టర్ ఆనంద్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఆ తర్వాత కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో వ్యవసాయం, దాని అనుబంధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. సుజాతశర్మ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నెలకున్న అంతరాలను గుర్తించి.. వాటిని ఏ విధంగా తొలగించాలో అధ్యయనం చేయాలి. ఆదాయం మెండుగా వచ్చేలా రానున్న ఆరేళ్లకు కార్యాచరణ తయారీ చేయాలని సూచించారు. ధన్‌ధాన్య కృషి యోజన పరిధిలోకి 11 శాఖలకు చెందిన 36 పథకాలను కలిపి అమలు చేస్తున్నామన్నారు. నిర్దేశిత శాఖల అధికారులు సమన్వయం, సఖ్యతతో పనిచేస్తేనే ఫలితాలు వచ్చేదన్నారు. మామిడి, అరటి వంటి పంటలకు సంబంధించి 30శాతం స్థానికంగా అమ్మకాలు సాగాలి. తక్కిన 70శాతం ఎగుమతి చేసేలా ఉండాలన్నారు. కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణ శర్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి లేఅవుట్ క్రమబద్ధీకరణ చేయాలి

వినతులు స్వీకరిస్తున్న వరుణ్, జేసీ శివనారాయణ శర్మ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అహుడా పరిధిలోని ప్రతి లే అవుట్ క్రమబద్ధీకరణ కావాలని ఛైర్మన్ వరుణ్, జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. గురువారం అహుడా కార్యాలయంలో ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అక్రమ లేఅవుట్‌లో ఎక్కడైనా వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఐజీల్లో ప్రతి ఫ్లాట్ కొనుగోలు దారుకు మెరుగైన సేవలు అందాలన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కంబదూరు పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి అశ్వర్థరెడ్డిపై సస్పెన్షన్ వేటుపడింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వహించిన కారణంగా అతన్ని సస్పెండ్ చేసినట్లు డీపీఓ నాగరాజునాయుడు తెలిపారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్లో ఇంటిపన్ను వివరాలు నమోదు చేయడంలో భాగంగా 3,714 కుటుంబాలకు ఒకే ఫోన్ నంబరు అనుసంధానం చేయడం వల్ల అతన్ని సస్పెండ్ చేశారు. వివరాలు సరిగా నమోదు చేయని కార్యదర్శులను సస్పెండ్ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే ఆయనపై చర్యలు తీసుకున్నారు. అలాగే డీపీఓ నాగరాజునాయుడుపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ కమిషనర్ వీసీలో హెచ్చరించారు.

గాడితప్పిన సాగునీటి కాలువల పర్యవేక్షణ

- అధ్వానంగా రహదారులు
- అధికారుల తీరుపై రైతుల అసహనం

అధ్వానంగా గుంతకల్లు బ్రాంచ్ కాలువ రోడ్డు

గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే : హెచ్చెల్సీ సర్కిల్ గుంతకల్లు డివిజన్ పరిధిలోని కాలువలకు సంబంధించిన రోడ్లు పాడైపోయాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. రోడ్లు సక్రమంగా లేక పోవడంతో డివిజన్‌లో పని చేసే ఇంజినీర్లు, సిబ్బంది కాలువను, ఆయకట్టును పర్యవేక్షించడానికి అక్కడికి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా కాలువల పర్యవేక్షణ దారితప్పింది. దీంతో నీటి సరఫరాను సక్రమంగా అమలు చేయక పోతుండటంతో ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు.

గుత్తి బైపాస్ కాలువకు రోడ్డు వేయని తీరు

గుత్తి ఉపకాలువ రోడ్డూ అంతే

గుత్తి ఉపకాలువకు సంబంధించి గుంతకల్లు నుంచి గుంతకల్లు కొట్టాల వారు రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. వాహనాలు వెళ్లలేవు. ఇక గుత్తి బైపాస్ కాలువను ఏర్పాటు చేసి 20 ఏళ్ల వుతున్నా ఇప్పటికీ కెనాల్ రోడ్డు నిర్మించలేదు. ఫలితంగా సిబ్బంది కాలువను పరిశీలించడానికి కాలువ మీదుగా వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. కాలువ నిర్మాణ సమయంలోనే రోడ్డు వేయాల్సింది.. అలా చేయకపోడంతో ఆయకట్టు పర్యవేక్షణ నామమాత్రంగా ఉంటోంది. గుంతకల్లు బ్రాంచ్ కాలువ, గుత్తి ఉపకాలువ కింద దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు ఉండటం గమనార్హం.

నాలుగు మండలాల గుండా కాలువ

డివిజన్ పరిధిలోని గుంతకల్లు బ్రాంచ్ కాలువ పొడవు 58 కి.మీ.లు. ఈ కాలువ ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల గుండా వెళుతోంది. కాలువకు, రోడ్డుకు చెందిన నిర్మాణాలు చాలాచోట్ల నేలమట్టమయ్యాయి. కొన్ని చోట్ల వంతెనల రక్షణగోడలు కూలిపోయాయి. రోడ్డుమీదుగా వాహనాల్లో వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉంది. గుంతలకు మట్టి తోలినా ప్రయోజనం ఉండటం లేదు. వర్షాకాలంలో గుంతల్లోకి నీరు చేరుతోంది. బురద దారిలో వాహన రాకపోకలకు కష్టంగా ఉంటోంది. తాత్కాలిక మరమ్మతుల పేరుతో నిధులు వృథా చేస్తున్నారు.

ప్రణాళికలు తయారు చేస్తున్నాం

కాలువల పక్క దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించాం. అవసరమైన ప్రణాళిక తయారు చేస్తున్నాం. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. గుంతకల్లు బ్రాంచ్‌కాలువకు కొంత వరకు మరమ్మతులు చేశాం. ఇంకా పూర్తిస్థాయిలో పనులు చేయాల్సి ఉంది. దీంతో పాటు గుత్తి బైపాస్ కాలువకు ఆయకట్టు రోడ్డును నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- వెంకటరమణ, ఈఈ, గుంతకల్లు డివిజన్**

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

JOBS

Royaloak Furniture - Walk - In - Interview. Sales Executives & Asst. Manager. Date: 30-11-2025. Venue: Royaloak Furniture Showrooom, Anantapur.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. శ్రీ వసతి, భోజనం, జీ:18K ✆ 96402 58899, 96404 68899

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in BLOSSOMS SCHOOL, Aravind Nagar, ATP. Mob: 90307 77676.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైములుతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

The A.P. State Seeds Development Corporation Limited
UNIT OFFICE :PRASANNAYAPALLI : ANANTHAPURAMU
Email :apseedsantp@gmail.com

APSSDC

తేది: 28-11-2025

టెండరు ప్రకటన

అనంతపురము యూనిట్‌కు సంబంధించిన ఈ క్రింద తెలియపరిచిన మొలక శాతం తగ్గిన వేరుశనగకాయలు, వేరుశనగ రిజెక్షన్ మరియు కొర్రలు టెండరు/ వేలము పద్ధతిలో తేది: 03.12.2025న కొనుగోలు చేయుటకు ఆసక్తిగల వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నది. ఆసక్తిగలవారు రూ.500.00 చెల్లించి టెండరు షెడ్యూల్‌ను అనంతపురము ఆఫీసు నందు తేది: 01.12.2025 నుండి తేది: 03.12.2025 మధ్యాహ్నం 1 గం॥లోపు పొందవచ్చును. టెండరుతోపాటు క్రింద తెలియపరిచిన ధరావత్తు (E.M.D) ని APSSDC Ltd., Ananthapuramu వారి పేరు మీద చెల్లించి అదేరోజు మధ్యాహ్నం 2 గం॥లలోపు టెండరు బాక్సులో వేయవలెను. తేది:03.12.2025న మధ్యాహ్నం 3గం॥ లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును.

వ సం	సరుకు వివరములు	పరిమాణం (క్వింటాళ్లలో/ నంబర్లలో)	ధరావత్తు సొమ్ము (EMD) In Rs.
1	వేరుశనగకాయలు TCGS-1694 రకము	71.10	50,000/-
2	కొర్ర SIA-3156	23.36	
3	వేరుశనగకాయలు TCGS-1694 రిజెక్షన్	24.80	
	Total	119.26	

సంప్రదించవలసిన సెల్ నెం: 1) జిల్లా మేనేజరు (విత్తనములు), ఏ.పి.యస్.యస్.డి.సి లిమిటెడ్, అనంతపురము 9849908751. 2) T.మదన్ మోహన్ Asst. Accountant, 9885081314

ఇట్లు: సం/-జిల్లా మేనేజర్ (సీడ్స్), ఏ.పి.సీడ్స్, అనంతపురము

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : అనంతపురం
రికవరీ సెక్షన్, రైల్వే స్టేషన్ దగ్గర, శ్రీనివాసనగర్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, తాడిపత్రి బ్రాంచ్ వారికి ఋణగ్రహీత : శ్రీ సగిల నారాయణ, తండ్రి: అశ్వర్థ, హెచ్.నెం.15/818-3, భగత్‌సింగ్ నగర్, తాడిపత్రి, ఆంధ్రప్రదేశ్-515411. హామీదారు : శ్రీ జి. రాముడు, తండ్రి: తిరుపాలు, హెచ్.నెం. 819-1, 15వ వార్డు, భగత్‌సింగ్ నగర్, తాడిపత్రి, ఆంధ్రప్రదేశ్-515411వారు తేది.20.05.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ. 4,90,435.46/- (అక్షరాల నాలుగు లక్షల తొంభై వేల నాలుగు వందల ముప్పై ఐదు రూపాయల నలభై ఆరు పైసలు మాత్రమే) మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, తాడిపత్రి బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది.30.12.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 30.12.2025, ఉ॥ 11.45 గం.ల నుండి మ॥ 12.45 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు తేది: 29.12.2025, సా॥ 5.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

అనంతపురం ఆర్‌డి పరిధి, తాడిపత్రి యస్‌ఆర్‌డి మరియు తాడిపత్రి గ్రామ పొలం (15వ వార్డు, తాలూక ఆఫీస్ వెనుక, హరిజనవాడ, ఇంటి డి.నెం: 15/813 ప్రక్కన, తాడిపత్రి మున్సిపల్ ఏరియా), సర్వే నెం: 618-ఎ, పూర్తి విస్తీర్ణం: ఎ. 0-03 సెంట్లు ఇందులో, వాస్తవిక విస్తీర్ణం: 0-01 1/2 సెంట్లు భూమి మరియు బిల్డింగ్. హద్దులు: తూర్పు: 20 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: 20 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: అదే సర్వే నంబర్‌లో పి. మహమ్మద్ బహిరంగ స్థలం, దక్షిణం: అదే సర్వే నంబర్‌లో నాగేంద్ర రెడ్డి బహిరంగ స్థలం. కొలతలు: తూర్పు-పడమర: 51 అ॥లు లేదా 15.55 మీ॥, ఉత్తరం-దక్షిణం: 12 1/2 అ॥లు లేదా 3.81 మీ॥. మొత్తం: 70.83 చ॥గ॥. సెర్సాయ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఐడి: 400007945489. టైటిల్ హోల్డర్: శ్రీ సగిల నారాయణ.

రిజర్వు ధర: రూ. 14,59,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 1,45,900/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తాడిపత్రి బ్రాంచ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 99443 39812.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 26.11.2025, ప్రదేశం: తాడిపత్రి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

వక్క అక్రమ రవాణాపై డీలర్లకు తాఖీదులు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి ఈ-వేబిల్లు లేకుండా దిల్లీకి వక్కలను రవాణా చేస్తున్న మూడు లారీలను గుత్తి సమీపంలో నవంబరు 18న స్వాధీనం చేసుకుని, సదరు డీలర్లకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తాఖీదులు జారీ చేశారు. ఒక్కొక్క లారీకి రూ.20 లక్షలు ప్రకారం మూడు లారీలకు రూ.60 లక్షలు అపరాధ రుసుం కట్టాలని అధికారులు తాఖీదు జారీ చేశారు. అపరాధ రుసుం చెల్లించడానికి నిబంధనల ప్రకారం డీలరుకు 30 రోజులు గడువిచ్చి, ఆ తర్వాత అపరాధ రుసుం చెల్లించడానికి ముందుకు రాని పక్షంలో వక్కలు వేలం వేసి, ఆ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నారు.

ప్రైవేట్ బ్యాంకు వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంకు వద్ద కమ్మాన్‌చెట్ల వీధికి చెందిన శైలు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బ్యాంకులో బాధితురాలు కొంత బంగారు ఉంచిందన్నారు. అది దొంగ బంగారు కావడంతో కర్ణాటక పోలీసులు ఇటీవలే బ్యాంకు వచ్చి బంగారు పై అనుమానం ఉందని దానిని బ్యాంకర్లకు లేఖ ఇవ్వగా ఆ ఉద్యోగులు ఆ ఖాతాను హోల్డ్‌లో ఉంచారన్నారు. బంగారు తీసుకొచ్చేందుకు బ్యాంకు వద్దకు ఆమె వచ్చింది. పోలీసుల అనుమతి కావాలని అక్కడి అధికారులు చెప్పగా, తన బంగారు ఇవ్వడంలో ఎందుకు ఇలా చేస్తున్నారని ఆవేశానికి లోనైంది. బ్యాంకు వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు దీనిపై విచారణ చేపడుతున్నారు.

మనోవేదనతో రైతు బలవన్మరణం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నకోట్లకు చెందిన రైతు లక్ష్మీనారాయణ (72) ఆత్మహత్యకు యత్నించి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. లక్ష్మీనారాయణ కొన్నేళ్లుగా కిడ్నీ సమస్య, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మనోవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో 25న భార్య ఇంట్లో లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సుబ్బలక్ష్మమ్మ, ముగ్గురు కుమారులున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

నాలుగు ఎకరాల సీడ్ జొన్న పంట ధ్వంసం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని కల్లుదేవనహళ్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రిస్వామి, గిరిజమ్మ అనే రైతులకు సంబంధించిన సీడ్ జొన్న కంకిని కోత కోసి పొలంలో పడేసి తీవ్రంగా నష్టపరిచినట్లు బాధితులు తెలిపారు. తల్లి, కుమారుడు గ్రామంలో తమ ఎకరా భూమితో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని ప్రైవేట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని సీడ్ జొన్న పంట సాగు చేశారు. బుధవారం పొలంలో తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. అర్ధ రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఎకరాకు పైగా జొన్న కంకిని కోత కోసి కింద పడేసి సొప్పును ధ్వంసం చేశారు. రూ.లక్ష వరకు అప్పుచేసి పెట్టుబడి పెట్టామని, గిట్టని వారే ఈఘాతుకానికి ఒడిగట్టారని లబోదిబోమని వాపోయారు. తమకు అన్యాయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయులకు తాఖీదులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికలో గందరగోళ పరిస్థితికి కారణమైన ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారి తాఖీదులు జారీ చేశారు. కణేకల్లు మండలం యర్రగుంట్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడికి తాఖీదులు ఇచ్చారు. తపోవనం పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు కమిషనర్ వద్దకు విచారణకు వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అనంత నేరవార్తలు: అనంతపురం నగరంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని పొట్టి శ్రీరాములు కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రహీం (20), ఎర్రనేల కొట్టాలకు చెందిన కశ్యప్ మిత్రులు. వీరు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై రిలయన్స్ మార్ట్ వైపు నుంచి సైపుల్లా వంతెన మీదుగా వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి ఎడమవైపున ఉన్న ప్లాట్‌ఫాంను వేగంగా ఢీకొట్టింది. వేగ తీవ్రతకు వాహనం పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న రహీం తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. వెనుక కూర్చున్న కశ్యప్ తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు ఒకరు.. మందలించారని మరొకరు

పురంలో యువతీయువకుల మృతితో విషాదం

హిందూపురం,న్యూస్‌టుడే: హిందూపురం, పూలకుంటకు చెందిన యువతి, యువకులు గురువారం మృతిచెందటంతో పట్టణంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి. పూలకుంటకు చెందిన హనుమంత(19) గురువారం ఉదయం తన స్వగ్రామానికి వచ్చి తిరిగి బెంగళూరుకు వెళ్లే సమయంలో గ్రామీణ మండలం అప్పలకుంట వద్ద బస్సును దాటే సందర్భంగా పొగమంచు కారణంగా ప్రమాదానికి గురై తలకు బలమైన దెబ్బ తగలటంతో దుర్మరణం చెందాడు. ఇతడి తండ్రి అంజినప్ప బెంగళూరులో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తుండగా హనుమంత టీవీ టవర్స్‌లో పనిచేస్తున్నాడు. ఇతని మృతి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సంఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

భానుతేజ

టీవీ, చరవాణులను అధికంగా చూస్తోందని కుటుంబ సభ్యులు మందలించటంతో పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన భానుతేజ(18) గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు. భానుతేజ సేవామందిర్‌లోని ఎన్‌లైట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ బీబీఏ చదువుతున్నట్లు వివరించారు. విద్యార్థిని తండ్రి నరసింహులు ఉల్లిపాయల వ్యాపారం చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె ఇలా చనిపోవటంతో కుటుంబం విషాదానికి లోనైయింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రధాన కూడలిలో ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు, స్థానికులు

తలుపుల, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని నాలుగేళ్ల హర్షవర్ధన్‌ను హత్య చేసిన నిందితుడు ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు, స్థానికులు గురువారం రాత్రి తలుపుల ప్రధాన కూడలిలో వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంధువులపై ఏవైనా గొడవ లుంటే వారితోనే చర్చించి తేల్చుకోవాలే తప్ప అమాయకులైన పిల్లల జోలికి వెళ్లడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితుడిని కఠినంగా దండించాలన్నారు. ర్యాలీలో సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, హసన్, సిద్ధయ్య, తలుపుల ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వజ్రకరూరు: నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం వజ్రకరూరులో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపేవారిని అదుపు చేసి, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఉరవకొండ సీఐ మహానంది, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

10న సీపీఐ వందేళ్ల వేడుక

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: చరిత్రాత్మక ఉద్యమాలు చేసిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుక డిసెంబరు 10న నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. గురువారం పట్టణానికి వచ్చిన ఆయన సీపీఐ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులుతో కలిసి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి కావడంతో పోరాట యోధుల కుటుంబాలకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: చెర్లోపల్లిలోని వీధులలో అపరిశుభ్రత నెలకొంది. - గోవిందు

సమస్య: ఐపార్లపల్లిలో రోడ్లపై వృథా నీరు పారుతోంది. - గంగప్ప

సమాధానం: పై సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. -సురేష్, పంచాయతీ కార్యదర్శి, పాల్తూరు. -న్యూస్‌టుడే, కంబదూరు

పూర్వ ప్రాథమిక విద్యకు ఊతం

పైలెట్ ప్రాజెక్టుగా కళ్యాణదుర్గం

అవగాహన కల్పిస్తున్న ఎంఈవో విజయకుమారి, సీడీపీవో లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోనే కళ్యాణదుర్గం శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టులోని కళ్యాణదుర్గం మండలం పైలెట్‌గా ఎంపికైంది. ప్రభుత్వం పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో అంగన్‌వాడీ కార్యకర్త మమేకమై పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. దీనిపై శిశుసంక్షేమశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా అన్ని ఏర్పాట్లతో పాటు బోధన చేసేందుకు సిద్ధం కానుంది.

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు : 84
అంగన్‌వాడీ కేంద్రాలు: 122
మ్యాపింగ్ అయ్యేవి : 55 పాఠశాలలకు 72 అంగన్‌వాడీ కేంద్రాలు

ఉపయోగాలివిగో!

- అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి సంబంధించి స్థలం ఉంటే రెండు గదులు నిర్మించి, వంట గది, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తారు. స్థల సౌకర్యం లేని చోట్ల ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పరిశీలించి ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి పంపుతారు.
- తల్లిగర్భం నుంచే శిశువు మెదడు పెరుగుదల ప్రారంభం అవుతుంది. పుట్టిన 8 ఏళ్లలోపే 85 శాతం మెదడు పెరుగుదల ఉంటుంది. ఆ దశలోనే పూర్వప్రాథమిక విద్యకు పునాది వేయడంతో ద్వారా పిల్లల బంగారు భవిష్యత్తు బాటలు వేయడానికి ప్రేరణ జరుగుతుంది కాబట్టి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.
- 5 ఏళ్ల తరువాత అంగన్‌వాడీ విద్య నుంచి పిల్లలు బడిమానకుండా ఒకే ఆవరణలో 3-8 సంవత్సరాల వరకు సమగ్రాభివృద్ధికి అవకాశాలు అందుతాయి.

సమగ్ర విద్యాబోధనకు తోడ్పాటు

కేంద్రాల్లో వసతులతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను బోధించడానికి పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల ద్వారా సమగ్ర విద్యాభివృద్ధి బోధన ఎంతో తోడ్పాటు కలుగుతుంది. కేంద్రాల్లో ఇతర సామాజిక కార్యకర్తలు నిర్వహించాలంటే అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 9-12 గంట వరకు కచ్చితంగా కేటాయిస్తూ మధ్యాహ్నం 1-4 గంటల వరకు ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. -లక్ష్మీప్రసన్న, సీడీపీవో

మేధో సంపతి పెరుగుతుంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు పాఠశాల స్థాయి బోధనతో మార్పులతో విద్యార్థులు ఆకర్షితులవుతారు. అదే ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఉండటంతో ఇతర పాఠశాలలకు వెళ్లే అవకాశాలు ఉండవు. బోధనలో మార్పులు రావడంతో విద్యార్థుల్లో మేధోసంపత్తి పెరుగుతుంది. ఇక ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వైపు ఆస్కారం ఉండదు. పూర్వప్రాథమిక విద్య బలోపేతం కానుంది. -విజయకుమారి, ఎంఈవో

పోటీలతో నైపుణ్యాభివృద్ధి

బహుమతులు అందుకున్న విజేతలతో ప్రిన్సిపల్ పద్మజాదేవి, పీడీ శ్రీనాథ్

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పద్మజాదేవి అన్నారు. గురువారం ఆదర్శ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో 9వ తరగతి చదువుతున్న త్రిజిత ప్రథమ, పదో తరగతి గౌతమ్‌ప్రేమ్ ద్వితీయ, తొమ్మిదో తరగతి చదువుతున్న రాఘవేంద్ర తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్, పీడీ శ్రీనాథ్ బహుమతులు అందజేశారు.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అసహనం

కుందుర్పిలో పరిశీలిస్తున్న సీఈవో శివశంకర్

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లోని చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం కరిగానిపల్లి, అపిలేపల్లి, కుందుర్పిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల పనితీరు, నిర్వహణ అస్తవ్యస్తం ఉండటంపై ఆయా పంచాయితీ కార్యదర్శులు, సిబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం గ్రామ పంచాయితీల్లో సేకరించిన తడిచెత్త, పొడి చెత్త ఎరువుల తయారీ తొట్టెల్లో లేని విషయంపై మండిపడ్డారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తయారీ కేంద్రాలను పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్వీర్యం చేయడం తగదన్నారు. వారం రోజుల్లో మండల కేంద్రంతో పాటు అన్ని పంచాయితీల్లోనూ చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించాలని ఎంపీడీఓ మాధవిని ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపీడీఓ రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీ

రాయదుర్గం పట్టణం: మండలంలోని కదరంపల్లి సమీపంలో 544డీడీ జాతీయ రహదారిపై గురువారం ఉదయం ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఓ ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈఘటనలో ఇద్దరు ప్రయాణికులతో పాటు రోడ్డు పక్కన వెళ్తున్న మరో వ్యక్తికి బస్సు తాకడంతో స్వల్పగాయాలయ్యాయి. రాయదుర్గం వైపు నుంచి అనంతపురానికి ఆర్టీసీ బస్సు వెళుతూ బోలిగొండ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నిస్తూ అదుపు తప్పి ఢీకొంది. ఈఘటనపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో సీసీకి గాయాలు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వెలుగు సీసీ మంజునాథ్ తీవ్రంగా గాయపడ్డారు. విడిపల మగినంపల్లి గుండ్లపల్లి మీదుగా కళ్యాణదుర్గం వెళుతుండగా జాతీయ రహదారిపై కుక్కఅడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడి కిందకి పడిపోయాడు. చేతులకు, తలకు గాయాలవడంతో 108లో కళ్యాణదుర్గం తరలించారు.

విద్యుదాఘాతంతో రైతుకు..

కణేకల్లు: ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి విద్యుదాఘాతంతో రైతు ఉమేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన బెణికల్లు గ్రామంలో గురువారం జరిగింది. రైతు పొలంలో పనులు చేసుకుంటుండగా స్టార్టర్ పెట్టెకు విద్యుత్తు సరఫరా చేసే తీగలు తగులుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రైతుకు ముప్పు తప్పింది. పక్కన పొలాల రైతులు గమనించి బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు బాధితులు వివరించారు.

తప్పిన పెనుప్రమాదం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : బొమ్మనహాళ్ హెచ్చెల్సీ కార్యాలయం వద్ద అంతర్రాష్ట్ర రహదారికి పెద్ద ఎత్తున పడిన గుంతల కారణంగా గురువారం ద్విచక్రవాహనం, టిప్పర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఉద్దేహాళ్‌కు చెందిన బాషా బళ్లారి వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా బొమ్మనహాళ్ సమీపంలోని ఓ కర్మాగారం నుంచి బళ్లారి వెళ్తున్న టిప్పర్ గుంతల రహదారి వద్ద ద్విచక్రవాహన చోదకుడు అదుపు తప్పి టిప్పర్ ముందు పడ్డాడు. అంతలో టిప్పర్ చోదకుడు బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. ద్విచక్రవాహన చోదకుడికి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. నిత్యం ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. కాలనీలోని మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంటంతో గుంతలు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

దాడి ఘటనపై కేసు నమోదు

కళ్యాణదుర్గం గ్రామీణం : పట్టణంలోని బళ్లారి రోడ్డులో గల గాంధీ విగ్రహం వద్ద దాడి చేసుకొన్న ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ హరినాథ్ తెలిపారు. బళ్లారికి చెందిన ఓ లాయర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు విషయంలో కళ్యాణదుర్గం వచ్చి తిరిగి వాహనంలో వెళ్తున్నాడు. అక్కడ నెల కొన్న కొన్ని కారణాల వల్ల ఘర్షణ పడ్డారు. దీనిపై కళ్యాణదుర్గం మండలంలోని గోళ్ల గ్రామానికి చెందిన వారిపై న్యాయవాది, న్యాయవాదిపై సదరు గ్రామస్థులు ఫిర్యాదులు చేసుకొన్నారు. ఇరువురి ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

విద్యార్థి అదృశ్యం

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే : బ్రాహ్మణపల్లికి చెందిన 13 ఏళ్ల బాలుడు అదృశ్యం అయినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఆ బాలుడు స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇంట్లో తల్లిదండ్రులు మందలించారన్న కోపంతో ఈనెల 25న పాఠశాలకు వెళ్తానని చెప్పి, మళ్లీ ఇంటికి రాలేదన్నారు. ఎంతకూ ఆచూకీ తెలియ రాలేదు. చివరకు తల్లిదండ్రులు సీఐ రాజుకు ఫిర్యాదు చేశారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు రాజకీయ వేధింపులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప అన్నారు. కార్మికులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద చేపడుతున్న రిలే దీక్ష గురువారంతో 11వ రోజుకు చేరుకొంది. జీతాల్లో కోతలు విధిస్తూ, గుత్తేదారులు పలు రకాలుగా వేధిస్తున్నారన్నారు.

ఏపీ ఎన్జీవో తాలుకా అధ్యక్షుడికి సన్మానం

విడపనకల్లు: ఏపీ ఎన్జీవో తాలుకా అధ్యక్షుడిగా ఎన్నికైన ఏవో భాస్కర్ బాబును విడపనకల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధాకృష్ణ, సిబ్బంది, తెదేపా నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తెదేపా సర్పంచులు తిమ్మరాజు, జనార్దననాయుడు, గ్రామ కార్యదర్శులు లోకేశ్, మున్నాఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరమ్మ గ్రామోత్సవం

ప్రత్యేక అలంకరణలో ఈశ్వరమ్మ విగ్రహం, కలశాలతో యువతులు

ఉరవకొండ: ఉరవకొండలో ఈశ్వరమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారి ప్రతిమను అందంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, ఈశ్వరమ్మ మాలధారులు పట్టణ ప్రధాన వీధులు మీదుగా గ్రామోత్సవాన్ని చేపట్టారు. యువతులు కలశాలతో ఉత్సవంలో సాగారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి వసంతోత్సవం

ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం చేయిస్తున్న పండితులు

ఉరవకొండ, న్యూస్‌టుడే : పట్టణంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఇందులో భాగంగా స్వామి మూల విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి, వల్లీశ్వరి, దేవసేన అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి, వసంతోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిమలకు చక్ర స్నానం చేయించారు.

ఎస్సీ, ఎస్టీ పథకాలను పునరుద్ధరించాలి

మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తదితరులు

ఉరవకొండ: గత వైకాపా ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. గురువారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత భవనంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎన్ఎస్ఎఫ్‌డీసీ భూ కొనుగోలు పథకం, భూ అభివృద్ధి పథకం, కార్పొరేట్ విద్యను అందించే పథకాలను రద్దు చేసిందన్నారు. వాటిని పునరుద్ధరించి, వారి అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. నాయకులు తిప్పయ్య, ఆనందురాజు, పోలేరి పాల్గొన్నారు.

వజ్రకరూరు : పందికుంట తండాలోని చత్రీనాయక్, రామునాయక్, నాగరాజునాయక్ దారి లేకుండా చేశారని అందిన ఫిర్యాదు మేరకు సాకే హరి గురువారం తండా చేరుకొని దారి విషయం పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ సతీష్‌కుమార్‌తో జాతీయ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలో గిరిజనులకు చెందిన రోడ్డు స్థలాన్ని ఆక్రమించిన వారిని శిక్షించాలని డిమాండు చేశారు.

టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించండి

ఉరవకొండ: ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించాలన్న విషయంలో వారికి మినహాయింపు ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి డిమాండు చేశారు. సంఘం సభ్యత్వ నమోదును గురువారం మండలంలోని ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇప్పుడు టెట్‌లో అర్హత సాధించాలనడం సరైన అంశం కాదన్నారు.

ఇంటర్ విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ హనుమంత నాయక్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : బొమ్మనహాళ్ జూనియర్ కళాశాలలో సంకల్ప-2026 మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేసిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి కళాశాల ప్రిన్సిపల్ హనుమంతనాయక్ తెలిపారు. 2025-26లో జరిగే ఇంటర్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ ఉత్తమ ఫలితాలను సాధించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సంకల్ప-2026 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు సి.సుబ్బరాయుడు, ఆదిరాముడు, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

కడదరబెంచిలో స్వామిత్వ గ్రామసభ

ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీడీవో రాధాకృష్ణ

విడపనకల్లు, న్యూస్‌టుడే : కడదరబెంచి గ్రామంలో ఎంపీడీవో రాధాకృష్ణ, ఏవో భాస్కర్ బాబు, ఈవో శిల్పా ఆధ్వర్యంలో స్వామిత్వ గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్థులకు పీపీఎం ధ్రువపత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ వాటిని పరిశీలించి ఏమైనా మార్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సభలో గ్రామ కార్యదర్శులు శిల్పా, లోకేశ్, మహేష్, రవి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సగర, ఉప్పరల అభ్యున్నతికి కృషి

ఉప్పర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరును అభినందిస్తున్న సంఘం నాయకులు, తెదేపా శ్రేణులు

కణేకల్లు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సగర, ఉప్పరల అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తానని ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు ఆనందరాజు పేర్కొన్నారు. గురువారం విజయవాడ గొల్లపూడిలో బీసీ సంక్షేమ మంత్రి సవిత, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. సగర, ఉప్పర సంఘం నాయకులు, మండల తెదేపా నాయకులు కార్పొరేషన్ డైరెక్టరును సత్కరించారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే!

ఉరవకొండలోని సీపీఐ నగర్ మూడు రోడ్ల కూడలి వద్ద ప్రధాన మురుగు కాలువ కల్వర్టు మీద రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. అది ప్రధాన దారి కావడంతో వాహన రాకపోకలు అధికంగా ఉంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురి కావాల్సి వస్తుంది. రాత్రి పూట మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరతున్నారు. -న్యూస్‌టుడే, ఉరవకొండ

శుద్ధజలకేంద్రం లేక తిప్పలు

ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ రూ.10 లక్షల వ్యయంతో గతంలో ఏర్పాటు చేసిన శుద్ధ జలకేంద్రం ప్రస్తుతం మూత పడింది. ఆరు నెలల క్రితం నీటిని శుద్ధిచేసే పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కుందుర్పి

గుంతల రహదారి.. ఇక్కట్ల ప్రయాణం

కామక్కపల్లి వద్ద ప్రధాన రోడ్డులో పలు చోట్ల మోకాలు లోతు గుంతలు ఏర్పడడంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. కళ్యాణదుర్గం నుంచి కంబదూరు మీదుగా బెంగళూరుకు వెళ్లే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్లు భవనాల శాఖ డీఈ ప్రసాద్‌ను వివరణ కోరగా ఆయా చోట్ల మరమ్మతులు చేయిస్తామన్నారు. -న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

పీఏబీఆర్ నుంచి నీరు విడుదల

గేటు ద్వారా పెన్నానదిలోకి వెళ్తున్న నీరు

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం పీఏబీఆర్ నుంచి గురువారం ఒక గేటు ద్వారా 400 క్యూసెక్కుల నీటిని పెన్నానదిలోకి విడుదల చేశారు. మరోవైపు జల విద్యుత్తుకి 345 క్యూసెక్కులు వెళ్తున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 11 టీఎంసీలు. ఆనకట్ట భద్రత దృష్ట్యా 5 టీఎంసీల లోపే నీటిని నిల్వ చేస్తారు. ప్రస్తుతం 5.3 టీఎంసీల ఉన్నాయి. పైగా హంద్రీనీవా, పీఏబీఆర్ లింకు కాలువ ద్వారా 700 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఫలితంగా ఉరవకొండ మండలం మైలారంపల్లిలోకి క్రమంగా నీరు చేరుతోంది. ఈనేపథ్యంలో దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ ప్రక్రియను జలవనరుల ఎస్ఈ సుధాకర్‌రావు, ఈఈ శశిరేఖ, డీఈఈ వెంకటరమణ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

డ్రగ్స్ వినియోగం, డిజిటల్ మోసాలపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శెట్టూరు, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలు, డిజిటల్ మోసాలు, చట్టాలపై యాటకల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పోలీసులు అవగాహన కల్పించారు. డిజిటల్ మొబైల్ వాహనం ద్వారా గ్రామంలో ముందుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో శక్తి టీం సభ్యులు అక్కులప్ప, రాము, విద్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తుపదార్థాల వల్ల అనర్థాలు, డిజిటల్ మోసాలు, మహిళా చట్టాలు, ఇతర నేరాలు గురించి దృశ్య శ్రవణ పద్ధతుల ద్వారా అవగాహన కల్పించారు. హెచ్ఎం చంద్రమౌళి, విద్యార్థులు, వారి తల్లి తండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో సందేశాలు.. ఫిర్యాదులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా, వైకాపాలకు చెందిన కొందరు సామాజిక మాధ్యమాల్లో ఒకరిపై ఒకరు కించపరుచుకునేలా సందేశాలు చేసుకొని అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకొన్నారు. ఇరు పార్టీల నాయకులను స్టేషన్‌కు పిలిచి సీఐ హరినాథ్ గురువారం చర్చించారు. చిన్నచిన్న వాటిపై లేనిపోని విధంగా చేసుకోరాదని సముదాయించి పంపినట్లు సీఐ తెలిపారు.

ట్రాఫిక్ సమస్య కొలిక్కొచ్చింది!

గడియార స్తంభం వద్ద విశాలంగా కనిపిస్తున్న ప్రధాన దారి

ఉరవకొండ, న్యూస్‌టుడే : ఉరవకొండ మేజర్ పంచాయతీ ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య ఒక కొలిక్కి వచ్చింది. ఇప్పటి వరకు ఇక్కడ ప్రత్యేక మార్కెట్ లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. కొన్నేళ్లుగా కూరగాయల వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులు ప్రధాన దారుల అంచున తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించేవారు. కాలక్రమేణా వాహన రాకపోకల కారణంగా ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. ప్రధానంగా గడియార స్తంభం ప్రాంతంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేది. దీంతో పంచాయతీ అధికారులు అన్ని రకాల వ్యాపారాలకు సంబంధించిన తోపుడు బండ్లను పాత ప్రయాణ ప్రాంగణంలోకి మార్చారు. అక్కడే చిరువ్యాపారులకు స్థలం కేటాయించారు. ఇది బాగానే ఉన్నా.. ఇక్కడ పెద్దవాహనాల రాకపోకలు సాగకుండా దారి మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాదని ప్రజలు అంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ స్పందిస్తూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో భాగంగానే తోపుడు బండ్లను తరలించామన్నారు. పాత ప్రయాణ ప్రాంగణంలో పెద్దవాహనాలు రాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నిధుల వినియోగంపై సీఈఓ ఆరా

శెట్టూరు, న్యూస్‌టుడే: సీఎఫ్ఎంఎస్, పీఎఫ్ఎంఎస్ నిధులు ఎంత ఉన్నాయి, ఎంతవరకు వినియోగించారని జడ్పీ సీఈవో శివశంకర్ శెట్టూరు ఎంపీడీవో కార్యాలయం ఏవో, సిబ్బందిని ఆరా తీశారు. శెట్టూరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎక్కడికెళ్లారు అని ప్రశ్నించగా ఒకరు క్షేత్రస్థాయికి వెళ్లాడని, మరికొందరు సెలవు పెట్టాడని సమాధానమివ్వడంతో ఎక్కడున్నదీ మీకే తెలియకపోతే ఎలా? అని ప్రశ్నించారు. సెలవుపై వెళ్లాడని నిర్ధారించారు. సీఎఫ్ఎంఎస్, పీఎఫ్ఎంఎస్ నిధులు వినియోగించకుండా ఇన్నేళ్లు ఎందుకు ఉంచుకున్నారని సీఈవో అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఇపుడు ఎంపీటీసీలకు నిధులు రూ.50లక్షలు దాకా కేటాయించారని, పనులు ప్రారంభం అవుతున్నాయని ఏవో శ్రీనివాసులు తెలిపారు. పూర్తి వివరాలను తనకు పంపాలని సీఈవో ఆదేశించారు. చెత్తతో సంపద కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు!

అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజరు నీలకంఠ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, మాస్ ఎడ్యుకేషన్ సిబ్బంది

రాయదుర్గం : రాయదుర్గంలోని శాంతినగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలోని వారపు సంతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మాస్ ఎడ్యుకేషన్ సంస్థ, ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఐఈసీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. హెచ్ఐవీ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, బాధితుల పట్ల వివక్షత చూపకుండా కలిసి మెలిసి సమాజంలో ఎలా జీవించాలి తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజరు నీలకంఠ, ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, ఏఎన్ఎం నాగమణి, ఔట్రీచ్ వర్కర్లు కె.సుధ, మంగళమ్మ, లక్ష్మి, భారతి, ఇందిరమ్మ, పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా షెడ్యూలు దాఖలా ఆస్తి రాజశ్రీ రాయదుర్గం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు **O.S.No. 113/2025** లోబడి కోర్టు తగాదాలో ఉన్నది. కావున కోర్టులోని సదరు వ్యాజ్యము పైన వరకు ఎవ్వరేగాని షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవ్వరి దగ్గర నుండైనా కొనుగోలు చేయడం లేదా అమ్మకం చేయడం వంటివి చేయకూడదు. మా యొక్క హెచ్చరిక ఇందుకు తప్పిన వారు శిక్షార్హులు. అంతేకాకుండా అటువంటి వ్యవహారాలకు వాళ్ళే బాధ్యత వహించవలయును.

షెడ్యూలు

అనంతపురం రిజిస్ట్రేషన్ డివిజన్ మరియు రాయదుర్గం సబ్ రిజిస్ట్రేషన్ డివిజన్‌కు చెంది డి.హిరేహాళ్ మండలం, హిర్దేహాళ్ గ్రామ పొలంలోని భూమి వివరం...

బాబు	L.P.No.	సర్వే నెం.	విస్తీర్ణం
G.D.	909	196	Ac. 3.741 సెంట్లు

పైకి య. 2.00 యకరాలు భూమికి చెక్కుబంది: తూర్పు: రాయదుర్గం - బళ్ళారి రోడ్డు, పడమర: రావుస్టీల్ ఫ్యాక్టరీ, ఉత్తరం: పెట్రోలు బంకు మరియు మంజునాథ భూమి, దక్షిణం: ఇదే సర్వే నెంబరులో శంకర్ భూమి.

సి.నాగరాజు, వకీలు, రాయదుర్గం.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పెన్నహర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక పెద్దపొలమడ గ్రామంలో గురువారం పెన్నహర్ల సంఘం, మానవత సంస్థ సంయుక్తంగా మొక్కలు నాటారు. అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న పెన్నహర్ల సంఘం నాయకులు

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

దత్త నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పామిడి, న్యూస్‌టుడే: పామిడిలోని దత్త మహాయోగ పీఠంలో గురువారం దత్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. దత్త పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ సమక్షంలో గణపతి, నవగ్రహ పూజలు, కలశ స్థాపన చేశారు. అనంతరం గణపతి, దత్తమాల మూల మంత్ర హోమాలు చేపట్టారు.

కలశస్థాపన పూజ చేస్తున్న పీఠాధిపతి సురేంద్ర మహారాజ్

బాలికలపై హింసను రూపుమాపాలి

యాడికి, న్యూస్‌టుడే: మహిళలు, బాలికలపై జరిగే హింసను రూపుమాపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందని బాలల పరిరక్షణ సమితి లీగల్ అధికారిణి సంధ్యారాణి పేర్కొన్నారు. యాడికి మండలం వేములపాడులోని కేజీబీవీలో గురువారం 'బేటీ బచావో బేటీ పఢావో' నినాదంపై మిషన్ శక్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆటలు, పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎస్‌వో నిర్మల, సంధ్య, రమాదేవి, రాజ్యలక్ష్మి, సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న బాలల పరిరక్షణ సమితి లీగల్ అధికారిణి సంధ్యారాణి

మట్కా నిర్వహిస్తే చర్యలు తప్పవు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో ఎవరైనా మట్కా నిర్వహించినా, ఆడినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి పేర్కొన్నారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ తాడిపత్రిలోని పలు కాలనీల్లో మట్కా నిర్వహిస్తున్న ఏడుమంది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,01,000ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొండమనాయుడు, మాబున్నీ, ఖల్లయప్ప, పుల్లయ్య, రహమ్మత్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. పట్టణ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్సై గౌస్ మహమ్మద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదాత పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్ర నాయకులు రాంభూపాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో 13వ జిల్లా మహాసభల సందర్భంగా గార్లదిన్నెలో గురువారం సాయంత్రం ర్యాలీ, బహిరంగ సభ జరిగింది. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ రైతుల సంక్షేమార్థం పలు తీర్మానాలు ఆమోదించడం జరుగుతుందన్నారు. పంట నష్టపరిహారం, పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఉరవకొండ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశామన్నారు. శుక్రవారం కల్లూరులో రైతు సంఘం జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శివారెడ్డి, రాయుడు, సభ్యులు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

గార్లదిన్నెలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఒట్టిపోయిన చెరువు.. పొలాలన్నీ బీడు

నిర్వేదంలో అన్నదాతలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాంపల్లి పాతచెరువు ప్రత్యేక ఉంది. ఒకప్పుడు ఈచెరువుకు నీరు వస్తే సమీపంలోని బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగడంతోపాటు కొంత ఆయకట్టు భూములు పంటలతో సస్యశ్యామలంగా ఉండేవి. ప్రస్తుతం నీరులేక ఆయకట్టు భూములు బీళ్లుగా మారి కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి.

నీరులేక కంపచెట్లతో దర్శనం ఇస్తున్న వెంకటాంపల్లి పాతచెరువు

వెయ్యికళ్లతో ఎదురుచూపులు

ప్రస్తుతం జిల్లాలోని అన్ని చెరువులకు నీటితో నింపుతుండగా ఇక్కడి చెరువుకు నీటిని అందించి రైతులను ఆదుకోవాలనే ఆలోచన అధికారులు, ప్రజాప్రతినిధులకు రావడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాతచెరువుకు నీరందిస్తే పశుపక్ష్యాదులతోపాటు ఆయకట్టు రైతులు వరిపంటలు పండించుకునేందుకు ఎంతో అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు.

● జీవనం భూములకు సాగునీరు ఇవ్వకపోయినా పర్వాలేదు.. భూగర్భజలాలు పెరగడానికి నీటితో చెరువును నింపాలని ప్రజలు, రైతులు కోరారు.

పూడికతీత పనులు చేపట్టినా..

తెదేపా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇక్కడి పాతచెరువులో పూడికతీత పనులు చేపట్టారు. చెరువులో నీరు నిల్వ ఉండేందుకు ఉపాధిహామీ పథకం కింద ఆజాదీ అమృత్ సరోవర్ కింద ఇక్కడి చెరువులో పూడికతీత పనులు వైకాపా ప్రభుత్వంలో చేపట్టినా నీరు నిల్వ లేదు. రూ.లక్షలు వెచ్చించి పనులు చేసినా చుక్క నీరు లేకపోవడంతో భూములకు సాగునీరు లేక బీళ్లుగా పెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా చెరువులో ఉన్న కంపచెట్లను తొలగించి చెరువును నీటితో నింపాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

- నూర్జాహన్, చిన్ననీటిపారుదలశాఖ ఏఈ, పెద్దవడుగూరు

వెంకటాంపల్లిలో ఉన్న పాతచెరువుకు నీటితో నింపేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాం. చెరువు చుట్టూ ఉన్న కట్టలు, బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపి కంపచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య : గుంతకల్లులో హౌసింగ్ బోర్డులో పార్కు ఏరియాలో చెత్తకుండి లేకపోవడంతో చెత్తను ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటేశ్వర్లు, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పురపాలక సంఘం**

సమస్య : హౌసింగ్ బోర్డులోని వివేకానంద పార్కు ఏరియాలో సీసీరోడ్లు ఉన్నా కాలువల లేకపోవడంతో పరిసరాల్లోనే మురుగు ప్రవహిస్తోంది. **- వెంకటేశ్వర్లు**

సమాధానం: హౌసింగ్ బోర్డులో పార్కు వెనుకలా, ముందర కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- ప్రతాప్, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం**

– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య : శింగనమల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత కొద్ది రోజులుగా విద్యార్థులు తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. **-నాగార్జున, శింగనమల**

సమాధానం: తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతాం. **- భాస్కర్, ఎంపీడీవో**

– న్యూస్‌టుడే, శింగనమల(బుక్కరాయసముద్రం)

విద్యుత్తు స్తంభాన్ని సరిచేశారు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని దిద్దుకొట్టాలలో ఇళ్లపైకి ఒరిగిన విద్యుత్తు స్తంభాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది గురువారం సక్రమంగా నిలబెట్టారు. ఇళ్లపైకి ఒరిగిన స్తంభం గురించి 'ఈనాడు'లో గురువారం 'ప్రమాదం జరిగితేనే.. స్పందిస్తారా?' అనే శీర్షికతో వచ్చిన చిత్రవార్తకు స్పందన లభించింది. ఏఈ రఘునాథ్ సిబ్బందిని పంపి విద్యుత్తు స్తంభాన్ని సరి చేయించారు.

స్పందనకు వందనం

పక్కాగృహాలు మంజూరు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలోని ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసిందని గృహనిర్మాణశాఖ ఏఈ సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 250 ఇళ్లకు మంజూరు ఉత్తర్వులు వచ్చాయని ఆయన వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50లక్షలు వెచ్చించనుందన్నారు. ఇప్పటికే అందిన దరఖాస్తులపై విచారణ చేశామన్నారు. త్వరలోనే ఇళ్లనిర్మాణాలను మొదలుపెట్టిస్తామన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు ప్రజల దరి చేరవని ఎంపీడీవో సాల్మన్‌రాజు తెలిపారు. గురువారం ఆయన నీలంపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీలంపల్లిలో పరిసరాలు శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే తామె తొలగిస్తామని హెచ్చరించారు. ఊరికి దూరంగా దిబ్బలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

చరవాణుల అధిక వినియోగంతో నష్టాలే!

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని విజయనగర్ కాలనీలో ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి, రెండు, మూడవ బహుమతులు సాధించిన ఈక్షిత్ రెడ్డి, సాయితేజ, ఇమ్రాన్ ఖాసీంలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నటరాజు, పలువురు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

తాడిపత్రి : విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో డాక్టర్ రాజేంద్రప్రసాద్ పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం అనే అంశంపై ఉపన్యాసం పోటీలు జరిగాయి. తొమ్మిదో తరగతి చదువుతున్న ఎన్.మిత్ర ప్రథమ, 7వ తరగతి బి.రేషక్ ద్వితీయ స్థానం, తొమ్మిదో తరగతి కె.తేజస్విని తృతీయ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయులు రవిబాబు విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీలత, జయలక్ష్మి, జమీలా, సుధాకర్ పాల్గొన్నారు.

గుంతకల్లు :బహుమతులు అందుకున్న బాలికలు

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాఫర్

సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : డిసెంబరులో నిర్వహించే సీపీఐ శతజయంతి వేడుకలను విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాఫర్ పిలుపునిచ్చారు. గురువారం బుక్కరాయసముద్రంలో నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా పార్టీ పేదల కోసం పని చేస్తోందన్నారు. శతజయంతి ఉత్సవాలను డిసెంబరు 10న అనంతపురంలో పార్టీ యోధుల కుటుంబాలకు ఆత్మీయ సన్మానం చేస్తామన్నారు. అదే నెల 26న ఖమ్మంలో నిర్వహించే వందేళ్ల పండగకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, రామకృష్ణ, రాజారెడ్డి, మల్లికార్జున, చిన్నప్పయాదవ్, పెద్దయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల జప్తు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని పామిడి పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మిడుతూరులోని 44వ జాతీయ రహదారిలో తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి జప్తు చేసినట్లు ఆయన తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మురుగు కదలదు.. చెత్త తొలగదు!

వరదాయపల్లిలోని పలు వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. కాలువలు లేకపోవడంతో నిత్యం మురుగు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. దీని పక్కన చెత్త నిల్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద కారణంగా జనం రోగాల బారిన పడుతున్నారు. ఏళ్లుగా సమస్య ఉందని, అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పెద్దపప్పూరు

ఒరిగిపోతున్నా పట్టదా?

కమ్మవారిపల్లి గ్రామ సమీపంలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఓ విద్యుత్తు స్తంభం నేలకు వాలి రహదారి వైపు ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. మరో విద్యుత్తు స్తంభాన్ని పిచ్చిమొక్కల తీగలు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్తు సమస్య తలెత్తుతోందని ప్రజలు వాపోతున్నారు. కొన్ని నెలలుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. విద్యుత్తుశాఖ ఏఈ నరసింహులును వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పెద్దపప్పూరు**

ముళ్లపొదలు తొలగించరూ!

అంకోలా-నెల్లూరు జాతీయ రహదారి పక్కన పెరిగిన కంపచెట్లతో రాకపోకలతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి రోడ్డులో లక్ష్మి కోల్డ్ స్టోరేజీ దగ్గర ముళ్ల పొదలు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. రాత్రి సమయంలో ముళ్ల పొదలతో ప్రమాదాల జరిగే అవకాశం ఉందని చోదకులు పేర్కొంటున్నారు. ముళ్లపొదలను తొలగించాలని ఎన్‌హెచ్ అధికారులను కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ప్రమాదం అల్లుకుపోతోంది!

పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డు ప్రధాన రహదారి పక్కన ఉన్న రైల్వేగేటు వద్ద మూడు విద్యుత్తు స్తంభాలకు పిచ్చిమొక్కల తీగలు అల్లుకుపోతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో విద్యుత్తు తీగలు రాపిడికి గురై నిప్పు రవ్వలు పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ రైల్వేగేటు వేస్తే దాదాపు అరకిలో మీటరు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఆగుతాయి. ఇలాంటి చోట ప్రమాదకర పరిస్థితి ఉందని, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పామిడి

రైతుల పక్షాన కూటమి సర్కారు

నార్పల, న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి సర్కారు పని చేస్తోందని తెదేపా జిల్లా నాయకులు వెంకట నరసానాయుడు అన్నారు. గురువారం బొందలవాడలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థికసాయం, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ రాయితీతో డ్రిప్ సామగ్రి, వ్యవసాయ పరికరాలు ఇస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, అఖిల, రైతులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది

రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేసిన కల్లూరు వాసులు

రైల్వే సమస్యల పరిష్కారానికి వినతి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కల్లూరు రైల్వే స్టేషన్‌లో గురువారం సాయంత్రం కల్లూరు ప్రజలు పడుతున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. కల్లూరు నుంచి కొండకింద కొట్టాల, ఇందిరమ్మ కాలనీ, ముంటిమడుగు, కేశవాపురం, కొప్పలకొండ, పి.కొత్తపల్లి, పెనకచెర్ల, డ్యామ్ గ్రామాలకు వెళ్లాలంటే రైల్వే భూగర్భ వంతెన కింద వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అక్కడ నిత్యం నీరు ఉండడంతో ప్రయాణం ఇబ్బందిగా ఉంటోందని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెళ్లేందుకు ఉన్న దారి రైల్వే వారు మూసివేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతూ మరో దారిలో వెళ్లాల్సి వస్తోందని దారి చూపాలని, స్టేషన్‌లో కొన్ని రైళ్లు ఆపడం లేదని, వాటిని ఆపాలన్న పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే భద్రత, అభివృద్ధి ఏడీఆర్‌ఎం సుధాకర్, సీఎస్‌వో రామకృష్ణలకు అందజేశారు. సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో గురువారం కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. అధికారుల తీరుపై కౌన్సిలర్లు మండిపడ్డారు. కనీస సమాచారం ఇవ్వకుండా వార్డుల్లో పనులు చేస్తుండటంతో తాము ప్రజల్లో చులకన అవుతున్నామని కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ వన్నూరుబీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరుపులు, కేకలతో కొనసాగింది. తమకు తెలియకుండా వార్డుల్లో కాలువలు, రోడ్లు నిర్మిస్తున్నారన్నారు. 25వ వార్డులో మురుగు కాలువలులేవని, ప్రజాకుళాయిల ఏర్పాటును ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెదేపా కౌన్సిలర్ రాణి అధికారులను నిలదీశారు. మూడు నెలల నుంచి వార్డులోని పలు కాలనీల్లో వీధిదీపాలు వెలగడంలేదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని చెప్పారు. 3,6,7 వార్డుల్లో కాలువలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ వరదరాజులు పేర్కొన్నారు. ఆయనతోపాటు కోట కౌన్సిలర్ నజీర్ వాపోయారు. తన వార్డులో 15 ఏళ్ల నుంచి ఉన్న ప్రజాకుళాయిని ఎందుకు తీసి వేశారని ఆయన డీఈఈని నిలదీశారు. ప్రజలు వద్దన్నందుకే తొలగించినట్లు డీఈఈ చెప్పడంతో కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఇప్పుడే వార్డుల్లోకి వెళ్దామని కౌన్సిలర్లు తమ సీట్ల నుంచి లేచి రమ్మని డిమాండు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ జబ్బార్‌మియా సమాధానమిచ్చారు. మూడో వార్డులో వీధి దీపాలు లేవని, వేగనియంత్రికలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి కోరారు. కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు తదితరులు మాట్లాడారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో శిథిలావస్థకు చేరుకున్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు అధికారులు, ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

ఓటర్ల జాబితా కచ్చితంగా ఉండాలి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఓటర్ల జాబితాలు కచ్చితంగా ఉండేవిధంగా బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. గుంతకల్లు, మండలంలోని 148 పోలింగ్ కేంద్రాలకు చెందిన బీఎల్‌వోల సమావేశం గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమయావేశ మందిరంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జాబితాల్లో ఉండేవారిలో ఎవరైనా చనిపోయిఉంటే వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో ఉన్న తప్పుల సవరణ, కాలనీల్లో మారి ఉంటే చిరునామాల మార్పు తదితర కార్యక్రమాలను చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఓటర్ల జాబితాల గురించి ఎవరూ ఫిర్యాదు చేయని విధంగా పటిష్ఠంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసే ఉత్తర్వులను అమలు చేయడానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. తహసీల్దారు రమాదేవి, ఎన్నికల ఉప తహసీల్దారు రాజ్‌కుమార్, సహాయ సిటీ ప్లానర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

యాడికి, న్యూస్‌టుడే : మండలంలోని ఎన్.చిక్కేపల్లిలో గడ్డివామి దగ్ధం అయింది. గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి ఇటీవల రెండు ట్రాక్టర్ల గడ్డిని దగ్గరి బంధువుల వద్ద కొనుగోలు చేసి ఇంటి సమీపంలో ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బుడిదయింది. నోరులేని జీవాల కోసం ఉంచిన గడ్డిని కాల్చడం, నష్టం కలిగించడంపై రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పెద్దపప్పూరు నుంచి తాడిపత్రి వైపునకు వస్తున్న ఆటో చిన్నపొలమడ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నిలపగా వెనుక నుంచి క్రేన్ ఢీకొంది. ఆటో వెనకాల కూర్చున్న నాగయ్య, పెద్దపప్పూరు మండలం దేవునుప్పలపాడుకు చెందిన చాకలి కొండప్పలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిఆర్.ఎస్.కు చెందిన ఓ మహిళ(50) అదృశ్యంపై గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పొలానికి వెళ్లిన మహిళ బుధవారం నుంచి కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఎవరైనా ఆమెను హత్య చేసి ఉండవచ్చన్న అనుమానాలను కుటుంబీకులు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే : రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందిచాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఏడీఈ పద్మజ హెచ్చరించారు. తాడిపత్రిలోని సీబీరోడ్డు, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డులో ఉన్న ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న నిల్వలు, కాలపరిమితి, నాణ్యత తదితర వాటిపై ఆరా తీసినట్లు అధికారులు తెలిపారు. సాయికేశవ ఫర్టిలైజర్ దుకాణంలో 5 బస్తాలు, న్యూ అన్నదాతలో 20 బస్తాల నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో జప్తు చేసినట్లు తెలిపారు. ఏవో ఆంజనేయులు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

నాయకత్వ లక్షణాలు పెంచడానికే ఎన్నికలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పురపాలక ఉన్నత పాఠశాలలో స్కూల్ పీపుల్ లీడర్(ఎస్‌పీఎల్), క్లాస్ పీపుల్ లీడర్(సీపీఎల్) ఎంపిక చేయడానికి సోమవారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం రవిబాబు తెలిపారు. స్కూల్ పీపుల్ లీడర్‌కు ఎనిమిది మంది విద్యార్థులు పోటీ చేయడానికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. క్లాస్ పీపుల్ లీడర్‌కి పోటీకి 64 మంది విద్యార్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఎన్నిక ఉపయోగపడుతుందని హెచ్‌ఎం తెలిపారు. 8,9 తరగతుల విద్యార్థులు ఎస్‌పీఎల్‌కు పోటీల్లో ఉంటారు.

(c) eenadu

అనంతపురం

● అనంతపురం ● రాప్తాడు

రోబోటిక్ సాంకేతికతతో అత్యాధునిక వైద్యం

కమలానగర్, న్యూస్‌టుడే : వెన్నెముక శస్త్ర చికిత్సలకు మణిపాల్ ఆసుపత్రి సౌజన్యంతో అత్యాధునిక వైద్యాన్ని రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందిస్తున్నామని మణిపాల్ ఆసుపత్రి స్పైన్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ బాలమురుగన్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం కాలంలో వయసుతో సంబంధం లేకుండా వెన్నెముక సమస్యలు వస్తున్నాయన్నారు. రోబోటిక్ ద్వారా తక్కువ ఖర్చుతో శస్త్ర చికిత్సల ద్వారా భవిష్యత్తును మారుస్తున్నామన్నారు. రోబోటిక్స్, కృత్రిమ మేధ ఏఐ, ఆధునాతన ఇమేజింగ్ (స్కానింగ్) కలయిక వెన్నెముక వైద్యంతో కొత్త శకానికి బాటలు వేస్తున్నామన్నారు.

'రాక్రీట్ సంస్థపై చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు: ఇంటి నిర్మాణాలు చేపట్టకుండానే బిల్లులు చేసుకొని అవినీతికి పాల్పడిన రాక్రీట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణాలు చేపడతామంటూ ముందుకు వచ్చి ఎక్కడా నిర్మాణాలు చేపట్టలేదన్నారు. అంతకు మునేపే ప్రభుత్వం నుంచి రూ.80 కోట్ల రూపాయలను మంజూరు చేయించుకొని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మరో వైపు నిర్మాణాలు పూర్తి కావాలంటే రూ.10 వేలు చెల్లించాలంటూ లబ్ధిదారుల నుంచి వసూలు చేశారన్నారు. పాలడెయిరీ పేరుతో ప్రజల నుంచి రూ.10 కోట్లు వసూలు చేసి అక్రమంగా భూములు కొనుగోలు చేసి సంపాదించుకున్నారన్నారు.

ఘనంగా విశ్వజనీన దేవాలయ ప్రారంభోత్సవం

అనంత సాంస్కృతికం: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో హెచ్ఎల్సీ కాలనీలో రామకృష్ణ విశ్వజనీన దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు గురువారం గోపూజ, కలశారాధనతో ప్రారంభమయ్యాయి. సమితి వ్యవస్థాపకుడు శ్రీధరమూర్తి, రాయలసీమ కన్వీనర్ గంగాధరల ఆధ్వర్యంలో 4 రోజులు ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. గురువారం ఉదయం మహాగణపతి, ఆదిత్యాధి, నవగ్రహ, సుదర్శన, చండికా, దుర్గా పరమేశ్వరి కలశారాధన పూజలు నిర్వహించారు.

కలశారాధన పూజోత్సవం

పెళ్లికి వచ్చి అదృశ్యం

అనంత నేరవార్తలు: పెళ్లికి అనంతపురం నగరానికి వచ్చిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన చిన్నపు వెంకటరామిరెడ్డి నగరంలోని స్థానిక పోలీస్ కాంప్లెక్స్‌లో జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యాడు. కార్యక్రమం అనంతరం బయటకు వచ్చిన వృద్ధుడు కనబడకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు నగరంలో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది..

జాతీయ రహదారి నిర్వహణ దయనీయం

● ఒకవైపు వెలుగు, మరోవైపు చీకటి
● అడ్డంగా పెరుగుతున్న ముళ్లచెట్లు

న్యూస్‌టుడే, ఎస్కేయూ

జాతీయ రహదారుల నిర్వహణ దయనీయంగా మారింది. అనంత నగరానికి చుట్టూ జాతీయ రహదారులున్నాయి. బెంగళూరు-హైదరాబాద్‌కు వెళ్లే రహదారి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉండగా, అనంతపురం నుంచి చెన్నైకి, అనంతపురం నుంచి బళ్లారి, రాయదుర్గం వెళ్లే రహదారులు జాతీయ రహదారులశాఖ పరిధిలో ఉన్నాయి. అనంతపురం పాతూరు నుంచి ఇస్కాన్ వరకూ ఉన్న రహదారి కూడా ఎన్‌హెచ్ పరిధిలో ఉంది. ఈ రహదారులన్నీ నగర శివారులో ఉన్నాయి. నిర్వహణ లోపంతో జనం ఇబ్బంది పడుతున్నారు.

అనంతపురం నుంచి చెన్నైకి వెళ్లే జాతీయ రహదారిలో హైమాస్ట్ లైట్లు ఒక వైపు మాత్రమే వెలుగుతున్నాయి. మరోవైపు వెలగడం లేదు. సత్యసాయి ఉన్నతవిద్య కళాశాల నుంచి పంగల్‌రోడ్డు వరకూ ఇదే పరిస్థితి. ఒకవైపు చీకటి, మరోవైపు వెలుగు ఉంటోంది.

● రాష్ట్ర రహదారుల కంటే జాతీయ రహదారులు ఎంతో విశాలంగా, సుందరంగా, సరైన వసతులతో కూడి ఉండాలి. ఈ రోడ్లన్నీ విస్తరించారు. నాలుగు వరుసల రహదారులుగా మార్చారు. టోల్ వసూళ్లు కూడా ఉన్నాయి. కానీ రోడ్లపై సమస్యల్ని పట్టించుకోలేదు. రోడ్డు పక్కన అపరిశుభ్రత, సక్రమంగా వెలగని లైట్లు, ముళ్ల పొదళ్లు ఏపుగా పెరగడం, రోడ్డు మధ్యలో, అంచుల్లో మట్టి పేరుకుపోవడం, నడకబాటలు ఆక్రమణ తదితర సమస్యలు నెలకొన్నాయి. వాటిని పట్టించుకొనే వారు కరవయ్యారు. ఇటు అధికారులు గానీ, అటు పాలకులుగానీ పట్టించుకోలేదు. ఈ సమస్యలన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆయా మార్గాల్లో వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి. రాత్రిళ్లు చీకటి కారణంగా రోడ్డు దాటడం కష్టంగా మారింది.

ఎస్కేయూకి సమీపంలోని ఆకుతోటపల్లి వద్ద జాతీయ రహదారిలో రోడ్డుకు అడ్డంగా పెరిగిన ముళ్ల చెట్లు ఇవి. ఈ రహదారికి ఇరువైపులా ఉన్న నడకబాటలు ముళ్లచెట్లు కమ్మేస్తున్నాయి. డివైడర్లలో కూడా చెట్లు పెరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడలేదు.

మేమున్నాం.. మీకు తోడుగా

లక్ష్మీనగర్: 9849771687
అరవింద్‌నగర్: 8008573004
రాప్తాడు: 6304766286

సమస్య: హౌసింగ్ బోర్డు కాలనీలోని కొత్త రెవెన్యూ కాలనీ మూడో క్రాస్‌లో గత కొన్ని రోజులుగా లైటు వెలగడం లేదు. **-స్థానికులు**
సమాధానం: వెంటనే లైటు వెలిగే విధంగా చర్యలు చేపడతాం
సమస్య: భవానినగర్ ప్రారంభంలోనే చెత్త డబ్బా వద్ద దుర్వాసన వస్తోంది. **-మహేష్**
సమాధానం: చెత్త వద్ద ఉన్న మట్టిని తొలగించి దుర్వాసన రాకుండా చేస్తాం.
- పై ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ఎంహెచ్ఓ నరసింహ, డీఈ దాక్షాయిణి సమాధానాలు ఇచ్చారు.
– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

దొంగల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

రాప్తాడు: రాప్తాడు జగన్ సభలో ఆదివారం గొల్లపల్లికి చెందిన మహిళ మెడలో చైన్ దొంగతనం చేసిన దొంగలను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లికి చెందిన పద్మావతి ఆదివారం జగన్ చూడటానికి రాప్తాడు సభకు వచ్చిన సమయంలో మెడలోని 3 తులాల బంగారు గొలుసును దొంగలించడంతో రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గురువారం రాప్తాడు సమీపంలోని పంగల్‌రోడ్డులో నలుగురు దొంగలను అరెస్ట్ చేసి విచారణ చేయగా.. దొంగతనం చేసినట్లు బంగారు గొలుసు అమ్మి డబ్బు పంచుకున్నట్లు ఒప్పుకోవడంతో గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లక్ష 39 వేలు స్వాధీనం చేసుకున్నారు.

'బెదిరింపులకు భయపడం'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే చెప్పిన తప్పులను ప్రశ్నిస్తే పదవి నుంచి దింపుతానంటూ బెదిరింపు మాటలు మాట్లాడితే భయపడం అని మేయర్ వసీం అన్నారు. గురువారం వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలోనే దించాలని ప్రయత్నాలు చేయగా ఏం జరిగిందో ఓసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. వైకాపాకు చెందిన 48 కార్పొరేటర్లను ప్రజలు గెలిపిస్తే తాను మేయర్ అయ్యానని అదేదో నీవే నాకు పదవి ఇచ్చినట్లు దింపుతానంటూ మాట్లాడితే భయపడే వారు లేరన్నారు. వైకాపా హయాంలో అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో అభివృద్ధి ఎందుకు ఆగిందో అందరికీ తెలుసు అన్నారు.

మితిమీరి చరవాణి వాడకం అనర్థం

లక్ష్మీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తూ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: మొబైల్ ఫోన్ల వల్ల లాభాలతో పాటు.. నష్టాలు కూడా ఉన్నాయని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో గురువారం పాతూరులోని లక్ష్మీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, అశోక్‌నగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్, మూడోరోడ్డులోని ప్రసాద్ కాన్సెప్ట్ పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ల ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

విజేతలు వీరే: లక్ష్మీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి శాంతి స్వరూప ప్రథమ, 9వ తరగతి విద్యార్థులు మసిహా అమీన ద్వితీయ, భరత్ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ ప్రార్థనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అరుణ బహుమతులు అందజేశారు.
● శ్రీసాయి విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని సారిక ప్రథమ, 8వ తరగతి విద్యార్థిని మహిత ద్వితీయ, 9వ తరగతి విద్యార్థి కృష్ణచైతన్య తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు.
● ప్రసాద్ కాన్సెప్ట్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు హిమబిందు ప్రథమ, అప్పలక్ష్మి ద్వితీయ, పార్థసారథి దినాయక్ తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు కరస్పాండెట్లు నాగరాజుగుప్త, రామాంజనేయప్రసాద్, గంగాధర్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు గాయత్రి, మల్లికార్జున, పద్మజ, వసుంధర బహుమతులు అందజేశారు.

శ్రీసాయి విద్యానికేతన్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రసాద్ కాన్సెప్ట్ పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

జనశక్తినగర్‌లో సమస్యలు పరిష్కరించండి

రాంనగర్: అనంతపురం నగరం ఎ.నారాయణపురం పంచాయతీలోని జనశక్తినగర్‌లో ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. రహదారులు, మురుగు కాలువలేక అవస్థలు పడుతున్నామని స్థానిక ప్రజలు ఏకరవు పెట్టారు. బుధవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనశక్తినగర్‌లో అధ్వానంగా రహదారులు ఉన్నాయి. ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదని, కాలువలేక మురుగంతా మట్టిరోడ్లపై పారుతోందని మీరైనా మా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వేడుకున్నారు. నగర మేయర్ వసీం ప్రాతినిధ్యం వహిస్తున్న 38వ డివిజన్‌లోని కొవ్వూరునగర్‌లోని పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది, ఎక్కడికక్కడే చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంది. సచివాలయ ఉద్యోగులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదన్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రజాదర్బార్‌కు 608 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 452 అర్జీలు పరిష్కరించడం జరిగిందన్నారు.

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

బాధ్యతగా పనిచేద్దాం..

మీ కష్టంతో గత ఎన్నికల్లో తెదేపా గెలిపించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో మరింత బాధ్యతగా పనిచేయండి. అన్ని డివిజన్లలో పార్టీని గెలిపించాలని దగ్గుపాటిప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో మూడో క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఆయా కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలోపే ఎన్నికలకు జరిగే అవకాశం ఉంది. అందుకు తెదేపా ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు.

గ్రామీణ పోస్టాఫీసుల్లో ఈ-సేవలు ప్రారంభించాలి

అరవిందనగర్, న్యూస్‌టుడే: గ్రామీణ పోస్టాఫీసుల్లో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న సొమ్మును సదరు ఖాతాదారుడు తీసుకునే సౌకర్యం ఉంది. గ్రామీణ పోస్టు మాస్టర్ల దగ్గర తగినంత నగదు నిల్వలు లేకపోవడంతో గ్రామీణులు ఈ సేవలను వినియోగించుకోలేక పోతున్నారు. గ్రామాల్లో రైతులు, కార్మికులు, డ్వాక్రా సంఘం సభ్యులు తమ అవసరాల మేరకు వివిధ బ్యాంకుల్లో రుణం తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రుణం తీసుకోవడానికి, చెల్లించడానికి గ్రామీణులు పట్టణ ప్రాంతాల్లో బ్యాంకులకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్టప్ప యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర బ్యాంకుల్లో ఖాతాదారులు పొదుపు చేసుకున్న సొమ్మును ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా గ్రామీణ పోస్టాఫీసుల్లో డిపాజిట్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకుని వస్తే ఇతర బ్యాంకుల్లో పొదుపు సొమ్ము విత్‌డ్రా చేసుకునే అవకాశం గ్రామీణులకు కలుగుతుంది. గ్రామీణ పోస్టాఫీసుల్లో రుణం చెల్లించడానికి వారికి అవకాశం ఉంటుందన్నారు.

వైద్యుల భర్తీకి డిమాండ్

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందాలంటే జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆయన గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి రూ.200 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. ఈ ఆసుపత్రి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నిర్మించడం, ప్రభుత్వ మెడికల్ కళాశాల నిధులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు ఖర్చు చేస్తుండటం, ప్రత్యేక బడ్జెట్ లేకపోవడం వల్ల నిధుల సమస్యతో రోగులకు మెరుగైన సేవలు అందించలేకపోతోందన్నారు. ఈ ఆసుపత్రికి సంబంధించి 17 విభాగాలకు 68 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 31 మంది మాత్రమే వైద్యులు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రధాన విభాగాలైన అనస్తీషియా, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ లాంటి కీలక విభాగాలకు వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

ఆజాద్‌నగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనంతపురం నగర జనరల్ బాడీ సమావేశంలో గురువారం నగరంలోని వీకే మెమోరియల్ హాల్లో ఆ పార్టీ నిర్వహించింది. కార్యక్రమానికి నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి పాల్గొని ప్రసంగించారు. జగదీశ్ మాట్లాడుతూ.. సీపీఐ వందేళ్ల ప్రయాణం అపూర్వ పోరాట గాథ అన్నారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ప్రమాదకర మలుపులోకి వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో పొలాలు ఎండిపోతున్నాయని, పట్టణాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మాట్లాడుతున్న డి.జగదీశ్

డీపీఓపై పంచాయతీరాజ్ కమిషనర్ ఆగ్రహం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణభారతి పంచాయతీ పోర్టల్‌లో ఇంటి పన్నుల వివరాల నమోదులో అనంతపురం జిల్లా ఎందుకు వెనుకబడింది.. గ్రామ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ఎందుకు ఉపేక్షిస్తున్నారు.. అందరి పనితీరు బాగోలేదని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసు జారీ చేయాలని, సోమవారం విజయవాడకు రావాలని ఆయనను ఆదేశించారు.

ఇలా ఉంటే.. జరగదా ప్రమాదం!

సాయినగర్ 5వ క్రాస్ పావని ఆసుపత్రి - అరుణ్ ఆసుపత్రి రహదారిలో అంగన్‌వాడి కేంద్రం ఆనుకుని ప్రమాదం పొంచి ఉంది. ఈ కేంద్రం ఆనుకుని విద్యుత్తు స్తంభంపై వేప చెట్టు కొమ్మలు తగులుతున్నాయి. చిన్నపాటి గాలులకు వైర్లు ఒకదానికొకటి తగులుకుని నిప్పురవ్వలు ఎగిసి పడుతూ.. తరచు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. పక్కనే అంగన్‌వాడి కేంద్రం చిన్నారులు ఈ స్తంభం కింద తరచుగా ఆడుకుంటూ ఉంటారు. ఈక్రమంలో నిప్పురవ్వలు ఎగిసిపడితే ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. **- న్యూస్‌టుడే, శారదానగర్**

నీడనిచ్చి.. కొబ్బరి నీళ్లనిచ్చి

అనంతనగరంలో నాయక్‌నగర్‌లో ఓ ఇంటి వరండా నుంచి మొదటి అంతస్తు వరకు ఎదిగిన కొబ్బరి చెట్టును యజమానిని సంరక్షిస్తున్నారు. చెట్టు పెరిగి పెద్దదవుతున్న క్రమంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. చెట్టు అడ్డు వస్తున్నా తొలగించకుండా నిర్మాణ క్రమంలో మార్పులు చేసుకున్నారు. తర్వాత చెట్టు కొమ్మలు విస్తరించి ఇంటి నిర్మాణంలో చక్కగా ఒదిగిపోయింది. **- ఈనాడు అనంతపురం**

పీఏబీఆర్ నుంచి నీరు విడుదల

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం పీఏబీఆర్ నుంచి గురువారం ఒక గేటు ద్వారా 400 క్యూసెక్కుల నీటిని పెన్నానదిలోకి విడుదల చేశారు. మరోవైపు జల విద్యుత్పత్తికి 345 క్యూసెక్కులు వెళ్తున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 11 టీఎంసీలు. ఆనకట్ట భద్రత దృష్ట్యా 5 టీఎంసీల లోపే నీటిని నిల్వ చేస్తారు. ప్రస్తుతం 5.3 టీఎంసీల ఉన్నాయి. పైగా హంద్రీనీవా, పీఏబీఆర్ లింకు కాలువ ద్వారా 700 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఫలితంగా ఉరవకొండ మండలం మైలారంపల్లిలోకి క్రమంగా నీరు చేరుతోంది. ఈనేపథ్యంలో దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ ప్రక్రియను జలవనరుల ఎస్ఈ సుధాకర్‌రావు, ఈఈ శశిరేఖ, డీఈఈ వెంకటరమణ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

అప్రమత్తంగా ఉంటేనే.. చోరీలకు అడ్డుకట్ట

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో చైన్ స్నాచింగ్ ఘటనలు జరగకుండా పోలీసు పరంగా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్ని ముఖ్యంగా మహిళల్ని అప్రమత్తం చేయాలని ఎస్పీ జగదీశ్ పోలీసు అధికారులను ఆదేశించడంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గొలుసు దొంగతనాల నిరోధక చర్యలపై మహిళలకు తెలియజేశారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లో పోలీసులు నిఘా ఉంచారు. తెల్లవారుజామున ఇళ్ల బయట ప్రదేశాలు శుభ్రం చేయడం, ముగ్గులు వేయడం, వాకింగ్‌కు వెళ్లే మహిళలను ఆయా స్టేషన్ల పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడవడం, వాహనం నడపడం చేయరాదన్నారు. సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాలు ఉన్న వీధులు, మార్గాలు ఉపయోగించాలనీ, చీకటి ఉన్న గల్లీలు, శివారు, కంపచెట్ల మధ్య వెళ్లే దారుల వెంబడి వెళ్లకూడదన్నారు.

మహిళలకు జాగ్రత్తలు చెబుతున్న పోలీస్

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ముఖ్యం

అనంతపురం విద్య: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని డీఈవో ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు గురువారం డీఈవోను కలిసారు. చదువులతోపాటు, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, భావవ్యక్తీకరణ అలవరచుకోవాలని డీఈవో సూచించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఎస్కేయూ,రాప్తాడు: ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. గంగలకుంటలో ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. స్మైల్‌బ్రైట్- లైవ్ బ్రైట్ అనే నినాదంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దంతవైద్య నిపుణులు సందీప్, రాణి సంయుక్తంగా పరీక్షలు నిర్వహించారు.

ద్విచక్ర వాహనం చోరీ

అనంత నేరవార్తలు: అనంతపురం నగరంలోని సంగమేశ్ కూడలికి సమీపంలో అద్దె గదిలో ఉంటున్న ఓ వైద్యుడి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వైద్యుడు పార్థసారథి ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చదువుతున్నాడు. స్థానికంగా గది అద్దెకు తీసుకుని మిత్రులతో కలిసి ఉంటున్నాడు. బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని గది బయట పార్కింగ్ చేశాడు. గురువారం ఉదయం ద్విచక్ర వాహనం కనబడలేదు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అవీ.. ఇవీ..

సాంకేతిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

రాప్తాడు: పంటల సాగులో నూతన సాగువిధానాలు, పాటిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చని ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం కేంద్ర నోడల్ ఆఫీసర్ సుజాత శర్మ తెలిపారు. గురువారం హంపాపురం గ్రామంలో రైతులు సాంకేతికతో సాగు చేసిన దానిమ్మ, ద్రాక్ష పంటలను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కుష్ఠువ్యాధి సర్వే పక్కాగా నిర్వహించాలి

అనంతపురం(వైద్యం): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30 వరకూ నిర్వహించిన ఇంటింటా కుష్ఠు వ్యాధి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర సర్వేటీం పర్యవేక్షకురాలు ఉషారాణి, డీఎల్‌టీవో జయలక్ష్మి, సంజీవరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం అనంతపురంలోని ఇందిరానగర్, వినాయక్‌నగర్, ఆదిమూర్తినగర్‌లోని పట్టణారోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటా కుష్ఠు సర్వే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు.

తపాలాశాఖలో పదోన్నతులు..

అరవిందనగర్: తపాలాశాఖ అనంతపురం డివిజన్లో ఏడుగురు గ్రామీణ తపాలా ఉద్యోగులకు పదోన్నతి కలిగింది. దిల్లీలో సర్‌ప్లస్ కోటాలో అనంత డివిజన్లో సూర్యనారాయణరెడ్డి, శ్రీరాములు నాయక్, దేవరాజు, కుళ్లాయప్ప, పావని, సత్యమూర్తి, శివకుమార్‌లకు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

'రాక్రీట్‌పై నిందలు తగదు'

అనంత నగరపాలక: రాక్రీట్ సంస్థపై నిందలు వేయడం తగదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఆ సంస్థకు ఇంకా రూ.36 కోట్లు బిల్లులు రావాల్సి ఉందన్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : గంగ : **ఖైదు,** గౌరి : **రివాల్వర్ రీటా,** గాయత్రి : **జనతా బార్,** త్రివేణి, నీలిమ : **స్కూల్ లైఫ్,** తరంగిణి : **మరువ తరమా,** ఎస్వీ సినిమా : **రాజు వెడ్స్ రాంబాయి,** శాంతి : **ఆంధ్రకింగ్ తాలుకా.**

వృద్ధుడి అదృశ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారులోని రామకృష్ణ కాలనీకి చెందిన హుసేన్‌పీరా అదృశ్యమయ్యాడు. అతడు మతి స్థిమితం తప్పి సంచరిస్తుండేవాడు. ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు పరిసర కాలనీలు, తెలిసిన వారి వద్ద గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

మురుగులోనే తాగునీటి పైపులైన్లు

ఆత్మకూరు మండలం గొరిదిండ్లలో పలుచోట్ల మురుగు సమస్యలు తలెత్తుతున్నాయి. ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో మురుగు రెండు ఇళ్ల నడుమ వెళుతోంది. కాలువలు లేక నీరు సరిగా ముందుకు పారడం లేదు. కాలువను నిర్మించి వాటిపై మూతలు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నీరు ప్రవహించే ప్రాంతంలో కల్వర్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రధాన వీధిలో కాలువలోనే తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేశారు. వాటిని తీసి బయట వేస్తేనే నీరు కలుషితం అవకుండా ఇళ్లకు సరఫరా అవుతుంది. పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా వివరణ కోరగా కాలువల సమస్యపై ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకువెళ్లామని.. స్పందించి నిధులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. **- న్యూస్‌టుడే, ఆత్మకూరు**

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక ఉత్సవం

అనంత సాంస్కృతికం: నగరంలోని రాంనగర్ అయ్యప్పస్వామి (ధర్మశాస్త) ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేకం ఉత్సవంలో గురువారం పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. శతాధిక ప్రతిష్ఠాపనా చార్య గోరంట్ల భాస్కర తారానాథ శర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ పర్యవేక్షణలో వేదపారాయణం, నవగ్రహ దేవతారాధన, శ్రీమహాగణపతి, మూలమంత్ర హోమాలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సాయందీక్షా హోమం, జలాధివాసం, వేద స్వస్తి మంగళ హారతులిచ్చారు. శ్రీఅయ్యప్ప సేవా సంఘం సభ్యులు చేయూతనందించారు. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మూలమంత్ర జపం నిర్వహిస్తున్న పండితారాధకులు

'కోటి సంతకాల సేకరణ దండగ'

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: వైద్య రంగాన్ని అనన్య సామాన్యంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు వ్యతిరేకంగా వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం దండగని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఎద్దేవా చేశారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి బదులు రామకోటి రాస్తే కొంత మేలైనా జరుగుతుందని హితవు పలికారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు అస్తవ్యస్తమయ్యాయి. వాటిని సరిదిద్ది ప్రజలకు మేలు చేకూర్చాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుండగా.....వైకాపా నాయకులు అర్థం లేని కార్యక్రమాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. పీపీపీ విధానంపై బహిరంగ చర్చకు రావాలని మంత్రి సత్యకుమార్ అనేకమార్లు బహిరంగ సవాల్ విసిరినా మాజీ సీఎం జగన్ ఎందుకు స్పందించలేదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. దళిత మోర్చా నాయకుడు ప్రభు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవానంద్

47వ వర్ధంతి

కీ॥శే॥ M.రామయ్య గారు
రిటైర్డ్ టీచర్, అంబేద్కర్‌నగర్, అనంతపురం.
మీ మధుర స్మృతులతో... ఇట్లు..
కుటుంబ సభ్యులు
అంబేద్కర్‌నగర్, అనంతపురం. Cell: 09481044065

(c) eenadu

ఆమెకు అందలం.. ఆటకు లక్ష్మీ కటాక్షం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: వీరపునాయునిపల్లె మండలం ఎర్రమల్లపల్లె గ్రామానికి చెందిన శ్రీచరణి ఈ ఏడాది ఉమెన్స్ క్రికెట్ స్టార్‌గా నిలిచింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ వేస్తూ ప్రత్యర్థులకు పరుగులివ్వకుండా కట్టడి చేస్తోంది. తన ప్రతిభతో రాణిస్తూ జిల్లా క్రీడా ఖ్యాతిని నలుదిశలా చాటుతోంది. తాజాగా గురువారం నాటి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఆమెను దిల్లీ జట్టు మరోసారి దక్కించుకోవడం ఇందుకు నిదర్శనం.

- **2024:** డబ్ల్యూపీఎల్-2025 యాక్షన్‌లో దిల్లీ జట్టు శ్రీచరణిని రూ. 55 లక్షలకు దక్కించుకుంది. అదే ఆమెకు తొలి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్.
- **2025:** డబ్ల్యూపీఎల్‌లో శ్రీచరణి చక్కటి బౌలింగ్‌తో రాణించడంతో భారత మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత వరల్డ్‌కప్‌కు ఎంపికై అక్కడా రాణించింది.
- లభించిన ప్రతి అవకాశాన్ని శ్రీచరణి సద్వినియోగం చేసుకుంది. దీంతో డబ్ల్యూపీఎల్-2026కు గాను దిల్లీ జట్టు ఆమెను రూ. 1.30 కోట్లకు దక్కించుకుంది.

లక్కిరెడ్డిపల్లె చెరువులకు నిధులు



ఈనాడు, కడప: లక్కిరెడ్డిపల్లె మండలంలోని ఆరు చెరువుల పునరుద్ధరణ పనులకు రూ. 1.05 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగమున్నీయమ్మ కుంటకు రూ. 13.70 లక్షలు, రాజులపల్లి సమీపంలోని మంగళోనికుంటకు రూ. 18.80 లక్షలు, బడేదుకుంటపల్లి దగ్గరలోని గంగయ్యకుంటకు రూ. 18.50 లక్షలు, వడ్డేపల్లి సమీపంలోని నల్లత్తుమ్మ చెరువుకు రూ. 23.70 లక్షలు, జెలలోల చెరువుకు రూ. 16 లక్షలు, కుర్నాతల వద్ద వడ్డేపల్లికుంటకు రూ. 17.50 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు సాగునీటి సదుపాయాలు మరింతగా మెరుగవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాజు రాసిన ముడుపుల చిట్టా!

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టిన కట్టా రాజు రాసిన డైరీ ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో లభించిన ఈ డైరీలో పలువురికి వాటాల చెల్లింపుల వివరాలుండటమే అందుకు కారణం. మామూళ్లతో పాటు నకిలీ మద్యం సరఫరా చేసిన బెల్ట్ షాపుల నిర్వాహకులతో సాగించిన లావాదేవీలనూ అందులో పొందుపర్చినట్లు సమాచారం. సదరు డైరీని సిట్ అధికారులకు ఎక్సైజ్ అధికారులు అప్పగించారు.

నిందితుడు కట్టా రాజు

సిట్ చేతికి చేరిన జాతకాల డైరీ

నిర్వాహకుల నుంచీ వివరాలు

ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పీటీఎం మండలాల్లో నడిచిన గొలుసు దుకాణాల నిర్వాహకుల పేర్లూ డైరీలో ఉన్నట్లు సమాచారం. నిందితులు జనార్దన్‌రావు, బాలాజీ, నకిరేకంటి రవితో పాటు జయచంద్రారెడ్డి అకౌంటెంట్ తీసుకున్న నగదు వివరాలు అందులో నమోదయ్యాయి. దీంతో కట్టా రాజు డైరీలోని వివరాల ఆధారంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పుడు ఆరా తీస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి వివరాలు రాబడుతున్నారు.

అధికారుల్లో ఆందోళన మొదలు

నకిలీ మద్యం కేసులో ఏ1 నిందితుడైన జనార్దన్‌రావు ప్రధాన అనుచరుడు కట్టా రాజు. ఇతను ములకలచెరువులోని ఓ మద్యం దుకాణాన్ని ఈ ఏడాది మే నుంచి తన అధీనంలోకి తీసుకున్నారు. సమీపంలో ఖాళీగా ఉన్న డాబాను లీజుకు తీసుకుని నకిలీ మద్యం తయారీ చేపట్టారు. కొందరు ఎక్సైజ్ అధికారులకు నెలవారీ మామూళ్లిస్తూ వచ్చారు. డైరీలో విజయవాడ ఎస్‌టీఎఫ్ స్క్వాడ్, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ స్క్వాడ్, స్థానికంగా ఉన్న ఎక్సైజ్ కార్యాలయం, ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లకు నెలవారీగా ఎంత మొత్తంలో చెల్లించిందీ పేర్కొన్నారు. ఈ విషయాలు బయటికి పొక్కకుండా అధికారులు ఇప్పటి వరకు గోప్యంగా ఉంచారు. సిట్ అధికారులు ఆరా తీస్తుండటంతో వివిధ విభాగాల అధికారుల్లో ఆందోళన మొదలైంది.

నేడు తంబళ్లపల్లె కోర్టుకు నిందితులు

కేసులో ఏ1గా ఉన్న జనార్దన్‌రావుతో పాటు ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాస్‌రావు, రమేష్‌బాబు, షేక్ అల్లాబక్షులను తంబళ్లపల్లె కోర్టులో శుక్రవారం హాజరు పర్చనున్నారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న నిందితులను తీసుకొచ్చేందుకు ఎక్సైజ్ పోలీసులు ఇప్పటికే వెళ్లారు. జనార్దన్‌రావును కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించనున్నారు.

11.05 లక్షల మందితో మదనపల్లె జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, కడప: మదనపల్లె జిల్లా ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసింది. కొత్త జిల్లా ఏర్పాటుపై అభ్యంతరాలకు రానున్న 30 రోజుల వరకు గడువుగా పేర్కొంది. పరిపాలనను మరింత బలోపేతం చేయడం, ప్రజాసేవల అందుబాటును పెంచడం దృష్ట్యా జిల్లాగా ఏర్పాటు చేయడానికి ప్రాథమిక నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. జిల్లా ఏర్పాటుపై ఈ ప్రాంతంలో నివసించే, ప్రభావితమయ్యే వ్యక్తుల నుంచి అభ్యంతరాలు, సూచనలు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించింది.

- విడుదలైన ప్రాథమిక ప్రకటన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..
- మదనపల్లె జిల్లా ప్రధాన కార్యాలయంగా ఉంటుంది. 21 మండలాలతో కొత్త జిల్లా ఏర్పాటవుతుంది.
- మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలున్నాయి.
- కొత్తగా ఏర్పాటయ్యే పీలేరు రెవెన్యూ డివిజన్‌లో పీలేరు, సోమల, సదుం, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం ఉంటాయి.
- ఈ మండలాలన్నీ ప్రస్తుతం అన్నమయ్య, చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి.
- 11.05 లక్షల మంది జనాభాతో మదనపల్లె జిల్లా ఏర్పాటవుతుంది.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

ఒంటిమిట్ట, సిద్దవటం పైనా...: ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప రెవెన్యూ డివిజన్ నుంచి రాజంపేటలోకి కలుపుతూ ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. పరిపాలన సౌలభ్యం, అభివృద్ధి ప్రభావంతం చేయడానికి ఈ రెండు మండలాలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలుపుతూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అభ్యంతరాలుంటే రానున్న 30 రోజుల వ్యవధిలో రాత పూర్వకంగా జిల్లా కలెక్టర్‌కు తెలిపాలని సూచించింది.

చెరువుల్ని నింపింది చెయ్యేరు

3,148 ఎకరాలకు సాగు నీరు

నిండుకుండలా మన్నూరు చెరువు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రజాప్రతినిధుల చొరవ, అధికారుల ప్రణాళికతో చెయ్యేరులోని వృథా నీరు ఆదా అవుతోంది. నీటిని ఒడిసిపట్టి చెరువులను నింపారు. కాలువలను అభివృద్ధి చేయడంతో రాజంపేట, నందలూరు మండలాల పరిధిలోని ఎనిమిది చెరువులు నిండుకుండలా మారాయి. అన్నమయ్య జలాశయం ప్రధాన కాలువ లేకపోయినప్పటికీ నీటితో కళకళలాడుతున్నాయి.

చెరువు పేరు	ఆయకట్టు (ఎకరాల్లో)
పాటూరు	65
ఎర్రచెరువు	49
నందలూరు	392
లేబాక	314
మదనగోపాలపురం	50
తాళ్లపాక	152
మన్నూరు	696
పోలి	1,430
మొత్తం	3,148

- **పెరిగిన భూగర్భ జలాలు:** ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడం, చెయ్యేరు నదిలో ఎక్కువ రోజులు నీటి ప్రవాహం కొనసాగడంతో గత అయిదేళ్లలో ఎప్పుడూ లేనంతగా పరివాహక ప్రాంతంలో సాగు నీటి ఇక్కట్లు తొలగాయి. గతంలో 800 అడుగుల లోతు బోర్లు వేసినా నీటి జాడ కనిపించేది కాదు. ప్రస్తుతం నాలుగు అడుగుల్లోనే గంగమ్మ ఉబికి వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దయనీయం.. తప్పు ఎవరిదందాం!

దారి పొడవునా ఆరబోసిన ధాన్యాన్ని చూసి ఇదేదో మార్కెట్ యార్డో.. కల్లమో అనుకుంటే పొరపాటు. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారి ఇది. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని గువ్వలచెరువులో ఇలా దారంతా ఆరబోశారు. పండించిన వరి ధాన్యాన్ని ఇళ్ల వద్ద ఆరబెట్టేందుకు స్థలం లేదు. మార్కెట్ యార్డుల్లో అందుకు తగిన సదుపాయాలు లేవు. దీంతో జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో దాదాపు అర కిలో మీటరు పొడవున ఇలా ఆరబెట్టారు. ఈ కారణంగా సర్వీసు రోడ్డులో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. **- న్యూస్‌టుడే, రామాపురం**

హాయ్.. నేను బెన్ బెన్ రోబో

చిత్రంలో శునకంలా కనిపిస్తున్నది ఓ రోబో. పేరు బెన్ బెన్. కడప నగర శివార్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఇది సందడి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, ఏఐఎం, యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ కలిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు శిక్షణ ఏర్పాటు చేశారు. ల్యాబ్ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు చేరవేయడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రైవేట్ సంస్థ రూపొందించిన బెన్ బెన్ అనే రోబో పనితీరును గురువారం ప్రదర్శించారు. శిక్షణకు హాజరైన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో బెన్ బెన్ కరచాలనం చేస్తూ.. ప్రాంగణంలో కలియతిరుగుతూ ఆకట్టుకుంది. **- న్యూస్‌టుడే, కడప విద్య**

5న సివిల్స్ శిక్షణకు పరీక్ష

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: బీసీ సంక్షేమ శాఖ నిర్వహించే సివిల్స్ శిక్షణార్థులకు డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. అభ్యర్థులు పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జతచేసి పాత రిమ్స్ ఆవరణంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

యుద్ధ విద్య నేర్వాలి.. రాణి లక్ష్మీబాయిలవ్వాలి

కలికిరి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రుల్లోనూ వారి రక్షణకు సంబంధించి కొంత భయాందోళన ఉంటోంది. విద్యార్థి దశలోనే బాలికలు యుద్ధవిద్యలో సుశిక్షితులుగా ఎదిగితే భవిష్యత్తులో ఆత్మరక్షణకు ఆలంబనగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం గతంలో ఆలోచించింది. ఆ మేరకు పాఠశాలల్లో 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' కార్యక్రమాన్ని అమలు చేసింది. కొద్దికాలం తర్వాత ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యలో నిపుణులతో శిక్షణ ఇప్పించాలని మళ్లీ ప్రభుత్వం నిర్ణయించింది.

కలికిరి బాలికోన్నత పాఠశాలలో ఆత్మరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

- జిల్లాలో 2,103 పాఠశాలలతో పాటు 49 జూనియర్ కళాశాలలు, 12 గురుకుల పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు ఎనిమిది వేల మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు.
- గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బాలికలకు కరాటేలో శిక్షణ కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేసింది.
- కొవిడ్ సమయంలో అప్పటి వైకాపా ప్రభుత్వం నిలిపేసింది.
- తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాలికల భద్రతపై దృష్టిసారించి కరాటే శిక్షణను ప్రారంభించింది.
- ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు రెండు నెలలపాటు శిక్షణ ఇస్తారు. ఇందుకుగాను ప్రతి పాఠశాలలో రెండు నెలల్లో ఇరవై వరకు తరగతులు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు.
- ఒక్కో తరగతికి 90 నిమిషాల పాటు శిక్షణ ఇచ్చే బాధ్యతను మార్షల్ ఆర్ట్స్ సంస్థలకు అప్పగించారు.



బోగస్‌కు లేదు ఉపాధి

66,429 జాబ్ కార్డుల తొలగింపు

కంభంవారిపల్లి, చిన్నమండెం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో ఉపాధి హామీ పథకం అమలులో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుంది. పనులు ఒకరు చేస్తే, బిల్లులు మరొకరికి చెల్లించారు. కూటమి ప్రభుత్వం అవినీతికి అవకాశం లేకుండా.. నిజమైన శ్రామికులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తోంది. కేంద్రం ఆదేశాల మేరకు ఈకేవైసీ అమలు చేసింది. ఇందులో భాగంగా ఉపాధి సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 90 శాతం జాబ్‌కార్డులకు ఈకేవైసీ పూర్తి చేశారు. దీంతో శ్రామికుల సంఖ్యలో పలువురు బోగస్ ఉన్నట్లు తేలింది. ఈ విషయమై ఆ పథకం పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ.. తొలగించిన శ్రామికుల్లో అర్హులుంటే, మళ్లీ దరఖాస్తు చేసుకుంటే జాబ్‌కార్డు మంజూరు చేస్తామన్నారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లినవారి జాబ్‌కార్డులు తొలగించినట్లు తెలిపారు.

జిల్లాలో 90 శాతం ఈకేవైసీ పూర్తి

ఈకేవైసీకి ముందు జిల్లాలో జాబ్ కార్డులు 2,50,000	ఆ కార్డుల్లోని శ్రామికులు 1,51,707 మంది
ఈకేవైసీ చేసిన తర్వాత తొలగించినవి 66,429	ప్రస్తుతం మిగిలిన జాబ్‌కార్డులు 1,91,477

అందులోని శ్రామికులు: 3,06,304 మంది

(c) eenadu

అక్కడ కేసులు.. ఇక్కడ ఊసులు

పల్లెలో ఆక్రమణలపై ఉక్కుపాదం

రాజంపేట ప్రాంతంలో చెవికెక్కదు

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ, రాయచోటి

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెవెన్యూ దస్త్రాలను పరిశీలిస్తూ ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. స్థలాల స్వాధీనానికి అడ్డుకునేందుకు యత్నిస్తే ఆక్రమణదారుపై కేసుల నమోదుకు వెనుకాడడం లేదు. ఇది మదనపల్లెలో జరుగుతోంది. జిల్లా కేంద్రం రాయచోటిలో పట్టించుకోవడం లేదు.

పప్పిరెడ్డిగారిపల్లె వద్ద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి

కొన్ని ఉదాహరణలివి

★ మండలంలోని కోళ్లబైలు పంచాయతీ సర్వే నంబరు 529లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని జేసీబీలతో చదును చేస్తున్నారని తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 7న రవి, నాగార్జునలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

★ పట్టణంలోని బీకేపల్లె గుట్టపై ఈ ఏడాది అక్టోబరు 6న కొందరు పట్టాలు లేకుండా అక్రమంగా జేసీబీతో చదును చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండటంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జేసీబీను స్వాధీనం చేసుకున్నారు. దాదాను 10 సెంట్ల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ★ పప్పిరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామంలో బెంగళూరు రహదారి సమీపంలోని 12/07, 12/10 సర్వే నంబరులో రూ.1.60 కోట్ల విలువైన ప్రభుత్వ గయ్యాలి భూమి చుట్టూ ప్రహరీ నిర్మించారు. దాదాపు 16 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు వచ్చిన ఫిర్యాదు మేరకు దస్త్రాలను పరిశీలించారు. అక్రమణలుగా గుర్తించిన రెవెన్యూ అధికారులు ప్రహరీని జేసీబీతో గూల్చేసి స్వాధీనం చేసుకున్నారు.

★ కోళ్లబైలు పంచాయతీలోని 4.74 ఎకరాల ప్రభుత్వ స్థలం కోర్టులో వివాదం నడుస్తుండగా శ్రీనివాసులు, భాస్కర్‌లు జేసీబీతో చదును చేసి, పంట పెట్టడంపై తహసీల్దారు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఈ ఏడాది అక్టోబరు 17న కేసు నమోదు చేశారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లోని సర్వే నంబర్లు 615/1, 529లలోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇదే పంచాయతీలోని సర్వే నంబరు 614/2, 614/3లోని ప్రభుత్వ లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాలకు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

కోళ్లబైలు పంచాయతీలోని ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

రాయచోటిలో కంచెను తొలగించిన అక్రమార్కులు

జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రధాన రహదారులకు అనుబంధంగా ఉన్న వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించి ప్రజోపకార పనులు చేపట్టడం లేదు. 2016-18 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం రాయచోటి పట్టణంలో వెలికి తీసిన గడ్డిమేత స్థలాన్ని పురపాలక స్వాధీనం చేసుకొంది. అప్పట్లోనే జిల్లా కలెక్టరు హరికిరణ్ చొరవతో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఆఘమేఘాల మీద పురపాలక అధికారులు ఆక్రమణలు తొలగించి స్థలం స్వాధీనం చేసుకొని కంచె ఏర్పాటు చేశారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పార్కు నిర్మాణానికి హామీ ఇచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పాలకుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకొన్న కొందరు ఆక్రమణదారులు కంచె తొలగించి ఇష్టానుసారం రోడ్లు వేశారు. ఖాళీ ప్రదేశంలో ప్రైవేట్ వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపి ఆక్రమించేశారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకునే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది. సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్, రొమాంటిక్ రిట్రీట్‌కు గ్లాంపింగ్ వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకునేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకునే సుందర ప్రకృతితో సరికొత్తగా రోజుని ప్రారంభించాలనుకునేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, ఫస్ట్ కాంతో.. ఊయలలో.. మనసుకు ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకోవటం.. చలిమంటలు కాగుతూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలుచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకునే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

విద్యా సంస్థల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

రాయచోటి, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో గంజాయి ఉత్పత్తిదారులు, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని క్యాంటీన్లలో పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ద్వారా ప్రజలందరికీ ఉత్తమ సర్వే నిర్వహించాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా బియ్యం సేకరణ త్వరగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మాట్లాడుతున్న అబ్జర్వర్ మహేంద్రన్, పక్కన నాయకులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

రాయచోటి గ్రామీణ: జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్ అన్నారు. గురువారం రాయచోటిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆసక్తి, అర్హత గల నాయకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అబ్జర్వర్ ఆశోక్ రత్నం, ప్రస్తుత అధ్యక్షుడు గాజుల భాస్కర్, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లకు ప్రజల పాట్లు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి డాక్యుమెంటు రైటర్‌లు సామూహికంగా గైర్హాజరయ్యారు. ఈ కార్యాలయ ప్రాంగణంలోని గదులను అద్దెకు తీసుకుని ఉంటున్న వీరంతా ఒకేసారి తలుపులు మూసుకుని వెళ్లిపోయారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి ఆస్తుల క్రయ, విక్రయాల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలపై కడప డీఐజీ ఇటీవల విచారణను నిర్వహించారు. అప్పటి నుంచి సబ్‌రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు సెలవుపై వెళ్లగా గురువారం డాక్యుమెంటు రైటర్‌లు కూడా విధులకు రాలేదు. డాక్యుమెంటు రైటర్‌ల గైర్హాజరు ప్రభావం ఉన్నప్పటికీ నాలుగు దస్తావేజులను రిజిస్టర్ చేశామని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సంక్షేమ పథకాలతో అన్నదాతకు అండ

● సబ్ కలెక్టర్ భావన

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి అధికారులు చేస్తున్న సర్వేని రాజంపేట సబ్ కలెక్టర్ భావన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమం రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆమె చెప్పారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ గురించి రైతులను వివరాలు అడిగి సేకరించారు. ఈ యాప్ వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఫిర్యాదు చేయడానికి, వివిధ రకాల రాయితీలు పొందడానికి వీలుంటుందని చెప్పారు. సర్వే కార్యక్రమం వేగంగా పూర్తి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పెనగలూరు తహసీల్దార్ అమరేశ్వరి, ఏవో సుబ్రహ్మణ్యం, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనగలూరు మండలం నారాయణనెల్లూరు గ్రామంలో రైతన్నా...మీ కోసం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భావన

ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ స్థలం పరిశీలన

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో నూతనంగా నిర్మించనున్న ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని గురువారం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో స్థలానికి సంబంధించిన దస్త్రాలతో పాటు మ్యాప్‌లను పరిశీలించారు. వెంటనే స్థలానికి సంబంధించిన అన్ని దస్త్రాలు సిద్ధం చేసి సంబంధత శాఖకు భూమిని అప్పగించాల్సి ఉంటుందని రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. అందుకు సంబంధించిన పలు విషయాలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు నరసింహకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

ఆయువు తీసిన అతివేగం

● యువకుడి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

కనకయ్య (పాత చిత్రం)

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అతి వేగంగా ద్విచక్ర వాహనం నడపడంతో నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది. రాజంపేట పట్టణం ఎర్రబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నందలూరు మండలం, అరవపల్లి గ్రామానికి చెందిన యువకుడు కనకయ్య (22) మృతి చెందగా, జగదీష్ తీవ్రంగా గాయపడి కడప పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు మన్నూరు పోలీసులు చెప్పారు. నందలూరు పట్టణం అరవపల్లి గ్రామానికి చెందిన కొమ్మల కనకయ్య, జగదీష్ రాజంపేట పట్టణంలో స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లారు. తిరిగి నందలూరుకి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎర్రబల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు...

సంబేపల్లె: అప్పటి వరకు పెండ్లి వేడుకలో బంధువులతో సంతోషంగా గడిపిన ఆ యువకుడు మరికొన్ని నిమిషాల్లో ఇల్లు చేరతాడనగా వాహనం నుంచి పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఈ విషాదకర ఘటన గురువారం సంబేపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం తాటికుంట దళితవాడకు చెందిన సిరిపురి ఆంజనేయులు, రాజేశ్వరిలకు కుమారుడు, కుమార్తె. బుధవారం గుట్టపల్లెలో జరిగిన బంధువుల వివాహానికి కుమారుడు రుషేంద్ర (17) హాజరయ్యాడు. గురువారం వాహనంలో ఇంటికి తిరిగి వస్తూ తాటికుంట దళితవాడకు సమీపంలో మలుపు వద్ద వాహనం నుంచి పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ రుషేంద్రను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోవడంతో ఆ కుటుంబ రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో గుళికల మందు తిని..

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని పందిళ్లపల్లె పంచాయతీ జె.వడ్డెపల్లెకు చెందిన లక్ష్మీ ప్రసన్న (15) గురువారం గుళికల మందు తిని మృతి చెందినట్లు ఎస్సై రవీంద్రబాబు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. లక్ష్మీప్రసన్న తల్లి బి.యర్రగుడి గ్రామానికి పెళ్లికి వెళ్లిందని తాను కూడా వస్తానని తల్లిని అడగగా వద్దని త్వరగా వస్తామని ఇంటి దగ్గరే ఉండమని చెప్పింది. మనస్తాపానికి గురైన లక్ష్మీ ప్రసన్న పొలానికి తెచ్చిన గుళికల మందు తిని అపస్మారక స్థితో ఉండటంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..

రాజంపేట గ్రామీణ: పెనగలూరు మండలం తిరుణంపల్లి గ్రామానికి చెందిన రాజేష్ (34) చేపల వేటకు వెళ్లి గుంజనేరులోని సుడిగుండాల్లో చిక్కుకుని మృతి చెందినట్లు పెనగలూరు ఎస్సై రఘురాం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. పెనగలూరు మండలం తిరుణంపల్లి గ్రామానికి చెందిన రాజేష్ తిరుపతిలో చేపల వ్యాపారం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం స్వగ్రామం తిరుణంపల్లికి వచ్చాడు. చేపలు పట్టే అనుభవం ఉండడంతో గురువారం గ్రామానికి సమీపంలోని గుంజనేరుకు వెళ్లాడు. ఈ క్రమంలో నదిలో సుడిగుండాల్లో చిక్కుకుని మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. మృతి చెందిన వ్యక్తికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైకాపా విష ప్రచారానికి తెరదించిన సీఎం

రాయచోటి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు చెన్నముక్కపల్లె గ్రామస్థులు పాలాభిషేకం చేశారు. జిల్లా కేంద్రం రాయచోటిని మార్పు చేస్తున్నారన్న వైకాపా దుష్ప్రచారానికి తెర దించుతూ స్పష్టత నిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో వాస్తవాలు వెలుగు చూశాయని తెదేపా నాయకులు కొండారెడ్డి, సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు తరలి వచ్చి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లా కేంద్రం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు రాయదుర్గం లక్ష్మీదేవి, చంద్రమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

సామర్థ్యాలకు అనుగుణంగా విద్యా బోధన

సంబేపల్లె, న్యూస్‌టుడే : విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన అవసరమని డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మోటకట్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) బేస్‌లైన్ టెస్ట్‌ను ఆయన పరిశీలించారు. ఈ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పిక్చర్ రీడింగ్, అక్షరాల గుర్తింపు, పదాల పఠనం, పేరాగ్రాఫ్ చదవడం, కథ అవగాహన వంటి అంశాలను పరీక్షిస్తున్నామన్నారు. గణితంలో సంఖ్యల గుర్తింపు, తీసివేత, గుణకం, భాగహారం వంటి ప్రాథమిక నైపుణ్యాల ఆధారంగా సామర్థ్యాలను అంచన వేస్తున్నామని తెలిపారు. పరీక్ష ఫలితాల ద్వారా ప్రతి విద్యార్థి ఏ స్థాయిలో ఉన్నాడో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మజ, ఛాత్రోపాధ్యాయులు అతియా, రజియా, సీఆర్పీ వసుంధర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి

విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించే బాధ్యత మీదే

రాయచోటి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించే బాధ్యతను తీసుకోవాలని యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ తెలిపారు. రాయచోటిలోని మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ పాఠశాలల కార్యశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. అటల్ టింకరింగ్ పాఠశాలల్లో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని ఆయన తెలియజేశారు. ఉపాధ్యాయులు రూపొందించిన కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు ప్రతి నెలా మానిటరింగ్ చేసి లీఫ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్, రాష్ట్ర సమగ్ర శిక్ష యూనిసెఫ్ ఈ కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. అటల్ ప్రయోగశాలల్లో కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, వ్యవస్థాపకులుగా రూపొందుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో అసదుల్లా, జిల్లా సైన్సు అధికారి ఓబుల్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్లు ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్

రాయచోటిలో ఇస్కాన్ పాదయాత్ర

రాయచోటి, న్యూస్‌టుడే : అంతర్జాతీయ కృష్ణ సంఘం సంపూర్ణ భారత దేశ పాదయాత్రలో భాగంగా గురువారం రాయచోటి పట్టణానికి చేరుకుంది. 1984 సంవత్సరం నుంచి పాదయాత్ర నిరాటంకంగా కొనసాగుతోందని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఇస్కాన్ మహామంత్రం అయిన హరే కృష్ణ మంత్రం ప్రపంచాన్ని దేశంతో కలుపుతోందని తద్వారా వివిధ దేశాల్లో ఇస్కాన్ ఆధ్యాత్మిక ఒరవడిని సృష్టిస్తోందన్నారు. ఇస్కాన్ అక్షయపాత్ర, గోసంరక్షణ, వేద విద్య వంటి కార్యక్రమాలను సంఘం నిర్వహిస్తోందన్నారు. పాదయాత్రలో మేలు జాతి ఎద్దులతో ఏర్పాటు చేసిన రథంపై ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాధకృష్ణుల ప్రతిమలతో పాటు ఇస్కాన్ సంఘం వ్యవస్థాపకులు భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రతిమలు చూపరులను ఆధ్యాత్మిక జగత్తులోకి తీసుకెళ్లాయి. హరే కృష్ణ మంత్రాన్ని గానం చేస్తూ భగవద్గీత, రామాయణ గ్రంథాలను ప్రజలు చదవాలని సూచించారు. పాద యాత్ర రథాన్ని పట్టణ ప్రజలు ఆశ్చర్యచకితులై తిలకించారు. ఈ యాత్ర కన్యాకుమారి వరకు కొనసాగుతుందని అంతర్జాతీయ కృష్ణ సంఘం ప్రతినిధులు తెలిపారు.

రాయచోటిలో నేతాజీ సర్కిల్ వద్ద ఇస్కాన్ పాదయాత్ర బృందం

అక్రమాలపై విచారణ చేపట్టండి

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు మేజర్ గ్రామ పంచాయతీలో అధికారులు నిధుల దుర్వినియోగం చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఫోర్జరీ సంతకాలు, ప్లాన్ అప్రూవల్, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై విచారణ జరపాలన్నారు.

తెదేపా నాయకుడి గృహ నిర్బంధం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం మదనపల్లె పర్యటనకు వస్తున్న నేపథ్యంలో తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఇటీవల ఆయనకు వైకాపా నాయకులకు మధ్య నడుస్తున్న వైద్య కళాశాల వివాదం మనందరికీ విదితమే. అయితే ఇలాంటి సమయంలో వైకాపా ఎంపీ ఆ ప్రాంతంలో పర్యటిస్తుండటంతో అక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు ఆయన్ను ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. అలాగే ఆయన మాట్లాడిన మాటలపై వివరణ ఇవ్వాలని పోలీసులు కోరారు. ఎంపీ మిథున్‌రెడ్డి కార్యక్రమం పూర్తయ్యే వరకు ఆయన్ని గృహ నిర్బంధంలోనే ఉంచడం సర్వత్రా చర్చ జరుగుతోంది.

శ్రీరామ్ చినబాబు ఇంటి వద్ద పోలీసు పహారా

కుటుంబ సమస్యలతో ఆత్మహత్య

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యలతో విరక్తి చెంది ఒకరి ఉరేసుకుని మృతి చెందిన ఘటన మదనపల్లెలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఝార్ఖండ్ రాష్ట్రం హుస్సేన్‌బాద్ జిల్లా కంగార్‌పూర్‌కు మోతీరాజ్‌వార్(24) కొంత కాలం కిందట ఉపాధికోసం మదనపల్లెకు వచ్చారు. ఇక్కడ పోతబోలు సమీపంలోని ఆర్.సి.కురవపల్లెలో నివాసం ఉంటూ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి కుటుంబ సమస్యలతో విరక్తి చెందిన ఆయన పనిచేసే ప్రాంతానికి సమీపంలోనే చెట్టుకు ఉరేసుకుని మరణించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES | JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

ప్రొద్దుటూరు D&C అసోషియేట్స్‌లో పనిచేయుటకు ఇంటర్/డిగ్రీ చదివి Comp. Operatorగా పనిచేయుటకు మహిళలు కావలెను. శాలరీ: 10 - 12K స్టార్టింగ్. ✆ 9642484707.

PERSONAL CLASSIFIEDS

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్ట్ పద్ధతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్. 8341177761/8019647888

CHANGE OF NAME

I, Kotapati Vahini Priya, R/o D.No.3/16, Venkatypalli, Ponnaolu, Siddavatam(M), YSR Dist, AP. Declare that I have changed my name from Rajeswari (Old Name) to Kotapati Vahini Priya (New Name). Henceforth, I shall be known as Kotapati Vahini Priya for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

CONSULTANCY

తిరుపతి మరియు తిరుపతి పరిసర ప్రాంతాలలో స్థలం కొనాలన్నా అమ్మాలన్నా మమ్మల్ని సంప్రదించగలరు. Ph: 99890 76007, 90320 76007.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ|| 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248, PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

AUTO — వాహనాల అమ్మకం
REAL ESTATE — ఇళ్ళు, ఫ్లాట్లు, స్థలాలు అమ్మకాలు... కొనుగోళ్ళు...
JOBS — ఉద్యోగాల భర్తీ...
TO LET — ఇళ్ళు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు
PERSONAL CLASSIFIEDS — మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు
BUSINESS SERVICES — బ్యూటీ పార్లర్స్, ఫొటోగ్రఫి, బిజినెస్ వ్యవహారాలు...

5 లైన్ల బ్లాక్ & వైట్ ప్రకటన రూ.350/- B/W రూ.410/- Col మాత్రమే *GST 5% అదనం

THE EENADU WAY CLASSIFIEDS
ఈనాడు క్లాసిఫైడ్స్
వివరాలకు సంప్రదించండి:
కడప: 9989997626, 8008514248
ప్రొద్దుటూరు: 8008597620

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

సేవలు లోపిస్తే.. కఠిన చర్యలు

మాట్లాడుతున్న 1వ డీఎం రమణారెడ్డి

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ 1వ డిపో పరిధిలో ఆయా బస్సుల్లో ప్రయాణికులకు సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని డిపో మేనేజరు ఎ.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. ఇందులో భాగంగా ఆదాయ సాధన, డీజిల్ పొదుపులో జిల్లాలో 1వ డిపో ప్రథమ స్థానం సాధించినందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో నిత్యం ప్రయాణిస్తున్నారు, దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులకు సేవలు అందించడంలో లోపం ఉంటే చర్యలు తప్పవన్నారు. మెకానికల్ ఏఈ రవికుమార్, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట పోలీసు స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ వెంకటాద్రి తనిఖీ చేశారు. కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న బి.కొత్తకోట పరిసర ప్రాంతాల్లో జరిగిన సంఘటనలపై సిబ్బందితో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం నియోజకవర్గ తెదేపా పోల్ మేనేజ్‌మెంట్ సమన్వయకర్త కుడుం శ్రీనివాసులు, స్థానికులు ఎస్పీని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వెంకటాద్రి

ప్రతిభ చూపారు.. బహుమతులు పట్టారు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె పట్టణంలోని హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస (స్పీచ్) పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గౌస్‌ఆజాము (10వ తరగతి), జి.భావన (9వ తరగతి), కె.గాయత్రి (10వ తరగతి)లు గెలుపొందారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

విజేతలతో హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు

ప్రశంసా పత్రాలు చూపుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మదనపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస (స్పీచ్) పోటీలు జరిగాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎం.భవ్యశ్రీ (8వ తరగతి), డి.యన్నికవిని (10వ తరగతి), జె.సుదర్శన్ (8వ తరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

గుంతల దారి.. అవస్థలే మరి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రం నుంచి జిల్లా పునర్విభజనలో భాగంగా మదనపల్లె జిల్లా కేంద్రంగా మార్పు చెందింది. ఇయినప్పటికి ఇక్కడి నుంచి ప్రధాన నగరాలకు వెళ్లే రహదార్లు మాత్రం అధ్వానంగానే ఉన్నాయి. గత వైకాపా పాలనలో రహదార్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో అడుగుకో గోతిగా మారింది. ప్రయాణికులు నరకయాతనపడుతున్నారు.

డీఎస్పీ బంగ్లా వద్ద గుంతల రోడ్డు

● మదనపల్లె నుంచి పుంగనూరు మార్గంలో మూడు కిలోమీటర్ల వరకు అడుగడుగునా గుంతలున్నాయి. ఈ మార్గంలో మదనపల్లె నుంచి చిత్తూరు, చెన్నై, కుప్పం, తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తం, కృష్ణగిరి, కేరళలోని శబరిమలైకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. మదనపల్లె పట్టణ ప్రజలే కాకుండా అనంతపురం నుంచి, కర్ణాటక రాష్ట్రంలోని రాయల్పాడు ప్రజలు మదనపల్లె మీదుగా ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉంటుంది. పట్టణంలోని చిత్తూరు బస్టాండ్ నుంచి బసినికొండ పంచాయతీ వైజంక్షన్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రివేళ ద్విచక్రవాహనదారులు, ఆటో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

● మదనపల్లె మీదుగా బెంగళూరు వెళ్లే రహదారిలోని రాష్ట్ర సరిహద్దు వరకు 10 కి.మీ పొడవున జలీవల కురిసిన వర్షాలతో గుంతలు ఏర్పడ్డాయి. నక్కలదిన్నె, సిమ్మిరెడ్డిగారిపల్లె, హంద్రీ-నీవా కాలువ వంతెన వద్ద, బార్లపల్లె, చీకలబైలు ప్రాంతాల్లో రోడ్లపై తారు లేచిపోయి గుంతలుగా మారాయి. కంకరతేలిన రహదారుల్లో వాహనదారులు ప్రయాణించలేక అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో దాదాపు 150 గ్రామాలున్నాయి. రైతులు, వ్యాపారస్థులు మదనపల్లెకు అటు బెంగళూరు, చింతామణి, రాయలపాడుకు ప్రయాణం చేస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు నడుమ నొప్పులతో పాటు, కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. దీంతో పాటు రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు భవనాలశాఖ అధికారులు దీనిపై స్పందించి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

బెంగళూరు మార్గం ఇలా

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

?: మదనపల్లెలోని వేంపల్లె పంచాయతీ కొనకుంటవారిపల్లె బెంగళూరు రహదారిపై చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వస్తోంది. - రమేశ్, బెంగళూరురోడ్డు
✓: వెంటనే సిబ్బందిని పంపి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - తాజీముస్సార్, ఎంపీడీవో, మదనపల్లె - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: తాళ్లసుబ్బన్నకాలనీలో మురుగు కాలువల్లో చెత్త పేరుకు పోయి నీరు ప్రవహించడం లేదు. - శ్యామ్, తాళ్లసుబ్బన్నకాలనీ
✓: వెంటనే సిబ్బందిని పంపి మురుగు కాలువల్ని శుభ్రం చేయిస్తాం. - షర్ఫుద్దీన్, కార్యదర్శి, కొత్తపల్లె, మదనపల్లె - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: బొమ్మనచెరువులోని వెంకటేశ్వర రోడ్డులో మురుగు కాలువల్లో పూడిక నిండి మురుగు పారడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. - రమణ, వెంకటేశ్వరరోడ్డు
✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయిస్తాం. - భారతి, డిప్యూటీ ఎంపీడీవో, మదనపల్లె - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: రంగారెడ్డికాలనీలోని మిషన్‌రెడ్డిపల్లి వీధిలోని దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళ బయటకు వెళ్లాలంటే సమస్యగా ఉంది. - నవీన్, రంగారెడ్డికాలనీ
✓: వీధి దీపాలను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - స్వేత, సచివాలయం కార్యదర్శి, కొత్తిండు పంచాయతీ, మదనపల్లె - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: నేతాజీ కాలనీలోని తిరుపతి మార్గంలో మురుగు నీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. - అక్షిత, తిరుపతి రోడ్డు, నేతాజీకాలనీ
✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. - పవన్‌కుమార్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, మదనపల్లె - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

అవమానించారని ఆత్మహత్యాయత్నం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: అందరి ముందు అవమానించారని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బి.కొత్తకోట మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదు. నాయునిచెరువు రోడ్డులో వేసే గేట్ల వద్ద నిలబడి ఉండగా ఆమెను కొందరు చూసి పాఠశాలకు ఎందుకు రావడం లేదని ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని బంధువులకు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థిని పాఠశాల తరగతులకు హాజరయ్యారు. కొంత సమయానికి అక్కడికి బాలిక మామ చేరుకుని అందరి ముందు పాఠశాలకు ఎందుకు వెళ్లలేదని దూషించడంతో మనస్తాపానికి గురయ్యారు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఆ బాలిక విషద్రావణం తాగి అస్వస్థకు గురికావడంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హెచ్‌ఎంను వివరణ కోరగా.. ఆ విద్యార్థిని ఎవరూ ఏమి అనలేదని, ఆ బాలిక మామే అందరి ముందు దూషించారన్నారు.

ఎన్‌జీవో నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గం సభ్యులు వీరే..

వాల్మీకిపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీ ఎన్జీవో వాయల్పాడు తాలూకా ఎన్నికలు గురువారం ఎన్నికల అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారి నరసింహ, పరిశీలకులుగా జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌లు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో 12 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాయల్పాడు తాలూకా ఎన్జీవో అధ్యక్షుడిగా రాజేష్, సహఅధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా మహమ్మద్‌రఫి, ఐరెడ్డిప్రసాద్, సలీం, ధనలక్ష్మి, కార్యదర్శిగా గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా ప్రమీలదేవి, మహేష్, కళామజాద్, వరలక్ష్మి, కోశాధికారిగా కిషన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మదనపల్లె జిల్లా ప్రకటనపై సంబరాలు

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నియోజకవర్గంలోని ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటించిన తర్వాత ఆయన విజయవాడ నుంచి గురువారం సాయంత్రం మదనపల్లెకు వచ్చారు. మదనపల్లెకు వచ్చే దారి పొడవునా ప్రజలు ఆయనకు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయడంలో ఎమ్మెల్యే కృషి ఎంతో ఉందని కొనియాడారు. ర్యాలీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు.

మదనపల్లె విద్య: ప్రజల చిరకాల కోరిక అయిన మదనపల్లెను జిల్లా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి స్థానిక ఎన్టీఆర్ కూడలిలో గురువారం పాలాభిషేకం చేశారు. తెదేపా ఎన్ఆర్ఐ విభాగం నాయకుడు లోకేశ్‌నాయుడు సూచన మేరకు ఆయన అనుచరులు ఈ కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె వాసుల చిరకాల కోరిక కూటమి ప్రభుత్వంతో నెరవేరిందని, ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవినాయక్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో నిర్వాహకులు విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మదనపల్లె రూరల్ సీఐ రవినాయక్ అన్నారు. గురువారం మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో కురబలకోట మండలం అంగళ్లులోని వసతి గృహాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులు సురక్షితమైన, క్రమశిక్షణ కలిగి ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల కోసం క్రమం తప్పకుండా భద్రతా ఆడిట్‌లు, ఫిర్యాదుల పరిష్కార విధానాలు అమలు చేయాలన్నారు. వసతి గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ముదివేడు ఎస్ఐ మధురామచంద్రుడు, మిట్స్ కళాశాల అధ్యాపకులు మారుతీప్రసాద్, రియాజ్‌ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నవోదయ విద్యార్థుల గ్రామసభ

గ్రామ సభలో సర్పంచిగా మాట్లాడుతున్న విద్యార్థిని యుక్తప్రియ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులే గ్రామ సర్పంచి, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజలు.. ఇలా అన్ని విభాగాలతో నవోదయ విద్యాలయం విద్యార్థులు వలసపల్లె గ్రామసభను గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గీత మాట్లాడుతూ విద్యార్థులకు గ్రామాల్లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కరణకు తీసుకుంటున్న మార్గాలు, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేసేందుకే ఈ సభ నిర్వహించినట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు గ్రామ పరిపాలనపై అవగాహన వస్తుందన్నారు. అనంతరం గ్రామ సభలో సర్పంచిగా 9వ తరగతి విద్యార్థిని యుక్తప్రియ అధ్యక్ష స్థానంలో కూర్చొని గ్రామసభను నిర్వహించారు. ఈ సభలో మోక్షజ్ఞ (స్వయం సహాయక సమూహ సభ్యురాలు), భువి కీర్తి (వార్డుసభ్యురాలు, ఆరోగ్య, పారిశుద్ధ్య బాధ్యతలు), హర్షిణి (ప్రభుత్వేతర సంస్థ కార్మికురాలు), జ్ఞానశ్రీ (విద్యాలయ నిర్వహణ కమిటీ తల్లిదండ్రుల ప్రతినిధి), హనీ (సహాయక కార్యదర్శి), తన్మయి (పంచాయతీ కార్యదర్శి), సంజన (అంగన్‌వాడి కార్యకర్త), దివ్య (వ్యవసాయ సహాయకురాలు), హర్షిత (వార్డు మెంబర్ 1, స్వయం సహాయక సభ్యురాలు(మధ్యాహ్నభోజనం), కీర్తన (వృద్ధమహిళల సహాయకురాలు), లీలాప్రియ (ఆశా కార్యకర్త), మనస్వీ (గ్రామ విద్యాలయ ప్రధానాచార్యులు), రాకేష్ (క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమ విభాగాధిపతి), వి.అజిత్‌కుమార్ (రైతు ప్రతినిధి), హరివంశీ (డేటా నమోదు నిర్వాహకుడు), ఎ.లలిత్‌సాగర్ (ఉపాధి సహాయకుడు), జయంత్ (యువత ప్రతినిధి), నితీష్‌సాయి (వార్డు ప్రతినిధి)గా వ్యవహరించారు. వీరంతా గ్రామ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కురవంక సర్పంచికి నోటీసులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పంచాయతీ నిధులు వినియోగంపై సమగ్ర సమాచారం అందజేయాలని కోరుతూ మదనపల్లె మండలం కురవంక గ్రామపంచాయతీ సర్పంచి చలపతికి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి గురువారం నోటీసు జారీ చేశారు. 2021-22 నుంచి 2024-25 వరకు గ్రామపంచాయతీ రికార్డులను డివిజనల్ పంచాయతీ అధికారి తనిఖీ చేయుట, ముందస్తు అనుమతి లేకుండా నిధులు డ్రాచేసి ఖర్చు చేయడం వంటి అంశాలపై నోటీసు ఇచ్చారు. పంచాయతీలో 2021-22 నుంచి 2024-25 వరకు పంచాయతీ రికార్డులను అధికారి తనిఖీ చేశారని, సర్పంచే మేకర్, చెక్కర్‌గా వ్యవహరించి ఉన్నారని, ముందస్తు అనుమతి, ఓచర్లు, బిల్లులు లేకుండా పంచాయతీ నిధులు పారిశుద్ధ్యం నిమిత్తం, చెత్తరవాణా చేసే ట్రాక్టర్‌కు అద్దె, డీజిల్ కోసం రూ.17,48,080లు డ్రా చేసి ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ నిధులు అక్టోబర్ 29వ తేదీన యు.రెడ్డిబాబు, జి.పునీత్‌కుమార్ బ్యాంకు ఖాతాలకు రూ.8,70,082 లక్షలు బదలాయించినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులకు సంబంధించి వివరాలు, ఓచర్లు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచి సమర్పించాలన్నారు. ముందస్తు అనుమతి పొందాకనే బిల్లులు, ఓచర్లు లేకుండా ఖర్చు చేయకూడదని ప్రాథమిక నివేదిక ప్రకారం ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం కురవంక సర్పంచికి చెక్కు డ్రా చేయు అధికారం తాత్కాలికంగా తొలగించవలసిందిగా కోరుతూ నివేదికను సమర్పించినట్లు తెలిపారు. దీనిపై నోటీసు అందిన 3 రోజుల్లోగా సంజాయిషీని కార్యాలయానికి సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో మాస్టర్లు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి స్క్వాయ్ పోటీలకు మదనపల్లె విద్యార్థులు ఎంపికైనట్లు ఏపీ స్క్వాయ్ మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ ఇస్మాయిల్, రాష్ట్ర కోచ్ ఖాదర్‌బాషా తెలిపారు. నంద్యాలలోని ఎన్టీఆర్ షాదీఖానాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. 11 సంవత్సరాల విభాగంలో నితీష్, డీఎల్ కుషాల్‌సాయి, కె.సాత్విక, తహ అర్ఫా, సాయిప్రితిక, 14 సంవత్సరాల విభాగంలో. . టి.శైలజ, పి.హర్షితయశశ్విని, కె.గణేష్, వై.రెడ్డికావ్య, 18 సంవత్సరాల విభాగంలో.. అయాన్, పి.చరిత్‌సాయి, పి.లిఖిత్, కె.గాయత్రి, సీనియర్స్ విభాగంలో మహిజుద్దీన్ జుబేర్, ముజహర్‌ఆలీ, గ్రూప్ విభాగంలో.. 13 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. మదనపల్లె స్క్వాయ్ అకాడమికి 29 బంగారు పతకాలు వచ్చాయన్నారు. వీరంతా కూడా వచ్చే ఏడాది జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి స్క్వాయ్ పోటీల్లో మన రాష్ట్రం తరపున పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు డి.నరసింహులు, టీమ్ మేనేజర్ శ్రీనివాసులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దుదాం

సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె పట్టణం,న్యూస్‌టుడే: మదనపల్లె పురపాలకను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికి సిబ్బంది సహకారం చాలా అవసరమని కమిషనర్ ప్రమీల అన్నారు. గురువారం కౌన్సిల్ హాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు సంస్థ పురపాలక సంఘంలో పని చేసే సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ రోజు నుంచి మదనపల్లె పురపాలకసంఘం కార్యాలయాన్ని ప్లాస్టిక్‌రహిత కార్యాలయంగా ప్రకటిస్తూ పోస్టర్స్‌ను విడుదల చేశారు. మార్పు పురపాలక సంఘంలో పనిచేసే సిబ్బంది నుంచే ప్రారంభం కావాలని అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజంతుల్లాఖాన్, తదితరులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని మదనపల్లెకు చెందిన ప్రముఖ వైద్యులు పవన్‌కుమార్, అజంతుల్లాఖాన్‌తో పాటు విజయభారతి విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు అన్నారు. గురువారం జీఆర్‌టీ హైస్కూల్ మైదానంలో వీబీఎస్ క్రికెట్ లీగ్ 2025 పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆడటంతో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా చదువుల్లోను చురుగ్గా పాల్గొంటారన్నారు. విజయభారతి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు రెండు రోజులు పాటు సాగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిశ్చిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న పెద్దేరు ప్రాజెక్టు ఛైర్మన్ శివకుమార్

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని పెద్దేరు ప్రాజెక్టు ఛైర్మన్ కొటాల శివకుమార్ అన్నారు. ఆయన ప్రాజెక్టు ఆవరణంలో ఆయకట్టు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు కుడి కాలువ కింద 8.6 కి.మీ, ఎడమ కాలువ కింద 8 కి.మీ సుమారు 4,000ఎకరాలు సాగుకు తీర్మాణించినట్లు తెలిపారు. ఆయకట్టు రైతులు నీటిని వృథా కాకుండా పంటలు సాగు చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో ఆయకట్టు సభ్యులు గంగిరెడ్డి, శివనాగిరెడ్డి, తేజమూర్తి నాయుడు, మాజీ సర్పంచి కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: విచారణ పేరుతో పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణ రహితంగా కొట్టిన పోలీసు కానిస్టేబుల్ భరత్‌పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. వారు బాధితుడు, అతని కుటుంబ సభ్యులతో కలసి మదనపల్లె ప్రభుత్వాసుపత్రి ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శనం మాట్లాడుతూ... రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీలోని ఓ యువతిని వెంకటేష్ కుమారుడు మణి తీసుకెళ్లాడని ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ విషయంగా అబ్బాయి తండ్రి వెంకటేష్‌ను విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేసి విచక్షణ రహితంగా కొట్టడం దారుణమన్నారు. పోలీసుల దాడిలో గాయపడిన వెంకటేష్ చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చేరారన్నారు. విచారణ పేరుతో వెంకటేష్‌ను తీసుకెళ్లిన కానిస్టేబుల్ భరత్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు విచక్షణ రహితంగా కొట్టిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెక్‌డ్యాంలతో నీరుగారిన లక్ష్యం

మేకలవానికాలువలో వృథాగా వెళ్తున్న నీరు

పీలేరు, న్యూస్‌టుడే: ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకొని భూగర్భ జలాలు పెంచాలని ప్రభుత్వం చెపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో వచ్చిన తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు పింఛా నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. నాటి నుంచి చెక్‌డ్యామ్‌లు మరమ్మతులకు నోచుకోక నీరంతా వృథాగా పోతున్నాయి. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో పరివాహక భూములకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

రూ.10 కోట్లతో ప్రతిపాదనలు

గత వైకాపా హయాంలో రూ.10 కోట్లతో నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు. నిధులు వస్తే చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉంటే భూగర్భజలాలు అభివృద్ధి చెంది తద్వారా వరిసాగుకు నీరు పుష్కలంగా లభిస్తాయని రైతులు ఆశించారు. అయితే వారి ఆశ నిరాశగా మారింది. గత ప్రభుత్వం వైఫల్యంతో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఆ ప్రభుత్వంపై విరక్తి చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వం ఆదరిస్తుందని ఆశించి అధికారం ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి వ్యవసాయానికి అనువైన చెక్‌డ్యామ్‌లను మరమ్మతులు చేస్తారని ఆశిస్తున్నారు. చెక్‌డ్యామ్‌ల్లో నీరు నిల్వ ఉన్నట్లయితే బోర్లు, కుంటలతో సుమారు రెండు వేల వరి పొలాలకు సాగు నీరు అందుతుంది. పీలేరు మండలంలో పీలేరు, బాలంవారిపల్లె, అగ్రహారం, దొడ్డిపల్లె, కాకులారంపల్లె, ఎర్రగుంటపల్లె, బోడుమల్లువారిపల్లె, వేపులబైలు పంచాయతీల్లో ప్రజల దాహార్తికి కూడా ఉపయోగపడుతుంది. సాగునీరు, తాగునీటికి అవకాశం ఉన్న చెక్‌డ్యామ్‌లను మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

దెబ్బతిన్న చెక్ డ్యామ్‌ల మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల సమీక్షా సమావేశాల్లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాం. మరమ్మతులు చేస్తే వర్షపునీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉంటుంది. నిధులు వచ్చిన తరువాత వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- ఝాన్సీ, ఏఈ, జలవనరులశాఖ, పీలేరు

భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కిరణ్ కుమార్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన **ఓసూరి కిరణ్‌కుమార్‌ను** నియమిస్తూ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల అభివృద్ధి, అన్నదాత గౌరవం, వ్యవసాయ పురోగతికి కృషి చేస్తానన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పత్రాలిస్తే మీ డబ్బు... మీ హక్కు

కరపత్రాలు విడుదల చేస్తున్న బ్యాంకు సిబ్బంది

రాయచోటి, న్యూస్‌టుడే: బ్యాంకుల్లో దాచుకున్న మీ డబ్బు మీ హక్కు అని ఎల్‌డీఎం ఆంజనేయులు తెలిపారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, చాలా కాలంగా ఖాతాల్లోని సొమ్ము విత్‌డ్రా కాకపోవడంతో నిలిచిన మొత్తాలకు సరైన పత్రాలు సమర్పించిన నామినీలు తిరిగి డబ్బు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఏపీజీబీ బ్రాంచి మేనేజరు సదాశివారెడ్డి, వివిధ బ్రాంచిల మేనేజర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని మండల తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని మాధవరం, శిబ్యాల, చెన్నముక్కపల్లెల్లో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్ర పటాలకు తెదేపా నాయకులు పాలాభిషేకం చేశారు.

సీఎం చంద్రబాబు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ట్యాంకులు ఇలా.. గొంతు తడిచేదెలా!

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన రాయచోటికి తాగునీటిని అందిస్తున్న పథకాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఏళ్ల నాడు నిర్మించిన ట్యాంకుల్లోనే నేటికీ నీటిని నింపి పట్టణానికి సరఫరా చేస్తున్నారు. రెండేళ్ల కిందట పట్టణంలోని సుండుపల్లి రోడ్డులో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకును అధికారులు కూల్చివేశారు. ఆ ట్యాంకుతో పాటు నిర్మించిన మరికొన్ని ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. 1995-98 మధ్య రాయవరం నీటి పథకం పురుడు పోసుకున్న సందర్భంలో పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. రాయవరంలో నీటిని ట్యాంకుకు నింపి అప్పట్లో మేజర్ పంచాయతీగా ఉన్న రాయచోటికి సరఫరా చేసేవారు. పట్టణం విస్తరించి 1.30 లక్షలకు జనాభా చేరింది. వెలిగల్లు నుంచి రోజూ 9 ఎంఎల్‌డీల నీటిని ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. ఎస్‌ఎన్ కాలనీ, బాలికల ఉన్నత పాఠశాల, మాసాపేట, డైట్ కళాశాలల ఆవరణంలోని ట్యాంకుల నుంచే పట్టణంలోని జనాభాకు నీటిని సరఫరా చేస్తున్నాయి. వెలిగల్లు నుంచి వచ్చే నీరు ఈ ట్యాంకులకు నింపి రెండు, మూడు రోజులకు ఒకసారి వార్డులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎస్‌ఎన్ కాలనీలోని నీటి ట్యాంకు పైభాగం తుప్పు పట్టింది. సిమెంట్ పెచ్చులూడి పడుతున్నాయి. ట్యాంకు పైకి ఎక్కేందుకు నిర్మించిన నిచ్చెన ఇతర పిల్లర్లు పటిష్టతను కోల్పోయి బలహీనంగా ఉన్నాయి. దీంతో ట్యాంకు భద్రతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ నిపుణులు నీటి ట్యాంకుల నిర్మాణ సామర్థ్యాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని పురవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. తాగునీటి ట్యాంకుల శుభ్రతతో పాటు భద్రతపై నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

ఎస్‌ఎన్ కాలనీలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు

రోడ్లా... మడుగులా?

❖ నరకం చూపుతున్న రహదారులు

❖ పల్లె పండగ ఉన్నా.. వినియోగం సున్నా

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది. పల్లె పండగ పథకం పేరుతో పల్లెల్లో మంచి రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. కానీ ఆ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య పోరు నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న సర్పంచుల్లో చాలా మంది గత వైకాపా హయాంలో గెలుపొందిన వారే ఉన్నారు. ప్రస్తుతం కూటమి పాలన నడుస్తున్నందున చాలా మంది సర్పంచులకు పనులు కావడం లేదనే విమర్శలున్నాయి. ఆ గ్రామాల్లోని కూటమి నాయకులు పనులు తాము చేస్తామంటే - తామే చేయాలంటూ పట్టుబట్టడం కూడా అభివృద్ధి నిరోధకంగా మారుతోంది.

ఇది బంగ్లామిట్ట గిరిజన కాలనీ.. వర్షం కురిస్తే ప్రధాన రహదారి ఇలా మారిపోతోంది

■ మండల పరిధిలోని బొజ్జావారిపల్లె పంచాయతీ బంగ్లామిట్ట గిరిజన కాలనీలో ప్రధాన రహదారులు కొద్దిపాటి వర్షానికే నీటితో నిండిపోతున్నాయి. అక్కడి గిజనులు ఆ వీధుల్లో తిరగలేక ఇబ్బంది పడుతున్నారు.

■ ఉర్లగట్టుపోడు పంచాయతీలో ప్రధాన ఊరితో పాటు గద్దలవారిపల్లె, రాచపల్లె ప్రాంతాల్లో రహదారులు సరిగా లేవు. అక్కడ ప్రభుత్వ నిధులు ఉపయోగించి అభివృద్ధి చేసుకోవడానికి వీలున్నా ప్రజాప్రతినిధులు సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

■ పల్లె పండగ పనులను ప్రాధాన్యం ఉన్న చోట కాకుండా స్థానిక నాయకులకు అవసరమైన ప్రాంతాల్లో వినియోగించుకున్నారు. బొజ్జావారిపల్లె సర్పంచి మావిళ్ల సుబ్బయ్య మాట్లాడుతూ బంగ్లామిట్ట గిరిజన కాలనీకి రహదారిని ఎత్తు లేపి మళ్లీ రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. ఆ పనులకు ప్రతిపాదనలు పంపించామని, పనులు మంజూరైతే చేస్తామని చెబుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

?: పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో కూరగాయల వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలి. **- మన్సూర్, స్థానికుడు**

✓: మార్కెట్ ప్రాంతం నుంచి కూరగాయలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- రవి, పురపాలక కమిషనర్**

- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

?: పట్టణంలోని చిట్వేలి రోడ్డులో ప్రభుత్వాసుపత్రి, కొత్త బస్టాండుకు వెళ్లే దారిలో చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి? దుర్వాసన వస్తోంది? పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి? **- కే.సుదర్శన్, వ్యాపారి, చిట్వేలి రోడ్డు**

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించి పరిస్థితిని చక్కదిద్దుతాం. **- బి. శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు**

?: పట్టణంలో పందులు, పశువులతో బెడదగా ఉంది? నడిరోడ్డుపై పశువులు అడ్డంగా పడుకుంటున్నాయి? పందులు రోడ్డు దాటే వాహనాలను ఢీకొంటున్నాయి? **- బాలాజీ, గాంధీనగర్**

✓: పశువులు రాకుండా చర్యలు చేపడతాం. **- బి. శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు**

- న్యూస్‌టుడే, పుల్లంపేట

?: వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. చీకటి పడితే బయట అడుగు వెయ్యాలంటే భయమేస్తుంది. సమస్యను పరిష్కరించాలి? **- ఎస్.పద్మనాభయ్య, చేనేత కాలనీ, సీతారాంపేట**

✓: పంచాయతీలో అక్కడక్కడ వీధి దీపాలు పనిచేయడం లేదు. వీటిని మరమ్మతు చేసే మెకానిక్ అందుబాటులో లేనందున జాప్యం జరుగుతోంది. త్వరలో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. **- చంద్రశేఖర్, కార్యదర్శి, గారాలమడుగు**

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: చిట్వేలి మండల పరిధిలోని బాకారాపురం 11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని చెర్లోపల్లి, రాజుకుంట గ్రామాలకు శుక్ర, శనివారాలు మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటచలపతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం పనులు చేస్తున్న క్రమంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ రెండు రోజుల్లో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు త్రీఫేస్ కరెంటు సరఫరా ఉంటుందని ఆ సమయంలో రైతులు తమ అవసరాలను తీర్చుకోవాలన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి టూఫేస్ కరెంటు ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చిట్వేలిలో జనవాణి నేడు

చిట్వేలి (పుల్లంపేట): మండల కేంద్రమైన చిట్వేలి ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం శుక్రవారం ఉదయం పది గంటలకు కూటమి ప్రభుత్వం విప్ అరవ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మీ సమస్యలను జనవాణి దృష్టికి తీసుకుని వస్తే వాటిని సత్వరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తాగునీరు. రోడ్డు, విద్యుత్, పింఛన్లు, రేషన్, గృహాలు, రైతు సంబంధిత ప్రజా సమస్యలను పరిష్కరించేలా ప్రజాప్రతినిధి వద్దే వినతి పత్రాలు అందించి పరిష్కారం పొందే వ్యవస్థను బలోపేతం చేసేందుకే ఈ జనవాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జనసేన నాయకులు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలకు వినతి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్, నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ... భూ ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై కేసులు నమోదు చేసి ఆక్రమణకు గురైన భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగారెడ్డి, జగన్‌బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

సుండుపల్లి: రెడ్డివారిపల్లి సచివాలయ సమీపంలో గత ఆదివారం జరిగిన చోరీ ఘటనను ఛేదించామని ఎస్సై ఎం.శ్రీనివాసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని చోరీ అయిన బంగారు, నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కోర్టులో హాజరు పరిచి జువైనల్ హోంకు తరలించామని తెలిపారు.

పొలం దున్నిన వ్యక్తిపై కేసు నమోదు

సుండుపల్లి, న్యూస్‌టుడే: యర్రమనేనిపాలెం గ్రామం గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన టి.రాణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారి ఉలవ పొలం దున్నిన మాధవరానికి చెందిన నాగభూషణ్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. తనకు చెందిన 1.82 ఎకరాల పొలంలో ఉలవ పంట వేయగా దానిని ట్రాక్టరుతో దున్ని నష్టం కలగజేశారని పేర్కొన్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

రైల్వేకోడూరు: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని రైల్వేకోడూరు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పెండ్యాల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని అమ్మవారిశాలలో గురువారం నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు డూండి రాకేష్‌తో పాటు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు అధ్యక్షుడు కస్తూరి కోటేశ్వర చౌదరి, డీసీఎంఎస్ అధ్యక్షుడు ఎర్రగుండ్ల జయప్రకాష్, తెదేపా నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కలువా మురళి, కోశాధికారిగా పెడబల్లె సుబ్బారావు, కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడిగా శ్రీరాం సుబ్రహ్మణ్యంతో వారు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎన్‌టీపీఏ కార్యవర్గం ఎన్నిక

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు ఎన్‌టీపీఏ మండలశాఖ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూడే శ్రీరాములు నాయక్, ప్రధాన కార్యదర్శిగా సి.గంగారాజు, ఆర్థిక కార్యదర్శిగా పి.ప్రభాకర్, గౌరవాధ్యక్షుడిగా మండ్ల శ్రీనివాసులు, గౌరవ సలహాదారుడు ఎస్.రామచంద్ర, మైనార్టీ కన్వీనర్ ఎస్.బాలాజీ, మహిళా ఉపాధ్యక్షురాలు కె.సరోజ, కార్యదర్శి బి.సుగణమ్మను ఎన్నుకున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99899 97626

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 91771 11468

ప్రతిభకు పురస్కారం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని సంగీత ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై గురువారం ప్రతిభా పాటవ పోటీలు (ఉపన్యాసం) నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎనిమిదో తరగతికి చెందిన నీరజ, యాసీన్, జ్ఞానేశ్వరి విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ రామాంజులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగోత్రి పాల్గొన్నారు.

ప్రతిభా పాటవ పోటీల్లో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ రామాంజులు

ప్రజలతో మమేకం.. పార్టీ బలోపేతం

రాజంపేట, న్యూస్‌టుడే: పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లో మమేకమై వారి సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, పార్టీ పరిశీలకులు చిట్టిబాబు తెలిపారు. స్థానిక ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, రాజంపేట పురపాలక పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మండల సారథులుగా ఎన్నికైన వారంతా కార్యకర్తలను కలుపుకొని మరింత ముందుకు తీసుకెళ్లేలా అడుగులు వేయాలన్నారు. ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని, రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని సూచించారు. పార్టీకి కష్టపడిన వారికి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన తెదేపా మండల పార్టీ అధ్యక్షులతో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, పార్టీ పరిశీలకులు చిట్టిబాబు

ఖాతాదారుల సేవలో 51 ఏళ్లు

పుల్లంపేట, న్యూస్‌టుడే: 51 ఏళ్లుగా ఖాతాదారులకు కెనరా బ్యాంకు సేవలందిస్తోందని జనరల్ మేనేజర్ పాండురంగ అన్నారు. పుల్లంపేట బస్టాండు సమీపంలో సభాసంస్థల ప్రాంగణంలో కెనరా బ్యాంకు శాఖను జెండా మాను సమీపంలో నూతన భవంతిలోకి మార్పు చేశారు. ఈ శాఖను జనరల్ మేనేజర్ గురువారం ప్రారంభించారు. మిగిలిన కార్యాలయాల గదులను సహాయ జనరల్ మేనేజర్ అరుణజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ మేనేజర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పుల్లంపేటలో 1974లో జనవరి 19న సిండికేట్ బ్యాంకు శాఖను ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ ఖాతాదారుల అభిమానాన్ని చూరగొందన్నారు. ప్రస్తుతం రూ.150 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. ఏటా విద్యాభివృద్ధికి ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. బ్యాంకుకు అనుకూలంగా ఉండేలా భవనం నిర్మించిన యజమాని రాజారెడ్డిని అధికారులు సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగి వెంకటప్ప, విశ్రాంత ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు, ఖాతాదారులు, వెలుగు వీవోఏలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతి

లక్కిరెడ్డిపల్లె: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని ప్రిన్సిపల్ వర్ల రమేష్ తెలిపారు. గురువారం ఆదర్శ పాఠశాలలో ఎకనామిక్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ప్రియాంకకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో పనిచేస్తూ సాధారణ బదిలీపై లక్కిరెడ్డిపల్లె ఆదర్శ పాఠశాలకు వచ్చిన అధ్యాపకురాలు ప్రియాంక ఇటీవల వచ్చిన మెగా డీఎస్సీలో సత్యసాయి జిల్లా అమరాపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్లడం సంతోషకరమన్నారు. వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీలు తక్షణం పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లె: పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించాలని తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్ మోహన్ కోరారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు క్రాంతికుమార్‌తో చర్చించారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ అవకతవకలను రెవెన్యూ రికార్డుల్లో పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. రెవెన్యూ కార్యాలయానికి వివిధ సమస్యలతో వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఐ రాజేష్, లక్కిరెడ్డిపల్లె ఓబులేష్, రమ్య రాయల్, కావలి ఆంజనేయులు, శివమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉద్యోగులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కస్తూరిరాజుగారిపల్లె గ్రామ సచివాలయంలో సమయపాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం సచివాలయం ఎదుట గ్రామస్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో గ్రామ ప్రజలు వారి అవసరాల కోసం సచివాలయానికి వచ్చి సిబ్బంది సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చిన అరకొర సిబ్బంది కంప్యూటర్ పనిచేయలేదు, నెట్‌వర్క్ లేదనే కారణాలు చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే డిజిటల్ అసిస్టెంట్ ప్రభుత్వ రుసుము రూ.50 నుంచి రూ.60 ఉంటే అతను మాత్రం రూ.500 నుంచి రూ.600 వరకూ వసూలు చేయడం సరికాదన్నారు. అధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సవ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ

సుండుపల్లి, న్యూస్‌టుడే: గోవింద మాలధారి, వినాయకనగర్‌కు చెందిన మేస్త్రీ నంద్యాల వెంకట రమణ కుటుంబ సభ్యులు చేయించిన రూ.5 లక్షలు విలువైన వెంకటేశ్వర స్వామి, భూదేవి, శ్రీదేవి పంచలోహ విగ్రహాలకు విరూపాక్ష, చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం ప్రాణ ప్రతిష్ఠాపనా పూజలు అర్చక స్వామి కె.హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గురువారం రాత్రి సుండుపల్లి పురవీధుల్లో పంచలోహ విగ్రహాలను పూలతో అలంకరించిన రథంలో ఊరేగించారు. గోవింద మాలధారులు గోవింద నామ స్మరణతో ఊరేగింపులో పాల్గొన్నారు.



సుండుపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ పూజలు

భక్తిశ్రద్ధలతో హోమం

సుండుపల్లి, న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించిన ఆలయంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తి కావడంతో కంచిపాటివాండ్లపల్లి గురువారం సంప్రదాయ పూజలు, హోమం నిర్వహించారు. ఆకేపాడుకు చెందిన పురోహితులు భానుమూర్తిశర్మ ఆధ్వర్యంలో మండల పూజలు నిర్వహించారు. గ్రామంలో ఓ రైతుకు చెందిన పశువుల కొట్టంలో పుట్ట పెరిగేదని అప్పుడప్పుడు మట్టిని తొలగించినా మళ్లీ వచ్చేదని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో స్థలం చదును చేసే ప్రయత్నంలో పుట్టను తొలగించి, నేలను తవ్వుతుండగా భూగర్భంలో ఉన్న నాగదేవత పంచలోహ విగ్రహం లభించిందని స్థానికులు తెలిపారు. చందాల ద్వారా నిధులు సేకరించి రెండు నెలల క్రితం ఆలయ నిర్మాణం ప్రారంభించి పూర్తి చేశారు. ఈ 40 రోజులు ఊరిలో ఎవ్వరూ మాసం ముట్టరు, వండకుండా నిష్ఠతో గడిపినట్లు స్థానికులు తెలిపారు.

హోమంలో పాల్గొన్న భక్తులు

మాక్ అసెంబ్లీలో అదరగొట్టిన విద్యార్థినులు

విద్యార్థిని షేక్ నూర్ ఆయేషాకు మిఠాయి తినిపిస్తున్న తెదేపా కస్తూరి నేత విశ్వనాథనాయుడు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: (పెనగలూరు): రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి మాక్ అసెంబ్లీలో పాల్గొని సత్తా చాటిన షేక్ నూర్ ఆయేషాను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అభినందించి, మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే రాజకీయాలుపై అవగాహన కలిగి ఉండడం చాలా మంచిదని, ప్రజా సేవ చేయాలకునే వారికి రాజకీయం ఎంతో ఉపయోగమని ఆయన తెలిపారు. తెదేపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ షామీర్ బాషా కుమార్తె మాక్ అసెంబ్లీకి ఎంపిక కావడం, చక్కగా మాట్లాడడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

వీరబల్లి: మాక్ అసెంబ్లీలో పాల్గొనడం విద్యార్థులకు వరమని వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రారెడ్డి, హెచ్‌ఎం రెడ్డెయ్య అన్నారు. వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి మాక్ అసెంబ్లీకి ఎంపికైన కొల్లి వీక్షితను గురువారం దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలు, విలువలు, శాసన సభ్యుల బాధ్యతలపై అవగాహన పెంచుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు.



కొల్లి వీక్షితను సన్మానిస్తున్న సురేంద్రారెడ్డి, హెచ్‌ఎం రెడ్డెయ్య, ఉపాధ్యాయులు

కూటమి సర్కారు.. వైకాపా నాయకుడి పేరు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల పరిషత్తు ప్రాంగణంలో ఇటీవల రూ.27 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ నూతన కార్యాలయం నిర్మించారు. ఈ నెల 24న జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి హాజరై శిలాఫలకంతో పాటు నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంలో పని వివరాలతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే, ఎంపీ, కుడా ఛైర్మన్, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, అధికారుల పేర్లు ప్రస్తావించారు. చివర్లో కార్యనిర్వాహకులు సీడీ నాగేంద్ర అంటూ ఓబులవారిపల్లె మండలం వైకోటకు చెందిన వైకాపా నాయకుడి పేరు ముద్రించడం చర్చనీయాంశంగా మారింది. ఇదేమని అధికారులను అడిగితే కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం, పనులు చేయించడంలో ఆయన సహాయం చేసినందున ఆ పేరు ముద్రించినట్లు చెబుతున్నారు. 18 నెలల కూటమి పాలనలో అన్ని పనులు, నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుంటే వైకాపా నాయకుడి సహకారం ఏంటని శిలాఫలకం చూసిన వారు ప్రశ్నిస్తున్నారు. నేతలు కూడా ఈ ఫలకాన్ని ఎలా ఆవిష్కరించారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



శిలాఫలకం చివర్లో కార్యనిర్వాహకుడిగా వైకాపా నాయకుడు సీడీ నాగేంద్ర పేరు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చెరువులో జలహారతి ఇస్తున్న తెదేపా నాయకులు

నందలూరు, న్యూస్‌టుడే: రైతులంతా సుభిక్షంగా ఉండటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. గురువారం మండలంలోని లేబాక చెరువు అలుగు పారుతుండటంతో ఎలైట్ హాస్పిటల్ అధినేత బాలసుబ్రహ్మణ్యంతో కలసి జలహారతి ఇచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, సొసైటీ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, గంటా గోపి, వెంకట సుబ్బయ్య, సర్పంచి చుక్కా యానాది తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని మద్దిరేవుల పంచాయతీ బూడిదగుంటపల్లెలో ప్రభుత్వం పథకాలపై కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు బోర్లు వేయించి సమస్య లేకుండా చూశామన్నారు. మండల వ్యవసాయ అధికారిణి రాజకుమారి, ఉద్యానశాఖ అధికారి సింధూరి, వ్యవసా, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయచోటి గ్రామీణ: రాష్ట్రంలో రైతుల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా బీసీ సెల్ కార్యదర్శి పత్తికాని రామచంద్ర అన్నారు. గురువారం మండల పరిధిలో ఏపిలవంకపల్లెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తెదేపా నాయకులు అక్బర్ బాష, వెంకట రమణ, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

విబ్రియోతో విలవిల

వనామీ రొయ్యను దెబ్బతీసిన వైరస్

బాపట్ల, న్యూస్‌టుడే

ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఆక్వా రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వైరస్‌లు విజృంభించి తీరంలో వనామీ రొయ్యల పంటను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

23,700 ఎకరాల్లో సాగు.. జిల్లాలోని చిన గంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో 23,700 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. మొంథా తుపాను ప్రభావానికి కురిసిన వర్షాలకు ఉష్ణోగ్రతలు పడిపోవడం.. 24 గంటలకు పైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్ల ద్వారా ఏరియేటర్లు నడిపి ఆక్సిజన్ అందించారు. రొయ్యలను కాపాడుకోవటానికి రైతులు అవస్థలు పడ్డారు. తాజాగా మంచు ప్రభావం రొయ్యలపై పడుతోంది. ఉదయం పది గంటల వరకు మంచు ఉండటం, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వనామీ రొయ్యలు ఆహారాన్ని సరిగా తీసుకోవడం లేదు. చెరువుల పీహెచ్‌లో మార్పులతోపాటు అమ్మోనియం, నైట్రేట్ శాతాలు పెరుగుతున్నాయి. రోగనిరోధక శక్తి తగ్గి విబ్రియో వైరస్ వచ్చి రొయ్యలు చనిపోతున్నాయి. వైట్ స్పాట్ సమస్య కూడా వస్తోంది.

పెరిగిన ధర.. కర్లపాలెం, నిజాంపట్నం మండలాల్లోని తీర ప్రాంతంలో వైరస్‌ల సమస్య ఎక్కువగా ఉంది. కర్లపాలెం మండలం గణపవరానికి చెందిన రైతు సుబ్బారావు కాకినాడ నుంచి రెండు లక్షల రొయ్య పిల్లలు తెచ్చి చెరువులో వదిలారు. 18 రోజులకే విబ్రియో వైరస్ వచ్చి అవి చనిపోవడంతో రూ.1.20 లక్షల వరకు నష్టపోయారు. ఇలానే 45 నుంచి 50 రోజుల పంటకు వైరస్ సోకి మరి కొందరు రైతులు చెరువుకు రూ. రెండు లక్షలకు పైగా నష్టపోయారు. దిగుబడులు లేనందున పది రోజుల వ్యవధిలో వంద కౌంట్ రొయ్యల ధర రూ.230 నుంచి రూ.240కు పెరిగింది.

జాగ్రత్తలు తప్పనిసరి.. శీతాకాలంలో నీటి ఉష్ణోగగ్రతలు పడిపోవడంతో రొయ్యల్లో ఆకలి తగ్గుతుంది. మేత తీసుకునే స్థాయి, జీర్ణశక్తి పడిపోతుంది. అందుకే రొయ్యలు తినేంత స్థాయిలోనే మేత వేయాలి. నీటిలో పీహెచ్ విలువల్లో మార్పును తనిఖీ చేయాలి. ఉదయం, సాయంత్రం పీహెచ్‌లో వ్యత్యాసం 0.5 కంటే ఎక్కువ ఉండకూడదు. వ్యాధి నివారణకు జీవ రసాయనాలు, ప్రోబయోటిక్స్‌ను సిద్ధంగా ఉంచాలి. ఉష్ణోగ్రతలు పడిపోతే మేతను ఆపడం లేదా తగ్గించాలి. ఆకాశం మేఘావృతమై ఉంటే ఏరియేటర్లను ఎక్కువసేపు తిప్పి ఆక్సిజన్ బాగా అందేలా చూడాలి. రొయ్యల పెరుగుదల స్థితి, ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, మేతలో విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ ఔషధాలు, జీర్ణశక్తిని పెంచే ఎంజైమ్‌లు కలపాలని నిపుణులు సూచిస్తున్నారు.

వాలీబాల్‌లో కృష్ణవేణిదే విజయం

బాపట్ల ఆర్ట్స్, సైన్స్ కాలేజీకి మూడో స్థానం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల వేదికగా మూడ్రోజులపాటు సాగిన పోటీల్లో ఆతిథ్య కృష్ణవేణి కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్ ను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. తుది పోరులో కృష్ణవేణి కళాశాల జట్టు నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టుపై గెలుపొందింది. మూడో స్థానం కోసం బాపట్ల ఆర్ట్స్, సైన్స్ కాలేజీ, ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల జట్లు తలపడగా.. బాపట్ల కళాశాల విజయం సాధించింది.

ట్రోఫీతో బాపట్ల క్రీడాకారులు, కళాశాల ప్రతినిధులు

నిధులొస్తే... రాచబాటలే

రెండు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని ప్రతిపాదన

ఈనాడు–అమరావతి

గుంటూరు జిల్లాను బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేసే కీలక మార్గాలను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. అవి...

1. **గుం**టూరు నుంచి ప్రత్తిపాడు, పర్చూరు, ఇంకొల్లు మీదుగా నాగులుప్పలపాడు వరకు 89 కిలోమీటర్ల మార్గం.
2. **గుం**టూరు నుంచి నారాకోడూరు మీదుగా బాపట్ల వరకు 45.800 కిలోమీటర్ల మార్గం.

ప్రతిపాదనలు ఇలా... గుంటూరు - నాగులుప్పలపాడు వరకు 89 కిలోమీటర్ల మార్గంలో బైపాస్‌లు నిర్మించాల్సి ఉంది. ★ ప్రాజెక్టు వ్యయం రూ.1,183.21 కోట్లుగా అంచనా. ★ కోల్‌కతా-చెన్నై, వాడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారులను ఇది అనుసంధానం చేస్తోంది.

గుంటూరు-బాపట్ల ప్రధాన రహదారి

కీలకం... రాష్ట్ర రహదారుల జాబితాలో ఉన్న ఈ రెండు మార్గాలు అత్యంత కీలకమైనవి. భారీ వాహనాలతోపాటు రవాణా వాహనాల రద్దీ ఎక్కువ. ★ ఆక్వా, ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తులతోపాటు శనగ, పత్తి, మిర్చి పంటల ఉత్పత్తుల రవాణాకు ఉపయోగపడుతున్నాయి. ★ ఈ మార్గాల్లో గ్రామీణ ప్రాంతాలకు ఆయా పట్టణాలతో అనుసంధానం పెరగడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ★ గుంటూరు నుంచి తీర మార్గాలకు అనుసంధానం చేయడంతో పాటు ప్రకాశం జిల్లాలోకి వెళ్లే మార్గాలను కలుపుతుంది. ★ జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలన్న ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపించారు.

గుంటూరు బాపట్ల మార్గం...

- కోల్‌కతా-చెన్నై జాతీయరహదారి 16 నుంచి నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరు, అప్పికట్ల మీదుగా బాపట్లలో జాతీయరహదారి 216కు అనుసంధానమయ్యే రాష్ట్ర రహదారిని నాలుగు వరుసల జాతీయ రహదారిగా విస్తరించాలన్నది ప్రతిపాదన.
- బాపట్ల, గుంటూరుతో నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరు, అప్పికట్లకు అనుసంధానం పెరుగుతుంది.
- కోల్‌కతా-చెన్నై, కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారులను కలుపుతుంది.
- గుంటూరు వద్ద బైపాస్‌లో ప్రారంభమై బాపట్ల వద్ద జాతీయరహదారి 216ను కలుస్తుంది. గుంటూరు, ప్రత్తిపాడు, పొన్నూరు, బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా వెళ్తుంది.

ప్రకాశం జిల్లాలోకి అద్దంకి

రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటుకు ఉత్తర్వులు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేసింది. పది మండలాలతో అద్దంకిని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించింది. అద్దంకి డివిజన్లో ప్రకాశం జిల్లాలోని దర్శి నియోజకవర్గాన్ని చేర్చింది. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, కురిచేడు, దొనకొండ కలిపి రెవెన్యూ డివిజన్ ఆవిష్కృతం కానుంది.

ఏ ఆట ఆడతారు?

బాపట్ల, న్యూస్‌టుడే

చదువుతో పాటు క్రీడల్లో పిల్లలు రాణించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. క్రీడా రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి పెంచడంతోపాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. గతంలో అన్ని పాఠశాలలకు క్రీడా సామగ్రి ఒకేవిధంగా ఇచ్చేవారు. ఇప్పుడు అలాకాకుండా కోరుకున్న క్రీడా సామగ్రిని అందిస్తున్నారు.

● విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే వ్యాయామోపాధ్యాయుల శిక్షణ ఎంతో కీలకం. వారు మెరుగ్గా శిక్షణ ఇవ్వగలిగే క్రీడలకు సంబంధించి పరికరాలు అందజేస్తే పిల్లలకు మేలు జరుగుతుంది. అందుకే బడుల వారీగా ఇండెంట్లను తీసుకుని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కిట్లు చేరవేస్తున్నారు.

పాఠశాలలకు కోరుకున్న క్రీడా సామగ్రి అందజేత

స్థాయి	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	1098	62,853
ప్రాథమికోన్నత	68	3235
ఉన్నత	239	28,074

● క్రీడలు ఆడేలా విద్యార్థుల్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం క్రీడా సామగ్రిని అందజేస్తోందని **డీఈవో పురుషోత్తం** తెలిపారు.

● పాఠశాల స్థాయిని బట్టి ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు విలువ చేసే క్రీడా సామగ్రి అందిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలలోపు విలువచేసే కిట్లు సరఫరా చేస్తున్నట్లు విద్యా శాఖాధికారులు తెలిపారు. అథ్లెటిక్స్‌కు సంబంధించి అన్ని పాఠశాలలకు ఒకే తరహా సామగ్రి అందిస్తారు.

రూ.3,400 కట్టలేక.. ధాన్యం ఎత్తనీయక

జీపీఎస్ నిబంధనతో వరి రైతుకు యాతన

వలివేరు (చుండూరు), వేమూరు, న్యూస్‌టుడే

ఓవైపు వాతావరణం, మరోవైపు జీపీఎస్ నిబంధన వరి రైతును ఆందోళనకు గురిచేస్తోంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు వాహనానికి జీపీఎస్ తప్పనిసరి చేయడంతో పంటను కాపాడుకోవడం, అమ్ముకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది. పౌరసరఫరాల శాఖ అధికారులు తేమ శాతం 20 ఉన్నా పంటను కొనుగోలు చేయాలని చెబుతుంటే మిల్లర్లు మాత్రం 17 శాతం దాటితే కోత విధిస్తున్నారు.

ట్రాక్టర్లున్నా ఎదురుచూపులే.. జిల్లాలో 1.18 లక్షల హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. ఇందులో 10 వేల ఎకరాల్లో కోశారు. రెండు వేల ఎకరాల్లో పంటను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగతా పంట రహదారులు, కల్లాల్లో ఆరబెడుతున్నారు. రాత్రివేళ గుట్టలుగా చేసి, తడవకుండా పట్టలు కప్పుతున్నారు. జిల్లాలో 70 శాతానికిపైగా కౌలు రైతులున్నారు. వీరిలో చాలామందికి సొంతంగా ట్రాక్టర్లు లేవు.

ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ప్రస్తుతం ధాన్యం తరలించాలంటే రైతు వివరాలు నమోదుచేయాలి. ట్రాక్టర్‌తో పాటు లైసెన్స్ డ్రైవర్ వివరాలు అందించి జీపీఎస్ అమర్చడానికి రూ.3,400 కట్టాలి. దీంతో వాహన యజమానులు జీపీఎస్ అమర్చుకోవడానికి ముందుకు రావడంలేదు. గ్రామాల్లో ఉండే చాలా ట్రాక్టర్లకు జీపీఎస్ లేకపోవడంతో వాహనం కోసం అన్నదాతలు ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ నిబంధన రైతులకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు జీపీఎస్‌తో సంబంధం లేకుండా పంట తరలించేందుకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై **రేపల్లె ఆర్డీవో రామలక్ష్మిని** వివరణ కోరగా పంటను అమ్ముకునే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

నేటి నుంచి క్షిపణి పరీక్షలు

సముద్రంలో చేపల వేట నిషేధం

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా సూర్యలంక వాయుసేన కేంద్రంలో శుక్రవారం నుంచి డిసెంబరు 6 వరకు క్షిపణి పరీక్షలు నిర్వహిస్తారని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల గ్రామీణ పోలీస్‌స్టేషన్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ తొమ్మిది రోజులు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా నిషేధం విధించినట్లు తెలిపారు. మత్స్యకారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పౌరసరఫరాల డీఎం బాధ్యతల స్వీకరణ

బాపట్ల, న్యూస్‌టుడే: పౌరసరఫరాల సంస్థ డీఎంగా **వి.శ్రీలక్ష్మి** కలెక్టరేట్లోని కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ భావనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరణ సజావుగా సాగేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. మిల్లర్ల నుంచి బీజీలు తీసుకుని అన్ని ఆర్ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 20 ఉన్నా మిల్లర్లు ఉదారంగా వ్యవహరించి సహకరించాలని కోరారు.

మీనం ఎగిరితే.. చీరకు చిక్కినట్లే!

వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి కారంచేడు శివారులోని రొంపేరు లెఫ్ట్ ఆర్మ్ కాలువలో జాలర్లు వినూత్న రీతిలో వేట సాగిస్తున్నారు. నీటి ప్రవాహానికి అడుగున చేపలు పట్టేందుకు బుట్టలతో పాటు సన్నపాటి వలలు ఏర్పాటు చేశారు. బుట్టలను తప్పించుకుని వలను దాటి, నీటి ప్రవాహం వైపు ఎగిరే చేపల్ని పట్టుకునేందుకు చీరలు కట్టారు. ఎగిరే చేపలను పట్టుకునేందుకు కాలువలో వరుసగా చీరలు కట్టామని.. చేపలు ఎగిరి చీరల్లో పడతాయని జాలరి సుబ్బయ్య తెలిపారు. **- న్యూస్‌టుడే, కారంచేడు**

(c) eenadu

సౌర శీతల గదిలో దాచేద్దాం

5 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ కోల్డ్ రూం

కోల్డ్‌రూంను చూపిస్తున్న రైతు వీరాంజనేయులు

మార్టూరు మండలం బొబ్బేపల్లి, యద్దనపూడి మండలం యనమదల మధ్య ఏర్పాటు చేసిన సోలార్ కోల్డ్ రూంతో మార్కెట్ ధరకు అనుగుణంగా తమ ఉత్పత్తులను అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు.. ఓ రైతు. సౌర విద్యుత్తు సాయంతో ఇది నడుస్తుంది. 5 కిలోవాట్ సామర్థ్యం ఉన్న దీనిలో 4 డిగ్రీల నుంచి 10 డిగ్రీల శీతల గదిలో 5 టన్నుల వరకు నిల్వచేసుకోవచ్చు. అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, విత్తనాలు పాడవకుండా నాలుగు రోజుల నుంచి నెలరోజుల వరకు ఇందులో భద్రపరచుకుని మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పుడు అమ్ముకోవచ్చు. ఖరీదైన విత్తనాలు తీసుకొచ్చినప్పుడు 90 శాతం మొలక సామర్థ్యం ఉంటుందని, వాటిని దీనిలో ఏడాది పాటు నిల్వ ఉంచినా మొలకశాతం తగ్గకుండా ఆ విత్తనాలు రైతులకు అధిక దిగుబడి ఇస్తాయని, తాము పండించిన ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఇతర కోల్డ్‌స్టోరేజీలపై ఆధారపడకుండా ఇంటివద్దే తక్కువ ఖర్చుతో అధిక లాభాల పొందొచ్చని రైతు దండా వీరాంజనేయులు తెలిపారు. దీని వ్యయం రూ.15.12 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.11.34 లక్షల రాయితీ ఇచ్చింది. 2018-19లో ఏర్పాటు చేశారు.

- ఈనాడు బాపట్ల, న్యూస్‌టుడే మార్టూరు,యద్దనపూడి

ఇనాం భూములకు అన్నదాత సుఖీభవ

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

బల్లికురవ: అన్నదాతల ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని చెన్నుపల్లిలో గురువారం రైతన్న మీకోసం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. చెన్నుపల్లి, పరిసర గ్రామాల అగ్రహారం భూములకు ఎటువంటి పెట్టుబడి సాయం కానీ, ప్రభుత్వ పథకాలు కానీ అందడం లేదని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు నేతలు తన దృష్టికి తీసుకురాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రితో చర్చించి అగ్రహారం భూముల రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. అర్హత కలిగిన అగ్రహారం రైతులకు అన్నదాత నిధులు రాకపోతే వివరాలు తీసుకుని మూడో విడతలో వచ్చేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రతి గ్రామంలో నూతన లైన్లు, నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో చాలా వరకు నూతన లైన్లు పూర్తయ్యాయని చెప్పారు. 2026 మే నెల నాటికి నియోజకవర్గంలో నూతన నియంత్రికలు, అన్ని విద్యుత్తు పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. వ్యవసాయ బోర్లకు బల్లికురవ మండలంలో సుమారు 1200 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, అర్జీలు పెట్టుకున్న అందరికీ నియంత్రికలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

In Memory of the Diamond Jubilee of
LOYOLA PUBLIC SCHOOL, Nallapadu, Guntur and following the Legacy of St.Ignatius' Pedagogy in Education, as a Token of Love and Gratitude.
Hearty Welcome to Alumni of Loyola Public School on
29-11-2025, SATURDAY at 4.30 P.M. GOD BLESS US!
loyolapublicschool.lps@gmail.com
☎ : 91216 06671
Management

ఖో అంటే.. పాయింటే!

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపిక

జె.పంగులూరు, న్యూస్‌టుడే

ఆ విద్యార్థులు బరిలోకి దిగితే... పాయింట్లు రావాల్సిందే.. ప్రత్యర్థి జట్టులో క్రీడాకారులకు చెమటలు పట్టాల్సిందే. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారంతా. .. ఆటపై పట్టు సాధించారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వీరు ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందారు. అండర్ 19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఈ నెల 10న విజయనగరం వేదిక జరిగాయి. వీటిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ విజయంలో కీలక భూమిక పోషించిన బాజీబాబు, భరత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారి లక్ష్యాలు ఏమిటో చూద్దాం..

రైల్వేలో కొలువు సాధిస్తా



నాది పంగులూరు గ్రామం. క్రీడాకారుడిగా రాణించాలనేది తల్లిదండ్రుల కల. నేను 4వ తరగతి నుంచి ఖోఖోలో శిక్షణ పొందుతున్నాను. నాలుగుసార్లు జాతీయ జట్టులో ఆడాను. క్రీడా కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. ఆ దిశగా కృషిచేస్తున్నాను. **- బాజీబాబు**

ఎనిమిదో తరగతి నుంచి శిక్షణ

నేను 8వ తరగతి నుంచి ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నాను. కోచ్ సీతారామిరెడ్డి ఇచ్చిన మెలకువలతో క్రీడల్లో రాణించి రైల్వేలో కొలువు సాధించడమే లక్ష్యం. అల్టిమేట్ ఖోఖో పోటీల్లో ఆడేందుకు కృషిచేస్తున్నాను. **- ఎన్.భరత్‌కుమార్**

వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడతా

కోచ్ సహకారంతో ఆటలో మెలకువలు నేర్చుకొని ఆటపై పట్టు సాధిస్తున్నాను. క్రీడల్లో మరింతగా రాణించి వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనేది ధ్యేయం. నాలాగే మరింత మంది క్రీడాకారులను తయారు చేయడమే నా లక్ష్యం. **- ఐ.ప్రవీణ్ కుమార్‌రెడ్డి**

మరింత మంది క్రీడాకారులను తయారు చేస్తా

క్రీడలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని మరింత మంది క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం. గత డిసెంబర్లో ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీకి చెందిన 11 మంది [illegible] వ్యాయామ ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడం సంతోషించదగిన విషయం. ఈ విధంగా క్రీడాకారులను తయారు చేయడంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ బాచిన చెంచుగరటయ్య, పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, పంగులూరు గ్రామస్థుల సహకారంతో ఈ విజయాలు సాధ్యం అవుతున్నాయి. **- మేకల సీతారామిరెడ్డి, కోచ్**

ధాన్యం సేకరణ వేగవంతానికి ఆదేశం

అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎదురవుతున్న సమస్యల గురించి సమాచారం అందించాలన్నారు. ఈ నెల 30, డిసెంబరు 1న జిల్లాలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. రైతులకు అవసరమైన టార్పలిన్ పట్టలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ 17 శాతానికి రాగానే ఆర్‌ఎస్‌కేలో విక్రయించాలని సూచించారు. [illegible] 505 వాహనాలను ఆర్‌ఎస్‌కేలు అనుసంధానించామని చెప్పారు. జేసీ భావన, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఎస్‌ఓ జమీర్‌బాషా, డీఎం శ్రీలక్ష్మి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

అన్ని చర్యలు తీసుకున్నాం..

బాపట్ల: ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం అమరావతి నుంచి సీఎస్ విజయానంద్ నిర్వహించిన వీసీలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కేలో 3.15 లక్షల గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం తడవకుండా సేకరిస్తామని పేర్కొన్నారు. [illegible] పట్టణాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల [illegible] డీఎస్‌డబ్ల్యూవో రాజా దిబోరా, డీటీడబ్ల్యూవో శివలీల, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి ఆకతాయి చర్య

★ సహచర విద్యార్థి ఛాతిపై ఏఐ ద్వారా పాకిస్థాన్ జెండాతో చిత్రం

★ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వైనం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రముఖ కళాశాలకు చెందిన విద్యార్థుల ఆకతాయి చర్య వివాదాస్పదమైంది. వసతిగృహంలో విద్యార్థి పడుకొని ఉండగా సహచర విద్యార్థి ఫోన్లో చిత్రం తీసి ఏఐ ద్వారా అతడి ఛాతిపై పాకిస్థాన్ జెండా ఉన్నట్లుగా సృష్టించాడు. దీనిని సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. పాకిస్థాన్ జెండా వీడియో కావాలంటే తనను సంప్రదించాలని పోస్టులో పేర్కొన్నాడు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లింది. విద్యార్థులను బాపట్ల పట్టణ పోలీసులు విచారించారు. విచారణలో ఏఐ ద్వారా సృష్టించిన చిత్రంగా తేలింది. బాధ్యుడైన విద్యార్థినిని మందలించి పంపించారు. ఘటనపై ఎస్పీ ఉమామహేశ్వర్‌ను సంప్రదించగా స్పందిస్తూ విద్యార్థి ఛాతిపై పాకిస్థాన్ జెండా ఉంచి చిత్రం తీయలేదని పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. ఓ విద్యార్థి ఏఐ ద్వారా ఈ చిత్రాన్ని సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినట్లు తెలిపారు. కృత్రిమ మేధను ఎవరూ దుర్వినియోగం చేయరాదన్నారు.

బాల్య వివాహాలు నేరం

బాపట్ల, న్యూస్‌టుడే: బాల్య వివాహాల రహిత జిల్లాగా బాపట్లను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమ కర పత్రాలను కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PERSONAL CLASSIFIEDS

N. లక్ష్మి, ఫోక్సో అడ్వకేట్ & హైకోర్టు, హైదరాబాద్. క్రిమినల్ కేసుల నిపుణులు. ఉచిత న్యాయ సలహాల కొరకు సంప్ర: 80193 43834.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT.వృద్ధులకు, పేషెంట్స్ సేవలకు, ఇంటి/ వంట, బేబీకేర్ వర్కర్లకు భారతదేశం అంతటా పంపబడును. ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

GENERAL

రాజధాని అమరావతిలో గజం 5000/- & 10000/- రాజధానిలో ఎకరం పొలం 70 లక్షలు, గుంటూరులో మార్కెట్ షాప్ 1.60 Cr. Ph: 90523 45356.

JOBS

WANTED Pro'sfor Jr.College Chirala for Details ✆ 80088 12235 send resume to wat'sapp:8323837500 attend Interview on1-12-25by 10AM.

Wanted Female Computer Operator, Timings: 9Am-6pm ★ Eclat Health Services, Arundalpet, Guntur ✆ 99514 42111.

ఉద్యో హస్పటల్ బాపట్లలో పనిచేయుటకు యూత్ డాక్టర్, అనుభవజ్ఞులైన నర్సింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించవలసిన. ✆: 79897 85865.

WANTED HDFC BANK కొరకు
చీరాల జిల్లా ప్రాంతాలు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ కలిగినవారికి [illegible]
లలితా ఫైనాన్స్ లింక్స్ [illegible]
✆7729989278

ప్రముఖ కల్లెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కన్సల్టెంట్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవం గల వారు కావలెను. జీతము (15K to 20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

ఆర్ డాక్టర్ హాస్పటల్, గోరంట్ల, గుంటూరు నందు మేనేజర్, నర్సింగ్ స్టాఫ్, PRO's కావలెను. రెజ్యూమ్ వాట్సాప్ 79814 50441.

హరిత్వర్ హోటల్లో వృద్ధులకు, పేషెంట్స్ పిల్లలను చూసుకునేందుకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆ 96402 58899, 96404 68899.

ప్రముఖ మార్కెటింగ్ సంస్థకు సేల్స్‌మెన్, స్టాఫ్ కావలెను. నెలకు ₹ 5,000, డెలివరీ బాయ్స్, ఫ్రంట్‌ఆఫీస్, హౌస్ వైఫ్స్, వీక్లీ బోనస్, 98487 33026.

ప్రముఖ ఆగ్రామి సంస్థలో పార్ట్‌టైం/ ఫుల్‌టైం బిజినెస్ పార్ట్‌నర్స్ కావలెను. అధిక కమీషన్ సంపాదించండి. విద్యార్హత 10th. Age:30-65 సం|| 9963590104.

FACULTY/ TEACHERS

WANTED: Principal To Run the School, Qul: PG+ B.Ed., need Sy. Experience, Salary: 40 to 50K, Cont: Buchi Reddy Palem Nellore (Dt.) ✆ 94401 22213.

గమనిక
[illegible]

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జీ.ఎస్.టీ. అదనం

ద్విచక్ర వాహనాల అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

నిందితులతో ఎస్పీ ఉమామహేశ్వర్, ఇతర పోలీసు అధికారులు

బాపట్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను సీసీఎస్, అమృతలూరు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఎస్పీ వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కొమ్మ వెంకట సాయి, సాయికృష్ణ, సంపంగళి నాని, సయ్యద్ నాగూర్ వలి, పందుల రమేష్‌బాబు, ప్రకాశం జిల్లా పొదిలి మండలం రామాపురానికి చెందిన బండి శివారెడ్డి (ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు) దొంగల ముఠాగా ఏర్పడ్డారు. చెడు వ్యసనాలకు బానిసలై విలాసాలకు నగదు కోసం రెండేళ్ల నుంచి మోటార్ సైకిళ్లు చోరీ చేయటం ప్రారంభించారు. దొంగతనం చేసిన వాహనాలను వేరే జిల్లాలకు తీసుకెళ్లి మెకానిక్ దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిందితులపై ఇతర జిల్లాల్లోను కేసులు నమోదయ్యాయి. జిల్లాలో వరసగా మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడ్డారు. యద్దనపూడి మండలం చిమటావారిపాలేనికి చెందిన సుబ్బారావు అమృతలూరు మండలం ఇంటూరులో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా అపహరించారు. అతడి ఫిర్యాదు మేరకు అమృతలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనాల చోరీల కేసును సీసీఎస్ పోలీసులకు ఎస్పీ అప్పగించారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ నేతృత్వంలో సీఐ ప్రేమయ్య, అమృతలూరు ఎస్సై రవితేజలతో రెండు పోలీసు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి వారి నుంచి రూ.16.50 లక్షల విలువైన 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దొంగల ముఠా చోరీ చేసిన వాహనాలను శివారెడ్డి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బైక్ మెకానిక్ దుకాణం ద్వారా విక్రయిస్తున్నాడు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి నగదు పురస్కారాలు అందజేశారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య, చుండూరు సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ 49.56 శాతం పూర్తి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ 49.56 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్ యాదవ్ వీసీ ద్వారా నిర్వహించిన సమీక్షలో కలెక్టరేట్ నుంచి ఆయన గురువారం మాట్లాడారు. కొత్త పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోల నియామకానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. బీఎల్వోలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామన్నారు.

జల క్రీడలకు ప్రోత్సాహం.. జిల్లాలో జల క్రీడలను ప్రోత్సహిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో కలెక్టర్‌ను శాప్ ఎండీ భరణి గురువారం కలిశారు. జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం నిర్మాణంపై చర్చించారు. బీచ్‌లు పరిశీలించారు. డీఎస్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్య సామర్థ్యాలు పెంపొందించాలి

తరగతి గదిలో పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

పర్చూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో భాగంగా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించాలని ప్రాంతీయ విద్యాసంచాలకుడు (ఆర్జేడీ) బి.లింగేశ్వరరెడ్డి చెప్పారు. గురువారం పర్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు స్వయంగా ఉక్తలేఖనం (డిక్టేషన్) నిర్వహించి స్వయంగా తప్పులు, రాత, పఠనం, గణిత విభాగాల్లో పిల్లల సామర్థ్యాలు పరిశీలించారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. గ్రేడ్ల విధానం అమల్లో ఉండటంతో బోధనలో ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. ఎంఈవోలు తరచూ పాఠశాలల్లో తనిఖీలు చేయాలని ఆయన సూచించారు. ఆర్జేడీ వెంట ఎంఈవోలు శివకోటేశ్వరరావు, పి.వెంకట్రామయ్య, హెచ్‌ఎం నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

భూసేకరణ వేగవంతం

బాపట్ల, న్యూస్‌టుడే: యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావటానికి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పతకానికి గతంలో భూమిలిచ్చిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇంకా 340.23 ఎకరాల సేకరణ పెండింగ్‌లో ఉందని తెలిపారు. భూసేకరణ ప్రకటన 2011లో జారీ అయిందన్నారు. 2013 భూసేకరణ చట్టం ఆధారంగా పరిహారం చెల్లించాలని రైతులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రైతుల అభిప్రాయాలు సేకరించి నివేదిక అందజేస్తామన్నారు. ఉప కలెక్టర్ విజయ జ్యోతికుమారి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

బాపట్ల, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు, గిరిజనుల సమస్యలపై కలెక్టరేట్లో ప్రత్యేక పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆ వర్గాల వారు సమస్యలపై అర్జీలు అందజేస్తే విచారించి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు దివ్యాంగులకు క్రీడా పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి క్రీడా పోటీలను మినీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, చదరంగం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 – ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 – ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 – మ. 2
సత్యభామ	మ. 2 – సా. 5
లైట్ తీస్కో	సా. 5 – రా. 9
సరదాగా కాసేపు	రా. 9 – రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 – తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల బైపాస్ జాతీయ రహదారిలో గురువారం చోటుచేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫి తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని అదే దారిలో వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో వెనుక కూర్చున్న వ్యక్తి లారీ కింద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రెండు లారీలు ఢీకొన్న ఘటనలో క్లీనర్

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై ముప్పవరం విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వినోద్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఒంగోలు వెళుతున్న కరెంటు స్తంభాల లారీ రహదారి వెంబడి ఆగి ఉండగా అదే మార్గంలో వెనుక నుంచి మరో లారీ ఢీకొందన్నారు. దీంతో ఢీకొన్న లారీలోని క్లీనర్ ఆరీఫ్(35)కు గాయాలయ్యాయని చెప్పారు. హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆరీఫ్ మృతిచెందాడు. లారీ డ్రైవర్ క్షేమంగా ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

కాలువలో పడిపోయిన కారు

కేశవరప్పాడు (కారంచేడు), న్యూస్‌టుడే: అదుపుతప్పి కారు బోల్తాకొట్టి కాలువలోకి దూసుకువెళ్లిన ఘటన గురువారం ఉదయం మండల పరిధిలోని స్వర్ణ-కేశవరప్పాడు గ్రామాల మధ్య నాలుగు రోడ్ల కూడలి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఒంగోలులో నివసించే కొమ్మోజీ శ్రీనివాస్ పెదగంజాంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే యూటీఎఫ్ శాఖ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. జరుబులవారిపాలెంలోని తల్లిదండ్రులతో మాట్లాడి కారులో బాపట్లలో జరిగే యూటీఎఫ్ సమావేశానికి హాజరయ్యే క్రమంలో ఒక్కసారిగా కారు అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టి పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాకొట్టింది. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పి, ఆయనకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు శ్రీనివాస్‌ను కారులో నుంచి బయటకు తీసుకొచ్చి, చీరాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. అనంతరం ఆయన ఒంగోలుకు వెళ్లిపోయినట్లు తెలిసింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

తార వెలిసింది

నగరం: గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయి. పండగను పురస్కరించుకుని గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో 10 నుంచి 30 అడుగుల ఎత్తున్న క్రిస్మస్ నక్షత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నగరం, పూడివాడ, ధూళిపూడి, మంత్రిపాలెం, పమిడిమర్రు, గాలివారిపాలెం తదితర గ్రామాల్లో రంగు రంగుల తారలను ఏర్పాటు చేసి వాటికి విద్యుత్తు దీపాలు అమర్చుతున్నారు. విద్యుత్తు కాంతులీనుతున్న వీటిని చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనర్గళంగా మాట్లాడి.. బహుమతులు పొంది

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ చాందిని

బాపట్ల, న్యూస్‌టుడే: కర్లపాలెంలోని హైవెండ్ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపి విద్యార్థులు కె.వరలక్ష్మి ప్రథమ, కె.అశ్విని ద్వితీయ, ఎస్‌కే అనాస్ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ పి.చాందిని బహుమతులు ప్రదానం చేశారు.

హామీలు అమలు చేస్తున్న ఘనత కూటమిదే

స్థానికుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గురవారం గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకంపై ఇంటింటి ప్రచారం చేస్తూ రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరనిస్తూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

చెరుకుపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న శివప్రసాద్

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. చెరుకుపల్లి సంత బజారులో నూతనంగా రూ.కోటితో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, సైడ్ డ్రెయిన్ నిర్మాణాలకు, నడింపల్లిలో రూ.1.85 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో షేక్ మహబూబ్ సుబానీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చంద్రశేఖరరావు, చందానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుడుతున్నాయ్.. కుడుతున్నాయ్

దోమల నివారణ చర్యలు శూన్యం

రేపల్లె అర్బన్, చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే:

వాతావరణంలో మార్పులు, పారిశుద్ధ్య లోపంతో పట్టణాలు, పల్లె ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగలు భగభగ మండే ఎండ, రాత్రి సమయాల్లో మంచు ఇలా భిన్న వాతావరణం నెలకొనడంతో ప్రజలు జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు.

★ రేపల్లె పట్టణంలో 28 వార్డులు, రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో 235 పంచాయతీలున్నాయి. పట్టణంలో 95 శాతం వరకు మురుగు కాలువలున్నా పల్లెల్లో 80 శాతం వరకు కచ్చా కాలువలే. భారీ వర్షం కురిస్తే రోజుల తరబడి నీరు నిలిచిపోయి మురికి కూపాలవుతున్నాయి. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు, ఖాళీ కొబ్బరి చిప్పలు, చెత్తాచెదారం, వ్యర్థాలను ఆవాసాలుగా చేసుకుని లార్వా ఉత్పత్తి కేంద్రాలుగా దోమలు మార్చుకుంటున్నాయి. ఖాళీ జాగాల్లో పడేసిన చెత్తాచెదారం పేరుకుని కుళ్లిపోవడంతో దోమల సమస్య మరింత జఠిలంగా మారుతోంది. దోమ కాటుకు గురైన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

రేపల్లె 23వ వార్డు ఖాళీస్థలంలో నిలిచిన మురుగు

తాత్కాలిక పనులతో సరి

దోమల బెడదను నియంత్రించాల్సిన అధికారులు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్ల పక్కన సున్నం, బ్లీచింగ్ చల్లించి చేతులు దులుపుకుంటున్నారు. తుపాను విపత్తు పోయినా ఇప్పటికీ పట్టణంతో పాటు, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు పూర్తిగా తొలగలేదు. ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు నీటిలో ఎక్కడా ఆయిల్ బాల్స్ వేయించడం, లార్వా నిర్మూలనకు రసాయనాల పిచికారీ చేయించ లేదు. పట్టణం, పల్లెల్లో ఫాగింగ్ ఊసే లేదు. పల్లెల్లో ఫాగింగ్ చేయించేందుకు ఎక్కువ ఖర్చు అవుతోందని అధికారులు కుంటి సాకులు చెబుతున్నారని గ్రామీణులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఈ విషయమై రేపల్లె డీఎల్‌డీవో పద్మ, కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాం. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరు తొలగించడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించాం. మురుగునీటి గుంతల్లో ఆయిల్ బాల్స్, మురుగు కాలువల్లో రసాయనాలు పిచికారీ చేయిస్తామని తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న భట్టిపూడి మల్లికార్జునరావు పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా భట్టిప్రోలుకు బదిలీ అయ్యారు. మండలంలోని అంబేడ్కర్ నగర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఈయన మూడు నెలల క్రితం బదిలీపై చెరుకుపల్లి రాగా మళ్లీ పదోన్నతిపై భట్టిప్రోలు మండలం గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

వెండి వస్తువులు అందజేత

కొల్లూరు, న్యూస్‌టుడే : గ్రామంలోని పార్వతీదేవి అమ్మవారి దేవస్థానానికి గోలి మురళీధర్ దంపతులు 75 గ్రాముల వెండి గ్లాసు, ఉద్ధరిణిని గురువారం అందించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాల సమయంలో వినియోగించేందుకు వీలుగా ఉండేందుకు అందజేసినట్లు దాతలు తెలిపారు.

నివాస ప్రాంతాల్లో చెత్త వేయరాదు

ఇంటింటి ప్రచారంలో డీఎల్‌డీవో పద్మావతి

అమృతలూరు, న్యూస్‌టుడే: నివాస ప్రాంతాల వద్ద స్థానికులు చెత్త వేయరాదని డీఎల్‌డీవో పద్మావతి అన్నారు. ఆమె గురువారం అమృతలూరులో చెత్త సేకరణపై అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం చేశారు. తడి, పొడి చెత్తను పంచాయతీ కార్మికులకు ఇంటికి వచ్చిన సందర్భంలో వారికి ఇవ్వాలని ఆమె తెలిపారు. అనంతరం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ కంపోస్టు ఎరువు తయారీ, చెత్త నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఎంపీడీవో శేషుబాబు, పంచాయతీ సిబ్బంది జ్యోతి, రిజ్వాన తదితరులు ఉన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా పాలకవర్గం

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : ఆలయం, గోవు, సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రుద్రయ్య అన్నారు. పట్టణంలోని ఎన్జీవో గృహంలో గురువారం దేవాలయాల పరిరక్షణ జిల్లా కమిటీ ఏర్పాటు, ప్రమాణ స్వీకారం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లా, పట్టణ కమిటీల సభ్యులు స్వచ్ఛందంగా పనిచేసి దేశంలో హిందూ మత ఔనత్యాన్ని చాటాలన్నారు. జిల్లా, పట్టణ కమిటీలను ఏర్పాటు చేసి వారిచేత జైశ్రీరామ్ రామరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏవీ శివకుమార్, వి.నాగేశ్వరరావు, కృష్ణప్రియ, డీవీ సుబ్బారావు, ఎ.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన

మంత్రి నారా లోకేశ్‌తో ఉపాధ్యాయుడు మురళీమోహన్

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్వహించిన విద్యార్థుల మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న 175 మంది విద్యార్థులకు మండలంలోని వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల ప్రదర్శన చూసి అందరూ మెచ్చుకొన్నారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. విద్యార్థులు మాట్లాడిన తీరు తనకెంతగానో నచ్చిందని ఉపాధ్యాయుడికి తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

ఐలవరంలో ధాన్యం కొనుగోలు చేసే పరికరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, బృందం సభ్యులు

అమృతలూరు, న్యూస్‌టుడే: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. ఆయన అమృతలూరు రైతు సేవా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పర్యవేక్షించారు. అల్పపీడనం కారణంగా వాతావరణం సరిగా లేకపోవడంతో ధాన్యం కొనుగోలు విషయంలో జాప్యం చేయరాదని, రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సకాలంలో సేవలందించాలని ఆయన సూచించారు. ఏవో భరత్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోండి

భట్టిప్రోలు: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆరు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పరికరాలను గురువారం బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో రైతులు ధాన్యాన్ని జాగ్రత్త పరిచేందుకు ప్రతి కేంద్రానికి 5 వేల గోతాలు, 25 పట్టలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎంపీడీవో ఎస్.వి.రమణ, ఏవో బ్రహ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

పిట్టలవానిపాలెం: ధాన్యం విక్రయాల విషయంలో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను రైతులు పాటించాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని చందోలు, పిట్టువారిపాలెం గ్రామాల్లో గురువారం ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

వేమూరు: మండలంలోని వెల్లబాడుకు చెందిన వెల్లబాటి వంశీ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ప్రైవేటు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.2లక్షల సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ఆనందబాబు గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి మరివాడ ప్రసాద్ తాను చదువుకొన్న పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 1.6 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. చెరుకుపల్లి జడ్పీటీసీ సభ్యురాలు మరివాడ పావని భర్త అయిన ఈయన ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ మేళాలో పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పిస్తానని ఇచ్చిన వాగ్దానం మేరకు ప్లాంట్ ఏర్పాటు చేశారు. గురువారం మంత్రి అనగాని శివప్రసాద్ ప్లాంట్‌ను ప్రారంభించారు. దాతను, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్

అల్లూరు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : ప్రజలు చట్టాలను పాటించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చందోలు ఎస్సై శివకుమార్ అన్నారు. గురువారం మండలంలోని అల్లూరులో గ్రామస్థులకు శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల శారీరకంగా, మానసికంగా తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మహిళలతో అగౌరవంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

రేపల్లె అర్బన్: రేపల్లె 8వ వార్డులో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఈనెల 27న మేమున్నాం..మీకు తోడుగా శీర్షికన ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ గురువారం కార్మికులను పంపి ఆరుచోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

అనుకోనిది జరిగితే.. కన్నీరే మిగిలేది

బైక్‌పై ఐదుగురి ప్రయాణం

సాధారణంగా బైక్‌పై ఇద్దరు ప్రయాణించాలి. కానీ నగరం నుంచి రేపల్లె వెళ్తున్న ఓ వ్యక్తి తనతో పాటు మరో నలుగుర్ని ఎక్కించుకుని ప్రమాదకరంగా బండి నడుపుతూ ఇలా కనిపించాడు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం ప్రస్తుతం సాధారణమైంది. ప్రమాదాలు చోటు చేసుకుంటే కన్నీరే మిగులుతుంది. అధికారులు తగు చర్యలు తీసుకుని ఇలాంటి ప్రయాణాలను నివారించాలని సమాజహితులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, నగరం

పదినెలలుగా నత్తనడకన

సజ్జావారిపాలెం-రేపల్లె రహదారి దుస్థితి

సజ్జావారిపాలెం-రేపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు పది నెలలుగా సాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో మొదలైన రహదారి పనులు నేటికి కొనసాగుతూనే ఉన్నాయి. సజ్జావారిపాలెం నుంచి రేపల్లె శివారు ఇసుకపల్లి వరకు నాలుగు నెలల క్రితం తారు రోడ్డు వేశారు. వేసిన ఐదారు కిలోమీటర్ల రహదారిలో మధ్య మధ్యలో కిలోమీటరు పైగా తారు వేయలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నగరం

దారి పక్కన వ్యర్థాలు

మండలంలోని మేజర్ పంచాయతీ చందోలు పెద్ద హరిజనవాడ నుంచి 216 జాతీయ రహదారికి వెళ్లే దారి పక్కన చెత్త వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనికి తోడు రాత్రిపూట దీపాలు వెలగడం లేదు. అటుగా వెళ్లే విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

ఆదమరిస్తే డ్రెయిన్లోకే

పట్టణంలోని అంబేడ్కర్ మార్గ్‌లో గ్రంథాలయ సమీపంలో రహదారిని ఆనుకుని ఉన్న మురుగు కాలువ మీద సిమెంట్ బల్ల విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఎవరూ పట్టించుకోక కొన్ని రోజుల నుంచి అలాగే ఉంది. ఆదమరిచి వాహనం నడిపితే వాహనదారులు మురుగు కాలువలో పడే ప్రమాదం ఉంది. మున్సిపాలిటీ సిబ్బంది మురుగు కాలువపై సిమెంట్ బల్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బాపట్ల టౌన్

హడావుడిగా వరి కుప్పలు

మండలంలో వరి పైర్లు కోతకు వచ్చి సిద్ధంగా ఉన్నాయి. వాతావరణంలో మార్పులు, తుపాను హెచ్చరికలు రైతులను కలవరం పెడుతున్నాయి. కోత కొచ్చిన పైర్లను రైతులు పశుగ్రాసం దక్కకపోయినా యంత్రాల ద్వారా కోసి ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. మరి కొందరు రైతులు మామూలుగా కోసిన పైర్లను హడావుడిగా కుప్పలు వేస్తున్నారు. పంట చేతి కొచ్చిన దశలో వర్షాలు కురిస్తే ఆరుగాలం పండించిన పంట రైతన్నకు దక్కదని ఆందోళన చెందుతున్నారు. -బాపట్ల టౌన్, న్యూస్‌టుడే

కొనసాగుతున్న సేవా శిబిరం

బేతపూడి (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం బేతపూడిలో రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరం గురువారం ఆరోరోజుకు చేరింది. నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మత్తుపదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారి దాసు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రవిబాబు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

మండల స్థాయి ఆటల పోటీలు

భట్టిప్రోలు : అద్దేపల్లి భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు గురువారం మండల స్థాయిలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, పరుగుపందెం, కుర్చీ ఆటలు ఆడించారు. ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రంగయ్య, ఐఈడీ టీచర్లు కె.రత్నాకర్, మేరీ ఇవాంజికల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : నూతన వ్యాధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డా.కె.సిద్ధార్థ అన్నారు. పట్టణంలోని బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో గురువారం నూతన వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన రోగాలను ఎదుర్కొనేందుకు వాటిని నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రిన్సిపల్ గోపాలకృష్ణ మూర్తి, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకరు వస్తేనే నీరు.. లేదంటే బేజారు

బాపట్ల, న్యూస్‌టుడే

పురపాలక సంఘం పరిధిలోని పీఎంఏవై గృహకల్ప నగర్‌లలో పక్కా గృహాలు నిర్మించుకున్న పేదలు నీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కాలనీల్లో గత ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేదు. తాగునీటి పైప్ లైన్ల నిర్మాణం చేపట్టలేదు. ట్యాంకర్ల ద్వారా మూడు కాలనీలకు అరకొరగా మాత్రమే నీరు సరఫరా సరఫరా చేస్తున్నారు.

★ పట్టణ పరిధిలోని ప్యాడిసన్‌పేట, మూలపాలెం, బేతనీ కాలనీ పేదల కాలనీల్లో రెండున్నర వేలకు పైగా గృహాల నిర్మాణం జరిగింది. లబ్ధిదారులు అష్టకష్టాలు పడి గృహాలు నిర్మించినా కాలనీల్లో నివాసం ఉండలేని దుస్థితి నెలకొంది. తాగునీటి పైప్ లైన్లు వేయలేదు. ప్యాడిసన్ పేట లేఔట్‌లో నీటి కోసం రూ.వేలు ఖర్చు చేసి బోర్లు వేయించినా కటిక ఉప్పగా ఉండి ఏ మాత్రం వినియోగానికి అనుకూలంగా లేవు. నీటి సమస్య వల్ల గృహాలు నిర్మించుకున్నా వందల మంది లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉండటం లేదు. సొంతిల్లు ఉన్నా ఇంకా అద్దెంట్లోనే నివాసం ఉంటున్నారు.

ట్యాంకర్ నుంచి డ్రమ్ముల్లోకి పడుతున్న నీరు

★ వేసవి వస్తే ఈ కాలనీల్లో నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాగటానికి క్యాన్లలో రెండు, మూడు కి.మీ. దూరం వెళ్లి వ్యాపారుల నుంచి నీరు కొనుగోలు చేసి తెస్తున్నారు. ఇంట్లో రోజువారీ అవసరాలకు నీరు అవసరం అవుతోంది. పురపాలక ట్యాంకర్లు వారానికి ఒకసారి వస్తున్నాయి. ఇళ్ల ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని ట్యాంకర్ నీటిని పట్టుకున్నా అవి నాలుగు రోజులే వస్తున్నాయి. మరో మూడ్రోజులు నీరు లేకుండా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

★ మూడు కాలనీలకు పైప్‌లైన్లు వేసి కుళాయి కనెక్షన్లు ఇచ్చి ప్రతి ఇంటికి రక్షిత నీరు సరఫరా చేసేలా పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. సమస్యపై పురపాలక డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అదనపు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అమృత్ 2.0 కింద పురపాలక సంఘానికి మంజూరైన రూ.20.32 కోట్ల నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందన్నారు.

ఆప్కో బకాయిలు విడుదల చేయండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : చేనేత సహకార సంఘాలకు ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు మురుగుడు సత్యనారాయణ కోరారు. గురువారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంఘాల్లో బకాయిలు పెరిగి పనిచేయించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి సంఘానికి రూ.లక్షల్లో బకాయిలు ఉన్నాయని, వీటితో పాటు చేనేత కార్మికులకు అందాల్సిన త్రిఫ్ట్ ఫండ్ వెంటనే అందించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నోటీసులు వెనక్కి తీసుకోవాలి

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : సూర్యలంక సముద్రానికి అత్యంత సమీపంలో జీవనం సాగిస్తున్న మత్స్యకారుల నివాసాలు తొలగించాలంటూ ఇచ్చిన నోటీసులను రెవెన్యూ అధికారులు వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను గురువారం ఆయన సందర్శించారు. ఏళ్లుగా 35 కుటుంబాల వారు చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నట్లు బాధితులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సూర్యలంక అభివృద్ధికి పేదల ఇళ్లు అడ్డం కాదని గంగయ్య అన్నారు. నిరుపేదల ఇళ్లు తొలగించాలని చూస్తే సీపీఎం పార్టీ ప్రజా సంఘాలతో కలిసి సమస్య పరిష్కారం దిశగా పోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కృష్ణ, మోహన్, శరత్ ఉన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: మైనార్టీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. గురువారం పురపాలక మార్కెట్ వద్ద షాదీఖానా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రషీద్, సభ్యులుగా షేక్ సిరాజ్, షేక్ గఫార్, సయ్యద్ షమీమ్, పఠాన్ షాహినా బాధ్యతలు స్వీకరించారు. నేతలు ఏపూరి భూపతిరావు, షేక్ రఫీ, పఠాన్ అహ్మద్‌బాషా, బాజీఖాన్, మహమ్మద్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు పత్రాల అందజేత

అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలుగా పదోన్నతులు పొందిన నలుగురు కార్యకర్తలకు పత్రాలను ఎమ్మెల్యే గురువారం అందజేశారు.

అల్పపీడన ప్రభావం.. అన్నదాత కలవరం

మూల్పూరు, (అమృతలూరు), న్యూస్‌టుడే

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతం కావడం, ఈదురు గాలులు వీచడంతో రైతుల కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే దశలో ఉంది. వర్షం కురిస్తే పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభమైన కోతలు: అమృతలూరు మండలంలో 26 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. సాధారణ వరికోతలు 200ఎకరాల్లో కోశారు. వరి పనలు నేలపై ఉన్నాయి. మరోవైపు సుమారు 1300 ఎకరాల్లో యంత్రాల సహాయంతో ఒకేసారి కోత కోసి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. తేమ తగ్గడం కోసం జాగా కనిపించిన చోట ఆరబెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈవిషయమై ఏవో భరత్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 29, 30వ తేదీల్లో వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపినట్లు పేర్కొన్నారు. రైతులు నాలుగు రోజుల వరకు సాధారణ కోతలు కోయించరాదని, యంత్రాల సహాయంతో కోయిస్తే అలాంటి ధాన్యాన్ని ఆరబెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన సూచించారు.

ధాన్యం ఆరబెడుతూ..

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

ఖేలో ఇండియా పోటీలకు శ్రావణి

వేటపాలెం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో వ్యాయామోపాధ్యాయినిగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి ఖేలో ఇండియా విశ్వవిద్యాలయం గేమ్స్‌కి టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఉమ్మిటి వేణుగోపాలరావు తెలిపారు. వచ్చేనెల 1 నుంచి 5 వరకు రాజస్థాన్‌లోని బికనీర్‌లో నిర్వహించే యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఈమె హాజరుకానున్నారని చెప్పారు. పీఈటీని ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

కంప్యూటర్ వితరణ

బల్లికురవ: మండలంలోని ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కారసాని అంజిరెడ్డి వారసులు గురువారం కంప్యూటర్‌ను బహూకరించారు. ఎంఈవో-2 కె.రమేష్‌బాబు, కొండేటి ఇజ్రాయేల్, సింగంశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల చెంచయ్య అధ్యక్షతన గురువారం మండల యూటీఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.సుబ్బారావు, బి.మేరీ శ్యామల, ప్రధాన కార్యదర్శిగా దామా రామాంజనేయులు, కోశాధికారిగా షేక్ ఫిరోజ్ సాహెబ్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు తెలిపారు. అనంతరం జిల్లా కౌన్సిలర్లుగా సాయి సత్యనారాయణ, ఎస్వీడీ ప్రసాద్, రావి శ్రీనివాసరావు, ఎం.రమాదేవి, ఎస్ఎల్ఎన్ సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కాలనీలు కావు.. చిట్టడవులు!

పమిడిపాడు, రావినూతల (మేదరమెట్ల), న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో జగనన్న కాలనీల పేరుతో నివాస యోగ్యం కానీ చోట కాలనీలు ఏర్పాటు చేయడంతో అక్కడ ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు ఇష్టపడలేదు. కొరిశపాడు మండలం పమిడిపాడు, రావినూతల గ్రామాల్లోని కాలనీల్లో పూర్తిగా చిల్లచెట్లు పెరిగి అడవులను తలపిస్తున్నాయి.

శ్మశానాల మధ్య వద్దన్నా వినలేదు: పమిడిపాడు గ్రామ శివారులోని రాచపూడి రోడ్డులో మూడెకరాల పొలాన్ని సేకరించి కాలనీగా ఏర్పాటు చేశారు. 110 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ స్థలం వద్దని లబ్ధిదారులు పలుమార్లు ఆందోళన చేపట్టినా అప్పటి అధికారులు పట్టించుకోలేదు. మొక్కుబడిగా గ్రామసభలు ఏర్పాటు చేసి, స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలం ఎదురు శ్మశానం ఉండటంతో పాటు రెండు వైపులా చెరువులు ఉన్నాయి. ఈ కారణంతో లబ్ధిదారులు అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు అయిష్టత చూపించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు అందించి నాలుగేళ్లు దాటినా ఇప్పటి వరకు అక్కడ ఒక్కరూ ఇల్లు నిర్మించుకోలేదు. ఆ ప్రదేశం పూర్తిగా చిల్లచెట్లతో నిండిపోయి అడవిని తలపిస్తోంది.

గ్రామానికి దూరంగా..: రావినూతల గ్రామానికి చెందిన 60 మందికి కుర్రవాని పాలెం వెళ్లే దారి పక్కన కాలనీ ఏర్పాటు చేశారు. ఊరికి దూరంగా వద్దని లబ్ధిదారులు మొత్తుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కాలనీలో కనీస సౌకర్యాలు లేక ఒక్కరూ ఇల్లు నిర్మించుకోలేదు. ప్రస్తుతం ఆ కాలనీ అంతా చెట్లు పెరిగిపోయాయి. మందుబాబులకు అడ్డాగా మారింది.

పమిడిపాడులో పెరిగిన చిల్లచెట్లు

అవగాహన కల్పిస్తున్నాం: పమిడిపాడు, రావినూతల గ్రామాల్లోని లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కాలనీల్లో గృహాలు నిర్మించుకోవాలని ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం గృహాలు నిర్మించుకోవడానికి అందించే నగదు పెంచింది.

- కిషోర్ కుమార్, ఇన్‌ఛార్జి హౌసింగ్ ఏఈ, కొరిశపాడు మండలం

ప్రణాళిక లోపం... ప్రజలకు శాపం

వైకుంఠపురం, విఠల్‌నగర్, దండుబాట (చీరాల), న్యూస్‌టుడే

గత పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వెరసి దండుబాట పరిధిలోని వైకుంఠపురం, విఠల్ నగర్ ప్రాంత ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారు. పట్టణంలోని మురుగు బయటకు పంపేందుకు దండుబాట రహదారి పక్కనుంచి ప్రధాన కాలువ తవ్వారు. దానిని అనుసంధానించే కాలువలు ఇష్టారాజ్యంగా నిర్మించారు. దీంతో ముందుకెళ్లాల్సిన మురుగు వెనక్కి వస్తూ పల్లపు ప్రాంతాల్లో నిలుస్తోంది. వర్షాలు కురిసినపుడు ఇళ్లముందు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైకుంఠపురం జాలమ్మ గుడి వద్ద పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇక్కడ యానాది సంఘంలో ఏమాత్రం వర్షం కురిసిన ఇళ్ల ముందు నీరు నిలిచి, స్థానికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలకు సంబంధించిన నీరు ఇప్పటికి అక్కడే నిలిచి ఉంది. ఇటీవల ఈప్రాంతంతో పాటు శ్రీరామ్‌నగర్‌లో దండుబాటను కలుపుతూ రహదారులు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాల్లోనూ శాస్త్రీయత పాటించటం లేదనే విమర్శలు ఉన్నాయి. జాలమ్మ గుడి వద్ద దండుబాటను ఆనుకొని కొద్ది దూరం రహదారి నిర్మించారు. పక్కన ఉన్న కాలువను పరిగణనలోకి తీసుకోకపోవడంతో మురుగు బయటకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. దీంతో మురుగు మొత్తం ఇళ్ల ముందే నిలిచిపోతుంది. ఇక్కడ మురుగు కాలువను ప్రధాన కాలువకు అనుసంధానించేలా మిగిలిన రోడ్డును పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. విఠల్‌నగర్‌లోని బలహీనవర్గాల కాలనీలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈప్రాంతం నుంచి ప్రధాన కాలువకు వెళ్లే చిన్న కాలువల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది.

జాలమ్మ గుడి వద్ద రహదారి ఎత్తుగా నిర్మించడంతో మార్గం లేక నిలిచిన మురుగు

మురుగు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో నెలల తరబడి నీరు నిలిచి స్థానికులు దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత పాలకులైన ఈప్రాంతాల సమస్యలపై దృష్టిపెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మొక్కుబడిగా రోడ్లు నిర్మించి చేతులు దులుపుకోవటం కాకుండా శాస్త్రీయత పాటించి కాలువలు నిర్మించి, ప్రధాన కాలువకు అనుసంధానం చేయాలని పల్లపు ప్రాంతాల్లో మురుగు నిలవకుండా చూడాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి

బల్లికురవ,న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. మండలంలోని చెన్నుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 30 సీఎం సహాయనిధి చెక్కులు, ఆరు ఎల్వోసీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పలు అర్జీలు అందించగా స్వీకరించి, వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణం

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక వై.జంక్షన్ వద్ద గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి దాతలు చిమటా శ్రీనివాసరావు, మన్నెం శ్రీకాంత్‌తో పాటు పలువురు దాతలు అందజేసిన రూ.1.50 కోట్లతో నిర్మించిన వంటశాల, అతిథి గృహాలు, కల్యాణ మండపాన్ని దాతల కుటుంబ సభ్యులు ప్రారంభించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కమిటీ సభ్యులు కె.హరిప్రసాద్, ఆర్.ఆంజనేయులు, జి.శ్రీనివాసరావు కె.సురేంద్ర, శివనాగేశ్వరరావులు పర్యవేక్షించారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న దాతల కుటుంబ సభ్యులు

దుమ్ము రహదారి

మక్కెనవారిపాలెం (సంతమాగులూరు), న్యూస్‌టుడే

దుమ్ము రహదారి.. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి నుంచి మక్కెనవారిపాలెం వెళ్లే అనుసంధాన రోడ్డు దుస్థితి ఇది. ఐదు వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామ సచివాలయానికి చేరుకునే అనుసంధాన మార్గమిది. ఎన్నెస్పీ అద్దంకి బ్రాంచి కాలువ ప్రధాన వంతెన వద్దకు రైతులు వెళ్లేందుకు ఉన్న దగ్గరి దారిది. నామ్ రహదారి నుంచి గ్రామ ప్రవేశ మార్గం వరకు చేరుకునేందుకు 1800 మీటర్లకు పైగా పొడవున్న ఈ మార్గం గ్రామ ప్రజల రాకపోకలకు ప్రధాన వనరు. ఊరి సమీపంలో చిన్నతరహా సాగు నీటి చెరువు అంచున వెళ్లే ఈ దారి గతంలో గుంతలమయంగా ఉండేది. దీన్ని తారు రోడ్డుగా మార్చేందుకు ఐదేళ్ల క్రితం పీఆర్ (పీఐయూ) విభాగం ద్వారా రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టారు. గుంతల్ని పూడ్చి కంకరు వేశారు. ఆ తరువాత తారు రహదారి నిర్మాణం పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం ఈ రోడ్డు కంకరు డస్టుతో కలిసి దుమ్ము రేగుతోంది. ద్విచక్ర వాహనదారులు, బాటసారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా మారింది. గతంలో ఈ రహదారి నిర్మాణానికి అంచనా వేసి నిధులు మంజూరు చేయడం, పనులు చేపట్టి పూర్తి చేయకపోవడం, ప్రస్తుతం మెటీరియల్ ధరలు పెరగడంతో అప్పటి ధరలకి, ప్రస్తుత ధరలకి వ్యత్యాసం ఉండటంతో దీన్ని పూర్తి చేసేందుకు గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా నిధులు విడుదల చేసి, తారు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మక్కెనవారిపాలెం అనుసంధాన రోడ్డు దుస్థితి

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

కొత్తపేట(చీరాల అర్బన్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గురువారం కొత్తపేటలోని బీఆర్‌కే హైస్కూల్‌లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోను ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కె.జ్ఞానేశ్వరరెడ్డి, ఎన్.సంతోషిణి, ఎస్.యశస్విని సాధించారు. వీరికి 'ఈనాడు' తరపున జ్ఞాపికలను ప్రధానాచార్యుడు బి.రాధాకృష్ణారెడ్డి అందజేశారు. ఉపాధ్యాయులు ఎం.రమేష్, ఎ.అయ్యప్ప ఉన్నారు. మధ్యాహ్నం నుంచి విజ్ఞానభారతి హైస్కూల్‌లో జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో డి.ముకుంద, ఎస్.నిఖిలేష్, డి.తేజశ్రీ నిలిచారు. వీరికి 'ఈనాడు' నుంచి జ్ఞాపికలను డైరెక్టర్ భూపేంద్ర అందజేశారు. ప్రిన్సిపల్ షేక్ కరీముల్లా, పాల్గొన్నారు.

బీఆర్‌కే హైస్కూల్‌లో విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రతినిధులు

విజ్ఞానభారతిలో..

కృత్రిమ మేధతో అంతా సౌలభ్యం

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రతినిధులు

అద్దంకి: కృత్రిమ మేధతో అంతా సౌలభ్యం అని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధతో ఉపయోగాలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రధానాచార్యులు యు.కోటేశ్వరమ్మ నేతృత్వం వహించారు. అనంతరం విజేతలు షేక్ సరోష్, సీహెచ్.వాణి, బి.భార్గవిలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు అందించారు. అధ్యాపకులు రాజేశ్వరమ్మ, పద్మావతి, బుజ్జిబాబు, నీరజ పాల్గొన్నారు.

మొంథా గాయాలు తగ్గాయ్.. రాకపోకలు రయ్..రయ్

పేరాయపాలెం వద్ద దోర్నపువాగు వద్ద పూర్తయిన మరమ్మతులు

నెల క్రితం సంభవించిన మొంథా తుపాను గాయాలు తగ్గాయి. ప్రభుత్వం సకాలంలో స్పందించడంతో యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చారు. దీంతో రాకపోకలు రయ్..రయ్ అంటున్నాయి. అద్దంకి ప్రాంతంలో గతంలో ఎపుడూ లేని విధంగా 18.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈకారణంగా వర్షపునీరు భారీగా వచ్చి చేరింది. తుపాను కారణంగా మోదేపల్లి, పేరాయపాలెం గ్రామాల మధ్య చిలకలేరు, దోర్నపు వాగులపై నిర్మించిన వంతెనల అప్రోచ్ రహదారులకు గండ్లు పడ్డాయి. పంటలు కూడా దెబ్బతిన్నాయి. సంఘటనా స్థలాలను రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. రెండు వంతెనలు, రహదారుల మరమ్మతులకు ర.భ.శాఖ ద్వారా రూ.25 లక్షలు కేటాయించారు. ఫలితంగా ప్రస్తుతం గండ్లు పడిన ప్రదేశాల్లో మరమ్మతులు పూర్తి కావటంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. **– న్యూస్‌టుడే, మోదేపల్లి (అద్దంకి)**

మంచినీటి పైపులైను పనుల పరిశీలన

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని కొండాయపాలెంలో జరుగుతున్న రక్షిత మంచినీటి పైపులైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. సీసీ రోడ్లు దెబ్బతినకుండా కటింగ్ చేసి, పైపులైను అమర్చే విధానాన్ని చూశారు. ధూళిపాళ్ల రాధాకృష్ణయ్య, ఏల్చూరి మహేష్‌బాబు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ఆటల పోటీలు

సంతమాగులూరులో నిర్వహించిన పరుగు పందెంలో పాల్గొన్న ప్రత్యేక అవసరాల విద్యార్థులు

పర్చూరు, చీరాల గ్రామీణం, ఇంకొల్లు, యద్దనపూడి, సంతమాగులూరు, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లోని వివిధ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, లాంగ్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ తదితర పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు వెంకట్రామయ్య, శ్రీనివాసరావు, సామ్రాజ్యం, వి.కోటేశ్వరరావు, దినేష్‌కుమార్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా క్రీడాకారులకు అభినందనలు

జె.పంగులూరు,న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో చందలూరు జడ్పీ జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తాచాటారు. గురువారం బడి ఆవరణలో జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నాయిపాము శృతి, హెప్సిబా, ఎం.వెంకటేష్‌లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వీరితో పాటు ద్వితీయ స్థానంలో నిలిచిన భవ్యశ్రీ, రత్నకుమారి, లిఖితలను ప్రధానోపాధ్యాయిని గిరిజ, పీడీలు ప్రతిమ, మధుమూర్తి, తదితరులు అభినందించారు.

సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు

మార్టూరు, పర్చూరు: నల్లబర్లీ పొగాకు రైతుల ఖాతాల్లో రూ.50 కోట్ల నగదు జమ చేయడంపై సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం రాత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలుచేయక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో ప్రభుత్వం ముందుకు వచ్చిందని చెప్పారు.

ఆలయానికి ఫ్రీజర్ అందజేత

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి ఫ్రీజర్‌ను దాతలు గురువారం అందించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మందపాటి పవన్ కుమార్-అలేఖ్య దంపతులు స్వామివారి గర్భాలయం వద్ద పువ్వులు, దండలు, పాలు, పెరుగు తదితర వస్తువులు నిల్వ ఉంచేందుకు రూ.34 వేల విలువైన ఫ్రీజర్‌ను ఆలయ కమిటీ ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావుకు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? పర్చూరు-చీరాల రహదారిలోని ఎన్టీఆర్ క్రీడాప్రాంగణం వద్ద రోడ్డువెంబడి చెత్తాచెదారం పడేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి. **-స్థానికుడు, పర్చూరు** ✔ రెండ్రోజుల్లో చెత్తాచెదారం తొలగించి, మెరుగు పారిశుద్ధ్యాన్ని కల్పిస్తాం. వి.ప్రద్యుమ్నకుమార్, ఎంపీడీవో, పర్చూరు. **- న్యూస్‌టుడే, పర్చూరు**

? నాగుల చెరువు తూర్పు వైపు కట్టపై గతంలో వేసిన విద్యుత్తు స్తంభాలు ఎత్తు తక్కువగా ఉన్నందున వాహనాల రాకపోకల సమయంలో సర్వీసు వైర్లు వాహనాలకు తగిలి తెగిపోతున్నాయి. పాత స్తంభం తీసివేసి, ఎత్తుగా ఉండే కొత్తది ఏర్పాటు చేయాలి. **-వి.శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి, అవసరమైన చోట ఎత్తుగా ఉండే స్తంభాలు ఏర్పాటు చేస్తాం. **- రామకృష్ణ, ఏఈ, ఇంకొల్లు. - ఇంకొల్లు, న్యూస్‌టుడే**

ఇక ప్లాస్టిక్ రహిత చీరాల

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్లాస్టిక్ రహిత చీరాలకు మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించడంతో పాటు కార్యాలయంలో ఉద్యోగులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ప్రతిజ్ఞ చేశారు. మేనేజరు శ్రీనివాసరావు, టీపీవో శ్రీనివాసరావు ఉన్నారు.

పెరటి పంటల పరిశీలన

కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురులో పలువురు ఇళ్ల పెరట్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయల పంటలను ప్రకృతి వ్యవసాయం డీపీఎం హుస్సేన్ గురువారం సందర్శించారు. సిబ్బంది శ్రీవల్లి, విజయశాంతి, భారతి, జయమ్మ, శ్రీలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటుకు భూమిపూజ

సంతరావూరు (చినగంజాం), న్యూస్‌టుడే: సంతరావూరు మాదిగపల్లి వాటర్ ట్యాంక్ వద్ద ఆర్వో ప్లాంటు నిర్మాణానికి సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి గురువారం భూమి పూజ చేశారు. ఎంపీ నిధులు రూ.9 లక్షలతో నిర్మించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.బసవరాణి తెలిపారు. కార్యదర్శి కె.కృపారావు, నాయకులు దేవతోటి నాగరాజు, దేవయ్య, సురేష్, రాజేష్, శ్యామ్ పాల్గొన్నారు.

చీరాల, అద్దంకి తాలుకా ఏపీఎన్జీవోస్ ఎన్నికల ప్రకటన విడుదల

చీరాల అర్బన్, అద్దంకి: చీరాల, అద్దంకి తాలుకా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్నికల ప్రకటన గురువారం విడుదల చేశారు. చీరాలకు ఎన్నికల అధికారిగా అద్దంకి తాలుకా అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా టి.రమేష్‌బాబు, పరిశీలకులుగా వి.సృజన నియమితులయ్యారు. జిల్లా అడహాక్ కమిటీ ఛైర్మన్ పి.నాగేశ్వరరావు, కన్వీనరు బి.ప్రసాదరావు, సభ్యుడు చింతా శేషుబాబు పాల్గొన్నారు.

★ అద్దంకిలో కార్యాలయం వద్ద ఎన్నికల అధికారి సీహెచ్.శేషుబాబు వివరాలు వెల్లడించారు. మొత్తం 16 పదవులకు ప్రకటన విడుదల చేశామన్నారు. ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాని వారుంటే డిసెంబరు 5వ తేదీ లోగా రూ.300 చెల్లించి, సభ్యత్వం పొందొచ్చన్నారు. అవసరమైతే డిసెంబరు 15న ఎన్నికలు జరుగుతాయన్నారు. ప్రస్తుతం 800 మంది వరకు ఓటర్లు ఉన్నారన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు గద్దల కిరణ్‌కుమార్, తాళ్లూరి రమేష్ బాబు, మిగిలిన కార్యవర్గం ఉన్నారు.

వరి నారు మడుల్లో పొగాకు లద్దె పురుగు

కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురు పొలాల్లోని వరి నాడుల్లో పొగాకు లద్దె పురుగు తీవ్రంగా ఆశించినట్లు బాపట్ల వరి వ్యవసాయ పరిశోధన సంస్థ కీటక శాస్త్రవేత్త కామాక్షి తెలిపారు. గురువారం నారు మడులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక శ్రీవీరాంజనేయస్వామి విగ్రహం సమీపంలో పొలాల వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్త కామాక్షి మాట్లాడుతూ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ మందును లీటరు నీటిలో, లేదా రీమాన్ 1.0 ఎంఎల్‌ను లీటరు నీటిలో, ఇండాక్సికార్బ్ 1.0 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులందరూ సామూహికంగా చేయాలన్నారు. చీరాల ఏడీఏ రత్నకుమారి, ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏవీ ఇవీ

పాఠశాలల తనిఖీ

మార్టూరు, కారంచేడు: మార్టూరు మండలం కోలలపూడి, తాటివారిపాలెం, కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెంలో పాఠశాలలను గురువారం మండల అకడమిక్ ఫోరం సభ్యులు తనిఖీ చేశారు. బడుల్లోని మౌలిక వసతులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్య సామర్థ్యాలు, రికార్డులు పరిశీలించారు. ఎంఈవోలు వస్రామ్‌నాయక్, ప్రేమలత, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, గృహ నిర్మాణాలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, నిరుపేదలకు గృహ నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో ఎన్.విజయ తెలిపారు. చీరాల మండలం దేవినూతల, కావూరివారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఏఈ సుబ్బారావు, ఉపాధి హామీ ఇంజినీర్ జయకుమార్ తెలిపారు.

పంచాయతీలు, సచివాలయాలపై పర్యవేక్షణ పెంపు

చీరాల గ్రామీణం: ఇకపై ప్రభుత్వం పంచాయతీలు, సచివాలయాలపై పర్యవేక్షణ మరింత పెంచినట్లు ఎంపీడీవో ఎన్.విజయ తెలిపారు. ప్రస్తుతం ఒకరు సహాయ ఎంపీడీవోగా పనిచేస్తుండగా.. తాజాగా మరో సహాయ ఎంపీడీవో పోస్టు చీరాలకు కేటాయించినట్లు తెలిపారు. ఒకరు పంచాయతీలను, మరొకరు సచివాలయాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తారని చెప్పారు. రామకృష్ణాపురం కార్యదర్శిగా పని చేస్తున్న ఎం.శ్రీనివాసరావుకు సహాయ ఎంపీడీవోగా పదోన్నతి లభించగా.. గురువారం ఆయన విధులలో చేరారు.

శక్తియాప్, డ్రగ్స్ వద్దు బ్రోపై అవగాహన

వేటపాలెం: చీరాల సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో స్థానిక ఓఆర్ఎస్, నాయునిపల్లి తూర్పు, పడమర పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో, పోక్సో చట్టాలపై ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు శోభాదేవి, నిర్మలాదేవి, కర్ణ వీరప్రసాద్, కానిస్టేబుల్ సుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మార్టూరు, పర్చూరు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పర్చూరు ఎస్సై జీవీ చౌదరి హెచ్చరించారు. బుధవారం అర్ధరాత్రి మార్టూరు మండలం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పలు ప్రైవేట్ బస్సులు, వాహనాలను పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు. డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

మార్టూరు: మండలంలోని ద్రోణాదులలో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ సైదా తెలిపారు. ఆ గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వెంకటరావు ఆమె చెయ్యిపట్టుకుని, అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

రేకుల షెడ్డులోకి దూసుకెళ్లిన కంటైనర్

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పెరపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం వేకువజామున అదుపుతప్పి రేకుల షెడ్డులోకి కంటైనర్ లారీ దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. షెడ్డు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

కరాటే మాస్టర్ అఖిల్‌కు సత్కారం

సంతమాగులూరు: కరాటే కిక్స్‌లో బృంద ప్రదర్శనలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదైన వెల్లలచెరువుకు చెందిన కరాటే మాస్టర్ జి.అఖిల్‌ను స్థానిక బాలాజీ విద్యాసంస్థల యజమాని కొండారెడ్డి లక్ష్మీరెడ్డి గురువారం సత్కరించారు. కరీమూన్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్విజ్ పోటీలు

జె.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో కోటపాడు జడ్పీ పాఠశాలలో గురువారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వేణుబాబు అధ్యక్షతన బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిని రామారావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

జె.పంగులూరు: గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ పదోన్నతి పొంది జె.పంగులూరు మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పి.శ్రీనివాసులు రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మాలధారణం... నియమాల తోరణం

స్వామివారి భజనలో భక్తులు

పాపరాజుతోట (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: కార్తిక మాసం నుంచి మకర సంక్రాంతి వరకు పట్టణాలు, పల్లెల్లో మాలధారణ స్వాములు కనిపిస్తారు. 'స్వామియే శరణం... అయ్యప్ప శరణం' అంటూ మండలం(41 రోజుల) పాటు క్రమ పద్ధతిలో జీవనం సాగించడానికి ఆసక్తి చూపే వారి సంఖ్య క్రమేపి పెరుగుతోంది. సత్ప్రవర్తన అలవరచుకోవడానికి... కఠిన నియమాలు ఆచరించడానికి... ఆరోగ్యం సంరక్షించుకునేందుకు యువత, పిల్లలు పెద్దఎత్తున మాలధారణ చేస్తున్నారు.

50 వేలకుపైగా.. చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, పందిళ్లపల్లి, చినగంజాం, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, అద్దంకి పరిసర ప్రాంతాల్లో అయ్యప్ప దీక్షలు ఎక్కువగా తీసుకుంటారు. దీనివల్ల ఈప్రాంతాల్లో మణికంఠుడి ఆలయాలు సైతం నిర్మించారు. దీక్షాధారులు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేకంగా స్వామికి రాత్రిపూట పెద్దఎత్తున పడిపూజలు సైతం నిర్వహిస్తున్నారు. ఏటా పైన పేర్కొన ప్రాంతాల నుంచి దీక్ష చేపట్టి శబరిమలకు చేరుకునే వారి సంఖ్య దాదాపు 50వేలకు పైగా ఉంటోంది. ఈ మాలతో పాటు శివ, ఆంజనేయ, భవానీ మాలధారులు సైతం ఉంటున్నారు. ఇటువంటి దీక్షతో వారి నడవడికలో మార్పునకు అవకాశం కలగడంతో పాటు జీవితంపై విశేష ప్రభావం పడుతోందని, సన్మార్గంలో నడిచేందుకు ఇది దోహదపడుతోందని అంటున్నారు. ఇదే సమయంలో ఆధ్యాత్మిక చింతన, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందనే అభిప్రాయాన్ని గురుస్వాములు వ్యక్తం చేస్తున్నారు.

భూమి కోల్పోయే రైతులకు న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పమిడిపాడు రైతులు

పమిడిపాడు (మేదరమెట్ల): యర్రం చినపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా బొల్లవరప్పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. దీనిలో భాగంగా పమిడిపాడు గ్రామానికి చెందిన 340 ఎకరాలను భూ సేకరణ చేయాలి. అందులో భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అవార్డు అందించాలని ప్రయత్నించగా వారు నిరాకరించారు. నష్టపరిహారం పెంచాలని కోరుతూ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సమస్యలను పరిష్కరించి, ప్రాజెక్ట్ నిర్మించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే నష్టపరిహారం అందించే విషయంపై గురువారం కలెక్టర్ రైతులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రైతులు రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అందించాలని కోరారు. ఒకసారి ప్రాజెక్ట్ నిర్మించే గ్రామాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి పర్యటిస్తానని కలెక్టర్ రైతులకు తెలిపారు

(c) eenadu

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్‌కు విజయవాడలో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీబాషా గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈనెల 30 లోగా తమ దరఖాస్తులు కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సంప్రదించాల్సిన నంబర్లు:
91774 29494, 85200 04646

నీరు నిండుగా.. పంట మెండుగా

చుట్టూ ఎటు చూసినా పొలాలు.. మధ్యలో నిండుకుండను తలపించేలా వ్యవసాయ బావి. చౌడేపల్లి మండల కేంద్రం నుంచి పలమనేరు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చాలా బావులు ఇలాగే దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిండి.. నేలకు సమాంతరంగా కనిపిస్తున్నాయి. సమీపంలోనే చెరువు ఉండటంతో ఏడాది పొడవునా నీరు పుష్కలంగా ఉంటుందని రైతులు తెలిపారు. ఇందులో చేపలను సైతం పెంచుతూ ఆదాయం పొందుతున్నారు.

– ఈనాడు, చిత్తూరు

ప్రకృతి చెక్కిన.. పులిగుండు

న్యూస్‌టుడే, పెనుమూరు:



భూమికి 15 వందల అడుగుల ఎత్తులో, శివ లింగాకారంలో రెండు కొండల కలయికతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది పులిగుండు. పెనుమూరు మండలంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ రెండు కొండలను స్థానికులు శివపార్వతులుగా కొలుస్తారు. వీటిని చూసేందుకు పలు ప్రాంతాల ప్రజలు తరలి వస్తుంటారు.

చరిత్ర కథలు వేర్వేరు..: గతంలో ఇక్కడ పులి సంచరించడంతో దీన్ని పులిగుండుగా పిలుస్తారని పూర్వీకుల మాట. దీంతో పాటు మరో కథ ప్రచారంలో ఉంది. పెనుమూరు ఉత్తర దిశలో పాళ్యం అడవులున్నాయి. రాజుల కాలంలో కార్వేటినగరం సంస్థానాధీశుల పాలనలో పాళేగాళ్ల ఏలుబడిలో ఈ ప్రాంతం ఉండేదని.. మహమ్మదీయులు దాడిచేసిన సమయంలో వారు ప్రాణరక్షణకు గుండుపైకి చేరి ప్రాణాలు నిలుపుకున్నారని పలువురు చెబుతుంటారు.

భారీగా భక్తుల రాక..

పులిగుండు తూర్పు దిశలో స్వయంభు గుంటీశ్వర ఆలయం ఉంది. ఇక్కడ రాతి గుండుకు పూజలు చేస్తారు. ముందు భాగంలో మరో శివలింగం ఉంటుంది. ప్రతి పౌర్ణమినాడు శివపార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగిస్తారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి, మహాశివరాత్రి రోజు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. కొండ పైభాగంలో శివుడు, పార్వతి, గణపతి, అయ్యప్ప ఆలయాల నిర్మాణం చేపట్టారు. చలన చిత్రాల చిత్రీకరణలు జరుగుతాయి.

సంక్షేమ గృహాల్లో.. ఘుమఘుమలు

వంట సిబ్బందికి తిరుపతిలోని పాకశాస్త్ర సంస్థలో ప్రత్యేక శిక్షణ

ఈనాడు డిజిటల్, తిరుపతి: సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లోని విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాటిలో పనిచేసే వంట సిబ్బందికి పోషకాహార విలువలతో కూడిన ఆహారం తయారు చేయడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తోంది.

ఎంతమందికి: రాష్ట్రంలోని 1050 సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో పనిచేస్తున్న వంటమనుషులు, సహాయకులకు. రెండో విడతలో 190 గురుకుల పాఠశాలల సిబ్బందికి..

ముగిసిన మొదటి విడత శిక్షణ

ప్రభుత్వం మొదటి విడతలో రాయలసీమతోపాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సిబ్బంది 90 మందికి శిక్షణ పూర్తిచేసింది. వసతిగృహాల్లో అమలవుతున్న మెనూ ఆధారంగా ఆయా పదార్థాలను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. వంటశాలలతో పాటు ముడిసరకులు ఎంపిక, నిల్వ చేయడంపైనా అవగాహన కల్పించారు.

వంటల తయారీపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

- శిక్షణ ఎక్కడంటే..: తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్
- కాలం : 5 రోజులు
- అంశాలు: వంటగది నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషక విలువలు తగ్గిపోకుండా ఆహార పదార్థాల తయారీ

పేదల బియ్యంపై నిఘా

గోదాముల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలకు అడ్డు పడనుంది. గత ప్రభుత్వ హయాంలో పలు కేంద్రాల్లో బియ్యం నిల్వలు అక్రమంగా ఉంచేవారు. పేదలకు సరఫరా చేసిన తర్వాత కొన్నింటిని పక్కదారి పట్టించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ అక్రమాలపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా గోదాముల్లో అవకతవకలు జరగకుండా నిఘా పెడుతోంది. జిల్లా వ్యాప్తంగా గోదాముల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

పూతలపట్టు గోదాములో సీసీ కెమెరా

నాలుగు చొప్పున

పౌర సరఫరాల సంస్థకు జిల్లాలోని 14 మండలాల్లో నిల్వ గోదాములు ఉన్నాయి. ఇక్కడ వేల టన్నుల్లో బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు, రాగులు, జొన్నలు నిల్వ చేస్తారు. ఇక్కడి నుంచి చౌక ధరల దుకాణాలకు సరఫరా చేస్తారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గోదాములకు వస్తున్న, వెళ్తున్న వాహనాలతో పాటు కదలికలు నిక్షిప్తం అవుతాయి. రాష్ట్ర, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో కంప్యూటర్లకు అనుసంధానం చేయడంతో అధికారులు పర్యవేక్షించనున్నారు.

జిల్లాలో వివరాలు..
- బియ్యం కార్డులు: 5.34 లక్షలు
- నిల్వ గోదాములు: 14
- బియ్యం: 8,500 టన్నులు
- చక్కెర: 260 టన్నులు

ఆత్మవిశ్వాసానికి ఈ అంధులే స్ఫూర్తి

- మూడేళ్లలో 645 మంది బలవన్మరణం
- ఎక్కువ మంది విద్యార్థులే

వారంతా అంధులు..
ఒకరి తోడు లేకుండా బయటకు రాలేరు..
ప్రపంచాన్ని పూర్తిస్థాయిలో చూడలేరు..
వారే ఆత్మవిశ్వాసంతో అడుగేసి..
ప్రపంచాన్ని జయించారు..
క్రికెట్ వరల్డ్‌కప్ విజేతలుగా నిలిచారు..

అలాంటిది..
అన్ని అవయవాలు బాగున్నా..
చిన్న చిన్న సమస్యలతో..
ఇంట్లో గొడవలతో..
మార్కులు తక్కువ వచ్చాయని..
ఓటమి ఎదురైతే కొందరు
నిరాశ చెందుతున్నారు..
మనస్తాపంతో ప్రాణాలు తీసుకుంటున్నారు..

మనందరం అంధుల క్రికెట్ విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. వారిలా ఒడుదొడుకులు ఎదురైనా.. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా విజేతలుగా నిలవాల్సిన సమయం వచ్చింది.

- గత నెలలో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని ల్యాబ్ రికార్డులు సమర్పించలేదు. అధ్యాపకురాలు తిట్టడంతో మేడపై నుంచి దూకి ప్రాణాలు కోల్పోయింది.

ధైర్యంగా ముందుకు..

మన అంధుల క్రికెట్ జట్టులోని క్రీడాకారిణులు సైతం ఎన్నో హేళనలు ఎదుర్కొన్నారు. అసలు కళ్లే కనిపించవు.. వీరు ఎలా ఆడుతారని చాలా మంది చిన్నచూపు చూశారు. బయట నుంచి చేసే వెక్కిరింతల్ని పట్టించుకోలేదు. ధైర్యంగా ముందుకు సాగి పెద్ద జట్లను సైతం మట్టి కరిపించారు. దేశం తలెత్తుకునేలా చేశారు. మనం కూడా చిన్న చిన్న అవమానాలకు ప్రాణాలు తీసుకోకుండా ఒక్క క్షణం ఆలోచించాలి. కించపర్చిన వారి నుంచే పొగడ్తలు దక్కించుకునేలా కృషి చేయాలి.

ఒడుదొడుకులు..

ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆటుపోట్లు ఎదురవుతాయి. జట్టు కెప్టెన్ దీపిక, మరో తెలుగమ్మాయి కరుణతో పాటు మిగిలిన అమ్మాయిల కుటుంబాలన్నీ వెనుకబడినవే. కానీ వారు కష్టాలకు ఎదురెళ్లి భవిష్యత్తు కోసం అడుగులు వేశారు. చివరికి విజేతలుగా నిలిచారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని, సమస్యలతో పోరాటం చేస్తే గెలుపు సొంతం అవుతుంది.

- కొంత కాలం క్రితం కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో నగరంలోని ఓ వ్యక్తి కిరోసిన్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

- గతేడాది జీవకోనకు చెందిన ఓ విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో మార్కులు సక్రమంగా రాలేదని నిరాశ చెందింది. తల్లిదండ్రులు ఏమనుకుంటారోనని ఆత్మహత్య చేసుకుంది.

తల్లిదండ్రుల బాధ్యత..

విద్యార్థులపై పరీక్షల సమయంలో ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. పరీక్ష బాగా రాయలేదని ప్రాణాలు తీసుకుంటున్నారు. పిల్లలను బాధ్యతగా చూసుకోవాల్సింది తల్లిదండ్రులే. అందరికీ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక అమ్మానాన్నలే ఆదర్శం. అయిదు నెలలకే కుమార్తెకు అంధత్వం వచ్చినా తన లక్ష్యం చేరే వరకు అండగా నిలిచారు.

తల్లిదండ్రులు గమనించాలి..

తరచూ మనస్తాపానికి గురయ్యేవారు, ఆత్మహత్యే శరణ్యమని భావించే వారిని కుటుంబ సభ్యులు గుర్తించి చేరదీయాలి. చదవలేమని, తక్కువ మార్కులు వచ్చాయని బాధపడే విద్యార్థులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి సలహాలు అందించాలి. ఏడవడం, చిరాకు, నిద్రలో ఇబ్బందులు పడేవారు వ్యాయామం చేయాలి. ఆరోగ్యకర ఆహారం తీసుకొని, ఎక్కువ సేపు నిద్రపోవాలి. – **డాక్టర్ మల్లికార్జునరావు, ప్రొఫెసర్, రుయా మానసిక వైద్య విభాగం**

సలహా పొందండి..

- మీరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారా.. ఒత్తిడికి లోనవుతున్నారా.. మనసులో వచ్చే చెడు ఆలోచనల నుంచి బయట పడాలని అనుకుంటున్నారా.. టోల్ ఫ్రీ నంబరు **14416**ను సంప్రదించండి. నిపుణులు మీతో మాట్లాడి సమస్య నుంచి బయట పడే ప్రయత్నం చేస్తారు.

జిల్లాలో వివరాలు..

సంవత్సరం	ఆత్మహత్యలు
2023	215
2024	226
2025	205

(ఇప్పటి వరకు)

- న్యూస్‌టుడే, చిత్తూరు(నేరవిభాగం)

డ్రగ్స్‌పై సమాచారమివ్వండి..
రూ.25 వేలు గెలుచుకోండి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: డ్రగ్స్ నిర్మూలనకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈఏజీఎల్ఈ) రివ్యూ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. పాఠశాలల్లో డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు గుర్తించామని, పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పిల్లల ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. డ్రగ్స్ గుర్తించి సమాచారం తెలియజేసిన వారికి రూ.25 వేలు నగదు బహుమతి ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ తుషార్‌డూడి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, డీఈవో వరలక్ష్మి పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్లు
1972,
8977781972

వన్యప్రాణులు ఎన్నున్నాయ్..?

పలమనేరు, న్యూస్‌టుడే: మన అడవుల్లో పులులు ఎన్ని ఉన్నాయి.. ఏనుగుల సంచారం.. తోడేళ్లు.. జింకలు.. నక్కలు.. ఇలా అన్ని జంతువుల వివరాల లెక్క తేలనుంది. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వన్యప్రాణుల సర్వే మరో 5 రోజుల్లో జిల్లాలో ప్రారంభం కానుంది. కేంద్రం ప్రతిపాదించిన బృందం సర్వేలో పాల్గొంటుంది.

ఇవీ జంతువులు..

ఏనుగులు, పాంథర్స్, రేసుకుక్కలు, తోడేళ్లు, గుంట నక్కలు, అడవి పిల్లులు, దుప్పులు, జింకలు, అడవి పందులు, ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటితో పాటు వివిధ రకాల అడవి జంతువులు, పక్షుల వివరాలు సర్వేలో లెక్కిస్తారు.

పదుల సంఖ్యలో మృత్యువాత..

15 నుంచి 20 చ.కిమీ విస్తీర్ణంలో ఎన్ని జంతువులు ఉన్నాయో వివరాలు లెక్కిస్తారు. పులి టెరిటోరియల్ ఏర్పాటు చేసుకుంటుంది. ఈ ప్రకారం ఎన్ని ఉన్నాయో అంచనా వేస్తారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలోని అడవిలో ఇప్పటి వరకు 70 వరకు ఏనుగులు, 2 ఎలుగు బంట్లు, 1 పాంథర్ ప్రాణాలు కోల్పోయాయి. జింకలు, దుప్పులు వేటగాళ్ల ఉచ్చులో పడి, జాతీయ రహదారి దాటే సమయంలో వందల సంఖ్యలో మృతి చెందుతున్నాయి.

అంచనా..
ఏనుగులు- 100, పాంథర్స్- 7, జింకలు, దుప్పులు- 2 వేలు, ఎలుగుబంట్లు- 7, మిగిలిన చిన్న జంతువులు వేలల్లో ఉన్నట్లు అంచనా.

సర్వే వివరాలు..

ఎందుకు: వన్య ప్రాణుల సంఖ్య నిర్ధారణ
ప్రారంభం: డిసెంబరు 1
పరిధి: పలమనేరు, కుప్పం అటవీశాఖ
చేస్తున్నది: దిల్లీ నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ
లక్ష్యం: 2026 నాటికి దేశంలో ఉన్న పులులు, ఏనుగులు, ఇతర వన్యప్రాణాల వివరాల సేకరణ.

నాలుగేళ్లకు ఒకసారి..

ఈ సర్వే నాలుగేళ్లకు ఒకసారి చేస్తాం. ప్రస్తుతం ఏనుగులు, పాంథర్స్‌తో పాటు చిరుతల వివరాలు సేకరించనున్నాం. – **వేణుగోపాల్, సబ్‌డీఎఫ్‌వో, పలమనేరు**

ట్యాంకు కాదు.. ఇల్లే

ఈ ఇంటిని చూడండి.. అచ్చం నీళ్ల ట్యాంకులా కనిపిస్తుంది కదూ.. తిరుపతి నుంచి ఏర్పేడుకు వెళ్లే మార్గంలో గుత్తివారిపల్లి వద్ద ఓ యజమాని ఇలా నిర్మించారు. నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇంటిస్థలం వెళ్లిపోగా మిగిలిన కొద్దిపాటి స్థలంలో వాటర్ ట్యాంకులా వృత్తాకారంలో ఇంటిని నిర్మించుకున్నారు.

–ఈనాడు, తిరుపతి

వరసిద్ధుడి భక్తులకు.. ప్రసాద కానుక

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఉచిత ప్రసాద పథకానికి శ్రీకారం చుట్టారు.. గతంలో ఉన్నా కొత్తగా మెరుగులు దిద్ది భక్తులకు మరింత చేరువచేయాలని తలచారు.. ఉచిత ప్రసాద పంపిణీ పథకానికి విస్తృత ప్రచారం కల్పించి తద్వారా భక్తులకు నిత్యం అందించేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

దాతలు ముందుకు రావాలి

వరసిద్ధుడి దర్శనార్థం వచ్చే భక్తులకు నిరంతరం ఉచిత ప్రసాదం అందజేసేందుకు భక్తులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ఈ పథకానికి విరివిగా విరాళాలు అందజేయాలి.

–పెంచల కిషోర్, ఈవో

40 నుంచి 200 కిలోలకు పెంపు

ప్రస్తుతం భక్తుల విరాళాలతో రోజుకు 40 కిలోల ప్రసాదాన్ని రెండుగంటలపాటు అందజేస్తున్నారు. ఇది కేవలం కొందరికే దక్కుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి భక్తుడికి అందజేయాలనే సంకల్పంతో అధికారులు ఆలయ నిధులతో 200 కిలోలకు ప్రసాదాన్ని పెంచారు. గతంలో పులిహోర ఇచ్చేవారు. ఇప్పుడు అదనంగా పెరుగన్నం, కట్టె పొంగలి అందజేస్తున్నారు. మున్ముందు ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం అందజేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. విరాళాలు సేకరించేందుకు ప్రత్యేక నిధి, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవనున్నారు.

పల్లెల్లో.. మినీ మార్ట్‌లు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని చౌక ధరల దుకాణాలను మినీ మార్ట్‌లుగా ఏర్పాటు చేయనున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో డీలర్లతో సమావేశమయ్యారు. డీఎస్వో మాట్లాడుతూ వీటి ఏర్పాటుకు 'ఈజీ మార్ట్' సంస్థతో ఒప్పందం చేసుకుందన్నారు. తొలుతగా పైలట్ ప్రాజెక్టుగా చిత్తూరు, పల్నాడు జిల్లాల్లో మినీమార్ట్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈజీమార్ట్ జనరల్ మేనేజరు వెంకట్ మాట్లాడుతూ మినీమార్ట్‌ల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన డీలర్లు ముందుకొస్తే వీలైనంత త్వరగా ప్రారంభిస్తామన్నారు.

30న అత్యంత భారీ వర్ష సూచన

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అప్రమత్తం చేసింది. జిల్లాకు 29న ఆరెంజ్ అలర్ట్, 30న రెడ్ అలర్ట్ జారీ చేసింది. 30న అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొనడంతో జిల్లా అధికార యంత్రాంగం హుటాహుటిన అప్రమత్తమైంది. వర్ష ప్రభావం ఉండే ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో నిమగ్నమైంది.

కోతాపురి

టన్నుకు రూ.3,900 జమ | గుజ్జు పరిశ్రమల నిర్వాకం | సీఎం ఆదేశాలు బేఖాతరు

పుత్తూరు, న్యూస్‌టుడే: మామిడి రైతులను ఆదుకుంటామని, ప్రభుత్వం రూ.4 వేలు ప్రోత్సాహక నగదు ఇస్తుందని గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.8వేలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు స్పష్టంగా ఆదేశించారు.. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో పర్యటించి ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాలని పరిశ్రమలకు సూచించారు.. ఇటీవల చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి సైతం అధికారులతో చిత్తూరులో సమీక్షించి ప్రభుత్వం నిర్దేశించిన ధర ఇవ్వాలని చెప్పారు.. అయినా పరిశ్రమల యజమానులు పట్టించుకోకపోవడం గమనార్హం.. కిలోకు ప్రభుత్వం చెప్పిన రూ.8 కాకుండా రూ.3.9 ఇచ్చి రైతులను ముంచుతున్నారు. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యంరాజు పుత్తూరు పరిధిలోని గుజ్జు పరిశ్రమకు తోతాపురి కాయలు తోలాడు. వారం రోజుల కిందట టన్నుకు రూ.3,900 చొప్పున ఖాతాలో జమచేశారు. ప్రభుత్వం టన్నుకు రూ.8 వేలు చెల్లించాలని ఆదేశించినా పరిశ్రమ యజమాన్యం పెడచెవిన పెట్టింది. దీనికితోడు కూలి కింద రూ.100 తీసుకున్నట్లు చెప్పడంతో రైతు కంగుతిన్నాడు. అటు తూకాల్లోనూ మోసం చేశారని, బయట తూకానికి.. గుజ్జు పరిశ్రమలోని తూకానికి మూడు టన్నులకు 300 కిలోల వ్యత్యాసం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మారని పరిశ్రమల తీరు..

ప్రభుత్వం ప్రోత్సాహక నగదును రూ.4 వేల చొప్పున రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమచేసింది. పరిశ్రమల యజమానులు మాత్రం రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. కనీసం పెట్టుబడి రాలేదని వాపోతున్నారు.

జనవరి వరకూ ఇస్తారంట

మరికొందరు పరిశ్రమల యజమానులు వచ్చే ఏడాది జనవరిలో రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని చెబుతున్నారు. అదీనూ ఎంత ఇస్తామనేది చెప్పకపోవడం గమనార్హం.

- ఉమ్మడి జిల్లాలో మొత్తం విస్తీర్ణం: 1.12 లక్షల హెక్టార్లు
- తోతాపురి విస్తీర్ణం: 55 వేల హెక్టార్లు
- ఈ ఏడాది దిగుబడి: 5.50 లక్షల టన్నులు
- ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు కొనుగోలు చేసినది: 5.50 లక్షల టన్నులు
- రూ.4వేలు చొప్పున ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహక నగదు: రూ.185 కోట్లు

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

షోడశదిన సుందరకాండ పారాయణానికి అంకురార్పణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో శుక్రవారం నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు జరగనున్న షోడశదిన సుందరకాండ పారాయణానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ప్రతిరోజూ ఉదయం 8.30-9.30 వరకు వసంత మండపంలో సుందరకాండ పారాయణం ఉంటుంది.

వేడుకగా మహంతు ఉత్సవం

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి గురువారం మహంతు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు ఆలయం సమీపంలోని హథీరాంజీ మఠానికి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఊరేగుతూ మధ్యాహ్నం రెండు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయానికి తీసుకొచ్చారు. హథీరాంజీ మఠం తరఫున అమ్మవారికి సారె, ముత్తైదు పూజా సామగ్రిని అందజేశారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారు తిరుమాడ వీధుల్లో తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

అలంకరణలో అమ్మవారు

1న పీజీ స్పాట్ ప్రవేశాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలోని పలు పీజీ కోర్సులకు డిసెంబరు ఒకటో తేదీన పేమెంట్ అండ్ స్పాన్సర్ కేటగిరీ విభాగంలో స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విద్యార్హత పత్రాలతో నేరుగా హాజరు కావాలని, ఎంపిక ప్రక్రియ పీజీసెట్ ర్యాంకుపై ఆధారపడి ఉంటుందన్నారు. వివరాలకు 0877-22 48589లో సంప్రదించవచ్చన్నారు.



(c) eenadu

నేడు పీఈఎస్‌లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

యాదమరి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నేడు, రేపు(శుక్ర, శనివారాల్లో) స్థానిక పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ పోటీలను నేడు ఉదయం 9 గంటలకు ఎస్పీ తుషార్ డూడీ ప్రారంభిస్తారన్నారు. అతిథులుగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెంగల్రాయ నాయుడు, పీఈఎస్ విద్యాసంస్థల ఛాన్సలర్ జవహర్ దొరస్వామి పాల్గొననున్నారని, శనివారం సాయంత్రం నాలుగు గంటలకు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పాఠశాల ప్రిన్సిపల్ వై.వి.కృష్ణబాబు పేర్కొన్నారు.

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము : పలమనేరు

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది.** బ్రాంచ్ కార్యాలయము: పలమనేరు

ఈక్రింద పేర్కొన్న ఋణగ్రహీత /సహఋణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద ఋణ సౌకర్యము పొంది ఉన్నారు. ఋణ సౌకర్యము పొందిన తర్వాత సదరు ఋణగ్రహీతలు/ గ్యారంటీదారులు ఋణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా ఋణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) ఎం.డి.ఇబ్రహీం తండ్రి ఎం.అన్వర్‌బేగ్, ఇ.నెం.1-28/2, లాన్స్ బజార్, వి.కోట, చిత్తూరు జిల్లా - 517424
2) షాహీనా బేగం, భర్త ఎం.డి.ఇబ్రహీం తండ్రి ఎం.అన్వర్ బేగ్, ముస్లిం, డి.నెం.1-28/2 లాన్స్ బజార్, వి.కోట, చిత్తూరు జిల్లా - 517424
3) ఎం.అన్వర్ బేగ్, ఇ.నెం.1-28/2, లాన్స్ బజార్, వి.కోట, చిత్తూరు జిల్లా - 517424

ఎన్‌పిఏ తేది: 31.08.2014 డిమాండ్ నోటీసు తేది: 11.10.2025
ఋణ మొత్తం రూ.7,00,000 (ఏడు లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PLMNRTF12270002
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.14,45,671/- (పద్నాలుగు లక్షల నలభై ఐదు వేల ఆరు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

చిత్తూరు జిల్లా, పలమనేరు సబ్ జిల్లా, వి.కోట మండలం, వి.కోట గ్రామ పంచాయతీ, పత్రపల్లి రెవిన్యూ గ్రామ లెక్కదాఖలా వార్డునెం.2, కొత్త బస్టాండ్ ఏరియా, 2వ సెగ్మెంట్, వి.కోట, సర్వేనెం.446/1ఎ లోని **ఐటం నెం.1 :** దారి స్థలం కొలతలు: తూర్పు నుండి పడమర: 54అ. (16.459మీ.), ఉత్తరం - దక్షిణం: 7 1/2అ. లేదా 2.285 మీ. వెరశి 405 చ.అ. **ఐటంనెం.2:**- స్థలం కొలతలు: తూర్పు నుండి పడమర: 4 3/4అ. లేదా 1.447మీ., ఉత్తరం - దక్షిణం: 14 అ. లేదా 4.267 మీ. వెరశి 66.5 చ.అ. **ఐటం నెం.3:**- స్థలం కొలతలు: తూర్పు నుండి పడమర: 11 అ. లేదా 3.352 మీ., ఉత్తరం-దక్షిణం: 6 1/2 అ. (1.981 మీ.) వెరశి 71.5 చ.అ., **ఐటం నెం.4:**- స్థలం కొలతలు: తూర్పు నుండి పడమర: 15 1/2 అ. (4.724మీ.) ఉత్తరం-దక్షిణం: 12 అ. (3.657 మీ.) వెరశి 186 చ.అ., ఐటం నెం.1 నుండి 4 యొక్క పూర్తి విస్తీర్ణం 728 చ.అ. లేదా 81 చ.గ.. ఇందున 15.5×12=186 చ.అ.లలో నిర్మించిన మంగుళూరు టైల్ వేసిన డి.నెం.2-105 మరియు హెచ్ఎస్‌సి నెం.1639 గల ఇల్లు, వాటికి అమర్చి యుండు ద్వారములు, ద్వారబంధనములు, కిటికీలు. **హద్దులు:** తూర్పు: నేర్పిపల్లి వహాబ్ ఇల్లు, పడమర: తిప్పావారి ఇల్లు, ఉత్తరం: లేన్, దక్షిణం: పోలీస్‌స్టేషన్ మరియు హైస్కూల్ కాంపౌండ్ గోడ. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 46అ. లేదా 13.984 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 15అ. లేదా 4.561మీ. వెరశి 690 చ.అ. లేదా 76.6

ఈ పరిస్థితులలో ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేమనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి ఋణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియ జేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి ఋణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: పలమనేరు — సం/- అధీకృత అధికారి,
తేది: 25.11.2025 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ తదితరులు

మాక్ అసెంబ్లీలో పాల్గొనడం అభినందనీయం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులను కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. వీరి స్ఫూర్తితో మున్ముందు మిగిలిన విద్యార్థులు సైతం పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, సమగ్ర శిక్షా ఏపీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

ఆఖరు నిమిషంలో.. అసలేం జరిగింది

గూడూరును జిల్లాలోనే కొనసాగించడంపై సర్వత్రా చర్చ

గూడూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: గూడూరును తిరుపతి జిల్లాలోనే కొనసాగించాలన్న నిర్ణయం.. ఇందుకుగల కారణాలపై ప్రజల్లో సర్వత్రా చర్చ నడుస్తోంది. గూడూరు నెల్లూరు జిల్లాలో కలిస్తే అభివృద్ధికి దూరమవుతామన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కృష్ణపట్నం ఓడరేవులో కొంత భాగం.. సాగరమాల కారిడార్, పరిశ్రమలు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ యార్డ్ వంటి ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో నెల్లూరులో విలీనం చేస్తే సమన్వయం కొరవడి పనులు మందగిస్తాయన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాజకీయ ప్రాబల్యం తగ్గుతుందన్న కోణంలోనూ అధిష్ఠానం వద్ద కొందరు నేతలు మంతనాలు చేసినట్లు చెబుతున్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఎంతో కృషి చేశారు. తీరా ప్రతిపాదనలు చూశాక అంతా తృప్తి చెందారు. దాంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఎమ్మెల్యేకు ఫోన్ చేసి విలీనం చేయపోవడానికిగల కారణాలు వివరించినట్లు తెలిసింది.

నాలుగు మండలాలు మదనపల్లెలోకి

ఈనాడు- చిత్తూరు: పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాలను కొత్తగా ఏర్పాటవుతోన్న మదనపల్లె జిల్లాలోకి చేరుస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు మాత్రం చిత్తూరు జిల్లాలోనే కొనసాగించారు. చౌడేపల్లె, పుంగనూరు మండలాలను మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో, సదుం, సోమల నూతనంగా ఏర్పాటయ్యే పీలేరు డివిజన్‌లో కలిపారు. బంగారుపాళ్యం మండలం ఇప్పటివరకు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉండగా తాజాగా చిత్తూరులో చేర్చాలని నిర్ణయించారు. అభ్యంతరాలు 30 రోజుల్లోగా కలెక్టర్‌కు తెలపవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒకే డివిజన్ పరిధిలోకి వెంకటగిరి

బాలాయపల్లి : రెండు జిల్లాలో మూడు డివిజన్ల పరిధిలో ఉన్న వెంకటగిరి నియోజకవర్గాన్ని ఒకే రెవెన్యూ డివిజన్ కిందికి తెస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. వైకాపా పాలనలో ఆరు మండలాలను సగం చొప్పున విభజించి నెల్లూరు, తిరుపతి జిల్లాలో చేర్చారు. నెల్లూరు జిల్లాలోని కలువాయి, రాపూరు, సైదాపురాన్ని నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలను గూడూరు డివిజన్‌లో కొనసాగించి తిరుపతిలో విలీనం చేశారు. జిల్లాల నిర్మాణం 1974 సంఖ్య 7 ప్రకారం మెరుగైన పరిపాలన, అభివృద్ధి కోసం నియోజకవర్గాన్ని ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి తీసుకురావడంతోపాటు ఒక జిల్లాలో ఉంచాలనే ప్రక్రియ మేరకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్‌సీడీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్‌సీడీ 4.0 సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి జూమ్ సమావేశం ద్వారా జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బందితో గురువారం ఆమె మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నిత్యం పది కేసుల చొప్పున వారంలో 70 కేసులు సర్వే చేయాలన్నారు. శుక్రవారం నుంచి సర్వే వేగవంతం చేయాలని, ఒకవేళ తప్పుడు సర్వే చేసినట్లు తెలిసినా, ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి గిరి, ఎపిడమాలజిస్టు శ్రీవాణి పాల్గొన్నారు.

జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

పీఆర్‌లో 29 మందికి ఉద్యోగోన్నతి

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జిల్లా, మండల పరిషత్తు, జిల్లా పంచాయతీ, డివిజన్ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శులు, ఎగువశ్రేణి సహాయకుల్లో 29 మందికి డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు(డిప్యూటీ ఎంపీడీవో)గా ఉద్యోగోన్నతి కల్పించి నియమించామని చిత్తూరు డీఎల్‌డీవో రవికుమార్ గురువారం తెలిపారు.

ఆదాయం రూ.2,93,020

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: స్వయంభు మొగిలీశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన దుకాణాలు, వాహనాల పార్కింగ్, కొబ్బరిచిప్పల సేకరణ, పాదరక్షలు భద్రపరచుటకు ఏడాది కాలపరిమితితో గురువారం ఈవో మునిరాజ, సీనియర్ అసిస్టెంట్ శ్వేత, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్ నేతృత్వంలో బహిరంగ వేలం నిర్వహించారు. దుకాణాలకు రూ.1,10,520, ఇతర వాటి ద్వారా రూ.1,82,500 ఆదాయం వచ్చిందని, తలనీలాల సేకరణకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేశామన్నారు. తెదేపా నాయకులు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.6.23 కోట్లతో దివ్యాంగులకు సహాయ పరికరాలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ): దివ్యాంగులు, వయోవృద్ధులైన 18,651 మందికి రూ.6.23 కోట్ల విలువైన సహాయ పరికరాలు పంపిణీ చేయనున్నామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి ఏడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహించి సహాయ పరికరాలు అవసరమున్న వారిని గుర్తించామన్నారు. అలింకో సంస్థ ద్వారా త్వరలో వీల్‌ఛైర్లు, వినికిడి యంత్రాలు, కర్రలు, ట్రైవీల్ బైకులతో పాటు వివిధ పరికరాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయండి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు డీఆర్‌డీఏ సిబ్బంది, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాలకు అమలు చేస్తున్న పథకాలపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ ఏడాది నిర్దేశించిన బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నారని, జనవరి లోగా లక్ష్యాన్ని అధిగమించాలని బ్యాంకు అధికారులను ఆయన హెచ్చరించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, వివిధ బ్యాంకుల అధికారులు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతన్న-మీకోసం'లో.. 1,26,016 గృహాల సందర్శన

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 314 రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న 'రైతన్నా-మీకోసం' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. నాలుగు రోజులుగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు 1,26,016 గృహాలను సందర్శించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ గురువారం తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సందేహాలు, సమస్యలు నివృత్తి చేస్తూ రైతుల అభిప్రాయాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు.

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము : పలమనేరు

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

[illegible]

ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) ఎం.జానకిరాం తండ్రి ఎం.బెల్లప్ప, [illegible]
2) ఎం.శాంతి, భర్త ఎం.జానకిరాం, డి.నెం.4-13, [illegible] - 517408
3) పి.స్వేతకుమార్ [illegible] - 517408
4) [illegible]
5) [illegible]

ఎన్‌పిఏ తేది: 30.06.2019 డిమాండ్ నోటీసు తేది: 25.09.2025
ఋణ మొత్తం రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: PLMNRTF1809280006
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.24,92,061/- [illegible]

స్థిరాస్తి వివరములు

[illegible]

ప్రదేశం: పలమనేరు — సం/- అధీకృత అధికారి,
తేది: 25.11.2025 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము : చిత్తూరు

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

[illegible]

ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

[illegible] - 517001 ... [illegible] - 515801

ఎన్‌పిఏ తేది: 29.02.2020 డిమాండ్ నోటీసు తేది: 16.09.2025
ఋణ మొత్తం రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: CHTORTF1904090004
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ. 33,48,272/- [illegible]

స్థిరాస్తి వివరములు

[illegible]

ప్రదేశం: చిత్తూరు — సం/- అధీకృత అధికారి,
తేది: 25.11.2025 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

29న ఉద్యోగ మేళా

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీతమ్స్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 29 శనివారం స్థానిక సీతమ్స్ కళాశాలలో 18 బహుళజాతి సంస్థలతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

మొగిలి ఘాట్‌రోడ్డులో ఏనుగు హల్‌చల్

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: చిత్తూరు-పలమనేరు మార్గమధ్యలో మొగిలి ఘాట్‌రోడ్డులో గురువారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఆ మార్గంలో వెళ్లే పలువురు వాహనదారులు చరవాణిలో ఫొటోలు తీసి వైరల్ చేశారు. చరవాణిలో ఒంటరి ఏనుగు దృశ్యాలను ఫొటోలు తీస్తుండటంతో తాపీగా జాతీయ రహదారి పక్కనే చెట్ల పొదల్లోకి వెళ్లిందని పేర్కొన్నారు. దీంతో అటవీ ప్రాంతంలో ఆరు వరుసల రహదారి పనులు చేస్తున్న కూలీలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. రాత్రివేళ షెడ్లలోనే ఉండాలని, లైట్లు వెలిగించి అగ్గిమంటలు వేసుకోవాలని సూచించారు. పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. అటవీ ప్రాంత సరిహద్దులోని మొగిలివారిపల్లె, గౌరీశంకరపురం, పార్వతీపురం రైతులు వ్యవసాయ బావుల వద్ద రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

83 బస్తాల నిషేధిత పదార్థాల స్వాధీనం

చిత్తూరు(నేరవార్తలు), నగరం, న్యూస్‌టుడే: చిత్తూరులో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై పోలీసులు, నగరపాలక అధికారులు దాడులు నిర్వహించారు. 83 బస్తాల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. నగరంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని.. హాన్స్, కులిప్ పదార్థాలకు పాఠశాల విద్యార్థులు బానిసలవుతున్నారనే సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చిత్తూరు ఒకటో పట్టణ సీఐ మహేశ్వర్, చిత్తూరు నగరపాలక వైద్యాధికారి లోకేశ్.. తమ బృందాలతో పలు ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. దుకాణాల్లో సోదాలు చేయగా రెండు దుకాణాల్లో 83 బస్తాల నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు సదరు బస్తాలను నగరపాలక అధికారులు అప్పగించగా.. అధికారులు సి.ఒ.టి.పి.ఎ చట్టం-2003 ప్రకారం కేసు నమోదుకు చర్యలు చేపట్టారు. ఇకపై దాడులు కొనసాగిస్తామని, అక్రమ వ్యాపారం చేసే వారిపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకుంటున్న పోలీసు, నగరపాలక అధికారులు

నలుగురు లాటరీ విక్రేతల అరెస్టు

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరులో లాటరీ టికెట్లు విక్రయిస్తూ అమాయకులను దోచుకుంటున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. 'లయన్.. యాపిల్.. సింగం' పేరిట లాటరీ టికెట్ల విక్రయాలపై గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ మహేశ్వర్ పలుచోట్ల దాడులు చేపట్టి లాటరీ విక్రయిస్తున్న భాగ్యరాజ్, రామచంద్ర, మూర్తి, సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.17,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆటోను ఢీకొన్న వాహనం: మహిళ మృతి

గుడిపాల, న్యూస్‌టుడే: చిత్తూరు-వేలూరు మార్గంలో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి వద్ద గురువారం టూరిస్టు వాహనం ఆటోను ఢీకొన్న సంఘటనలో శ్రీలేఖ(37) మృతిచెందగా బుజ్జి(45)కి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై రామ్మోహన్ కథనం మేరకు.. మండలంలోని పల్లూరు ఆదిఆంధ్రవాడకు చెందిన శ్రీలేఖ, బుజ్జి.. ఆటోలో చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నారు. వీరి ఆటోను వేలూరు వెళ్తున్న టూరిస్టు వాహనం వెనక నుంచి ఢీకొనడంతో ఆటోలో ఉన్న శ్రీలేఖ తీవ్రంగా గాయపడగా, బుజ్జికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీలేఖ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీలేఖ (పాత చిత్రం)

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆93812 87629.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి - చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్‌కు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 9505502346

CONSULTANCY

GENERAL

తిరుపతి మరియు తిరుపతి పరిసర ప్రాంతాలలో స్థలం కొనాలన్నా అమ్మాలన్నా మమ్మల్ని సంప్రదించగలరు. Ph: 99890 76007, 90320 76007.

TO LET

COMMERCIAL 3 Sheds for Ware House/ Godown/ Offices Each Shed -1800 sft. Near Taj Hotel, Tiruchanur Bypass Road, Tirupati. Niranjan. 94414 94697. Email: ravi.kambham@gmai.com.

2400 Sft గోడౌన్ (37X61) & వాచ్‌మెన్ రూం (10X10) బాడుగకు ఇవ్వబడును. RC రోడ్, అవిలాల పార్క్ ఎదురుగా, తిరుపతి ✆ 85200 38198, 80740 25167.

EENADU THE e-WAY CLASSIFIEDS — B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు. వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B/W: రూ. 600, Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

A Premier Construction Firm is highly Exp. Senior Sales & Marketing Executive Specialising in Residential Flats Tirupati Area. Over 5 Yrs Exp in Sales & Marketing ✆ +91-7780641034.

Parinaya Creation's (A Premium Gift Shop for All Occasions) Wanted Cashier with Computer Billing Knowledge is Must ✆ 63009 00677, 79934 34242

Parinaya Creation's (A Premium Gift Shop for All Occasions) Wanted Sales Girl/Boy with Good Communication Skills ✆ 63009 00677, 79934 34242.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

విజయ డిజిటల్ డెంటల్‌కి లేడీ అటెండర్ (ఇంటర్/డిగ్రీ) కావలెను. కళాంజలి ఎదురుగా రేణిగుంట రోడ్, తిరుపతి. టైం: 9-2 & 4-9, ఇంటర్వ్యూ 29/11.

ప్రముఖ ఇంటర్నేషనల్ కొరియర్ సంస్థ బెంగుళూరు బ్రాంచ్ కొరకు TATA ACE డ్రైవర్స్ కావలెను, ఎకామిడేషన్ కలదు. 9014530584, 9291901305

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్ట్ పద్దతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్. 8341177761/8019647888

WANTED
తిరుపతిలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ HS Enterprises నందు పనిచేయుటకు
★ AC Technicians-6 Salary:18,000- 20,000
★ AC Technician Helpers-06 Salary:12,000- 15,000
★ Auto Drivers-02 Salary:15,000- 18,000
అక్కారంపల్లి రోడ్, తిరుపతి
8008803316

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, నగరి: సమస్య: పట్టణంలో కేశవపట్టు దళితవాడలో వీధిదీపాలు వెలగడం లేదు. - ప్రకాష్, స్థానికులు
సమాధానం: మరమ్మతు చేయించి దీపాలు అమర్చుతాం. -కె.వి.కృష్ణారెడ్డి, కమిషనర్

రేపు మున్సిపల్ సమావేశం

నగరి, న్యూస్‌టుడే: కౌన్సిల్ సమావేశం పురపాలక కార్యాలయంలో ఛైర్మన్ నీలమేఘం అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఆర్డీవో అనుపమ

కార్వేటినగరం: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగరి ఆర్డీవో అనుపమ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. రైతులు తమ న్యాయమైన సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దారు నాగరాజు, ఆర్ఎస్‌డీటీ స్వరూపారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలో ఆటోలు నడిపే వారు దరా నిబంధనలు తప్పక పాటించాలని ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ కోరారు. నగరంలో గురువారం ఆయన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అతివేగంగా వెళ్లడం, మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, అధిక ఛార్జీ వసూలు చేయరాదన్నారు. యూనిఫాం ధరించాలని, తద్వారా ప్రజల్లో గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇష్టానుసారం పార్కింగ్ చేయడం, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించొద్దని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు.. చదువే ముద్దు

సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత

పాలసముద్రం, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ వల్ల ఆరోగ్యంతో పాటు సమాజం నాశనం అవుతుందని, జీవితం చీకటి గుండంలో పడిపోతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత పేర్కొన్నారు. ఆరోగ్యం, ఆనందంగా జీవించాలంటే డ్రగ్స్ జోలికి వెళ్లద్దని విద్యార్థులకు సూచించారు. గురువారం కళాశాలలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. హెల్త్ కమ్యూనిటీ అధికారి లత, వెటర్నరీ అసిస్టెంట్ భార్గవి, మహిళా పోలీసు దివ్య పాల్గొన్నారు.

మ్యాపింగ్‌తో.. లెక్క పక్కా

• గత వైకాపా అక్రమాలపై కొరడా
• త్వరలో ఇంటి పట్టాల జారీకి కసరత్తు

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్: వైకాపా ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో పట్టాల లెక్క పక్కాగా తేలనుంది. అప్పట్లో పేదల పేరుతో వైకాపా కార్యకర్తలు, వాలంటీర్లు, వారి స్నేహితులు, బంధువులు, సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు, ఒకే కుటుంబంలోనే ఇద్దరు ముగ్గురికి పట్టాలు జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా కాలనీల్లో అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఆరు నెలల క్రితం సర్వే చేపట్టినప్పటికీ సమగ్రంగా నిగ్గు తేల్చలేకపోయారు. పక్కా లెక్కకు ప్రతి ఇంటి స్థలం మ్యాపింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మ్యాపింగ్‌తో అక్రమార్కుల్లో ఆందోళన నెలకొంది. చిత్తూరు, నగరి, గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో జగనన్న కాలనీలపై ప్రత్యేక కథనం.

చిత్తూరు నగరం బండపల్లెలోని జగనన్న లేఅవుట్

ఇష్టానుసారంగా పట్టాలు జారీ..

జగనన్న కాలనీ పేరుతో లేఅవుట్లు ఏర్పాటు చేసి పేదలకు గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు స్థలంలో పట్టాలు ఇచ్చి అప్పట్లో ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. అనర్హులకు ఎక్కువగా పట్టాలు జారీ చేశారనే విమర్శలు ఉన్నాయి. అంతేకాక వైకాపా నేతలకు పెద్ద పీట వేశారు. లేఅవుట్ల ఏర్పాటులో చేతివాటం చూపారని బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వాటిని అధికారులు గుర్తించనున్నారు.

త్వరలో అర్హులకు పట్టాలు..

కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వనుంది. వీటిని త్వరగా అర్హులకు ఇంటి నివాస పట్టాలు జారీ కసరత్తు వేగవంతం చేసింది. ఈ క్రమంలో లేఅవుట్లలో ఖాళీగా, అనర్హులకు జారీ చేసిన ఇంటి స్థలాలను గుర్తించి వాటిని ప్రభుత్వం నిర్దేశిత కొలతల ప్రకారం సిద్ధం చేయనున్నారు. ఆ తర్వాత అర్హులకు ఇంటి నివాస స్థలాలు అందజేయనున్నారు.

నియోజకవర్గం	లేఅవుట్లు	ఇంటి స్థలాలు
చిత్తూరు	45	7,852
పూతలపట్టు	107	5,040
గంగాధరనెల్లూరు	151	5,548
నగరి	49	4,362

వేగంగా మ్యాపింగ్..
ప్రభుత్వ లేఅవుట్లలో ఇంటి స్థలాల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. వారం రోజుల్లో మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించాం. మ్యాపింగ్ ద్వారా లేఅవుట్లలో ఖాళీ స్థలాల వివరాల లెక్క తేలనున్నాయి. ఆపై ఖాళీ స్థలాలను అర్హులకు అందజేయనున్నాం.
-శ్రీనివాసులు, ఆర్డీవో, చిత్తూరు

ప్రతి ఇంటి స్థలం మ్యాపింగ్..

జగనన్న కాలనీలు, ప్రభుత్వ లేఅవుట్లలో జారీ చేసిన ఇంటి స్థలాల పరిశీలన జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. లేఅవుట్లో కోర్టు కేసులు ఉన్న ఇంటి స్థలం మినహా మిగిలిన ప్రతి ఇంటి స్థల మ్యాపింగ్ ప్రక్రియ ముమ్మరం చేశారు. ప్రతి లేఅవుట్ కెళ్లి మ్యాపింగ్ సత్వరమే పూర్తి చేయాలని వీఆర్వోలను నియమించారు. మ్యాపింగ్‌లో గ్రామం, లేఅవుట్, ఇళ్ల పట్టాలు పొందిన వారి పేర్లతో పాటు స్థలం నాలుగు దిక్కుల్లో ఉన్న వారి వివరాలు సైతం నమోదు చేస్తారు. తద్వారా లేఅవుట్లో ఖాళీగా ఉన్న ఇంటి స్థలాలతో పాటు అనర్హులకు జారీ చేసిన పట్టాల వివరాల లెక్క తేలనుంది.

క్లీన్ పుత్తూరుకు సహకరించండి

వంతెన వద్ద చెట్లు, కంప తొలగిస్తున్న జేసీబీ

పుత్తూరు, న్యూస్‌టుడే: క్లీన్ పుత్తూరుకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించి మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలంటే అందరూ సమష్టిగా కదిలితేనే సాధ్యమవుతుందన్నారు. 18వ వార్డులో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుక పాటి వద్దకు వరద రోడ్డుపై చేరుతోందన్నారు. దీంతో జేసీబీతో రాళ్లు తొలగించి పారిశుద్ధ్య కాలువ శుభ్రం చేయించామని చెప్పారు. ఇక పంట కోడ్లో కింద వంతెన వద్ద ముళ్ల చెట్లు పెరిగి వంతెనలోకి వంగిపోవడంతో ఇబ్బంది ఉండటంతో జేసీబీతో తొలగించారు. కమిషనర్ వెంట ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ ఉన్నారు.

కాలువలకు మోక్షమెన్నడో..?

గేటుపుత్తూరులోని పిళ్లారిపట్టు రోడ్డులో కాలువల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు రోడ్డుపై మురుగు నిలిచి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదికి రెండు, మూడుసార్లు మాత్రమే వ్యర్థాలు తొలగిస్తుండటంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. కాలువ నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పుత్తూరు

ఉపన్యసించి.. బహుమతి తీసుకుని

హిమజ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

బహుమతులు అందజేస్తున్న పాఠశాల హెచ్‌ఎం తేజోవతి

పుత్తూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా.. పట్టణంలోని హిమజ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో గురువారం 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విద్యార్థులు సిరి, అక్షర, కుముద విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్‌ఎం తేజోవతి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు జయలక్ష్మి, ప్రశాంతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు వినతి

గుడిపాల, న్యూస్‌టుడే: రామభద్రాపురం పంచాయతీకి చెందిన ఎస్సీ కాలనీలో ఇళ్ల స్థలాలు లేని పేదలకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రినాయుడు తహసీల్దార్ శ్రీనివాసులుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ భూమి గుర్తించి అర్హులకు త్వరలో ఇళ్లస్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వాసుపత్రిలో పార్కింగ్ రుసుం రద్దు చేయండి

సూపరింటెండెంట్ ఉషశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ఇటీవల ప్రారంభించిన పార్కింగ్ రుసుము వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా పార్కింగ్ రుసుము విధానం లేదని చెప్పారు. ఈ ఆసుపత్రిలో ఈ విధానం పెట్టడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆస్పత్రికి పరుగులు పెట్టే రోగులు, వారితోపాటు వచ్చే సహాయకులను అక్కడి నిర్వాహకులు గేటు వద్దే అడ్డుకుని పార్కింగ్ రుసుము అడగటం సరికాదన్నారు. ఈ రుసుం ఆయా వర్గాలకు భారమని, దీన్ని వెంటనే రద్దు చేసి పార్కింగ్ బాధ్యతలు సెక్యూరిటీకి అప్పగించాలన్నారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ నగర కార్యదర్శి గోపీనాథ్, నాయకులు మణి, దాసరి చంద్ర, విజయకుమార్ పాల్గొన్నారు.

జీడీనెల్లూరు సీఐగా నిత్యబాబు

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: నూతన సీఐగా నిత్యబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా ఉన్న శ్రీనివాసంతిని చిత్తూరు డీటీఆర్‌బీకి బదిలీచేసి చిత్తూరు ఈస్ట్ సీఐ నిత్యబాబును ఇక్కడ నియమించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.

అదుపు తప్పితే అంతే..!

పుల్లూరు నుంచి పాలసముద్రం మండలం రంగాపురం వెళ్లే మార్గంలో తుంగవంక వద్ద ఇటీవలి వర్షాలకు తారు రోడ్డు పక్కనే మట్టి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అదుపు తప్పి వాహనాలు పక్కకు వెళ్తే లోతైన ప్రదేశంలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పాలసముద్రం, జీడీనెల్లూరు మండలాలతో పాటు తమిళనాడు వెళ్లే ప్రయాణికులు ఆదమరిస్తే ఇక అంతే సంగతులు. అధికారులు మట్టి తోలి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, శ్రీరంగరాజపురం

చెత్తలో కలిపేస్తారేమో..?

మండలంలోని 13 పంచాయతీల గ్రామాల్లో చెత్త, వ్యర్థాల తరలింపునకు ప్రభుత్వం అందజేసిన చెత్త సేకరణ వాహనాలు మండల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో ఖాళీస్థలంలో మూలన పడ్డాయి. వీటిని అధికారులు పట్టించుకోక పోవడంతో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల నడుమ పడిఉన్నాయి. అలానే వదిలేయడంతో అవికాస్తా మరమ్మతుకు గురయ్యాయి. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఇలా నిరుపయోగంగా ఉండటంతో వాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పాలసముద్రం

ఈ నీరు తొలగేదెన్నడో..?

ఎగువ తడకర పంచాయతీ ఎగువ వెంకటాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల సమీపంలో కుంటలా నీరు నిలుస్తోంది. వర్షాకాలంలో ఆ వీధిలో నడక చాలా ప్రమాదకరంగా ఉంటోంది. ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉంటే దోమలు ప్రబలి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదముంది. సమీపంలోనే పాఠశాల ఉండటంతో విద్యార్థులు రోగాల బారినపడే అవకాశముంది. -న్యూస్‌టుడే, తవణంపల్లె

స్పందనకు వందనం

తీగల తొలగింపు

చిత్తూరు-పెనుమూరు మార్గంలో మోపిరెడ్డిపల్లె బస్టాపు సమీపంలో విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న తీగల సమస్యపై ట్రాన్స్‌కో ఏఈ తులసిప్రసాద్ స్పందించారు. వాటిని సిబ్బంది సహకారంతో తొలగింపజేశారు.
-న్యూస్‌టుడే, పెనుమూరు

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

కొప్పేడు సచివాలయ ఆవరణలోని తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద నీరు నిత్యం నేలపాలవుతున్న సమస్యపై గ్రామ సర్పంచి సంపూర్ణమ్మ స్పందించారు. స్థానికులతో మాట్లాడి నీరు పట్టుకున్నాక మోటారు ఆఫ్ చేయాలని సూచించారు.
-న్యూస్‌టుడే, నింద్ర

ఎస్టీకాలనీకి తాగునీటి సరఫరా

మాంబేడు పంచాయతీ ఎంఎంకండ్రిగ ఎస్టీ కాలనీలో తాగునీటి బోరుబావికి అమర్చిన మోటారు మరమ్మతుకు గురై అవస్థలు పడుతున్న సమస్యపై పంచాయతీ పాలకులు స్పందించి మోటారు మరమ్మతు చేశారు.
-న్యూస్‌టుడే, వెదురుకుప్పం

వారపు సంతలో వీధిదీపాల ఏర్పాటు

స్థానిక వారపు సంతలో వీధి దీపాలు లేక రైతులు, కొనుగోలుదారులు పడుతున్న అవస్థలపై ఎంపీడీవో మనోహర్‌గౌడ్ స్పందించి సంత నిర్వాహకులతో దీపాలు ఏర్పాటు చేయించారు. -న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

తొలగిన మురుగు

ఈనాడు కథనానికి స్పందన

యూబీపల్లె ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో కుంటలా వర్షపు నీరు, మురుగు నీరు నిలిచిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి చంద్ర స్పందించారు. నీటిని తొలగించి దోమలు ప్రబలకుండా దోమల సంహారక మందు పిచికారీ చేయించారు.
-న్యూస్‌టుడే, తవణంపల్లె

రాయలసీమ నేపథ్యంలో దేవగుడి చిత్రం

దేవగుడి చిత్ర యూనిట్ సభ్యులు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: రాయలసీమ నేపథ్యంలో సందేశాత్మక కథాంశంతో 'దేవగుడి' చిత్రాన్ని నిర్మించామని చిత్ర దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి తెలిపారు. దేవగుడి చిత్ర యూనిట్ గురువారం చిత్తూరులో సందడి చేసింది. స్థానిక విజయం విద్యాసంస్థల ఆడిటోరియంలో యూనిట్ బృందం విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ అభినవ్ సౌర్య, అనుశ్రీ హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం డిసెంబరు 19న విడుదల కానుందని చెప్పారు. స్నేహ బంధం, సీమ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కథను నమ్ముకుని తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. విజయం విద్యాసంస్థల నిర్వాహకులు తేజోమూర్తి, ఏవో రాజగోపాల్‌నాయుడు, ప్రిన్సిపల్ జయంత్ పాల్గొన్నారు.

స్టాంపులు అందుబాటులో ఉంచాలని వినతి

పుత్తూరు, న్యూస్‌టుడే: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్ జ్యుడిషియల్ స్టాంపులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాటిని అందుబాటులో ఉంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ విజయభాస్కర్‌కు గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్‌జేఎస్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉందని, చుట్టుపక్కల ప్రాంతాల్లో అవి దొరుకుతున్నా యని, ఇక్కడ నోటరీ కోసం చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. దస్తావేజు లేఖరులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు బ్యాంకుల్లో రుణాల కోసం స్టాంపులు సమర్పించాల్సి ఉందని, రూ.100 స్టాంపులకు రూ.250 వసూలు చేస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చలానా విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందని, అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కృష్ణారెడ్డి, అన్బు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

ముత్తుసెల్వన్‌ను అభినందిస్తున్న ఎంపీడీవో, తెదేపా అధ్యక్షుడు

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోటి మొక్కలు నాటించాలనే సుదుద్దేశంతో ఐదేళ్లుగా ప్రపంచమంతా సైకిల్ యాత్ర చేస్తున్నట్లు కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో యాత్రలో భాగంగా పర్యటిస్తున్న అతడికి ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తెదేపా మండల అధ్యక్షుడు స్వామిదాస్ ఘనస్వాగతం పలికారు. అతడి కృషిని అభినందించారు.

నిబంధనలు.. మాటల్లోనే..!

ఆటోలో ప్రమాదకర ప్రయాణం

చోదకుల ప్రాణాలతో ఆటలు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆటోలో ఐదుగురిని మించి ఎక్కించుకోవద్దని రవాణాశాఖ అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల కలిగే అనర్థాలపై డ్రైవర్లకు అవగాహన సదస్సులు పెట్టి మరీ వివరిస్తున్నారు. కొందరు డ్రైవర్లు మాత్రం అధికారుల మాటలను లెక్కచేయడం లేదు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, మేస్త్రీ పనులకు తీసుకెళ్లేవారు ముందు జాగ్రత్తలు గాలికొదిలేస్తున్నారు. డ్రైవర్ పక్కనే రెండు వైపులా ఇద్దరికి మించి కూర్చోబెడుతున్నారు. ఆటో డ్రైవర్ సీటు వెనుక ఏర్పాటు చేసిన చెక్క సీటుపై ఎనిమిది మంది, వీరి మధ్య ఇద్దరు, వెనక డోరు తొలగించి మరో ముగ్గురిని ఎక్కించుకుని రహదారులపై వేగంగా పరుగులు తీయిస్తున్నారు.

గ్రామాల నుంచి పనుల కోసం..

పుత్తూరు, నారాయణవనం, కార్వేటినగరం మండలాల్లోని గ్రామాల నుంచి పుత్తూరుకు మేస్త్రీ పనుల కోసం వందల మంది వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఒక్కో ఆటోలో పది మందికి మించి ప్రయాణం చేస్తున్నారు. రూ.700 నుంచి రూ.వెయ్యి కూలిపై ఆశతో ప్రాణాలు పణంగా పెట్టి ఆటోల్లో వెళ్తున్నారు. పరిమితికి మించిన ప్రయాణికులతో పాటు వేగంగా నడుస్తున్న వాహనాలు ప్రమాదానికి గురైనా, అదుపు తప్పి బోల్తాపడినా జరిగే ప్రమాదాన్ని ఊహించలేం. గతంలో ఇలాంటి ఘటనలు అనేకం జరిగినా ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు తిరిగొచ్చే వరకు కుటుంబ సభ్యులు భయంభయంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి. పెను ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

బంగారుపాళ్యం: ఎర్రాండ్లపల్లెలో గోడప్రతులు చూపుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, తెదేపా నాయకులు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని అన్నదాతలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఎర్రాండ్లపల్లెలో గురువారం రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. తెదేపా మండల అధ్యక్షులు ధరణీప్రసాద్ నాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు ప్రకాష్ నాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, తెదేపా మండల కార్యదర్శి జనార్ధన్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ వాసుదేవనాయుడు, నాయకులు లోకనాథ నాయుడు, హరిప్రసాద్, ఏవో భారతి, మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు గౌమతి పాల్గొన్నారు. నల్లగాంపల్లె వీఆర్వో దివంగత వెంకటాద్రి సతీమణి లలితమ్మ(82) మృతికి ఎమ్మెల్యే మురళీమోహన్, తెదేపా మండల అధ్యక్షులు ధరిణీప్రసాద్ నాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, మాజీ సర్పంచి సురేంద్రనాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. **పాలసముద్రం:** రైతును రారాజు చేయడమే తెదేపా ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ, తెలుగు మహిళ జిల్లా మాజీ అధ్యక్షురాలు ఇందిర పేర్కొన్నారు. గంగమాంబపురం పంచాయతీ పరిధి గ్రామాల్లో పర్యటించి రైతులకు రైతన్నా-మీకోసం కరపత్రాలు అందజేశారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** ఎంపీడీవో పురుషోత్తం.. పెరుమాళ్లపల్లెలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలిసి రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో వనిత, మండల తెదేపా అధ్యక్షుడు మోహన్‌మురళి పాల్గొన్నారు. **కార్వేటినగరం:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ రాజు అన్నారు. గోపిశెట్టిపల్లిలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు చెంగ్రాయులు యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజా, నాయకులు రాజేంద్రరెడ్డి, రవిరాజు, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

పుత్తూరు.. మొక్క నాటి నీరు పోస్తున్న అధ్యాపకులు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని గోవిందపాళెం అర్బన్ హెల్త్ కేంద్రం వైద్యులు రమేష్ పేర్కొన్నారు. పట్టణంలోని సీటీఆర్‌నత్తంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం మొక్కలు నాటారు. ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, బంగారు భవిత నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి వాతావరణ సమతౌల్యాన్ని కాపాడాలన్నారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి, ఎక్సైజ్ ఎస్ఐ అంజాద్‌బాషా, అధ్యాపకులు షర్మిల, శ్యామ్‌సన్‌రాజు, వెంకట కృష్ణయ్య, శ్రీనివాసులు, బాబురావు, ఉపాధ్యాయులు సరోజ, లక్ష్మీప్రసన్న, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు. **నగరి, న్యూస్‌టుడే:** అవగాహనతో ఎయిడ్స్ నివారించవచ్చని ప్రభుత్వ పీసీఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి పేర్కొన్నారు. కళాశాలలో ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రెడ్‌రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ హరిబాబు, స్టెప్స్ సంస్థ సభ్యులు కళైవాణి, సుమ, హిందుమతి, గుణసుందరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూపతి మృతి పార్టీకి తీరని లోటు

పుత్తూరు, న్యూస్‌టుడే: రామకుప్పం మండలం వీర్నమల గ్రామానికి చెందిన రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి విద్యుదాఘాతంతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నంతో కలిసి గురువారం.. భూపతి భౌతిక కాయంపై తెదేపా జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. జిల్లా బీసీ సెల్ కార్యదర్శి లక్ష్మీపతి, పుత్తూరు పట్టణ టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నవీన్, కలియబాకం ఆయకట్టు ఛైర్మన్ రమేష్ నాయుడు, జిల్లా బీసీసెల్ మీడియా కో-ఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

పలమనేరులో రాష్ట్రస్థాయి పోటీలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి జోనల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ ఎస్.బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29 నుంచి డిసెంబరు 1 వరకు పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 400 మంది క్రీడాకారులు రానున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీపీఎం వాసు సూచించారు. మండలంలోని బీలంపల్లెలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతుల గురించి వివరించారు. విత్తన కిట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

సదుంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో 30 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు గురువారం భూమిపూజ చేశారు. దాతల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, సదుం

92 మందికి రూ.9.60 లక్షల పరిహారం

పలమనేరు, న్యూస్‌టుడే: ఏనుగుల దాడుల నివారణకు అన్ని విధాల కృషి చేస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు పట్టణ పార్టీ కార్యాలయంలో గురువారం చెక్కులు అందజేశారు. 92 మంది రైతులకు రూ.9.60 లక్షలు అందజేశారు. ఏనుగుల కట్టడికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. రైతులు అటవీ నిబంధనలు అనుసరించాలన్నారు. ఏఎంసీ అధ్యక్షుడు రాజన్న, నాయకులు సోమశేఖర్‌గౌడ్, నాగరాజరెడ్డి, ఆర్టీసీకట్టి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ఒంటరి ఏనుగు దాడులు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దేవళంపేట పంచాయతీలోని దిగువమూర్తివారిపల్లె, చిన్ననగరిలో పంట పొలాలపై బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసింది. నాగరాజుకు చెందిన కొబ్బరి, మామిడి చెట్లు, రాగులు, ఉలవ పైరు, శంకరయ్య- పశుగ్రాసం, మామిడి చెట్లు, నరసింహులు- కందిపంట, అమరనాథ్- పశుగ్రాసం, గురుస్వామి- మామిడి చెట్లు, సుధాకర్- వరిసాగు, శివరామయ్య- మామిడి చెట్లు తదితరాలను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

దిగుబడి తగ్గింది.. ధర పెరిగింది

వినియోగదారులను భయపెడుతున్న టమాట

పుంగనూరు, న్యూస్‌టుడే: ఏటా తెగుళ్ల, ప్రకృతి ప్రభావం టమాట ధరలపై ప్రభావం చూపుతున్నాయి. నవంబరు నెలలో ఏటా రూ.10 పలికే పంట ఈ ఏడాది ప్రస్తుత మార్కెట్లో రూ.80కి చేరింది. దీంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. దళారుల రాకతో మరోవైపు రైతులు సైతం సొమ్ము చేసుకోలేని పరిస్థితి కనిపిస్తుంది.

పుంగనూరులో సాగవుతున్న టమాట పంట

లాభం అంతా వారికే..

ఏప్రిల్ నుంచి జులై మధ్య టమాట దిగుబడులు ఎక్కువగా వస్తాయి. ఈ సీజన్‌లో పంట ధర తక్కువ. దీంతో అన్ సీజన్‌లో రైతులు పండిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లోనూ సాగు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో రైతులకు మేలు చేసేదే. కానీ కొందరు దళారులు మాత్రం మార్కెట్‌పై ఆధిపత్యం చలాయిస్తున్నారు. దీంతో మార్కెట్లో భారీగా ధరలు ఉన్నా రైతులకు మాత్రం రూ.30 నుంచి రూ.40 వరకు మాత్రమే వస్తోంది. మరో రూ.40 వరకు నష్టం కలుగుతోంది. దీంతో కష్టం మాత్రమే మిగులుతోందని పలువురు వాపోతున్నారు.

ఎక్కువగా పారబోస్తున్నాం..

ఈ నెలంతా ఇవే ధరలు ఉంటే పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. కానీ దిగుబడులు లేవు. వైరస్ తాకిడితో పూత, పిందె దశలో పంట పోయింది. నాణ్యత తగ్గడంతో ఎక్కువ కాయలు వృథాగా బయట పారబోస్తున్నాం.
- నరసింహులు, టమాట రైతు, పుంగనూరు

ప్రస్తుత వివరాలు..

మార్కెట్	దిగుబడి (టన్నుల్లో)	ధర (కిలో.రూల్లో..)
పలమనేరు	50	23
వి.కోట	6	46
పుంగనూరు	55	40

పంటలపై తెగుళ్ల ప్రభావం..

ధరలు బాగున్నాయని సంతోషించేలోపే రైతులకు ఎదురు దెబ్బ తగులుతోంది. అన్ సీజన్ కావడంతో వాతావరణ ప్రభావంతో దిగుబడి తగ్గింది. దీనికి తోడు వైరస్ ప్రభావం, గాలులతో పూత, పిందె రాలిపోతున్నాయి. పుంగనూరు, పలమనేరు, కుప్పంలో టమాట పంటపై 75 శాతం మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఎకరా సాగుకు రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. కానీ ప్రకృతి సహకరించకపోవడంతో నష్టాలు చవి చూస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

❖ పలమనేరు పట్టణంలోని బసవన్నగుడి వీధిలో కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - వీరభద్ర ❖ కాలువలను శుభ్రం చేయిస్తాం. - ఎన్.వి.రమణారెడ్డి, పుర కమిషనర్ - న్యూస్‌టుడే, పలమనేరు

❖ మొరుపల్లెలో బోరు మోటారు గొట్టాలు పాడయ్యాయి. నీరు సరఫరా ఆగిపోతోంది. - సూరి ❖ పైపులు బాగు చేస్తాం. - సురేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికోన్నత పాఠశాల పరిసరాలను పురపాలక సిబ్బంది శుభ్రం చేశారు. పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ❖ పుంగనూరు గ్రామీణం: బసివినాయనపల్లె, గూడూరుపల్లెలో పరిసరాలు సక్రమంగా లేవని వార్తలు ప్రచురితమయ్యాయి. కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, సురేష్‌బాబు స్పందించి శుభ్రత పనులు చేశారు.

బోరు మోటారు బాగు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని గంగిరెడ్డిగారిపల్లెలో బోరు మోటారు పాడైంది. తాగునీటి ఇబ్బందులపై 'ఈనాడు'లో వార్త ప్రచురించగా సర్పంచి రెడ్డెప్ప, పంచాయతీ కార్యదర్శి మేనక స్పందించారు. బోరు మోటారు బాగు చేయించారు.

మొక్కల తొలగింపు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: శాంతినగర్- గుడుపల్లె మార్గంలో పనికిరాని మొక్కలు పెరగడంతో ఎదురవుతున్న సమస్యలపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించారు. పనికిరాని మొక్కలు తొలగించారు. ❖ కుప్పం- పలమనేరు మార్గంలో సామగుట్టపల్లె వద్ద రోడ్డుపై మురుగు నిల్వ చేరింది. 'ఈనాడు'లో వార్త ప్రచురితమవగా సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేశారు.

ప్రవాహం.. పొంచిఉన్న ప్రమాదం

పెద్దపంజాణి మండలంలోని పలమనేరు- చౌడేపల్లె మార్గంలో చెన్నారెడ్డిపల్లె చెరువు మొరవ పాడైంది. నీరు రోడ్డుపై పారుతోంది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికం. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు కర్రకు ఎరుపు రంగు వస్త్రం కట్టి సూచికగా ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

నిర్మించారు.. వదిలేశారు..

కుప్పం పురపాలిక పరిధిలో గత వైకాపా హయాంలో ఫిష్ ఆంధ్ర పేరుతో బైపాస్ మార్గంలో దుకాణాలు నిర్మించారు. రెండు రోజుల పాటు చేపల వ్యాపారం చేపట్టి వదిలేశారు. దీంతోపాటు గెర్నిబాయి వద్ద నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో ఆరోగ్య సేవలు సక్రమంగా అందడం లేదు. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండు

చౌడేపల్లి ఆర్టీసీ బస్టాండు నిర్వహణ సక్రమంగా లేక ఆవరణ అధ్వానంగా మారింది. పలమనేరు, చిత్తూరు, కుప్పం, బెంగళూరు నుంచి రోజూ ప్రయాణికులు ఈ బస్టాండు మీదుగా రాకపోకలు సాగిస్తారు. ఎక్కడికక్కడ గోతులుగా మారడంతో పాటు వర్షం నీరు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, చౌడేపల్లె

కాలువ లేక కష్టాలు

పుంగనూరు పట్టణంలోని మేలుపట్లలో దశాబ్దాల క్రితం నిర్మించిన కాలువ పూర్తిగా పాడైంది. మురుగు ప్రవాహం సక్రమంగా లేకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని పలువురు చెబుతున్నారు. ప్రజలు రోగాల బారిన పడకముందే బాగు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. పరిసరాలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పుంగనూరు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది ఏ సమయంలో ఎక్కడికి వెళ్తున్నారు.. ఏం చేస్తున్నారో వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి ప్రసన్నకుమార్ సూచించారు. కొండామర్రి, వెంగళపల్లె, కాగతి గ్రామాల్లోని సచివాలయాలను గురువారం సందర్శించారు. హాజరు, కదలికల రిజిస్టర్‌లను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వోలు సచివాలయాలకు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో లీలామాధవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన పాల్గొన్నారు.

ఉపన్యాసాలకు ప్రశంసలు

పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభ పాటవ పోటీలు జరిగాయి. 'మేధో సంపత్తి' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. మొదటి ఏడాదికి చెందిన కీర్తిశ్రీ, ధనుష్, ఆలియ విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కన్నయ్యశెట్టి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, పలమనేరు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కాలినడకన వెళ్తున్న ఓ వివాహితను పాఠశాల బస్సు ఢీకొనడంతో గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. గుడుపల్లె మండలంలోని గుండ్లసాగరానికి చెందిన జనార్దనరాజు భార్య ధనలక్ష్మి (36) గ్రామ సమీప రోడ్డుపై వెళ్తుండగా బస్సు ఢీకొంది. కుప్పం పీఈఎస్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్తు షాక్‌తో మహిళకు గాయాలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: బైరెడ్డిపల్లె మండల కేంద్రంలో విద్యుత్తు షాక్‌తో మహిళకు గాయాలయ్యాయి. విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో నివాసం ఉంటున్న వైద్యాధికారి విజయచందర్ భార్య ప్రియాంక మిద్దెపై దుస్తులు ఆరబెట్టేందుకు గురువారం ఉదయం వెళ్లారు. అనుకోకుండా తీగలు తగలడంతో షాక్‌కు గురై చేతులకు గాయాలయ్యాయి. ఆమెను తిరుపతి తరలించారు.

తాగి వాహనాలు నడిపితే సహించం

సోమల: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతామని ఎస్సై శివశంకర్ హెచ్చరించారు. కందూరు క్రాస్‌రోడ్డులో గురువారం వాహనాలు తనిఖీలు చేపట్టి దస్త్రాలు పరిశీలించారు. లైసెన్సులు లేనివారు, మద్యం తాగి నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లోని వనమలదిన్నె సమీపంలో ఇద్దరి నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. 120 మద్యం పొట్లాలు, రూ.6 వేలు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

పుదుచ్చేరి పోలీసుల తనిఖీలు

కుప్పం గ్రామీణం: పుదుచ్చేరిలో జరిగిన ఓ చోరీ కేసుకు సంబంధించి కుప్పం మండలంలోని కొత్తయిండ్లులో గురువారం పుదుచ్చేరి పోలీసులు తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. బంగారం, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఇంట్లో గతనెల 9న జరిగిన చోరీ ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు శిక్షణ ఎస్సై జయశ్రీ తెలిపారు. బాధితుడు ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు రూ.2.40 లక్షల విలువైన 48 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని జయశ్రీ చెప్పారు.

నవ వధువు అదృశ్యం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలో ఓ గ్రామానికి చెందిన నవ వధువు (20) అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు శిక్షణ ఎస్సై జయశ్రీ తెలిపారు. ఆమెకు 10 రోజుల క్రితం వివాహమైందని, ఈనెల 26న ఉదయం ఇంటి నుంచి వెళ్లిందన్నారు. తిరిగి రాకపోడంతో భర్త ఫిర్యాదు చేశారన్నారు.

కొనసాగుతున్న విచారణ

కుప్పం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో భారీగా నగదు దోపిడీ జరిగిన విషయం విదితమే. దీనిపై కర్ణాటక పోలీసులు ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని చోరీకి గురైన నగదు చాలావరకు రికవరీ చేశారు. మిగిలినది రికవరీ చేసేందుకు గురువారం రాత్రి కుప్పంలోని పలు చరవాణి దుకాణాల్లో దస్త్రాలు, సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు. నగదు దోపిడీకి పాల్పడిన వారిలో కొందరు కుప్పంలో ఖరీదైన చరవాణులు కొనుగోలు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

జీడీనెల్లూరు: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోటి మొక్కలు నాటించాలనే సదుద్దేశంతో ఐదేళ్లుగా ప్రపంచమంతా సైకిల్ యాత్ర చేస్తున్నట్లు కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ పేర్కొన్నారు. గురువారం జీడీనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో అతడికి ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తెదేపా మండల అధ్యక్షుడు స్వామిదాస్ ఘనస్వాగతం పలికారు.

ఆదాయం ఆర్జించి.. సమస్యలు సృష్టించి

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో కొందరు భవనాల యజమానులు ఆదాయ ఆర్జన తప్ప సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. పెద్ద పెద్ద భవంతులు, దుకాణాలు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు కానీ అక్కడకు వచ్చే వాహనాలు నిలిపే స్థలాలు లేక పుంగనూరు, కుప్పం, పలమనేరు పట్టణాలు నిరంతరం రద్దీగానే కనిపిస్తున్నాయి.

పుంగనూరు: వాణిజ్యపరమైన భవంతులు గల ఎంబీటీ రోడ్డు

రోజూ వేలాది వాహనాలు..

మూడు పట్టణాలకు రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీనికి తోడు పరిసర గ్రామాల ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఇక్కడకు వెళ్లాల్సిందే. సుమారు మూడు పట్టణాల్లో రోజుకు 10 వేల వరకు వాహనాల తాకిడి ఉంటుంది. కానీ వాటిని నిలిపే స్థలం లేక చిన్న, సన్న వీధులతో పాటు రోడ్లపై నిలిపేస్తున్నారు. పట్టణ ప్రజలకు అవస్థలు మిగుల్చుతున్నారు.

భవనాలు అనేకం..

పుంగనూరులో నాగపాళ్యం నుంచి తపాల కార్యాలయం వరకు సుమారు 150కి పైగా దుకాణాలు ఉంటాయి. పలమనేరు, కుప్పంలోనూ మరో 200 వరకు పెద్ద దుకాణాలు ఉండటంతో ఖాళీ స్థలమే కనిపించడం లేదు. నిబంధనలు పాటించకుండా నిర్మించే వాటికి అనుమతులు ఎలా ఇస్తున్నారని పలువురు అధికారులను ప్రశ్నలు సంధిస్తున్నారు.

అత్యవసరమా.. దిక్కులు చూడాల్సిందే

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నియోజకవర్గం, మూడు రాష్ట్రాల సరిహద్దు పట్టణం కుప్పంకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి అవస్థలు తప్పడం లేదు. వివిధ పనుల మీద వచ్చే వారు కాలకృత్యాలు తీర్చుకునేందుకు సులబ్ కాంప్లెక్స్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

మూడు నిర్మించినా...

పట్టణ ప్రజల సౌకర్యార్థం మూడు సులబ్ కాంప్లెక్సులు నిర్మించారు. బైపాస్ మార్గం ప్రైవేటు బస్టాండు, రాధా కృష్ణ రోడ్డు, కొత్తపేటలో రూ.15 లక్షల చొప్పున వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. రాధాకృష్ణ రోడ్డులో దుకాణ సముదాయం నిర్మిస్తామని తొలగించారు. కొత్తపేటలో శిథిలావస్థకు చేరడంతో భవనాన్ని కొట్టేశారు. ప్రైవేటు బస్టాండు వద్దనున్న దానికి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఏళ్లుగా వినియోగానికి దూరంగా ఉంది.

నిత్యం రాకపోకలు..

కుప్పం పట్టణానికి రోజూ 25 వేల మంది వరకు వస్తారు. జమిందారీ పార్కు, ఆర్టీసీ బస్టాండులో ఉన్న మరుగుదొడ్లు సైతం వినియోగానికి దూరంగా ఉన్నాయి. వాటిల్లోకి వెళ్లాలంటే దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. విషయం పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. సమస్య పరిష్కారానికి పురపాలకవర్గంతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

భూపతి మృతికి సంతాపం

రామకుప్పం, న్యూస్‌టుడే: వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భూపతి బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. గురువారం ఆయన స్వగ్రామం వీర్ణమలలో అంత్యక్రియలు నిర్వహించారు. భూపతి భౌతికకాయానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డా.సురేష్‌బాబు, జనసేన బాధ్యుడు నరేశ్, గ్రంథాలయ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, రెస్కో అధ్యక్షుడు ప్రతాప్, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, తెదేపా మండలాధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ❖ ఆయన కుటుంబానికి పెద్దతండా, గుట్టూరుతండా, చిక్కపల్లి తండా పంచాయతీల ప్రజలు రూ.60 వేలు అందజేశారు.

జెండా కప్పి బావోద్వేగానికి గురవుతున్న తెదేపా నాయకులు, కుటుంబ సభ్యులు

న్యాయవాదుల సంఘ భవనం ప్రారంభం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు కోర్టు ఆవరణలో రూ.45 లక్షలతో నిర్మించిన న్యాయవాదుల సంఘ కార్యాలయ భవనం గురువారం ప్రారంభించారు. సంఘాధ్యక్షుడు చెన్నకేశవులు ఆధ్వర్యంలో గోమాతకు పూజలు చేశారు. న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి నిధులు

సదుం, న్యూస్‌టుడే: సదుంలోని మదీనా మసీదు అభివృద్ధి కోసం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం తిరుపతిలో ఎంపీని కలిసి సత్కరించారు. సభ్యులు మహమ్మద్ అలీ, మస్తాన్, కాలేషా, సయ్యద్‌బాషా, ఖాజాపీర్, మునాఫ్ తదితరులున్నారు.

విద్యార్థులపై యమపాశాలు

పులిచెర్ల మండలంలోని సదుం రోడ్డులో ఉన్న మండల పరిషత్తు ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ 1 నుంచి 5 తరగతులుండగా 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఆవరణలోని చెట్టును తాకుతూ భవనాల పైనుంచి విద్యుత్తు తీగలు వెళ్లడంతో వారంతా భయంతో ఉంటున్నారు. గాలులు వీస్తే కొమ్మలు, తీగలు తెగి పడుతున్నాయని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని హెచ్‌ఎం భానుమతి తెలిపారు. - ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, కల్లూరు

అధ్వానమార్గం.. అవస్థల ప్రయాణం

శాంతిపురం మండలంలోని 64-పెద్దూరు పంచాయతీ కారిముట్ల నుంచి గుడుపల్లె మండలం పొగురుపల్లె రహదారి వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కె.గొల్లపల్లె, కారిముట్ల వద్ద రాళ్లు, కంకర తరలింపు వాహనాల ధాటికి ఎక్కడికక్కడ గుంతలమయమైంది. ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం.

రూ.49 లక్షలతో పనులకు ప్రతిపాదనలు

వివరాలు చెబుతున్న అధ్యక్షుడు సమీపతి యాదవ్

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు ఏఎంసీ కార్యాలయం ఆవరణలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.49 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు ఛైర్మన్ సమీపతి యాదవ్ అన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన ఏఎంసీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. గోవుల షెడ్లు, ఇనాం కార్యాలయ భవనం బాగుకు రూ.10 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. సీసీ రోడ్లు, కాలువలు, ముఖద్వారం, వాణిజ్య గదుల బాగు, దీపాల విస్తరణకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు చెప్పారు. కార్యదర్శి గోపి, సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా ఉండాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: ప్రజలకు సకాలంలో సేవలు అందించాల్సిన సచివాలయ ఉద్యోగులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తే చర్యలు తప్పవని పురాధ్యక్షుడు అలీంబాషా అన్నారు. గురువారం పురపాలిక సాధారణ సమావేశం నిర్వహించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో అగౌరవంగా ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇందిరా కూడలిలోని కౌండిన్య కాలువలో ఆక్రమణలను తొలగించాలన్నారు. కమిషనరు మధుసూదనరెడ్డి, ఉపాధ్యక్షుడు నాగేంద్ర, డీఈఈ మహేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పురాధ్యక్షుడు అలీంబాషా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి కప్పు కైవసం చేసుకుందని పీడీ మురళీధర్ తెలిపారు. క్రీడల్లో సత్తా చాటిన పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు విజయ్, గానవి రాష్ట్రస్థాయి జట్టులో చోటు సాధించినట్లు హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. వీరు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడా కారులు, పీడీని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రోఫీ చూపుతున్న క్రీడాకారులు

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

బైరెడ్డిపల్లె, కల్లూరు, శాంతిపురం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంగంవారిపల్లెలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించి పథకాల గురించి వివరించారు. రైతుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. ● కల్లూరు మండలంలో తెలుగు యువత మీడియా కో-ఆర్డినేటరు మునికృష్ణమనాయుడు, నాయకుడు గోపీనాయుడు, శాంతిపురం మండలంలో ఏఎంసీ పాలకవర్గ డైరెక్టర్ హరినాథరెడ్డి, రెస్కో డైరెక్టర్ బసవరాజు, తెదేపా జిల్లా బీసీసెల్ కార్యదర్శి జి.జయరామ్ గోడప్రతులు ఆవిష్కరించారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు, రైతులు

(c) eenadu

సృజన కళ కనువిందు

ఈదరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన హస్తకళల, చిత్రలేఖన ప్రదర్శన

ఈదరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం, హస్తకళలు, కళాత్మక వస్తువుల ప్రదర్శనను గురువారం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు వీటిని సందర్శించారు. ఈ ప్రదర్శనను డీఈవో షేక్ సలీం బాషా ప్రారంభించారు.

-న్యూస్‌టుడే, మామిడికుదురు

విందు.. పసందు

సాధారణంగా కొంగలు అదిరించినా.. బెదిరించినా తుర్రున ఎగిరిపోతాయి. దమ్ము సమయంలో పొలంలో చేరిన ఈ పక్షులు ట్రాక్టరు వెంట పడుతూ చేలోంచి పైకి వస్తున్న కీటకాలను నోటితో అందుకుని గుటుక్కు మనిపిస్తాయి. ఉప్పలగుప్తం మండలం కూనవరంలో కనిపించిన దృశ్యమిది. ఖరీఫ్ సాగు కోసం దమ్ము చేస్తుండగా వందల కొంగలు ఇలా ఆహార అన్వేషణ సాగించాయి.

-న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

అధ్యక్షా..

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ

మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. సభాపతి ఎన్నిక మొదలుకొని అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వరకు ప్రతి అంశాన్ని చక్కగా వివరించారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు ఏవిధంగా సమాధానాలు ఇవ్వాలో, సభను సమర్థంగా ఎలా నిర్వహించాలో, బిల్లుల ఆమోదానికి ఏవిధంగా చర్చ జరుగుతుందో చూపారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష సభ్యుల పాత్రల్లో చక్కగా అభినయం చేశారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ

స్కిల్ హబ్‌ల ద్వారా యువతకు అవకాశాలు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

చదువు పూర్తయి ఉద్యోగాన్వేషణలో ఉన్నారా..? స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారా..? నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ చేయూతనందిస్తోంది. శిక్షణ నుంచి ఉపాధి కల్పన వరకు అండగా నిలుస్తోంది. స్కిల్ హబ్‌ల ద్వారా వివిధ కోర్సుల్లో నైపుణ్య శిక్షణకు అవకాశం కల్పిస్తోంది. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏడు చోట్ల నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలో ఏడు చోట్ల

ముమ్మిడివరంలోని ఎయిమ్స్, కొత్తపేట- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం- ఎస్‌కేపీ జూనియర్ కళాశాల, మండపేట- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమలాపురం- మిరియాం కళాశాల, రాజోలు- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పి.గన్నవరం- సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈ కేంద్రాలు ఉన్నాయి.

ఈ కోర్సుల్లో తర్ఫీదు

యువ

ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, అప్లికేషన్ డెవలపర్, వెబ్, మొబైల్, కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ పెరిఫెరల్స్, ఈ-కామర్స్ డెలివరీ అసోసియేట్స్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 660 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి నుంచి పీజీ వరకు అభ్యర్థులు అర్హులు.

ఏడాది	ఉద్యోగ మేళాలు	ఉద్యోగాలు
2024	25	1800
2025	17	1100

ముమ్మిడివరం ఎయిమ్స్‌లోని శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

విదేశాల్లో ఉద్యోగాలు..

ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసి రెండేళ్ల నుంచి మూడేళ్ల అనుభవం ఉన్న యువకులకు, నర్సింగ్‌కు సంబంధించి యువతులకు జర్మనీ, దుబాయ్‌లలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. అక్కడి భాషతో పాటు నైపుణ్య శిక్షణలో 8 వారాలు ఇస్తారు. ప్రస్తుతం జిల్లాకు చెందిన 8 మంది రాజమహేంద్రవరంలోని నైపుణ్య కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నారు.

అర్హులు వినియోగించుకోవాలి

వివిధ కంపెనీలను ఆహ్వానించి ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం జిల్లాలోని స్కిల్ హబ్‌లలో నైపుణ్య శిక్షణకు నమోదుకు అవకాశం కల్పించాం.

-డి.హరి శేషు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

తూర్పు వాకిట.. మండపేట

- ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం
- అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు

ఈనాడు, అమలాపురం: తూర్పుగోదావరి జిల్లా భౌగోళిక, నైసర్గిక స్వరూపం మారనుంది. ఇప్పటివరకు 7 నియోజకవర్గాలు..19 మండలాలతో ఉండగా తాజాగా డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాలు కలస్తాయి. ప్రాథమిక నోటిఫికేషన్ ప్రచురించి ప్రజల నుంచి 30 రోజుల్లోగా అభ్యంతరాలు స్వీకరించాలని కలెక్టర్లకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

హామీ నెరవేర్చి

భౌగోళికంగా మండపేట నియోజకవర్గంలోని గ్రామాలు రాజమహేంద్రవరానికి దగ్గర. గత ప్రభుత్వం కోనసీమ జిల్లాలో కలపడంతో స్థానికులు ఆందోళనలు చేపట్టారు. కూటమి అధికారంలోకి వస్తే మండపేటను తూర్పుగోదావరిలో కలుపుతామని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రస్తుతం నెరవేరింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం ముమ్మర ప్రయత్నం చేశారు. అమలాపురం వెళ్లాలంటే కొన్ని గ్రామాల నుంచి 70 కి.మీ దూరంతోపాటు, నాలుగు బస్సులు మారాలని.. అదే రాజమహేంద్రవరానికి కనిష్ఠంగా 8 కి.మీ దూరమని వివరించారు. మెజార్టీ పంచాయతీలు 'రుడా' పరిధిలో ఉన్నాయని పేర్కొంటూ సీఎం, మంత్రి వద్ద ఉపసంఘం వద్ద ప్రస్తావించారు.

కొత్త మార్పులివి

- రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోకి జిల్లా మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు
- తూర్పులో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల సరసన మండపేట చేరిక
- అనపర్తి నియోజకర్గంలోని పెదపూడి అప్పుడూ, ఇప్పుడూ కాకినాడ డివిజన్‌లోనే..

కాకినాడలో విలీనానికి డిమాండ్..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు కాకినాడ జిల్లాలో.. రామచంద్రపురం, కె.గంగవరం కోనసీమలో ఉన్నాయి. ఈ రెండింటిని కాకినాడలోనే విలీనం చేయాలనే డిమాండ్ ఉంది. ఇటీవల అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసనలూ చేపట్టారు. ప్రభుత్వం ప్రస్తుతానికి యథాతథ స్థితిలోనే ఉంచింది.

అతివలకు అండ

రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఆర్థిక సాయం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ముమ్మిడివరం: రైతు ఉత్పత్తిదారుల సంస్థకు రూ.3 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

డ్వాక్రా సంఘాల్లోని మహిళలతో రైతు ఉత్పాదకులు ఏర్పాటయ్యారు. మండలానికో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. జిల్లాలో ఇప్పటికే 14 మండలాల్లో ఎఫ్‌పీవోల రిజిస్ట్రేషన్ జరిగింది.

50 వరకు సంఘాలు..

ప్రతి మండలంలో 30-50 సంఘాలను రైతు ఉత్పాదక సంస్థ (ఎఫ్‌పీఓ)గా రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ (ఐఎఫ్‌సీ) కింద వివిధ పంటలు, పౌల్ట్రీ, పండ్ల తోటల అభివృద్ధి ఉంటుంది. సేంద్రియ పద్ధతిన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిపై అవగాహన కల్పిస్తారు.

జిల్లాకు నిధుల విడుదల

మూడు విడతల్లో ఎఫ్‌పీఓలు రిజిస్టర్ అయిన 13 మండలాల్లో 644 సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ విడుదల చేశారు. ప్రతి సంఘానికి రూ.10 వేల వంతున ఇస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఎఫ్‌పీఓలతో ప్రోత్సాహకాలు అందిస్తామని డీఆర్‌డీఏ ఏపీఎం వరాల బాబు తెలిపారు.

- ఎస్‌హెచ్‌జీ సంఘాలు: 38,279
- సభ్యులు: 3,77,254
- ఏర్పాటైన సంఘాలు: 644
- రైతు ఉత్పత్తిదారుల సంస్థలు: 14
- రివాల్వింగ్ ఫండ్: రూ.64.40 లక్షలు

మిగిలింది మూడు రోజులే..

గృహ సర్వేకు ముగియనున్న గడువు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ్) కింద ఆవాస్ ప్లస్-2024 పేరుతో క్షేత్రస్థాయిలో సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఇందులో నమోదైన లబ్ధిదారులకు మాత్రమే 2029 వరకు పక్కాఇళ్లు మంజూరు చేస్తారు. గడువు ఈ నెల 30తో ముగియనుంది. దీనిపై ప్రజాప్రతినిధులు, హౌసింగ్ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమయం లేనందున అర్హులందరూ వినియోగించుకోవాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి

గతంలో నిర్వహించిన డిమాండ్ సర్వేలో పేరు లేకపోయినా ప్రజలు అడిగితే తాజా సర్వేలో నమోదు చేయాలని ఎమ్మెల్యేలు ఆ శాఖ సిబ్బందికి పదేపదే సూచిస్తున్నారు. లేకుంటే 2029 వరకు కొత్తగా ఎవరు పక్కాఇల్లు అడిగినా మంజూరు చేసేందుకు వీలుపడదని స్పష్టం చేస్తున్నారు.

నేటికీ అనేకమందికి తెలియక..

ప్రస్తుతం జరుగుతున్న సర్వే గురించి నేటికీ తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారి వివరాలను సైతం సేకరించి సర్వేలో ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

గత డిమాండ్ ప్రకారం

హౌసింగ్ అధికారులు గతంలో చేసిన డిమాండ్ సర్వే ప్రకారం జిల్లాలో 14,206 మంది పేదలకు పక్కాఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. వీరందరినీ ఆవాస్ ప్లస్-2024 వెబ్‌సైట్‌లోకి తీసుకొచ్చేందుకు ఈ ఏడాది అక్టోబరు 20 నుంచి ప్రత్యేకంగా సర్వే చేస్తున్నారు. ఇంతవరకు 11,617 కుటుంబాలను ఇందులోకి తీసుకొచ్చారు. ఇంకా 2,589 కుటుంబాలను చేయాల్సి ఉంది.

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం

సర్వే ఈ నెల 30తో ముగుస్తుంది. హౌసింగ్ డిమాండ్‌లో పేరు లేకపోయినా పక్కాఇల్లు కావాలని ఎవరైనా అడిగితే వారిని కూడా ఆవాస్ ప్లస్-2024 సర్వేలోకి చేర్చమని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ఎవరైనా విస్మరిస్తే వారే బాధ్యులవుతారు.

- ఎ.వి.నర్సింహారావు, పీడీ, బలహీనవర్గాల గృహనిర్మాణ సంస్థ

ఇప్పటివరకు పూర్తయిన వివరాలు

నియోజకవర్గం	కుటుంబాలు
అమలాపురం	2,895
ముమ్మిడివరం	2,354
రాజోలు	846
పి.గన్నవరం	2,400
కొత్తపేట	1,855
రామచంద్రపురం	704
మండపేట	563

మార్గాలా.. మృత్యుముఖాలా!

ఉమ్మడి జిల్లాలో ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

"రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడం ఆందోళనకరం. కొన్ని జిల్లాల్లో మరణాల సంఖ్య అధికంగా ఉంది. అందులో కాకినాడ ఉంది. కారణాలను విశ్లేషించండి. ప్రతీ ప్రమాదంపైనా ఆడిట్ జరగాలి"

-రహదారి భద్రతా మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు చిన్న, పెద్ద ప్రమాదాలు 1,252 జరిగి 761 మంది మృత్యువాతపడ్డారు. వెయ్యి మందికి పైగా గాయపడ్డారు. ఎక్కువగా పదహారో నంబరు హైవేపై జరిగాయి.

పెరిగిన మరణాలు..

● కాకినాడ జిల్లాలో గతేడాది మొదటి పది నెలల్లో 758 ప్రమాదాలు జరిగి 259 మంది చనిపోయారు. ఈ ఏడాది 436కు తగ్గినా మరణాలు 285. ● తూర్పులో 2024లో 606 ప్రమాదాలు జరిగి 246 మంది చనిపోయారు. ఈసారి 465కు తగ్గాయి.. ప్రాణనష్టం 280కి పెరిగింది. ● కోనసీమలో 2024లో 418 ఘటనలు జరిగితే ఈసారి 351. మరణాలు గతసారి 144 కాగా ఈ దఫా 196.

ఈనెల 8న కిర్లంపూడి మండలం సోమవరం కూడలిలో నలుగురి ప్రాణాలను బలిగొన్న కారు

ప్రధాన కారణాలు ఇలా..

☛ కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడం ☛ డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం ☛ వెలుతురు సమస్య ☛ మద్యం మత్తు ☛ శిరస్త్రాణం, సీటు బెల్ట్‌లు ధరించకపోవడం ☛ రోడ్ల నిర్వహణ లోపం

ఘటనలు ఇలా.. (జనవరి-అక్టోబరు)

వివరం	కాకినాడ	తూర్పు	కోనసీమ
మొత్తం ప్రమాదాలు	436	465	351
మృతులు	285	280	196
క్షతగాత్రులు	698	789	617

తేడాలు సవరిస్తేనే..

● ఇటీవల సోమవరం కూడలి వద్ద ఓ కారు నలుగురి ప్రాణాలను బలిగొంది. రహదారి పక్కగా ఐరన్ గ్రిల్స్‌తో కూడిన బ్యారికేడ్ నిర్మాణం రెండు కి.మీ వరకు అవసరం. ● కోరంగి పరిధిలో రోడ్డు నిర్మాణంలో తేడా ఉంది. ● 10 కి.మీ.కు ఒక మొబైల్ వాహనం పెట్టి హైవేపై నిలిపేసి ఉన్న వాహనాలను తరలించాలి.

ఏటిగట్టు రహదారికి మహర్దశ

రూ.6 కోట్లు మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రావులపాలెం పట్టణం: ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయం శనివారం వచ్చిందంటే చాలు.. భక్తులతో కిటకిటలాడుతుంది. ఆ రోజు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం సెంటర్ వివిధ వాహనాలతో కళకళలాడుతుంది. దీంతో ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాడపల్లి వెళ్లేందుకు ఊబలంక - బొబ్బర్లంక రహదారి సింగల్ రూట్ కావడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఏటిగట్టు రహదారిని అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరడంతో ఆయన వెంటనే రూ.6 కోట్లు మంజూరు చేశారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

వాడపల్లి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రహదారి

ఎంతో ఉపయోగం..

గోదావరికి వరదల సమయంలో నీరు గ్రామాల్లోకి రాకుండా బ్రిటిష్ కాలంలో ఏటిగట్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. 20 ఏళ్ల క్రితం ఈ ఏటిగట్లను ఆధునికీకరించారు. ప్రస్తుతం గుంతలమయంగా మారడంతో పాటు పిచ్చి మొక్కలు, పెద్ద పెద్ద వృక్షాలు పెరిగి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రావులపాలెం గౌతమి వంతెన వద్ద నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లికి ఏడు కిలో మీటర్ల దూరం ఉంది. ఉపముఖ్యమంత్రి నిర్ణయంతో ఇది అభివృద్ధి కానుంది. ఈ రహదారిని నిర్మించడం వల్ల వాడపల్లి వెళ్లే భక్తులతోపాటు ఈ ఏటిగట్టు చెంతన ఉండే రావులపాలెం, ఊబలంక, మెర్లపాలెం, వాడపల్లి గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. లంక ప్రాంతాల్లోని రైతులకూ ఇబ్బందులు తప్పుతాయి. గట్టును ఆనుకుని గోదావరి, పచ్చని పంటపొలాలు ఉండడంతో పర్యాటకంగానూ అభివృద్ధి చెందుతుంది.

నేటి నుంచి బడి బస్సుల తనిఖీలు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు బడి బస్సుల ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం భద్రతా ప్రమాణాలు, ఫిట్‌నెస్, ట్యాక్స్, పర్మిట్, చోదకుడి డ్రైవింగ్ లైసెన్సు తదితర అంశాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయ వ్యవస్థకు ప్రత్యేక అధికారులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాలను పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 22 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలకు ఈ బాధ్యతలు అప్పగించారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించి డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు. ఈమేరకు వారికి నియామక పత్రాలను అందించినట్లు జీఎస్‌డబ్ల్యూ సమన్వయకర్త విజయ్ తెలిపారు.

మెగా పీటీఎంకు విద్యాశాఖ సన్నద్ధం

మామిడికుదురు, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని (మెగా పీటీఎం 3.0) డిసెంబరు 5న అన్ని పాఠశాలల్లో పండగ వాతావరణంలో నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. దీనికి సంబంధించి కార్యాచరణ సిద్ధమైంది. ఆ రోజు ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, అధికారులకు స్వాగతం పలుకుతారు. 9.30 నుంచి 10.50 వరకు ప్రాథమిక, మాధ్యమిక, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రగతి, లక్ష్యాలు, 10.50 నుంచి 11 వరకు బోధనోకరణాలు, విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులు, వివిధ వస్తువుల ప్రదర్శన జరుగుతుంది. 11 నుంచి 11.10 వరకు సమావేశం ఏర్పాటవుతుంది. 11.10 నుంచి 12.45 వరకు విద్యార్థులు తమకు వచ్చిన పద్యాలు, శతకాలు, కథలను చెబుతారు. అతిథుల ఉపన్యాసాల అనంతరం అందరికీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ఏర్పాటవుతుంది.

జాగా లేదని.. పొగబెట్టేస్తున్నారు..

డంపింగ్‌యార్డులో వ్యర్థాల నిర్వహణ తీరిది

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

అమలాపురం పట్టణాన్ని చెత్త సమస్య పట్టి పీడిస్తోంది. పట్టణ పరిధిలో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను ప్రస్తుతం బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డులో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి 4.5 ఎకరాల్లో రెండున్నర ఎకరాల స్థలంలో చెత్త శుద్ధి ప్రక్రియ జరుగుతుంది. మిగిలిన రెండు ఎకరాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి.

అమలాపురంలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

పురపాలిక వివరాలు

- వార్డులు 30
- జనాభా: 70 వేలు
- రోజువారీగా పోగవుతున్న చెత్త: 32 టన్నులు
- పొడి చెత్త: 20 టన్నులు
- తడి చెత్త: 9 టన్నులు
- ప్లాస్టిక్ వ్యర్థాలు: 3 టన్నులు

కదలని దస్త్రాలు..

ఈ డంపింగ్‌యార్డుకు 10 నుంచి 15 ఎకరాల భూమి సేకరణకు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆనందరావు ప్రతిపాదన పెట్టారు. దీనికి సంబంధించిన దస్త్రాలను పురపాలిక అధికారులు రెవెన్యూ శాఖకు పంపి నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు కదలిక లేదు.

పొగతో ఉక్కిరిబిక్కిరి..

డంపింగ్ యార్డులోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ వ్యాపించి సమీప నివాసాల వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డులో చెత్త వేసేందుకు ఖాళీ లేదు.

ఆచరణకు నోచుకోక..

డంపింగ్ యార్డులో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చెత్త నుంచి ఎరువు తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. నెలలు కావస్తున్నా ఇది కార్యరూపం దాల్చలేదు. ప్లాస్మా విధానంలో పొడి చెత్తను మండించి బూడిదగా మార్చే ప్రక్రియకు ప్రతిపాదనలు పెట్టారు. అదీ నెరవేరడం లేదు.

చర్యలు తీసుకుంటున్నాం

డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్లాస్మా యంత్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టాం. భూసేకరణకు సంబంధించి అంశం రెవెన్యూ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉంది.

-నిర్మల్ కుమార్, పురపాలిక కమిషనర్

(c) eenadu

రాజకీయ ప్రాతినిధ్యానికి ఉమ్మడి పోరాటం

● జస్టిస్ ఈశ్వరయ్య

మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య, చిత్రంలో మల్లాడి కృష్ణారావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, కుడిపూడి సూర్యనారాయణ, డాక్టర్ విశారదన్ మహరాజ్ తదితరులు

యానాం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజకీయ భాగస్వామ్యం గ్రామ స్థాయి నుంచి పెంచడానికి ఉద్యమాన్ని రూపొందించి ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తెస్తామని జస్టిస్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్య, ఉద్యోగావకాశాలతో పాటు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ స్థాయిలో చేయాల్సిన పోరాటం, భవిష్యత్తు కార్యాచరణపై స్థానిక గీతా మందిరంలో గురువారం ఆంధ్రప్రదేశ్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేధోమధన సమావేశం నిర్వహించారు. ఏపీ బీసీ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం ఉన్నందున 69 శాతం రిజర్వేషన్ తెచ్చుకునే సువర్ణావకాశం ఏపీ ప్రభుత్వానికి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన డాక్టర్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ విడిపోయిన ఏపీ, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఒక్కటై రిజర్వేషన్ ఉద్యమాన్ని పునర్నిర్మించాలన్నారు. మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ 10 నుంచి 15రోజుల్లో ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరి ప్రభుత్వాలకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాల్ని అందజేస్తామన్నారు. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు సుబ్రహ్మణ్యం, ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పప్పు దుర్గారమేష్, పెసింగి ఆదినారాయణ, గూడూరి వెంకటేశ్వరరావు, బీసీ రమణ, కర్రి చిట్టిబాబు, ఘంటశాల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని డీఆర్వో కె.మాధవి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో మధ్యాహ్న భోజనం అమలు తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా ప్రతినిధులు పలు లోపాలను గుర్తించి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో బడితోట పెంచడం ద్వారా నాణ్యమైన కూరగాయలతో భోజనం పెట్టవచ్చన్నారు. జిల్లాలో 858 పాఠశాలల్లో మాత్రమే ఈతోటలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలు తీరుపై నిరంతరం పరిశీలన చేయాలని తెలిపారు. సమావేశంలో డీఈవో సలీం బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి దుర్గారావుదొర, స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్'ను సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ, ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌లో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసును హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్త రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఉయ్యాలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కబుర్లు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల మజిలీని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

అంతిమయాత్రలో ఆపద్బాంధవుడు

అనాథశవాలకు సొంత ఖర్చుతో అంత్యక్రియలు

వివిధ కారణాలతో సమాజంలో ఎంతో మంది అనాథలుగా మిగులుతున్నారు. బంధాలను పక్కన పెట్టి అయిన వారు కూడా కన్నెత్తిచూడని ప్రస్తుత పరిస్థితుల్లో అనాథ శవాలకు అన్నీ తానై అంత్యక్రియలు చేస్తున్నారు అంబాజీపేటకు చెందిన నాగాబత్తుల సాయిబాబా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వెంకటసుబ్బారావు. ఆయన తండ్రి పేరున ఈ ట్రస్టును ప్రారంభించారు. అంత్యక్రియలతోపాటు అనంతరం జరిపే దిన కార్యక్రమాలు, భోజనాలకు ఆయన ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా సొంత ఖర్చులతో చేస్తున్నారు. ఇప్పటి వరకు 20 అనాథశవాలకు పైగా అంత్యక్రియలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, అంబాజీపేట

మృతదేహం రోజుల తరబడి ఉండిపోవడంతో..

కరోనా సమయంలో మృతి చెందిన వారి దగ్గరకు కనీసం రక్త సంబంధీకులు కూడా రాని పరిస్థితి. ఆ సమయంలో అంబాజీపేటకు చెందిన ఓ మహిళ మృతి చెందడంతో దేహం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వచ్చింది. ఇది చూసిన వెంకటసుబ్బారావు చలించిపోయి ఆ శవాన్ని తానే స్వయంగా స్థానిక శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. ఇతని వద్ద శవాలను భద్రపరిచే ఫ్రీజర్ ఉంది. దీనిని గ్రామంలో 250 మంది వరకు వినియోగించుకున్నారు. ఈయన ఆర్థికంగా పెద్ద స్థితిమంతుడు కూడా కాకపోయినా ఒక్కొక్క కార్యక్రమానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు సొంత డబ్బులు ఖర్చుచేస్తున్నారు. ఇతనికి సహాయంగా ఐదుగురు యువకులు సేవలు అందిస్తున్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న వెంకటసుబ్బారావు

రైతు సంక్షేమానికి పెద్దపీట

ముమ్మిడివరం ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన భాగ్యశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు చిత్రంలో ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్సీ రాజశేఖరం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి పథకాలు అమలు చేస్తోందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అన్నారు. ముమ్మిడివరం ఏఎంసీ ఛైర్మన్ ఓగూరు భాగ్యశ్రీ, ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ మాట్లాడారు. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకంలో ఏటా రైతులకు రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, కొత్తపేట జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సాగిరాజు సూరిబాబురాజు, మోకా ఆనందసాగర్, చెల్లి అశోక్, తాడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరుకున్న గల్ఫ్ బాధితురాలు

మల్లమ్మ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ముమ్మిడివరానికి చెందిన తెడ్లపు మల్లమ్మ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. అక్కడ పూర్తి స్థాయిలో పని చెప్పకపోవడంతో పాటు గుర్తింపు కార్డు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. స్వదేశానికి వచ్చేద్దామని ఏజెంట్‌ను సంప్రదించగా రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కేంద్రాన్ని సంప్రదించారు. బాధిత మహిళను గురువారం సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు డీఆర్వో కె.మాధవి తెలిపారు.

శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికే శిక్షణ తరగతులు

● భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, వేదికపై ఎంపీ పురందేశ్వరి, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్సీ వీర్రాజు

దేవీచౌక్, న్యూస్‌టుడే: దేవీచౌక్, న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఉత్సాహంగా పనిచేసేందుకు ప్రశిక్షణవర్గ తరగతులు ప్రేరణగా నిలుస్తాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని రివర్‌బే ఫంక్షన్ హాలులో గోదావరి జోన్ ప్రశిక్షణవర్గ తరగతులు గురువారం నిర్వహించారు. ఆరు జిల్లాలకు(ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా) చెందిన మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పార్టీ చరిత్ర, వికాసం వంటి అంశాలు ప్రశిక్షణ తరగతుల్లో వివరించామన్నారు. మండల అధ్యక్షులు రాబోయే కాలంలో పార్టీ భూమిక ఏవిధంగా ఉండాలో కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో వాడవాడలా భాజపా జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ తరగతులకు సుదీర్ఘ చరిత్ర ఉందని పేర్కొన్నారు. వీటి వల్ల నిబద్ధత, నాయకత్వ పటిమ పెరుగుతాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న శక్తివంతమైన రాజకీయ పార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తున్నామనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. భాజపా రెండు సీట్ల నుంచి 300కు పైగా సీట్లు సాధించే స్థాయికి ఎదిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక అంశాల ఆధారంగా పని చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర సంఘటన సహ కార్యదర్శి మధుకర్, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యక్షులు నిర్మలా కిషోర్, కార్యదర్శులు బొమ్ముల దత్తు, ఆదిలక్ష్మి, రాష్ట్ర సీనియర్ నాయకుడు వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 27 నుంచి దేహదారుఢ్య పోటీలు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో డిసెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ మెన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నామని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను వర్సిటీలో గురువారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో నిర్వహించే ఈ పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక అవుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లు డిసెంబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, అసోసియేట్ కార్యదర్శి ఎం.వి.వి.ఎస్ మూర్తి, ప్రిన్సిపల్స్, పీడీలు పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యం వెంటనే కొనుగోలు చేయండి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం నేపథ్యంలో కోతలు పూర్తయ్యి కల్లాల్లో ఉన్న ధాన్యం తక్షణం కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నాలుగు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలన్నారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, డీఎస్వో ఉదయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్, ✆ 9849138626.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

వైజాగ్ ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు దగ్గరలో 40'రోడ్ ఫేసింగ్ కమర్షియల్ 869 గజాలు VMRDA ప్లాటు అమ్మకం. ✆ 94932 44471, 93969 72239.

JOBS

WANTED Managers to Motivation of Team/ Targets/ Salary upto 50K/ Kkd/ Age above 30 yr/ Insurance Exp./ Male/ Female. Cont: 98494 21277.

రాజమండ్రి- మహిళలకు మాత్రమే. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, 9 am - 5 pm, శాలరీ + ఇన్సెంటివ్, అనుభవం అవసరం లేదు. Contact Cell: 73969 46490.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. ✆ 96402 58899, 96404 68899

WANTED: సేల్స్ & సర్వీస్ మేనేజర్ - కార్ షోరూమ్‌లో అనుభవం కనీసం 2 సంవత్సరాలు. డెమో ఎగ్జిక్యూటివ్‌లు, సేల్స్ & సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్ (Female), సీనియర్ మెకానిక్స్ కావలెను. రాజమండ్రి, తుని, జగ్గంపేట, మండపేట, రావులపాలెం. Contact Cell: 97033 34844, 63019 19238.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
SHRIRAM Finance
ప్రధాన కార్యాలయం : లెవెల్ - 3, ఓక్‌హార్ట్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, (బాంద్రా ఈస్ట్), ముంబాయి - 400051. ఫోన్ : 022-42410400, 022-40603100, వెబ్‌సైట్ : http://www.shriramfinance.in./auction
జోనల్ కార్యాలయ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం. 22బి-13-8, 2వ ఫ్లోర్, వెంకట రామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002 మరియు బ్రాంచ్ ఆఫీస్ : పాలకొల్లు

అనుబంధం - IV-A (రూల్ 9(1) యొక్క నిబంధనను చూడండి) స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) r/w 9(1) నందలి నిబంధనతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు తెలియజేయునది ఏమనగా "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడిన / ఛార్జి చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"(గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది) యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనపర్చుకోబడినవి మరియు పట్టికలో ఇవ్వబడిన విధంగా సదరు ఋణగ్రహీతలు మరియు గ్యారంటర్ల నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క మిగతా బకాయిని రాబట్టుకొనుటకు తేది.31-12-2025న ఉ॥ 11.00 గం. నుండి మ.1.00 గం. మధ్య ఇ-వేలంలో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే" ప్రాతిపదికన విక్రయించబడును. ఋణగ్రహీతలు మరియు గ్యారంటర్ల వివరాలు, బకాయి సొమ్ము, స్థిరాస్తి సంక్షిప్త వివరం మరియు తెలిసిన ఎన్‌కంబరెన్స్‌లు, స్వాధీనత రకం, రిజర్వు ధర మరియు ధరావతు మరియు పెంపుదల దిగువనీయబడినవి :

ఋణగ్రస్తులు/సహ ఋణగ్రస్తులు / గ్యారంటీదారులు / మార్టిగేజిదారుల పేరు	తేది & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	స్వాధీనం తేది & విధం	ఆస్తి వివరాలు (శ్రీ కుంపట్ల సత్తిరాజు గారికి చెందినది)	ఎర్నెస్టు మనీ డిపాజిట్ వివరాలు (ఇఎండి) వివరాలు	వేలం జరిగే తేది & సమయం	సంప్రదించబడాల్సిన వ్యక్తి మరియు తనిఖీ తేది
1. వేమన సతీష్, తండ్రి: సత్యనారాయణ, డి.నెం.2-9-1, మెయిన్ రోడ్డు, వినాయక గుడి దగ్గర, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా – 533250. 2. వేమన కృష్ణ కుమారి, భర్త : సతీష్, డి.నెం.2-9-1, మెయిన్ రోడ్డు, వినాయక గుడి దగ్గర, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా – 533250. 3. పలివెల నవీన్, తండ్రి : రాంబాబు, డి.నెం.1-70, నిడమర్రు, పశ్చిమ గోదావరి జిల్లా – 521324. 4. కుంపట్ల ఏసుబాబు, తండ్రి : ఏసు ప్రసాద్, డి.నెం.2-96, మరిపూడు, వినాయక గుడి దగ్గర, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా – 533250. 5. కుంపట్ల సత్తిరాజు, తండ్రి : సూర్యనారాయణ, డి.నెం.2-96, మరిపూడు, వినాయక గుడి దగ్గర, సఖినేటిపల్లి, తూర్పు గోదావరి జిల్లా – 533250.	చెల్లించాల్సిన మొత్తం రూ.73,83,960/- (అక్షరాల డెబ్బై మూడు లక్షల ఎనభై మూడు వేల తొమ్మిది వందల అరవై రూపాయలు మాత్రమే) తో పాటు ఋణ ఒప్పందం నెం. PALKLTF2110310001 ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి బకాయిపడిన తదుపరి వడ్డీ ప్లస్ చార్జీలు డిమాండ్ నోటీసు తేది : 20.12.2023	01-11-2024 భౌతిక స్వాధీనం ఏవైనా ఎన్‌కంబరెన్స్‌లు : తెలీదు ముందస్తు అమ్మకం ప్రకటన తేది : 11.01.2025	తూర్పు గోదావరి జిల్లా, మలికిపురం సబ్ డిస్ట్రిక్ట్, సఖినేటిపల్లి మండలం, మోరిపోడు గ్రామ పంచాయితీ, మోరీ గ్రామ ఖాతాలో ఆర్.ఎస్.నెం.243/2 లోని ఎ.0.21 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో ఎ.0.04 సెంట్లు లేదా 193.6 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో డి.నెం.2-67తో ఉన్న ఆర్‌సిసి భవనంతో గల జిరాయితీ మెట్ట భూమి. హద్దులు: తూర్పు: కొనుగోలుదారుని భూమి, దక్షిణం : కొనుగోలుదారుని భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం : మువ్వర్తి విక్రమార్కరావు గారి భూమి. రిజర్వు ధర మొత్తం : రూ.48,89,000/- ఇఎండి మొత్తం : రూ.4,88,900/- బిడ్ పెంపుదల : రూ.25,000/- మరియు అలాంటి గుణిజాల్లో గల పెంపుదల. ఇఎండి సమర్పించుటకు చివరి తేది : 29-12-2025, సమయం : ఉ॥ 10.00 గం॥ల నుంచి సా॥ 5.00 గం॥ల వరకు	క్రింద ఇక్కడ వివరించిన ఖాతా వివరాలకు RTGS/ NEFT ద్వారా జమ చేయాల్సిన ఇఎండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట బ్యాంకు పేరు : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, ముంబయి (MH). ఖాతా నెం: 230010200005265, IFSC కోడ్ : UTIB0000230	31 డిసెంబరు, 2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుంచి మ॥ 1.00 గం॥ వరకు	అధీకృత అధికారి శ్రీ ఆర్. పెద్దబ్బాయి, 9652519891 కె. వై. విఘ్నేశ్వరరావు, 8047244674 కస్టమర్ కేర్ : 022 -40081572 ఆస్తి తనిఖీ చేయు తేది : 27-12-2025, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు

ఇ-వేలం తేది అనగా ఇ-వేలం ప్రక్రియ ప్రారంభమైనప్పుడు లేదా ముందు తేది.31-12-2025లోగా పైన తెలిపిన మొత్తముతోపాటు చెల్లింపు తేదీనాటికి వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవల్సిందిగా లేని యెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని తెలియజేస్తున్నాము.
ఆసక్తి గల బిడ్డర్లకు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను రూపొందించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొ॥ వాటి కొరకు సంప్రదించండి మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి అసద్ ఖాన్, మొబైల్ నెం.: 7128695102, శ్రీ గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం.9833922941, Mr. GAURAV NAMBOODIRI <gaurav.n@samil.in> మరియు ఆస్తికి సంబంధించిన వివరముల కొరకు ఆఫీస్ పని వేళలలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, శ్రీ ఆర్. పెద్దబ్బాయి, మొబైల్ నెం.9652519891 నందు సంప్రదించగలరు.
బకాయి శేషం ఏదేని ఉన్నచో ఏ కారణం చూపకనే తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ "శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్" యొక్క వెబ్‌సైట్ (https:// eauctions.Samil.in/home) పై నిర్వహించబడును. టెండరు దాఖలు / బిడ్ ఫారం పొందు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడండి. అమ్మకం యొక్క నియమ నిబంధనల వివరాలకై "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడండి.
గమనిక : "ఇందుమూలముగా తెలియజేయునదేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" లో విలీనమైనది. తర్వాత 30-11-2022 తేదీనాటి పేరు మార్పుననుసరించి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడినది.
ప్రదేశం : ఏలూరు, తేది : 27-11-2025 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
SHRIRAM Finance
నమోదిత కార్యాలయం: శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction
కార్యాలయ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డి.నెం. 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101 మరియు శాఖ కార్యాలయం రాజమండ్రి-2

శ్రీ వాకపల్లి రాజు కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

తేది.17.09.2025 నాటి ఉద్దేశిత అమ్మకం ప్రకటన 30 రోజుల గడువు ముగిసినందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9(1) తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన ఇప్పుడు జారీచేయడమైనది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) తో చదువబడు సదరు చట్టం 54/2002 లోని సెక్షన్ 13(8) ప్రకారం మీ విముక్తి హక్కును వినియోగించుకోవడంలో మీరందరూ విఫలమైనందున, ఇ-వేలం విక్రయానికి ఈ నోటీసు జారీ చేయబడింది. ఇది ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు / సహ-దరఖాస్తుదారులు / సహ-ఋణగ్రహీతలకు తెలియజేయడమైనది.
1. వై.జి.దేవ్ & కో తరపున మేనేజింగ్ పార్టనర్: యర్ర గురుదేవులు, తండ్రి: శ్రీరామ్ మూర్తి, డి.నెం.28-9-6బి/4, సమాచార భవనము, జాంపేట, గణేష్ చౌక్ దగ్గర, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (ఋణగ్రహీత)
2. యర్ర గురుదేవులు, తండ్రి: శ్రీరామ్ మూర్తి, బిజినెస్, డి.నెం.73-18-19/1, బ్లాక్ నెం.ఎ1, సాయి టవర్స్, ఎవి అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
3. వాకపల్లి లత, భర్త: రాజు, ఆర్కిటెక్చర్ బిజినెస్, డి.నెం.23-15-4/3/1M, ఫ్లాట్‌నెం.401, 4వ అంతస్తు, మార్కెట్ యార్డ్ దగ్గర, వసుధ ఎన్‌క్లేవ్, సుభాష్ నగర్, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
4. వాకపల్లి రాజు, తండ్రి: వీరన్న, టీచర్, డి.నెం.23-15-4/3/1M, ఫ్లాట్ నెం.401, 4వ అంతస్తు, మార్కెట్ యార్డ్ దగ్గర, వసుధ ఎన్‌క్లేవ్, సుభాష్ నగర్, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
5. యర్ర పద్మావతి, భర్త: యర్ర గురుదేవులు, బిజినెస్, డి.నెం.73-18-19/1, బ్లాక్ నెం.-A1, సాయి టవర్స్, ఎవి అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
1. మేము M/s.శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్"గా పిలువబడేది), ఎన్‌సిఎల్‌టి చెన్నై, తేది.9-11-2022, C.P. No: 69-76 ఆఫ్ 2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది మరియు పేరు మార్పుననుసరించి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ యొక్క రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ద్వారా ధ్రువీకరించబడిన ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్చబడినది. కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ చేయబడింది, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి ఆర్‌బిఐ లో నమోదు చేయబడింది. అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డి.నెం. 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101 మరియు శాఖ కార్యాలయం రాజమండ్రి-2 (ఇకపై కంపెనీ/రుణదాతగా సూచిస్తారు) వద్ద కలిగి ఉన్న మేము దిగువ తెలిపిన విధంగా నోటీసు మీకు జారీచేస్తున్నాము.
2. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌చే మంజూరు చేయబడిన రుణ ఖాతా నెం. RAJA4TF1903290009 లోని బకాయి రూ.58,30,020/- (అక్షరాల యాభై ఎనిమిది లక్షల ముప్పై వేల ఇరవై రూపాయలు మాత్రమే), వర్తించు తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించమని మిమ్ములను కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "SARFAESI చట్టం"గా సూచిస్తారు) లోని సెక్షన్ 13(2) క్రింద 30.01.2023 తేదీ గల డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. డిమాండ్ చేసిన మొత్తాన్ని చెల్లించడంలో మీరు నిర్లక్ష్యం చేసినారు మరియు విఫలమయ్యారు.
3. దాని పర్యవసానంగా, సెక్యూర్డ్ క్రెడిటార్ SARFAESI చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సెక్షన్ 13(4) క్రింద తేది 01.08.2023 గల నోటీసును జారీచేసినారు, తదనుగుణంగా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తులను రాజమహేంద్రవరంలోని గౌరవనీయ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి-కమ్-చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ద్వారా అడ్వకేట్ కమిషనర్‌గా నియమించబడిన అడ్వకేట్ కమిషనర్ సహాయంతో 04.03.2024 తేదీన స్వాధీనం చేసుకున్నారు. దిగువ వివరించిన హామీ గల స్థిరాస్తులను బహిరంగ వేలం మరియు/లేదా చట్టం మరియు రూల్స్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం సూచించిన ఇతర పద్ధతుల ద్వారా విక్రయించాలని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతిపాదిస్తుంది. తేది.30.01.2023 నాటి డిమాండ్ నోటీసులో సూచించిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రావల్సిన బకాయి రూ.58,30,020/- (అక్షరాల యాభై ఎనిమిది లక్షల ముప్పై వేల ఇరవై రూపాయలు మాత్రమే) మరియు వర్తించు తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, న్యాయపరమైన మరియు ఇతర యాదృచ్ఛిక ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు చట్టం మరియు రూల్స్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం ఈ నోటీసు పత్రికా ప్రచురణ తేది నుండి 30 రోజుల వ్యవధితో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే & అక్కడ ఏముందో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ బహిరంగ ఇ-వేలం ద్వారా దిగువ ఆస్తిని విక్రయించబడును.

ఋణగ్రహీతల యొక్క పేరు / సహ-ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు	తేది & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	వాకపల్లి రాజుకి సంబంధించిన ఆస్తి యొక్క వివరణ	ధరావత్తు (EMD) జమచేయు వివరములు	వేలం తేది & సమయం	సంప్రదించబడాల్సిన వ్యక్తి మరియు తనిఖీ తేది
1. వై.జి. దేవ్ & కో 2. యర్ర గురుదేవులు 3. వాకపల్లి లత 4. వాకపల్లి రాజు 5. యర్ర పద్మావతి	చెల్లించాల్సిన మొత్తం రూ.58,30,020/- (అక్షరాల యాభై ఎనిమిది లక్షల ముప్పై వేల ఇరవై రూపాయలు మాత్రమే) వడ్డీ, వ్యయాలు, ఖర్చులు, చట్టబద్ధ మరియు అన్ని అనుషంగిక ఖర్చులు. రుణ ఒప్పందం నెం. RAJA4TF1903290009 డిమాండ్ నోటీసు తేది: 30.01.2023	తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం సబ్-జిల్లా, పెద్దాపురం మండలం, పెద్దాపురం మునిసిపాలిటీ ఏరియా, పెద్దాపురం గ్రామము, వార్డు నెం.17, కొత్త వార్డు నెం.15, కొండయ్యపేట, యానాదిగూడెం స్ట్రీట్, బృందావన కాన్వెంట్ ఆర్‌సిసి బిల్డింగ్ మరియు పూరిల్లు, డి.నెం. 1-4-3బి, అసెస్‌మెంట్ నెం. 1062006835 నందు 383 చ॥గ॥ లేదా 320.23 చ॥మీ॥ స్థలము. దీనికి హద్దులు: తూర్పు: లంకా దయానిధికి చెందిన గోడ-56.0 అ॥; దక్షిణం: రాజావీధి-61.6 అ॥; పడమర: బోరా అచ్చియమ్మ యొక్క ఇల్లు-56.0 అ॥; ఉత్తరం: రాజావీధి-61.6 అ॥. ఈ పై హద్దుల మధ్యలోని 383 చ॥గ॥ లేదా 320.23 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందలి ఆర్‌సిసి భవనము. (రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ నందు తనఖా ఆస్తి దస్తావేజు నెం.3404/2019 మరియు పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ నందు విక్రయ దస్తావేజు నెం. 46/2003 ప్రకారము ఆస్తికి అనుగుణంగా)	EMD ని DD ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట జమచేయవలెను బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచి: బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ముంబయి- 400710, ఖాతా నెం. 230010200005265, IFSC కోడ్: UTIB0000230	30-12-2025 సమయం: ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు	డి.రామ్‌మోహన్ సంప్రదించవలసిన నెం. 9849824075 సిహెచ్. శ్రీనివాసరావు సంప్రదించవలసిన నెం. 9959912922 కస్టమర్ కేర్ 022-40081572 ఆస్తి తనిఖీ చేయు తేది: 27-12-2025 సమయం: ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు

రిజర్వుధర మొత్తం: రూ.44,29,100/- (అక్షరాల నలభై నాలుగు లక్షల ఇరవై తొమ్మిది వేల ఒక వంద రూపాయలు)
ఇఎండి మొత్తం: రూ.4,42,910/- (అక్షరాల నాలుగు లక్షల నలభై రెండు వేల తొమ్మిది వందల పది రూపాయలు)
బిడ్ పెంపుదల: రూ.10,000/- మరియు అలాంటి గుణిజాల్లో గల పెంపుదల
ఇఎండి సమర్పించుటకు చివరి తేది: 29.12.2025, సమయం: ఉ॥ 10.00 గం॥ల నుంచి సా॥ 5.00 గం॥ల వరకు

ఇ-వేలం తేది అనగా 30.12.2025 లోగా పైన తెలిపిన మొత్తముతో పాటు చెల్లింపు తేదీనాటికి అగు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవల్సిందిగా లేనియెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని మరియు బకాయి శేషం ఏదేని ఉన్నచో అది వడ్డీ మరియు వ్యయంతో రాబట్టుకోబడునని ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు ఇందుమూలముగా ప్రకటించడమైనది.
ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవడానికి, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్‌ను సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ, మొదలైనవాటిలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ వారిని సంప్రదించవచ్చును. పేరు: శ్రీ గౌరవ్ నంబూదిరి, ఫోన్ నెం.9833922941, Email id: gaurav.n@samil.in మరియు ఆస్తికి సంబంధించిన వివరాలు కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి డి.రామ్‌మోహన్ గారిని ఫోన్: 9849824075 నందు ఆఫీసు పనిదినములలో పనివేళల నందు సంప్రదించవచ్చును.
ఎట్టి కారణములు చూపకుండానే ఏదేని లేదా అన్ని బిడ్లను తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ (https://eauctions.Samil.in/home) పై నిర్వహించబడును. టెండరు దాఖలు/ బిడ్ ఫారం పొందుటకు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు. అమ్మకం యొక్క పూర్తి నియమనిబంధనల వివరాలకై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు.
ప్రదేశము: రాజమండ్రి, తేది: 27.11.2025 — సం/-అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ఆత్రేయపురం: సమస్యల పరిష్కారంలో భాగంగా ఆత్రేయపురం మండల పరిషత్తు కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ గురువారం తెలిపారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

ఫిజియోథెరపీ సేవల పరిశీలన

పి.గన్నవరం: భవిత కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారుల కోసం కేటాయించిన ఫిజియోథెరపిస్ట్ సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సమగ్రశిక్షా అకడమిక్ మోనిటరింగ్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్ వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించారు.

ఎన్నికల విధానం.. విద్యార్థుల ఉత్సాహం

మాక్ ఓటింగ్ నిర్వహణ

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరులోని జొన్నాడ జయశ్రీ జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులు మాక్ ఎన్నికల పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని కె.రమ ఆధ్వర్యంలో విద్యార్థులు బ్యాలెట్ బాక్సులో ఓటు వేసి అవగాహన పొందారు. ఉపాధ్యాయులు మాచరరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

వీధి దీపాలు వెలిగాయి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వద్దిపర్రులో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచి జజ్జవరపు శ్యామల దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్తు లైనుకు మరమ్మతులు చేయించారు.

రావులపాలెం పట్టణం: రావులపాలెంలోని శ్రీనివాసనగర్‌లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

పైపులైన్‌కు మరమ్మతులు

మామిడికుదురు: ఆదుర్రు ప్రధాన కూడలిలోని రహదారి పక్కన తాగునీటి పైపులైన్ నుంచి నీరు లీకవుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచి బళ్ల శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

స్పందన

తాగునీటి ట్యాంకు శుభ్రం

ఈనాడు కథనాలకు స్పందన

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో 'ట్యాంకుల కలుషితం.. అందని శుద్ధజలం' శీర్షికన ఈ నెల 25న కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ ఆదేశాల మేరకు గురువారం 17 గ్రామాల్లో ఉన్న ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేయించారు.

విద్యుత్తు తీగలపై పాదుల తొలగింపు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కొమరాజులంక అగ్రహారం నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే రహదారి చెంతన ఉన్న విద్యుత్తు స్తంభం తీగలకు పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈ నెల 27న 'అల్లుకున్న పాదులు' శీర్షికన ఈనాడులో వార్త ప్రచురితం అయ్యింది. స్పందించిన విద్యుత్తుశాఖ ఏఈ నరేష్ సిబ్బందిని పంపించి వాటిని తొలగింపజేశారు.

మత్తుకు బానిస కావొద్దు..

సరదాలకు అలవాటుపడి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దంటూ కొత్తపేట ఎక్సైజ్ సీఐ కాత్యాయిని సూచించారు. గురువారం ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం ఆధ్వర్యంలో రావులపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఈమె పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది హాజరై అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణకుమార్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

యువత స్ఫూర్తి.. సేవలతో సంతృప్తి

– న్యూస్‌టుడే, సఖినేటిపల్లి, మలికిపురం

వైద్యచికిత్సకు చెక్కు అందిస్తున్న లిటిల్ హార్ట్స్ సంస్థ సభ్యులు

వారంతా యువకులు. ఉద్యోగాలు, వ్యాపారం, ఉపాధి నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆదాయంలో కొంతభాగం పుట్టి పెరిగిన ఊరి అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. సేవా సంఘాలుగా ఏర్పడి పేదలు, అన్నార్తులకు తోడ్పాటు అందిస్తున్నారు. ఐకమత్యంగా యువత స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

ఆర్థిక చేయూత

సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపల్లిపాలెంకు చెందిన అగ్నికుల క్షత్రియ యువకులు 86 మంది ఉపాధి కోసం కువైట్ వెళ్లారు. 'యువ పల్లవ సేన అగ్నికుల క్షత్రియ' సేవా సంఘాన్ని 2015లో ఏర్పాటు చేసుకున్నారు. కరోనా సమయంలో రూ.3.5 లక్షలతో పేదలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేయడమే కాకుండా ఆ సమయంలో మృతిచెందిన కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబానికి వంద కిలోల బియ్యం పంపిణీ చేస్తుంటారు. రూ.5 లక్షల వ్యయంతో శ్మశానవాటికలో విశ్రాంతి భవనం, దహనవాటిక తదితర సౌకర్యాలు సమకూరుస్తున్నారు.

అంతర్వేదిపల్లిపాలెం శ్మశానవాటికలో నిర్మించిన విశ్రాంతి భవనం

లిటిల్ హార్ట్స్ పేరుతో..

కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన సుమారు 50 మంది కలిసి లిటిల్ హార్ట్స్ సేవా సమితిగా ఏర్పడ్డారు. 2016 నవంబరు 18న సంస్థను ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం, జీవనోపాధి కోసం మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు వంటివి సమకూరుస్తున్నారు. కరోనా సమయంలో పలు గ్రామాల్లో నిత్యావసర సరకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు సుమారు రూ.30 లక్షలతో వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు రామారావులంకకు చెందిన ఓ సభ్యుడు చెప్పారు. నెల నెలా కొంత నగదును సంస్థ పేరున ఉన్న ఎన్జీవో ఖాతాకు జమ చేస్తుంటారు. స్నేహితుల కుటుంబాల్లో జరిగే పెళ్లిళ్లు, పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఇచ్చే విరాళాల ద్వారా సమకూరిన ఆర్థిక వనరులతో సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.

కొత్తపేటలో ఉద్యోగ మేళా రేపు

కొత్తపేట, న్యూస్‌టుడే: అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో కొత్తపేట కాపు కల్యాణ మండపంలో శనివారం 11 కంపెనీలతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 600 పైగా ఉద్యోగ అవకాశాలతో ఈ మేళా నిర్వహిస్తున్నారని, జిల్లాలో నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ చదివిన వారు బయోడెటా, ఆధార్ కార్డు, తదితర నకలు తీసుకురావాలన్నారు. సందేహాలకు 99511 79021 నంబరును సంప్రదించాలని తెలిపారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

సంధిపూడిలో రైతుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, సఖినేటిపల్లి: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు అన్నారు. ఆలమూరు మండలం సంధిపూడిలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సాహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్నదాతలు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలన్నారు. పురుగుమందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ● రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజోలు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, వీవీమెరక, అంతర్వేదిపాలెంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల నుంచి సమస్యలపై వినతి పత్రాలను తీసుకున్నారు.

లోకేశ్‌ను కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు

రాజోలు, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను రాజోలు మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగిరెడ్డి గోపి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పరిస్థితుల గురించి ఆయన ఆరా తీశారు. ప్రభుత్వం యువతకు కల్పిస్తున్న ఉద్యోగ కల్పన, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారన్నారు.

ఆదాయ వ్యయాలపై స్పష్టత అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఆదాయ వ్యయాలపై స్పష్టత ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ మల్లిబాబు అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా చేయాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మంజూరైన తాగునీటి ట్యాంకుల నిర్మాణం శరవేగంగా చేయాలని, రోడ్లపై పశువుల బెడద లేకుండా వాటిని ఒకచోట పెట్టేలా చూడాలని, లోవోల్టేజీ సమస్య రాకుండా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వెల్‌నెస్ కేంద్ర నిర్మాణాలపై ఆరాతీశారు. గత కొంతకాలం నుంచి జరుగుతున్న సమావేశాల్లో సమీక్షలు సక్రమంగా చేయడం లేదని, నిధులు ఇవ్వడంలో తారతమ్యం చూపిస్తున్నారని పలువురు సభ్యులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులకు పవన్ భరోసా ఇచ్చారు

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గంలో బుధవారం జరిగిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతం కావడం పట్ల రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. కేశనపల్లిలో జరిగిన ముఖాముఖిలో రైతుల ఆవేదనను పవన్‌కల్యాణ్ అర్థం చేసుకున్నారన్నారు. కొబ్బరి చెట్లు నాశనమై దిగాలుగా ఉన్న వారికి భరోసా కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. పల్లె పండగ 2.0 ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయన్నారు.

పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ఆలమూరు, న్యూస్‌టుడే: పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం సంధిపూడిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. కాపు కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కపోతేశ్వరస్వామికి పవళింపు సేవ

రాజోలు, న్యూస్‌టుడే: కడలిలోని కపోతేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవళింపు సేవ గురువారం రాత్రి నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అన్ని రంగాల్లో పట్టుసాధించాలి

రావులపాలెం పట్టణం: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ పట్టు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈవో శ్రీనివాసరాజు అన్నారు. రావులపాలెంలోని మండల పరిషత్తు కార్యాలయంలో చైతన్య పాఠశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ నాసా కాంటెక్ట్ కిట్లను ఎంఈవో అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక వైఖరిని, ఆసక్తిని పెంపొందించడంలో ఇవి దోహదపడతాయన్నారు. ఆర్ఐ నరేష్, ప్రిన్సిపల్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రైతుసేవా కేంద్రం

కేశనపల్లిలో రైతు సేవా కేంద్రం అసంపూర్తిగా నిలిచింది. ఇంకా పనులు మిగిలి ఉండగానే గత మార్చి నెలలో హడావుడిగా ప్రారంభించేశారు. కిటికీలు, టైల్స్, ఇతర పనులు మిగిలపోయాయి. ప్రస్తుతం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. దీనిపై స్థానిక పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి తగు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

హెచ్చరిక సూచికలేవీ..?

ఆత్రేయపురం నుంచి లొల్ల వెళ్లే ర.భ రోడ్డులో ఉన్న మలుపుల్లో హెచ్చరిక సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం ఈ రహదారి మీదుగా వేలాది మంది భక్తులు వాడపల్లి రాకపోకలు సాగిస్తుంటారు. సమస్యను ర.భ.శాఖ డీఈ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

మామిడికుదురులోని నూకాలమ్మ ఆలయ సమీపంలో పంటకాలువ మధ్యలో ఉన్న తాగునీటిని సరఫరా చేసే ప్రధాన గొట్టం వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో పారుదల మందగించడంతో పాటు దుర్గంధభరితంగా తయారైంది. ఇక్కడ క్రమేణా డొంకలు పెరిగి ఇరువైపులా అస్తవ్యస్తం కావడంతో ఇబ్బందులు తీవ్రంగా మారుతున్నాయి. దీనికి సంబంధించి అవసరమైన చర్యలు చేపడతామని మంచినీటి విభాగం ఏఈఈ జయశ్రీ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

వేలాడుతున్న విద్యుత్తు తీగలు

అయినవిల్లిలంక పంచాయతీ పరిధి ముక్తేశ్వరం రేవు రహదారిలో దుర్గమ్మ ఆలయం ఎదురుగా విద్యుత్తు తీగలు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. రాకపోకల సమయంలో స్థానిక రైతులు, పశువులు అనుకోకుండా తాకితే ప్రమాదం సంభవిస్తుంది. పరిశీలించి సరిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణమూర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

ప్రారంభించకుండానే శిథిలం

చింతనలంక గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరింది. సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు సకాలంలో పూర్తికాలేదు. దీంతో గుత్తేదారుడు అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం తలుపులు, గుమ్మాలు చెదలు పడతున్నాయి. చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. అధికారులు వినియోగానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు: జేసీ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బంది లేకుండా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి వెల్లడించారు. గురువారం పి.గన్నవరంలోని వివిధ శాఖలకు సంబంధించి పనితీరుపై ఆకస్మిక తనిఖీ చేశారు. ముంగండపాలెంలో భూరీసర్వే ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం రేషన్ డిపోలో సరకుల నిల్వ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోతవరంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలుపై సిబ్బందితో మాట్లాడారు. విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం ఇచ్చిందన్నారు. ఇంతవరకు 1,20,246 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఆలస్యం లేకుండా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయన్నారు. మొదటి విడతలో 17, రెండో విడతలో 29 గ్రామాల్లో భూరీసర్వే పూర్తయ్యిందన్నారు. మూడో విడతలో 28 గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతుందని వెల్లడించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎ.డి.ఎ. సి.హెచ్.డి.విజయకుమార్, మండల సర్వేయర్ జె.కె.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

జగన్మోహనుడి సేవలో కేంద్ర డిప్యూటీ కార్యదర్శి

భట్టాచార్య దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఛైర్మన్

ర్యాలి(ఆత్రేయపురం), కొత్తపేట, న్యూస్‌టుడే: ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామిని గురువారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ డిప్యూటీ కార్యదర్శి కేకే అనురూప్ భట్టాచార్య దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు స్వామివారి జ్ఞాపిక బహూకరించారు. ఈవో బీవీ రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరం భట్టాచార్య దంపతులు మందపల్లి మందేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

అంతర్వేదిలో సినీ నటుల పూజలు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని సినీ నటులు రాజీవ్ కనకాల, బెల్లంకొండ ప్రవీణ్, జబర్దస్త్ అశోక్‌లు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అర్చకులు వేదాశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు. ఆలయ ఏసీ నాగవరప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

సుబ్బారావు కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

వాడపల్లి (ఆత్రేయపురం), మామిడికుదురు, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన ఆవాల వెంకట సుబ్బారావు, వీరవెంకట లక్ష్మి దంపతులు, ఇషాన్వి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని గురువారం సమర్పించారు. వీరికి దేవస్థానం వేదపండితుడు స్వామివారి చిత్రపటం అందజేసి అభినందించారు. ● అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలోని అన్నప్రసాద ట్రస్టుకు పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన మద్దుల సుబ్బారావు, స్వర్ణలత దంపతులు, కుటుంబ సభ్యులు రూ.54,099 విరాళాన్ని సమర్పించారు.

చక్కని ఆలోచనలతో అత్యుత్తమ ఫలితాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: విద్యార్థులు చక్కని ఆలోచనతో పురోగమిస్తే అన్నింటా అత్యుత్తమ ఫలితాలు వస్తాయని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. ఈదరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం, హస్తకళలు, వైవిధ్యమైన కళాత్మక రూపకల్పనలకు సంబంధించి గురువారం ఏర్పాటైన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. వీటి వల్ల విద్యార్థుల్లో మరింత సృజనాత్మకత పెరుగుతుందన్నారు. వివిధ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయ అధికారిణి జి.మమ్మీ, సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం, డీవైఈవో సూర్యప్రకాశం, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబా, చిత్రలేఖన, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, బి.సరస్వతి పాల్గొన్నారు.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఈవో సలీంబాషా

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

మలికిపురం: కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేద్దామని అఖిల భారత కాంగ్రెస్ జాతీయ కిసాన్‌సెల్ అధ్యక్షుడు, ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేశ్‌శుక్లా పిలుపునిచ్చారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులుగా కొత్తవారిని నియమిస్తున్న క్రమంలో కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక పులే-అంబేడ్కర్ సామాజిక భవనంలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు జంగా గౌతమ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా కొత్త వారిని ఎన్నుకోడానికి అభిప్రాయాలు తెలపాలని సూచించారు. రాష్ట్రం, కేంద్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు శుక్లాను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మరో ఇద్దరు పరిశీలకులు ముళ్లపూడి రాంబాబు, అరిగెల అరుణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సరెళ్ల ప్రసన్నకుమార్, నాయకులు తోటే ప్రతాప్, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేశ్ శుక్లా

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటెప్పుడు?

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు రెండున్నర దశాబ్దాలుగా కార్యరూపం దాల్చడం లేదు. దీనికోసం పదేళ్ల క్రితమే పోతవరం ప్రధాన రహదారి చెంతన ప్రభుత్వ స్థలం గుర్తించారు. గత ప్రభుత్వంలో ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. గెయిల్ సంస్థ ఒక అగ్నిమాపక శకటాన్ని మంజూరు చేసింది. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భవనం నిర్మించేందుకు వీలుపడలేదు. రూ.1.20 కోట్లు మంజూరు చేస్తున్నట్టు అప్పట్లో హడావుడిగా ప్రకటించడంతో పోతవరం వద్ద ప్రభుత్వ స్థలంలో ఉన్న రెండు శిథిల షెడ్లు కూడా తొలగించారు. సిబ్బందిని కూడా కేటాయించలేదు. అంతా కాగితాల్లోనే చూపించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అగ్నిమాపక కేంద్రం గురించి, వైకాపా చేసిన నిర్వాకాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. నిధులు, సిబ్బందిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇది జరిగి ఏడాది కావస్తుంది. ఇంకా నిధులు విడుదల కాలేదు.

ఇబ్బందులు ఇలా..

పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజోలు, అమలాపురం, కొత్తపేట కేంద్రాలపై ఆధార పడాల్సి వస్తోంది. అంతదూరం నుంచి శకటం వచ్చేసరికి సమయం మించిపోయి ఆస్తి నష్టం పెరిగిపోతుంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సంబంధించి మూడేళ్ల క్రితం గెయిల్ సంస్థ ఒక శకటాన్ని సమకూర్చింది. దీనిని రాజమహేంద్రవరంలో ఉంచాం. భవనం నిర్మించేందుకు రూ.1.20 కోట్ల నిధులు కావాలి. ఒక అధికారి, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది సిబ్బంది అవసరం. ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకెళ్లాం.

- ఎన్.పార్థసారథి, జిల్లా అగ్నిమాపకాధికారి

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం
వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా.

బహిరంగ వేలం/ సీల్డ్ టెండరు ప్రకటన

డా. బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానము నందు పార్కింగ్ ప్రదేశము నందు తాత్కాలిక షాపులు 10x10x10 కొలతలతో మూడు సంవత్సరాల కాలపరిమితికి అనగా ది. 01-01-2026 నుండి ది.31-12-2028 వరకు. ది. 11-12-2025 గురువారం బహిరంగ వేలం, బాక్స్ టెండరు నిర్వహించబడును.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు	పాట వివరములు
1	పార్కింగ్ ప్రదేశము నందు తాత్కాలిక షాపులు 10x10x10 కొలతలతో షాప్ నెం. 28, 35, 38, 39, 40, 41, 45, 49, 54, 56, 62, 63, 66, 67, 68, 69, 70, 75, 76,47,48,74,77,95,97 మరియు జ్యూస్ షాప్ నెం.8	50,000/-	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం॥ 10.00 బహిరంగ వేలం: ది.11-12-2025 ఉదయం గం॥ 11.15 బాక్స్ టెండరు తెరుచు సమయం: ది. 11-12-2025 ఉదయం గం 11.45

ముఖ్య షరతులు :
1) ధరావతును - Tender Deposit, The Executive Officer, Sri Venkateswara Swamy Temple, Vadapalli పేరున ఏదైనా జాతీయ బ్యాంకు నుండి D.D. తీసి జతపర్చవలెను. మిగతా వివరములకు సంప్రదించవలసిన ఫోన్ No:08855-271888, Whatsapp: +91-9491000085.
2) టెండరు షెడ్యూలు ది. 05-12-2025 నుండి ది. 10-12-2025 సా. 5.00 వరకు మాత్రమే ఆఫీసు పనిచేయు వేళల్లో దేవస్థానం ఆఫీసు నందు రూ. 500/- రుసుము చెల్లించి పొందగలరు.
3) పూర్తి షరతులు కార్యాలయము నందు పొందవలెను.

తేది: 27-11-2025,
స్థలం: వాడపల్లి

నల్లం సూర్య చక్రధరరావు
డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పల్లంకుర్రులో నూతనంగా నిర్మిస్తున్న ఉపవిద్యుత్తు కేంద్రానికి టవర్‌లైన్లు వేసేందుకు కాట్రేనికోన ఉపవిద్యుత్తు కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని అమలాపురం ఈఈ రాంబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్యాలయం ఏర్పాటు చేయాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: వివిధ ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయాన్ని అమలాపురంలో ఏర్పాటు చేయాలని ఏపీ దివ్యాంగుల మహా సంఘటన అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ కోరారు. ముమ్మిడివరంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం: టమాట - 42, వంకాయలు నలుపు - 54, వంకాయలు తెలుపు - 45, బెండకాయలు - 50, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 45, బీరకాయలు - 50, కాలిఫ్లవర్ -28, క్యాబేజీ - 38, క్యారెట్ - 55, దొండకాయలు - 35, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 26, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 35, చిక్కుడుకాయలు - 100, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్ - 52, కీరదోసకాయలు - 35, అల్లం - 75, క్యాప్సికం - 98, చిలకడదుంపలు - 50, గుమ్మడి -30, ఉసిరి - 80, ముల్లంగి - 45, కరివేపాకు -55, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70.

ఒక్కొక్కటి చొప్పున: అనబకాయ - 30, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -12, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 25, కొబ్బరికాయ - 25.

సమావేశంలో కౌన్సిలర్లు (అంతర చిత్రం) మున్సిపల్ ఛైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

ప్రజా సమస్యలు పట్టవా..?

అధికారులపై కౌన్సిలర్ల ధ్వజం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 16 అంశాలను, రూ.80 లక్షల సాధారణ నిధులతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. పట్టణంలో మంచినీటి సమస్య అధికంగా ఉందని, పారిశుద్ధ్యం సరిగా లేదని, దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రం వినియోగించడం లేదని, రూ. కోట్ల విలువైన పనుల్లో ఒక్కటి చేయడం లేదని, అలాంటప్పుడు టెండర్లు పిలవడం ఎందుకని మున్సిపల్ అధికారులపై తెదేపా, జనసేన, వైకాపా కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. తెదేపా, జనసేన కౌన్సిలర్ల వార్డుల్లో 2023లో కౌన్సిల్ ఆమోదం పొందిన పనులను గుత్తేదారులు ఎందుకు చేయడం లేదని 5వ వార్డు తెదేపా కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. తమ వార్డులో కుక్కలను పట్టుకోవడానికి 350 బర్త్‌కంట్రోల్ శస్త్రచికిత్సలు చేసినట్టు ఎలా చెబుతారని జనసేన కౌన్సిలర్ పిండి అమరావతి ప్రశ్నించారు. పట్టణ ప్రజల కనీస అవసరాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులను మేమే వేయించామని యూనియన్ నాయకులు ప్రచారం చేస్తున్నారని, కౌన్సిలర్లు, నాయకులను దూషించారని వైకాపా కౌన్సిలర్ సంసాని చంద్రశేఖర్ అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైస్‌ఛైర్మన్‌లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

• సమస్యలు పరిష్కరిస్తాం • ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పి.రవివర్మ

ముఖాముఖి

ముమ్మిడివరం నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయి 14 ఏళ్లు గడిచినా అభివృద్ధి అంతంతమాత్రమే. నగర పంచాయతీ ఛాయలు కొన్ని వార్డులకే పరిమితం కాగా.. చాలా వార్డుల్లో గ్రామీణ వాతావరణమే ఉంది. పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి చేపట్టనున్న చర్యలను కమిషనర్ రవివర్మ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వివరించారు. ఆదాయం పెంపునకు కృషి చేసి.. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సహకారంతో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు.

ఆదాయం పెరిగింది..

నగర పంచాయతీ వార్షికాదాయం గతంలో రూ.1.02 కోట్లు ఉండేది. ప్రస్తుతం రూ.2.12 కోట్లకు తీసుకెళ్లాం. ఇప్పటికే రూ.1.35 కోట్లు వివిధ పన్నుల రూపంలో వసూలు చేసి ప్రగతి సాధించాం. నగర పంచాయతీలో 6,432 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఖాళీ స్థలాలు, ఇతర అసెస్‌మెంట్లను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకువచ్చాం. ఈ నిధులతో వార్డుల అభివృద్ధికి అవకాశం కలుగుతుంది.

కాలనీల అభివృద్ధికి కార్యాచరణ

నగర పంచాయతీలో కంసాలగరువు, సోమాలమ్మచెరువు, చవుడుపేట, అంబేడ్కర్ నగర్, జీఎంసీ బాలయోగి కాలనీ, జంగాల కాలనీ, జంగావారిపేట, మల్లాయపాలెం, మందబయలు మురికివాడలుగా గుర్తించాం. వీటిలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచనలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ప్రత్యేకంగా నిధులు ద్వారా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు

2023-24, 2024-25కు సంబంధించి ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి చొప్పున రూ.2 కోట్లు రాగా.. వాటిలో కౌన్సిల్ ఆమోదంతో రూ.36.20 లక్షలు విద్యుత్తు బిల్లులు చెల్లించాం. మిగిలిన వాటిని తాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనకు వెచ్చించాం. ఎంపీ నిధులు రూ.1.50 కోట్లతో 3, 19 వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించాం. ప్రస్తుతం 8వ వార్డులో రూ.32 లక్షలు సీసీ రోడ్డుకు నిధులు కేటాయించారు. ఎస్సీ సబ్ ప్లాన్‌లో రూ.కోటి నిధులు రాగా.. 2,3,5,9,10,15,20 వార్డుల్లో అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

మురుగు శుద్ధికి కార్యాచరణ

నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. కొత్తలంక రోడ్డులో చెత్త రోడ్డుమీదకు రాకుండా ఏర్పాట్లు చేశాం. డ్రెయిన్ల ద్వారా వచ్చే మురుగునీటిని శుద్ధి చేయడానికి నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డు చింతలమెరకలో రెండు ఎకరాల్లో సీడీఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటుకు కార్యాచరణ జరుగుతోంది. డ్రెయిన్లలో పూడిక తీత పనులు ఎప్పటికప్పుడు చేయిస్తున్నాం.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

ప్రమాణ స్వీకారానికి ర్యాలీగా పయనం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెటింగ్ ఛైర్‌పర్సన్‌గా గురువారం ప్రమాణస్వీకారం చేసిన ఒగూరి భాగ్యశ్రీకి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ప్రమాణస్వీకారానికి ముందుగా వేట్లపాలెంలోని ఆమె స్వగృహం నుంచి భారీ ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. కాట్రేనికోన గేటుసెంటరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు.

జిల్లాలో కొత్తగా 108 పోలింగ్ కేంద్రాలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 108 ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల పరిశీలన ప్రక్రియ చివరి దశకు చేరుకుందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ 42 శాతం పూర్తయ్యిందన్నారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివేక్ యాదవ్ దూరదృశ్య సమావేశం నిర్వహించి ఓట్ల నమోదు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న డీటీవో శ్రీనివాసరావు తదితరులు

డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ కళాశాల ద్వారా ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 12వ బ్యాచ్‌ను గురువారం ప్రారంభించారు. డ్రైవర్లు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన సూచించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.టి.పి.రాఘవకుమార్ మాట్లాడుతూ శిక్షణ సమయంలో డ్రైవింగ్‌తోపాటు మిగతా అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్.శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, గ్యారేజీ ఇన్‌ఛార్జి జీఆర్.ఎల్.దేవి, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌ఛార్జి ఎన్.వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ జీపీఎస్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో ఉదయభాస్కర్

ధాన్యం సేకరణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: రైతులు మాసూలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అడపా ఉదయభాస్కర్ సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన బిట్వా తుపాను ప్రభావం మన జిల్లాలో అంతగా ఉండదని.. అయినా రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను రైతు సేవా కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లాలో 204 కేంద్రాలకు 194 తెరిచినట్లు చెప్పారు. 2060 జీపీఎస్ కలిగిన వాహనాలు సిద్ధంగా ఉన్నాయని.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు వాహనాల ఇబ్బంది ఎక్కడా లేదన్నారు.

అపరిశుభ్రంగా ట్యాంకులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: చిర్రయానంలోని తుపాను రక్షిత భవనం ఆవరణలో ఉన్న నీటి ట్యాంకులపై మూతలు లేక లోపల నీరు నాచు పట్టి అధ్వానంగా తయారైంది. ఇలానే ఉంటే ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పునాది దశలో వదిలేశారు..!

ముమ్మిడివరం రాణేలంక రోడ్డులోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల్లో పునాది స్థాయిలో నిలిచిపోయిన భవనం ఇది. ఆరేళ్ల క్రితం ఎస్ఎస్ఏ నిధులు రూ.12 లక్షలతో చేపట్టిన ఈ నిర్మాణం పునాది స్థాయి వరకు పనులు చేసి వదిలేశారు. తర్వాత పట్టించుకోకపోవడంతో అక్కడ మొక్కలు మొలిచి.. ఊచలు తుప్పుపట్టి పాడైపోయాయి. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఎక్కడికి వెళ్లాలో తెలుసుకునేదెలా..?

అమలాపురం పురపాలక సంఘం కార్యాలయంలో ఇటీవల రూ.5 లక్షలతో పురుషులు, మహిళల కోసం రెండు మరుగుదొడ్లను నిర్మించారు. ఎవరు ఎక్కడికి వెళ్లాలో తెలిసేలా పేర్లు మాత్రం రాయలేదు. ఈ సమస్యను డీఈ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో పేర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

పూడిక తీశారు

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధిలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు దిగక ఇబ్బందులు పడుతున్నాం.
-పీవీవీ సత్యనారాయణ, స్థానికుడు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులో డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోవడంతో నీరు దిగక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
-సీహెచ్.సుబ్రహ్మణ్యం, స్థానికుడు

స్పందనకు వందనం

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని ఆసుపత్రి వీధి, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులోని మురుగుకాలువల పరిస్థితిని కమిషనర్ రవివర్మ దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు.
-న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమస్య: అమలాపురం పట్టణంలోని నల్లవంతెన నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో మురుగుకాలువపై పిచ్చిమొక్కలు పెరిగాయి. మురుగు ముందుకు వెళ్లే దారిలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
-రవికుమార్, స్థానికుడు

సమస్య: మద్దాలవారిపేటలో రోడ్డు దుమ్ము, ధూళి, పిచ్చిమొక్కలతో నిండి అపరిశుభ్రంగా తయారైంది. స్థానికులు, అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు.
-కళ్యాణ్‌చక్రవర్తి, స్థానికుడు

సమస్య: గాంధీబజార్ ప్రధాన రహదారి మురుగుకాలువలో పూడికలు తొలగించి అలాగే వదిలివేశారు. దుర్వాసన వస్తోంది. -ప్రభు, వ్యాపారి

సమస్య: అన్నబత్తులవారి వీధిలో చుట్టుపక్కల ప్రజలు రోడ్డుపై చెత్త వేస్తున్నారు.
-హుస్సేన్, వ్యాపారి.

పరిష్కారం: పట్టణంలో నల్లవంతెన, మద్దాలవారిపేట, గాంధీబజార్, అన్నబత్తులవారి వీధిలో సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వారు సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. రోడ్లపై, మురుగుకాలువలలో చెత్త, ప్లాస్టిక్‌వ్యర్థాలు వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.
-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

బిహార్‌లో తప్పిపోయి యానాం చేరిక

బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన అధికారులు

యానాం, న్యూస్‌టుడే: ఓ బాలుడు గిరియాంపేట కూడలిలో దిక్కుతోచని స్థితిలో తిరుగుతుండగా గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు విచారణ చేపట్టి బిహార్‌కు చెందినవాడిగా గుర్తించారు. ఆ రాష్ట్రంలోని రాజనగర్‌లో నివసిస్తున్న సాధువరం సాహు కుమారుడు ధరమ్‌జీ కుమార్ మానసిక పరిస్థితి సరిగా లేదు. అతడు 17 రోజుల క్రితం అమ్మతో కలిసి సంతకు వెళ్లి గ్రామంలో తప్పిపోయి అనూహ్యంగా యానాం చేరుకున్నాడు. అతడి చరవాణి ద్వారా ఛైల్డ్‌హెల్ప్‌లైన్ ఉద్యోగులు గ్రామంలోని తండ్రితో మాట్లాడారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ధరమ్‌జీ చిన్నాన్న ఉమేష్‌కుమార్ సాహు గురువారం యానాం వచ్చారు. పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ సమక్షంలో ఎస్సై పునీత్‌రాజ్, ఛైల్డ్‌లైన్ అధికారి సూరంపూడి రాజేంద్ర, దేవిశ్రీదేవి బృందం ధరమ్‌జీని అప్పగించారు.

ధరమ్‌జీని అప్పగిస్తున్న పోలీసులు, ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు

ప్రసంగిస్తున్న విద్యార్థిని ★ విజేతలతో సర్‌సీవీ రామన్ పాఠశాల ప్రిన్సిపల్ కేశవరావు, హెచ్‌ఎం శ్రీనివాసరాజా

ప్రతిభ చాటి.. బహుమతి పొంది

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

అమలాపురం పట్టణం: అమలాపురంలోని సర్‌సీవీ రామన్ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.కేశవరావు మాట్లాడుతూ చరవాణితో సమయం వృథా చేసుకుంటే చదువుపై ప్రభావం పడుతుందన్నారు. అనంతరం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బి.నిహారిక, కె.అశ్రిత, పి.హలని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్, ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసరాజా అందజేశారు.

కృత్రిమమేధతోనే భవిష్యత్తు

అమలాపురం గ్రామీణం: కృత్రిమ మేధతోనే భవిష్యత్తులో అనేక మార్పులు రానున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. కామనగరువులోని ది అమలాపురం డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. కృత్రిమ మేధ భవిష్యత్తులో వచ్చే మార్పులు అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కొలిశెట్టి జాజిశ్రీలక్ష్మీకాంతం, కుడుపూడి కిరణ్‌విష్ణుసాయి, పి.ప్రసాద్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు కళాశాల డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్, జి.వి.ఎస్.నాయుడు చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సూరిబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థి ★ విజేతలతో అమలాపురం డిగ్రీ, జూనియర్ కళాశాలలో డైరెక్టర్ కిరణ్‌కుమార్

ఆక్రమణల తొలగింపు వాయిదా

యానాం: జాతీయ రహదారి మార్గంలో యూకేవీ నగర్ దగ్గర చిరువ్యాపారుల దుకాణాలు, తోపుడు బండ్లలో వ్యాపారం సాగిస్తున్నారు. గురువారం పొక్లయినర్‌తో వాటిని తొలగించేందుకు హైవే అథారిటీ అధికారులు చేసిన ప్రయత్నాల్ని వ్యాపారులు, ఆ ప్రాంత ప్రజలు నిలువరించారు. తమకు న్యాయం చెయ్యాలని ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును కోరడంతో పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌ను కలిసి మాట్లాడారు. దీనితో తొలగింపు ప్రక్రియకు తాత్కాలికంగా వాయిదా పడింది.

ఉత్సాహంగా ఆటల పోటీలు

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మై భారత్ యానాం శాఖ యువజనాధికారి తిర్రి గోపి గురువారం బ్లాక్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్ తదితర పోటీలు పీఈటీ దుర్గారావు పర్యవేక్షణలో జరిగాయి. విజేతలకు ప్రిన్సిపల్ బాలరాజస్వామి, సూపరింటెండెంట్ ఆర్.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

తీరగ్రామాల్లో అధ్వాన రహదారులు

న్యూస్‌టుడే, కాట్రేనికోన

సముద్రతీర మండలం కాట్రేనికోనలోని తీర గ్రామల్లో సరైన రోడ్లు లేక స్థానికులతోపాటు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బలుసుతిప్ప, చిర్రయానం, నీలరేవు, పోర తదితర గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. వైకాపా హయాంలో ఈ రహదారుల నిర్మాణానికి కనీసం చర్యలు తీసుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా తమ గ్రామాలకు రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏ గ్రామంలో చూసినా..

■ పల్లంకుర్రు నుంచి బలుసుతిప్ప వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పలుచోట్ల కుంగి గుంతలు పడింది.

రాళ్లు పైకిలేచిన బలుసుతిప్ప రోడ్డు

బలుసుతిప్పతోపాటు రామాలయంపేట, బొంతువారిపేట, వడ్డివారిపేట వాసులు ఇబ్బంది పడుతున్నారు. ■ గచ్చకాయలపోర వంతెన నుంచి చిర్రయానం, నీలరేవు వెళ్లే తారు రోడ్డు సుమారు 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీనిని నిర్మించి సుమారు పదిహేనేళ్లు అవుతోంది. ఏడెనిమిదేళ్ల క్రితమే రోడ్డు పాడై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. కంకరరాళ్లు పైకిలేచాయి. కాలభైరవుని ఆలయానికి, నీలరేవు, చిర్రయానం, గచ్చకాయలపోర సముద్రతీరానికి వచ్చే పర్యాటకులు, ఇతర ప్రాంతాలకు వెళే చేపల వ్యాపారులు, విద్యార్థులు నిత్యం ఈ గుంతల రోడ్డులో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.■ పల్లం నుంచి నీలరేవు వెళ్లే సీసీ రోడ్డు పలుచోట్ల పాడై రాళ్లు పైకి తేలాయి. నీలరేవు ప్రజలంతా పల్లం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. పల్లం ప్రజలు శ్మశానవాటికకు వెళ్లేందుకు ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. రోడ్డు మొత్తం పాడవ్వడంతోపాటు సముద్రపు ఆటుపోట్లుకు ఒక్కోసారి నీరు రోడ్డుపైకి చేరుతుంది.■ కందికుప్ప నుంచి పోర వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది.

ముమ్మిడివరంలో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. ముమ్మిడివరం మార్కెట్ యార్డు వద్ద కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగ ఉపకరణాల తయారీ సంస్థ ద్వారా గురువారం వికలాంగులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి పలు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛను రెట్టింపు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన 386 మంది దివ్యాంగులకు మూడు చక్రాల ఛార్జింగ్ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చక్రాల కుర్చీలు, బ్రెయిలీ కిట్లు అందజేశారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఒగూరి భాగ్యశ్రీ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గొలకోటి దొరబాబు, నడింపల్లి సుబ్బరాజు, పొద్దోకు నారాయణరావు, చెల్లి అశోక్, టేకుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కాట్రేనికోన: కందికుప్ప జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వక్తలు రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. డ్రాయింగ్, వ్యాసరచనా పోటీలను నిర్వహించి ప్రతిభచూపిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

కోనసీమ ఓ అద్భుతం: రాజీవ్ కనకాల

అమలాపురం పట్టణం: కోనసీమలో ఆలయాలు, చక్కని వంటలు, పరిసర ప్రాంతాలు అద్భుతంగా ఉన్నాయని సినీనటుడు రాజీవ్ కనకాల ప్రశంసించారు. కోనసీమలో షూటింగ్ నిమిత్తం వచ్చిన ఆయన, జబర్దస్త్ ఫేమ్ అశోక్ అమలాపురం పట్టణంలో గురువారం పర్యటించారు. చెన్నమల్లేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అముడా ఛైర్మన్ స్వామినాయుడి ఇంటికి వెళ్లారు.

స్వామినాయుడి నివాసంలో సినీనటుడు రాజీవ్ కనకాల, అశోక్

(c) eenadu

మండపేట

•మండపేట • రామచంద్రపురం

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

విద్యార్థి విజయ్‌బాస్కర్‌ను అభినందిస్తున్న హెచ్ఎం చేగొండి, దాత గుబ్బల

రామచంద్రపురం: పట్టణంలో చింతపల్లి సూరన్ననగర్ పురపాలక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి రెడ్డి విజయ్‌భాస్కర్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు చేగొండి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీల్లో నెల్లూరు జిల్లా పొదలకూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 17 విభాగంలో పాల్గొంటాడన్నారు. విద్యార్థి విజయ్‌భాస్కర్, పీఈటీ నాగార్జునను హెచ్ఎం, క్రీడా సామాగ్రి దాత గుబ్బల సత్యనారాయణ అభినందించారు.

దాతల సహకారం.. రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంటు

మాట్లాడుతున్న డీపీటీవో రాఘవకుమార్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మోతీలాల్ జైన్ కుటుంబికులు రూ.5 లక్షలు వెచ్చించి రామచంద్రపురం ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ప్రయాణికులకు చల్లటి నీరు అందించేందుకు ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. గురువారం ఈ ప్లాంటును జిల్లా డీపీటీవో రాఘవకుమార్ ప్రారంభించారు. రాఘవకుమార్, ఆర్టీసీ డీఎం పేపకాయల భాస్కరరావు మాట్లాడుతూ దాతలు మోతీలాల్ జ్యూయలర్స్ అధినేతలు మోతీలాల్, సతీమణి కుసుమజైన్, కుమారులు సంజయ్‌జైన్ చంద్రిక జైన్, హితేష్ జైన్ వాణిజైన్ దంపతులకు అభినందనలు తెలిపారు. కూటమి నాయకులు గుణ్ణం రామకృష్ణ, కృత్తివెంటి ట్రస్టుబోర్డు ఛైర్మన్ సలాది వెంకప్పనాయుడు, మోతీలాల్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1	మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191

చెత్తకుప్పలను తొలగించారు

రాయవరం: వి.సావరంలో కొంకుదురు రహదారి చెంత చెత్తకుప్పలు పేరుకుపోయి స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి గుత్తుల వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా కార్మికులను పంపి వ్యర్థాలను తీయించారు.

స్పందనకు వందనం

దీపాలు వెలిగాయి..

ద్వారపూడి: మండపేట మండలం ద్వారపూడిలోని బంగారమ్మ కాలనీలో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థుడు మురళీకృష్ణ తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణకు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపి మరమ్మతులు చేపట్టారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి, సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 430 మందికి, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను గురువారం నిర్వహించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది, కో ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పిల్లలకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ప్రిన్సిపల్ చిట్టూరి కల్పన, అధ్యాపకులు సునీత్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక.. నిర్మాణాలు పూర్తికాక

న్యూస్‌టుడే - మండపేట

గత ప్రభుత్వ హయాంలో పరిపాలన సౌలభ్యం కోసం చేపట్టిన ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, సచివాలయ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణం పూర్తికాక అందుబాటులోకి రాలేదు. కొన్ని భవనాలు నిర్మాణం పూర్తయినప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంతవరకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో సత్వర సేవలు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిధులతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వెచ్చించి భవనాల నిర్మాణాలను పూర్తి చేయవలసి ఉంది.

అందుబాటులోకి రాని ప్రభుత్వ భవనాలు

సోమేశ్వరంలో అసంపూర్తిగా రైతు సేవా కేంద్రం

మండపేట నియోజకవర్గంలో ఇలా..

మొత్తం 50 గ్రామ సచివాలయ భవనాలకుగాను 49 నిర్మాణాలు పూర్తయ్యాయి. 44 రైతు సేవా కేంద్రాలకుగాను 36 భవనాలను సిద్ధం చేశారు. 31 ఆరోగ్య కేంద్రాలకుగాను 25 భవనాలను పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయిన వాటిని ప్రారంభించకపోవడంతో సగానికి పైగా భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని భవనాలకు విద్యుద్దీకరణ, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయవలసి ఉంది.

● మండపేట నియోజకవర్గంలో అన్ని భవనాలు పూర్తి చేయాలంటే మొత్తం రూ.3.49 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. నిర్మాణాలు పూర్తిచేయాలంటే మండపేట మండలానికి రూ.1.79 కోట్లు, కపిలేశ్వరపురం మండలానికి రూ.1.18 కోట్లు, రాయవరం మండలానికి రూ.52 లక్షలు అవసరమవుతాయి.

మండలాల వారీగా భవనాలకు వెచ్చించాల్సిన నిధులు (రూ. లక్షల్లో..)

మండలం	సచివాలయం	రైతుసేవా కేంద్రం	ఆరోగ్య కేంద్రం
మండపేట	130	44	5
కపిలేశ్వరపురం	43	35	40
రాయవరం	25	22	5

రెండు భవనాలకు నిధులు మంజూరు

మండపేట మండలం పాలకొల్లు, తాపేశ్వరం గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలకు రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. వాటి నిర్మాణం పూర్తి చేయవలసి ఉంది. కొన్ని భవన నిర్మాణాలు పూర్తయినప్పటికీ చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

- నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి డీఈ, పంచాయతీరాజ్ శాఖ, మండపేట

కళావేదిక నిర్మాణానికి భూమిపూజ

భూమి పూజలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో కళావేదిక నిర్మాణానికి దాత నాగులపల్లి సీతారామస్వామినాయుడు సొంత నిధులు రూ.4.65 లక్షలు వితరణ చేయడంతో గురువారం భూమిపూజ చేశారు. విద్యార్థులు సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా నిర్మాణం చేపట్టనున్నట్లు హెచ్ఎం తెలిపారు. విద్యా కమిటీ ఛైర్మన్ కంకటాల మురళీకృష్ణ, సభ్యులు కోట లక్ష్మణ్, గోణం పుల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టారు.. బహుమతి పట్టారు

ఈనాడు-ఈటీవీ ప్రతిభాపాటవ పోటీలు

ఉపన్యాస పోటీలో నారాయణ పాఠశాల విద్యార్థులు

విద్యార్థులకు బహుమతులు అందజేసిన ప్రధానోపాధ్యాయుడు గౌతమ్

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం స్థానిక నారాయణ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ప్రసంగం(స్పీచ్) పోటీ సందేశాత్మకంగా సాగింది. 9వ తరగతి విద్యార్థి ఆర్.సత్యదీక్షిత ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థి బి.సాయి ద్వితీయ బహుమతి, 8వ తరగతి విద్యార్థి సిహెచ్. ఆజ్యురి తృతీయ బహుమతి సాధించారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌతమ్ అప్పారెడ్డి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు అందజేశారు. ఎం.శ్రీనివాసరెడ్డి, ఎన్.శరత్‌కుమార్, కె.సోమన్న న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

అపోస్తలిక్ పాఠశాలలో: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం స్థానిక అపోస్తలిక్ ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన (స్పీచ్) ఉపన్యాస పోటీలో పలు విషయాలను ప్రస్తావించారు. 10వ తరగతి విద్యార్థిని ఎం.కరుణ ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని వి.నవ్య సుస్మిత ద్వితీయ బహుమతి, కె.మరియగ్రేస్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను కరస్పాండెంట్, ఛైర్మన్ ప్రసాద్‌పాల్, ప్రిన్సిపల్ దమయంతి అందజేశారు. ఎన్.జోత్స్న, పి.మెర్సి, జి.కమల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ఉపన్యాస పోటీలో అపోస్తలిక్ పాఠశాల విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ దమయంతి

డెంగీ కేసుల నమోదుతో అప్రమత్తం

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం కందులపాలెం, యనమదల గ్రామాల్లో అనుమానిత డెంగీ కేసులు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమై గురువారం ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు రెండు గ్రామాలను సందర్శించి దోమల కారకాలైన మురుగు కుంటలు, నీటి నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా మందు పిచికారీ చేయించారు. నివాస ప్రాంతాల వద్ద నీటి నిల్వలు లేకుండా, ఫ్రిజ్ వెనుక భాగంలో నీటి తొట్టెలో నీరు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వెల్ల పీహెచ్‌సీని సందర్శించి ల్యాబ్‌లో రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు వి.స్వాతిభవాని, వి.లక్ష్మీ ప్రసన్న, సబ్‌యూనిట్ అధికారి బిషప్, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలేష్‌బాబు, వైద్యరావు, ఎంపీహెచ్‌ఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రాయవరం, న్యూస్‌టుడే: మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సిబ్బందితో కలిసి పసలపూడిలో గురువారం వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు లేని, శిరస్త్రాణాలు ధరించని చోదకులకు జరిమానా విధించారు.

కౌమార బాలికల ఆరోగ్యంపై అవగాహన

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక పాలడుగు సత్యవతి, చంద్రమౌళి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మండపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీడ నుంచి వచ్చిన గైనకాలజిస్ట్ డాక్టర్ శారదశ్రీ కౌమార బాలికల సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వంటిపల్లి పాపారావు ఆర్థిక సహకారంతో రూ.2.50 లక్షలతో శానిటరీ నాప్‌కిన్ డిస్పోజర్ యంత్రం, రూ.15,000తో 30 కుర్చీలు, రూ.10 వేలతో స్పోర్ట్ కిట్‌లు అందజేశారు. డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి రచించిన కౌమార బాలికల సంరక్షణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ పాలడుగు చంద్రమౌళి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటేశ్వరరెడ్డి, బొబ్బా పాపారావు, వంటిపల్లి పాపారావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొసగుర్ల విశ్వనాధం, ఇమ్మిడిశెట్టి నాగభూషణం, ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకటరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు బహూకరిస్తున్న రోటరీ సభ్యులు

తాగునీరు వృథా..

ద్వారపూడి దూళ్ల సంత సమీపంలో రక్షిత తాగునీటి ట్యాంకు వద్ద పైపు లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. గొట్టానికి రంధ్రం ఏర్పడటంతో చుట్టూ నీరు చేరి పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణను వివరణ కోరగా నీరు వృథాగా పోకుండా చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

శునకాల బెడద

పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్టు వీధి, సూర్యానగర్, కాకినాడ రోడ్డు, లలితానగర్‌లో గుంపులుగా తిరుగుతుండటంతో స్థానికులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏరియా ఆసుపత్రికి నెలకు 70 నుంచి 85 కుక్క కాట్ల కేసులు వస్తున్నాయంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. దీనిపై 'న్యూస్‌టుడే' కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజును వివరణ కోరగా కుక్కలకు ఒక షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, రామచంద్రపురం

తూర్పులో విలీనంపై హోరెత్తిన సంబరాలు

రాయవరంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చినద్వారపూడిలో..

రాయవరం, మండపేట: : తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గాన్ని విలీనం చేయడంపై గురువారం సంబరాలు నిర్వహించారు. రాయవరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర మాట్లాడుతూ విలీనంపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట నిలబెట్టుకున్నారన్నారు. తొలుత తెదేపా నాయకుడు వుండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ర్యాలీ నిర్వహించారు. రామచంద్రపురం సాగునీటి డీసీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, వెదురుపాక, మాచవరం, చెల్లూరు, పసలపూడి సహకార సంఘాల ఛైర్మన్లు లొల్ల సర్పంచి, జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకీరాంబాబు పాల్గొన్నారు. ● ద్వారపూడి, చిన్నద్వారపూడి, పాలతోడు గ్రామాల్లో నాయకులు సంబరాలు చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కేకు కోసి బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, జోగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ● విలీనంపై పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మించిన పెనుగొండ పుణ్యక్షేత్రం పేరును వాసవి పెనుగొండగా మార్చి తమ చిరకాల కోరిక నెరవేర్చినందుకు కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సంకా శ్రీనివాసరంగా, గౌరవ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, ధర్మకర్త బోనగిరి సుబ్బారావు, కాళ్లకూరి పెదరామం, చెక్కా రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుముడులు

రాయవరం, న్యూస్‌టుడే: అయ్యప్పమాలధారుల శరణుఘోషలతో రాయవరం మార్మోగింది. గురువారం స్థానిక రెడ్ల రామాలయం వద్ద అయ్యప్పల పీఠం నుంచి శబరియాత్రకు గురుస్వామి పులగం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 60 మంది మాలధారులకు ఇరుముడులు కట్టారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నాగిరెడ్డి

సతీష్‌రావు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా హసనబాద గ్రామ సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమార్‌స్వామి నుంచి ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా భాజపా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌స్వామి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్నలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచండి

రాయవరం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వి.సావరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. లీప్ యాప్ సహాయంతో ఆన్‌లైన్‌లో వచ్చే ప్రశ్నల ఆధారంగా విద్యార్థి అభ్యసనాన్ని గణన చేస్తామన్నారు. జిల్లాలో 30,881 మంది విద్యార్థుల సామర్థ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. నోకాస్ట్, లోకాస్ట్ విధానంతో బోధనోపకరణాలను తయారుచేసి పాఠాలు బోధించాలన్నారు. గణితాన్ని పేరడీ పాటల రూపంలో విద్యార్థులకు ఆసక్తికర బోధన చేస్తున్న నాగేశ్వరరావును ఏఎంవో అభినందించారు. పసలపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాల సర్వేను డీఈవో కార్యాలయ ఏపీవో నల్లా ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. సీఆర్పీలు కిలపర్తి పోసి రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరంపూడి లోవప్రసాద్, కోరుమిల్లి వెంకటరమణ, ఉపాధ్యాయులు పీవీ రమణ, రామలక్ష్మి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

శిలాఫలకం ఆవిష్కరించిన సత్యం తదితరులు

పామర్రు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నిలిచిపోయిన భవన నిర్మాణానికి మనబడి మన భవిష్యత్తు పథకంలో నిధులు మంజూరు చేస్తోందని కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం తెలిపారు. కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.12 లక్షలతో నిర్మించిన వంటశాలను గురువారం ఆయన ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కొత్తపుంతలు తొక్కిస్తున్నారని, ఏటా డీఎస్సీ నియామకాల ప్రకటనకు కట్టుబడి పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు గణనీయంగా పెరిగేలా ప్రజాప్రతినిధులు శ్రమించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీరామప్రసాద్, ఎంఈవోలు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు, గ్రామ సర్పంచి తోకల మంగ, ఉపసర్పంచి బి.మంగాదేవి. ఎంపీడీవో కార్యాలయాధికారి సురేంద్రరెడ్డి, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాస్టర్ ఓరియంటేషన్ పోటీలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: అమలాపురం జోన్ నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులకు రామచంద్రపురంలోని పాఠశాలలో గురువారం మాస్టర్ ఓరియంటేషన్ కాంపిటేషన్ నిర్వహించారు. ప్రిన్సిపల్ పి.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలను కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. ప్రిన్సిపల్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ మాస్టర్ ఓరియంటేషన్ కాంపిటేషన్‌లో విద్యార్థులు పాల్గొని వాక్చాతుర్యం, ప్రజెంటేషన్ నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, డాక్టర్ గిరిబాల ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

పామర్రులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పామర్రు, న్యూస్‌టుడే: దంగేరు ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. స్పీకర్‌గా శీలం వినీత సభను నడిపించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు తెలగాని జగదీష్‌బాబు, చింతపల్లి గంగరాజు, నాయుడు శ్రీనివాస్‌కుమార్‌ల పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. వీరిని ప్రధానోపాధ్యాయుడు గుణ్ణం శ్రీనివాస్ అభినందించారు. పామర్రు పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు యర్రా ఈశ్వరుడు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు చంద్రు చౌదరి, మెహర్‌కుమారి బహుమతులు అందచేశారు.

భీమేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.43.95 లక్షలు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గత నెల 15 నుంచి ఈ నెల 27వ తేదీ వరకు 43 రోజులకుగాను హుండీల ద్వారా రూ.43,95,359, అన్నదాన ట్రస్టుకు రూ.52,682 వెరసి రూ.44,48,041 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏవీ దుర్గాభవాని తెలిపారు. జిల్లా సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ లెక్కింపును పర్యవేక్షించారు. ఈవోలు వి.బాలకృష్ణ, వి.శ్రీనివాసు, అర్చకులు, పోలీసు సిబ్బంది, నాయకులు పెంకే సాంబశివరావు, ముప్పనపల్లి గణేష్, ఆళ్లబుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రామచంద్రపురం
(మైనర్లు గుత్తి చేతన్ నాగసాయి, వయస్సు 6, గుత్తి జ్ఞానేశ్వర్, వయస్సు 4)
GWOP 94/2025
Between:
గుత్తి సతీష్ గాంధీ, S/o ప్రసాద్, D.No.72-12-2/6 వర్కర్స్ కాలనీ, లాలాచెరువు, రాజమండ్రి. ... పిటిషనర్
AND
గుత్తి @ జట్ల తులసి, W/o గుత్తి సతీష్ గాంధీ, హిందువు, వయస్సు 28, D.No.3-16, ఆదివారపుపేట విలేజ్, ద్రాక్షారామం, డా. B.R. అంబేద్కర్ కోనసీమ జిల్లా. ... రెస్పాండెంట్
జనరల్ నోటీసు
పై నెంబరు GWOP గ్రంథంలో గుత్తి సతీష్ గాంధీ గారి పిల్లలు గుత్తి చేతన్ నాగసాయి మరియు గుత్తి జ్ఞానేశ్వర్ మైనర్లు అయినందున తన Custody (సంరక్షణ)కి అప్పించవలసిందిగా కోరుచూ GWOP దాఖలు చేసియున్నారు. సదరు GWOPలో పైన తెలిపిన రెస్పాండెంటుకు గాని, ఎవరికైనా గాని అభ్యంతరములు ఉన్నయెడల ది.16-12-2025న ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై తెలియపర్చుకొనవలసిందిగా తెలియజేయడమైనది.
రామచంద్రపురం, ది. 27-11-2025.
T.గోపికృష్ణ
అడ్వకేట్
రామచంద్రపురం, సెల్: 85200 81777

బేలర్ యంత్రం.. పశువులకు గ్రాసం

న్యూస్‌టుడే-ద్రాక్షారామ

నెలపర్తిపాడులో బేలర్ ద్వారా చుట్టలు చుడుతున్న ఎండుగడ్డి

వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి. కానీ వరి గడ్డి చిన్నచిన్న ముక్కలుగా కావడంతో వృథాగాపోయి పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. గడ్డికి డిమాండ్ పెరిగి పశుపోషణ భారంగా మారుతోంది. చేలల్లో మిగిలిన వరిగడ్డిని బేళ్లుగా కట్టే బేలర్ యంత్రం అందుబాటులోకి రావడంతో పశుగ్రాస సమస్యకు పరిష్కారం లభించింది. వరి కోత అనంతరం చేలో అస్తవ్యస్తంగా పడిన గడ్డిని తగలబెట్టేవారు. దీనివల్ల భూసారం దెబ్బతిని అనర్థాలు ఎదురయ్యేవి. ప్రస్తుతం సార్వా మాసూళ్లు పూర్తి కావస్తుండటంతో చాలా మంది రైతులు బేలర్ యంత్రాన్ని ఉపయోగించి పశుగ్రాసాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు.

ఎకరాకు 45 కట్టలు..

బేలర్ యంత్రం 25 కిలోల గడ్డిని ఒక కట్టగా కడుతుంది. ఎకరానికి 45 నుంచి 50 కట్టలు వస్తాయి. ఒక కట్టకు రూ.30 నుంచి రూ. 35 వరకు తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. గంట వ్యవధిలోనే ఎకరం చేలో గడ్డిని కట్టలుగా చుట్టేస్తుండటంతో రైతులకు సొమ్ము ఆదా కావడంతో పాటు రవాణా ఛార్జీలు కలిసి వస్తాయి.

సద్వినియోగం చేసుకోండి

యంత్రంతో వరి కోసిన తరువాత గడ్డిని వృథాగా వదిలేయడం, తగలబెట్టడం వల్ల రైతుకు, పొలానికి నష్టం చేకూరుతోంది. ఎండుగడ్డి కొరతతో పశుపోషణ భారంగా మారుతోంది. బేలర్ సహాయంతో ఒబ్బిడి చేసుకుంటే గ్రాసానికి ఇబ్బంది ఉండదు. బేలర్ అందుబాటులో లేకుంటే ఎకరానికి 100 కిలోల యూరియా మొదటి సాలులో వేసి దుక్కి దున్నితే చేను సారవంతంగా తయారవుతుంది.

- బి.నాగకుమార్, ఏడీఏ, రామచంద్రపురం

10వ తరగతి చదువుచున్న విద్యార్థులకు
IIT-JEE, NEET, EAPCET శిక్షణతో పాటు
ఇంటర్‌లో FREE Seats పొందే అవకాశం
వారి తల్లిదండ్రులకు IIT-JEE, NEET, EAPCET & IPE కోర్సులపై
అవగాహనా సదస్సు
30-11-2025 ఆదివారం ఉ॥ 8.30 ని॥లకు at Modern Campus
అవగాహనా సదస్సు మరియు మోడరన్ అచీవర్ స్కాలర్‌షిప్ ఎంపికకు తప్పనిసరిగా తల్లిదండ్రులు మరియు స్టూడెంట్స్ హాజరై మీ చిన్నారిని విజేతగా నిలపండి
వేదిక: విద్యారత్న Ln.G.V.Rao, President & Correspondent
రామచంద్రపురం పట్టణంలో తిరుగులేని అగ్రగామి విద్యాసంస్థ
మోడరన్ GRC జూనియర్ కాలేజి
సూర్యనగర్, రామచంద్రపురం. Ph: 08857-242489, 98487 83737

(c) eenadu

వజ్రోత్సవం.. సాంస్కృతిక సంబరం

నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. రెండోరోజు గురువారం 150 మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి ప్రారంభమై సంతమార్కెట్, నంగాలమ్మ పూరి గుడి, గాంధీబొమ్మ కూడలి, రోటరీ ఆడిటోరియం మీదుగా నంగాలమ్మ తల్లి ఆలయం వరకు గరగ నృత్యాలతో ప్రదర్శన సాగింది. నంగాలమ్మ ఆలయం వద్ద సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. **- న్యూస్‌టుడే, నిడదవోలు**

తీరం.. యోగానందం

రాజమహేంద్రవరంలోని గౌతమిఘాట్ గోదావరి నదీతీరంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కార్యకర్తలతో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, దేవీచౌక్**

మార్గాలు.. 'మృత్యు' ద్వారాలు..!

ఉమ్మడి జిల్లాలో ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

"రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడం ఆందోళనకరం. కొన్ని జిల్లాల్లో మరణాల సంఖ్య అధికంగా ఉంది. అందులో కాకినాడ ఉంది. కారణాలను విశ్లేషించండి. ప్రతీ ప్రమాదంపైనా ఆడిట్ జరగాలి"

-రహదారి భద్రతా మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు చిన్న, పెద్ద ప్రమాదాలు 1,252 జరిగి 761 మంది మృత్యువాతపడ్డారు. వెయ్యి మందికి పైగా గాయపడ్డారు. ఎక్కువగా పదహారో నంబరు హైవేపై జరిగాయి.

పెరిగిన మరణాలు..

● కాకినాడ జిల్లాలో గతేడాది మొదటి పది నెలల్లో 758 ప్రమాదాలు జరిగి 259 మంది చనిపోయారు. ఈ ఏడాది 436కు తగ్గినా మరణాలు 285. ● తూర్పులో 2024లో 606 ప్రమాదాలు జరిగి 246 మంది చనిపోయారు. ఈసారి 465కు తగ్గాయి.. ప్రాణనష్టం 280కి పెరిగింది. ● కోనసీమలో 2024లో 418 ఘటనలు జరిగితే ఈసారి 351. మరణాలు గతసారి 144 కాగా ఈ దఫా 196.

ఈనెల 8న కిర్లంపూడి మండలం సోమవరం కూడలిలో నలుగురి ప్రాణాలను బలిగొన్న కారు

ప్రధాన కారణాలు ఇలా..

☛ కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడం ☛ డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం ☛ వెలుతురు సమస్య ☛ మద్యం మత్తు ☛ శిరస్త్రాణం, సీటు బెల్ట్‌లు ధరించకపోవడం ☛ రోడ్ల నిర్వహణ లోపం

ఘటనలు ఇలా.. (జనవరి-అక్టోబరు)

వివరం	కాకినాడ	తూర్పు	కోనసీమ
మొత్తం ప్రమాదాలు	436	465	351
మృతులు	285	280	196
క్షతగాత్రులు	698	789	617

తేడాలు సవరిస్తేనే..

● ఇటీవల సోమవరం కూడలి వద్ద ఓ కారు నలుగురి ప్రాణాలను బలిగొంది. రహదారి పక్కగా ఐరన్ గ్రిల్స్‌తో కూడిన బ్యారికేడ్ నిర్మాణం రెండు కి.మీ వరకు అవసరం. ● కోరంగి పరిధిలో రోడ్డు నిర్మాణంలో తేడా ఉంది. ● 10 కి.మీ.కు ఒక మొబైల్ వాహనం పెట్టి హైవేపై నిలిపేసి ఉన్న వాహనాలను తరలించాలి. ● తూర్పుగోదావరి జిల్లాలో దేవరపల్లి, రాజానగరం పరిధిలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

రబీ సాగుకు సన్నద్ధం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రబీ సీజన్ (2025-26)కు సంబంధించి వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే ఖరీఫ్ వరికోతలు 65 శాతం పూర్తయ్యాయి. కోతలు పూర్తయిన కొన్ని మండలాల్లో రబీ వరి నారుమడులు చేసే పనుల్లో రైతులు నిమగ్నమవుతున్నారు. దుక్కులు దున్ని నారుమడులు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం, కొవ్వూరు, అనపర్తి తదితర మండలాల్లోని కొన్నిగ్రామాల్లో ఇప్పటికే ఆకుమడులు మొదలైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా, తొర్రిగెడ్డ పంపింగ్, కొవ్వాడ కాలువల పరిధిలో 7.324 టీఎంసీల నీటి అవసరం ఉన్నట్లు గుర్తించారు.

* రబీ సీజన్‌లో అన్నిపంటలకు కలిపి 1,15,781 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం 34,153 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశారు. దాళ్వాలో 120 రోజుల కాలపరిమితి వరి రకాలైన ఎంటీయూ 1121, ఆర్ఎన్ఆర్ 15048, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకాలు సాగు చేస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) మాధవరావు తెలిపారు.

అంచనాలు ఇలా... (వేల హెక్టార్లలో):
- సాధారణ సాగు విస్తీర్ణం: 83
- వాస్తవ సాగు: 75
- వరి సాగు జరిగేది: 56
- మొక్కజొన్న: 8
- ఇతర పంటల విస్తీర్ణం: 9

మెగా పీటీఎంకు పూర్తయిన ఏర్పాట్లు

మామిడికుదురు : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని (మెగా పీటీఎం 3.0) డిసెంబరు 5న అన్ని పాఠశాలల్లో పండగ వాతావరణంలో నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. ఆ రోజు ఉదయం 9 గంటలకే కార్యక్రమం ప్రారంభమవుతుంది. 10.50 నుంచి 11 వరకు సైన్స్ ప్రాజెక్టులు, వివిధ వస్తువుల ప్రదర్శన జరుగుతుంది. 11 నుంచి 11.10 వరకు సమావేశం ఏర్పాటవుతుంది. 11.10 నుంచి 12.45 వరకు విద్యార్థులు తమకు వచ్చిన పద్యాలు, శతకాలు, కథలను చెబుతారు.

తూర్పు వాకిట.. మండపేట

☛ ప్రాథమిక ప్రకటన విడుదలకు ఆదేశం
☛ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు

ఈనాడు, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా భౌగోళిక, నైసర్గిక స్వరూపం మారనుంది. ఇప్పటివరకు 7 నియోజకవర్గాలు..19 మండలాలతో ఉండగా తాజాగా డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాలు కలుస్తాయి. ప్రాథమిక నోటిఫికేషన్ ప్రచురించి ప్రజల నుంచి 30 రోజుల్లోగా అభ్యంతరాలు స్వీకరించాలని కలెక్టర్లకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

హామీ నెరవేర్చి

భౌగోళికంగా మండపేట నియోజకవర్గంలోని గ్రామాలు రాజమహేంద్రవరానికి దగ్గర. గత ప్రభుత్వం కోనసీమ జిల్లాలో కలపడంతో స్థానికులు ఆందోళనలు చేపట్టారు. కూటమి అధికారంలోకి వస్తే మండపేటను తూర్పుగోదావరిలో కలుపుతామని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రస్తుతం నెరవేరింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం ముమ్మర ప్రయత్నం శారు. అమలాపురం వెళ్లాలంటే కొన్ని గ్రామాల నుంచి 70 కి.మీ దూరంతోపాటు, నాలుగు బస్సులు మారాలని.. అదే రాజమహేంద్రవరానికి కనిష్ఠంగా 8 కి.మీ దూరమని వివరించారు. మెజార్టీ పంచాయతీలు 'రుడా' పరిధిలో ఉన్నాయని పేర్కొంటూ సీఎం, మంత్రి వర్గ ఉపసంఘం వద్దా ప్రస్తావించారు.

కొత్త మార్పులివి

● రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోకి ఇకపై మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు

● తూర్పులో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల సరసన మండపేట చేరిక

● అనపర్తి నియోజకర్గంలోని పెదపూడి అప్పుడూ, ఇప్పుడూ కాకినాడ డివిజన్ లోనే..

కాకినాడలో విలీనానికి డిమాండ్..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు కాకినాడ జిల్లాలో.. రామచంద్రపురం, కె.గంగవరం కోనసీమలో ఉన్నాయి. ఈ రెండింటినీ కాకినాడలోనే విలీనం చేయాలనే డిమాండ్ ఉంది. ఇటీవల అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసనలూ చేపట్టారు. ప్రభుత్వం ప్రస్తుతానికి యథాతథ స్థితిలోనే ఉంచింది.

బడి బస్సుల భద్రతపై నిఘా

న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : బడి బస్సుల భద్రతపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భద్రత ప్రమాణాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బస్సు ప్రమాదాలు కలవరపెట్టిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం సాయంత్రం రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. నిబంధనలు పాటించని బస్సులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం నుంచి వచ్చే నెల 4 వరకు తనిఖీలు చేయనున్నారు.

ఏం పరిశీలిస్తారంటే
- ☛ వాహన రిజిస్ట్రేషన్ వివరాలు
- ☛ సీట్ల సామర్థ్యం
- ☛ అనుమతులు,
- ☛ అత్యవసర ద్వారం

నాలుగు ప్రత్యేక బృందాలతో..

జిల్లాలో మొత్తం రెండు వేలకు పైగా బడి బస్సులున్నాయి. నాలుగు ప్రత్యేక బృందాలు తనిఖీ చేయనున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి లోపాలు గుర్తించనున్నారు. 'విద్యార్థుల భద్రత దృష్టిలో ఉంచుకుని నిబంధనలు పాటించని బడి బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్.సురేష్‌కుమార్ అన్నారు.

కాన్సర్ పై డాక్టర్ సలహా కొరకు ......సంప్రదించండి

CARE HOSPITALS

డా. అమిత్ కె జొత్వాని
అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ - రేడియేషన్ అంకాలజీ

ప్రత్యేక నైపుణ్యం :
- నోరు, గొంతు, రొమ్ము, ఊపిరితిత్తులు, కడుపు క్యాన్సర్లు
- పునరావృత క్యాన్సర్ చికిత్స
- బ్రెయిన్ ట్యూమర్ చికిత్స, రేడియో సర్జరీ
- మోకాలి, భుజం, మోచేయి, చేతులు & పాదాల నొప్పికి అధునాతన రేడియోథెరపీ (LDRT)

విచ్చేయు తేదీ
- 29.11.2025 (శనివారం)
- ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు
- చంద్రకళ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రకాష్ నగర్, రాజమండ్రి

అపాయింట్‌మెంట్ కోసం సంప్రదించండి - 80993 22555, 63001 80993

అధ్యక్షా..

వడిశలేరులో మాక్ అసెంబ్లీకి ప్రజాప్రతినిధులుగా హాజరైన విద్యార్థులు

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ అసెంబ్లీ జరిగింది. పాఠశాల విద్యార్థులే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలుగా హాజరై ప్రజా సమస్యలపై చర్చించారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు హెచ్ఎం దాట్ల అరుణ వివిధ పోటీలను నిర్వహించారు. పి.కోటపాడు పాఠశాలలోనూ మాక్ అసెంబ్లీ జరిగింది.

Rajahmundry's Largest Jewellery Exhibition

28 29 30 NOV 2025 10AM - 9PM

Hotel Shelton Rajahmundry, Symphony Hall, 7th Floor

Reach us at: 72077 73263 / 89778 65994

1g GOLD COIN on jewellery purchase over ₹5 lakhs

0.5g GOLD COIN on jewellery purchase over ₹2.5 lakhs

Certified VVS-EF Diamond Jewellery Starting from ₹51,999/ct (0.200gms)

100% Old Gold Exchange

*T&C Apply

Sri Krishna Jewellers SINCE 1967

Vizag: VIP Road, AP | Hyderabad: Rd. 10, Banjara Hills | USA: Dallas, Texas

+91 96399 96399 srikrishnajewellers srikrishna.com

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి..!

న్యూస్‌టుడే, కంబాల చెరువు, కోటగుమ్మం (రాజమహేంద్రవరం)

మారిన జీవనశైలి, చరవాణి అతి వినియోగంతో చిన్న వయసులోనే కంటి చూపు మందగిస్తోంది. నేత్ర సంబంధిత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించాలనే ఉద్దేశంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలల్లో ఆరు నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జుబ్లీ మెమోరియల్ పాఠశాలలో విద్యార్థినికి కంటి వైద్య పరీక్షలు

ఇదీ పరిస్థితి..
- 42,600 పరీక్షించిన విద్యార్థుల సంఖ్య
- 3,350 కళ్ల అద్దాలు అవసరమైన వారు
- 7.86 శాతం మొత్తం విద్యార్థుల్లో దృష్టి లోపం ఉన్న వారి శాతం

పట్టణ ప్రాంత విద్యార్థుల్లోనే అధికం

తీవ్ర సమస్యలతో 14 మంది విద్యార్థులను జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ముఖ్యంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పోలిస్తే పట్టణ ప్రాంత విద్యార్థుల్లో అధికంగా నేత్ర సమస్యలున్నట్లు వైద్యులు గుర్తించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు కంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారిని గమనించి సకాలంలో చికిత్స అందించాల్సి ఉంది.

18 మంది డిప్యూటీ ఎంపీడీవోల నియామకం

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: జిల్లాలో 18 మంది డిప్యూటీ ఎంపీడీవోలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలో భాగంగా సచివాలయ పరిపాలనకు సంబంధించి కొత్తగా డిప్యూటీ ఎంపీడీవోలను నియమించారు. గ్రామపంచాయతీలలో గ్రేడ్1 కార్యదర్శులను, మండలపరిషత్‌లో పనిచేసే సీనియర్ సహాయకులకు పదోన్నతి ఇచ్చి డిప్యూటీ ఎంపీడీవోలుగా అవకాశం ఇచ్చారు. వీరిలో 12 మంది జిల్లాలో పనిచేస్తున్నవారు కాగా మరో ఆరుగురు పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారు. మండలాల వారీగా నియమితులైన డిప్యూటీ ఎంపీడీవోలు వరుసగా.. ఆర్.వి సత్యనారాయణ (గోపాలపురం), ఎం.శ్రీనివాస్ (రంగంపేట), కేఎస్‌వివి వీరన్న (నిడదవోలు), కెవివి రాంబాబు (తాళ్లపూడి), ఎస్ శ్యాంప్రసాద్ (కడియం), ఎం.ముత్యం (కొవ్వూరు), వి.శ్రీరామ్మూర్తి (గోకవరం), సీహెచ్ దేవదాసు (రాజానగరం), సీహెచ్ శ్రీశాస్త్రి (అనపర్తి), మల్లిడి వెంకటరెడ్డి (సీతానగరం), వై.మునేశ్వరరావు (బిక్కవోలు), గుణ్ణం ప్రసాదరావు (కోరుకొండ), కాయల వి.సత్యనారాయణ (దేవరపల్లి), దాసరి సత్యనారాయణ (రాజమహేంద్రవరం గ్రామీణం), పుల్లేటికుర్తి అచ్యుతరామకృష్ణ (చాగల్లు), కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (పెరవలి), తాళ్లూరి శేషుబాబు (ఉండ్రాజవరం).

కొత్తగా 217 పోలింగ్ కేంద్రాలు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,581 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 217 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఎల్ఆర్)-2026పై గురువారం దూరదృశ్య సమావేశం ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. మొత్తం 16,23,741 మంది ఓటర్లలో 4,19,20 మందిని బీఎల్వో యాప్ ద్వారా మ్యాప్ చేసినట్లు తెలిపారు.

ఆలివ్ రిడ్లే.. ఆహార్యం పదిలం

ఇక్కడ కన్పిస్తున్నది బొమ్మ తాబేలు అనుకుంటే పొరపాటు.. ఇది నిజంగా సముద్రంలో నివసించే ఆలివ్‌రిడ్లే తాబేలే.. కానీ దీనికి ప్రాణం లేదు. పదేళ్ల కిందట సేకరించిన కళేబరాన్ని వివిధ రసాయనాల పూతలతో ఇప్పటికీ చెక్కుచెదరకుండా సంరక్షిస్తున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య, సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కార్యాలయంలో ఇది ఉంది. ఇక్కడ వివిధ రకాల చేపలూ ఆకట్టుకుంటున్నాయి. వాటికి సంబంధించిన పేర్లు, పూర్తి సమాచారం అందుబాటులో ఉంది. ఈ కార్యాలయంలో రొయ్యల, చేపల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తుంటారు. వీటి ఎగుమతుల్లో ఇది ఎంతో కీలకం. ఆక్వా రైతుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. – ఈనాడు, కాకినాడ

ఏటిగట్టు రహదారికి మహర్దశ

రావులపాలెం పట్టణం: ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయం శనివారం వచ్చిందంటే చాలు.. భక్తులతో కిటకిటలాడుతుంది. ఆ రోజు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వాడపల్లి వెళ్లేందుకు ఊబలంక - బొబ్బర్లంక రహదారి సింగల్ రూట్ కావడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఏటిగట్టు రహదారిని అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరడంతో ఆయన వెంటనే రూ.6 కోట్లు మంజూరు చేశారు. రావులపాలెం గౌతమి వంతెన వద్ద నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లికి ఏడు కిలో మీటర్లు దూరం ఉంది. ఉపముఖ్యమంత్రి నిర్ణయంతో ఇది అభివృద్ధి కానుంది. వాడపల్లి వెళ్లే భక్తులతోపాటు ఈ ఏటిగట్టు చెంతన ఉండే రావులపాలెం, ఊబలంక, మెర్లపాలెం, వాడపల్లి గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

మధురమే... మధురమే... మధురమే...
ఈ క్షణములు ఇంకా మధురమే...
పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు,
మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
అయితే వారికి అందించండి, అభినందన చందనాలు.
వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ,
ఈనాడు ద్వారా వారికి అందించండి,
పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు :
80085 97607

వాటికి మాటలు రావనే అలుసా..!

గోపాలపురం, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లో మూగజీవాల మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పశువైద్యాన్ని రైతుల ముంగిటకే తీసుకొచ్చామని గొప్పలు చెప్పారు.. రైతు భరోసా కేంద్రాలకు మొదట్లో మందులు అందించి 2023 నుంచి పూర్తిగా సరఫరాను పట్టించుకోలేదు. ప్రస్తుత సర్కారు వీటి పేరును ఆర్ఎస్‌కేలుగా మార్చినా మూగజీవాల చికిత్సకు అవసరమైన మందులు అందించక పోవడంతో పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎస్‌కేల్లో ఉంటున్న పశుసంవర్ధక సహాయకుల వద్దకు పశువులను తీసుకెళ్తే అవసరమైన మందులు తీసుకురావాలంటూ ప్రైవేటు దుకాణాలకు పంపుతున్నారని వాపోతున్నారు. టీకాలు, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు మాత్రమే ఉచితంగా ఇస్తున్నారని చెబుతున్నారు. జిల్లాలో 364 ఆర్ఎస్‌కేలు ఉండగా పశు చికిత్స కేంద్రాలు 198 ఉన్నాయి. వీటిలో 193 మంది పశు సంవర్ధక సహాయకులు పని చేస్తున్నారు.

జిల్లాలో మూగజీవాల వివరాలు..

ఆవులు	36,135
గేదెలు	87,533
మేకలు	35,663
గొర్రెలు	67,935
కోళ్లు	99,57,476

పశువైద్యశాల నుంచి..

ప్రభుత్వం నుంచి వచ్చే మందుల సరఫరా నిలిచిపోయింది. దీంతో దగ్గరలో ఉన్న పశువైద్యశాల నుంచి మందులు తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. త్వరలో అన్ని ఆర్ఎస్‌కేల్లో మందులు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

ప్రమాణస్వీకార మహోత్సవ శుభాకాంక్షలు

Er. D.HARI KUMAR GARU
Rajahmundry

తేది: 28-11-2025
సాయంత్రం గం॥ 6-30 ని॥ల నుండి
వెన్యూ: హోటల్ లా హోస్పిన్, రాజమండ్రి

రాజమహేంద్రవరంలో మొట్టమొదటి నేషనల్ ప్రొఫెషనల్ బాడీ ACCE(I) రాజమహేంద్రవరం సెంటర్ స్థాపించిన నాటి నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకోబడుతూ, ఇప్పుడు మూడవసారి ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న రాజమండ్రి సీనియర్ కన్సల్టింగ్ ఇంజనీర్ శ్రీ దుద్దుపూడి హరికుమార్ గార్కి మరియు కమిటీ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.

ఎలక్టెడ్ బాడీ 2025-2027

ఛైర్మన్ Er. దుద్దుపూడి హరికుమార్
సెక్రటరి Er. K.రామచంద్రారెడ్డి

MC మెంబర్స్
Er. Y.గురుదేవ్ - Er. B.తిరుపతిరావు - Er. B.సురేష్‌బాబు - Er. TVL.నరసింహారావు

ఎక్స్ అఫీషియో మెంబర్స్
Er. భాస్కర్ తీగెల Er. K.ఆనందబాబు

రాజమండ్రి నగర స్ట్రక్చరల్ ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్, లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ మరియు లైసెన్స్‌డ్ సర్వేయర్ల అభినందనలతో...

(c) eenadu

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికే శిక్షణ తరగతులు

● భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

దేవీచౌక్, న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఉత్సాహంగా పనిచేసేందుకు ప్రశిక్షణవర్గ తరగతులు ప్రేరణగా నిలుస్తాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని రివర్‌బే ఫంక్షన్ హాలులో గోదావరి జోన్ ప్రశిక్షణవర్గ తరగతులు గురువారం నిర్వహించారు. ఆరు జిల్లాలకు(ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా) చెందిన మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ పార్టీ చరిత్ర,

హాజరైన వివిధ జిల్లాల మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు

వికాసం వంటి అంశాలు ప్రశిక్షణ తరగతుల్లో వివరించామన్నారు. మండల అధ్యక్షులు రాబోయే కాలంలో పార్టీ భూమిక ఏవిధంగా ఉండాలో కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో వాడవాడలా భాజపా జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ తరగతులకు సుదీర్ఘ చరిత్ర ఉందని పేర్కొన్నారు. వీటి వల్ల నిబద్ధత, నాయకత్వ పటిమ పెరుగుతాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న శక్తివంతమైన రాజకీయ పార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తున్నామనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. భాజపా రెండు సీట్ల నుంచి 300కు పైగా సీట్లు సాధించే స్థాయికి ఎదిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక అంశాల ఆధారంగా పని చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర సంఘటన సహ కార్యదర్శి మధుకర్, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యక్షులు

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, వేదికపై ఎంపీ పురందేశ్వరి, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

నిర్మలా కిషోర్, కార్యదర్శులు బొమ్ముల దత్తు, ఆదిలక్ష్మి, రాష్ట్ర సీనియర్ నాయకుడు వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై సర్కారు చిత్తశుద్ధి : విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. రూ.11,500 కోట్లు ప్యాకేజీ ప్రకటించడమే దీనికి నిదర్శనమన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భవనాలు పూర్తికాక.. చదువులు సాగక

▲ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఎదురుచూపులు

▲ దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణ రావు జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి, 10 ప్లస్ వరకు సుమారు 480 మంది విద్యార్థులు ఉన్నారు. 2022లో ఒక్కో గదికి రూ. 12 లక్షల చొప్పున నాలుగు గదులకు రూ.48 లక్షలు మంజూరు చేశారు. గత సర్కార్‌లో సిమెంట్ లేకపోవడంతో 2023 జూన్‌లో పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు గదులు చాలక అవస్థలు పడుతున్నారు. ▲ గోపాలపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.90 లక్షలు మంజూరు చేశారు. సాంకేతిక కారణాలతో నిధులు రాక 60 శాతం పూర్తయిన పనులను గుత్తేదారుడు నిలిపేశారు.

దేవరపల్లి, గోపాలపురం, న్యూస్‌టుడే: నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని గత వైకాపా సర్కారు పెద్దలు సభలు, సమావేశాల్లో ఊదరగొట్టారు. క్షేత్ర స్థాయిలో పనులు మాత్రం నిధులు లేక అలాగే ఉండిపోయాయి. సమయానికి సిమెంట్, ఇసుక అందజేయక పోవడంతో అదనపు తరగతి భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 983 ప్రభుత్వ పాఠశాలల్లో 92,706 విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ఫేస్-2 కింద రూ.259. 10 కోట్లు కేటాయింపగా రూ.100.29 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో భవనాల నిర్మాణాలు పూర్తికాక విద్యార్థులు చాలీచాలని గదుల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి నిర్మాణాలు పూర్తి చెయ్యాలని కోరుతున్నారు.

నియోజకవర్గం	అదనపు గదులు	వివిధ దశల్లో ఉన్నవి
రాజమహేంద్రవరం	71	66
రా. గ్రామీణం	68	62
గోపాలపురం	125	118
నిడదవోలు	93	87
కొవ్వూరు	128	125
రాజానగరం	212	203
అనపర్తి	97	94

దేవరపల్లిలో స్లాబు స్థాయికి వచ్చి నిలిచిన అదనపు తరగతి గదులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

సిమెంట్, ఐరన్, నిధుల కొరత వల్ల భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిర్మాణాలు త్వరలోనే పూర్తి చేసేలా కసరత్తు జరుగుతోంది.

- ఎస్.సుభాషిణి, ఏపీసీ, సమగ్ర శిక్షా, తూర్పుగోదావరి జిల్లా

మహిళా శిశు సంక్షేమశాఖలో పోస్టుల భర్తీకి ప్రకటన

బొమ్మూరు: జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖలో కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని పీడీ టి.శ్రీవిద్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డీసీపీయూలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ -1, సోషల్ వర్కర్ -1, అవుట్‌రీచ్ వర్కర్ (పురుషుడు) -1, స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీలో పోస్టులకు చౌకీదార్ -1, పార్ట్‌టైం డాక్టర్ -1, చిల్డ్రన్ హోమ్‌లో స్టోర్ కీపర్ కమ్ అసిస్టెంట్ -1, కుక్ -1, సహాయకుడు కమ్ నైట్ వాచ్ ఉమెన్ -1 పోస్టులకు అభ్యర్థులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులు (ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్) వెబ్‌సైట్‌లోనూ, బొమ్మూరులోని మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలోనూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈనెల 28 నుంచి డిసెంబర్ 7 లోపు పూర్తిచేసిన దరఖాస్తులు బొమ్మూరు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జీవిత ఖైదీల విడుదల

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి ఇద్దరు జీవిత ఖైదీలు గురువారం విడుదలైనట్లు కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ ఓ ప్రకటనలో తెలిపారు. బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన కటికిరెడ్డి నాగేశ్వరరావు (68) 2011 మార్చిలో హత్య, నగదు దోపిడీ చేసిన కేసులో కేంద్ర కారాగారానికి వచ్చాడు. ఇతను 14 ఏళ్ల రెండు నెలల శిక్ష అనుభవించగా సుమారు ఆరేళ్ల కాలం శిక్ష సత్ప్రవర్తన కారణంగా తగ్గింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాలకు చెందిన మద్దూరి సువర్ణరాజు తన భార్యను చంపిన కేసులో 2010 జులైలో కారాగారానికి వచ్చాడు. 14 ఏళ్ల తొమ్మిది నెలల ఏడు రోజులు శిక్ష అనుభవించగా సత్ప్రవర్తన కింద ఆరేళ్ల శిక్ష తగ్గింది.

దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో జాబ్‌కార్డు

గోపాలపురం, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇప్పటి వరకు కార్డు లేకుండా ఉన్న వారు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో పొందేందుకు వెసులుబాటు కల్పించింది. గతంలో జాబ్‌కార్డు పొందాలంటే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు సైతం ఇబ్బందులుండేవి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఈకేవైసీ నిర్ణయాలతో అర్హులైన కార్మికులకు 48 గంటల్లో కొత్త జాబ్‌కార్డు అందజేసే ప్రక్రియ మొదలైంది. దీనిపై ఇటీవల ప్రత్యేక గ్రామసభలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పిస్తే మండల కార్యాలయం నుంచి మరుసటి రోజుకే నూతన జాబ్‌కార్డు నకలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల, రామన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు ఫుట్‌బాల్, టెన్నికాయిట్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పల్లంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని బి.రిషిత ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో జాతీయస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు రాజేష్ తెలిపారు. వచ్చే నెలలో అండమాన్‌లో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. ● రామన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మిరియాల ప్రియదర్శిని ఈ నెల 21, 22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి వచ్చేనెల నెల 22 నుంచి 26 వరకు కేరళలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వ్యాయామోపాధ్యాయిని సరస్వతి తెలిపారు.

బి.రిషిత

ఎం.ప్రియదర్శిని

సివిల్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించే ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు గురువారం రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శశాంక ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. దరఖాస్తులను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94944 52267, 90000 58102, 70321 97288, 93939 34825 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నన్నయలో డిసెంబరు 27 నుంచి దేహదారుఢ్య పోటీలు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో డిసెంబరు 27 నుంచి 30వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ మెన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నామని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను వర్సిటీలో గురువారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో నిర్వహించే ఈ పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక అవుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లు డిసెంబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, అసోసియేట్ కార్యదర్శి ఎం.వి.వి.ఎస్ మూర్తి, ప్రిన్సిపల్స్, పీడీలు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction

కార్యాలయ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డి.నెం. 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101 మరియు శాఖ కార్యాలయం రాజమండ్రి-2

శ్రీ వాకపల్లి రాజు కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

తేదీ.17.09.2025 నాటి ఉద్దేశిత అమ్మకం ప్రకటన 30 రోజుల గడువు ముగిసినందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9(1) తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన ఇప్పుడు జారీచేయడమైనది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) తో చదువబడు సదరు చట్టం 54/2002 లోని సెక్షన్ 13(8) ప్రకారం మీ విముక్తి హక్కును వినియోగించుకోవడంలో మీరందరూ విఫలమైనందున, ఇ-వేలం విక్రయానికి ఈ నోటీసు జారీ చేయబడింది. ఇది ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు / సహ-దరఖాస్తుదారులు / సహ-ఋణగ్రహీతలకు తెలియజేయడమైనది.

1. వై.జి.దేవ్ & కో తరఫున మేనేజింగ్ పార్ట్‌నర్: యర్ర గురుదేవులు, తండ్రి: శ్రీరామ్ మూర్తి, డి.నెం.28-9-6బి/4, సమాచారం భవనము, జాంపేట, గణేష్ చౌక్ దగ్గర, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (ఋణగ్రహీత)
2. యర్ర గురుదేవులు, తండ్రి: శ్రీరామ్ మూర్తి, బిజినెస్, డి.నెం.73-18-19/1, బ్లాక్ నెం.ఎ1, సాయి టవర్స్, ఎవి అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
3. వాకపల్లి లత, భర్త: రాజు, ఆర్కిటెక్చర్ బిజినెస్, డి.నెం.23-15-4/3/1M, ఫ్లాట్ నెం.401, 4వ అంతస్తు, మార్కెట్ యార్డ్ దగ్గర, వసుధ ఎన్‌క్లేవ్, సుభాష్ నగర్, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
4. వాకపల్లి రాజు, తండ్రి: వీరన్న, టీచర్, డి.నెం.23-15-4/3/1M, ఫ్లాట్ నెం.401, 4వ అంతస్తు, మార్కెట్ యార్డ్ దగ్గర, వసుధ ఎన్‌క్లేవ్, సుభాష్ నగర్, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
5. యర్ర పద్మావతి, భర్త: యర్ర గురుదేవులు, బిజినెస్, డి.నెం.73-18-19/1, బ్లాక్ నెం.-A1, సాయి టవర్స్, ఎవి అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)

1. మేము M/s.శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్"గా పిలువబడేది), ఎన్‌సిఎల్‌టి చెన్నై, తేదీ.9-11-2022, C.P. No: 69-76 ఆఫ్ 2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది మరియు పేరు మార్పుననుసరించి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ యొక్క రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ద్వారా ధృవీకరించబడిన ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్చబడినది. [illegible]

2. [illegible] ... రూ.58,30,020/- ... [illegible]

3. దాని పర్యవసానంగా, సెక్యూర్డ్ క్రెడిటార్ SARFAESI చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సెక్షన్ 13(4) క్రింద తేది 01.08.2023 గల నోటీసును జారీచేసినారు, తదనుగుణంగా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తులను రాజమహేంద్రవరంలోని గౌరవనీయ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి-కమ్-చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ద్వారా అడ్వకేట్ కమిషనర్‌గా నియమించబడిన అడ్వకేట్ కమిషనర్ సహాయంతో 04.03.2024 తేదీన స్వాధీనం చేసుకున్నారు. దిగువ వివరించిన హామీ గల స్థిరాస్తులను బహిరంగ వేలం మరియు/లేదా చట్టం మరియు రూల్స్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం సూచించిన ఇతర పద్ధతుల ద్వారా విక్రయించాలని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతిపాదిస్తుంది. తేదీ.30.01.2023 నాటి డిమాండ్ నోటీసులో సూచించిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రావల్సిన బకాయి రూ.58,30,020/- (అక్షరాల యాభై ఎనిమిది లక్షల ముప్పై వేల ఇరవై రూపాయలు మాత్రమే) మరియు వర్తించు తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, న్యాయపరమైన మరియు ఇతర యాదృచ్ఛిక ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు చట్టం మరియు రూల్స్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం ఈ నోటీసు పత్రికా ప్రచురణ తేదీ నుండి 30 రోజుల వ్యవధితో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే & అక్కడ ఏముందో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ బహిరంగ ఇ-వేలం ద్వారా దిగువ ఆస్తిని విక్రయించబడును.

ఋణగ్రహీతల యొక్క పేరు / సహ-ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు	తేదీ & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	వాకపల్లి రాజుకి సంబంధించిన ఆస్తి యొక్క వివరణ	ధరావత్తు (EMD) జమచేయు వివరములు	వేలం తేది & సమయం	సంప్రదించబడాల్సిన వ్యక్తి మరియు తనిఖీ తేదీ
1. వై.జి. దేవ్ & కో 2. యర్ర గురుదేవులు 3. వాకపల్లి లత 4. వాకపల్లి రాజు 5. యర్ర పద్మావతి	చెల్లించాల్సిన మొత్తం రూ.58,30,020/- (అక్షరాల యాభై ఎనిమిది లక్షల ముప్పై వేల ఇరవై రూపాయలు మాత్రమే) వడ్డీ, వ్యయాలు, ఖర్చులు, చట్టబద్ధ మరియు అన్ని అనుషంగిక ఖర్చులు. రుణ ఒప్పందం నెం. RAJA4TF1903290009 డిమాండ్ నోటీసు తేదీ: 30.01.2023	తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం సబ్-జిల్లా, పెద్దాపురం మండలం, పెద్దాపురం మునిసిపాలిటీ ఏరియా, పెద్దాపురం గ్రామము, వార్డు నెం.17, కొత్త వార్డు నెం.15, కొండయ్యపేట, యానాదిగూడెం స్ట్రీట్, బృందావన కాన్వెంట్ ఆర్‌సిసి బిల్డింగ్ మరియు పూరిల్లు, డి.నెం. 1-4-3బి, అసెస్‌మెంట్ నెం. 1062006835 నందు 383 చ॥గ॥ లేదా 320.23 చ॥మీ॥ స్థలము. దీనికి హద్దులు: తూర్పు: లంకా దయామణికి చెందిన గోడ-56.0 అ॥; దక్షిణం: రాజావీధి-61.6 అ॥; పడమర: బోరా అచ్చియమ్మ యొక్క ఇల్లు-56.0 అ॥; ఉత్తరం: రాజావీధి-61.6 అ॥. ఈ పై హద్దుల మధ్యలోని 383 చ॥గ॥ లేదా 320.23 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందలి ఆర్‌సిసి భవనము. (రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ నందు తనఖా ఆస్తి దస్తావేజు నెం.3404/2019 మరియు పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ నందు విక్రయ దస్తావేజు నెం. 46/2003 ప్రకారము ఆస్తికి అనుగుణంగా)	EMD ని DD ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట జమచేయవలెను బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచి: బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ముంబయి- 400710, ఖాతా నెం. 230010200005265, IFSC కోడ్: UTIB0000230	30-12-2025 సమయం: ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు	డి.రామ్‌మోహన్ సంప్రదించవలసిన నెం. 9849824075 సిహెచ్. శ్రీనివాసరావు సంప్రదించవలసిన నెం. 9959912922 కస్టమర్ కేర్ 022-40081572 ఆస్తి తనిఖీ చేయు తేదీ: 27-12-2025 సమయం: ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు

రిజర్వుధర మొత్తం: రూ.44,29,100/- (అక్షరాల నలభై నాలుగు లక్షల ఇరవై తొమ్మిది వేల ఒక వంద రూపాయలు)
ఇఎండి మొత్తం: రూ.4,42,910/- (అక్షరాల నాలుగు లక్షల నలభై రెండు వేల తొమ్మిది వందల పది రూపాయలు)
బిడ్ పెంపుదల: రూ.10,000/- మరియు అలాంటి గుణిజాల్లో గల పెంపుదల
ఇఎండి సమర్పించుటకు చివరి తేదీ: 29.12.2025, సమయం: ఉ॥ 10.00 గం॥ల నుంచి సా॥ 5.00 గం॥ల వరకు

ఇ-వేలం తేదీ అనగా 30.12.2025 లోగా పైన తెలిపిన మొత్తముతో పాటు చెల్లింపు తేదీనాటికి అగు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవల్సిందిగా లేనియెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని మరియు బకాయి శేషం ఏదేని ఉన్నచో అది వడ్డీ మరియు వ్యయంతో రాబట్టుకోబడునని ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.
ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవడానికి, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్‌ను సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ, మొదలైనవాటిలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ వారిని సంప్రదించవచ్చును. పేరు: శ్రీ గౌరవ్ నంబూదిరి, ఫోన్ నెం.9833922941, Email id: gaurav.n@samil.in మరియు ఆస్తికి సంబంధించిన [illegible] ... 9849824075 ... [illegible] (https://eauctions.Samil.in/home) ... [illegible] ... https://eauctions.Samil.in/home ... www.shriramfinance.in/auction ... [illegible]

ప్రదేశము: రాజమండ్రి, తేదీ: 27.11.2025 సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వైకాపా పాలనలోనే రాష్ట్రానికి తీవ్ర నష్టం

● సంక్షేమాన్ని గాలికొదిలి వనరుల దోపిడీ ● రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి రామానాయుడు

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన కంటే వైకాపా పాలనలోనే రాష్ట్రం ఎక్కువగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు అన్నారు. నిడదవోలు పురపాలిక వజ్రోత్సవాల రెండోరోజు గురువారం రాత్రి పార్కు వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి వనరులను దోచుకున్నారన్నారు. కనీసం జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ఇంత కష్టకాలంలోనూ కూటమి ప్రభుత్వం ఒకపక్క సంక్షేమ పథకాలు అందిస్తూ, మరోపక్క రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోందన్నారు. రాజధాని అమరావతితో పాటు, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నిడదవోలు అభివృద్ధికి తన వంతు సహకారం పూర్తిగా అందిస్తానన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. దీనిలో భాగంగా వంద పడకల ఆసుపత్రి, మినీ స్టేడియం, చిన్నకాశీరేవు వద్ద వంతెన నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ నిర్మాణ పనులు డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రయత్నం చేశామని, అయితే మార్చి నాటికి పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటామన్నారన్నారు. పలు అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మరి కొందరిని మంత్రులు సత్కరించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, కమిషనర్ తోట కృష్ణవేణి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ పువ్వల రతీదేవి, జనసేన, భాజపా పట్టణ అధ్యక్షులు రంగా రమేష్, మోర్త ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు, వేదికపై మంత్రి దుర్గేష్, మున్సిపల్ ఛైర్మన్ ఆదినారాయణ

ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

చాగల్లు, న్యూస్‌టుడే: కొవ్వూరు మండలం కాపవరం సర్వీస్ రోడ్డులో గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామీణ పోలీసుల వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం ధర్మవరానికి చెందిన ఎం. పోశయ్య(39) వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కాపవరం వచ్చారు. తిరుగు ప్రయాణంలో చాగల్లు వెళ్లే రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండో వాహనచోదకుడికి తీవ్ర గాయాలు కావడంతో తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోశయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ భగవాన్ దాస్ తెలిపారు. మృతుడికి భార్య శాంతి తోపాటు పది, ఆరు, నాలుగు తరగతులు చదువుతున్న స్నేహ, సిరి, ప్రదీప్, నాలుగేళ్ల వయస్సున్న నాగేంద్ర పిల్లలున్నారు. పోశయ్య మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎం.పోశయ్య (పాత చిత్రం)

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్, ✆ 9849138626.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

వైజాగ్ ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు దగ్గరలో 40'రోడ్ ఫేసింగ్ కమర్షియల్ 869 గజాలు VMRDA ప్లాటు అమ్మకం. ✆ 94932 44471, 93969 72239.

JOBS

WANTED Managers to Motivation of Team/ Targets/ Salary upto 50K/ Kkd/ Age above 30 yr/ Insurance Exp./ Male/ Female. Cont: 98494 21277.

రాజమండ్రి- మహిళలకు మాత్రమే. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, 9 am - 5 pm, శాలరీ + ఇన్సెంటివ్, అనుభవం అవసరం లేదు. Contact Cell: 73969 46490.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. ✆ 96402 58899, 96404 68899

WANTED: సేల్స్ & సర్వీస్ మేనేజర్ - కార్ షోరూమ్‌లో అనుభవం కనీసం 2 సంవత్సరాలు. డెమో ఎగ్జిక్యూటివ్‌లు, సేల్స్ & సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్ (Female), సీనియర్ మెకానిక్స్ కావలెను. రాజమండ్రి, తుని, జగ్గంపేట, మండపేట, రావులపాలెం. Contact Cell: 97033 34844, 63019 19238.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-15 పై
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

కర్షకులు సంతృప్తి చెందే స్థాయిలో సేవలందించాలి

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రీసర్వే జరిగిన గ్రామాల్లో అయిదేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను పట్టాల విభజన కార్యక్రమం ద్వారా సర్కారు పరిష్కరిస్తుందని సర్వేశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్.వి.ఎస్.ఎన్.కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ జరిగిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 412 జాయింట్ ఎల్‌పీఎంలను ఇప్పటికే రిజిస్టర్ చేయగా విభజన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రైతుల సంతృప్తి స్థాయిని పెంచేలా సేవలు అందించాలని సూచించారు.

పారిశుద్ధ్య సమస్యలతో సతమతమవుతున్నారా..?

రేపు ఈనాడు ఆధ్వర్యంలో డయల్ యువర్ ఎంహెచ్‌వో'

సమయం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

మీ ఇంటి వద్ద కాలువల్లో పూడిక తొలగించడం లేదా..? వీధులు అధ్వానంగా ఉన్నాయా..? వంటి సమస్యల పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ ఎంహెచ్‌వో కార్యక్రమం ఈ నెల 29న (శనివారం) నిర్వహిస్తున్నారు. నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారిణి వినూత్న పరిష్కార మార్గాలు చూపుతారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య : స్థానిక భాస్కర్‌నగర్ కాలనీలో పూడిక తొలగించడం లేదు - **అనురాధ**

సమస్య : అల్కట్‌గార్డెన్స్ వద్ద కాలువల్లో పూడిక పేరుకుపోయింది. - **భరత్**

సమాధానం : సిబ్బందిని పంపించి, కాలువలను శుభ్రం చేయిస్తాం.

- ఎంహెచ్‌వో, వినూత్న

– న్యూస్‌టుడే, టి.నగర్

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బొమ్మూరు: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని తెదేపా వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. హుకుంపేటలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేరుస్తున్నారన్నారు. రైతులకు కరపత్రికలను అందజేశారు. మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సూర్య రమేష్, బొప్పన శ్రీనివాస్, దుద్దుపూడి రమేష్, మద్దిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కోరుకొండ, రాజానగరం: గోదావరి పుష్కరాల దృష్ట్యా రహదారులు, తాగునీటి సరఫరా పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. 2027 నాటికి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బలరామకృష్ణ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రహదారులు, భవనాలు, ఇంజినీరింగ్, ఎంపీడీవోలు తదితర వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రాజానగరం - బూరుగుపూడి, దివాన్‌చెరువు - పుణ్యక్షేత్రం, రాజానగరం - చిన్నకొండేపూడి, మోరంపూడి - పుణ్యక్షేత్రం, కోరుకొండ - నాగంపల్లి, రాపాక - చిన్నకొండేపూడి, శ్రీరాంపురం - పోలీస్‌క్వార్టర్స్, శ్రీకృష్ణపట్నం - పిడింగొయ్యి, రాజవోలు - కొండగుంటూరు రోడ్ల పనులు ప్రతిపాదించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటికే పూర్తి చేసిన పంచాయతీరాజ్ రోడ్లను శంకుస్థాపనలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రూ.30 కోట్లతో పుష్కరాలలో పీఆర్ రోడ్ల పనులు ప్రాధాన్యం ప్రకారం తయారు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పథకానికి సంబంధించి బూరుగుపూడి, మునగాల, దోసకాయలపల్లి, కోటికేశవరం, జంబూపట్నంలో చేపట్టిన మంచినీటి సరఫరా పనులు వేగవంతం చేయాలన్నారు. దివాన్‌చెరువు, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడలో మంచినీటి సరఫరా పనులు సమీక్షించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం: జేసీ

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసినట్లు జేసీ మేఘస్వరూప్ అన్నారు. 201 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 21,794 మంది రైతుల నుంచి 1,61,611 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. 10,008 మంది రైతులకు రూ.175.85 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు.

పేరు ఘనం.. 'చెత్త'శుద్ధి శూన్యం..!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: చారిత్రక నగరం స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన స్థానం సాధించినా పారిశుద్ధ్యం ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. గత ఏడాది జాతీయ స్థాయిలో 19వ స్థానం సాధించింది. ఇంటింటా చెత్త సేకరణ, వీధుల శుభ్రత, కాలువల్లో పూడిక తొలగింపు ప్రక్రియ వంటి అంశాల్లో నిర్లక్ష్యం వెంటాడుతోంది. యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రానున్న పుష్కరాల నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్యం మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.

సేకరణ అంతంత మాత్రమే

కొన్ని డివిజన్లలోనే చెత్తను తడి, పొడిగా వేరు చేసి, సేకరిస్తున్నారు. నిబంధనల ప్రకారం రోజుకు రెండు సార్లు, ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని బట్టి ఒకసారి మాత్రమే వీధులు శుభ్రం చేస్తున్నారు.

రోడ్లపైనే..

ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న నగరంలో వ్యాపార దుకాణాల నుంచి కూడా ఒకసారి మాత్రమే చెత్త సేకరిస్తున్నారు. మెయిన్ రోడ్డు, తాడితోట, డీలక్స్ సెంటర్, కంబాలచెరువు, దేవీచౌక్ తదితర ప్రాంతాల్లో పేరిగిపోయిన చెత్తను రాత్రి సమయాల్లో తిరిగి రోడ్లపైకి చేరుస్తున్నారు.

☛ 96 : సచివాలయాలు ☛ 50 : డివిజన్లు
☛ 90 : ఇంటింటా చెత్త సేకరణ వాహనాలు
☛ 1245 : పారిశుద్ధ్య సిబ్బంది

అరకొర సిబ్బందితో

ప్రతి డివిజన్‌లో 10 నుంచి 15 మంది పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించారు. ఉదయం ఇంటింటా చెత్త సేకరణ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం నుంచి వీధులు, కాలువలను శుభ్రం చేయాల్సి ఉంటుంది. కొంత మంది సిబ్బందిని ప్రధాన ప్రాంతాలు, జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య విధుల కోసం కేటాయిస్తున్నారు. మురికివాడ ప్రాంతాల్లో కాలువల్లో పూడిక పెరిగి, దోమలు విజృంభిస్తున్నాయి.

అటకెక్కిన పనులు

గతంలో రాత్రి పూట ప్రధాన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేవారు. దీని కోసం ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. రద్దీ ప్రాంతాలు, రైల్వే, బస్ స్టేషన్లు, కీలక జంక్షన్లలో పనులు చేపట్టేవారు. ప్రస్తుతం అవన్నీ అటకెక్కాయి. రోడ్లు శుభ్రం చేసేందుకు రెండు వాహనాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం అవి మరమ్మతుకు గురై మూలకు చేరాయి.

మహాభారత ప్రవచన యజ్ఞం ప్రారంభం

కోటగుమ్మం, న్యూస్‌టుడే : స్థానిక త్యాగరాజనగర్‌లో హిందూ సమాజం ప్రాంగణంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్వర్యంలో గురువారం మహా భారత ప్రవచన యజ్ఞం ప్రారంభించారు. ఈ యజ్ఞం ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు 60 రోజులు కొనసాగుతుందని పేర్కొన్నారు. మనిషి తన జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఈ గ్రంథం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. జీవితంలో ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం చూపే మహత్తర గ్రంథమన్నారు. గోపాలకృష్ణశర్మ మాట్లాడుతూ మహాభారతంలో ధర్మసందేహాలు ఉంటే ఈ 60 రోజుల్లో నివృత్తి చేసుకోవచ్చన్నారు.

బ్రౌన్‌కు నివాళులర్పిస్తున్న మల్లీశ్వర్, సన్నిధానం శాస్త్రి తదితరులు

తెలుగువారి గుండె చప్పుడు సి.పి.బ్రౌన్

కోటగుమ్మం: రాజమహేంద్రవరంలోని సి.పి.బ్రౌన్ మందిరాన్ని రచయిత మల్లీశ్వర్ గురువారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలుగు భాషకు సేవ చేసిన విదేశీ మహనీయుడు సి.పి.బ్రౌన్ అని కొనియాడారు. సన్నిధానం శాస్త్రి మాట్లాడుతూ తెలుగుభాషకు సేవ చేసిన బ్రౌన్‌ను స్మరించడమే బ్రౌన్ మందిరం లక్ష్యమన్నారు. లీలా ప్రసాద్, అరుణ్ కుమార్, వెంకట రమణ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

టి.నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయాలని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయంపై దళిత గిరిజన సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, దారా యేసురత్నం తదితరులు మాట్లాడారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. ఉసురుమర్తి రామారావు, కుమార్‌బాబు, చాపల చినరాజు, అజ్జరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై కలెక్టర్ ఆరా

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

మోరంపూడి: తొర్రేడు గ్రామంలో గురువారం నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి పాల్గొని రైతులతో మాట్లాడారు. వరి సాగు వల్ల కలిగే లాభాలు, ఖర్చుల విషయాలను వారితో సమీక్షించారు. సేంద్రియ వ్యవసాయం వైపు మారడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని, ఆరోగ్యకరమైన పంటలు సాగు చేయడం సాధ్యమవుతుందని అన్నారు. పంట మార్పిడి విధానంలో హార్టికల్చర్ పంటల సాగును పరిశీలించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మిర్తిపాడు గ్రామంలో కళ్లాల్లో నిల్వ సమస్యలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, సహాయ సంచాలకులు రమేష్ పాల్గొన్నారు.

ఉపన్యాసంతో అలరించారు..!

● 'ఈనాడు –ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: గాంధీపురం శ్రీ గౌతమి స్కూల్లో 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు గురువారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై జరిగిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమదైనశైలిలో ప్రసంగించారు. సెల్‌ఫోన్ అతి వినియోగం వల్ల ఎటువంటి మానసిక సమస్యలు తలెత్తుతాయి... వాటి వల్ల చూపు మందగించటం వంటి అంశాలను తమ ఉపన్యాసాల్లో స్పష్టంగా వివరించారు. సీహెచ్.మయూఖ (9వ తరగతి), ఎస్.హర్షిత్ కార్తికేయ (7వ తరగతి), వి.ఇషిత కుమారి (10వ తరగతి) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వీరికి ఈనాడు సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ సీహెచ్ఎన్‌వీఎస్ఆర్ శాస్త్రి, కో ఆర్డినేటర్ కె.సీతా మహాలక్ష్మి అందించారు. న్యాయనిర్ణేతలుగా కె.హరిత, కె.బాలభాను వ్యవహరించారు.

విజేతలతో శ్రీగౌతమి పాఠశాల యాజమాన్యం

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అక్షర శ్రీ స్మార్ట్ స్కూల్లో... స్థానిక బొమ్మూరు అక్షర శ్రీ స్మార్ట్ స్కూల్లో ఉపన్యాస పోటీలు గురువారం నిర్వహించారు. జి.మోక్షిత, సీహెచ్.జొన్న గ్రేస్, బి.శ్రావణ్‌నాగ పవన్ (7వ తరగతి) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు ఈనాడు సమకూర్చిన బహుమతులను స్కూలు డైరక్టర్ టి.నాగరత్నం, ప్రిన్సిపల్ డి.స్వాతి అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఈమని.ఎస్.ఎన్.మూర్తి, కె.శ్రీనివాస్, వ్యవహరించారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో అక్షర శ్రీ స్మార్ట్ స్కూలు యాజమాన్యం

ఉపన్యాసాన్ని ఆలకిస్తున్న విద్యార్థులు

ఆదమరిస్తే అంతే

నగరంలోని నారాయణపురం కిడ్స్ పాఠశాల సమీపంలో మలుపు వద్ద గుంత పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే కోటగుమ్మం

ప్రజారోగ్యంపై 'పొగ'

నగరంలో నిత్యం రద్దీగా ఉండే తూర్పురైల్వేస్టేషన్ రోడ్డులో ఆవ వాంబే గృహాల ప్రాంతంలో గురువారం సాయంత్రం వాహనదారులు, పాదచారులు పొగతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాంబే గృహాల మలుపు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు, పాత వస్త్రాలు దహనం చేస్తుండటంతో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. ఈ మార్గంపై నిత్యం విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రహదారికి మరమ్మతులు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటైన కాతేరు మార్గం గుంతలతో ప్రమాదకరంగా మారింది. మలుపుల వద్ద భారీ గుంతలతో అధ్వానంగా మారింది. వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారని గత నెల 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర కథనానికి సంబంధిత శాఖ సిబ్బంది స్పందించి మరమ్మతులు చేశారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కుంగిన మ్యాన్‌హోల్

లాలాచెరువు నుంచి క్వారీ మార్కెట్ వెళ్లే మార్గంలో పోస్టల్ క్వాటర్స్ వద్ద మ్యాన్‌హోల్ శ్లాబు పూర్తిగా దెబ్బతిని కుంగిపోయింది. ఊచలతో ప్రమాదకరంగా మారింది. పాదచారులు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంపై ప్రయాణించాలంటే అప్రమత్తంగా ఉండాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతులు చేయించాలని చోదకులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

అలంకరణలో అమ్మవారు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: స్థానిక వీరభద్రాపురం ప్రాంతంలో కనక మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు అమ్మవారికి విశేషంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గురువారం వేకువజాము నుంచే భక్తులు ఆలయం వద్ద దర్శనానికి బారులుదీరారు. భక్తులే స్వయంగా అమ్మవారికి పసుపు, కుంకులతో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన భార్య మాజీ మేయర్ వీరరాఘవమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నత్తనడకన రైతుబజార్ నిర్మాణం

కడియం, ధవళేశ్వరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలో మేజర్ పంచాయతీగా పేరొందిన ధవళేశ్వరంలో రైతు బజార్ నిర్మాణ పనులు నత్తకంటే దారుణంగా నడుస్తున్నాయని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో వేగం లేదు. దాదాపు 80వేల జనాభాతో ఉన్న పంచాయతీలో సకల సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా నిత్యావసరమైన కాయగూరల కొనుగోళ్లకు నాలుగు కిలోమీటర్లు దూరాభారం తప్పడం లేదంటున్నారు.

ధవళేశ్వరంలో పునాదులకే పరిమితమైన రైతుబజార్ పనులు

పునాదులకే పరిమితం

గత వైకాపా పాలనలో రూ.65 లక్షల నిధులతో సుమారు 20 దుకాణాల సముదాయంగా ఏర్పాటుచేసేందుకు మాజీ ఎంపీ భరత్ శ్రీకారం చుట్టినా అవి పట్టాలెక్కలేక పునాదులకే చతికిలపడ్డాయి. కూటమి ప్రభుత్వం రావడంతో ఇటీవల ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు. పంచాయతీ సిబ్బంది వ్యర్థాలకు నిలయంగా వినియోగిస్తుండటంపై గ్రామస్థులు పెదవి విరుస్తున్నారు.

అనుమతులు వచ్చాయి

ధవళేశ్వరంలో అసంపూర్తిగా ఉన్న రైతుబజార్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాలతో తిరిగి అనుమతులకు ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

- సునిల్‌వినయ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, రాజమహేంద్రవరం

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: బాగా చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బాలికల సదనాన్ని గురువారం ఆమె సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి మౌలిక వసతులు, సౌకర్యాలు తదితర అంశాలు తెలుసుకున్నారు. మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా 15100ను సంప్రదించాలని సూచించారు. ● రాజమహేంద్రవరంలోని మానస ఆసుపత్రిని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి గురువారం సందర్శించారు. మానసిక చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మానసిక రుగ్మతల నుంచి కోలుకున్న వారిని తిరిగి కుటుంబ సభ్యులతో కలపడానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

చిన్నారులతో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించండి

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రిలో మూడు నెలలుగా కార్మికులకు మందుల కొరత తీవ్రంగా ఉందని భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య ఆరోపించింది. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గోదావరి ఎలక్ట్రికల్ వర్క్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈఎస్‌ఐ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. శ్రామిక భవన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వ మొండి వైఖరి వీడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆశపు శ్రీనివాస్, వీరబాబు, రాజరాజ నరేంద్ర, కూరపాటి రాజన్న, రెడ్డి అప్పలనాయుడు, రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికాస ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా రేపు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కలెక్టరేట్ వద్ద ఉన్న వికాస కార్యాలయంలో శనివారం ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ విద్యార్హతలు కలిగి 35 ఏళ్లలోపువారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 76608 23903 నంబరులో సంప్రదించాలన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం

రాజమహేంద్రవరం వైద్యం: రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో ఏడాది వైద్య విద్యార్థులు గురువారం నగరంలోని నెహ్రూనగర్ నగరపాలక సంస్థ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య విద్యాబోధన చేశారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, వ్యక్తిగత శుభ్రత, వ్యాయామం తదితర అంశాలు వివరించారు. కళాశాల కమ్యూనిటీ వైద్య విభాగం హెచ్‌వోడీ బి.శ్రీనివాసనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, నెహ్రూనగర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో వైద్య కళాశాల విద్యార్థులు

నేడు విద్యుత్తు ఉండదు..

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు విద్యుత్ ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరాను ఈ నెల 29వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలుపుదల చేస్తున్నామని ఈఈ జె.పి.బి.నటరాజన్ గురువారం ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, పాలచర్ల గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

ధవళేశ్వరం, మోరంపూడి: ధవళేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మత్తుల నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బ్యారేజి, ఇరిగేషన్ ఆఫీస్, అగ్రహారం, క్వారీ రోడ్, బత్తిన సుబ్బారావు కాలనీ, సాయి ప్రియాంక, కాటన్ పేట, ఎర్రకొండ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు.

మెరుగైన ఫలితాలకు సంకల్ప్

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్: విద్యపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే పదోతరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అమలు చేస్తుండగా ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు సంకల్ప్-2026 కార్యక్రమం పేరిట 50 రోజుల ప్రణాళిక ఈ నెల 24నుంచి అమలు చేస్తోంది. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటికే తరగతులు ప్రారంభించారు.

హైస్కూలు ప్లస్‌లతోపాటు రెసిడెన్షియల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఇంటర్ ఉత్తీర్ణతలో వెనుకబడుతున్నాయి. వీటిలో హైస్కూలు ప్లస్‌లో ఉత్తీర్ణతశాతం చాలా తీసుకట్టుగా ఉంటోంది. ఇంటర్ ఉత్తీర్ణత కాకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉత్తీర్ణతశాతాన్ని పెంచేందుకు సంకల్పించింది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు

● ఈ నెల 24 నుంచి ప్రారంభమైన ప్రణాళిక వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 వరకు అమలు చేయనున్నారు.

ప్రణాళిక ఇలా

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు యథావిధిగా కళాశాలలో తరగతులను బోధిస్తారు. ఈ సమయంలో పూర్తి చేయని సిలబస్‌ను బోధిస్తారు. ● మధ్యాహ్నం 1.20 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెప్పిన పాఠాలను పునఃశ్చరణ చేయించటం, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తారు. ● డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ● డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20వరకు ప్రీఫైనల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, మార్కులు బాగా తక్కువగా వస్తున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఉంటాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల : 02 | హైస్కూలు ప్లస్ : 04 | ఎయిడెడ్ కళాశాలలు : 01 | రెసిడెన్షియల్ : 01 | ఇంటర్ విద్యార్థులు: 2850

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

నన్నయలో ముగిసిన సీఆర్‌టీ కార్యక్రమం

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయం నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ (సీఆర్‌టీ) కార్యక్రమం విజయవంతంగా జరిగిందని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. గురువారం నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులు సందర్భానుసారం వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఓయూ ద్వారా నాంది ఫౌండేషన్ విశ్వవిద్యాలయంలో సీఆర్‌టీ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తోందని ఆమె తెలిపారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.జగన్మోహన్ రెడ్డి, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొర్రేడు రబీ నారుమడులను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మోరంపూడి: ప్రస్తుత రబీ వరి పంట కొరకు తూర్పుగోదావరి జిల్లాలో రైతులు విత్తనాలు వేసుకొని, ముమ్మరంగా నారుమళ్ళు పెంచుకొనే పనులలో నిమగ్నం అయ్యారని, ఈ తరుణంలో చేపట్టవలసిన విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్యం గురించి వివరాలను ఏరువాక కేంద్రం, రాజమహేంద్రవరం శాస్త్రవేత్తలు డా. చల్లా వెంకట నరసింహారావు, డా.మానుకొండ శ్రీనివాస్ రైతులకు తెలియజేశారు. గురువారం తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాలను వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి సందర్శించారు. ప్రస్తుత దాళ్వా సీజనులో రైతాంగం కొద్దిపాటి మెలకువలను పాటించి, నారుమడిని సంరక్షించుకొంటే మంచిదని, విత్తన శుద్ధి విధానం గురించి వివరించారు. వ్యవసాయ అధికారి భీమరాజు, చాపర్ల వెంకటేశ్వర్రావు, దాసరి గురు ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు విద్యుత్ ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరాను ఈ నెల 29వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలుపుదల చేస్తున్నామని ఈఈ జె.పి.బి.నటరాజన్ గురువారం ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, పాలచర్ల గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

ధవళేశ్వరం, మోరంపూడి: ధవళేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బ్యారేజి, ఇరిగేషన్ ఆఫీస్, అగ్రహారం, క్వారీ రోడ్, బత్తిన సుబ్బారావు కాలనీ, సాయి ప్రియాంక, కాటన్ పేట, ఎర్రకొండ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యం

అనపర్తి గ్రామీణం: బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో బాల వివాహ్ ముక్త్ భారత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వర్చువల్‌గా సీడీపీవో కృష్ణవేణి, అంగన్వాడీలు, ఏఎన్‌ఎంలు, వీవోలు, ఆశా వర్కర్లతో కలిసి ఆయన పాల్గొన్నారు.

రైతుకు కరపత్రం అందజేస్తున్న గోరంట్ల రవి

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

బొమ్మూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని టీడీపీ గ్రామీణ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. హుకుంపేటలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ వైస్ ప్రెసిడెంట్ మార్ని వాసుదేవరావు మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేరుస్తున్నారన్నారు. రైతులకు కరపత్రాలను అందజేశారు. మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సూర్య రమేష్, బొప్పన శ్రీనివాస్, దుద్దుపూడి రమేష్, మద్దిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

నత్తనడకన రైతుబజార్ నిర్మాణం

ఆకాశాన్నంటుతున్న కాయగూరల ధరలు

కడియం, ధవళేశ్వరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలో మేజర్ పంచాయతీగా పేరొందిన ధవళేశ్వరంలో రైతు బజార్ నిర్మాణ పనులు నత్తకంటే దారుణంగా నడుస్తున్నాయని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో వేగం లేదు. దాదాపు 80వేల జనాభాతో ఉన్న పంచాయతీలో సకల సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా నిత్యావసరమైన కాయగూరల కొనుగోళ్లకు నాలుగు కిలోమీటర్లు దూరాభారం తప్పడం లేదంటున్నారు.

ధవళేశ్వరంలో పునాదులకే పరిమితమైన రైతుబజార్

పునాదులకే చతికిల..

గత వైకాపా పాలనలో రూ.65 లక్షల నిధులతో సుమారు 20 దుకాణాల సముదాయంగా ఏర్పాటుచేసేందుకు మాజీ ఎంపీ భరత్ శ్రీకారం చుట్టినా అవి పట్కాలెక్కలేక పునాదులకే చతికిలపడ్డాయి. కూటమి ప్రభుత్వం రావడంతో ఇటీవల ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు. పంచాయతీ సిబ్బంది వ్యర్థాలకు నిలయంగా వినియోగిస్తుండటంపై గ్రామస్థులు పెదవి విరుస్తున్నారు. బయటమార్కెట్లలో అధిక ధరలతో కాయగూరల కొనుగోళ్లతో చేతిచమురు వదులుతోందన్నారు.

కడియంలో మళ్లీ మొదటికి

కడియం మండలంలో రైతుబజార్ ఏర్పాటు తీరని కలగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా హయాంలో చికెన్ మార్కెట్ ఎదురుగా స్థలాన్ని కేటాయించి ఎన్నికల ముందు హడావిడిగా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ స్థలంలో ఉపవిద్యుత్తు కేంద్రం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. దాంతో రూ.40లక్షలతో ప్రతిపాదించిన సుమారు 8దుకాణాల రైతుబజార్ నిర్మాణ పనులను వేరే చోటుకు మార్పుచేశారు. కాగా నేటికీ ఆ పనులు కార్యరూపం దాల్చలేదు.

అనుమతులు వచ్చాయి

ధవళేశ్వరంలో అసంపూర్తిగా ఉన్న రైతుబజార్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాలతో తిరిగి అనుమతులకు ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది. అక్కడ ఆమోదం పొందడంతో ఇటీవల టెండర్లను ప్రకటించాం. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. కడియంలో రైతుబజార్ ఏర్పాటుకు స్థలాన్ని ఖరారు చేయలేదు.

– సునిల్‌వినయ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, రాజమహేంద్రవరం

హరిత నిలయాలుగా కడియం నర్సరీలు

సత్యదేవా నర్సరీలో ఒడిశా ఎన్నికల అధికారుల బృందం

కడియం, న్యూస్‌టుడే: కడియంలోని నర్సరీలు పచ్చని హరిత నిలయాలుగా కొలువుదీరాయని ఒడిశా ఎన్నికల అధికారుల బృందం కొనియాడారు. కడియపులంకలోని సత్యదేవా నర్సరీని గురువారం ఒడిశా జిల్లా పరిషత్ ఛైర్మన్‌తో పాటు 32మందితో కూడిన ఎన్నికల బృందం సందర్శించారు. వారంతా నర్సరీలో పెంచుతున్న దేశీయ, విదేశీ మొక్కల పోషక వివరాలపై అధ్యయనం చేశారు. వాటి శాస్త్రీయనామాలను రైతు పుల్లా పెద్దసత్యనారాయణ వారికి వివరించారు. ఎస్.భాస్కర్ నాయక్, కితీశ్‌మిశ్రా, సోవురవ్‌కుమార్, డాక్టర్ పుల్లా రామకృష్ణ, కడియం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PEPAKAYALA SATYAVENI Wife of PEPAKAYALA SATYANARAYANA, Resident of D.No.4-113/A, Chinna Doddigunta (V), Rangampeta (M), E.G. District, I have changed my name from PEPEAKAYALA SATYAVATHI (Old Name) to PEPAKAYALA SATYAVENI (New Name) Hence I am being called PEPAKAYALA SATYAVENI As per Affidavit dated 27-11-2025 for all Purposes P. SASIDHARA KUMARI Advocate - Notary, Rajamahendravaram.

పదవీవిరమణ శుభాకాంక్షలు

విధి నిర్వహణలో గత 30 సం॥లుగా అంకితభావంతో పనిచేసి, ఎంతోమంది విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిదిద్ది, నేడు పదవీవిరమణ చేయుచున్న శ్రీ సబ్బితి రాజు గార్కి, మా శుభాకాంక్షలు.

భార్య: రాజరాజేశ్వరి

కుమారుడు: S.ఆనంద్‌కుమార్

కుమార్తెలు: గుర్రం హేమలత, గుడివాడ యోచనిబేబి

అల్లుళ్లు: కిరణ్‌కుమార్, నిషాంత్ రాజు

శ్రీమతి & శ్రీ సబ్బితి రాజు గారు, MA, B.Ed, PSHM, MPPS-II, రఘుదేవపురం, అధ్యక్షులు: UTF, సీతానగరం మండలం

మనుమలు: G.లాస్యప్రణతి, డెనీస్, జోషిక గ్రేస్

శుభాకాంక్షలతో: UTF, సీతానగరం మండలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, MPPS-II, రఘుదేవపురం

పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, రాజానగరం: గోదావరి పుష్కరాల దృష్ట్యా రహదారులు, తాగునీటి సరఫరా పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. 2027 నాటికి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బలరామకృష్ణ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రహదారులు, భవనాలు, ఇంజినీరింగ్, ఎంపీడీవోలు తదితర వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రాజానగరం - బూరుగుపూడి, దివాన్‌చెరువు - పుణ్యక్షేత్రం, రాజానగరం - చిన్నకొండేపూడి, మోరంపూడి - పుణ్యక్షేత్రం, కోరుకొండ - గాదరాడ, రాపాక - చిన్నకొండేపూడి, శ్రీరంగపట్నం - పోలిస్‌రాజగర్లి, శ్రీకృష్ణపట్నం - సిడిగొయ్యి, రాజవోలు - కొండగుంటూరు రోడ్ల పనుల ప్రతిపాదనలు సంబంధిత శాఖల అధికారులు ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటికే పూర్తి చేసిన పంచాయతీరాజ్ రోడ్ల పనులు శంకుస్థాపనకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రూ.30 కోట్లతో పుష్కరాలలో పీఆర్ రోడ్ల పనులు ప్రాధాన్యత ప్రకారం తయారు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పథకానికి సంబంధించి బూరుగుపూడి, మునగాల, దోసకాయలపల్లి, కోటికేశవరం, జంబూపట్నంలో చేపట్టిన మంచినీటి సరఫరా పనులు వేగవంతం చేయాలన్నారు. దివాన్‌చెరువు, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడలో మంచినీటి సరఫరా పనులు సమీక్షించారు. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడికి వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రతిపాదన ప్రభుత్వానికి నివేదించామన్నారు.

జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపిక

కొంతమూరు: కొంతమూరు ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న టి.సంపత్ కుమార్ జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం బి.రత్నకళ తెలిపారు. 69వ ఎస్జీఎఫ్ అండర్ 19 యోగాసన పోటీలు బాపట్ల జిల్లా చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23 నుంచి 25 వరకు జరిగాయి. వాటిలో పాల్గొని ప్రథమ స్థానం సాధించి, జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు.

జీజీయూ ఆధ్వర్యంలో పాఠశాలల్లో పోటీలు

రాజానగరం: జీజీయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శ్రీకృష్ణపట్నం హెచ్‌ఎం ఎం.డి.అక్బర్, చక్రద్వారబంధం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయానంద్, జీజీయూ భౌతికశాస్త్ర అధ్యాపకులు ఎ.శాంతిలత, జ్యోత్స్న, పీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో విద్యార్థులు రాణించాలి

గోకవరం: చక్కని ప్రణాళికతో విద్యార్థులు చదువులో రాణించాలని ఎంఈవోలు బి.గౌరమ్మ, చిమ్మరాజుదొర అన్నారు. భూపతిపాలెం గురుకుల పాఠశాలలో అలుమ్ని పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీరు హాజరయ్యారు. అయిదో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వీరి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. దీంతో పాటు విద్యార్థులకు రూ.50వేలతో సమకూర్చిన విద్యా సామగ్రిని అందజేశారు.

విమానాశ్రయంలో ప్రముఖులకు స్వాగతం

కోరుకొండ: రాజమహేంద్రవరం విమానాశ్రయంలో గురువారం పలువురు ప్రముఖులకు స్వాగతం పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ చైతన్య సదస్సులో హాజరయ్యేందుకు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, ప్రముఖ ఉద్యమకారుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్‌కు విమానాశ్రయంలో పలువురు స్వాగతం పలికారు. రాష్ట్ర మూల్ నివాసి సంఘ్ అధ్యక్షుడు మార్గాని చంటిబాబు, కండవల్లి లక్ష్మి, మేకల లక్ష్మీపతి, వియ్యపు రాఘవేంద్ర యాదవ్, నాగ్వేరరావు, భీమన వెంకటేశ్వర గౌడ్, బొల్లా శ్రీనివాస్, పాక సూర్యచంద్రరావు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బలభద్రపురం శాఖ

13వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ఖాతాదారులకు విశిష్ట సేవలు అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బలభద్రపురం శాఖ నేడు 13వ వార్షికోత్సవం జరుపుకొంటున్న శుభవేళ బ్రాంచి మేనేజర్ శ్రీ G.రాధాకృష్ణ గార్కి మరియు బ్యాంకు సిబ్బందికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

మేడపాటి ఆనందరెడ్డి

MPTC సభ్యులు, సెల్: 94412 42418

బలభద్రపురంలో తొలి YSR విగ్రహ నిర్మాణ దాత

బలభద్రపురం గ్రామ YSRCP వ్యవస్థాపక అధ్యక్షులు

శ్రీ లక్ష్మీగణపతి ట్రేడర్స్

ప్రొ: కర్రి రామచంద్రారెడ్డి, కర్రి నాగేంద్రరెడ్డి, బలభద్రపురం

దేవర వెంకన్నబాబు

బలభద్రపురం, సెల్: 9293 1515 75

ఇసుక తిప్పలు తప్పడం లేదు

ఇసుక లోడు లారీలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బాలాజీపేట నుంచి బొమ్మూరుకు వెళ్లే మార్గంలో నిత్యం లోడు లారీలు ఇష్టానుసారం తిరుగుతున్నాయి. లారీలపై టార్పాలిన్ వేయకపోవడంతో బాలాజీపేట పైవంతెన నుంచి బొమ్మూరు రోడ్డు పొడవునా ఇసుక ఉంటుంది. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు బ్రేక్ వేస్తే అదుపుతప్పి పడిపోతున్నామని చెబుతున్నారు. నెలల తరబడి ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నా ఎవరికీ పట్టడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

రైతులతో కలెక్టర్ ముఖాముఖి

స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

మోరంపూడి: తొర్రేడు గ్రామంలో గురువారం నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి పాల్గొని రైతులతో మాట్లాడారు. వరి సాగు వల్ల కలిగే లాభాలు, ఖర్చులు విషయాలను వారితో సమీక్షించారు. సేంద్రియ వ్యవసాయం వైపు మారడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చుని, ఆరోగ్యకరమైన పంటలు సాగు చేయడం సాధ్యమవుతుందని అన్నారు. పంట మార్పిడి విధానంలో హార్టికల్చర్ పంటల సాగును పరిశీలించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మిర్తిపాడు గ్రామంలో కళ్లాల్లో నిల్వ సమస్యలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, సహాయ సంచాలకులు రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీకేంద్రం పరిశీలన

ధవళేశ్వరం, మోరంపూడి: జిల్లా కలెక్టర్ కీర్తి తొర్రేడు అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఆరోగ్య సేవల నాణ్యత, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, సకాలంలో నిర్వహించవలసిన వైద్య పరీక్షలు, రికార్డుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. ప్రతి చిన్నారి కోసం చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్, హెల్త్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

దుర్గాదేవి ఆలయానికి భూమిపూజ

బిక్కవోలు: బలభద్రపురం తూర్పు శెట్టిబలిజ పేటలో దుర్గాదేవి ఆలయానికి గురువారం భూమిపూజ చేశారు. బలభద్రపురానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు దత్తుడు సుబ్బారెడ్డి, మానస దంపతులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి ఈ దేవాలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నారు. రూ. 10 లక్షల వ్యయంతో దేవాలయం నిర్మిస్తున్నట్లు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ● పందలపాకలో వీరభద్రుని దేవాలయానికి గురువారం భూమిపూజ జరిగింది. అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కర్రి వీర్రాజు, మంగయమ్మ దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు జరిగాయి.

కోరుకొండలో రామసేన కార్యాలయం ప్రారంభం

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండలో గురువారం రాత్రి రామసేన కార్యాలయం అట్టహాసంగా ప్రారంభమైంది. విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు కార్యాలయాన్ని ప్రారంభించారు.

బాలిక అదృశ్యంపై కేసు

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట మండలం వెంకటాపురానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో స్థానికంగా, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రి వెంకన్నబాబు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

పాఠశాలకు రూ.2 లక్షలు ఆర్థిక సాయం

గణేశ్వరరావుని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: హుకుంపేట డీ బ్లాక్‌లోని ఇంద్రానగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలకు దాసరి.గణేశ్వరావు రూ.2లక్షలు చెక్కును ప్రధానోపాధ్యాయుడు ఎస్.శేషగిరిరావుకు బుధవారం అందజేశారు. ఎన్‌ఆర్‌ఐగా అమెరికాలో స్థిరపడిన తన మిత్రుడు పాఠశాలకు సహాయం అందించడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పాఠశాలలో డిజిటల్ తరగతులు, ఇతర సదుపాయాలు కోసం సహాయం చేసానని గణేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారు ఎందరో ఉన్నత పదవుల్లో ఉన్నారని ఆయన విద్యార్థులకు తెలిపారు.

పూర్వవిద్యార్థి రూ.లక్ష విరాళం

గోకవరం: 'పది' పరీక్షల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు ఏటా నగదు పురస్కారం అందించేందుకు రంపయర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిధిని ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల పూర్వవిద్యార్థి ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కోనాల గౌరీశంకర్ గురువారం రూ.లక్ష విరాళాన్ని ఉపాధ్యాయులకు అందజేశారు. గౌరీశంకర్‌ను స్థానికులు అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న డీఐజీ

బిక్కవోలు, న్యూస్‌టుడే: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఏలూరు డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆయనకు ఉత్సవ కమిటీ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పండితుల ఆశీర్వచనం గావించారు.

కనులపండువగా రథోత్సవం

బిక్కవోలు: బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పూజల అనంతరం రథంపై అలంకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి రథయాత్రను ప్రారంభించారు. రథం లాగటానికి భక్తులు పోటీ పడ్డారు. కోలాట నృత్యాలు, కేరళ డాన్సులతో కళాకారులు అలరించారు. ● వివిధ రకాల బాణసంచా సామగ్రిని నిర్వాహకులు వెలిగించి ప్రేక్షకులను అలరించారు.

ఖండన ప్రకటన

మా క్లయింట్ కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, కరకుదురు గ్రామ కాపురస్తులు పెమ్మనబోయిడి శివసుబ్రహ్మణ్యంగారి భార్య భారతి విజయలక్ష్మి మాకు ఇచ్చిన సంజాయిషీపై, కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, తిప్పరాజు పాలెం గ్రామం, డోర్ నెం.2-87రు కాపురస్తులు పామర్తి సుదీప్తి, వీరి కుమార్తె కేతన శ్రీ మహాలక్ష్మి గార్లు ది.24-11-2025న ఈనాడు దినపత్రిక తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లో ఇచ్చిన ప్రకటనను ఖండిస్తూ యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మా క్లయింటు ది.25-07-2025న (డాక్యుమెంటు నెం. 9485/2025) సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, కాకినాడలో రిజిస్ట్రీ కాబడి మా క్లయింట్కు దఖలు పడిన షెడ్యూలు ఆస్తి యందు పూర్తి హక్కుదారులై ఉన్నారు. సదరు ఆస్తిపై పామర్తి సుదీప్తికి గాని, వారి కుమార్తె కేతన శ్రీ మహాలక్ష్మి గార్కి గాని ఎట్టి హక్కును, అధికారములు లేవు. సదరు దస్తావేజు చట్టప్రకారము మా క్లయింట్కు పూర్తి హక్కును అధికారమును ఇచ్చియున్నది. వారి హక్కును మరియు అనుభవభుక్తములకు వ్యతిరేకముగా ఎవరు ప్రయత్నించినను వారు చట్టప్రకారం శిక్షార్హులు.

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం సబ్-రిజిస్ట్రీ, పాలచర్ల గ్రామం, రి.స.నెం.675, య.3.2560 సెంట్లు, ఆంధ్రప్రదేశ్ రైట్ ఆఫ్ రికార్డ్స్ చట్టం ప్రకారం స.నెం.675, ఎల్.పి.నెం. 1377 ప్రకారం య.3.2560 సెంట్లు జిరాయితీ మెరక వివరములు.

తూర్పు : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల తాలూకు భూమి కొంత మేర, యితరుల తాలూకు భూమి కొంత మేర; **పడమర :** దాట్ల రాజేశ్వరి గారి భూమి కొంత మేర, రుద్రరాజు విశ్వనాథరాజు గారి భూమి కొంత మేర; **ఉత్తరం:** యితరుల తాలూకు భూమి;
దక్షిణం : పామర్తి వెంకట్ గారి భూమి.

యావత్తు ఈజిమెంటు హక్కులతో సహా.

గాదం సత్య ప్రభాకరరావు,
న్యాయవాది
అశోక్ నగర్,
కాకినాడ

స్థలం: కాకినాడ
తేది: 27-11-2025.
మొబైల్ నెం.9441712729

విద్యార్థి దశలోనే రాజ్యాంగ పరిచయం

అనపర్తి గ్రామీణం: విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు అన్నారు. అనపర్తి కేపీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని ఉన్నతపాఠశాల విద్యార్థులకు పులుగుర్త జడ్పీఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆర్థిక సౌజన్యంతో రాజ్యాంగంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదును ఆయన అందజేశారు. అనంతరం గొల్లపల్లి సత్యనారాయణను సత్కరించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు అందజేస్తున్న డీఈవో వాసుదేవరావు

కోరుకొండ: కోరుకొండ ప్రాథమిక పాఠశాలలో ఎస్సై కేవీ నాగార్జున వారి సిబ్బంది పాల్గొని రాజ్యాంగ విశిష్టతను వివరించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్- 1 ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో మత్తు పదార్థాలు, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ శీలం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ కె.వి.స్వామి పాల్గొన్నారు.

విజయవంతంగా రోబోటిక్ థైరాయిడ్ శస్త్రచికిత్సలు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని డెల్టా, ఎపెక్స్ ఆసుపత్రుల్లో రోబోటిక్ థైరాయిడెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశామని రోబోటిక్ -అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నితిన్ రిమ్మలపూడి పేర్కొన్నారు. నగరంలోని డెల్టా ఆసుపత్రిలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో మొదటిసారిగా ఎస్ఎస్ఐ మంత్రా-3 రోబోటిక్ సర్జికల్ ప్లాట్‌ఫాం సాయంతో చేశామన్నారు. ప్రముఖ సర్జన్ ఆర్.భాస్కరచౌదరి మార్గదర్శకంలో డాక్టర్ నితిన్, డాక్టర్ సుమంత్ ఇటీవల ముగ్గురు రోగులకు రోబోటిక్ విధానంలో థైరాయిడ్ తొలగింపు శస్త్రచికిత్సలు చేశారన్నారు. ఈ విధానం వల్ల మెడపై ఎలాంటి మచ్చ కనిపించదన్నారు. 3డీ విజువలైజేషన్ ద్వారా అత్యంత కచ్చితత్వంతో జరుగుతుందన్నారు. నరాలు, పారాథైరాయిడ్ గ్రంథులకు మెరుగైన సంరక్షణ ఉంటుందన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ

రాజానగరం: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని గురువారం రాజానగరంలో నిర్వహించారు. రాజానగరం సీడీపీఓ జి.గౌరమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యానికి ఆటంకాలని అన్నారు. ఈమేరకు 27 నవంబరు 2025 నుంచి మార్చి 2006 వరకు వంద రోజుల ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బలభద్రపురం శాఖ

13వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

బలభద్రపురం బ్యాంకు మేనేజర్ మరియు సిబ్బంది

ఖాతాదారులకు విశిష్ట సేవలు అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బలభద్రపురం శాఖ నేడు 13వ వార్షికోత్సవం జరుపుకొంటున్న శుభవేళ బ్రాంచ్ మేనేజర్ శ్రీ G.రాధాకృష్ణ గార్కి మరియు బ్యాంకు సిబ్బందికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

కొవ్వూరి సుజాత వెంకటరామారెడ్డి
మాజీ సర్పంచ్, గ్రామ YSRCP అధ్యక్షులు, సెల్: 81799 73888

ద్వారంపూడి దుర్గారెడ్డి
జిల్లా YSRCP యువజన విభాగం, బలభద్రపురం, సెల్: 94946 63635

శ్రీ ఆంధ్రా షిర్డిసాయి మందిర్ ఆలయకమిటీ
కెనాల్ రోడ్, బలభద్రపురం

కొవ్వూరి సతీష్‌రెడ్డి
S/o వెంకటరెడ్డి, బలభద్రపురం
సెల్: 98667 66888

బుంగా రామారావు
సర్పంచ్, బలభద్రపురం
97049 46888

S.బుల్లయ్య రెడ్డి ఫిల్లింగ్ స్టేషన్
(IOC డీలర్స్), బలభద్రపురం
సెల్: 95818 71199

శ్రీ వెంకటసాయి ట్రేడర్స్
కాంట్రాక్టర్: శ్రీనివాస్
రైస్ & ఫ్లోర్‌మిల్
మేనేజర్: తేతల వెంకటరెడ్డి (శ్రీను), బలభద్రపురం
సెల్: 89852 51297

కర్రి వెంకటరెడ్డి
Advocate
K.V.R. ఎలక్ట్రికల్ & హార్డ్‌వేర్
సాయిబాబా గుడి పక్కన, బలభద్రపురం
సెల్: 77801 17545

లక్ష్మీగణపతి ఫ్యామిలీ మెడికల్స్
బలభద్రపురం
కొవ్వూరి వీరరాఘవరెడ్డి
సెల్: 83281 76309

శ్రీ మణికంఠ బిజినెస్
(ఎరువులు, పురుగు మందుల వ్యాపారం)
ప్రొ: కొవ్వూరి వెంకటరెడ్డి
పంచాయతీ ఆఫీస్ ఎదురుగా, బలభద్రపురం
సెల్: 99898 43404

మాచవరపు శ్రీనివాసు
VRO, బలభద్రపురం, సెల్: 98855 59117

(c) eenadu

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

నిర్దిష్ట సమయానికి సరకులు దుకాణాలకు చేర్చాలి

హమాలీలతో మాట్లాడుతున్న ఏఎస్‌వో ఆంజనేయులు

గోపాలపురం, న్యూస్‌టుడే: మండలస్థాయి స్టాక్ పాయింట్ నుంచి సరకులు నిర్దిష్ట సమయానికి రేషన్ దుకాణాలకు చేర్చాలని ఏఎస్‌వో ఎం.ఆంజనేయులు సూచించారు. గోపాలపురంలోని మండలస్థాయి నిత్యావసర సరకుల స్టాక్ పాయింట్‌లో రవాణా ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. దస్త్రాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం, దేవరపల్లి పౌరసరఫరాల డీటీలు దివాకర్‌బాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

ఉండ్రాజవరం: రాజ్యాంగాన్ని గౌరవించాలని, అందులో పొందుపరిచిన విషయాలను విద్యార్థులంతా తెలుసుకోవాలని ఎంఈవోలు శారదజ్యోత్స్న, సక్సేనారాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉన్నత పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ముత్యం

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు డిప్యూటీ ఎంపీడీవోగా దాసరి ముత్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. పంగిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు. ఆయనను ఎంపీడీవో టీబీవీ రమణ, పంగిడి సర్పంచి గోశాల నాగార్జున, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, తదితరులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని తాడిపర్రు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో గణపతి, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సూర్యభగవానుడు, నవగ్రహాలు, కాలభైరవస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం వేడుకగా జరిగాయి. మంత్రి కందుల దుర్గేష్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు తదితరులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరు దాటితే అంధకారమే
గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిలో దుస్థితి

● ఈ ఏడాది సెప్టెంబరు 20వ తేదీ రాత్రి దేవరపల్లిలోని డైమండ్ జంక్షన్ సమీపంలోని హోటల్‌లో భోజనం చేసేందుకు రోడ్డు దాటుతున్న ప్రకాశం జిల్లాకు చెందిన లారీ డ్రైవర్‌ను అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

● దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద సెప్టెంబరు 4వ తేదీ తెల్లవారుజామున 11 మందితో వెళుతున్న వ్యాన్ డ్రైవర్ గమనించక లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అప్పటికే ఆ ప్రాంతంలో లారీని కంటైనర్ ఢీకొట్టింది. అక్కడ దీపాలు లేక అంధకారం నెలకొనడమే ప్రమాదాలకు కారణం.

– న్యూస్‌టుడే, దేవరపల్లి

నిర్మాణ లోపాలో.. అధికారుల నిర్లక్ష్యమో తెలియదుగాని ఆ జాతీయ రహదారిలో ప్రయాణమంటేనే భయపడాల్సి వస్తోంది. ఎటునుంచి ఏ రూపంలో మృత్యువు ఎదురవుతుందోనని వాహనదారుల బెంబేలెత్తిపోతున్నారు. ఏలూరు జిల్లా గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు 16వ నంబరు జాతీయ రహదారిని 2021లో రూ.1800 కోట్లతో నిర్మించారు. కొన్ని ప్రమాదకర ప్రాంతాల్లో సైతం దీపాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల అంధకారం నెలకొనడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అయినా జాతీయ రహదారుల సంస్థ అధికారులకు పట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కృష్ణంపాలెం సమీపంలో అరకొర వెలుగులు

ప్రధానంగా ఎక్కడెక్కడంటే..

నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం నుంచి కొవ్వూరు వరకు సుమారు 53 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించి ఉంది. ★ నల్లజర్ల మండలంలోని దూబచర్ల, ఘంటావారిగూడెం గ్రామాల్లో అండర్ పాస్‌ల వద్ద విద్యుత్తు దీపాలున్నా వెలగడం లేదు. ★ దేవరపల్లి మండలంలోని డైమండ్ జంక్షన్ నుంచి యాదవోలు వరకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై ఒక్క విద్యుత్తు దీపమైనా లేదు. ★ కొత్తగూడెం నుంచి కృష్ణంపాలెం వరకు డివైడర్‌పైనా ఇదే పరిస్థితి. ★ డైమండ్ జంక్షన్, యాదవోలు, కొత్తగూడెం వంతెనలపై విద్యుత్తు దీపాలున్నా వెలగడం లేదు. ★ గౌరీపట్నం నుంచి దుద్దుకూరు వరకు ఇదే సమస్య నెలకొంది.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం : మండలంలోని చివటం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గామహేశ్వరరావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : పాతఊరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో హుండీలను లెక్కించగా రూ.60,512 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారి మీసాల నాగరాజు గురువారం తెలిపారు. సుబ్రహ్మణ్య షష్టి పర్వదినం సందర్భంగా ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.31,220 హుండీల ద్వారా రూ. 29,292 సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మోటూరి బాలకృష్ణ, సూరపనేని సోమశేఖర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే జీవితానికి పరిపూర్ణత

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, న్యూస్‌టుడే: విద్య మనిషికి వెలుగునిస్తే, ఆధ్యాత్మికత జీవితానికి పరిపూర్ణత అందిస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని గౌరిపల్లిలో రామాలయం నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన రైతు సేవలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాగులోనూ మహిళలు రాణించాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మహిళలను సాగు దిశగా ప్రోత్సహించి.. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించేలా చేసి ఆర్థిక వృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. కొవ్వూరు మండల సమాఖ్య కార్యాలయంలో డివిజన్ స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో) సిబ్బందికి గురువారం నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. వ్యవసాయం, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక శాఖలు, ప్రకృతి వ్యవసాయం, నాబార్డు, బ్యాంకు అధికారులు పర్యావరణ హితంగా ఉండే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా ఉండే పంటలను సాగు చేసే విధానం, వాటి రూపాన్ని మార్చి విలువను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందడంపై వివరించారు. ఎఫ్‌పీవోలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం హిఫర్ ఇంటర్నేషనల్ భాగస్వామ్యంతో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని పీడీ మూర్తి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎఫ్‌పీవోలకు శిక్షణ ఇస్తామన్నారు. ఏపీడీ సత్యం నాయుడు, ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్, ఉద్యాన అధికారి సుధీర్ మాట్లాడారు. డీపీఎంలు హేమంత్, సత్యవేణి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం తాతారావు, అదనపు డీపీఎం ఎస్కే వలి, బ్యాంకు అధికారులు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యసిస్తున్న విద్యార్థిని, విజేతలతో శ్రీసద్గురు పాఠశాల ప్రిన్సిపల్ కంఠమణి కీర్తిశ్రీ, కరస్పాండెంట్ వెంకటరత్నం, తదితరులు

ప్రసంగించి.. బహుమతి సాధించి
'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

కొవ్వూరు పట్టణం: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలోని శ్రీసద్గురు పాఠశాలలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని చక్కగా ఉపన్యసించి ప్రతిభ చాటారు. టి.సారిక (9వ తరగతి), ఆర్.చంద్రిక, కె.భరత్ శ్రావణ్ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపల్ కంఠమణి కీర్తిశ్రీ, కరస్పాండెంట్ పాలెంపాటి వెంకటరత్నం చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

★ 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో వాడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ఉపన్యసించి ఆకట్టుకున్నారు. వి.విన్ని, కె.అస్మిత (9వ తరగతి), బి.నాగవర్షిణి (7వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ఉపాధ్యాయులు పి.విమల, పి.రాంబాబు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపన్యసిస్తున్న విద్యార్థిని. విజేతలతో వాడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.విమల, పి.రాంబాబు, తదితరులు

'కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు'

కొవ్వూరు పట్టణం : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించాలని చూస్తోందని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులకు నష్టాన్ని తెచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ కోరమాండల్ కాంక్రీట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. యూనియన్ కార్యదర్శి బీర రవి అధ్యక్షత వహించగా సుందరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను అమల్లోకి తెచ్చారన్నారు. వీటిని రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. కోరాడ రామకృష్ణ, బట్టు సాంసంగ్, టి.రాంబాబు, పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శైలజ ఎంపిక

చాగల్లు: గత నెల దేవరపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో చాగల్లు మండలం చిక్కాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.శైలజ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు తెలిపారు. ఆమె రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఇది మూడోసారని చెప్పారు. ఆమెను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం

కార్తిక్

నిడదవోలు: వినుకొండలో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్‌త్రో అండర్-17 విభాగంలో మండలంలోని తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పంతులు కార్తిక్ ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించాడు. కార్తిక్, వ్యాయామోపాధ్యాయుడు బండి ప్రదీప్‌ను ప్రధానోపాధ్యాయిని సీహెచ్ పద్మ, గ్రామస్థులు అభినందించారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

చిన్నారుల గీతాలాపన

వజ్రోత్సవం.. ఉత్తేజం

నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవాలు రెండో రోజు గురువారం సందడిగా సాగాయి. జలవనరుల అభివృద్ధి శాఖామంత్రి రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో పురప్రజలు ఉత్సవాలకు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

వాసవీమాతకు 102 గోత్రాల రజత హారం

నిడదవోలు : నిడదవోలు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ గుడ్‌విల్ విజిట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా వాసవి అమ్మవారికి 102 గోత్రాల రజిత హారాన్ని బహూకరించారు. రెండు సిమెంట్ బెంచీలు, సింగవరంలో గోవులకు గరుకు స్తంభం ప్రతిష్ఠాపన, చర్ల సుశీలా వృద్ధాశ్రమానికి హైడ్రాలిక్ బెడ్, అయ్యప్ప స్వామి అన్నదాన కార్యక్రమానికి వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకు అందించారు. కార్యక్రమంలో మడిపల్లి భాస్కరం, క్లబ్ అధ్యక్షురాలు గొల్లపూడి గాయత్రి, కార్యదర్శి జవ్వాది శిరీష, కోశాధికారి ఉదయగిరి మణి పాల్గొన్నారు.

హారాన్ని అందిస్తున్న రామకృష్ణ

ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

నిడదవోలు : మండలంలోని పందలపర్రు ఉమామల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఛైర్మన్‌గా గొల్లపల్లి మురళీకృష్ణ, సభ్యులుగా భోగిరెడ్డి సుబ్బారావు, పులిమి సూర్యనారాయణ, సింగనపూడి మందేశ్వరరావు, అయినవల్లి యేసు, గొలుగొండ వెంకటలక్ష్మి, తొంటపాక వెంకటలక్ష్మి, పుల్లేటికుర్తి కనకదుర్గ, కప్పల సుజాత, ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా బాదంపూడి సూర్యనారాయణమూర్తితో దేవాదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీనరసింహరావు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సోమాల శివ, నాయకులు అత్తిలి వెంకటరామన్, అత్తిలి సోమశేఖర్, తోరం వీరన్న, ఆకుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రైసుమిల్లు తనిఖీ

తాళ్లపూడి: పైడిమెట్టలోని శ్రీలక్ష్మీసాయి రైసుమిల్లును తహసీల్దార్ లక్ష్మీలావణ్య గురువారం తనిఖీ చేశారు. అక్కడున్న రైతులతో మాట్లాడి గోనెసంచులు, రవాణా తదితర అంశాలపై ఆరా తీశారు. ఆమె వెంట వీఆర్వో నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

బహుమతులు అందజేత

గోపాలపురం, న్యూస్‌టుడే: రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని చెరుకుమిల్లి సొసైటీ ఆధ్వర్యంలో చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన 14 మందికి సొసైటీ పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు గురువారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గద్దె హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

నిడదవోలు : ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మానవతా ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు అన్నదానం చేశారు. పట్టణంలోని చర్ల సుశీలా వృద్ధాశ్రమం, తిమ్మరాజుపాలెం, కైలాస భూమి, లింగంపల్లిలోని రోటరీ వృద్ధాశ్రమం, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ మేనేజర్ బి.శ్రీనివాస్, మానవతా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : బాలుడి అదృశ్యంపై పట్టణ స్టేషన్లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణానికి చెందిన 15 ఏళ్ల నాగ ఏడుకొండలు, అతని సోదరి లక్ష్మీదుర్గ స్థానిక సంస్కృతోన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఈనెల 25న ఇద్దరూ పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్నం సోదరుడి కోసం లక్ష్మీదుర్గ వెళ్లగా తరగతి గదిలో బ్యాగు మాత్రమే కనిపించింది. దీంతో ఇంటికి వచ్చి చెప్పగా తల్లి అలేఖ్య పాఠశాలకు వచ్చి వెతికారు. బయట, చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో పట్టణ స్టేషన్లో ఫిర్యాదు చేయగా హెడ్‌కానిస్టేబుల్ సాంబమూర్తి కేసు నమోదు చేశారు.

పిల్లలతో స్నేహభావంతో మెలగాలి

తాళ్లపూడి: పిల్లలతో స్నేహభావంతో మెలుగుతూ వారికి అర్థమయ్యే రీతిలో మంచి, చెడుల గురించి వివరించాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బాల్య వివాహ ముక్త్ భారత్(బీవీఎంబీ)పై అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. పిల్లలు చెడు ప్రభావాలకు లోనుకాకుండా ఉపాధ్యాయులు చూడాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంఈవోలు బాలామణి, నెప్రూా, సెక్టార్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

గోపాలపురం : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ సీడీపీవో మమ్మీ అధ్యక్షతన గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల ఇబ్బందులు, సమస్యలపై వివరించారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోహార్, ఎంఈవో జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల : నల్లజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఎస్వీ కృష్ణవేణి, ఎం.హారతి, టి.వెంకటలక్ష్మి, హెచ్‌ఎం తులసి కోమలిచిత్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా, వైకాపా సభ్యులు (అంతర చిత్రం) ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి

పారిశుద్ధ్య నిర్వహణ తీరు మారదా..?
పురపాలక సమావేశంలో కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరు అధ్వానంగా ఉందని, అధికారుల పర్యవేక్షణ లేమి స్పష్టంగా కనిపిస్తోందని తెదేపా, వైకాపా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవ్వూరు పురపాలక సంఘ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ప్రభుత్వ కాలనీలకు తాగునీటి సరఫరా, ప్రధాన డ్రెయిన్ల శుభ్రత, వీధి దీపాల మరమ్మతులు తదితర ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదించింది. తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని మాట్లాడుతూ ఖాళీ స్థలాలు, రహదారుల పక్కన, బైపాస్ రోడ్ల పక్కన ఇష్టరీతిన చెత్త, ఇతర వ్యర్థాలు పోస్తున్నారని, సేకరణ తీరు కూడా బాగోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2వ వార్డు కౌన్సిలర్ కోడూరి శివరామకృష్ణ మాట్లాడుతూ 7వ వార్డులో ప్రైవేటు స్థలాన్ని డంపింగ్‌యార్డుగా మార్చారని, పలు కూడళ్లలో చెత్త, వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. 9, 10 వార్డుల కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, బత్తి నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని, వీధి దీపాలు వెలగడం లేదన్నారు. కౌన్సిలర్ చీరా అరుణ మట్లాడుతూ బ్రిడ్జిపేటలో పైపులైన్ల అమర్చే పనులు ఎప్పుడు చేస్తారని, 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్ మాట్లాడుతూ అనంగపాల్, ఊబా వారి వీధుల్లో సీసీ రోడ్డు, డ్రెయిను పనులు చేయాలని అయిదేళ్ల నుంచి అడుగుతున్నానని, గడప గడపకు ప్రభుత్వం పథకంలో చేసిన పనులకు గుత్తేదారుకు నిధులు ఏవని నిలదీశారు. కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అన్ని విభాగాల సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవరపలి, నల్లజర్ల: యర్నగూడెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ ఏజీఎల్ ఫీడర్ ఆర్డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. యర్నగూడెం వ్యవసాయ ఫీడర్, సంగాయిగూడెం, గాంధీనగరం, స్టాక్ నగర్ ప్రజలు గమనించాలని కోరారు. ★ నల్లజర్ల, చీపురుగూడెం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అనంతపల్లి, గుండేపల్లి, పోతవరం, పోతినీడిపాలెం, చీపురుగూడెం ప్రజలు గమనించాలని కోరారు.

సరకులు అందజేత

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని శ్రీ శివసాయిధామం సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు రూ.40 వేలు విలువ చేసే నిత్యావసర సరకులను గురువారం అందించారు. కార్యక్రమంలో సాయిధామం అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య, ఉపాధ్యక్షుడు పరిమి రాజేష్, కార్యదర్శి రెడ్డి తాతయ్యబాబు, కోశాధికారి నగళ్లపాట శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముందే గుర్తిస్తే.. ముప్పు తప్పినట్లే..
కుష్ఠు లక్షణాలపై ఇంటింటి సర్వే

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

కుష్ఠు వ్యాధి లక్షణాలు కనిపించినా ఆందోళన చెందవద్దని.. ప్రారంభంలో గుర్తించి చికిత్స పొందితే నయమవుతుందని వైద్యులు చెబుతున్నారు. చర్మంపై చిన్న మచ్చలే కదా? అని అశ్రద్ధ చేస్తే అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. కుష్ఠును పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాయి. 2027 నాటికి దేశంలో ఈ వ్యాధి లేకుండా చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి చికిత్స అందించనున్నారు. ఈనెల 17న ప్రారంభించిన సర్వేలో భాగంగా వైద్యాధికారులు, సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ నెలాఖరు వరకు కొనసాగనుంది.

సర్వే బృందంలో.. కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ఏర్పాటైన సర్వే బృందంలో ఆశ, సామాజిక కార్యకర్తలు ఉంటారు. వీరు రోజూ 25 నుంచి 30 ఇళ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరించాలి. కుష్ఠు లక్షణాలు ఉన్నదీ? లేనిదీ? ఆరా తీసి ఆ వివరాలను నమోదు చేయాలి.

ఔషధాలన్నీ ఉచితమే.. ప్రభుత్వాసుపత్రుల్లో బాధితులకు ఉచితంగా ఔషధాలను అందజేస్తారు. సాధారణంగా చికిత్స కాలం 6 నెలల నుంచి ఏడాది వరకు ఉంటుంది. నిత్యం వైద్య సేవలు అందుకోవడం ద్వారా కుష్ఠు వ్యాధి దూరమవుతుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సమస్యలు ఉత్పన్నమవుతాయి.

ఏటా బాధితులు ఇలా..

ఏడాది	2022 -23	2023- 24	2024- 25	2025-26
కేసులు	30	53	48	14 (ఇప్పటివరకు)

కొవ్వూరు పట్టణంలో వైద్య బృందం సర్వే

కొవ్వూరు డివిజన్‌లో ఇలా..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు : 20
- యూపీహెచ్‌సీలు : 4
- మొత్తం కుటుంబాలు : 2,46,713
- ఎంత మందిని సర్వే చేయాలి : 7,46,531
- ఎంతమందికి పూర్తయింది : 2,87,733
- ఎల్ఎస్‌డీసీ సర్వే బృందాలు : 711

అంతా సహకరించాలి..

కుష్ఠు లక్షణాలు ఉంటే బాధితులు వైద్యాధికారి, సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వాలి. ఎల్ఎస్‌డీసీ సర్వేకు ప్రజలు సహకారం అందించాలి. ఈనెలాఖరు నాటికి సర్వే పూర్తిచేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

– ఎం.సంధ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కొవ్వూరు

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

కుదుల రవిశేఖర్‌రావు, S/o వెంకటేశ్వర్‌రావు, పోతవరం గ్రామం, నల్లజర్ల మండలం, తూ॥గో॥ జిల్లా, A.P. అను నా యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్స్ నెం. 80/1996 జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిస్టర్ చేసినవి య. 4.50 సెం॥ సంబంధించినవి నల్లజర్ల నుండి పోతవరం వచ్చేటప్పుడు దారిలో పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు.

సెల్: 99487 99313



ఖాదర్‌కు గౌరవ పట్టా విధానసభాపతి యూటీ ఖాదర్‌కు బెంగళూరు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో కులపతి, గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ చేతుల మీదుగా గురువారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన దృశ్యం **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

ముంచేలా.. పొగమంచు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : దట్టమైన పొగ మంచు బెంగళూరు పరిసరాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయ వేళ రహదారులు కనిపించని పరిస్థితి. మరోవైపు.. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి, వెళ్లే విమానాల రాకపోకలు గురువారం ఆలస్యమయ్యాయి. గురువారం ఉదయం 5.30 నుంచి 7 గంటల మధ్య 41 విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. పొగమంచుతో కొన్ని విమానాలు ఆలస్యంగా వచ్చాయి. పరిస్థితులు సర్దుకున్న అనంతరం ఒక్కో విమానం వరుసగా బయలు దేరి వెళ్లడంతో ఎయిర్ ట్రాఫిక్ రద్దీగా మారింది.

అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అవుతున్న విమానం

పీఠం నీదా.. నాదా?

- మాటకు మాటతో సవాళ్లు
- కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం

ఈనాడు, బెంగళూరు : అధికార పీఠం కోసం నేతల మధ్య మాటమాటా పెరుగుతోంది. నాలుగు గోడల మధ్య కుదిరిన ఒప్పందం నేడు ఆ గోడలు దాటి సామాజిక మాధ్యమ వేదికలపై సమరనాదంగా మారుతోంది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు, ఆపై ఆయన ఎక్స్‌లో చేసిన ఇదే తరహా వ్యాఖ్య పోటీదారుతో కయ్యానికి సిద్ధమైన సంకేతాలిచ్చాయి. డీసీఎం వ్యాఖ్యల వెనుక అర్థం ఎలాగున్నా గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పోస్ట్ చేసిన సుదీర్ఘ వ్యాఖ్యలు డీసీఎంకు కౌంటర్ అన్నట్లుగా మారాయి. మరోవైపు అధికార పీఠానికి పోటీ పడుతున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల తరఫున వారి సముదాయ సంఘ ప్రతినిధులు, పీఠాధిపతులు గొంతు విప్పుతూ ఈ రాజకీయ నాటకంలో తమ పాత్రలను పోషించేందుకు సిద్ధమవటం తాజా పరిణామం

మాటకు మాట..

ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైనది ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం.. న్యాయమూర్తి కానీ, అధ్యక్షులు కానీ, ఎవరైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డీకే చేసిన వ్యాఖ్యలు నేరుగా సిద్ధరామయ్యను ఉద్దేశించినవేనన్న వాదన వినిపించింది. ఈ వ్యాఖ్యల వెనుక అర్థమేమిటని ప్రశ్నించగా తాను ఇలాంటి పోస్ట్ పెట్టలేదని డీకే తోసిపుచ్చారు. పైగా బుధవారం తన ఎక్స్ నుంచి చేసిన ఈ పోస్ట్‌ను తొలగించటం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ప్రపంచానికి మేలు చేయని ఓ మాట శక్తిగా భావించరాదు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ఓ నినాదం కాదు. అది ప్రజల కోసం సృష్టించే కొత్త ప్రపంచం. ఓ క్షణం కోసం అధికారం ఇవ్వలేదు. ఐదేళ్ల సేవ కోసం అందిన అధికారాన్ని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఉపయోగించుకోవాలి. తొలిసారి ముఖ్యమంత్రిగా 95శాతం, ఈసారి సగం పాలనలోనే 60 శాతం హామీలు నెరవేర్చాను. గ్యారంటీలతో అన్ని వర్గాలకు ఇచ్చిన మాట నెరవేర్చా'నని చేసిన వ్యాఖ్యలు అక్షరాల డీకేతో పోటీనా అన్నట్లుగా మారాయి. మొన్నటి వరకు అధికార పంపిణీ, రెండున్నరేళ్ల తర్వాత నాయకత్వ మార్పులపై నోరు మెదపని సీఎం, డీసీఎంలు క్రమంగా తమ ధోరణిని మార్చి సామాజిక మాధ్యమాలు, బహిరంగ సమావేశాల్లో నువ్వా? నేనా? అన్నట్లు మాటల తూటాలు పేలుస్తూ రాజకీయాన్ని రక్తికట్టిస్తున్నారు.

రంగుల రాజకీయం

సిద్ధు, డీకేల మధ్య పోరు క్రమంగా రంగు మారుతోంది. సిద్ధరామయ్యకు మద్దతుగా అహింద సంఘాలు, డీకేకు మద్దతుగా ఒక్కలిగ పీఠాధిపతులు తెరపైకి వచ్చి నేరుగా రాజకీయ డిమాండ్లు చేయటం ఆసక్తికరం. ఒక్కలిగ నేతగా డీకే శివకుమార్ పార్టీ గెలుపునకు పడిన శ్రమకు కూలి చెల్లించాలని కర్ణాటక ఒక్కలిగర సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ నేరుగా అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానంద స్వామి, మడివాళేశ్వర పీఠాధిపతి వీరేశ్వరస్వామి, నిరంజనానంద స్వామి, నంజావధూతస్వామి తదితరులు తమ సముదాయ నేతకు అన్యాయం జరిగితే పోరాటానికి సిద్ధమని సవాలు చేశారు. డీకేకు అవకాశం ఇవ్వకపోతే కాంగ్రెస్‌లో చీలిక ఖాయం. ఇది పార్టీకే ప్రమాదమని హెచ్చరించారు. మరోవైపు కర్ణాటక వెనుకబడిన వర్గాల సమితి (కేఎస్ఎఫ్‌బీసీసీ) అధ్యక్షుడు కేఎం రామచంద్రప్ప ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతుగా నిలుస్తూ మఠాధిపతులు రాజకీయాల కోసం చేస్తున్న బెదిరింపులు ఇప్పటివి కావన్నారు. వీరు వీధి పోరాటానికి దిగితే రాష్ట్రంలో 70శాతంగా ఉన్న మేము అందుకు సిద్ధమేనని సవాలు విసిరారు. తన తండ్రి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితులు తలెత్తలేదని ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య స్పష్టం చేశారు. పీఠాధిపతులు డిమాండ్ చేయగానే అధిష్ఠానం నిర్ణయం తీసుకోదు. అది సీఎల్‌పీలో నిర్ణయించాల్సిన అంశమన్నారు. పైగా సుభిక్ష పాలన అందించే ముఖ్యమంత్రి మధ్యలో తొలగిపోవాల్సిన అవసరమేముందన్నారు.

ఆనాటి చిత్రం.. నేటికీ అదే పరిస్థితి చాటే ఓ విచిత్రం.. రెండున్నరేళ్ల కిందట సిద్ధు- డీకే హావభావాలు

సంక్షోభంగా మారకముందే..

పార్టీలో ఈ అయోమయ పరిస్థితులు సంక్షోభంగా మారకముందే చక్కబెట్టాలని సీనియర్ మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ అధిష్ఠానానికి సూచించారు. వీలైనంత త్వరగా ఓ నిర్ణయానికి రావాలన్నారు. మరోవైపు సతీశ్ జార్కిహొళి, హెచ్.సి.మహదేవప్ప, కె.రాజణ్ణ, శివరాజ్ తంగడిగె తదితర అహింద మంత్రులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసంలో ప్రత్యేకంగా సమావేశమై తమ కార్యాచరణపై తీర్మానాలు చేశారు. వీరంతా త్వరలో దిల్లీకి వెళ్లి తమ అభిప్రాయాలను స్పష్టం చేయాలని చూస్తున్నారు.

రాజీనామానే ప్రత్యామ్నాయం

బాగలకోటె, న్యూస్‌టుడే : రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి స్థానాన్ని విడిచి పెడతానని చెప్పి ఉంటే, గౌరవ ప్రదంగా పక్కకు తప్పుకోవాలని సిద్ధరామయ్యకు మాజీ మంత్రి గోవింద కారజోళ హితవు పలికారు. కుర్చీ కోసం జరుగుతున్న పోరు ప్రజల వరకు చేరుకుందని చెప్పారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, హోటళ్లు, బార్లలోనూ అధికార మార్పిడికి సంబంధించి చర్చలు, పందేలు, పైపందేలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. పాలన పూర్తిగా స్తంభించిందని, రాష్ట్రపతి పాలన విధించే వరకు పరిస్థితులు దిగజారకుండా చూసుకోవలసిన బాధ్యత సిద్ధరామయ్యపై ఉందన్నారు. ఒకవేళ అధికారం పంచుకునే ఒప్పందం లేకపోతే ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించాలని సూచించారు. ఖజానా ఖాళీ అయిందని, ప్రజలను దారి తప్పించేందుకు కొత్త నాటకాలకు తెరతీయ వద్దని హితవు పలికారు.

ఒక్క తాటిపైకి ఒక్కలిగరు



నినాదాలు చేస్తున్న సంఘం ప్రతినిధులు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని ఒక్కలిగర సంఘం ప్రతినిధులంతా ఒక్కమాటగా స్వరం పెంచారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చేందుకు శ్రమిస్తూ వచ్చిన ఆయనకు పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. గత వారం సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, ఇతర సమితులకు సంబంధించి నిర్వహించిన ఎన్నికలో 35 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శివకుమార్ పార్టీ అధ్యక్షునిగా ఉండడంతోనే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు మెజార్టీ సాధించేందుకు అవకాశం దక్కిందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

నమో.. కృష్ణ స్మరామి

ప్రధాని రాకకు సర్వం సిద్ధం

ఉడుపి, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఉడుపి శ్రీకృష్ణ మఠానికి విచ్చేస్తున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళూరు నుంచి ప్రధానితో, భద్రతాదళాలు ఒకేసారి మూడు హెలికాప్టర్లలో దిగేందుకు 'ఆది ఉడుపి'లో రూ.60 లక్షల వ్యయంతో కొత్తగా హెలిప్యాడ్లను నిర్మించారు. హెలిప్యాడ్ నుంచి ఆలయానికి చేరుకునే మార్గానికి ఇరువైపులా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. లక్ష కంఠ భగవద్గీత పఠనం కోసం భక్తులు, గాయకులు ఇప్పటికే ఉడుపి చేరుకున్నారు. మధ్వసరోవరంలో తీర్థ ప్రోక్షణ అనంతరం ఆలయంలో కనకన కిండి (కిటికీ/కంత) నుంచి శ్రీకృష్ణుడిని మోదీ దర్శించుకుంటారు. అష్టమఠాలకు నేతృత్వం వహిస్తున్న పీఠాధిపతుల ఆశీర్వచనం అనంతరం ప్రసాదాన్ని స్వీకరిస్తారు. గీతామందిరాన్ని ప్రధాని సందర్శిస్తారు. మోదీ పర్యటనను దృష్టిలో ఉంచుకుని, భాజపా రాష్ట్రాధ్యక్షుడితో పాటు, సీనియరు నాయకులు ఉడుపికి ఒక్కొక్కరే చేరుకుంటున్నారు.

మోదీ భక్తిపథం

గీతాగాన సుధామృతాన్ని ఆస్వాదించే వేదిక వద్ద ఏర్పాట్లు

దిక్కులేని మొక్కజొన్న రైతు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : అధికార పార్టీ మొక్కజొన్న రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని భాజపా కర్ణాటక శాఖ దుయ్యబట్టింది. రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీ అంటూ ఒక పోస్టరును తన అధికారిక ఎక్స్ కార్ప్ ఖాతాలో పోస్టు చేసింది. చెరకు రైతుల డిమాండ్‌ను పక్కదారి పట్టించినట్లే మొక్కజొన్న రైతులకు మొండి చేయి చూపిస్తే తాము పోరుబాట పడతామని భాజపా హెచ్చరించింది.

భాజపా విడుదల చేసిన పోస్టరు

సహజీవనవాసికీ ఆ చట్టం వర్తింపు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : సహజీవనంలో ఉన్న మహిళను వేధించినా, 498ఏ చట్టం చెల్లుతుందని జస్టిస్ సూరజ్ గోవిందరాజ్ స్పష్టం చేశారు. తనకు వివాహమైందన్న విషయాన్ని దాచి పెట్టి, శివమొగ్గకు చెందిన వ్యక్తి ఒక మహిళతో సహజీవనాన్ని ప్రారంభించారు. సహజీవనం చేస్తున్న మహిళ ఈ విషయాన్ని గుర్తించడంతో ఆమెపై శారీరక, మానసిక దాడులు చేశాడు. ఆమె ప్రాణాన్ని తీసేందుకు ప్రయత్నించిన ఆరోపణలు వచ్చాయి. ఆ మహిళ 498ఏ చట్టం కింద కేసు నమోదు చేసింది. భార్య కాని మహిళ ఈ చట్టం కింద కేసు నమోదు చేయడం సాధ్యం కాదంటూ ఆ వ్యక్తి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. సహజీవనం చేస్తున్న వారిపై దాడి చేసినా ఈ చట్టం వరిస్తుందని న్యాయమూర్తి స్పష్టం చేసి, అతని అర్జీని తోసిపుచ్చారు.

మహిళ కడుపులో భారీ కణితి

శివమొగ్గ, న్యూస్‌టుడే : శికారిపుర పట్టణంలోని సొప్పినకేరి లేఅవుట్‌కు చెందిన ఒక మహిళ (55) కడుపు నుంచి 12.5 కిలోల కణితిని తొలగించారు. ఒక ఏడాది నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె వైద్య పరీక్షలు చేయించుకోగా, కణితి ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలోని వైద్యులు ప్రకాశ్, గురుదత్త తదితరులు తాజాగా శస్త్రచికిత్స నిర్వహించి, కణితిని తొలగించారు.

సిద్ధుకు విజయేంద్ర లేఖ

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో మరణించిన ఐఏఎస్ అధికారి మహంతేశ్ బీళగి (51) కుటుంబంలో ఒకరికి క్లాస్-1 పోస్టు ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర కోరారు. మహంతేశ్ భార్య లేదా కుమార్తెకు ఉద్యోగాన్ని ఇచ్చి వారికి మద్దతు ఇవ్వాలని కోరుతూ, ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను రాశారు.

వ్యాజ్యానికి దిగిన ఫోన్ పే

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : వినియోగదారుల లావాదేవీల వివరాలు ఇవ్వాలని పోలీసులు జారీ చేసిన నోటీసులను ప్రశ్నిస్తూ ఫోన్ పే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన వెబ్‌సైట్లలో పందేలు వేసేందుకు ఒక వ్యక్తి 'ఫోన్‌పే' యాప్‌ను వినియోగించుకున్నారు. ఆ సమయంలో రూ.6 వేలను ముందస్తుగా డిపాజిట్ చేశారు. తన పని పూర్తయిన అనంతరం నగదు వెనక్కు రాలేదని ఆరోపిస్తూ ఆ వ్యక్తి బెంగళూరు గ్రామీణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. వినియోగదారుల వివరాలు అందించాలని పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆ సంస్థ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వివరణ ఇవ్వాలని హోం శాఖకు, బెంగళూరు గ్రామీణ ఠాణా, గ్రామీణ ఎస్పీకి జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం పుణచ్చల పీఠం నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది.

అన్నదాతకు పరిహార భాగ్యం!

ఖాతాల్లోకి రూ.1033.60 కోట్లు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అతివృష్టి నేపథ్యంలో వాటిల్లిన పంటనష్టం అంచనావేసి, రైతులకు పరిహారం చెల్లించాలని సర్కారు నిర్ణయించింది. నష్టం ఎదుర్కొన్న 14.24 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలోకి రూ.1033.60 కోట్లు చేర్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బటన్ నొక్కి ప్రారంభించారు. ఆయన గురువారం ఇక్కడ ముఖ్యమంత్రి అధికార కార్యాలయమైన 'కృష్ణ'లో నిర్వహించిన కార్యక్రమంలో 'పెట్టుబడి రాయితీ' పంపిణీ ప్రక్రియను ఆయన మంత్రులతో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారీ వర్షం, ప్రవాహం వరద ముంపు వల్ల పంట నష్టం ఎదుర్కొన్న రైతులను గుర్తించి అదనంగా రూ.1033.60 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ రాయితీ ప్రకటించామని, ఇప్పుడు ఆ హామీని అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతుల ప్రభుత్వమే అధికారంలో ఉందని గుర్తు చేశారు. అదనపు రాయితీ మొత్తాన్ని పెంచామన్నారు. వర్షం వల్ల పంట నష్టం వాటిల్లితే హెక్టారుకు పరిహారాన్ని రూ.8500 నుంచి రూ.17 వేలకు, నీటి పారుదల ఆయకట్టు భూములకు హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25,500, ఇతర పంటలకు రూ.22,500 నుంచి రూ.31 వేల అదనపు రాయితీ పెంచినట్లు వెల్లడించారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం 14.24 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.1218.03 కోట్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఆ మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ఈనెల 17న ప్రధానమంత్రిని కలిసి, పంట నష్టపరిహారం కింద రూ.1521.67 కోట్ల పరిహారం అందించాలని విన్నవించుకున్నట్లు గుర్తు చేశారు. పంట నష్టం పరిశీలించేందుకు త్వరలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం రాష్ట్రానికి వస్తుందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు కృష్ణభైరేగౌడ, సంతోష్‌లాడ్, బోసురాజు, ఈశ్వర్ బి.ఖండ్రె, ప్రియాంక్‌ఖర్గే తదితరులు పాల్గొన్నారు.

మంత్రులతో సమావేశమై.. పంట పరిహారం చెల్లించే బటన్ నొక్కిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

భాజపా కీలక అడుగులు

ఉడుపి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్థానాన్ని కాపాడుకునేందుకు సిద్ధరామయ్య ప్రయత్నిస్తుండగా, ఆ పదవి కోరుకుంటూ డీకే శివకుమార్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ సమయంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని భాజపా నిర్ణయించింది. సిద్ధు, శివుని మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో ఓట్లు చీలిపోతాయని కమలనాథులు యోచిస్తున్నారు. బెళగావి శాసనసభ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వి సునీల్ కుమార్ గురువారం ఇక్కడ తెలిపారు. ప్రజలు, రైతులు, పేదల హితాన్ని మరిచిన ప్రభుత్వం తమ పదవులను కాపాడుకునేందుకు మఠాధిపతులు, అహింద, ఒక్కలింగ సంఘాలను బరిలోకి లాగాయని ఆయన దుయ్యబట్టారు.

పల్లెసీమల్లో ఆకాశ కాంతులు

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : గ్రామీణ విద్యార్థులకు ఖగోళశాస్త్రంపై అవగాహన, ఆసక్తి కల్పించేందుకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, విజ్ఞాన సాంకేతిక శాఖలు సంయుక్తంగా చేపట్టిన సంచార డిజిటల్ తారాలయం వాహనాలకు విధానసౌధ ముంగిట ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆ వాహనాల సంచారం గురువారం నుంచే ప్రారంభించారు. విద్యార్థులకు ఖగోళశాస్త్రంపై అవగాహన కలిగించాలని, మూఢనమ్మకాలను తొలగించి విజ్ఞాన ఆసక్తి పెంచాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు బోసురాజు, ప్రియాంక్‌ఖర్గే, సంతోష్‌లాడ్ తదితరులు పాల్గొన్నారు.

సంచార వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న సిద్ధరామయ్య

శ్రమజీవుల నిరసనహోరు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : కార్మిక చట్టాల్లో చేసిన సవరణలు రద్దు చేయాలని ఏఐటీయూసీ, ఇతర కార్మిక సంఘాలు డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులతో పాటు ఇతర కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా చట్టాల్లో సవరణలు చేశారని ఆక్రోశించారు. ఆయా పరిశ్రమలు, సంస్థలు, ప్రభుత్వ శాఖల్లో పది నుంచి ఇరవై ఏళ్ల పాటు ఒప్పంద కార్మికులుగా సేవలు అందించిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు.

చిన్నారి తల్లి కేసు.. ఆరుగురికి సంకటం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఉన్నతపాఠశాల విద్యార్థిని ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించిన కేసులో హనుమగౌడ అనే యువకుడిని అరెస్టు చేసి గురువారం అతనిపై పోక్సో చట్టం కింద కొప్పళ గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. హాస్టల్ ఇన్‌ఛార్జ్ శశికళ హిరేమఠ, వంట గదిలో పని చేసే పార్వతి కుదిరిమోతి, ప్రియాంక సింధోగిలను విధుల నుంచి తప్పిస్తూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. హనుమగౌడ, శశికళ హిరేమఠ, ఉపాధ్యాయులు ప్రభాకర భజంత్రి, యంకప్ప పూజార, కుకనూరు ఆసుపత్రి సిబ్బంది భరతేశ హిరేమఠ, సబియాలపై కేసు నమోదు చేసుకున్నారు. కుకనూరు గ్రామంలోని హాస్టల్‌లో బాలిక ఎనిమిదో తరగతి చదువుతున్నప్పటి నుంచి హనుమేగౌడ పరిచయం. వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెను గర్భవతిని చేశాడు. చివరి క్షణం వరకు బాలిక గర్భం విషయాన్ని దాచి ఉంచినందుకు వారిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాల పంజా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : హైటెక్ సిటీలో సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయి. సైబర్ నేరాల్లో బెంగళూరు మొదటిస్థానంలో ఉన్నట్లు కేంద్ర క్రైమ్ రికార్డు బ్యూరో వెల్లడించింది. విద్యావంతులే మాయగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు. బ్యాంకుల్లో కష్టపడిదాచుకున్న నగదు నిమిషాల్లో మాయమవుతున్న సంఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నాయి. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, లెక్కల్లో పెద్దవారనుకున్న వారు, మాజీ సైనికాధికారులు, మాజీ ఉద్యోగులు, మాజీ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులూ మోసపోతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు సైబర్ నేరాల కేసులు పది వేలకు పైగా నమోదుకాగా.. రూ.4,100 కోట్ల ప్రజల సొమ్ము మాయమైంది. అందులో కేవలం రూ.300 కోట్లు మాత్రమే తిరిగి స్వాధీనం చేసుకున్నారు. మాయగాళ్ల వలలో చిక్కిన వ్యక్తులు వారి బెదిరింపులకు భయపడి డబ్బులు చెల్లించుకుంటున్నారు. ఇటీవల సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఉషారాణి రూ.38 కోట్లు పోగొట్టుకున్న సంఘటన వెలుగులోకి రావడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఓ కంపెనీలో వందలాది మందిని లీడ్ చేసే ఆమె మోసపోవడాన్ని నమ్మలేక పోతున్నారు. మాజీ డీజీపీ శంకర్‌బిదరి బ్యాంకు ఖాతాలో రూ.1.85 లక్షలను నేరగాళ్లు కొట్టేసిన విషయం తెలిసిందే. కేసులు నమోదవుతున్నా పరిష్కారం కావడం లేదు. నేరగాళ్ల ఆచూకీ తెలిసినా అరెస్టు చేయలేని పరిస్థితి. డిజిటల్ అరెస్టు పేరుతో పోలీసులు, ఐటీ, సీబీఐ తదితర సంస్థల అధికారులమని చెప్పి పెద్ద బ్యాంకు ఖాతాదారులను గుర్తించి బెదిరించి వారి నుంచి భారీ మొత్తం వసూలు చేస్తున్న సంఘటనల నిలువరింతకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలకు ఉపక్రమించారు.

సంచి నిండా డబ్బు!

నిజాయతీ చాటిన ఆటోవాలా

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : ఈ రోజుల్లో ఎవరికైనా అయాచితంగా డబ్బు, వస్తువులు దొరికితే వాటిని సొంతం చేసుకోవడమే తప్ప.. పోగొట్టుకొన్న వారికి ఇద్దామన్న ఆలోచన ఉండదు. అది శ్రీమంతులైనా సరే.. మనిషి ప్రవర్తన మారిపోతుంది. అలాంటిది రెక్కాడితే కాని డొక్కాడని ఓ ఆటో డ్రైవర్‌కు బ్యాగు నిండా డబ్బులు దొరకగా.. దాన్ని పోగొట్టుకున్న వారికి ఇచ్చి తన నిజాయతీని చాటుకున్నారు. ఈ ఘటన బెంగళూరులో ఇటీవల చోటుచేసుకొంది. దీనికి సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అసలేం జరిగిందంటే.. నగరానికి చెందిన రాజు ఆటో నడుపుతూ ఉపాధి కల్పించుకున్నారు. ఒకరోజు ఓ ప్రయాణికుడు డబ్బున్న సంచిని ఆటోలో మర్చిపోయి వెళ్లిపోయాడు. కొంతసేపటి తర్వాత దాన్ని గమనించిన డ్రైవర్ రాజు.. ఆ డబ్బును తీసుకోకుండా పోగొట్టుకున్న ప్రయాణికుడిని వెదికి పట్టుకుని తిరిగి ఇచ్చేశాడు. అతడి నిజాయతీని ఆ ప్రయాణికుడు ప్రశంసిస్తూ తన డబ్బు తిరిగి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాలు పంచుకుంటూ ఆ ప్రయాణికుడు ఓ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా.. అది కాస్త వైరల్‌గా మారింది. డ్రైవర్ రాజు నిజాయతీని మెచ్చుకుంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. 'మానవత్వం ఇంకా ఎక్కడో బతికే ఉంది..' అని ఓ వ్యక్తి రాసుకొచ్చారు. ఆటో డ్రైవర్ చేసిన పనిని మరొకరు ప్రశంసిస్తూనే.. మంచి వారికి ఎలాంటి ప్రతిఫలం లభించదని నిరాశ వ్యక్తం చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

హంపీ పర్యాటకులపై టికెట్ భారం

హంపీ విజయవిఠల ఆలయం, ఏకశిలా రథం వద్దకు పర్యాటకులను తీసుకెళుతున్న బ్యాటరీ వాహనాలు

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ పర్యాటకులపై బ్యాటరీ వాహనాల టికెట్ మోత పడింది. విజయవిఠల ఆలయం, ఏకశిలా రథం వద్దకు చేరుకునేందుకు పర్యాటకులు వినియోగించే బ్యాటరీ వాహనాన టికెట్ ధరను రూ.20 నుంచి రూ.30కి పెంచారు. ఈ నెల 25 నుంచి టికెట్ కొత్త ధరను అమల్లోకి తీసుకొచ్చారు. పదేళ్ల కిందట బ్యాటరీ వాహనాలను ప్రవేశపెట్టిన సమయంలో రాకపోకలకు ఒకరికి రూ.20 టికెట్ ధర ఉండేది. ఆ ధరను ఇప్పుడు పెంచారు. హంపీ అభివృద్ధి ప్రాధికార బ్యాటరీ వాహనాల నిర్వహణ చేపట్టింది. ఒకరు లేదా ఇద్దరు బ్యాటరీ వాహనాలను వినియోగిస్తే టికెట్ ధర భారమనిపించదు. సుమారు పదిమంది, అంతకన్నా ఎక్కువ మంది ఒకే కుటుంబానికి చెందినవారు వాటిని వినియోగిస్తే ధరాభారమనిపిస్తుందని కుటుంబ సమేతంగా వచ్చిన చాలా మంది పర్యాటకులు వాపోయారు. ప్రస్తుతం హంపీలో 15దాకా బ్యాటరీ వాహనాలు ఉన్నాయి. ఏటా అక్టోబరు నుంచి మార్చినెల వరకూ పర్యాటక వేళలు ఉంటాయి. ఆ సమయంలో సందర్శకుల సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. ఒక్కోసారి ఉన్న బ్యాటరీ వాహనాలు చాలక సందర్శకులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురిస్తుందని సందర్శకులు వివరించారు. బ్యాటరీ వాహనాల సంఖ్య, ఇతర సౌకర్యాలు పెంచి, టికెట్ ధర పెంచితే అనుకూలంగా ఉంటుంది. ఇవేవీ పట్టించుకోకుండా ఉన్నఫళంగా టికెట్ ధర పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 25 నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి, దీనిగురించి ప్రాధికార అధికారి ఒకరు వివరణ ఇస్తూ.. కొత్త టికెట్ ధరలు ఇంకా చర్చల్లో ఉన్నాయి, అమల్లోకి రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉంది.

అమల్లోకి వచ్చిన కొత్త ధర టికెట్

వసతి గృహంలో ఆకస్మిక తనిఖీలు

మొరార్జీదేశాయ్ వసతి గృహంలో బాలికలతో మాట్లాడుతున్న ఛైర్మన్

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ ఛైర్మన్ శశిధర్ కోసాంబే గురువారం బళ్లారి నగరంలోని పార్వతినగర బసవభవనం సమీపంలోని వెనుకబడిన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. వసతి గృహంలోని గదులు, మరుగుదొడ్లు, వంట గది, సరకులు నిల్వ చేసిన గది, తాగునీటి యూనిట్ తదితర వాటిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వంట చేయడానికి నాణ్యతలేని కూరగాయలు, ఆహార పదార్థాలు కనిపించడంతో వార్డన్‌పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నాణ్యతను కాపాడుకోవాలని గట్టిగా సూచించారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే 1098 సహాయవాణికి ఫోన్ చేయాలని తెలియజేశారు. అక్కడి నుంచి నగర శివారులో ఉన్న మైనార్టీ సంక్షేమశాఖకు చెందిన మొరార్జీ దేశాయ్ వసతిశాల, కళాశాలను సందర్శించారు. అనంతరం కేంద్ర కారాగారాన్ని సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. రోజువారీ భోజనం, ఆరోగ్య సమస్యలు, పరీక్షలు, వారి పని గురించి జైలు అధికారుల నుంచి సమాచారం సేకరించారు.

బాల్య వివాహాల నివారణే లక్ష్యం

బళ్లారి, న్యూస్‌టుడే: బెంగళూరు, చిక్కమగళూరు, బెళగావి, రాయచూరు, చామరాజనగర జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర బాలల రక్షణ కమిషన్ నిర్వహించిన సర్వేలో 99 శాతం మంది పిల్లలు సోషల్ మీడియాకు బానిసలని, మానసికంగా బలంగా లేరని, నిరాశకు గురవుతున్నారని తేలిందని కర్ణాటక రాష్ట్ర బాలల రక్షణ కమిషన్ ఛైర్మన్ శశిధర్ కోసాంబే ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం బీడీఏఏ సభాభవనంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాలు నివారణ, సవాళ్లు, పరిష్కారాలు అనే అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రస్తుతం తమ పిల్లల్లో మంచి ఆలోచనలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వారి కదలికలను నిత్యం పర్యవేక్షించాలని, ప్రభుత్వం, సమాజానికి సంఘాలు వారధిగా పనిచేయాలని కోరారు. 2030 నాటికి భారతదేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చడానికి అన్ని శాఖలు, సంఘాలు, సంస్థలు, ప్రజలు చేతులు కలపాలని కేంద్ర మహిళా-శిశు అభివృద్ధి అధికారిణి అన్నపూర్ణ దేవి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. బాల్య వివాహాలను నిషేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసిందన్నారు. సమాజంలో లోతుగా పాడుకుపోయిన బాల్య వివాహ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి రాజేష్ ఎన్.హొసమని మాట్లాడుతూ రాష్ట్రంలో 60వేలకు పైగా బాల్య వివాహ నిషేధ అధికారులు ఉన్నారు. ప్రతి జిల్లాలో 2 వేల మంది అధికారులు పనిచేస్తున్నారు. బాల్య వివాహాలు, పోక్సో కేసులు నమోదవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పోలీస్ అధికారి డా.శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం అనేక రకాల సౌకర్యాలను కల్పిస్తోంది. పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోనే బాల్య వివాహాలు, పోక్సో కేసులను నివారించడానికి సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. రీడ్స్ సంస్థ డైరెక్టర్ తిప్పేశప్ప పిల్లలు దేశ భవిష్యత్తు అని వివరించారు. కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ అధ్యక్షుడు హెచ్.సి.రాఘవేంద్ర బాల్య వివాహాలు నిషేధంపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్ నందారెడ్డి, అధికారులు సుభద్రాదేవి, సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్ణాటక రాష్ట్ర బాలల రక్షణ కమిషన్ ఛైర్మన్ శశిధర్ కోసాంబే

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

RAMOJI GLAMPING

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

దంపతుల ఆత్మహత్యాయత్నం

దంపతులతో కానిస్టేబుల్ రంగస్వామి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి కుటుంబ సభ్యులతో చరవాణిలో మాట్లాడడం కలకలం రేపింది. ఈ ఘటన గురువారం మంత్రాలయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటకలోని హొన్నవరానికి చెందిన మంజునాథ్, వీణా పూజారి దంపతులు మంత్రాలయం వచ్చారు. మంజునాథ్ అటవీ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఉన్నతాధికారి ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్తీక్, యోగేష్ వద్ద తనను వంట మనిషిగా పని చేయాలని గత సంవత్సరం పైగా వేధింపులకు గురి చేశారు. అందుకు ఆయన ఒప్పుకోలేదు. దాంతో ఆయన్ను మానసికంగా వేధింపులకు గురిచేశారు. మంజునాథ్ నెలన్నర అనారోగ్యానికి గురయ్యారు. అయినా ఆయన్ని వంట మనిషిగా బదిలీ చేశారు. అది భరించలేక ఇంట్లో సూసైడ్ నోట్ రాసి దంపతులు బుధవారం మంత్రాలయం చేరుకున్నారు. గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని ఆత్మహత్య చేసుకోవడానికి నదిలోకి వెళ్లారు. వారికి పిల్లలు గుర్తు రావడంతో వారితో చరవాణిలో మాట్లాడారు. విషయం తెలుసుకున్న పొరుగు ఇంటి వినోద గోపాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే మంత్రాలయం పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రంగస్వామి ఆ దంపతులను నదిలో గుర్తించి సీఐ రామానుజులకు అప్పగించారు. ఎస్సై శివాంజల్ కర్ణాటక పోలీసులకు సమాచారం అందజేశారు. కర్ణాటకకు నుంచి పోలీసులు రాత్రి వస్తామన్నారు. మంత్రాలయం సీఐ ఆ దంపతులను వారికి అప్పగించనున్నట్లు తెలిపారు.

జలవేణి.. నగర సొబగులకు పారాణి



బెంగళూరు చరిత్రతో ముడిపడిన హెసరుఘట్ట చెరువు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర ప్రజల దాహం తీర్చేలా చెరువులను సంరక్షిస్తున్న తీరు ఇతర రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. వాటి నిర్వహణ, సంరక్షణపై అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారుల బృందాలు తరచుగా ఇక్కడికి వస్తుండటం ప్రస్తావనార్హం. సాధారణంగా నగరాల మధ్య భాగంలో చెరువులున్నాయంటే.. అవి నిర్వహణకు నోచుకోక మురికికూపాలుగా కనిపిస్తుంటాయి. నిజానికి ఉద్యాననగరిలోనూ గతంలో ఈ తరహా పరిస్థితి కానవచ్చినా ప్రస్తుతం మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. కాలుష్య కోరల నుంచి వాటిని రక్షించి, మురుగునీటి శుద్ధీకరణతో సమస్యను నిలవరించి, పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. ప్రతి చెరువు బాగోగులకూ ప్రజా భాగస్వామ్యంతో చర్యలకు ఉపక్రమించడం ఫలితాన్నిచ్చింది. పందులు దొర్లాడే చోట.. అనేకానేక జాతుల పక్షులతో నేడు అందాలు ఇనుమడించాయి. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వచ్చి ఇక్కడి చెరువులపై అధ్యయనం చేశారు. కర్ణాటక సర్కారు అమలు చేస్తున్న జలసంరక్షణ పథకాలను చూసి ఆ రాష్ట్ర అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారని పాలికె వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఒడిశా, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అధికారులూ త్వరలో రానున్నట్లు ఆ వర్గాల ద్వారా అందిన సమాచారం. మొన్నటి ఈశాన్య రుతుపవనాల సమయంలో కురిసిన వర్షాలకు చెరువులన్నీ నిండి జలకళ ఉట్టిపడుతోంది. భూగర్భ జలాల మట్టం విపరీతంగా పెరిగినట్లు భూగర్భ- గనుల శాఖ అధికారులు తెలిపారు. నగర పరిధిలో 64 చెరువులు ఉండగా. అందులో 42 చోట్ల నిండుకుండలు దర్శనమిస్తున్నాయి. మిగిలిన వాటిలో సంతృప్తికరంగా నిల్వలున్నాయి. నగర శివార్లలో తాగునీటి ఎద్దడి పూర్తిగా నిలువరించారు. రెండేళ్ల కిందట తాగునీటి ఎద్దడి ఎదుర్కోలేక చాలా మంది వేర్వేరు ప్రాంతాలకు కదలివెళ్లారు. మరికొందరు ట్యాంకర్ల నీటిని కొనుక్కుని కాలం వెళ్లదీశారు. వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో భూగర్భజలాల మట్టం పెరిగి.. ఈసారి ముప్పు నిలువరించే మార్గం సులువైంది. హెబ్బాళ, నాగవార, యలహంక, హలసూరు, శాంకి, దాసరహళ్లి, కెంపాబుద్ధి, అగ్రహార, దొడ్డబొమ్మసంద్ర, లక్కసంద్ర, జక్కూరు, పుట్టేనహళ్లి, జేపీనగర, అగర, మడివాళ, కైగుండనహళ్లి, మారతహళ్లి, సర్జాపుర, కె.ఆర్.పురం, భట్టరహళ్లి, మహదేవపుర, హెసరుఘట్ట తదితర చెరువుల పరిసరాలన్నీ పచ్చందాలతో తులతూగుతున్నాయి.

> అక్రమార్కుల చెర నుంచి తటాకాలకు విముక్తి కల్పించడానికి రెండుమూడేళ్లుగా సర్కారు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తోంది. దశాబ్దం కిందటి వరకు మురికి కూపాలుగా దర్శనమిచ్చిన చెరువులకు నిధులు కుమ్మరించడంతో కొత్తందాలతో మెరిసిపోతున్నాయి. వాటి సంరక్షణ చర్యలు ఇతర రాష్ట్రాలకు పాఠాలుగా మారాయి!

నాగవార తటాకం.. నగర అందాలకు పెట్టని కోట

బళ్లారి ఏసీగా రాజేష్



బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి ఉపవిభాగం ఏసీగా కె.ఎ.ఎస్. అధికారి **హెచ్.డి. రాజేష్‌ను** నియమిస్తూ ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. హాసన జిల్లాలోని సకలేశ్‌పూర్ ఉపవిభాగం ఏసీగా రాజేష్ విధులు నిర్వహిస్తున్నారు. సండూరు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో బళ్లారి ఏసీగా గతంలో విధులు నిర్వహించారు. ఎన్నికల తర్వాత బదిలీ అయ్యారు. బళ్లారి ఉపవిభాగం ఏసీగా ఉన్న పి.ప్రమోద్‌పై బళ్లారి తాలూకా శ్రీధరగడ్డ గ్రామంలో ఇనాం భూమిపై హక్కును అక్రమంగా మార్చిన కేసుకు సంబంధించి బళ్లారి లోకాయుక్త పోలీసులు ఎఫ్.ఐ.ఆర్.నమోదు చేశారు. అంతేకాకుండా కేసు నమోదు చేస్తున్న సమయంలో ప్రమోద్ అనధికార సెలవుపై వెళ్లారు. ఈ అంశాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు సెలవును తిరస్కరించిన తొమ్మిది రోజుల తర్వాత గురువారం ఉన్నఫళంగా హాజరయ్యారు.

EENADU eClassifieds

REAL ESTATE

PLOT FOR SALE

Site for Sale 1800 sqft Akhatha, Only 150 Feet From Hosur Main Road, Near Bommanahalli Metro Station, Suitable for Hotel, Automobile Service Center, Nursing Home, Travel Office & PG More Cont: 76766 66616.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆: 96402 58899, 96404 68899

కర్ణాటక గధక్ జిల్లాలో ప్రముఖ విండ్ ఫాన్ కంపెనీలో పని చెయ్యడానికి అనుభవం ఉన్న సూపర్‌వైజర్లు, సైట్ ఇన్‌ఛార్జ్‌లు, ROW డీలింగ్ వ్యక్తులు కావలెను. ✆ : 8919882518.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్లారి : 9121167525
బెంగుళూరు : 9121167527
(ప్రకటనలపై జీ.ఎస్.టి. 5% వర్తించబడును)

నాయకనహట్టిలో ఘనంగా దీపోత్సవం

చెళ్లకెర, న్యూస్‌టుడే: ప్రసిద్ధి చెందిన నాయకనహట్టిలోని శ్రీ గురు తిప్పేరుద్రస్వామి దేవాలయం వద్ద గురువారం రాత్రి లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి దీపారాధనలో పాల్గొన్నారు. లక్ష దీపోత్సవం సందర్భంగా పట్టణ వీధులను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నాయకనహట్టి శ్రీగురు తిప్పేరుద్రస్వామి దేవాలయం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

దొగ్గనాళ్‌కు రూ.3కోట్లతో రహదారి నిర్మాణం

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హొళల్కెర తాలూకా దొగ్గనాళ్ గ్రామానికి రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నూతన డాంబరు రహదారిని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప పేర్కొన్నారు. గురువారం దొగ్గనాళ్ గ్రామం వద్ద చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు చేపడతామన్నారు. జడ్పీ మాజీ సభ్యుడు మహేశ్, వైద్యుడు విశ్వేశ్వరయ్య, విశ్రాంత డీవైఎస్పీ చంద్రన్న, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సవిత, మండల అధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

మూడు భాషల్లో 'ద రైజ్ ఆఫ్ అశోక' సినిమా

విలేకరుల సమావేశంలో పాల్గొన్న హీరో నీనాసం సతీశ్, హీరోయిన్ సప్తమి

హొసపేటె, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటివారంలో 'ద రైజ్ ఆఫ్ అశోక' సినిమా కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నట్లు కథానాయకుడు నీనాసం సతీశ్, కథానాయిక సప్తమి తెలిపారు. సినిమా విడుదల ముందస్తు ప్రచారానికి హొసపేటె వచ్చిన వారు గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 70వ దశకంలో చామరాజనగరలో జరిగిన ఓ కథను ఆధారంగా చేసుకుని మూడు భాషల్లో సినిమా సిద్ధమవుతోందని తెలిపారు. ఇప్పటికే ఓ పాటను చిత్రీకరించారు, మరో ఏడు పాటల చిత్రీకరణ మాత్రమే బాకీ ఉందన్నారు. పెద్ద బడ్జెట్‌తో సిద్ధమవుతున్న ఈ సినిమాకు వినోద్ దొండాలె దర్శకత్వం వహిస్తున్నారని వివరించారు. ఉత్తర కర్ణాటకలో కన్నడ సినిమాకు మంచి ఆదరణ ఉంది, ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో ముందస్తు ప్రచారం చేస్తున్నామని తెలిపారు. నిర్మాత వరదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికుల నిరసన

ఎన్ఎండీసీ కార్యాలయం ప్రధాన ద్వారం ముందు నిరసన తెలియజేస్తున్న కార్మికులు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా దోణిమలైలోని ఎన్ఎండీసీ కంపెనీ పరిధి పలెట్ ప్లాంట్, బెనిఫికేషన్ ప్లాంట్‌లో తాత్కాలిక కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం వారు ప్రధాన ద్వారం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న లోక్‌సభ సభ్యుడు అక్కడికి రావడంతో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘం కార్యాధ్యక్షుడు దేవదాసు మాట్లాడుతూ తాత్కాలిక కార్మికులుగా తొమ్మిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని 10 రోజుల ముందు ఉన్నఫళంగా ఎన్ఎండీసీ తొలగించింది. వారికి ఉద్యోగ భద్రత లేక పోవడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. మరో కంపెనీ ప్రారంభమయ్యే వరకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సంఘం సభ్యులు సోమశేఖర్‌గౌడ, డా.ప్రమోద్, సురేశ్, హులిగేశ్, మంజునాథ్, సంతోష్‌కుమార్, రాజప్ప, హులియప్ప పాల్గొన్నారు.

మంత్రాలయానికి ఐరావత బస్సు సర్వీసు

నూతన బస్సు సర్వీసును పచ్చజెండా ఊపి ప్రారంభించిన ఎంపీ ప్రభ మల్లికార్జున్

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: దావణగెర బస్టాండు నుండి మంత్రాలయానికి రోజూ బయలుదేరే నూతన ఐరావత బస్సు సర్వీసు చిత్రదుర్గం, చెళ్లకెర, బళ్లారి మీదుగా మంత్రాలయం వెళ్తుందని దావణగెరె ఎంపీ డాక్టర్ ప్రభ మల్లికార్జున్ తెలిపారు. గురువారం ఆమె దావణగెరెలో నూతన బస్సు సర్వీసుకు పచ్చజెండా చూపి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజూ రాత్రి 9 గంటలకు దావణగెరెలో బయలుదేరి 10 గంటలకు చిత్రదుర్గం, 11 గంటలకు చెళ్లకెర, అర్ధరాత్రి 12 గంటలకు బళ్లారి, తెల్లవారుజామున 4 గంటలకు మంత్రాలయానికి చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఉదయం 11 గంటలకు మంత్రాలయం నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు దావణగెరెకు వస్తుందన్నారు. దావణగెరె, చిత్రదుర్గం, బళ్లారి జిల్లాల భక్తులు బస్సు సర్వీసును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బళ్లారి తపాలా శాఖకు పతకాల పంట

పతకాలు అందుకున్న ఉమ్మడి బళ్లారి జిల్లా తపాలా శాఖాధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఉమ్మడి బళ్లారి జిల్లా జోనల్ తపాలా శాఖ ఉత్తమ సేవలను గుర్తించి శాఖ ఉత్తర కర్ణాటక జోనల్‌లో ఉమ్మడి బళ్లారి జిల్లా జోనల్‌కు ప్రశంసలు దక్కాయి. ఏకంగా 33 పతకాలు అందజేసి అభినందించింది. 2024-25 ఏడాదికిగాను భారత తపాలా శాఖ బెళగావి జోన్‌లో ఉత్తర కర్ణాటక శాఖ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో బళ్లారి జోనల్ తపాలా జీవిత బీమా పథకం, పొదుపు, ఇతర విభాగాల్లో అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవలను గుర్తించింది. వాటిలో జీవిత బీమా పథకం విభాగంలో 14 పతకాలు, పొదుపు పథక విభాగంలో 13 పతకాలు సాధించినట్లు జోనల్ అధికారి చిదానందప్ప 'న్యూస్‌టుడే'కి తెలిపారు. పతకాలను అధికారులు చిదానందప్ప, కూడ్లిగి సబ్ డివిజన్ అధికారి శశికుమార్ హిరేమఠ్, బళ్లారి ప్రిన్సిపల్ పోస్ట్‌మాస్టర్ భీమసేన, హొసపేటె తపాలాశాఖాధికారి రామారావ్, అధికారులు వెంకటేశ్, మారుతి ఉప్పారట్టి, మొహిద్దీన్, దాదాపీర్, జలజాక్షి తదితరులకు అందించి అభినందించారు.

బళ్లారి రైల్వేస్టేషన్‌లో సమస్యలు తీర్చరూ

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రైల్వే స్టేషన్‌లో అమృతభారత్ పథకం కింద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, కరోనా సమయంలో నిలిచిపోయిన రైళ్లను కొనసాగించాలని బళ్లారి డీఆర్‌యూసీసీ సభ్యులు హుబ్బళ్లి రైల్వే జోన్ డీఆర్ఎం బెళా మీనాను కోరారు. గురువారం ఆయన అధ్యక్షతన డీఆర్‌యూసీసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ స్టేషన్‌లో కొన్ని పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హుబ్బళ్లి రైల్వే విభాగంలో బళ్లారి రైల్వే స్టేషన్ నుంచి అత్యధిక ఆదాయం వస్తోందని వివరించారు. లిఫ్ట్, ఫైవంతెన పనులు జరగడం లేదని వివరించారు. రెండో, మూడో ప్లాట్‌ఫాంకు ప్రయాణికులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. హైదరాబాదుకు రైలు సేవలను నిత్యం ప్రారంభించాలన్నారు. ముంబయి రైలును హొసపేటె నుంచి బళ్లారికి విస్తరించాలని, హొసపేటె-గుంతకల్లు మధ్య ఉదయం కనీసం రెండు సార్లు రైలు నడిచే విధంగా చూడాలన్నారు. లిఫ్ట్, ఎస్కలేటర్ పనులు పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సభ్యులు సొంత గిరిధర్, కొట్రేష్, రాహుల్ మోహత తదితరులు హాజరయ్యారు.

సమావేశంలో హుబ్బళ్లి రైల్వే జోన్ డీఆర్ఎం బెళా మీనాతో రైల్వే అధికారులు, సభ్యులు

(c) eenadu

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

30న ఆరెంజ్ వాకథాన్

జాగృతి గోడపత్రికను విడుదల చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మణిదీప్తి, సభ్యులు

హొసపేటె, న్యూస్‌టుడే: మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలన్న డిమాండ్‌తో ఈ నెల 30న పట్టణంలో ఆరెంజ్ వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మణిదీప్తి తెలిపారు. గురువారం జిల్లా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యం మహిళలపై వేధింపులు జరుగుతూనే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పట్టణంలోనూ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. సాయంత్రం 4 గంటలకు జిల్లా క్రీడామైదానంలో వైద్యులు ఇందుమతి, అరుణా కామినేని, డీసీ, ఎస్పీ ప్రారంభిస్తారు. క్లబ్ ముఖ్యులు డాక్టర్ మాధవిలతా, సుజాతా, రేఖాప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు లోక్‌సభ సభ్యుడి జిల్లా పర్యటన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారాం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బళ్లారి శివారు ప్రాంతమైన వేణివీరాపుర వద్ద నూతన బైపాస్‌ను, జాతీయ రహదారిని ప్రారంభించనున్నారని వ్యక్తిగత కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందు రూ.10 లక్షలతో నిర్మించే బస్సు షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రంలో ఎనిమిదిన్నర సీఎస్ఆర్ నిధులతో రూ.1200 లక్షలతో నిర్మించిన ఎంఆర్ఐ స్కానింగ్ కేంద్రం ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 2.15 గంటలకు జడ్పీ ఆవరణలో విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర జెస్కాం ఉపవిభాగం-2 వ్యాప్తిలో విద్యుత్తు స్తంభాలు మార్పు చేసే పనులు జరగుతుండటం వల్ల ఈ నెల 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోకి వచ్చే బసవనకుంటె, కోట ప్రదేశం, తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని పేర్కొన్నారు.

● **బళ్లారి:** బళ్లారి గ్రామీణ జెస్కాం ఉపవిభాగం వ్యాప్తిలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం వ్యాప్తిలోకి వచ్చే శ్రీధరగడ్డ, వక్రాణిక్యాంపు, సోమసముద్రం, లక్ష్మీనగర క్యాంపు, వీరాంజినేయ క్యాంపు, కోళూరు, మధురె, భాగ్యనగర క్యాంపు, మల్లారెడ్డి క్యాంపు, కోళూరు క్రాస్, దమ్మూరు, డి.కగ్గల్, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందన్నారు.

పొర్లుతున్న హెచ్చెల్సీ కాలువ.. ఇళ్లలోకి వెల్లువ

14వ ఉప కాలువ వంతెనపైకి వస్తున్న నీరు

నిండుకుండలా ప్రవహిస్తున్న హెచ్చెల్సీ ఉప కాలువ

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 34వ వార్డు పరిధిలోకి వచ్చే బత్రి - విద్యానగర మధ్య రాకపోకలకు తుంగభద్ర జలాశయం హెచ్చెల్సీ 14వ ఉప కాలువపై నిర్మించిన వంతెనపైకి నీరు వెల్లువెత్తి సమీప ఇళ్లలోకి చొరబడుతోంది. ప్రధాన దారిపై నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నగర పాలికె, నీటిపారుదలశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. హెచ్చెల్సీ ఉప కాలువ వెలుపల బత్రి గ్రామం ఉంది. ఈ గ్రామం నగర పాలికె 34వ వార్డు వ్యాప్తిలోకి వస్తోంది. ఈ గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పాల విక్రయదారులు జీవనం సాగిస్తున్నారు. కాలువ గట్టుపై కూడా పలువురు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ వంతెన హవంబావి, రామనగర, సిరుగుప్ప రహదారిని కలుపుతుంది. హైవేగాంలో శాంతినగర, కొళగల్లు రహదారిని కలుపుతుంది. అక్కడ నుంచి విమానాశ్రయం వరకు వెళ్లవచ్చు.

వంతెనపై ప్రవహిస్తున్న నీటిలో వెళ్తున్న వాహనాలు

పెరిగిన రాకపోకలు

ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం కావడంతో రైతుల రాకపోకలు పెరిగాయి. హెచ్చెల్సీ 14వ కాలువ వంతెనపై మోకాలు లోతు లీకేజీ అయిన నీరు నిలబడిపోయింది. దాని పక్కనే వ్యర్థాలు పడేయడంతో మరింత అపరిశుభ్రంగా మారింది. వంతెన కూడా దుస్థితికి చేరుకుంది. వంతెన ఇరువైపులా గోడలు బలహీనపడ్డాయి. ఇరుకుగా ఉండటం వల్ల వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేసి అనుకూలం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

శంకర్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె అల్లీపురానికి చెందిన శంకర్ (11) అనే బాలుడు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు బళ్లారి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా బాలుడి ఆచూకీ తెలియ రాలేదు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బాలల క్రయవిక్రయాలు నేరం

మెట్రిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న గ్రామ పంచాయతీ సభ్యులు, అధికారులు

కంప్లి, న్యూస్‌టుడే: పిల్లలను కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమని బళ్లారి డాన్ బాస్కో సంస్థ ప్రతినిధి జి.భాగ్య తెలిపారు. మెట్రి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన పిల్లల దత్తత - పోషణ జాగృతి సమావేశంలో ఆమె మాట్లాడారు. చట్ట పరంగా పిల్లలను దత్తత తీసుకోవాలంటూ పిల్లల పోషణ, తదితరాల అంశాలను వివరించారు. జీపీ అధ్యక్షురాలు నాగమ్మ, ఉపాధ్యక్షుడు మహంతేశ్, అభివృద్ధి అధికారి బీరలింగ, జీపీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకునేందుకు అవసరమైన శిక్షణ పొందాలని విశ్రాంత ఉపాధ్యాయుడు జె.నరసింహమూర్తి పేర్కొన్నారు. ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ రారావి గ్రామ ఉన్నత పాఠశాలలో గురువారం స్వాస్థ్య సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇతర ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక, సామాజికంగా బలోపేతం కావాలంటే ఉపాధ్యాయులు, ఇలాంటి సంఘ, సంస్థలు అందించే విషయాలను జీవితంలో అలవర్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాలూకా యోజన అధికారి సుధీర్ హంగళూరు, ప్రధానోపాధ్యాయురాలు రంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి నిలయం నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న నగర పాలికె కమిషనర్ మంజునాథ, చిత్రంలో వి.వి.సంఘం అధ్యక్షుడు, సభ్యులు తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి రావ్ బహద్దూర్ వై.బహబలేశ్వరప్ప సాంకేతిక మహావిద్యాలయం విద్యార్థులకు నూతన వసతి నిలయం నిర్మాణానికి నగర పాలికె కమిషనర్ మంజునాథ, వి.వి.సంఘం అధ్యక్షుడు కణేకల్ మహంతేశ్, కళాశాల అధ్యక్షుడు జానెకుంటె బసవరాజు, సంఘం గౌరవ కార్యదర్శి డా.అరవింద్ పాటేల్ తదితర సభ్యులు పాల్గొని భూమిపూజ చేశారు. వి.వి.సంఘం అధ్యక్షుడు కణేకల్లు మహంతేశ్ మాట్లాడుతూ కల్యాణ కర్ణాటక ప్రాంతంలో అభివృద్ధిలో వెనకబడిన బళ్లారి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు, దేశ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడినట్లు వివరించారు. నేడు విద్యార్థులు చదువులతో పాటు సాంకేతిక, నైపుణ్యం, పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు. వి.వి.సంఘం సభ్యులు, ప్రధాన ఆచార్యులు డా.హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

కారటగి, న్యూస్‌టుడే: తాలూకాలోని ఈళిగనూరు గ్రామ ఆరాధ్య దైవం మారుతేశ్వర రథోత్సవం బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తుల జయ, జయ ధ్వనుల మధ్య ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం పాదగట్టె వరకు వెళ్లి తిరిగి యథాస్థానానికి చేరుకుంది. ప్రజలు భక్తితో రథానికి పూలు, పండ్లు సమర్పించుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

29న తుంగభద్ర నీటికోసం ధర్నా

మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప

సిరుగుప్ప, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు కింద ఎల్ఎల్‌సీ కాలువ నుంచి రెండో పంటకు నీరివ్వాలని, లేకుంటే పంట పరిహారం ఇవ్వాలని ఈనెల 29న పట్టణంలో రైతులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి ప్రతిఘటన ర్యాలీ నిర్వహిస్తామని మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప పేర్కొన్నారు. ఆయన తెక్కెలకోటలో గురువారం మధ్యాహ్నం భాజపా తాలూకా అధ్యక్షుడు కుంట్నాళ్ మల్లికార్జున స్వామి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఎం.ఎస్.సిద్ధప్ప, ఇతర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ పంటగా రైతులు సాగు చేసిన వరి, పత్తి, మిరప తదితర పంటలు అధిక వర్షాలకు కోల్పోయారన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోయారు. తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం, డ్యాం ఇంజినీర్లు, అధికారుల నిర్లక్ష్యంతో నీటిని కాలువలు, నదికి వృథాగా విడుదల చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించకపోతే 29న పట్టణంలో ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా వీరేంద్ర హెగ్గడే జన్మదినం

దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే : ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే పుట్టిన రోజును గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ట్రస్టు తాలూకా శాఖ ఆధ్వర్యంలో ఏపీఎంసీ యార్డులోని చన్నబసవేశ్వర అంధ పిల్లల వసతి పాఠశాల విద్యార్థులకు పండ్లు ఇతర ఆహార పదార్థాలను అందించారు. నెరళు అనాథాశ్రమంలోని వృద్ధులకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. తాలూకా యోజనాధికారి సునీత ప్రభు, పురపాలక సంఘం సభ్యుడు శరణప్పమేధా, చన్నబసవస్వామి, దేసాయి దోతరబండి, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అన్నభాగ్య బియ్యం పట్టివేత

జె.సి.ఆర్.నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన అన్నభాగ్య బియ్యం లారీ

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: అక్రమంగా అన్నభాగ్య బియ్యం బస్తాలను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకొన్నట్లు సహాయక కమిషనర్ మహబూబ్ జిలాని ఖురేశి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉదయం 10 గంటల సమయంలో జె.సి.ఆర్.నగర్‌లో అనుమానాస్పదంగా నిలిపిన లారీలో అన్నభాగ్య బియ్యం బస్తాలు ఉన్నట్లు సమాచారం అందటంతో వెంటనే అధికారులు, పోలీసులను వెంటబెట్టుకొని తనిఖీ చేశామన్నారు. లారీలో బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించామని, లారీ చోదకుడు, క్లీనర్ అక్కడి నుంచి పారిపోయారన్నారు. రూ.6 లక్షలు విలువైన 15 టన్నులకు పైగా బియ్యం బస్తాలు ఉన్నట్లు తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

27-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1623.29	1630.15
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,529	3,302
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,316	6,984
నీటి నిల్వ (టి.ఎం.సి)	71.046	94.628

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అమ్మభాషలో బోధించాలి

జోగతి మంజమ్మను సన్మానిస్తున్న సంఘం సభ్యులు తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థులకు అమ్మభాషలో బోధించాలి. ప్రతి ఒక్కరూ కన్నడను గౌరవించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత జోగతి మంజమ్మ తెలిపారు. ప్రబుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన రాజ్యోత్సవ కార్యక్రమాన్ని జోగతి మంజమ్మ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చరవాణులకు దూరంగా ఉండాలి. టీవీని చూడకండి.. విద్యార్థులు మహాభారతం, ఖురాన్, రామాయణం, బైబిల్ వంటి పుస్తకాలు పఠనం చేసే అభ్యాసం చేయాలన్నారు. మంగళముఖి (హిజ్రాలు) అన్న కార్యక్రమానికి అధ్యక్షత వహించి గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో మంగళముఖిలను నిర్లక్ష్యం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రబుద్ధ ఫౌండేషన్ అధ్యక్షుడు గాది గెణికెహాళ రాజ్యోత్సవం ప్రాముఖ్యత, రాజ్యాంగం గురించి వివరించారు. జి.కె.ఫౌండేషన్ సంస్థాపకుడు జి.కె.స్వామి, తహసీల్దార్ నరసప్ప, సీఐ సుప్రిత్, సభ్యులు లోకేష్, వాగీశ్, రేఖ, సుంకప్ప దేసాయి, గుత్తిగనూరు శేఖర్, గిరియప్ప, దేవపుత్ర పాల్గొన్నారు.

ఆపద సమయంలో సంజీవని

రక్తదానం చేస్తున్న శరణబసవరాజ్ పాటిల్

మాన్వి, న్యూస్‌టుడే : ప్రమాద సమయాల్లో ఉన్న వారికి రక్తం సంజీవని వంటిదని తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్ పేర్కొన్నారు. కల్మఠ విరూపాక్ష పండిరాధ్య స్వామీజీ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, రిమ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆధునీక సాంకేతిక అందుబాటులోకి వచ్చిన క్రమంలో రక్తాన్ని తెల్లరక్తకణాలు, ప్లాస్మాలుగా విభజించి అవసరమైన రోగులకు ఇస్తారన్నారు. డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేదిక్ వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, కల్మఠం భక్తులు, ఔత్సాహికులు రక్తదానం చేశారు.

నేడు విజయవాడకు మంత్రుల బృందం

మాన్వి, న్యూస్‌టుడే : చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసు రాజు, రోడ్డు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్రపద్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కానున్నారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్‌లతో సమావేశమై తుంగభద్ర నదికి చికల్‌పర్వి వద్ద నిర్మించనున్న వంతెన అంశంపై చర్చలు జరుపుతారు. సాయంత్రం విమానంలో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాయచూరు వస్తారు. ఈ మేరకు మంత్రి బోసు రాజు వ్యక్తిగత కార్యదర్శి వీరభద్రప్ప హంచినాళ్ ఒక ప్రకటనలో తెలిపారు.

29న వీఎస్కేయూలో యువజనోత్సవం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు డా.బి.ఆర్.అంబేడ్కర్ భవనంలో నిర్వహించే అంతర్ విభాగం యువజనోత్సవ కార్యక్రమాన్ని మేయర్ పూజారి గాదెప్ప, ఉపకులపతి మునిరాజు ప్రారంభిస్తారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.పి.దినేశ్, మూల్యాంకనం రిజిస్ట్రార్ ఎన్.ఎం.సాలి, ఆచార్యులు నాగరాజు, శాంతనాయక్ పాల్గొంటారన్నారు.

రథోత్సవ మార్గం పరిశీలన

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి పేటె బసవేశ్వర నీలమ్మ జోడు రథోత్సవం 30న జరగనుంది. రథోత్సవం ఆలయం నుంచి కూలికట్టె బసవేశ్వర ఆలయం వరకు సాగనుంది. ప్రస్తుతం ఈ మార్గంలోని మధ్య మసీదు నుంచి జోగి కాలువ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రథోత్సవం నేపథ్యంలో మార్గాన్ని వీక్షించిన వీరశైవ సముదాయ నాయకులు 29లోపు మార్గాన్ని సుగమం చేయాలని అధికారులను కోరారు.

మార్గాన్ని పరిశీలిస్తున్న భక్తులు

చిత్రలేఖనంలో విద్యార్థిని

జానపద పాటలకు నృత్యం

అలరించిన కళా ప్రతిభోత్సవం

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న కళాప్రతిభను వెలికితీయడానికి కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళా ప్రతిభోత్సవ ముగింపు కార్యక్రమం గురువారం సాయంత్రం ముగిసింది. విద్యార్థులు చేసిన నృత్యాలు, సృజన కళలు, జానపద కళలు అబ్బురపరిచాయి. తల్లిదండ్రులు, సందర్శకుల హర్షధ్వానాలతో వేదిక మార్మోగింది. బళ్లారి జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రశంసాపత్రాలను అందజేశారు. యవ్వనంలో పిల్లలు దురలవాట్లకు అలవాటుపడి మృతిచెందిన తర్వాత వృద్ధాప్యంలో కన్నవారు పడుతున్న కష్టాలను మనసులను కదిలించింది.

నాటకంలో ఓ సన్నివేశం

పూర్వ పాఠశాలకు ఎంపికైన ఎల్‌బీఎస్ కేంద్రం

రాయచూరు: అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక తరగతుల (ఎల్‌కేజీ, యుకేజీ)ను ప్రారంభించేందుకు నగరంలోని ఎల్‌బీఎస్ నగర్ 12వ అంగన్‌వాడీ కేంద్రం ఎంపికైనట్లు తాలూకా శిశు అభివృద్ధి యోజనాధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇది జిల్లాలో మొట్టమొదట ప్రారంభించిన పూర్వ ప్రాథమిక పాఠశాల కావడం విశేషం. ఈ కేంద్రంలో మెరుగైన మౌలిక వసతులు ఉన్నందున, కార్యకర్త రేష్మా పనితీరు ఆధారంగానే ఎంపిక చేశారు. రాష్ట్రంలో ఐదువేల బడులు తెరుస్తుండటంపై బెంగళూరు అరమనె మైదానంలో శుక్రవారం అధికారికంగా ప్రకటిస్తారు. ఈ కార్యక్రమ ప్రసారాన్ని వీక్షించేందుకు ఎల్‌బీఎస్ కేంద్రంలో ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు సహ పంక్తి భోజనం అందించాలి

మెట్రి పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న శశిధర కోసంబి

కంప్లి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులను వరుసగా కూర్చోబెట్టి మధ్యాహ్న భోజనం వడ్డించాలన్న నియమం ఉంది. ఆ పద్ధతిని ఉల్లంఘించి నిలబెట్టి భోజనం పెడుతున్నారని కర్ణాటక రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణ కమిషన్ అధ్యక్షుడు శశిధర కోసంబి ఆగ్రహం వ్యక్తం చేశారు. కంప్లి తాలూకాలోని మెట్రి, రామసాగర ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్లాక్ విద్యా శాఖ అధికారి (బీఈవో) అనుమతి పొంది సెలవు తీసుకోవాలి. మెట్రి ప్రధానోపాధ్యాయుడు అధికారి అనుమతి లేకుండానే సెలవు తీసుకుని మరొకరికి ప్రధానోపాధ్యాయ బాధ్యతలు అప్పగించారు. ఇది విద్యా శాఖ నియమ ఉల్లంఘన. మెట్రిలోని ఉన్నత పాఠశాల 12 మంది, ప్రాథమిక పాఠశాల అయిదుగురు విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరవుతున్నారు. ఈ విషయాన్ని పిల్లల సంక్షేమ సమితి దృష్టికి తేలేదన్నారు. పాఠశాలలో శుద్ధ తాగునీటి సదుపాయం లేదని వాపోయారు. 2020-21 కరోనా సమయంలో పిల్లలకు పౌష్టికాహారం కోసం నిధులు మంజూరయ్యాయి. పిల్లలకు పౌష్టికాహారం అందించలేదన్న ఫిర్యాదులు వచ్చాయి. రామసాగర ఉన్నత పాఠశాలలో ఎస్‌డీఎంసీ (పాఠశాల అభివృద్ధి సమితి) సభ్యులు విద్యార్థుల నుంచి అధిక ఫీజు వసూలు చేశారని తెలిసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని వేరే చోటుకు బదిలీ చేశారు. ఇది సరైన చర్య కాదు. పౌష్టికాహార నిధుల దుర్వినియోగం, అధిక ఫీజులు వసూలు విషయాల్లో జిల్లా విద్యా శాఖ అధికారి తనిఖీ నిర్వహించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుని కమిషన్‌కు నివేదిక సమర్పించాలి. లేకపోతే కమిషన్ స్వయంగా తనిఖీ చేపడుతుందన్నారు. తహసీల్దార్ మంజునాయక్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే దేశం శక్తివంతం

బళ్లారి, న్యూస్‌టుడే: మన దేశం ప్రపంచంలోనే అతి పెద్ద, బలమైన, అత్యంత శక్తివంతమైన లిఖిత రాజ్యాంగం కలిగిన దేశం. భారతీయులకు రాజ్యాంగమే పవిత్ర గ్రంథమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవా ప్రాధికార సంస్థ అధ్యక్షురాలు జస్టిస్ కె.జి.శాంతి పేర్కొన్నారు. న్యాయశాఖ, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సంయుక్తంగా బుధవారం సాయంత్రం స్థానిక తాళూరు రహదారిలోని నూతన కోర్టు ఆవరణలో రాజ్యాంగం దినోత్సవాన్ని ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మన విధిని తెలుసుకుని, దేశ భద్రత కోసం మాత్రమే కాకుండా మన భద్రత కోసం కూడా చట్టాలను గౌరవిస్తే రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడినట్లు అవుతుందన్నారు. న్యాయమూర్తి వెంకటేష్ రాజ్యాంగంపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.శాంతి రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. న్యాయమూర్తులు రాజేష్ ఎన్.హొసమని, ప్రమోద్, రాఘవేంద్రగౌడ, రాధాకాంత్‌గుడి, ఇబ్రహీం ఎం.ముజావర్, వినుత, ముదుకప్ప, నస్రత్ మఖ్తార్, నాగేష్‌నాయక్, సిద్ధలింగయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.శాంతి, న్యాయమూర్తులు

మౌలిక వసతులు సమకూర్చండి

రాయచూరు: నగరంలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రధాన సమస్యలను పరిష్కరించాలని రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహాపాత్రను కోరారు. ఎమ్మెల్యే గురువారం కమిషనర్ చాంబర్‌లో జుబిన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇ-ఆస్తి ఖాతా కోసం దరఖాస్తు సమయంలో ఏర్పడుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించాలన్నారు. చెరువులు, కోటల ప్రదేశానికి సమీపంలోని ఇంటి యజమానులు సక్రమంగా పన్నులు చెల్లించి ఉంటే ఖాతాలు మంజూరు చేయాలని, కొత్త నిర్మాణాలకు అనుమతి ఇవ్వవద్దన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని దాఖలాలను అందజేస్తే ఖాతా ఇవ్వటానికి ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు.

(c) eenadu

గోదాముల మండలి లాభాల బాట



ముఖ్యమంత్రికి చెక్కు అందిస్తున్న మండలి అధ్యక్షుడు సంపంగి తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్ర గోదాము అభివృద్ధి మండలి గడించిన రూ. 1.49 కోట్ల లాభాలను గురువారం బెంగళూరు విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు చెక్కు రూపంలో మండలి అధ్యక్షుడు సంపంగి అందించారు. నష్టాల్లో ఉన్న సంస్థను లాభాల బాట పట్టించామని, ఆ మొత్తాన్ని సర్కారుకు అందజేశామని వివరించారు. మండలి అధికారులు, ఉద్యోగులను ముఖ్యమంత్రి అభినందించారు.

యువతి ఊపిరి తీసిన విద్యుదాఘాతం

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : హుబ్బళ్లిలోని మూరుసావిర మఠం పరిధిలో ఉంటున్న మేఘన (24) అనే యువతి బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో మరణించింది. ఇంట్లో నీటి కోసం మోటారు వేసేందుకు వెళ్లిన సమయంలో విద్యుత్తు షాక్ కొట్టి పడి పోయింది. చికిత్స కోసం కిమ్స్‌కు తీసుకువెళ్లే లోగా కన్నుమూసింది. ఉపనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గ్రామీణ ప్రదర్శనలకు చక్కని స్పందన

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : జై జవాన్, జైకిసాన్ నినాదం ప్రజల జీవన మంత్రం కావాలని యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ పేర్కొన్నారు. విశ్వ విద్యాపీఠంలో దేశభక్తి, వ్యవసాయ సంస్కృతి వైభవం పేరిట నిర్వహించిన జైజవాన్, జైకిసాన్ సాంస్కృతిక ఉత్సవం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి, కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ యోగేంద్ర సింగ్ యాదవ్, కర్నల్ జైశంకర్ బాబు, సీబీ మహేశ్వరప్ప తదితరులను సత్కరించి మాట్లాడారు. గ్రామీణ వాతావరణాన్ని యువత, విద్యార్థులకు పరిచయం చేసే దిశలో ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో ఉంచిన ఎద్దుల బండి, ఇతర నమూనాలకు చక్కని స్పందన లభించింది. సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ సుశీలా సంతోష్, ఇతర ఉపాధ్యాయులు ప్రశంస పత్రాలు, ప్రోత్సాహకాలను వితరణ చేశారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలిలో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్ సిటీ ప్రత్యేక సౌకర్యంతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలని కోరే వారి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాలు కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రిట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రులు బస ఎంపిక చేసుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలిమంటలు కాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	105
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	120
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	80
టమాటా(సాధారణ)-	70
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	65
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	165
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	85
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

హంపీ రాతిరథం.. సస్యవాటికగా రూపాంతరం

కాకరకాయ, మిరపకాయలు, క్యాప్సికమ్‌తో ఏనుగు

అబ్బురాల మూట.. కబ్బన్ పూలబాట!

ప్రత్యేక ఫల, పుష్ప ప్రదర్శన షురూ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఉద్యాననగరి నగర నడిబొడ్డున విరాజిల్లే కబ్బన్ ఉద్యానవనం సుమరాజాలతో వికసించింది. వివిధ రకాల పూలు, పండ్లు, మొక్కలు, కూరగాయలతో చేసిన బొమ్మలు, మరుగుజ్జు పండ్ల మొక్కలతో పాటు సైనికుల ఆయుధ సంపత్తి, యుద్ధట్యాంకుల నమూనాల ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ తెరతీశారు. వ్యవసాయం, ఉద్యానవనాల శాఖలు ప్రదర్శనను ఏర్పాటు చేయగా.. 11 రోజుల పాటు కొనసాగుతుంది. వివిధ రకాల అలంకరణలకు ఎనిమిది రకాల బంతి పులు, 26 రకాల కాగితం రంగులు, విదేశీ- స్వదేశీ అలంకార పుష్పాలు, మొక్కలను ఉపయోగించారు. ఇళ్లలో పెంచుకునే మొక్కలతో పాటు నల్లేరు, నల్లజీడు, మరుగుజ్జు మొక్కలూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కాకర కాయలు, పెద్దమిరప, క్యాప్సికమ్ సాయంతో ఏనుగు బొమ్మలు సిద్ధం చేశారు. సుమ రాజాలతోనే చేపలు, ట్రాక్టర్, ఏనుగులు, జింకలు దర్శనమిస్తాయి. యుద్ధంలో వినియోగించే ట్యాంకులు, వైర్లెస్ వ్యవస్థ, బుల్లెట్ దుస్తులు, ఏకే-47, ఏకే-56, ఎస్ఎల్ఆర్ రకం ఆయుధాలను మరో వేదికపై సిద్ధం చేశారు. వాటిని చిన్నారులు, యువకులు ఆసక్తిగా గమనించారు. వాటి పనితీరును సైనికులు వివరించారు. మైసూరు మహారాజు చామరాజ ఒడెయర్ కూడలి నుంచి బాలభవన్ వరకు సుందర అలంకార వేదికలు కళ్లను మరల్చుకోనియ్యవు. ఫలాలు, శీతల పానీయాలు కావాలనే వారికి అందుబాటులో ఉంచారు. ఆయా వేదికల ఛాయాచిత్రాలను తీసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. ఈ ప్రదర్శన ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు- డిసెంబరు ఏడో తేదీ దాకా కొనసాగుతుంది. బాలలకు రూ.10, పెద్దలు రూ.30 ప్రవేశ ధర చెల్లించి ప్రదర్శన తిలకించేందుకు నిర్వాహకులు అవకాశం కల్పించారు.

పువ్వులతో తయారు చేసిన ట్రాక్టర్

కబ్బన్‌పార్కు చామరాజ ఒడెయర్ కూడలికి పుష్పాలంకరణ

ప్రదర్శనకుంచిన సైనిక ఆయుధాలను తిలకిస్తున్న సందర్శకులు

కోట్లు కొట్టేసి.. మాటల్లో చిక్కారు!

దుండగులు దారితప్పించిన సొమ్ము తరలించే వాహనం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : దోపిడీకి వారెంత గట్టి ప్రయత్నం చేసినా.. చివరికి కుటుంబ బలహీనతల వరకు వచ్చేసరికి బోల్తా పడి పోలీసుల వలలో చిక్కారు. బెంగళూరు ఏటీఎంలలో నగదు నింపేందుకు తీసుకువెలుతున్న వ్యానును అడ్డగించి రూ.7.11 కోట్ల నగదుతో పరారైన నిందితుల్లో ఇద్దరు తమ భార్యలకు ఫోన్ చేసి చిక్కుల్లో పడ్డారు. ఆపై.. ఆ ముఠా మొత్తం అనుపానలు వెలుగు చూసేందుకు వారి ఫోన్ కాల్స్ కారణమయ్యాయని తేలింది. ఈ కేసు దక్షిణాది రాష్ట్రాల్లో కలకలం రేపిన విషయం తెలిసిందే. కేసు నిందితుల్లో రవి, రాకేశ్ భార్యలు ఇద్దరూ గర్భిణులు. ఇళ్లలో ఒంటరిగా వదిలి పెట్టి దోపిడీకి వచ్చారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వారికి ఫోన్లు చేసేందుకు పది చరవాణులు కొనుగోలు చేసుకున్నారు. కొత్త సిమ్ కొంటే.. గుర్తింపు కార్డు ఇవ్వవలసి వస్తుందని భయపడ్డారు. దోపిడీ అనంతరం నిందితులు అందరూ విడిపోయారు. వీరిద్దరూ హొసూరుకు వెళ్లి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు రూ.10 వేలు చెల్లించి ఒక క్యాబ్ బుక్ చేసుకున్నారు. క్యాబ్ డ్రైవరు నుంచి ఫోను తీసుకుని వారిద్దరూ తమ భార్యలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, తాము త్వరలో వస్తామని చెప్పారు. అప్పటికే వారిద్దరి భార్యల ఫోన్లపై పోలీసులు 'నిఘా' ఉంచడంతో వివరాలు సులువుగా దొరికిపోయాయి. క్యాబ్ డ్రైవరు కాల్ డేటా ఆధారంగా, నిందితులు వెళుతున్న మార్గాన్ని గుర్తించారు. ఓ రైల్వేస్టేషన్ వద్ద వారిద్దరినీ మొదట అరెస్టు చేశారు. అనంతరం మరో ఏడుగురిని అరెస్టు చేశారు. దోచుకున్న రూ.7.11 కోట్లలో నిందితులు కేవలం రూ.లక్ష మాత్రమే ఖర్చు చేసుకున్నారు. ఇప్పటి వరకు రూ.6.30 కోట్లు జప్తు చేసుకోగా, మరో రూ.81 లక్షలను కొందరు స్నేహితులకు చేబదులుగా ఇచ్చారని అనుమానిస్తున్నారు.

కారాగారంలో పరిచయంతో నేరాలబాట

బెంగళూరు (మహాలక్ష్మిలేఅవుట్), న్యూస్‌టుడే : కారాగారంలో ఉన్నప్పుడు మొదలైన పరిచయం.. బెయిలుపై బయటకు వచ్చిన అనంతరం కొనసాగించి, దొంగతనాలకు పాల్పడుతున్న హరీశ్ నాయక్, హేమంత్‌లను బ్యాడరహళ్లి ఠాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.2 లక్షల విలువైన ఆభరణాలు జప్తు చేసుకున్నారు. గతంలో దొంగతనం కేసుల్లో కారాగారం చేరిన అనంతరం వీరిద్దరికీ పరిచయం మొదలైంది. బయటకు వచ్చిన అనంతరం కలిసి గొలుసు చోరీలు, దారి దోపిడీలకు పాల్పడుతూ వచ్చారు. ఈ నెల 18న సర్‌ఎం విశ్వేశ్వరయ్య లేఅవుట్‌కు చెందిన మహిళను కత్తితో బెదిరించి గొలుసు తెంపుకొన్నారు. హెగ్గనహళ్లి క్రాస్ వద్ద ఈ వారం ప్రారంభంలో మరో ఇద్దరిని బెదిరించి, నగదు, నగలు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ పూర్తి చేసి వీరిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

నా ఆకాంక్ష అదే: నిర్మలానంద

హాసన, న్యూస్‌టుడే : కర్ణాటక కాంగ్రెస్ ప్రదేశ్ సమితి అధ్యక్షుడు డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నానని, అదే తమ సముదాయం ప్రతినిధులకూ కోరిక అని ఆదిచుంచనగిరి పీఠాధిపతి నిర్మలానందనాథ స్వామి పేర్కొన్నారు. పార్టీ పట్ల విధేయత, ఆయన సేవలను పరిగణనలోకి తీసుకుని త్వరగా ఆయనకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పాత మైసూరు ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని పార్టీ శ్రేణులను ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన శివకుమార్‌కు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తుందని అందరూ వేచి చూస్తున్నారని గురువారం ఇక్కడ తనను కలుసుకున్న విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధికి జనతాదళ్, భాజపా, కాంగ్రెస్‌లకు చెందిన ఒక్కలిగ నాయకుల శ్రమ చాల ఉందని ఆయన పేర్కొన్నారు.

అక్రమ ఆస్తుల విలువ.. రూ.35.31 కోట్లు!

బెంగళూరు (గ్రామీణం) : ఆదాయం కన్నా ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్న పది మంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల అక్రమార్జన విలువను రూ.35.31 కోట్లని లోకాయుక్త అధికారులు ప్రకటించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు దాడులు, సోదాలు కొనసాగాయి. బెంగళూరు, మైసూరు, మండ్య, బీదర్, హావేరి, ధార్వాడ, గదగ, కొడగు, శివమొగ్గ, రామనగర, కోలారు జిల్లాల్లోని వారి నివాసాలు, కార్యాలయాల్లో సోదాల అనంతరం వారి అక్రమార్జనను గుర్తించారు.

శిరస్త్రాణాలు లేక.. ఇద్దరు బలి

హాసన, న్యూస్‌టుడే : బేలూరు తాలూకా హొన్నేహళ్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో లోకేశ్ (25), కిరణ్ (32) అనే వ్యక్తులు గురువారం మరణించారు. వీరిద్దరూ వెళుతున్న బైకు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. తలకు శిరస్త్రాణాలు లేకపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. బేలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో టెకీ..

బెంగళూరు (సదాశివనగర) : మాన్యత టెక్‌పార్కులోని ఒక కంపెనీలో టెకీగా పని చేస్తున్న ఆనంద్ (35) రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుధవారం రాత్రి 10.45కి ప్రమాదం సంభవించింది. విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో బైకు అదుపుతప్పి రహదారి విభాజకాన్ని ఢీకొట్టింది. చికిత్స కోసం వచ్చిన అంబులెన్సు జక్కూరు ఎయిర్ స్ట్రిప్ మార్గంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద వాహన రద్దీలో చిక్కుకుపోయింది. బాధితుడ్ని మరో కారులోకి ఎక్కించుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా మరణించారు.

బాలిక.. నిగూఢ హత్య

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బోళార గ్రామానికి చెందిన కవన (15) అనే బాలిక హత్యకు గురైంది. తల్లి చనిపోయిన అనంతరం అదే గ్రామంలో సమీప బంధువు సావిత్రమ్మ ఇంట్లో ఉంటుండగా.. తండ్రి వేరే చోట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన బాలిక మళ్లీ వెనక్కు తిరిగి రాలేదు. ఆమెను వెతుక్కుంటూ వెళ్లిన సావిత్రమ్మకు బాలిక మృతదేహం కనిపించింది.

ప్రైవేటు వాహనాల జప్తు

కోలారు, న్యూస్‌టుడే : పన్ను చెల్లింపుల్లో లోపాలు, సరైన పర్మిట్లు లేకుండా ప్రయాణికులను తరలిస్తున్న 32 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను కోలారు జిల్లాలో రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. బస్సుల్లో అత్యవసర ద్వారాలు లేకపోవడం, ప్రమాదం సంభవిస్తే బస్సు నుంచి తప్పించుకునేందుకు, అద్దాలు పగలగొట్టేందుకు ఎటువంటి పరికరాలు లేవని గుర్తించి, ఈ బస్సుల నిర్వాహకులకు రూ. కోటి జరిమానా విధించారు.

జలవేణి.. నగర సొబగులకు పారాణి

బెంగళూరు చరిత్రతో ముడిపడిన హెసరుఘట్ట చెరువు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర ప్రజల దాహం తీర్చేలా చెరువులను సంరక్షిస్తున్న తీరు ఇతర రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. వాటి నిర్వహణ, సంరక్షణపై అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారుల బృందాలు తరచుగా ఇక్కడికి వస్తుండటం ప్రస్తావనార్హం. సాధారణంగా నగరాల మధ్య భాగంలో చెరువులున్నాయంటే.. అవి నిర్వహణకు నోచుకోక మురికికూపాలుగా కనిపిస్తుంటాయి. నిజానికి ఉద్యాననగరిలోనూ గతంలో ఈ తరహా పరిస్థితి కానవచ్చినా ప్రస్తుతం మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. కాలుష్య కోరల నుంచి వాటిని రక్షించి, మురుగునీటి శుద్ధీకరణతో సమస్యను నిలువరించి, పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. ప్రతి చెరువు బాగోగులకూ ప్రజా భాగస్వామ్యంతో చర్యలకు ఉపక్రమించడం ఫలితాన్నిచ్చింది. పందులు దొర్లాడే చోట.. అనేకానేక జాతుల పక్షులతో నేడు అందాలు ఇనుమడించాయి. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వచ్చి ఇక్కడి చెరువులపై అధ్యయనం చేశారు. కర్ణాటక సర్కారు అమలు చేస్తున్న జలసంరక్షణ పథకాలను చూసి ఆ రాష్ట్ర అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారని పాలికె వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఒడిశా, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అధికారులూ త్వరలో రానున్నట్లు ఆ వర్గాల ద్వారా అందిన సమాచారం. మొన్నటి ఈశాన్య రుతుపవనాల సమయంలో కురిసిన వర్షాలకు చెరువులన్నీ నిండి జలకళ ఉట్టిపడుతోంది. భూగర్భ జలాల మట్టం విపరీతంగా పెరిగినట్లు భూగర్భ- గనుల శాఖ అధికారులు తెలిపారు. నగర పరిధిలో 64 చెరువులు ఉండగా. అందులో 42 చోట్ల నిండుకుండలు దర్శనమిస్తున్నాయి. మిగిలిన వాటిలో సంతృప్తికరంగా నిల్వలున్నాయి. నగర శివార్లలో తాగునీటి ఎద్దడి పూర్తిగా నిలువరించారు. రెండేళ్ల కిందట తాగునీటి ఎద్దడి ఎదుర్కోలేక చాలా మంది వేర్వేరు ప్రాంతాలకు కదలివెళ్లారు. మరికొందరు ట్యాంకర్ల నీటిని కొనుక్కుని కాలం వెళ్లదీశారు. వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో భూగర్భజలాల మట్టం పెరిగి.. ఈసారి ముప్పు నిలువరించే మార్గం సులువైంది. హెబ్బాళ, నాగవార, యలహంక, హలసూరు, శాంకి, దాసరహళ్లి, కెంపాబుద్ధి, అగ్రహార, దొడ్డబొమ్మసంద్ర, లక్కసంద్ర, జక్కూరు, పుట్టేనహళ్లి, జేపీనగర, అగర, మడివాళ, కైగుండనహళ్లి, మారతహళ్లి, సర్జాపుర, కె.ఆర్.పురం, భట్టరహళ్లి, మహదేవపుర, హెసరుఘట్ట తదితర చెరువుల పరిసరాలన్నీ పచ్చందాలతో తులతూగుతున్నాయి.

> **అక్రమార్కుల చెర నుంచి తటాకాలకు విముక్తి కల్పించడానికి రెండుమూడేళ్లుగా సర్కారు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తోంది. దశాబ్దం కిందటి వరకు మురికికూపాలుగా దర్శనమిచ్చిన చెరువులకు నిధులు కుమ్మరించడంతో కొత్తందాలతో మెరిసిపోతున్నాయి. వాటి సంరక్షణ చర్యలు ఇతర రాష్ట్రాలకు పాఠాలుగా మారాయి!**

నాగవార తటాకం.. నగర అందాలకు పెట్టని కోట

సినీ కార్మికుల సంక్షేమానికి నిధి!

మంత్రివర్గ సమావేశంలో తీర్మానం

ఈనాడు, బెంగళూరు : చలన చిత్ర రంగంలో పని చేసే కార్మికులను అసంఘటిత కార్మికులుగా గుర్తించి వారి సంక్షేమం కోసం ప్రత్యేక బిల్లును తయారు చేయాలని సర్కారు తీర్మానించింది. బెంగళూరులో గురువారం మంత్రివర్గ సమావేశంలో చర్చించిన ఈ బిల్లును రానున్న శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. కల్యాణ కర్ణాటక నీటి పారుదల, హజ్ యాత్రికులకు భద్రత, ఉత్తర కన్నడ జిల్లా తాగునీటి సమస్యల పరిష్కారానికి పరిష్కారం తదితరాలపై ఈ మంత్రివర్గ సమావేశంలో సముచిత నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో చర్చించిన మరిన్ని అంశాలిలా ఉన్నాయి.

● పార్టీలో అధికార పంపిణీ కోసం మొదలైన గందరగోళ పరిస్థితులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అత్యధిక సంఖ్యలో మంత్రులు ముఖ్యమంత్రిని నిలదీసినట్లు సమాచారం. నాయకత్వ మార్పునకు అవకాశం ఇచ్చేందుకు మేము సహకరించబోమని సీనియర్లు తేల్చి చెప్పారు. బెళగావి సమావేశాల్లోగా ఈ అంశంపై స్పష్టత తేవాలని పట్టుబట్టారు. అధిష్ఠానం రమ్మంటే దిల్లీకి వెళ్లి మా అభిప్రాయాలు వెల్లడిస్తామని వీరంతా ముఖ్యమంత్రికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

మరిన్ని తీర్మానాలు: హజ్ యాత్రికుల భద్రత కోసం ప్రత్యేక నియమాలు రూపొందించాలని, ఇందు కోసం కేంద్ర హజ్ సమితి చట్టంలోని కీలకాంశాలను రాష్ట్ర సమితి పాటించాలని నిర్ణయించారు. కల్యాణ కర్ణాటక నీటిపారుదల సమస్య తీర్చేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.200 కోట్లు, సినీ కార్మిక నిధి కోసం టికెట్ ధరల్లో రెండు శాతం సెస్‌గా వసూలు, రాష్ట్ర డేటా సెంటర్‌లో నిర్వహించే విపత్తు నిర్వహణ కేంద్రాల సేవలను మరో ఐదేళ్లకు విస్తరించేందుకు రూ.143 కోట్ల వ్యయాన్ని అంచనా, రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయానికి కిత్తూరు రాణిచెన్నమ్మగా పేరు మార్పు, బెంగళూరు జలమండలి వినియోగదారులు చెల్లించే బిల్లుల్లో ఏకకాలంలో చెల్లించే వాటిపై వడ్డీ, అదనపు రుసుములు రద్దు, జీబీఏ పరిధిలో ఘన వ్యర్థ నిర్వహణ, ల్యాండ్ ఫిల్లింగ్ ప్రాంతాల కోసం రూ.100 కోట్లు, రాష్ట్రంలోని పది చిన్న రేవుల్లో ఇనుప ఖనిజ రవాణా నిషేధంపై విధించిన ఆదేశాల రద్దు, రవాణాశాఖలో నియామకాలు, కొప్పళ జిల్లా గంగావతిలో కొత్త శాటిలైట్ బస్టాండ్‌ల నిర్మాణం తదితరాలపై ఈ మంత్రివర్గంలో తీర్మానాలు చేశారు.

పోలీసులకు దొరికిన డిజిటల్ టోకరా ముఠా

కడప నేరవార్తలు: డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి ఓ విశ్రాంత ఉద్యోగి దాచుకున్న సొమ్మును దోచుకున్నారు. ఎవరికీ చెప్పలేక సదరు వృద్ధుడు గుండెపోటుకు గురై మృతి చెందారు. అతని పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి టోకరా ముఠాను పట్టుకున్నారు. కడప జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐ సీతారామిరెడ్డి, సైబర్ ఠాణా సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డితో కలిసి ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు.

● పులివెందులకు చెందిన ప్రకాశ్‌రెడ్డి విశ్రాంత ఉపాధ్యాయుడు. పదవీ విరమణ తర్వాత వచ్చిన నగదుతో పాటు మరికొంత కలిపి మొత్తం రూ. 1,62,83,000 బ్యాంకులో జమ చేశారు. దిల్లీకి చెందిన రాకేశ్, తివారీ అనే వ్యక్తులు ప్రకాశ్‌రెడ్డికి ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు పేరిట భయభ్రాంతులకు గురి చేశారు. వారు చెప్పిన ఖాతాల్లోకి విడతల వారీగా రూ. 1,62,83,000 జమ చేయించుకున్నారు. ఇంకా డబ్బులు కావాలని అడగడంతో ప్రకాశ్‌రెడ్డి పులివెందుల నుంచి కడపకు బస్సులో వస్తూ గుండెపోటుతో ప్రాణాలు విడిచారు.

● నిందితుల కోసం గాలిస్తుండగా పులివెందుల- కదిరి సమీపంలోని తలుపుల క్రాస్ రోడ్డు వద్ద చిక్కారు. వీరు చిక్కరాజు మధు(బెంగళూరు యలచేనహళ్లి), ఆదిత్య మనోహర్(జయనగర్), అర్జున్ నేలమాకల అలీసిద్దయ్య(కర్ణాటక రాష్ట్రం మాండ్యా), రోషన్, సురేశ్, హరీశ్(బెంగళూరు)గా గుర్తించారు.

గజరాజులతో గుండెదడ

చామరాజనగర, న్యూస్‌టుడే : ఒకవైపు పులుల దాడులతో భయపడుతున్న రైతులు, స్థానికులకు ఏనుగుల దాడులు మరింత భయపడేలా చేస్తున్నాయి. చామరాజనగర జిల్లా, తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో 20 కుపైగా ఏనుగులు పొలాలు, తోటల్లోకి వచ్చి వెళుతున్నాయి. బైకుపై వెళుతున్న ఒక యువకుడు ఆ ఏనుగుల గుంపును తన చరవాణి కెమెరాతో రికార్డు చేసి, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ఇప్పుడు ఆ వీడియో వైరల్‌గా మారింది. ఏనుగులను బంధించేందుకు తమిళనాడు అటవీశాఖ సిబ్బందితో కలిసి కార్యాచరణ చేపట్టామని కర్ణాటక అధికారులు తెలిపారు.

యోగేశ్వర్‌కు కోర్టులో ఊరట

రాజాజీనగర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్, ఆయన కుటుంబానికి చెందిన 223 స్థిరాస్తులను ఇతరులకు విక్రయించకుండా గతంలో ఇచ్చిన ఆదేశాలను 43వ అదనపు సిటీ సివిల్, సెషన్స్ న్యాయస్థానం తొలగించింది. యోగేశ్వర మొదటి భార్య మాళవిక సోలంకి, ఆమె కుమార్తె నిశా యోగేశ్వర్ వేసిన దావాపై న్యాయమూర్తి చిన్నణ్ణవర రాజేశ సదాశివ విచారణ పూర్తి చేశారు. ఆ స్థిరాస్తుల్లో ఆరు ఆస్తులపై మాత్రమే వారిద్దరికీ హక్కులు ఉంటాయని స్పష్టం చేసి, మిగిలిన 217 ఆస్తులపై ఉన్న నిర్బంధాన్ని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

Site for Sale 1800 sqft Akhatha, Only 150 Feet From Hosur Main Road, Near Bommanahalli Metro Station, Suitable for Hotel, Automobile Service Center, Nursing Home, Travel Office & PG More Cont: 76766 66616.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆: 96402 58899, 96404 68899

కర్ణాటక గదక్ జిల్లాలో ప్రముఖ విండ్ ఫాన్ కంపెనీలో పని చెయ్యడానికి అనుభవం ఉన్న సూపర్‌వైజర్లు, సైట్ ఇన్‌ఛార్జ్‌లు, ROW డీలింగ్ వ్యక్తులు కావలెను. ✆ : 8919882518.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

రైల్వే పనులను వేగవంతం చేయాలి

రైల్వేశాఖలోని నైరుతి డివిజనల్ బెంగళూరు విభాగం రైల్వే సలహా సమితి సమావేశం గురువారం బెంగళూరులోని డివిజనల్ కార్యాలయంలో జరిగింది. వివిధ రైల్వే సేవలకు సంబంధించి వివరాలను సమితి సభ్యులు సీనియర్ రైల్వే అధికారుల దృష్టికి తెచ్చారు. డివిజనల్ రైల్వే ఏడీఆర్ఎం పరీక్షిత్ మోహన్ సూర్యా నేతృత్వంలో జరిగిన సమావేశంలో రైల్వే సలహా సమితి సభ్యులు టి.జె.గిరీష్, తుమకూరుకు చెందిన ధనియాకుమార్ కరణం రమేష్, వెంకటేశ్‌లాడ్, డి.ఎం.సతీష్, మల్లసంద్ర శివణ్ణ ఇతర సభ్యులు రైల్వేకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. - న్యూస్‌టుడే, తుమకూరు

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : అబ్బిగిరిలో నూతనంగా ప్రతిష్ఠించిన వేంకటేశ్వరస్వామి, రామాంజనేయస్వామికి ఆలయ ధర్మకర్తలు, కమిటీ ప్రతినిధులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ప్రపంచ శాంతికి హోమాలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ధర్మకర్తలు రాజణ్ణ, కె.నాగభూషణం, విశ్వనాథ్, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న విశ్వనాథ్, మహిళలు

హోసూరు కబుర్లు

సొంత నిధులతో సమస్య పరిష్కారం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలోని జూజువాడి ఒకటో వార్డు శెందిల్ నగర్‌లో చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కౌన్సిలర్ అశోక్ పరిష్కరించారు. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. లేఅవుట్ నిర్మాణం చేసిన వ్యక్తులు డ్రైనేజి సదుపాయాన్ని కల్పించని కారణంగా వర్షాకాలంలో కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. సమస్యను స్వయంగా పరిశీలించిన అశోక్ సొంత నిధులు వెచ్చించి డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయించారు. స్థానిక ప్రముఖులు జూజువాడి గణేష, నివాసుల ప్రతినిధులు అశోకను అభినందించారు.

స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అశోక్

వైభవంగా రామలింగేశ్వర ఆలయ కుంభాభిషేకం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ వసంత నగరులోని పర్వతవర్ధిని ఆలయాన్ని ఏఐఏడీఎంకే నాయకుడు నందకుమార్ నేతృత్వంలో భక్తుల సహకారంతో పునరుద్ధరించారు. గురువారం ఆలయం మహా కుంభాభిషేకం వేలాది మంది భక్తుల సమక్షంలో వైభవంగా జరిగింది. దేవతలను పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి, ఉప మేయర్ సి.ఆనందయ్య, ఆరోగ్య కమిటీ ఛైర్మన్ ఎన్.ఎస్.మాదేశ్వరన్, కార్పొరేటర్ మారక్క, చెన్నీరన్, నాయకులు నాగరాజ్, చిట్టి జగదీష్, వెన్సెక్లాస్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి హాజరైన భక్తులు

14 జంటలకు షష్టిపూర్తి మహోత్సవం

డెంకణికోట న్యూస్‌టుడే : డెంకణికోట బేటరాయస్వామి ఆలయ ఆవరణలో 14 వృద్ధ జంటలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో షష్టి పూర్తి కల్యాణోత్సవం నిర్వహించారు. దంపతులకు పంచె, చీర, పండ్లు, పలహారాలు, తాళి, తదితర వస్తువులను పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేల్‌రాజ్, ఎస్.ఎ.నాగరాజు, అరుళ్‌మణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందిస్తున్న శ్రీనివాస్ తదితరులు

విధులు బహిష్కరించి కార్మికుల ఆందోళన

డెంకణికోట, న్యూస్‌టుడే : డెంకణికోట పట్టణంలోని రేషన్ షాపులకు బియ్యం, నూనె, ఇతర వస్తువులను సరఫరా చేసే కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు విధులను బహిష్కరించి ధర్నా చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని, పనిచేసిన వారికి పర్మనెంట్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా, తాలూకా, యూనియన్‌కు చెందిన కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

కృష్ణగిరి (డెంకణీకోట) న్యూస్‌టుడే : జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. గురువారం కృష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ అధ్యక్షతన బాల్య వివాహాలు నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేశారు. అవగాహన కోసం పట్టణంలో కలెక్టర్ స్వయంగా పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో పిల్లల సంరక్షణాధికారి శక్తి, కలెక్టర్ సహాయకులు గోపు, స్వార్డు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అతికిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

'పట్టభద్ర' ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు జిల్లాలో కర్ణాటక ఆగ్నేయ పట్టభద్ర క్షేత్రం ఎన్నికలకు సంబంధించి 23,080 మంది పురుషులు, 16,971 మంది మహిళలు మొత్తం 40,051 మంది ఓటర్ల జాబితాలో చేరారని జిల్లాధికారి శుభాకల్యాణ్ వివరించారు. జిల్లాధికారి కార్యాలయంలోని సభా ప్రాంగణంలో గురువారం ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జాబితాలో మార్పులకు సంబంధించి డిసెంబరు 10 వరకు గడువు ఉందని జిల్లాధికారి తెలిపారు. సమావేశంలో అదనపు జిల్లాధికారి తిప్పేస్వామి, ఇన్‌ఛార్జి ఎన్నికల అధికారి, తహసీల్దార్ అనితాలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లాధికారి శుభాకల్యాణ్ తదితరులు

నేడు, రేపు కన్నడ రాజ్యోత్సవాలు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : కన్నడ భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని, విద్యార్థులు భాష గొప్పదనాన్ని తెలుసుకోవాలనే లక్ష్యంతో హవనూరు లేఅవుట్‌లోని అసెంట్ కళాశాల అధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో కన్నడ రాజ్యోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ బీఎం వెంకటేశ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా దాసరహళ్లి ఎమ్మెల్యే మునిరాజు, కన్నడ కవులు, మేధావులు హాజరవుతారన్నారు. విద్యార్థులకు కవిత్వం, వ్యాసరచన, తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు.

ప్రిన్సిపల్ వెంకటేశ్

దుమ్ము..ధూళితో అనారోగ్యాలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నిత్యం సంచార రద్దీ ఉండే అవుటర్‌రింగ్ రోడ్డు ప్రస్తుతం దుమ్ముధూళితో నిండింది. వాహనదారులు దుమ్ము మధ్య ముక్కులు మూసుకొని సంచరిస్తున్నారు. దీని కారణంగా శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నిలిచింది. నిదానంగా చలి పెరుగుతోంది. చలి దుమ్ము కలిసిన వాతావరణం మధ్య ప్రజలు, వాహనదారులు సంచరిస్తున్నారు. అవుటర్ రింగ్‌రోడ్డు డివైడర్ల మరమ్మతులు చేపట్టారు. రహదారి పక్కన వృథా మట్టి, రాళ్ల కుప్పలు వేశారు. రహదారిపై నిత్యం వాహన సంచారంతో పాటు చుట్టు పక్కల జన నివాస ప్రదేశాలకు దుమ్ము వ్యాపించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మంచులో దుమ్ము కలిసి పోవడంతో ప్రజలు త్వరగా వ్యాధులకు గురవుతున్నారని, రెండు వారాల నుంచి రోగులు సంఖ్య పెరిగినట్లు బౌరింగ్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. హెబ్బాళ్ నుంచి సిల్క్‌బోర్డు కూడలి వరకు డివైడర్ల మరమ్మతులు చేపట్టారు. ఓవైపు డివైడర్ల మరమ్మతు, మరో వైపు మెట్రో ఉపరితల వంతెన పనులు సాగుతున్నాయి. ఈ పనుల కారణంగా సమస్య ఎక్కువగా ఉంది. హెబ్బాళ్, నాగవార, వీరణ్ణపాళ్య, హెణ్ణూరు, కళ్యాణనగర, బాణసవాడి, కస్తూరినగర, హైయ్ లేఅవుట్, ఎఫ్‌సీఐ గోదాములు, కె.ఆర్.పురం, మహదేవపుర, దొడ్డగుబ్బి, మారతహళ్లి, సర్జాపుర, బెళ్లందూరు, సిల్క్‌బోర్డు కూడలి పొడవు వాయుమాలిన్యం అధికంగా ఉన్నట్లు మాలిన్య నియంత్రణ మండలి అధికారులు గుర్తించారు. చలికాలంలో దుమ్ముతో కూడిన గాలిని పీలిస్తే శ్వాసకోశ వ్యాధులు అధికమవుతాయని హెచ్చరిస్తున్నారు. వ్యాధులతో బాధపడే వ్యక్తులు, మధుమేహం, రక్తపోటు కలిగిన వారు బయట సంచరించేటప్పుడు మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పనుల వల్ల వ్యాపిస్తున్న దుమ్ము

దుమ్ముకు కారణమైన నిర్మాణ వ్యర్థాలు

క్రీడల విజేతలకు రూ.5 లక్షలు : ముఖ్యమంత్రి

ధనలక్ష్మి, లక్షలను సత్కరిస్తున్న సిద్ధరామయ్య

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఢాకాలో జరిగిన ప్రపంచకప్ మహిళ కబడ్డీ పోటీలో విజేతగా నిల్చిన భారత జట్టు సభ్యురాలు ధనలక్ష్మి, చైనాలో జరిగిన జూనియర్ ఏషియన్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో రజత పతకం సాధించిన లక్షరాజేశ్‌లను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అభినందించి ఇద్దరికీ చెరో రూ.5 లక్షల బహుమతి ప్రకటించారు. గురువారం కర్ణాటక ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.గోవిందరాజు నేతృత్వంలో విధానసౌధ కార్యాలయంలో సీఎంను కలిసిన ఈ క్రీడాకారిణులకు మైసూరు పేట, గంధం హారం వేసి సత్కరించారు. భవిష్యత్తులో రాష్ట్రం, దేశానికి మరింత పేరు తేవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రూ.5 లక్షల చెక్‌లు అందించాలని ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శికి సీఎం సూచించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కె.వి.ప్రభాకర్, బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రాజేశ్, కోచ్ బి.ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యాననగరంలో హెచ్‌సీఎల్ తొలి సైక్లోథాన్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : హెచ్‌సీఎల్ గ్రూపు సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో హెచ్‌సీఎల్ సైక్లోథాన్ రేసింగ్ సిరీస్‌ను వచ్చే ఫిబ్రవరి 8న ఉద్యాననగరంలో నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీఎల్ గ్రూపు హెడ్ ఉపాధ్యక్షుడు రజత్‌బొందిలియా తెలిపారు. నైస్‌రోడ్డులో నిర్వహించే ఈ సైక్లోథాన్‌కు సంబంధించి గురువారం జెర్సీని గురువారం రజత్‌బొందిలియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మణిందర్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజత్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ సైక్లిస్టులకు ఇదో చక్కని వేదిక కానుందన్నారు. మణిందర్‌సింగ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితశైలిని ప్రచారం చేసేందుకు బెంగళూరులో సైక్లోథాన్ పరిచయం చేస్తున్నామన్నారు. రూ.30 లక్షల బహుమతితో ఏర్పాటు చేసిన ఈ సైక్లోథాన్ ప్రొఫెషనల్స్‌కు 18-35 వయోవిభాగంలో యాభై కిలోమీటర్ల దూరంలో పోటీలు ఉంటాయి. ఇతర వయో విభాగాల్లో కూడా పోటీలు జరగనున్నాయని వివరించారు.

జెర్సీ ఆవిష్కరణలో రజత్ బొందిలియా, మణిందర్‌సింగ్ తదితరులు

నేడు పావగడలో శగదాడు భూతప్పకు పూజలు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని తుమకూరు రహదారిలో వెలసిన ఆదిశక్తి బోధల మారెమ్మ దేవాలయంలో శగదాడు భూతప్ప స్వామికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు రంగనాథ్, తలారి శ్రీనివాసులు తెలిపారు. శిరా తాలూకాలోని శగదాడు గ్రామంలో వెలసిన భూతప్ప స్వామిని పావగడ పట్టణానికి తలారి శ్రీనివాసులు తీసుకొచ్చి మారెమ్మ దేవాలయం దగ్గర ప్రతిష్ఠించారు.

శగదాడు భూతప్పస్వామి

ధర్మస్థలపై ప్రత్యేక తపాలా బిళ్ల ఆవిష్కరణ

బెంగళూరు (సాంస్కృతికం) : ధర్మస్థల గ్రామాభివృద్ధి పథకం ద్వారా చేస్తున్న సాధనలకు గుర్తుగా తపాలా శాఖ వారు ధర్మస్థల గురించి ప్రత్యేక తపాలా బిళ్లను రూపొందించారు. గురువారం ధర్మాధికారి వీరేంద్రహెగ్డే, గణపతిభట్, హేమావతి హెగ్గడే తదితర ప్రముఖులు ఆవిష్కరించారు. భారతీయ జీవిత బీమా సంస్థ హైదరాబాద్ విభాగం ప్రతినిధి పునీత్ రాజ్‌కుమార్ ధర్మాధికారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉడుపి డివిజన్ తపాలా విభాగం ముఖ్య అధికారి రమేశ్, పుత్తూరు తపాలాశాఖ విభాగం అధికారి రవీంద్రనాయక్, అధికారి గణపతిభట్ పాల్గొన్నారు.

తపాలా బిళ్లలను ఆవిష్కరిస్తున్న వీరేంద్రహెగ్గడే, తదితరులు

రేపు మత్తికెరెలో రాయల్ ఉత్సవాలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : పీణ్యా దాసరహళ్లి పరిధి మత్తికెరెలోని రాయల్ కళాశాల నిర్వహించనున్న రాయల్ ఉత్సవాలను ఈనెల 29న జేపీ ఉద్యానవనంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకలను కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే ప్రారంభించనున్నారు. సంస్థాపకుల తల్లి శాంతమ్మ పేరిట ప్రారంభిస్తున్న రాయల్ జ్ఞానశాంతి ప్రశస్తిని శిక్షణా నిపుణుడు ఉడే.పి.కృష్ణకు ప్రదానం చేస్తారు. ప్రారంభ వేడుకల్లో సంస్థాపకులు బీకే దేవరాజ్, డైరెక్టర్ సుజాతదేవరాజ్, ప్రిన్సిపల్ లక్ష్మీశ్‌హెగ్గడే పాల్గొననున్నారు. సాయంత్రం గాయకురాలు ఉషా కోకిలతో సంగీత రసమంజరీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వనాథ్, ఖాదర్‌వలి తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : యలహంకలోని విశ్వవిద్యా పీఠ సంస్థలు గురువారం ఏర్పాటు చేసిన జైజవాన్, జైకిసాన్ సాంస్కృతిక ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే విశ్వనాథ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పెట్టే రైతులను, దేశ సరిహద్దులను సంరక్షించే సైనికులను అందరు గౌరవించాలని తెలిపారు. దేశభక్తి చిన్నతనం నుంచి పిల్లలకు నేర్పించాలని సూచించారు. చిరుధాన్యాలతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్‌వలి, కర్నల్ జైశంకర్ బాబు, సీబీ మహేశ్వరప్ప, పాఠశాల డైరెక్టర్ సుశీలా సంతోష్ తదితరులు హాజరయ్యారు. ప్రదర్శన ఈనెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రాజన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

పావగడ, న్యూస్‌టుడే : ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న రాజకీయ పరిణామాల్లో ముఖ్యమంత్రి మార్పు తథ్యమైతే బడుగు బలహీన వర్గాలకు (ఎస్టీ) చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసి, కె.ఎన్.రాజన్నను మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిడిగల్లు ఆశ్రమ పీఠాధ్యక్షుడు వాల్మీకి సంజయ్‌కుమార్ స్వామీజీ హితవు పలికారు. ఆయన పట్టణంలోని విశ్రాంతి భవనంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన కె.ఎన్.రాజన్నను నిష్కారణంగా మంత్రి వర్గం నుంచి తొలగించడం అన్యాయమన్నారు. అఖిల కర్ణాటక వాల్మీకి నాయక మహాసభ జిల్లాధ్యక్షుడు పాలేగార్ లోకేశ్ మాట్లాడుతూ నాయక సముదాయానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కె.ఎన్.రాజన్నను, నాగేంద్రను మంత్రివర్గం నుంచి తొలగించడం సబబు కాదన్నారు. సీనియర్ దళిత కాంగ్రెస్ నాయకులైన సతీశ్ జార్జిహొళి, పరమేశ్వర్, మునియప్పలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి జాగృతి వేదిక కార్యదర్శి భాస్కర్ నాయక, సభ్యుడు మీనకుంటపల్లి శివప్ప పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న స్వామీజీ, తదితరులు

అథ్లెటిక్స్‌లో ఓవర్‌ఆల్ ప్రశస్తి పొందిన ఆళ్వాస్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మంగళూరు విశ్వవిద్యాలయం అంతర కళాశాలలు, శంకర ప్రభుత్వ మహిళా పీయూ కళాశాల, స్నాతకోత్తర అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన మంగళూరు అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ఆళ్వాస్ కళాశాల జట్టు 23వ సారి ఓవర్‌ఆల్ ప్రశస్తిని పొందింది. విజేతలను గురువారం విద్యా సంస్థ అధ్యక్షుడు ఎం.మోహన్‌ఆళ్వా అభినందించారు. ఆళ్వాస్ క్రీడాకారులు పురుష, మహిళల విభాగాల నుంచి 71 పతకాలను సాధించారు. ఇందులో ఆరు కొత్త రికార్డులను నమోదు చేసారు. 47 విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి.

ఛాంపియన్స్ ఆళ్వాస్ క్రీడాకారులు

వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ముళబాగిలు, న్యూస్‌టుడే : వరకట్నం వేధింపుల కారణంగా తాలూకాలోని కసువుగానహళ్లి గ్రామానికి చెందిన తనుశ్రీ (22) గురువారం తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త, ఒక కూతురు ఉన్నారు. భర్త మాల వేసుకుని శబరిమలకు వెళ్లాడు. అత్త, మామ లేని సమయంలో ఉరి వేసుకుంది. అత్తమామలు, భర్త వరకట్నం కోసం వేధించడం వల్లే తమ కూతురు అత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి ఫిర్యాదు ఆధారంగా నంగలి పోలీసులు కేసు నమోదు చేశారు.

పదిహేను మందికి గాయాలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : హొసకోటె సమీపంలో గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న క్యాంటర్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. బాధితులను హొసకోటెలోని ఎంవీజే ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. హొసకోటె ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవరును అరెస్టు చేసిన పోలీసులు

హాసన, న్యూస్‌టుడే : ఒక బాలిక (17)ను వెంబడిస్తూ తనను ప్రేమించాలని వేధిస్తున్న ఆటో డ్రైవరు మను (27)ను బేలూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. అతని ప్రేమను నిరాకరించడంతో దారి కాచి వేధించడం, శరీరాన్ని తాకుతూ ముద్దులు పెడుతూ వచ్చాడు. అతని హింస భరించలేక బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. వారి ఫిర్యాదుతో బేలూరు ఠాణా పోలీసులు కార్యాచరణ నిర్వహించి నిందితుడ్ని అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద దర్యాప్తు చేపట్టారు.

హిందూ కార్యకర్తలపై దాడి

కలబురగి, న్యూస్‌టుడే : అఫ్జలపుర నుంచి ఆళందకు లారీలో ఆవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో హిందూ సంఘానికి చెందిన కార్యకర్తలు దాన్ని అడ్డుకున్నారు. లారీని పరిశీలించేందుకు ముందుకు వెళ్లిన రోహిత్, అనిల్‌పై డ్రైవరు, క్లీనరు, క్యాబిన్‌లో ఉన్న మరి కొందరు దాడి చేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కలబురగి సబ్ అర్బన్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు తీవ్రగాయాలు

కలబురగి, న్యూస్‌టుడే : జేవర్గి తాలూకా ఇజేరి గ్రామంలో మూడో తరగతి చదువుతున్న లక్ష్మీ సగర (9) అనే బాలిక రోడ్డు ప్రమాదంలో ఒక కాలు కోల్పోయింది. గురువారం మధ్యాహ్నం నీరు తాగేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన గూడ్సు వాహనం ఢీకొనడంతో కింద పడింది. ఆమె కుడి కాలు పైనుంచి వాహనం చక్రం వెళ్లడంతో అది సగానికి విరిగిపోయింది. బాధితురాలిని చికిత్స కోసం జేవర్గి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరారీలో ఉన్న నిందితుని కోసం యడ్రామి ఠాణా పోలీసులు గాలింపు చేపట్టారు.

కేసులు త్వరగా పరిష్కరించండి : సిద్ధరామయ్య

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ఎస్సీ కులాల రిజర్వేషన్ వర్గీకరణ గురించి న్యాయస్థానంలో ఉన్న కేసులను త్వరగా పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ న్యాయవాదులు, ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచించారు. గురువారం ఇక్కడ ఆయన సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఎస్సీ కులాల రిజర్వేషన్‌ను ఏబీసీగా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరించి ఆదేశాలు జారీ చేసింది. కొందరు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో న్యాయస్థానం ఆదేశాలు అమలు కాకుండా నిలుపుదల చేసి విచారణ చేపట్టింది. సంచార కులాలు తమకు అన్యాయం జరిగిందని ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమకు ఒక శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహించిన విషయం తెల్సిందే. న్యాయస్థానంలో ఉన్న కేసుల విచారణ గురించి చర్చించారు. సమావేశంలో మంత్రులు డాక్టర్ మహదేవప్ప, కె.హెచ్.మునియప్ప, జమీర్ అహ్మద్‌ఖాన్, ముఖ్యమంత్రి న్యాయ సలహాదారుడు పొన్నణ్ణ తదితరులు హాజరయ్యారు.

769 మందికి పరిహారం చెల్లింపు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : జిల్లాలో అతివృష్టి వలన పంటలను నష్టపోయిన 769 మంది రైతులకు రూ.1.09 కోట్ల నష్ట పరిహారంను చెల్లించడానికి చర్యలు తీసుకొన్నట్లు జిల్లా పాలనాధికారి వెంకటేశ్ తెలిపారు. గురువారం ముఖ్య మంత్రి సిద్ధరామయ్య నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 467 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నష్టపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ శివకుమార్, ఉద్యానవనాలు, తోటలు అభివృద్ధి శాఖ డీడీ సవిత తదితరులు పాల్గొన్నారు.

టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి

విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : మన్మోహన్ సింగ్ బెంగళూరు నగర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భాష, సంస్కృతి, విశ్వశాంతి, శాంతియుత ప్రపంచం కోసం గురువారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సును ఫ్రాన్స్‌కు చెందిన శిక్షణ నిపుణుడు ఫ్యాడి ఫడేల్ ప్రారంభించారు. సదస్సుకు విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంలో రమేశ్ మాట్లాడుతూ భాషలు, ధర్మం పేరిట భారత సమాజంలో శాంతి నశిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో అలియన్స్ ఫ్రాంఛైస్ డైరెక్టర్ జిన్‌మార్క్ డిపియర్, మ్యాక్స్‌ముల్లర్ భవన్ డైరెక్టర్ మైకెల్‌హైన్స్, ప్రపంచ భాషల కేంద్రం డైరెక్టర్ జ్యోతి వెంకటేశ్, రిజిస్ట్రార్లు ఎ.నవీన్‌జోసెఫ్, రమేశ్ బి.కుడెనట్టి, ఆర్థికాధికారి ఎం.వి.విజయలక్ష్మి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న రమేష్, ఫ్యాడిఫడేల్, తదితరులు

స్నేహ సంబంధాలు కొనసాగించాలి

తుమకూరు, న్యూస్‌టుడే : వృద్ధులు ఇళ్లలో ఒంటరి తనం అనుభవిస్తుంటారని, వృద్ధాశ్రమాల్లో ఉండేవారు ఇతరులతో స్నేహ భాందవ్యాలతో మెలగాల్సి ఉందని సీనియర్ కవయిత్రి రమాకుమారి అభిప్రాయపడ్డారు. తుమకూరు దేవరాయపట్టణ ప్రాంతంలోని శారదాంబ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన నాటక ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ఎందరో ఆశ్రయం పొందుతున్నారని, ఈ వయసులో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమాధికారి చిదానంద్‌మూర్తి, పాత్రికేయుడు ఉగమ శ్రీనివాస్, శారదాంబ ట్రస్టు ప్రతినిధులు యశోదా, శైలా నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిని వెలిగిస్తున్న కవయిత్రి రమాకుమారి, ఉగమ శ్రీనివాస్ తదితరులు

కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : ప్రతి కన్నడిగుడు కన్నడ భాషాభివృద్ధికి కృషిచేయాలని మానవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎం చిక్కణ్ణ పిలుపునిచ్చారు. యశస్ విద్యాసంస్థ ఛైర్మన్ కృష్ణప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవంలో చిక్కణ్ణ కన్నడ జెండాను ఎగురవేసి భువనేశ్వరికి పూజలు చేశారు. తమ మాతృభాషను మరువకుండా భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ ఛైర్మన్ కృష్ణప్ప, ప్రతినిధి గురురాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడిని సత్కరిస్తున్న చిక్కణ్ణ, కృష్ణప్ప తదితరులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

నేడు విజయవాడకు మంత్రుల బృందం

మాన్వి, న్యూస్‌టుడే : చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, రోడ్డు రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కానున్నారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్‌లతో సమావేశమై తుంగభద్ర నదికి చికలపర్వి వద్ద నిర్మించనున్న వంతెన అంశంపై చర్చలు జరుపుతారు. సాయంత్రం విమానంలో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాయచూరు వస్తారు. ఈ మేరకు మంత్రి బోసురాజు వ్యక్తిగత కార్యదర్శి వీరభద్రప్ప హంచినాళ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా వీరేంద్ర హెగ్గడే జన్మదినం

దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే : ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే పుట్టిన రోజును గురువారం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ట్రస్టు తాలూకా శాఖ ఆధ్వర్యంలో ఏపీఎంసీ యార్డులోని చన్నబసవేశ్వర అంధ పిల్లల వసతి పాఠశాల విద్యార్థులకు, నెరళ అనాథాశ్రమంలోని వృద్ధులకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. తాలూకా యోజనాధికారి సునీత ప్రభు, పురపాలక సంఘం సభ్యుడు శరణప్పమేధా, చన్నబసవస్వామి, దేసాయి దోతరబండి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు పరిహార భాగ్యం!

ఖాతాల్లోకి రూ.1033.60 కోట్లు

మంత్రులతో సమావేశమై.. పంట పరిహారం చెల్లించే బటన్ నొక్కిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అతివృష్టి నేపథ్యంలో వాటిల్లిన పంట నష్టం అంచనావేసి, రైతులకు పరిహారం చెల్లించాలని సర్కారు నిర్ణయించింది. నష్టం ఎదుర్కొన్న 14.24 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలోకి రూ.1033.60 కోట్లు చేర్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బటన్ నొక్కి ప్రారంభించారు. ఆయన గురువారం ఇక్కడ ముఖ్యమంత్రి అధికార కార్యాలయమైన ‘కృష్ణ’లో నిర్వహించిన కార్యక్రమంలో ‘పెట్టుబడి రాయితీ’ పంపిణీ ప్రక్రియను ఆయన మంత్రులతో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారీ వర్షం, ప్రవాహం వరద ముంపు వల్ల పంట నష్టం ఎదుర్కొన్న రైతులను గుర్తించి అదనంగా రూ.1033.60 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ రాయితీ ప్రకటించామని, ఇప్పుడు ఆ హామీని అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతుల ప్రభుత్వమే అధికారంలో ఉందని గుర్తు చేశారు. అదనపు రాయితీ మొత్తాన్ని పెంచామన్నారు. వర్షం వల్ల పంట నష్టం వాటిల్లితే హెక్టారుకు పరిహారాన్ని రూ.8500 నుంచి రూ.17 వేలకు, నీటి పారుదల ఆయకట్టు భూములకు హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25,500, ఇతర పంటలకు రూ.22,500నుంచి రూ.31 వేల అదనపు రాయితీ పెంచినట్లు వెల్లడించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం 14.24 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.1218.03 కోట్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఆ మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ముంగారు కాలంలో 82.56 లక్షల హెక్టార్ల విత్తనాలు వేయగా గత సెప్టెంబరులో కురిసిన వర్షాలకు 14.58 లక్షల హెక్టార్ల పంట నష్టపోయినట్లు వివరించారు. రూ.10,748 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశామని వివరించారు. 5.36 లక్షల హెక్టార్ల కందిపంట, 2.63 లక్షల హెక్టార్ల పెసలు, 2.68 లక్షల హెక్టార్ల పత్తి, 1.21 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న పంటలకు నష్టం ఎదురైందన్నారు. ఈనెల 17న ప్రధానమంత్రిని కలిసి, పంట నష్టపరిహారం కింద రూ.1521.67 కోట్లు పరిహారం అందించాలని విన్నవించుకున్నట్లు గుర్తు చేశారు. పంటనష్టం పరిశీలించేందుకు త్వరలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం రాష్ట్రానికి వస్తుందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు కృష్ణబైరేగౌడ, సంతోష్‌లాడ్, బోసురాజు, ఈశ్వర్ బి.ఖండ్రె, ప్రియాంక్‌ఖర్గే తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం రాసులతో మార్కెట్ కళకళ

గంజ్‌లో రహదారిపైనే ఆరబోసిన ధాన్యం

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఏపీఎంసీ (గంజ్) మార్కెట్ వరి ధాన్యం రాసులతో కళకళలాడుతోంది. కృష్ణా, తుంగభద్ర నదులు పరీవాహక ప్రాంతాలు, మెట్ట సేద్యంలో పంపుసెట్లపై ఆధారపడి పండించిన పంట ఇబ్బడి ముబ్బడిగా విపణికి తరలివస్తోంది. గంజ్‌లోని షెడ్లు 90 శాతం ధాన్యంతో నిండిపోయింది. ఖాళీ లేక పంటను రహదారుల మీదనే ఆరబోస్తున్నారు. ధాన్యం నింపిన సంచులను రోడ్డుపైన ఉంచుతున్నారు. సరకుతో లోపలికి వస్తున్న లారీలు, ట్రాక్టర్లు, టెంపోలు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంచుల్లో నింపి మిల్లులకు వెళ్లే రవాణా వాహనాలతో మార్కెట్ రద్దీగా మారింది. గంజ్ ప్రధాన ముఖద్వారంలో ఒక ద్వారాన్ని మూసి వేశారు. ఏపీఎంసీ విడుదల చేసిన గణంకాల మేరకు.. గురువారం 41,576 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించుకున్నారు. మరి కొన్ని వారాలు ఇంతే ప్రమాణంలో లావాదేవీలు జరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌కు ఆదాయం రెట్టింపు కానుంది.

మద్దతు ధరను మించి..

మార్కెట్‌లో క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.1922, మాదిరి రూ.2699, గరిష్ఠంగా రూ.2949 పలికింది. కేంద్రం సోనామసూరి ఏ గ్రేడ్ వంద కిలోలకు ఖరారు చేసిన రేటు రూ.2389. మాదరి, గరిష్ఠ ధరలకే ఎక్కువ మంది అమ్ముకున్నారు. ఈ పరిణామాలతో వరి రైతుల్లో మందహాసం కన్పిస్తోంది. తుంగభద్రలో రెండో సాగు లేనందునే ఊహించని ధర వస్తోంది. జిల్లాలో అత్యధికంగా పండించే జొన్న, కంది, పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడం గమనార్హం.

ప్రోత్సాహధనం ఇవ్వాలి

రబీకి నీరు విడుదల చేయనందున, తెగుళ్లతో దిగుబడులు దెబ్బతిన్నందున తెలంగాణ తరహాలో క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహ ధనాన్ని చెల్లించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాయి. ఇటీవల సింధనూరు పాదయాత్రలో పాల్గొన్న దళ్ యువనేత నిఖిల్ కుమారస్వామి ఎకరాకు రూ.25 వేల పరిహారాన్ని ప్రకటించాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు.

మిల్లుకు వెళ్లే లారీలో ధాన్యపు బస్తాలు

మాన్వి, సింధనూరులో కేంద్రాలు తెరిచాం

మాన్వి, సింధనూరు తాలూకాల్లో ధాన్యపు సేకరణ కేంద్రాలు తెరిచాం. ఎకరాకు 25 క్వింటాళ్ల చొప్పున గరిష్ఠంగా 50 క్వింటాళ్లు ఖరీదు చేస్తారు. ఏ గ్రేడ్‌కు రూ.2389, సాధారణ గ్రేడ్‌కు రూ.2369 చెల్లిస్తారు. డిసెంబరు 31 వరకు పేర్లను నమోదు చేసుకోవచ్చు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ఖరీదు ప్రక్రియ కొనసాగుతుంది. గరిష్ఠంగా 50 క్వింటాళ్లకు పరిమితం చేయాలన్న నిబంధనను ఎత్తివేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది ఏపీఎంసీలల్లో ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు కేంద్రాల వైపు మొగ్గు చూపుతారా? లేదా? వేచి చూడాల్సిందే.

- జిల్లా పాలనాధికారి నితీశ్

సిద్ధుకు విజయేంద్ర లేఖ

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : రోడ్డుప్రమాదంలో మరణించిన ఐఏఎస్ అధికారి మహంతేశ్ బీళగి (51) కుటుంబంలో ఒకరికి క్లాస్-1 పోస్టు ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర కోరారు. మహంతేశ్ భార్య లేదా కుమార్తెకు ఉద్యోగాన్ని ఇచ్చి వారికి మద్దతు ఇవ్వాలని కోరుతూ, ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను రాశారు. మహంతేశ్ అధికారిగానే కాకుండా బసవాది శరణుల తత్వాలను ఒంటబట్టించుకున్న వ్యక్తి అని, తాను పని చేస్తున్న చోట సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, అందరికీ ఆదర్శంగా నిలిచేవారని ఆ లేఖలో పేర్కొన్నారు.

సామాజిక న్యాయానికి దిక్సూచి రాజ్యాంగం

అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : భూమ్మీద మనిషి ఉన్నంత వరకు భారత రాజ్యాంగం మనుగడ సాగిస్తుందని విశ్రాంత ఉప కులపతి ఆచార్య జి.ఎస్.పాటిల్ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవల ప్రాధికార, న్యాయవాదుల సంఘం సంయుక్తంగా రంగమందిరంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరైన పాటిల్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రముఖలతో కలసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఉపన్యసిస్తూ రాజ్యాంగ రచనకు 1947కు ముందే ప్రక్రియ మొదలైందని, రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా చదివితే అంబేడ్కర్ ఎంత శ్రమించారో బోధపడుతుందన్నారు. సంస్కృత భాషపై పట్టు ఉన్న ఆయన అక్కడక్కడా శ్లోకాల ప్రస్తావన తెచ్చారని వెల్లడించారు. సామాజిక న్యాయానికి దిక్సూచి అయిన భారత రాజ్యాంగం ఇతర దేశాల రాజ్యాంగం కంటే భిన్నంగా ఉంటుందన్నారు. జిల్లా న్యాయస్థానం ముఖ్య న్యాయమూర్తి మారుతి బాగడే, జిల్లా పాలనాధికారి నితీష్, న్యాయసేవల ప్రాధికార సభ్య కార్యదర్శి సాత్విక్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, ప్రభుత్వ న్యాయవాది రామనగౌడ, నగర పాలక సంస్థ ఉప కమిషనర్ సంతోషరాణి, న్యాయవాదులు చెన్నబసణ్ణ, హనుమంతప్ప మేటి వేదిక మీద ఆసీనులయ్యారు.

ఔషధ పరిశ్రమల్లో భాగస్వామ్యం అవసరం

హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు, ప్రసంగిస్తున్న సుబర్ణరాయ్

రాయచూరు, న్యూస్‌టుడే : ఔషధాల ఆవిష్కరణకు ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్) చేస్తున్న పరిశోధనల్లో కళాశాలలు భాగస్వామ్యం కావాలని ఐసీఎంఆర్ (బెళగావి) నిర్దేశకుడు డాక్టర్ సుబర్ణరాయ్ సూచించారు. ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ సమకూరుస్తున్న ఆర్థిక సాయం-పరిశోధనల ప్రతిపాదనలపై అవగాహన కల్పించేందుకు గురువారం నవోదయ కళాశాల సభాభవనంలో ఒక రోజు సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సును ప్రారంభించిన రాయ్ ప్రసంగిస్తూ అధ్యాపకులు ఐసీఎంఆర్ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకుని, శాస్త్రవేత్తల అనుభవాలను వినియోగించుకుని లోతుగా పరిశోధనలు చేయాలని సలహా ఇచ్చారు. నవోదయ విద్యా సంస్థల రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్ ప్రసంగిస్తూ తమ కళాశాలలో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనలు నిర్వహిస్తున్నారని, శాస్త్ర సంబంధమైన అనేక ఆవిష్కరణలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని వివరించారు. పలు సంస్థల నుంచి ఆర్థిక సాయం అందిందని తెలిపారు. రాబోవు రోజుల్లో కొత్త మందులను కనుగొనేందుకు జాతీయ సంస్థలతో చేతులు కలుపుతామన్నారు. విద్యా, పరిశోధనల డైరెక్టర్ డాక్టర్ వి.రామమోహన్ గుప్తా మాట్లాడుతూ బోధకులు సంశోధనలు చేసి జ్ఞానాన్ని పంచాలని ఆకాంక్షించారు. నవోదయ ఛైర్మన్ సుంకి రాజేంద్రరెడ్డి ముందు చూపు వల్ల కళాశాలలో ఉన్నతమైన ఆవిష్కరణలు చేశారని వివరించారు. డైరెక్టర్లు విజయకుమార్, సురేష్‌బాబు, ప్రిన్సిపాళ్లు హెచ్.దొడ్డయ్య, కౌశికరెడ్డి, గిరీశ్‌శెట్టి, సుధానకుమారి, డాక్టర్లు బందే నవాజ్, ఎ.ఎస్.ఆనంద్, నోడల్ అధికారి డాక్టర్ మనీషా బరువాలియా, ఐసీఎంఆర్ శాస్త్రవేత్త డాక్టర్ అత్కుల్యా పాల్గొన్నారు.

శిరస్త్రాణాలు లేక.. ఇద్దరు బలి

హాసన, న్యూస్‌టుడే : బేలూరు తాలూకా హొన్నేహళ్లి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో లోకేశ్ (25), కిరణ్ (32) అనే వ్యక్తులు గురువారం మరణించారు. వీరిద్దరూ వెళుతున్న బైకు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. తలకు శిరస్త్రాణాలు లేకపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. బేలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో టెకీ..

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మాన్యత టెక్‌పార్కులోని ఒక కంపెనీలో టెకీగా పని చేస్తున్న ఆనంద్ (35) రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుధవారం రాత్రి 10.45కి ప్రమాదం సంభవించింది. విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో బైకు అదుపుతప్పి రహదారి విభాజకాన్ని ఢీకొట్టింది. చికిత్స కోసం వచ్చిన అంబులెన్సు జక్కూరు ఎయిర్ స్ట్రిప్ మార్గంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద వాహన రద్దీలో చిక్కుకుపోయింది. బాధితుడ్ని మరో కారులోకి ఎక్కించుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా మరణించారు. యలహంక ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బాలిక.. నిగూఢ హత్య

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బోళార గ్రామానికి చెందిన కవన (15) అనే బాలిక హత్యకు గురైంది. తల్లి చనిపోయిన అనంతరం అదే గ్రామంలో సమీప బంధువు సావిత్రమ్మ ఇంట్లో ఉంటుండగా.. తండ్రి వేరే చోట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన బాలిక మళ్లీ వెనక్కు తిరిగి రాలేదు. ఆమెను వెతుక్కుంటూ వెళ్లిన సావిత్రమ్మకు బాలిక మృతదేహం కనిపించింది. కగ్గలిపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారాగారంలో పరిచయం.. దుండగుల నేరాలబాట

బెంగళూరు (మహాలక్ష్మిలేఅవుట్), న్యూస్‌టుడే : కారాగారంలో ఉన్నప్పుడు మొదలైన పరిచయం.. బెయిలుపై బయటకు వచ్చిన అనంతరం కొనసాగించి, దొంగతనాలకు పాల్పడుతున్న హరీశ్ నాయక్, హేమంత్‌లను బ్యాడరహళ్లి ఠాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.2 లక్షల విలువైన ఆభరణాలు జప్తు చేసుకున్నారు. గతంలో దొంగతనం కేసుల్లో కారాగారం చేరిన అనంతరం వీరిద్దరికీ పరిచయం మొదలైంది. బయటకు వచ్చిన అనంతరం కలిసి గొలుసు చోరీలు, దారి దోపిడీలకు పాల్పడుతూ వచ్చారు. ఈ నెల 18న సర్‌ఎం విశ్వేశ్వరయ్య లేఅవుట్‌కు చెందిన మహిళను కత్తితో బెదిరించి గొలుసు తెంపుకొన్నారు. హెగ్గనహళ్లి క్రాస్ వద్ద ఈ వారం ప్రారంభంలో మరో ఇద్దరిని బెదిరించి, నగదు, నగలు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ పూర్తి చేసి వీరిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

కర్షకుల కష్టాలపై ఆందోళన ఉద్ధృతం

మాట్లాడుతున్న వీరనగౌడ, ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా, తాలూకా కేంద్రాల్లో ఆందోళన చేపడుతామని జిల్లా భాజపా అధ్యక్షుడు వీరనగౌడ లెక్కిహాళ వెల్లడించారు. ఆయన గురువారం ఇక్కడి పత్రికా భవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నవంబరు నెల ముగిసిపోతున్నా పంట నష్ట పరిహారాన్ని చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. గిట్టుబాటు ధర లేని అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు సేకరణ కేంద్రాలు తెరవాలని ఒత్తిడి తెస్తున్నా.. సర్కారు గంభీరంగా పరిగణించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర రైతులకు రెండో పంటకు నీరు సరఫరా చేయనందున ఎకరాకు పాతిక వేల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చశారు. రైతుల, కార్మికుల, మహిళా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. అవినీతిలో మునిగిపోయిన సిద్ధరామయ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే పోరుబాటలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీ బి.వి.నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు అధికారం కోసం పోట్లాడుకుంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌ఆర్‌డీఎఫ్‌లో రైతులకు నష్ట పరిహారాన్ని ఇంకా విడుదల చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బసనగౌడ బ్యాగవ్యాట్, నాయకులు శరణప్ప గౌడ, కె.ఎం.పాటిల్, సిద్ధనగౌడ, రాఘవేంద్ర ఉట్కూరు, వి.పి.రెడ్డి, సంతోష్ రాజగురువు పాల్గొన్నారు.

పూర్వ పాఠశాలకు ఎంపికైన ఎల్‌బీఎస్ కేంద్రం

రాయచూరు, న్యూస్‌టుడే : అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక తరగతుల (ఎల్‌కేజీ, యుకేజీ)ను ప్రారంభించేందుకు నగరంలోని ఎల్‌బీఎస్ నగర్ 12వ అంగన్‌వాడీ కేంద్రం ఎంపికైనట్లు తాలూకా శిశు అభివృద్ధి యోజనాధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇది జిల్లాలో మొట్టమొదట ప్రారంభించిన పూర్వ ప్రాథమిక పాఠశాల కావడం విశేషం. ఈ కేంద్రంలో మెరుగైన మౌలిక వసతులు ఉన్నందున, కార్యకర్త రేష్మా పనీరు ఆధారంగానే ఎంపిక చేశారు. రాష్ట్రంలో ఐదువేల బడులు తెరుస్తుండటంపై బెంగళూరు అరమనె మైదానంలో శుక్రవారం అధికారికంగా ప్రకటిస్తారు. ఈ కార్యక్రమ ప్రసారాన్ని వీక్షించేందుకు ఎల్‌బీఎస్ కేంద్రంలో ఏర్పాట్లు చేశారు.

ఆపద సమయంలో సంజీవని

రక్తదానం చేస్తున్న శరణబసవరాజ్ పాటిల్

మాన్వి: ప్రమాద సమయాల్లో ఉన్న వారికి రక్తం సంజీవని వంటిదని తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్ పేర్కొన్నారు. కల్మఠ విరూపాక్ష పండిరాధ్య స్వామీజీ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, రిమ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సాంకేతిక అందుబాటులోకి వచ్చిన క్రమంలో రక్తాన్ని తెల్లరక్తకణాలు, ప్లాస్మాలుగా విభజించి అవసరమైన రోగులకు ఇస్తారన్నారు. డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, కల్మఠం భక్తులు, ఔత్సాహికులు రక్తదానం చేశారు.

అనాథ బాలలను ఆదరించండి

గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గణేష్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : అనాథ పిల్లలను దత్తత తీసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా సర్వేక్షణాధికారి డాక్టర్ కె.గణేష్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం, ఆరోగ్య శాఖ సంయుక్తంగా డీహెచ్‌వో కార్యాలయం కృష్ణా సభా భవనంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి దత్తత విధి విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ అనాథలకు మెరుగైన భవిష్యత్తు కల్పించడం మనందరి బాధ్యతగా భావించాలన్నారు. పిల్లలను అప్పగించటానికి రూపొందించిన నియమ, నిబంధనలను తెలుసుకోవాలని కోరారు. జిల్లా బాలల రక్షణా విభాగం అధికారి కిరలింగప్ప ప్రసంగిస్తూ ముక్కు పచ్చలారని చిన్నారులను వీధులు, కాల్వలు, చెత్త కుప్పల్లో వదిలేసి ఉంటే 1098 సహాయవాణికి ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలల పోషణ-రక్షణ చట్టం 2015 కేంద్ర దత్త సంపన్మూల ప్రాధికార మార్గ సూచన మేరకు అనాథలను అప్పగిస్తామని వివరించారు. జిల్లా క్షయ రోగ నిర్మూలన అధికారి డాక్టర్ షాకీర్, వైద్యాధికారులు శివకుమార్, శీతల్, జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్పతో కలసి దత్తత నియమాల గోడ పత్రాన్ని విడుదల చేశారు.

‘చిన్నారి తల్లి’ కేసు.. ఆరుగురికి సంకటం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఉన్నతపాఠశాల విద్యార్థిని ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించిన కేసులో హనుమగౌడ అనే యువకుడిని అరెస్టు చేసి గురువారం అతనిపై పోక్సో చట్టం కింద కొప్పళ గ్రామీణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. హాస్టల్ ఇన్‌ఛార్జ్ శశికళ హిరేమఠ, వంట గదిలో పని చేసే పార్వతి కుదిరిమోతి, ప్రియాంక సింధోగిలను విధుల నుంచి తప్పిస్తూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. హనుమగౌడ, శశికళ హిరేమఠ, ఉపాధ్యాయులు ప్రభాకర భజంత్రి, యంకప్ప పూజార, కుకనూరు ఆసుపత్రి సిబ్బంది భరతేశ హిరేమఠ, సబియాలపై కేసు నమోదు చేసుకున్నారు. కుకనూరు గ్రామంలోని హాస్టల్‌లో బాలిక ఎనిమిదో తరగతి చదువుతున్నప్పటి నుంచి హనుమేగౌడ పరిచయం. వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెను గర్భవతిని చేశాడు. చివరి క్షణం వరకు బాలిక గర్భం విషయాన్ని దాచి ఉంచినందుకు వారిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

ఊపిరి తీసిన విద్యుదాఘాతం

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : హుబ్బళ్లిలోని మూరుసావిర మఠం పరిధిలో ఉంటున్న మేఘన (24) అనే యువతి బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో మరణించింది. ఇంట్లో నీటి కోసం మోటారు వేసేందుకు వెళ్లిన సమయంలో తీగ తాకడంతో షాక్ కొట్టి పడిపోయింది. చికిత్స కోసం కిమ్స్‌కు తీసుకువెళ్లి చేర్చే లోగా కన్నుమూసింది. ఉపనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ముంచేసిన పొగమంచు

టేకాఫ్ అవుతున్న విమానం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : దట్టమైన పొగ మంచు బెంగళూరు పరిసరాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయ వేళ రహదారులు కనిపించని పరిస్థితి. మరోవైపు.. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి, వెళ్లే విమానాల రాకపోకలు గురువారం ఆలస్యమయ్యాయి. గురువారం ఉదయం 5.30 నుంచి 7 గంటల మధ్య 41 విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. పొగమంచుతో కొన్ని విమానాలు ఆలస్యంగా వచ్చాయి. పరిస్థితులు సర్దుకున్న అనంతరం ఒక్కో విమానం వరుసగా బయలుదేరి వెళ్లడంతో ఎయిర్ ట్రాఫిక్ రద్దీగా మారింది.

దిక్కులేని మొక్కజొన్న రైతు

భాజపా విడుదల చేసిన పోస్టరు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : అధికార పార్టీ మొక్కజొన్న రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని భాజపా కర్ణాటక శాఖ దుయ్యబట్టింది. రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీ అంటూ ఒక పోస్టరును తన అధికారిక ఎక్స్ కార్ఫ్ ఖాతాలో పోస్టు చేసింది. చెరకు రైతుల డిమాండ్‌ను పక్కదారి పట్టించినట్లే మొక్కజొన్న రైతులకు మొండి చేయి చూపిస్తే తాము పోరుబాట పడతామని భాజపా హెచ్చరించింది.

‘నమో’.. కృష్ణ స్మరామి

ప్రధాని రాకకు సర్వం సిద్ధం

ఉడుపి, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఉడుపి శ్రీకృష్ణ మఠానికి విచ్చేస్తున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళూరు నుంచి ప్రధానితో, భద్రతాదళాలు ఒకేసారి మూడు హెలికాప్టర్లలో దిగేందుకు ‘ఆది ఉడుపి’లో రూ.60 లక్షల ఖర్చుతో కొత్తగా హెలిప్యాడ్లను నిర్మించారు. హెలిప్యాడ్ నుంచి ఆలయానికి చేరుకునే మార్గానికి ఇరువైపులా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. లక్ష కంఠ భగవద్గీత పఠనం కోసం భక్తులు, గాయకులు ఇప్పటికే ఉడుపి చేరుకున్నారు. మధ్వసరోవరంలో తీర్థ ప్రోక్షణ అనంతరం ఆలయంలో కనకన కిండి (కిటికీ/కంత) నుంచి శ్రీకృష్ణుడిని మోదీ దర్శించుకుంటారు. అష్టమఠాలకు నేతృత్వం వహిస్తున్న పీఠాధిపతుల ఆశీర్వచనం అనంతరం ప్రసాదాన్ని స్వీకరిస్తారు. గీతామందిరాన్ని ప్రధాని సందర్శిస్తారు. మోదీ పర్యటనను దృష్టిలో ఉంచుకుని, భాజపా రాష్ట్రాధ్యక్షుడితో పాటు, సీనియరు నాయకులు ఉడుపికి ఒక్కరొక్కరే చేరుకుంటున్నారు.

ప్రైవేటు వాహనాల జప్తు

కోలారు, న్యూస్‌టుడే : పన్ను చెల్లింపుల్లో లోపాలు, సరైన పర్మిట్లు లేకుండా ప్రయాణికులను తరలిస్తున్న 32 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను కోలారు జిల్లాలో రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. బస్సుల్లో అత్యవసర ద్వారాలు లేకపోవడం, ప్రమాదం సంభవిస్తే బస్సు నుంచి తప్పించుకునేందుకు, అద్దాలు పగలగొట్టేందుకు ఎటువంటి పరికరాలు లేవని గుర్తించి, ఈ బస్సుల నిర్వాహకులకు రూ.కోటి జరిమానా విధించారు. బుధ, గురువారాల్లో అధికారులు కార్యాచరణ నిర్వహించగా, వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్సులే ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

27-11-2025 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1623.29	1630.15
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,529	3,302
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,316	6,984
నీటి నిల్వ (టి.ఎం.సి)	71.046	94.628

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మౌలిక వసతులు సమకూర్చండి

కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయచూరు: నగరంలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రధాన సమస్యలను పరిష్కరించాలని రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహాపాత్రను కోరారు. ఎమ్మెల్యే గురువారం కమిషనర్ చాంబర్‌లో జుబిన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ-ఆస్తి ఖాతా కోసం దరఖాస్తు సమయంలో ఏర్పడుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించాలన్నారు. చెరువులు, కోటల ప్రదేశానికి సమీపంలోని ఇంటి యజమానులు సక్రమంగా పన్నులు చెల్లించి ఉంటే ఖాతాలు మంజూరు చేయాలని, కొత్త నిర్మాణాలకు అనుమతి ఇవ్వవద్దన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని దాఖలాలను అందజేస్తే ఖాతా ఇవ్వటానికి ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. రాయచూరులో స్వచ్ఛతా పనుల నిర్వహణకు మైసూరు నగర పాలక సంస్థ సహకారం తీసుకుంటామని వెల్లడించారు.

(c) eenadu

ఈ సభలో నేనెంతో నేర్చుకున్నాను

శాసనసభలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్బోధ

శాసనసభ ఆవరణలో బృంద చిత్రం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎన్నో కష్టాలు, బాధలు అధిగమించి శాసనసభలో తాను పాదం మోపిన తర్వాత ఎంతో నేర్చుకున్నానని, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రశ్నలడిగి సమాధానాలు తెలుసుకున్నానని, మంత్రిగా సభ్యులడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పానని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్రపతి హోదాలో సభ్యులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సభలో తనతో కలిసి పని చేసిన మాజీ ఎమ్మెల్యేలు, వివిధ రంగాల ప్రముఖులున్నారని, ఈ దృశ్యం తన జీవితంలో తీపిగుర్తుగా మిగులుతుందన్నారు.

ప్రజలు మనల్ని గమనిస్తున్నారు

చట్టసభలకు ఎన్నికవుతున్న వారిని ప్రజలు గమనిస్తుంటారని రాష్ట్రపతి చెప్పారు. నాయకుల పనితీరు బాగుండాలని, ఆదర్శప్రాయం కావాలని సూచించారు. సమృద్ధ ఒడిశా-2036 విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం రూపకల్పన చేసిన సమయంలో కలసి కట్టుగా లక్ష్య సాధనకు ఉద్యమించాలన్నారు. వికసిత్ భారత్-2047లో ఒడిశా క్రియాశీలక పాత్ర పోషించాలని, ఈ నేల బిడ్డగా, మీ అందరి సోదరిగా కోరుతున్నానన్నారు.

మాట్లాడుతున్న విపక్షనేత నవీన్ పట్నాయక్

స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర

స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత ఈ రాష్ట్రం ధైర్య సాహసాలు, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ నేలపై పుట్టిన ఎందరో జాతికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యమిచ్చి మహిళాభ్యుదయం, గిరిజన వికాసం, సమగ్రాభివృద్ధి దిశగా సన్నాహాలు చేపట్టడం శుభపరిణామమని చెప్పారు.

11వ నెంబరు గదికి వచ్చారు

కార్యక్రమంలో గవర్నరు హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, సభాపతి సురమా పాడి, విపక్షనేత నవీన్ పట్నాయక్‌లు మాట్లాడారు.

సభలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకి అసెంబ్లీ ఫొటో అందజేస్తున్న సభాపతి సురమా పాఢి

అసెంబ్లీకి రాష్ట్రపతి రాక చరిత్రాత్మకమని, చిరస్మరణీయంగా నిలుస్తుందని భావించిన మోహన్ ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రధాన్, జోయల్ ఓరం, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించింది. రాష్ట్రపతికి సభాపతి సురమాపాడి జగన్నాథుని ఫొటో, అసెంబ్లీ ఫొటో అందజేశారు. దీనికి ముందుగా అందరితో బృందచిత్రం దిగిన రాష్ట్రపతి తాను మంత్రిగా ఉన్న సమయంలో అప్పట్లో ప్రభుత్వం తనకు సభాగృహంలో కేటాయించిన 11వ నెంబరుకి వచ్చారు.

ప్రసంగిస్తున్న గవర్నరు హరిబాబు

తుపానుల ప్రభావం రాష్ట్రంపై ఉండదు

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో శ్రీలంక వద్ద కొనసాగుతున్న వాయుగుండం గురువారం సాయంత్రం తుపానుగా మారిందని, మరోవైపు నికోబార్ ద్వీపానికి చేరువగా సెన్యార్ తుపాను కేంద్రీకృతమై ఉందన్నారు. ఈ రెండు తుపానుల ప్రభావం రాష్ట్రంపై ఉండదని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. శుక్రవారం (28న) సుందర్‌గఢ్, ఝార్సుగుడ, కొంధమాల్, కొరాపుట్ జిల్లాల్లో మంచు కురిసే సూచనలు ఉన్నందున ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. కొంధమాల్ జిల్లాలోని జి.ఉదయగిరిలో అత్యల్ప ఉష్ణోగ్రత 7.4 డిగ్రీలుగా నమోదు కాగా, రఝైలాలో 7.7 డిగ్రీలుగా ఉందని, మిగతా కేంద్రాల్లో 10 నుంచి 17 డిగ్రీలు నమోదైందని వివరించారు. చలిగాలుల తీవ్రత కొనసాగుతుందన్నారు.

శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో ప్రత్యేక సేవలు

పురుషోత్తమునికి చలివస్త్రధారణ వేడుక

గోపాలపూర్, న్యూస్‌టుడే: మార్గశిర మాసం నాలుగో గురువారం నేపథ్యంలో పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో ప్రత్యేక సేవలు జరిగాయి. చలికాలం కావడంతో స్వామికి నూలు వస్త్రాల ధారణ చేయిస్తున్న సేవాయత్‌లు లక్ష్మీ, నారాయణ ఉత్సవ విగ్రహాల సన్నిధిలో షోడాలగి సేవలు చేశారు. మార్గశిర గురువారం మహాలక్ష్మికి ప్రత్యేకం కాగా, ఆ తల్లి మందిరంలో పూజలు జరిగాయి. 56 రకాల పిండి వంటకాలు నైవేద్యంగా అర్పించారు.

11 మంది విద్యార్థినులకు అస్వస్థత

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేటు రెసిడెన్షియల్ కళాశాల వసతి గృహంలో 11 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు వసతిగృహంలో ఉదయం పులావ్ తిని అస్వస్థతకు గురైనట్లు సమాచారం. వారిని సహీద్ లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వారి ఆరోగ్యం మెరుగు పడుతుందని డాక్టర్లు అంటున్నారు.

హైకోర్టులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: హైకోర్టులో గురువారం ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఉపాధ్యాయులను బదిలీ చేసే అధికారం ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉండకూడదని, రాజకీయ జోక్యం తగదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉపాధ్యాయులను బదిలీ చేసే అధికారం కల్పిస్తూ ఈ ఏడది మే 13న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఒక్కో ఎంపీ, ఎమ్మెల్యే 15 మంది ఉపాధ్యాయులను వారు కోరుకున్న చోట్ల (తమ నియోజకవర్గంలో) నియామకాలు చేయొచ్చని పేర్కొంది. దీన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో 30 పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ చేపట్టిన న్యాయ స్థానానికి ప్రభుత్వం వివరణ ఇచ్చింది. పరిశీలించిన తర్వాత విద్యాలయాల్లో రాజకీయ జోక్యం తగదని, ఉపాధ్యాయులకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు బదిలీలు చేస్తే వారికి దాసోహమయ్యే పరిస్థితి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయం చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది.

రెండు నివేదికల రూపకల్పన: ప్రభాతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వికసిత ఒడిశా-2036, వికసిత్ భారత్-2047 ధ్యేయంగా రెండు విజన్ డాక్యుమెంట్లు (నివేదికలు) రూపకల్పన చేసినట్లు ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో వివిధ రంగాల ప్రముఖులతో విజన్ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభాతి మాట్లాడుతూ... రాష్ట్ర హితం, ప్రజల సంక్షేమం, అవకాశాలకు ప్రాధాన్యతిస్తున్నామని, డబుల్ ఇంజిన్ పాలనలో దీన్ని నెరవేర్చడానికి ప్రభుత్వం సన్నద్ధమైందని చెప్పారు.

దివంగత నేతలకు సభలో శ్రద్ధాంజలి

శీతాకాలం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

సంతాప తీర్మానంపై మాట్లాడుతున్న సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ శీతాకాలం సమావేశాలు గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. సభాపతి సురమా పాడి కార్యక్రమాలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలు దర్మేంద్ర ప్రసాద్ మహాపాత్ర, కృష్ణచంద్ర మల్లిక్‌లకు సంతాపం తెలియజేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. వారి సేవలను ప్రస్తుతించారు. విపక్ష నేత నవీన్ పట్నాయక్, కాంగ్రెస్ సభా పక్షం నాయకుడు రామచంద్రకదం, సీపీఎం నేత లక్ష్మణ ముండ ప్రసంగించారు. తర్వాత ఏకగ్రీవంగా ఆమోదం పొందిన తీర్మానాన్ని సభాపతి చదివి వినిపించారు. వారికి ఆత్మశాంతి కలగాలని ఒక నిమిషం సభ్యులంతా మౌనం పాటించారు. అనంతరం సభా కార్యక్రమాలు సాయంత్రం వరకు వాయిదా పడ్డాయి.

నేడు అదనపు బడ్జెట్

ఆర్థిక శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ శుక్రవారం (28)న శాసన సభలో 2025-26 సంవత్సరానికి సంబంధించి అదనపు బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

శ్మశానంలో తమ్ముడి మృతదేహం... ఆసుపత్రిలో అన్న మరణం..

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి ఠాణా పరిధిలోని మౌళాభంజ గ్రామం సాతొభవుని మందిరం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. దిగపొహండి సమితిలోని చౌదరి టిటరవద గ్రామానికి చెందిన అరుణ్ మహారణా, ఆయన తమ్ముడు మిటు (అజయ) మహారణాలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన మినీ సరుకు వాహనం బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అన్నదమ్ముల్లో తమ్ముడు మిటు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అరుణ్ మహారణాను దిగపొహండి ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. బుధవారం తమ్ముడు మిటు మృతదేహానికి పోలీసులు పరీక్షలు జరిపించి కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామంలో ఆయన అంత్యక్రియలు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఎమ్కేసీజీ ఆసుపత్రిలో అరుణ్ కూడా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారి తండ్రి త్రినాథ మహారణా కుప్పకూలిపోయాడు. ఆయనకు సపర్యలు చేసి ధైర్యం చెప్పారు. అరుణ్ మృతదేహానికి పరీక్ష అనంతరం రాత్రి ఇద్దరు అన్నదమ్ముల మృతదేహాలకు గ్రామంలో అంత్యక్రియలు జరిపించారు. గ్రామస్థులంతా శోకతప్త హృదయాలతో వారికి అంతిమ వీడ్కోలు పలికారు. దిగపొహండి తహసీల్దారు సంతోష్ కుమార్ సాహు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ. 60 వేల ఆర్థిక సహకారాన్ని అందించారు. అన్నదమ్ముల మృతితో చౌదరి టిటరవద గ్రామంలో శోకఛాయలు అలుముకున్నాయి. తండ్రి త్రినాథ మహారణ భార్య కనకలత మహారణ పది రోజుల కిందట మృతిచెందింది. బుధవారం ఆమె ద్వాదశ శ్రాద్ధకర్మల కోసం అన్నదమ్ములు మిటు, అరుణ్‌లు ద్విచక్ర వాహనంపై మంగళవారం సొంతూరు వెళుతూ దుర్ఘటనకు గురై ఒకరి తర్వాత మరొకరు అనంత లోకాలకు తరలి పోయారు.

అతిథి భవనం ప్రారంభించిన రాష్ట్రపతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్ ప్రాంగణంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన కళింగ అతిథి భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ వేడుకలో గవర్నరు కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, శాసనసభాపతి సురమాపాడి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఇక్కడ అందరితో కలిసి రాష్ట్రపతి మధ్యాహ్న భోజనం ఆరగించారు.

అతిథి భవనం ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదీముర్ము. గవర్నరు హరిబాబు, సీఎం మోహన్ తదితరులు

న్యాయం చేయాలంటూ వినతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ 'ఆల్ ఒడిశా ఆయుష్ విద్యార్థుల సంఘం' ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'తాళా బంద్' ఆందోళన కొనసాగుతోంది. గంజాం జిల్లాలో బ్రహ్మపురలోని బిజు పట్నాయక్ హోమియోపతిక్ వైద్య కళాశాల, అంకుశపూర్‌లోని కేపీటీఎస్ ఆయుర్వేదిక వైద్య కళాశాల విద్యార్థులు ఆయా వైద్య కళాశాలల గేట్లకు తాళాలు వేసి ఆందోళన చేస్తున్నారు. గురువారం సంఘం ప్రతినిధులు బ్రహ్మపుర సబ్ కలెక్టరు కార్యాలయం ఆవరణలో ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ సంఘం నాయకులు కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు వారు నగరంలో ర్యాలీ నిర్వహించారు.

బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయం బయట సంఘం ప్రతినిధుల ప్రదర్శన

బస్సు యజమానుల సమ్మె నిర్ణయం ఉపసంహరణ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డిసెంబరు 1 నుంచి నిర్వహించ తలపెట్టిన చక్కాబంద్ కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రైవేటు బస్సుల ఆపరేటర్ల సంఘం కార్యదర్శి దేవేంద్ర సాహు గురువారం కటక్‌లో చెప్పారు. రవాణాశాఖ ఉన్నతాధికారులతో జరిగిన చర్చల తర్వాత దీనిపై నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బస్సుల తనిఖీల అధికారం పోలీసులకు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆపరేటర్లు వ్యతిరేకించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా వివిధ చోట్ల ఆపి తనిఖీల పేరిట ఇబ్బంది పెడతారని, రవాణాశాఖ ఆధీనంలో తనిఖీలు జరుగుతుండగా పోలీసులకు ప్రత్యేక అధికారాలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. దీనికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో సమ్మె హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో రవాణాశాఖ అధికారులతో చర్చలు జరిగాయి. పోలీసుల తనిఖీలు ఉండవని అధికారులు ప్రకటించడంతో సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

చేపల వలకు చిక్కిన బాలుడి పార్థివదేహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం ఠాణా పరిధిలోని దామోదరపల్లి గ్రామ చెరువులో చేపల వలకు గురువారం రెండున్నరేళ్ల బాలుడి మృతదేహం చిక్కింది. మృతుడు అదే గ్రామానికి చెందిన సుమునాథ్ పాత్ర్ కుమారుడు బినాయక పాత్ర్‌గా గుర్తించారు. చెరువులో వేసిన చేపల వలను ఉదయం తీసిన వారు అందులో బాలుడు ఉండటాన్ని గుర్తించి, తక్షణమే గంజాంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే బినాయక మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఠాణా ఎస్సై అనిరుధ్ స్వయిన్ ఆరోగ్య కేంద్రానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బహుశా చెరువు ఒడ్డున ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు.

పెళ్లింట తీరని విషాదం

చెట్టుకు ఢీకొన్న వాహనం

రాయగడ, న్యూస్‌టుడే: సోదరుడి పెళ్లికి వెళ్లి ఊరేగింపులో ఉత్సాహంగా నృత్యాలు చేసి కళ్ల నిండా ఆనందం నింపుకొని వివాహం అనంతరం వాహనంలో బయలుదేరి తిరిగి రాయగడ వస్తుండగా బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వరుడు సోదరి జ్యోత్స్న రాణి గౌడ(37) మృతి చెందడంతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రాయగడ గౌడ వీధికి చెందిన పాత్రికేయుడు గోపీనాథ్ గౌడకు ఝార్సుగుడలో బుధవారం ఉదయం వివాహం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు రాత్రి వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. సంబల్‌పూరు జిల్లా కుసింది సమితి కతర్బాగ గ్రామ సమీపంలో వీరి వాహనం చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె ఘటనా స్థలంలో మృతి చెందాగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి వాహనంలో ఇరుక్కున్న వారిని, మృతదేహాన్ని బయటకు తీశారు. గాయపడిన నలుగురిని బుర్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖపట్నం తరలించారు.

జ్యోత్స్నరాణి (పాతచిత్రం)

కలెక్టర్ కార్యాలయంలో సామగ్రి జప్తు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్‌లోని కలెక్టర్ కార్యాలయంలో విలువైన సామగ్రి, కంప్యూటర్లు జప్తు చేయాలని జిల్లా సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. 2011లో ప్రియాంషు అనే కాంట్రాక్టర్ ఒక రోడ్డు నిర్మించాడు. పని పూర్తయినా సంబంధిత బిల్లు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ జయపురం సివిల్ కోర్టులో ఫిర్యాదు చేయగా పలు మార్లు కోర్టు బిల్లు చెల్లింపు చేయాలని ఆదేశాలు జారీ చేసినా యంత్రాంగం స్పందించలేదు. జిల్లా సివిల్ కోర్టు బిల్లు బకాయిలు, వడ్డీతో సహా 1.15 కోట్లు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి కూడా యంత్రాంగం స్పందించక పోవడంతో కలెక్టర్ కార్యాలయంలో విలువైన వస్తువులు, కంప్యూటర్లు జప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయవాది ప్రతినిధి జామి సంతోష్ తెలిపారు. దీంతో గురువారం కలెక్టర్ కార్యాలయంలో సామగ్రి జప్తు చేశారు.

కలెక్టర్ కార్యాలయంలో సామగ్రి జప్తు చేస్తున్న సిబ్బంది

పారా క్రీడాకారుల ప్రతిభకు మెరుగులు దిద్దుతాం

● క్రీడల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్

పతకాల విజేతలను సత్కరించిన మంత్రి సూర్యవంశీ. చిత్రంలో సచిన్ యాదవ్ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: థాయిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఎబిలిటీ క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర పారా క్రీడాకారులను క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ సత్కరించారు. భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం సత్కారం, అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పతకాల విజేతలకు మంత్రి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఒడిశా పారా క్రీడల సంఘం కార్యదర్శి సునీల్ ప్రధాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారా క్రీడల కోసం ప్రత్యేక మైదానం, హాస్టల్, శిక్షణ, వీల్‌ఛైర్లు తదితరాలు సమకూర్చాలని కోరారు. స్పందించిన మంత్రి సూర్యవంశీ జ్ఞపారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని, వారి ప్రతిభకు పదును పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్రీడా శాఖ కార్యదర్శి సచిన్ యాదవ్, సంచాలకుడు విజయ్ ఎద్దుల, ఇతర అధికారులు పాల్గొన్నారు. థాయిలాండ్‌లో వారం రోజులు నిర్వహించిన పోటీల్లో ఒడిశాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు వివిధ అంశాల్లో పోటీపడి మొత్తం 12 పతకాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే.

విజేతలకు మంత్రి సత్కారం

ఆసియా అథ్లెటిక్స్, జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులను క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ సత్కరించారు. భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకున్న క్రీడాకారిణి తన్విపత్రి, ఆసియా అథ్లెటిక్స్‌లో హైజంప్‌లో, డెకథ్లాన్‌లో రజత పతకం సాధించిన తేజస్విని శంకర్‌లకు మంత్రి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల తదితరులు పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న తన్విపత్రిని, తేజస్విని శంకర్

హ్యాండ్‌బాల్ పోటీలకు బ్రహ్మపుర క్రీడాకారుడు

కర్ణాటకలో జరుగుతున్న జాతీయ ఐసీఎస్ఈ పాఠశాలల అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు బ్రహ్మపురకు చెందిన క్రీడాకారుడు ఉజ్వల స్వయిన్ ఎంపికయ్యాడు.

చిన్నారులపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్టు

పోలీసుల అదుపులో నిందితుడు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: రెండు రోజుల కిందట ముగ్గురు చిన్నారులపై ఓ వ్యక్తి లైంగిక దాడి చేసినట్లు మల్కాన్‌గిరి జిల్లా ఎమ్.వి.79 ఠాణాలో బాలికల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో దర్యాప్తు చేసి పరారీలో ఉన్న నిందితుడు నరేన్ రాయ్‌ని గురువారం పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించారు.

కలాం మెచ్చుకోలు... నేతలు పట్టించుకోరు

సిటీ హైస్కూల్లో వేధిస్తున్న తరగతి గదుల కొరత


ఒకే గదిలో వేర్వేరు తరగతుల విద్యార్థులకు బోధన

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన, భారత దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మెచ్చిన బ్రహ్మపురలోని పురాతన సిటీ హైస్కూలుకు దీర్ఘకాలంగా సమస్యలు వెంటాడుతున్నాయి. 1930లో ప్రారంభమైన ఈ పాఠశాలలోని తెలుగు, ఒడియా మాధ్యమంలో ప్రస్తుతం శిశువాటిక నుంచి పదో తరగతి వరకూ 830 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో మొదటి అంతస్థులోని మూడు బ్లాక్‌లలో పైకప్పు వర్షాలకు నీరు చిమ్మేది. దీంతో తరగతుల నిర్వహణకు అంతరాయం ఏర్పడటంతో ప్రభుత్వం సుమారు రూ.కోటి వ్యయంతో మూడు భవనాలకు కొత్తగా శ్లాబుల నిర్మాణాలు చేపట్టింది. దీంతో తరగతి గదుల కొరత సమస్య తీరుతుందని పాఠశాల బోధనా సిబ్బంది పెట్టుకున్న ఆశలు ఇంకా నెరవేరడంలేదు.

■ నిర్మాణాలు పూర్తయినా..

రోడ్లు, భవనాల శాఖ బ్రహ్మపుర డివిజన్ అధికారులు మొదటి అంతస్థులోని మూడు భవనాలకు కొత్తగా పైకప్పు శ్లాబు నిర్మాణాలు పూర్తి చేసి ఏడాదికిపైగా పూర్తయింది. అర్ధాంతరంగా నిలిచిన విద్యుదీకరణ పనులతో అవింకా అందుబాటులోకి రావడంలేదు. దీనిపై పలుమార్లు రోడ్లు, భవనాల శాఖ అధికారులకు విన్నవించామని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ మిశ్ర గురువారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. తరగతి గదుల కొరతను అధిగమించేందుకు ఉదయం 6.30 నుంచి 11 గంటలు వరకూ శిశువాటిక నుంచి ఏడో తరగతి, 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు రెండు షిఫ్టుల్లో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పన్నెండు తరగతి గదులున్నాయని, కొత్తగా నిర్మాణమైన భవనాలు తమకు అప్పగిస్తే అదనంగా మరో ఐదు తరగతి గదులు, రెండు విశాలమైన హాళ్లు అందుబాటులోకి వస్తాయని మిశ్ర పేర్కొన్నారు. ఈ సమస్యపై రోడ్లు, భవనాల శాఖ ఎస్డీఓ తపన్ కుమార్ దాస్‌ను 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా, ఇది తను రాకముందు జరిగిన పనులని, వివరాలు సేకరించి, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పూర్తికాని విద్యుద్దీకరణ పనులు

ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గోపాల మిశ్ర

నిర్మాణాలు పూర్తయినా అందుబాటులోకి రాని తరగతి గది

(c) eenadu

రాష్ట్రపతికి ఘనస్వాగతం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం మధ్యాహ్నం నిర్ణీత వ్యవధికంటే ముందుగా 1.50 గంటలకు వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ చేరుకున్నారు. విమానాశ్రయంలో గవర్నరు కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, కేంద్రమంత్రులు ధర్మేంద్రప్రధాన్, జోయల్ ఓరం, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, నగర మేయరు. సులోచనదాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర పోలీసు అధికారులు ఆమెకు స్వాగతం పలికారు.

గిరిజనుల ఔషధీయ ఉత్పత్తులు విలువైనవి

ఆదివాసీ ప్రతినిధులతో గవర్నరు మాటామంతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గిరిజనుల ఔషధీయ ఉత్పత్తులు విలువైనవని, వ్యాధులు నివారించే సామర్థ్యం కలిగి ఉన్నాయని, వీటిని ప్రోత్సహించాలన్న ధ్యేయంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆయుష్‌శాఖ ప్రారంభించారని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్ అభిషేక్ హాల్లో ఆదివాసీ ప్రతినిధులతో గవర్నరు ఇష్టాగోష్ఠి సమావేశం చేపట్టారు. కార్యక్రమంలో గవర్నరు ప్రిన్సిపల్ కార్యదర్శి రూపారోషన్ సాహు, ఆదివాసీ అభివృద్ధి సంస్థ సంచాలకుడు సుధాకర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం వేసి నిరసన..

పాఠశాల ఎదుట వినతిపత్రంతో గ్రామస్థులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పాఠశాలలో తమ పిల్లలకు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించడం లేదంటూ గ్రామస్థులు ఆగ్రహంతో స్కూల్‌కు తాళం వేసిన ఘటన గుసాని సమితి రంప పంచాయతీలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే. . పంచాయతీలోని బురుసాహిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సుమారు 45 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. వారి బోధన సక్రమంగా లేదంటూ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తాళం వేసినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న సమితి విద్యాశాఖ అధికారి సీతారాం పాత్ర్ వారితో మాట్లాడుతూ.. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉగ్రదాడి మృతులకు నివాళులు

మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ముంబయిలో 26/11 ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ బుధవారం రాత్రి ఓ కార్యక్రమం జరిగింది. బహుముఖి సమాజ మంగళ, సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినిధులు స్థానిక గాంధీనగర్ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద అమరుల చిత్రాలున్న ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. నిర్వాహక సంస్థ ప్రతినిధులు డాక్టర్ శంకర్షణ పాత్ర్, మహ్మద్ అస్లం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగౌరి ఆలయంలో నేటి పూజల వివరాలు

ఉదయం 5 గంటలకు తొలిపూజ ధూప దీప నివేదన, హారతి. 5:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అమ్మవారి సర్వ దర్శనం. 12:30 నుంచి 1:30 వరకూ మహా నైవేద్యం ఆలయం మూత. 1:30 నుంచి రాత్రి 9:00 గంటల వరకు సర్వ దర్శనం. సాయంత్రం 6:30 గంటలకు సంధ్యాహారతి.

– న్యూస్‌టుడే, రాయగడ

ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు



పూజలు చేస్తున్న దీక్షాదారులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో అయ్యప్ప మాలధారులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రాంతంలో గల ఫ్రెండ్స్ కాలనీలో బుధవారం రాత్రి అయ్యప్ప మండపం ప్రత్యేకంగా అలంకరించి పడిపూజ చేపట్టారు. లక్ష్మణ్ గురు స్వామి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

అట్టహాసంగా ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ మలంచా శ్రీ తిరుపతి వెంకటేశ్వర పెరుమాళ్ల దేవస్థానం 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు వేద పండితులు ధర్మపురి సీతారామ శర్మ బృందం ఆధ్వర్యంలో అట్టహాసంగా గురువారం మొదలయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ఆటపాటలతో ముగిసిన పరబ్ వేడుకలు

అలరించిన వేషధారణ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజేంద్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ కళా సంస్కృతి పరిరక్షణ ఉద్దేశంతో నిర్వహించే పరబ్ వేడుకలు సునాబెడలో బుధవారం రాత్రి ఆటపాటలతో ముగిశాయి. 3 రోజుల వేడుకలు జరుగుతున్న విషయం తెలిసిందే. చివరి రోజు ఆదివాసీ, జానపద నృత్యాల ప్రదర్శన జరిగింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్ర్, అతిథులు ఎంపీ ప్రతినిధి సుశాంత్ కార్, భాజపా నేత సుమంత్ ప్రధాన్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

జాతీయ ప్రజాకోర్టు ...

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: డిసెంబరు 13న పర్లాఖెముండిలోని జిల్లా కోర్టుతో పాటు కాశీనగర్, ఆర్.ఉదయగిరి, మోహన న్యాయస్థానాల ఆవరణలో ఈ ఏడాది నాలుగో జాతీయ ప్రజాకోర్టు నిర్వహించనున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్, బ్యాంకు రుణాలు, వాహన ప్రమాద పరిహారం, కార్మిక, కుటుంబ వివాదాలు, భూసేకరణ వ్యాజ్యాలపై తీర్పు ఇవ్వనున్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని న్యాయస్థానం అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, కళాకారుడు కన్నుమూత

తారిణి ప్రసాద్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం సారాసాహికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, చలనచిత్ర కళాకారుడు తారిణి ప్రసాద్ దాస్(88) తుది శ్వాస విడిచారు. ఆయన మరణానికి స్థానిక కళాకారులు, న్యాయవాదులు, కాంగ్రెస్ నేతలు సంతాపం తెలిపారు. ఏడాదిగా ఆరోగ్యం క్షీణించి ఇంటికే పరిమితమైన తారిణి బుధవారం మృతి చెందారు.

నందహండిలో ఎంపీ క్రీడోత్సవాలు ప్రారంభం

పోటీలను ప్రారంభించిన ఎంపీ బలభద్ర మాఝి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా నందహండి సమితి దహన క్రీడా మైదానంలో గురువారం ఎంపీ క్రీడా మహోత్సవాలు-2025 ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బలభద్ర మాఝి దహన, మెంద్రి మధ్య జరిగిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి దీపం వెలిగించారు. గౌరవ అతిథులుగా జిల్లా క్రీడా సంఘ ఎడిటర్ ఆర్యన్ త్రిపాఠి, కొట్పాడ్ ఎమ్మెల్యే రూపుదేవ్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు అరుణ్ మిశ్ర, పాలనాధికారి మహేశ్వర్ స్వెయిన్, అదనపు పాలనాధికారి బిశ్వజిత్, బీడీవో చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయని, ఇందులో 21 పంచాయతీలకు చెందిన 4,985 మంది క్రీడాకారులు తమపేర్లు నమోదు చేసుకున్నారు. డిసెంబరు 25 వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి గురండి గ్రామ ప్రాంతంలో నిర్మించిన శ్రీ మా తరాతరిణి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా జరిగింది. రెండు రోజులపాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు.

ఖేలో ఇండియా వర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్‌లో రీమా, రింకిలకు పతకాలు

పసిడి పతకంతో రీమా భోయి

రజత పతకంతో రింకి నాయక్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాజస్థాన్‌లోని బికనీర్‌లోని మహారాజ గంగసింగ్ విశ్వవిద్యాలయం ఇండోర్ హాల్లో జరుగుతున్న 5వ ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో రాష్ట్ర వర్సిటీలకు చెందిన ఇద్దరు మహిళా లిఫ్టర్లు పతకాలు సాధించారు. ఇందులో బుధవారం నిర్వహించిన 58 కిలోల విభాగంలో రీమాభోయి స్నాచ్, క్లీన్‌జర్క్‌లలో మొత్తం 197 కిలోలు బరువులెత్తి మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం గెలుచుకుంది. 48 కిలోల విభాగంలో రింకి నాయక్ స్నాచ్, క్లీన్‌జర్క్‌లలో మొత్తం 149 కిలోలు బరువులెత్తి ద్వితీయస్థానం పొంది రజత పతకం కైవసం చేసుకున్నట్లు రాష్ట్ర సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ కె.రవికుమార్ గురువారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

పంచాయతీ కార్యనిర్వహణ అధికారి మృతి

సోమేశ్ పరిడా (పాత చిత్రం)

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమితి రంప గ్రామపంచాయతీ కార్య నిర్వహణ అధికారి సోమేశ్ పరిడా(36) గురువారం తుది శ్వాస విడిచారు. వివరాల్లోకి వెళ్తే.. పని నిమిత్తం తన కార్యాలయానికి వెళ్తుండగా గారబంద ప్రాంతంలో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమితి అధ్యక్షుడు ఎన్.వీరరాజు, సమితి అభివృద్ధి అధికారి గౌర చంద్ర పట్నాయక్ తదితరులు ఆసుపత్రి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కార్యదర్శి రూప మిశ్ర

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి జరుగుతుందని గృహ, పట్టణ వ్యవహారాల సంయుక్త కార్యదర్శి రూప మిశ్ర అన్నారు. గురువారం సాయంత్రం పర్లాఖెముండిలోని జిల్లా పరిషత్తు సమావేశ భవనంలో మిశ్ర అధ్యక్షతన ఆకాంక్ష జిల్లాల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్, రెవెన్యూ ఏడీఎం మునీంద్రా, సబ్ కలెక్టర్ అనూప్ పండా, అదనపు కలెక్టర్ ఫాల్గుణ మాఝి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆర్.ఉదయగిరి, గుమ్మ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పనితీరుపై ఆరా తీశారు.

మద్యం తాగి బోధిస్తున్నారని ఆరోపణ

ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ [illegible]డియా ప్రాంతంలో ఉన్న లోహానియా పాఠశాల ఉపాధ్యాయులు కొందరు మద్యం తాగి పాఠశాలకు వస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ బేబ్‌నాథ్‌కు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సంగీత నాటకం అకాడమీ పురస్కారాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ పురస్కారాలు బుధవారం రాత్రి ప్రకటించారు. 2023-25 సంవత్సరాలకు రూ.2.5 కోట్ల విలువచేసే పురస్కారాలు 134 మంది కళాకారులకు కేటాయించారు. 2023 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక కవిసామ్రాట్ ఉపేంద్ర భంజ సమ్మాన్ డాక్టర్ ప్రణబ్ కిశోర్ పట్నాయక్, బాదల్ సికదర్‌కు సంయుక్తంగా ఇచ్చారు. 2024 సంవత్సరానికి మోహిని మోహన్‌పట్నాయక్ సుధాకర్ సాహులకు, 2025 సంవత్సరానికి ఘనశ్యాం పండా, భాగవత్ ప్రధాన్‌లకు భంజ పురస్కారాలు కేటాయించారు. రూ.లక్షచొప్పున నగదు, ప్రశంసా పత్రాలు ఇచ్చారు. కవిచంద్ర కాళీచరణ్ యువప్రతిభా సమ్మాన్ పురస్కారాలు కింద, కళాకారులకు రూ.50 వేలు చొప్పున ఇచ్చారు. పురస్కార వితరణ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో ఉపాధ్యాయులు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కె.సింగపూర్ ఆదర్శ విద్యాలయ ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో తమపై భారం పడుతోందని బుధవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు తగిన గుర్తింపు, ప్రత్యేక ఎలవెన్స్‌లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

గ్రామస్థుల ఆందోళన

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ సమితి మాచర కూడలి వద్ద స్థానిక గ్రామాల ప్రజలు గురువారం ఆందోళన చేపట్టారు. మాచర కూడలి నుంచి డాక్రా వరకు రహదారిని భారతమాల రోడ్‌కు జోడించాలని కోరారు. దీంతో 12 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని, ఒడాపూర్ నుంచి బంసిగూడకు మధ్య వంతెన నిర్మిస్తే మూడు పంచాయతీల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొంటూ ఆందోళన చేపట్టారు.

మాచర కూడలి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నేత్ర మొబైల్ యాప్ ప్రారంభం

యాప్‌ను ప్రారంభిస్తున్న సీఎమ్‌డీ సింగ్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నాల్కో యాజమాన్యం నేత్ర మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేయగా భువనేశ్వర్‌లో నాల్కో కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సీఎండీ బీపీ సింగ్ ప్రారంభించారు. ఉద్యోగుల సౌకర్యార్థం దీన్ని ప్రారంభించామని, ఇందులో ఉద్యోగులకు సంబంధించి అన్ని వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు దీన్ని రూపొందించినట్లు తెలిపారు. హెచ్.ఆర్. డైరెక్టర్ తపస్ కుమార్ పట్నాయక్, కార్యనిర్వాహక డైరెక్టర్ అశుతోష్ రతో తదితరులు పాల్గొన్నారు

రాజస్థాన్‌లో పర్యటిస్తున్న జడ్పీ కౌన్సిల్ సభ్యులు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా పరిషత్ కౌన్సిల్ సభ్యులు రాజస్థాన్‌లో పర్యటించారు. జడ్పీ ఛైర్మన్ సస్మితా మెలక అధ్యక్షతన సభ్యులు పర్యటన కొనసాగిస్తున్నారు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలు సందర్శించి అక్కడ అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు సస్మితా తెలిపారు. మహిళా స్వస్థీకరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలు పరిశీలించినట్లు తెలిపారు.

జైపూర్‌లో అధికారులతో కొరాపుట్ జడ్పీ కౌన్సిల్ సభ్యులు

లక్ష్మీపూర్ ప్రాంతంలో మంచు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: శీతాకాలం ప్రారంభంతో కొరాపుట్ జిల్లాలో తీవ్రమైన మంచు ప్రభావం కనిపిస్తోంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు ప్రభావం అధికంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లక్ష్మీపూర్ ప్రాంతంలో గత రెండు రోజులుగా మంచు ప్రభావం తీవ్రంగా ఉంది. మంచు ప్రభావంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లక్ష్మీపూర్ వద్ద మార్గాన్ని మూసివేసిన మంచు

పిల్లల గ్రంథాలయం ప్రారంభం

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న బీడీవో తదితరులు

జయపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో పాఠ్యపుస్తకాలతో పాటు జ్ఞానాన్ని పెంచే పుస్తకాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, బాల్యంలో వివిధ అంశాల గురించి జ్ఞానం సంపాదించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కుంద్ర బీడీవో అన్నారు. కొరాపుట్ జిల్లా కుంద్ర సమితి లిమ పంచాయతీ కుసుమగూడ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో పిల్లల గ్రంథాలయం బీడీవో పి.మనస్మిత చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. గౌరవ అతిథిగా హాజరైన ఎమ్ఎస్ స్వామినాథన్, సీనియర్ అధికారి మెహర్ గడ్కెర గ్రంథాలయానికి వివిధ పుస్తకాలు అందజేశారు.

మహిళలపై హింస తగదు

పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయంలోని బీఈడీ విభాగం తరఫున గురువారం మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. మహిళలపై హింసను నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మహిళల భద్రత, గౌరవం కాపాడటం అందరి బాధ్యతంటూ ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని పరిడ ఆధ్వర్యంలో విద్యార్థులు, బీఈడీ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా ఇంఫా వ్యవస్థాపక దినోత్సవం

అతిథులను సన్మానిస్తున్న ఉద్యోగులు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా తెరువలి ఇంఫా పరిశ్రమ 64వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం రాత్రి పరిశ్రమ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి పరిశ్రమ సీఈఓ బిచిత్రానంద మహాపాత్ర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిశ్రమ వ్యవస్థాపకుడు బంశీధర్ పండా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమ స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ సురేష్ బాబు, మేనేజర్ ఎమ్.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. 30 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు జ్ఞాపికలు, నగదు బహుమతి అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు బంశీ ధర్ పండా 94వ జయంతి సందర్భంగా 500 మందికి వస్త్రదానం, ముగ్గురు దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే మూడు చక్రాల రిక్షాలు అందజేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ: ఒకరి మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా రంభ ఠాణా పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై బైపాస్ కూడలి వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొంది. ఈ దుర్ఘటనలో బెగునియాపడా ఠాణా పరిధిలోని అంగారగావ్‌కు చెందిన కృష్ణ జెనా అనే యువకుడి తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఆయన సోదరుడు యజ్ఞసేన జెనా ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరీక్షకు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అన్నదమ్ములు యజ్ఞసేన, కృష్ణ జెనాలు ద్విచక్ర వాహనంపై బ్రహ్మపురవైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

మంగులి మృతదేహం లభ్యం

మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా మత్తిలి ఠాణా కర్తన్‌పల్లి గ్రామానికి చెందిన మంగులి భూమియ (62) మంగళవారం నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలించినా దొరకలేదు. గురువారం ఉదయం శబరి నది దగ్గర ఓ వలలో ఆమె మృతదేహం చిక్కుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. మత్తిలి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరీక్షకు తరలించారు.

దాడి చేశారు... దోచుకున్నారు

నవరంగపూర్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి కొందరు దుండగులు ఓ ఇంట్లోకి చొరబడి దంపతులపై దాడి చేసి నగదు, బంగారం దోచుకున్నారు. ఉమ్మర్‌కోట్ ఎస్‌డీపీఓ సుబేందు కుమార్ సబర్ తెలిపిన వివరాల ప్రకారం.. జొరిగావ్ సమితి హతిబాడి గ్రామంలో బిభుపాద స్వాయి ఇంటి ఆవరణలో ఉన్న మొక్కజొన్న పంటకు కాపలాగా పడుకున్నారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత సుమారు 10 మంది దుండగులు వచ్చి ఆయన కాళ్లు చేతులు కట్టేశారు. ఇంటి తలుపులు తెరవకుంటే బిభుపాదను చంపేస్తామని బెదిరించగా, ఆయన భార్య లక్ష్మీప్రియ తలుపులు తెరిచింది. ఇంట్లో ఉన్న బీరువాను పగలగొడుతుండగా, అడ్డు వచ్చిన లక్ష్మీప్రియను కత్తితో పొడిచారు. రూ.3 లక్షలు నగదు, 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు చరవాణులను దోచుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి మొక్కలకు నిప్పు

గంజాయి మొక్కల్ని పెకిలిస్తున్న పోలీసులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బడగడ ఠాణా పరిధిలోని జయసింగ్ గ్రామం శివారున సుమారు ఎనిమిది ఎకరాల్లో అక్రమంగా సాగవుతున్న గంజాయి మొక్కలను గురువారం పోలీసులు నాశనం చేశారు. ధారాకోట తహసీల్దారు కార్యాలయం అధికారుల సమక్షంలో బడగడ, అస్కా, సురడా, పొలసరా ఠాణాల అధికారులు, సిబ్బంది ఏపుగా పెరిగిన గంజాయి మొక్కల్ని పెకిలించి, నిప్పు పెట్టారని గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు మధ్యాహ్నం ఒక ప్రకటనలో తెలిపారు.

భంజనగర్‌లో రెండు అగ్ని ప్రమాదాలు

కాలిపోయిన భంజనగర్‌లోని హోటల్ గది

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భంజనగర్ అగ్ని మాపక కేంద్రం పరిధిలో గురువారం రెండు వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. బహాడపదర్ గ్రామంలో ఉదయం ఓ గడ్డి ఇంట్లో దేవుడి చిత్రపటాల ముందు వెలిగించిన దీపం కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను నియంత్రించారు. అంతకుముందు వేకువన భంజనగర్‌లో పురుణా బజారు వీధిలోని కన్ను హోటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నికీలల్లో చిక్కుకుని హోటల్‌లోని ఫర్నీచర్, సీలింగ్ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను నియంత్రించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని కేంద్రం సహాయ ఫైర్ ఆఫీసర్ చక్రధర కహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

EENADU Classifieds
JOBS
హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్స్, పిల్లలను చుసుకొనుటకు పర్సన్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 63899
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

శ్రీక్షేత్రానికి అత్యాధునిక దీపాలంకరణ

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రానికి అత్యాధునిక దీపాలంకరణ జరగనుంది. 10 కిలోమీటర్ల దూరం నుంచి వెలుగులు భక్తులు చూడగలుగుతారు. ఇందుకోసం రూ.17.12 కోట్లు ఖర్చవుతాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

నిర్వాసిత గ్రామాలను అభివృద్ధి చేయాలి

రూపక్ తురుక్‌తో మాట్లాడుతున్న సంస్థ అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: భారతమాల రహదారితో నిర్వాసితులైన వారి గ్రామాలను అభివృద్ధి చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తూ గురువారం ఆందోళనకు దిగారు. కొరాపుట్ సబ్ డివిజన్ పరిధిలోని దశమంత్‌పూర్ సమితి పుల్‌బెడ గ్రామపంచాయతీ పరిధిలో ఒడపూర్ వద్ద భారతమాల సంస్థ కార్యాలయం వద్ద వందలాది మంది నిర్వాసితులు ఉదయం ఆందోళనకు దిగారు. ఆందోళన జరుగుతున్న విషయం తెలిసి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రూపక్ తురుక్, మాజీ ఎమ్మెల్యే నిమయి సర్కార్‌లు చేరుకొని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. సంస్థ అధికారులు వారితో చర్చించారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

లలితా ఖిలోకి ఘన స్వాగతం

లలితా ఖిలోకి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, ఇతరులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచిన లలితా ఖిలోకి ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి ఆర్.ఎస్.సి.6 ఉన్నత పాఠశాల విద్యార్థిని లలితా ఖిలో నాగపూర్‌లో గత నవంబర్ 18 నుంచి 23 వరకు జరిగిన జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ఆమె ప్రాజెక్టు మొదటి స్థానంలో నిలిచినందుకు ఆమెకు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. బుధవారం లలిత తిరిగి చిత్రకొండకి రావడంతో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆమెకు సమితి విద్యాధికారి గాయత్రి దేవితో పాటు పలువురు ఉపాధ్యాయులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమెతో పాటు ఈ ప్రాజెక్టుకు సహకరించిన ఉపాధ్యాయులు డంబురుధర్ ఆకల్, దేవదత్త దాస్ పట్నాయక్‌కు స్వాగతం పలికారు.

రోడ్ షో కోసం ముందస్తు సమావేశం

సమావేశంలో పాల్గొన్న అధికారులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లాలో డిసెంబర్ 14 నుంచి 18 వరకు జరగనున్న మాల్యవంత మహోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ అస్మి ఎల్.నేతృత్వంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ముందస్తు సమావేశం జరిగింది. డిసెంబర్ 7న ఈ రోడ్ షో చేయడానికి తేదీ ఖరారు చేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు నుంచి డి.ఎన్.కె. కూడలి వరకూ జరుగుతుంది. రోడ్ షోలో ముగ్గులు, స్కేటింగ్స్, మార్షల్ ఆర్ట్స్, యోగా, నృత్యం, సంగీతం, ఫ్యాషన్ డ్రెస్సు బొమ్మలు, డాగ్ షోతో పాటు ఇతర కార్యక్రమాలు జరుగుతాయి. సమావేశంలో జిల్లా సమాచార, ప్రజాసంబంధ అధికారి ప్రమీల మాఝి, జిల్లా సంస్కృతి అధికారి సంత్రాస్ నారాయణ్ పండా, అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ మండంగి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బ్రహ్మపుర బిషప్, ఇతర క్రైస్తవ ప్రముఖులు

నగరంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు

కొవ్వొత్తులతో భారీ ర్యాలీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక చర్చి రోడ్డులోని శతాబ్దాల పురాతన క్వీన్ ఆఫ్ ది కేథడ్రిల్ 'మిషన్ రాణి' చర్చి ఆధ్వర్యంలో గురువారం బ్రహ్మపురలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ జరిగింది. చర్చి రోడ్డు వద్ద ప్రారంభమైన కార్యక్రమం రాత్రి నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి తిరిగి అక్కడే ముగిసింది. బ్రహ్మపుర బిషప్‌తో పాటు పలువురు క్రైస్తవ ప్రముఖులు పాల్గొన్నారు. దక్షిణ ఒడిశాలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకునే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

GLAMPING

సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ అందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతితో అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు,

మనసుకు హత్తుకునేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకునే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకునే వారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, వృక్ష కాంతి.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకోవచ్చు. చలిమంటలకూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలుచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకునే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

భవిత కేంద్రం.. చిన్నారులకు వరం

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

అడుగు తీసి అడుగు వేయలేరు.. సరిగా మాట్లాడలేరు.. తమ పనులు తాము చేసుకోలేరు.. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన వారి పరిస్థితి దయనీయం. ఇలాంటి చిన్నారులకు విద్యతోపాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పిల్లల ఎదుగుదలకు అవసరమైన సేవలందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సాధారణ స్థాయికి వచ్చేలా మార్పును తీసుకొస్తున్నాయి. భవిత కేంద్రాలు అందజేస్తున్న సేవలను కొందరు అందిపుచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

బాలుడికి వ్యాయామ చికిత్స చేస్తున్న వైద్యురాలు

నియోజకవర్గ వివరాలు

మండలం	చిన్నారుల సంఖ్య	ప్రత్యేక అవసరాల పిల్లలు
కవిటి	25	225
ఇచ్ఛాపురం	31	300
కంచిలి	25	232
సోంపేట	26	284

మండలానికి ఒకటి చొప్పున..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల్లో భవిత కేంద్రాలున్నాయి. వీరికి విద్యార్థులను బట్టి ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు ఒక ఫిజియోథెరపిస్టు, ఒక స్పీచ్‌థెరపిస్టు సేవలందిస్తారు. ఈ కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ.800, బాలురకు రూ.600 రవాణా ఖర్చుల కింద బాలల తల్లి బ్యాంకు ఖాతాలో నెలవారీ ప్రభుత్వం జమ చేస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి

భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. కొంత మంది తల్లిదండ్రులకు అవగాహన కొరవడుతోంది. దీంతో సేవలపై వారికి అవగాహన కల్పిస్తున్నాం. భవిత కేంద్రానికి తీసుకొచ్చే చిన్నారులకు రవాణా భత్యం కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.

– భావన, అమూల్య, ఫిజియోథెరపిస్టు, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు అవకాశాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు ఆకాంక్షించారు.

నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్ల రద్దు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ పరిధిలోని గోదావరి, రాజమహేంద్రవరం, కడియం సెక్షన్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా వచ్చే ఏడాది జనవరిలో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 12717/12718 విజయవాడ-విశాఖపట్నం(జనవరి 29వ తేదీ నుంచి 31 వరకు), ● 67262/67261 విజయవాడ-రాజమహేంద్రవరం(29వ తేదీ) ● 17249/17250 రేణిగుంట-కాకినాడ పోర్ట్(28, 29 తేదీల్లో) ● 17239/12240 గుంటూరు-విశాఖపట్నం(28వ తేదీ నుంచి 31 వరకు), ● 12805/12806 లింగంపల్లి-విశాఖపట్నం(28వ తేదీ నుంచి 30 వరకు), ● 17480/17479 తిరుపతి-పూరి(27, 28 తేదీల్లో), ● 12775/12776 కాకినాడటౌన్-లింగంపల్లి(27, 28 తేదీల్లో), ● 22708/22707 విశాఖపట్నం-తిరుపతి(28, 29 తేదీల్లో), ● 17257/17258 విజయవాడ-కాకినాడపోర్ట్(29వ తేదీ నుంచి 31 వరకు), ● 67201/67202 విజయవాడ-రాజమహేంద్రవరం(29వ తేదీ), ● 17219/17220 మచిలీపట్నం-విశాఖపట్నం(28వ తేదీ నుంచి 30వరకు) ● 22875/22876 గుంటూరు-విశాఖపట్నం(31వ తేదీ).

గంజాయి అక్రమ రవాణా.. దొంగనోట్ల చలామణి..

నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు(దేవరపాలెం), న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా, విక్రయంతోపాటు నకిలీ నోట్ల చలామణి చేస్తున్న ముఠాను ఏపీలోని నెల్లూరు గ్రామీణ పోలీసులు పట్టుకుని కటకటాల పాలు చేశారు. వివరాలను గురువారం నెల్లూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు వెల్లడించారు. 'అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీకి చెందిన షేక్ హసన్ అలియాస్ మున్నా అలియాస్ అశోక్ అలియాస్ కార్తీక్, ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన షేక్ రియాజ్ అలియాస్ ఇలియాజ్, షేక్ ముస్తఫా, పిఠాపురంకు చెందిన బెజ్జంకండ అనిల్ ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా తెప్పించుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దాంతో పాటు నకిలీ నగదు చలామణి చేస్తున్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు గ్రామీణ పోలీసులు వారిపై నిఘా ఉంచారు. బుధవారం షేక్ హసన్ అలియాస్ కార్తీక్ చెప్పిన వైపు వెళ్తుండగా నెల్లూరు గ్రామీణ పోలీసులను చూసి కారు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు.. పోలీసులు పట్టుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. రియాజ్, ముస్తఫా, బెజ్జంకండ అనిల్ కలిసి నకిలీ నోట్లను సేకరించి చలామణితో పాటు ఒడిశాకు చెందిన దేవా నుంచి రైలు మార్గం ద్వారా గంజాయి తెప్పించి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. అనంతరం ధనలక్ష్మీపురంలోని శ్రీసాయి సిటీ లేఅవుట్‌లోని ఇంట్లో దాడి చేశారు. అక్కడ బ్యాగులో రూ.37,50,000 నగదు, 22.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన నెల్లూరు గ్రామీణ ఇన్‌స్పెక్టర్ జి.వేణు, సిబ్బందిని గ్రామీణ డీఎస్పీ, ఉన్నతాధికారులు అభినందించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు: కంచిలి గ్రామీణం: కర్తలి మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర గురువారం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

స్కూల్ కాంప్లెక్స్‌లకు కంప్యూటర్లు..!

ఉపాధ్యాయులకు తొలగిన ఇబ్బందులు

న్యూస్‌టుడే, జి.సిగడాం: విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్యకలాపాల నిర్వహణ, జిల్లా, రాష్ట్ర స్థాయి నివేదికలు సకాలంలో పంపేలా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కొత్త కంప్యూటర్లు సమకూర్చింది. గతంలో నివేదికలు రూపొందించడానికి ఉపాధ్యాయులు ఇంటర్నెట్ కేంద్రాలపై ఆధారపడేవారు. బిల్లుల చెల్లింపునకు సొంత నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల అవసరమైన సామగ్రి, రూటర్లు అందజేయడంతో ఉపశమనం లభించింది.

ఎందువ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

విద్యార్థుల ప్రగతి తెలుసుకోవచ్చు..

స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులకు కంప్యూటర్లు అందించడంతో సమస్య పరిష్కారమైంది. సమాచారం సక్రమంగా అందించవచ్చు. విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలు కలిగింది.

– ఎ.రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం

- జిల్లాలో స్కూల్ కాంప్లెక్స్‌లు: 170
- మంజూరు చేసిన కంప్యూటర్లు: 170

కొత్త విధానంతో మేలు

★ గతంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించేటప్పుడు ప్రధాన అంశాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న పథకాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల సమగ్ర ప్రగతి, ఇతర అంశాలను జిల్లా, రాష్ట్ర విద్యా శాఖ అధికారులకు సమాచారం అందించాల్సి ఉండటంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు.

★ ప్రస్తుతం కొత్త కంప్యూటర్లు రావడంతో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలల నిర్వహణ, ఇతర సమాచారం ఉన్నతాధికారులకు నివేదించడం, ఆన్‌లైన్‌లో పనుల నిర్వహణకు వీలు కలిగింది.

★ ఒక్కో కాంప్లెక్స్‌కు సుమారు రూ.67 వేల విలువ చేసే కంప్యూటర్, స్టేషనరీ అందజేశారు. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'నా పేరిట ఫేస్‌బుక్ నకిలీ ఖాతా.. స్పందించవద్దు'

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'నా పేరు, ఫొటోతో ఫేస్‌బుక్ నకిలీ ఖాతాను క్రియేట్ చేసి, సందేశాలు పంపి డబ్బులు అడుగుతున్నారు. ఎవరూ స్పందించవద్దు' అని గంజాం పోలీసు అధికారి వి.శ్రీవాసన్ గురువారం తన వ్యక్తిగత సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు.

వేగావతిలో జీపు బోల్తా

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని శివరాంపురం గ్రామం శివారున వేగావతినదిలో ఓ జీపు బోల్తాపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట నుంచి ఇద్దరు దూడలను తీసుకుని పార్వతీపురం మీదుగా శివరాంపురం వెళ్తున్న సమయంలో వాహనం అదుపు తప్పి నదిలో మునిగిపోయింది. స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చి, దూడలను రక్షించారు. అనంతరం ట్రాక్టర్ సాయంతో మునిగిపోయిన జీపును బయటకు తీశారు.

ట్రాక్టర్‌తో జీపును బయటకు తీస్తున్న చిత్రం

మిల్లర్ల అదనపు దందా..!

– న్యూస్‌టుడే, నరసన్నపేట

రైసు మిల్లు వద్ద ధాన్యం వాహనాలతో నిరసన

మిల్లర్ల దందాకు రైతన్నలు అన్యాయం ఎదుర్కొంటున్నారు. కొనుగోలు ప్రక్రియపై ప్రభుత్వం చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. ఇందుకు ఉదాహరణగా ఈ ఘటనే. మిల్లర్లు 6 నుంచి 4 కిలోల వరకు అదనంగా తీసుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోండంటున్నారు. కంబకాయ గ్రామానికి చెందిన సిరినెల్ల సింహాచలం అనే రైతు 50 బస్తాల ధాన్యానికి బుధవారం ట్రక్ షీట్ జారీ అయింది. ఈమేరకు నరసన్నపేటలోని బాలాజీ మిల్లుకు ధాన్యం తరలించగా, సంబంధిత మిల్లు యజమాని ఆరుకిలోల అదనపు తూకానికి పట్టుబట్టారు. ఇందుకు రైతు ఒప్పుకోలేదు. బస్తాలతో కూడిన వాహనాన్ని నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి తరలించి జరిగిన అన్యాయాన్ని అధికారులకు చెప్పారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ ఘటనతో మిల్లర్లు చెప్పినంత ఇవ్వాల్సిందే.. లేకుంటే నష్టపోయేది అన్నదాతేనని రుజువవుతోంది. కొనుగోలు కేంద్రం నుంచి తేమశాతంతో పాటు అన్నీ సక్రమంగా ఉన్నా, మిల్లర్ల మెలికలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిర్లక్ష్యంగా ఇక్కడ..

ఈ చిత్రంలో అసంపూర్తిగా కనిపిస్తున్నది బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం. 2020లో రూ.1.78 కోట్లతో పనులు చేపట్టారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో ఆపేశారు. ఎన్నికల ముందు పూర్తికాకుండానే శాసనసభ మాజీ స్పీకర్ సీతారాం అప్పట్లో ప్రారంభించిన కేంద్రం ప్రస్తుతం ఇలా పనికిరాని మొక్కల మధ్య దర్శనమిస్తోంది.

– న్యూస్‌టుడే, బూర్జ

నీరందక అక్కడ..

ఎల్ఎన్‌పేట మండలం ముంగెన్నపాడు పెద్ద చెరువు దుస్థితి ఇది.. పూర్తిగా గుర్రపుడెక్కతో ఇలా నిండిపోయింది. ఆక్రమణతో కుచించుకుపోవడంతో పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏపీవో శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గుర్రపుడెక్క తొలగిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

కంట్లో కారంకొట్టి పుస్తెలతాడు చోరీ

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలో తూడి-పాలమెట్ట గ్రామాల మధ్య పొలం నుంచి వస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తి గురువారం అపహరించాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహిళ నడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చి కంట్లో కారం చల్లి ఆభరణాన్ని తెంచుకుపోయాడు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పాఠశాల ఉందని మరిచారా

బెనుగానిపేట ప్రధాన రహదారిలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు పక్కన వ్యర్థాలు పారబోస్తున్నారు. దీంతో విద్యార్థులు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమీప నివాస ఇళ్ల వారికి అవగాహన కల్పించి సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కృష్ణను వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

తుప్పల్లో స్వచ్ఛ సంకల్పం

పలాస మండలం గొల్లమాకన్నపల్లిలో స్వచ్ఛ సంకల్పం రిక్షా మూలకు చేరింది. రోడ్డు పక్కనే తుప్పల్లో పడి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఇదే విషయం ఎంపీడీవో వసంతకుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

వాడుకనీరు బోరులోకే..

ఖజానావీధిలోని మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. స్థానికులు ఇక్కడ నీటినే సేకరించి తీసుకెళ్తుంటారు. కొందరు అక్కడే స్నానాదికాలు చేస్తుంటారు. బోరు అనంతరం అడుగుభాగాన్ని కాంక్రీట్‌తో మూసివేయకపోవడంతో స్నానపునీరు తిరిగి బోరులోకి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించే దిశగా ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అల్లుకున్న నిర్లక్ష్యం



జల్లుపుట్టుగ నుంచి రాజపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో పలు చోట్ల స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. భైరిపురం వద్ద నియంత్రిక ఉన్న స్తంభానికి మొక్కలు అల్లుకోవడంతో ఎప్పటికప్పుడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

శిథిల కాలువ.. మురుగు నిల్వ

బెల్లుపడ అచ్చుమ్మపేట ప్రాంతంలో శివానందగిరికి వెళ్లే మార్గంలో కాలువ ధ్వంసమైంది. ఎగువ నివాసాల నుంచి వచ్చే వాడుక నీరు దిగువకు చేరే మార్గంలేక ఎక్కడికక్కడే తిష్ఠ వేస్తోంది. వర్షం పడితే మురుగు, వాన నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

శిక్షణతో సరి... యంత్రాలో మరి

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మహిళలు ఆర్థికంగా బలోపేతమవ్వాలని కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. అందులో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అతివలు స్వయం ఉపాధి పొందడానికి వీలుగా 3 నెలల పాటు కుట్టు శిక్షణ ఇచ్చింది. ఇందులో 75 శాతం హాజరు ఉండి.. నైపుణ్యం పొందిన వారికి కుట్టు యంత్రాలు, ధ్రువపత్రాలు, స్వయం ఉపాధికి 50 శాతం రాయితీతో రూ.2 లక్షల వరకు పెట్టుబడి రుణం ఇస్తామని పేర్కొంది. దీంతో ఆసక్తి ఉన్న వారు శిక్షణ తీసుకున్నారు. తొలి విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు 4 నెలలుగా ఎదురు చూస్తున్నా ఇప్పటికీ కుట్టు యంత్రాలు రాలేదు.

▶ బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలాస డివిజన్‌లోని అన్ని మండలాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మే నుంచి మూడు నెలల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. రోజుకు రెండు బ్యాచుల చొప్పున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటి బ్యాచ్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చారు.

▶ కుట్టు పనులే కాకుండా అల్లికలపైనా అవగాహన కల్పించారు. ఆధునిక యంత్రాలపై సాధన చేయించారు. ఈ మేరకు రోజూ హాజరు నమోదు చేశారు. శిక్షణ తరగతుల్లో 75 శాతం హాజరు ఉన్నవాళ్లకు పరీక్ష నిర్వహించి, కుట్టు యంత్రాలతోపాటు ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. శిక్షణ పూర్తయి నెలలు కావస్తున్నా నేటికీ ఏవీ ఇవ్వలేదు. శిక్షణ పొందిన వాళ్లంతా ఇవి ఎప్పుడు వస్తాయా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గాల వివరాలు

మండలం	నమోదు చేసుకున్న మహిళలు	హాజరైన వారు
పలాస	88	39
పలాస-కాశీబుగ్గ పురపాలిక	341	72
వజ్రపుకొత్తూరు	870	75
మందస	74	50
సోంపేట	90	45
కవిటి	130	120
కంచిలి	110	90
ఇచ్ఛాపురం	160	70
ఇచ్ఛాపురం పురపాలిక	104	95

పంపిణీ చేస్తాం

కుట్టుపై శిక్షణ పొందిన వాళ్లందరికీ యంత్రాలు అందజేస్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తాం.

– రవణమ్మ, ఏఈవో, బీసీ కార్పొరేషన్, శ్రీకాకుళం

ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరి మృతి

సుశాంత్‌కుమార్

కాశీబుగ్గ, పాతపట్నం, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పలాస మండలం గరుడఖండి సమీప పాతజాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తలగాన భీమారావు (27), సుశాంత్‌కుమార్ పైకా (23) మృతి చెందగా, తలగాన వేణు గాయాలపాలయ్యారు. పలాస మండలం వీరభద్రాపురానికి చెందిన భీమారావు తల్లితోపాటు విశాఖపట్నంలో ఉంటున్నారు. పెద్దనాన్న కుమారుడైన వేణు దగ్గరకు వీరభద్రాపురం వచ్చి అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై పలాస వెళ్తుండగా, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి ఠాణా పరిధి డెరబ గ్రామానికి చెందిన సుశాంత్‌కుమార్ పైకా మరో ద్విచక్రవాహనంపై కాశీబుగ్గ నుంచి వస్తూ ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. భీమారావు రహదారిపై మృతి చెందగా, సుశాంత్ కుమార్ పైకా కొద్ది దూరం ఎగిరి రహదారి పక్కన పడి మృతి చెందారు. భీమారావుతో వచ్చిన వేణుకు తీవ్ర గాయాలవ్వగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, ఎస్సై నరసింహమూర్తి సంఘటనా స్థలాలకు చేరుకుని మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుశాంత పైకాకు భార్య రీనా గొమాంగో, రెండేళ్ల కుమారుడు ఐస్ కుమార్ ఉన్నారు. 20 రోజుల కిందట కాశీబుగ్గ ప్రాంతంలో గుడ్ల కర్మాగారంలో పని చేసేందుకు భార్యతో కలిసి ఇక్కడికి వచ్చినట్లు ఆయన అన్నయ్య అరుణ్ కుమార్ తెలిపారు.

ఆదరణ కోల్పోయింది: పాతపట్నం మండలం సరాళి గ్రామానికి చెందిన తలగాపు భీమారావు(28)కు తల్లి లక్ష్మి, తమ్ముడు తేజేశ్వరరావు ఉన్నారు. తండ్రి కొన్నేళ్ల కిందటే మృతి చెందడంతో పరిస్థితులు బాగోక సరాళి నుంచి విశాఖ వెళ్లిపోయారు. భీమారావు పైప్‌లైన్ కంపెనీలో పని చేస్తున్నారు. గురువారం వీరభద్రాపురంలో బంధువుల గృహప్రవేశానికి విశాఖపట్నం నుంచి వచ్చారు. తిరిగి వెళ్లే ప్రయత్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమారావు మృతి చెందారు.

(c) eenadu

ఈనాడు తమిళనాడు

రాష్ట్రంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

■ 30 వరకు అతి భారీ వర్షాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో 'దిత్వాహ్' తుపాను ఏర్పడిన నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసినట్లు వాతావరణ పరిశోధన కేంద్రం దక్షిణ జోన్ హెడ్ అముద తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నైరుతి బంగాళాఖాతం, ఆగ్నేయ శ్రీలంక తీరంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బుధవారం అర్ధరాత్రి వాయుగుండంగా బలపడిందని, గురువారం మరింత బలపడి తుపానుగా మారినట్లు, గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు చెప్పారు. నైరుతి బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న శ్రీలంక ప్రాంతాల్లో చెన్నై నుంచి 700 కి.మీ దూరంలో నెలకొందన్నారు. ఉత్తర, వాయువ్య దిశగా పయనించి నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల్లో 30వ తేదీ తెల్లవారుజామున తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు.

● 28వ తేదీ పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు అముదల పేర్కొన్నారు. రామనాథపురం, శివగంగై, తిరుచ్చి, అరియలూరు, మైలాడుతురై, కారైక్కల్‌లో భారీ నుంచి అతి భారీవర్షం, తూత్తుకుడి, విరుదునగర్, మదురై, పెరంబలూరు, కడలూరు, పుదుచ్చేరిలో భారీవర్షానికి అవకాశం ఉంది.

● 29న చెంగల్పట్టు, విళుపురం, కడలూరు, మైలాడుతురై, తిరువళ్లూరు, నాగపట్టినం, పుదుచ్చేరి, కారైక్కల్‌కు రెడ్ అలర్ట్, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, వేలూర్, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, తిరుచ్చి, కరూర్, పుదుక్కోట్టై భారీ వర్షాలకు అవకాశం ఉంది.

● 30న తిరువళ్లూరు, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షం, వేలూర్, తిరుపత్తూర్, తిరువణ్ణామలై, విళుపురం, కృష్ణగిరి, ధర్మపురి, పుదుచ్చేరిలో భారీవర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు. కన్నియాకుమరి, మన్నార్‌గల్ఫ్, నైరుతి బంగాళాఖాతంలో 28వ తేదీ నుంచి గంటకు 70 నుంచి 80 కి.మీ వేగంతో గాలులు వీస్తాయన్నారు. 29న ఉదయం నుంచి 30 వరకు గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

చెన్నై: తుపాను నేపథ్యంలో సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి చేపట్టిన చర్యలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, విపత్తు నిర్వహణ చర్యలపై చర్చించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

ఫారాన్ని పూర్తి చేసి ఇస్తేనే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు: జిల్లా ఎన్నికల అధికారి

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి ఇస్తేనే ముసాయిదా (డ్రాఫ్టు) ఓటరు జాబితాలో ఓటరు పేరు చోటుచేసుకుంటుందని జిల్లా ఎన్నికల అధికారి, చెన్నై మహానగర పాలకసంస్థ కమిషనరు జె.కుమరగురుభరన్ తెలిపారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో... ఓటర్ల నుంచి పొందిన ఎన్యూమరేషన్ ఫారాలను భారత ఎన్నికల సంఘం యాప్‌లో అప్‌లోడ్ చేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ఫారాలను తిరిగి పొందే పనులను డిసెంబరు 4వ తేదీలోపు ముగించాలని ఎన్నికల సంఘం సూచించిన నేపథ్యంలో ప్రజలు అప్పటివరకు నిరీక్షించకుండా తమకు అందించిన ఫారాలను పూర్తిచేసి సంబంధిత బీఎల్వోలకు త్వరగా అప్పగించాలని కోరారు. వారి పేర్లు మాత్రమే డ్రాఫ్టు ఓటరు జాబితాలో చోటుచేసుకుంటాయని తెలిపారు. పూర్తి చేసిన ఫారాలను ఓటర్ల నుంచి బూత్ స్థాయి అధికారులు పొందకుంటే 1913 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్లలో కిరాణా దుకాణాలు

వడపళని, న్యూస్‌టుడే: కిరాణా దుకాణాల నుంచి వర్చువల్ రియాలిటీ గేమింగ్ జోన్ల వరకు చెన్నై డివిజన్‌లోని అన్ని రైల్వేస్టేషన్లలో అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల పెరుంగళత్తూరులో 100 చదరపు అడుగుల స్థలంలో కిరాణా దుకాణం ప్రారంభమైంది. 200 అడుగుల వరకు విస్తరిస్తూ కాయగూరలు కూడా అమ్మకానికి ఉంచనున్నారు. ఇతర స్టేషన్లలోనూ దుకాణాలు రానున్నాయని దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ వాణిజ్య విభాగ ఉన్నతాధికారి తెలిపారు.

పెరుంగళత్తూరు స్టేషన్‌లో దుకాణం

త్వరలో వేళచ్చేరి, తరమణిలో..

త్వరలోనే ఎమ్మార్టీఎస్ మార్గంలోని వేళచ్చేరి, తరమణి, చింత్రాదిపేట స్టేషన్లలో స్టాళ్లు రానున్నాయి. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసేందుకు స్థల ఎంపిక కూడా జరుగుతోంది. సబర్బన్ స్టేషన్ల నుంచి కార్యాలయాలకు వెళ్లి, ఇళ్లకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, వారందరికీ అనుకూలంగా ఉండాలనే ఆలోచనతో మరిన్ని స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారి చెప్పారు.

గేమింగ్ జోన్..

మొదటి వర్చువల్ రియాల్టీ గేమింగ్ జోన్ చెన్నై సెంట్రల్ స్టేషనులో డిసెంబరులో ప్రారంభం కానుంది. తాంబరం, చెంగల్పట్టు, కాట్పాడి స్టేషన్లలో కూడా గేమింగ్ జోన్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ టెండర్లను మూడు నెలల్లో ఖరారు చేయనున్నారు. స్టేషన్లలో బహుళ గేమింగ్ జోన్లు ఉంటాయని, పునరావృతం కాకుండా ఉండేందుకు ఏడాదిలోపు నమూనాలు మార్చనున్నారు.

ప్రయోగాత్మకంగా..

ప్రయోగాత్మకంగా చెన్నై సెంట్రల్‌లో కాస్మోటిక్, స్టేషనరీ దుకాణం ప్రారంభించారు. పెరుంగళత్తూరు స్టేషనులోని స్టాల్‌లో మొబైల్ ఫోన్లు, విడి పరికరాలు విక్రయానికి ఉన్నాయి. కేరళలోని నిలంబూరు రోడ్, మహే, కన్‌హన్‌గాడ్‌లాంటి స్టేషన్లలో కూడా స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు దక్షిణ రైల్వే టెండర్లు ఆహ్వానించింది.

గ్రూప్-2ఏ మెయిన్స్‌కు డిసెంబరు 1 నుంచి ఉచిత శిక్షణ

సైదాపేట, న్యూస్‌టుడే: గ్రూప్-2ఏ మెయిన్స్‌కు డిసెంబరు 1 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం గురువారం ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర కెరీర్ గైడెన్స్ కేంద్రం ఆధ్వర్యంలో అనుభవం, నైపుణ్యం కలిగిన బోధకులతో తరగతులు నిర్వహించనున్నట్లు ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ సి.పళని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రాష్ట్ర కెరీర్ గైడెన్స్ కేంద్రం, ఏ-28, ఫస్ట్ ఫ్లోర్, టాన్సీ బిల్డింగ్, తిరువీకా ఎస్టేట్, గిండి-32 చిరునామా లేదా 044-22500134, 9361566648 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

పుదువైలో విజయ్ రోడ్‌షోకు అనుమతి లభించేనా?

చెన్నై, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రోడ్‌షో నిర్వహించడానికి పోలీసుల అనుమతి వ్యవహారంపై సందిగ్ధత నెలకొంది. పార్టీ ప్రారంభించిన తర్వాత విజయ్ తొలిసారిగా డిసెంబరు 5న పుదుచ్చేరి వెళ్లనున్నారు. రోడ్‌షో నిర్వహించేందుకు పోలీసుశాఖ అనుమతి కోరుతూ లేఖ అందించారు. కాలపట్టు, అంజతా సిగ్నల్, ఉప్పళం, మరపాలం, అరియాంకుప్పం మార్గంగా రోడ్‌షో నిర్వహించి ప్రజలను కలవనున్నట్లు లేఖలో వెల్లడించారు. దానికి అనుగుణంగా సంబంధిత ప్రాంతాల్లో టీవీకే నిర్వాహకులు ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. ఇప్పటివరకు పోలీసుశాఖ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

వీపీ సింగ్ సామాజిక న్యాయ విజయాలు కీర్తిద్దాం

☛ ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: భారత మాజీ ప్రధాని దివంగత వీపీ సింగ్ సామాజిక న్యాయ విజయాలను కీర్తిద్దామని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. వీపీ సింగ్ వర్ధంతి సందర్భంగా తన 'ఎక్స్' పేజీలో.. పదవులను తృణప్రాయంగా భావించి సామాజిక న్యాయాన్ని ఉన్నతంగా గౌరవించారన్నారు. వీపీ సింగ్‌తో రాష్ట్రానికి ఉన్న అనుబంధాన్ని 2023న ప్రారంభించిన ఆయన నిలువెత్తు విగ్రహం చాటుతోందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్, నీట్ తదితర పలు మార్గాల్లో సామాజిక న్యాయాన్ని భూస్థాపితం చేస్తున్న పాలకులు కేంద్రంలో ఉన్నప్పుడు వీపీ సింగ్ వంటివారి అవసరం మరింత గుర్తుకొస్తోందన్నారు.

ప్రజలు మార్పు కోరుతున్నారు

■ విజయ్ స్వచ్ఛమైన పాలన అందిస్తారు

■ టీవీకేలో చేరిన సెంగోట్టైయన్

చెన్నై, న్యూస్‌టుడే: ప్రస్తుత అన్నాడీఎంకే, డీఎంకే వైఖరి ఒకటేనని, అందుకే టీవీకేలో చేరానని అన్నాడీఎంకే బహిష్కృత సీనియర్ నేత, మాజీ మంత్రి సెంగోట్టైయన్ తెలిపారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో విజయ్ గెలిచి స్వచ్ఛమైన పాలన అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఎమ్మెల్యే పదవికి బుధవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. గురువారం పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయానికి మద్దతుదారులతో చేరుకుని విజయ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. విజయ్ సభ్యత్వ నమోదు కార్డులు అందించారు. వెంట పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్, ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున తదితరులు ఉన్నారు. తర్వాత మీడియా ప్రతినిధులతో సెంగోట్టైయన్ మాట్లాడుతూ... ఎంజీఆర్ చూసి ప్రభావితమై అన్నాడీఎంకేలో చేరిన తాను ఆయన గుర్తింపును పొందానన్నారు. ఎంజీఆర్ పార్టీ ప్రారంభించినప్పుడు 100 రోజులు కూడా ఈ బొమ్మ ఆడదని విమర్శించారని, తర్వాత అదే తిరుగులేని పార్టీగా మారిందని చెప్పారు. అన్నాడీఎంకేలో చీలికలు వచ్చినప్పుడు జయలలిత నాయకత్వంలో పనిచేశానన్నారు. ఆమె మరణానంతరం పార్టీ మూడు ముక్కలైందని, సమైక్య అన్నాడీఎంకే అనే భావజాలాన్ని అమలు చేయడం సాధ్యపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చీలిక వర్గాలు ఏకమవ్వాలనే అభిప్రాయాన్ని వెల్లడించానని, పసుంపొన్ వెళ్లి తిరిగొచ్చిన తర్వాత బహిష్కరణకు గురయ్యానని తెలిపారు. తన మద్దతుదారులనూ పార్టీ నుంచి తొలగించారని పేర్కొన్నారు. అన్నాడీఎంకే విలీనానికి చర్యలు చేపట్టాలనే కోరానని, దానికి గడువు విధించినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. స్పష్టమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానన్నారు. రాష్ట్రానికి ఓ రాజకీయ మార్పు కావాలన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛమైన రాజకీయాలను విజయ్ ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు మార్పును, స్వచ్ఛమైన పాలనను కోరుతున్నారని పేర్కొన్నారు. డీఎంకే, భాజపా తదితర పార్టీల నుంచి తనను ఎవరూ సంప్రదించలేదంటూ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

టీవీకే కార్యాలయానికి వస్తున్న సెంగోట్టైయన్

సెంగోట్టైయన్‌ను పార్టీ ఉన్నతస్థాయి కార్యనిర్వాహక కమిటీ కో-ఆర్డినేటర్‌గా విజయ్ నియమించారు. అదనంగా కోయంబత్తూర్, ఈరోడ్, తిరుప్పూర్, నీలగిరి జిల్లాలకు వ్యవస్థాపక కార్యదర్శిగానూ నియమించినట్లు ప్రకటనలో వెల్లడించారు.

మంచే జరుగుతుంది.. గెలుపు ఖాయం

విజయ్ వీడియో సందేశం

చెన్నై: సెంగోట్టైయన్ టీవీకేలో చేరిన సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. అందులో... 20ఏళ్ల యువకుడిగా ఉన్నప్పుడే ఎంజీఆర్‌ను నమ్ముకుని అభిమాన సంఘంలో చేరిన సెంగోట్టైయన్ యుక్తవయసులోనే ఎమ్మెల్యేగా గురుతర బాధ్యతలు చేపట్టారన్నారు. ఆ పార్టీలో ఇద్దరు మహానాయకులకు విశ్వాసపాత్రుడిగా రాజకీయరంగంలో ఉన్నారని తెలిపారు. 50ఏళ్లు ఒకే పార్టీలో ఉన్న తన రాజకీయ అనుభవం, క్షేత్రస్థాయి సేవలు ప్రస్తుతం టీవీకేకు భారీ అండగా ఉంటాయనే నమ్మకంతో ఉన్న ఆయనకు, కలిసి పనిచేసేందుకు తమతో చేతులు కలిపిన అందరికీ ప్రజాసేవ అందించడానికి స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. మంచే జరుగుతుందని, గెలుపు ఖాయమని పేర్కొన్నారు.

సెంగోట్టైయన్‌ను శాలువాతో సత్కరిస్తున్న విజయ్

రాబోయే ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ

విలేకరులతో మాట్లాడుతున్న టీటీవీ దినకరన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వచ్చే ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొనే అవకాశం ఉందని ఏఎంఎంకే ప్రధానకార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. ఎవరూ ఊహించని విధంగా కొత్త కూటమి ఏర్పడే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. దిండుక్కల్ జిల్లా ఒట్టన్‌సత్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1989లో ఎన్నికల ప్రచారంలో సెంగోట్టైయన్ ఉత్సాహంగా పనిచేశారని, చిన్న వయసులోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారన్నారు. విజయ్‌ను కలవడంపై ఆయన తనతో ఏమీ చెప్పలేదన్నారు. తాము కూటమి పెట్టుకుందామని నిర్ణయించలేదని తెలిపారు. కూటమి గురించి ఇతర పార్టీలు తమతో మాట్లాడడం నిజమేనన్నారు.

సెంగోట్టైయన్ అన్నాడీఎంకేలో లేరు

ప్యారిస్, న్యూస్‌టుడే: సెంగోట్టైయన్ గురించి జవాబివ్వాల్సిన అవసరం లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. రామనాథపురం సంస్థానం యువరాజు నాగేంద్ర సేతుపతి వివాహం గురువారం మదురైలో జరిగింది. చెన్నై నుంచి వచ్చిన ఈపీఎస్ వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బయటికొచ్చిన ఆయన్ను విలేకరులు ప్రశ్నించగా సెంగోట్టైయన్ అన్నాడీఎంకేలో లేరని, ఆయన వద్దకే వెళ్లి అడగాలని చెప్పి వెళ్లిపోయారు.

ప్రత్యేక దృష్టి సారించండి.. దక్షిణ జిల్లాల్లో పార్టీ కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో విజయం సాధించలేకపోయామని, ఈసారి ప్రత్యేక దృష్టి సారించి దక్కించుకోవాలని ఈపీఎస్ సూచించారు. ఓ ప్రైవేటు హోటల్‌లో కార్యకర్తలు, మాజీ మంత్రులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నాడీఎంకే, భాజపా కూటమి బలాన్ని, డీఎంకే పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. యువకులు, మహిళలను పెద్ద సంఖ్యలో పార్టీలో చేర్చేందుకు ప్రయత్నించాలని తెలిపారు.

రామనాథపురం సంస్థానం యువరాజు నాగేంద్ర సేతుపతి వివాహంలో పాల్గొన్న ఎడప్పాడి పళనిసామి

ఫుట్‌బోర్డులో ప్రయాణిస్తే కఠిన చర్యలు

వడపళని, న్యూస్‌టుడే: సబర్బన్ సర్వీసులు, ఎమ్మార్టీఎస్ సర్వీసుల్లో ఫుట్‌బోర్డులో ప్రయాణిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని దక్షిణ రైల్వే హెచ్చరించింది. ప్లాట్‌ఫారం నుంచి కదులుతున్న రైళ్లపై స్కేటింగు లాంటి విన్యాసాలు, నడుస్తున్న రైళ్ల నుంచి దిగి స్టంట్లు చేయడం, ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణించడం, నడుస్తున్న రైలులో ఇబ్బంది కలిగించడంవంటి దృశ్యాలు సోషల్ మీడియాలో ఇటీవల ఎక్కువయ్యాయని దక్షిణ రైల్వే గురువారం ప్రకటన విడుదల చేసింది. వారితో పాటు, తోటి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, తల్లిదండ్రులకు, చదువుతున్న విద్యా సంస్థలకు చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు. భద్రతకు సంబంధించి సాయం కావాలంటే 139 హెల్ప్‌లైన్ నెంబరు సంప్రదించవచ్చని తెలిపింది.



తండ్రిగా, పార్టీ నాయకుడిగా ఆనందిస్తున్నా: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: ఉదయనిధి సేవలను ప్రజలు, డీఎంకే వర్గీయులు అభినందించడం చూసి తండ్రిగా, పార్టీ నాయకుడిగా ఆనందిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తన 49వ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులైన ముఖ్యమంత్రి స్టాలిన్, దుర్గా స్టాలిన్ దంపతులను గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి ఆశీస్సులు పొందారు. ఉదయనిధి నుదుటన స్టాలిన్ ఆపాయ్యంగా ముద్దాడి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో.. సిద్ధాంత భక్తితో శ్రమించి ఎదుగుతున్న ఉదయనిధికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా, క్రీడాశాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా అందిస్తున్న సేవలను ఆనందిస్తున్నట్లు పేర్కొన్నారు. యువకుల్లో ద్రావిడ ఉద్యమ భావజాలాన్ని నాటుతూ వారికి ఆదర్శవంతంగా ఉండాలన్నారు.

ఉదయనిధిని ముద్దాడుతున్న స్టాలిన్

పోలీసులు, లాయర్ల ఘర్షణ కేసు దర్యాప్తు సీబీఐ కొనసాగించవచ్చు: హైకోర్టు

ప్యారిస్: హైకోర్టులో పోలీసులు, లాయర్లు మధ్య ఏర్పడిన ఘర్షణలకు సంబంధించిన కేసు దర్యాప్తును సీబీఐ కొనసాగించవచ్చని మద్రాసు హైకోర్టు తెలిపింది. జనతాదళ్ పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి 2009లో మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి వెళ్లగా ఆయనపై కొందరు లాయర్లు చెప్పులు, రాళ్లు విసిరి దాడికి పాల్పడ్డారు. లాయర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు న్యాయవాదులు సుబ్రహ్మణ్యస్వామిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అప్పుడు పోలీసులు, లాయర్లకు మధ్య ఘర్షణ ఏర్పడింది. పోలీసులు పలువురిపై దాడిచేశారు. హైకోర్టు ప్రాంగణంలో ఉన్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీస్‌స్టేషన్‌కు నిప్పంటించారు. ఈ ఘటనపై హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. విచారణ ఎగ్మూర్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసు రద్దు చేయాలని రజనీకాంత్ తదితర 28 మంది లాయర్లు, నలుగురు పోలీసు అధికారులు మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసు జస్టిస్ నిర్మల్‌కుమార్ ముందు గత ఏప్రిల్‌లో విచారణకు వచ్చింది. లాయర్ల తరఫున లిఖితపూర్వక వాదనలు దాఖలు చేశారు. లాయర్లపై పోలీసులు దాడిచేసినట్లు, లాయర్లది ఎలాంటి తప్పులేదని తెలిపారు. ఈ ఘర్షణ జరిగినప్పుడు అన్నింటినీ ఓ లాయరుగా తాను కూడా చూసినట్లు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్‌కుమార్ చెప్పారు. అనంతరం తీర్పును తేదీ తెలపకుండా వాయిదా వేశారు. ఈ కేసులో పోలీసులు, లాయర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. కేసు దర్యాప్తు సీబీఐ కొనసాగించవచ్చని ఉత్తర్వులు ఇచ్చారు.

సచివాలయం ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు సరికాదు

చెన్నై, న్యూస్‌టుడే: సచివాలయం ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానం సరికాదని తమిళనాడు సచివాలయం సంఘం అధ్యక్షుడు వెంకటేశన్, సంయుక్త కార్యదర్శి లెనిన్ తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన లేఖలో... మానవవనరుల నిర్వహణశాఖ 24వ తేది నుంచి ఆ శాఖలో పని చేసే సచివాలయం ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేసిందన్నారు. తమిళనాడు సచివాలయం సంఘం నిర్వాహకులతో చర్చిస్తే ఆ విధానం అమలులోని లోపాలు తెలుసుకోవచ్చనే కనీస ఆలోచన మానవవనరుల నిర్వహణశాఖకు లేదని విమర్శించారు. సచివాలయం ఉద్యోగుల్లో సెక్షన్ అధికారి స్థాయి వరకే హాజరు పట్టికలో సంతకం చేయాలనే నిబంధన ఉన్నా ప్రస్తుత బయోమెట్రిక్ హాజరు విధానంలో ఐఏఎస్ స్థాయి మినహా అన్ని స్థాయిల్లోని ఉద్యోగులూ, అదనపు కార్యదర్శి నుంచి రిజిస్టర్ రైటర్ వరకు అందరినీ తీసుకొచ్చారని తెలిపారు. ఇది పూర్తిగా సచివాలయం కార్యాలయ నియమావళికి విరుద్ధమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని మానవవనరుల నిర్వహణ శాఖకు తగిన సూచనలు అందించాలని కోరారు.

టీవీకేలో చేరటం ఆత్మహత్యతో సమానం: సెమ్మలై

సైదాపేట, న్యూస్‌టుడే: సెంగోట్టైయన్ టీవీకేలో చేరటం ఆత్మహత్యతో సమానమని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెమ్మలై తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఎవరు ఎవరికి రాజకీయ పాఠాలు చెబుతారో వేచి చూద్దామన్నారు. కొంగుమండలంలో అన్నాడీఎంకేకు ఎలాంటి నష్టం ఉండదని, ఎడప్పాడి పళనిసామి కంటికి రెప్పలా కాపాడుతున్నారని పేర్కొన్నారు. పండుటాకు రాలితే చెట్టుకు నష్టం ఉండదని, సెంగోట్టయన్ విషయమూ అలాంటిదేనని తెలిపారు.

చివరి ప్రాంతాలకు సాగునీరు

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా తామరభరణి, కరుమేనియారు, నంబియారు నది అనుసంధాన పథకంలో భాగమైన వరద నీటి కాలువ నుంచి స్పీకర్ అప్పావు గురువారం నీటిని విడుదల చేశారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2009లో తామరభరణి నదిలో వృథాగా సముద్రంలో కలిసే నీటిని నాంగునేరి, రాధాపురం, సాత్తాన్‌కుళం వంటి చివరి ప్రాంతాలకు మళ్లించేందుకు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో నీటి కాలువ నిర్మాణం ప్రారంభించగా 2011లో పాలన మారాక ఆగిపోయిందన్నారు. ఎంకె స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.1060 కోట్లు కేటాయించి పూర్తి చేశారని పేర్కొన్నారు. రాష్ట్రం శాంతికి నెలవు అని, ఇక్కడ చదువుకున్న ప్రజలు అధికంగా ఉన్నారన్నారు.

నీటిని విడుదల చేస్తున్న శాసనసభాపతి అప్పావు

కేంద్రాన్ని వ్యతిరేకించే ధైర్యముందా?: మంత్రి రఘుపతి

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్రాన్ని వ్యతిరేకించే దమ్ములేని ద్రోహి ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి అని మంత్రి రఘుపతి ధ్వజమెత్తారు. ఆయన తన లేఖలో... ఈరోడులో మాట్లాడిన ముఖ్యమంత్రికి ఎడప్పాడి పళనిసామి సమాధానం చెప్పలేక 'ఎక్స్' పేజీలో ఇష్టానుసారం ట్వీట్లు చేస్తున్నారని తెలిపారు. మోదీ సర్కారు తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు మద్దతు పలికిన ఆయనకు పంట బీమా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వరి సేకరణ తేమస్థాయిని పెంచని కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి దమ్ము, ధైర్యంలేని ద్రోహి అని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు మోసపోతారా అని ప్రశ్నించారు. మదురై టంగ్‌స్టన్ గనులు ఏర్పాటుకు కారణమైన ఖనిజ సంపద చట్టాన్ని పార్లమెంట్‌లో స్వాగతించి రాష్ట్రానికి ద్రోహం చేశారన్నారు. 11 ఎన్నికల్లో వరుసగా ఓడిన ఆయనకు ప్రజలు ఇచ్చిన సమాధానం తెలియలేదా అన్నారు. ఆయన హయాంలో శంకుస్థాపన చేసిన మదురై ఎయిమ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చే దమ్ము లేకపోయినందుకు సిగ్గుపడాలన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలకు అడ్డుకట్ట

■ పదేళ్లుగా స్టీల్ సీసాలు ఉపయోగిస్తున్న విద్యార్థినులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను దృష్టిలో పెట్టుకుని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు స్టీల్ నీటి సీసాలు మాత్రమే ఉపయోగిస్తున్నారు. పుదుక్కోట్టై జిల్లా కీరమంగళం ప్రభుత్వ బాలిక మహోన్నత పాఠశాలలో సుమారు 1000 మంది చదువుతున్నారు. ప్లాస్టిక్ భూమిలో కరిగేందుకు చాలా ఏళ్లు పడుతుందని, పర్యావరణం, జలవనరులకు, వివిధ జీవులకు హాని కలుగుతుందన్న ఉపాధ్యాయులు మాట విని విద్యార్థినులు మేల్కొన్నారు. తమవంతుగా పదేళ్లుగా తాగునీటికి స్టీల్ సీసాలను మాత్రమే ఉపయోగిస్తున్నారు. పాఠశాలలోని ప్రతి ఒక్క విద్యార్థిని ఈ నియమాన్ని పాటిస్తున్నారు. వారిని చూసిన జిల్లా యంత్రాంగం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇదే విధానం అనుసరించాలని నాలుగేళ్ల కిందట ఉత్తర్వు జారీ చేసింది. ఈ పాఠశాలలో చదివిన పలువురు వైద్యులు, ఇంజినీర్లుగా ఉన్నతస్థానాల్లో ఉన్నారు.

స్టీల్ నీటి సీసాలతో విద్యార్థినులు

మూషిక వాహనంపై వినాయకస్వామి ● శేష వాహనంపై చంద్రశేఖరస్వామి ● పంచమూర్తుల వాహనాలు

శేష వాహనంపై భక్తులకు ఆభయం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: అరుణాచలేశ్వర ఆలయంలో కార్తిక దీపోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వినాయక స్వామికి అభిషేక, దీపారాధనలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి మూషిక వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామికి అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. శేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాత్రి పంచమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహాదీపం వెలిగించడానికి లోహపాత్ర సిద్ధం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో జరుగుతున్న కార్తిక దీపోత్సవాల్లో భాగంగా డిసెంబరు 3వ తేదీ 2,668 అడుగుల ఎత్తైన కొండపై మహాదీపాన్ని వెలిగించనున్నారు. ఇందుకోసం 10 అడుగుల ఎత్తు, 5 అడుగుల చుట్టుకొలతతో ఉన్న పెద్ద లోహపు పాత్రను సిద్ధం చేశారు. ఆ పాత్రకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిని డిసెంబరు 3వ తేదీలోగా కొండపైకి తీసుకెళ్లనున్నారు.

(c) eenadu

విజేతలతో మంత్రి సామినాథన్ తదితరులు

ఉంగళుడన్ స్టాలిన్ విజేతలకు పతకాలు ప్రదానం

చెన్నై, న్యూస్‌టుడే: 'ఉంగళుడన్ స్టాలిన్' పోటీల విజేతలకు మంత్రి సామినాథన్ పతకాలు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. జులై 15 నుంచి అమలులో ఉన్న 'ఉంగళుడన్ స్టాలిన్' పథకం ప్రజాజీవితంలో తీసుకొచ్చిన ఆలోచనలు, మార్పులపై ప్రజల భావోద్వేగాలను తెలుసుకునేలా పోటీలను సమాచార ప్రజా సంబంధాలశాఖ కింద కొనసాగే మీడియా సెంటర్ నిర్వహించింది. 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారాలు ద్వారా నిర్వహించిన పోటీల్లో 4,732 మంది పాల్గొన్నారు. 36 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వారిని సమాచారశాఖ మంత్రి సామినాథన్ గురువారం పిలిపించి అభినందించారు. పతకాలు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

సీమాన్‌పై డీఐజీ దాఖలు చేసిన పరువునష్టం దావా కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుచ్చి రేంజ్ డీఐజీగా ఉన్న వరుణ్‌కుమార్ తనపై, తన కుటుంబీకులపై సీమాన్ ప్రేరణతో ఆ పార్టీ నేతలు సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా పోస్టు చేస్తున్నారని తిరుచ్చి కోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. దీనిని రద్దు చేయాలని, విచారణకు నిషేధం విధించాలని సీమాన్ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ఇదివరకు విచారణకు వచ్చినప్పుడు సీమాన్‌పై పరువునష్టం దావా విచారణకు మధ్యంతర స్టే విధించింది. ఈ నేపథ్యంలో సీమాన్‌పై డీఐజీ వరుణ్‌కుమార్ దాఖలు చేసిన పరువునష్టం దావా కొట్టివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

కల్పాక్కం అణు విద్యుత్తు కేంద్రంలో ఉత్పత్తి పునఃప్రారంభం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా కల్పాక్కంలోని అణు విద్యుత్తు కేంద్రంలో 220 మెగావాట్ల సామర్థ్యమున్న రెండు ఉత్పత్తి యూనిట్లు పనిచేస్తున్నాయి. 2018లో యూనిట్-1లో సాంకేతిక లోపం తలెత్తింది. మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడటంతో ఇప్పటి వరకు ఆ యూనిట్ పనిచేయలేదు. ఈ క్రమంలో యూనిట్-2లో కూడా సాంకేతిక లోపం ఏర్పడటంతో ఈ ఏడాది జనవరి 31వ తేదీ నుంచి ఉత్పత్తిని నిలిపేశారు. లోపాన్ని సరి చేసిన తరువాత మార్చి 2న ఉత్పత్తి తిరిగి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో వార్షిక నిర్వహణ పనుల కోసం సెప్టెంబర్ 1న ఉత్పత్తిని నిలిపేశారు. పనులు పూర్తికావడంతో బుధవారం నుంచి ఉత్పత్తి పునఃప్రారంభమైందని కేంద్రం అధికారులు తెలిపారు.

తమిళనాడులో భాజపా బిహార్ ఫార్ములా!

✦ టీటీవీ, ఓపీఎస్‌ను చేర్చుకునేందుకు ఈపీఎస్ అంగీకారం? ✦ దళితుల ఓట్లు రాబట్టేందుకు వ్యూహం

- న్యూస్‌టుడే, సైదాపేట

ఎడప్పాడి పళనిసామి ● టీటీవీ దినకరన్ ● ఒ.పన్నీర్‌సెల్వం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫార్ములాను భాజపా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే భారీ విజయం సాధించింది. ఇందులో విశేషం ఏంటంటే నీతీశ్ కుమార్‌తో అభిప్రాయ బేధాలు ఉన్నవారిని కూడా ఎన్డీయేలోకి తీసుకురావడమే. అదే తరహాలో 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామితో పొసగని (టీటీవీ, ఓపీఎస్ తదితరుల)ను ఎలాగైనా కూటమిలోకి తీసుకొచ్చేందుకు భాజపా పెద్దలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క దళితుల ఓట్ల కోసం దళిత పార్టీల నేతలందరినీ ఏకం చేసేందుకు దిల్లీ పెద్దలు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

రాయబారిగా జీకే వాసన్

ఇదిలా ఉండగా ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ఎన్డీయేలోకి వచ్చేందుకు ఈపీఎస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల సేలంలో పళనిసామిని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ భాజపా రాయబారిగానే కలిసినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఎన్డీయేలోని పార్టీలన్నీ కలిసి డీఎంకేకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసేందుకు గతంలో నిర్ణయించాయి. ఇంతవరకు అది జరగలేదు. దీని గురించి జీకే వాసన్ చర్చించినట్లు తెలుస్తోంది. అప్పుడు టీటీవీ దినకరన్ ప్రస్తావన రాగా.. దినకరన్‌తో తాను ఢీకొట్టలేదని, ఆయనే నన్ను రెచ్చగొడుతున్నారని ఈపీఎస్ చెప్పినట్లు సమాచారం. టీటీవీని పార్టీలో చేర్చుకోవడం సాధ్యం కాదని, అలాగే ఎన్డీయే నుంచి ఆయన వైదొలగడంలో తన ప్రమేయం లేదని ఈపీఎస్ చెప్పినట్లు తెలుస్తోంది. ఆయన్ను ఎన్డీయేలో చేర్చుకుని భాజపాకు కేటాయించే సీట్లలో అంతర్గతంగా కేటాయించడానికి అభ్యంతరం లేదని, అలాగే ఓపీఎస్ కూడా వచ్చేలా ఉంటే పిలుచుకోండని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని జీకే వాసన్ భాజపా పెద్దలకు చేరవేసినట్లు సమాచారం. దీంతోనే అన్నాడీఎంకేను భాజపా అదనపు సీట్లు కోరేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఈపీఎస్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించమని చెప్పిన టీటీవీ దినకరన్‌ను భాజపా ఎలా ఒప్పిస్తుందో వేచిచూడాలి.

పుదియ తమిళగం అధినేత కృష్ణసామి ● తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం అధ్యక్షుడు జాన్ పాండియన్ ● తమిళ మానిల బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి పొర్కొడి

ముందు వరుసలో వీసీకే

అలాగే దళితుల ఓట్లు పొందేందుకు భాజపా వ్యూహాలు రచిస్తోంది. బిహార్‌లో కూడా దళిత సామాజిక వర్గాలను భాజపా ఏకం చేసింది. అదే యుక్తిని తమిళనాడులో ప్రయోగించాలని యోచన. ఇక్కడ దళితుల మద్దతు అత్యధికంగా వీసీకేకు ఉంది. అయితే వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ భాజపా వ్యతిరేకి కావటంతో పాటు డీఎంకే కూటమిలో ఉన్నారు. కావున వీసీకే మినహా మిగతా దళిత పార్టీలను ఏకం చేసే ఆలోచనలో భాజపా ఉంది. ఆ ప్రకారం ఉత్తర చెన్నైలో వీసీకే ఆధిపత్యం చెలాయించే సామాజికవర్గ పరిధిలోనే ఉండే పార్టీ ప్రాతిపదికన దివంగత ఆర్మ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడి ప్రారంభించిన తమిళ మానిల బహుజన్ సమాజ్ పార్టీ, తమిళరసన్‌కు చెందిన ఇండియా కుడియరసు కట్చి, పూవై జగన్ - పురట్చి భారతం కట్చి, కృష్ణసామి - పుదియ తమిళగం, జాన్ పాండియన్ - తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం తదితర పార్టీలను కూటమిలోకి తీసుకొచ్చి దళితుల ఓట్లు పొందాలన్నదే భాజపా దిల్లీ పెద్దల ఆలోచనగా తెలుస్తోంది. భాజపా బిహార్ ఫార్ములా తమిళనాడులో విజయవంతం అవుతుందో? లేదో? వేచి చూడాలి.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శికి శాంసంగ్ కార్మికుల వినతి

షణ్ముగానికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: సంఘం ఏర్పాటు చేసినందుకు ఉద్యోగం నుంచి తొలగించిన తమ వ్యవహారంలో పరిష్కారం చూపాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగానికి శాంసంగ్ కార్మికులు వినతిపత్రం అందించారు. కాంచీపురం జిల్లా సుంకువార్‌చత్రంలోని శాంసంగ్ యూనిట్‌లో సంఘం ఏర్పాటు చేసినందుకు 27 మందిని ఆ కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించింది. సంస్థకు చెందిన విడిభాగాల తయారీ కంపెనీ ఎస్.ఎస్. ఎలక్ట్రానిక్స్‌లోనూ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసిన 93 మందిని డిస్మిస్ చేశారు. తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ 8 నెలలుగా బాధితులు పోరాడుతున్నారు. దానికి పరిష్కారం కానరాని నేపథ్యంలో శాంసంగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ముత్తుకుమార్ అధ్యక్షతన గురువారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగాన్ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోనున్నట్లు షణ్ముగం భరోసా ఇచ్చారు.

పురాతన వెండి నాణెం లభ్యం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా బన్రుట్టి సమీపంలో తెన్ పెన్నై నది తీరంలో కళాశాల విద్యార్థులు చేపట్టిన పురావస్తు తవ్వకాల్లో మొదటి రాజరాజచోళన్ కాలంలో వాడుకలో ఉన్న వెండి నాణెం లభ్యమైంది. 4.35 గ్రాముల బరువున్న ఈ నాణెం ఓవైపు పుష్పాన్ని చేతిలో పట్టుకొని ఉన్న వ్యక్తి రూపం, అతని ఎడమ పక్కన నాలుగు పుత్తాలు ఉన్నాయి. కుడి పక్కన త్రిశూలం, దీపం ఉన్నాయి. మరో వైపు ఓ వ్యక్తి కుడి చేతిలో శంఖం పట్టుకొని కూర్చుని ఉన్నాడు. అతని ఎడమ చేతి కింద దేవనాగరి లిపిలో శ్రీ రాజరాజ్ అని రాసి ఉంది. చోళుల కాలం నాటి వెండి నాణెం లభించడం ఇదే మొదటిసారని చరిత్ర పరిశోధకుడు ఇమ్మానువేల్ తెలిపారు.

వెలుగుచూసిన నాణెం

డీఎంకే ఎంపీల సమావేశం 29న

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన 29(శనివారం)న ఆ పార్టీ ఎంపీల సమావేశం జరగనుందని ప్రధానకార్యదర్శి దురైమురుగన్ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు చెన్నైలోని అన్నా అరివాలయంలో జరగనుందని తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

వడపళని, న్యూస్‌టుడే: ఈస్టర్న్ రైల్వే అసన్‌సోల్ డివిజన్‌లోని దుర్గాపూర్‌లో ఇంటర్‌లాకింగు పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లించినట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. ● 15629 తాంబరం-సిల్చార్ టౌన్ నాగోన్ ఎక్స్‌ప్రెస్ 18.40 రైలు డిసెంబరు 1, 8, 15, 22, 29 తేదీలు అసన్‌సోల్, అండల్, సైన్‌థియా మీదుగా వెళ్తుంది. ● 15630 సిల్చార్ టౌన్-తాంబరం 28, డిసెంబరు 5, 12, 19, 26 తేదీలు 10.50 రైలు సైన్‌థియా, అండల్, అసన్‌సోల్ మార్గంగా నడుస్తుంది. ● 15929 తాంబరం-న్యూటిన్‌సుకియా 27 డిసెంబరు 4, 11, 18, 25 తేదీలు 18.40 రైలు అసన్‌సోల్, అండల్, సైన్‌థియా మీదుగా దారి మళ్లించారు. ● 15930 న్యూటిన్‌సుకియా-తాంబరం డిసెంబరు 1, 8, 15, 22, 29 తేదీలు 06.30కి బయలుదేరే రైలు సైన్‌థియా, అండల్, అసన్‌సోల్ మార్గంగా వస్తుంది. ● 22611 చెన్నై సెంట్రల్-న్యూ జల్‌పాయ్‌గురి డిసెంబరు 3, 10, 17, 24, 31 తేదీల్లో 10.45కి బయలుదేరే రైలు అసన్‌సోల్, అండల్, సైన్‌థియా మీదుగా వెళ్తుంది. ● 22612 న్యూ జల్‌పాయ్‌గురి-చెన్నై సెంట్రల్ 28, డిసెంబరు 5, 12, 19 23 తేదీలు 22.05కి నడిచే రైలు సైన్‌థియా, అండల్, అసన్‌సోల్ మార్గంగా దారి మళ్లించారు.

పులుల గణనకు కెమెరాల ఏర్పాటు

ఆటోమేటిక్ కెమెరాలు అమరుస్తున్న అటవీశాఖ సిబ్బంది

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ముదుమలై, మసినకుడి ప్రాంతాల్లో పులుల గణన ఆటోమేటిక్ కెమెరాలు అమర్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదటిసారిగా 391 ప్రాంతాలలో 782 ఆటోమేటిక్ కెమెరాలు అమర్చే పనులు జరుగుతున్నాయి. ముదుమలై టైగర్ రిజర్వు పరిధిలోని తెప్పకాడు, కార్కుడి, ముదుమలై, నెలక్కోట్టై అటవీ సర్కిల్, మున్‌గల్ అటవీ సిబ్బందికి పులుల గణనకుగాను ఆటోమేటిక్ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముదుమలై టైగర్ రిజర్వులో 140, మసినకుడి డివిజన్‌లో 251 ప్రాంతాలలో తలా రెండు చొప్పున 782 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీని గురించి అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... కెమెరాలు అమర్చే పనులు పూర్తయిన తర్వాత 30 రోజులలో వాటిల్లో నమోదవుతున్న ఫొటోలను డౌన్‌లోడ్ చేసి, వాటి ఆధారంగా పులుల గణన నిర్వహిస్తామని చెప్పారు. ఇది పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతున్నందున ఫలితాలు కచ్చితంగా ఉంటాయని పేర్కొన్నారు.

ప్రధానికి 300 పేజీల వినతి

తపాలా ద్వారా పంపిన శ్రీలంక తమిళులు

వేలూరు, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని మిన్నూరు, చిన్నపల్లి కుప్పం తదితర గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో ఉంటున్న 245 శ్రీలంక తమిళుల శరణార్థుల కుటుంబాలు గురువారం ప్రధానమంత్రికి 300 పేజీల వినతిని తపాలాలో పంపించారు. శ్రీలంక తమిళులు అక్రమ వలసదారులు కాదని పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడంపై కృతజ్ఞతలు తెలిపారు. భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, ఉన్నత విద్య, ఉపాధి, ఓటు హక్కు వంటి వాటిని అందించాలని విన్నవించారు.

రాష్ట్రస్థాయి విజేతలను ప్రకటించిన రాజ్‌భవన్

చెన్నై, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు తమిళం, ఆంగ్లం విభాగాల్లో వ్యాసరచన పోటీలను రాజ్‌భవన్ నిర్వహించగా ప్రస్తుతం విజేతలను ప్రకటించింది. 6 నుంచి 9వ తరగతి వరకు పోటీల్లో తొలి మూడు స్థానాలు, ప్రత్యేక బహుమతుల విభాగం కింద 15 మందిని ఎంపిక చేసింది. తొలి బహుమతికి చెన్నై రెడ్‌హిల్స్‌కు చెందిన ఎం.కిరుత్తికా, కడలూర్ జిల్లా పణ్రుట్టికి చెందిన ఏ.గిరిరాజ్ ఎంపికయ్యారు. ● పదో తరగతి నుంచి 12వ తరగతి వరకు నిర్వహించిన పోటీల్లో తొలి బహుమతికి తిరువారూర్ జిల్లా మడపురానికి చెందిన దర్శిత, చెన్నై పుళల్‌కు చెందిన జ్యోతి శర్మ, రెండో బహుమతికి చెన్నై రెడ్‌హిల్స్‌కు చెందిన హేమరాగిని, దిల్లీకి చెందిన ఎం.మీనాక్షి, మూడో బహుమతికి చెన్నై కోపూర్‌కు చెందిన రామకృష్ణన్, మదురై జిల్లా ఏళుమలైకు చెందిన అళగుపాండి, కడలూర్ జిల్లా పణ్రుట్టికి చెందిన సంధ్య ఎంపికయ్యారు. ● కళాశాల విద్యార్థుల విభాగంలో తొలి బహుమతికి తిరువణ్ణామలై జిల్లా కరియాంతల్‌కు చెందిన మతుషా, చెంగల్పట్టుకు చెందిన నివేద, రెండో బహుమతికి చెన్నైకు చెందిన ఎం.ముఖిల, తిరునెల్వేలి జిల్లా వడకన్‌కుళానికి చెందిన ఆక్సీ, మూడో బహుమతికి తేని జిల్లా పెరియకుళానికి చెందిన శ్రీదుర్గ, చెన్నై మీనంబాక్కానికి చెందిన జమున ఎంపికయ్యారు. ● తొలి, రెండో, మూడో బహుమతులు గెలుచుకున్నవారికి వరుసగా రూ.50వేలు, రూ.30 వేలు, రూ.25వేలు చొప్పున నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు, ప్రత్యేక బహుమతులు పొందిన వారికి ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నట్లు రాజ్‌భవన్ వెల్లడించింది. వచ్చే ఏడాది జనవరి 26న రాజ్‌భవన్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది.

మాజీ ఎంపీని కలిసిన సీఎం

మాజీ ఎంపీ విడుదలై విరుంబితో మాట్లాడుతున్న స్టాలిన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోవై సుందరాపురం ఎస్ఐసీ కాలనీలో మాజీ ఎంపీ విడుదలై విరుంబిను ముఖ్యమంత్రి స్టాలిన్ కలిశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఈరోడ్‌లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం చెన్నై వెళ్లేందుకు సీఎం కోయంబత్తూరు చేరుకున్నారు. అక్కడ ఊహించని విధంగా మాజీ ఎంపీ ఇంటికి వెళ్లారు. డీఎంకే ప్రచార కార్యదర్శిగా, మాజీ ఎంపీగా వ్యవహరించిన ఆయన ప్రస్తుతం వృద్ధాప్యం కారణంగా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పంపిన లేఖలను విడుదలై విరుంబి స్టాలిన్‌కు చూపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వాటిని చదివారు. ఆయన మనవరాలితో కాసేపు కబుర్లు చెప్పారు. వారివెంట మాజీ మంత్రి సెందిల్‌బాలాజీ, మంత్రి ఇ.వి.వేలు తదితరులు ఉన్నారు.

పోలీసు కస్టడీకి సామూహిక అత్యాచారం కేసు నిందితులు

నిందితుడిని స్ట్రెచర్‌పై తీసుకొచ్చిన పోలీసులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో అరెస్టైన ముగ్గురిని విచారణ చేసేందుకు ఒకరోజు పోలీసు కస్టడీకి కోయంబత్తూరు మహిళా కోర్టు అనుమతి మంజూరు చేసింది. అత్యాచారం కేసులో తవశి, సతీశ్, కార్తిక్ అరెస్టై కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉన్నారు. కేసులో నెలలోపు ఛార్జిషీట్ దాఖలు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటికే ఆదేశించారు. కస్టడీ విషయమై పోలీసులు కోయంబత్తూరు అదనపు మహిళా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఉదయం న్యాయమూర్తి సింధు ఎదుట పిటిషన్ విచారణకు రాగా ముగ్గురిని భారీ పోలీసు భద్రత నడుమ అంబులెన్స్‌లో తీసుకొచ్చి హాజరుపరిచారు. ఒకరోజు కస్టడీకి అనుమతి మంజూరు చేశారు. శుక్రవారం సాయంత్రం 4గంటలకు వారిని కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. నిందితులను స్ట్రెచర్, వీల్ చైర్‌లలో కోర్టుకు తీసుకొచ్చారు.

సముద్రపు అలల్లో చిక్కుకున్న యువకుడు

కాపాడిన జాలర్లు

యువకుడిని కాపాడి తీసుకొస్తున్న దృశ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: సముద్రపు అలల్లో చిక్కుకున్న యువకుడిని జాలర్లు రక్షించారు. చెన్నై నీలాంగరై వద్ద సముద్రంలో స్నానానికి దిగిన ఓ యువకుడు అలల్లో చిక్కుకుని కిలోమీటరు దూరం వెళ్లాడు. గమనించిన జాలర్లు ఈదుకుంటూ వెళ్లి యువకుడిని రక్షించి తీరానికి తీసుకొచ్చారు. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తులో అతను నామక్కల్‌కి చెందిన జశ్వంత్ అని తెలిసింది.

నటరాజస్వామి సేవలో మలయాళ నటుడు జయరామ్

ఆలయంలో జయరామ్ దంపతులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ప్రముఖ మలయాళ సినీనటుడు జయరామ్ దంపతులు గురువారం ఉదయం చిందబరం నటరాజ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వారికి ఆలయ దీక్షితుల తరఫున మర్యాదలు చేశారు. జయరామ్ కనకసభపై నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. తరువాత వారికి ఆలయం తరఫున తీర్థప్రసాదాలు అందజేశారు.

కృష్ణగిరి జిల్లాలో రాగి కొనుగోలు కేంద్రాలు

నేటి నుంచి ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లాలో నేటి(శుక్రవారం) నుంచి రాగి కొనుగోళ్లు ప్రారంభమవనున్నాయి. తమిళనాడు పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా కుప్పచ్చిప్పారై, మదకొండపళ్ళి, సామనప్పళ్ళి, బాగలూర్, బేరిపై సహకార ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల భవనాల్లో రాగి కొనుగోలు చేయనున్నారు. ప్రభుత్వం కిలో రూ.48 చొప్పున కొనుగోలు ధర నిర్ణయించింది. రాళ్లు, మట్టి లేకుండా శుభ్రంగా ఉండాలని అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు తిరిగి 2.30 నుంచి సాయంత్రం 6.30 వరకు పని చేస్తాయి. నగదు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

వేలూరు న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని వేలూరు కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో గురువారం ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్లపై పడే చెట్లను వెంటనే తొలగించి, బాధిత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిత్యావసరాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

● **అరక్కోణం:** రాణిపేట జిల్లాలో 29, 30 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ చంద్రకళ నేతృత్వంలో బుధవారం సాయంత్రం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రోడ్ షోలో నిబంధనలు పాటించాలి

పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలోనూ కరూర్ తరహా ఘటన జరిగే అవకాశం ఉందని మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. పుదుచ్చేరి భువనేశ్వరి ఆలయంలో గురువారం ఆయన అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. టీవీకే సభకు అనుమతి అడిగిన నేపథ్యంలో పాలకులు సమాధానం చెప్పాలన్నారు. తమిళనాడులో రోడ్‌షోకు విధించిన నిబంధనలు పుదుచ్చేరిలోనూ అమలుచేసి రద్దీని నియంత్రించాలని కోరారు. లేదంటే దుర్ఘటనలకు అవకాశం ఉందన్నారు. టీవీకే, కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. రంగసామి భాజపా కూటమి నుంచి బయటకు వెళ్లరని తెలిపారు. అలా జరిగితే మరుక్షణమే బిహార్ జైల్లో ఉంటారన్నారు. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు.

పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ప్రపంచ సైకిల్‌యాత్ర

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోటి మొక్కలు నాటించాలని సదుద్దేశంతో ఐదేళ్లుగా ప్రపంచమంతా సైకిల్ యాత్ర చేస్తున్నానని తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో యాత్రలో భాగంగా పర్యటిస్తున్న అతడికి ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తెదేపా మండల అధ్యక్షుడు స్వామిదాస్ ఘన స్వాగతం పలికారు. అతడి కృషిని అభినందించారు.

కవిన్ పరువు హత్య కేసులో ఎస్సై బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: కవిన్ పరువు హత్య కేసులో అరెస్టయిన సుర్జిత్ తండ్రి బెయిల్ పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తీర్పుని వాయిదా వేసింది. తిరునెల్వేలికి చెందిన కవిన్ ఈ ఏడాది జులైలో పరువుహత్యకు గురయ్యాడు. ఈ కేసులో సుర్జిత్, అతని తండ్రి సబ్ ఇన్‌స్పెక్టరు అయిన శరవణన్, తల్లిని నిందితులుగా చేర్చారు. వారిలో అరెస్టయిన ఎస్సై శవరణన్ బెయిల్ కోరుతూ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో శరవణన్ ఘటన జరిగిన రోజున సెలవులో ఉన్నాడని, కవిన్ మృతదేహాన్ని అతను చూసినందుకు ఆధారాలు ఉన్నాయని, బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం చూపుతుందని సీబీసీఐడీ తరఫున అభ్యంతరం తెలిపారు. అన్ని తరఫుల వాదనలు విన్న జస్టిస్ మురళి శంకర్.. తీర్పుని తేదీ తెలుపకుండా వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

TUDA APPROVED Plots available with all Modern Amenities & Ready to Construction Suitable for Commercial Building for more Rental Purpose at Sri City TADA, Tirupati (Dist). 99592 21918.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆96402 58899, 96404 68899.

క్రైస్తవులకు స్థలం కేటాయించాలి

శోళింగర్, న్యూస్‌టుడే: శోళింగర్ బస్టాండు వద్ద అఖిల భారత జస్టిస్ ప్రజా పార్టీ, గ్లోబల్ క్రిస్టియన్ చర్చ్ ఆఫ్ ఇండియా సినెట్ తరఫున ఆందోళన కార్యక్రమం గురువారం జరిగింది. పార్టీ స్థాపకుడు ఐసక్ అధ్యక్షత వహించారు. క్రైస్తవులకు 10.5 శాతం స్థలం కేటాయించాలని, రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ ఆపేయాలని, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో షిఫ్ట్ పద్ధతిలో తరగతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బాలల సంక్షేమం-సేవా పురస్కారాలు ప్రదానం

ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పురస్కార గ్రహీతలు

చెన్నై, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమం, మహిళా సాధికారతశాఖలో బాలల సంక్షేమం, పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేసిన సంస్థలు, జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కు 2025వ ఏడాది బాలల సంక్షేమం-సేవా పురస్కారాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రదానం చేశారు. సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో తంజావూర్‌లోని అన్నై సత్య అమ్మైయార్ స్మారక ప్రభుత్వ జువైనల్ హోమ్, తూత్తుకుడిలోని సెయింట్ మరియన్నై కరుణై ఇల్లం, చెన్నైలోని ప్రభుత్వ అబ్జర్వేషన్ హోమ్, రామనాథపురంలోని జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ పురస్కారాలు, నగదు బహుమతిగా రూ.లక్ష చొప్పున బ్యాంకు చెక్కులు అందించారు.

దేవాదాయశాఖ పనులకు శంకుస్థాపన

చెన్నై: హిందూ దేవాదాయ, ధర్మాదాయశాఖ తరఫున రూ.79.94 కోట్లతో రాష్ట్రంలో 18 ఆలయాల్లో చేపట్టనున్న 24 కొత్త పథక పనులు, ఓ కళాశాలలో ఇండోర్ స్టేడియం వంటి పనులకు సచివాలయం నుంచి ముఖ్యమంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. రూ.6.77 కోట్లతో 5 ఆలయాల్లో పూర్తయిన 4 పథక పనులు, కళాశాల ప్రయోగశాల, ఈవో నివాసాలు, 13 పర్యవేక్షకుల కార్యాలయాలనూ ప్రారంభించారు.

బీసీ, ఎంబీసీ సంక్షేమశాఖ తరఫున..

చెన్నై: బీసీ, ఎంబీసీ, మైనారిటీల సంక్షేమశాఖ తరఫున రూ.10.79 కోట్లతో నిర్మించిన భవనాలను సచివాలయం నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు. రూ.38.85 కోట్లతో నిర్మించనున్న సామాజికన్యాయ కళాశాల విద్యార్థుల వసతిగృహాలకు శంకుస్థాపన చేశారు. కారుణ్య ప్రాతిపదికన 50 మంది వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించారు. తమిళనాడు వక్ఫ్ బోర్డుకు అవసరమైన 9 మసీదులు, దర్గాల మరమ్మతు పనులకు ప్రభుత్వ రాయితీ కింద తొలివిడతగా రూ.4.45 కోట్ల బ్యాంకు చెక్కులను సంబంధిత మసీదుల యంత్రాంగాలకు అందించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

చెన్నై: సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రిని రైతులు, వ్యాపారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కడలూర్ జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ తాలూకాలోని 38 రెవెన్యూ గ్రామాల సాగు విస్తీర్ణాన్ని కావేరి డెల్టా ప్రాంతంగా ఇటీవల ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో గురువారం వ్యవసాయశాఖ మంత్రి ఎం.ఆర్.కె.పన్నీర్‌సెల్వం సమక్షంలో ముఖ్యమంత్రిని కాట్టుమన్నార్‌కోయిల్ ఎమ్మెల్యే సింతనైసెల్వన్, ఆ ప్రాంత రైతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడు వణిగర్ సంఘంగళిన్ పేరమైప్పు రాష్ట్ర అధ్యక్షుడు విక్రమరాజా నేతృత్వంలోని బృందం కూడా స్టాలిన్‌ను కలిసింది. వ్యాపారుల సంక్షేమబోర్డు సభ్యుల చేరికను పెంచినందుకు, పురపాలక సంస్థల తరఫున చేపట్టే నిర్మాణాల్లో వ్యాపారులకు దుకాణాలు కేటాయించడానికి, వ్యాపారుల సంక్షేమ పరిరక్షణకు పలు పథకాలను అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

(c) eenadu

రజనీకాంత్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వైజయంతిమాల బాలి

వైజయంతిమాల బాలికి శ్రీమతి వైజీపీ పురస్కారం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రసిద్ధ విద్యావేత్త డాక్టర్ శ్రీమతి వైజీపీ శతజయంతి వేడుకలు చెన్నై త్యాగరాయర్ నగర్‌లోని వాణీ మహల్‌లో బుధవారం సాయంత్రం జరిగాయి. ఇందులో రజనీకాంత్ ప్రత్యేక అతిథిగా పాల్గొని కల్చరల్ ఎక్సలెన్స్ కోసం డాక్టర్ శ్రీమతి వైజీపీ పురస్కారాన్ని అలనాటి అందాల తార వైజయంతిమాల బాలికి అందించి సత్కరించారు. కల్యాణి వెంకట్రామన్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని వెంకట్రామన్ ఏర్పాటు చేయడం గమనార్హం. డాక్టర్ శ్రీమతి వైజీపీతో సుదీర్ఘ కాలం పనిచేసిన సుందరి శంకరన్, చంద్ర రమణి, విజి కన్నన్‌లను కార్యక్రమంలో సత్కరించారు. కార్యక్రమంలో నృత్య కళాకారిణి డాక్టర్ పద్మా సుబ్రమణియం, వేల్స్ విద్య గ్రూపుల ఛైర్మన్ డాక్టర్ ఐషరి కె.గణేశ్, వయొలిన్ కళాకారుడు లాల్గుడి కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఐషరి కె.గణేశ్‌తో చేతులు కలిపిన దర్శకుడు విజయ్

చెన్నై: డాక్టర్ కె.ఐషరి గణేశ్‌కు చెందిన వేల్స్ ఫిలిమ్ ఇంటర్నేషనల్‌తో దర్శకుడు విజయ్‌కు చెందిన 'డి' స్టూడియోస్ పోస్ట్ చేతులు కలిపింది. చెన్నై నగరంలో జరిగిన కార్యక్రమంలో దీని గురించి దర్శకుడు విజయ్ మాట్లాడుతూ... సినిమా నిర్మాణంలోని కొన్ని రంగాల్లో ముంబయి ఎలా ముందంజలో ఉందనే విషయాన్ని కొన్నేళ్లుగా పరిశీలించానన్నారు. అదే ప్రమాణాలున్న చిత్రాలను నిర్మించే పరిస్థితులను రూపొందించాలనే భావనను రేకెత్తించిందని తెలిపారు. ఇకపై తమ రెండు సంస్థలు 'వేల్స్ - డి స్టూడియోస్'గా పనిచేస్తుందని, ఇది తమిళ సినిమాను ప్రపంచస్థాయిలో నడిపిస్తుందని పేర్కొన్నారు. ఉన్నతశ్రేణి కెమెరా, ప్రొడక్షన్ పరికరాలు, ఎడిటింగ్ సూట్స్, ఆడియో-విజువల్ ఎఫెక్ట్స్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్, ఔట్‌డోర్ యూనిట్ వంటివి ఈ అప్‌గ్రేడ్ స్టూడియోలో ఉంటాయని వెల్లడించారు. ఐషరి కె.గణేశ్ మాట్లాడుతూ... సినీరంగానికి చెందినవారు నమ్మకంతో, స్వేచ్ఛగా పనిచేసేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సృజనాత్మక ప్రదేశాన్ని చెన్నైలో రూపొందించాలన్న తన ఆకాంక్షకు అనుగుణంగా డి స్టూడియోస్ పోస్ట్ ఉందన్నారు.

దర్శకుడు విజయ్, ఐషరి కె.గణేశ్ తదితరులు

రివాల్వర్ రీటా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్: జె.కె.చంద్రు

చెన్నై: జె.కె.చంద్రు దర్శకత్వంలో కీర్తి సురేశ్ ప్రధానపాత్రలో నటించిన 'రివాల్వర్ రీటా' శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నై నగరంలో జరిగిన ముందస్తు విడుదల కార్యక్రమంలో దర్శకుడు జె.కె.చంద్రు మాట్లాడుతూ... చిత్రంలో కీర్తి సురేశ్‌తో సమానంగా ఇతర పాత్రలకూ ప్రాధాన్యత ఉందన్నారు. ఇదొక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని, కుటుంబ సమేతంగా సరదాగా చూడొచ్చని తెలిపారు. నటి కీర్తి సురేశ్ మాట్లాడుతూ... చిత్రం కథను మొదట దర్శకుడు చెప్పడంతోనే బిగ్గరగా నవ్వడంతో పాటు సంతోషించానని పేర్కొన్నారు. రాధికతో తొలిసారి నటించానని, ఆ సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నటులు సంజీవ్, కవిరసన్, అజీత్ శరత్, సెంద్రాయన్, అగస్టిన్, భైదు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో కీర్తి సురేశ్ తదితరులు

గోవా చిత్రోత్సవాలకు కదిలిన తారలు

చెన్నై: గోవాలో ఈ నెల 20 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ చిత్రోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. సినీరంగంలో 50ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకున్న రజనీకాంత్‌నూ ముగింపు వేడుకల్లో జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు తన సతీమణి లతతో కలిసి ఆయన గురువారం గోవాకు వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ... 'జైలర్-2' చిత్రీకరణ ఇంకా కొంత భాగమే మిగిలి ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు మీడియా ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి సెంగోట్టైయన్ టీవీకేలో చేరడంపై స్పందించడానికి నిరాకరించారు. గోవా చిత్రోత్సవాలు ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు నయనతార తన ఇద్దరు పిల్లలతో కలిసి గోవా వెళ్లారు. విమానాశ్రయంలో ఆమెకు భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ వీడ్కోలు పలికారు.

విలేకరులతో మాట్లాడుతున్న రజనీకాంత్
✦ విమానాశ్రయంలో నయనతార, విఘ్నేశ్ శివన్ దంపతులు

నేడు తెరపైకి డేనియల్ బాలాజీ ఆఖరి సినిమా

చెన్నై: మిష్కిన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన జెబి సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రం 'బీపీ 180'. నటి తాన్య రవిచంద్రన్ ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రంలో దివంగత నటుడు డేనియల్ బాలాజీ ప్రతినాయకుడిగా నటించారు. ఆయనకు ఇదే ఆఖరి చిత్రం కావడం గమనార్హం. ఇందులో కె.భాగ్యరాజ్, తమిళ్, అరుళ్‌దాస్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ చిత్రం శుక్రవారం తెరపైకి రానుంది. డేనియల్ బాలాజీ వద్ద చిక్కుకున్న తాన్య రవిచంద్రన్ అతడిలోని రాక్షసత్వాన్ని పోగొట్టేందుకు ప్రయత్నిస్తారు. అందులో సఫలమయ్యారా? లేక అతడినే నాశనం చేశారా? అనేది తెరపై చూడాల్సిందేనని దర్శకుడు వెల్లడించారు.

ఓ సన్నివేశంలో డేనియల్ బాలాజీ

అంజాన్ రీరిలీజ్ చిత్రం నిడివి కుదింపు

లింగుసామి

చెన్నై: సూర్య, సమంత, విద్యుత్ జమ్వాల్ ప్రధానపాత్రలు పోషించి 2014న విడుదలైన 'అంజాన్'ను ప్రస్తుతం రీ ఎడిట్ చేసి శుక్రవారం రీరిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో చిత్రదర్శకుడు లింగుసామి మాట్లాడుతూ... 2.36 గంటలు నిడివి ఉన్న చిత్రాన్ని ఎడిట్ చేసి 2 గంటలకు కుదించినట్లు తెలిపారు. ఎడిట్ వెర్షన్‌లో సూరి లేడన్నారు. చిత్రాన్ని సూర్య తండ్రి నటుడు శివకుమార్ చూశారని తెలిపారు. మహాభారతాన్ని తెరకెక్కించే ప్రయత్నం చేపట్టానని, బడ్జెట్ సమస్యతో అది సఫలీకృతం కాలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తన తర్వాతి చిత్రంలో విద్యాసాగర్ కుమారుడు కథానాయకుడిగా నటిస్తున్నారని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభంకానుందని తెలిపారు. అవకాశం ఉంటే 'అంజాన్'కు రెండో భాగాన్ని తెరకెక్కించవచ్చని పేర్కొన్నారు.

పుదువైలో రూ.20కోట్ల విలువైన నకిలీ మాత్రలు స్వాధీనం

నాలుగు గోదాములకు సీల్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో రూ.కోట్ల విలువైన నకిలీ మాత్రలను సీబీసీఐడీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దిల్లీ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న సన్ ఫార్మసీ అనే కంపెనీ పేరిట పుదుచ్చేరిలో నకిలీ మాత్రలు తయారుచేస్తున్నట్లు పుదుచ్చేరి సీబీసీఐడీ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నకిలీ మాత్రలు విక్రయించిన సీర్గాళికి చెందిన రాణా, కారైక్కుడికి చెందిన మెయ్యప్పన్‌ను మూడురోజుల కిందట అరెస్ట్ చేశారు. పుదుచ్చేరి రెడ్డియార్‌పాళ్యం ప్రాంతంలో నివాసం ఉంటున్న తమిళనాడుకు చెందిన రాజా అనేవ్యక్తికి సొంతమైన మేట్టుపాళ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రవికుమార్ ఇండస్ట్రీస్ అనే పరిశ్రమ నడుపుతున్నట్లు గుర్తించారు. గురువారం సీబీసీఐడీ పోలీసులు, డీఐజీ సత్యసుందరం ఎస్పీ శృతి, రఘునాయగం, ఔషధ నియంత్రణ విభాగ ఇన్‌స్పెక్టర్లు సోదాలు జరిపారు. నకిలీ మాత్రలు, యంత్రాలను స్వాధీనం చేసుకొని ఔషధ నియంత్రణ విభాగ అధికారులకు అప్పగించారు. కురుమాంబట్టి, మేట్టుపాళ్యంలోని నాలుగు గోదాములలో నకిలీ మాత్రలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని సీల్ వేశారు. స్వాధీనం చేసుకున్న మాత్రల విలువ రూ.20కోట్లు, యంత్రాల విలువ రూ.14కోట్లు ఉంటుందని, కేసుతో సంబంధం ఉన్న మరో 10మంది కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నకిలీ మాత్రల వ్యవహారంలో సీబీఐ విచారణ జరపాలని కోరుతూ జేసీఎమ్ మక్కల్ మండ్ర అధ్యక్షుడు రీగన్ జాన్‌కుమార్ నేతృత్వంలో గురువారం ప్లకార్డులతో అసెంబ్లీ వద్ద ఆందోళన చేశారు.

సోదాలు జరుపుతున్న అధికారులు

అరుణాచలేశ్వరాలయంలో పోర్చుగల్ భక్తుల సందడి

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో గురువారం పోర్చుగల్ దేశానికి చెందిన 25మంది భక్తులు సందడి చేశారు. ముందుగా సంబంధ వినాయకస్వామిని, తర్వాత అరుణాచలేశ్వరుని, ఉన్నాములై అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత నవ గోపురాలను సందర్శించి ఆలయంలో ఓచోట వృత్తాకారంలో కూర్చొని ప్రార్థనలు చేశారు.

వృత్తాకారంలో కూర్చొని ప్రార్థన చేస్తున్న విదేశీ భక్తులు

సన్నిధి వీధిలో ఆక్రమణల తొలగింపు

తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో కార్తిక దీపోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భక్తుల కోసం అనేక ఏర్పాట్లు చేస్తున్నారు. తాత్కాలిక బస్టాండ్లు, కార్ పార్కింగ్ వసతి, ఉచిత బస్సు సేవలు, అదనపు బస్సులు, రైళ్లు, తాగునీటి వసతి, ఆరోగ్య సేవలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సన్నధి వీధిలో ఉన్న ఆక్రమణలను మున్సిపాలిటీ సిబ్బంది జిల్లా కలెక్టరు తర్పగరాజ్ సమక్షంలో తొలగించారు.

అడవి ఏనుగు 'రోలెక్స్' మృతి

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా తొండాముత్తూరు, కెంపనూరు ప్రాంతాల్లో అడవి ఏనుగు 'రోలెక్స్' పంట పొలాలను నాశనం చేస్తుండటంతో అటవీశాఖ సిబ్బంది అక్టోబర్ 17న మత్తు ఇంజక్షన్ ఇచ్చి బంధించారు. అనంతరం పొళ్లాచ్చి అనైమలై టైగర్ రిజర్వ్‌లోని టాప్‌చిలిప్ వరకళియార్ శిబిరంలోని బోనులో నెల రోజులపాటు ఉంచారు. తర్వాత నవంబరు 12న మందిరిమట్టం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టి పర్యవేక్షించారు. ఈ క్రమంలో రోలెక్స్ గురువారం చనిపోయి కనిపించింది. పశు వైద్యులు శుక్రవారం కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తారని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఏనుగు మరణానికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగు రోలెక్స్

'సఫలమవుతున్న భాజపా వ్యూహం'

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేను పూర్తిగా కైవసం చేసుకునేందుకు భాజపా పన్నాగం పన్నిందని వీసీకే ఉప ప్రధాన కార్యదర్శి వన్నియరసు ఆరోపించారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అన్నాడీఎంకే బహిష్కృత నేత సెంగోట్టయన్ టీవీకేలో చేరడం వెనుక భాజపా హస్తం ఉండొచ్చని తెలిపారు. ఎడప్పాడి పళనిసామిని తడబాటుకు గురి చేసి ఎక్కువ సీట్లు పొందటమే భాజపా వ్యూహమని పేర్కొన్నారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మహాబలిపురంలోని వెన్నముద్ద రాయిపై లేజర్ కాంతులతో రూపొందించిన పటేల్ చిత్రం ఆకట్టుకుంటోంది.
- మహాబలిపురం, న్యూస్‌టుడే

ప్రేయసిని కత్తితో పొడిచి చంపిన యువకుడు

మరొకరితో నిశ్చితార్థం జరగడంతో ఘాతుకం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతికి మరొకరితో నిశ్చితార్థమైందన్న కోపంతో ప్రియుడు నడి రోడ్డుపై ప్రేయసిని కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన తంజావూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తంజావూర్ జిల్లా మేలకలక్కూడి ప్రాంతానికి చెందిన కావ్య(26) ఆలంగుడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈమె, గ్రామానికి చెందిన తన సామాజిక వర్గానికే చెందిన అజిత్‌కుమార్(29) కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇదిలా ఉండగా తల్లిదండ్రుల ఒత్తిడితో కావ్య బంధువైన యువకుడిని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంది. కొన్నిరోజుల క్రితం నిశ్చితార్థం జరిగింది. విషయం అజిత్‌కుమార్‌కు చెప్పకుండా దాచింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిశ్చితార్థం జరిగిన విషయం చెప్పి, ఫొటోలను పంపింది. దీంతో ఆక్రోశానికి గురైన ప్రియుడు గురువారం ఉదయం పాఠశాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కావ్యను అడ్డగించి గొడవ పడ్డాడు. వెంట తీసుకొచ్చిన కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు అజిత్‌కుమార్

ప్రియుడితో కలిసి కోడలిని హత్య చేసిన అత్త

మృతదేహాన్ని గోనె సంచిలో పెట్టి కాలువలో పడేసిన వైనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కోడలిని చంపి మృతదేహాన్ని గోనెసంచిలో పెట్టి కాలువలో పడేసిన అత్త, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడి సమీపం ఎడమలైయూర్‌కు చెందిన రాజా ఆటో డ్రైవర్. ఇతని భార్య ఇలంజియం(45)కు అదే గ్రామానికి చెందిన తంగపాండియన్ (41)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. 10ఏళ్ల క్రితం భర్తతో విడిపోయి తన ముగ్గురు పిల్లలు, తంగపాండియన్‌తో కలిసి తిరుప్పూర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. ఇలంజియం పెద్ద కుమారుడు అరవిందరాజ్ (25) స్థానికంగా ఉన్న ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న నాగపట్నంకు చెందిన స్నేహ (23)ను మూడేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. ఇదిలా ఉండగా గతేడాది కుటుంబ గొడవలతో అరవిందరాజ్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అతని మొదటి వర్ధంతి జరిపేందుకు ఈనెల 13వ తేదీ అత్తాకోడలు సొంతూరైన ఎడమలైయూర్‌కు వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగియడంతో 20వ తేదీ స్నేహను ఊరికి పంపేందుకు తంగపాండియన్ ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి బస్టాండ్‌లో వదిలాడు. మరుసటి రోజు స్నేహ తల్లి ఫోన్ చేయగా కుమార్తె తీయలేదు. దీంతో అనుమానం కలిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానంతో తంగపాండియన్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. భర్త చనిపోయిన తర్వాత స్నేహ మరోవ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అతనితో వేరేగా కాపురం పెడతానని అత్తకు చెప్పింది. ఈ నేపథ్యంలో ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని భావించిన ఇలంజియం, తంగపాండియన్ కలిసి కొట్టి చంపారు. మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి సోనాంపేట్టైలోని కాలువలో విసిరేశారు. పోలీసులు కాలువలో మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టానికి తరలించారు. అనంతరం ఇలంజియం, తంగపాండియన్‌ని బుధవారం అరెస్ట్ చేశారు.

రెండు ఏనుగుల మరణంపై అధ్యయనం

వడపళని, న్యూస్‌టుడే: ఇటీవల కోయంబత్తూరు ప్రాంతంలో రెండు ఏనుగులు ఒకే రకమైన పరిస్థితుల్లో మరణించాయని రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ రాకేష్ కుమార్ డోగ్రా గురువారం తెలిపారు. అడవిలోకి విడిచిపెట్టిన రోలెక్స్, రాధాకృష్ణన్ అనే రెండు ఏనుగుల మరణాలకు కారణాలను అధ్యయనం చేయడానికి ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. రెండూ ఒకే రకంగా చాలా ఎత్తు నుంచి పడిపోవడంతో మృత్యువాత పడినట్లు చెప్పారు.

డీఎంకే మళ్లీ అధికారంలోకి రాకూడదు: హెచ్.రాజా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ఎవరు ప్రయత్నించినా ప్రజలకు ద్రోహమే చేసినట్లవుతుందని భాజపా సీనియర్ నేత హెచ్.రాజా అన్నారు. తంజావూర్ జిల్లా పాపనాశం అయ్యంపేట్టైలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 55నెలల్లో సుమారు 6,700 దారుణహత్యలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియను డీఎంకే వ్యతిరేకిస్తోందన్నారు. డీఎంకే మళ్లీ అధికారంలోకి రాకూడదన్నారు. 2026 ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మదురై ధర్మాసనంలో భద్రతా విధుల్లో ఉన్న పోలీసు ఆత్మహత్య

ప్యారిస్, న్యూస్‌టుడే: మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం వద్ద భద్రతా విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మదురై ధర్మాసనంలో కేంద్ర భద్రతా దళంతోపాటు తమిళనాడు పోలీసులు షిఫ్టు విధానంలో భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కోర్టు ప్రవేశ ద్వారంలో బుధవారం రాత్రి భద్రతా విధుల్లో ఉన్న మదురై జిల్లా ఉసిలంపట్టికి చెందిన పోలీసు కానిస్టేబుల్ మహాలింగం(30) గురువారం తెల్లవారుజామున తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్పూరం వెలిగిస్తుండగా మహిళ చీరకు అంటుకున్న మంటలు

తల్లి, కుమారుడికి గాయాలు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయానికి గురువారం కడలూరు జిల్లా వడలూరు ప్రాంతానికి చెందిన రేఖ(41), ఆమె కుమారుడు దీనదయాళన్(22) వచ్చారు. ఆలయ రాజగోపురం ఎదుట ఉన్న చక్కెర కోనేరు వద్ద ఉన్న ఉక్కు కుండలో రేఖ కర్పూరం వెలిగిస్తుండగా పక్కన నేలపై వెలుగుతున్న కర్పూరం మంటలు ఆమె చీరకు అంటుకున్నాయి. వెంటనే కుమారుడు చేతులతో మంటలు ఆర్పాడు. ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. వారిని అక్కడివారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళను కాటేసిన పాము

చంపి భార్యతోపాటు ఆస్పత్రికి తీసుకెళ్లిన భర్త

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా గుడియాత్తం సమీపం బోడిపేటకు చెందిన ధర్మప్రకాశ్, ఉమాదేవి(45) దంపతులు. వీరు బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఉమాదేవిని పాము కరిచింది. వెంటనే భర్త పామును చంపాడు. పాముతో సహా భార్యను గుడియాత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు.

బస్సులో 19 సవర్ల నగల చోరీ

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీపం పంజువాంజేరికి చెందిన సింగారవేలన్ భార్య సుభాషిణి(45). ఈమె విళుపురం సమీపం కోనూర్‌లో గురువారం జరిగిన వివాహంలో పాల్గొనడానికి తన కుమారుడు అనిష్, కుమార్తె నవ్యతో కలిసి బుధవారం సాయంత్రం కిళాంబాక్కం నుంచి విళుపురానికి ప్రభుత్వ బస్సులో బయలుదేరింది. ఇంట్లో ఉన్న 19 సవర్ల నగలను ఓ సంచిలో పెట్టుకొని వెంట తీసుకొచ్చింది. రాత్రి విళుపురం నాలుగు రోడ్ల కూడలిలో బస్సు దిగారు. అప్పుడు తన వద్ద ఉన్న సంచిని చూడగా అందులో నగలు కనిపించలేదు. వెంటనే విళుపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఏటీఎం కేంద్రంలో దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

ప్యారిస్: చెన్నై ట్రిప్లికేన్‌కి చెందిన సయ్యద్ మహమ్మద్ ఈ నెల 24వ తేదీ రూ.10 లక్షల నగదుని అభిరామపురం, శృంగేరి మఠం సాలైలో ఉన్న ఏటీఎం కేంద్రంలోని యంత్రంలో పెడుతున్నారు. అప్పుడు అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు కత్తితో మహమ్మద్‌ను బెదిరించి రూ.8 లక్షలు దోచుకొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అభిరామపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దోపిడీకి పాల్పడిన తిరునెల్వేలికి చెందిన పాండియరాజాను అరెస్టు చేసి, రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బుధవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.


పాండియరాజా

పోక్సో కేసులో దోషికి 20ఏళ్ల జైలు శిక్ష

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా గుడియాత్తం సమీపం మాదూరుకి చెందిన అన్బరసన్(24), 16ఏళ్ల బాలిక ప్రేమించుకున్నారు. 2019లో వీరిద్దరూ ఏకాంతంగా ఉండగా అదే ప్రాంతానికి చెందిన ప్రకాశ్(34) సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించిన ప్రకాశ్ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు గుడియాత్తం ఆల్ ఉమెన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద అన్బరసన్, ప్రకాశ్‌ని అరెస్టు చేసి వేలూరులోని సత్తువాచ్చారి పోక్సో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ గురువారం ముగిసింది. అన్బరసన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేసింది. ప్రకాశ్‌కు 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

యువతిని రైలు ముందు తోసి హత్య చేసిన కేసు

దోషికి విధించిన ఉరిశిక్ష జీవితఖైదుగా మార్పు

ప్యారిస్, న్యూస్‌టుడే: కళాశాల విద్యార్థినిని రైలు ముందుకు తోసి హత్య చేసిన కేసులో యువకుడికి విధించిన ఉరిశిక్షను జీవితఖైదుగా తగ్గిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. చెన్నై సెయింట్ థామస్ మౌంట్ పోలీసు క్వార్టర్స్‌కు చెందిన కళాశాల విద్యార్థిని, అదే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సతీష్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను యువతి తల్లిదండ్రులు నిరాకరించడంతో అతనితో మాట్లాడం మానేసింది. ఇదిలా ఉండగా 2022 అక్టోబరు 13న కళాశాలకు వెళ్లేందుకు యువతి సెయింట్ థామస్ మౌంట్ రైల్వే స్టేషన్‌లో రైలు కోసం వేచి ఉండగా ప్రియుడు ఆమెను రైలు ముందు తోసి హత్య చేశాడు. ఈ కేసులో సతీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై మహిళా ప్రత్యేక కోర్టు అతనికి గతేడాది డిసెంబరు 30న ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పుని ఖరారు చేయడానికి కేసుని మద్రాసు హైకోర్టుకి పంపారు. అదే సమయంలో సతీష్ తరఫున అప్పీల్ దాఖలైంది. ఈ కేసును న్యాయమూర్తులు జస్టిస్ సతీష్‌కుమార్, జస్టిస్ జ్యోతిరామన్ ధర్మాసనం విచారించింది. అప్పుడు సతీష్ తరఫున.. ప్రేమించిన యువతి మరొకరిని వివాహం చేసుకోవడానికి సిద్ధమైందన్న వేదనతో అకస్మాత్తుగా వచ్చిన కోపంలో చేసిన పని అని, కావాలని ప్రణాళిక ప్రకారం చేసింది కాదని, ఇది అత్యంత అరుదైన కేసు అని వాదించారు. సీబీసీఐడీ తరఫున.. ఇది ప్రణాళిక ప్రకారం చేసిందేనని, రెండు రోజులు మాటువేసి మూడో రోజు రైలు వచ్చే వరకు వేచి ఉండి రైలు దగ్గరకు రాగానే తోసేశాడని అనేందుకు సీసీ కెమెరా దృశ్యాలు మొదలైన సాక్ష్యాలు ఉన్నాయని, కావున శిక్షను ఖరారు చేయాలని తెలిపారు. అన్ని తరఫు వాదనలు విన్న న్యాయమూర్తులు తీర్పుని వాయిదా వేసిన నేపథ్యంలో గురువారం సతీష్‌కు విధించిన ఉరిశిక్షను జీవిత ఖైదుగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా 20ఏళ్ల పాటు ఏ విధంగానూ శిక్ష తగ్గించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఘనంగా ఉదయనిధి జన్మదిన వేడుకలు

సైదాపేట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 49వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మంత్రులు, డీఎంకే నిర్వాహకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. చెన్నై మెరీనా తీరంలోని పేరరిజ్ఞర్ అన్నా, ముత్తమిళరిజ్ఞర్ కలైజ్ఞర్ కరుణానిధిల స్మారక మందిరాల్లో ఉదయనిధి నివాళులర్పించారు. చెన్నై గోపాలపురం, సీఐటీ కాలనీలోని ఇళ్లలో కలైజ్ఞర్ కరుణానిధి చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. అన్నా మార్గంలో రాష్ట్ర హక్కులను, సామాజిక న్యాయాన్ని కాపాడేందుకు పని చేద్దామని తన 'ఎక్స్'పేజీలో ఉదయనిధి తెలిపారు. ఉదయనిధి ఇంటి ముందు డీఎంకే నిర్వాహకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వివిధ రకాల సంప్రదాయ బొమ్మలు, సంగీత వాయిద్యాలతో పుట్టినరోజు సంబరాలు చేసుకున్నారు.

చాక్లెట్ల మాలలతో వచ్చిన అభిమాని

అన్నా స్మారక మందిరం వద్ద నివాళులర్పిస్తున్న ఉదయనిధి స్టాలిన్

తిరువణ్ణామలైలోని దుకాణాల్లో అగ్నిప్రమాదం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై కామాక్షి అమ్మన్ ఆలయ వీధిలో ఉన్న ఎవరెస్ట్ అనే కర్పూరం విక్రయించే దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే మంటలు పక్కనున్న దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు ఆర్పారు. ప్రమాదంలో నాలుగు దుకాణాలు, 7 ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.

ప్రమాదానికి గురైన దుకాణాలు

ముగ్గురు యువకులపై గూండా చట్టం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా రాశిపురం కొత్త బస్టాండ్ సమీపం టీవీఎస్ సాలై, పట్టణం సాలై ప్రాంతాలలో కొందరు యువకులు గత నెల 26వ తేదీ మద్యం దుకాణాలలో కత్తులు పట్టుకొని బీభత్సం సృష్టించారు. పాదచారులు, బస్టాండ్‌లో ఉన్న వారిపై దాడికి పాల్పడ్డారు. రోడ్లపై బారికేడ్లను ధ్వంసం చేశారు. వారి దాడిలో గాయపడిన కళాశాల విద్యార్థి ప్రదీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు రాశిపురానికి చెందిన రియాజుద్దీన్(24), అతని తమ్ముడు అజీబుద్దీన్(23), వి.నగర్ ప్రాంతానికి చెందిన బాబు(23)ను అరెస్ట్ చేసి మిగతా వారికోసం గాలింపు చేపట్టారు. ముందే పలు నేరాలకు పాల్పడిన ఈ ముగ్గురిపై గూండా చట్టం కింద చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దుర్గామూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సేలం సెంట్రల్ జైల్లో ఉన్న ముగ్గురిని గురువారం గూండా చట్టం కింద అరెస్ట్ చేసిన రాశిపురం పోలీసులు ఉత్తర్వులను సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

దాచేసి దోచేయాలనా?

- గోదాముల్లో రూ.8.25 కోట్ల విలువైన సామగ్రి
- బహిర్గతం చేసిన ఏలూరు ఎమ్మెల్యే చంటి

అధికారిని ప్రశ్నిస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసి రూ. కోట్లాది రూపాయల విలువైన గృహ వినియోగ పరికరాలను గృహనిర్మాణ సంస్థ అధికారులు వినియోగించకుండా గుట్టుగా గోదాముల్లో దాచి ఉంచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి గురువారం ఈ కుట్రను భగ్నం చేశారు. యుద్ధప్రాతిపదికన ఆయన నగర శివారు కొమడవోలులోని హౌసింగ్ లేఅవుట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పక్కనే ప్రైవేటు గోడౌన్లలో దాచి ఉంచిన లబ్ధిదారులకు చెందిన తలుపులు, కరెంట్ సామగ్రి, వైర్లు, టైల్స్ ఇతర వస్తువులను కనుగొన్నారు. పెద్దఎత్తున ఈ సామగ్రి అంతా ఎందుకూ పనికిరాకుండా ఉండటాన్ని చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ తరువాత హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎందుకు చెప్పలేదని అక్కడున్న అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా బడేటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ లబ్ధిదారులకు చెందిన తలుపులు, ఇతర కరెంట్ సామగ్రి హౌసింగ్ ఉద్యోగులు కొందరు తరలించుకుపోతున్నారనే విషయాన్ని తెలుసుకుని వెంటనే తనిఖీలకు వచ్చానన్నారు. ఓ ప్రైవేటు గోదాములో సుమారు 15,536 మంది లబ్ధిదారులకు చెందిన రూ 8.25 కోట్ల విలువైన సొత్తును ఇలా ఎందుకు మురగపెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామన్నారు.

గోదాములో దాచి ఉంచిన పైపులు, సిమెంటు, తలుపులు ఇతర వస్తువులు

పూజలు చేస్తున్న మహిళలు

సుబ్రహ్మణ్యేశ్వరా.. పాహిమాం!

సింగరాయపాలెం (ముదినేపల్లి), న్యూస్‌టుడే: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి నిత్య ఔపోసన, బలిహరణ వంటి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. అనంతరం మహిళలు పాలు పొంగళ్లు పొంగించి స్వామివారికి సమర్పించారు.

చిన్నారిని ఊయల కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

అంతరాలయ దర్శనం పునఃప్రారంభం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి అంతరాలయ, ముఖ మండపం దర్శనాలను ఆలయ అధికారులు గురువారం పునఃప్రారంభించారు. కరోనా నేపథ్యంలో నిలిపివేసిన ఈ దర్శనాలను తిరిగి ప్రారంభించడంతో భక్తులకు స్వామివారిని దగ్గరగా దర్శించుకునే భాగ్యం కలిగింది. మొదటి రోజు 610 మంది అంతరాలయ టిక్కెట్లు కొనుగోలు చేసి దర్శనం చేసుకున్నారు.

48 గంటల్లోనే ఉపాధి జాబ్‌కార్డు

ప్రస్తుతం కార్డులు: **3.78** లక్షలు
శ్రామికులు: **6.70**లక్షలు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు ఇక నుంచి నూతన జాబ్‌కార్డును 48 గంటల్లోనే అందజేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఈ వెసులుబాటును కూలీలకు కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చింది. గతంలో ఈ జాబ్ కార్డు కావాలంటే రోజుల తరబడి ఉపాధి శ్రామికులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జాబ్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్నా ఇబ్బందులు తప్పేవికావు. తాజాగా ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేపట్టిన విషయం విదితమే. దీంతో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసేటప్పుడు అర్హులైన వేతన జీవులకు 48 గంటల్లోనే ఉచితంగా జాబ్ కార్డుల మంజూరు ప్రక్రియ వేగవంతంగా చేపట్టారు. ఈ జాబ్‌కార్డు పొందితేనే ఉపాధి పనులు చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ముద్రించిన కార్డులు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ఏ4 సైజు పేపరుపై నకలును జాబ్‌కార్డుగా ఇస్తున్నారు. జాబ్‌కార్డు కావాలని సంబంధిత పత్రాలతో దరఖాస్తును క్షేత్ర సిబ్బందికి అందజేసిన మరుసటి రోజుకు కార్డు నకలును సంబంధిత కూలీలకు అందజేస్తామని ఏపీడీ దామోధరరావు అందజేస్తామని తెలిపారు.

ప్రత్యేక అవసరాల బాలలకు ఊరట

ఈ విద్యా సంవత్సరానికి నిధులు విడుదల

నూజివీడు, న్యూస్‌టుడే: భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇవ్వాల్సిన వివిధ రకాల భత్యాలను కూటమి ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరం అయిదు నెలలకు జిల్లా వ్యాప్తంగా 1926 మందికి వివిధ రకాల భత్యాల కింద రూ. 10,14,000 మంజూరు చేశారు. జిల్లాలో 28 భవిత కేంద్రాలు ఉండగా.. ప్రత్యేక ఉపాధ్యాయులు 52 మంది, ఆయాలు 28 మంది, ఫిజియో థెరపిస్టులు ఏడుగురు, సహాయకులు 26 మంది పని చేస్తున్నారు.

భత్యాల చెల్లింపు ఇలా.. ప్రతి నెలా రూ. 600 రవాణా భత్యం, సహాయకుల భృతి ఏడాదికి రూ.6 వేలు. బాలికలు ఉపకార వేతనం సంవత్సరానికి రూ.2 వేలు. ఇంటి వద్దే చదువుకునే వారికి నెలకు రూ.600. భవిత కేంద్రాలకు ప్రత్యేక అవసరాల విద్యార్థులను తీసుకొచ్చే వారికి విభాగాల వారీగా నిధులు విడుదలయ్యాయని జిల్లా సహిత విద్య సమన్వయకర్త భాస్కరరాజు తెలిపారు. వాటిని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేశారన్నారు.

జీజీహెచ్‌కు కొరతల జబ్బు

ఈనాడు-ఏలూరు: మూడురోజుల క్రితం జూట్ మిల్లు వంతెనపై నుంచి మహిళొకరు దూకి ఆత్మహత్యాయత్నం చేయగా... వెన్నెముక విరిగింది. ఆమెను ఆసుపత్రికి తరలించారు. 24 గంటల్లోపు శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా పరికరాల్లేవని వార్డుకే పరిమితం చేశారు. ప్రస్తుతం రిఫరల్‌పై విజయవాడ పంపాలనే యోచనలో వైద్యులున్నారు.

ఏలూరు బోధనాసుపత్రిలో క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు జరగటం లేదనేందుకు ఇలాంటి ఉదంతాలు కోకొల్లలు

108 వాహనాలన్నీ రిఫరల్‌కే! జీజీహెచ్‌కు వచ్చే రోగులను రిఫరల్‌పై ఎక్కువగా బయటకు పంపుతున్నారని.. వీరి కోసం దెందులూరులోని 108 వాహనాలను వినియోగిస్తున్నారని బుధవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తీసుకెళ్లారు. కొత్తగా ఏర్పాటైన ఐదు బోధనాసుపత్రుల్లో ఇది పలు సమస్యలతో కునారిల్లుతూ ఎక్కువ పీజీ సీట్లను సాధించుకోలేకపోయింది. ట్రామా వైద్యానికి ఠికాణా లేదు.

కేస్ షీట్‌లో వివరాలే ఉండవు.. రిఫర్ చేసే కేసులకు అప్పటి దాకా చేసిన వైద్య వివరాలు కేస్ షీట్‌లో రాసి రిఫర్ చేయాలి. ఇలా చేయటంతో తక్షణ వైద్యం అందే అవకాశం ఉంది. ఆ వివరాలే కేస్ షీట్‌లో ఉండక గోల్డెన్ అవర్‌లో రోగులకు సక్రమంగా వైద్య అందకుండా పోతోంది.



ప్రమాదాల్లో తలకు గాయమై..నరాలు తెగిపోయి వచ్చే కేసుల పరిశీలనకు న్యూరాలజిస్టుతో పాటు ఎమ్మారై, సీటీస్కాన్ రిపోర్టులు ఇవ్వటానికి రేడియాలజిస్టు అవసరం. ఆ రెండు పోస్టుల్లో వైద్యులు లేరు. సేవలు సన్నగిల్లటానికి ఇదీ ఓ కారణమే.

ల్యాప్రో.. ఎండో స్కోపీ వైద్యం శూన్యం.. ల్యాప్రోస్కోపీ, ఎండోస్కోపీ పరికరాలతో పొట్టలోపల, గొంతు భాగంలో ఏముందో చూసి వైద్యం అందించటానికి ఈ పరికరాలు అవసరం. అవేవీ ఆసుపత్రిలో లేవు. ల్యాప్రోస్కోపీ సర్జరీలు చేయటం లేదు. ఎండోస్కోపీ పరీక్షలు చేయటం లేదు. కంటి వైద్యానికి కాంటాక్టు లెన్స్‌ల్లేవు.

సరిపడా లేని ఔషధాలు.. పరికరాలూ ఉండవు

న్యూరాలజిస్టు.. రేడియాలజిస్టు లేకుండా వైద్యమా?

- ఔషధాలు, సర్జికల్ సామగ్రి కొరత వేధిస్తోంది. ఉచిత ఔషధాలు పూర్తిస్థాయిలో లభ్యం కావటం లేదు. డిసెంబరుతో ముగిసే మూడో త్రైమాసికానికి రూ.3.50 కోట్ల బడ్జెట్‌కు రూ. 2.50 కోట్ల విలువైన ఔషధాలే ఆసుపత్రులకు సరఫరా చేశారు.
- ఆర్ఎంవో, సీఎంవోల పర్యవేక్షణలో రాత్రి పూట వైద్యసేవలు పకడ్బందీగా అందేలా చర్యలు తీసుకోవాలి. వీరి పర్యవేక్షణ లేకపోయేసరికి రాత్రిపూట వైద్యం అందని ద్రాక్షే అవుతోంది.
- ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు ఇతర పనుల్లో బిజీగా ఉండి ఆసుపత్రిలో నిర్మాణాలను పట్టించుకోవటం లేదు. తద్వారా మౌలిక వసతుల సమస్య వేధిస్తోంది. స్టాఫ్‌నర్సుల కొరత నెలకొంది. ఆసుపత్రి అభివృద్ధి సంఘ సమావేశంలో దీనిపై చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఇక గ్రామాలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తు

ఆర్‌డీఎస్ పథకం కింద చురుగ్గా పనులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇక నుంచి 24 గంటలూ నాణ్యతతో కూడిన విద్యుత్తు సరఫరా కానుంది. అందుకు రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ పథకం (ఆర్‌డీ స్కీం) కింద గ్రామాల్లో కొత్త విద్యుత్తు లైన్లు, పరివర్తకాలు, అధునాతన పరికరాల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. విద్యుత్తుశాఖ కన్‌స్ట్రక్షన్ విభాగం పర్యవేక్షణలో వీటిని చేస్తున్నారు.

కామయ్యపాలెం యడ్లబజార్‌లో పరివర్తకం ఏర్పాటు పనులు

ఓవర్ లోడును అధిగమించే విధంగా.. వినియోగదారులకు నాణ్యతతో కూడిన విద్యుత్తు సరఫరా చేయడంతోపాటు ఓవర్ లోడ్ సమస్యను అధిగమించడం ప్రధాన లక్ష్యంగా ఈ పథకాన్ని చేపట్టారు. విద్యుత్తు ఉపకేంద్రాల్లో అవసరమైన పరివర్తకాలు, బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ, గృహావసరాలకు కలిపి ఉన్న ఫీడర్లను సాంకేతికంగా విభజించి, పరివర్తకాలు, అదనపు ఫీడర్లను అమర్చుతున్నారు. అందుకు అవసరమైన చోట్ల కొత్త లైన్లు వేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఆయా పనులను మా పరిధిలో చురుగ్గా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని జంగారెడ్డిగూడెం డీఈఈ (కన్‌స్ట్రక్షన్) వి.యువరాజ్ తెలిపారు.

జిల్లాలో పూర్తయిన పనులు ఇలా

కొత్తలైన్లు	ఫీడర్లు
60 / 150	142 / 303

అవసరమైన చోట్ల పరివర్తకాల అమరిక **290**

జంగారెడ్డిగూడెం విద్యుత్తు డివిజన్ పరిధిలోని మన్యం, మెట్ట మండలాల్లోని గ్రామాలకు ఈ పనులు ఎంతగానో ఉపయుక్తం కానున్నాయి.

మంచు కాదండోయ్..

ఏలూరు వంగాయగూడెం నుంచి సత్యనారాయణపురం వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాహనాల రాకపోకలప్పుడు పెద్దఎత్తున దుమ్ము రేగుతోంది. వెనుక వచ్చే వాహనదారులు దుమ్ము, ధూళిలో అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రమాదాలకు ఆస్కారమున్న చోట హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటుచేయాలని, దుమ్ము రేగకుండా నీటిని చల్లాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, ఏలూరు

ఇప్పటికైతే ఉన్నా.. ఇక ఉండనేమో..

విద్యార్థినుల వసతిగృహం ఇలా...

రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ వ్యాయామ కళాశాల దుస్థితి ఇదీ. ఏలూరు జిల్లా గోపన్నపాలెంలో ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో విధుల్లో ఉన్న వ్యాయామ అధ్యాపకుల్లో వందల మంది ఇక్కడ చదువుకున్న వారే. గత పాలనలో ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థుల వసతి భవనాలు శిథిలావస్థకు చేరాయి. గోడలు బీటలు ఇచ్చాయి. మరుగుదొడ్లు, స్నానాల గదులకు తలుపుల్లేవు. కళాశాలలో చేరేందుకు 440 మందికి అవకాశం ఉండగా ప్రస్తుతం 108 మంది మాత్రమే చదువుతున్నారు. వ్యాయామ సాధన చేసే భవనం కూలిపోయింది. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించిన తరగతి గదుల కొత్త భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. దీనిపై ప్రిన్సిపల్ నతానియేల్ మాట్లాడుతూ సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ రూ.25 లక్షలు మంజూరు చేశారని వాటితో అసంపూర్తిగా ఉన్న భవనంలో కొంతమేర గదులు పూర్తి చేస్తామన్నారు. - ఈనాడు, ఏలూరు

భవనంలో పుట్టలు

చివరిలో కష్టాలు!

దెందులూరు, ఏలూరు గ్రామీణ- న్యూస్‌టుడే: గత నెలాఖరులో మొంథా తుపాను బీభత్సాన్ని మరవక ముందే.. నష్టాల నుంచి గట్టెక్కక ముందే.. అన్నదాతలను మరోసారి తుపాను హెచ్చరిక కలవరానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఆకాశం మేఘావృతమై.. చలి తీవ్రత పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. ఏటా పంట చేతికొచ్చే సమయంలో నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాన్ల తాకిడి అధికంగా ఉంటోంది. ఫలితంగా ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలవుతోంది.

తుపాను హెచ్చరికలతో అన్నదాతల్లో గుబులు

పెదపాడు రోడ్డులోని పొలాల్లో కోసిన వరిపంటను కుప్పలుగా పెడుతున్న కూలీలు

తప్పని అదనపు భారం.. 'మొంథా' ప్రభావంతో దిగుబడులు తగ్గి పెట్టుబడులూ రాని పరిస్థితి. మరోమారు తుపాను వచ్చి పంట దెబ్బతింటే కోలుకోలేమని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత తుపానుతో నేలవాలిన పంట కోయడానికి కూలీలు ఎక్కువ కూలి అడుగుతుండటంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు.

5,700 ఎకరాల్లో నష్టం.. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2.09 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మొంథా తుపానుతో 5,700 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. సుమారు 11 వేల మంది రైతులు నష్టపోయారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 80 వేల ఎకరాల్లో కోతలు కోశారు. చేలల్లో వరి పనలుపై ఉంది. 'ఆరబెట్టిన ధాన్యం ఒబ్బిడి చేసుకోవాలి. పనలు కుప్పలు వేసుకోవాలి' అని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు.

జిల్లా వరి సాగు వివరాలిలా (ఎకరాల్లో)

ఈ-పంట నమోదు	2,07,286
పూర్తయిన కోతలు	78,928
కోయాల్సింది	1,28,491

విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేస్తున్న మహేశ్‌కుమార్

బాలికల సమస్యలు పరిష్కరిస్తాం: ఎంపీ

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: వట్లూరు బాలికల గురుకుల పాఠశాలను ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ గురువారం సందర్శించారు. అక్కడి తరగతి గదులు, భోజనశాల, వసతి, మెనూ తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆపై వారితో కాసేపు ముచ్చటించారు. గురుకులంలో పాటిస్తున్న విద్యా విధానాలను ఆరా తీసి అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని అభినందించారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేర్పారు.. యంత్రాలివ్వరా

నెలలుగా ఎదురుచూపులు

నిడమర్రులో శిక్షణ పొందుతున్న మహిళలు

ఏలూరు ఆర్ఆర్‌పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: మహిళల స్వావలంబనకు, ఆర్థిక ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఔత్సాహికులకు మూణ్నెల్లపాటు కుట్టులో ఉచిత శిక్షణనిచ్చింది. శిక్షణ విజయవంతంగా పూర్తయిన వారికి కుట్టు యంత్రంతో పాటు ధ్రువపత్రం ఇస్తామని సర్కారు ప్రకటించింది. ఇక్కడ వరకు బాగానే ఉన్నా.. శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నేటికీ యంత్రాలు పంపిణీ చేయకపోవడంతో వారు నెలలుగా ఎదురు చూస్తున్నారు.

3,500 మందికి శిక్షణ.. బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 4,589 మందికి శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యం. 18-50 ఏళ్ల వయసున్న బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, ఈబీసీ మహిళలను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాలు ఏర్పాటు చేసి.. 3,500 మందికి మూణ్నెల్లపాటు రోజుకు రెండు బృందాల చొప్పున శిక్షణ ఇచ్చారు. మిషన్ కుట్టడం, వస్త్రాలు కత్తిరించడం, మహిళల అభిరుచులకు అనుగుణంగా కుట్టు, అల్లికలు నేర్పారు.

75 శాతం హాజరుతో.. శిక్షణ తరగతుల్లో 75 శాతం హాజరుతో శిక్షణ పూర్తయిన వారికి కుట్టు మిషన్‌తో పాటు ధ్రువపత్రాలు, స్వయం ఉపాధికి 50 శాతం రాయితీతో రూ.50 వేలు నుంచి రూ.2 లక్షల వరకు రుణమిస్తామని అప్పట్లో ప్రకటించారు. దాంతో ఉత్సాహంగా ముందుకొచ్చి.. తొలి విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు 4 నెలలుగా నిరాశ తప్పలేదు. 'కుట్టు మిషన్లకు బడ్జెట్ రావాల్సి ఉంది. నగదు రాగానే ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధి చేకూర్చుతాం' అని బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత తెలిపారు.

జిల్లాలో కేంద్రాలు

ప్రారంభించాల్సినవి:	31
ప్రారంభించినవి:	26
శిక్షణనివ్వాల్సింది:	4,589 మందికి
ఇచ్చింది:	3,500 మందికి

కోత పెరుగుతోంది.. పట్టించుకోరా...

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం సమీపంలో దిగువ కాఫర్‌డ్యాం, స్పిల్ ఛానల్‌ను ఆనుకుని ఉన్న మహానందీశ్వరస్వామి ఆలయ ప్రాకారం ఏటా వరద ఉద్ధృతికి కోతకు గురవుతోంది. క్రమంగా ఆవరణలో భక్తుల కోసం నిర్మించిన భవనం పునాదుల వద్దకు కోత చేరడంతో అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయంలో నీటి సరఫరా కోసం వేసిన బోరు నదీ గర్భంలో కలిసిపోయిందని, అదే పరిస్థితి ఈ భవనానికి ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వరద ఉద్ధృతంగా ఉన్న సమయంలోనే కోత విపరీతంగా ఉంటుంది. ప్రస్తుతం స్పిల్‌ఛానల్‌లో పనుల కోసం రహదారి పనులు పునరుద్ధరించడంతో ప్రవాహం ఒత్తిడి పెరిగిందన్నారు. దీంతో లంక కోత మరింత పెరుగుతోందని, తక్షణం ప్రాజెక్టు అధికారులు కోత నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కొండ దిగువన భక్తుల అన్నదానం కోసం దాతలు నిర్మించిన భవనాన్ని కూడా కాపాడాలని భక్తులు చెబుతున్నారు.

కుందేళ్లు కాదు ఎలుకలే

వీటిని చూసి కుందేళ్ల పిల్లలు అనుకుంటున్నారేమో.. కాస్త నిశితంగా చూడండి. మన చిన్నప్పుడు సర్కస్‌లో అరుదుగా కనిపించే కాశీ ఎలుకలు ఇవి. కుందేళ్లను పోలి ఉండే ఈ ఎలుకలు ఇటీవల మన ప్రాంతంలో దాదాపు కనుమరుగయ్యాయి. కానీ పాలకోడేరు మండలం మోగల్లు గోస్తనీ నది వద్ద ఉన్న మహావనంలో వీటిని చూడొచ్చు. మొక్కలు, జంతువులపై మక్కువ కలిగిన హేచరీబాబు వీటిని హైదరాబాదు నుంచి తెప్పించి అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. సుమారు 600 నుంచి 700 గ్రాముల బరువు ఉంటే ఈ ఎలుకలు 8 నుంచి 10 సంవత్సరాల వరకు జీవిస్తాయని హేచరీబాబు తెలిపారు. -న్యూస్‌టుడే, పాలకోడేరు

టీ20కి మన వర్మ

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన క్రికెటర్ బి.మునీశ్ వర్మ బీసీసీఐ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రా క్రికెట్ జట్టులో అతడు స్థానం సంపాదించారు. గతంలో అండర్ 14-25 వరకు అన్ని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఖ్యాతి గడించారు. మునీశ్‌వర్మను నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు, శిక్షకులు అభినందించారు.

సివిల్స్ పరీక్షార్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సివిల్ సర్వీసు-2026కు సంబంధించి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి నాగరాణి తెలిపారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం డిసెంబరు 3 వరకు పొడిగించినట్లు చెప్పారు. అభ్యర్థులు విద్యార్హత, ఆదాయ, కుల ధ్రువపత్రాలు జత చేసి.. ఒకటో పట్టణం వెన్నవల్లివారిపేటలోని బీసీ అధ్యయన కేంద్రంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు డిసెంబరు 7న రాజమహేంద్రవరంలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటున్నారు. ఉత్తీర్ణులైన వారికి డిసెంబరు 14 నుంచి విజయవాడ గొల్లపూడిలోని బీసీ అధ్యయన కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. అక్కడ భోజన, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని, మరిన్ని వివరాలకు 86861 80018, 90302 11920 నంబర్లను సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

(c) eenadu

ముడుపు తీసుకొస్తున్న ఎమ్మెల్యే చంటి, మీనా దంపతులు

ఏలూరులో గంగానమ్మ జాతర

ఏలూరు నగరంలో గంగానమ్మ జాతర కనులపండువగా సాగుతోంది. ఏడేళ్ల కోసారి నిర్వహించే ఉత్సవంతో.. అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నగరం నలుదిక్కులా జాతర అంబరాన్నంటుతోంది. ఏలూరు పడమర వీధిలో గురువారం వినుకొండ అంకమ్మను మేడలోకి ప్రవేశపెట్టారు. తంగెళ్లపూడి గంగానమ్మ జాతర ప్రారంభ సూచిగా ముడుపు కట్టి, పందిరి రాటోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే చంటి, మీనా దంపతులు ముడుపును ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. దక్షిణపు వీధిలో అమ్మవారి ఘటా ఆవాహన చేసి.. పాదం నేలపై మోపే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, మేయర్ షేక్ నూర్జహాన్, ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి తదితరులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం

మేడలో కొలువైన వినుకొండ అంకమ్మ

ఖైదీలకు ఉపాధి కల్పిస్తే పరివర్తనకు దోహదం

కైకలూరు, న్యూస్‌టుడే: ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారిలో పరివర్తన వచ్చేందుకు దోహదపడుతుందని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ అన్నారు. కైకలూరు సబ్ జైలు సమీపంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును గురువారం ఆ శాఖ డీఐజీ ఎం.వర ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. కైకలూరుతో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 23 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులపైనే ఆధారపడకుండా, వీటి ద్వారా స్థిరమైన ఆదాయ వనరు పొందొచ్చని చెప్పారు. శాఖాపరమైన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమానికి వినియోగించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో అధికారిక ఉద్యోగ అవకాశాలను ఖైదీలు, వారి కుటుంబ సభ్యులకు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో ఖైదీల్లో ఆత్మవిశ్వాసం పెంపొంది కుటుంబాలు గౌరవప్రదంగా జీవనం సాగిస్తాయని తెలిపారు. అనంతరం రూ.1.63 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కైకలూరు సబ్ జైలు భవన నిర్మాణాన్ని సందర్శించారు. నాణ్యత ప్రమాణాల్లో వ్యత్యాసాలు రాకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. జైళ్ల శాఖ జిల్లా అధికారులు ఎస్.శివకుమార్, ఆర్వీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్న అంజనీకుమార్

నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ దేవప్రకాశ్ తెలిపారు. సమావేశానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షత వహిస్తారని.. ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు విధిగా హాజరు కావాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

మా బడి.. చదువులమ్మ ఒడి..

- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి కృషి
- రూ.50 లక్షలతో వసతుల కల్పన

సైన్సు ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న శ్రీమన్నారాయణ

కలిదిండి, న్యూస్‌టుడే: దాతృత్వం అనేది ఒక వరం. దాతలను ప్రోత్సహిస్తూ.. మంచి కార్యక్రమాలకు చేదోడుగా నిలవడమూ వరమే. ఉన్నత మనసు.. సేవా దృక్పథం ఉంటేనే ఇవి సాధ్యం. ఈ దిశగా బంధు, మిత్రుల నుంచి విరాళాలు సేకరించి బడి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు కైకలూరు మండలం రాచపట్నానికి చెందిన మాగంటి శ్రీమన్నారాయణ(చిన్ని). ఆయన ప్రోత్సాహంతో కలిదిండి మండలంలోని ఆరుతెలగపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.50 లక్షలు విరాళాలు దాతలు అందించారు.

శ్రీమన్నారాయణ ఇదే బడిలో చదువుకున్నారు. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో బడిలో ఆర్వో ప్లాంటు, దాని నిర్వహణకు నిధులు, భోజన శాల, మోడల్ గ్రంథాలయం, మరుగుదొడ్లు, సోలార్ ప్యానల్స్, మీటింగ్ హాలు ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుతం రూ.20 లక్షలతో సైన్సు ల్యాబ్, రూ.5లక్షలతో సైకిల్ షెడ్డు నిర్మాణానికి ఇటీవలే భూమి పూజ చేశారు. సదుపాయాల కల్పనకు నిధులు సమకూర్చడంతో పాటు ఆయా పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ పూర్తి చేయిస్తున్నారు.

చదువుకున్న పాఠశాలపై మమకారం.. చదువుకున్న బడిపై ఎనలేని మమకారం నాకు. దీని అభివృద్ధికి అవసరమైన పనుల కోసం బంధు, మిత్రులతో మాట్లాడి.. విరాళాలు ఇవ్వాలని అడుగుతుంటా. వాళ్ల ఔదార్యంతోనే వసతులు ఏర్పాటవుతున్నాయి. ఇది ఎంతో సంతోషాన్నిస్తోంది. - మాగంటి శ్రీమన్నారాయణ

విజయకేతనం పుస్తకాలందుకున్న విద్యార్థులతో పద్మశ్రీ

ఉత్తమ ఫలితాలు సాధిద్దాం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆకాంక్షించారు. స్థానిక శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల 'పది' విద్యార్థులకు జిల్లా పరిషత్తు నిధులతో రూపొందించిన విజయకేతనం అభ్యసన సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలు అద్వితీయ ప్రతిభతో పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో గదులు, కాటేజీల ఖాళీల వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు.

సత్రం పేరు	ఖాళీలు	
27న రాత్రి 10గంటల సమయానికి	28	29
ధర్మప్రచార నిలయం	75	80
తితిదే సత్రం	08	16
రాణి చిన్నమ్మారావు సత్రం	30	30
కాటేజీలు	22	27
బాలాజీ	04	02

సంప్రదించాల్సిన నంబర్లు: 90375 69891, 90375 67892

ఆన్‌లైన్ బుకింగ్ కోసం:www.aptemples.ap.gov.in

జాతీయ వైద్య ప్రమాణాలకనుగుణంగా సేవలు

భీమడోలు సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఎన్‌క్వాస్ బృందం

భీమడోలు, న్యూస్‌టుడే: జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు నాణ్యమైన సేవలు, సదుపాయాలు అందించాలని కేంద్ర ఎన్‌క్వాస్ బృంద సభ్యులు తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రెండో రోజు గురువారం బృందం సభ్యులు తనిఖీ చేశారు. సీహెచ్‌సీ భవనాలు, రహదారులు, మరుగుదొడ్లు, ప్రహరీ.. వైద్యులు, సిబ్బంది, అందుబాటులోని మందులు, రోగులకు అందిస్తున్న చికిత్స, శస్త్రచికిత్సలపై సమీక్షించారు. అనంతరం దస్త్రాలు పరిశీలించారు. కేంద్ర బృందాధికారి డాక్టర్ మహేంద్ర బెహరా, డాక్టర్ శ్రీరామశర్మ, సూపరింటెండెంట్ సునీత, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం సేకరణ : కలెక్టర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఈ నెల 30 నుంచి మూడ్రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం సాయంత్రం అధికారులతో దూర దృశ్య సమావేశం నిర్వహించి కల్లాల్లోని ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కోత దశకు రాని పంటకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ప్రతి రైతుకు వ్యవసాయ సిబ్బంది శాస్త్రీయ పరమైన మార్గదర్శకత్వం చేయాలన్నారు. వర్షాల సమయంలో ధాన్యం బస్తాలను ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో భద్రపరచుకోవచ్చన్నారు.

కూతపెడితే.. ప్రత్యర్థులు చిత్తే

కబడ్డీలో రాణిస్తున్న వైవీఎన్నార్ విద్యార్థులు

కైకలూరు, న్యూస్‌టుడే: కఠోర సాధన.. సాధించాలనే పట్టుదల ఉంటే విజయం సొంతమవుతుందని నిరూపిస్తున్నారు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. కబడ్డీ ఆటపై మక్కువతో ప్రదేశం తమదైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు ఈ కోర్టు క్రీడా కుసుమాలు. ఆటలో మెలకువలు ఒడిసి పట్టి జాతీయ, రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఔరా అనిపిస్తున్నారు.

క్రీడాకారుడిగా రాణిస్తా..

స్నేహితుల ప్రోత్సాహంతో కొన్నేళ్లుగా కబడ్డీ సాధన చేస్తున్నా. కళాశాలలో పీడీ శివ నాగ రాజు ఇచ్చిన శిక్షణ ఆట తీరులో మార్పు తెచ్చింది. ప్రస్తుతం బీకాం మూడో సంవత్సరం చదువుతున్నా. ఇటీవల విజయవాడ, విశాఖపట్నం, కడపతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ఆటగాడిగా ద్వితీయ స్థానం సాధించా. దీంతో జాతీయ స్థాయి సీనియర్ జట్టుకు ఎంపిక చేశారు. నిత్య సాధనతో మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందుతా. - సిద్ధార్థ

దేశపు జెర్సీ ధరిస్తా..

కబడ్డీ అంటేనే అమితమైన ఆసక్తి. పాఠశాల, కళాశాల తరఫున జిల్లా స్థాయి పోటీల్లో ఆడి బహుమతులు సాధించా. ప్రస్తుతం వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్నా. కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీల్లో కళాశాల తరఫున పాల్గొని మంచి ఆటతీరు కనబర్చడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యా. మూడేళ్లలో అంతర్రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి ప్రశంసా పత్రాలు కైవసం చేసుకున్నా. దేశపు జెర్సీ ధరించి దేశం తరఫున ఆడాలనేది కోరిక. - భాను

మరికొందరికి శిక్షణ ఇస్తా..

పాఠశాల స్థాయి నుంచి కబడ్డీ అంటే ఇష్టం. పదుల సంఖ్యలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జట్టుకు నాయకత్వం వహించా. బీఏ మూడో సంవత్సరం చదువుతున్నా. ఛత్తీస్‌గఢ్, గుజరాత్ రాష్ట్రాల్లో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ జట్టు తరఫున మూడు సార్లు పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానం సాధించాం. ఇటీవల విజయవాడ, విశాఖపట్నంలో నిర్వహించిన పోటీల్లో సీనియర్ విభాగంలో జాతీయ జట్టులో చోటు సాధించా. ప్రభుత్వ కొలువు సాధించి కబడ్డీపై ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇవ్వాలని కోరిక. - సుభాష్

నిరంతరం శ్రమిస్తున్నా..

కబడ్డీ అంటే ఇష్టం. పాఠశాల స్థాయి నుంచి అనేక పోటీల్లో పాల్గొన్నా. బీఏ మూడో ఏడాది చదువుతున్నా. ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయుల ఆటతీరు చూసి ప్రోత్సాహం పొందా. విజయవాడ, విశాఖపట్నం, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అంతరాష్ట్ర పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ జట్టులో స్థానం సాధించా. ప్రో కబడ్డీలో ఆడాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నా. - నరసింహ

యువకుడిపై పోక్సో కేసు

కైకలూరు, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడిపై కైకలూరు గ్రామీణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండలంలోని దొడ్డిపట్ల గ్రామానికి చెందిన ఓ అమ్మాయి(17) ఇంటర్ చదివి ఇంటి వద్దనే ఉంటోంది. ఈమెకు కలిదిండి మండలం తాడినాడ పంచాయతీ పరిధిలోని విభరాంబపురం గ్రామానికి చెందిన పామర్తి భార్గవ్(22)తో చదువుకునే రోజుల్లో పరిచయం ఉంది. దీనిని ఆసరాగా తీసుకుని కొన్ని రోజుల కిందట అమ్మాయి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో వచ్చి లైంగిక వాంఛ తీర్చాలని బలవంతం చేశాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. తల్లిదండ్రులకు విషయాన్ని తెలుపగా పరువు కోసం విషయాన్ని బహిర్గతం చేయలేదు. ఈ నేపథ్యంలో భార్గవ్ నాలుగు రోజులుగా ఆమెకు ఫోన్ చేస్తూ తనను పెళ్లి చేసుకోవాలని, లేకుంటే అంతు చూస్తానని బెదిరిస్తున్నాడు. ఇందుకు యువకుడి తల్లిదండ్రులు సహకరిస్తున్నారు. దీంతో అమ్మాయి గురువారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు భార్గవ్ అతని తల్లిదండ్రులు శ్రీనివాసరావు, శివరామలక్ష్మిలపై ఎస్సై వి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూత్రపిండాల రోగి ఇంటికి ముఖ్యమంత్రి!

...న పింఛను అందజేయనున్న చంద్రబాబు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి గురువారం పరిశీలించారు. గొల్లగూడెం-నల్లమాడు రోడ్డులో కారుమూరి తేజకు చెందిన వ్యవసాయ భూమిలో(2016లో ఏర్పాటు చేసింది) హెలిప్యాడ్, దాని సమీప చెరుకూరి శ్రీదేవి లేఅవుట్‌లో కార్యకర్తల సమావేశానికి సన్నాహాలు చేస్తున్నారు. గొల్లగూడెం నుంచి దూబచర్ల ర.భ.శా.రోడ్డులో వినియోగంలో లేని పెట్రోలు బంకు పక్కన కొక్కండ నాగ బ్రహ్మాచార్యులుకు చెందిన వ్యవసాయ భూమిలో ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నారు. దానికి సుమారు 50 మీటర్ల దూరంలో రోడ్డుకు మరో వైపునున్న వేములపల్లి వెంకటేశ్వరరావు వ్యవసాయ భూమిని పార్కింగ్‌కు కేటాయించారు. గోపినాథపట్నంలో డయాలసిస్‌తో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మి ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు పింఛన్ ఇవ్వనున్నారు. గొల్లగూడెంలో ఎవరికి పింఛన్ ఇస్తారో లేదో స్పష్టత రావాల్సి ఉంది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, చిత్రంలో ఆప్కాబ్ ఛైర్మన్ , డీఎస్పీ తదితరులు

విస్తృత ఏర్పాట్లు చేయండి: కలెక్టర్..

ఏలూరు వన్‌టౌన్: ఉంగుటూరు మండలంలో డిసెంబరు 1న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని, తదనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం అధికారులతో దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. హెలిప్యాడ్, సభా స్థలి ప్రాంతాలను వెంటనే పరిశీలించాలని, అనువైన ప్రాంతాలు గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జేసీ అభిషేక్ గౌడ, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, డీఆర్డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

బడి బస్సుల భద్రత లోపాలపై తనిఖీలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యా సంస్థల బస్సుల్లో భద్రతా లోపాలపై వారం రోజులపాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డీటీసీ కేఎస్ఎంవీ కృష్ణారావు తెలిపారు. రవాణా శాఖాధికారులు బడి బస్సుల్లోని భద్రతా లోపాలు గుర్తించి, యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఆయా యాజమాన్యాలు బస్సుల్లోని లోపాలు సవరించుకుని అధికారులకు సహకరించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.555 కోట్ల విలువైన పొగాకు కొనుగోళ్లు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఒకటో వేలం కేంద్రం పరిధిలో గురువారం వేలం ముగిసే నాటికి రూ.555 కోట్లు విలువైన 18.56 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరిగాయి. ఈ వేలం కేంద్రం పరిధిలో గురువారంతో వేలం ప్రక్రియ ముగిసింది. సోమవారం చూర పొగాకు కొనుగోళ్లు ఉంటాయని వేలం నిర్వహణాధికారి శ్రీహరి తెలిపారు. ఈ సీజన్‌లో మేలు రకం పొగాకు కిలోకి రికార్డు స్థాయిలో రూ.453 గరిష్ఠ ధర, రూ.299 సగటు ధర వచ్చింది. కాగా కనిష్ఠ ధరలు బాగా తగ్గి రూ.50కు పడిపోయింది. చివర్లో నాసిరకం పొగాకు కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడ్డారు.

పరిమితికి మించి.. ఒకటో వేలం కేంద్రం పరిధిలో 12.90 మిలియన్ కిలోలు పండించేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. కాగా రైతులు దీనిని అతిక్రమించి 18.56 మిలియన్ కిలోలు పండించారు. ఇది నాసిరకం పొగాకు ధరలపై తీవ్ర ప్రభావం చూపింది. కొనుగోళ్లు ముగియడంతో వేలం నిర్వహణాధికారి శ్రీహరి, ఇతర అధికారులు, సిబ్బందిని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు పరిమి రాంబాబు, నాయకులు కరాటం వెంకటరెడ్డినాయుడు, అల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాగి తీగల దొంగల ముఠా అరెస్టు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: నిర్మానుష్య ప్రాంతాల్లోని విద్యుత్తు నియంత్రికల్లో రాగి తీగను దొంగలిస్తున్న ముఠాను తడికలపూడి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏఎస్పీ సుస్మిత రామనాథన్ వివరాలు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, మణుగూరు, పరకాల గ్రామాలకు చెందిన కెల్లా దుర్గాప్రసాద్, షేక్ హైమత్, దేవకోటి రాజేశ్, కండెల జ్యోతి, కూరాకుల పద్మ, కోరగట్టు నాగరాజులు ఓ ముఠాగా ఏర్పడి విద్యుత్తు నియంత్రికల్లో రాగి తీగల చోరీలకు పాల్పడేవారు. ఈ నెల 24న నిందితులంతా కలిసి కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామ శివారులోని ఎత్తిపోతల వద్ద గల నియంత్రికలోని రాగి తీగ దొంగలించేందుకు నాగరాజును నియంత్రికపైకి మిగతా ముఠా సభ్యులు ఎక్కించారు. ఈ క్రమంలోనే విద్యుదాఘాతానికి గురై నాగరాజు కిందపడిపోయాడు. దీంతో వారందరూ కలిసి నాగరాజును జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించగా..అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆసుపత్రిలో చేర్చిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం సీఐ సుభాశ్, తడికలపూడి ఎస్సై చెన్నారావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం రావికంపాడు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా నిందితులు కెల్లా దుర్గాప్రసాద్, షేక్ హైమత్, దేవకోటి రాజేశ్, కండెల జ్యోతి, కూరాకుల పద్మలు రెండు కార్లలో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారని ఏఎస్పీ తెలిపారు. వీరిలో కెల్లా దుర్గాప్రసాద్‌పై తెలంగాణ రాష్ట్రంలో 13 కేసులు, కండెల జ్యోతిపై ఓ కేసు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అయిదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనకు సహకరించిన తడికలపూడి, జంగారెడ్డిగూడెం ఎస్సైలు చెన్నారావు, ఎన్వీ ప్రసాద్, ఏఎస్సై ఎన్వీ సంపత్‌కుమార్, పీసీలు ఎన్.రమేశ్, షేక్ షాన్‌బాబులను ఏఎస్పీ అభినందించారు.

సమావేశంలో నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

అదను దాటుతున్నా అదే తీరు

- అప్రమత్తం కాని ఆయిల్‌ఫెడ్
- ఆయిల్‌పామ్ మొక్కల సరఫరాలో జాప్యం

ఈనాడు-ఏలూరు: జిల్లాలో ఏపీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ పరిధిలో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కల కొరత వేధిస్తోంది. నాటడానికి అదను దాటిపోతోందని, మొక్కల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదవేగి, లింగపాలెం మండలాల్లో ఈ సాగు చేసే రైతులకు ఆయిల్‌ఫెడ్ మొక్కలు సరఫరా చేయాలి. ఈ ఏడాది ఉద్యాన శాఖ 13,700 హెక్టార్ల సాగు లక్ష్యాన్ని నిర్దేశించింది. 12 వేల హెక్టార్లలో రైతులతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు రాయితీపై మొక్కలు సరఫరా చేయాల్సి ఉండగా... కార్పొరేషన్ వెనకబడింది. ఇప్పటి దాకా 8 వేల హెక్టార్లకే సరఫరా చేసింది. మిగిలిన 4 వేల హెక్టార్లకు మొక్కల్లేక అయోమయం నెలకొంది. ఇటీవల ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దృష్టికి రైతులు మొక్కల సమస్యను తీసుకెళ్లగా ఉన్నతాధికారులతో మాట్లాడారు. అయినా యంత్రాంగం అప్రమత్తం కాలేదు..

నాలుగేళ్లుగా డిమాండ్.. నాలుగేళ్ల నుంచి రికార్డు స్థాయిలో ధరలు రావటం.. అదీ నిలకడగా కొనసాగుతుండటంతో లాభాల సాగుగా భావించి రైతులు ఈ సాగుకు మొగ్గు చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సాగు డిమాండ్‌ను అంచనా వేయటానికి డెవలప్‌మెంట్ అధికారులు ఉన్నారు. ముందుగానే విదేశాల నుంచి నాణ్యమైన సీడ్‌లింగ్స్ దిగుమతి చేసుకుని వాటిని ప్రాసెస్ చేసి రైతులకు నాణ్యమైన మొక్కలు అందజేస్తే నిర్దేశిత సమయానికి పంట వస్తుంది. ఆపై దిగుబడులు బాగా వస్తాయి. కానీ ప్రస్తుతం మోరంపూడి, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ నుంచి మొక్కలు తీసుకుని రైతులకు అందజేస్తున్నారు. వీటి నాణ్యత ఏమిటి? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎక్కడ ప్రాసెస్ చేశారని రైతుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. 'ఉద్యాన శాఖ చాలా ఎక్కువ లక్ష్యాన్ని ఇచ్చింది. మొక్కలు కొరతకు ఇదే కారణం. కార్పొరేషన్ నర్సరీతో పాటు ప్రైవేటు కంపెనీల నుంచి తీసుకుని ఇస్తున్నాం. రైతులకు నాణ్యమైనవే ఇస్తున్నాం. వచ్చే ఏడాది కోసం ప్రస్తుతం కామవరపుకోట నర్సరీలో 25 వేల మొక్కలు పెంచుతున్నాం' అని ఏపీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ఎండీ బాలాజీనాయక్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

సూర్య హాస్పటల్ కొవ్వూరు నందు పనిచేయుటకు నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఓటి టెక్నీషియన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 94919 92277.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899.

JOBS

ఏలూరు జ్ఞానికా TVS షోరూమ్‌లో వర్క్ చేయుటకు షోరూమ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ ఎగ్జిక్యూటివ్స్, సీనియర్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సంప్రదించండి ✆ 94922 25959.

దక్షిణభారత దేశంలో ప్రముఖచేపల రొయ్యలమందుల తయారీ ISO సర్టిఫైడ్ కంపెనీకి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, కైకలూరు, అమలాపురం, ఆకివీడు, గణపవరం హెడ్‌క్వార్టర్స్‌గా మాఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు అనుభవంగల పురుషఅభ్యర్థులు కావలెను. లోకల్‌వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం & అలవెన్సులుకలవు. 2 వీలర్ తప్పనిసరి. సంప్ర|| అల్ట్రాటెక్ మినరల్స్, గుంటూరు. మెయిల్: ultratechminerals@gmail.com. Ph: 9573308158. గమనిక: ఆక్వారంగంలో అనుభవం కల్గిన అభ్యర్థులు మాత్రమే సంప్ర.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.15 పై॥ తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉపోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

గ్రావెల్ తవ్వకాలు అడ్డుకున్న రైతులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గ్రావెల్ తవ్వకాలతో తమ పంట పొలాలు నాశనం అవుతాయని, గ్రావెల్ తవ్వకాలు నిలిపేయాలంటూ రైతులు తవ్వకాలను అడ్డుకుని నిరసన తెలిపిన ఘటన ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో గురువారం చోటు చేసుకుంది. కనసానపల్లి కర్రగట్టు వద్ద సర్వే నెంబరు 252-4లో 2.08 ఎకరాలు, సర్వే నెంబరు 260లో 0.72 ఎకరాలను గుంటూరుకు చెందిన శ్రీ ఎకోమైన్స్ సంస్థ యజమాని శ్రీనివాసరావు సుఖవాసి పేరుతో మైనింగ్ శాఖ నుంచి గ్రావెల్ లీజ్ ఉంది. దాంతో వారు గురువారం తవ్వకాలు ప్రారంభిస్తున్నారన్న విషయం తెలుసుకుని స్థానిక రైతులు ఆ ప్రాంతానికి చేరుకుని లారీని అడ్డగించారు. కొండ వద్ద తవ్వకాలు చేపడితే పశువులకు ఆవాసంగా ఉన్న కొండ పరీవాహక ప్రాంతం కలుషితమవుతుందని, క్వారీ టిప్పర్లు తిరగడం ద్వారా దుమ్ము లేచి వందల ఎకరాల్లో పండిస్తున్న పంటలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఎస్సై శుభశేఖర్ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకుని ఘర్షణలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్ర షెడ్యూల్ కమిషన్ ఛైర్మన్ పర్యటన వాయిదా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర షెడ్యూల్ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ జిల్లా పర్యటన వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. డిసెంబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో.. జవహర్ తన పర్యటన వాయిదా వేశారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చేపల చెరువు లీజు వివాదం

చెట్టున్నపాడులో ఉద్రిక్తత

స్థానికులకు సర్దిచెబుతున్న పోలీసులు

భీమడోలు, న్యూస్‌టుడే: చెట్టున్నపాడులో చేపల చెరువు లీజు వివాదం చినికిచినికి గాలివానగా మారింది. రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో దేవాదాయ శాఖకు చెందిన 42 ఎకరాల భూమిలో చేపల చెరువు లీజు విషయమై ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. దేవాదాయ శాఖ నుంచి చేపల చెరువును లీజుకు తీసుకున్న వ్యక్తులు అందులో యంత్రాలతో మరమ్మతులు చేసేందుకు గురువారం ప్రయత్నించగా.. వారిని మరో వర్గం అడ్డుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్సై మదీనా బాషా తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా.. వారు వినకుండా నినాదాలు చేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

(c) eenadu

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

గ్రామీణ దారులకు కొత్తరూపు: పత్సమట్ల

నిడమర్రు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గ్రామీణ రహదారులకు కొత్తరూపు సంతరించుకుంటున్నాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మందలపర్రు నుంచి గునపర్రు వరకు నాబార్డు నిధులు రూ.1.5 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని విస్మరించిందని ధ్వజమెత్తారు. అధ్వాన రహదారులతో అయిదేళ్లపాటు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక పల్లెల రూపురేఖలు మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సర్పంచులు దెందుకూరి సూర్యకాంతమ్మ, త్రిమూర్తిరాజు, కూనపరాజు వెంకట సత్యనారాయణరాజు, తెదేపా, జనసేన మండలాధ్యక్షులు ముత్యాల స్వామి, నిమ్మల దొరబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కర్షకులకు నష్టం కలగకుండా చర్యలు: జేసీ

సమావేశంలో పాల్గొన్న అభిషేక్ గౌడ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో.. కర్షకులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జేసీ ఎం.జె.అభిషేక్ గౌడ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆక్రమణల తదితరాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొని మాట్లాడారు. జడ్పీ సీఈవో శ్రీహరి, నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు (గ్రామీణ):	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? ఏలూరు నుంచి కొమడవోలు, కోటేలు వెళ్లే మార్గంలో భారీ వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నాయి. విద్యార్థులు, వృద్ధులు రోడ్డు దాటేందుకు భయాందోళన చెందుతున్నారు. - నరేశ్, స్థానికుడు

✔ భారీ వాహనాల వేగానికి కళ్లెం వేస్తాం. అవసరమైతే వాటి రాకపోకలు నియంత్రిస్తాం. - లక్ష్మణరావు, ట్రాఫిక్ సీఐ, ఏలూరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? ధాన్యం రాశులపై కప్పుకోవడానికి రాయితీపై పరదాలివ్వడం లేదు. ఫలితంగా ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. తుపాను హెచ్చరికల నేపథ్యంలో టార్పాలిన్లు ఇవ్వాలి. - వెంకటేశ్వరరావు, రైతు

✔ గ్రామంలోని ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించండి. వారు అందుబాటులోని పరదాలు ఇస్తారు. - అనిల్‌కుమారి, ఏడీఏ

? నగర శివారు బీడీ కాలనీ చెరువు గట్టు దిగువన వీధి దీపాలు వెలగడం లేదు. ఈ మార్గంలో రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - కుమార్, తంగెళ్లమూడి

✔ త్వరలో పంపి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. - పవన్, విద్యుత్తు ఏఈ

భీమడోలు, న్యూస్‌టుడే: ? స్థానిక లక్ష్మయ్యగారి రైసు మిల్లు వెనుక ప్రాంతంలో కొన్నాళ్లుగా పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించడం లేదు. రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోతుండటంతో దుర్వాసన వస్తోంది. - కె.బాబూరావు, స్థానికుడు

✔ చెత్త సేకరణ సక్రమంగా సాగేలా చూస్తాం. అక్కడ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. - తనూజ, పంచాయతీ కార్యదర్శి

దెబ్బతిన్న తాగునీటి పైపులైను

భీమడోలు, న్యూస్‌టుడే: పెద లింగంపాడులో తాగునీరందించే పైపులైను దెబ్బతినడంతో.. గురువారం సరఫరా నిలిచిపోయింది. గ్రామానికి వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులు చేస్తున్న సమయంలో.. భూగర్భంలోని పైపులైను పగిలిపోయింది. పెద్దఎత్తున నీరు లీకేజీ కావడంతో.. సరఫరా ఆగిపోయింది. అధికారులు ప్రత్యామ్నాయంగా ట్యాంకరుతో తాగునీరు సరఫరా చేశారు. సాయంత్రానికి మరమ్మతులు పూర్తి చేసినట్లు కార్యదర్శి కె.ఎల్.వి.తనూజ తెలిపారు.

ఆరోగ్యానికి 'పొగ'!

★ బహిరంగ ప్రాంతాల్లో చెత్తకు నిప్పు ★ ఇబ్బందులు పడుతున్న నగరవాసులు

ఏలూరు నగరంలోని కృష్ణా కాలువ గట్టుపై చెత్తా చెదారం పడేస్తున్నారు. దీనికి కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో.. ఆ ప్రాంతమంతా పొగ కమ్మేస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

వాయు కాలుష్యంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. పర్యావరణం విషతుల్యమవుతోంది. నగరంలో కృష్ణా కాలువ గట్టు వెంబడి, రైల్వే ట్రాక్ రోడ్డు, శనివారపుపేట కాజ్‌వే, తమ్మిలేరు పరీవాహక ప్రాంతాలతోపాటు శివారు కాలనీల్లోని రహదారుల పక్కన ఇష్టానుసారం చెత్తాచెదారం పడేస్తున్నారు. వాటికి కొందరు ఆకతాయిలు, స్థానికులు నిప్పు పెడుతున్నారు. ఫలితంగా ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేస్తోంది. గంటల తరబడి పొగ వస్తుండటంతో.. వాహనదారులు, పాదచారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు అస్వస్థతకు గురవుతున్నారు.

తరలింపులో చిత్తశుద్ధి

నగరంలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. రోజూ టన్నుల కొద్దీ చెత్త పోగవుతోంది. దీన్ని పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు సేకరించి.. ట్రాక్టర్లు, ఆటోల్లో డంపింగ్ యార్డుకు తరలించాలి. కానీ, క్షేత్రస్థాయిలో ప్రక్రియ సాగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో చిన్నపాటి చెత్త కుప్పలకు సిబ్బందే అగ్గి పెడుతున్నారు.

అనర్థాలెన్నో..

బహిరంగ ప్రాంతాల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చినపుడు విపరీతంగా పొగ వెలువడుతుంది. దీన్ని పీలిస్తే కళ్లు, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడే అవకాశాలున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం దహనం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 'నగరంలో పోగవుతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ఎవరైనా తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తీసుకుంటాం. బహిరంగ ప్రాంతాల్లో చెత్తకు నిప్పు పెట్టకుండా చూస్తాం' అని ఉప కమిషనర్ శివారెడ్డి తెలిపారు.

విజేతలతో కర్నాని పాఠశాల ఉపాధ్యాయులు

ఉపన్యసించి.. నిర్ణేతలను మెప్పించి!

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక కర్నాని పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై జరిగిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమలోని ప్రతిభను వెలికితీస్తూ.. అనర్గళంగా మాట్లాడారు. దేవి తేజశ్రీ(ప్రథమ), పూజిత(ద్వితీయ), నవ్యశ్రీ(తృతీయ) స్థానాలు సాధించారు. వారికి పాఠశాల సంచాలకుడు మదన్‌మోహన్‌రాజు, సత్యశారద బహుమతులు అందజేశారు.



సరస్వతీ విద్యానికేతన్‌లో.. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం'పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తన్మయి, శ్రీవాణి, సాయి సంజన తొలి మూడు స్థానాల్లో గెలుపొందారు. వారికి కరస్పాండెంట్ పద్మజ బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయినులు వి.మాధవి, ఎం.మౌనిక, కె.నవ్యశ్రీ పర్యవేక్షించారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా ఏలూరు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరును బాల్య వివాహాల రహిత జిల్లాగా మారుద్దామని ఐసీడీఎస్ పీడీ పి.శారద పిలుపునిచ్చారు. స్థానిక కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గురువారం కార్యక్రమం నిర్వహించారు. నగరంలో ప్రదర్శన చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు.



ఏలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికల ప్రదర్శన

ఉంగుటూరు: విడిది కార్యాలయంలో బాల్య వివాహ ముక్త భారత్ ప్రచార పత్రాలను ఎమ్మెల్యే ధర్మరాజు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి ఆవిష్కరించారు.

భీమడోలు: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బాల్య వివాహ ముక్త భారత్ గోడపత్రాలను గురువారం ఎంపీడీవో పద్మావతిదేవి, సీడీపీవో సునీల్ రాజశేఖర్ ఆవిష్కరించి మాట్లాడారు.

● స్థానిక గాంధీబొమ్మ కూడలిలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

దివ్యాంగ నిర్ధారణ వైద్య శిబిరానికి స్పందన

దెందులూరు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో నియోజకవర్గ స్థాయి దివ్యాంగ నిర్ధారణ వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఉచిత ఉపకరణాలు పొందేందుకు జరిగిన శిబిరంలో.. దివ్యాంగ బాలబాలికలు తరలివచ్చారు. సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త బి.భాస్కర రాజు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 60 మంది దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి.విజయ్‌కుమార్, భవిత, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెలను ప్లాస్టిక్ రహితంగా మారుద్దాం

కూచింపూడి(పెదవేగి) న్యూస్‌టుడే: పల్లెలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూచింపూడిలో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. గ్రామంలోని దుకాణాలు, ఇళ్ల వద్ద పేరుకుపోవడం చూసి.. స్థానికులకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, ఇంటింటికొచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. గ్రామంలో అస్తవ్యస్తంగా పెరిగిన చెట్ల కొమ్మలను గుర్తించి, వాటిని తొలగింపజేశారు. స్వచ్ఛతతో ఆరోగ్యకరంగా జీవించవచ్చని, ఈ విషయాన్ని గ్రామీణులు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.

ఇంటి ఆవరణలోని చెత్తను పరిశీలిస్తున్న చింతమనేని

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: తంగెళ్లమూడి ఉపకేంద్రం పరిధిలో విద్యుత్తు తీగల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ అంబేడ్కర్ తెలిపారు. ఆదివారపుపేట, లక్ష్మవారపుపేట, తమ్మిలేరు ఏటిగట్టు, లునానీ నగర్, బీడీ కాలనీ, ద్వారకానగర్, కండ్రికగూడెం, లంకపేట పరిసర ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నారు పోసి.. నీరు పెట్టి!

మొంథా తుపాను ప్రభావానికి కూరగాయల పంటలు పూర్తిగా పాడయ్యాయి. పొలాల్లో దెబ్బతిన్న వాటిని తొలగించి దుక్కి దున్ని కొత్తగా నారు వేశారు. ఏలూరు గ్రామీణ మండలం కొత్తూరులోని రైతులు నారు ఎండిపోకుండా సమీప కాలువల్లోని నీటిని మోటార్లతో ఇలా తోడుతూ.. తడులందిస్తున్నారు. - ఈనాడు, ఏలూరు

కొన్నారు.. వదిలేశారు!

రైతులకు మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వం ఆర్భాటంగా కియోస్క్ యంత్రాలు కొనుగోలు చేసింది. ఒక్కో యంత్రం రూ.75 వేలు చొప్పున.. మొత్తం 12 యంత్రాలకు రూ.9 లక్షలు వెచ్చించింది. ఆర్‌ఎస్‌కేల్లో కొన్నాళ్లు మాత్రమే సేవలందించిన కియోస్క్‌లు.. ఆపై మరమ్మతులకు గురై మూలకు చేరాయి. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

రోడ్డా.. డంపింగ్ యార్డా

ఏలూరు ఒకటో పట్టణం పాండురంగా థియేటర్ సమీప ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మించిన సర్వీసు రోడ్డు డంపింగ్ యార్డుగా దర్శనమిస్తోంది. ఈ దారికిరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. అక్కడే స్థానికులు చెత్తాచెదారం పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం

వాల్టా.. ఉల్టా

గణపవరం మల్లపురాజు కూడలి నుంచి కేశవరం శివారు వరకున్న రోడ్డు అంచుల్లో భారీగా పెరిగిన చెట్లను ఇటీవల నరికివేశారు. రెండు దశాబ్దాల వయసున్న వృక్షాలను దుండగులు తొలగించారు. వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. - న్యూస్‌టుడే, గణపవరం

దేవదాయ ధర్మాదాయ శాఖ
షాపు లైసెన్సునకు టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు నగరం, గన్‌బజారులో గల శ్రీ తలాటం పట్టయ్య సుబేదార్ సత్రం తాలూకు ఈ క్రింది పట్టికలో తెలిపిన షాపులో వ్యాపారం చేసుకొను లైసెన్సు హక్కు నిమిత్తం 3 సంవత్సరముల కాలమునకు అనగా అప్పగించిన నాటి నుండి ఇచ్చుటకు గాను ది. 08-12-2025న ఉదయం 11.00 గంటల నుండి సదరు షాపు వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున ఆసక్తిగలవారు పాట సమయంలో వారి ఆధార్ కార్డు ఇచ్చి ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ నెం.	డోరు నెం.	షాపు నెం.	విస్తీర్ణము స్వభావం	ధరావతు సొమ్ము
1	19-1-38	1	800 చ॥గ॥ షాపు	రూ. 30,000/-

పాట షరతులు: టెండర్లు దాఖలు చేయువారు తమ బిడ్ వివరములు మరియు చిరునామాతో ధరావతు సొమ్ము సత్రం పేరున డి.డి. రూపేణా జతపరచి సీల్డు కవరు ది. 08-12-2025న ఉదయం 10 గం.లలోపు ఈ దిగువ చిరునామాకు చేరునట్లు పంపవలయును. మిగిలిన నియమ నిబంధనల గురించి కార్యాలయం పనిచేయు వేళలలో ఈ క్రింది అడ్రస్సు వారిని సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

స్థలం: ఏలూరు శ్రీ తలాటం పట్టయ్య సుబేదార్ సత్రం, గన్‌బజారు, ఏలూరు
తేది: 26-11-2025 C/o. శ్రీ రంగ్రేజుల మఠం అనే శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానము
మెయిన్‌బజారు, ఏలూరు-1, సెల్: 99481 66689

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కొదమసింహం
అంబిక మినీ	రాజు వెడ్స్ రాంబాయి
సాయిబాలాజీ	12ఏ రైల్వేకాలనీ
బాలాజీ	జుటోపియా
సత్యనారాయణ స్క్రీన్ 1	కాంత
సత్యనారాయణ స్క్రీన్ 2	రివాల్వార్ రీటా
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మఫ్టీ పోలీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఆంధ్రకింగ్ తాలుకా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అమరకావ్యం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఆంధ్రకింగ్ తాలుకా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రేమంటే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	12ఏ రైల్వేకాలనీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కాంత

పోలియో మహమ్మారిని తరిమేద్దాం

ఏలూరు వన్‌టౌన్, నగరం- న్యూస్‌టుడే: జిల్లాలో పోలియో మహమ్మారి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్‌జీవీబీ స్వామి, ఆర్టీఎన్ చన్నా నాగభూషణరావు అన్నారు. నగరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన గురువారం అవగాహన ప్రదర్శన చేపట్టారు. దామోదర్‌రెడ్డి, వై.పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు.

తలసీమియా బాధితులకు రక్త పరీక్షలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో తలసీమియాతో బాధపడుతున్న పిల్లలు, వారి కుటుంబ సభ్యులకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన గురువారం రక్త పరీక్షలు చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాగంటి ప్రసాద్, బెన్ని మాట్లాడుతూ.. తలసీమియా సికిల్‌సెల్ వ్యాధుల కచ్చిత నిర్ధారణకు హెచ్‌పీఎల్‌సీ పరీక్ష అత్యంత కీలకమన్నారు.

ఘనంగా అంజన్న విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పెదవేగి మండలం తాళ్ల గోకవరంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

లేబర్ కోడ్లను రద్దు చేయండి: సీపీఎం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కర్షక, కార్మికులు, వ్యవసాయ కూలీలు, ప్రజలకు నష్టం చేకూర్చేలా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక వసంత మహల్ కూడలిలో లేబర్ కోడ్ పత్రాలను పార్టీ నాయకులు గురువారం దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తోందని దుయ్యబట్టారు. పోరాటాలు, ఉద్యమాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో ప్రధానమైన 29 రద్దు చేయడం దుర్మార్గమని ఆయన ధ్వజమెత్తారు. నాయకులు వైఎస్ కనకారావు, శ్యామలారాణి, ఆదిశేషు, ఇస్సాకు, గోపి, అరుణకుమారి, కోటేశ్వరరావు, లక్ష్మి, సత్యం, ఏసుబాబు, అమర్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

దళారీ వ్యవస్థకు తావివ్వొద్దు: బడేటి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో దళారీ వ్యవస్థకు తావివ్వొద్దని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 'రైతన్నా.. మీ కోసం' లో భాగంగా గ్రామీణ మండలం పోణంగిలో గురువారం ఆయన పర్యటించారు. పలువురు రైతులకు ముఖ్యమంత్రి పంపిన అభినందన పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు అన్నదాతల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని విధాలా ఆదుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని ఆయన కొనియాడారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

గవరవరం బ్రాంచి, అమీనపేట, ఏలూరు-534003.

లాకరు పగలగొట్టి తెరుచు ప్రకటన

బ్యాంక్ ఆఫ్ బరోడా, గవరవరం బ్రాంచి, ఏలూరు జిల్లా వద్ద అద్దెపై లాకర్లు తీసుకున్న మరియు అగ్రిమెంట్ ఉల్లంఘించిన మా విలువైన ఖాతాదారులకు సమాచారమివ్వడమైనది. అద్దెకు తీసుకున్నవారికి ఆర్.బి.ఐ. / బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం నోటీసులు వారి నమోదిత చిరునామాకు పంపబడినవి. అవి వ్యక్తులు / చిరునామాలు కనుగొనబడలేదని లేదా వెళ్లిపోయారని లేదా సమాధానం ఇవ్వలేదని తెలుపుతూ బట్వాడా కాకుండానే వాపస్ వచ్చినవి. వారి నమోదిత చిరునామాల వద్ద స్వయంగా లాకర్ హోల్డర్లను సంప్రదించుటకు చేసిన ప్రయత్నాలు విఫలమైనవి మరియు వారి ప్రస్తుత జాడ కూడా తెలియలేదు. ఆ విధంగా ప్రత్యామ్నాయం లేనందున దిగువ తెలిపిన వ్యక్తులందరినీ శాఖను సంప్రదించవలసినదిగా మరియు 15 రోజులలోగా బ్యాంక్ బకాయిలను చెల్లించవలసినదిగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో వారి వ్యయాలు, నష్టపూచీ మరియు బాధ్యతపై లాకరు పగులగొట్టి తెరుచుటకు బ్యాంక్ ముందుకు సాగుతుంది మరియు బకాయి ఉన్న అద్దె వ్యయాలు మరియు ఇతర ఛార్జీలు రాబట్టుకొనుట కొరకు తీసుకునే హక్కును బ్యాంక్ వినియోగించుకుంటుంది.

సం.	లెస్సీ/డిఫాల్టర్ కస్టమర్ పేరు	లాకర్ నెంబర్	బకాయి మొత్తం
1.	గుత్తా వి.ఆర్ కుమారి	1898 X 0079	రూ. 16,402/-
2.	వేగుంట రామకృష్ణ	1898 X 0094	రూ. 11,817.77/-

తేది: 27-11-2025
స్థలం: గవరవరం

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబరు 1న ఉంగుటూరు మండలంలో పర్యటిస్తున్న నేపథ్యంలో.. కూటమి నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. స్థానిక విడిది కార్యాలయంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణితో కలిసి గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. వీరాంజనేయులు మాట్లాడుతూ.. ఒకట్రెండు రోజుల్లో సీఎం పర్యటన షెడ్యూల్‌పై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. నాయకులు సుధీర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకొని అద్దెకివ్వండి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గృహ యజమానులు పూర్తి వివరాలు తెలుసుకున్నాకే కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకివ్వాలని డీఎస్పీ శ్రావణ్ కుమార్ సూచించారు. జిల్లాలో ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో.. ప్రజల భద్రతను పటిష్ఠం చేసేందుకు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ దృష్టి సారించినట్లు చెప్పారు. వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్లు, మాల్స్, హోటళ్ల యజమానులు సిబ్బందిని నియమించుకునే సమయంలో అన్ని వివరాలు సమగ్రంగా ఆరా తీయాలన్నారు. ప్రతిచోటా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అక్రమార్కుల్ని వదిలేయడం తగదు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరులో ఆర్టీసీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో నిధుల దుర్వినియోగానికి సంబంధించి విధించిన అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని ఐకాస నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. వారు మాట్లాడుతూ.. నిధుల దుర్వినియోగంలో అసలు దోషులు వదిలేసి, సంబంధం లేనివారిని సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు, కన్నబాబు, అప్పలరాజు తదితరులు మద్దతు తెలిపారు.

రిలే దీక్షలో ఆర్టీసీ ఉద్యోగులు

కృష్ణారావు మృతి తీరని లోటు

నిడమర్రు, న్యూస్‌టుడే: దేవరగోపవరం మాజీ సర్పంచి తుమ్మూరి కృష్ణారావు మృతి తీరని లోటని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గ్రామంలోని కృష్ణారావు నివాసంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. తొలుత తుమ్మూరి చిత్రపటానికి ధర్మరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అయిదేళ్ల పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన భార్య వెంకట నారాయణమ్మ ప్రస్తుతం సర్పంచిగా పని చేస్తూ.. భర్త ఆశయ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, జనసేన మండల ఇన్‌ఛార్జి బాచిరాజు, మండలాధ్యక్షుడు దొరబాబు, అచ్యుతం, బాబి, తుమ్మూరి పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు తదితరులు

తప్పిపోయిన బాలుడి అప్పగింత

చిట్టినగర్, న్యూస్‌టుడే: తప్పిపోయిన బాలుడిని కొత్తపేట పోలీసులు వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. ఏలూరు జిల్లా పాతూరు గ్రామం సాయిబుపేటకు చెందిన నాగుల్‌మీరా, మీరాబీ దంపతులు ఈనెల 27న మహంతిపురం, రాఘవరెడ్డి రోడ్డులోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతంలో బంధువుల వివాహానికి వచ్చారు. వారి 4 ఏళ్ల కుమారుడు షేక్ జాహిద్ ఆడుకుంటూ నైజాంగేటు ప్రాంతానికి వెళ్లి దారి మరిచిపోయాడు. బాలుడి కోసం తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై పద్మారావు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. నైజాంగేటు వద్ద బాలుడిని గుర్తించి తల్లిదండ్రుల వద్ద చేర్చడంతో పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్రాలు చూపుతున్న విద్యార్థినులు

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన అవసరం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వైద్యారోగ్య శాఖ జిల్లా అదనపు అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన గురువారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ థెరిసా డిగ్రీ, సీఆర్ రెడ్డి జూనియర్ కళాశాలలు, కేపీడీటీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రశ్నావళి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

జగన్మోహనరావు సేవలు నిరుపమానం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలకు దశాబ్దాలపాటు డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు నిరుపమాన వైద్య సేవలందించారని పలువురు కొనియాడారు. స్థానిక న్యూ అశోక్ నగర్‌లోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో. . ప్రముఖ వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్, అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు గ్రహీత జగన్మోహనరావు ప్రథమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. పలువురు నగర ప్రముఖులు, వైద్యులు, సన్నిహితులు, స్నేహితులు పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అట్లూరి సౌజన్య, లోహియా, లయన్స్ క్లబ్ సభ్యులు సుభాష్‌బాబు, ఉపేంద్ర, ఎంవీఎస్ రాజు, ఆర్‌ఎస్‌ఎన్ సూర్యనారాయణ, కోటేశ్వరరావు, శ్రీహరి, సుబ్బారావు, సత్యనారాయణ, ఐఎంఏ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంజలి ఘటిస్తున్న వైద్యులు, ప్రముఖులు

పెదపాడు- వట్లూరు మార్గం మధ్యలోని ఏలూరు- కృష్ణా కాలువపై వంతెన ఇరుకుగా ఉన్న దృశ్యమిది. తెదేపా ప్రభుత్వ హయాంలో వంతెనకు మరమ్మతులు చేసి రక్షణ గోడలు పటిష్ఠం చేశారు. ఈ వంతెన మీదుగా విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. రెండు గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల వ్యవసాయ భూములుండటంతో.. రైతులు తమ వ్యవసాయోత్పత్తులు తీసుకెళ్తుంటారు. వంతెన ఇరుకుగా ఉండటంతోపాటు రక్షణ గోడలు శిథిలమవుతుండటంతో రాత్రివేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

నిలుస్తాయా.. ఇంటికి చేరుస్తాయా..!

ప్రమాదకరంగా వారధులు

వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రధాన రహదారులపై నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వైకాపా పాలనలో వారధుల బాగోగులను విస్మరించడంతో.. పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వైకాపా సర్కారు ప్రధాన వంతెనల పునర్నిర్మాణానికి, మరమ్మతులకు రూపాయి కూడా కేటాయించలేదు. ఆయా రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు వారధులు దాటే వరకూ బిక్కుబిక్కుమంటున్నారు. కొన్ని సేతువుల రక్షణ గోడలు దెబ్బతినడంతో.. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు బాగుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం.. ప్రమాదకర వంతెనల మరమ్మతులు, పునర్నిర్మాణాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వట్లూరు మురుగు డ్రెయిన్‌పైనున్న వారధిని వంగాయగూడెం నుంచి పెదపాడు మీదుగా పెరికీడు వరకు నిర్మించే రహదారి విస్తరణ పనుల్లో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం' అని ర.భ.శా. ఏఈ శేషుకుమార్ తెలిపారు.

(c) eenadu

పోలవరం
•పోలవరం • చింతలపూడి

రీ సర్వేతో సరిహద్దు తగాదాలకు స్వస్తి

బొర్రంపాలెంలో రైతులతో మాట్లాడుతున్న సూర్యారావు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రైతులు తమ భూములకు రీసర్వే చేయించడం ద్వారా సరిహద్దు తగాదాలకు స్వస్తి పలకవచ్చని సర్వే సెటిల్‌మెంటు-లాండ్‌రికార్డ్స్ డీడీ కె.సూర్యారావు అన్నారు. బొర్రంపాలెంలో జరుగుతున్న రీ సర్వేను గురువారం ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. జంగారెడ్డిగూడెం డీఐ గాలీసాహెబ్, రీసర్వే డీటీ స్రవంతి, మండల సర్వేయర్ దుర్గారావు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉంటా

మంత్రి లోకేశ్‌తో నిఖిల్‌సాయి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: భవిష్యత్తులో సేవా దృక్పథం కలిగి ఉంటానని మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల విద్యార్థి నిఖిల్ సాయి అన్నారు. అప్పలరాజుగూడెంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం నాడు తాను అసెంబ్లీలో పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రతినిధిగా వ్యవహరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాజ్యాంగ విలువలు, నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవ గురించి తెలిశాయని వెల్లడించారు.

ద్వారకాతిరుమలలో కావడి ఉత్సవం

నేత్రపర్వంగా నెమలి వాహనంపై గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా నెమలి వాహనంపై ఊరేగిన స్వామివారిని భక్తులు దర్శించి తరించారు. ఉదయం కావడి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వెంకటలక్ష్మమ్మ

అవసరమైన వసతులు కల్పించాలి : డీఈవో

టి.నరసాపురం, న్యూస్‌టుడే: పాఠశాల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు సక్రమంగా కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. టి.నరసాపురంలోని శ్రీపాయిమెట్ల పబ్లిక్ పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల విద్యార్థుల, పలు దస్త్రాలు పరిశీలించారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతూ పాఠశాలలో వసతులు సక్రమంగా లేవని వారంలో వాటిని పూర్తిగా కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా 100రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, కనీసం 20మంది విద్యార్థులకు 500కు మార్కులు పైగా వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆమెతో పాటు ఎంఈవోలు రామమూర్తి, కళ్యాణి ఉన్నారు.

రూ.కోట్లు పోసి.. కొండను కొన్నారు..!

పోలవరం, న్యూస్‌టుడే:

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నవరత్నాల పథకంలో భాగంగా ఇళ్ల స్థలాల కోసం అధికారులు రూ.కోట్లు ఖర్చు చేసి పోలవరం పంచాయతీ పరిధి పైడిపాక పునరావాసకాలనీని అనుకుని సర్వే నంబర్ 336/2లో ఉన్న 8.5 ఎకరాలను కొనుగోలు చేశారు. ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేని ఈ భూములకు ఎకరానికి రూ.20 లక్షలు వంతున చెల్లించారు. వాటిని సరిచేయడానికి ఉపాధి హామీ పథకంలో మరిన్ని నిధులు కుమ్మరించారు. 242 మంది పోలవరం, పట్టిసీమ పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు అందులో పట్టాలు అందజేసి అయిదేళ్లు గడిచినా ఇప్పటికీ ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

కోర్టుకు వెళ్లిన మాజీ సైనిక ఉద్యోగి..

సదరు సర్వే నంబర్‌లో తనకు ఇచ్చిన కొంత భూమిలో వేరే వారికి నగదు ఎలా చెల్లిస్తారంటూ కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారు. అప్పటికే ఎకరానికి రూ.20లక్షల చొప్పున 8.50 ఎకరాలకు రూ.1.70 కోట్లు, అందులోని చెట్లు, షెడ్లు, బోర్లకు మరో రూ.25లక్షలు, భూమి చదును, లేఅవుట్, సర్వే రాళ్లు వేయడానికి సుమారు రూ.20 లక్షలు మొత్తం మీద రూ.2 కోట్లు పైబడి ఖర్చు చేశారు. సరిగ్గా 2020 మార్చిలో పట్టాలు పంపిణీ ప్రారంభించే సరికి స్టే రావడంతో అధికారులు పట్టాలతో పాటు హామీ పత్రాలకు సంబంధించిన లేఖ దానికి జత చేసి సమస్య పరిష్కరించిన వెంటనే ఇళ్లు నిర్మిస్తామని అందులో పేర్కొన్నారు.

పైడిపాక పునరావాస కాలనీ అనుకుని సేకరించిన భూమిలో పెరిగిన తుప్పలు

అయిదేళ్లుగా లబ్ధిదారులకు తీరని కష్టాలు

పట్టిసీమ పంచాయతీ పరిధిలో దాదాపు 60 మంది లబ్ధిదారులు ప్రస్తుతం ఆక్రమించిన స్థలాల్లో పాకలు వేసుకుని ఉంటున్నారు. పట్టాలు, హామీ పత్రాలు జాగ్రత్త చేసుకున్నారు. తమ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి లేదని అధికారులు చెబుతున్నారని.. తాము పాకలు వేసుకున్న ప్రాంతంలో విద్యుత్తు, నీటి సదుపాయం లేదని, కుండపోత వర్షం కురిస్తే లోపలకు నీరు చేరుతుందని కళ్లేపల్లి సత్యవేణి, పద్మావతి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టూ పొలాలు కావడంతో చీకటి పడితే పాములు తిరుగుతున్నాయని కొప్పిరెడ్డి సింహాచలం ఆందోళన వ్యక్తం చేశారు.

పాకలు వేసుకుని ఉంటున్నాం..

స్థలాల పట్టాలు చూపుతున్న పట్టిసీమకు చెందిన లబ్ధిదారులు

తహసీల్దార్ ఏమన్నారంటే..

స్థలం సమస్య కోర్టులో ఉంది. త్వరగా పరిష్కారం అవుతుందని భావించాం. వాయిదాలు నడుస్తున్నాయి. ఈలోగా ప్రభుత్వమే లబ్ధిదారుల విషయంలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తహసీల్దార్ సాయిరాజు చెప్పారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం:	80085 74478
కొయ్యలగూడెం:	80085 74947
చింతలపూడి:	76759 19086

పోలవరం, న్యూస్‌టుడే: ? రామయ్యపేట పునరావాస కాలనీలో వాటర్ ట్యాంకు పరిసరాల్లో వీధి దీపాలు పెద్దగా కాంతి రాకపోవడంతో రాత్రి సమయంలో పాముల భయం వెంటాడుతోంది. **- ఎస్.భీమయ్య, స్థానికుడు, రామయ్యపేట**

✔ఎల్ఈడీ దీపం వేయించేందుకు చర్య తీసుకుంటా. **- కొండలరావు, కార్యదర్శి, పోలవరం**

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ? అలివేరు పంచాయతీ నిమ్మలపాడులో మంచినీళ్ల ట్యాంకు లీకేజీ అవుతూ తాగునీరు వృథా అవుతుంది. కొత్త ట్యాంకు మంజూరు చేయాలి. **- స్థానికులు**

✔ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే నిర్మిస్తాం. **- కొడవర్తి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

? లంకపాకల గ్రామంలో డ్రెయిన్లు లేక మురుగు పారే వీలులేక అవస్థలు పడుతున్నాం. **- చింతల కృష్ణ, ఉప సర్పంచి**

✔ డ్రెయినేజీల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం. **- కె.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ?చింతలపూడి మండలం యర్రగుంటపల్లి ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించి అంచులు పూడ్చకుండా వదిలేశారు. - కుమార్, స్థానికుడు.

✔సిమెంట్ రోడ్ల వెంబడి అంచులను మట్టితో సరిచేసి సమస్య పరిష్కరిస్తాం. **- కామేశ్వరి, ఎంపీడీవో, చింతలపూడి.**

ప్రతిభను ప్రోత్సహించేందుకు దోహదం

విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో రాముడు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు దోహదపడతాయని జంగారెడ్డిగూడెం ఎంఈవో బుద్ధుల రాముడు అన్నారు. ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అన్న అంశంపై పోటీలు జరిగాయి. వి.సాయిప్రసన్న, ఆర్.రేణుక, కె.కీర్తన వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఎంఈవో రాముడు బహుమతులు అందజేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కె.శివప్రసాద్, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు, ఎ.అనిల్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యావికాస్ జూనియర్ కళాశాలలో..

విజేతలతో విద్యా సంస్థల ప్రతినిధులు

విద్యావికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు అన్న అంశంపై గురువారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. జి.భార్గవి, బి.హాసిని, ఎ.రిషిత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపల్ బొప్పన శ్రీనివాసరావు, వి.ప్రసన్నలక్ష్మి బహుమతులు అందజేశారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి:ఎమ్మెల్యే

విజయ కేతనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రోషన్ కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రణాళికాబద్ధంగా చదివి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన 'విజయకేతనం' పుస్తకాన్ని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే ఇంటర్‌లో మంచి కళాశాలలో సీటు వస్తుందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే రుచి చూశారు. ● పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. భట్టువారిగూడెంలో పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ప్రసంగించారు. భట్టువారిగూడెం రహదారికి రూ.4కోట్లు జడ్పీ నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

బాలరాజుకు సమస్య చెబుతున్న మహిళ

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రజల నుంచి వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి తగిన కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. బర్రింకలపాడులోని తన క్యాంపు కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన పలువురు గురువారం ఆయన్ను కలిసి సమస్యలపై వినతులు అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, కూటమి నేతలు పాల్గొన్నారు.

స్పిల్‌ఛానల్ రోడ్డు పునరుద్ధరణ

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి వచ్చిన వరదల కారణంగా స్పిల్‌ఛానల్‌లో వేసిన తాత్కాలిక రోడ్డు మొన్నటి వరకు నీటిలో ఉంది. కొద్ది రోజుల కిందట తిరిగి దెబ్బతిన్న రోడ్డు బయట పడటంతో పునరుద్ధరించే పనులు గుత్తేదారు ప్రతినిధులు చేపట్టారు. పోలవరం నుంచి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలోని 902 కొండ సమీపంలో వేసిన రోడ్డు వరదలకు దెబ్బతింది. దీంతో చెల్లాచెదురైన రాళ్లను సరిచేసి పైన గ్రావెల్ తీసుకొచ్చి వేస్తున్నారు. స్పిల్‌వే నుంచి వస్తున్న నీరు దిగువకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు మధ్యలో అక్కడక్కడా తూరలు ఏర్పాటు చేస్తున్నారు.

డీజిల్ దొంగిలించిన వ్యక్తులపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: నిలిపి ఉంచిన వాహనంలో డీజిల్ దొంగిలించిన వ్యక్తులపై బాధితుడి ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెం గ్రామానికి చెందిన ఎదురుపాక నాగేశ్వరరావుకు చెందిన లారీని జంగారెడ్డిగూడెం పట్టణం బైపాస్ రోడ్డులోని లారీ యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం నిలుపుదల చేశారు. గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు దుండగులు వచ్చి లారీలో 30 లీటర్ల డీజిల్ దొంగిలించారు. గమనించిన నాగేశ్వరరావు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. నిందితులు కత్తితో బెదిరించి పరారయ్యారు. దీనిపై బాధితుడు జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించారు.

ఉద్యోగిపై దాడి.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో శ్రీనివాసపురానికి చెందిన టి.మోజెస్ ఓ కారుకు ఫైనాన్స్ చేయించారు. అయితే వాయిదాలు చెల్లించకపోవడంతో సదరు కంపెనీవారు కారును కొద్ది రోజుల కిందట తీసుకొచ్చారు. దీనిపై ఈ నెల 26న మోజెస్ మరికొంత మంది ఫైనాన్స్ కంపెనీకి వెళ్లి సిబ్బందితో వాగ్వాదానికి దిగి కంపెనీ మేనేజర్ పి.పరమేశ్వరంపై దాడికి పాల్పడ్డారు. దీనిపై మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి రామచంద్రాపురానికి ఓ వాహనంలో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నారన్న సమాచారంతో దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో వ్యాన్‌లో తరలిస్తున్న 3 టన్నుల వ్యర్థాలను గుర్తించి.. ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై వాహన చోదకుడు కాకాడ ఇజ్రాయిల్, యజమాని ఎం. వెంకన్నబాబు, నగేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణం వైఎస్సార్ నగర్ సమీపంలోని పైడిపాక కాలనీ వద్ద నిర్వహిస్తున్న జూద స్థావరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు గురువారం దాడి చేసి అయిదుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 3,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

తెడ్లంలో.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: తెడ్లంలో గురువారం జూద స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో అయిదుగుర్ని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 3,500నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేట వద్ద పెనుప్రమాదం తప్పింది. వరంగల్ నుంచి తణుకు వెళ్తున్న తవుడు లోడు లారీ గురువారం ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొంది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ ముందు భాగం దెబ్బతింది.

పక్కకు ఒరిగి.. ప్రమాదకరంగా మారి..

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం మల్లాయిగూడెం, పోతునూరు గ్రామాల మధ్య ప్రధాన రహదారి వెంబడి ఉన్న విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఏ సమయంలో ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని సమీపంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే లైను చెరువు గట్టు వరకు ఉన్న స్తంభాలు పక్కకు వాలిపోయి ఉన్నాయని వెంటనే సరిచేయాలని కర్షకులు కోరుతున్నారు. పక్కకు ఒరిగిన విద్యుత్తు స్తంభాలను సరిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఏడీఈ రాంబాబు నాయక్ తెలిపారు.

ప్రధాన రహదారి.. అధ్వానం

గోగుమిల్లి మార్గం ఇలా..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెం- గోగుమిల్లి ప్రధాన మార్గం అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు పలు చోట్ల తీవ్ర కోతకు గురై, పెద్ద గోతులతో ఉండటంతో దాటి వెళ్లేందుకు కొండరెడ్డితెగ గిరిజనులు అష్ట కష్టాలు పడుతున్నారు. మలుపులు, కొండ ఎత్తైన ప్రదేశాల్లో కోతకు గురైన ప్రమాదకరంగా ఉన్నాయి. ముంజులూరు, గోగుమిల్లి గ్రామాల శివారుల్లోని కోతలు, గోతులతో నిండిన రహదారులు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. పులిరాముడుగూడెం నుంచి గెడ్డపల్లి, గిన్నేపల్లి, తంగేడుకొండ, ఉడతపల్లి, ఉర్రింక తదితర గ్రామాలకు ముంజులూరు మీదగా వెళ్లాలి. ఈ మార్గంలో ఉన్న కొండవాగులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. 'పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా తారురోడ్డు నిర్మాణానికి రూ.9 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపాం. మంజూరు కావాల్సి ఉంది' అని ఆ శాఖ ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

ఆసుపత్రి భవన నిర్మాణానికి కృషి : ఆయుష్ డీడీ

తనిఖీలు చేస్తున్న కుమార్‌బాబు

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట మండలం తడికలపూడిలో హోమియో ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని ఆయుష్ శాఖ ఏలూరు జోన్-2 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్‌డిడి) కె.వి.కుమార్‌బాబు తెలిపారు. సహకార సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆసుపత్రిని గురువారం తనిఖీ చేశారు. అవసరమైన మందుల సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంపౌండరు, స్వీపరు పోస్టులు భర్తీ చేయటం జరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రి భవన నిర్మాణానికి పంచాయతీ కేటాయించిన స్థలాన్ని డాక్టర్ రఫియా పర్వీన్ షేక్‌తో కలిసి పరిశీలించారు.

బంగారమ్మపేటలో కుక్కల బెడద

పోలవరం, న్యూస్‌టుడే: బంగారమ్మపేట గ్రామస్థులను కుక్కల భయం వెంటాడుతోంది. గత కొన్ని రోజులుగా గుంపులుగా తిరుగుతున్న కుక్కలు కోళ్లను పట్టుకుపోతున్నాయని పశువులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. వీధిలోకి వస్తే ఎటువైపు నుంచి వచ్చి మీద పడతాయో అన్న భయం గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను రోడ్డుపైకి పంపడానికి భయపడుతున్నామని తక్షణం పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి యు.రాజారావును సంప్రదించగా కుక్కలు పట్టుకునేందుకు రెండు రోజుల్లో వస్తున్నారని ఈ మేరకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న బొరగం శ్రీనివాసులు

రైతన్నా.. మీకోసం..

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించే అన్ని పథకాలు, సలహాలు, సూచనలు రైతులు వినియోగించుకోవాలని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. వెలగపాడు పంచాయతీలో గురువారం రైతన్నా-మీకోసంలో భాగంగా వ్యవసాయ శాఖ అన్నదాతలకు అందించే కరపత్రాలు విడుదల చేసి, ప్రసంగించారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమం వ్యవసాయాభివృద్ధికి రైతులకు మరింత తోడ్పడుతోందని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. కండ్రికగూడెంలో రైతన్నా మీకోసం కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు.

పదికి వంద రోజుల ప్రణాళిక

తడికలపూడిలో విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ సత్ఫలితాలు ఇచ్చేలా కృషి జరగాలని సొసైటీ ఛైర్మన్ తూతా బాలాజీ కుమార్ అన్నారు. విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ రూపొందించిన విజయకేతనం పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు కడిమి రమేశ్ తదితరులు మాట్లాడారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావుతో కలిసి జడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి సామ్యూల్ స్టడీ మెటీరియల్ అందజేశారు.

మహిళలతో మాట్లాడుతున్న పీతల సుజాత, గంటా పద్మశ్రీ

ఉపాధి కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

కామవరపుకోట, న్యూస్‌టుడే: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఆర్థిక సహకార సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. గురువారం తడికలపూడి ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రంలో పలు కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జడ్పీ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజ ప్రగతి మహిళాభ్యుదయంతో సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ కోర్సుల్లో శిక్షణ ముగిసిన 93 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రాంగణం అధికారిణి జుబేదా పర్వీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

కామవరపుకోట, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు నిమిత్తం శుక్రవారం తడికలపూడి, కళ్లచెరువు విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ ప్రకటనలో తెలిపారు.

డ్రెయిన్ నిర్మాణం ప్రారంభం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కుంతలగూడెం పంచాయతీ కనకాద్రిపురంలో మండల పరిషత్తు నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయిన్ పనులను ఎంపీపీ గంజిమాల రామారావు గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలుతీసుకుంటామన్నారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉషారాణి

స్త్రీ స్వేచ్ఛ కోసం ఓల్గా రచనలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్త్రీ స్వేచ్ఛ సమానత్వాల కోసం తన రచనల ద్వారా ఓల్గా సమాజాన్ని చైతన్య పరిచారని నిడదవోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు పి.ఉషారాణి అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓల్గా జయంతిని తెలుగు అధ్యాపకుడు వెంకట్‌లాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉషారాణి నవలలు, కవితల ద్వారా ఓల్గా స్త్రీ విముక్తి కోసం చేసిన సేవలను వివరించారు.

ఇనుప కంచె ఏర్పాటు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై సెప్టిక్ ట్యాంక్‌లో పడి గోవు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు గోవులు సెప్టిక్ ట్యాంక్‌ల వద్దకు వెళ్లకుండా రక్షణగా ఇనుప కంచె ఏర్పాటు చేశారు.

పీఏసీఎస్ అధ్యక్షుడి వివాహానికి చింతమనేని

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వీరభద్రవరంలో గురువారం జరిగిన మల్లుకుంట పీఏసీఎస్ అధ్యక్షుడు శీలం సాయి వినయ్ వివాహానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయివినయ్‌ను ఆయనతో పాటు పలువురు తెదేపా, జనసేన నాయకులు ఆశీర్వదించారు.

'విభజన రాజకీయాలు తగదు'

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ అధికారంలో కొనసాగడానికి మత ద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మండవ కృష్ణచైతన్య విమర్శించారు. ఇటువంటి విధానాలను ప్రజలు తిరస్కరించాలని కోరారు. కొయ్యలగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కృష్ణచైతన్య మాట్లాడారు.

గిరిజన సమాఖ్య మండల కమిటీ ఎన్నిక

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఏపీ గిరిజన సమాఖ్య బుట్టాయగూడెం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా చోడెం వెంకటేశ్వరరావు, కురసం రవీంద్ర ఎన్నికైనట్లు సీపీఐ మండల కార్యదర్శి చోడెం దుర్గ గురువారం తెలిపారు. మరో పదకొండు మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

CHANGE OF NAME
I, GUNTAMUKKALA SREE VIJETA, W/o. Jakkula Raju, R/o. Flat No.204, Bellamkonda Apartment, Power peta, Eluru, Eluru District-534002. I have Changed my name From GUNTAMUKKALA SRI VIJETHA (Old Name) to GUNTAMUKKALA SREE VIJETA (New Name) for all practical purpose.

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

తరగతి గదుల్లో బోధనపై శిక్షణ

మాట్లాడుతున్న ఎంఈవో-2 బ్రహ్మాచారి

చాట్రాయి, న్యూస్‌టుడే: తరగతి గదుల్లో బోధన తీరు సమూల మార్పులకు త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఎంఈవో-2 వీవీఎస్వీ బ్రహ్మాచారి తెలిపారు. ఉపాధ్యాయుల బోధన తీరుపై 'టీచ్ టూల్' కార్యక్రమంలో రెండు రోజుల శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బోధిస్తున్న సమయంలో సమన్వయకర్తలు పరిశీలించి నివేదిక ఇస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పరిశీలన తర్వాత నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎంఈవో-1 మాసగిరి శ్రీనివాస్, సమన్వయకర్తలు జి.సంజీవ్‌కుమార్, వి.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

బాలరావమ్మకు కాసుల పేరు, సారె సమర్పణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఆగిరిపల్లి దుగ్గిరాల బాలరావమ్మ తల్లి అమ్మవారికి ఆగిరిపల్లికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు జూలూరు చంద్రమౌళీశ్వరరావు మనుమరాలి దంపతులు దూపగుంట్ల వినూష దుర్గ - మణిగోపాల్ గురువారం రూ.30 వేల విలువైన కాసుల పేరు, చీర సారెను బహూకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, స్నపన, అలంకరణ, అష్టోత్తర పూజలను అర్చకులు పి.పుల్లయ్య వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, మాలధారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

స్పందనకు వందనం

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు వైఎస్సార్ కాలనీలో డ్రెయినేజీ మురుగునీరు ముందుకు కదలక దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసుడు సురేంద్ర 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచారు.

● కైకలూరు 7వ వార్డులో వీధి దీపాలు కొన్ని రోజులుగా సక్రమంగా వెలగడం లేదని స్థానికుడు క్రిష్టోఫర్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.

● మండలంలోని రామవరం పంచాయతీ రోడ్డులో వీధి దీపం కొన్ని రోజులుగా వెలగడం లేదని స్థానికుడు రామాంజనేయులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి కొత్త దీపం ఏర్పాటు చేయించారు.

'ఉపాధి'లో కూలికి ఏదీ హామీ!

మూడు నెలలుగా ఖాతాల్లో పడని నగదు

నూజివీడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఉన్న జాబ్ కార్డుల్లో మూడొంతుల మంది ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. చేసిన పనుల్ని వారాంతంలో కొలతలు తీసి మరుసటి వారం నగదును ఖాతాలో జమ చేయాలన్నది పథక నిబంధన. కానీ ఇది సరిగా అమలు కావడం లేదు. పథకంలో పనిచేసే కూలీల పర్యవేక్షణకు సిబ్బంది నియామకం, వారికి వసతులు సవ్యంగానే ఉన్నా నగదు మాత్రం సకాలంలో పడటం లేదు.

నియోజకవర్గ సమాచారం..

మండలం	శ్రామికులు	పాల్గొనేవారు
నూజివీడు	24,870	18,980
ఆగిరిపల్లి	22,752	17,761
ముసునూరు	26,383	23,150
చాట్రాయి	23,722	18,696
మొత్తం	97,727	78,587

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరికి మూడు నెలలుగా బిల్లులు అందకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

త్వరలో జమ చేస్తారు..

ఉపాధి కూలీలకు సంబంధించి బకాయి బిల్లులు త్వరలోనే వారి ఖాతాలకు జమ అవుతాయి.

- పి.శ్రీనివాస్, డ్వామా ఏపీడీ, నూజివీడు.

వైభవంగా గంగా హారతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఊటుకూరులోని సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయ పంచమ వార్షిక షష్ఠి మహోత్సవాల్లో భాగంగా గురువారం నవగ్రహ పూజ, హోమం వంటి విశేష పూజలు నిర్వహించారు. దంపతులు హోమంలో కూర్చుని పూజలు చేశారు. రాత్రి కోనేరులో గంగా హారతి వైభవంగా నిర్వహించారు. హారతులను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆలయంలో కావడి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కోటపాడులో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

చాట్రాయి, న్యూస్‌టుడే: కోటపాడులో శివాలయంలో బుధవారం రాత్రి సుబ్రహ్మణ్య కల్యాణ మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్సవ విగ్రహాలను వితరణగా అందించిన మద్దిరాల సత్యనారాయణ, మారేశ్వరి దంపతులను కమిటీ సభ్యులు సత్కరించారు.

సాయిబాబాకు విశేష పూజలు.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. అర్చకుడు దీపక్ పాండ్యే సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాలతో అభిషేకాలు, హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అందరూ ముందుకొస్తే నా సాయం రూ.10 లక్షలు: మంత్రి

మాట్లాడుతున్న వినూత్న, పక్కన పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రికి ఇష్టమైన పీ4 కార్యక్రమంలో అందరూ భాగమైతే నా వంతుగా రూ.10లక్షలు ఇస్తానని మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చేవాళ్లు, ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు అధికారులు ముందుకు రావాలన్నారు. గురువారం సబ్‌కలెక్టరు కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై నిర్వహించిన కార్యక్రమంలో మంత్రితో పాటు నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, పురపాలక కమిషనర్ పీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఆర్థికాభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం, సామాజిక పురోగతి, సుపరిపాలన వంటి వాటిపై దృష్టి సారించేందుకు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.3.5లక్షలతో ఏర్పాటు చేసిన నియోజకవర్గ అభివృద్ధి కార్యాలయం, రూ.20లక్షలతో ఆధునికీకరించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ప్రారంభించారు. రూ.5లక్షలతో ఏర్పాటు చేయనున్న సమాచార మందిరానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బత్తులవారిగూడెం, రేగుంటల గ్రామాల్లో ప్రారంభోత్సవాలు చేశారు. దేవరగుంట, జంగంగూడెం గ్రామాలకు చెందిన పలువురు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డీఎల్పీవో పి.వెంకటరత్నం, ఎంపీడీవో చెన్నా రామమోహన్‌రావు, తహసీల్దారు జి.బద్రు వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.35.56లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న 74 కుటుంబాలకు రూ.35.56 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. గురువారం నియోజకవర్గంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల మాయలో పడొద్దు

కైకలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక మాధ్యమాల మాయలో పడి చదువును నిర్లక్ష్యం చేయొద్దని కైకలూరు పట్టణ సీఐ ఏవీఎస్ రామకృష్ణ, గ్రామీణ ఎస్సై వి.రాంబాబు అన్నారు. నవజీవన్ బాలభవన్ 'నీతోడు' మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎం.లీలావతి ఆధ్వర్యంలో కైకలూరు, భుజబలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం 'సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సీఐ, ఎస్సై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చరవాణితో గంటల తరబడి గడపడం ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. దీని కారణంగా మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చి చదువుపై శ్రద్ధ చూపలేకపోతారని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేలా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన అవసరం..

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)పై ప్రజలకు అవగాహన అవసరమని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు కె.అనిల్, బి.రవికుమార్ సింగ్, పి.సుజన్, ఇ.ఈశ్వర్, పి.పురుషోత్తమ శర్మ, ఎస్‌కే షరీఫున్నీసా, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఈవోగా శింగనపల్లి

కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి భోగేశ్వరలంకలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థాన ఈవోగా శింగనపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనరు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఈవోగా పని చేస్తున్న వీఎన్‌కే శేఖర్ విస్సకోట గ్రూపు దేవాలయాలకు బదిలీపై వెళ్లారు.

రహదార్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలో పలు రహదార్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఈ మేరకు జీవో నం. 934 జారీ చేశారు. ఆ ఉత్తర్వులను ఈఎన్‌సీ, అకౌంట్స్ తదితర విభాగాలకు పంపించారు. ఆగిరిపల్లి మండలంలో చొప్పరమెట్ల నుంచి సగ్గూరు వెళ్లే 3.70 కి.మీ. రహదారికి రూ. 1.50 కోట్లు, నూజివీడు-ఏలూరు రహదారిలో సింహాద్రిపురం నుంచి వయా కొత్తూరు మీదుగా జడ్పీ రహదారికి రూ.కోటి, ముసునూరు మండలంలో అక్కిరెడ్డిగూడెం నుంచి గోగులంపాడు రహదారి 4.70 కి.మీ.కి రూ.కోటి, ఆగిరిపల్లి మండలంలోని కొత్త ఈదరలో 4 కి.మీ రహదారికి రూ.4 కోట్లు, విజయవాడ నుంచి కలటూరు అప్రోచ్ రోడ్డు 1.07 కి.మీ.కి రూ.70 లక్షలు, దిగవల్లి నుంచి వలసపల్లి రహదారి రమణక్కపేట సూరేపల్లి తుమ్మగూడెం రహదారి 3 కి.మీ.కి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 17.82 కి.మీ. మేర రహదారుల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశారు.

బాలిక పెళ్లి అడ్డగింత

కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గోపవరంలో గురువారం బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గోపవరం గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయించారు. హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు.. బాలిక నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులు, పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. దీంతో వివాహం నిలిపేయడానికి అంగీకరిస్తూ ఇరు కుటుంబాల వారు పెద్దల సమక్షంలో లిఖిత పూర్వక హామీ ఇచ్చారు. బాల్య వివాహాలు జరిపించే వారికి మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి హెచ్చరించారు. మహిళా సంరక్షకురాలు సంధ్యారాణి, ఛైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ రవి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి అండ

చాట్రాయి, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి అండగా నిలిచిందని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. చనుబండలో రూ.74వేల విలువైన సహాయ నిధి చెక్‌లను గురువారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో తొమ్మిది కోట్ల నగదు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించారని తెలిపారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

చిగురుకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు సామాజిక దురాచారం నేరమని దానివల్ల బాలికల విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, దీన్ని ప్రతి ఒక్కరూ అరికట్టాలని పలువురు పేర్కొన్నారు. చిగురుకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణకుమారి, సుభాషిణి, చిన్నారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని పోతురెడ్డిపల్లిలో క్లస్టర్ జోన్ కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. అందరూ కలిసి బాల్య వివాహాల వ్యతిరేకతపై ప్రతిజ్ఞ చేశారు. గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా మావంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

ప్రభుత్వ స్థలమని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గొల్లపల్లి పంచాయతీలో ఆక్రమణల పైన పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రభుత్వ భూమిలో కొంతమంది నిర్మాణాలు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై సబ్‌కలెక్టరు విచారణకు ఆదేశించారు. తహసీల్దారు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గ్రామస్థులు విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణ ఈలోపు పునాది దశకు చేరింది. ఈ విషయంలో పైనుంచి ఒత్తిడి రావడంతో ఆర్ఎస్.నం. 137-17, ఎల్‌పీఎం 883లోని భూమిని ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కైకలూరు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ కైకలూరు మండల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. స్థానిక ఓరియంటల్ జడ్పీ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో మండలాధ్యక్షుడిగా దండె బెనర్జీ, ప్రధాన కార్యదర్శిగా పెన్మత్స సురేశ్, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులను బలోపేతం చేయడంతో పాటు వారి సమస్యలపై నిరంతరం పోరాడుతామని నూతన నాయకులు తెలిపారు. జిల్లా కార్యదర్శి మారెళ్ల రవిశంకర్, కార్యవర్గ సభ్యుడు చిట్టిబాబు, హెచ్ఎం కట్టా విష్ణుమూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త వేసెయ్... తగలబెట్టేయ్..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల కేంద్రంలోని చెత్తను గ్రామ శివారులో రోడ్డు పక్కనే పోసి నిప్పు పెట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఎంపీడీవో రమణబాబు సర్పంచులకు చెత్త సమస్యపై సమావేశాన్ని నిర్వహించి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని ప్రకటించినా గురువారం చెత్తను ఇలా చేయడం గమనార్హం. ఇళ్లలోని చెత్తను పెద్దఎత్తున సేకరించి ఆటోలో గ్రామ శివారుకు తరలించడం పరిపాటిగా మారింది. చెత్త నుంచి సంపదను సృష్టిస్తే పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు మొత్తుకుంటున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. దీనిపై ఈవోపీఆర్డీని వివరణ కోరగా చెత్తను సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కూలితే గాని పట్టించుకోరా..

ట్యాంకు పెచ్చులూడి కనిపిస్తున్న ఇనుప చువ్వలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ముదినేపల్లిలోని మంచినీటి చెరువు వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. నేడో-రేపో కూలటానికి సిద్ధంగా ఉంది. ట్యాంక్ మొత్తం పెచ్చులూడి పోయి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. ఎక్కడికక్కడ నీరు లీకవుతోంది. కనీసం మరమ్మతులు సైతం నిర్వహించకపోవడంతో ప్రమాద భరితంగా మారింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి జి.రమేశ్‌ను సంప్రదించగా ట్యాంక్ పరిస్థితిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. నూతన ట్యాంకు నిర్మాణం కోసం అంచనాలు రూపొందించాలని కోరామన్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తామని వివరించారు.

ఖాళీగా బస్సు.. తిరిగితే సర్వీసు బాగు

కొత్తపల్లిలో పాఠశాల వద్ద ఇలా..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం కొత్తపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల కోసం మచిలీపట్నం డిపో నుంచి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసింది. రోజు ఉదయం 8 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి నేలకొండపల్లి, కల్వగుంట, ఉప్పరకల్వగుంట, పెనుమెల్ల, గాయంపాడు, వాడవల్లి నుంచి విద్యార్థులను ఎక్కించుకుని కొత్తపల్లిలోని ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకువస్తుంది. ఆ తర్వాత ఆ పాఠశాల వద్దే పక్కన పెట్టేస్తున్నారు. తిరిగి సాయంత్రం అదే పాఠశాల విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తోంది. దాదాపు 8 గంటల పాటు పాఠశాల వద్ద ఖాళీగా పెడుతున్నారు. అలాకాకుండా మచిలీపట్నానికి సర్వీసు తిరిగితే తమకు రవాణా సౌకర్యం కలుగుతుందని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై మచిలీపట్నం డిపో మేనేజరు టి.పెద్దిరాజును సంప్రదించగా.. అది బడి బస్సు అని తెలిపారు. విద్యార్థులు ఇబ్బంది పడకూడదని ఏర్పాటు చేశామన్నారు. సర్వీసు నడపాలంటే మరో ముగ్గురు సిబ్బంది అవసరమవుతారన్నారు. అంత మంది సిబ్బంది, బస్సులు లేవని ఆయన వివరించారు.

సైబర్ మోసాల్లో గోల్డెన్ అవర్ కీలకం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సైబర్ మోసాల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, నేరం జరిగిన గంటలోపు ఫిర్యాదు చేయగలిగితే పోగొట్టుకున్న మొత్తాన్ని రాబట్టడానికి అవకాశముంటుందని ఎస్సై కె.శుభశేకర్ తెలిపారు. ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

పంచ సూత్రాలపై రైతులకు అవగాహన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సూచించిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచ సూత్రాలపై వ్యవసాయ శాఖ జేడీ ఎస్‌కే హబీబ్ బాషా రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని బత్తులవారిగూడెంలో గురువారం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. మంత్రి కొలుసు పార్థసారథి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 12,723 కుటుంబాలకు ఇప్పటి వరకు 9,830 కుటుంబాలు పూర్తయ్యాయని జేడీ పేర్కొన్నారు.

జోరుగా క్యాన్సర్ సర్వే

తక్కెళ్లపాడు సర్వేలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది.

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో క్యాన్సర్‌పై ఆరోగ్య సిబ్బంది జోరుగా సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు పవిత్ర, సుమ తెలిపారు. గ్రామాల్లోని అన్ని ఇళ్లకు వెళ్లి రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్లపై అవగాహన కల్పిస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించి నమోదు చేస్తున్నారు. తక్కెళ్లపాడులో ఎంఎల్‌హెచ్‌పీ దివ్య మరియ, ఏఎన్ఎం ప్రమీల, ఆశా కుమారి తదితరులు పాల్గొన్నారు.

గోదాములో అగ్ని ప్రమాదం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని మొర్సపూడిలో వేవ్ కంపెనీలో గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. గోదాములో నిల్వ ఉంచి సంచులు అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి జి.నాగరాజు తన సిబ్బందితో వెళ్లి మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.10 వేలు నష్టం ఉంటుందని పేర్కొన్నారు.

అవి ఇవి అన్నీ

నేడు పోలింగ్ బూత్‌లపై సమీక్ష

చాట్రాయి, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన తెదేపా చింతలపూడి ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను చాట్రాయి మండలంలో నరసింహారావుపాలెం, పర్వతాపురం, చిన్నంపేట, కోటపాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించనున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బలహీనంగా ఉన్న బూత్‌లపై సమీక్ష చేయనున్నారు.

మొక్కజొన్న విత్తనాలు సీజ్

చాట్రాయి, న్యూస్‌టుడే: సరైన రీతిలో విత్తనాలను అమ్మి, వాటిని నమోదు చేయనందున చాట్రాయిలో రూ.3,90,214 విలువైన విత్తనాలను గురువారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏవో మీరయ్య, ఎస్ఐ నాగరాజు దుకాణంలో తనిఖీ నిర్వహించారు. అమ్మకాలు, నిల్వల్లో వ్యత్యాసం గుర్తించి 6-ఎ కేసు నమోదు చేశామని ఏవో శివశంకర్ తెలిపారు.

ఆక్వా సాగును పరిశీలించిన ఝార్ఖండ్ రైతులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం చింతపాడులోని చేపలు, రొయ్యల చెరువులను ఝార్ఖండ్‌కు చెందిన రైతులు గురువారం పరిశీలించారు. ఆక్వా సాగులో లాభ నష్టాలు, పెంపకం ఎలా? చేపలు ఎన్ని నెలలకు పెరుగుతాయి.. వాటికి మేత ఇతర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లా చందన్‌కేరి డీఏఎస్‌కే సొసైటీకి చెందిన 16 మంది సభ్యులు ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో మండవల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు

శ్రీకృష్ణదేవరాయల మండపం వద్ద చిన్నారులు, ఉపాధ్యాయులు.

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా కృష్ణా జిల్లా ఘంటసాలలోని బౌద్ధ స్తూపాలను గురువారం సందర్శించారు. బుద్ధుడు కాలంనాటి శాసనాలు, విగ్రహాలు విద్యార్థులకు చూపించి వాటి వెనుక ఉన్న సైన్స్‌ను వివరించారు. 2, 3వ శతాబ్దంలోని వివిధ విగ్రహాలు ఆనాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా చూపించాయి. విద్యార్థులంతా ఆసక్తితో విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నారు. అనంతరం శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన ఆలయాలను సందర్శించారు. ఉపాధ్యాయులు కాత్యాయని, అమీన, సత్యనారాయణ, జోత్స్నప్రియ, పీడీలు కృష్ణవేణి, రవికుమార్ 80 మంది విద్యార్థులతో ఈ యాత్రలో పాల్గొన్నారు.

పంట మార్పిడి విధానం అనుసరించండి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, తెదేపా నాయకులు

మండవల్లి, న్యూస్‌టుడే: పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీడీవో రమణబాబు తెలిపారు. మండవల్లి మండలం కొర్లపాడులో రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌తో కలిసి పాల్గొని రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. నష్టాలు లేని వ్యవసాయాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింతగా రైతులను ఆదుకోవడానికి అనేక పథకాలు తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఇందులో తెదేపా మండలాధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, సర్పంచి యడలి నాగేశ్వరరావు, నాయకులు కూనపరెడ్డి కోటేశ్వరరావు, గంజాల శ్రీనివాస్, టేకు రమేశ్ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నాగరాజు



ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఆగిరిపల్లి మండలం కొత్త ఈదరకు చెందిన దొడ్డా నాగరాజు నియమితులయ్యారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గం సభ్యుల జాబితాలో ఆయనకు చోటు లభించింది. దాంతో తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు. భాజపా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు గురువారం నాగరాజును అభినందించారు.

'లేబర్ కోడ్‌లను ఉప సంహరించుకోవాలి'

ముసునూరు, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక విధానాలకు దోహదం చేసే లేబర్ కోడ్‌లను సత్వరమే రద్దు చేయాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. గురువారం ముసునూరు మండలం రమణక్కపేటలో ఏఐసీసీటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ.. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ఈ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. డిసెంబర్ 6, 7 తేదీల్లో కడపలో జరిగే సీపీఐఎంఎల్ లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. భవాని, బాబూరావు, శ్రీనివాసరావు, చంటి, చిన్నబాబు పాల్గొన్నారు.

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని ఆందోళన

నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ చలసాని రామారావు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కరోనా కాలంలో 72 గ్రామాల్లో జీపు యాత్ర, లక్ష కరపత్రాల పంపిణీ, 25వేల సంతకాల సేకరణ చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు

(c) eenadu

ఈనాడు
కాకినాడ
శుక్రవారం నవంబరు 28, 2025

సుబ్రహ్మణ్యస్వామికి ఊంజల్ సేవ

అన్నవరం వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఊంజల్ సేవ గురువారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సుందరంగా వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దిన ఊయలలో ఆశీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. ఊంజల్‌సేవ (ఉయ్యాల సేవ), ఏకాంత సేవ (శ్రీపుష్పయాగ మహోత్సవం) తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై వేడుకను వీక్షించారు.

– న్యూస్‌టుడే, అన్నవరం

ఏటిగట్టు రహదారికి మహర్దశ

రావులపాలెం పట్టణం: ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయం శనివారం వచ్చిందంటే చాలు.. భక్తులతో కిటకిటలాడుతుంది. ఆ రోజు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వాడపల్లి వెళ్లేందుకు ఊబలంక - బొబ్బర్లంక రహదారి సింగిల్ రూట్ కావడంతో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఏటిగట్టు రహదారిని అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరడంతో ఆయన వెంటనే రూ.6 కోట్లు మంజూరు చేశారు. రావులపాలెం గౌతమి వంతెన వద్ద నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లికి ఏడు కిలో మీటర్లు దూరం ఉంది. ఉపముఖ్యమంత్రి నిర్ణయంతో ఇది అభివృద్ధి కానుంది. వాడపల్లి వెళ్లే భక్తులతోపాటు ఈ ఏటిగట్టు చెంతన ఉండే రావులపాలెం, ఊబలంక, మెర్లపాలెం, వాడపల్లి గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

ఆలివ్ రిడ్లే.. ఆహార్యం పదిలం

ఇక్కడ కన్పిస్తున్నది బొమ్మ తాబేలు అనుకుంటే పొరపాటు.. ఇది నిజంగా సముద్రంలో నివసించే ఆలివ్‌రిడ్లే తాబేలే.. కానీ దీనికి ప్రాణం లేదు. పదేళ్ల కిందట సేకరించిన కళేబరాన్ని వివిధ రసాయనాల పూతలతో ఇప్పటికీ చెక్కుచెదరకుండా సంరక్షిస్తున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య, సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కార్యాలయంలో ఇది ఉంది. ఇక్కడ వివిధ రకాల చేపలూ ఆకట్టుకుంటున్నాయి. వాటికి సంబంధించిన పేర్లు, పూర్తి సమాచారం అందుబాటులో ఉంది. ఈ కార్యాలయంలో రొయ్యల, చేపల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తుంటారు. వీటి ఎగుమతుల్లో ఇది ఎంతో కీలకం. ఆక్వా రైతుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

– ఈనాడు, కాకినాడ

మార్గాల్లో మృత్యుఘోష

ఉమ్మడి జిల్లాలో ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

ఈనాడు, కాకినాడ:

'రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడం ఆందోళనకరం. కొన్ని జిల్లాల్లో మరణాల సంఖ్య అధికంగా ఉంది. అందులో కాకినాడ ఉంది. కారణాలను విశ్లేషించండి. ప్రతీ ప్రమాదంపైనా ఆడిట్ జరగాలి'

–రహదారి భద్రతా మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు పరిశీలన

ఈనెల 8న సోమవరం కూడలిలో నలుగురి ప్రాణాలను బలిగొన్న కారు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు చిన్న, పెద్ద ప్రమాదాలు 1,252 జరిగి 761 మంది మృత్యువాతపడ్డారు. వెయ్యి మందికి పైగా గాయపడ్డారు. ఎక్కువగా పదహారో నంబరు హైవేపై జరిగాయి.

పెరిగిన మరణాలు..

● కాకినాడ జిల్లాలో గతేడాది మొదటి పది నెలల్లో 758 ప్రమాదాలు జరిగి 259 మంది చనిపోయారు. ఈ ఏడాది 436కు తగ్గినా మరణాలు 285.

● తూర్పులో 2024లో 606 ప్రమాదాలు జరిగి 246 మంది చనిపోయారు. ఈసారి 465కు తగ్గాయి. ప్రాణనష్టం 280కి పెరిగింది.

● కోనసీమలో 2024లో 418 ఘటనలు జరిగితే ఈసారి 351. మరణాలు గతసారి 144 కాగా ఈ దఫా 196.

ఘటనలు పరిశీలిస్తే..

జనవరి–అక్టోబర్	కాకినాడ	తూర్పు	కోనసీమ
మొత్తం ప్రమాదాలు	436	465	351
మృతులు	285	280	196
క్షతగాత్రులు	698	789	617

ప్రమాదాలకు ప్రధాన కారణాలు

- కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడం
- డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం
- మద్యం మత్తు, వెలుతురు సమస్య
- శిరస్త్రాణం, సీటు బెల్టులు ధరించకపోవడం

కాకినాడ జిల్లాలో తుని, కోరంగి, అన్నవరం, గండేపల్లి, ప్రత్తిపాడు, సామర్లకోట, గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రమాదాలు అధికం.

తేడాలు సవరిస్తేనే..

● ఇటీవల సోమవరం కూడలి వద్ద ఓ కారు నలుగురి ప్రాణాలను బలిగొంది. ఇక్కడ రహదారి పక్కగా ఐరన్ గ్రిల్స్‌తో కూడిన బారికేడ్ నిర్మాణం రెండు కి.మీ. వరకు అవసరం. ● కోరంగి పరిధిలో రోడ్డు నిర్మాణంలో తేడా ఉంది.

● 10 కి.మీ.కు ఒక మొబైల్ వాహనం పెట్టి హైవేపై నిలిపేసి ఉన్న వాహనాలను తరలించాలి.

లోపాలు సరిదిద్దేలా చర్యలు

ప్రమాదాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. కోరింగ దగ్గర రోడ్డు నిర్మాణ లోపాన్ని హైవే అథారిటీ దృష్టికి తీసుకువెళ్లాం. ఆగి ఉన్న వాహనాలతో ప్రమాదాలను తగ్గించడంపై కసరత్తు చేస్తున్నాం. ప్రతి ఘటనకు కారణాలు విశ్లేషించి లోపాలు సరిదిద్దేలా చూస్తున్నాం.

-బిందుమాధవ్, ఎస్పీ, కాకినాడ జిల్లా

ఓటరు జాబితాల సవరణకు సిద్ధం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఓటరు జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్)కు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షాన్‌మోహన్ తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్.. నిర్వహించిన వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఏఈఆర్వోలు, బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేసినట్లు చెప్పారు. బీఎల్వోలు 2002, 2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికి 37.53 శాతం పూర్తి చేశామన్నారు.

పాడా పీడీ చైత్రవర్షిణి బదిలీ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) పీడీ చైత్రవర్షిణిని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో మైక్రో క్రెడిట్ విభాగం ప్రత్యేక అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులిచ్చింది. గతేడాది డిసెంబరులో పిఠాపురం ప్రాంత ప్రాధికార సంస్థ ఏర్పాటైంది. ప్రాజెక్టు డైరెక్టర్‌గా చైత్రవర్షిణిని నియమించారు. ప్రస్తుతం ఆమె బదిలీ కాగా.. ఇంకా ఎవరినీ పీడీగా నియమించలేదు.

నిధుల మేత.. నాణ్యత కోత

వైకాపా హయాంలో పిఠాపురం పురపాలికలో అక్రమాలెన్నో

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, పిఠాపురం: పిఠాపురం పురపాలిక అభివృద్ధి కోసం ఖర్చుచేయాల్సిన నిధులను వైకాపా నేతలు అడ్డగోలుగా మేసేశారు. పనులు చేయకుండా బిల్లులు చేసుకున్నారు. చేసిన వాటిలోనూ నాణ్యత పాతరేశారు. వీరికి అధికారులు వంతపాడారు. పరిశీలించిన ఆయా ఇంజినీరింగ్ అధికారులు అడ్డంగా బుక్కయ్యారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా వారిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.

పిఠాపురం డ్రైవర్స్ కాలనీలో పైప్‌లైన్ పనులు చేయకుండా సుమారు రూ.12 లక్షల బిల్లులు మార్చుకున్నారు

విచారణలో గుర్తింపు..

వైకాపా ప్రభుత్వ హయాంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు ఏకమై కౌన్సిల్ ఆమోదించిన పనుల్లో చాలావరకు చేయకుండానే బిల్లులు చేసుకున్నారు. సుమారు రూ.7.73 కోట్ల పనుల్లో అనేక దుర్వినియోగం అయ్యాయని, మరికొన్ని నాసిరకంగా చేపట్టారని విజిలెన్స్ అధికారులు విచారణలో గుర్తించారు. అప్పటి ప్రజారోగ్య విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ వైఎస్ ఆర్‌కే నరసింహారావు, డీఈఈలు ఎం.టి.హుస్సేన్, ఎస్.భవానీశంకర్, ఏఈఈలు వంశీ అభిషేక్, కె.రత్నవల్లిపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం వీరంతా వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్నారు.

బిల్లులు భోంచేసి..

✦ పిఠాపురం డ్రైవర్స్ కాలనీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు రూ.12 లక్షలు కేటాయించారు. పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారు.

✦ 30 వార్డుల్లో విద్యుత్తు పనులకు రూ.15 లక్షలు మంజూరు చేస్తే అవి చేయకపోయినా గుత్తేదారుకు చెల్లింపులు చేశారు.

✦ మాధవపురం రోడ్డులో పైపులైన్‌కు రూ.8 లక్షలు కేటాయిస్తే పని జరగలేదు. సొమ్ములు చక్కబెట్టేశారు.

✦ జగ్గయ్యచెరువులో రెండు రోడ్లకు రూ.15 లక్షలు ఇచ్చినా నిర్మాణాలు లేవు. ఎంబుక్‌లో పూర్తయినట్లు నమోదు చేసి ఇంజినీరింగ్ అధికారులు వాటాలు పంచుకున్నారనే ఆరోపణలున్నాయి.

భద్రత.. అప్రమత్తత

కాకినాడ నగరంలోని బస్టాండ్, ఉద్యానాలు తదితర ప్రాంతాల్లో గురువారం బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. టౌన్ రైల్వేస్టేషన్‌లో పార్శిల్ కార్యాలయం, రైలులో ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. రామకృష్ణ, మణికంఠ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్, మసీదు సెంటర్ (కాకినాడ)

తూర్పు వాకిట.. మండపేట

- ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం
- అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు



ఈనాడు, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా భౌగోళిక, నైసర్గిక స్వరూపం మారనుంది. ఇప్పటివరకు 7 నియోజకవర్గాలు.. 19 మండలాలతో ఉండగా తాజాగా డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాలను కలుస్తాయి. ఈమేరకు ప్రాథమిక నోటిఫికేషన్ ప్రచురించి ప్రజల నుంచి 30 రోజుల్లోగా అభ్యంతరాలు స్వీకరించాలని కలెక్టర్లకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త మార్పులివి

- రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోకి ఇకపై మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు
- తూర్పులో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల సరసన మండపేట చేరిక
- అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి అప్పుడూ, ఇప్పుడూ కాకినాడ డివిజన్‌లోనే..

హామీ నెరవేర్చి..

భౌగోళికంగా మండపేట నియోజకవర్గంలోని గ్రామాలు రాజమహేంద్రవరానికి దగ్గర. గత ప్రభుత్వం కోనసీమ జిల్లాలో కలపడంతో స్థానికులు ఆందోళనలు చేపట్టారు. కూటమి అధికారంలోకి వస్తే మండపేటను తూర్పుగోదావరిలో కలుపుతామని అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రస్తుతం నెరవేరింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం ముమ్మర ప్రయత్నం చేశారు. అమలాపురం వెళ్లాలంటే కొన్ని గ్రామాల నుంచి 70 కి.మీ. దూరంతోపాటు, నాలుగు బస్సులు మారాలి. అదే రాజమహేంద్రవరానికి కనిష్ఠంగా 8 కి.మీ. దూరమని వివరించారు. మెజార్టీ పంచాయతీలు 'రుడా' పరిధిలో ఉన్నాయని పేర్కొంటూ సీఎం, మంత్రి వర్గ ఉపసంఘం వద్ద ప్రస్తావించారు.

కాకినాడ జిల్లాలో విలీనానికి డిమాండ్..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు కాకినాడ జిల్లాలో.. రామచంద్రపురం, కె.గంగవరం కోనసీమలో ఉన్నాయి. ఈ రెండింటినీ కాకినాడ జిల్లాలో విలీనం చేయాలనే డిమాండ్ ఉంది. ఇటీవల అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసనలూ చేపట్టారు. ప్రభుత్వం యథాతథ స్థితిలోనే ఉంచుతూ నిర్ణయం తీసుకుంది.

రబీకి వేళాయె..!

1,77,490 ఎకరాల్లో వరిసాగు అంచనా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ వరిసాగుకు వేళయింది. దీనికి అనుగుణంగా జిల్లా వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. డిసెంబరు ఒకటి నుంచి సాగు ప్రక్రియ ప్రారంభించేలా రైతులను సన్నద్ధం చేస్తోంది. రబీలో 1,77,490 ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని అంచనా వేసింది. గోదావరి సెంట్రల్ డెల్టా, పిఠాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు, ఇతర వనరుల ద్వారా సాగునీరు అందించడానికి జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయించారు. డిసెంబరు 1 నుంచి కాలువలకు సాగునీరు విడుదల చేయనున్న నేపథ్యంలో డెల్టా కింద నారుమడులు వేయడానికి విత్తనాలు, ఎరువుల నిల్వలను అందుబాటులోకి తెస్తున్నారు. వచ్చే నెల 31లోగా నారుమడులు, నాట్లు పూర్తి చేసి.. 2026, మార్చి 31 నాటికి రబీ పంటకాలాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు.

వెదజల్లే విధానానికి ప్రాధాన్యం

మొత్తం వరిసాగు విస్తీర్ణం	1,77,490 ఎకరాలు
వెదజల్లే సాగు విధానం	1,10,007 ఎకరాలు
అవసరమైన విత్తనాలు	35,498 క్వింటాళ్లు
ఎరువులు	61,271 టన్నులు

● రబీలో 1,77,490 ఎకరాల్లో వరి సాగు అంచనా కాగా, దీనిలో 1,16,112.5 ఎకరాల్లో సాధారణ రకాలైన ఎంటీయూ 3626, ఎంటీయూ1125, ఎంటీయూ 1156 వంగడాలు.. 61,367.5 ఎకరాల్లో సన్న రాకలైన కేఎన్ఎం 7715, ఆర్ఎన్ఆర్ 14058, సాధన, ఓంసాయి వంగడాలు సాగు జరుగుతుందని అంచనా వేశారు.

రైతును సమాయత్తం చేస్తున్నాం..

జిల్లాలో రబీ సాగుకు రైతును సమాయత్తం చేస్తున్నాం. పంట కాలం సకాలంలో ముగిసేలా అవగాహన కల్పిస్తాం. 9,500 టన్నుల యూరియాను సిద్ధం చేశాం. 3 వేల టన్నులు మార్క్‌ఫెడ్ వద్ద నిల్వ చేశాం. 6,500 టన్నులు ఆర్ఎస్‌కే, పీఏసీఎస్‌లు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంది. డిసెంబరు 31 లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- ఎన్.విజయ్‌కుమార్, జేడీఏ, కాకినాడ

స్వాతి.. సభా స్ఫూర్తి

శంఖవరం, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: సువిశాల ప్రజాస్వామ్యదేశం.. వజ్రోత్సవాల వేళ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారత రాజ్యాంగం దినోత్సవం వినూత్నంగా చేసింది.. భావిభారత పౌరులతో మాక్ అసెంబ్లీని రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి నిర్వహించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒకరిని ఎమ్మెల్యేగా ఎంపిక చేయగా పిల్లలంతా అచ్చం అసెంబ్లీని తలపించారు. మాక్‌అసెంబ్లీలో సభాపతిగా కాకినాడ జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన సైపిరెడ్డి స్వాతికి అవకాశం దక్కింది. ఆమె 175 మంది సభ్యులతో సభను నడిపించి ముఖ్యమంత్రి, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, నెటిజన్లతో సహా అందరినీ మెప్పించింది. స్వగ్రామం వచ్చిన స్వాతి అనుభవాలు, ఆకాంక్షలు 'న్యూస్‌టుడే'తో ఇలా పంచుకొంది..

విద్యామంత్రి లోకేశ్‌తో స్వాతి

కుటుంబ నేపథ్యం..

తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, గృహిణి, చక్రరావు లారీడ్రైవర్. సగటు శ్రామిక కుటుంబం. శంఖవరం పాఠశాలలో స్వాతి పదో తరగతి చదువుతోంది.

తర్ఫీదు: 15 రోజులు

సభాపతిగా ఎంపిక ఇలా..

మాక్ అసెంబ్లీకి ఎంపికే గట్టి పోటీ పరీక్షలో గెలిచినట్టుంది. మొదట మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. తరవాత 175 నియోజకవర్గాల నుంచి జిల్లాకు ఒకరు చొప్పున 26 మందిని ఎంపిక చేశారు. ఆపైన 26 మందిలో నన్ను సభాపతి అనడంతో అవాక్కయ్యానంతే. గురువులు చెప్పింది గ్రహించడం, చక్కగా వ్యక్తీకరించడం, శరీరభాష అన్నీ అనుకూలం అయ్యాయనిపిస్తోంది.

స్పీకర్ స్థానంలో ఉన్నపుడు ఏమనిపించిందంటే..

నిజమైన అసెంబ్లీలో ఉన్నాననిపించింది. సభను నడపడం సవాలే. ఒక వేదికపై నుంచి అందరిని సమన్వయపరచడం తెలిసింది. సమయస్ఫూర్తి, సంయమనం పాటించాను. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రసంగాలు విన్నాక ఏ ఉద్యోగం చేసినా రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేయాలనే కాంక్షను కలిగించాయి.

చదువు.. కొలువు.. రాజకీయాలు..

ఐఏఎస్ కావాలనేది నా ఆశయం.. రాజకీయాల్లో ప్రజలతో మమేకమవుతూ మరింత ప్రభావవంతంగా సేవ చేయొచ్చనేది సీఎం, విద్యామంత్రి ప్రసంగాలు విన్నాక నాకర్థమైంది. దీంతో ముందుగా ఉన్నత చదువుపై దృష్టి, అనుకున్న కొలువు ఆ తరవాత రాజకీయాలు. ఇదే నా లక్ష్యంగా ఖరారు చేసుకున్నా.

అవకాశం అందిపుచ్చుకొని..

శ్రద్ధగా చదువుకోవడమే! ఈ ప్రశంసలు తలకెక్కించుకోకుండా మరో ప్రయత్నానికి స్ఫూర్తిగా తీసుకుంటాను. మా పాఠశాల నుంచి, జిల్లా నుంచి నాకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. సహచరుల్లోనూ స్ఫూర్తి నింపుతాను. ఏ అవకాశాన్నయినా సొంతం చేసుకోవాలి. అందుకు అవసరమైన కృషి చిత్తశుద్ధితో చేయాలి. ఆటలో విజయం సాధించడం కన్నా మనస్ఫూర్తిగా పాల్గొనడం ముఖ్యం.

'ఉపాధి'లో ఈకేవైసీకి మరో అవకాశం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు పొంది, ఈకేవైసీకి దూరంగా ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. బోగస్ జాబ్‌కార్డుల ఏరివేతలో భాగంగా జిల్లాలోని 20 మండలాల పరిధిలో డ్వామా సిబ్బంది ఈకేవైసీ ప్రక్రియను నిర్వహించారు. జాబ్‌కార్డుల్లో సభ్యులు ఉండి, మరణించిన వ్యక్తులు, శాశ్వత, తాత్కాలిక వలస వెళ్లిన వారిని ఈ జాబితా నుంచి తొలగించలేదు. ఇది మస్తర్లలో అక్రమాలకు తావిస్తున్న కారణంగా జాబ్‌కార్డులోని ప్రతి సభ్యుడికి ఈకేవైసీ ప్రక్రియను చేపట్టారు. జిల్లాలోని 385 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరించారు. అప్పటికి వేల సంఖ్యలో జాబ్‌కార్డుదారులు ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారిలో 51,594 మంది శాశ్వత, 2,466 మంది తాత్కాలిక వలసలో ఉన్నట్లు నిర్ధారించారు. వీరిని ప్రస్తుతం హోల్డ్‌లో పెట్టారు. వీరంతా ఈకేవైసీ పూర్తి చేసుకుంటే.. జాబ్‌కార్డులో సభ్యత్వాలను పునరుద్ధరించనున్నారు. వీరంతా గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌ను సంప్రదించి, ఈకేవైసీ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇటీవల పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా జాబ్‌కార్డులు జారీ చేశారు. 3,337 మంది దరఖాస్తు చేయగా, వారందరికీ అందజేశారు.

మొత్తం జాబ్‌కార్డులు	2,22,809
సభ్యులు	3,48,045
ఈకేవైసీ చేయించుకుంది	2,89,729
నమోదు చేసుకోనివారు	58,316

సద్వినియోగం చేసుకోవాలి

జాబ్‌కార్డులున్న వారు ఉపాధి పనులకు వచ్చినా, రాకపోయినా ఈకేవైసీ తప్పనిసరి. ఇది పెండింగ్‌లో ఉన్నవారికి మరో అవకాశం కల్పించారు. అర్హత ఉన్నవారికి కొత్తకార్డులు జారీ చేస్తున్నాం.

- అడపా వెంకటలక్ష్మి, పీడీ, డ్వామా

మెగా పీటీఎంకు సన్నద్ధం

మామిడికుదురు, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని (మెగా పీటీఎం 3.0) డిసెంబరు 5న అన్ని పాఠశాలల్లో పండగ వాతావరణంలో నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. విద్యార్థుల ప్రగతి, లక్ష్యాలను ఉపాధ్యాయులు తొలుత వివరిస్తారు. పాఠశాల అభివృద్ధి, వివిధ ప్రణాళికలపై చర్చిస్తారు.

వినరు.. మారరు!

ఏదో చోట ప్రమాదాలు జరుగుతూ.. పలువురు మృత్యువాత పడుతున్నా.. చాలా మందిలో మార్పు రావడం లేదు. ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయానికి వెళుతున్న అయ్యప్ప మాలధారులు వ్యానులో కిక్కిరిసి సామర్లకోట-పిఠాపురం రోడ్డులో గురువారం ఇలా కనిపించారు. - న్యూస్‌టుడే, సామర్లకోట

'స్త్రీనిధి' రుణాలపై ప్రత్యేక బృందాల విచారణ

కాకినాడ కలెక్టరేట్, కరప, న్యూస్‌టుడే: స్త్రీనిధి బ్యాంకు నుంచి పొందిన రుణాల రికవరీపై డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు గురువారం కరప మండలంలోని 8 గ్రామాల్లో విచారణ నిర్వహించాయి. ఈ నెల 26న 'ఈనాడు'లో 'స్త్రీనిధిలో ఇంటి దొంగలు' శీర్షికన ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావుతో పాటు డీపీఎంలు, ఏపీఎంలు నాలుగు బృందాలుగా ఏర్పడి కరప మండలంలోని వేళంగి, నడకుదురు, కూరాడ, గొర్రిపూడి, ఉప్పలంక, వేములవాడ, వాకాడ, పెనుగుదురు గ్రామాల్లో డ్వాక్రా సంఘాల పనితీరు-పరిశీలన పేరుతో విచారణ చేశారు. డ్వాక్రా సభ్యుల నుంచి సిబ్బంది 24 వాయిదాలు కట్టించుకుని, రెండు వాయిదాల సొమ్ములను సిబ్బంది కాజేస్తున్నట్లు నిర్ధారించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు.

విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

మధురమే... మధురమే... మధురమే...
ఈ క్షణములు ఇంకా మధురమే...
పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
ఈనాడు ద్వారా వారికి అందించండి, పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు: 80085 97607

ప్రమాణస్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
రాజమహేంద్రవరంలో మొట్టమొదటి నేషనల్ ప్రొఫెషనల్ బాడీ ACCE(I) రాజమహేంద్రవరం సెంటర్ స్థాపించిన నాటి నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకోబడుతూ, ఇప్పుడు మూడవసారి ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న రాజమండ్రి సీనియర్ కన్సల్టింగ్ ఇంజనీర్ శ్రీ దుద్దుపూడి హరికుమార్ గార్కి మరియు కమిటీ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.

Er. D.HARI KUMAR GARU
Rajahmundry
తేది: 28-11-2025 సాయంత్రం గం. 6-30 ని.ల నుండి వెన్యూ: హోటల్ లా హాస్పిన్, రాజమండ్రి
ఎలెక్టెడ్ బాడీ 2025-2027
ఛైర్మన్ Er. దుద్దుపూడి హరికుమార్ | సెక్రటరి Er. K.రామచంద్రారెడ్డి
MC మెంబర్స్
Er. Y.గురుదేవ్ - Er. B.తిరుపతిరావు - Er. B.సురేష్‌బాబు - Er. TVL.నరసింహారావు
ఎక్స్ అఫీషియో మెంబర్స్
Er. భాస్కర్ తీగెల | Er. K.ఆనందబాబు
రాజమండ్రి నగర స్ట్రక్చరల్ ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్, లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ మరియు లైసెన్స్‌డ్ సర్వేయర్ల అభినందనలతో...

(c) eenadu

నన్నయలో డిసెంబరు 27 నుంచి దేహదారుఢ్య పోటీలు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో డిసెంబరు 27 నుంచి 30వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ మెన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నామని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను వర్సిటీలో గురువారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో నిర్వహించే ఈ పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక అవుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లు డిసెంబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, అసోసియేట్ కార్యదర్శి ఎం.వి.వి.ఎస్ మూర్తి, ప్రిన్సిపల్స్, పీడీలు పాల్గొన్నారు.

రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు

నాగులాపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో రూ.7 కోట్ల నాబార్డ్ నిధులతో రోడ్ల అభివృద్ధికి ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని చెందుర్తి నుంచి తాటిపర్తి, పి.దొంతమూరు రహదారి, వెల్దుర్తి నుంచి ధర్మవరం, నాగులాపల్లి నుంచి చేబ్రోలు వరకు బీటీరోడ్లను అభివృద్ధి చేసే పనులు ప్రారంభించారు. నాయకులు శ్రీనివాస్, భావన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.



ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ తదితరులు

విజయ్ మర్చంట్ క్రికెట్ టోర్నీకి ఎంపిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: బీసీసీఐ నిర్వహించే విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు కాకినాడ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.లక్ష్మీగౌతమ్(11వతరగతి), కె.తమన్(10వతరగతి) ఎంపికైనట్లు విద్యాసంస్థల డైరెక్టర్ సి.హెచ్.విజయ్ ప్రకాష్ గురువారం తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ పోటీలకు ఈ ఇద్దరే ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జాయింట్ సెక్రటరీ సమీరా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంపీ సానా సతీష్‌బాబు, ఉమ్మడి తూ.గో. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్, కార్యదర్శి నక్కా వెంకటేష్ తదితరులు విద్యార్థులు, కోచ్ దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి పోటీలకు కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వేదిక కానుంది. అండర్-14, 17, 19 బాలబాలికల జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. వివిధ జిల్లాల నుంచి సుమారు 400 మంది బాలబాలికలు హాజరుకానున్నారు. డీఎస్‌ఏ మైదానంలోని జిమ్నాస్టిక్ హాల్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. రిథమిక్, ఆర్టిస్టిక్, యూట్రిపోలిన్ కేటగిరీల్లో ఈ పోటీలు జరుగనున్నాయి. క్రీడాకారులకు స్థానిక రమణయ్యపేట మున్సిపల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, బాలికలకు శ్రీనగర్, శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో వసతి కల్పించారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శులు పి.సుధారాణి, శ్రీనివాసరావు తెలిపారు.

నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, సీఈవో లక్ష్మణరావు, తదితరులు

జడ్పీ సిబ్బందికి ఉద్యోగోన్నతులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం మంచి అవకాశమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ (జడ్పీ) ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న 18 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులను సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. వారికి గురువారం జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలరావు, సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు నియామక పత్రాలను అందజేశారు. పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీవీ రమేష్, జడ్పీ కార్యాలయ పర్యవేక్షకులు, ఏవోలు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం కేసులో ఏడేళ్ల జైలు

కరప, న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, రాజమహేంద్రవరం కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు ఇచ్చారని కరప ఎస్సై సునీత తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. కరప మండలం ఓ గ్రామంలో ఉంటున్న 80 ఏళ్ల వృద్ధురాలు గతేడాది ఆగస్టు 29న ఇంట్లో రాత్రి భోజనం చేసి ఇనుప మంచంపై పడుకున్నారు. అదే గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఆమెపై అత్యాచార యత్నం చేయడంతో ఆమె కేకలు వేయగా.. స్థానికులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దాంతో అప్పటి ఇన్‌ఛార్జి ఎస్సై రామారావు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ప్రస్తుత ఎస్సై సునీత కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

రాష్ట్రాభివృద్ధిలో స్థిరాస్తిరంగం కీలకం

- రెరా ఛైర్మన్ శివారెడ్డి

శివారెడ్డిని సన్మానిస్తున్న కాకినాడ క్రెడాయ్ ఛాప్టర్ సభ్యులు

గాంధీనగర్: రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) ఛైర్మన్ ఎ.శివారెడ్డి పేర్కొన్నారు. కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని చెప్పారు. క్రెడాయ్, కాకినాడ ఛాప్టర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హోటల్‌లో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ వ్యవసాయం తరువాత స్థిరాస్తి రంగమే రాష్ట్రాభివృద్ధిలో కీలకమన్నారు. జనవరి నుంచి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అనుమతులు వేగవంతం చేస్తామని వెల్లడించారు. అపార్ట్‌మెంట్లలో సమస్యలను కొనుగోలుదారులు తమ దృష్టికి తీసుకొస్తున్నారని, బిల్డర్లు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ సంస్థలను సమన్వయం చేసుకుంటూ పారిశ్రామిక, నిర్మాణ రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. క్రెడాయ్ కాకినాడ ఛాప్టర్ అధ్యక్షుడు విజయ్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి రమణారావు, ఛైర్మన్ నెక్కంటి శ్రీనివాసు, కోశాధికారి పురం రాంబాబు, ఉపాధ్యక్షుడు రాయుడు, ప్రసన్న, రాజమండ్రి ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.శ్రీనివాసు, అధ్యక్షుడు ఎం.ఫణికుమార్, జాతీయ కమిటీ సభ్యుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ చూస్తూ కుప్పకూలి.. వ్యక్తి మృతి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో తమ కుటుంబ సభ్యులు వేరే వారితో ఘర్షణ పడుతుండడాన్ని తట్టుకోలేక వ్యక్తి కుప్పకూలిపోగా ఆసుపత్రికి తరలిస్తే.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దయ అనే వ్యక్తి తన మనమరాలి పుట్టినరోజు సందర్భంగా రోడ్డుకు అడ్డుగా బల్లలు పెట్టారు. అదే మార్గంలో వెళ్తున్న వెంపల కృష్ణవేణి బల్లను పక్కకు నెట్టడంతో కిందపడి పోయింది. దాంతో ఇరువర్గాల వారు కేకలు వేసుకుని ఘర్షణ పడుతుండగా కృష్ణవేణి మామగారు సూరిబాబు(59) అది చూస్తూ.. కుప్పకూలి పడిపోయి మృత్యువాతపడ్డారు. ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

కెనరా బ్యాంక్ Canara Bank — సిండికేట్ Syndicate
అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, డి.నెం.28-14-1, మొదటి అంతస్తు, మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం - 530020. ఫోన్: 8332956773 & 7095199455 ఇ-మెయిల్ : cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) మరియు 9(1) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ అస్సెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.16.12.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం : తేది.16.12.2025, మ॥01.00 గం. నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 15.12.2025, సా॥ 06.00 గం.ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 15.12.2025, సా॥ 06.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఎఆర్ఎమ్ బ్రాంచ్, విశాఖపట్నం మెస్సర్స్ సౌత్ సెంట్రల్ షాపింగ్ మాల్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు పార్ట్‌నర్స్: 1. శ్రీ వెంకటేశ్వర రావు మామిడి (మేనేజింగ్ పార్ట్‌నర్), 2. శ్రీ రాజ వరహాలు మామిడి (పార్ట్‌నర్), 3. శ్రీమతి అమ్మాజీ మామిడి (పార్ట్‌నర్), 4. శ్రీమతి సరస్వతి మామిడి (పార్ట్‌నర్), 5. శ్రీ వెంకట సునీల్ దొడ్డి (పార్ట్‌నర్), 6. శ్రీ వెంకట మణికంఠ సురేష్ మామిడి (పార్ట్‌నర్). బకాయి మొత్తం : రూ.1873.99 లక్షలు + వడ్డీ + ఇతర ఖర్చులు	ఆస్తి-1: విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, పంచాయితీ ఆఫీస్ ప్రక్కన, పాయకారావుపేట, పాయకారావుపేట మెయిన్ రోడ్డు, సర్వే నెం.98/2బి లోని వార్డు నెం.13, మెయిన్ రోడ్డు వద్ద 450 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో పాత అసెస్మెంట్ నెం.2895 మరియు కొత్త అసెస్మెంట్ నెం. 4648, పాత డోర్ నెం.13-92 మరియు కొత్త డోర్ నెం.18-4తో, సెల్లార్ మరియు జి +3 తో కూడిన భవనం. క్రింది అంతస్తు 1875 చ॥అ॥లు, మొదటి అంతస్తు 1875 చ॥అ॥లు, రెండవ అంతస్తు 1875 చ॥అ॥లు, మూడవ అంతస్తు 1875 చ॥అ॥లు., హద్దులు: డీడ్ ప్రకారం. ASSET ID : 200034758400; CERSAI ID:400034816652	రూ. 637.00 లక్షలు	రూ. 63.70 లక్షలు
	ఆస్తి-2: ఐటమ్ నెం.1: తూర్పుగోదావరి జిల్లా, అతికవానిపాలెం పంచాయితీ మరియు తుని ఎస్ఆర్ఓ పరిధిలో, తుని మండలం, అతికవానిపాలెం గ్రామం వద్ద ఎస్.నెం.122/2 = 3872 చ॥గ॥లు (ఎ.0.80 సెంట్లు), 122/1ఎ = 1306.8 చ॥గ॥లు (ఎ.0.27 సెంట్లు), 122/4ఎ = 1452 చ॥గ॥లు (ఎ.0.30 సెంట్లు), 122/4బి = 1355.2 చ॥గ॥లు (ఎ.0.28 సెంట్లు) లతో నాలుగు ఐటమ్‌లుగా గల 7986 చ॥గ॥లు (ఎ.1.65 సెంట్లు లేదా 0.668 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు : డీడ్ ప్రకారం. ASSET ID: 200059627343; CERSA ID: 400059090770. ఐటమ్ నెం.2: తూర్పుగోదావరి జిల్లా, అతికవానిపాలెం పంచాయితీ మరియు తుని ఎస్ఆర్ఓ పరిధిలో, తుని మండలం, అతికవానిపాలెం గ్రామం వద్ద ఎస్.నెం.122/2 = 5178.8 చ॥గ॥లు (ఎ.1.07 సెంట్లు), 122/4ఎ = 1452 చ॥గ॥లు (ఎ.0.30 సెంట్లు), 122/4బి = 1210 చ॥గ॥లు (ఎ.0.25 సెంట్లు) లతో మూడు ఐటమ్‌లుగా గల 7840 చ॥గ॥లు (ఎ.1.62 సెంట్లు లేదా 0.656 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు : డీడ్ ప్రకారం. ASSET ID: 200059627343; CERSA ID: 400059090770. ఐటమ్ నెం.3: తూర్పుగోదావరి జిల్లా, అతికవానిపాలెం పంచాయితీ మరియు తుని ఎస్ఆర్ఓ పరిధిలో, తుని మండలం, అతికవానిపాలెం గ్రామం వద్ద ఎస్.నెం.122/2ఎ = 6485.6 చ॥గ॥లు (ఎ.1.34 సెంట్లు), 122/4ఎ = 1113.2 చ॥గ॥లు (ఎ.0.23 సెంట్లు), 122/4బి = 1113.2 చ॥గ॥లు (ఎ.0.23 సెంట్లు) లతో మూడు ఐటమ్‌లుగా గల 8712 చ॥గ॥లు (ఎ.1.80 సెంట్లు లేదా 0.729 హెక్టార్లు) విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. హద్దులు : డీడ్ ప్రకారం. ASSET ID: 200059627343; CERSA ID: 400059090770.	రూ. 632.00 లక్షలు	రూ. 63.20 లక్షలు
	ఆస్తి-3: విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, సర్వే నెం.145/8బి లోని వార్డు నెం.9, పాయకారావుపేట మెయిన్ రోడ్డు వద్ద 71 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో పాత అసెస్మెంట్ నెం.1272, పాత డోర్ నెం.9-119/1 మరియు కొత్త అసెస్మెంట్ నెం. 1734, కొత్త డోర్ నెం.13-84తో, క్రింది అంతస్తు, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తుతో కూడిన భవనం. క్రింది అంతస్తు 933.33 చ॥అ॥లు, మొదటి అంతస్తు 933.33 చ॥అ॥లు, రెండవ అంతస్తు 933.33 చ॥అ॥లు., హద్దులు: డీడ్ ప్రకారం. ASSET ID : 200034757803; CERSAI ID: 400034816054.	రూ. 91.00 లక్షలు	రూ. 9.10 లక్షలు
	ఆస్తి-4: విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, సర్వే నెం.143/1 లోని వార్డు నెం.10, పాయకారావుపేట మెయిన్ రోడ్డు వద్ద 106.66 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో పాత అసెస్మెంట్ నెం.1357 మరియు కొత్త అసెస్మెంట్ నెం.1811, పాత డోర్ నెం.10-72 మరియు కొత్త డోర్ నెం.14-23తో, క్రింది అంతస్తు, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తుతో కూడిన భవనం. క్రింది అంతస్తు 666.66 చ॥అ॥లు, మొదటి అంతస్తు 666.66 చ॥అ॥లు, రెండవ అంతస్తు 666.66 చ॥అ॥లు., హద్దులు: డీడ్ ప్రకారం. ASSET ID : 200034758286; CERSAI ID: 400034816538.	రూ. 119.00 లక్షలు	రూ. 11.90 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.09.12.2025, ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలు కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం.బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8332956773 & 7095199455. [illegible] ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్న వాటికి రూ.10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్న వాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ.50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ : "https://baanknet.com/eauction-psb", హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 24-11-2025, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction
కార్యాలయ చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డి.నెం. 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101 మరియు శాఖ కార్యాలయం రాజమండ్రి-2

శ్రీ వాకపల్లి రాజు కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

తేది.17.09.2025 నాటి ఉద్దేశిత అమ్మకం ప్రకటన 30 రోజుల గడువు ముగిసినందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9(1) తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన ఇప్పుడు జారీచేయడమైనది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) తో చదువబడు సదరు చట్టం 54/2002 లోని సెక్షన్ 13(8) ప్రకారం మీ విముక్తి హక్కును వినియోగించుకోవడంలో మీరందరూ విఫలమైనందున, ఇ-వేలం విక్రయానికి ఈ నోటీసు జారీ చేయబడింది. ఇది రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు / సహ-దరఖాస్తుదారులు / సహ-రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

1. వై.జి.దేవ్ & కో తరపున మేనేజింగ్ పార్ట్‌నర్: యర్ర గురుదేవులు, తండ్రి: శ్రీరామ్ మూర్తి, డి.నెం.28-9-6బి/4, సమాచారం భవనము, జాంపేట, గణేష్ చౌక్ దగ్గర, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (ఋణగ్రహీత)
2. యర్ర గురుదేవులు, తండ్రి: శ్రీరామ్ మూర్తి, బిజినెస్, డి.నెం.73-18-19/1, బ్లాక్ నెం.ఎ1, సాయి టవర్స్, ఎవి అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
3. వాకపల్లి లత, భర్త: రాజు, ఆర్కిటెక్చర్ బిజినెస్, డి.నెం.23-15-4/3/1M, ఫ్లాట్ నెం.401, 4వ అంతస్తు, మార్కెట్ యార్డ్ దగ్గర, వసుధ ఎన్‌క్లేవ్, సుభాష్ నగర్, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
4. వాకపల్లి రాజు, తండ్రి: వీరన్న, బిజినెస్, డి.నెం.23-15-4/3/1M, ఫ్లాట్ నెం.401, 4వ అంతస్తు, మార్కెట్ యార్డ్ దగ్గర, వసుధ ఎన్‌క్లేవ్, సుభాష్ నగర్, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)
5. యర్ర పద్మావతి, భర్త: యర్ర గురుదేవులు, బిజినెస్, డి.నెం.73-18-19/1, బ్లాక్ నెం.-A1, సాయి టవర్స్, ఎవి అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రాజమండ్రి-533103, తూర్పు గోదావరి జిల్లా (హామీదారు)

[illegible]

ఋణగ్రహీతల యొక్క పేరు / సహ-ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు	తేదీ & మొత్తం 13(2) డిమాండ్ నోటీసు	వాకపల్లి రాజుకి సంబంధించిన ఆస్తి యొక్క వివరణ	ధరావత్తు (EMD) జమచేయు వివరములు	వేలం తేది & సమయం	సంప్రదించవలసిన వ్యక్తి పేరు & ఫోన్ నెం
1. వై.జి.దేవ్ & కో 2. యర్ర గురుదేవులు 3. వాకపల్లి లత 4. వాకపల్లి రాజు 5. యర్ర పద్మావతి	[illegible] రూ.58,30,020/- [illegible] RAJA4TF1903290009 డిమాండ్ నోటీసు తేది: 30.01.2023	[illegible]	EMD 'RTGS' or DD శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible] యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ [illegible] ఖాతా నెం. 230010200005265, IFSC కోడ్: UTIB0000230	30-12-2025 [illegible] 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు	[illegible] 9849824075 [illegible] 9959912922 [illegible] 022-40081572 [illegible] 27-12-2025 [illegible] 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు

రిజర్వుధర మొత్తం: రూ.44,29,100/- [illegible] ధరావత్తు మొత్తం: రూ.4,42,910/- [illegible] బిడ్ పెంపుదల: రూ.10,000/- [illegible] ఇ-వేలం తేదీ: 29.12.2025 [illegible]

[illegible]

ప్రదేశము: రాజమండ్రి, తేది: 27.11.2025 సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI
మధురానగర్ బ్రాంచ్
డి నెం.65-9-9B, జీపీటి రోడ్డు, మెహర్ నగర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా-533003.
ఫోన్ : 0884-2375722, ఇ-మెయిల్ : Madhuranagar.Visakhapatnam@bankofindia.co.in

డిమాండ్ నోటీసు (సంక్షిప్తంగా)
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన నోటీసు)

[illegible]

(I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: M/s SRC [illegible]

(III) డిమాండ్ నోటీసు జారీచేసిన తేది: 03.11.2025

(IV) [illegible]: Blowing Machine 1 set with the following :
(a) 15 tons Hydro-pneumatic mould locking and fully pneumatic machine 250 stroke along with IR heater (Conveyor)n th PLC Controlling)
(b) Air compressor : 20 hp 30 kgs pressure with litre tank
(c) Chiller : 2TR, 60 litres SS tank capacity
(d) Moulds : 1000ml water bottle mould (as per your design)
And other raw materials of Fire Forms

[illegible]

తేది: 03.11.2025, ప్రదేశం : కాకినాడ సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్‌క్యాష్, ✆ 9849138626.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

వైజాగ్ ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు దగ్గరలో 40'రోడ్ ఫేసింగ్ కమర్షియల్ 869 గజాలు VMRDA ప్లాటు అమ్మకం. ✆ 94932 44471, 93969 72239.

JOBS

WANTED Managers to Motivation of Team/ Targets/ Salary upto 50K/ Kkd/ Age above 30 yr/ Insurance Exp./ Male/ Female. Cont: 98494 21277.

రాజమండ్రి- మహిళలకు మాత్రమే. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, 9 am - 5 pm, శాలరీ + ఇన్సెంటివ్, అనుభవం అవసరం లేదు. Contact Cell: 73969 46490.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. ✆ 96402 58899, 96404 68899

WANTED: సేల్స్ & సర్వీస్ మేనేజర్ - కార్ షోరూమ్‌లో అనుభవం కనీసం 2 సంవత్సరాలు. డెమో ఎగ్జిక్యూటివ్‌లు, సేల్స్ & సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్ (Female), సీనియర్ మెకానిక్స్ కావలెను. రాజమండ్రి, తుని, జగ్గంపేట, మండపేట, రావులపాలెం. Contact Cell: 97033 34844, 63019 19238.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

నేటి నుంచి న్యాయమూర్తులు, న్యాయవాదుల క్రికెట్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం నుంచి స్థానిక ఆర్ఎంసీ మైదానంలో నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చక్కపల్లి వీరభద్రరావు(నంబి) తెలిపారు. ఏడు పురుషుల జట్లు, రెండు మహిళల జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని పలు ప్రాంతాల న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- ఆంధ్రా కింగ్ తాలూకా, మరువతరమా, జుటోపియా 2, దేవి మల్టీప్లెక్స్ 4స్క్రీన్- ఆంధ్రా కింగ్ తాలూకా, రివాల్వర్ రీటా, ప్రేమంటే, క్రాక్, ఇట్లు మీ ఎదవ, లక్ష్మీ- జనతాబార్, సత్యగౌరి - ఆంధ్రా కింగ్ తాలూకా, తిరుమల - ఆంధ్రా కింగ్ తాలూకా, సీఅండ్‌సీ 1- 12ఏ రైల్వేకాలనీ, సీఅండ్‌సీ 2- పాంచ్ మినార్, శ్రీప్రియ - ఆంధ్రా కింగ్ తాలూకా, పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య1(వాకలపూడి) - రాజు వెడ్స్ రాంబాయి, సూర్య 2 -ఆంధ్రా కింగ్ తాలూకా.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1 కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

విద్యుత్తువృథా అరికట్టారు.. స్పందనకు వందనం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ శ్రీనగర్‌లోని ఓ వీధిలో పట్టపగలు వీధిదీపం వెలుగుతూ దర్శనమిస్తోంది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్తు వృథాను అరికట్టారు.

చెత్తకు నిప్పు పెడుతున్నారు..

సమస్య: అయోధ్యనగర్, పట్టాభిరామనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లపై సేకరించిన చెత్తను పోగేసి వాటికి నిప్పు పెడుతున్నారు. పొగంతా పరిసరాలకు వ్యాపించడంతో ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు, అయోధ్యనగర్

సమాధానం: చెత్తకు నిప్పుపెడుతుండటంపై చర్యలు తీసుకుంటాం. - పృథ్వీచరణ్, ఎంహెచ్‌ఓ, నగరపాలకసంస్థ

మరమ్మతులు చేపట్టండి..

కాకినాడ గైగోలుపాడు రహదారి ఎస్‌బీఐ కాలనీలోని మూడు రోడ్ల కూడలి వద్ద గుంతలతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మలుపు తిరిగే క్రమంలో ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

బాక్సుకు మూత ఏర్పాటు..

గాంధీనగర్ కెనరా బ్యాంకు సమీపంలో ఓ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు బాక్సుకు మూత లేక ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. బాక్సుకు మూత ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

రైతుల ముసుగులో బినామీలు

ఇప్పటికీ కొనసాగుతున్న అనర్హులు

న్యూస్‌టుడే, గాంధీనగర్

నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలను తక్కువ ధరలకే అందించడంతో పాటు, రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేసిన రైతుబజార్లు బినామీలకు ఆవాసంగా మారాయి. వర్తకులే మనవాళ్లైతే.. ఎక్కడ కూర్చుంటే అక్కడ సామెత చందంగా గత వైకాపా హయాంలో అడ్డగోలుగా ఆనాటి ప్రజాప్రతినిధుల సిఫార్సులతో అధికారులు దుకాణాలు కేటాయించేశారు. దీంతో అసలు రైతులకు అన్యాయం జరుగుతుంది.

ఆర్టీసీ రైతుబజారులోనే...

ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద రైతుబజారు

కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఉన్న రైతుబజారు ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ఆదాయం కలిగినదిగా పేరుంది. ఇక్కడ అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 122మంది కూరగాయలు, ఆకుకూరల రైతులు ఉన్నారు. రోజు సుమారు 80మంది ఇక్కడ వ్యాపారాలు చేస్తుంటారు. అద్దె దుకాణాలు 58 ఉండగా వీటి ద్వారా నెలకు రూ.1,61,500 ఆదాయం సమకూరుతుంది. వైకాపా హయాంలో కొందరు ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు వీటిని కేటాయించారు. గతంలో 22 మందికి దుకాణాలు కేటాయించగా, వారిలో 12 మంది వ్యాపారులే ఉండడం గమనార్హం.

వారిదే హవా

వైకాపా హయాంలో రైతుబజార్లలో బినామీలకు చేసిన కేటాయింపులు నేటికీ కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులే చెబుతున్నారు. బినామీల కారణంగా నిజమైన రైతులకు అన్యాయం జరగడంతోపాటు, నాణ్యత లేని వస్తువులు [illegible] మాగా మారుతున్నాయి. కొందరు బోర్డు మీద ధరల కంటే ఎక్కువగా అమ్ముతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా కొందరు బినామీలు కొనుగోలుదారులతో దుర్భాషలాడుతున్నారని వాపోతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు దృష్టిసారించి, బినామీలను తొలగించి, వారి స్థానంలో నిజమైన అర్హులకు అవకాశం కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: మార్గశిర మాసం తొలి గురువారం సందర్భంగా నగరంలోని వైష్ణవ ఆలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మి అమ్మవారిని అర్చకులు పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు. ప్రసాద వితరణ చేశారు.

ఔషధి పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలి

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల వివరాలను సకాలంలో ఈ-ఔషధి పోర్టర్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.జె.నరసింహనాయక్ అన్నారు గురువారం ఫార్మసిస్టులకు రీ ఓరియంటేషన్ శిక్షణ అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సుమారు 172 రకాల మందులను ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కాలం చెల్లబోయే మందులను 6 నెలల ముందుగానే గుర్తించి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీపీఎంయూ డా.జి.లక్ష్మి, ఫార్మసీ సూపర్‌వైజర్ కేపీ మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటి.. బహుమతులు పట్టి

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో హెచ్‌ఎం వై.శ్రీనివాసు, ఉపాధ్యాయులు

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ జగన్నాథపురం అన్నమ్మ ట్యాంక్ సమీపంలోని జీఎంసీ బాలయోగి నగరపాలకోన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసం(స్పీచ్) పోటీల్లో ఎం.దేవి ప్రథమ, ఏజే వర్ధిని ద్వితీయ, కె.సిరి తృతీయ బహుమతులు సాధించారు. ఉపాధ్యాయులు ఎన్.నూకరాజు, జి.సురేష్‌కుమార్, కె.సన్యాసిరావు, ఆర్.రాధ, పి.భాస్కర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లపై కార్మికుల నిరసన

సర్పవరం: కాకినాడ గ్రామీణం వలసపాకలలో గురువారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ చట్టాలకు నిరసనగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ, మండల కార్యదర్శి తొట్టెంపూడి రాజా ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణాజీ,. చంద్రరావు, బలరాం, సంగీతరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ అన్నారు. గురువారం స్థానిక టౌన్‌హాల్ సెంటర్ నందు వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ నియమనిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం.. ప్రాణాలకు రక్షగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్

శిథిలం ప్రమాదకరం

కాకినాడ కొత్తపేట మార్కెట్ సమీపంలోని పైవంతెన రహదారిలో ఓ వీధి మలుపు వద్ద స్లాబు రాళ్లు శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కాలువ పూడికతీత నిమిత్తం వాటిని తొలగించి అలాగే వదిలేశారు. దీంతో మురుగుపారుదలకు ఆటంకం ఏర్పడటంతో పాటు పాదచారులకు తగులుకుని ప్రమాదాలకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

స్తంభం వదిలేశారు.. రోడ్డు వేసేశారు..

కాకినాడ గొడారిగుంట ప్రధాన రహదారికి మధ్యలో రోడ్డుకు అడ్డుగా ఓ విద్యుత్తు స్తంభం ఉంది. దాంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని భయందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

కాలువ ఇలా.. పారేది ఎలా?

స్థానిక 41వ డివిజన్, పెనుమూడి వారి వీధిలోని ప్రధాన మురుగుకాల్వను కొన్ని రోజులుగా శుభ్రం చేయడంలేదు. దోమలు విజృంభన, దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు సురేశ్ కోరారు. – న్యూస్‌టుడే, బాలాజీచెరువు

అల్లుకున్న నిర్లక్ష్యం..

కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్ రోడ్ నెం.5లో ఓ విద్యుత్తు స్తంభంపై పిచ్చిజాతి మొక్క తీగ అల్లుకుంది. తీగలతో పాటు సర్వీసు వైర్లకు అల్లుకోవడంతో గాలికి విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. వీటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అధికారుల తనిఖీలు

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రైతుబజార్‌లో ఆహార భద్రతా విభాగం, నగరపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేవీ సుబ్బారావు మాట్లాడుతూ ఇక్కడ రంగులు కలిపిన పచ్చి బఠానీలు, చిలకడ దుంపలు అమ్ముతున్నట్లు ఫిర్యాదు వచ్చిందని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్పనాయుడుతో కలిసి తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించామన్నారు. అనంతరం వ్యాపారులకు ఆహార భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కాకినాడ కలెక్టరేట్: అగ్నికుల క్షత్రియ సమాజంపై సామాజిక మాధ్యమాల్లో అవమానకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని కాకినాడ జగన్నాథపురానికి చెందిన అగ్నికుల క్షత్రియ కదంబ పల్లవ రాజుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెసింగి రాజునాయకర్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు.

దొంగల ముఠాపై అప్రమత్తంగా ఉండాలి

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా బుధవారం రాత్రి దువ్వాడ, స్టీల్ ప్లాంట్ ప్రాంతాల్లో కనిపించినట్లు సమాచారం ఉందని, వీరు అనకాపల్లి మీదుగా ప్రయాణించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు అధికారులు సూచించారు. కాకినాడ జిల్లాలోని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు లక్ష్యంగా పెట్టుకునే అవకాశాలున్నాయని, అందరూ జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడినా, కొత్తగా వ్యక్తులను గుర్తించినా, వాహనాలు గమనించినా వెంటనే 100, 112కు సమాచారం అందించాలన్నారు. రాత్రిపూట సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని, తలుపులు సక్రమంగా వేసుకోవాలని అధికారులు సూచించారు.

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న జోనల్ ఇన్‌ఛార్జి గోవిందరాజు

ముగిసిన క్రికెట్ పోటీలు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా జరుగుతున్న భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. కాకినాడ జిల్లా పరిధిలోని 11 బ్రాంచిలకు చెందిన టీమ్‌ల విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాలల జోనల్ ఇన్‌ఛార్జి గోవిందరాజు తెలిపారు. సీనియర్స్ విభాగంలో రామచంద్రపురం, పిఠాపురం, జూనియర్స్ విభాగంలో విద్యుత్తునగర్, శశికాంత్‌నగర్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

పరిశుభ్ర నగరమే ధ్యేయం

నూతన కమిషనర్ సత్యనారాయణ

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

కాకినాడను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషిచేద్దామని నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా (ఎఫ్ఏసీ) నియమితులైన ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకాధికారి, కలెక్టర్ షాన్‌మోహన్‌తో పాటు నగర ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కాకినాడలో జడ్పీ సీఈవోగా, ఆర్డీవోగా, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీగా పనిచేసిన తనకు నగరంపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా కృషిచేస్తానని తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఎన్‌వీవీ సత్యనారాయణ

ముఖాముఖి

✦ నగరంలో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యం. ఇందుకోసం నిరంతరం పర్యవేక్షణ చేస్తా. ప్రధానంగా పైపులైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టడం ద్వారా తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాను. ఇబ్బందులున్న ప్రాంతాలకు సకాలంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

✦ నగరంలో పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి పెడతా. కార్మికులు ఇంటింటా వెళ్లి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకుంటా. చెత్తను రోడ్లు, కాలువల్లో పడేయకుండా నివారించేందుకు ప్రజలు, వ్యాపార సంస్థలను సమన్వయం చేసుకుంటా.

✦ మురికివాడల్లో కాలువలు, రోడ్లు, తాగునీరు, విద్యుద్దీపాల సమస్యలపై దృష్టి పెడతా. ప్రధానంగా ఆయా ప్రాంతాల్లో ఆక్రమణల సమస్యను పరిష్కరిస్తా. కాలువలు, రోడ్లపై అక్రమ కట్టడాలు తొలగించేందుకు ప్రత్యేక దృష్టి పెడతా. ✦ డంపింగ్‌యార్డులో పెద్దఎత్తున చెత్త పేరుకుపోతోంది. దీని నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. తడి చెత్తతో ఎరువుల తయారీపై చర్యలు తీసుకుంటా. వేస్ట్ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో చర్యలు తీసుకుంటా. ✦ పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. అనధికార గైర్హాజరీలు ఉన్నట్లు తెలుస్తోంది. చెత్త తరలించే వాహనాల కొరత ఉంది. ఉన్న వాహనాలు వినియోగించకుండా అద్దె వాహనాలపై ఆధారపడుతున్నట్లు తెలిసింది. వీటన్నింటిపైనా దృష్టిసారిస్తా.

✦ కార్యాలయంలో వివిధ విభాగాలపై వచ్చే ఆరోపణలు, ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటా. ప్రజలకు అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉండాల్సిందే.

అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వాటిని పూర్తిచేసేందుకు ప్రత్యేకాధికారి, నగర ఎమ్మెల్యేలు, ఎంపీ సహకారంతో చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా నగరపాలక సంస్థ కార్యాలయం, సైన్స్ సిటీ భవనం, డెయిరీఫారం నుంచి సంజయ్‌నగర్ మీదుగా అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు పనులను పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకుంటా.

రోజూ వార్డు పర్యటనలు

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వార్డు పర్యటనలు చేస్తా. రోజుకో వార్డు చొప్పున తిరిగి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరిస్తా. ప్రధానంగా ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు వచ్చే సమస్యలను వారితో చర్చించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కాకినాడ నగరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని కళాశాల విద్య ఆర్జేడీ పీవీ కృష్ణాజీ, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని వారు సూచించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రామారావుపేట బ్రాంచి మేనేజర్ అనంతకుమార్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డా.సంజీవ్ కుమార్, రెడ్‌క్రాస్ నోడల్ అధికారి డా.కె.జయదేవ్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కళాశాల విద్య ఆర్జేడీ కృష్ణాజీ, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

జేడీ కృష్ణమూర్తికి వినతి అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల వినతి

కాకినాడ కలెక్టరేట్: పశువైద్య విద్యలో డిగ్రీ లేకుండా 'వెటర్నరీ' పదం వాడకూడదని రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ పీవీ లక్ష్మయ్య చేసిన ప్రకటనను వ్యతిరేకిస్తున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం కాకినాడలోని జేడీ కృష్ణమూర్తికి ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

సంచార పశువైద్య అంబులెన్స్ పరిశీలన

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరంలో సేవలు అందిస్తున్న సంచార పశువైద్య అంబులెన్స్‌ను గురువారం పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ ఎన్.రజినికుమారి పరిశీలించారు. ఈ యూనిట్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. జేడీ కృష్ణమూర్తి, డీడీ అంబేద్కర్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

బాలాజీచెరువు, న్యూస్‌టుడే: స్థానిక సామర్లకోట రోడ్డులోని వేంచేసియున్న శ్రీవిజయ గణపతి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం శ్రీమాత గోవిందమ్మ, సిద్ధయ్య స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవిశ్వబ్రహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో దేవాదాయ శాఖ డిప్యూటీ స్థపతి గౌరస శ్రీనివాసాచారి, రాష్ట్ర విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తాలాబత్తుల సాయి ఉదయ్ భాస్కర్, జయేంద్ర ప్రసాద్, సంఘం అధ్యక్షుడు అంగుళూరి ధర్మారావు, ఆవుపాటి ఉమాశంకర్, సీహెచ్. వీరరాఘవులు, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

కాకినాడ నగరం: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. జగన్నాథపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో నూతనంగా భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన వెండి పూత ద్వారాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ ఛైర్మన్ పినపోతు సూర్యారావు, తాతారావు, లంకే గంగాధరరావు, డా.రామ్మూర్తి, గిరి తదితరులు పాల్గొన్నారు.

వెండి ద్వారాన్ని ఆవిష్కరిస్తున్న కొండబాబు

టిడ్కో గృహాల నిర్మాణ ఘనత తెదేపాదే

కాకినాడ నగరం: పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లతో కూడిన గృహాలను అందించేందుకు గత తెదేపా ప్రభుత్వం కృషిచేసిందని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. పర్లోవపేటలో నిర్మిస్తోన్న టిడ్కో గృహాలకు సంబంధించి లబ్ధిదారులతో అంగీకార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు వాటిని అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు.

పిచ్చుకల సంరక్షణకు ఉద్యమం

కాకినాడ కలెక్టరేట్: పిచ్చుకల పరిరక్షణ ఉద్యమంలో విద్యార్థులను భాగస్వాములు చేయాలని హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు పి.దాలినాయుడు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పిచ్చుకల పరిరక్షణకు ఫౌండేషన్ ద్వారా చేసిన కార్యక్రమాలను వివరించారు. జీవ వైవిధ్యానికి, రైతులకు మేలు చేసే పిచ్చుకలు, ఇతర పక్షులను కాపాడుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి విద్యార్థికి ధాన్యం కుచ్చు తయారీ నేర్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

కలెక్టర్ షాన్‌మోహన్‌కు ధాన్యం కుచ్చును చూపుతున్న దాలినాయుడు

4R MINING & TRADING
చిరునామా మార్పు
పాత చిరునామా:
69-5-13/1, Gaigolupadu,
Kakinada-533005.
కొత్త చిరునామా:
3-16-1/26A,
Rajyalakshmi Nagar,
Revenue Ward No.6, Kakinada.
పై చిరునామా మార్పు గమనించవలెను.

ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది

బాల్యవివాహాల నియంత్రణే ధ్యేయం

సాంబమూర్తినగర్(కాకినాడ): జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఛైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్టు, ఛైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్తంగా గురువారం సాయంత్రం 'బాల్య వివాహ ముక్త్ భారత్'పై అవగాహనకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ నోడల్ అధికారి జెస్సీ ఫ్లోరెన్స్, సీడీపీవో జ్యోతి, ట్రస్టు కోఆర్డినేటర్ బి.కుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. జెస్సీ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో విజేతగా జిల్లా బాలికల జట్టు

మసీదు సెంటర్ (కాకినాడ): ఈ నెల 23 నుంచి 25 వరకు విజయనగరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచిందని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.సుధారాణి తెలిపారు. జిల్లా జట్టులో ప్రతిభ కనబరచిన పలువురు క్రీడాకారిణులు వచ్చేనెల 20 నుంచి అయోధ్య జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా జట్టును మొదటిస్థానంలో నిలిపిన క్రీడాకారిణులకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, ఖోఖో కోచ్ వాసు, పీడీలు తదితరులు అభినందనలు తెలిపారు.

విజేతగా నిలిచిన క్రీడాకారిణులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పోర్టు బ్రాంచి, మార్కెట్ వీధి, కాకినాడ-1, Ph: 0884-2378360
37వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు విశిష్ట సేవలందిస్తూ, అందరి మన్ననలు పొందుచూ, ప్రగతి పథంలో పయనిస్తూ, నేటికి 37 వసంతములు పూర్తి చేసుకొని 38వ వసంతంలోకి అడుగిడుచున్న శుభసందర్భంగా బ్యాంక్ మేనేజరు శ్రీమతి B.రమాదేవి గార్కి మరియు బ్యాంక్ సిబ్బందికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
బలగం ప్రసన్నకుమార్
Ex. సర్పంచ్, తూరంగి, కాకినాడ రూరల్ మండలం
శ్రీ గణేష్ ఇంజిన్ ఆయిల్స్
ప్రొప్రయిటర్: J.వెంకట కృష్ణంరాజు, మార్కెట్ వీధి, కాకినాడ, సెల్: 98496 61177
Avinash Communications
Prop: V.Kanakadurgadevi, Temple Street, Kakinada

(c) eenadu

సత్తెమ్మతల్లి కొలువాయె..

తాళ్లరేవు: జి.వేమవరం రాయవరపేటలో సత్తెమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా వేద పండితుల సమక్షంలో పూజలు జరిగాయి. గురువారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఊంజల్ సేవ జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ

గొల్లప్రోలు: గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గురువారం అర్చకుల సమక్షంలో పూజల అనంతరం విగ్రహాన్ని నెలకొల్పారు. పాఠశాలలో ఆహ్లాద వాతావరణం నెలకొల్పడంలో భాగంగా విగ్రహం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

అధికారుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం

పెద్దాపురం: పట్టణంలో అభివృద్ధి, నిర్మాణ పనులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యంతోనే తీవ్ర జాప్యం జరుగుతోందని ఒకటో వార్డు కౌన్సిల్ సభ్యుడు ఆరేళ్ల రాఘవ, 21వ వార్డు కౌన్సిలర్ గోకేడ అప్పారావు తీవ్రంగా ఆరోపించి అధ్యక్షురాలు పోడియం ముందు ఒకరి తరవాత మరొకరు కూర్చుని నిరసన తెలిపారు. గురువారం పురపాలిక అధ్యక్షురాలు బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన పురపాలిక పాలకమండలి సమ్మేళ సాధారణ సమావేశం జరిగింది. రాఘవ మాట్లాడుతూ టీపీఎస్, ఎల్‌ఈసీఎస్ నిధులపై ప్రశ్నించారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సమాధానమిస్తూ పథకాల ద్వారా రూ.3 కోట్ల వరకు వచ్చాయని, పనులు జరుగుతున్నాయన్నారు. ఇదే అంశంపై ఉపాధ్యక్షుడు సాయిప్రసాద్ మాట్లాడారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ తన వార్డులో ప్రగతి పనులపై ప్రశ్నించారు.

వైకాపా ఇచ్చింది ఖాళీ పట్టాలు

కొత్తపల్లి: వైకాపా ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు చూపించకుండా అర్హులందరికీ ఖాళీ పట్టాలిచ్చి చేతులు దులుపుకొన్నారని నాగులాపల్లిలో మహిళలు ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ వద్ద విలపించారు. స్థలాలకోసం భూములు సేకరించి లేఔట్ స్థల విభజన చేయకుండా వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎంపీని కోరారు.

గృహాలకు సులువుగా రుణాలు

సామర్లకోట: పురపాలక పరిధిలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఈజీ హోమ్‌లోన్స్ ఫైనాన్స్ కంపెనీ ద్వారా గృహానికి అవసరమైన రుణం అందుతుందని పురపాలిక కమిషనర్ శ్రీధర్ అన్నారు. గురువారం మెప్మా కార్యాలయంలో సీఎంఎం సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో చర్చించారు. ఫైనాన్స్ కంపెనీ సేల్స్ మేనేజర్ గాంధీ, మెప్మా సీఎల్‌టీసీ రత్నం పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులుగా ప్రతిభ

గొల్లప్రోలు: చెందుర్తి జడ్పీ పాఠశాలలో గురువారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థులతో అసెంబ్లీ సమావేశం తీరును ఉపాధ్యాయులు నిర్వహింపజేశారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తిలకించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు గీసిన చిత్రాలను ఆయన పరిశీలించారు. సతీష్, కృష్ణమూర్తి, వరలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి పెంచుదాం

పిఠాపురం: నీటి వృథాను అరికట్టాలని, మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా తెలిపారు. గురువారం పిఠాపురం కోర్టు ప్రాంగణంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో కూలింగ్ మినరల్ మంచినీటి ప్లాంటును ప్రారంభించి, పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. జడ్జి శ్రీహరి కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యదత్త వ్రతాలు

పిఠాపురం: పిఠాపురంలోని శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో సామూహిక సత్యదత్త వ్రతాలు వైభవంగా జరిగాయి. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వ్రతాలు ఆచరించారు. శ్రీపాద వల్లభుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈవో సౌజన్య ఆలయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో.. ఇల్లు తీస్కో

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సిబిల్ స్కోర్ బాగోలేక ఇదివరకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరించాయి. ఆ కారణంగా అర్హులకు ఆయా ఫ్లాట్‌లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంలో జాప్యం చోటుచేసుకుంది. దాంతో ప్రైవేటు బ్యాంకులు రుణాలిచ్చేందుకు ముందుకొచ్చాయి.

– న్యూస్‌టుడే, పిఠాపురం

రుణాలకోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న లబ్ధిదారులు

పిఠాపురం గోర్స రోడ్డులో టిడ్కో గృహ సముదాయ నిర్మాణం 2016లో మొదలైంది. 2018 నాటికే పనులు పూర్తయ్యాయి. అప్పటి తెదేపా ప్రభుత్వం తాత్కాలికంగా లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు కూడా చేపట్టింది. రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి పైపులైన్, ఇతర పనులు పెండింగ్ ఉండడంతో ప్రజలు ఇళ్లలో చేరలేదు. ఆ తరువాత 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కక్షపూరితంగా లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింతను అడ్డుకుంది. అయిదేళ్లపాటు అదిగో, ఇదిగో అంటూ హడావుడి చేసింది తప్పితే.. మరేదీ కాలేదు. 2023లో ఎన్నికల సమయంలో ఉచిత రిజిస్ట్రేషన్ అంటూ ప్రక్రియ మొదలుపెట్టింది. అప్పట్లో ఉచిత ఫ్లాట్లు పొందినవారు 192, మరో 200 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. మిగిలినవారికి బ్యాంకులు రుణాలివ్వక ఇళ్ల అప్పగింతలో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలు దఫాలుగా ఇళ్ల అప్పగింతపై దృష్టి సారించింది. ఇప్పటివరకు 669 మందికి

ప్రైవేటు బ్యాంకుల సుముఖత..

టిడ్కో లబ్ధిదారుల్లో 195 మందికి సిబిల్ స్కోర్ బాగోక, వయసు 50 ఏళ్లు పైబడి వయసు ఉండడం, మగపిల్లలు లేని మహిళలకు బ్యాంకులు రుణాలివ్వడం లేదు. దాంతో అధికారుల చొరవ మేరకు ప్రైవేటు బ్యాంకులు ముందుకొచ్చాయి. ఈజీ హోమ్‌లోన్ పథకంలో భాగంగా సిబిల్ స్కోర్ ప్రామాణికంగా చూడకుండా ఫ్లాట్లను ఆస్తిగా పరిగణిస్తూ బ్యాంకులు రుణాలిచ్చేందుకు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా వివరాలు తీసుకుంటున్నారు. ప్రక్రియ పూర్తికాగానే 195 మందికి రిజిస్ట్రేషన్లు చేసి ఇళ్లు అప్పగిస్తారు.

వివరాలివీ..	
మొత్తం ఫ్లాట్లు:	864
300 చ.అ.:	192
365 చ.అ.:	160
430 చ.అ.:	512
రిజిస్ట్రేషన్ అయినవి:	669
ఇంకా అప్పగించాల్సినవి:	195

అప్పగించారు. మిగిలిన వారికి కూడా ఆయా ఫ్లాట్లు అందించేందుకు చొరవ తీసుకుంటోంది. అప్పగించినా 200 మంది వరకు నివాసం ఉండడం లేదు.

మరమ్మతులు చేయిస్తాం

ఆరేళ్ల క్రితం టిడ్కో గృహ నిర్మాణం పూర్తయింది. వినియోగంలో లేక పలుచోట్ల స్లాబ్ లీకులు, విద్యుత్తు వైర్ల చోరీ, పైపులైన్ పగిలిపోయి, మరుగుదొడ్లు దెబ్బతిని ఉన్నాయి. రుణాలు మంజూరై, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే టిడ్కో సంస్థవారే మరమ్మతులు చేయించి, ఫ్లాట్లు అప్పగిస్తామని ఒప్పుకొన్నారు. డిసెంబరు నెలాఖరుకు అందరికీ ఫ్లాట్లు అందిస్తాం.

– పి.రాజు, కమిషనర్, పిఠాపురం

సీహెచ్‌సీలో సమస్యలా.. చెప్పండి

సూపరింటెండెంట్‌తో రేపు ఫోన్-ఇన్

తేదీ: 29-11-2025 (శనివారం)

సమయం మధ్యాహ్నం 12.00 నుంచి 1 గంట వరకు

సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో రోగుల సమస్యలు, పరిష్కారం, సందేహాలు నివృత్తి చేసేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.కార్తీక్, ఫిజీషియన్ ఆర్.వరలక్ష్మి, చిన్నపిల్లల వైద్యులు శివజ్యోతితో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ఫోన్‌ఇన్ కార్యక్రమం జరగనుంది. పట్టణ పరిధిలోని ప్రజలు ఆరోగ్య సమస్యలు, వైద్యులలో వసతులు, ఫిర్యాదులు, సూచనలను ఫోన్‌లో చెప్పవచ్చు. శరీరంలో చిన్నపిల్లలకు ఎటువంటి సమస్యలున్నా వైద్యుల సలహాలు పొందవచ్చు. – న్యూస్‌టుడే, సామర్లకోట

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

పెదపూడి: పెదపూడి మండలంలో ఈ నెల 29న విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఉదయభాస్కర్ గురువారం తెలిపారు. కరకుదురు, దోమాడ, అచ్యుతాపురత్రయం, పెదపూడి, ఆక్వా సర్వీసులకు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు ఉండదన్నారు. ✦ **తాళ్లరేవు:** చొల్లంగి, చొల్లంగిపేట, పటవల, కొత్తూరు, రామన్నపాలెం, మట్లపాలెం, జి.వేమవరం గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఉదయభాస్కర్ తెలిపారు.

ఇంటింటికీ గోదావరి జలాలు

సామర్లకోట గ్రామీణం: ప్రతి ఇంటికి గోదావరి జలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి పేర్కొన్నారు. పనసపాడులో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా దవళేశ్వరం నుంచి సామర్లకోట పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు గోదావరి జలాలను అందించే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచి వెంకటేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు పంచభూత స్వరూపుడు

పిఠాపురం, గొల్లప్రోలు: సుబ్రహ్మణ్యేశ్వరుడు పంచభూత స్వరూపుడని, ఆయన సకల అభీష్టాలను నెరవేర్చే దైవమని, పూజ చేస్తే భూమి అంతటినీ చేసినట్లేనని ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం రాత్రి గొల్లప్రోలు మండలం ఆలవెల్లి మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ప్రవచనాలు వినిపించారు. కమిటీ అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దక్షిణామూర్తి, కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, అప్పారావు, విశ్వనాథ పాల్గొన్నారు.

ప్రవచనం చెబుతున్న చాగంటి కోటేశ్వరరావు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఆర్బీకొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పంపన వినయ్ డిసెంబరు మొదటి వారంలో లక్నవూలో నిర్వహించే జాతీయ స్థాయి హ్యామర్ త్రో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యవేణి తెలిపారు. ఈ నెల 25న గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు.

పంపన వినయ్

బాస్కెట్‌బాల్ పోటీల్లో రజత పతకం

పెద్దాపురం: రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థిని దాడి కుమలాక్షైవి రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రజత పతకం సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ విజయప్రకాష్ తెలిపారు. మదనపల్లిలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో జరిగిన పోటీల్లో పతకం సాధించిందని అభినందించారు.

బీపీఎస్-ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన

గొల్లప్రోలు: గొల్లప్రోలు నగర పంచాయతీలో బీపీఎస్, ఎల్ఆర్ఎస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ శ్రీనివాసులు కోరారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 31 లోపు అనుమతిలేని భవనాల క్రమబద్ధీకరణ, నాన్ లేఅవుట్ల సమస్యల పరిష్కారానికి గడువు ఉందని చెప్పారు.

సహర్షకు అభినందన

కాజులూరు: అమలాపురంలోని శశిసంస్థలో బుధవారం మాక్ అసెంబ్లీలో పాల్గొన్న కాజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని యార్ల సహర్షను హెచ్‌ఎం విష్ణుమూర్తి, పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం అభినందించారు.

గృహ నిర్మాణాలపై విచారణ

కాజులూరు: గృహ నిర్మాణాలపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదుతో గురువారం గొల్లపాలెం శివాలయం పక్కన ఉన్న స్థలంపై విచారణ చేపట్టారు.

కంటి సంరక్షణ ప్రధానం

సామర్లకోట: దాతలు చొరవతో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. సామర్లకోట భీమేశ్వరాలయం వద్ద శంకర్ నేత్రాలయం, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యాంజలి సంయుక్తంగా గురువారం వైద్య సేవలు అందించారు. నిర్వాహకులు శివ, శ్యామ్, సునీత ఆధ్వర్యంలో అతిథులుగా ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి మాట్లాడారు.

చేతిరాత మార్చుకుందాం..

పిఠాపురం: చక్కటి చేతిరాత విద్యార్థుల భవిష్యత్తును మార్చేస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు కేవీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం పిఠాపురం ఏకేపీఎం పాఠశాలల విద్యార్థులకు పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్టు ద్వారా ఆంగ్లంలో చేతిరాతపై శిక్షణ ఇచ్చారు. పుస్తకాలు ఉచితంగా అందించారు. గణేష్‌వలీ, సత్యనారాయణ, సురేష్, గుబ్బలరాజు, ప్రధానోపాధ్యాయుడు రాజు పాల్గొన్నారు.

పూడిక పేరుకుని యాతన

వరహాలయ్యపేటలోని ప్రధాన కాలువలో చెత్తాచెదారంతో పూడిక పెరిగిపోయింది. మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. పూడిక తొలగించడానికి పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై వివరణ కోరగా కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తగిన కార్యాచరణకు ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశిస్తానన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

జల కేంద్రం.. నిరుపయోగం

గురజనాపల్లిలోని ఆర్వో ప్లాంటు పనిచేయడం లేదు. మరమ్మతులకుగురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. స్థానిక మంచినీటి ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటులో పరికరాలు పాడైపోవడంతో నిరుపయోగంగా ఉంది. దీని గురించి అడగ్గా ఏఈ వర్ధన్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

పైపు పగిలి.. మంచినీరు వృథా

పిఠాపురంలోని సీతయ్యగారితోటలో మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. వారం రోజులుగా సమస్య నెలకొంది. నీరు కలుషితమై ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ సమస్య గురించి తాగునీటి విభాగం పర్యవేక్షణాధికారి జనార్దన్‌కు చెప్పగా మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

ముగిసిన ఖోఖో జట్టు శిక్షణ శిబిరం

సర్పవరం: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని ఏపీఎస్పీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23 నుంచి నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో జట్టు బాలుర విభాగం శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులకు ఎంఈవోలు రంగారావు, శ్రీనివాస్‌కుమార్ అభినందనలు తెలిపారు. వీరు విశాఖలో జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. శ్రీనివాస్, మాచారావు, హరిబాబు, త్రిమూర్తులు, కిరణ్‌కుమార్, సుప్రియ పాల్గొన్నారు.

ఏపీఎస్పీ పాఠశాలలో క్రీడాకారులతో వ్యాయామోపాధ్యాయులు

మహిళలూ.. ఆరోగ్యం జాగ్రత్త

సర్పవరం: పెనుమర్తిలో గురువారం అక్కా కాకినాడ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారిని మాగంటి శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. వాలంటీర్లు స్నేహ, షర్మిల ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు నెలసరి శుభ్రతపై వివరించారు. యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, గైగోలుపాడు ఏరియా, రమణయ్యపేట పంచాయతీ, డో.నెం.4-281/1 కాపురస్తులు **మల్లెమడుగుల సుబ్బారావు గారి కుమారుడు లక్ష్మీ నారాయణరావు గారు** మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి ఇచ్చుచున్న పబ్లిక్ నోటీసు.

సర్పవరం గ్రామం, పోస్టల్ ఎంప్లాయిస్ కాలనీ, స.నెం.90రు దాఖలా ప్లాట్ నెం.21రు 396 చ.గల స్థలమును మా క్లయింటు తల్లిగారైన మల్లెమడుగుల వీరలక్ష్మి గారు భల్లమూడి శ్రీనివాసరావు గారి వద్ద నుండి ది.15-05-1995 తేదీన ద.నెం.3236/1995రు గా రిజిస్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా క్రయం పొంది దరిమిలా తన కుమారులు ముగ్గురికి తన అనంతరం చెందులాగున ఏర్పాటు చేస్తూ ది.15-05-1995 తేదీన ద.నెం.175/1995రు గా వీలునామా వ్రాయించి యున్నారు. అటు పిమ్మట మా క్లయింటుకు అతని సోదరుడు మల్లెమడుగుల అప్పారావు గారికి సదరు మొత్తం ఆస్తి దఖలు పడగా వారిరువురు ది.19-01-2005 తేదీన ద.నెం.667/2005రు గా రిజిస్టర్ కాబడిన పార్టీషన్ దస్తావేజు రీత్యా విభజించుకొని యున్నారు. కాగా మా క్లయింట్ వద్ద పైన పేర్కొన్న ద.నెం.175/1995రు గా రిజిస్టర్ కాబడిన వీలునామా ఒరిజినల్ రెండు రోజుల క్రితం సర్పవరం జంక్షన్ ఏరియా లో జెరాక్స్ కాపీ తీయించుటకు వెళ్ళు సమయంలో పోయినది. తిరిగి ఎంత వెదికిననూ దొరకలేదు. కావున సదరు వీలునామా ఒరిజినల్ ఎవరికి దొరికిననూ మా క్లయింటుకు అందజేయగలరు. సదరు వీలునామాను అనుసరించి మా క్లయింట్ సమ్మతి లేకుండా ఎవరు ఎట్టి వ్యవహారములు జరిపిననూ మా క్లయింటు జరపబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయడమైనది.

పేపకాయల రామకృష్ణ
మల్లిపూడి సత్యనారాయణ, మాగాపు చైతన్య కుమార్
ఆడ్వకేట్స్, మెహర్ భవన్, రామారావుపేట,
కాకినాడ. కాకినాడ. సెల్: 9440178750
ది.27-11-2025

లేబర్ కోడ్‌లపై కార్మికుల నిరసన

సర్పవరం: కాకినాడ గ్రామీణం వలసపాకలలో గురువారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ చట్టాలకు నిరసనగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ, మండల కార్యదర్శి తొట్టెంపూడి రాజా ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణాజీ,. చంద్రరావు, బలరాం, సంగీతరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చరవాణి వద్దు.. చదువే ముద్దు

సర్పవరం: విద్యార్థి దశ చాలా కీలకం.. తీసుకునే ప్రతి నిర్ణయం జీవితంలో గెలుపు, ఓటములను ప్రభావితం చేస్తుంది. చెడు అలవాట్లు, చరవాణి అతి వినియోగానికి దూరంగా ఉండాలని సీఐ చైతన్యకృష్ణ తెలిపారు. ఇంద్రపాలెంలో గురువారం మౌంట్ కార్మెల్ హైస్కూల్ ఎండీ నానిశెట్టి సాయిరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలు వివరించారు. ✦ **సామర్లకోట గ్రామీణం:** విద్యార్థినులు సోషల్ మీడియా, ఇతర వ్యక్తుల పరిచయాలకు దూరంగా ఉంటూ చదువుల్లో రాణించాలని సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. మాధవపట్నం జడ్పీ పాఠశాల్లో విద్యార్థులకు జాగ్రత్తలు సూచించారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ

సామర్లకోట గ్రామీణం: మాధవపట్నంలో గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్ట్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహ ముక్త్ భారత్ అని నినదించారు. సీడీపీవో ఉష, సర్పంచి సుగుణమ్మ, లక్ష్మి, శ్రీనివాసరావు, నళిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా నిలవాలి

పిఠాపురం: సమాజంలో ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలవాలని ఐఐఎఫ్ఎల్ బ్రాంచి డీఎం రైతు ప్రసన్నకుమార్ కోరారు. గురువారం ఐఐఎఫ్ఎల్ సామాజిక బాధ్యతలో భాగంగా పిఠాపురం బ్రాంచి ఆధ్వర్యంలో అగ్రహారం మున్సిపల్ పాఠశాలలో 40 మంది పేద విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. నాగభూషణం, అర్పణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న పురపాలిక కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: సామర్లకోట పురపాలిక కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29న జరుగుతుందని ఛైర్‌పర్సన్ అరుణ గురువారం తెలిపారు. ✦ **పిఠాపురం:** పిఠాపురం పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం ఛైర్‌పర్సన్ సూర్యావతి అధ్యక్షతన శనివారం జరుగుతుందని కమిషనర్ రాజు తెలిపారు. .

ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో బోధించాలి

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో బోధించాలని డీఈవో రమేష్ అన్నారు. గురువారం పెదపూడిలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా ధనరాజు

సర్పవరం: కాకినాడ గ్రామీణం తిమ్మాపురానికి చెందిన భాజపా సీనియర్ నాయకుడు కాళ్ల ధనరాజును కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పేర్కొంటూ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి బుధవారం రాత్రి నియామక పత్రం విడుదల చేశారు. ధనరాజు మాట్లాడుతూ జిల్లాలో భాజపా బలోపేతానికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. నాయకులు రామకృష్ణ, నాని, గాంధీ, మణిబాల తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

గొల్లప్రోలు: కడపలో డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. గురువారం చెందుర్తిలో కరపత్రాలు ఆవిష్కరించి, అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కన్నడ రమణ, నక్కా అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణకు డిమాండ్

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డా.శ్రీను

పిఠాపురం: తక్షణమే 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలని డెమొక్రాటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డా.డి.శ్రీను కోరారు. గురువారం పిఠాపురం మండలంలోని చిత్రాడ, ఎఫ్‌కేపాలెంలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకుసైతం సంబంధిత చెల్లింపులు చేయలేదన్నారు. సాయికృష్ణ, శ్రీనివాసులు, మణికుమార్ పాల్గొన్నారు.

స్వావలంబన సాధించండి

కరప: స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించేలా మహిళలు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు సూచించారు. గ్రామసందర్శనలో భాగంగా గురువారం ఆయన కరప మండలం వేళంగిలో పర్యటించి గ్రామైక్య సంఘాల పని తీరును సమీక్షించి స్త్రీనిధి రుణాల లబ్ధిదారులకు పథకాలపై అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కొత్తపల్లి విష్ణాలయం సమీపంలో కాలువలు పూడికతో మూసుకుపోయాయి. - **స్థానికులు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: పిఠాపురంలోని రామా థియేటర్ సెంటర్ సమీపంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. -**రమేష్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆ ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: నాగంపేటలో చెత్త కుప్పలు తొలగించక అధ్వానంగా ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి. - **భద్రరావు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా చెత్తకుప్పలు తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కరప మండలం వేళంగి చిన ఎస్సీపేటలోని పాఠశాల వద్ద వీధి కుళాయికి మూత లేదు. - **శివకుమార్**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావుకు చెప్పగా సిబ్బందితో కుళాయికి మూత పెట్టించారు.

– న్యూస్‌టుడే, కరప

సమస్య: పండూరు గ్రామ పంచాయతీ ఎస్సీకాలనీలో మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. - **రామనాథం**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌చౌదరికి చెప్పగా కార్మికులతో శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, సర్పవరం

అసంపూర్తిగా.. అధ్వానంగా

న్యూస్‌టుడే, తాళ్లరేవు

ఏళ్లు గడుస్తున్నా.. గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో వీటి నిర్మాణం ప్రారంభించారు. ఒక్కో భవనానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షల ప్రభుత్వం నిధులు కేటాయించింది. తర్వాత బిల్లులు, ఇతర సమస్యల కారణంగా పనులు ముందుకు సాగలేదు. తాళ్లరేవు మండలంలో 24 సచివాలయ కార్యాలయాలు ఉంటే 22 చోట్ల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. వాటిలో కొన్ని శ్లాబ్ వరకు రాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పిల్లంకలో భవనాన్ని ప్రారంభించి విధులు నిర్వహిస్తున్నారు. తాళ్లరేవు-2, పటవలలో నిర్మాణ పనులు పూర్తయినా విధులు నిర్వహించేందుకు కనీస సదుపాయాలు లేవు. మిగిలిన చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని భవనాల్లో విద్యుత్తు, ఫర్నిచర్ సదుపాయం ఏర్పాటు చేస్తే వినియోగించుకునే అవకాశం ఉంది. ఆ పనులూ చేయడం లేదు.

అద్దె భవనాల్లో విధులు

భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. నిర్మాణ దశలో ఉన్న భవనాలకు చెదలు పడుతున్నాయి. పాదులు పాకుతున్నాయి. వాటిని పట్టించుకునే వారే లేరు. గ్రామానికి దూరంగా ఉన్నచోట పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. మద్యం, గంజాయి, పేకాటకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ సమస్యను మండల ఇంజినీర్ అప్పారావు దృష్టికి తీసుకువెళ్లగా సచివాలయ భవనాల నిర్మాణంపై ప్రభుత్వానికి నివేదిక అందించామని తెలిపారు.

నిరుపయోగంగా తాళ్లరేవు-2 సచివాలయ భవనం

గ్రామ పంచాయతీ కార్యాలయం, గాడిమొగ, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా

టెండరు నోటీసు

తేది.27-11-2025

కాకినాడ జిల్లా, తాళ్లరేవు మండలం, గాడిమొగ గ్రామపంచాయతీ ఏరియాలో గ్రామపంచాయతీ నిధుల నుండి చేపట్టు ఈ దిగువ ఉదహరించిన పనులు పూర్తిచేయుటకు 09-12-2025 తేదీన ఉదయం 10:30 ని॥ల నుండి మధ్యాహ్నం గం.1:00ల వరకు పంచాయతీరాజ్, ఆర్&బి మరియు పిడబ్ల్యుడి ప్రభుత్వ శాఖలలో రిజిస్టర్ కాబడిన కాంట్రాక్టర్లచే సీల్డ్ టెండర్లు నిర్వహించబడి అదే రోజు మధ్యాహ్నం గం॥2.00లకు అప్పటికి హాజరైన టెండర్‌దారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. టెండరు షరతులు తదితర విషయంలో గ్రామపంచాయతీ కార్యాలయం పనివేళల్లో అడిగి తెలుసుకోవలెను.

వ. సం	పని పేరు	అంచనా విలువ	షెడ్యూల్	డిపాజిట్ రూ.
1.	పెదవలసల గ్రామంలో గోపమ్మ చెట్టు నుండి బాబానగరం శ్మశానం వరకు సిసి రోడ్డు నిర్మాణం	5.00 లక్షలు	1000	25,000
2.	గోపాలపురం గ్రామంలో అప్రోచ్ రోడ్డు నుండి బాబానగరం శ్మశానం వరకు సిసి రోడ్డు నిర్మాణం	5.00 లక్షలు	1000	25,000
3.	చినవలసల గ్రామంలో పేసింగి సత్యం ఇంటి నుండి కొత్త OHSR ట్యాంక్ వరకు సిసి రోడ్డు నిర్మాణం	5.00 లక్షలు	1000	25,000
4.	పెదవలసల R&B రోడ్డు నుండి చెక్కల బ్రిడ్జ్ వరకు సిసి రోడ్డు నిర్మాణం	5.00 లక్షలు	1000	25,000
5.	పెదవలసల R&B రోడ్డు నుండి ఓలేటి శ్రీను ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణం	5.00 లక్షలు	1000	25,000
6.	పెదవలసల గ్రామంలో రేఖడి వెంకటేశ్వర్లు ఇంటి నుండి R&B రోడ్డు వరకు సిసి డ్రైన్ మరియు కవర్ స్లాబ్లు నిర్మించుట	5.00 లక్షలు	1000	25,000
7.	పెదవలసల గ్రామంలో తుపాన్ బిల్డింగ్ నుండి R&B రోడ్డు వరకు సిసి డ్రైన్ మరియు కవర్ స్లాబ్లు నిర్మించుట	5.00 లక్షలు	1000	25,000

గమనిక: ది.06-12-2025 సాయంత్రం గం 5:00 వరకు షెడ్యూల్ A కొరకు దరఖాస్తులు తీసుకోబడును. దరఖాస్తుతో డిపాజిట్ చలానా రూపంలో SBI ట్రెజరి బ్రాంచ్, కాకినాడ యందు చెల్లుబాటు అయ్యే విధంగా సమర్పించవలెను.
2. ది.08-12-2025 ఉదయం 10:30 నుండి సాయంత్రం గం 5:00 వరకు షెడ్యూల్ A ఇవ్వబడును
3. టెండరు వ్రాయువారు స్వయంగా టెండర్ డిపాజిట్ వారి పేరున తీసి సమర్పించవలెను, వారే స్వయంగా టెండర్ సమర్పించవలెను.
4. టెండరు ఏ కారణం చేతనైనను రద్దు చేయుటకు గాని, వాయిదా వేయడం గాని పంచాయతీ కార్యదర్శి వారికి అధికారం కలదు
5. పంచాయతీ నిధుల నిల్వలను బట్టి ప్రాధాన్యత క్రమంలో సిఎఫ్ఎంఎస్ఐడి ఉన్నవారికి చెల్లింపులు జరుపబడును.

సం/- **కామాడి గోవాలక్ష్మి,** సర్పంచ్, గాడిమొగ, గ్రామపంచాయతీ, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా
సం/- **ఎస్.వెంకటరమణ,** పంచాయతీ కార్యదర్శి, గాడిమొగ గ్రామపంచాయతీ, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా

(c) eenadu

హైవేను కమ్మేసిన మంచు

జాతీయ రహదారిపై మంచు దుప్పటి కమ్మేసింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత నాలుగు రోజులుగా ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తుండంతో వాహనచోదకులు పగలు సైతం దీపాలు వేసి నడపాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంత రహదారులపై మరింతగా మంచు కమ్మేస్తోంది. చోదకులు అప్రమత్తతతో వాహనాలు నడపాల్సి ఉంటుంది. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం

శంఖవరం, న్యూస్‌టుడే: మానసిక ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యప్రియ అన్నారు. కె.కొత్తూరులో కత్తిపూడి సీతారామ కళాశాల విద్యార్థులతో చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించి వాటి ఉపయోగాలను వివరించారు. కో-ఆర్డినేటర్లు వెంకటేశ్వరరావు, అక్కారావు, ప్రిన్సిపల్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ఉ. 10 - మ. 1 ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

చెత్తను తరలించరూ..!

సమస్య: జె.అన్నవరంలో రహదారి అంచుల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - రామారావు, జె.అన్నవరం

సమాధానం: రహదారులు, కాలువల్లో ఉన్న వ్యర్థాలు, చెత్త తొలగింపు పనులు వెంటనే నిర్వహిస్తాం. - విశ్వనాథ్ వర్మ, ఎంపీడీవో, ఏలేశ్వరం.

వీధి దీపాలు వెలిగించండి

సమస్య: వేమవరం పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న వీధి దీపాలు కొన్ని రాత్రి సమయంలో వెలగడం లేదు. - బాబూరావు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి వీధి దీపాలు వేయిస్తాం. - అప్పారావు, పంచాయతీ కార్యదర్శి, తొండంగి

సమస్య: దానవాయిపేట మూడో వార్డులో వీధి దీపాలు వెలగడం లేదు. వీధి దీపాలు వేయాలి. - కుమార్, స్థానికుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి వీధి దీపాలు వేయిస్తాం. - విశ్వన్, పంచాయతీ కార్యదర్శి

బస్ షెల్టర్ అపరిశుభ్రం.

సమస్య: ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేటలో బస్ షెల్టర్ అపరిశుభ్రంగా ఉండి కూర్చునేందుకు అనువుగా లేదు. పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయించాలి. - రాజేష్, రమణయ్యపేట

సమాధానం: రమణయ్యపేటలోని బస్ షెల్టర్‌ను శుభ్రం చేసేందుకు పంచాయతీకి ఆదేశిస్తాం. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా పనులు చేయిస్తాం. - రామరాజు వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, ఏలేశ్వరం

హెచ్చరిక బోర్డులు అమర్చాలి

సమస్య: ఎస్.రాయవరం నుంచి ఏలేశ్వరం వెళ్లే మార్గం ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులు అమర్చాలి. - శ్రీను, ఎస్.రాయవరం

సమాధానం: మలుపులు ఉన్న ప్రదేశాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రమాదాల నివారణకు అవసరమైన బోర్డులు ఏర్పాటుచేస్తాం. - సాయి కిరణ్, జేఈ, ర.భ.శాఖ, ఏలేశ్వరం.

- న్యూస్‌టుడే, తొండంగి, ఏలేశ్వరం

సిబ్బంది కొరత.. సవాలే..

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, ఏలేశ్వరం

ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ తీరు

జిల్లాలో ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ కీలకం. ఉపప్రణాళిక మన్యం, 35 కి.మీ పొడవు ఉండే హైవేతో పాటు నాలుగు మండలాల్లోని రహదారుల భద్రత సవాలే. ఏలేశ్వరం నగర పంచాయతీ, అన్నవరం, పుణ్యక్షేత్రాలు, ప్రధాన కూడళ్ల యర్రవరం, ప్రత్తిపాడు, కత్తిపూడితో పాటు, కాలువలు, జలాశయాలు ఉన్నాయి. నియోజకవర్గంలో అటువంటివి నిఘా ఉండాల్సిందే. జూదాలు, వివాదాలు, చోరీల ఉదంతాలు వరుసగా పెరుగుతున్నాయి. అడపాదడపా ప్రోటోకాల్. ఏదో మూలన బందోబస్తుకి వెళ్లాలి. గణపతి నవరాత్రులు నుంచి కార్తీకం ముగిసే వరకు నియోజకవర్గం అంతటా హడావుడే. ఈ సర్కిల్ పరిధిలో సిబ్బంది కొరత గట్టి సవాలే. ఇప్పటికే 44 మంది వివిధ స్థాయిల సిబ్బంది

హైవేపై భద్రత చర్యలు పరిశీలిస్తున్న..

సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి స్టేషన్లు ఉన్నాయి. సిబ్బంది ఇలా..

సిబ్బంది	ఉన్నవారు	ఖాళీలు
ఎస్సైలు	4	-
అదనపు ఎస్సై	2	1
ఏఎస్సైలు	6	6
హెడ్‌కానిస్టేబుళ్లు	18	3
కానిస్టేబుళ్లు	75	24
హోంగార్డులు	24	10

రౌతులపూడి అవుట్ పోస్టే..!

మండలం ఏర్పడి 15 ఏళ్లు దాటినా రౌతులపూడిలో పోలీసు వ్యవస్థ వేళ్లూనుకోలేదు. ఎట్టకేలకు స్టేషన్ ఏర్పాటు చేయగా ఎస్సైను నియమించారు. మిగతా సిబ్బంది లేరు. స్టేషన్ భవన నిర్మాణమూ కొలిక్కిరాలేదు. ఈ క్రమంలో పోలీస్ అవుట్‌పోస్టుగానే సేవలు పరిమితం అయ్యాయి. కార్తీకం, రవాణా ఇబ్బందులు ఈ మండలంలో తీవ్ర సమస్యగా ఉన్నాయి.

రహదారి భద్రత..ట్రాఫిక్ నియంత్రణ

నియోజకవర్గంలో ఏలేశ్వరం- అన్నవరం వరకు 12 కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్య. సర్కిల్ పరిధిలో కొండలు, అటవీ ప్రాంతం, మైదానం వెరసి 600 చ.కి.మీ. విస్తీర్ణం. జూదాలు, సారా తయారీ, రవాణా, మద్యపాలు, శాంతిభద్రతల సమస్యలను అదుపు చేయడం నిత్యం ఏదో మూలన పని ఉంటుంది. నిత్యం రోడ్డు పై జరిగే ఆందోళనలు, ర్యాలీలు ఉంటాయి. ఐటీఎప ఆస్పత్రిలో చోరీలు పెరిగాయి. డ్రోన్ తరతర సాంకేతిక సహకారంతో పోలీసింగ్ ఈ సర్కిల్లో ఎక్కువ అవసరం ఉంది.

మూడు నెలలుగా నమోదైన కేసులు

రోడ్డు ప్రమాదాలు	18	దొంగతనాలు	20
వివాదాలు.. ఘర్షణలు..	70		
జూదాలు	21	డ్రంక్ అండ్ డ్రైవ్	60

ఉన్నతాధికారులకు నివేదించాం

సర్కిల్ పరిధిలో అవసరమైన సిబ్బంది విషయమై ఇటీవల ప్రత్తిపాడు స్టేషన్ తనిఖీకి వచ్చినపుడు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌కు నివేదించాం. - బి.సూర్య అప్పారావు, సీఐ

1న ఉచిత వైద్యశిబిరం

తుని పట్టణం, న్యూస్‌టుడే: ఎస్బీఐ ఆధ్వర్యంలో డిసెంబరు 1న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తుని బ్రాంచ్ (మెయిన్‌బ్రాంచ్) మేనేజర్ సౌజన్య తెలిపారు. ఎస్బీఐ, శంకర్ ఫౌండేషన్, మణిపాల్ సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమంలో నేత్ర, సాధారణ ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. పట్టణంలోని బెల్లపువీధి శాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించారు. బీఎల్వోలు ఇంటింటా పరిశీలన ద్వారా ఓటర్లు ఎందరు, నూతన ఓటర్లు, జాబితాలో మార్పులు గుర్తించాలని తహసీల్దార్ ఎన్వీ నరేష్ సూచించారు. ఓటరు సమగ్ర సవరణపై శిక్షణ జరిగింది.

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

తుని గ్రామీణం: తుని మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అమృతవాణి తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 19 కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన జూనియర్ ఇంటర్ విద్యార్థిని కాకర ప్రణతి బంగారు బహుమతి సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆ విద్యార్థినిని జిల్లా బాలిక సంరక్షణాధికారిణి ఉమామహేశ్వరి, ప్రిన్సిపల్ అమృతవాణి అభినందించారు.

జగ్గంపేట గ్రామీణం, జగ్గంపేట: నెల్లూరులో జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున జగ్గంపేట శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. నెల్లూరులో జరిగే పాఠశాల సమాఖ్య అటల రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీ చైతన్య పాఠశాలలో ఎస్ సూర్యచరణ్ (8వ తరగతి) నెల్లూరుకి ఎంపికయ్యారు. సీహెచ్ జ్యోష్న (6వ తరగతి) జె.రేవంత్ ఆర్ బెంజమిన్ రాజు (9వ తరగతి) అనంతపురం పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్డు శుభ్రతకు చర్యలు

గండేపల్లి: జడ్.రాగంపేట గ్రామంలో సర్పంచి కుడుల చిట్టిబాబు రోడ్డు శుభ్రతకు వినూత్న చర్యలు చేపట్టారు. ట్రాక్టర్‌తో గ్రామంలోని ప్రధాన సీసీ రోడ్లను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలో దుమ్ము ట్రాక్టర్లు, గడ్డి, మట్టిని తరలించే వాహనాలు తిరగడంతో రోడ్డు పక్కల మట్టితో నిండుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రోడ్డు శుభ్రత చర్యలు చేపట్టామని తెలిపారు.

28, 29 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

జగ్గంపేట గ్రామీణం, జగ్గంపేట న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు 28, 29 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్నాయి. వీటికి సంబంధించిన గోడ పత్రికను జగ్గంపేటలో బుధవారం సంఘ నాయకులు ఆవిష్కరించారు.

అన్నదాతల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

రాపాకలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని గ్రామీణం, తొండంగి, న్యూస్‌టుడే: అన్నదాతల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. రాపాక గ్రామంలో గురువారం నిర్వహించిన 'రైతన్నా మీకోసం'లో ఆమె పాల్గొన్నారు. రైతుల అభివృద్ధి కోసం చేపట్టే ప్రణాళికల కరపత్రాలను వారికి పంపిణీ చేశారు. చింతలపాటి అబ్బాయి, తమరాన సత్యనారాయణ, గంగాధర్, బాబ్జి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ● రైతుల కళ్లలో సంతోషం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఆనూరులో గురువారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అమలు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులు యనమల రాజేష్, చింతలపాటి అబ్బాయి, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, చొక్కా కాశీ, తదితరులు పాల్గొన్నారు.

స్వాతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సభను బాగా నిర్వహించావు

ప్రత్తిపాడు: విద్యార్థుల మాక్ అసెంబ్లీ సభాపతిగా వ్యవహరించిన శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన ఎస్.స్వాతిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం తన కార్యాలయంలో సత్కరించారు. ఆమెకు మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. చక్కగా చదువుకుని ఎంచుకున్న రంగంలో స్వాతి ఉన్నతస్థానానికి చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సర్పవరం: కాకినాడలోని కార్యాలయంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌ను గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. రూరల్ దిగువ మంజూరు, పెదమల్లాపురం కేంద్రంగా కొత్త ఏర్పాటు చేస్తున్న ఐటీడీఏ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సహకారం అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

సెల్‌ఫోన్‌ను మంచికే వినియోగించాలి

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

తరగతి గదిలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

తుని, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని లయోలా ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై పిల్లలు ఆసక్తిగా ఉపన్యాసం ఇచ్చారు. ఆధునిక పోటీ ప్రపంచంలో సెల్‌ఫోన్ వాడకం ఓ అత్యవసర సదుపాయం కాగా, దీనిని మంచికే వినియోగించాలని అనేక మంది అభిప్రాయపడ్డారు. స్కూలు ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. పోటీల్లో వీటీవీ కృష్ణ (10వ తరగతి), డి.సరయు (9వ తరగతి), డి.సుహాసిని (9వ తరగతి) వరుసగా మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరికి ఈనాడు సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను కరస్పాండెంట్ దండు రామకృష్ణ, ప్రిన్సిపల్ డి.వి రామచంద్రరావు, ఉపాధ్యాయులు పి.లోవరాజు, బి.మహేష్ లు అందజేశారు.

బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలు

ఇసుక మేటతో.. ప్రమాదకరం

హైవేపై కి.మీ.కొద్దీ శంఖువులు ఉంచి రోజూ నిర్వహణ పనులు జరుగుతూనే ఉంటాయి. ప్రమాదకరమైన, చోదకులు ఇబ్బందులు పడే పరిస్థితులను మాత్రం చక్కదిద్దడం లేదు. ఎర్రవరం నుంచి కత్తిపూడి వరకు రహదారి కన్నా ఎత్తుగా ఇసుక మేటలు వేస్తున్నాయి. వర్షానికి, ఇసుక, మట్టి, కంకర చిమ్ముకుంటూ వెళ్లే లారీల వల్ల ఇలా మేటలు వేస్తున్నాయి. తొలగించక పోవడం వల్ల ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దాబాల వద్ద అంచులు అగాధాల్లా మారుతున్నాయి. రహదారి భద్రత కోసం హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సీఐ సూర్యఅప్పారావు తెలిపారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

నిరుపయోగంగా తాగునీటి పథకం

ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌కి సమీపాన ఉన్న మంచి నీటి పథకం నిర్వహణకు దూరమైంది. జీఎల్ఆర్ ట్యాంకు పైభాగాన పిచ్చి మొక్కలు పెరిగాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న పథకం దుస్థితికి చేరింది. నిర్మాణం, చప్టా చుట్టూ నాచు ఉంది. పరిశుభ్రత దూరం కావడంతో తాగు నీటి కోసం వచ్చే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. నగర పంచాయతీ అధికారులు చూసీచూడనట్టే వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి జీఎల్ఆర్ ట్యాంకుపై భాగంలో ఉన్న కొరగాని మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

ప్రధాన రోడ్లలో పశువుల సంచారం

ఏలేశ్వరం రహదారులపై మూగజీవాల సంచారంతో స్థానికులు, వాహనచోదకులకు ఇబ్బందిగా ఉంటోంది. రేయింబవళ్లు ఇవి రోడ్ల మధ్యలోనే ఉంటున్నాయి. ఈ విషయంలో నగర పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పశువులను సంబంధిత యజమానులకు అప్పగించడం, లేదా నగర పంచాయతీ అదుపులో ఉంచుకునేందుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

దాత ఔదార్యం.. అధికారుల నిర్లక్ష్యం

మండలంలోని తిరుమాలి కాలనీ నుంచి రోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. వారి సౌకర్యార్థం గతంలో దాత కాలనీలో ర.భ.శాఖ రహదారి చెంతనే బస్‌షెల్టర్ నిర్మించారు. నిర్వహణను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమేపీ అది శిథిలస్థితికి చేరుకుంది. ఫలితంగా నిర్మాణం నేడో రేపో పడిపోయే స్థితికి చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెల్టర్‌ని వినియోగానికి అనువుగా తీర్చిదిద్దాలని, లేకుంటే కూల్చివేసి నూతన నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

సాయం చేయడంలోనే సంతృప్తి

తొండంగి: పేదలకు సాయం చేయడంలో సంతృప్తి ఉంటుందని సత్యసాయి హేచరీ అధినేత యాదాల రాజబాబు అన్నారు. కాకినాడ సెక్టార్ ఆల్ ఇండియా ష్రింప్ హేచరీ అధ్యక్షుడు సత్తి సూర్యనారాయణరెడ్డి (పెదబాబు) పుట్టినరోజు వేడుకలు తాటియాకులపాలెంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఏటా పెదబాబు పుట్టినరోజున రక్తదానం, దుస్తులు, నిత్యావసర సరకులు పంచుతున్నట్లు పేర్కొన్నారు. అద్దరిపేట నుంచి చోడిపల్లిపేట వరకు ఉన్న పేదలు సుమారు 150 మందిని గుర్తించి ఒక్కొక్కరికి రూ.3 వేలు విలువ చేసే బియ్యం, దుప్పట్లు, 9 రకాల నిత్యావసర సరకులు సప్తగిరి హేచరీ ఉద్యోగులు ప్రసాద్, శేఖర్, రాజ్‌కుమార్ చేతుల మీదుగా రాజబాబు అందజేశారు. కేకును కోసి అందరికి మిఠాయిలు పంచారు. తనూజ్, స్వామి, యశ్వంత్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు సరకులను అందిస్తున్న రాజబాబు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు అభిప్రాయ సేకరణ

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆలీ

తుని: కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు కార్యకర్తలు, నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ఏఐసీసీ పరిశీలకుడు ఆలీ మెహది అన్నారు. పట్టణంలోని ఆర్ఎస్‌పేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. పార్టీ చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' లో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ చేపట్టామన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఎవరైనా ఆసక్తి ఉన్నవారు మూడు రోజుల్లోగా దరఖాస్తు ఇవ్వవచ్చునన్నారు. సత్యానందరావు, శ్రీనివాసరావు, వీరభద్రరావు, గోవిందరావు పాల్గొన్నారు.

కడపలో లిబరేషన్ జాతీయ మహాసభలు

వెంకటనగరంలో ర్యాలీ

ప్రత్తిపాడు: సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలు కడపలో డిసెంబరు 6,7 తేదీల్లో జరుగుతాయని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటనగరం గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లత్సబాబు తదితరులు నాయకత్వం వహించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ మహాసభల్లో ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను చర్చిస్తారన్నారు.

పకడ్బందీగా 'ఉపాధి' పథకం నిర్వహణ

మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు పూర్తి పారదర్శకంగా ఉండాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆదేశించారు. గతంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ కోసం ముందస్తుగా ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. భవిష్యత్తులో జరిగే ప్రతి పని రైతులు, కూలీలకు మేలు చేసేదిగా ఉండాలన్నారు. ఆడిట్ పక్కాగా జరగాలన్నారు. ఈ నెల 28 నుంచి ప్రతి గ్రామంలోనూ సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో రవికుమార్ వర్మ చెప్పారు. సమావేశానికి ఎస్ఆర్‌పీ రాజు తదితరులు హాజరయ్యారు.

తాగునీటి కష్టాలు తీరాయి..

కొళాయి ప్రారంభించిన పీఏసీఎస్ ఛైర్మన్ రామలింగేశ్వరావు

తుని గ్రామీణం: ఎస్.అన్నవరం శివారు శాంతినగర్ కాలనీలో రక్షణ మంచినీటి కొళాయిలు లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దివ్యకు వినతిపత్రం అందించారు. ఆమె ఆదేశాలతో మండల పరిషత్తు నిధులు రూ. రెండు లక్షలు వెచ్చించి కాలనీలోని నాలుగు వీధులకు పైపులైను వేసి కొళాయిలు ఏర్పాటు చేశారు. వాటిని గురువారం ఎస్.అన్నవరం పీఏసీఎస్ ఛైర్మన్ రామలింగేశ్వరరావు, కూటమి నాయకులు ప్రారంభించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

తొండంగి: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పాండు తెలిపారు. నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామానికి చెందిన దంపతులు బాబ్జి, మంగ ద్విచక్ర వాహనంపై బుధవారం కొంతంగి నుంచి స్వగ్రామం వెళ్తుండగా బెండపూడి హైవేపై వీరి వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో మంగకు తీవ్ర గాయాలు, బాబ్జికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్సులో కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ మంగ (45) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి బంధువు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బంగారు ఆభరణం చోరీ

తుని: తుని గొల్లప్రోలు సెంటర్‌లో బస్సు ఎక్కుతుండగా దుండగులు బంగారు ఆభరణం చోరీ చేసినట్లు ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పాపారావు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం వేమగిరి గ్రామానికి చెందిన కె.లక్ష్మీ పాయకరావుపేటలో ఉన్న కుమార్తె ఇంటికి వచ్చారన్నారు. తర్వాత 23న అక్కడి నుంచి కాకినాడలోని మరో కుమార్తె వద్దకు వెళ్లేందుకు తునిలో బస్సు ఎక్కుతుండగా 14 గ్రాముల బంగారు నెక్లెస్, ఆధార్ కార్డు ఉన్న బ్యాగు చోరీకి గురైందన్నారు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

8 నెలలు.. 577 కేసులు.. రూ.68 లక్షల జరిమానా

రౌతులపూడి: కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నేటివరకు 577 కేసులు నమోదు చేసి రూ.68 లక్షలు జరిమానా విధించామని ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు. రౌతులపూడి మండలం నుంచి నల్లరాయిని తరలించే, చింతలూరు నుంచి ఎర్రమట్టిని తరలించే పలు లారీలు అధిక లోడు, భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. అలాంటి నిబంధనలు పాటించని భారీ వాహనాలపై 116 కేసులు నమోదు చేసి రూ. 16 లక్షలు జరిమానా విధించామన్నారు. తనిఖీలు నిరంతరం సాగుతాయని, నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తుని పట్టణం: పోటీ ప్రపంచంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత స్థాయికి చేరతారని ఏయూ కళాశాల అభివృద్ధి మండలి డీన్ ప్రొ.టీవీ కృష్ణ అన్నారు. శ్రీప్రకాష్ అనుబంధ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నూతన పరీక్షా, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ విభాగాలను ఆయన గురువారం ప్రారంభించారు. అటానమస్ కళాశాలలో ఉన్న వసతులు, ఆయా విభాగాలను పరిశీలించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపల్ డా. రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంటర్‌ను ప్రారంభిస్తున్న టీవీకృష్ణ, ఇతరులు

ఇరుకిరుగ్గా రోడ్లు.. రాకపోకలకు ఇబ్బంది

పల్లె, పట్టణాల్లో మార్గాల దుస్థితి

ఏలేశ్వరం, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు రావాలంటే అంతర్గత రహదారిపై కాలుమోపాలి. రోజూ అత్యవసరమైన రోడ్లు అసౌకర్యంగా ఉంటున్నాయి. ఏలేశ్వరం పట్టణం, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 30 కి.మీ. పరిధిలో ఉన్న అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో రూ.10 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అంతర్గత రహదారులను నిర్మించారు. నిర్వహణ కొరవడి వాటి రూపురేఖలు మారాయి. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో లక్ష మంది జనాభాకు నిత్యం ఇబ్బందే. కనీస మౌలిక వసతులు సక్రమంగా లేకపోవడంతో ప్రజల పాట్లు వర్ణనాతీతం.

ఏలేశ్వరం రెండో వార్డులో ఇరుకు రోడ్డు

'విజన్' లేని పనులతో ఇక్కట్లు

ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా 60 శాతం పరిధిలో సీసీ రోడ్లు ఉన్నాయి. కాని అవి నిర్వహణకు దూరమవుతున్నాయి. సీసీ రహదారులు నిర్మించిన అనేక వీధుల్లో కాలువల నిర్మాణం జరగకపోవడం గమనార్హం. ఈ క్రమంలో వర్షం, వాడకం నీరు రహదారులపైనే తిష్ఠ వేస్తోంది. పలు వార్డుల్లో కాలువలు లేకపోవడంతో రోడ్డు కిరువైపులా తుప్పలు పెరిగాయి. అసలే ఇరుకుగా ఉన్న రహదారులు పిచ్చి మొక్కలతో మరింత సన్నగా మారాయి. తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని ప్రజలు గొల్లుమంటున్నారు. ● ఏలేశ్వరం రెండో వార్డులో ఉన్న ఈ రహదారే అస్తవ్యస్త పరిస్థితులకు దర్పణం పడుతోంది. పలు గ్రామాల్లోనూ ఇదే తీరు. సంబంధిత పంచాయతీలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏ వీధిలైనా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించిన సమయంలోనే కాలువల ఏర్పాటుకు చోటు కల్పించాలి. కాని రహదారులు నిర్మించిన వీధిలో కాలువ ఉండదు. కాలువ ఉన్న ప్రాంతంలో సీసీ రోడ్లు ఉండవు. దీంతో పలు ప్రాంతాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అందని పరిస్థితి. సకాలంలో పన్నులు కట్టించుకుంటున్న స్థానిక సంస్థలు మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించకపోవడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంతర్గత రహదారులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

(c) eenadu

రప్పా.. రప్పా.. ఈ ఆక్రమణలేందప్పా

అసంపూర్తిగా ఉన్న గోడ నిర్మాణం పూర్తి చేయించడమే కాకుండా.. ఎత్తు పెంచి నిర్మిస్తుండటం గమనార్హం.

■ వివాదాస్పద స్థలంలో వైకాపా నేత ప్రహరీ నిర్మాణం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గత ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఇష్టానుసారం ఆక్రమించిన వైకాపా నేతలు కూటమి ప్రభుత్వంలోనూ తమ కబ్జాల పరంపరను కొనసాగిస్తున్నారు. కర్నూలు నగరం నడిబొడ్డున ఉన్న వివాదాస్పద స్థలంలోనే నిర్మాణాలు చేపట్టడం తాజాగా చర్చనీయాంశమైంది. ఆర్‌ఎస్ రోడ్డు ఐదురోడ్ల కూడలిలో సుమారు రూ.80 కోట్ల విలువ చేసే 1.60 ఎకరాల ఆగ్రోస్ సంస్థ స్థలాన్ని రెండున్నరేళ్ల కిందట వైకాపా హయాంలో ఆ పార్టీ జిల్లా కార్యాలయానికి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో వైకాపా కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. అప్పట్లో ఆగ్రోస్ సంస్థ అనుమతులు లేకుండానే రెవెన్యూ శాఖ ద్వారా ఆ భూమిని పార్టీ కార్యాలయం కోసం తీసుకున్నారు. అప్పట్లో తెదేపా నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ భవనాన్ని ప్రభుత్వ అవసరాలు, రైతుల సంక్షేమానికి వినియోగించేలా చూస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైనా ఆ స్థల వ్యవహారం ఓ కొలిక్కి రాలేదు. నగరపాలక సంస్థ అధికారులు దీనిపై కోర్టుకు వెళ్లినట్లు సమాచారం. కోర్టు విచారణలో ఉన్న స్థలంలో ప్రస్తుతం వైకాపా నేతలు ప్రహరీ నిర్మించారు. ఆ పార్టీ జిల్లా నేత ఒకరు స్వయంగా ఈ పనులు చేయిస్తున్నట్లు సమాచారం.

చదువులమ్మ ఒడి

ఆలూరు జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. పూర్వ విద్యార్థినులు తులసి, ధనలక్ష్మి సుమారు రూ.2 లక్షలతో గుడి నిర్మించి పాలరాతితో తయారు చేయించిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. అర్చకుల అభిషేకాలు, మహా మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఆలూరు

అభివృద్ధి నిధి.. ఆరగించడమే విధి

■ తేలని రూ.52.30 కోట్ల పంచాయతీ లెక్కలు

గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారు. కొన్నింటికి బిల్లులు లేవు. మరికొన్ని వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేసి నిధులు పక్కదారి పట్టించారు. ఆడిట్ అధికారులు తనిఖీలు చేయగా అక్రమాలు బయటపడ్డాయి.

– న్యూస్‌టుడే, కర్నూలు జడ్పీ

భారీగా ఆడిట్ అభ్యంతరాలు

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 పంచాయతీలున్నాయి. వీటికి వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు నాటికి ఆడిట్ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

● 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలకు చేరిన సొమ్ము (ప్రభుత్వ, సొంత వనరులు)పై సమగ్రంగా ఆడిట్ నిర్వహించి అభ్యంతరాల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రకటన విడుదలకు ముందే ఆడిట్ పూర్తి చేయడం ద్వారా బాధ్యులైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశముంటుంది.

ఏడాది	వసూలైన పన్నులు (రూ.కోట్లు)	వచ్చిన నిధులు (రూ.కోట్లు)
2020-21	21.10	152
2021-22	22.76	148
2022-23	19.15	79
2023-24	16.95	123
2024-25	19.60	61

ఏటికేడు పెరిగిపోతూ..

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక శాతం మంది వైకాపాకు అనుకూలమైన సర్పంచులు ఉన్నారు. వివిధ పంచాయతీల్లో నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. వాటికి సంబంధించిన రసీదులు, దస్త్రాలు కనిపించడం లేదు.
- 2020-21 నుంచి 2023-24 వరకు ఆడిట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 44,100 అభ్యంతరాలు వెలుగు చూశాయి. వీటికి సమాధానాలు కానరావడం లేదు. రూ.52.30 కోట్ల నిధులకు పంచాయతీలు సమాధానం చెప్పడం లేదు.

సహకారం అందించక..

- నంద్యాల జిల్లాలో 489 గ్రామ పంచాయతీలున్నాయి. 2023-24లో 9,400 అభ్యంతరాల రాగా రూ.4.57 కోట్ల విలువైన సొమ్ముకు లెక్కలు తేలడం లేదు. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో ఈ పరిస్థితి నెలకొందని ఆడిట్ అధికారులు చెబుతున్నారు.
- నంద్యాల జిల్లాలో 40 పంచాయతీల్లో ఆడిట్ చేసేందుకు సంబంధిత కార్యదర్శులు సహకరించడం లేదు. దస్త్రాలు, పుస్తకాలు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులున్నాయి.
- ఆడిట్ పూర్తైన తర్వాత 2 నుంచి 4 నెలల్లోగా పంచాయతీ కార్యదర్శులు సమాధానాలివ్వాల్సి ఉండగా.. అధిక శాతం మంది ఖాతరు చేయడం లేదు. ఆడిట్ అధికారులు తాఖీదులు జారీ చేస్తే తప్ప స్పందించడం లేదు.

తనిఖీలు మరిచి..

- డీపీవో, డీఎల్‌పీవోలు పంచాయతీలను తనిఖీ చేయకపోవడంతో అభ్యంతరాలు అధికమవుతున్నాయి. ఇటీవల రుద్రవరం, బనగానపల్లి పంచాయతీల్లో నిర్వహించిన తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. పంచాయతీ అధికారుల తనిఖీ లేకపోవడమే కారణమని నంద్యాలకు చెందిన ఓ ఆడిట్ అధికారి చెప్పారు.
- పంచాయతీ ఎన్నికల జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఆడిట్ పూర్తి చేయాలన్న ప్రభుత్వం ఆదేశాలను అమలు చేస్తామని కర్నూలు జిల్లా ఆడిట్ అధికారి రమేష్ చెప్పారు.

నడిచే నాట్యమా!

నృత్యం చేస్తున్న సురేష్

పదో తరగతి పూర్తి చేసిన కుర్రాడు సినిమాలపై ఆసక్తితో హైదరాబాద్‌కు వెళ్లారు. చార్మినార్ వద్ద పర్యాటకుల ఫొటోలు తీస్తూ సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పని చేస్తూ బతుకుబండి లాగించారు. ఈ క్రమంలో కూచిపూడిపై ఆసక్తితో పలు కోర్సులు పూర్తి చేసి నాట్యంలో నైపుణ్యం సాధించి జూనియర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు నంద్యాలకు చెందిన పల్లెంశెట్టి సురేష్. నాట్యంలో నైపుణ్యం సాధించిన ఆయన కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వారు ప్రకటించే జూనియర్ ఫెలోషిప్ అవార్డుకు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కూచిపూడిలో ఈ అవార్డు సాధించిన ఏకైక వ్యక్తి కావడం గమనార్హం. అదేవిధంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్ భారత్ రంగ్ మహోత్సవంలో పాల్గొన్నందుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకొన్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

పాఠం ప్రత్యక్ష వీక్షణం

ట్యాబ్‌లో పాఠాలు వింటున్న విద్యార్థినులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లో పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని అనుసరించి పాఠాలు బోధించేందుకు సమగ్ర శిక్షా శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్రంలో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో 20 పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌ల ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. ఇప్పటికే ట్యాబ్‌లు వచ్చాయి.. వాటిల్లో గణితం, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల్లోని కంటెంట్‌ను నిక్షిప్తం చేస్తున్నారు. ఈ విధానంలో కృత్రిమ మేధ విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేసి, దానికి అనుగుణంగా వీడియో పాఠాలు ప్రసారం చేస్తారు.

బడిలో పాల్ ల్యాబ్స్

2025-26 విద్యా సంవత్సరంలో తుగ్గలి మండలంలోని ఆర్ఎస్ పెండేకల్, చిప్పగిరి మండలం నేమకల్, కల్లూరు మండలం పర్ల, కర్నూలు రూరల్ పరిధిలో మిలిటరీ కాలనీ, వెల్దుర్తిలోని డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, నందికొట్కూరు మండలంలోని కొణిదెల, నంద్యాల మండలం ఎన్.కొత్తపల్లి, కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి, ప్యాపిలిలో హుస్సేనాపురం, బనగానపల్లిలోని ఇల్లూరు కొత్తపేట, పగిడ్యాలలోని ప్రాతకోట, రుద్రవరం తదితర ప్రభుత్వ పాఠశాలల్లో పాల్ ల్యాబ్ అమలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఏఐ ఆధారంగా బోధన

○ ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పాల్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం పూర్తిగా స్వయం చాలిత అభ్యసన విధానం. ఒక్కో పాఠశాలలో 30 ట్యాబ్‌లు సమకూరుస్తారు. గణితం, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల్లోని కంటెంట్ ట్యాబ్‌లలో నిక్షిప్తం చేస్తారు. ఈ ప్రక్రియ అంతా ఏఐ ఆధారంగా పనిచేస్తుంది.

○ ట్యాబ్‌లలో ఉంచిన సమాచారం మేరకు ఒక్కో విద్యార్థి అందులో ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చే క్రమంలో వారి సామర్థ్యాలు, స్థాయిని పరిగణనలోకి తీసుకుని ట్యాబ్‌లో నుంచి విద్యార్థులకు బోధన జరుగుతుంది. వారానికి రెండు గణితం తరగతులు, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టులకు ఒక్కో తరగతి వచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రయాణం.. పర్వతారోహణం

ప్రస్తుతం పర్వతాలను తేలిగ్గా అధిరోహిస్తున్నారు.. కానీ ఆదోని పట్టణ శివారులోని పర్వాతాపురానికి వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. మూడేళ్ల కిందట రూ.30 లక్షలతో ప్యాచ్‌వర్క్ చేశారు. ప్రస్తుతం 'తారు'మారై అధ్వానంగా మారింది. మూడు కి.మీ. మేర ఉన్న ఈ దారి మేదరవీధి కొత్త ఆకాశవంతెన కింది నుంచి కంకర తేలి ఆనవాళ్లు కోల్పోయింది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉండటంతో 40-50 టన్నుల భారం ఉన్న లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. - **న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం**

అప్పు మింగింది.. ఆత్మక్షోభ మిగిలింది

■ అన్నదాతల కుటుంబాలకు అందని పరిహారం
■ త్రీమెన్ కమిటీల విచారణ పేరుతో తీవ్ర జాప్యం

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : అప్పుల ఊబి నుంచి బయటపడలేక అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతినెలా సగటున ఐదారుగురు ప్రాణాలు తీసుకుంటున్నారు. వారి ఆత్మహత్యలపై అధికారులు విచారణ జరిపి.. ప్రభుత్వానికి నివేదిక ఇస్తే.. బాధిత కుటుంబాలకు రూ.7 లక్షలు చొప్పున పరిహారం అందుతుంది. సాయం నివేదికలు వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు వెళ్లి. . ప్రభుత్వం పరిశీలించి పరిహారం ఇచ్చేలోపు ఏడాది నుంచి రెండేళ్లు దాటుతుండటంతో బాధిత కుటుంబాలు బతకడానికి మరింత అప్పులు చేయాల్సి వస్తోంది.

బతుకు భారమై.. చదువు దూరమై..

– వీరేశమ్మ, ఐరన్‌బండ, గోనెగండ్ల

నా భర్త రామాంజినేయులు సొంత పొలం రెండెకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిరప, ఉల్లి పంటలు సాగు చేసేవారు. మూడేళ్లగా భారీ వర్షాలు, తెగుళ్లతో దిగుబడి పడిపోయింది. గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడంతో రూ.10 లక్షల అప్పులు మిగిలాయి. అప్పులోళ్ల బాధ తాళలేక ఈ ఏడాది ఏప్రిల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి మాకు సాయం అందలేదు. దీంతో పదో తరగతి వరకు చదివిన నా కుమారుడు ప్రవీణ్ నాతో పాటే కూలి పనులకు వస్తున్నాడు. కుమార్తె అంజలి నర్సింగ్ చదువుతోంది. ఆమె చదువు ఖర్చులూ భరించలేని పరిస్థితి మాది. ప్రభుత్వం త్వరగా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

అడుగడుగునా ఆలస్యమే..

❑ రైతు ఆత్మహత్య చేసుకున్న 24 గంటల్లోపు వీఆర్వో మండల వ్యవసాయాధికారి (ఏవో), తహసీల్దారుకు సమాచారం చేరవేయాలి. ఆత్మహత్యకు కారణాలను ఏవోలు తెలుసుకొని ఉన్నతాధికారులకు ప్రాథమిక సమాచారం పంపాలి. ఇందుకు నెల రోజులు పడుతుండటం గమనార్హం.

❑ రైతు ఆత్మహత్యకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఆధారంగా చేసుకొని త్రీమెన్ కమిటీ (ఏవో, తహసీల్దారు, ఎస్సై) బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు సేకరించాలి. ఈ నివేదికను ఆర్డీవో లాగిన్‌కు పంపేందుకు ఒకటి, రెండు నెలలు పడుతోంది.

❑ త్రీమెన్ కమిటీ నివేదికను ఆర్డీవో, వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ, డీఎస్పీలు, జిల్లా వ్యవసాయాధికారి, జేసీ పరిశీలించి కలెక్టరు ఆమోదంతో ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు కనీసం ఆరు నెలల సమయం పడుతోంది. బాధిత కుటుంబానికి పరిహారం అందేసరికి ఏడాది దాటిపోతోంది.

ముందుకు కదలని నివేదికలు

❑ ఈ ఏడాది ఏప్రిల్‌లో వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదికల ప్రకారం.. కర్నూలు జిల్లాలో 42, నంద్యాల జిల్లాలో 25 మంది కలిపి 67 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడినట్లు లెక్కలు చెబుతున్నాయి.

❑ కర్నూలు జిల్లాలో 40, నంద్యాల జిల్లాలో 24 మంది చొప్పున 64 మంది రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన నివేదికలు ఇప్పటికే వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఆర్డీవోలు, తహసీల్దార్ల లాగిన్లలో కర్నూలులో 12, నంద్యాలలో 8 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవికాక ప్రాథమిక స్థాయిలో కర్నూలులో 10, నంద్యాలలో ఆరుగురు కలిపి మరో 16 మంది వరకు ఆత్మహత్యలు చేసుకున్నారు.

అర ఎకరం రూ.55,080 లాభం

అర ఎకరం పొలంలో బీట్‌రూట్ సాగు చేసి 90 రోజుల్లో రూ.55,080 లాభం గడించారు ముడుమాలకు చెందిన రంగన్న. సెప్టెంబరు మొదటి వారంలో పొలంలో విత్తనాలు విత్తారు. అందుకు రూ.4,000 వేలు వెచ్చించారు. చీడపీడల నివారణకు మరో రూ.ఐదు వేలు ఖర్చు చేశారు. పంట పూర్తికాలం 90 రోజులు. గత వారం మొదటి కోత కోశారు. కర్నూలు మార్కెట్‌కు 26 సంచులు (ఒక్కోటి 55 కిలోలు) తరలించారు. 10 కిలోలు రూ.360 చొప్పున విక్రయించారు. కూలీలు, ఆటో ఖర్చు మొత్తం రూ.2,520 వేలు ఖర్చు అయ్యింది. రెండో కోతలో 20 సంచులు తీసుకెళ్లారు. మొత్తం ఖర్చులు రూ.35,000 పోగా రూ.55,080 ఆదాయం వచ్చింది. – న్యూస్‌టుడే, సి.బెళగల్

ఆకతాయిల వేధింపులా యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు

కళాశాలలు, బస్టాండులు ఇలా బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు, బాలికలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. వారి సామాజిక, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. దీన్ని అలుసుగా చేసుకొని ఆకతాయిలు మరింతగా రెచ్చిపోతున్నారు. విషయాన్ని గుర్తించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోక్సో ఈ-బాక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. హోం పేజీపై కనిపించే ఎర్రటి రంగు బటన్‌పై క్లిక్ చేయాలి. దుకాణం, క్రీడా ప్రాంగణం, రహదారి, పాఠశాల ట్యూషన్, బ్లాక్ మెయిల్, స్కూల్ బస్, వ్యాన్, కుటుంబ సభ్యులు, బంధువుల, ఇంటర్నెట్ వంటి చిత్రాలతో కూడిన ఐచ్ఛికాలు కన్పిస్తాయి. ఏ ప్రాంతంలో వేధింపులకు గురయ్యారో ఆ ఐచ్ఛికంపై క్లిక్ చేయాలి. పేరు, ఈ-మెయిల్, ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఘటన వివరాలు దిల్లీలోని ప్రత్యేక విభాగానికి వెళ్తాయి. వారు పరిశీలించి రాష్ట్ర, జిల్లాస్థాయిలో స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులను అప్రమత్తం చేస్తారు.

–న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

విభిన్న విజేతలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : 'మాట' రాదని మదన పడలేదు.. 'అడుగు' పెట్టలేమని ఆవేదన చెందలేదు.. 'చూపు' లేదని ఇంట్లో ఉండలేదు.. వినలేమని కుంగిపోలేదు.. పుట్టుకతో కొందరు.. ప్రమాదవశాత్తు మరికొందరు దివ్యాంగులుగా మారారు. ఆత్మవిశ్వాసంతో అటు చదువుల్లో ఇటు క్రీడల్లో రాణిస్తున్నారు. తామెవరికీ తీసిపోమని మాకెవరూ సరిలేరని నిరూపిస్తున్నారు పలువురు విభిన్న ప్రతిభావంతులు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి.. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

గౌతమ్.. గెలుపులో అందనంత ఎత్తున

నంద్యాల జిల్లా రుద్రవరం మండల కేంద్రానికి చెందిన గౌతమ్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీకాం కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇతను పుట్టుకతోనే మరుగుజ్జు. ఈ లోపాన్ని చూసి ఇతరులు హేళన చేయడం ఇతనిలో కసి పెంచింది. ఇతని లాగే సమస్యను ఎదుర్కొంటున్న అన్న సాయి ప్రోత్సాహంలో గౌతమ్ క్రీడల బాట పట్టారు. బ్యాడ్మింటన్, షాట్‌పుట్ క్రీడల్లో శిక్షణ తీసుకుని విభిన్న ప్రతిభావంతుల పోటీల్లో పలు పతకాలు సాధించారు. 2023 ఫిబ్రవరి 1వ తేదీన ఉత్తర్ ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో కాంస్య పతకం అందుకున్నారు. 2025 ఫిబ్రవరిలో చెన్నైలో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో షాట్‌పుట్‌లో కాంస్యం అందుకున్నారు. ఈనెల 11వ తేదీన మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ అథ్లెటిక్స్ మీట్‌లో షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించారు. అథ్లెటిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్నారు గౌతమ్.

శ్రీనివాసులు.. పాదం మోపితే పతకమే

గడివేముల మండలం చిందుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆర్‌యూలో పీజీ చదువుతున్నారు. 2014లో ఇతనికి పాము కాటు వేయడంతో వైద్యులు కుడికాలి పాదం తొలగించారు. కుమారుడి పరిస్థితిని చూసి తల్లిదండ్రులు కుమిలిపోయేవారు. శ్రీనివాసులు మాత్రం ఏమాత్రం నిరాశకు గురవకుండా.. కృత్రిమ పాదం సాయంతో మైదానంలో అడుగుపెట్టారు. దివ్యాంగుల క్రీడల్లో విజయాలు సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ ఏడాది జనవరిలో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో స్వర్ణ పతకాలు అందుకున్నారు. అక్టోబరులో ఏలూరులో జరిగిన పారా ఆక్వాటిక్ పోటీల్లో 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం సాధించారు. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించారు.

అంధరికీ ఆదర్శం మల్లికార్జున

మద్దికెరకు చెందిన మల్లికార్జున కర్నూలు పార్కు రోడ్డులోని యూనియన్ బ్యాంకు క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పుట్టుకతో అంధుడైన ఇతను పట్టుదలతో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించారు. కుమారుడి ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు దగ్గరుండి మైదానానికి తీసుకెళ్లి.. అంధుల క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. వారి ప్రోత్సాహంతో క్రికెట్‌తో పాటు షాట్‌పుట్‌లోనూ రాణిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్‌లో కాంస్యం సాధించారు. ఈనెల 26వ తేదీన కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్‌లో స్వర్ణం గెలుపొందారు. జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడమే లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు మల్లికార్జున చెబుతున్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: యూపీపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షల శిక్షణకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసూన తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోగా కర్నూలు బీసీ స్టడీ సర్కిల్‌లో పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి కల్పిస్తారని వెల్లడించారు.

68 చెరువులు.. రూ.85 లక్షలు

ఉమ్మడి జిల్లాలోని 68 చెరువుల ప్రాజెక్టుకు రూ.85.24 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 సెప్టెంబరు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు 77 చెరువుల నిర్వహణకు ఈ నిధులు వెచ్చించనున్నారు. చెరువులకు నీటి నింపేందుకు అవసరమైన నిర్వహణ, ఇతర ఖర్చులకు రూ.1.70 కోట్లు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కొన్ని మార్పులతో మరోసారి రూ.1.30 కోట్లకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం రూ.85.24 లక్షలు విడుదల చేసింది. ఈ నిధులు ఏడు నెలల సిబ్బంది వేతనాలకు సరిపోతాయని, లూబ్రికెంట్ ఆయిల్, నియంత్రికలు, ఇతర నిర్వహణ ఖర్చులు, వాహన సదుపాయానికి నిధులు విడుదల చేయలేదని ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు.

– న్యూస్‌టుడే ,కర్నూలు జలమండలి

అదనపు గదుల్లో.. నత్త పోటీలు

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యాలయాల్లో(కేజీబీవీ) అదనపు గదుల నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థునుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. రెండేళ్ల నుంచి ఇంటర్మీడియట్ విద్యనూ బోధిస్తున్నారు. ఈక్రమంలో అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సమగ్రశిక్షా పర్యవేక్షణలో పీఎఫ్‌ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానంలో నిధులు ఖర్చు చేస్తున్నారు. పేరుకు ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు కనిపిస్తున్నా.. చేసేది మాత్రం స్థానిక నాయకుల అనుచరులే. నిధులు వచ్చినప్పుడే కొంత పనులు చేస్తూ.. మిగితా సమయంలో చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో పూర్తి కావాల్సిన పనులు వచ్చే ఏడాది నాటికీ పూర్తయ్యేట్లు కనిపించడం లేదు.

కస్తూర్బా	కర్నూలు	నంద్యాల
విద్యాలయాలు	17	22
నిధులు(రూ.కోట్లు)	4.46	6.32
ఖర్చు(రూ.కోట్లు)	2	1.5

రూ.10.78 కోట్ల కేటాయింపు

● స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, గుత్తేదారులు పనులు చేయకూడదు. కేవలం ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలోనే చేయాలి. ప్రిన్సిపాళ్లు మహిళలు కావడం, సివిల్ పనులపై అవగాహన లేకపోవడంతో స్థానికంగా ఉన్న నాయకులు తలదూర్చారు.

● ఇంజినీర్లను మధ్యవర్తులుగా ఉంచి ప్రిన్సిపాళ్లతో సంతకాలు చేయించి.. మిగితా పనులన్నింటినీ వారే చేస్తున్నారు. నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, డోన్, పాణ్యం, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు తదితర నియోజకవర్గాల్లో పనులన్నీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. కనీసం 60 శాతం కూడా పూర్తి కాలేదు.

మహానంది మండలం తిమ్మాపురంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో 250 మంది చదువుకొంటున్నారు. ఇక్కడ ఆరు అదనపు గదుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. గత కొన్నినెలలుగా పనులు జరగడం లేదు. ప్రయోగశాలలకు గదుల్లేక విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ

- మహానంది మండలం తిమ్మాపురంలో కొన్ని నెలలుగా పనులు జరగడం లేదు. నంద్యాల పట్టణంలోని మైనార్టీ కేజీబీవీలో ఒక నెల పని జరిగితే మరికొన్ని నెలల పాటు కదలడం లేదు. గడివేములలో ఫ్లోరింగ్ పనులు ఆగుతూ సాగుతున్నాయి. రుద్రవరం, మిడుతూరు, ఓర్వకల్లు, గూడూరు, మంత్రాలయం, పత్తికొండ ప్రాంతాల్లో పైకప్పు స్థాయిలో నిలిచిపోయాయి.
- ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పుడు డ్రా చేసుకొని ఆ మేర పనులు చేసి తర్వాత వదిలేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నాటికే పూర్తి కావాల్సినా పట్టించుకోవడం లేదు.
- నిర్మాణాల తీరుపై ఏఈలు సమగ్ర శిక్షా అధికారులతో సమన్వయం చేసుకోలేకపోతున్నారు. ప్రిన్సిపాళ్లే ముందుగా ఖర్చులు భరించి, తర్వాత ఎం.బుక్కులో నమోదు చేయాలంటూ ఇంజినీర్లు ఒత్తిడి చేస్తున్నారు.
- నాయకుల ప్రమేయం పరోక్షంగా ఉండటంతో పనుల వేగంపై ఒత్తిడి చేయలేకపోతున్నారు.

(c) eenadu

దారి చూపుతే గెలుపు దరిచేరుతాం

ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు కర్నూలు నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో రెండు రోజులుగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగులకు పరుగు, షాట్‌పుట్, జావెలిన్ త్రో ఇతర పోటీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, పోటీలను చూసేందుకు వచ్చిన ప్రజలు వారిని చప్పట్లతో ప్రోత్సహించారు. దీంతో దివ్యాంగులు ఉత్సాహంగా ఆటలు ఆడి విజేతలుగా నిలిచారు. – ఈనాడు, కర్నూలు

దివ్యమైన పరుగులు

ఎన్‌సీసీ విద్యార్థుల సాయంతో పరుగు తీస్తున్న అంధ మహిళలు

పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్

దస్త్రాలు పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్, పరిపాలనాధికారిణి ప్రతిమ

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదోన్నతి పొందిన 54 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు కలెక్టరేట్ డీపీవో కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యదర్శులు ఎంపిక చేసుకున్న గ్రామ పంచాయతీల్లో ఖాళీలను పరిగణనలోకి తీసుకుని డీపీవో భాస్కర్, పరిపాలనాధికారిణి ప్రతిమ కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు డీపీవో తెలిపారు. కాగా పదోన్నతి పొందిన కార్యదర్శుల్లో 36 మందికి పైగా తమకు అనుకూలమైన పంచాయతీల కోసం నేతల నుంచి సిఫార్సు లేఖలు తీసుకువచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగుల పదోన్నతులపై డీపీసీ

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలోని వివిధ కేటగిరీల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) అధికారుల బృందం గురువారం కర్నూలులోని సర్కిల్ కార్యాలయంలో రాయలసీమ జిల్లాల్లో పదోన్నతి పొందే ఉద్యోగుల ప్రతిపాదనలు పరిశీలించింది. ఏఈఈ, డీఈ, సీనియర్ సహాయకులు, పర్యవేక్షకులు, తదితర పోస్టులకు సంబంధించి పదోన్నతులు లభించనున్నాయి. డీపీసీలో కర్నూలు ఎస్‌ఈ మనోహర్, కడప ఎస్‌ఈ ఏసుకొండలు, అనంతపురం ఎస్‌ఈ సురేష్ ఉన్నారు.

DIRECTORATE OF SECONDARY HEALTH, A.P.
AREA HOSPITAL, YEMMIGANUR, KURNOOL-Dist, AP.
Rc.No.60/Canteen/E2/AH/YGR/2025 Dt: 21-11-2025

కర్నూలు జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త మరియు ఈ ఏరియా ఆసుపత్రి ఎమ్మిగనూరు మండల ఆసుపత్రి అభివృద్ధి సంఘం ఛైర్మన్ సూచనల మేరకు మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, ఎమ్మిగనూరు ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానించబడ్డాయి. దరఖాస్తుకు చివరి తేది: 29.11.2025 సాయంత్రం 04.00.
టెండర్ ప్రారంభ తేది: 01.12.2025 సాయంత్రం 04.00.
సం/- మెడికల్ సూపరింటెండెంట్ ఏరియా హాస్పిటల్
ఎమ్మిగనూరు-518360. కర్నూలు - జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయము, గుత్తి రోడ్డు బి.క్యాంపు PO., కర్నూలు-518002
స్టేజ్-2 కాంట్రాక్టరు నియామకం కొరకు రీ-టెండరు ప్రకటన (5th call)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, కర్నూలు మండల స్థాయి గోదాము నుండి, ప్రజా పంపిణీ వ్యవస్థ మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల క్రింద కేటాయింపబడిన నిత్యావసర సరుకులను, ఎంఎల్ఎస్ పాయింటు కర్నూలు పరిధిలోని మండలాలలో గల చౌక ధరల దుకాణాలకు, పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాలకు లేదా ప్రభుత్వము సూచించిన ఏదైనా సంస్థలకు, 2025-27 సంవత్సరాలకు గాను రవాణా చేయుటకు, టెండర్లు కోరబడుచున్నవి. ఈ కాంట్రాక్టు, నియామకపు తేదీ నుండి 31.03.2027 వరకూ ఉండును. టెండరు షెడ్యూల్ మరియు ఇతర వివరాలు **www.tender.apeprocurement.gov.in** వెబ్‌సైట్ నుండి పొందవచ్చును. ఆన్‌లైన్ టెండర్‌లను సమర్పించడానికి మరియు ఫార్మాలిటీలను పూర్తి చేయడానికి చివరి తేది: 10.12.2025 సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుంది.

NOORUL QUAMER, I.A.S., జాయింట్ కలెక్టర్ & EOED
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, కర్నూలు జిల్లా.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్ : శ్రీరామ్ ఫైనాన్స్ లి., డి.నెం. 15/387-2, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ రోడ్డు, ఆదోని, కర్నూలు జిల్లా - 5180301.

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

Ref : Loan Account No. ADONITF1607290018

[illegible] Cr.M.P.No. 257/2024 [illegible] రూ. 34,19,325/- [illegible]

స్థిరాస్తి వివరములు: ADONITF1607290018కి చెందిన ఆస్తి వివరాలు : [illegible]

ప్రదేశం : ఆదోని
తేది : 24-11-2025
అధీకృత అధికారి, మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

ఉపాధ్యాయుల ఆటలు

కృష్ణగిరి మండలంలో ఉపాధ్యాయులు క్రీడాకారులుగా మారారు. కంబాలపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి ఆటలపోటీలు నిర్వహించారు. 60 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్, త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. – కృష్ణగిరి, న్యూస్‌టుడే

కబడ్డీ కూత.. గోల్స్ మోత

☛ జాతీయ స్థాయి పోటీలకు ఆదోని క్రీడాకారులు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఒకరు కబడ్డీ కూతపెడితే ప్రత్యర్థి క్రీడాకారులు నిలవడం కష్టం.. మరొకరు ఫుట్‌బాల్ బంతితో మైదానంలో దిగాడంటే గోల్ తన ఖాతాలో జమకావాల్సిందే. ఆదోనికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఆయా క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతున్నారు. వారి ప్రత్యేకత ఏంటో తెలుసుకుందాం.

ప్రత్యర్థి జట్టు షేక్

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన రైతు పీర్‌బాషా, హుసేన్‌బీ దంపతుల కుమారుడు షేక్షావలి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి క్రీడలపై ఉన్న ఆసక్తిని గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు, రమేష్ విద్యార్థి షేక్షావలి ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇస్తూ.. సాధన చేయిస్తున్నారు. ఫుట్‌బాల్ మైదానంలో డిఫెండర్‌గా బరిలో దిగితే ప్రత్యర్థులు గోల్ చేయకుండా.. గోల్ వైపు వెళ్లకుండా అడ్డుగోడలా నిలుస్తూ తమ జట్టు విజయానికి కృషి చేస్తున్నాడు. కర్నూలు నగరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ చాటాడు. నవంబరు 19 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు జిల్లా మదనపల్లెలోని గ్రీన్ వ్యాలీలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీల్లో తన ప్రత్యేకతను చాటాడు. డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననున్నాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉందని చెబుతున్నాడు షేక్షావలి.

విజయం.. దేవాధీనం

ఆదోని పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ సిద్ధలింగప్ప, భాగ్యమ్మ దంపతుల కుమారుడు చరణ్‌దేవ్ స్థానిక ఆర్ట్ లేబర్ కాలనీ నగర పాలక ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కబడ్డీ ఆటపై ఆసక్తితో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. రెండేళ్లుగా కబడ్డీలో డిఫెండర్‌గా, రైడర్‌గా సాధన చేస్తూ ప్రతిభ చూపుతున్నాడు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చాటాడు. ఈ పోటీలో ప్రతిభ కనబరచడంతో కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. డిసెంబరులో పంజాబ్ రాష్ట్రం చండీఘడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాడు. జాతీయ స్థాయిలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నానంటున్నాడు క్రీడాకారుడు చరణ్‌దేవ్.

స్పందన మరింత ఉత్సాహాన్నిచ్చింది

◆ నగరంలో రాజు వెడ్స్ రాంబాయి చిత్ర బృందం సందడి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నగరంలోని ఆనంద్ థియేటర్‌లో 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్ర బృందం సందడి చేసింది. హీరోయిన్ తేజస్వీని, పాత్రదారులు చైతు జొన్నగడ్డ, నిర్మాత రాహుల్ ప్రేక్షకులతో ముచ్చటించారు. హీరోయిన్ తేజస్వీని మాట్లాడుతూ.. తన తొలి చిత్రాన్ని ఊహించిన దానికంటే అధికంగా ఆదరించారన్నారు. మహిళా అభిమానులతో కలిసి స్వీయచిత్రాలు తీసుకున్నారు.

చిత్ర బృందంతో స్వీయ చిత్రం దిగుతున్న మహిళా అభిమానులు

గని గుంత.. కళ్లకు గంతలు

- ▸▸ చోద్యం చూస్తున్న అధికారులు
- ▸▸ తవ్వేసి వదిలేస్తున్న యజమానులు
- ▸▸ నిబంధనలు బేఖాతరు

జిల్లాలో నాపరాతి గని గుంతలు ప్రమాదకరంగా మారాయి. గని గుంతలు ఎంతో మంది ప్రాణాలు బలిగొంటున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. నాపరాతి గనులు లీజులు పూర్తయిన తర్వాత పూడ్చాల్సిన యజమానులు విస్మరించడంతో గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. గనులు, భూగర్భ శాఖ అధికారులు పట్టించుకోక గాలి కొదిలేశారు. – న్యూస్‌టుడే,బనగానపల్లి

పలుకూరు సమీపంలో చెరువును తలపిస్తున్న నాపరాతి గని

చెరువుల్లా మారిపోయి

● ఉమ్మడి జిల్లాలో 1,150 హెక్టార్లలో నాపరాతి గనులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, డోన్, నందికొట్కూరు ప్రాంతాల్లో నాపరాతి గనులు ఉన్నాయి. సుమారు 500 మందికి పైగా గనుల లీజులు పొందిన యజమానులు ఉన్నారు. సుమారు వందకు పైగా గని గుంతలు ఉన్నట్లు అంచనా. ఏడాది పొడవునా నీరు నిల్వ ఉంటుంది.

● యజమానులు విచ్చలవిడిగా తవ్వకాలు సాగించి వదిలి వేయడం కొందరి పాలిట శాపంగా మారింది. ఒక్కో గని గుంత 50 నుంచి 70 అడుగుల లోతు ఉంటుంది. వాటి నిండా వర్షం నీరు చేరి చెరువుల్లా మారిపోయి ఉంటాయి. సమీపంలోని ప్రజలు, రైతులు నీటి కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

"గని గుంతల్లో ఎవరైనా పడి చనిపోతే ఆ బాధ్యత యజమానులే తీసుకోవాలని, గుంతలను గుర్తించి ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తామని" గనుల శాఖ ఏడీ రాజగోపాల్ తెలిపారు.

పోతున్న ప్రాణాలు

గుంతల్లో పడి యువత, పనిచేసే కూలీల దగ్గరి నుంచి రైతులు, గ్రామాల సమీపంలో పనిచేసే కూలి మహిళలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కొందరు ఆవేశానికి గురై గని గుంతల్లో పడి ఆత్మహత్య చేసుకోవడం, ఈతకు వెళ్లిన యువత చనిపోవడం కనిపిస్తోంది. మరో వైపు నాపరాతి గనుల సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు అంటురోగాలు, దోమల బారిన పడుతున్నారు.

కొన్ని ప్రమాదాలు పరిశీలిస్తే..

● కొలిమిగుండ్ల మండలం బెలుం సమీపంలోని గతేడాది నాపరాతి గని గుంతలో పడి మహేంద్రరెడ్డి(22) అనే విద్యార్థి చనిపోయాడు.

● బందర్లపల్లె సమీపంలో స్నేహితులతో కలిసి గని గుంతలో ఈతకు వెళ్లి ఇటీవల ప్రవీణ్ (14) అనే విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు.

● నాలుగేళ్ల కిందట పలుకూరు సమీపంలో గణేశ్ నిమజ్జనం చేసే క్రమంలో ఇద్దరు యువకులు గని గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు.

నిబంధనలకు నీళ్లు

● గనుల లీజులు పొందే ముందు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంది. ఆ మేరకు అగ్రిమెంటులో సంతకం చేస్తారు. నాపరాతిని తవ్విన తర్వాత వ్యర్థాలతో గుంతను పూడ్చి వేయాలి. ● గని గుంతల్లో నీరు చేరకుండా చూడాలి. ఒక వేళ నీరు చేరితే మోటార్ల ద్వారా బయటకు పంపి పూడ్చి వేయాలి. ● అవసరాన్ని బట్టి చుట్టూ కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. తిరిగి లీజులు పునరుద్ధరించాలంటే గతంలో చేసిన గనిని అధికారులు పరిశీలించి గుంతను పూడ్చితేనే తిరిగి లీజులు ఇవ్వాలి.

● స్థానికులను ఇబ్బంది పెట్టేలా పేలుడు పదార్థాలు వాడకూడదు. ● గుంతల వద్ద విద్యుత్తు తీగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

భయపెట్టిన దొంగలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. విత్తన వ్యాపారం చేసే వెల్దుర్తికి చెందిన రఘురాం రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి కర్నూలుకు వచ్చారు. ఓ జ్యూవెలరీ దుకాణంలో దాదాపు 9 తులాల బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. తర్వాత గాయత్రీఎస్టేట్‌లో ఓ వైద్యుడి వద్దకు వెళ్లి. . అనంతరం ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌కు వెళ్లి కారులోనే బంగారు ఆభరణాల బ్యాగును ఉంచి లోపలికి వెళ్లి టిఫిన్ చేశారు. తిరిగి వెల్దుర్తికి వెళ్లి ఇంట్లో బ్యాగు చూసుకోగా లోపల బంగారు ఆభరణాల మాయమయ్యాయి. టిఫిన్ సెంటర్ వద్దే ఆభరణాలు అపహరణకు గురైనట్లు భావించిన బాధితుడు కర్నూలు రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జ్యూవెలరీ దుకాణం వద్ద నుంచే దొంగలు వీరిని అనుసరించి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు హోటల్ వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఇద్దరు దొంగలు కలిసి నేరానికి పాల్పడినట్లు తెలిసింది. వారిని పట్టుకునే పనిలో పడ్డారు.

రైతు ఇంట్లో

మంత్రాలయం, న్యూస్‌టుడే: తాళం వేసిన రైతు ఇంట్లో చోరీ చేసి వెండి పట్టీలు దొంగిలించిన ఘటన మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ రామాంజినేయులు ఇంటికి తాళం వేసి భార్య లక్ష్మీతో కలిసి ఉదయం పత్తి తీయడానికి పొలం వెళ్లారు. ఆయన కుమార్తె పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం పాఠశాల వదిలాక ఇంటికొచ్చిన విద్యార్థిని తాళం పగలగొట్టబడి ఉండటంతో ఆందోళనకు గురైంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాలోని వస్తువులు చెల్లాచెదరుగా పడి ఉండటాన్ని గమనించి, తల్లికి ఫోన్ చేసి చెప్పింది. వారు వచ్చి చూడగా బీరువాలో పట్టీలు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. శుక్రవారం జిల్లా నుంచి వేలిముద్రల నిపుణులు వచ్చి విచారిస్తారని పోలీసులు తెలిపారు.

ఆదోనిలో పట్టపగలే

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని పద్మశాలి నగర్‌లో పట్టపగలు చోరీ జరిగింది. మూడో పట్టణ ఎస్సై రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న గొల్ల చంద్రశేఖర్ దంపతులు ఈ నెల 24వ తేదీన పనుల కోసం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఆ సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లి, బీరువాలోని సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలు, 31 తులాల వెండి సామగ్రి, రూ.4వేలు ఎత్తుకెళ్లారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ధాన్యం సేకరణలో లోపాలు ఉండకూడదు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాను వల్ల ఈ నెల 29 నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి ధాన్యం సేకరణకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. రైతులకు టార్పాలిన్లు, గోనె సంచులను అందుబాటులో ఉంచడంతో పాటు అవసరం మేరకు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మహేశ్ (పాతచిత్రం)

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి-డోన్ మార్గంలోని 44వ జాతీయ రహదారిలో రైల్వేగేటు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేశ్(31) మృతిచెందారు. మల్లెపల్లికి చెందిన మహేశ్ వెల్దుర్తిలోని వీరన్నగట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న తల్లి కళావతి వద్దకు వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి అనంతపురానికి వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన మహేశ్‌ను చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

పెద్దహరివాణం మండలంలో చేరమంటే చేరం!

◆ వ్యతిరేకిస్తున్న విలీన గ్రామాల ప్రజలు

ఆదోని మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ రామస్వామి, తెదేపా నాయకులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం నుంచి ప్రత్యేకంగా పెద్దహరివాణం మండల కేంద్రంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలోని విలీన గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఆదోని మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో గురువారం ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ రామస్వామి, మాజీ సర్పంచి కారుమంచప్ప, తెదేపా నాయకులు పరశురాం, సుబ్బారెడ్డి, రామకృష్ణ, రాము, గుళెప్ప, షేక్షావలి, గోవిందు, తదితరులు నిరసన వ్యక్తం చేశారు. పెద్దహరివాణం మండల కేంద్రానికి నారాయణపురం, ఢణాపురం, బసాపురం, మదిరె, చాగి, నాగనాథనహళ్లి గ్రామాలు 25 నుంచి 35 కి.మీ. దూరం ఉంటుందని, ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతామన్నారు. ఈ గ్రామాలను పెద్దహరివాణం మండలంలో కలపాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండు చేశారు. ప్రభుత్వానికి అధికారులు వాస్తవ పరిస్థితులు వివరించాలన్నారు. మండల కేంద్రం దూరం పెరగడంతో గ్రామీణులకు ప్రభుత్వ సేవలు ఎలా అందుతాయన్నారు. త్వరలో అన్ని గ్రామాల సర్పంచులతో సమావేశమై తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపుతామన్నారు. ప్రజల అభిప్రాయలకు అనుకూలంగా నిర్ణయం వచ్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

ఆదోని జిల్లా సాధనకు అందరూ కలిసిరావాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధన కోసం డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలిసికట్టుగా ముందుకొచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ అన్నారు. ఆదోని పట్టణంలోని కోట కూడలి వద్ద ఆదోని జిల్లా ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా సాధన రిలే నిరాహారదీక్షల శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. రిలే నిరాహారదీక్షల్లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కూర్చొని మద్దతు తెలిపారు.

బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి విచారించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎ.సిరి, పక్కన జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో కర్నూలు, పాణ్యం, ఆదోని నియోజకవర్గాలు ఓటర్ల మ్యాపింగ్‌లో వెనుకబడి ఉన్నాయని.. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.సిరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గురువారం ఆయా నియోజకవర్గాల బీఎల్వోలకు కలెక్టర్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల గురించి విచారించాలని స్పష్టం చేశారు. నిర్దేశిత ఫారాల్లో ఓటరు వివరాలను సేకరించాలన్నారు. మరణించిన ఓటర్ల వివరాలను సేకరించి.. వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇవ్వాలన్నారు. రాబోయే పది రోజుల్లో అర్బన్ 80 శాతం, రూరల్ 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమంలో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, నియోజకవర్గ ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల ఉప తహసీల్దార్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల మ్యాపింగ్‌లో పురోగతి తేవాలి

కర్నూలు సచివాలయం: ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్ డా.ఎ.సిరి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఓటరు దరఖాస్తులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ వీసీలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, ఉప కలెక్టర్ అనురాధ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆96402 58899, 96404 68899

కోయిలకుంట్లలో RV రెసిడెన్సి ఎ/సి లాడ్జి నందు పనిచేయుటకు సిబ్బంది కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి: ✆ 99899 07171.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ప్రజాభిప్రాయం పరిగణలోకి తీసుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గ్రామ విభజనపై ప్రజా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని ఆదోని మండలం వడాపురం మాజీ సర్పంచి మల్లికార్జున అన్నారు. ఆయన గురువారం మాట్లాడారు. పెద్దహరివాణం మండల కేంద్రంలో ఊకాపురం గ్రామాన్ని కలపడంపై వ్యతిరేకించారు. పెద్దహరివాణం వెళ్లాలంటే 30 కి.మీ. అవుతుందన్నారు. ఆదోని మండలంలోనే కొనసాగించాలన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలని వినతి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సకాలంలో జీతాలు చెల్లించి, తమకు పనికి తగిన వేతనాలివ్వాలని ఆదోని పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగం ఆప్కాస్ కార్మికులు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్ నాసిర్‌హుసేన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, కార్మికుల యూనియన్ నాయకులు ఈరన్న, మోహన్, దేవేంద్ర, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో నష్టం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్ర, సభ్యులు నాగసురేంద్ర యాదవ్ అన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్‌వర్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు బాలకృష్ణనాయక్, సూరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని సంతపేట, ఖాజీపుర ప్రాంతాల్లో కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. – హవ్వాల్దారి శౌకారినాగరాజు, ఆదోని

✔: త్వరలో కుక్కల పట్టివేత పనులు చేపట్టి, సమస్య పరిష్కరిస్తాం. – నాసిర్‌హుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

హొళగుంద, న్యూస్‌టుడే: ?: హొళగుంద ప్రధాన రహదారి మార్గంలోని శ్మశాన వాటికలో చేతిపంపు నిరుపయోగంగా ఉంది. మరమ్మతు చేయించండి. – మహేశ్, హొళగుంద

✔: పరిశీలించి సిబ్బంది పంపి మరమ్మతు చేయిస్తాం. – చక్రవర్తి, డిప్యూటీ ఎంపీడీవో, హొళగుంద

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: ముత్తుకూరు గ్రామ సచివాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మురుగు కాల్వలు లేక రహదారి అధ్వానంగా మారింది. – సతీశ్, రంగన్న, ముత్తుకూరు

✔: సీసీ రహదారి, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధుల మంజూరైన వెంటనే పనులు చేయిస్తాం. – జంప్లానాయక్, పంచాయతీ కార్యదర్శి, ముత్తుకూరు

పెరవలి, (మద్దికెర), న్యూస్‌టుడే: ?: పెరవలి ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ఉన్న పశువుల నీటి తొట్టిలోని నీరు అపరిశుభ్రంగా ఉంది. – రామాంజనేయులు, పెరవలి

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, పెరవలి

మండలాలుగా ఆదోని, పెద్దహరివాణం

☛ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో పెద్ద మండలంగా ఉన్న ఆదోనిని రెండు మండలాలుగా విభజిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆదోని మండల పరిధిలో మొత్తం 46 రెవెన్యూ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఆదోని మండలంలో 29, పెద్దహరివాణం మండలంలో 17 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాల ఏర్పాటు సందర్భంగా ప్రజల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోపు వినతులు స్వీకరించాలని గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

● ఆదోని మండల పరిధిలోని 29 రెవెన్యూ గ్రామాలు కలుపుతూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఆదోని, కల్లుబావి, వెంగళాపురం, పర్వతాపురం, మండిగిరి, ఎస్.కొండాపురం, ఇస్వీ, గోనబావి, ఢణాపురం, నెట్టేకల్లు, ఆరేకల్, బైచిగేరి, సంతకూడ్లూరు, విరుపాపురం, దొడ్డనకేరి, సాంబగల్లు, పెద్దపెండేకల్లు, బసరకోడు, చిన్నపెండేకల్లు, బల్లేకల్లు, మాంత్రికి, దెయ్యాలగూడెం, పాండవగల్లు, కుప్పగల్లు, జాలిమంచి, సుల్తానపురం, పెసలబండ, పెద్దతుంబళం గ్రామాలు ఉన్నాయి.

● పెద్దహరివాణం మండల పరిధిలో 17 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో పెద్దహరివాణం, సంతేకూడ్లూరు, యడవల్లి, బలదూరు, చిన్నగోనెహాలు, చిన్నహరివాణం, మదిరె, కడితోట, హానవాళు, జి.హోసళ్లి, బసాపురం, వి.కొండాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం, చాగి, ఢణాపురం, గణేకల్లు గ్రామాలు ఉన్నాయి.

"ఆదోని పట్టణ శివారు ప్రాంతాల్లో కారుచీకట్లు కమ్ముకున్నాయి. పట్టణంలో 42 వార్డులు. పదివేల వీధి దీపాలున్నాయి. డివిజన్ కేంద్రం కావడం, 167వ జాతీయ రహదారి వెళ్లింది. ఇక్కడి నుంచి హైదరాబాద్, బళ్లారి, హుబ్బళ్లి, గోవా, షోలాపూర్, పుణె, ముంబయి, రాయచూర్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, వంటి ప్రాంతాలకు వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి, సుందరీకరణతో వీధి దీపాలు ఉన్నా రాత్రిళ్లు యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో చీకట్లోనే రాకపోకలు సాగించడంతో పలు రహదారి [illegible] కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రత్యేక శ్రేణి ఉన్న పురపాలికను గుర్తించుకుంటే.. కనీసం ఆ స్థాయిలో సుందరీకరణ పనులుండాలనే డిమాండ్ వినిపిస్తోంది."

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

శివారులో చీకట్లు.. ప్రజలకు ఇక్కట్లు

విస్తరణ జరిగినా.. అంతే

ఆదోని పట్టణం రోజు రోజుకు విస్తరిస్తోంది. వ్యాపార వరంగా రెండో ముంబయిగా పేరుంది. ప్రధాన రహదారుల విస్తరణ జరిగినా.. నేటికీ వీధి దీపాలకు నోచుకోవడం లేదు.

● తిమ్మారెడ్డి బస్టాండు నుంచి మహాయోగి లక్ష్మమ్మ ముఖద్వారం వరకు రహదారి విస్తరించి.. కొత్తగా బీటీ దారి వేశారు. మధ్యలో రహదారి విభాగినులు వేసి దీపాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది.

● కంట్రోల్ రూం నుంచి తిక్కస్వామి దర్గా, ఆర్ట్స్ కళాశాల పట్టణ ముఖద్వారం వరకు డివైడర్ల ఎత్తు పెంచి మధ్యలో బటర్ ఫ్లై దీపాలు అమర్చలేదు. డివైడర్లు ఎత్తుగా ఉండటం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

● పోలీసు కంట్రోల్ రూం నుంచి కొత్త బస్టాండు వరకు ఆక్రమణలు తొలగించి, నెలలు గడుస్తున్నా.. విస్తరణ, డివైడర్ల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు లాంటి పనులు ముందుకు సాగడం లేదు. దీంతో మళ్లీ ఆక్రమణల పర్వం మొదలైంది.

● మేదరవీధి ఆకాశవంతెన అవతలి భాగం నుంచి రాయచూర్ వైపు వెళ్లే రహదారిలో ఆక్రమణలు తొలగించారు. కొత్తగా రహదారి వేసి మధ్యలో దీపాలు ఏర్పాటు చేయలేదు.



మేదరవీధి ఆకాశవంతెన నుంచి రాయచూర్ వైపు రహదారిలో కనిపించని వీధి దీపాలు

పల్లెనా.. పట్టణమా?

చిన్న చిన్న పట్టణాలు సైతం శివారు ప్రాంతాలను సుందరీకరించి, డిజిటల్ అక్షరాల పేరు, ఫౌంటెన్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఆదాయమున్న ఆదోని పురపాలికలో మాత్రం కనీస ఆలోచన చేయడం లేదు. ఈ ప్రాంతం మీదుగా వెళ్లే జనం ఇది పట్టణమా.. పల్లెటూరా? అని సందేహించడం గమనార్హం. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి వీటిపై దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రూ.10 లక్షలతో టెండర్లు పూర్తయినా..

పట్టణంలో రెండు చోట్ల వీధి దీపాలు అమర్చేందుకు రూ.10 లక్షలతో ఈ ఏడాది ఆగస్టులో టెండర్లు పూర్తయ్యాయి. ఇంతవరకు గుత్తేదారు పనులు ఆరంభించలేదు. శిరుగుప్ప కూడలిలో ఐ-మార్క్ దీపాలు ఏర్పాటుకు రూ.5 లక్షలు, రైల్వేస్టేషన్ రహదారిలో ఎంపీడీవో కార్యాలయం నుంచి పాత ఆకాశవంతెన కింది భాగం వరకు మధ్యలో బటర్ ఫ్లై దీపాలు ఏర్పాటుకు రూ.5 లక్షల టెండర్లు పూర్తయ్యాయి. ఈ ప్రాంతాల్లో రాత్రిళ్లు రైలు దిగి ఇళ్లకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. శివారులోని బసవేశ్వర కూడలిలో ఐ-మార్క్ దీపాలు వెలగక నెలలు గడుస్తున్నాయి. పంచాయతీ పరిధిలో ఉండటం వల్ల నిధులు లేక దీపాలు వెలిగించే వారే లేరు. ఈ ప్రాంతంలో బైపాస్ రహదారి ఉండటం వల్ల రాత్రిళ్లు బస్సులు దిగి, తిరుమల నగర్, సీతారామనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, తదితర ప్రాంతాలకు వెళ్లే వారు చీకటి కారణంగా ఇతరుల సాయంతో ఇళ్లకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కుష్ఠు నివారణపై కేంద్ర బృందం సర్వే

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో కుష్ఠు వ్యాధి నివారణపై నిర్వహిస్తున్న సర్వే

ఇందిరానగర్ వాసులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

తీరును కేంద్ర వైద్య బృందం సభ్యులు గురువారం సాయంత్రం పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు భాస్కర్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టరు వి.శాంతారాం, డ్టారు రితీ తివారీ, డాక్టరు మాన్సి, రాష్ట్ర స్థాయి అధికారి డాక్టరు దేవసాగర్ తదితరులు సర్వే తీరును పరిశీలించారు. సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నిపుణులు సత్యవతి, వైద్యాధికారి డాక్టరు మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు సత్యవతి, డీపీఎంవో సీతారాముడు, సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజరు మేరి అరుణ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. అగమ్యగోచరం

రాంపురం కొట్టాల గ్రామానికి వెళ్లే రహదారిలో రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణానికి పైపులు వేసి వదిలేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అసంపూర్తి పనులతో గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పీఆర్ అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

విద్యార్థులే ఊడ్చేస్తారు

కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామంలో విద్యార్థులే స్వీపర్లుగా మారారని, పాఠశాల పరిసరాలు శుభ్రం చేయిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు పనులు చేస్తున్న వీడియోలు గురువారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు ఇలా పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. – న్యూస్‌టుడే, పోతుగల్లు (కృష్ణగిరి)

మట్టి తెచ్చారు.. మైదానంలో పోశారు

ఆదోని పట్టణ ప్రజలు, పిల్లలు ఆడుకునేందుకు ఉన్నది మున్సిపల్ మైదానం ఒక్కటే. మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి తవ్విన మట్టిని తెచ్చి మైదానంలో నిల్వ చేస్తున్నారు. దీంతో ఆటలు ఆడేందుకు వచ్చిన పురవాసులకు, క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పురపాలక అధికారులు స్పందించి మైదానంలో నిల్వ చేసిన మట్టిని తొలగించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

నిర్వహణ గాలికొదిలేశారు

నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే కార్యాలయాలు. చుట్టూ ముళ్లచెట్లు, రాళ్లురప్పలతో అధ్వానంగా పరిసరాలు. పత్తికొండ మండలం చందోలి గ్రామంలోని సచివాలయం దుస్థితి ఇది. గత వైకాపా హయాంలో సుమారు రూ.30లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయ భవన నిర్వహణ గాలికొదిలేశారు. సచివాలయ భవనం పక్కనే రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. పనులపై వచ్చే ప్రజలు, రోగులు, రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు దృష్టిసారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

సాయిబాబానగర్(ఆదోని పురపాలకం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని 20వ వార్డు సాయిబాబానగర్ సచివాలయాన్ని పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్ నాసిర్‌హుసేన్ గురువారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుతో పాటు దస్త్రాలను పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని, క్రమశిక్షణతో ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

సంక్షిప్త సమాచారం

ఆస్పరి, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆస్పరి సీఐ గంగాధర్ అన్నారు. గురువారం రాత్రి అంబేడ్కర్ కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంటులో ప్రస్తావించాలని ఏపీ వీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారెల్ల అంజి ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు యోగేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పత్తికొండలో కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను వీబీఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మహేంద్రనాయుడు, ఏవీనాయుడు, తాయన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు యోగేశ్ పిలుపునిచ్చారు. పత్తికొండ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన శ్రీజన్ అభియాన్ సంఘటన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గ బాధ్యుడు క్రాంతి నాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పాండు రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా.. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల వద్దకు వెళ్లి ఉపాధ్యాయులను సభ్యులుగా చేర్చే కార్యక్రమం చేపట్టారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వన్నూరప్ప, సంజన్న, వెంకటేశ్వర్లు, లోక్‌నాథ్, విజయభాస్కర్‌రెడ్డి, హుసేన్ పీరా, వెంకటరాముడు, గణేశ్, రంగా, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. మూడో రోజు వేడుకల్లో భాగంగా వేలాది మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికతను పంచే నాటక ప్రదర్శనలు, సంగీత విభావరి కార్యక్రమాలతో పాటు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయి చదరంగం, ఖోఖో, పరుగు పందెం, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారంతో ఈ వేడుకలకు ముగింపు పలుకుతామని నిర్వాహకులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా వేడుకలను కనులపండువగా నిర్వహించారు.

ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

రైతులకు రూ.24 కోట్ల పంట రుణాలు

చిప్పగిరి, న్యూస్‌టుడే: రైతులకు రూ.24 కోట్ల పంట రుణాలు అందించామని బెల్డోణ సహకార సంఘం ఛైర్మన్ కొండా రామాంజనేయులు తెలిపారు. చిప్పగిరిలోని సొసైటీ కొత్త ఛైర్మన్‌గా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్లుగా నంచర్ల కృష్ణవేణి, బంటనహల్ దస్తగిరిస్వామి ప్రమాణ స్వీకరణ చేశారు. కార్యక్రమంలో సీఈవో హరికృష్ణ, తెదేపా నాయకులు వైకుంఠం వెంకటేశ్వర్లు, కొండా పురుషోత్తం, పోతరాజు రాముడు, నంచర్ల తిమ్మప్ప, రవితేజ, జనర్ధాన్‌స్వామి, వీరాంజనేయులు, పుల్లయ్య, చిప్పగిరి సర్పంచి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన తెదేపా నాయకులు

విద్యార్థుల మాట.. విజయాల బాట

ఈనాడు-ఈటీవీ ప్రతిభా పాటవ పోటీలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పాఠశాల కరస్పాండెంట్ రమేశ్‌బాబు అన్నారు. ఆదోని పట్టణంలోని మిల్టన్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని తమ ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు. కె.సౌమ్య, కె.ఉమాలక్ష్మి, ఈ.అనుష విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో వెంకటేశు, ప్రిన్సిపల్ నాగరాజు, ఉపాధ్యాయులు జయసింహా, సుశీలా, లావణ్య, యాస్మిన్‌భాను, ఉమర్‌వలి, మహరున్నిసా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల నిర్వాహకులు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వివిధ పోటీల్లో పాల్గొనటం మంచి అలవాటని పత్తికొండ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిణి అన్నారు. ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో 'విద్యార్థులపై సెల్‌ఫోన్ల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ప్రతిభా ఉపన్యాస పోటీల్లో విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన అఖిల, సలోమి, కీర్తనకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె.నారాయణ, ఉపాధ్యాయినులు యం.లక్ష్మి, సి.జోత్స్న పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ హరిణి, తదితరులు

ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎల్వీ ప్రసాద్

కృష్ణగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా కృష్ణగిరి మండలం మాదాపురం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు, న్యాయవాది ఎల్వీ ప్రసాద్ గురువారం అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి సవిత, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బషీర్, నాగార్జున, మోహన్, సజ్జద్, జయన్న, పరమేశ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న న్యాయవాది ఎల్వీప్రసాద్

పోలీసుల అదుపులో దొంగలు

నార్లాపురం(వెల్దుర్తి), న్యూస్‌టుడే: గోకులపాడు రహదారిలోని హంద్రీ కాల్వ వద్ద ఏర్పాటు చేసుకున్న మోటార్లను అపహరిస్తున్న దుండగులను నార్లాపురం, మల్లెపల్లి, గోకులపాడుకు చెందిన రైతులు పట్టుకున్నారు. సకాలంలో వర్షాలు రాకపోవడంతో హంద్రీనీవా కాల్వ నీటిని నమ్ముకుని నార్లాపురం, మల్లెపల్లి, గోకులపాడు రైతులు సుమారు 300 ఎకరాల్లో మొక్కజొన్న, కొర్ర, వేరుసెనగ పంటలు సాగుచేశారు. పంటలకు నీరు అవసరమైన సమయంలో గోకులపాడు రహదారిలోని కాల్వ వద్ద డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకొని పైపులైను ద్వారా నీరు తరలించి పంటలు సాగుచేస్తున్నారు. కాల్వ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. నార్లాపురం గ్రామానికి చెందిన జయరామనాయుడు, చాంద్‌బాషా, రామాంజనేయులు, చంద్రశేఖర్, రామయ్యతోపాటు పలువురి రైతులకు సంబంధించిన సుమారు 12 ఇంజిన్లు అపహరణకు గురయ్యాయి. దీంతో రైతులు నిఘా ఉంచారు. గురువారం మధ్యాహ్న సమయంలో గోకులపాడు రహదారిలోని కాల్వ వద్ద ఆటో నిలిపి, ముగ్గురు వ్యక్తులు రైతులకు చెందిన డీజిల్ ఇంజిన్ తీగలు కత్తిరిస్తుండగా రైతులు గుర్తించారు. రైతులు రావడాన్ని పసిగట్టి ఇద్దరు పరారయ్యారు. ఓ వ్యక్తిని పట్టుకొని, వారు తెచ్చుకున్న ఆటోను వెల్దుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. రైతుల ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఆముదం దిగుబడిని చోరీ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ సమీపంలోని పొలంలో ఉంచిన ఆముదం దిగుబడిని ఎత్తుకెళ్లారని బాధిత రైతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు మూడెకరాల్లో వేసిన ఆముదం పంట కోత కోసి పొలంలోని బండపై ఉంచామని, ఈలోపే సుమారు పది బస్తాలు చోరీకి గురయ్యాయన్నారు. అనుమానితులను విచారించి న్యాయం చేయాలనికోరారు.

చిన్నారుల గీతలు.. విజయాల బాటలు

☛ గురుకుల విద్యార్థుల ప్రతిభ

అరికెర గురుకులం(ఆలూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఏకాగ్రత పెరిగేందుకు, చదువులో రాణించేందుకు చిత్రలేఖనం దోహద పడుతుందనే ఉద్దేశంతో చిత్ర ఉపాధ్యాయుడు అచ్చయ్య ప్రోత్సాహం అందించారు. దాంతో గురుకులం విద్యార్థులు బొమ్మలు గీస్తూ... వాటిలోనే తమ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఆ లక్ష్యం వైపుగా అడుగులు వేస్తున్నారు. వారే అరికెర గురుకుల విద్యార్థులు. చిత్రలేఖనంపై మక్కువతో గత రెండేళ్లుగా బొమ్మలు గీస్తున్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు పొందుతున్నారు. చిత్రాలు గీసి అందులోనే ప్రావీణ్యం పొందుతున్నారు.

కార్టూన్ సినిమాలు చూసి..

ప్రస్తుత సమాజంలో చిన్న పెద్ద అందరు కార్టూన్స్ చూసేందుకు ఆసక్తి చూపుతున్నాడు. అభినవ్ 9వ తరగతి చదువుతున్నాడు. తనకు యానిమేషన్ డిజైనర్ కావాలన్నదే కోరిక. ఈ నేస్తం చిన్నప్పటి నుంచే కార్టూన్ సినిమాలు చూస్తుండేవాడు. ఆ క్రమంలోనే తనకు ఆలోచన మొదలైంది. ఎలాగైనా యానిమేషన్ డిజైనర్ కావాలని లక్ష్యం పెంచుకున్నాడు. అందుకు ముందుగా బొమ్మలు గీయడం అలవాటు చేసుకున్నాడు.

వీడియో గేమర్‌నవుతా

పిల్లలకు ఆటలంటే చాలా ఇష్టం. కానీ, ప్రస్తుతం చరవాణులకు అతుక్కుపోతున్నారు. వీడియో గేమ్స్ అంటూ.. విచ్చలవిడిగా ఫోన్‌లను నొక్కేస్తున్నారు. దాంతో ఓ నేస్తం వీడియో గేమర్ కావాలని లక్ష్యం పెట్టుకున్నాడు. అజయ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చిత్రాలు గీయడం నేర్చుకుంటున్నాడు. ఇంజినీరింగ్ వంటి చదువులే కాదు.. ఫైన్ ఆర్ట్స్ కోర్సు ద్వారా మంచి స్థాయికి చేరుకోవచ్చని భావించాడు. ఆ వైపుగా అడుగులు వేస్తున్నాడు అజయ్.

వెబ్ డిజైనర్ కావాలన్నదే..

కార్తిక్ 7వ తరగతి చదువుతున్నాడు. గత రెండేళ్లగా బొమ్మలు గీయడంలో మెళకువలు పొందుతున్నాడు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి అప్లైడ్ ఆర్ట్స్(విజువల్ ఆర్ట్స్) వెబ్ డిజైనింగ్ నేర్చుకోవాలన్న కోరికతో ముందుకు సాగుతున్నాడు. ఇటీవల విజయవాడ సత్తెనపల్లెలో జరిగిన పోటీల్లో జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం సొంతం చేసుకున్నాడు.

విధుల్లో చేర్చుకోవాలని అంగన్‌వాడీల నిరసన

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలం కె.నాగలాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం-2లో విధులు నిర్వహిస్తున్న కార్యకర్త పుష్పావతి, ఆయా అయ్యమ్మను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బైఠాయించి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు తిప్పన్న, లక్ష్మన్న తదితరులు మాట్లాడారు. సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సరోజ, వెంకటేశు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు అస్వస్థతకు గురైన ఘటనపై అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలను విధుల నుంచి తొలగించడం సరికాదని అంగన్‌వాడీ (ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షుడు వీరేశ్, రాష్ట్ర సమితి సభ్యురాలు గౌసియా అన్నారు. ఆదోనిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకురాలు జానకి, ఈరమ్మ, శారద, గీత, ప్రభావతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

(c) eenadu

వైభవంగా బంగారు పల్లకి సేవ

మంత్రాలయం, న్యూస్‌టుడే: శ్రీమఠంలో గురువారం మృత్తిక బృందావనానికి బంగారు పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీమఠం సందడిగా మారింది. ఉదయం మృత్తిక బృందావనాన్ని వెండి సింహాసనంపై ఉంచి అర్చకులు పాదపూజ నిర్వహించారు. అనంతరం బంగారు పల్లకిలో ఉంచి శ్రీమఠం ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో సహాయ పీఆర్వో వ్యాజరాజాచార్, మఠం అర్చకులు శ్రీకాంత్ అర్చక్, గురుస్వామి, భక్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వేరుసెనగ గరిష్ఠ ధర రూ.7,209

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,209 మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.6,210 (రెండు ఒకటే ధర)కు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,760 మధ్యస్థ ధర రూ.5,664 కనిష్ఠ ధర రూ.5,460 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కొండపేటలో విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. మరొకటి ఇంటికి సమీపంలో ఉంది. -గంగాధర్, కోడుమూరు.

✔: సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.
- మధుసూదన్, ఏఈ, విద్యుత్తు శాఖ.

నందవరం, న్యూస్‌టుడే: ?: ముగతి శ్మశాన వాటికకు వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగాయి. - శివకుమార్, ముగతి

✔: విషయం సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.
- ఎంపీడీవో పుల్లయ్య, నందవరం మండలం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: నగరపంచాయతీలోని రాజవీధిలో సమయానికి కుళాయి నీరు రావడం లేదు. - వెంకటేశ్, స్థానికుడు

✔: నీరు సమయానికి అందేలా చూస్తాం. -కృపాకర్, ఏఈ

?: నగరపంచాయతీలోని హకీం వీధిలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. - షఫీ, స్థానికుడు

✔: త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.
- రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: పట్టణంలో లక్ష్మీపేట పెద్దబావి లైన్‌లో రహదారి కంకర తేలి అధ్వానంగా మారింది. - నాగరాజు, కాలనీవాసి

✔: కొత్త రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.
- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: అబ్బాస్ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. - వీరేష్, కాలనీవాసి

✔: సిబ్బందిని పంపించి కాల్వలు శుభ్రం చేయిస్తాం.
- శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: గూడూరు రహదారిలో పక్కనే చెత్తను పారవేడయంతో దుర్వాసన వస్తోంది. - సోమేష్ కాలనీవాసి

✔: చెత్తను తరలిస్తాం. -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణం న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. సాగునీరు, అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు భరోసా కల్పించిన ఘనత ఘనత

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వెంకటగిరి గ్రామంలో గురువారం అన్నదాత సుఖీభవ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్డీఎస్ కుడి కాలువ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి వసతి కల్పించేందుకు వాటర్ గ్రిడ్ ప్రతిపాదన పెట్టామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లయ్య, ఎంపీడీవో బంగారమ్మ, ఏఈ జయన్న, ఏపీఎం జయశ్రీ, తెదేపా నాయకులు ఈరప్ప నాయుడు, జగదీష్, రాఘవేంద్ర, కేటీ వెంకటేశు, గోనెగండ్ల తిరుపతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ పేర్కొన్నారు. కృష్ణాపురంలో గురువారం 'రైతన్నా మీ కోసం' నిర్వహించారు. సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంఏవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అందని వారుంటే గుర్తించి నివేదికలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శంకర్‌రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతన్నకు అండగా ఉంటుందని మండల తెదేపా అధ్యక్షుడు జె.సురేష్ అన్నారు. మండలంలోని కె.నాగలాపురంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సచివాలయం సిబ్బంది, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనాల క్రమబద్ధీకరణకు అభయం

● అర్హతలుంటే దరఖాస్తుకు అవకాశం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో అనుమతి లేని కట్టడాలు వెలిశాయి. నిబంధనలు ఉల్లంఘించారు. ఆక్రమణలు చేపట్టి దోచ్చుకున్నారు. అయినా ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడింది. కూటమి ప్రభుత్వం రాకతో అక్రమాలకు చెక్ పెట్టింది. వాటిని సక్రమంగా చేసేందుకు జీవో విడుదల చేసి బీపీఎస్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

పురపాలకలో వెయ్యికిపైగానే అనుమతులు

గత ఐదేళ్లలో వెయ్యికిపైగానే నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. అనుమతిలేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను ప్రణాళికా విభాగం అధికారులు గుర్తించారు. వాటికి నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. అవకాశాన్ని వినియోగించుకోకపోతే అధికారులు చర్యలు తప్పవన్నారు. పురపాలికకు దాదాపు రూ.20 లక్షల ఆదాయం సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

బీపీఎస్ దరఖాస్తు

1984 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్య నిర్మించిన ఇళ్లకు బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ, దేవదాయ, నదులు,

మునెప్పనగర్ కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

కాల్వలు, భూముల్లో మాస్టర్ ప్లాన్ రోడ్డు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు ఈ పథకం వర్తించదు. అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్లాన్‌లు మంజూరు చేసి నిర్మించిన వాటిలో దాదాపు 450కిపైగానే, ప్లాన్లు లేకుండా దాదాపు 80కిపైగానే ఉంటాయని అంచనా. క్షేత్రస్థాయిలో సర్వే చేసి నోటీసులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అవసరమైన పత్రాలు

★ రిజిస్టర్ సేల్ డీడీకాపీ. ★ ఈసీ, మార్కెట్ విలువను ధ్రువీకరించే పత్రం

★ స్ట్రక్చర్ ఇంజినీరు నుంచి భవన నాణ్యత పత్రం. ★ ఎన్‌క్లూజర్ - 4 పత్రం

★ గుర్తింపు పొందిన సాంకేతిక పర్సన్ (ఎల్‌టీపీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

రుసుం ఇలా

★ దరఖాస్తు సమయంలో రూ.10వేలు చెల్లించాలి.

★ మార్కెట్ విలువ మేరకు నివాస సముదాయాలకు చదరపు అడుగుకు రూ.40చ నుంచి చ 200, వాణిజ్య సముదాయాలకు చదరపు అడుగుకు రూ.80 నుంచి 400 వరకు ఉంటుంది.

మినహాయింపులు

★ 60 గజాల లోపు జీప్లస్ టూ ఇళ్లను నిర్మించుకున్న వారికి మినహాయింపు ఉంటుంది. వారు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదు. 1997 డిసెంబర్ 12లోపు నిర్మాణాలకు 25 శాతం తగ్గింపు, మురికివాడల్లో 50 శాతం తగ్గింపు రుసుము ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి

– గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

అక్రమ కట్టడాలకు నోటీసులు సిద్ధం చేశాం. సచివాలయ ఉద్యోగులతో దాదాపు సర్వే పూర్తి చేశాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. కావున బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకొని ఆక్రమణలను క్రమబద్ధీకరించుకోవాలి.

ప్రజాభిప్రాయం పరిగణలోకి తీసుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గ్రామాల విలీనంపై ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని ఆదోని మండలం ఢణాపురం మాజీ సర్పంచి మల్లికార్జున అన్నారు. పెద్దహరివాణం మండల కేంద్రంలో ఢణాపురం గ్రామాన్ని కలపడంపై వ్యతికించారు.

దారి కుంగింది.. ప్రమాదం పొంచి ఉంది

పట్టణంలోని గాంధీనగర్‌లో రహదారి మురుగు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ నిర్మాణం కుంగి రంధ్రం పడింది. ప్రమాద సూచికగా కుంగిన చోట రాళ్లు పెట్టారు. పట్టణంలో రద్దీగా ఉండే రహదారుల్లో ఇదొక్కటి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు నేరవార్తలు

రూ.లక్షలు వెచ్చించి.. లక్ష్యం మరిచి

కోడుమూరు పట్టణంలోని 3వ వార్డు గ్రామ సచివాలయం సమీపంలోని రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దానికి రూ.లక్షలు వెచ్చించారు. పనులను మధ్యలో వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో చుట్టూ ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారాలు భవానం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. – న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

కంప కప్పేసింది.. ప్రమాదం పెంచింది

మండలంలోని ఖానాపురం నుంచి రేమటకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారాయి. ఇరువైపులా ఏపుగా కంప చెట్లు పెరిగాయి. ఆ మార్గంలో రాత్రిపూట ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ దారిలో మలుపులు సైతం కానరాక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు రోడ్డుకి ఇరువైపులా కంప చెట్లు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

అధికారుల నిర్లక్ష్యం.. మరమ్మతులు శూన్యం

ఆదోని-ఎమ్మిగనూరు- రాయచూర్ జాతీయ రహదారి 167లో డ్రైనేజీ శిథిలమై ప్రమాదాకరంగా మారింది. ఎమ్మిగనూరు నుంచి ముగతి వరకు మూడు కిలోమీటర్లు రహదారి పక్కన వర్షపు నీరు పారే కాల్వలు శిథిలమైయ్యాయి. కొందరు వాటిని ధ్వంసం చేశారు. దాంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. ముగతి ఫారం వద్ద, వంక వద్ద, ఆదోని రోడ్డు, మార్కెట్ సమీపంలో ఇతర ప్రాంతాల్లో దాదాపు 8 చోట్ల ప్రమాదాలు నెలకొన్నాయి. ఐదేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

బురొద.. తప్పని వ్యధ

మండలంలోని చిన్నమర్రివీడులో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రహదారిలో ప్రధాన తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతోంది. తాగునీరు కలుషితమవడంతో పాటు రహదారి బురదమయంగా మారింది. నిత్యం విద్యార్థులు బురదలో అవస్థలుపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. పైపులైను లీకేజీ అరికట్టి బురద కష్టాలు తీర్చాలని కాలనీవాసులు కోరారు.– న్యూస్‌టుడే, గోనెగండ్ల

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

మాట్లాడుతున్న వైద్యాధికారిణి పావని

కౌతాళం, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారిణి పావని పేర్కొన్నారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలున్నాయని ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే వెంటనే పోలీసులకు, సంబంధిత కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కౌతాళం కేజీబీవీ పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులకు జలుబు, దగ్గు, చర్మ సంబంధిత తదితర కారణాలతో బాధపడుతున్నట్లు గుర్తించి, మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేజీబీవీ ఎస్వో, వైద్య శాఖ పర్యవేక్షకుడు వెంకటరాముడు, ఎమ్ఎల్‌హెచ్‌పీ అంజలి, కేజీబీడీ ఏఎన్ఎమ్ రాధ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్సై హనుమంతరెడ్డి పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేసినా, వాటిని ప్రోత్సహించిన కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. బాల్య వివాహాలు అరికట్టడంపై కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వంద రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఎంఈవో సునీలమ్మ, ఉపాధ్యాయులు భాస్కర్, కోనేరు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మౌనిక, ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి, , మొబిలైజర్ చిన్న రామాంజినేయులు పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: సమష్టి కృషితోనే బాల్యవివాహాల నిర్మూలనా సాధ్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మాదన్న అన్నారు. పట్టణ శివారుల్లోని కస్తూర్బా పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18 సంవత్సరాలు లేకుండా వివాహాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కమల్ సాహెబ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కంబదహల్(సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని కంబదహల్‌లో సాయిబాబా ఆలయంలో గురువారం పురోహితుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవా నిర్వహించగా.. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలకల్‌లో సద్దురు శింగరయ్య ఆలయంలో నాగదోష నివారణ పూజలు చేశారు. కొత్తకోటలో రాఘవేంద్రస్వామి మఠంలో అభిషేక పూజలు చేశారు. గుండ్రేవులలో సుబేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

కుష్ఠు వ్యాధి నిర్మూలన సర్వే పరిశీలన

డాక్టరుతో చర్చిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: జిల్లా వైద్యాధికారి డా.ఎల్.భాస్కర్ సమక్షంలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి నిర్మూలన సర్వేను కేంద్ర బృందం సభ్యులు డా.శాంతరాం, డా.రీతి తివారీ, డా.మనీషా పరిశీలించారు. గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాలను గురువారం కేంద్ర బృందం సందర్శించింది. వైద్యశాలలో చేపట్టిన సర్వే పనులపై కేంద్ర బృందం మండల వైద్యాధికారిణి రంగరవళి, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సర్వేలో గుర్తించిన ముగ్గురు రోగుల్లో ఒకరితో కేంద్ర బృందం మాట్లాడారు. వ్యాధి లక్షణాలు ఎలాంటి మందులు వినియోగిస్తున్నారు తదితర అంశాలపై విచారించారు. ఈనెల 30 వరకు జరిగే సర్వేలో పకడ్బందీగా సర్వే చేపట్టి రోగులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు డా.దేవసాగర్, డా.సత్యవతి, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మిరపలో ముసురు వాతావరణం కారణంగా పురుగు, తెగుళ్లు ఆశిస్తుందని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారిణి శ్రీవాణి పేర్కొన్నారు. కడివెళ్ల, కందనాతిలో గురువారం క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించింది. ఆమె మాట్లాడుతూ.. చలి వాతావరణంతో రసం పీల్చు పురుగులు, ఆకు ముడత, ఆకుమచ్చ, బూడిద రంగు తెగులు ఆశిస్తుందన్నారు. పురుగుల నివారణకు జాగ్రత్తలు వహించాలన్నారు.

ప్రారంభమైన ఇసుక తవ్వకాలు

కౌతాళం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ఇసుక భాండాగారంగా పేరుగాంచిన కౌతాళం మండలంలోని తుంగభద్ర నదిలో గుడికంబాలి రీచ్ నుంచి ఇసుక తవ్వకాలు, తరలింపు ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఇసుక లోడుతో లారీలు, టిప్పర్లు హాల్వి గ్రామం వద్ద రహదారులపై బారులుతీరాయి. మరో నాలుగైదు రోజుల్లో నదిచాగి, మరళి రీచ్‌లు కూడా ప్రారంభమవుతాయని సమాచారం.

సేంద్రియ సాగుపై అవగాహన

సి.బెళగల్, న్యూస్‌టుడే: రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సాంకేతికతో పంచవర్ష ప్రణాళికను అమలు పరచడమే ప్రభుత్వ ధ్యేయం అని తెదేపా కన్వీనరు బి.చంద్రశేకర్ పేర్కొన్నారు. మండలంలోని ఇనగండ్ల గ్రామంలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతుసేవా కేంద్రం సిబ్బందితో కలిసి రైతులకు సేంద్రియ, యాంత్రీకరణ రాయితీ గురించి సవివరంగా వివరించారు. కార్యక్రమంలో గ్రామ తెదేపా నేతలు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల లబ్ధిదారులపై సర్వే

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులపై సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి గురువారం తెలిపారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 5వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. కావున మండలం, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆయుర్వేద వైద్యశాల బలోపేతానికి కృషి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యశాల బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భవనం ఏర్పాటు చేసి వైద్యసేవలను మరింత అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం ఆయుర్వేద వైద్యశాల ప్రభుత్వ ఆసుపత్రిలో శిథిలమైన క్వార్టర్ భవనంలో ఏర్పాటు చేశారు. ఆయుష్ కింద రూ.30లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం వైద్య సేవలకు అంతంత మాత్రమే ఓపీ ఉంది. ఆయుర్వేద ఆసుపత్రిని రోగులకు అందుబాటులో ఉండేలా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

కౌతాళం, న్యూస్‌టుడే: ఏకల్ గ్రామోతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ముఖ్య కార్యదర్శి పాండురంగారెడ్డి, ఏకల్ గ్రామోతన్ కౌతాళం అధ్యక్షుడు మారుతీమోహన్ తెలిపారు. మూడు విడతల్లో దాదాపు 150 మంది మహిళలు, యువతులకు కుట్టు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కౌతాళంలోని త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గ్రామ నాయకులు ధ్రువపత్రాలు అందజేశారు. కౌతాళం మండలంలోని బాపురం, నదిచాగిలో రెండు కుట్టు మిషన్లు అందజేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, కౌతాళం సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు, రాజానందు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ధ్రువపత్రాలు అందజేస్తున్న గ్రామ నాయకులు

ఓటర్ల మ్యాపింగ్‌ను పడక్బదీంగా చేయాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఓటర్ల జాబితాలను తప్పులు దొర్లకుండా పకడ్బందీగా మ్యాపింగ్ చేయాలని తహసీల్దారు పి.రాజేశ్వరి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని 68 పోలింగ్ కేంద్రాల్లో 59,593 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ రఘువీర, ఆర్ఐ రామయ్య, వీఆర్వోలు నారాయణ, మున్నీరుబాషా, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలి

మాట్లాడుతున్న రంగన్న

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కరోనా సమయంలో సేవలు అందించి ప్రాణాలు కోల్పోయిన పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ నాయకుడు రంగన్న డిమాండు చేశారు. పురపాలక సంఘం కార్యాలయం సమీపంలో గురువారం కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వం కార్మికులను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు విజయేంద్ర, తిమ్మగురుడు, ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాలు పెరిగాయి.. పడకలు పెరగాలి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాల్లో ప్రథమ స్థానంలో ఉంది. కొన్ని నెలలుగా ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి. ఆసుపత్రిలో కాన్పులు నిర్దేశించిన దాని కంటే రెట్టింపు కన్నా అధికంగా జరుగుతుండటంతో పడకల స్థాయిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నవజాత శిశువులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఎన్ఐయూసీ వార్డును అత్యాధునిక వైద్య పరికరాలతో పీపీపీ విధానంతో ఏర్పాటు చేశారు.

నెలకు 250 నుంచి 300 కాన్పులు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఆయా గ్రామాలతో పాటు మంత్రాలయంలోని పలు గ్రామాల గర్భిణులు ప్రసవాలకు ఆసుపత్రికి వస్తారు. నెలకు 250నుంచి 300వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. కాన్పులు చేసేందుకు

బాలింతల వార్డు

ముగ్గురు గైనకాలజిస్టులతో పాటు సిబ్బంది ఉన్నారు. కాన్పులు అధికంగా జరుగుతుండటంతో గతంలో రూ.2కోట్లతో ఆధునిక వైద్య పరికరాలతో ఆదర్శ కాన్పుల వార్డు ఏర్పాటు చేశారు.

ఇటీవల ఓపీ 700 పెరిగింది

వంద పడకలు ఆసుపత్రి భవనంతో గదుల, వార్డుల కొరత తీరింది. ఏరియా ఆసుపత్రిలో నెలకు వంద ప్రసవాలు జరగాలి. అధికంగా కాన్పులు జరుగుతున్నాయని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిని 100పడకల నుంచి 200 పడకలకు స్థాయి పెంచాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇటీవల ఓపీ 700 పెరిగింది. నెలకు రక్త, మూత్ర వంటి పరీక్షలు 30వేల వరకు నిర్వహిస్తున్నారు.

నవజాత శిశువులకు భరోసా

దాదాపు రూ.30లక్షలతో ఎన్ఐయూసీ వార్డు ఏర్పాటు చేశారు. బరువు తక్కువ, ఉమ్మనీరు తాగిన నవజాత శిశువులకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బందిని నియమించారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

–డా. ఆదినాగేష్, సూపరింటెండెంట్

కొన్ని నెలలుగా ప్రసవాలు అధికమైయ్యాయి. నిర్దేశించిన లక్ష్యం కన్నా ఎక్కువగా జరుగుతున్నాయి. నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు పీపీపీ విధానంతో ఎన్ఐయూసీ వార్డు ఏర్పాటు పూర్తయింది.

దంపతుల ఆత్మహత్యాయత్నం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి కుటుంబ సభ్యులతో చరవాణిలో మాట్లాడడం కలకలం రేపింది. ఈ ఘటన గురువారం మంత్రాలయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటకలోని హొన్నవరానికి చెందిన మంజునాథ్, వీణా పూజారి దంపతులు మంత్రాలయం వచ్చారు. మంజునాథ్ అటవీ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ఉన్నతాధికారి ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్తీక్, యోగేష్ వద్ద తనను వంట మనిషిగా పని చేయాలని గత సంవత్సరం పైగా వేధింపులకు గురి చేశారు. అందుకు ఆయన ఒప్పుకోలేదు. దాంతో ఆయన్ను మానసికంగా వేధింపులకు గురిచేశారు. మంజునాథ్ నెలన్నర అనారోగ్యానికి గురయ్యారు. అయినా ఆయన్ని వంట మనిషిగా బదిలీ చేశారు. అది భరించలేక ఇంట్లో సూసైడ్ నోట్ రాసి దంపతులు బుధవారం మంత్రాలయం చేరుకున్నారు. గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని ఆత్మహత్య చేసుకోవడానికి నదిలోకి వెళ్లారు. వారికి పిల్లలు గుర్తు రావడంతో వారితో చరవాణిలో మాట్లాడారు. విషయం తెలుసుకున్న పొరుగు ఇంటి వినోద గోపాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే మంత్రాలయం పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రంగస్వామి ఆ దంపతులను నదిలో గుర్తించి సీఐ రామానుజులకు అప్పగించారు. ఎస్సై శివాంజల్ కర్ణాటక పోలీసులకు సమాచారం అందజేశారు. కర్ణాటకకు నుంచి పోలీసులు రాత్రి వస్తామన్నారు. మంత్రాలయం సీఐ ఆ దంపతులను వారికి అప్పగించనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన వడ్డె నాగేశ్ కుమారుడు వడ్డె ప్రవీణ్(6) ఈ నెల 11న ఉదయం ఇంట్లో స్నానానికి సిద్ధం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు పొయ్యి వద్ద నిప్పంటుకొని గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు సిఫారసు చేశారు. అక్కడ హోమియో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

మంత్రాలయం: పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్ బిరుదు వరించింది. మైల్స్ లీడర్‌షిప్ విశ్వవిద్యాలయం అధికారులు ఈనెల 29న ఈ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు.

గోనెగండ్ల: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా నియోజకవర్గ బాధ్యుడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అల్వాలలో కోటి సంతకాల సేకరణ గురించి ప్రజలకు వివరించారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరపంచాయతీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సంతకాలు పూర్తి చేసిన పత్రాలు కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సతీష్‌కు అందజేశారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా వ్యాపారంగా మార్చడం వల్ల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సాయిఉదయ్ పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

అదనపు ఏఈఆర్వోల నియామకం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించి పూర్తిగాని తప్పులుగా ఉన్న కర్నూలు, పాణ్యం, ఆదోని నియోజకవర్గాలకు అదనపు ఏఈఆర్వోలను నియమిస్తూ కలెక్టర్ డా.ఎ.సిరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు నియోజకవర్గానికి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఆర్‌వీ కృష్ణ, కేంద్రీ ఈఈ పి.వి.శేషసాయి, నగరపాలక డిప్యూటీ కమిషనర్ కె.వి.సతీష్ కుమార్‌రెడ్డిలను, ఆదోని నియోజకవర్గానికి ఆదోని ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎండీ నాసిర్ హుసేన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి.శిరీష, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య, ఆదోని డీలేవీవో తిమ్మక్కలను నియమించారు. అలాగే పాణ్యం నియోజకవర్గానికి కల్లూరు ఎంపీడీవో నాగ శేషాచలరెడ్డి, ఎంపీడీవో కార్యాలయ ఏవో ఎస్.నాగరాజు, కల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి.జయశ్రీలను నియమించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను సమర్థమంతంగా పూర్తి చేసేందుకు నియామకం చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన సదస్సు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు మండల పరిధిలోని జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం శక్తిటీం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, కానిస్టేబుల్ ఆరికే నాయకులు శక్తియాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపద సమయంలో శక్తి యాప్, శక్తి వాట్సప్ నంబరు-7993485111 ఉపయోగాలు వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఏఎస్ ప్రసాద్, ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408 పీర్యకట్ల : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ?: కృష్ణానగర్, అబ్బాస్‌నగర్ ప్రాంతాల్లో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. - అనిల్, స్థానికుడు

?: శరీన్‌నగర్‌లోని వీధుల్లో దోమల బెడద ఉంది. నియంత్రణ చర్యలు చేపట్టాలి. - స్థానికులు

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. - నగరపాలక అధికారులు

ప్రసంగించి.. ప్రశంసలు పొంది

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం ద్వారా వక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలు నేర్చుకోవచ్చని ప్రిన్సిపల్ మంజుల పేర్కొన్నారు. నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విజేతలైన మహశ్రీ, హర్షిత, సంజనరెడ్డికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏవో రామాంజనేయులు, డీన్ రాజేష్‌రెడ్డి, ఉపాధ్యాయిని ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో ఉపాధ్యాయులు

ఉపన్యాస పోటీలో పాల్గొన్న విద్యార్థిని

ఆదాయం దండి.. సౌకర్యాలకు గండి

▶ వ్యవసాయ మార్కెట్‌లో కనీస వసతులు కరవు ▶ రైతన్నలకు తప్పని అవస్థలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. రైతుల గురించి పట్టించుకునేవారు కరవయ్యారు. వారికి కనీస వసతులు ఉండటం లేదు. అన్నదాతలు తీసుకొచ్చిన ఉత్పత్తులను ప్లాట్ ఫాంల మీద పెట్టుకుంటే భద్రత కరవయ్యింది. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారుతోంది. మూడు శుద్ధ జల కేంద్రాలకు గాను ఒకటే సరిగా పనిచేస్తుండటంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. దాతల సహకారంతో ఇస్కాన్ భోజనశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు ఆరుబయట నీళ్ల ప్యాకెట్లను కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. ఏటా ఆరేడు కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా నిర్వహణ కొరవడి రైతన్నలకు ఇక్కట్లు తప్పడం లేదు.

నిరుపయోగంగా మారిన కార్యాలయం పక్కనున్న మినరల్ వాటర్ ప్లాంట్



మార్కెట్‌లో అలంకారప్రాయంగా సీసీ కెమెరా

పట్టించుకునే వారేరీ?

- మార్కెట్‌కు వచ్చే రైతులు, కార్మికులకు అత్యవసరమైతే డబ్బులు చెల్లించి మల, మూత్రశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఉచిత మరుగుదొడ్ల ఏర్పాటు చేయలేదు.
- విశ్రాంతి భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంది. ఇందులో ఇనుప మంచాలు మాయమయ్యాయి.
- మాధవాచారి షెడ్ల ప్రాంతంలో ముళ్ల పొదలు, చెత్తా చెదారం పేరుకుపోయాయి. ఈ ప్రాంతంలో కమీషన్ ఏజెంట్ల దుకాణాల సముదాయం గత కొన్నేళ్లుగా అర్ధంతరంగా ఆగిపోయి మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి.
- మార్కెట్‌లో మురుగు కాలువలు మట్టితో మూసుకుపోయాయి. పిచ్చిచెట్లు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షాకాలంలో యార్డు చిత్తడి చిత్తడిగా మారుతోంది. కమీషన్ ఏజెంట్ల దుకాణాల ముందు వర్షపునీరు నిలుస్తోంది. దీంతో పంట ఉత్పత్తులు తడిసిపోయే ప్రమాదం ఉంది.

వానొస్తే వణుకే..

యార్డు లోపల పంట ఉత్పత్తులు తడవకుండా ఉండేందుకు మార్కెట్ కమిటీ అధికారులు టార్పాలిన్లు అందజేయాలి. ఇటీవల ఉల్లి ఉత్పత్తులు మార్కెట్‌కు పోటెత్తగా రైతులకు ఒక్క టార్పాలిన్ కూడా అందించలేదు. దీంతో పంటంతా తడిచి రైతన్నలు నష్టపోయారు. వర్షం పడిన ప్రతిసారీ పంట నష్టం తప్పడం లేదు.

◆ మార్కెట్‌లో ఎటు చూసినా చెత్త కుప్పలు, పంట ఉత్పత్తుల వ్యర్థాలే. ఇక ప్రధాన గేటు సమీపంలో కమీషన్ ఏజెంట్ల దుకాణాల ముందు మల, మూత్ర విసర్జన చేస్తుంటారు. ఈ ప్రాంతంలో దుర్గంధంతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. ఇక మాధవాచారి గోదాముల సముదాయ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది.

◆ ఇక మార్కెట్‌లో సీసీ కెమెరాలు సరిగా పనిచేయడం లేదు. పంట ఉత్పత్తులకు భద్రత కరవై చోరీలు అధికమయ్యాయి. నిఘా నేత్రాల నిర్వహణను పూర్తిగా విస్మరించారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: అనుమతులు లేని భవనాలు, అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ అవులు వేగవంతంగా జరగాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ప్రాంతీయ పట్టణ ప్రణాళిక ఉప సంచాలకుడు సంజీవ్‌కుమార్ సూచించారు. క్రెడాయ్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం బిల్డర్లు, పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్, మార్చి 11 వరకు బీపీఎస్ గడువు కొనసాగుతుందన్నారు. క్రమబద్ధీకరణ చేసుకోని వాటిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ, జిల్లా పట్టణ నిర్మాణ అధికారి శశిలత, కుడా సహాయ ప్రణాళికాధికారి హయాత్ మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గకు బస్సులు నడపాలని వినతి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కాల్వబుగ్గ పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ భక్తులు నడపాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు ఆర్ఎం.శ్రీనివాసులును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు టి.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాల్వబుగ్గ రామేశ్వరం వద్ద బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని ఆర్ఎం శ్రీనివాసులు వారికి హామీ ఇచ్చారు.

ఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

కుష్ఠు రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కుష్ఠురహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ వి.శాంతారాం అన్నారు. గురువారం జిల్లాలో కుష్ఠు సర్వేను పరిశీలించిన కేంద్ర బృంద సభ్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌తో సమావేశమయ్యారు. డా.శాంతారాం మాట్లాడుతూ.. సర్వే సమయంలో నిబంధనల ప్రకారం అన్ని వివరాలు సేకరించి ప్రభుత్వం అందించే వైద్యసేవలను ప్రజలకు తెలియజేయాలన్నారు. బాధితులపై వివక్ష లేకుండా ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. బాధితులకు ప్రభుత్వం అందించే పథకాలను వివరించి వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు డా.రీతితివారి, డా.మాన్సి, రాష్ట్రస్థాయి అధికారి డా.దేవసాగర్, కన్సల్టెంట్ సత్యవతి, డా.మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌తో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ఆదమరిస్తే అపాయమే..

నంద్యాల చెక్‌పోస్టు మార్గం కేంద్రీయ విద్యాలయం సమీపంలో రహదారిని ఆనుకుని గుంత ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా కొన్నేళ్ల కిందట కల్వర్టు పనులు చేశారు. ఆ గుంత అలానే ఉండటంతో మురుగునీరు చేరి పాచి పట్టింది. వాహనాలు రాకపోకల సమయంలో ఏమాత్రం అదుపుతప్పినా ఆసుపత్రి పాలు కావాల్సిందే. వీధి దీపాలు సైతం లేకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారుల ప్రమాదం పొంచి ఉంది.

– కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

నడిరోడ్డుపై మురుగు ప్రవాహం

మండిబజార్‌లో మురుగు ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువలు పూడికతో నిండిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. వాహనాలు, పాదచారులు అందులోంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు జారిపడే అవకాశముంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సకాలంలో కాలువలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

రహదారిపై గుంత.. ప్రయాణానికి చింత

స్థానిక కొత్తబస్టాండు నుంచి బంగారుపేట వెళ్లే మార్గంలో పాత ఈద్గా ప్రాంతంలో నడిరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించబోయి ప్రమాదాలబారిన పడుతున్నారు. నగరపాలక యంత్రాంగం స్పందించి ప్రధాన రహదారులపై గుంతలకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఆలయంలో కమిటీ సభ్యులకు వెండి కిరీటం, పళ్లెం అందజేస్తున్న దాతలు

శిర్డీ సాయి ఆలయానికి వెండి కిరీటం సమర్పణ

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కర్నూలు పాతబస్తీ దక్షిణ శిర్డీ సాయిబాబా ఆలయానికి బొల్లవరం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, పద్మావతి దంపతులు రూ.1.60 లక్షలు విలువచేసే వెండి పళ్లెం, వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయకమిటీ ప్రతినిధి మహాబలేష్‌కు గురువారం వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు తీర్థప్రసాదాలు అందచేసి ఆశీర్వదించగా... కమిటీ సభ్యులు సత్కరించారు.

బాలసాయిబాబా ఆరాధనోత్సవం

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: బాలసాయిబాబా ఆరాధనను పురస్కరించుకుని స్థానిక పాతబస్తీలోని శ్రీనిలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలసాయి విగ్రహానికి అభిషేకం నిర్వహించి అలంకరించారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. బాలసాయి మేనేజింగ్ ట్రస్టీ టి.రామారావు, టీఎస్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బాలసాయి ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

విభిన్న ప్రతిభావంతులకు అన్ని విధాలా ప్రోత్సాహం

పోటీలను ప్రారంభిస్తున్న రయీస్ ఫాతిమా, భూపతిరావు

పరుగులో పోటీపడుతున్న క్రీడాకారిణులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని కర్నూలు విభిన్నవంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగుల) దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లాల విభిన్న ప్రతిభావంతుల జిల్లాస్థాయి పోటీలను కర్నూలు ఇన్‌ఛార్జి క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు, డీఎస్ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: మహిళా క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు రాణించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యుడు గుడిపల్లె సురేంద్ర అన్నారు. ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో అస్మిత ఖేలో ఇండియా షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, వైకాపా మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణిరెడ్డిలు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు.

లాన్ టెన్నిస్ క్రీడాకారుడికి అభినందన

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నవంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీల్లో కర్నూలుకు చెందిన క్రీడాకారుడు సాయిశంకర్ సింగిల్స్‌లో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి తన ఛాంబర్‌లో గురువారం అభినందించారు. రాబోవు జాతీయస్థాయి పోటీల్లో సైతం పతకంతో తిరిగి రావాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, లాన్‌టెన్నిస్ శిక్షకుడు మహమ్మద్ రఫిలు పాల్గొన్నారు.

క్రీడాకారుడు సాయిశంకర్‌ను అభినందించిన కలెక్టర్

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ క్రీడ అయిన కరాటే నేర్చుకోవాలని విద్యార్థినులకు కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వైఎస్ ప్రిన్సిపల్ జీవీ రంగారెడ్డి సూచించారు. కళాశాలలో గురువారం యూనివర్సల్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి కరాటే మాస్టర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. పలు విభాగాల్లో నిర్వహించి.. ప్రతిభ చూపిన వారికి బెల్ట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త ఆర్తిచక్ర, వ్యాయామ అధ్యాపకురాలు మౌనిక, పావని, ఎగ్జామినర్ గీత పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిలను గుర్తించి చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఈవ్‌టీజింగ్ బీట్‌లను సీఐలు, ఎస్సైలు తనిఖీ చేశారు. ఆయా పోలీసు అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్‌గా వై.వెంకటరమణ

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక పట్టణ ప్రణాళిక డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న వై.వెంకటరమణకు ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్‌గా బాధ్యతలను అప్పగిస్తూ నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ ఉత్తర్వులు జారీ చేశారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని స్టాంటన్‌పురంలో జరిగింది. స్థానికంగా నివాసముండే ప్రేమవరం జ్యోతి(27), అరుణ్‌కుమార్ దంపతులు. వీరికి ఏడాదిన్నర వయసున్న ఒక కుమార్తె సంతానం. గురువారం జ్యోతి ఇంట్లో ఉరి వేసుకోగా కుటుంబసభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కర్నూలు అర్బన్ పోలీసులు కేసు విచారిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం కర్నూలు జిల్లా 5వ మహాసభలను శుక్రవారం ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నట్లు ఏపీడీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి కరుణాకర్ తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కర్నూలు నగరపాలకసంస్థ: నగర పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, రహదారి భద్రతపై ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ స్థలాల్లో పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఆ స్థల యజమానులు శుభ్రం చేసుకోవాలన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలల అనుమతులను రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు.

పేరుకే మరమ్మతులు

❑ గుంతల దారులతో వాహనదారుల పాట్లు

❑ పట్టించుకోని నగరపాలక అధికారులు

ఈ చిత్రం కిసాన్‌ఘాట్ నుంచి ధర్నాచౌక్‌కు వచ్చే దారిలోనిది. రహదారి గుంతలమయంగా మారడంతో కంకర వేశారు. ప్రస్తుతం రాళ్లు తేలి అధ్వానంగా మారింది. రాకపోకల సమయంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరపాలక అధికారులు మరమ్మతులు చేయకుండా ఇలా వదిలేయడంపై వాహనచోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రం సంకల్‌బాగ్ సమీపంలోని ఓ వీధిలోనిది. రహదారి మధ్యలో గుంతలు తవ్వి ఆ తర్వాత మరమ్మతులు చేశారు. అయితే ప్రస్తుతం మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. పనుల్లో నాణ్యత లోపమే ఇందుకు కారణమని స్థానికులు పెదవి విరుస్తున్నారు. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కోరుతున్నారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో రహదారులు అధ్వానంగా మారాయి. పలు చోట్ల గుంతలు పడి కంకర తేలాయి. కాలనీల్లో సైతం సీసీ రోడ్ల మధ్యలో గుంతలు ఏర్పడి నెర్రెలిచ్చాయి. వాటి మరమ్మతుల కోసం నిధులు కేటాయిస్తున్నా అవి పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. పనుల్లో నాణ్యత కొరవడటంతో చేసిన పనులనే మళ్లీ చేయాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరమ్మతుల పనులు సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. రూ.లక్షల్లో నిధులు వృథాగా మారుతున్నాయని పురవాసులు అంటున్నారు.

భారీగా నిధులు ఖర్చు చేస్తున్నా..

నగర పరిధిలో 750 కి.మీ. మేర రహదారులు ఉండగా.. మున్సిపల్ రోడ్లు 680 కి.మీ మేర ఉంటాయి. అందులోనూ సీసీ రోడ్లు 500 కి.మీ.పైన, బీటీ రోడ్లు 20 కి.మీ., గ్రావెల్ రోడ్లు 120 కి.మీ, 30 కి.మీ.పైన డబ్ల్యూబీఎం రోడ్లు ఉన్నాయి. ఏడాదిన్నర కాలంలో దాదాపు రూ.2 కోట్లకు పైగా నిధులను గుంతల రోడ్ల మరమ్మతులకు వెచ్చించినట్లు సమాచారం. భారీగా నిధులను ఖర్చు చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన మేర ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. పనుల్లో నాణ్యత కొరవడటం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిధులు వృథాగా మారుతున్నాయన్న విమర్శలొస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలను పరీక్షించకుండానే కొన్ని పనులకు బిల్లులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి గోతుల దారులకు మరమ్మతు పనులు నాణ్యతతో చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈనాడు నంద్యాల

శుక్రవారం నవంబరు 28, 2025 | 5

ధర దక్కదు

మొక్కజొన్న ధర పూర్తిగా పతనమైంది. క్వింటా రూ.1600లకు దళారీ వ్యవస్థ కొనడంతో అన్నదాతలు ప్రైవేటు గోదాముల వద్ద కంపెనీలకు తరలిస్తున్నారు. కొన్ని కంపెనీలు రూ.1950కి కొనుగోలు ప్రారంభించి.. నేడు రూ.1800లకు తగ్గించాయి. రైతులు హమాలీ, సంచులు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు రూ.150 భరించుకొని అక్కడికి తీసుకెళ్తే అక్కడ తేమ శాతం 14లోపు ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ ఉంటే వెనక్కి పంపించేస్తున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు

గోదాముల వద్ద బారులుదీరిన మొక్కజొన్న ట్రాక్టర్లు

తడి ఆరదు

రైతులు గత 20 రోజులుగా వరి, మొక్కజొన్న కోతలు, నూర్పిళ్లు చేస్తున్నారు. పంట కోసిన తరువాత తేమ శాతం అధికంగా ఉంటే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. కొందరు ఆరబోయడానికి కల్లాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో పలువురు మహానంది మండలం బొల్లవరం మెట్ట వద్ద వెంచర్లలో, నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డులో వరి, మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం

బనగానపల్లి రెవెన్యూ డివిజన్

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లిని నూతన రెవెన్యూ డివిజన్‌గా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. బనగానపల్లి రెవెన్యూ డివిజన్‌లో బనగానపల్లి, కోవెలకుంట్ల, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల మండలాలు వస్తాయి.

గురుకులాల్లో ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల మాధ్యమంలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సమన్వయకర్త డా.ఐ.శ్రీదేవి తెలిపారు. చిన్నటేకూరులో గణితం, కోవెలకుంట్లలో ఫిజిక్స్, లక్ష్మాపురంలో టీజీటీ హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అభ్యర్థులు తప్పనిసరిగా టెట్ అర్హత కల్గి, సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీ, బీఎడ్ పూర్తి చేసి ఉండాలన్నారు. డిసెంబరు 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. 94411 92673, 90100 70219 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి నిధి.. ఆరగించడమే విధి

■ తేలని రూ.52.30 కోట్ల పంచాయతీ లెక్కలు

గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారు. కొన్నింటికి బిల్లులు లేవు. మరికొన్ని వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేసి నిధులు పక్కదారి పట్టించారు. ఆడిట్ అధికారులు తనిఖీలు చేయగా అక్రమాలు బయటపడ్డాయి. - న్యూస్‌టుడే, కర్నూలు జడ్పీ

భారీగా ఆడిట్ అభ్యంతరాలు

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 పంచాయతీలున్నాయి. వీటికి వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు నాటికి ఆడిట్ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

● 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలకు చేరిన సొమ్ము (ప్రభుత్వ, సొంత వనరులు)పై సమగ్రంగా ఆడిట్ నిర్వహించి అభ్యంతరాల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రకటన విడుదలకు ముందే ఆడిట్ పూర్తి చేయడం ద్వారా బాధ్యులైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశముంటుంది.

ఏడాది	వసూలైన పన్నులు (రూ.కోట్లు)	వచ్చిన నిధులు (రూ.కోట్లు)
2020-21	21.10	152
2021-22	22.76	148
2022-23	19.15	79
2023-24	16.95	123
2024-25	19.60	61

ఏటికేడు పెరిగిపోతూ..

▸▸ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక శాతం మంది వైకాపాకు అనుకూలమైన సర్పంచులు ఉన్నారు. వివిధ పంచాయతీల్లో నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. వాటికి సంబంధించిన రసీదులు, దస్త్రాలు కనిపించడం లేదు.

▸▸ 2020-21 నుంచి 2023-24 వరకు ఆడిట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 44,100 అభ్యంతరాలు వెలుగు చూశాయి. వీటికి సమాధానాలు కానరావడం లేదు. రూ.52.30 కోట్ల నిధులకు పంచాయతీలు సమాధానం చెప్పడం లేదు.

సహకారం అందించక..

నంద్యాల జిల్లాలో 489 గ్రామ పంచాయతీలున్నాయి. 2023-24లో 9,400 అభ్యంతరాలు రాగా రూ.4.57 కోట్ల విలువైన సొమ్ముకు లెక్కలు తేలడం లేదు. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో ఈ పరిస్థితి నెలకొందని ఆడిట్ అధికారులు చెబుతున్నారు.

▸▸ నంద్యాల జిల్లాలో 40 పంచాయతీల్లో ఆడిట్ చేసేందుకు సంబంధిత కార్యదర్శులు సహకరించడం లేదు. దస్త్రాలు, పుస్తకాలు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులున్నాయి.

▸▸ ఆడిట్ పూర్తైన తర్వాత 2 నుంచి 4 నెలల్లోగా పంచాయతీ కార్యదర్శులు సమాధానాలివ్వాల్సి ఉండగా.. అధిక శాతం మంది ఖాతరు చేయడం లేదు. ఆడిట్ అధికారులు తాఖీదులు జారీ చేస్తే తప్ప స్పందించడం లేదు.

తనిఖీలు మరిచి..

▸▸ డీపీవో, డీఎల్‌పీవోలు పంచాయతీలను తనిఖీ చేయకపోవడంతో అభ్యంతరాలు అధికమవుతున్నాయి. ఇటీవల రుద్రవరం, బనగానపల్లి పంచాయతీల్లో నిర్వహించిన తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. పంచాయతీ అధికారుల తనిఖీ లేకపోవడమే కారణమని నంద్యాలకు చెందిన ఓ ఆడిట్ అధికారి చెప్పారు.

▸▸ పంచాయతీ ఎన్నికల జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఆడిట్ పూర్తి చేయాలన్న ప్రభుత్వం ఆదేశాలను అమలు చేస్తామని కర్నూలు జిల్లా ఆడిట్ అధికారి రమేష్ చెప్పారు.

నడిచే నాట్యమా!

నృత్యం చేస్తున్న సురేష్

పదో తరగతి పూర్తి చేసిన కుర్రాడు సినిమాలపై ఆసక్తితో హైదరాబాద్‌కు వెళ్లారు. చార్మినార్ వద్ద పర్యాటకుల ఫొటోలు తీస్తూ సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పని చేస్తూ బతుకుబండి లాగించారు. ఈ క్రమంలో కూచిపూడిపై ఆసక్తితో పలు కోర్సులు పూర్తి చేసి నాట్యంలో నైపుణ్యం సాధించి జూనియర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు నంద్యాలకు చెందిన పల్లెంశెట్టి సురేష్. నాట్యంలో నైపుణ్యం సాధించిన ఆయన కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వారు ప్రకటించే జూనియర్ ఫెలోషిప్ అవార్డుకు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కూచిపూడిలో ఈ అవార్డు సాధించిన ఏకైక వ్యక్తి కావడం గమనార్హం. అదేవిధంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్ భారత్ రంగ్ మహోత్సవంలో పాల్గొన్నందుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకొన్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

అప్పు మింగింది.. ఆత్మక్షోభ మిగిలింది

■ అన్నదాతల కుటుంబాలకు అందని పరిహారం

■ త్రీమెన్ కమిటీల విచారణ పేరుతో తీవ్ర జాప్యం

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : అప్పుల ఊబి నుంచి బయటపడలేక అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతినెలా సగటున ఐదారుగురు ప్రాణాలు తీసుకుంటున్నారు. వారి ఆత్మహత్యలపై అధికారులు విచారణ జరిపి.. ప్రభుత్వానికి నివేదిక ఇస్తే.. బాధిత కుటుంబాలకు రూ.7 లక్షలు చొప్పున పరిహారం అందుతుంది. సాయం నివేదికలు వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు వెళ్లి. . ప్రభుత్వం పరిశీలించి పరిహారం ఇచ్చేలోపు ఏడాది నుంచి రెండేళ్లు దాటుతుండటంతో బాధిత కుటుంబాలు బతకడానికి మరింత అప్పులు చేయాల్సి వస్తోంది.

బతుకు భారమై.. చదువు దూరమై..

- వీరేశమ్మ, ఐరన్‌బండ, గోనెగండ్ల

నా భర్త రామాంజినేయులు సొంత పొలం రెండెకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిరప, ఉల్లి పంటలు సాగు చేసేవారు. మూడేళ్లుగా భారీ వర్షాలు, తెగుళ్లతో దిగుబడి పడిపోయింది. గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడంతో రూ.10 లక్షల అప్పులు మిగిలాయి. అప్పులోళ్ల బాధ తాళలేక ఈ ఏడాది ఏప్రిల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి మాకు సాయం అందలేదు. దీంతో పదో తరగతి వరకు చదివిన నా కుమారుడు ప్రవీణ్ నాతో పాటే కూలి పనులకు వస్తున్నాడు. కుమార్తె అంజలి నర్సింగ్ చదువుతోంది. ఆమె చదువు ఖర్చులూ భరించలేని పరిస్థితి మాది. ప్రభుత్వం త్వరగా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

అడుగడుగునా ఆలస్యమే..

❏ రైతు ఆత్మహత్య చేసుకున్న 24 గంటల్లోపు వీఆర్వో మండల వ్యవసాయాధికారి (ఏవో), తహసీల్దారుకు సమాచారం చేరవేయాలి. ఆత్మహత్యకు కారణాలను ఏవోలు తెలుసుకొని ఉన్నతాధికారులకు ప్రాథమిక సమాచారం పంపాలి. ఇందుకు నెల రోజులు పడుతుండటం గమనార్హం.

❏ రైతు ఆత్మహత్యకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఆధారంగా చేసుకొని త్రీమెన్ కమిటీ (ఏవో, తహసీల్దారు, ఎస్సై) బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు సేకరించాలి. ఈ నివేదికను ఆర్డీవో లాగిన్‌కు పంపేందుకు ఒకటి, రెండు నెలలు పడుతోంది.

❏ త్రీమెన్ కమిటీ నివేదికను ఆర్డీవో, వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ, డీఎస్పీలు, జిల్లా వ్యవసాయాధికారి, జేసీ పరిశీలించి కలెక్టరు ఆమోదంతో ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు కనీసం ఆరు నెలల సమయం పడుతోంది. బాధిత కుటుంబానికి పరిహారం అందేసరికి ఏడాది దాటిపోతోంది.

ముందుకు కదలని నివేదికలు

❏ ఈ ఏడాది ఏప్రిల్‌లో వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదికల ప్రకారం.. కర్నూలు జిల్లాలో 42, నంద్యాల జిల్లాలో 25 మంది కలిపి 67 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడినట్లు లెక్కలు చెబుతున్నాయి.

❏ కర్నూలు జిల్లాలో 40, నంద్యాల జిల్లాలో 24 మంది చొప్పున 64 మంది రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన నివేదికలు ఇప్పటికే వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఆర్డీవోలు, తహసీల్దార్ల లాగిన్లలో కర్నూలులో 12, నంద్యాలలో 8 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవికాక ప్రాథమిక స్థాయిలో కర్నూలులో 10, నంద్యాలలో ఆరుగురు కలిపి మరో 16 మంది వరకు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ప్రయాణానికి పొగ

నంద్యాలలోని బొమ్మలసత్రం నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో ఎక్కడ పడితే అక్కడ చెత్తను తగలబెడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఊపిరి బిగపట్టి వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి.

- న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

పాఠం ప్రత్యక్ష వీక్షణం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లో పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని అనుసరించి పాఠాలు బోధించేందుకు సమగ్ర శిక్షా శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్రంలో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో 20 పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌ల ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ఆరంభించారు. ఇప్పటికే ట్యాబ్‌లు వచ్చాయి.. వాటిల్లో గణితం, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల్లోని కంటెంట్‌ను నిక్షిప్తం చేస్తున్నారు. ఈ విధానంలో కృత్రిమ మేధ విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేసి, దానికి అనుగుణంగా వీడియో పాఠాలు ప్రసారం చేస్తారు.

ట్యాబ్‌లో పాఠాలు వింటున్న విద్యార్థినులు

బడిలో పాల్ ల్యాబ్స్

2025-26 విద్యా సంవత్సరంలో తుగ్గలి మండలంలోని ఆర్ఎస్ పెండేకల్, చిప్పగిరి మండలం నేమకల్, కల్లూరు మండలం పర్ల, కర్నూలు రూరల్ పరిధిలో మిలిటరీ కాలనీ, వెల్దుర్తిలోని డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, నందికొట్కూరు మండలంలోని కొణిదెల, నంద్యాల మండలం ఎన్.కొత్తపల్లి, కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి, ప్యాపిలిలో హుస్సేనాపురం, బనగానపల్లిలోని ఇల్లూరు కొత్తపేట, పగిడ్యాలలోని ప్రాతకోట, రుద్రవరం తదితర ప్రభుత్వ పాఠశాలల్లో పాల్ ల్యాబ్ అమలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఏఐ ఆధారంగా బోధన

❍ ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పాల్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం పూర్తిగా స్వయం చాలిత అభ్యసన విధానం. ఒక్కో పాఠశాలలో 30 ట్యాబ్‌లు సమకూరుస్తారు. గణితం, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల్లోని కంటెంట్ ట్యాబ్‌లలో నిక్షిప్తం చేస్తారు. ఈ ప్రక్రియ అంతా ఏఐ ఆధారంగా పనిచేస్తుంది.

❍ ట్యాబ్‌లలో ఉంచిన సమాచారం మేరకు ఒక్కో విద్యార్థి అందులో ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చే క్రమంలో వారి సామర్థ్యాలు, స్థాయిని పరిగణనలోకి తీసుకుని ట్యాబ్‌లో నుంచి విద్యార్థులకు బోధన జరుగుతుంది. వారానికి రెండు గణితం తరగతులు, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టులకు ఒక్కో తరగతి వచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

అర ఎకరం రూ.55,080 లాభం

అర ఎకరం పొలంలో బీట్‌రూట్ సాగు చేసి 90 రోజుల్లో రూ.55,080 లాభం గడించారు ముడుమాలకు చెందిన రంగన్న. సెప్టెంబరు మొదటి వారంలో పొలంలో విత్తనాలు విత్తారు. అందుకు రూ.4,000 వేలు వెచ్చించారు. చీడపీడల నివారణకు మరో రూ.ఐదు వేలు ఖర్చు చేశారు. పంట పూర్తికాలం 90 రోజులు. గత వారం మొదటి కోత కోశారు. కర్నూలు మార్కెట్‌కు 26 సంచులు (ఒక్కోటి 55 కిలోలు) తరలించారు. 10 కిలోలు రూ.360 చొప్పున విక్రయించారు. కూలీలు, ఆటో ఖర్చు మొత్తం రూ.2,520 వేలు ఖర్చు అయ్యింది. రెండో కోతలో 20 సంచులు తీసుకెళ్లారు. మొత్తం ఖర్చులు రూ.35,000 పోగా రూ.55,080 ఆదాయం వచ్చింది. - న్యూస్‌టుడే, సి.బెళగల్

ఆకతాయిల వేధింపులా యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు

కళాశాలలు, బస్టాండులు ఇలా బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు, బాలికలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. వారి సామాజిక, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. దీన్ని అలుసుగా చేసుకొని ఆకతాయిలు మరింతగా రెచ్చిపోతున్నారు. విషయాన్ని గుర్తించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోక్సో ఈ-బాక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. హోం పేజీపై కనిపించే ఎర్రటి రంగు బటన్‌పై క్లిక్ చేయాలి. దుకాణం, క్రీడా ప్రాంగణం, రహదారి, పాఠశాల ట్యూషన్, బ్లాక్ మెయిల్, స్కూల్ బస్, వ్యాన్, కుటుంబ సభ్యులు, బంధువుల, ఇంటర్నెట్ వంటి చిత్రాలతో కూడిన ఐచ్ఛికాలు కన్పిస్తాయి. ఏ ప్రాంతంలో వేధింపులకు గురయ్యారో ఆ ఐచ్ఛికంపై క్లిక్ చేయాలి. పేరు, ఈ-మెయిల్, ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఘటన వివరాలు దిల్లీలోని ప్రత్యేక విభాగానికి వెళ్తాయి. వారు పరిశీలించి రాష్ట్ర, జిల్లాస్థాయిలో స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులను అప్రమత్తం చేస్తారు.

-న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : సివిల్స్ రాసే అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి జగ్గయ్య తెలిపారు. నంద్యాల జిల్లాకు చెందిన డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబరు 7వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి బీసీ భవన్, గొల్లపూడి, విజయవాడలో ప్రత్యేక స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. నకలు కాపీలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

విభిన్న విజేతలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : 'మాట' రాదని మదన పడలేదు.. 'అడుగు' పెట్టలేమని ఆవేదన చెందలేదు.. 'చూపు' లేదని ఇంట్లో ఉండలేదు.. వినలేమని కుంగిపోలేదు.. పుట్టుకతో కొందరు.. ప్రమాదవశాత్తు మరికొందరు దివ్యాంగులుగా మారారు. ఆత్మవిశ్వాసంతో అటు చదువుల్లో ఇటు క్రీడల్లో రాణిస్తున్నారు. తామెవరికీ తీసిపోమని మాకెవరూ సరిలేరని నిరూపిస్తున్నారు పలువురు విభిన్న ప్రతిభావంతులు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి.. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

గౌతమ్.. గెలుపులో అందనంత ఎత్తున

నంద్యాల జిల్లా రుద్రవరం మండల కేంద్రానికి చెందిన గౌతమ్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీకాం కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇతను పుట్టుకతోనే మరుగుజ్జు. ఈ లోపాన్ని చూసి ఇతరులు హేళన చేయడం ఇతనిలో కసి పెంచింది. ఇతని లాగే సమస్యను ఎదుర్కొంటున్న అన్న సాయి ప్రోత్సాహంలో గౌతమ్ క్రీడల బాట పట్టారు. బ్యాడ్మింటన్, షాట్‌పుట్ క్రీడల్లో శిక్షణ తీసుకుని విభిన్న ప్రతిభావంతుల పోటీల్లో పలు పతకాలు సాధించారు. 2023 ఫిబ్రవరి 1వ తేదీన ఉత్తర్ ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో కాంస్య పతకం అందుకున్నారు. 2025 ఫిబ్రవరిలో చెన్నైలో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో షాట్‌పుట్‌లో కాంస్యం అందుకున్నారు. ఈనెల 11వ తేదీన మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ అథ్లెటిక్స్ మీట్‌లో షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించారు. అథ్లెటిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్నారు గౌతమ్.

శ్రీనివాసులు.. పాదం మోపితే పతకమే

గడివేముల మండలం చిందుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆర్‌యూలో పీజీ చదువుతున్నారు. 2014లో ఇతనికి పాము కాటు వేయడంతో వైద్యులు కుడికాలి పాదం తొలగించారు. కుమారుడి పరిస్థితిని చూసి తల్లిదండ్రులు కుమిలిపోయేవారు. శ్రీనివాసులు మాత్రం ఏమాత్రం నిరాశకు గురవకుండా.. కృత్రిమ పాదం సాయంతో మైదానంలో అడుగుపెట్టారు. దివ్యాంగుల క్రీడల్లో విజయాలు సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ ఏడాది జనవరిలో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో స్వర్ణ పతకాలు అందుకున్నారు. అక్టోబరులో ఏలూరులో జరిగిన పారా ఆక్వాటిక్ పోటీల్లో 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం సాధించారు. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించారు.

అంధరికీ ఆదర్శం మల్లికార్జున

మద్దికెరకు చెందిన మల్లికార్జున కర్నూలు పార్కు రోడ్డులోని యూనియన్ బ్యాంకు క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పుట్టుకతో అంధుడైన ఇతను పట్టుదలతో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించారు. కుమారుడి ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు దగ్గరుండి మైదానానికి తీసుకెళ్లి.. అంధుల క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. వారి ప్రోత్సాహంతో క్రికెట్‌తో పాటు షాట్‌పుట్‌లోనూ రాణిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్‌లో కాంస్యం సాధించారు. ఈనెల 26వ తేదీన కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్‌లో స్వర్ణం గెలుపొందారు. జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడమే లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు మల్లికార్జున చెబుతున్నారు.

ప్రమాదాలకు నిచ్చెన

విద్యుత్తు శాఖ కార్మికులు క్షేత్రస్థాయిలో ప్రమాదకరంగా పనిచేస్తున్నారు. స్తంభాలు ఎక్కడానికి సరైన నిచ్చెనలు లేవు. దీంతో తమకు అందుబాటులో ఉన్న నిచ్చెనలను లారీలు, జీపుల పైభాగంలో పెట్టుకొని పైకెక్కి మరమ్మతులు చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో ఇద్దరు కార్మికులు ఇలా ఒక నిచ్చెనకు మరొక నిచ్చెనను ఆధారంగా పెట్టి. . తీగల ఎత్తులో వాటిని పట్టుకొని నిల్చుని మరమ్మతులు చేస్తున్నారు. నిచ్చెన జారితే కింద పడే ప్రమాదం ఉంది.

- న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

అదనపు గదుల్లో.. నత్త పోటీలు

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యాలయాల్లో(కేజీబీవీ) అదనపు గదుల నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థునుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. రెండేళ్ల నుంచి ఇంటర్మీడియట్ విద్యనూ బోధిస్తున్నారు. ఈక్రమంలో అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సమగ్రశిక్షా పర్యవేక్షణలో పీఎఫ్ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానంలో నిధులు ఖర్చు చేస్తున్నారు. పేరుకు ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు కనిపిస్తున్నా.. చేసేది మాత్రం స్థానిక నాయకుల అనుచరులే. నిధులు వచ్చినప్పుడే కొంత పనులు చేస్తూ.. మిగితా సమయంలో చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో పూర్తి కావాల్సిన పనులు వచ్చే ఏడాది నాటికీ పూర్తయ్యేట్లు కనిపించడం లేదు.

కస్తూర్బా	కర్నూలు	నంద్యాల
విద్యాలయాలు	17	22
నిధులు(రూ.కోట్లు)	4.46	6.32
ఖర్చు(రూ.కోట్లు)	2	1.5

రూ.10.78 కోట్ల కేటాయింపు

● స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, గుత్తేదారులు పనులు చేయకూడదు. కేవలం ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలోనే చేయాలి. ప్రిన్సిపాళ్లు మహిళలు కావడం, సివిల్ పనులపై అవగాహన లేకపోవడంతో స్థానికంగా ఉన్న నాయకులు తలదూర్చారు.

● ఇంజినీర్లను మధ్యవర్తులుగా ఉంచి ప్రిన్సిపాళ్లతో సంతకాలు చేయించి.. మిగితా పనులన్నింటినీ వారే చేస్తున్నారు. నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, డోన్, పాణ్యం, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు తదితర నియోజకవర్గాల్లో పనులన్నీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. కనీసం 60 శాతం కూడా పూర్తి కాలేదు.

మహానంది మండలం తిమ్మాపురంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో 250 మంది చదువుకొంటున్నారు. ఇక్కడ ఆరు అదనపు గదుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. గత కొన్నినెలలుగా పనులు జరగడం లేదు. ప్రయోగశాలలకు గదుల్లేక విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ

▸▸ మహానంది మండలం తిమ్మాపురంలో కొన్ని నెలలుగా పనులు జరగడం లేదు. నంద్యాల పట్టణంలోని మైనార్టీ కేజీబీవీలో ఒక నెల పని జరిగితే మరికొన్ని నెలల పాటు కదలడం లేదు. గడివేములలో ఫ్లోరింగ్ పనులు ఆగుతూ సాగుతున్నాయి. రుద్రవరం, మిడుతూరు, ఓర్వకల్లు, గూడూరు, మంత్రాలయం, పత్తికొండ ప్రాంతాల్లో పైకప్పు స్థాయిలో నిలిచిపోయాయి.

▸▸ ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పుడు డ్రా చేసుకొని ఆ మేర పనులు చేసి తర్వాత వదిలేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నాటికే పూర్తి కావాల్సినా పట్టించుకోవడం లేదు.

▸▸ నిర్మాణాల తీరుపై ఏఈలు సమగ్ర శిక్షా అధికారులతో సమన్వయం చేసుకోలేకపోతున్నారు. ప్రిన్సిపాళ్లే ముందుగా ఖర్చులు భరించి, తర్వాత ఎం.బుక్కులో నమోదు చేయాలంటూ ఇంజినీర్లు ఒత్తిడి చేస్తున్నారు.

▸▸ నాయకుల ప్రమేయం పరోక్షంగా ఉండటంతో పనుల వేగంపై ఒత్తిడి చేయలేకపోతున్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

పూర్తి వివరాలకు: కర్నూలు: 99899 97628, 80080 12489 నంద్యాల: 90007 66039 ఆదోని: 80087 09793.

(c) eenadu

ప్రధాన దారి.. దుమ్ము రేగి

బెంగళూరు నుంచి హైదరాబాదు వెళ్లే జాతీయ రహదారి నంబరు 44 అధ్వాన్నమైన నిర్వహణకు ఈ చిత్రం నిదర్శనం. దీన్ని చూస్తుంటే ఏదైనా పల్లెకు వెళ్లే మట్టి దారా.. అనిపిస్తుంది. వెల్దుర్తి వద్ద రైల్వేస్టేషన్ కూడలిలో రహదారి పొడవునా ఎర్రమట్టి పేరుకుని పోయింది. దీంతో వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి వెనకవచ్చే వాహనదారులకు దారి కనిపించకుండా చేస్తుంది. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారి శుభ్రం చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – ఈనాడు, కర్నూలు

రహదారి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణం బైపాస్ రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రహదారి, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. అమరావతిలోని సచివాలయంలో ఆయన రహదారి, భవనాల శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బనగానపల్లి బైపాస్ రహదారి పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బైపాస్ నిర్మాణం లక్ష్యంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే బైపాస్ నిర్మాణానికి భూముల కోల్పోయిన రైతులకు రెండు విడతలుగా రూ.5 కోట్లు పరిహారం చెల్లించినట్లు చెప్పారు. నంద్యాల జిల్లాలో దారులు గుంతల రహితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి, కర్నూలు ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

వసతి గృహాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్లు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం రైతుల నుంచి ధాన్యం సేకరణ, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సిటిజన్ సర్వే, సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో బాలుర, బాలికల వసతిగృహాలు, టీటీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో విద్యార్థుల ఆరోగ్యం పరిరక్షించాలన్నారు. ఇక నుంచి ప్రతి వసతి గృహాన్ని అధికారులు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ జావళి తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ, ఎస్పీ

శ్రీశైల దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి తాటికొండ శ్రీనివాసరావు కుమారుడి పెళ్లి వేడుక స్థానిక వాసవీ విహార్ ప్రాంగణంలో గురువారం జరిగింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణతోపాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, రాజకీయ ప్రముఖులు, పూర్వపు ఈవోలు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ధర్మకర్తలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

కబడ్డీ కూత.. గోల్స్ మోత

- జాతీయ స్థాయి పోటీలకు ఆదోని క్రీడాకారులు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఒకరు కబడ్డీ కూతపెడితే ప్రత్యర్థి క్రీడాకారులు నిలవడం కష్టం.. మరొకరు ఫుట్‌బాల్ బంతితో మైదానంలో దిగాడంటే గోల్ తన ఖాతాలో జమకావాల్సిందే. ఆదోనికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఆయా క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. వారి ప్రతిభ ఏంటో తెలుసుకుందామా..

ప్రత్యర్థి జట్టు షేక్

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన రైతు పీరాసాహెబ్, హుసేన్‌బీ దంపతుల కుమారుడు షేక్షావలి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి క్రీడలపై ఉన్న ఆసక్తిని గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారావు, రమేష్ విద్యార్థి షేక్షావలికి ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇస్తూ.. సాధన చేయిస్తున్నారు. ఫుట్‌బాల్ మైదానంలో డిఫెండర్‌గా బరిలో దిగితే ప్రత్యర్థులు గోల్ చేయకుండా.. గోల్ వైపు వెళ్లకుండా అడ్డుగోడలా నిలుస్తూ తమ జట్టు విజయానికి కృషి చేస్తున్నాడు. కర్నూలు నగరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ చాటాడు. నవంబరు 19 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు జిల్లా మదనపల్లిలోని గ్రీన్ వ్యాలీలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీల్లో తన ప్రత్యేకతను చాటాడు. డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉందని చెబుతున్నాడు షేక్షావలి.

విజయం.. దేవాధీనం

ఆదోని పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ సిద్ధలింగప్ప, భాగ్యమ్మ దంపతుల కుమారుడు చరణ్‌దేవ్ స్థానిక ఆర్ట్స్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కబడ్డీ ఆటపై ఆసక్తితో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. రెండేళ్లుగా కబడ్డీలో డిఫెండర్‌గా.. రైడర్‌గా రాణిస్తున్నాడు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ చాటాడు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. డిసెంబరులో పంజాబ్ రాష్ట్రం చండీఘడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాడు. జాతీయ స్థాయిలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నానంటున్నాడు క్రీడాకారుడు చరణ్‌దేవ్.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం

తిమ్మాపురం(మహానంది), న్యూస్‌టుడే: సమాజ వికాసానికి ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల ఇన్‌ఛార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని అంకాళ పరమేశ్వరీదేవి ఆలయం ఆవరణలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఉమామహేశ్వరీ పర్యవేక్షణలో వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గురువారం నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు కళాశాల జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థులతో పలురకాల సేవా కార్యక్రమాల కోసం తొలి రోజు జెండా విష్కరణ, ర్యాలీతో ప్రారంభించామన్నారు. గ్రామ ఉప సర్పంచి షేక్ రేష్మ, మాజీ సర్పంచి కోటయ్య, ఆదర్శ పాఠశాల ప్రధానాచార్యులు లక్ష్మణరావు, పశువైద్యులు డాక్టర్ కరుణాకర్, గ్రంథాలయాధికారి డీ.మధు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : రాష్ట్రం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని, కొందరు అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు ప్రజాప్రతినిధులు లెటర్ ఇవ్వాలన్నా, సిఫార్సులు చేయాలన్నా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోకపోతే తెలుగుదేశం పార్టీకి నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కొందరు చేసే అవినీతి కార్యక్రమాలు పార్టీ దృష్టికి వెళ్లడం లేదన్నారు. అవినీతికి పాల్పడేవారిని సీఎం నియంత్రించాలన్నారు.

అమ్మవారి సన్నిధిలో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

సులభంగా పని.. వేగంగా లక్ష్యం

బండిఆత్మకూరు మండలంలోని సంతజూటూరు గ్రామంలో సర్పంచి యలగల రామచంద్రుడు చెత్త సేకరణ విషయంలో వినూత్నంగా ఆలోచించారు. చెత్త సేకరించే ట్రాలీని ద్విచక్రవాహనానికి అమర్చారు. దీంతో చెత్త సేకరణ, తరలింపు వేగంగా, సులభతరంగా మారింది. రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలంటే సుమారు మూడు గంటల సమయం పడుతుందని, ట్రాలీ ద్విచక్ర వాహనం అమర్చిన తర్వాత గంటన్నరలోనే సేకరిస్తున్నట్లు సర్పంచి తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఇలాంటి ఆలోచన చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీడీవో గాయత్రి తెలిపారు. – న్యూస్‌టుడే, సంతజూటూరు(బండిఆత్మకూరు)

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

వేదికపై మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని డీఈవో జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. అహోబిలం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ 69వ అంతర్ జిల్లా అండర్-17 బాలబాలికల బేస్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న క్రీడా కోటాను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడల్లో 500 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు, పీఈటీలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విశ్వనాథ్, ఆళ్లగడ్డ ఎంఈవో తదితరులు పాల్గొన్నారు. ఈనెల 29 వరకు పోటీలు జరుగనున్నాయి.

సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా సురేశ్‌కుమార్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నంద్యాలకు చెందిన ఉప్పరి సురేశ్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడ సెంట్రల్ గొల్లపూడి బీసీ సంక్షేమ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం డిసెంబరు 5న

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం డిసెంబరు 5న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సమావేశానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. ఈ సందర్భంగా వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత పెంచాలని సూచించారు. పదో తరగతి సిలబస్ డిసెంబరు 5 నాటికి పూర్తవుతుందని, అక్కడి నుంచి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా వారికి ప్రత్యేకంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

పారదర్శక, సమగ్ర ఓటర్ల జాబితాకు చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో స్పష్టమైన, సక్రమమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి సమగ్ర చర్యలు చేపట్టామని కలెక్టర్ జి.రాజకుమారి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు వివరించారు. విజయవాడ చీఫ్ ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 సంబంధిత సన్నాహక పనులపై వివేక్ యాదవ్ వివరాలు సేకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో బీఎల్‌వో ఖాళీలు లేవని, ఎన్నికల ఖర్చుల నివేదికను కూడా సీఈవో కార్యాలయానికి పంపినట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

బుగ్గానిపల్లెలో స్థలాల పరిశీలన

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలోని ఎంఐజీ లేఅవుట్‌ను కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ గురువారం తనిఖీ చేశారు. గ్రామంలోని ఎంఐజీ లేఅవుట్‌లోని 225-2, 234-1ఏ, 234-2, 233-1 సర్వే నంబర్లలో మొత్తం 14-57 ఎకరాల భూమి ఉంది. ఈ లేఅవుట్‌ను భవిష్యత్‌లో అభివృద్ధి చేస్తే ఎలా ఉంటుందనే దానిపై పరిశీలించినట్లు సమాచారం.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ నూరుల్ ఖమర్

ఓంకారంలో జాయింట్ డైరెక్టరు పూజలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల పరిధిలోని ఓంకార పుణ్యక్షేత్రాన్ని రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టరు శ్రీనివాసులు దంపతులు దర్శించుకున్నారు. ఆయన గురువారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ఛైర్మన్ అల్లె చెన్నారెడ్డి, ఈవో నాగప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం వారు దంపతులిద్దరిని సన్మానించారు. ఆలయ విశేషాలను వివరించారు.

జేడీ శ్రీనివాసులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

గని గుంత.. కళ్లకు గంతలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- తవ్వేసి వదిలేస్తున్న యజమానులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

జిల్లాలో నాపరాతి గని గుంతలు ప్రమాదకరంగా మారాయి. గని గుంతలు ఎంతో మంది ప్రాణాలు బలిగొంటున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. నాపరాతి గనులు లీజులు పూర్తయిన తర్వాత పూడ్చాల్సిన యజమానులు విస్మరించడంతో గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. గనులు, భూగర్భ శాఖ అధికారులు పట్టించుకోక గాలి కొదిలేశారు. – న్యూస్‌టుడే,బనగానపల్లి

పలుకూరు సమీపంలో చెరువును తలపిస్తున్న నాపరాతి గని

చెరువుల్లా మారిపోయి

- ఉమ్మడి జిల్లాలో 1,150 హెక్టార్లలో నాపరాతి గనులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, డోన్, నందికొట్కూరు ప్రాంతాల్లో నాపరాతి గనులు ఉన్నాయి. సుమారు 500 మందికి పైగా గనుల లీజులు పొందిన యజమానులు ఉన్నారు. సుమారు వందకు పైగా గని గుంతలు ఉన్నట్లు అంచనా. ఏడాది పొడవునా నీరు నిల్వ ఉంటుంది.
- యజమానులు విచ్చలవిడిగా తవ్వకాలు సాగించి వదిలి వేయడం కొందరి పాలిట శాపంగా మారింది. ఒక్కో గని గుంత 50 నుంచి 70 అడుగుల లోతు ఉంటుంది. వాటి నిండా వర్షం నీరు చేరి చెరువుల్లా మారిపోయి ఉంటాయి. సమీపంలోని ప్రజలు, రైతులు నీటి కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

"గని గుంతల్లో ఎవరైనా పడి చనిపోతే ఆ బాధ్యత యజమానులే తీసుకోవాలని, గుంతలను గుర్తించి ఆయా యజమానులకు నోటీసులు జారీ చేస్తామని" గనుల శాఖ ఏడీ రాజగోపాల్ తెలిపారు.

పోతున్న ప్రాణాలు

గుంతల్లో పడి యువత, పనిచేసే కూలీల దగ్గరి నుంచి రైతులు, గ్రామాల సమీపంలో పనిచేసే కూలి మహిళలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కొందరు ఆవేశానికి గురై గని గుంతల్లో పడి ఆత్మహత్య చేసుకోవడం, ఈతకు వెళ్లిన యువత చనిపోవడం కనిపిస్తోంది. మరో వైపు నాపరాతి గనుల సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు అంటురోగాలు, దోమల బారిన పడుతున్నారు.

కొన్ని ప్రమాదాలు పరిశీలిస్తే..

- కొలిమిగుండ్ల మండలం బెలుం సమీపంలోని గతేడాది నాపరాతి గని గుంతలో పడి మహేంద్రరెడ్డి(22) అనే విద్యార్థి చనిపోయాడు.
- బందర్లపల్లె సమీపంలో స్నేహితులతో కలిసి గని గుంతలో ఈతకు వెళ్లి ఇటీవల ప్రవీణ్ (14) అనే విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు.
- నాలుగేళ్ల కిందట పలుకూరు సమీపంలో గణేశ్ నిమజ్జనం చేసే క్రమంలో ఇద్దరు యువకులు గని గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు.

నిబంధనలకు నీళ్లు

- గనుల లీజులు పొందే ముందు యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంది. ఆ మేరకు అగ్రిమెంటులో సంతకం చేస్తారు. నాపరాతిని తవ్విన తర్వాత వ్యర్థాలతో గుంతను పూడ్చి వేయాలి.
- గని గుంతల్లో నీరు చేరకుండా చూడాలి. ఒక వేళ నీరు చేరితే మోటార్ల ద్వారా బయటకు పంపి పూడ్చి వేయాలి.
- అవసరాన్ని బట్టి చుట్టూ కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. తిరిగి లీజులు పునరుద్ధరించాలంటే గతంలో చేసిన గనిని అధికారులు పరిశీలించి గుంతను పూడ్చితేనే తిరిగి లీజులు ఇవ్వాలి.
- స్థానికులను ఇబ్బంది పెట్టేలా పేలుడు పదార్థాలు వాడకూడదు.
- గుంతల వద్ద విద్యుత్తు తీగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

ప్యాపిలి, న్యూస్‌టుడే: అరటి గెల నాణ్యత పెరగడం కోసం ఫ్రూట్ కేర్ యాక్టివిటీ(గెలల యాజమాన్యం)ని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు రైతులకు సూచించారు. 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా ప్యాపిలి మండలంలోని గుడిపాడు, పీఆర్‌పల్లి గ్రామాలను గురువారం ఆయనతో పాటు ఉద్యానశాఖ అధికారిణి జి.కల్యాణిలు సందర్శించి అరటి తోటలను పరిశీలించారు. అరటి ధరల గురించి రైతులతో చర్చించారు. డిసెంబరులో అరటి ధరలు పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. అరటి రెండో పంట నాణ్యత, యాజమాన్య పద్ధతులపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అరటి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు తదితరులు

మహానందీశునికి ఇంటెలిజెన్స్ డీఎస్పీ పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనార్థమై వచ్చారు. వారికి ఆలయ ఏఈవో ఎర్రమల మధు, ప్రోటోకాల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, గోపూజలు చేసుకున్నారు. దర్శనానంతరం అలంకార మండపంలో పండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన పెద్ద సుబ్బరాయుడు(81) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఆరోగ్య సమస్యలు, అప్పుల బాధలు ఉండడంతో మృతుడు తన పొలంలోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. స్థానికులు గమనించి చూసేసరికి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి ఇద్దరు సంతానం ఉన్నారు.

వ్యాపారానికి వెళ్లిన రోజే మృత్యువాత

పేరాయిపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: కూలీ పనులకు వెళ్లే ఆమె కొత్తగా పల్లీల వ్యాపారానికి వెళ్లింది. మొదటి రోజు వ్యాపారం పూర్తి చేసుకొని ఇంటికి పయనమయ్యే క్రమంలో రహదారి ప్రమాదం ఆమెను బలితీసుకుంది. ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద 40వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాలపురం గ్రామానికి చెందిన అనుపూరు దూదేకుల పుల్లమ్మ(59) కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. చాలా కాలం క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఒక్కరే ఉంటున్నారు. కూలీ పనులు మానుకొని వ్యాపారం చేయాలని తలిచి పల్లీల విక్రయానికి వెళ్లారు. పని ముగించుకొని గ్రామానికి వెళ్లే సమయంలో రహదారి దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె మృతి చెందారు. ఘటనాస్థలికి చేరుకొని ఎస్సై వరప్రసాద్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వివాహిత బలవన్మరణం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రుద్రవరం మండలం చందలూరు గ్రామానికి చెందిన సింధూర(27) అనే వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుమార్తె అనారోగ్యంతో ఉండటంతో చికిత్స చేయించలేదని మనస్తాపంతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి పెద్ద సుబ్బయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై మహమ్మద్‌రఫి కేసు నమోదు చేశారు.

విశ్రాంత ఉద్యోగి దారుణ హత్య!

- మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో పుల్లయ్య(61) అనే విశ్రాంత ఉద్యోగిని దారుణంగా హత్య చేసి మద్దూరు వద్ద ఉన్న కుందూనదిలో పడేసినట్లు సమాచారం. పుల్లయ్య భార్య, ఇద్దరు కుమారులకు దూరంగా.. పట్టణంలోని శ్యామ్‌నగర్‌లో ఒంటరిగా ఉంటున్నారు. కుమారుడికి అప్పుడప్పుడు ఫోన్ చేసి మాట్లాడేవారు. కొన్ని రోజుల నుంచి ఫోన్ చేయకపోవడంతోపాటు అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. కుమారుడు నంద్యాలకు వచ్చి చూసేసరికి ఇంట్లో ఎవరూ లేరు. తండ్రి అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. వారు పుల్లయ్యను ఈనెల 14న హత్య చేసి మృతదేహాన్ని కుందూనదిలో వేసినట్లు సమాచారం. మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. గతంలో హత్యకేసుల్లో నిందితులే ఈ హత్య చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఎర్రమఠం గ్రామానికి చెందిన కొమ్ము సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయశేఖర్ తెలిపారు. మూడేళ్ల క్రితం ఎర్రమఠం గ్రామానికి చెందిన సునీతను నందికొట్కూరుకు చెందిన అఖిల్‌కు ఇచ్చి వివాహం చేశారు. భర్త అఖిల్, అత్తమామలు, ఆడపడుచు, భర్త స్నేహితుడు కలిసి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సునీత ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K ✆ 96402 58899, 96404 68899

కోయిలకుంట్లలో RV రెసిడెన్సీ ఎ/సి లాడ్జి నందు పనిచేయుటకు సిబ్బంది కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి: ✆ 99899 07171.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మాక్ అసెంబ్లీలో విద్యార్థిని పాల్గొనడం అభినందనీయం

మంత్రి నారా లోకేశ్‌తో విద్యార్థిని అమృత బోస్

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యం ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని అమృత బోస్ పాణ్యం ఎమ్మెల్యేగా మాక్ అసెంబ్లీలో పాల్గొనడం అభినందనీయమని ప్రిన్సిపల్ దినేష్‌బాబు అన్నారు. విద్యార్థినిని పాఠశాలలో గురువారం అభినందించారు. అమృత బోస్ విజయవాడలో పాల్గొనగా మంత్రులు అభినందించారని పేర్కొన్నారు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నందికొట్కూరు: నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు కె.రంగముని తెలిపారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులు అర్హులన్నారు. సైబర్ క్రైమ్, ఆటోమోటివ్ ఐటీఐ అప్లికేషన్ స్పెషలిస్ట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ ధ్రువ పత్రాలతో కళాశాలలోని స్కిల్‌హబ్‌లో సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 91548 30286 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ?: బర్మాశాల, గాంధీచౌక్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **ప్రసాద్**

?: టెక్కెలో కుక్కల బెడద అధికమైంది. **- మంజు**

✔: కాల్వలను శుభ్రం చేయిస్తాం. కుక్కలను పట్టిస్తాం.

- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నంద్యాల

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: రఘునాథ్ కేంద్రం నుంచి సంతమార్కెట్ మార్గంలో పైపులైను వాల్వు నుంచి నీరు అధికంగా లీకవుతుంది. **- షాకీర్**

✔: వాల్వునకు మరమ్మతులు చేయిస్తాం.

- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.

?: ఇస్లాంపేటలో పెద్ద కమేళాకు వెళ్లే మార్గంలో వీధి దీపం వెలగడం లేదు. **- ముర్తుజా, వ్యాపారి.**

✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం.

- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: గగ్గటూరు గ్రామంలో నీరు నిల్వ ఉంటుంది. దీంతోపాటు దోమల బెడద ఎక్కువైంది. **- రాజేష్**

✔: నీరు తరలించే ఏర్పాట్లతోపాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు ఈవోఆర్డీ, పాణ్యం**

మిడుతూరు, న్యూస్‌టుడే: ?: మిడుతూరులోని సహకార సంఘం ముందున్న మురుగు కాల్వ నుంచి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించగలరు. **- రమేశ్**

✔: కాల్వను శుభ్రం చేయిస్తాం. **- కల్యాన్ సింగ్, తాత్కాలిక కార్యదర్శి, మిడుతూరు.**

ప్రతిభా పోటీలతో మేధోశక్తి పెంపు

ఉపన్యాస పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ప్రతిభా పోటీలతో విద్యార్థుల్లో మేధో శక్తి పెరుగుతుందని శ్రీ నవనంది పాఠశాల కరస్పాండెంట్ బుడ్డల శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ నవనంది పాఠశాలలో గురువారం 'ఈనాడు' నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'విద్యార్థుల జీవితాల్లో చరవాణి ప్రభావం' అంశంపై స్పీచ్ నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కె.సదీపాజ్యోతి, ఎం. ఉమశ్రీ, డి.దక్షిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. గెలుపొందిన వారికి కరస్పాండెంట్ శ్రీధర్ బహుమతులను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్

పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చేస్తాం

◆ 'ఈనాడు' ఆధ్వర్యంలో 'వాక్ విత్ ఆఫీసర్'లో శానిటరీ ఇన్‌స్పెక్టర్

నంద్యాల రైతునగరం, పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చేస్తామని నంద్యాల పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ అన్నారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం నంద్యాలలోని నూనెపల్లె, గూడ్స్ షెడ్, బెన్నీ కాంప్లెక్స్ వద్ద 'వాక్ విత్ ఆఫీసర్' కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ పాల్గొన్నారు. స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు నూనెపల్లె రహదారి పక్కనున్న చెత్తను సిబ్బందితో వెంటనే తొలగించి, డోజర్‌తో ఆ ప్రాంతాన్ని చదును చేయించారు. పారిశుద్ధ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని లేదా పురమిత్ర యాప్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అధికారి దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలు

◆ నూనెపల్లెలో పాత ఆంధ్రాబ్యాంకు వద్ద చెత్తాచెదారం వేస్తున్నారు. దుర్వాసన, అపరిశుభ్రత నెలకొంది. **- సరస్వతి**

◆ నూనెపల్లెలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతోపాటు దోమలు ప్రబలుతున్నాయి. **- జయప్రకాష్**

◆ ఠాగూర్ పాఠశాల కూడలిలో చెత్తను తొలగించడం లేదు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు అధికంగా పడుతున్నాం. **- జయమ్మ**

◆ బెన్నీ కాంప్లెక్స్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వల్లో మురుగు పారడం లేదు. **- రాజశేఖర్**

◆ పట్టణంలోని జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట రహదారిపైనే చెత్త వేస్తున్నారు. సిబ్బంది సమయానికి తొలగించడం లేదు. **- సురేష్**

◆ గూడ్స్ షెడ్ ప్రాంతంలో రహదారులపై వ్యర్థాలు తొలగించడం లేదు. దోమలు ప్రబలుతున్నాయి. **- లక్ష్మీదేవి**

◆ నూనెపల్లె, సాయిబాబానగర్ ప్రాంతాల్లో కుక్కలు అధికంగా ఉన్నాయి. **- పవన్**

◆ గూడ్స్ షెడ్, ఎంఎస్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. **- సుభాన్**

నూనెపల్లెలో రహదారి పక్కనున్న వ్యర్థాలను తరలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ

ఉదయాన్నే చెత్తను తరలించడానికి చర్యలు

-లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పట్టణంలో చెత్తను ఉదయాన్నే తరలించడానికి చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది కొరత, వాహనాల మరమ్మతుల కారణంగా చెత్త తరలింపు ఆలస్యమవుతోంది. నూనెపల్లె, బెన్ని కాంప్లెక్స్‌లలో కాల్వలను శుభ్రం చేయించి దోమల మందు పిచికారీ చేయిస్తాం. ఖజానా కార్యాలయం, గూడ్స్ షెడ్ తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కన చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచుతాం. పట్టణ ప్రజలు ఇంటింటి చెత్త సేకరణ కోసం వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి ఉదయాన్నే చెత్త అందించి సహకరించాలి.

రహదారిపై గుంతల పూడ్చివేత

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం నూనెపల్లె వంతెన నుంచి విజయ పాల కేంద్రం వెళ్లే దారిపై గుంతలు ఏర్పడ్డాయి. వీటిని గమనించకుండా ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 11వ తేదీన 'ఈనాడు'లో 'గుంత.. గమనించకుంటే ప్రమాదమంట' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రహదారిపై గుంతలను చిప్స్ సిమెంటుతో పూడ్చివేసి సమస్య పరిష్కరించారు.

రోడ్లపై జంతువులు... ప్రజల బెంబేలు

మహానంది పుణ్యక్షేత్రంతోపాటు గ్రామపంచాయతీ పరిధిలోని నంద్యాల-మహానంది ప్రధాన రహదారిపై పలు రకాల జంతువులు సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అడవి నుంచి కర్రలు, ఇతర వస్తువులు తీసుకొచ్చుకోవడానికి గుర్రాలు, గాడిదలను ఉపయోగిస్తుంటారు. తర్వాత వాటిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో రహదారులపైకి వస్తున్నాయి. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయ్యన్ననగర్, శ్రీనగరం, అల్లినగరం, బుక్కాపురం, తమడపల్లె తదితర గ్రామాల్లోని వరి, అరటితోటల్లోకి వెళ్లి నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. – న్యూస్‌టుడే, మహానంది,

కంచె లేని నియంత్రిక.. ప్రయాణికుల ఆందోళన

మహానంది నుంచి నంద్యాల పట్టణానికి ఫరూక్‌నగర్ మీదుగా దగ్గరి దారి కావడంతో ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో విద్యుత్తు నియంత్రిక, దాని నుంచి ఫీజు క్యారియర్లు కిందికి ఉంటూ ప్రమాదకరంగా మారింది. చుట్టూ కంచె కూడా లేదు. దాని పక్క నుంచే ప్రజలు ప్రయాణం సాగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పశువులు సైతం విద్యుదాఘాతానికి గురయ్యే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

కదలని మురుగు.. రోడ్డుపై మడుగు

నంద్యాల పట్టణం సరస్వతీనగర్ నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారిలో రహదారిపై మురుగు పారుతోంది. నెల రోజులుగా రహదారిపై నిలుస్తున్నా పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టడం లేదని.. దుర్వాసన, దోమలతో రోగాల బారిన పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

శిథిలావస్థలో పశువైద్యశాల

నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే పైకప్పు నుంచి నీరు కారుతోంది. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పశువైద్యశాల సిబ్బంది, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి నూతన పశువైద్యశాల భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

దారిలో గుంత.. వాహనదారుల చింత

నంద్యాల శివారులో అయ్యలూరు మెట్ట నుంచి ఎస్‌వీఆర్ కళాశాలకు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది మంది ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయాల్లో గుంతలను గమనించకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. వాటిని పూడ్చి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

సంక్షిప్త సమాచారం

నంద్యాల రైతునగరం: తిరుపతిలో డిసెంబరు 12నుంచి 14 వరకు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

మహానంది: గోపవరం మెట్ట వద్ద ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు రహదారిని దాటుతుండగా కారు ఢీకొనడంతో భర్తకు గాయాలయ్యాయి. నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నంద్యాల పాతపట్టణం: మండలస్థాయి త్రోబాల్ పోటీలు ఈనెల 29న నూనెపల్లె ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు.

దీబగుంట్ల(గోస్పాడు): దీబగుంట్లకు చెందిన ఆర్.నాగ సిసింద్రారెడ్డి పీజీ జనరల్ మెడిసిన్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచాడు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నంద్యాల గాంధీచౌక్: బాలజీ కాంప్లెక్స్‌లో కేశవరెడ్డి పాఠశాలలో గురువారం జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సీపీవో సునందకుమారి అన్నారు. తమ్మరాజుపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

గడివేముల: బాలికలు శక్తియాప్‌ను కలిగి ఉండాలని శక్తిటీం సభ్యులు సూచించారు. గడిగరేవుల జిల్లాపరిషత్ పాఠశాలలో శక్తిటీం సభ్యులు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు.

మహానంది: గోపవరం గ్రామానికి చెందిన ఏజెన్సీ ఉద్యోగి కుమార్ రహదారి ప్రమాదంలో గాయపడటంతో నంద్యాల కేసీకెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ రామలింగారెడ్డి పరామర్శించారు.

నంద్యాల రైతునగరం: ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

వెలుగోడు, బండిఆత్మకూరు: ఈనెల 30, డిసెంబరు 1వ తేదీన తుపాను ప్రభావం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వెలుగోడు, బండిఆత్మకూరు వ్యవసాయాధికారులు స్వాతి, పవన్‌కుమార్ తెలిపారు.

కొత్తపల్లె(నంద్యాల గ్రామీణం): పంటకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు కన్నీరు పెడుతున్నా.. ప్రభుత్వానికి పట్టలేదని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మండలంలోని కొత్తపల్లె గ్రామంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు.

సున్నిపెంట సర్కిల్: సున్నిపెంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంలో గ్రామీణ భారత సాధికారత' అంశంపై 2026 జనవరిలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.పి.హుసేన్‌బాషా తెలిపారు.

నంద్యాల పట్టణం: జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించి, వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్తున్న ప్రేమంత్‌కుమార్‌ను గురువారం వైఎస్సార్.నగర్‌లోని కేజీబీవీలో ప్రిన్సిపాళ్లు సన్మానించారు.

అక్రమ వెంచర్ల క్రమబద్ధీకరణ ప్రారంభం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రమ వెంచర్ల క్రమబద్ధీకరణ ప్రారంభమైందని కమిషనరు రమేష్‌బాబు వెల్లడించారు. పురపాలక సంఘంలో అయిదు లేఅవుట్‌లలో 9.4 ఎకరాలకు గురువారం భూక్రమబద్ధీకరణ పథకం కింద అనుమతులు

పత్రాలు చూపుతున్న కమిషనరు రమేష్‌బాబు

మంజూరు చేశారు. కమిషనరు రమేష్‌బాబు మాట్లాడుతూ.. అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు వేయటం చట్టవిరుద్ధమని, కొనుగోలుదారులకు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. పట్టణంలో మిగిలిన లేఅవుట్‌ల యజమానులు అనుమతులు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారి రామకృష్ణ, వార్డు ప్లానింగు కార్యదర్శులు సుధీర్, సాధిక్, అశోక్ పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలకు రూ.6.23 కోట్లు మంజూరు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: పాణ్యం బనగానపల్లె రహదారిలోని రెండు వంతెనల పునర్నిర్మాణానికి రూ.6.23 కోట్లు మంజూరు చేస్తున్నట్లు గురువారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండు చిన్న వంతెనలు నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తూ రవాణా, రోడ్లు, భవనాల శాఖ జీవోను విడుదల చేసింది. పాణ్యం బనగానపల్లె రహదారిలో 12-6 కిలోమీటర్ల వద్ద ఉన్న వంతెనకు రూ.3.13 కోట్లు, 24-2, 3 కిలోమీటర్ల వద్ద ఉన్న వంతెనకు రూ.3.10 కోట్లను కోర్నెట్ క్యాపిటల్ నిధుల కింద మంజూరు చేసింది.

ఆయుర్వేదంతోనే ఆరోగ్యం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యంతోనే పూర్వీకులు ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్య భారతి క్షేత్ర సంఘటన కార్యదర్శి కుమారస్వామి, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ధన్వంతరీ జయంతి ఉత్సవాలను గురువారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకనంద ఆడిటోరియంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆయుర్వేదం పట్ల అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, నగర అధ్యక్షుడు డాక్టర్ బాల వెంకటకృష్ణ, కార్యదర్శి విజయభాస్కరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

గురునితిన్‌ను అభినందిస్తున్న షేక్షావలిరెడ్డి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో గురురాజ పాఠశాల విద్యార్థి గురునితిన్ రాయల్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ. క్రీడల్లో రాణించే విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

రోగులకు ఉచితంగా మందులు అందించండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధి అనుమానిత కేసులను గుర్తించి, వారికి అందాల్సిన ఉచిత మందులు, అవసరమైన ఎంసీఆర్ చెప్పులు, పింఛన్లు సకాలంలో అందేటట్లు చూడాలని కేంద్ర బృందం సభ్యుడు డా.కాంతారామ్ అన్నారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, బైర్లూటి, బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. నంద్యాలలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ సమక్షంలో సమావేశం నిర్వహించారు. బృందం సభ్యులు డా.రీతి తివారి, డా.మానుషి శర్మ, రాష్ట్ర లెప్రసి జాయింట్ డైరెక్టర్ డా.దేవసాగర్, అధికారులు డా.కాంతారావు, డా.తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు వదలాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో రైతులు పంటలు పండించుకోవడానికి సాగునీరు వదలాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. పట్టణంలోని ఏపీ రైతు సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో నీటి విడుదలపై ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టమైన ప్రకటన ఇవ్వకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు నీటిని విడుదలపై స్పష్టత ఇస్తే మెట్ట లేదా మాగాణిలో ఏ పంటలు వేసుకోవాలో రైతులకు అవకాశం ఉంటుందన్నారు. సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు, సురేష్, రామ్మోహన్, వీరన్న పాల్గొన్నారు.

సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొక్కెరంచలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. కొత్తపల్లి మండలంలోని కొక్కెరంచ గ్రామంలో గురువారం రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాలపై ఆందోళన చెందవద్దని, త్వరలోనే శుభవార్త చెబుతామన్నారు. కొత్తపల్లి మండల తెదేపా కన్వీనర్ లింగస్వామి గౌడ్, మండల నాయకులు నారపురెడ్డి, ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరి తదితరులు పాల్గొన్నారు.

☛ కొత్తపల్లి కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం తనిఖీ చేశారు. దస్త్రాలు, స్టోర్ గది, భోజనశాలను, పరిశీలించారు. దస్త్రాలు సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రుచి, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వంగాల కృష్ణారెడ్డి, తెదేపా మండలాధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి అన్నారు. బండిఆత్మకూరులో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పంచసూత్రాల గురించి రైతులకు వివరించారు. అన్నదాతల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారని వివరించారు. తెదేపా నాయకులు బైరెడ్డి మధుసుదన్‌రెడ్డి, రేగటి రాజశేఖర్‌రెడ్డి, నర్ల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరులో.. తెదేపా నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డీఆర్‌కే వెంకటరమణమ్మ, సీనియర్ శాస్త్రవేత్త మల్లేశ్వరరెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు హేమలత అన్నారు. బాపణంతాపురం, కరివేన, ముష్టేపల్లి, సిద్ధేపల్లి గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎరువులు, పురుగు, తెగుళ్ల మందుల వాడకం తగ్గించాలన్నారు. అంతర పంటల మార్పిడి పాటించాలన్నారు. భూమిని 365 రోజులు పంటలతో కప్పి ఉంచి నేలలోని సూక్ష్మజీవులను పెంపొందించాలని తెలిపారు.

ముద్ర పడదు.. ముద్ద దిగదు

☛ రేషన్ బియ్యం అందక పేద ప్రజల ఇబ్బందులు

పాణ్యం(గడివేముల), న్యూస్‌టుడే : విధి వక్రీకరించింది. వ్యాధి కాటేసింది. ఫలితంగా ఆరోగ్యంపై ప్రభావం చూపింది. కుష్ఠు వ్యాధి సోకడంతో ఎవరూ ఆదరించడం లేదు. కనీసం ప్రభుత్వమిచ్చే బియ్యమైనా అందుతుందనుకుంటే అది సైతం దూరమైంది. తమను ఆదుకోవాలని.. సమస్యను పరిష్కరించాలని బాధితులు విన్నవిస్తున్నారు.

కుష్ఠు వ్యాధి బారిన పడటంతో..

గని గ్రామంలో కుష్ఠు వ్యాధితో బాధపడుతున్నవారికి బియ్యం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన మునెమ్మ, రాబిన్‌బీ, షేకున్నిసాతో పాటు మరో ఇద్దరు బాధితులున్నారు. వ్యాధి సోకిన నేపథ్యంలో వారి వేలిముద్రలు పడడం లేదు. నిత్యావసర సరకులు తీసుకోవాలంటే తప్పనిసరిగా గ్రామ రెవెన్యూ అధికారి వేలిముద్రలు వేయాల్సి ఉంది. వారు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడు నెలలుగా బియ్యం అందకపోవడంతో అల్లాడుతున్నారు. ముందే నిరుపేదలు.. దీనికితోడు ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం అందడం లేదు. అధికారుల చుట్టూ పలుమార్లు ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేకపోతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు తిరగ్గా ఒక నెల బియ్యం మాత్రం ఇచ్చారని.. తర్వాత ఇవ్వడం లేదని బాధితులు పేర్కొంటున్నారు.

ఏడు నెలలుగా ఇవ్వడం లేదు

-మునెమ్మ, బాధితురాలు

ప్రభుత్వం అందించే రేషన్ బియ్యంతోనే అన్నం చేసుకొని తింటున్నాం.. బియ్యం తీసుకోవాలంటే వేలిముద్ర వేయాలి. కానీ, కుష్ఠు వ్యాధి కారణంగా వేలిముద్ర పడడం లేదు. అధికారులు వచ్చి వేలిముద్ర వేయాల్సి ఉన్నా.. వారు రావడం లేదు. ఏడు నెలలుగా బియ్యం అందక అవస్థలు పడుతున్నాం. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదు. వరుసగా కొన్ని నెలలు బియ్యం తీసుకోకపోతే రేషన్ కార్డు రద్దవుతుందని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- వెంకటరమణ, తహసీల్దారు

గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిశీలిస్తాం. వేలిముద్రలు పడని వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వీరికి బియ్యం అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. ప్రతినెలా గ్రామ వీఆర్‌ఏ వేలిముద్రలు వేసేలా చర్యలు తీసుకుంటాం.

'ప్రశ్నించినందుకే అసత్య ఆరోపణలు'

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో బిల్డర్ పబ్బతి వేణు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించినందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ అన్నారు.

సాక్ష్యాలు ఉన్నాయని చూపుతున్న రంగనాయుడు

పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ తాళ్లపల్లి వీరయ్యకు సంబంధించిన ఆస్తుల వివాదం కోర్టులో నడుస్తుందన్నారు. స్థలంలో నిర్మాణాలు చేపట్టకుండా కోర్టు స్టేటస్ కో ఇచ్చిందన్నారు. అయినా, బినామీలతో భవన నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపించారు. త్వరలో బాధితులతో కలిసి భవన నిర్మాణం వద్ద ఆందోళన చేస్తామన్నారు. నాయకులు సుంకయ్య, బి.శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, సోమన్న, లక్ష్మీదేవీ, సుశీలమ్మ పాల్గొన్నారు.

పొలంలో పంట కొయ్యలు కాల్చరాదు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: రైతులు పంటకోత అనంతరం పంటకొయ్యలను, వ్యర్థాలను తగలబెట్టి.. భూసారం, పర్యావరణానికి హాని కలిగించవద్దని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పార్నపల్లె గ్రామంలో గురువారం పంటకోత అనంతరం రైతులు కొయ్యలను తగలబెట్టడాన్ని గుర్తించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..పొలాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడంతో భూమిలోని సేంద్రియ కర్బనం, తగ్గిపోయి, నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయన్నారు. నేల స్వాభావిక లక్షణాలు మారిపోయి, భూమిలో తేమను నిలుపుకొనే శక్తి తగ్గి ఆమ్ల గుణం పెరుగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని అవగాహన కల్పించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు పాణ్యం విద్యార్థులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి కరాటే పోటీలకు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాములునాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పాఠశాలలో గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈ నెల 25వ తేదీన రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వెయిట్ క్యాటగిరీ 24 విభాగంలో సుబ్బమ్మ అనే విద్యార్థిని గోల్డ్‌మెడల్, 20 విభాగంలో సోహెల్‌బాషా బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, మునిశేఖర్, తిమ్మరుసు, మునీంద్ర, పవన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఉపన్యసించి.. ప్రశంసలు పొంది

పోటీలో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

విజేతలతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషి అవసరమని ప్రధానోపాధ్యాయురాలు ఎస్.మైమున్నీసాబేగం పేర్కొన్నారు. ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో పదో తరగతి విద్యార్థులు ఎస్.అల్మాస్ హఫియా, కె.ఐశ్వర్య, టి.తన్వితలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎంఈవో రఘునాయక్, హెచ్‌ఎం మైమున్నీసా బేగం, ఉపాధ్యాయులు సుచరిత, రాజేశ్వరి, నర్సమ్మ బహుమతులను అందజేశారు.

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

పోటీలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

బేతంచెర్ల, న్యూస్‌టుడే: వక్తృత్వ పోటీలతో విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ వికాసం చెందుతుందని జడ్పీ ప్రధానోపాధ్యాయులు యు.హరికృష్ణ పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ధరణి టౌన్‌షిప్‌లోని జడ్పీ మెయిన్ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వి.శివలక్ష్మి (పదో తరగతి), ఎస్.శ్రావణి (తొమ్మిదో తరగతి), జి.టి.అనురాధ (ఎనిమిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ ఉపయుక్తం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు దేశసేవకులుగా మారేందుకు, క్రమశిక్షణకు ఉపయోగపడుతుందని ఎన్‌సీసీ సుబేదార్ అలోక్‌కుమార్ అన్నారు. గురువారం ప్రజ్ఞ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు విద్యార్థులకు శారీరక, దృఢత్వ, మైదాన పరీక్షలు నిర్వహించి 31మంది అర్హులను ఎంపిక చేశారు.

ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో అధికారులు

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.సుజాత అన్నారు. డిసెంబరు 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి వ్యాప్తి, నియంత్రణపై సమాచారం ప్రతి ఒక్కరికీ చేరాలన్నారు. కార్యక్రమంలో చైతన్య రూరల్ డెవెలప్‌మెంట్ అధ్యక్షుడు వర్ధనాచారి పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. వసతులు శూన్యం

■ డోన్ మార్కెట్ యార్డులో సౌకర్యాలు కరవు

డోన్, న్యూస్‌టుడే: డోన్ పట్టణ శివారులో పదెకరాలకు పైగా స్థలంలో వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కోసం ఓపెన్ గోదాములతో పాటు ఆరుబయట ఆరబెట్టుకునేందుకు గోదాములు నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా అక్కడ మాత్రం గోదాములు నిరుపయోగంగానే ఉన్నాయి. పేరుకే మార్కెట్ అయినా పశువుల క్రయవిక్రయాలు జరిగే సంతకు మాత్రమే ఉపయోగపడుతోంది. ఉన్న అరకొర వసతుల్లోనే తూతూమంత్రంగా ఆదాయమే ఆర్జనగా మార్కెట్‌ను నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కేవలం పశువుల సంత మాత్రమే..

★ డోన్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోకి డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలు వస్తాయి. ఈ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరిగితే వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి మండలాల నుంచి రైతులు అమ్మకాల కోసం వచ్చే అవకాశం ఉంటుంది. దీని పరిధిలోకి 135 గ్రామాలకు పైగా వస్తాయి. కొన్నేళ్లుగా ఇక్కడ పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మాత్రం జరగటంలేదు.

★ దీంతో రైతులు వ్యయప్రయాసలు పడి కర్నూలుతో పాటు ఇతర మార్కెట్లకు వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్కెట్‌లో కేవలం గురు, శనివారాల్లో పశువుల సంత మాత్రమే నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా మార్కెట్ ఆదాయం రూ.కోటికి పైగానే వస్తుంది. ఈ ఏడాది రూ.1.45 కోట్ల ఆదాయ లక్ష్యంగా విధించారు. ఇప్పటికే సగం ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వృథాగా ఉల్లి గోదాము

★ మార్కెట్‌లో ఓపెన్‌షెడ్డు గోదాము ఇసుక నిల్వ కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు కూలిపోయింది. రెండేళ్లు అవుతున్నా దాని మరమ్మతులు చేయించకపోవటం విడ్డూరం.

★ శీతలీకరణ గోదాముకు సంబంధించి ఓ వైపు కూలిపోయింది. అయినా దాన్ని పట్టించుకోవటం లేదు. దీన్ని అందుబాటులోకి తెస్తే అరటితో పాటు ఇతర పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

మార్కెట్ యార్డులో కూలిపోయిన షెడ్డు

★ మార్కెట్‌లో రూ.కోటి వరకు వెచ్చించి ఏర్పాటు చేసిన ఉల్లి గోదాములు నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మార్కెట్‌లో గురు, శనివారాల్లో పశువుల సంత నిర్వహించేటపుడు వేలాదిగా రైతులు తరలివస్తారు. ఇలాంటి సమయంలో తాగునీరు కష్టతరంగానే మారుతోంది. మరుగుదొడ్ల వసతులు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

★ పశువుల సంత నిర్వహించే సమయంలో కొందరు దళారులే రైతులను మోసం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడి సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తూ మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల వద్ద చెత్తపోగవుతోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **-మహబూబ్‌బాషా, పాతమసీదు వీధి.**

✔: చెత్తను రోజూ తరలించేలా చర్యలు తీసుకుంటాం. **-బాలస్వామి, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, ఆళ్లగడ్డ పురపాలిక.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: ఇసుకపల్లె కొట్టాలపల్లె ప్రధాన రహదారిపై వీధిదీపాలు వెలగడం లేదు. **- కాశయ్య.**

✔: వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- రాఘువేంద్ర, పంచాయతీ కార్యదర్శి, చెన్నూరు.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల వద్ద రహదారి పక్కన తాగునీటి పైపు పగిలి నీరు వృథాగా పారుతోంది. **- స్థానికులు.**

✔: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. **-మధుతేజరెడ్డి, ఏఈ.**

?: పట్టణంలోని నీళ్లట్యాంకు లైనులో వీధి లైటు వెలగడం లేదు. **- కాలనీ వాసులు.**

✔: విద్యుత్తు సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. **- మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: మీర్జాపురం గ్రామంలోని బీసీ కాలనీలో చాలా చోట్ల వీధి దీపాలు వెలగటంలేదు. **- కాలనీ వాసులు.**

✔: దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. **- మురళీకృష్ణగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో.**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని కర్రా సుబ్బారెడ్డి కాలనీలో సీసీ రహదారి దెబ్బతింది. **- రాముడు, స్థానికుడు.**

✔: త్వరలో చర్యలు చేపడతాం. **-ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక

వేదికపై సమావేశమైన పూర్వ విద్యార్థులు

హుస్సేనాపురం(ప్యాపిలి), న్యూస్‌టుడే: మండలంలోని హుస్సేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు అన్వర్‌బాషా, డోన్ ఎంఈవో ప్రభాకర్, పద్మావతి, సర్వజ్ఞమూర్తి, దివాకర్, గోపాల్, మల్లేశ్‌లను ఘనంగా సత్కరించారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

సమావేశంలో మాట్లాడుతున్న శంషాద్‌బేగం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం పేర్కొన్నారు. గురువారం ఐసీడీఎస్ సమావేశ భవనంలో డోన్ ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సంరక్షణ అధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షలు ఉంటాయన్నారు.

అటకెక్కిన ఆరోగ్య సేవలు

ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలో పడకండ్లలోని పట్టణ ఆరోగ్యం కేంద్రంలో సమస్యలు నెలకొన్నాయి. రెండేళ్ల కిందట ఇక్కడ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. రెండు గదులున్న అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. నాలుగు నెలల నుంచి వైద్యుడే లేడు. పరికరాలను అటకెక్కించేశారు. ఎవరైనా రోగులు వస్తే ఫార్మసిస్టే తనకు తెలిసిన మందులు ఇచ్చి పంపించేస్తున్నారు. కేంద్రంలో ఇద్దరే సిబ్బంది ఉన్నారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ**

గుంత చిన్నదే.. ప్రమాదాలే పెద్దవి

బేతంచెర్ల సమీపంలో నంద్యాల వెళ్లే రహదారిపై ఈ గుంత చిన్నగా ఉన్నా.. అక్కడ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు మాత్రం ఎక్కువగా ఉన్నాయి. వాహనదారులు దగ్గరకు వెళ్లేంతవరకు గుంత కనిపించదు. అకస్మాత్తుగా వేగం నియంత్రించుకోలేక అలాగే వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి గుంతలు బేతంచెర్ల నుంచి సిమెంట్‌నగర్ వరకు, సిమెంట్‌నగర్ నుంచి తమ్మరాజుపల్లె వరకు దర్శనమిస్తున్నాయి. గత నెలలో ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశాత్తు విభాగినిని ఢీకొని మృతిచెందారు. **– న్యూస్‌టుడే, బేతంచెర్ల**

అధిక లోడు.. ప్రమాదం చూడు

డోన్ పట్టణం ఉపరితల వంతెనపై నిత్యం వాహనాలు అధిక లోడుతో వెళ్తున్నాయి. అధిక భారంతో సామగ్రిని వేసుకుని వెళ్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ ఉండిపోతున్నారే గానీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అత్యాశతో అధికలోడు వేసుకుని వెళ్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే వాహనదారులు ఇష్టారాజ్యంగా సామగ్రిని వేసుకుని వెళ్తున్నారు. **– న్యూస్‌టుడే, డోన్ పట్టణం**

ధాన్యం ఆరబోతకు పడిగాపులు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది కోటకందుకూరు గ్రామ రైతు కోటమీది చిన్న హుశేన్. మొక్కజొన్న పంట కోసేందుకు సిద్ధంగా ఉన్నారు. కోత కోసిన వెంటనే గింజలు ఆరేసేందుకు స్థలం కావాలి. స్థలాల కొరత ఉండటంతో సర్వీస్ రోడ్డుకు చేరుకున్నారు. స్థలం దొరకడంతో అందులో ఎవరూ వేయకుండా రెండు రోజులుగా కాపలా కూర్చున్నారు. దీన్ని బట్టి చూస్తే స్థలాల కోసం రైతులు ఎంతలా ఇబ్బందులు పడుతున్నారో అర్థమవుతోంది. **– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం**

సంక్షిప్త సమాచారం

వెంకటాపురం (శిరివెళ్ల), న్యూస్‌టుడే: మహిళలకు శక్తియాప్ రక్షణలాంటిదని ఎస్సై చిన్న పీరయ్యయాదవ్ పేర్కొన్నారు. సిబ్బందితో కలిసి గురువారం శక్తియాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని గ్రామాల్లోని వంట ఏజెన్సీలు విధిగా అమలు చేయాలని ఎంఈవో నాగార్జునరెడ్డి పేర్కొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసర పిల్లలకు ఉపకరణాల అర్హులను ఎంపిక చేసే కార్యక్రమం ఈ నెల 28న జరుగుతుందని ఎంఈవో శోభావివేకవతి అన్నారు. వైపీపీఎం ఉన్నత పాఠశాలలో జరిగే శిబిరానికి వచ్చే వారు ధ్రువపత్రాలు తీసుకుని రావాలని ఎంఈవో అన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: మాయలూరు గ్రామానికి శివ ట్రస్టు సభ్యులు రూ.35 వేలు విలువచేసే ఐదు సీసీ కెమెరాలను సమకూర్చినట్లు నందీశ్వరరెడ్డి తెలిపారు.

ఆర్.పాంపల్లె(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆట పాటల ద్వారా మానసిక వికాసం సాధ్యమని ప్రకృతి పీఠం వ్యవస్థాపకుడు పల్లె నరసింహరెడ్డి అన్నారు. ఆర్.పాంపల్లెలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.

డోన్, న్యూస్‌టుడే: ఎద్దుపెంట గ్రామంలోని సచివాలయ తలుపులు తెరిచి ఎవరూ హాజరు కాకపోవటంపై సీపీఐ నాయకులు పులిశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారని ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బనగానపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పారిశుద్ధ్య పనులను డీపీవో పార్వతిబాయి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వీధుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి తగిన సూచనలు చేశారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి పట్టణానికి చెందిన మట్కా బీటర్ బషీర్‌ని అరెస్టు చేసినట్లు ఎస్సై మధుసూదన్ గురువారం తెలిపారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: యర్రగుడి గ్రామంలో ఈనెల 11న వాహనంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో నిందితుడైన నిమ్మకాయల శశితేజను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ రమేష్‌బాబు చెప్పారు.

అవుకు, న్యూస్‌టుడే: మహిళల ప్రయోజనాలకు ఉద్దేశించిన ఈ-నారీ యాప్‌పై స్వయం సహాయక సంఘాల సభ్యులకు గురువారం అవగాహన కల్పించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని ఎల్ఎం కాంపౌండ్ కాలనీలో కుక్కల దాడిలో ఓ వ్యక్తి గురువారం గాయాలపాలయ్యాడు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బనగానపల్లి ఏరియా ఆసుపత్రి వైద్యులు డా.విజయలక్ష్మి పేర్కొన్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి పొందే సంక్షేమ పథకాలకు, ఇతర సేవల కోసం ప్రతి ఒక్కరూ సమీపంలోని సచివాలయంలో ఈకేవైసీ తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మికం

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పారాయణం గొప్పదనాన్ని వివరిస్తున్న స్వామీజీ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రకాశం జిల్లా సిద్ధజ్ఞాన ఆశ్రమం, శుద్ధ చైతన్యానంద గిరి స్వామీజీ పేర్కొన్నారు. పట్టణంలోని పూదోట ఆశ్రమంలో గీతా జయంతిని పురస్కరించుకొని కొనసాగుతున్న సామూహిక భగవద్గీత పారాయణంలో ఆయన పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.

గీతా సారం.. కర్తవ్య సాధనం

సంజామల, న్యూస్‌టుడే: భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించి, అందులోని ధర్మాన్ని అవగాహన చేసుకోవాలని పేరుసోముల విష్ణుకంఠి క్షేత్రం కంబగిరిస్వామి దేవాలయం ఉపాసకులు రామ్మోహన్‌స్వామి అన్నారు. స్థానిక వనం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రామ్మోహన్‌స్వామి మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతవైపు యువత పయనించాలన్నారు.

మాట్లాడుతున్న రామ్మోహన్‌స్వామి

పేరుసోముల (సంజామల), న్యూస్‌టుడే: పేరుసోముల ఆర్యవైశ్య వైకుంఠధామంలో డా.నరసింహమూర్తి ఆధ్వర్యంలో శివుడి విగ్రహాన్ని గురువారం ఏర్పాటు చేశారు. అర్చకులు మోహన్‌స్వామి, విరూపాక్షిశాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహానికి అభిషేకాలు, పూజలు భక్తులు నిర్వహించి ప్రతిష్ఠించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

డోన్, న్యూస్‌టుడే: స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు దాతలు అన్నదానం చేశారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలో ఏకశిలపదునెట్టాంబడి అయ్యప్ప ఆలయ ఆవరణలో సాయిమందిరంలో గురువారం ప్రత్యేక హారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

ఆర్.పాంపల్లె (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ఆర్.పాంపల్లె గ్రామంలో దాతలు, గ్రామస్థులు అందించిన రూ.15 లక్షల విరాళంతో నిర్మించిన దత్తాత్రేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. అర్చకులు రంగయ్య, నరసింహ ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దత్తాత్రేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

మద్దూరు(చాగలమర్రి), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలియజేశారు. మద్దూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు, విద్యా సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోంచేశారు. కార్యక్రమంలో ఎంఈవో నయామతుల్లా, ప్రధానోపాధ్యాయులు మహబూబ్‌బాషా, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పలువురు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు. గురువారం గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి రైతులకు అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి తెలియజేశారు. అనంతరం రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖల ద్వారా అందిస్తున్న పథకాలు, రాయితీలు వివరించారు. చంద్రపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు. **–న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, ప్యాపిలి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, డోన్.**

ప్యాపిలి: చంద్రపల్లిలో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న వై.నాగేశ్వరరావుయాదవ్

సత్వర సేవలు అందించేందుకు కృషి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా బి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల రూరల్ సెక్షన్‌లో ఏడీఈ పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

శ్రీనివాసులును సన్మానిస్తున్న సిబ్బంది

ఫిర్యాదు చేసినా.. స్పందన కరవు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలో ఉన్న తన స్థలాన్ని వైకాపా నాయకుల అండదండలతో కొందరు ఆక్రమించారని న్యాయం చేయాలని కోరుతూ 15 రోజుల కిందట అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చినా స్పందన లేదని మేకల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని తన భార్య పేరున 25-6-2012లో రెండు సెంట్ల స్థలం ఇచ్చారన్నారు. అప్పటి వైకాపా ప్రజాప్రతినిధుల అండదండలతో స్థలాన్ని ఆక్రమించుకొన్నారన్నారు. స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని వాపోయారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మ సుబ్బారావు, అతని కుమారుడు ఏకాంబరం పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కర్నూలు వైపు వెళ్తున్న కారు వెనుకవైపు నుంచి వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఓబీసీ జనగణన చేపట్టాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

డోన్ పట్టణం, డోన్, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఓబీసీ కుల ఆధారిత జన గణన చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణసాయి ఆధ్వర్యంలో గురువారం వడ్డెర సంఘం కార్యాలయంలో ఓబీసీ జనగణన అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కర్నూలులో డిసెంబరు 14న జరిగే ఓబీసీ సభలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు డిసెంబరు 2న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటరమణారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఇల్లూరుకొత్తపేట(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. హ్యాండ్‌బాల్, హాకీ పోటీల్లో యశస్విని, సమీరాబాను ప్రతిభ చూపారన్నారు.

ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఉపకరణాల కోసం నిర్ధారణ పరీక్షలు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉపకరణాల కోసం నిర్ధారణ పరీక్షలు సమగ్ర శిక్షా, సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో స్వరూప మాట్లాడుతూ దివ్యాంగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముస్లింలలో రాజకీయ చైతన్యం రావాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ముస్లింలలో రాజకీయ చైతన్యం రావాలని జిల్లా ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు సుభాన్ అన్నారు. గురువారం షాదీఖానాలో జిల్లా ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముస్లిం సంఘాల నాయకులు, మేధావులతో సమావేశం జరిగింది. జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ రాజకీయాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ డిసెంబరు 1న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతాన్నామన్నారు.

అధికారులపై విచారణకు రంగం సిద్ధం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన కమిషనర్లు కృష్ణమూర్తి, రమేష్ బాబు, టీఎస్ రాజు ఎబినేజర్, ఇంజినీరింగ్ అధికారులు వేణుగోపాల్, రామమూర్తి, రాజూనాయక్, సురేంద్రనాథ్, శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శబరీష్, ప్రహ్లాద్, పురుషోత్తం, ఇంజినీర్ అప్రెంటిస్‌లు లక్ష్మీసువర్ణ, ఎంఎస్ రూపేష్‌కుమార్‌లు మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.సతీష్‌చంద్ర విచారణాధికారిగా నియమిస్తూ గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

భవనాలు శిథిలం.. సేవలకు కష్టం

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బ్రిటిష్ కాలం నాటి భవనాలు నేటికీ కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో విధులు నిర్వహించలేక అద్దె భవనాల్లో, వేరే కార్యాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది భయాందోళన మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ భవనాలకు నిధులు మంజూరైనా స్థల సమస్యతో ఇంకా ప్రారంభానికి నోచుకోని పరిస్థితి నెలకొంది. ఆళ్లగడ్డ, డోన్, బనగానపల్లి నియోజకవర్గాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలపై కథనం.

చాగలమర్రిలో దెబ్బతిన్న ఎమ్మార్వో భవనం

పెచ్చులూడి ప్రమాదకరంగా..

★ చాగలమర్రి పట్టణంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ భవనం పైభాగం పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది.

★ చాగలమర్రి మండలంలోని మద్దూరు గ్రామంలో పశువైద్యశాల గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

★ చాగలమర్రి పట్టణంలో ఏళ్ల కిందట నిర్మించిన ఎమ్మార్వో భవనం వర్షానికి నీరు కార్యాలయంలోకి వస్తోంది. నూతన భవనం మంజూరైనా స్థల సేకరణ ఇంకా జరగలేదు. తహసీల్దారు భవనం లేకపోవడంతో నూతన భవనం నిర్మాణంలో ఉంది.

అద్దె భవనంలో కొనసాగింపు

★ కోవెలకుంట్ల మండల కేంద్రంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటిష్ కాలం నాటి భవనం కావడంతో పూర్తిగా వర్షం వస్తే కారుతోంది.

★ శిరివెళ్ల మండలంలో గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతుంది.

★ ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో సబ్‌ట్రెజరీ(ఉపఖజానా) కార్యాలయంలో గోడలు దెబ్బతిన్నాయి. తహసీల్దారు, పట్టణ పోలీసు స్టేషన్ వందేళ్ల కాలం నాటి భవనాల్లో నడుస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

★ రుద్రవరంలోని వ్యవసాయ కార్యాలయం పాత భవనంలోనే కొనసాగుతోంది. భవనం పైభాగం పెచ్చులూడి పడుతోంది. సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

★ ప్యాపిలి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే రెండు గదుల్లోకి నీరు చేరుతోంది.

★ ప్యాపిలి మండలంలోని జలదుర్గం, ఊటకొండ గ్రామాల్లో పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని చర్యలు చేపట్టాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

(c) eenadu

రైతన్నా.. మీకోసమే

ఇతరాల్లో నమోదైన భూసమస్యలకు పరిష్కారం

రెవెన్యూ సదస్సులో రైతులు

సత్తెనపల్లి, అచ్చంపేట, న్యూస్‌టుడే

రైతన్నలకు కూటమి ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వెబ్ ల్యాండ్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఇతరాలుగా రికార్డుల్లో నమోదైన భూముల్ని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో కుమ్మక్కై వైకాపా నాయకులు తమ పేరిట పత్రాలు సృష్టించి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇతరాల్లో పడిన భూముల మ్యూటేషన్ ప్రక్రియను నిలుపుదల చేస్తూ నెల రోజుల కిందట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే పీజీఆర్ఎస్‌లో రైతుల నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతుండటం, జిల్లా స్థాయి అధికారులు చేసిన విజ్ఞప్తులతో కూటమి ప్రభుత్వం ఇతరాల్లో పడిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంది. తహసీల్దార్ స్థాయిలో కాకుండా ఆర్డీవోలు విచారించి ఆమోదిస్తేనే మ్యూటేషన్ జరిగేలా తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది.

యడ్లపాడు మండలంలోనే రీసర్వే వంద శాతం జరిగింది. అక్కడ భూ సమస్యలు చాలా వరకు లేవు. మిగిలిన 27 మండలాల రైతులు ఇతరాల్లో తమ భూములు నమోదై ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 25 వేల నుంచి 28 వేల వరకు ఇలాంటి అర్జీలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ఇలా చేయాలి..

ఇతరాలు, మిగులు భూములు, క్లైయిమ్ చేయని భూమి కింద నమోదైతే రైతులు తమ పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ❖ ఆ దరఖాస్తును తహసీల్దార్ పరిశీలించి ఫారం-8 నోటీసు జనరేట్ చేసి వీఆర్వో లాగిన్‌కు పంపిస్తారు. వీఆర్వో క్షేత్ర స్థాయిలో విచారణ చేసి.. నివేదిక ఇస్తారు. సంబంధిత భూమి ఆర్వోఆర్ పత్రాలు, ఫారం-8 తిరుగు రసీదు, ఇతర పత్రాలుంటే వాటిని తీసుకుంటారు. వాటిని ఆర్ఐ పరిశీలించి రిమార్కులతో నివేదిక అందజేస్తారు. తహసీల్దార్ అన్నింటిని మరోసారి పరిశీలించి ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్‌కు పంపిస్తారు.

❖ ఆర్డీవో లేదా సబ్‌కలెక్టర్ సమగ్ర విచారణ చేసి అర్హత ఉంటే ఇతరాల నుంచి తొలగించి రైతు వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశాలిస్తారు. అనర్హులుగా తేలితే దరఖాస్తు తిరస్కరిస్తారు. చివరగా దరఖాస్తు పరిశీలన బాధ్యతను తహసీల్దార్లకు అప్పగించారు.

పత్తి విక్రయాల్లో సమస్యలు ఎదురవుతున్నాయా?

జిల్లా మార్కెటింగ్ శాఖాధికారితో 29న ఫోన్ ఇన్

ఉపేంద్రకుమార్

ఈనాడు మీతోడు

పత్తికి సరైన ధర దక్కడం లేదా? మీ ప్రాంతాల్లో విక్రయానికి సమస్యలు ఎదురవుతున్నాయా? సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు విధిస్తున్నారా? సిబ్బంది ఏమైనా కొర్రీలు పెడుతున్నారా? మంచి ధర రావాలంటే ఏం చేయాలి? తదితర విషయాలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కేవీఎన్ ఉపేంద్ర కుమార్ దృష్టికి తీసుకొచ్చే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సింది ఫోన్‌కాల్ చేయడమే. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానాలిస్తారు. సందేహాలను నివృత్తి చేస్తారు.

– ఈనాడు డిజిటల్, నరసరావుపేట

91823 61225 | తేదీ: శనివారం (29.11.2025) | ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

చరవాణి చేజారిందా.. చెంత చేరుతుందిలా!

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), సత్తెనపల్లి, న్యూస్‌టుడే

చరవాణి చోరులు చెలరేగిపోతున్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, సినిమా థియేటర్లు, పర్యాటక ప్రదేశాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో హస్త లాఘవం ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పలువురు ఠాణాల మెట్లు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కొన్నింటిని గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నారు. జిల్లాలో ఎస్పీ కృష్ణారావు నేతృత్వంలో చరవాణుల రికవరీపై ప్రత్యేక దృష్టిసారించారు. బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించేందుకు మిస్సింగ్ మొబైల్స్ ట్రాకింగ్ విధానం, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్(సీఈఐఆర్)ను వినియోగిస్తున్నారు. 2024 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రూ.3.97 కోట్ల విలువైన 2834 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు.

సంవత్సరం	అప్పగించిన సెల్‌ఫోన్లు	విలువ
2024	1432	రూ.2.05 కోట్లు
2025 (ఇప్పటి వరకు)	1402	రూ.1.96 కోట్లు

ఏం చేయాలంటే.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, ఇతరులు ఎవరైనా చోరీ చేసినా తక్షణం సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వివరాలు సమర్పించాలి. ఆలస్యం చేయకుండా ఆ ఫోన్‌లోని నంబరు (సిమ్ కార్డు) డిజబుల్ చేయించుకోవాలి. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఐఎంఈఐ నంబర్ ఆధారంగా అన్ని నెట్‌వర్కుల్లో బ్లాక్ చేస్తారు. ఎవరైనా ఆ ఫోన్ వాడకంలోకి తెచ్చినప్పుడు సాంకేతికత ఆధారంగా సెల్‌ఫోన్ లొకేషన్ గుర్తిస్తారు. దీని ఆధారంగా ఫోన్‌ను గుర్తించి బాధితులకు అప్పగిస్తారు.

సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న చిలకలూరిపేట సీఐ రమేష్

సద్వినియోగం చేసుకోవాలి.. 'సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే పోలీసులకు తెలియజేస్తే సాధ్యమైనంత త్వరగా వాటి ఆచూకీ కనిపెడతాం. ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి' అని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు.

ట్రోఫీ అందుకున్న విజేత జట్టు సభ్యులతో కళాశాల, క్రీడా సంఘం ప్రతినిధులు

కృష్ణవేణి జట్టు జయకేతనం

ముగిసిన అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల వేదికగా మూడ్రోజులపాటు సాగిన పోటీల్లో ఆతిథ్య కృష్ణవేణి కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌ను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. ఒక్కో పాయింట్ సాధించడంలో నువ్వానేనా అన్నట్లు ఆటగాళ్లు పోరాడారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీలకు విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 20 జట్లు హాజరు కాగా నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్లు ఫైనల్‌కు చేరాయి. నాలుగు సెట్ల పాటు సాగిన మ్యాచ్‌లో విజయం కృష్ణవేణి డిగ్రీ కళాశాలను వరించింది. మూడో స్థానం కోసం బాపట్ల ఆర్ట్స్, సైన్స్ కాలేజీ, ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల జట్లు తలపడగా.. బాపట్ల కళాశాల విజయం సాధించింది.

ఏ ఆట ఆడతారు?

పాఠశాలలకు కోరుకున్న క్రీడా సామగ్రి అందజేత

నరసరావుపేట, క్రోసూరు, న్యూస్‌టుడే

చదువుతో పాటు క్రీడల్లో పిల్లలు రాణించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. క్రీడా రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి పెంచడంతో పాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. గతంలో అన్ని పాఠశాలలకు క్రీడా సామగ్రి ఒకేవిధంగా ఇచ్చేవారు. ఇప్పుడు అలాకాకుండా కోరుకున్న సామగ్రిని అందిస్తున్నారు.

స్థాయి	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	1215	52,791
ప్రాథమికోన్నత	54	4,580
ఉన్నత	298	86,991

❖ విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే వ్యాయామోపాధ్యాయుల శిక్షణ ఎంతో కీలకం. వారు మెరుగ్గా శిక్షణ ఇవ్వగలిగే క్రీడలకు సంబంధించి పరికరాలు అందజేస్తే పిల్లలకు మేలు జరుగుతుంది. అందుకే బడుల వారీగా ఇండెంట్లను తీసుకుని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కిట్లు చేరవేస్తున్నారు.

❖ పాఠశాల స్థాయిని బట్టి ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు విలువ చేసే క్రీడా సామగ్రి అందిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలలోపు విలువచేసే కిట్లు సరఫరా చేస్తున్నట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు. అథ్లెటిక్స్‌కు సంబంధించి అన్ని పాఠశాలలకు ఒకే తరహా సామగ్రి అందిస్తారు. క్రీడల్లో విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సరఫరా చేసే క్రీడా సామగ్రి దోహదం చేస్తుందని డీఈవో చంద్రకళ చెప్పారు.

మీనం ఎగిరితే.. చీరకు చిక్కినట్లే!

వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి కారంచేడు శివారులోని రొంపేరు లెఫ్ట్ ఆర్మ్ కాలువలో జాలర్లు వినూత్న రీతిలో వేట సాగిస్తున్నారు. నీటి ప్రవాహానికి అడుగున చేపలు పట్టేందుకు బుట్టలు, సన్నపాటి వలలు ఏర్పాటు చేశారు. బుట్టల్ని తప్పించుకుని వలను దాటి నీటి ప్రవాహం వైపు ఎగిరే చేపలను పట్టుకునేందుకు చీరలు కట్టారు. ఎగిరే చేపలను పట్టుకునేందుకు కాలువలో చీరలు కట్టామని జాలరి సుబ్బయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, కారంచేడు



చెరువనుకుంటే తప్పు.. టిడ్కో ఇంటి పైకప్పు

చిత్రంలో కనిపిస్తున్నది చెరువు అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది చిలకలూరిపేటలోని టిడ్కో గృహ సముదాయంలోని భవనాల పైకప్పు. ఇక్కడ మొదటి విడత పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. వాటిలో చాలామంది నివాసం ఉంటున్నారు. అయితే భవనాలపై నీరు నిలిచి పాచిపట్టి గడ్డి మొలిచింది. వర్షపు నీటితో పాటు ట్యాంకులు నిండిన సమయంలో వచ్చే నీరు కిందికి వెళ్లే మార్గం లేక భవనంపైనే నిలుస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహణను పట్టించుకోకపోవడంతో రోజుల తరబడి నీరు నిలిచి.. ఇలా అధ్వానంగా మారిందని, నీచు వాసన వస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. భవనం దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను పురపాలక కమిషనర్ శ్రీహరిబాబు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి వెంటనే తగు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

(c) eenadu

వరికపూడిశెల పూర్తి చేసేదాకా విశ్రమించం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల, రెంటచింతల, గురజాలను కలుపుతూ మార్కెట్ యార్డు వద్ద రూ. 54.09 కోట్లతో నిర్మించనున్న ఇన్నర్ బైపాస్ నిర్మాణానికి గురువారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి భూమిపూజ చేశారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ నరసరావుపేట పార్లమెంట్ స్థానం పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 231 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను నిర్మించామన్నారు. వరికపూడిశెల నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలగిన వెంటనే శంకుస్థాపన చేస్తామని, ప్రాజెక్టును పూర్తి చేసేవరకు విశ్రమించేది లేదని ఎంపీ అన్నారు. నియోజకవర్గంలో రూ. 1200 కోట్లతో జల్‌జీవన్ మిషన్, రూ. 124 కోట్లతో అమృత్ పథకాలను త్వరలో ప్రారంభించనున్నామని వివరించారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. మాచర్ల పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేటాయించిన రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తెదేపా నాయకుడు షేక్ మోసిన్ ఇద్దరు వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు సమకూర్చగా, వాటిని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు.

IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE RANGA REDDY DISTRICT AT: KUKATPALLY
F.C.O.P. No: 372 OF 2024

Between:
Sri. Nekkalapu Srinivas Rao ...Petitioner
AND
Smt. Sujatha Vadlamudi ...Respondent

To,
Smt. Sujatha Vadlamudi, D/o. Lakshmaiah, Aged about 43 years, Occ: Soft Ware Employee, R/o. H.No.4-18, Muppalla Village, Ipuru Mandal, Palnadu District Andhra Pradesh-522661.

The above-named Petitioner have filed FCOP.No.372 of 2024 before the HON'BLE VI ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE RANGA REDDY DISTRICT AT: KUKATPALLY for nullity of marriage dated 06.06.2009 performed between you and the Respondent, under Sec.12 r/w Sec 5(i) of Hindu Marriage Act against you and the case is posted on 15-12-2025 for your appearance.

Therefore, you requested to appear either in person or through your advocate on **15-12-2025 at 10.30 AM** before the HON'BLE VI ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE RANGA REDDY DISTRICT AT: KUKATPALLY for your response. Otherwise, the matter will be decided in your absence.

(By Order of the Court)
G. SRINIVAS REDDY
Associates and Advocates

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రానికి అప్పులు అధికంగా ఉన్నా వాటిని అధిగమించి రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే అధునాతన పద్ధతులతో వ్యవసాయం చేయాలన్నారు. ఈ మేరకు వారికి అవగాహన కల్పించేందుకు రైతన్నా మీ కోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రైతులు బాగుండాలని అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు చూడటం కోసం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

LOYOLA PUBLIC SCHOOL, GUNTUR
60 YEARS OF LEGACY IN EDUCATION
Diamond Jubilee Celebrations

In Memory of the Diamond Jubilee of
LOYOLA PUBLIC SCHOOL, Nallapadu, Guntur and following the Legacy of St.Ignatius' Pedagogy in Education, as a Token of Love and Gratitude.
Hearty Welcome to Alumni of Loyola Public School on
29-11-2025, SATURDAY at 4.30 P.M. GOD BLESS US!
loyolapublicschool.lps@gmail.com
☎ : 91216 06671
Management

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

బాల్య వివాహాలతో దుష్ఫలితాలు

నరసరావుపేట అర్బన్, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: బాల్య వివాహాల కారణంగా పలు సమస్యలు, దుష్ఫలితాలు కలుగుతాయని, ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేస్తే బాల్య వివాహాలు అరికట్టవచ్చని వక్తలు అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం 'బాల్ వివాహ్ ముక్త భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానాలో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు వివాహ వయసుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈలోపు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అందుకు శిక్షలు ఉంటాయన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రొంపిచర్ల తహసీల్దారు నిర్మల, ఎంపీడీవో మాధ్యూబాబు, పీహెచ్‌సీ వైద్యురాలు రేవతి, సీడీపీవో కాంతకుమారి, ఒకటో పట్టణ ఎస్సై అరుణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఐసీడీఎస్ కార్యకర్తలు అధికారులు

'పది' విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివించాలి

ఈపూరు కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఈపూరు, రొంపిచర్ల, న్యూస్‌టుడే: ఈపూరు మండలంలో వివిధ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ముప్పాళ్ల, ఈపూరు జడ్పీ ఉన్నత పాఠశాల, ఈపూరు కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాలు సందర్శించి పదోతరగతి విద్యార్థుల పరీక్షకు సన్నద్ధతను పరీక్షించారు. ముప్పాళ్ల హైస్కూల్‌లో రెండు నెలలుగా తరగతులకు గైర్హాజరవుతున్న ఓ పదోతరగతి విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బాలికను పాఠశాలకు పంపేందుకు ఒప్పించారు. ఈపూరు హైస్కూల్‌లో పీఎంశ్రీ పనుల పురోగతిని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ప్రణాళికాబద్ధంగా పదోతరగతి విద్యార్థును చదివించి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం ఆమె వనికుంట వద్ద నిర్మాణంలో ఉన్న ఆదర్శ పాఠశాల నూతన భవనాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో-2 రామతులసి, హెచ్‌ఎంలు సాంబానాయక్, శ్రీనివాసరావు, కేజీబీవీ ప్రిన్సిపల్ జ్యోతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పుల్లా పద్మజ పాల్గొన్నారు. రొంపిచర్ల మండలంలో ఆరేపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో గోడలపై అంటించిన చార్టుపై ఉన్న అక్షరాలను విద్యార్థులతో చదివించారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు నివేదించాలని పాఠశాల హెచ్‌ఎం బాలకృష్ణకు సూచించారు. ఆమె వెంట సీఎంవో పద్మారావు తదితరులు ఉన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

కృష్ణవేణి - వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్ల మధ్య తుదిపోరు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: శారీరక మానసిక వికాసానికి, యువత భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవడానికి క్రీడలు దోహదపడతాయని ఏఎన్‌యూ యోగా కోఆర్డినేటర్, ఆచార్య బి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఏఎన్‌యూ అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ నాసరయ్య, ప్రముఖులు డాక్టర్ వెంకట్రావు, గౌరీశంకర్, పి.శ్రీనివాసరావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిబాబు చెప్పారు. జలాలపురం గ్రామానికి చెందిన తిమ్మిశెట్టి కోటేశ్వరరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ శిక్షణ కేంద్రాన్ని నడుపుతున్నారు. అదే నగరానికి చెందిన రైజ్ టెక్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కన్సల్టెంట్లు షేక్ ఆసిఫ్‌బాషా, అల్లం దామోదర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడంతో తనకు తెలిసిన విద్యార్థుల ద్వారా కోటేశ్వరరావు వారికి రూ. 16.80 లక్షలు ఇప్పించారు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నగదు తిరిగి ఇవ్వాలని కోరగా చంపుతామని వారు బెదిరించారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

యడ్లపాడు, న్యూస్‌టుడే: శనగ, మొక్కజొన్న విత్తనశుద్ధి ద్వారా పంటకు తొలి దశలో తెగుళ్లు సోకకుండా నివారించుకోవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ అన్నారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు కీర్తిశ్రీ నిధి, జోషితాశ్రేయ, అనగాని బేబి విజయలక్ష్మి, గాయత్రి, జ్యోత్స్న శనగ, మొక్కజొన్న పంటలపై గురువారం జగ్గాపురంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలన్నారు. పురుగు ఉనికిని గుర్తిస్తే తొలిదశలో నివారణకు తక్కువ ఖర్చులో వేపనూనె పిచికారీ చేసుకోవాలన్నారు. శనగలో నీటి యాజమాన్య పద్ధతుల్లో భాగంగా 30-35 రోజులకోసారి, 60-65 రోజులకోసారి తేలికపాటి నీటి తడులు ఇవ్వటం ద్వారా 2-3 క్వింటాళ్ల దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త (విస్తరణ) డాక్టర్ పీవీ సత్యగోపాల్ మాట్లాడుతూ శనగలో ఆకుమాడు తెగులు, తుప్పు తెగులు నివారణకు ప్రోపికోనజోల్ ఎకరాకు 200 మి.లీ. మందు పిచికారీ చేసుకోవాలన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

కారుమంచి(శావల్యాపురం): మండలంలో కారుమంచి రెవెన్యూ గ్రామ పరిధిలో రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వే భూ రికార్డుల డిప్యూటీ డైరెక్టరు తోయజాక్షరావు ఆదేశించారు. రీ సర్వే పనులను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనులు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఇప్పటి వరకు రెవెన్యూ పరిధిలోని వయ్యకల్లు, గుంటుపాలెం, భాస్కరనగర్, ధర్మపురి తదితర గ్రామాల్లో 80 శాతం పనులు పూర్తయ్యాయని స్థానిక రెవెన్యూ అధికారులు తెలపగా మిగిలిన 20 శాతం పనులు వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయన వెంట పల్నాడు జిల్లా సర్వే అధికారి భానుకీర్తి, నరసరావుపేట సర్వే ఇన్‌స్పెక్టరు వై.శ్రీనివాసరావు, తహసీల్దారు ఎం.అర్జున్‌నాయక్, డిప్యూటీ తహసీల్దారు డి.సుబ్బారావు, సర్వేయరు డి.రవికుమార్ పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PERSONAL CLASSIFIEDS

N. లక్ష్మీ, హైకోర్ట్ అడ్వకేట్ & సైకాలజిస్ట్, హైదరాబాద్. క్రిమినల్ కేసుల నిపుణులు. ఉచిత న్యాయ సలహాల కొరకు సంప్ర: 80193 43834.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT.వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

GENERAL

రాజధాని అమరావతిలో గజం 5000/- & 10000/- రాజధానిలో ఎకరం పొలం 70 లక్షలు, గుంటూరులో డూప్లెక్స్ విల్లా 1.60 Cr. Ph: 90523 45356.

JOBS

WANTED Pro'sfor Jr.College Chirala for Details ✆ 80088 12235 send resume to wat'sapp:8328387500 attend Interview on1-12-25by 10AM.

Wanted Female Computer Operator, Timings: 9Am-6pm ★ Eclat Health Services, Arundalpet, Guntur ✆ 99514 42111.

యజ్ఞ హాస్పటల్ బాపట్లలో పనిచేయుటకు డ్యూటి డాక్టరు, అనుభవజ్ఞులైన నర్సింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించవలసిన. ✆: 79897 85865.

WANTED HDFC BANK కొరకు చీరాల పరిసర ప్రాంతాల నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. లలితా ఫైనాన్స్ లింక్స్ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆7729989278

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవం గల వారు కావలెను. జీతము: (15K to 20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

ఆర్ డాక్టర్ హాస్పటల్, గోరంట్ల, గుంటూరు నందు మేనేజర్, నర్సింగ్ స్టాఫ్, PRO's కావలెను. రెజ్యూమ్ వాట్సాప్. 79814 50441.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆ 96402 58899, 96404 68899.

ప్రముఖ మార్కెటింగ్ సంస్థకు పార్ట్‌టైమ్ స్టాఫ్ కావలెను. నెలకు ₹ 5,000, డెలివరీ బాయ్స్, స్టూడెంట్స్, హౌస్ వైఫ్స్, వీక్లీ బోనస్. 98487 33026.

ప్రముఖ అగ్రగామి సంస్థలో పార్ట్‌టైం/ ఫుల్‌టైం బిజినెస్ పార్ట్‌నర్‌గా చేరండి. అధిక కమీషన్ సంపాదించుకోండి, విద్యార్హత: 10th. Age:30-65 సం|| 9963590104.

FACULTY/ TEACHERS

WANTED: Principal To Run the School, Qul: PG+ B.Ed., need Sy. Experience, Salary: 40 to 50K, Cont: Buchi Reddy Palem Nellore (Dt.) ✆ 94401 22213.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- | 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- | 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జీ.ఎస్.టి. అదనం

పత్తికి 'గులాబి' ముల్లు

పంటను దెబ్బతీస్తున్న పురుగు

బోయపాలెం (యడ్లపాడు), న్యూస్‌టుడే

పత్తి రైతులకు కాలం కలిసి రావడం లేదు. మొంథా తుపాను పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. అధిక వర్షాలకు తీతలకు సిద్ధంగా ఉన్న పత్తి పాడైంది. పక్వానికి వచ్చిన కాయలు కుళ్లిపోగా.. గూడ, పిందెలు రాలిపోయాయి. అనంతరం తెగుళ్లు సోకి పంట ఎదుగుదల ఆగిపోయింది. ఎకరాకు 5- 6 క్వింటాళ్లకు మించి దిగుబడి లభించేలా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం చేలపై గులాబి రంగు పురుగు వ్యాపిస్తోంది. ఈ కారణంగా అత్తెసరు దిగుబడులు కూడా దక్కకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది.

లింగాకర్షక బుట్టల్లో పడిన చిలుకలు

అప్రమత్తం చేయాల్సి ఉన్నా..

గులాబి రంగు పురుగు ఉనికిని గుర్తించడానికి రైతులు పంట చేలలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేస్తారు. బుట్టలో రోజుకు నాలుగుకు మించి చిలుకలు పడితే త్వరలో గులాబి రంగు పురుగు వ్యాపిస్తుందని అంచనా. అవి పెట్టిన గుడ్ల నుంచి పురుగులు పుట్టి నేరుగా పిందె దశలోని కాయలోకి చొచ్చుకుపోతాయి. ఒకసారి అవి కాయలోకి వెళ్తే వాటి నిర్మూలన అసాధ్యం. తాజాగా లింగాకర్షక బుట్టల్లో రోజుకు 15-20 చిలుకలు పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. త్వరలో గులాబి రంగు పురుగులు దాడి చేసే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. సాధారణంగా అమావాస్య సమయంలో పురుగులు గుడ్లు పెడతాయి. వారం కిందటే అమావాస్య వెళ్లింది. అప్పుడే గుడ్డు, పిల్ల దశలోనే గులాబి రంగు పురుగును నిర్మూలించాల్సి ఉంది. వ్యవసాయ అధికారులు పది రోజుల కిందటే రైతులను అప్రమత్తం చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. ఫలితంగా గులాబి రంగు పురుగు పంటకు నష్టం చేస్తోంది.

నివారణ చర్యలు చేపట్టాలి

పత్తి చేలలో ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టల్లో 4-5 మించి చిలుకలు కనిపిస్తే నివారణ చర్యలు చేపట్టాలని యడ్లపాడు మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. గులాబి పురుగు నివారణకు ల్యామ్డాసైలోత్రిన్ మందును ఎకరాకు 300 మి.లీ., సైపర్‌మైత్రిన్, ప్రొఫెనోఫాస్ మందులు 300 మి.లీ. చొప్పున వారానికి ఒకసారి మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు.

అమరావతి - తుళ్లూరు దారికి మహర్దశ

ఎమ్మెల్యే ప్రవీణ్ చొరవతో రూ.6 కోట్లు మంజూరు

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతి నుంచి తుళ్లూరు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. గోతులకు భయపడి చాలామంది ప్రయాణికులు విజయవాడ నుంచి గుంటూరు మీదుగా వస్తున్నారు. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. అమరావతి నుంచి వైకుంఠపురం వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 6 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెదమద్దూరు వాగుపై వంతెన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలోనే రోడ్డు పనులు మొదలు పెట్టి, పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.

రేమిడిచర్లలో వ్యక్తి హత్య

కుమార్తెను వేధిస్తున్నాడని మందలించినందుకు ఘాతుకం



మరియదాసు (పాత చిత్రం)

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: మండలంలో రేమిడిచర్ల ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. బండ్లమోటు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన నోముల మరియదాసు (42) కుమార్తెను అదే కాలనీకి చెందిన ఎల్. శామ్యూల్ అనే యువకుడు వేధిస్తున్నాడు. ఈ విషయం ఆమె తన తండ్రికి తెలిపింది. ఈ విషయాన్ని మరియదాసు ఆ యువకుడి కుటుంబ సభ్యులకు తెలిపి పద్ధతి మార్చుకోవాలని సూచించాడు. కక్ష పెంచుకున్న శామ్యూల్ తన బంధువులతో కలిసి మరియదాసుపై దాడికి పథకం పన్నాడు. ఆరు రోజుల క్రితం రాత్రి సమయంలో గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన మరియదాసుపై రాడ్డుతో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన బాధితుడికి వినుకొండలో ప్రాథమిక చికిత్స అందించి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సమీర్‌ఖాన్ తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ ధ్యేయం

మాట్లాడుతున్న శిఖామీల్ బరాల

వినుకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా భాజపాకు మద్దతు ఇస్తున్నాయని ఏఐసీసీ పరిశీలకురాలు, రాజస్థాన్ ఎమ్మెల్యే శిఖామీల్‌బరాల అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేసేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వినుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయపాటి రామాంజనేయులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే భద్రత.. నిర్లక్ష్యం వహిస్తే శిక్ష

మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్

దాచేపల్లి, న్యూస్‌టుడే: నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం రవాణా, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా స్కూల్ బస్సుల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. గురజాల నియోజకవర్గ పరిధిలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులను ఒకేచోటుకు రప్పించి భద్రతా ప్రమాణాలపై సమగ్ర పరిశీలన చేపట్టారు. డీఎస్పీ జగదీష్, జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్ కుమార్, మాచర్ల ఎంవీఐ శేషురెడ్డి పర్యవేక్షించారు. డ్రైవర్లు, సహాయకులు, పాఠశాల యాజమాన్యానికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బస్సులు నడిపేటప్పుడు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సీఐ భాస్కర్, ఎస్సైలు పాపారావు, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

గురజాల, న్యూస్‌టుడే: దాయాదుల మధ్య భూ వివాదం నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితులైన ముగ్గురికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.ప్రియదర్శిని గురువారం తీర్పునిచ్చారు. వివరాలిలా.. కారంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు, మల్లయ్య అన్నదమ్ములు. వీరి మధ్య భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో 2016, జులై 19న వెంకటేశ్వర్లు, తన కుమారుడు వెంకటనరసయ్య, కుమార్తె ఆదిలక్ష్మి, కూలీ ఏసురత్నం కలిసి పొలానికి వెళ్లారు. అక్కడ పనులు చేస్తుండగా.. మల్లయ్య కుమారులు చప్పిడి అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్ప ట్రాక్టరుపై మారణాయుధాలతో అక్కడికి చేరుకున్నారు. వెంకటనరసయ్యతో గొడవ పెట్టుకుని వేట కొడవళ్లు, గొడ్డళ్లతో దాడి చేసి హతమార్చారు. కుమారుడిపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తండ్రి వెంకటేశ్వర్లుపైనా దాడి చేయడంతో గాయపడ్డాడు. కుమార్తె ఆదిలక్ష్మి, కూలీ ఏసురత్నం భయపడి అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులు విచక్షణారహితంగా దాడులు చేయడంతో మృతుడి తల మొండెం నుంచి వేరుపడి 3 అడుగుల దూరంలో పడిపోయింది. ఈ ఘటనపై వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై నారాయణస్వామి కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు 2016, ఆగస్టు 8న నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం నిందితులు బెయిల్‌పై విడుదల అయ్యారు. నిందితుల్లో ఒకరైన అయ్యప్ప ఈనెల 17న పేటసన్నెగండ్ల వద్ద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. హత్య కేసుకు సంబంధించి సాక్షులను విచారించిన న్యాయమూర్తి ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితుల తరపున ఏపీపీ కందిమళ్ల సూర్యరాజు వాదనలు వినిపించారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

సాగు నీరందించి పంటలు రక్షించాలి

నరసరావుపేట సెంట్రల్: మండలంలో కేతముక్కల అగ్రహారం, గుంటగార్లపాడు, రంగారెడ్డిపాలెం, ములకలూరు, జొన్నలగడ్డ గ్రామాల పరిధిలో సుమారు 700 ఎకరాల్లో పంటలు నీరందక ఎండుముఖం పట్టాయని, వెంటనే అధికారులు స్పందించాలని కౌలురైతు సంఘం జిల్లా నాయకుడు కామినేని రామారావు డిమాండ్ చేశారు. రైతు సంఘం, పీడీఎం నాయకులతో కలిసి నీరు లేక ఎండుతున్న పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పగంజి వాగు నుంచి నీటి మళ్లింపు పథకం కాలువకు ప్రభుత్వం మరమ్మతులు చేయలేదని, రైతులే సొంత ఖర్చుతో బాగు చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే అరవిందబాబు జోక్యం చేసుకొని వెంటనే కాలువ మరమ్మతులకు నిధులు విడుదలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వర్లరావు, నల్లపాటి రామారావు, నీటి సంఘం అధ్యక్షుడు గోపాలరావు తదితరులున్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ఆడపిల్లలకు బాల్యంలో వివాహాలు జరిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో ఆడపిల్లలకు పెళ్లి చేయడం వల్ల ఆరోగ్య సమస్య తలెత్తడమే కాకుండా వారి భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, సమాజ పరిరక్షణలో మహిళలదే కీలక పాత్ర అన్నారు. అనంతరం అడ్మిన్ ఆర్ఐ కృష్ణ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఆర్ఐలు గోపినాథ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వెనుక బజారు నుంచి మూడు సినిమా హాళ్ల సెంటర్‌కు వెళ్లే దారిలో గ్రంథాలయం మలుపు వద్ద ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. దీంతో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందిగా మారింది. - మస్తాన్‌రావు

✔ గ్రంథాలయం మలుపు వద్ద వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. - రమేష్, సీఐ

– న్యూస్‌టుడే, గాంధీపేట (చిలకలూరిపేట పట్టణం)

ఆగని లీకులు.. తప్పని నీటి కష్టాలు

అరండల్‌పేట (నరసరావుపేట), పండరీపురం(చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే: నరసరావుపేట, చిలకలూరిపేట పట్టణాల్లో తరచూ పైపులైన్లు లీకై శివారు కాలనీల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 35ఏళ్ల కిందట వేసిన పైపులైన్లు కావడం, భూగర్భంలో అవి తుప్పు పట్టి లీకై నీరంతా రోడ్డుపైకి చేరి వృథా అవుతోంది. దీంతో పలు కాలనీలకు రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతుంది. రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.

ఎక్కడెక్కడంటే..

★ నరసరావుపేట పట్టణంలో బరంపేట, రామిరెడ్డిపేట, ప్రకాష్‌నగర్, అరండల్‌పేట, రెడ్డినగర్, బాలయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. పైపులైను లీకేజీలతో శివారు కాలనీలైన ఎస్ఆర్‌కేటీ, కోడెల శివప్రసాదరావు కాలనీ, బరంపేట, శ్రీనివాస గిరిజన కాలనీలకు రోజుల తరబడి నీటి సరఫరా నిలిపేస్తున్నారు.

★ రెండ్రోజుల క్రితం నరసరావుపేట మొదటి గేటు నుండి కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైనుకు లీకేజీ ఏర్పడింది.

★ సత్తెనపల్లి రోడ్డు కోడెల శివప్రసాదరావు స్టేడియం ఎదుట మంచినీటి పైపులైనుకు బుధవారం రంధ్రం పడింది. దీంతో బరంపేట చాకిరాలమిట్ట, సాయినగర్, బీసీకాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపేశారు. ఈ లీకేజీ కారణంగా రెండ్రోజులుగా కుళాయిలకు నీటి సరఫరా లేదు. కనీసం ఈ విషయం ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

★ చిలకలూరిపేటలో పండరీపురం, సాంబశివనగర్, చెరువు రోడ్డు, భావనారుషినగర్, సుగాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో పైపులైన్లు తరచూ లీకవుతుంటాయి. ప్రస్తుతం పండరీపురం ప్రాంతంలో మూడు చోట్ల పైపులైను లీకులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తాగునీరు రోడ్డు పాలవుతోంది.

చిలకలూరిపేట: పండరీపురంలో పైపులైను లీకు నుంచి వస్తున్న నీరు

నరసరావుపేట: ట్యాంకరు నీరే ఆధారం

వెంటనే చర్యలు చేపడతాం

ఈ విషయమై నరసరావుపేట మున్సిపల్ డీఈ రఫీ, చిలకలూరిపేట మున్సిపల్ ఏఈ అల్తాఫ్‌ను వివరణ కోరగా లీకేజీలు ఏర్పడిన ప్రాంతాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లతో ఎప్పటికప్పుడు నీటి సరఫరా చేస్తున్నామన్నారు. నరసరావుపేట సత్తెనపల్లి రోడ్డులో పైపులైనుకు మరమ్మతులు పూర్తయ్యాయని, నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడతామన్నారు. పైపులైను మరమ్మతు కోసం తవ్విన ప్రాంతంలో త్వరలో రోడ్డు వేయిస్తామని తెలిపారు.

రైతును రాజుగా చూడటమే కూటమి లక్ష్యం

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), యడ్లపాడు, రొంపిచర్ల, వినుకొండ రూరల్, నూజండ్ల, న్యూస్‌టుడే : రైతును రాజుగా మార్చాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ రంగంలో నూతన సాగు విధానాలు అమలు చేస్తూ రైతుల్ని ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో వేర్వేరుగా నిర్వహించిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పంచసూత్రాల ప్రాధాన్యం వివరించారు. సంప్రదాయ సాగు విధానాలకు స్వస్తి పలికి ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని లాభసాటి పంటలు పండించాలని సూచించారు. నాదెండ్ల మండలం గణపవరం, యడ్లపాడు మండలం దింతెనపాడులో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొన్నారు. దింతెనపాడులో పంచాయతీ భవనం పనులకు, గణపవరంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ రూ.10లక్షలతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రొంపిచర్ల మండలం కొత్తపల్లి, చాకలికుంట తండాలో ఎమ్మెల్యే అరవిందబాబు ఇంటింటికీ తిరిగి రైతులకు కర పత్రాలు అందజేశారు. వినుకొండ మండలం చాట్రగడ్డపాడు, నూజండ్ల మండలం ఉప్పలపాడు, ఐనవోలు, చింతలచెరువు గ్రామాల్లో ఆయా మండల ఏవోలు వరలక్ష్మి, ఆంజనేయులు నాయక్ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు.

గణపవరం: రైతులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని యక్కలవారిపాలెంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయ శిఖర కలశ, ధ్వజ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు హాజరయ్యారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పొట్టి శ్రీరాములు స్మృతివనం లఘు చిత్ర ప్రదర్శన

వినుకొండ, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం లఘు చిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ వైశ్య సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అమరావతిలో నిర్మించతలపెట్టిన 58 అడుగుల అమరజీవి విగ్రహం, స్మృతివనం వివరాలు ఇందులో వెల్లడిస్తారని చెప్పారు.

నేడు

చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్

వినుకొండ, న్యూస్‌టుడే: కొత్తపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరిస్తారని తెలిపారు.

చిలకలూరిపేటలో.. చిలకలూరిపేట గ్రామీణ: స్థానిక తెదేపా కార్యాలయంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ప్రజా సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వయంగా స్వీకరిస్తారని తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు గ్రామాల్లో రైతన్నా.. మీకోసం

సాతులూరు(చిలకలూరిపేట గ్రామీణ): నాదెండ్ల మండలం సాతులూరు, చందవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11గంటల నుంచి రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొంటారని మండల తెదేపా అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తారన్నారు.

రేపు

కౌన్సిల్ సాధారణ సమావేశం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మైలవరపు గుండయ్య కౌన్సిల్ భవనంలో నిర్వహిస్తున్నట్లు పురపాలక ఛైర్మన్ ఎస్కే రఫాని తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన 16 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

ప్రతిభా పోటీలతో ప్రజ్ఞా వికాసం

గాంధీపేట (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: చిలకలూరిపేట మోడరన్ స్టెల్లార్ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల డైరెక్టర్ చేబ్రోలు ప్రత్యూష మాట్లాడుతూ ఇటువంటి పోటీలతో విద్యార్థుల్లో ప్రజ్ఞా వికాసం కలుగుతుందన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు తమ ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. సెల్‌ఫోన్ అవసరం మేరకు వినియోగించాలని, భవిష్యత్తులో సెల్‌ఫోన్‌కు సంబంధించి ఎన్నో మార్పులు వస్తాయన్నారు. పోటీలో విద్యార్థులు షేక్ అబ్దుల్‌బాషా, జి.హర్షిణి (9వ తరగతి), వి.ఈశ్వరప్రసాద్ (7వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించి విజేతలుగా నిలిచారు. వీరికి విద్యా సంస్థల డైరెక్టర్ చేబ్రోలు ప్రత్యూష, మోడరన్ స్టెల్లార్ పాఠశాల ప్రిన్సిపల్ బి.విజయలక్ష్మి ప్రసూన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జిలు సుధారాణి, సాధిక్, నాగవాసవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో డైరెక్టర్ ప్రత్యూష, ప్రిన్సిపల్ ప్రసూన తదితరులు

విద్యార్థినికి సత్కారం

నరసరావుపేట అర్బన్, సెంట్రల్, న్యూస్‌టుడే: అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న కాకాని పాఠశాల విద్యార్థిని వక్కలగడ్డ కాత్యాయనిని ఎమ్మెల్యే అరవిందబాబు గురువారం సత్కరించారు. ఆమె సమాచార ప్రసారశాఖ మంత్రిగా చక్కగా తన పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వం విద్యార్థులను విద్యతో పాటు సేవా రంగాల్లో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు మాక్ అసెంబ్లీ నిర్వహించారన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు, పట్టణ తెదేపా అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ ఉన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ఖోఖో రాష్ట్ర జట్టులో చోటు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో గీతమ్స్ విద్యార్థులు మారెళ్ల అభినాష్‌రెడ్డి, నక్కా సాయిచరణ్ అండర్-17 రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చాటి జట్టులో స్థానం సాధించినట్లు చెప్పారు. డిసెంబరు 24న ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహించే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడతారని ఆమె తెలిపారు. విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

అభినాష్‌రెడ్డి, సాయిచరణ్

ఈత పోటీలో ప్రతిభ

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల శీతాకాలపు ఛాంపియన్‌షిప్ ఈత పోటీల్లో భాగంగా నిర్వహించిన బటర్ ఫ్లై 200 మీటర్ల విభాగంలో స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థి కె.శివసాకేత్ రజత పతకం సాధించాడని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ గురువారం తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే 36వ సౌత్‌జోన్ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఇతన్ని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి సుబ్బరాయగుప్తా, అప్పారావు, పీడీ యక్కల మధుసూదనరావు అభినందించారు.

శివసాకేత్

నీరివ్వక.. నిరుపయోగంగా..

చిలకలూరిపేట పట్టణంలో ఆర్‌వీఎస్‌సీవీఎస్ క్రీడా మైదానం వెనుక బజారు సాలిపేటలో చేతి పంపు పాడైంది. ఈ బోరుపై హెడ్ ఏమైందో తెలియదు. దీనికి మరమ్మతులు చేయిస్తే ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగం. బోరు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. సమస్యను పురపాలక సంఘ ఏఈ అన్సర్ దృష్టికి తీసుకెళ్లగా చేతి పంపునకు త్వరలో మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, గాంధీపేట (చిలకలూరిపేట పట్టణం)

అమ్మో.. కూలుతుందేమో!

నరసరావుపేట బాబాపేటలోని మార్కెట్ వీధిలో ఓ విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. పక్కనే మురుగు కాలువ ఉండటంతో ఎలాంటి ఆధారం లేక కూలిపోయే అవకాశం ఉంది. సమీప ఇళ్లకు సంబంధించి సర్వీసు తీగలు దీనికి అనుసంధానంగా ఉన్నాయి. స్తంభం కూలితే అవన్నీ తెగి పెను ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ సురేంద్రను వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ప్రకాష్‌నగర్ (నరసరావుపేట టౌన్)

ప్రమాదంతో దాగుడుమూతలు

నరసరావుపేట పట్టణంలో ఎస్ఎస్ఎన్ కళాశాల సమీపంలో మ్యాన్‌హోల్ మూత రంధ్రాలు పడి ప్రమాదకరంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే వాహన టైర్లకు ఆ మూతకు ఉన్న ఇనుపచువ్వలు గుచ్చుకొని పంక్చర్ పడుతున్నాయి. రాత్రిళ్లు ఈ మార్గంలో పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ ఏఈ జ్యోతి దృష్టికి తీసుకెళ్లగా మ్యాన్‌హోల్‌పై కొత్త మూత ఏర్పాటు చేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, ఎన్జీవో కాలనీ (నరసరావుపేట సెంట్రల్)

రోడ్డే.. పార్కింగ్ కేంద్రంలా..

జిల్లా కేంద్రం నరసరావుపేటలో పలు రహదారులు పార్కింగ్ కేంద్రాలను తలపిస్తున్నాయి. పట్టణంలో అరండల్‌పేటలోని బ్యాంకు వీధి, మోర్ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. అసలే ఇరుకు రోడ్లు దీనికి తోడు వాహనచోదకులు ద్విచక్రవాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపేస్తుండడంతో పాదచారులకూ అవస్థలు తప్పడం లేదు. దీనిపై ట్రాఫిక్ సీఐ లోకనాథంను సంప్రదించగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో పర్యవేక్షణ చేయిస్తున్నామన్నారు. రోడ్లపై వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

- న్యూస్‌టుడే, అరండల్‌పేట (నరసరావుపేట)

నిరుద్యోగ సమస్య రూపుమాపేందుకు కృషి

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఇ.తమ్మాజీరావు అన్నారు. నాదెండ్ల మండలం గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల డైరెక్టర్ చుండి రంగనాయకులు మాట్లాడుతూ యువత మరిన్ని నైపుణ్యాలను సాధించి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. జాబ్‌మేళాలో పది కంపెనీలు హాజరు కాగా 158 మంది యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో 53 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తమ్మాజీరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్, కోఆర్డినేటర్లు సురేష్, అంజిరెడ్డి, అనూష, ఆయా కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సర్వే

నరసరావుపేట సెంట్రల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని జొన్నలగడ్డలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులు ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. కనీస సదుపాయాలు, కుటుంబాల్లో విద్యావంతులు, ఉద్యోగులు వంటి వివరాలు సేకరించారు. సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి హనుమంతరావు తెలిపారు.

తెగిన విద్యుత్తు తీగ.. తప్పిన ప్రమాదం

శావల్యాపురం, న్యూస్‌టుడే : శావల్యాపురం పోస్టాఫీసు సమీపంలో విద్యుత్తు నియంత్రిక వద్ద గురువారం పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం నియంత్రిక నుంచి పెద్ద శబ్దం రావడంతో దానికి ఉన్న ప్రధాన లైను విద్యుత్తు తీగ తెగి పోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తీగ తెగి పడిన ప్రదేశం పక్కనే ప్రైవేటు పాఠశాల ఉంది. ఆ సమయంలో మధ్యాహ్న భోజనానికి పిల్లలు బయటకు వస్తే పరిస్థితి మరోలా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో గ్రామంలో పోలేరమ్మ దేవాలయం వద్ద విద్యుత్తు నియంత్రిక నుంచి, మతుకుమల్లి రోడ్డులో అక్కారావు కాంప్లెక్స్ వద్ద మంటలు వచ్చాయని ప్రజలు పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

పాఠశాల సమీపంలో విద్యుత్తు నియంత్రికతో సమస్య వస్తోందని ఏఈ నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు విన్నవించినా పట్టించుకోలేదని పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్. మోహన్‌చంద్ తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్తు నియంత్రిక వద్ద శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు డిమాండ్

పోట్లూరు (శావల్యాపురం), న్యూస్‌టుడే : తన సంతకం ఫోర్జరీ చేసి పంచాయతీ నిధులు రూ.7.58లక్షలు డ్రా చేశారని పోట్లూరు సర్పంచి పోపూరి జ్యోతి ఆరోపించారు. శావల్యాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఫ్రాన్సిస్ తనను, తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. పంచాయతీ ఖాతా నుంచి నగదు డ్రా అయిన సందేశం తన సెల్‌ఫోన్‌కు రావడంతో ఈ విషయం బయటపడిందని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోకు తెలిపినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. అధికారులు స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను సంప్రదించగా పంచాయతీ కార్యదర్శి అనారోగ్య రీత్యా సెలవులో ఉన్నారని, పక్కనే ఉన్న ఇర్లపాడు కార్యదర్శి రబ్బానికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించామన్నారు. దీనిపై ఆయన విచారించి బిల్లులు మంజూరయ్యేలా చూస్తారన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

యడ్లపాడు, న్యూస్‌టుడే: పౌర సేవలకు సంబంధించి విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పి.ఝాన్సీసాగర్ అన్నారు. ఆమె అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొలస ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొండవీడు, కోట, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో పత్తి దెబ్బతిన్నా ఒక్క ఎకరం కూడా పరిహారానికి నమోదు చేయలేదని ఆరోపించారు. ముందుగా అధికారులు శాఖాపరమైన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు రోటరీ కృషి

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ): విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రోటరీ కృషి చేస్తుందని చిలకలూరిపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్ అన్నారు. నాదెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.60 లక్షలతో నిర్మించనున్న ఆర్‌వో ప్లాంట్‌కు గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. అలాగే పాఠశాలలో 1991-92 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.1.50 లక్షల విరాళంతో పాఠశాలలో కిచెన్‌షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పూర్వ విద్యార్థి రామారావు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.నిర్మల, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు, సైన్సు ఉపాధ్యాయులు కెల్లంపల్లి రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్, పక్కన పూర్వ విద్యార్థులు

29 నుంచి ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

నూజండ్ల: ఉపాధ్యాయులకు ఒత్తిడి తగ్గించి శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం పెంచడం కోసం పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో రవిచంద్ర పేర్కొన్నారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 29 నుంచి పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 29న నూజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు.

తెదేపాలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు

ఈపూరు, న్యూస్‌టుడే: తెదేపాలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టరు రాపర్ల జగ్గారావు అన్నారు. ఈపూరు మండలం అంగలూరు సొసైటీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ బాలయ్య, సీఈవో కోటేశ్వరరావు, నర్రా కిషోరు తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి జైలుశిక్ష

యడ్లపాడు, న్యూస్‌టుడే: మహిళను వేధించి అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం శిక్ష విధించింది. పోలీసుల కథనం మేరకు... యడ్లపాడు మండలం వంకాయలపాడుకు చెందిన షేక్ కరీముల్లా అక్టోబరు 30, 2020న ఓ మహిళను నడిరోడ్డుపై వేధించి, అవమానకరంగా మాట్లాడి బెదిరించాడు. అప్పట్లో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేశారు. అతనిపై ఆరోపణలను పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో నిరూపించారు. చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

బాపట్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సీసీఎస్, అమృతలూరు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారని బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఆయన వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కొమ్మ వెంకట సాయి, సాయికృష్ణ, సంపంగిళి నాని, సయ్యద్ నాగూర్ వలి, పందుల రమేష్‌బాబు, ప్రకాశం జిల్లా పొదిలి మండలం రామాపురానికి చెందిన బండి శివారెడ్డి (ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు) దొంగల ముఠాగా ఏర్పడ్డారు. చెడు వ్యసనాలకు బానిసలై విలాసాలకు నగదు కోసం రెండేళ్ల నుంచి మోటార్ సైకిళ్ల చోరీ ప్రారంభించారు. దొంగతనం చేసిన వాహనాలను వేరే జిల్లాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిందితులపై ఇతర జిల్లాల్లోనూ కేసులు నమోదయ్యాయి. పోలీసుల విచారణలో సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించి వారి నుంచి రూ.16.50 లక్షల విలువైన 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. అందుగుల కొత్తపాలెంలో వినుకొండ నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న కారు కొత్తపాలెంకు చెందిన చేకూరి శ్రీను ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. అది రోడ్డు పక్కన యాచకుడిని తాకింది. యాచకుడికి తీవ్ర గాయాలు కాగా ద్విచక్ర వాహనం నుంచి కింద పడిన శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేట వాసి గతేడాది నవంబరు 8న బ్రహ్మంగారి మఠం సమీపంలో తన ఇంటి ఎదుట ద్విచక్రవాహనం పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

గోడ విషయంలో వివాదం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో పమిడిపాడు గ్రామంలో గోడ విషయంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు ఎట్టి ప్రకాష్, మెట్టెల వీరాంజనేయులు ఇళ్లు పక్క పక్కనే ఉన్నాయి. వీరి ఇళ్ల మధ్య గోడకు పెయింట్ వేసే విషయంలో వివాదం తలెత్తి పరస్పరం దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ప్రకాష్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాపు అమ్మకానికి కలదు

25 లక్షల పెట్టుబడితో నెలకు లక్ష రూపాయల ఆదాయం, నరసరావుపేటలో 3 సం॥లుగా (అద్దెతో నడుప బడుతున్న) రన్నింగ్‌లో వున్న పిల్లల బొమ్మలు మరియు బట్టల షాపు స్టాక్‌తో అమ్మకానికి కలదు.

9111879555

అప్పీల్ నోటీసు

A.S. No. 109/2024

Between:-

To

[illegible]

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

2న అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి వచ్చే నెల 2న అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరనున్నట్లు డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. 2వ తేదీ రాత్రి 9 గంటలకు బస్సు బయలుదేరి 3న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకుని రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. దర్శనం అనంతరం 4న కంచికి చేరుతుందన్నారు. అక్కడ దర్శనం అనంతరం బయలుదేరి 5వ తేదీ ఉదయం సత్తెనపల్లికి చేరుతుందన్నారు. రానుపోను టికెట్ ధర రూ.2,500గా నిర్ణయించామన్నారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. బుకింగ్‌తోపాటు మరిన్ని వివరాలకు 9959225429, 7382897583, 7382896966 చరవాణి నంబర్లలో సంప్రదించాలని డీఎం కోరారు.

అనాథ విద్యార్థులకు ఉచితంగా జనన ధ్రువీకరణ పత్రాలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఇరవై ఐదు మంది అనాథ విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు యువ నాయకుడు యరపతినేని సాయినిఖిల్ చొరవతో గురువారం అందజేశారు. లెనిన్‌నగర్ ప్రాంతానికి చెందిన 25 మందికి ఆధార్ కార్డులు లేవు. వారికి ఆధార్‌కార్డులు కావాలంటే జనన ధ్రువీకరణ పత్రాలు అవసరం. వాటిని పొందాలంటే ఒక్కో విద్యార్థి సుమారు రూ.3500 ఖర్చు చేయాల్సి ఉంది. అంత నగదు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానిక నాయకులు నిఖిల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి విద్యార్థులకు పత్రాలు ఇప్పించి, ఆధార్‌కార్డులు వచ్చేలా కృషి చేశారు. తహసీల్దారు మధుబాబు, పట్టణ తెదేపా నాయకులు పిల్లి చెన్నారావు, షేక్ మస్తాన్‌వలి ఈ ప్రక్రియ పూర్తి చేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? తండాలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- సోములానాయక్, హనుమాపురంతండా** ✔ వీధి దీపాలు వెలిగిస్తాం. **- మారుతి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, వెల్దుర్తి**

? రెంటచింతలలో ఎల్‌డబ్ల్యూఎస్ పథకం ద్వారా విద్యుత్తు పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. **- రంగనాయకులు, రెంటచింతల** ✔ ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పూర్తి చేయిస్తాం. **- సింగయ్య, ఈఈ - న్యూస్‌టుడే, రెంటచింతల**

మొండి బకాయిలే గుదిబండ

ఆస్తి పన్ను వసూళ్లలో వెనకంజ

సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

పురపాలిక	అసెస్‌మెంట్లు	డిమాండ్	వసూళ్లు (రూ.కోట్లలో)
సత్తెనపల్లి	16,127	8.16	2.94
పిడుగురాళ్ల	15,727	7.11	3.32
మాచర్ల	15,033	6.33	2.64
దాచేపల్లి	10,621	2.83	1.20
గురజాల	8,095	1.63	0.82

ఆస్తి పన్ను వసూళ్లలో సచివాలయ ఉద్యోగి

మున్సిపాల్టీలకు ఆస్తి పన్ను ప్రధాన ఆదాయ వనరు. ఆ ఆదాయంతోనే తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ చేపడతారు. నిధులు ఎక్కువగా ఉంటే రోడ్లు, కాలువలు, భవనాల నిర్మాణాల్ని పూర్తి చేస్తారు. పన్నుకు సంబంధించి మొండి బకాయిలు పురపాలక సంఘాలకు గుదిబండగా మారుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొదటి ఆరు నెలలు పూర్తయ్యాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వసూళ్లు ఆశించిన మేరకు జరగలేదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వసూళ్లు పక్కాగా చేపడితే ఆదాయం సమకూరుతుంది.

రెడ్ నోటీసులిస్తున్నా..

ఆస్తి పన్నుపై వడ్డీమాఫీ అవకాశం ఇచ్చినా మొండి బకాయిదారులు స్పందించట్లేదు. అలాంటి వారిని గుర్తించి రెడ్ నోటీసులు అందిస్తున్నారు. ఇంటింటికి సచివాలయ ఉద్యోగులు వెళ్లి పన్ను చెల్లించాలని కోరుతున్నారు. సత్తెనపల్లిలో రూ.2.06 కోట్ల పాత బకాయికిగాను రూ.32 లక్షలే చెల్లించారు. పిడుగురాళ్లలో రూ.1.37 కోట్లకు రూ.15 లక్షలు, మాచర్లలో రూ.1.89 కోట్లకు రూ.33.50 లక్షలు, దాచేపల్లిలో రూ.71 లక్షలకు రూ.13 లక్షలు, గురజాలలో రూ.30 లక్షలకు రూ.5.75 లక్షలే వచ్చింది. శతశాతం ఆస్తిపన్ను వసూళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్లు 'న్యూస్‌టుడే' బృందంతో చెప్పారు.

ఎక్స్‌రే తీయాలంటే గుంటూరు వెళ్లాల్సిందే

ఎక్స్‌రే యూనిట్

అమరావతి, న్యూస్‌టుడే: రెండు రోజుల కిందట రాత్రి ఏడు గంటల సమయంలో అమరావతి విజయవాడ జంక్షన్ వద్ద ఓ ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆయనను అమరావతి సామాజిక ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న వైద్యులు వృద్ధుడిని పరీక్షించి, కాలు విరిగినట్లుగా గుర్తించారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే తీసేందుకు ఆపరేటర్ లేరని, గుంటూరు తీసుకెళ్లాలని రాసి ఇచ్చారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత సీహెచ్‌సీలో ఎక్స్‌రే గదికి తాళం వేస్తున్నారు. ఎక్స్‌రే యూనిట్‌లో ప్రస్తుతం ఒక ఆపరేటర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విధుల్లో ఉంటున్నారు. ఆ తర్వాత ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎక్స్‌రే తీయాలంటే గుంటూరు జీజీహెచ్‌కి వైద్యులు రెఫర్ చేస్తున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌ను అడగ్గా ఆపరేటర్ ఒకరే ఉన్నారని, సమస్య లేకుండా చూస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సత్తెనపల్లి గ్రామీణ: రామకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి పి.ప్రేమ్ కుమార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల వెనిగండ్లలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీలో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం పొందాడు. స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో డిసెంబరులో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నాడు.

కుస్తీ పోటీల్లో సత్తా

సత్తెనపల్లి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కుస్తీ పోటీల్లో పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని మాకాని మహేశ్వరి సత్తా చాటింది. ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైంది. ఆమెను డైరెక్టర్ శ్రీనివాసరావు, సుజాత, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, పీడీ మురళీకృష్ణ అభినందించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రెంటచింతల: గురజాల, సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి ఏసుబాబు గురువారం స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం రుచి చూశారు. ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో నిత్యం మజ్జిగ అందిస్తున్నందున అభినందించారు.

భాజపా పట్టణ అధ్యక్షుడిగా శంకరరావు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భాజపా పట్టణ అధ్యక్షుడిగా శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. ఆయనను మెడికల్ అసోసియేషన్ నాయకులు, వ్యాపారులు సత్కరించారు.

చేనేత హస్తకళా ప్రదర్శన

గురజాల: గురజాల పాతపాటమ్మ తిరునాళ్ల పురస్కరించుకుని కారంపూడి రోడ్డులోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో చేనేత హస్తకళా ప్రదర్శనను సీఐ భాస్కర్ ప్రారంభించారు. డిసెంబరు 11 వరకు అమ్మకాలు సాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మానసిక దృఢత్వం అవసరం

సత్తెనపల్లి: యుక్త వయసులో ఆడబిడ్డలు నైతికంగా, మానసికంగా, భావోద్వేగాలపరంగా ఎంతో దృఢంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వేద కళాశాలలో గురువారం బాలికలు, మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సీఎస్ సీడీపీవో శ్రీలత, ఎక్సైజ్ ఎస్సై నాగలక్ష్మి, సేవాసంస్థ బాధ్యుడు బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటనెమలిపురిలో ఉద్రిక్తత

కోటనెమలిపురి(రాజుపాలెం): కోటనెమలిపురిలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. శివాలయం ఎదురుగా ఉండే స్థలం తమదంటే తమదని రెండు సామాజిక వర్గాల మధ్య మూడు నెలల కిందట వివాదం తలెత్తింది. బుధవారం ఇరువర్గాలు గుంపులుగా చేరి, గొడవకు దిగుతున్నట్లు సమాచారం రాగా పోలీసులు చేరుకుని పికెట్ ఏర్పాటు చేశారు. గురువారం గ్రామీణ సీఐ కిరణ్, ఎస్సై మణిక్యరావు గ్రామానికి చేరుకుని తగాదాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

అంతర పంటల సాగుపై అవగాహన

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వాణిజ్య పంటల్లో అంతర సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమల్‌కుమార్ సూచించారు. గురువారం పెదకూరపాడులో రాష్ట్ర అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న మిర్చి, అంతర పంటలను పరిశీలించారు. గో ఆధారిత సేంద్రియ సాగు చేపట్టడం అభినందనీయమన్నారు.

విద్యార్థుల దాతృత్వం

మాచర్ల (కారంపూడి): మాచర్లలోని నారాయణ స్కూల్ విద్యార్థులు దాతృత్వం చాటారు. గురువారం స్థానిక రామకృష్ణ సేవాశ్రమం, అనాథాశ్రమం, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరకులను అందించారు. ఆశ్రమాల నిర్వాహకుడు గోవిందరెడ్డి, ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి, జానకిరామిరెడ్డి, భద్రారెడ్డి, గౌసియా, రిహాని, రవీంద్ర, ఆంజనేయులు, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ జానీ(78) మృతి చెందారు. కొద్ది నెలల కిందట రహదారి ప్రమాదానికి గురైన జానీ చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

మహాసభల గోడపత్రాల ఆవిష్కరణ

పిడుగురాళ్ల: అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర మహాసభలు వచ్చేనెల 8,9వ తేదీల్లో గుంటూరులో జరగనున్నాయి. సభలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌బాబు గోడ పత్రాలను ఆవిష్కరించారు.

పదవికి వన్నెతెచ్చేలా పనిచేయాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పదవికి వన్నెతెచ్చేలా కష్టపడి పనిచేయాలని రాష్ట్ర మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రాష్ట్ర భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరాజుకు సూచించారు. గురువారం వేర్వేరుగా వారిని వెంకటేశ్వరరాజు కలిసి సత్కరించారు.

అన్నదాతల అభ్యున్నతికి కృషి

పల్లెగుంత(గురజాల గ్రామీణ), న్యూస్‌టుడే: రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సాగర్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. పల్లెగుంత గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత రూ.30 లక్షల నిధులతో నిర్మించనున్న హెల్త్ క్లీనిక్ భవనానికి భూమిపూజ చేశారు. ఏవో పుల్లారెడ్డి, తెదేపా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రకాశ్, వీరనారాయణ, సత్యం పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సేవాసంస్థలు పాటుపడాలని ఎంఈవో సుధారాణి అన్నారు. మండలంలోని మాదల ఎంపీపీఎస్(హెచ్‌డబ్ల్యు) పాఠశాలలో దళిత ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేవా సంస్థ బాధ్యుడు లాజర్‌బాబు, గ్రామ పెద్దలు బసవయ్య, సైదుబాబు, ప్రవీణ్, హెచ్ఎం నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కస్తల (అచ్చంపేట), న్యూస్‌టుడే: గ్రామ, మండల స్థాయి అధికారులు సమన్వయం, సేవాభావంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం కస్తల గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే స్వయంగా దివ్యాంగుడు లక్ష్మీనారాయణ వద్దకు వెళ్లి అతడి అర్జీని స్వీకరించారు. పింఛను మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కృష్ణానది తీర గ్రామం కస్తలలో ఇసుక ర్యాంపు మంజూరు చేయించి, పడవల యజమానులు, కూలీలకు జీవనోపాధి కల్పించాలని గ్రామ తెదేపా అధ్యక్షుడు శ్రీధర్, సొసైటీ డైరెక్టర్ ఖాజావలి కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కస్తలలో వివిధ పథకాల ద్వారా రూ.5.66 కోట్ల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. రూ.36 లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు ఆశీర్వాదం, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష వద్దు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రజనీకుమారి, సిబ్బంది

మాచవరం, న్యూస్‌టుడే: లింగ వివక్షపై గురువారం స్థానిక కుటుంబ న్యాయ సలహా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజనీకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ తేడా లేదని, అందరూ సమానులేనని అన్నారు. ఎక్కడైనా లింగ వివక్షత చూపితే తగు చర్యలు ఉంటాయన్నారు. అనంతరం మానవహారంలా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఇన్‌ఛార్జి ఏపీఎం బాలస్వామి, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

హస్నాబాద్ తండాలో సోదాలు

కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: మాచర్ల మండలం హస్నాబాద్‌తండాలో పోలీసు, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని 23 బైక్‌లు, 16 గొర్రెలు, 14 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణ, ఎక్సైజ్ సీఐ ఎన్.వెంకటరమణ, విజయపురిసౌత్ ఎస్సై ఆశోక్, ట్రైనీ ఎస్సై రాంబాబు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించరూ..

దుర్గి, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను తెలంగాణకు చెందిన కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండలానికి చెందిన పలువురు రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు గురువారం విన్నవించారు. 2008లో అప్పటి ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా 100 ఎకరాలు అడిగొప్పల గ్రామానికి చెందిన 100 ఎస్సీ కుటుంబాలకు అందించారన్నారు. అప్పట్నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల 26 ఎకరాలకు సంబంధించిన ఆ భూముల పట్టాల్లో పేర్లు మార్చారని, మిగతా పొలాల పత్రాల పేర్లు మార్చే ప్రయత్నంలో ఉన్నారన్నారు. న్యాయం చేయాలని బాధిత రైతులు జార్జి, అనిల్, అబ్రహం, శ్రీను తదితరులు కోరారు. ఆర్డీవో మురళీకృష్ణకు కూడా వినతిపత్రం అందించారు.

అటవీ భూముల పరిశీలన

భూముల పరిశీలిస్తున్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, అటవీ అధికారులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని అసైన్డ్, అటవీ భూములను గురువారం ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, అటవీశాఖ డీఎఫ్‌వో కృష్ణప్రియ పరిశీలించారు. చెరుకుపాలెం గ్రామస్థులకు గతంలో డీకే పట్టాలు ఇవ్వగా ఆ భూముల వివరాలను పరిశీలించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన

సూచనలిస్తున్న వైద్యురాలు లక్ష్మీప్రసన్న

వెల్దుర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోనే ఎక్కువగా బాల్య వివాహాలు వెల్దుర్తి మండలంలో జరుగుతున్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని ఉప్పలపాడు ఆరోగ్యకేంద్రం వైద్యురాలు లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యురాలు మాట్లాడుతూ మండలంలో నిరక్షరాస్యత, పేదరికం కారణంగా ఆడపిల్లలకు చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాలు నేరమన్నారు. బాలికలు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్నవయసులో పెళ్లి చేస్తే పలు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రధానోపాధ్యాయిని గంగాభవాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల సమస్య పరిష్కరించండి

ప్రసంగిస్తున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి

మాచవరం, న్యూస్‌టుడే: మాచవరం మండల పరిషత్తు సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమస్యలు ప్రస్తావించారు. మాచవరంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, రోజురోజుకు వాటి సంఖ్య పెరిగి దాడులకు పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపాలెం గ్రామ సచివాలయం తలుపులు తీసేవారు కరవయ్యారని, ఉన్న ఒక ఇంజినీరింగ్ అసిస్టెంట్ సెలవు పెట్టారని చెప్పారు. మాచవరం ఎస్సీ కాలనీలో లైబ్రరీ భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్తది నిర్మించాలని విన్నవించారు. రీసర్వేలో ఏమైనా అభ్యంతరాలుంటే అర్జీ రూపంలో తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దారు నాగమల్లేశ్వరరావు సూచించారు. సమావేశానికి కొన్ని శాఖల అధికారులు రావడం మానేశారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ఇబ్బంది పడతారని ఎంపీడీవో విష్ణు చిరంజీవి హెచ్చరించారు.

తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

సమీక్షిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్

గురజాల: గురజాల పాతపాటమ్మ తిరునాళ్లను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆర్డీవో మురళీకృష్ణ ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరునాళ్ల రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. సమీక్షలో డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం

మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, న్యూస్‌టుడే: అన్నదాతల శ్రేయస్సే తమ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. నర్శింగపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యేతోపాటు డీసీఎంఎస్ ఛైర్మన్ హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా పాలనలో రైతులు ధాన్యం అమ్మాలంటే నానాకష్టాలు పడేవారన్నారు. అమ్మిన ధాన్యం డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలిసేది కాదన్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాలో పడుతున్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని సూచించారు. పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా ప్రధాన కార్యదర్శి నాగౌతు శౌరయ్య, సాగి శ్రీను, తహసీల్దారు పుల్లారావు, ఏవో దేవదాసు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్ ప్రజావేదికలో గురువారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్ల నిర్మాణాలకు 123 మంది పేదలకు మంజూరు పత్రాలను కన్నా అందజేశారు. అర్హులందరికీ పక్కాఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తోటివారికి సహాయంతోనే సంతృప్తి

సత్తెనపల్లి: తోటివారికి సహాయం చేయడంలో సంతృప్తి ఉంటుందని స్థానిక నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారావు అన్నారు. పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక పరివర్తన ఆశ్రమ పాఠశాలలో థ్యాంక్స్ గివ్వింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆశ్రమ చిన్నారులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరకులు, చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు.

విజేతలతో ఉపాధ్యాయులు

ప్రసంగించి.. బహుమతులు సాధించి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం నిర్వహించారు. విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు చేపట్టారు. విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవటానికి సెల్‌ఫోన్ బాగా ఉపయోగపడుతుంది. అధికంగా వినియోగిస్తే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పోటీల్లో వై.మేరిషా, కె.రక్షిత, ఎన్.అమర్‌నాథ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.సైదారెడ్డి, వాణి బహుమతులు అందజేశారు.

'బడుగుల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిఖా మీల్ బరాల

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ప్రజల మధ్య చిచ్చు పెట్టదని.. ప్రజా హితం, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎల్లప్పుడూ పనిచేస్తుందని ఆ పార్టీ రాజస్థాన్ రాష్ట్రం చోము నియోజకవర్గ ఎమ్మెల్యే శిఖా మీల్ బరాల అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ బలోపేతానికి అందరి అభిప్రాయాలు తీసుకుంటామని, ప్రజా సమస్యలపై ఉత్సాహంగా పోరాడే వారిని ప్రోత్సహిస్తామన్నారు. ప్రజల హక్కులు, సమస్యలపై ఉద్యమాలు చేసేవారికి అండదండలు అందిస్తామన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఏపీసీసీ కార్యదర్శి ఖుర్షిదా, పార్టీ జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్కా చంద్రపాల్, నాయకులు బాషా, జ్ఞాన్‌రాజ్‌పాల్, శివనాగేశ్వరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజలం.. బడులకు దూరం

కుమ్మరిపాలెం,శివాలయం ఏరియా (పిడుగురాళ్ల), న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి కష్టాలు తీరడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నీటి శుద్ధి యంత్రాలు అమర్చినా నిర్వహణ గాలికి వదిలేశారు. పలు యంత్రాలు అటకెక్కాయి. రూ.లక్షల వ్యయం వృథా అవుతోంది. పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల, కరాలపాడు ప్రాథమిక, ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలోని శుద్ధజల యంత్రాలు పనిచేయడం లేదు.

ఫ్లోరైడ్ నీరే గతి

పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1710 మంది అభ్యసిస్తున్నారు. జిల్లాలోనే అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలగా గుర్తింపు పొందింది. ఇక్కడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాంట్‌ను ఏడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. మరో ప్లాంట్‌ను నాడు-నేడు కార్యక్రమంలో అమర్చారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన ప్లాంట్ పట్టుమని పదిరోజులు కూడా పనిచేయలేదు. క్లబ్ అందజేసిన శుద్ధజలం యంత్రం మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం బోరు నీటిని ట్యాంకుకు ఎక్కించి, విద్యార్థులకు అందిస్తున్నారు. బోరు నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంది. ఆ నీరు తాగడానికి యోగ్యం కాదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకుని యంత్రాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరాలపాడు పాఠశాలలో నిరుపయోగంగా ప్లాంటు

★ కరాలపాడులోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ కూడా శుద్ధజల కేంద్రం పని చేయడం లేదు. స్థానికంగా లభ్యమయ్యే నీటిని తాగుతున్నారు. పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలోని శుద్ధజలం అటకెక్కింది. ఈ విద్యాలయంలో 152 మంది బాలికలు వసతి పొందుతున్నారు. ప్రస్తుతం ఓ వ్యక్తి శుద్ధజలాన్ని బాలికలకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అగ్రి కమర్షియల్ బ్రాంచ్ (01010), మాచర్ల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522426.

చర / స్థిరాస్తి ఇ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన

ఇ-వేలం తేదీ మరియు సమయం: 18.12.2025, సాయంత్రం గం. 04-00 లకు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002లోని యాక్ట్ 54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన చర / స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం.

www.psballiance.com

రిజర్వు ధర: రూ.25,36,920/- ధరావత్తు: రూ.2,53,692/-

బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-

ఇ-వేలం తేదీ సమయం: 18.12.2025 ఉ|| 11.00 గం||ల నుండి సా|| 04.00 గం||ల వరకు

https://ebkray.in/ eauction-psb/baanknet.com/bidder-registration

తేదీ: 27.11.2025, ప్రదేశం: మాచర్ల సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

ఈనాడు పార్వతీపురం మన్యం

శుక్రవారం నవంబరు 28, 2025 5

నమో నారసింహ..

సీతానగరం వేణుగోపాల స్వామి ఆలయ సన్నిధిలోని లక్ష్మీనరసింహుడికి గురువారం ముడుపుల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యుల ఆధ్వర్యంలో మూల విరాట్‌ను పుష్ప, తులసి మాలలతో అలంకరించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సీతానగరం

5న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ?



పార్వతీపురం, సీతంపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు డిసెంబరు మొదటి వారంలో రానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు కసరత్తు చేస్తోంది. రానున్న రోజుల్లో పాఠశాలల్లో విద్యార్థులందరికీ కనీస విషయ సామర్థ్యాన్ని కచ్చితంగా అందిస్తామనే గ్యారంటీని ప్రభుత్వం ఇవ్వనుంది. డిసెంబరు 5న జిల్లా వేదికగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే వీలుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. భామినిలో పాల్గొనే సమావేశంలో సీఎం ప్రకటించనున్నట్లు సమాచారం. కలెక్టర్ ప్రభాకరరెడ్డితో జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం ఈ విషయమై చర్చించారు. పర్యటనకు సంబంధించి అధికారికంగా ప్రకటన ఏదీ ఇంకా వెలువడలేదు.

బుజ్జాయి.. ఆరోగ్యమస్తు..!

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతంపేట

పార్వతీపురం మండలం పిండిలోవకు చెందిన ఈ బాలిక పేరు భారతి. ఏడాది వయసున్న ఈమె 10 కిలోల బరువుండాలి. 7.3 కిలోలే ఉండడంతో పౌష్టికాహార పునరావాస కేంద్రంలో ఈ నెల 21న చేర్పించారు. ప్రస్తుతం 7.8 కిలోలకు బరువు పెరిగింది.

భారతి

ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా 50 నుంచి 60 మంది చిన్నారులు పునరావాస కేంద్రాల్లో చేరి వయసు, ఎత్తుకు తగ్గ బరువు పెరుగుతున్నారు. అదే ఇంటి వద్ద పిల్లాడి పొట్ట నిండేలా అన్నం పెడుతున్నా... నీరసంతో చాలా మంది బాలలు వయసు, ఎత్తుకు తగ్గ బరువు ఉండడం లేదు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులకు పిల్లలకు ఇచ్చే పోషకాహారంపై అవగాహన లేమి అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పోషకాహార లోపంతో అనారోగ్య సమస్యలు

చాలా మంది చిన్నారులను పౌష్టికాహార లోపం వేధిస్తోంది. పది నెలల శిశువులు 8 కిలోలు, ఏడాది బిడ్డ 10 కిలోల బరువుండాలి. అలా ఉండట్లేదని సర్వేలో తేలింది. వయసుకు తగ్గ ఎదుగుదల లేని పిల్లలు 7,450 మంది, పొడుగుకు తగ్గ బరువు లేనివారు 10,240 మంది ఉన్నారు. కొందర్ని పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు తరలిస్తుండడంతో మార్పు ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

3 ఉమ్మడి జిల్లాలో పౌష్టికాహార పునరావాస కేంద్రాలు

7 వేల మంది ఎదుగుదల లేనివారు

10 వేల మంది తక్కువ బరువున్న వారు

చిన్నారులు: **2.10** లక్షల మంది

6-8 నెలల వరకు.. బియ్యం, మినపప్పు, కందిపప్పు, పెసరపప్పును వేయించి పొడి చేసుకొని ఒకటి లేదా రెండు స్పూన్ల చొప్పున ఉడికించాలి. కొంచెం ఉప్పు, నెయ్యి కలిపి మొదటి ఆహారంగా అందించాలి.

పౌష్టికాహార పునరావాస కేంద్రంలో బరువు తక్కువ పిల్లలు

ఈ ఆహారం తప్పనిసరి.. పిల్లల ఆహారంలో ధాన్యాలు, పప్పు దినుసులు, ఆకు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు, మాంసం ఉండేలా చూసుకోవాలని న్యూట్రిషియన్ జ్యోతి తెలిపారు.

8 నెలల తర్వాత.. మెత్తగా ఉడికించిన అన్నం, పప్పును నెయ్యితో కలిపి తినిపించాలి. రాగిపిండి, బెల్లంతో చేసి జావ తాగించాలి. కిచిడి, పులగం ఇవ్వాలి.

ఏడాది దాటాక

ఉప్మా, పప్పు ఆకుకూరలు, కూరగాయలతో సాంబారు, రవ్వపాయసం, కిచిడీ, పులగం క్యారెట్, గుడ్డు వంటివి అలవాటు చేయాలి. ● చికెన్, మటన్ వంటివి మితంగా ఇవ్వాలి. ● చిన్నారులకు రోజుకు 5నుంచి 6సార్లు ఆహారం ఇవ్వాలి. ● మెత్తగా వండిన అన్నానికి పప్పు కలిపి తినిపించాలి. ● క్యారెట్, బంగాళ దుంప మెత్తగా ఉడికించి బియ్యం, పెసర పప్పుతో కలిపి పొంగలి చేసి ఇవ్వొచ్చు. ● ఉడికించిన గుగ్గిళ్లు, పెసలు, అలసందలు, అయిదేళ్లలోపు వారికి ఇవ్వడం మంచిది. ● చక్కెరతో తయారు చేసిన బాలామృతం ఇస్తే మంచి బలవర్ధకం.

ప్రత్యేక శ్రద్ధచూపుతున్నాం..

బాలలకు ఏ ఆహారం ఇవ్వాలో అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోతే వైద్యుల సూచనలతో పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు పంపిస్తున్నాం. – కనకదుర్గ, పీడీ, ఐసీడీఎస్

కొమరాడ మండలం వనధార గ్రామానికి చెందిన నాలుగేళ్ల నితీష్ 14 కిలోల బరువుండాలి. 11 కిలోలే ఉండడంతో కేంద్రంలో ఈ నెల 17న చేర్పించారు. పది రోజుల్లో 11.7 కిలోలకు చేరినట్లు నిర్వాహకుడు తెలిపాడు.

నితీష్

ప్రాధాన్యమన్నారు.. పాట్లు మిగిల్చారు..!

ప్రారంభోత్సవానికి నోచుకోని గరుగుబిల్లి సచివాలయం

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, పార్వతీపురం

గరుగుబిల్లి మండలంలో 13 గ్రామ సచివాలయాలకు భవనాలు మంజూరు కాగా శివ్వాం, గొట్టివలసలో కోర్టు కేసుల కారణంగా నిర్మాణాలు చేపట్టలేదు. రైతు సేవా కేంద్రాలు 8 పూర్తికాలేదు. 9 వెల్‌నెస్ సెంటర్ల భవనాలు మంజూరవ్వగా ఒక్కటే భవనమే అప్పగించారు.

సచివాలయాల పరిధిలో ప్రాధాన్యత భవనాలు నిర్మిస్తాం.. ఈ వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసి.. అయిదేళ్లు కాలయాపన చేసింది. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ గ్రంథాలయాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు మంజూరు చేసింది. ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. తీరా ప్రారంభించాక అన్నింటికీ నిధులివ్వలేమని గ్రహించి.. ప్రాధాన్య పనులే పూర్తిచేయాలని ఆదేశించింది. డిజిటల్ గ్రంథాలయాలు, బల్క్ మిల్క్ యూనిట్ల పనులు పక్కనెట్టేసింది. మిగిలినవీ అసంపూర్తి నిర్మాణాలతో వెక్కిరిస్తున్నాయి.

కూటమి సర్కారుకు భారం

గత ప్రభుత్వం చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల భవనాల పూర్తికి ఉమ్మడి జిల్లాలో రూ.320 కోట్లు అవసరం. గుత్తేదారులకు బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం గత 18 నెలల్లో అంచెలంచెలుగా నిధులు మంజూరు చేసింది. రెండు జిల్లాల్లోనూ వందవరకూ సచివాలయ భవనాలు పూర్తయినా బిల్లులు పెండింగ్ వల్ల అప్పగించలేదు. 35 ఆర్‌బీకేలు అప్పగించాల్సి ఉంది. నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

మన్యం జిల్లా వివరాలు (వ్యయం ఒక్కోదానికి)..

భవనం	మంజూరు	పూర్తయినవి	వ్యయం (రూ.లక్షల్లో)
గ్రామ సచివాలయాలు	311	122	43.06
రైతు సేవా కేంద్రాలు	301	100	23.94
వెల్‌నెస్ సెంటర్లు	192	16	20.80

పక్కదారి పడితే పట్టేస్తుంది!

బీసీ వసతి కేంద్రంలో యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫొటోలు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

వసతిగృహాల్లో పర్యవేక్షణలోపం, శుభ్రత, భోజనాలపై నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల కురుపాంలోని గిరిజన గురుకులం వసతి గృహంలో పచ్చకామెర్లతో వందల మంది ఆసుపత్రి పాలయ్యారు.. ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఉడకని భోజనం పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యానికి కళ్లెం వేసి, వసతి కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత పెంచేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) పేరుతో ఏఐ (కృత్రిమ మేధ) వ్యవస్థతో పనిచేసే ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. దీన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి కేంద్రాల వార్డెన్ల చరవాణిల్లో ఇన్‌స్టాల్ చేశారు. వీటి మోనటరింగ్ కోసం జిల్లా కేంద్రానికి ఓ యాప్‌ను ఇచ్చారు.

ఏఐ కొత్త యాప్‌తో హాస్టళ్లలో అక్రమాలకు అడ్డుకట్ట

యాప్ ఇలా పనిచేస్తుంది..

యాప్ నిర్వహణపై ఇటీవల వార్డెన్లకు శిక్షణ ఇచ్చారు. ఆ మేరకు రోజూ ప్రతి పనినీ ఫొటో తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ప్రతి మెనూ వివరాలు, ఆవరణ, మరుగుదొడ్లు, గదులు శుభ్రత చిత్రాలు అప్‌లోడ్ చేయాలి. దీంతో పాటు పుస్తకాలలోనూ నమోదు చేయాలి. ఈ రెండింటి వివరాలు సరిపోతేనే బిల్లులు మంజూరు చేస్తారు.

జిల్లాల్లో వసతి గృహాల వివరాలివీ..

జిల్లా	హాస్టళ్లు	విద్యార్థులు
పార్వతీపురం	116	23,000
విజయనగరం	100	11,450

ప్రయోజనమిదీ..

వసతి కేంద్రాల్లో పారదర్శకత పెంచేలా ఈ యాప్‌ను తీసుకొచ్చింది. రోజూ చేపట్టే పనులతో పాటు వారాంతం, నెలవారీ కార్యక్రమాలు పక్కాగా అమలయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా సిబ్బందికి తక్షణమే హెచ్చరికలు వెళ్తాయి.

అడ్డుకట్ట వేయడానికే..

ఈ యాప్ ద్వారా వసతి కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ఏ సమస్య ఉన్నా తెలుస్తుంది. వెంటనే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

– జ్యోతిశ్రీ, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సంక్షేమాధికారులు

శ్రీరంగరాజపురంలో వైద్య శిబిరం

ఈనాడు కథనానికి స్పందన

బలిజిపేట, న్యూస్‌టుడే: నారన్నాయుడువలస పంచాయతీ పరిధిలోని శ్రీరంగరాజపురం గ్రామంలో గళావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 'ఈనాడు'లో గురువారం 'మన్యంపై ఫ్లోరైడ్ పడగ' శీర్షిక వెలువడిన కథనానికి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. గళావల్లి పీహెచ్‌సీ వైద్యులు బి.రేవతి, జి.రవికుమార్, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి.. కిడ్నీ రోగుల మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. అవసరమైన మందులను సిఫార్సు చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఆరుగురు డయాలసిస్ రోగులున్నట్లు గుర్తించారు. అనంతరం గ్రామంలోని ఆర్వో ప్లాంటును పరిశీలించి, నీటి నమూనాలు సేకరించారు.

వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వ వైద్యులు

విద్యార్థులందరికీ నేత్ర పరీక్షలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యార్థులందరికీ ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందికి, పాత్రికేయులకు గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా లక్షన్నర మంది విద్యార్థులు ఉన్నారని, అందరికీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా ఇచ్చేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

ఆచరిస్తూ.. అవగాహన కల్పిస్తూ..

ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, సాలూరు

పచ్చదనం పెంపు, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా.. తాము పాటిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవడంతో రాష్ట్ర, జాతీయ పురస్కారాలు అందుకున్నారు సాలూరుకు చెందిన శ్రీశ్యామలగౌరీ ఎస్‌ఎల్‌ఎఫ్, కోటవీధి విజయదుర్గ మహిళా సంఘం సభ్యులు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నారు. ఈ ఏడాదీ పురస్కారాలు పొందారు.

పురస్కారం అందుకుంటున్న సభ్యులు (పాతచిత్రం)

మిద్దెసాగుతో పురస్కారం

కోటవీధిలో విజయదుర్గ మహిళా సంఘ సభ్యులు పచ్చదనం పెంచేందుకు ఎంతగానో కృషి చేసి జిల్లాస్థాయిలో పురస్కారం పొందారు. గత నెల రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత, పచ్చదనంలో మిద్దె పంట విభాగంలో ఈ సంఘం పురస్కారం, ప్రశంసాపత్రం అందుకుంది. సంఘ అధ్యక్షురాలు రీనాపాడి మిద్దె సాగు చేస్తున్నారు. సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. సుమారు వంద రకాల మొక్కలు పండ్లు, పూలు, కూరగాయలు పెంచుతున్నారు. ఇంట్లో తడిచెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి వినియోగిస్తున్నారు. ఇంటి అవసరాలు తీరగా మిగిలిన ఫలసాయం బంధువులకు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం ప్రోత్సహిస్తూ పురస్కారం అందించడం ఆనందంగా ఉందని రీనాపాడి తెలిపారు.

మిద్దెసాగుతో పురస్కారం పొందిన రీనాపాడి

జాతీయస్థాయిలో గుర్తింపు

వెలమపేటలోని శ్రీశ్యామలగౌరీ ఎస్‌ఎల్‌ఎఫ్‌లో 28 మహిళా సంఘాలు, 292 మంది సభ్యులున్నారు. వీరంతా వార్డులు, వీధుల్లో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి, హానికర వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. చెత్త వేసేందుకు ఎరుపు, ఆకుపచ్చ బుట్టలను వినియోగిస్తూ, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని ప్రచారం చేశారు. ప్రజలంతా పాటించేలా చేయడంలో మహిళా సంఘ సభ్యులు సఫలీకృతులయ్యారు. ఏటా ఆదర్శ బృందంగా ఉన్నారు. దీంతో 2018లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో మూడో స్థానం దక్కించుకున్నారు. పురస్కారంతో పాటు రూ.50 వేలు నజరానా కూడా అందుకున్నారు. 2025 అక్టోబరు స్వచ్ఛ వేడుకల్లో జిల్లా మంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.

15కు పైగా శాఖలున్నా శుభ్రత పట్టేదెవరికి?

ఈ ట్యాప్‌లు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం(ఆర్సీఎం పాఠశాల) వద్దవి. గతంలో పాఠశాల పిల్లలు ఉండేటప్పుడు భోజనాలు చేశాక క్యారేజీలు శుభ్రం చేసుకునేవారు. విలీనంలో ఈ పాఠశాలను ఎత్తివేశారు. ఖాళీగా ఉన్న భవన సముదాయాన్ని కార్యాలయాల కోసం అద్దెకు తీసుకున్నారు. ఇక్కడ 15కు పైగా జిల్లా కార్యాలయాలు నడుస్తున్నాయి. వందలాది మంది సిబ్బంది క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. వాటిని శుభ్రం చేసుకునేందుకు ఆవరణలో ఉన్న ట్యాపులను వినియోగించుకోలేని పరిస్థితి. నీటి సరఫరా ఉంది.. కాస్త శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకువస్తే చక్కగా వాడుకోవచ్చు. 15 శాఖల్లో ఏ ఒక్క శాఖ అధికారులైనా ముందడుగు వేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

ఉద్యోగుల వినతుల స్వీకరణ నేడు

పార్వతీపురం: వివిధ శాఖల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక వినతుల విభాగాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని, ఉద్యోగులు తమ సమస్యలు, విశ్రాంత ఉద్యోగులు పింఛను ఇబ్బందులపై వినతులు ఇవ్వొచ్చన్నారు.

విజయనగరం 2.. మన్యం 3

● స్త్రీనిధి రుణ వినియోగంలో ఇవీ స్థానాలు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: స్త్రీనిధికి ప్రత్యేకించి లక్ష్యాలు ఉండవని, మహిళల అవసరం మేరకు రుణం తీసుకోవచ్చని అయిదు జిల్లాల స్త్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజరు కృష్ణంనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఏజీఎం చిట్టిబాబుతో కలిసి ఎల్.కోట వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పొదుపు సంఘాలకు నవంబరు నాటికి రూ.482.48 కోట్లు రుణం ఇచ్చేందుకు లక్ష్యం పెట్టుకున్నామని, ఇప్పటివరకు రూ.459.55 కోట్లు అందజేశామన్నారు. దీంతో ఈ జోన్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఏటా 97 శాతం రికవరీ అవుతున్నట్లు చెప్పారు. రుణాల వినియోగంలో మొదటి స్థానంలో శ్రీకాకుళం, తర్వాతి స్థానాల్లో విజయనగరం, మన్యం, విశాఖ, అల్లూరి సీతారామరాజు ఉన్నాయన్నారు. విజయనగరం జిల్లాలో విజయనగరం, మెంటాడ, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి, వంగర మండలాలు వెనుకబడి ఉన్నాయని, మిగతావి సక్రమంగా వినియోగించు కుంటున్నాయని చెప్పారు.

రండి.. తోటపల్లి అందాలు చూసొద్దాం!

పర్యాటకులను ఆకట్టుకునేందుకు తోటపల్లి జలాశయం పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్ది పర్యాటక శోభ తీసుకొస్తున్నారు. గరుగుబిల్లి మండలంలోని ప్రసిద్ధ తోటపల్లి వేంకటేశ్వరాలయం, జలాశయాలను సందర్శించేందుకు వచ్చే వారిని ఆకట్టుకునేందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, చిన్నారుల పార్కులను ఆధునికీకరించింది. అంతర్రాష్ట్ర రహదారి నుంచి తోటపల్లి జలాశయం అందాలు చూసేందుకు గట్టుపై వెదురు కర్రలతో నిర్మాణాలు, చిన్నారులు, యువత ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, ఉద్యాన క్షేత్రంలో గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా బొమ్మలు, అందమైన ఆకృతులతో పగోడాలు, కుర్చీలు, ముఖ ద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఒడిశా పర్యాటకులను ఆకట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ ఏఈ తిరుపతిరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

రంగులు అద్దుకుంటున్న గిరిజన సంప్రదాయ బొమ్మలు

సుంకి ఉద్యాన క్షేత్రంలో అందమైన నిర్మాణాలు

అమృతమూర్తికి శ్రద్ధాంజలి



జననం: 09-09-1950

మరణం: 18-11-2025

మంచితనానికి మారుపేరుగా నిలిచి, ఆప్యాయత, అభిమానాలు మా అందరికి పంచి, కుటుంబ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడి, మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకొని మీరు స్వర్గస్తులైనందుకు మిక్కిలి చింతిస్తూ.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

కీ॥శే॥ శ్రీమతి బలగ సింహాచలం గారు

క్రిష్ణపల్లి గ్రామం, పార్వతీపురం (మండలం)

పార్వతీపురం మన్యం జిల్లా

భర్త: బలగ బలరాం నాయుడు

Rtd L.F.L. Head Master

కుమారులు - కోడళ్లు - మనుమలు / మనుమరాండ్రు

బలగ గోపాలక్రిష్ణ (ప్రసాద్) - శ్రీమతి బలగ భవాని - బలగ సుచిత్‌శ్రీ - బలగ హిమానిశ్రీ

బలగ చంద్రమౌళి - శ్రీమతి బలగ గీతాలత - బలగ హితేంద్ర,బలగ హాసిని

కుమార్తె - అల్లుడు - మనుమలు / మనుమరాండ్రు / మునిమనుమరాలు

అల్లు పద్మజ - అల్లు వెంకటరమణ - అల్లు నవీన్‌కుమార్ - శ్రీమతి జశ్విత

- ఇషానిపూర్వ

అల్లు శ్రీకాంత్ - శ్రీమతి షర్మిల

బంధుమిత్రులు, ఇతర కుటుంబ సభ్యులు సంతాప సందేశాలతో

పెద్దకర్మ: తే 28-11-2025దీన శుక్రవారం క్రిష్ణపల్లి గ్రామంలో మా స్వగృహమునందు జరుగును

(c) eenadu

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

అంతర విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

శిక్షకుడు రాముతో కలిసి బంగారు పతకం చూపిస్తున్న పల్లవి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రాజస్థాన్ రాష్ట్రంలో జరుగుతున్న ఖేలో ఇండియా అంతర విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలం కొండ వెలగాడ గ్రామానికి చెందిన ఎస్. పల్లవి సత్తా చాటి బంగారు పతకం సాధించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున ఆమె పాల్గొన్నట్లు శిక్షకుడు రాము తెలిపారు. 69 కిలోల కేటగిరీలో స్నాచ్ 90 కిలోలు, క్లీన్‌అండ్‌జర్క్ విభాగంలో 110 కిలోలు కలిపి 200 కిలోల బరువులెత్తి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెదేపా విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు ఎస్. రవిశేఖర్, మండలాధ్యక్షుడు కె. ఆనంద్‌కుమార్ తదితరులు అభినందించారు.

డోలీ మోతలు పట్టించుకోండి సారూ..!

గిరిజనులను రహదారి కష్టాలు ఇంకా వెంటాడుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నేటికీ డోలీ మోతలు తప్పడం లేదు. తాజాగా కురుపాం మండలం ఒబ్బంగి పంచాయతీ పరిధిలోని తోలుంగూడ గ్రామానికి చెందిన వృద్ధుడు మండంగి కింబాపు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఊరికి రహదారి సదుపాయం లేక స్థానికులు డోలీ కట్టి సుమారు ఏడు కిలోమీటర్లు మోస్తూ నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాకిలి కూడలి ప్రధాన రహదారి నుంచి తోలుంగూడ మీదుగా లిక్కిడి కూడలి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోసంగూడ, కుంబరివలస, గోమాయిగూడ, విప్పమానుగూడ గిరిజనులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

మంచానికి తాళ్లు కట్టి వృద్ధుడిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న గ్రామస్థులు

విద్యార్థి దశలోనే లక్ష్యాలపై దృష్టిపెట్టాలి

విజయనగరం విద్యావిభాగం, పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే బాలలంతా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకెళ్లాలని ఎస్పీ దామోదర్ సూచించారు. సీఎస్ఆర్ నిధులతో ఎస్‌బీఐ సమకూర్చిన 16 సైకిళ్లను విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు గురువారం ఆయన అందజేశారు. అన్ని రంగాల్లోనూ బాలలు రాణించాలన్నారు. అంతర్జాలం, సామాజిక మాధ్యమాలను ఉపయోగపడేలా వినియోగించాలని కోరారు. వాటికి బానిసలు కావొద్దన్నారు. ఎస్‌బీఐ ప్రాంతీయ ప్రబంధకుడు ఎం. సురేష్‌బాబు, ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆర్. గోవిందరావు, ఉప విద్యాశాఖాధికారి కె. వి. రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి. లలితకుమారి, రెండో పట్టణ సీఐ టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లతో విద్యార్థినులు, చిత్రంలో ఎస్పీ దామోదర్ తదితరులు

రూ.345.11 కోట్ల ఆదాయమే లక్ష్యం

రాజాం, న్యూస్‌టుడే: జిల్లాలోని 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా అక్టోబరు నాటికి రూ. 194.99 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. రూ. 188.06 కోట్లు సాధించామని **జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఉపేంద్రరావు** తెలిపారు. రాజాంలోని కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. తెర్లాం, కొత్తవలస, విజయనగరం కార్యాలయాలు మిగిలిన వాటి కంటే కాస్త వెనుకబడినట్లు గుర్తించామన్నారు. మార్చి నెలాఖరు నాటికి రూ. 345.11 కోట్లు సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, దళారులను ఆశ్రయించొద్దని చెప్పారు. అవగాహన లేకపోతే తమ కార్యాలయంలో సహాయం అందించేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టాంపు వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ వేణు ఉన్నారు.

ఉన్నత విద్యకు పదో తరగతి తొలిమెట్టు

మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు పదో తరగతి తొలిమెట్టని జిల్లా డీఈవో మాణిక్యంనాయుడు అన్నారు. ఎల్.కోట ఉన్నత పాఠశాలలో పదో తరగతికి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గురువారం పరిశీలించారు. సొంత ఆలోచనలతో ముందుకు సాగితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. లక్ష్యాలు నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఒత్తిడితెచ్చి సంతకాలు పెట్టించుకున్నారు

ఈనాడు, విజయనగరం

గది తలుపులేసి నాతో సంతకాలు చేయించారు.. అని ఇటీవల సస్పెండైన కొత్తవలస తహసీల్దారు అప్పలరాజు ఒకరిద్దరు రాష్ట్ర మంత్రులు, తెదేపా సీనియర్ నాయకులకు మొర పెట్టుకున్నట్లు తెలిసింది. నిబంధనలు తుంగలో తొక్కి ప్రభుత్వ భూములు సబ్ డివిజన్ చేసి, కొంతమేర ప్రైవేటు వ్యక్తుల పేర్లు రాసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడవడంతో కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆయన్ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పలువురు నేతలను సంప్రదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం. 'విధుల్లో చేరిన నాటి నుంచే కీలక ప్రజాప్రతినిధుల అనుచరులు నాపై ఒత్తిడి పెంచారు. నాకు చెప్పకుండా ఎక్కడా సంతకం పెట్టకూడదని.. మేము చెప్పిందల్లా చేస్తే ఇక్కడ పనిచేయగలవు.. లేకుంటే సస్పెండైనా.. బదిలీ అయినా అవుతావని బెదిరించడంతో సంతకాలు చేశా.. ఇచ్చింది తీసుకున్నా..' అని ఆవేదన చెందినట్లు సమాచారం.

మంత్రుల వద్ద కొత్తవలస తహసీల్దారు మొర

కంటకాపల్లి సర్వే నం.245లోని భూముల చిత్రపటం

కంటకాపల్లి భూములపై కన్ను.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎస్. కోట నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల కబ్జాకు కుట్ర జరుగుతోంది. విశాఖ నగరాన్ని ఆనుకుని ఉండడంతో ఎకరా రూ. కోట్లలో పలుకుతుండడంతో అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు కళ్లు మూసుకుంటున్నారు. కొత్తవలస మండలంలోని కంటకాపల్లి సర్వే నం. 245లోని రూ. కోట్ల విలువైన భూములపై కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. సర్వే నం. 245-1లో 210 ఎకరాలు, సర్వే నం. 245-2లో 169.02 ఎకరాలున్నాయి. నం. 245-1లో పోరంబోకు కొండ, 245-2లో గయాలు(అభివృద్ధి చేసిన వృథా భూమి)గా అధికారిక దస్త్రాల్లో నమోదై ఉంది. ఇందులోని 132 ఎకరాల్లో మామిడితోటలు, జీడి తోటలు ఉన్నాయి.

వాదోపవాదాలు..

గతంలో అసిస్టెంట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఇచ్చిన ఆర్డర్ మేరకు ఆ భూములు తమవేనని ఓవైపు రైతులు.. ఎండీఆర్‌లో 1, 2 సబ్ డివిజన్లున్నా, ఎఫ్ఎంబీలో లేకపోవడంతో ప్రభుత్వానివేనని అధికారులు వాదిస్తున్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గతంలో కోర్టు ఆదేశించింది. అప్పట్నుంచి తమను యజమానులుగా దస్త్రాల్లో నమోదు చేయాలని రైతులు జేసీని కోరుతున్నారు. వారి దరఖాస్తుపై క్షేత్రస్థాయి పరిశీలనతో నివేదించాలని కిందిస్థాయి అధికారులను జేసీ ఆదేశించారు. అయితే భూములని గుర్తించలేమని అప్పటి తహసీల్దారు నివేదించగా, తర్వాత వచ్చిన తహసీల్దారు అనుకూలంగా రాయించినట్లు సమాచారం. ఇది ప్రస్తుతం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. కంటకాపల్లి భూములు, తహసీల్దారు వ్యవహారాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా తప్పులు చేసిన అధికారులపై చర్యలు తప్పవన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దాం

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి దామోదరరావు తదితరులు

బెలగాం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. దామోదరరావు అన్నారు. కోర్టు ఆవరణలో గురువారం అప్ హోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహముక్త భారత్, న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గోడప్రతులను ఆవిష్కరించారు. – న్యూస్‌టుడే, రాజాం

ఆ పంచాయితీ ఉండదిక!!

- గ్రామాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు
- అక్రమాలకు అడ్డుకట్ట

గ్రామ పంచాయతీల్లో పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అభివృద్ధికి కీలకమైన పన్నుల రాబడిపై దృష్టిపెట్టింది. పూర్తి పారదర్శకతకు ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఆస్తి, తాగునీటి కుళాయిలు, చెరువుల లీజులు, ఆశీలు, భవనాలు, భూముల క్రమబద్ధీకరణ.. తదితర ప్రక్రియలన్నీ శతశాతం ఈ విధానంలోనే సాగాలని నిర్దేశించింది. ఆఫ్‌లైన్ పద్ధతిలో వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నిధుల దుర్వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట పడనుందని భావిస్తోంది.

పెరగనున్న ఆదాయం..

కొన్ని గ్రామాల్లో రాజకీయ కారణాలతో చాలా నిర్మాణాలకు పన్నులు వేయడం లేదు. లెక్కల్లో తేలిన వాటితో సరిపోల్చితే ప్రస్తుతం ఉన్న అసెస్మెంట్లు చాలా తక్కువగానే ఉంటున్నాయని గుర్తించారు. దీన్ని సరిచేసేందుకు సచివాలయాల వారీగా ఇటీవల ప్రతి నిర్మాణం కొలత తీసుకుని యాప్‌లలో నిక్షిప్తం చేశారు. కొలతల ఆధారంగా పన్నులు విధించాలని అధికారులు సూచించారు. పాత పద్ధతికి పూర్తిగా ముగింపు పలకడంతో ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఇకపై పన్ను బకాయిల నోటీసులను సైతం వాట్సప్, సంక్షిప్త సమాచారం రూపంలో యజమానులకు చేరవేస్తారు. అందులో ఉండే క్యూఆర్‌కోడ్, యూపీఐ ఐడీ ద్వారా చెల్లింపులు పూర్తి చేయవచ్చు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

- పంచాయతీలు : 777
- అసెస్మెంట్లు : 3,94,228
- ఆస్తిపన్ను డిమాండు: రూ. 24.26 కోట్లు
- వసూలైంది: రూ. 2.10 కోట్లు

కానరాని వసూళ్లు..

ఆర్థిక సంవత్సరం పూర్తి కాక ముందే వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని అధికారులు ఆదేశించారు. మూడు నెలల ముందే రాబట్టాలని స్పష్టం చేశారు. కానీ జిల్లాలో ఇంత వరకు కేవలం 8.66% మాత్రమే చెల్లింపులు జరిగాయి. మొండి బకాయిలు రూ. 4.56 కోట్ల మేర పేరుకుపోగా, రూ. 38.67 లక్షలు అందాయి.

పక్కాగా అమలు..

పంచాయతీల్లో ఆన్‌లైన్ చెల్లింపులు పక్కాగా అమలు చేయాలని చెప్పాం. డిజిటల్ పేమెంట్ రూపంలోనే ఇక నుంచి పన్ను వసూళ్ల ప్రక్రియ సాగుతుంది. ఈ నిధులు నేరుగా ఖాతాలకే జమవుతాయి. ఎక్కడా అక్రమాలకు తావుండదు. యజమానులకు ముందుగానే అవగాహన కలిగించాలి. నిబంధనలు ఉల్లంఘించినా, రసీదులు ఇచ్చి నగదు తీసుకున్నా డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, ఈవోలపై చర్యలు తీసుకుంటాం. – మల్లికార్జునరావు, డీపీవో

కేంద్రాలు ప్రారంభించకుండా... ధాన్యం ఎక్కడివి!

సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్

నిర్వాహకులను ప్రశ్నిస్తున్న సబ్‌కలెక్టర్

పాలకొండ, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండానే మిల్లుల్లో ధాన్యం బస్తాలు ఎలా వచ్చాయంటూ సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్ మిల్లు నిర్వాహకులను ప్రశ్నించారు. గురువారం మండలంలోని సింగన్నవలస వద్ద ఉన్న మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ధాన్యం బస్తాలు ఎలా వచ్చాయంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. వాతావరణ పరిస్థితులు బాగోలేనందున రైతులే బస్తాలను ఉంచినట్లు వారు చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. గొట్టమంగళాపురంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేపై ఆరా తీశారు. పాలకొండలో నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు.

విద్యుత్తు లేదని భవనాన్ని వదిలేశారు?

పాచిపెంట మండలంలోని కొటికిపెంట నిర్వాసిత కాలనీలో గత ప్రభుత్వ హయాంలో రూ. 20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనమిది. స్థానికులకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా సిద్ధం చేశారు. పనులు పూర్తయినా విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ఇలా వదిలేశారు. దీంతో చుట్టూ పెద్దఎత్తున మొక్కలు పెరిగాయి. లోపలికి వెళ్లేందుకు సైతం వీలు లేకుండా పోతోంది. రాత్రి వేళల్లో మందుబాబులు, గంజాయి తాగేవారు తిష్ఠ వేస్తున్నారు. ఆకతాయిలు ఇప్పటికే కిటికీ అద్దాలు, తలుపులను పగలగొట్టారు. దీనిపై పీఆర్ జేఈ ఫరూక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి కనెక్షన్ ఇప్పిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

నిరుపయోగంగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ఆకతాయిల కారణంగా దెబ్బతిన్న కిటకీల అద్దాలు

చూచిరాతల నిరోధానికి ప్రత్యేక కమిటీ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) దూరవిద్య పరీక్షల్లో చూచిరాతలపై ప్రత్యేక కమిటీ వేస్తున్నట్లు దూరవిద్య కేంద్రం ఏయూ రెక్టార్ పులిపాటి కింగ్, సంచాలకుడు డి. అప్పలనాయుడు చెప్పారు. కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. కమిటీ నివేదిక ఆధారంగా పరీక్షలు కొనసాగించాలా? లేదా అన్నది నిర్ణయిస్తామన్నారు. ఇటీవల ఈ కేంద్రంలో జరిగిన డిగ్రీ, పీజీ పరీక్షల్లో ఏడుగుర్ని తనిఖీ బృందం పట్టుకున్న విషయం తెలిసిందే.

EENADU Classifieds

REAL ESTATE

JOBS

PLOT FOR SALE

233 చ॥గ॥లు, N/F స్థలం అమ్మకం. ఆకాశపు ఎంక్లేవ్ ప్లాట్ నెం.11, Sitam కాలేజ్ Opp. గాజులరేగా VZM. 9949478595, 9440501951

KVR Estates శక్తిధార్ ఫేజ్-1లో రోడ్డు పోటు ప్లాట్ ఫర్ సేల్ 238 గజాలు గవర్నమెంటు రేటు గజం 8000కే అమ్మకం ✆ 9493707594.

విజయనగరం దగ్గరలో (చెల్లూరు-రాయపూర్) హైవే ఫేసింగ్ VMRDAవెంచర్‌లో రెడీగా ఇల్లు కట్టుకొనుటకు గజం 15వేలు & 167, 183, 200, 300 గజాలు కలవు. ✆9391276529

మహీంద్రా ట్రాక్టర్ వారి అనకాపల్లి, తగరపువలస బ్రాంచ్‌లలో పనిచేయుటకు మెకానిక్స్, హెల్పర్ (ఐటిఐ, టెన్త్ క్వాలిఫికేషన్ మరియు ఎక్స్పీరియన్స్), సూపర్‌వైజర్, స్పేర్ పార్ట్స్ సేల్స్ మెన్ (డిగ్రీ/ DAE/ DMEతో పాటు ఆటోమొబైల్ రంగంలో అనుభవం గలవారు) కావలెను. సంప్రదించండి: శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్, అనకాపల్లి, సెల్: 80085 77055, 80085 77078.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కంట్లో కారం కొట్టి పుస్తెలతాడు చోరీ

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం మండలంలోని తూడి- పాలమెట్ట గ్రామాల మధ్య పొలం నుంచి వస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తి గురువారం అపహరించాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మహిళ నడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చి కంట్లో కారం కొట్టి ఆభరణాన్ని తెంచుకుపోయాడు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చీపురుపల్లిలో బంగారు గొలుసు అపహరణ..

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణంలోని కొత్తాగ్రహారం శివాలయం దారిలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. స్థానికంగా నివాసం ఉండే మహంతి అనూష తన ఇద్దరి పిల్లలను తీసుకుని బుధవారం రాత్రి సమీపంలోని శివాలయానికి వెళ్లారు. తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్తుండగా.. కుమారుడు గేటు బయట ఉండిపోయాడు. తీసుకెళ్లడానికి వెనుకకు వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుపోయారు. గొలుసును బలవంతంగా లాగేయడంతో మెడ వద్ద గాయమైంది. కేసు నమోదు చేసి, దర్యాప్తునకు మూడు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్సై దామోదరరావు తెలిపారు.

గంజాయి కేసులో అయిదుగురికి జైలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన గంజాయి కేసులో అయిదుగురు నిందితులకు 18 నెలల చొప్పున జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం. మీనాదేవి గురువారం తీర్పునిచ్చారని ఎస్పీ దామోదర్ తెలిపారు. నగరానికి చెందిన బి. వెంకటేశ్వరరావు, ఎం. శాంతి, జి. మస్తానీ, బాబూ సింగ్, ఎ. ప్రసాద్ రావు పాత రైల్వే క్వార్టర్స్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారని సమాచారం రావడంతో తమ సిబ్బంది దాడి చేసి, పట్టుకున్నారన్నారు. తనిఖీల్లో భాగంగా వారి నుంచి 8 కిలోల గంజాయి పట్టుబడిందని, ఈ మేరకు అప్పటి ఎస్సై ఎ. నరేష్ కేసు నమోదు చేయగా, సీఐ బి. వెంకటేశ్వరరావు దర్యాప్తు చేపట్టి రిమాండుకు తరలించారన్నారు. దీంతో కోర్టులో నేరారోపణ రుజువైందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జగదీష్ (పాతచిత్రం)

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన పూసపాటిరేగ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నడిపల్లికి చెందిన పులపా జగదీష్(28) నాతవలస టోల్‌గేట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసేవారు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పాత కొప్పెర్ల వద్ద అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ఈక్రమంలో నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రులు ఉన్నారు. కుమారుడి మృతితో బోరుమంటున్నారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. జగదీష్ తండ్రి శ్రీనివాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

వసతిగృహంలో విద్యార్థుల ఘర్షణ

ఇద్దరికి తీవ్ర గాయాలు

గాయాలతో కమిలి పోయిన విద్యార్థి వీపు

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలంలోని పెదఖేర్జల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్వగ్రామాలైన పూడేసు, కోనకు గురువారం వెళ్లిన బాధిత బాలలు తల్లిదండ్రులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆరో తరగతి చదువుతున్న వరుణ్‌తో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థి తాడంగి ఆరెంజ్ శరీరంపై తట్లు తేరాయి. ఒక వస్తువు విషయంలో విద్యార్థుల మధ్య గొడవ జరగడంతో బుధవారం రాత్రి ఆరుగురు కలిసి వీరిద్దరిపై దాడిచేసినట్లు తెలుస్తోంది. ఏటీడబ్ల్యూవో రజని వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా.. ఘటనపై ఆరా తీస్తున్నామన్నారు. వాస్తవ పరిస్థితి తెలుసుకుని తదుపరి విషయాలను వెల్లడిస్తామని చెప్పారు.

నలుగురిపై అట్రాసిటీ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఓ గృహిణిని ఇబ్బందులకు గురి చేసినందుకు గానూ నలుగురిపై పోలీసులు అట్రాసిటీ, వేధింపుల కేసు నమోదు చేశారు. సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తవలసలోని రాంజీనగర్ ప్రాంతానికి చెందిన కొట్యాడ జ్ఞానేశ్వరి విజయనగరంలోని ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన కేశవరాము ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం కావడంతో భర్త, అత్తమామలు, ఆడపడుచు తరచూ అవమానిస్తూ, వరకట్నం కోసం వేధిస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ అట్రాసిటీ, వరకట్న వేధింపుల నేరాల కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఉద్యోగి మృత్యువాత?

మోహన్‌రావు (పాతచిత్రం)

పాచిపెంట, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ఓ ఉద్యోగి సాగునీటి బట్టిలో పడి దుర్మరణం పాలైన ఘటన పాచిపెంట మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకట సురేశ్ అందించిన వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం గురివినాయుడుపేట పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంటుగా ఎస్. మోహనరావు(50) పనిచేస్తున్నారు. రామభద్రపురంలో నివాసముంటూ విధులకు హాజరవుతున్నారు. బుధవారం కార్యాలయానికి వచ్చి, సాయంత్రం తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తూ పాంచాలి గ్రామం సమీపంలోని సాగునీటి బట్టిలో పడి మృతి చెందారు. గ్రామస్థుల సమాచారంతో గురువారం ఉదయం ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేగావతి నదిలో జీపు బోల్తా

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని శివరాంపురం గ్రామ శివారునున్న వేగావతినదిలో ఓ జీపు బోల్తా పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ హాని జరగలేదు. బొబ్బిలి మండలం గోపాలరాయుడు పేట నుంచి ఆవు, దూడతో పారన్నవలస మీదుగా శివరాంపురం వెళ్తున్న సమయంలో వాహనం అదుపు తప్పి నదిలో మునిగిపోయింది. స్థానికులు అప్రమత్తమై చోదకుడు, సహచరుడు, ఆవు, దూడలను రక్షించారు. అనంతరం ట్రాక్టర్ సాయంతో మునిగిపోయిన జీపును బయటకు తీశారు.

వేధింపులపై మహిళ ఫిర్యాదు

పార్వతీపురం, పట్టణం, సాలూరు, న్యూస్‌టుడే: సాలూరుకు చెందిన తన బంధువు సతీష్ వేధిస్తున్నాడని అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ గురువారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన కారుణ్య నియామకం కోసం పెద్దమొత్తంలో డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. పలుమార్లు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సతీష్ ఓ మంత్రి దగ్గర అనధికార వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నాడని తెలిపారు. ★ మంత్రి కుమారుడిపై కూడా పలు ఆరోపణలు చేస్తూ ఆమె ఫిర్యాదు చేశారు.

తప్పుడు ప్రచారం.. నిరాధార ఆరోపణలు చేసిన మహిళపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు సతీష్ తెలిపారు. దాడి చేసినట్లు లేదా అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు ఆధారాలు చూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు.

(c) eenadu

మూడేళ్లుగా నిరుపయోగంగా..

బగ్గందొరవలస గ్రామ సచివాలయ భవనం మూడేళ్లుగా అసంపూర్తిగా ఉంది. స్థానిక ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో 2020 జూన్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. రెండంతస్తుల భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యంతో గుత్తేదారు పనులు నిలిపివేశాడు. దాదాపు మూడేళ్లుగా భవనం పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల గోడలు వర్షపు నీటితో నల్లగా మారాయి. అసంపూర్తి భవనాలపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని ఇంజినీరింగు అధికారి చంద్రమౌళి తెలిపారు.–న్యూస్‌టుడే, సీతానగరం

ఇంకా ఎన్నాళ్లిలా?

సీతంపేటలోని గిరిజన యువత శిక్షణ కేంద్రం(వైటీసీ) వద్ద కార్యక్రమాలు, సమావేశాలు, సభలు నిర్వహించేందుకు అనుకూలంగా వేదిక ఏర్పాటు చేశారు. దీని పైకప్పునకు వేసిన రేకులు గత కొన్నేళ్ల క్రితం తుపానుకు ఎగిరిపోయాయి. ఇనుప ఊచలు దర్శనమిస్తున్నాయి. దీంతో గిరిజన యువత, వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై ఐటీడీఏ ఇన్‌ఛార్జి ఏపీవో ఎస్.వి.గణేష్ వద్ద ప్రస్తావించగా ప్రతిపాదనలు పెట్టామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

వెదురు కర్రలే ప్రహరీ

సీతంపేట మండలం పెదరామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు కలుగుతున్నాయి. మూగ జీవాలు, శునకాలు, కోళ్లు లోపలికి వచ్చేస్తున్నాయి. పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోంది. చేసేది లేక కర్రలతో కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. ఎంఈవో ఎం.ఆనందరావు మాట్లాడుతూ నిధుల కోసం ప్రతిపాదించామని వస్తే పనులు చేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, సీతంపేట

శిథిల వారధి.. వెతలు తీరే దారేది?

సీతంపేట మండలం పెదరామ వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. పెదరామ, కొత్తగూడ పంచాయతీల ప్రజలకు ఇదే ప్రధాన దారి. దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో పూర్తిగా దెబ్బతింది. భారీ వాహనాలు ప్రయాణిస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు గ్రామ రహదారి అధ్వానంగా ఉంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి మరమ్మతులు, వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులొస్తే పనులు చేస్తామని పీఆర్ ఏఈ గౌరీశంకర్ తెలిపారు. – న్యూస్‌టుడే, సీతంపేట

శుభ్రతపై కదలిన యంత్రాంగం

పార్వతీపురం : జిల్లా కేంద్రంలో ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి సోమవారం పీజీఆర్ఎస్‌లో అధికారులను ఆదేశించారు. దీంతో యంత్రాంగంలో కదలిక వచ్చింది. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగంలో పాత దస్త్రాల దుమ్ముదులిపే పని ప్రారంభించారు. అవసరంలేని వాటిని గుర్తించి నిప్పు పెట్టారు. ఆకస్మికంగా కార్యాలయాలను తనిఖీ చేస్తానని, శుభ్రత లోపిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టరు హెచ్చరించిన విషయం విదితమే. దీంతో కొన్ని కార్యాలయాల్లో శుభ్రపరిచే ప్రక్రియ ప్రారంభించారు.

ఐటీడీఏ కార్యాలయంలో బయటపెట్టిన దస్త్రాలు

స్పర్శ లేదా..? నిర్లక్ష్యం వద్దు..!

కుష్ఠు బాధితుల గుర్తింపునకు సర్వే..

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

కుష్ఠు వ్యాధిని 2027 నాటికి నిర్మూలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బాధితులను గుర్తించేందుకు ఈ నెల 30వ తేది వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది, వైద్యాధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించేందుకు 1,550 బృందాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల వయస్సు పైబడిన వారికి శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వారి సమాచారం సేకరించి స్థానిక వైద్యాధికారికి పరిశీలన చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఉచితంగా చికిత్స అందిస్తారు. వారి కుటుంబ సభ్యులను సైతం అప్రమత్తం చేస్తారు. ప్రతి బృందం గ్రామీణ ప్రాంతాల్లో 20-25 ఇళ్లను, పట్టణాల్లో 30-40 ఇళ్లను సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

సంవత్సరం	కేసులు
2022-23	122
2023-24	135
2024-25	156
2025 (ఏప్రిల్- అక్టోబరు)	128

సర్వే చేస్తున్న వైద్య బృందం (పాతచిత్రం)

వ్యాధి లక్షణాలపై మహిళలకు ఆశా కార్యకర్తలు, పురుషులకు ప్రాథమిక వైద్య సిబ్బంది పరిశీలన చేయాల్సి ఉంటుంది. సర్వేను పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తాయి. తొలి దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే తక్కువ సమయంలో నయమవుతుంది. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత సేవలు అందిస్తామని కుష్ఠు నిర్మూలన జిల్లా అధికారి మంతిని వినోద్‌కుమార్ తెలిపారు.

వ్యాధి లక్షణాలు ఇవీ:

★ చర్మంపై ఎర్రటి మచ్చలు, గడ్డలు ఏర్పడతాయి. అయితే అవి దురదగా ఉండకపోవచ్చు. ★ స్పర్శ, నొప్పి లేదా వేడిని గ్రహించే సామర్థ్యం తగ్గిపోతుంది. ★ నరాలు దెబ్బతినడం వల్ల తిమ్మిర్లు, కండరాల బలహీనత లేదా పక్షవాతం వస్తుంది. ★ నరాలు గట్టిపడినట్టు అనిపించవచ్చు. ముఖ్యంగా చేతులు మరియు పాదాల దగ్గర. ★ వ్యాధి తీవ్రమైన సందర్భాల్లో కళ్లు, ముక్కు, చెవులు ప్రభావితం కావచ్చు. దృష్టి సమస్యలు కూడా సంభవించవచ్చు. చికిత్స తీసుకోకపోతే వ్యాధి ముదిరి వైకల్యానికి దారి తీయవచ్చు.

నివారణ చర్యలు:

★ సకాలంలో చికిత్స అందడం వల్ల ఇతరులకు వ్యాపించకుండా నిరోధించవచ్చు. ★ ప్రభావిత వ్యక్తులకు ఎమ్‌డీటీ(బహుళ ఔషధ చికిత్స) ఇవ్వడం వల్ల వ్యాధి నయం అవుతుంది. ★ కుష్ఠు రోగులతో సన్నిహితంగా ఉన్నవారికి చికిత్స అందించాలి ★ వ్యాధి లక్షణాలు, వ్యాప్తిపై అవగాహన పెంచుకోవాలి.

ప్రసంగించారు... బహుమతి పట్టారు!

తమ్మినాయుడు పాఠశాలలో బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పాలకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యసాయి, తమ్మినాయుడు పాఠశాలల్లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థి జీవితంపై చరవాణి ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సత్యసాయి పాఠశాలలో కె.యామిని (పదో తరగతి) ప్రథమ, సీహెచ్ అంజన కామేశ్వరి (తొమ్మిదో తరగతి) ద్వితీయ, కె.రుచితశ్రీ (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల అకడమిక్ అడ్వయిజర్ బి.లక్ష్మీనారాయణ, ఏఎంవో కేశవరావు, ప్రిన్సిపల్ ప్రసాదరావు ఉపాధ్యాయులు ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు. ★ తమ్మినాయుడు పాఠశాలలో జరిగిన పోటీల్లో జి. దుర్గానందశ్రీ(ఎనిమిదో తరగతి) ప్రథమ, కె.శ్రీవర్షిత(ఎనిమిదో తరగతి) ద్వితీయ, జి.శ్రావ్యశ్రీ(ఏడో తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు.

పోటీల్లో ప్రసంగిస్తున్న విద్యార్థి

బహుమతులు అందిస్తున్న సత్యసాయి పాఠశాల యాజమాన్యం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పాలకొండ గ్రామీణం: విద్యుత్తు ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా పాలకొండ పట్టణం, మండల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.విష్ణుమూర్తి తెలిపారు.

పార్వతీపురం గ్రామీణం: మండలంలోని నర్సిపురం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఏఈ రామారావు తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

విద్యార్థులను అభినందిస్తున్న పీవో, తదితరులు

సీతంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో చూపిన ప్రతిభ మాదిరిగా జాతీయ స్థాయిలోనూ ప్రదర్శించి ఐటీడీఏ పేరు తీసుకురావాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఎన్.కావ్య, ఎస్.సమిత, ఎస్.కృష్ణవేణి గురువారం ఐటీడీఏ పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని పీవో అభినందించారు. ★ బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సీతంపేట, భామిని మండలాల బీఎల్వోలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండాలి

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండాలని, ఇదే లక్ష్యంతో పీపీసీ కేంద్రాల సిబ్బంది పనిచేయాలని జిల్లా జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని పెద్దింపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. పొలం నుంచి ధాన్యం తరలింపునకు అవసరమైన ట్రక్ షీటును స్వయంగా జనరేట్ చేయించారు. సమీపంలోని రైతు 'సేవ' కేంద్రాన్ని సందర్శించి, రైతన్నా మీ కోసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌరసరఫరాల శాఖ గోదామును పరిశీలించారు.

పెద్దింపేటలో మాట్లాడుతున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రసంగిస్తున్న దేబాషిష్ పట్నాయక్

కలెక్టరేట్ ప్రాంగణం: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని ఏఐసీసీ పరిశీలకుడు దేబాషిష్ పట్నాయక్ అన్నారు. పార్వతీపురం పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మన్యం జిల్లాలో అనేక సమస్యలున్నాయన్నారు. ఒడిశాతో వివాదంలో ఉన్న జంఝావతి ప్రాజెక్టు నిర్మాణానికి చర్చలు జరిపేలా పాలకులు కృషిచేయడం లేదన్నారు. అడవి ఏనుగుల సమస్య పట్టించుకునేవాళ్లే లేరన్నారు. ఏఐసీసీ సభ్యులు శ్రీనివాస్, బుల్లిబాబు, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి బత్తిన మోహనరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి పార్కును తీర్చిదిద్దుతాం

పార్వతీపురం, న్యూస్‌టుడే: పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న తోటపల్లి పార్కును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. ఈ మేరకు పార్కులో పలు వసతులు కల్పించి విప్ జగదీశ్వరి, పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి గురువారం పునః ప్రారంభించారు. ఇక్కడ జల విహారాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. పిల్లలు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి ఏర్పాటు చేశారు. దీంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, జేడీ పశుసంవర్ధక శాఖ మన్మథరావు, ఉద్యాన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పునఃప్రారంభ వేడుకలో కలెక్టర్, విప్ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	-8008566244
పాలకొండ	-8008574299
సాలూరు	-8008786820
కురుపాం	-9849044696

?: కంబరవలస శ్మశానవాటికకు రహదారి లేక మృతదేహాలు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. **- అప్పారావు, కంబరవలస.** ★ శాశ్వత రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. - **ఎం.లక్ష్మి, సర్పంచి, బి.కోటేశ్వరరావు, కార్యదర్శి.** – న్యూస్‌టుడే, వీరఘట్టం.

?: అప్పయ్యపేటలోని రామమందిరం పక్కన వీధిలో పక్కా కాలువలు లేక మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. - **చంద్రరావు** ★ కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **సురేష్, ఈవో** – న్యూస్‌టుడే, సీతానగరం

?: పట్టణంలోని నీలమ్మకాలనీ మూడో వీధిలో విద్యుత్తు దీపం వెలగడం లేదు. **- రమణరావు, ఉద్యోగి** ★ విద్యుత్తు దీపం ఏర్పాటు చేస్తాం. **దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: గుమ్మ పంచాయతీ కేంద్రంలో వీధి కాలువలు పూర్తిస్థాయిలో లేవు. **-శంకరరావు** ★ కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **-జె.ఉమామహేశ్వరి, ఎంపీడీవో** –న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

?: నర్సిపురం నుంచి వీఆర్‌పేట తారురోడ్డు ముక్కలూడి రవాణాకు ఇబ్బందిగా మారింది. - **ప్రసాదు, వీఆర్ పేట** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **నాగేశ్వరరావు, డీఈఈ** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం : మజ్జిగౌరి కాలనీ(వెంకంపేట పంచాయతీ) పరిసరాల్లో చెత్తను తొలగించారు. 'శుభ్రం చేయాలి' శీర్షికన ఈనెల 5న 'ఈనాడు' లో ప్రచురించిన వార్తపై స్పందించి.. సర్పంచి కృష్ణారావు పనివారితో చెత్త తీయించారు.

పాలకొండ గ్రామీణం: మండలం నవగాం కూడలిలో పొగతో కాలుష్యానికి గురిచేస్తున్న దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఎంవీ రంగారావు తెలిపారు. పొగ వ్యాప్తి చెందుతున్న వైనంపై 'ఈనాడు'లో ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో స్పందించారు.

త్వరితగతిన స్త్రీనిధి రుణాల మంజూరు

వీరఘట్టం : స్త్రీనిధి రుణాలు జిల్లాలో త్వరితగతిన మంజూరు చేస్తున్నట్లు ఏజీఎమ్ కామరాజు చెప్పారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా గురువారం ఈ విషయం చెప్పారు. ఇప్పటివరకు 2199 స్వయం సహాయక సంఘాలకు చెందిన 5,834 మంది సభ్యులకు రూ.47.50 కోట్ల రుణాలు అందజేశామన్నారు. ఏపీఎం కె.రాము ఉన్నారు.

పారదర్శకంగా ధాన్యం తూకం

పార్వతీపురం గ్రామీణం: ధాన్యం తూకం విషయంలో సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని తహసీల్దారు ఎం.సురేష్ ఆదేశించారు. మండలంలోని అడ్డాపుశీల విజయశంకర ధాన్యం పరిశ్రమ పరిసరాలు, లారీనుంచి దిగుబడులు పరిశీలించారు. మండలంలో 13 ధాన్యం మిల్లులను కొనుగోళ్లకు ఎంపిక చేశామన్నారు. వీటిల్లో ఏర్పాట్లపై తనిఖీలు చేస్తున్నామన్నారు.

రహదారులు నిర్మించాలని నిరసన

పార్వతీపురం: దశాబ్దాలుగా రహదారికి నోచుకోని గిరిజన గ్రామాలకు ఆ సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండు చేశారు. పార్వతీపురం ఐటీడీఏ ఎదుట గురువారం శిబిరాన్ని ఏర్పాటుచేసి, నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

బలిజిపేట మాజీ ఎంపీపీ మృతి



బలిజిపేట: బలిజిపేట మండల పరిషత్తుకు రెండు సార్లు మండలాధ్యక్షురాలిగా ఎన్నికైన శంబాన **వెంకటమ్మ** (82) గురువారం మృతి చెందారు. ఈమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పలగర గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా రెండు సార్లు పోటీచేసిన ఈమెను మండలంలోని అత్యధిక గ్రామాల ఎంపీటీసీలు ఎంపీపీగా ఎన్నుకున్నారు.

108 వాహనంలో ప్రసవం

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దపల్లంకివలసకు చెందిన జి.దేవిక బుధవారం రాత్రి సీతంపేట 108 వాహనంలో ప్రసవమైందని ఈఎంటీ రాములు, పైలట్ మురళి తెలిపారు. 108లో ఎక్కించి కొంత దూరం వచ్చాక నొప్పులు అధికమవ్వడంతో పరిస్థితి గమనించి డెలివరీ చేశారు. పేగు మెడకు చుట్టుకొని ఉండడాన్ని చూసి దాన్ని తప్పించి ప్రసవం జరపగా పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, తదుపరి వైద్య సేవల నిమిత్తం సీతంపేట ప్రాంతీయాసుపత్రిలో చేర్పించామన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం: మండలంలోని అన్ని ప్రాథమిక, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఈనెల 29, 30 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సింహాచలం తెలిపారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తిగలవారు సీఆర్పీలకు పేర్లు ఇవ్వాలన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మక్కువ, జియ్యమ్మవలస: మక్కువ మండలంలోని పనసభద్ర గ్రామంలో తెదేపా మండలాధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు, ఏవో సీహెచ్ భారతి , బీజేపురంలో ఎంపీపీ బొంగు సురేష్.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు.

ఆహార తనిఖీలు

సాలూరు : పట్టణంలోని పలు హోటల్స్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ గురువారం దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాలు నమూనాలు సేకరించారు.

అంచనా బడ్జెట్‌కు ఆమోదం

కొమరాడ: మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025-26 సవరణ బడ్జెట్ రూ.89,96,533, 2026-27 అంచనా బడ్జెట్ రూ.99,33,533గా ఉందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీలు, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొమరాడ: ఇటీవల జంఝావతి నదిలో స్నానానికి వెళ్లిన ముగ్గురు మృత్యువాత పడిన ఘటనలో వారి కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ డైరెక్టరు శేఖర్‌పాత్రుడు పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల పరిహారం వచ్చేలా కృషి చేస్తామన్నారు. తెదేపా మండల కన్వీనరు వెంకటనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..!

కురుపాం గ్రామీణం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కురుపాం స్టేట్ బ్యాంకు మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. మ్యాజిక్ షో, కళాజాత ప్రదర్శనతో ఖాతాదారులను చైతన్య పరిచారు.

వృత్తి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

వీరఘట్టం: విద్యార్థులు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులను ఆయన గురువారం పరిశీలించారు.

వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, కొమరాడ, న్యూస్‌టుడే: అత్త వేధింపులతో మనస్తాపానికి గురైన మహిళ పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం కొమరాడ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.... మండలంలోని వన్నాంకు చెందిన సుజాతను అత్త చిన్న విషయాలకు తిట్టడంతో మనస్తాపంతో పురుగు మందు తాగింది. కుటుంబీకులు గమనించి బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ట్రైకార్ ఎండీ ప్రాథమిక విచారణ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నాదొర, పూర్వ గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయ పర్యవేక్షకుడు దేశ్‌లపై దళిత సంఘాల సంయుక్త మండలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలతో గురువారం ట్రైకార్ ఎండీ సి.ఎ.మణికుమార్ ప్రాథమిక విచారణ జరిపారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రక్రియ నిర్వహించారు. అధికారులను అడిగి సంబంధిత దస్త్రాలు పరిశీలించారు.

ఆరోపణలు తగదు: ప్రస్తుత ఏపీవో చినబాబు, డీడీ అన్నాదొర ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఐకాస పేరుతో ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రవికుమార్, నాయకులు పేర్కొన్నారు.

8న ఎన్జీవో సంఘ ఎన్నిక

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు తాలూక ఎన్జీవో సంఘ ఎన్నికలు పట్టణంలోని రాయల్ ఫ్యామిలీ రెస్టారెంట్ భవనంలో డిసెంబరు 8న నిర్వహిస్తామని ఎన్నికల అధికారులు జి.సూర్యనారాయణ, దుర్గాప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 15పోస్టులకు ఎన్నిక జరుగుతుందని డిసెంబర్ 1న నామినేషన్లు స్వీకరిస్తామని, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

పోటీలకు స్పందన కరవు

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం ఎస్వీడీ కళాశాల మైదానంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి పారా క్రీడా పోటీలకు క్రీడాకారులు అరకొరగా హాజరయ్యారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, విలువిద్య (బాలురు, బాలికలకు) పోటీలను నిర్వహించారు. సుమారు 30 మంది క్రీడాకారులు మాత్రమే హాజరయ్యారు.

పోలీసు సబ్ డివిజన్ అధికారి పర్యటన

పాచిపెంట, న్యూస్‌టుడే: పార్వతీపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారిణి వి.మనీషా రెడ్డి మండలంలో పాచిపెంట, పాంచాలి గ్రామాల్లో గురువారం పర్యటించారు. పి.కోనవలస చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి సూచలు ఇచ్చారు. ఎస్సై వెంకట సురేశ్, ఉన్నారు.

సూచనలిస్తున్న మనీషా రెడ్డి

ఘనంగా లక్ష్మీ పూజలు

పాలకొండ గ్రామీణం : పాలకొండ పురటాల పోలమాంబ ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా గురువారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని గజమాలతో అలంకరించారు.

నేడు బడ్జెట్ సమావేశం

సీతానగరం: మండల పరిషత్తు 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ రమణమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

రైతు రాజు కావాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ప్రతి రైతు రాజు కావాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కళావతి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం మొరమలో గురువారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో శివ, భూషణ్ తదితరులు ఉన్నారు. ★ **గరుగుబిల్లి:** వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం నందివానివలసలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఐటీడీఏలో ఏం జరుగుతోంది?'

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలో ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొందని తెదేపా ఎస్టీ సెల్ కన్వీనర్, గిరిజన సంఘ నాయకుడు మండంగి భూషణరావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పాఠశాల సహాయకులు, ఎల్పీలు, హెచ్‌పీలకు సంరక్షకుల బాధ్యతలు అప్పగించరాదని ఉత్తర్వులు వెలువడినా.. పార్వతీపురం ఐటీడీఏలో మాత్రం వాటిని పాటించడంలేదన్నారు.

ప్రభుత్వ భూమిలో కంచె ఎలా వేస్తారు..

కలెక్టరేట్ ప్రాంగణం : పార్వతీపురం పట్టణం నడిబొడ్డున ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులున్నా.. కంచె ఎలా వేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు అన్నారు. సుందరయ్య భవనంలో గురువారం వామపక్ష నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. వరహాల గెడ్డపై 410 సర్వే నంబరు ప్రభుత్వ భూమిగా పరిగణించినట్లు అధికారులు చెబుతున్నారని, ప్రజలకు ఉపయోగపడేలా దాన్ని తీర్చిదిద్దాలన్నారు. కంచెను తొలగిస్తే.. ఇనుప చువ్వలతో మళ్లీ ఎలా పనులు చేపడతారని ప్రశ్నించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని నాయకులు ఆర్.వి.ఎస్ కుమార్, పి.ఈశ్వరరావు, రంజిత్ కుమార్ తదితరులు సబ్‌కలెక్టర్ వైశాలికి వినతిపత్రాన్ని అందించారు.

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

రామవరం ఆర్ఎస్‌కే పరిశీలన

సీతానగరం : మండలంలోని రామవరం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేపట్టడం లేదని గురువారం రైతులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో సబ్ కలెక్టరు వైశాలి సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం వెంటనే సేకరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం అప్పయ్యపేటలోని ధాన్యం మిల్లులో దస్త్రాలు పరిశీలించారు. తహసీల్దారు ప్రసన్నకుమార్, ఏవో అవినాష్ పాల్గొన్నారు.

ఆరుగంటల తర్వాతే ట్రక్‌షీట్ కొట్టాలి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం శివరాంపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ వైశాలి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉదయం 5 గంటలకు ట్రక్‌షీట్ కొట్టడాన్ని గమనించి ఆరుగంటల తరువాత, సాయంత్రం 5 గంటల లోపు జనరేట్ చేయాలని సూచించారు. పలు విషయాలను పరిశీలించారు. తహసీల్దార్ నీలకంఠరావు, ఏవో శిరీష తదితరులు ఉన్నారు.

శ్రద్ధాంజలి



జననం : 09-09-1950
మరణం : 18-11-2025

కీ॥శే॥ శ్రీమతి బలగ సింహాచలం గారు
W/o బలగ బలరాంనాయుడు
Rtd. L.F.L., H.M.,
క్రిష్ణపల్లి (గ్రామం), పార్వతీపురం (మండలం)

ముందు తరాల ఆచార, వ్యవహారాలు కొనసాగిస్తూ కుటుంబ పెద్దగా నిలిచిన మా ఇంటి ఇలవేలుపు, మా అందరి ఆలన, పాలనలు సొంత బిడ్డల్లా చూచుకొని మమ్మల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్ది, మా అభివృద్ధికి కారకులైన మీరు స్వర్గస్తులైనందుకు చింతిస్తూ.... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.... శోకతప్త హృదయాలతో..

మరుదులు	తోటికోడళ్లు	పిల్లలు
స్వర్గీయ బలగ సింహాచలంనాయుడు	శ్రీమతి అప్పలనరసమ్మ	సుధాకరరావు, చినవెంకటస్వామినాయుడు, గౌరీశంకరరావు
బలగ ధనుంజయనాయుడు	శ్రీమతి జయమ్మ	రమ, రమేష్, దేవి
బలగ శంకరరావు	శ్రీమతి లలితకుమారి	కిషోర్‌కుమార్, తిలక్‌కుమార్
బలగ వెంకటస్వామినాయుడు	శ్రీమతి భవానీదేవి	స్నేహ, రోహిత్
బలగ జనార్దనరావు	శ్రీమతి వెంకటసూర్యలక్ష్మీకుమారి	వంశీ, సుష్మ

ఆడపడుచు కుటుంబం: స్వర్గీయ బొంగు సావిత్రమ్మ, స్వర్గీయ బొంగు సూర్యనారాయణ శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, శశిధర్‌బాబు మరియు ఇతర కుటుంబ సభ్యులు

(c) eenadu

ఏందిరొయ్యా.. ఈ దారుణం?

▸ పంట పొలాలను కబళిస్తున్న చెరువులు ▸ ఉప్పగా మారుతున్న భూగర్భ జలాలు

ఎలాంటి అనుమతులుండవు.. అడిగేవారుండరు... ఇష్టానుసారంగా రొయ్యల సాగు చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో హద్దుమీరి చెరువులు అంతకంతకూ తవ్వేస్తున్నారు. పర్యావసనంగా పంట పొలాలు నిలువునా ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు ఉప్పగా మారుతున్నాయి. గుండ్లకమ్మ నదీజలాలు కలుషిత మవుతున్నాయి. –ఈనాడు, ఒంగోలు

పంటలకు చెంతనే రొయ్యల చెరువులు

గుండ్లకమ్మ నది నాగులుప్పలపాడు మండలం కనపర్తి వద్ద సముద్రంలో కలుస్తుంది. సముద్రం నుంచి ఉప్పు నీళ్లు వెనక్కి చొచ్చుకురాకుండా ఉలిచి వద్ద చెక్‌డ్యాం నిర్మించారు. ఈ చెక్ డ్యాం వద్ద ఆధారంగా సమీప గ్రామాల్లోని రైతులు పంటలను సాగు చేస్తున్నారు. నదీతీర మండలాలైన ఒంగోలు, నాగులుప్పలపాడు మండలాల్లోని బొద్దులూరిపాలెం, గుండాయపాలెం, దేవరంపాడు, చింతాయగారిపాలెం, పాతపాడు, ఉలిచి, అమ్మనబ్రోలు, ఉప్పలపాడు, చవటపాలెం గ్రామాల్లో భారీగా రొయ్యల చెరువులు తవ్వేశారు. చెక్ డ్యాం ఎగువన అడ్డగోలుగా రొయ్యల సాగు చేస్తుండడం శాపంగా మారింది. సముద్రం నుంచి ఉప్పు నీటిని గొట్టాల ద్వారా చెరువుల్లోకి నింపుతుండగా, వ్యర్థాలతో కూడిన నీటిని చెక్‌డ్యాంలోకి వదిలేస్తున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు ఉప్పగా మారిపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు వచ్చారు.. వెళ్లారు

కలెక్టరేట్‌కు ఫిర్యాదు అందడంతో అమ్మనబ్రోలు గ్రామంలో బుధవారం అధికారుల బృందం పర్యటించింది. కాలుష్యానికి కారణమైన రొయ్యల చెరువులను పరిశీలించింది. వాస్తవ పరిస్థితిని అధికారులు డివిజన్ కమిటీకి నివేదిస్తారని మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు తెలిపారు. నివేదిక వచ్చిన అనంతరం జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి రొయ్యల చెరువులపై నిర్ణయం తీసుకుంటుందన్నారు.

చోద్యం చూస్తున్న యంత్రాంగం

అమ్మనబ్రోలులో ఎండిపోయిన జామాయిల్ తోట

అడ్డగోలుగా రొయ్యల చెరువులు తవ్వేసి పర్యావరణానికి హాని చేస్తున్నా అటు రెవెన్యూ, మత్స్య, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వీటిపై ఫిర్యాదు చేసినప్పుడు క్షేత్రస్థాయి పరిశీలనకు రావడం, అనంతరం వదిలేయడం సర్వసాధారణమైపోయింది. అధికారులకు ముడుపులు చెల్లించుకుంటూ కొందరు దర్జాగా రొయ్యల సాగు చేపడుతున్నారు. ఇక్కడ వందల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నా, అనుమతులు తీసుకుని ఎంత సాగు చేస్తున్నారనేది అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది. అడిగేవారు లేకుంటే అంతా తమ ఇష్టం.. అన్నట్లు ఇక్కడ అంతకంతకూ చెరువులు తవ్వుకుంటూ పోయారు. ఫలితంగా గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితం కావడంతో చెరువులను ఆనుకుని ఉన్న జామాయిల్ తదితర తోటలు నిలువునా ఎండిపోతున్నాయి. వరి పంట దిగుబడులు ఏటేటా తగ్గుతూ వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంతం.. నీదా.. నాదా.. సై

దర్శి అంబేడ్కర్ గురుకుల కళాశాలలో గురువారం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ రెజ్లింగ్ స్త్రీ, పురుష జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో తలపడుతున్న క్రీడాకారులను చిత్రంలో చూడొచ్చు.
–న్యూస్‌టుడే, దర్శి

ఫాస్టాగ్ జాగు.. పక్కకు ఆగు!

పెద్దసంఖ్యలో వాహనాలు బారులు తీరిన ఈ దృశ్యం జాతీయ రహదారి-16పై టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం కనిపించింది. ఫాస్టాగ్ సర్వరు సమస్యలతో ఇలా కిలోమీటర్ల మేర గంటలతరబడి వాహనాలు నిలిచిపోవడంతో చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. –న్యూస్‌టుడే, టంగుటూరు

మార్కాపురం జిల్లాకు ప్రాథమిక అడుగు

▸ నోటిఫికేషన్ జారీ చేసిన కూటమి ప్రభుత్వం

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమ ప్రకాశంలోని నాలుగు నియోజకవర్గాలతో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026లో జనగణన దృష్ట్యా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు అద్దంకి రెవెన్యూ డివిజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాజాగా కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం కానున్నాయి. దీంతో ప్రస్తుత ప్రకాశంలో ఆరు నియోజకవర్గాలు; మార్కాపురం కేంద్రంగా నూతనంగా ఏర్పాటు కానున్న జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండనున్నాయి.

జిల్లాల వారీగా నియోజకవర్గాలు
మార్కాపురం: మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం
ప్రకాశం: ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కందుకూరు, అద్దంకి, దర్శి

అభ్యంతరాల స్వీకరణ

మార్కాపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలోని 15 మండలాలు; కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలు ఉండనున్నాయి. ప్రకాశం జిల్లాలో ఒంగోలు, కందుకూరుతో పాటు కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు కానుంది. అద్దంకి నియోజకవర్గంలోని 5 మండలాలతోపాటు దర్శి నియోజకవర్గంలోని 5 మండలాలతో కలిపి మొత్తం 10 మండలాలతో అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. కందుకూరు డివిజన్ కేంద్రంలో కందుకూరు నియోజకవర్గంలోని 5 మండలాలతో పాటు కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, మర్రిపూడి మండలాలను కలిపారు. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా కలెక్టర్‌కు తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిలా పాపం.. తలా పిడికెడు!

▸ ఎస్టీ సంఘాల పేరిట రుణాల స్వాహా
▸ మెప్మాలో అక్రమాలపై కమిటీ విచారణ

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

మెప్మాలో తవ్వేకొద్దీ అవినీతి ఊట బయటికొస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 2021-24 మధ్య కాలంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. అదే బాటలో ఇటీవల కొన్ని జరిగినట్లు ఆరోపణలొచ్చాయి. పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులైన అమాయక మహిళలను అడ్డం పెట్టుకుని నాయకులు మెప్మా క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో రూ.కోట్లు కాజేశారు. బ్యాంకు అధికారులు, సిబ్బందితో కలిసి పావలా వడ్డీ రుణాలు పొంది తిలాపాపం తలా పిడికెడు చందంగా పంచేసుకున్నారు. ఈ నేపథ్యంలో కార్యాలయ ఉద్యోగుల మధ్య తలెత్తిన వివాదాలతో అక్రమలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. దీంతో మెప్మా ఎండీ ఆదేశాల మేరకు ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిపి బాధ్యులైన ఇద్దరు రిసోర్స్‌పర్సన్లపై వేటు వేశారు.

ఎస్టీ సంఘాల సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న విచారణ కమిటీ

రూ.30 లక్షలు కాజేసి...

ఒంగోలు నగరంలోని 36 సంఘాలపై తాజాగా ఫిర్యాదులందగా, వీటిలో ఎస్టీలకు సంబంధించి 12 సంఘాలున్నాయి. సీవోలు, ఆర్పీలు కుమ్మక్కై సభ్యులకు తెలియకుండా దాదాపు రూ.30 లక్షలు కాజేసినట్లు సమాచారం. దీనిపై సంబంధిత ఆర్పీపై చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరడంతో మెప్మా ఎండీ అయిదుగురు సభ్యులతో కమిటీని వేశారు. స్టేట్ మిషన్‌లో పనిచేస్తున్న ఆదినారాయణ, ప్రభావతి, గోపి, విజిలెన్స్ విభాగం నుంచి రాధ, ఐటీ విభాగం నుంచి రమేష్ గురువారం విచారణ ప్రారంభించారు. ఎస్టీ సంఘాల సభ్యులను పిలిపించి రుణాలు ఎంత తీసుకున్నారని ప్రశ్నించారు. కొందరు తమకు తెలియదని, రుణాలు తీసుకోలేదన్నారు. అప్పట్లో పనిచేసిన సీఎంఎం, సీవోలను వివరణ కోరారు. ఆయా సంఘాల్లోని మిగిలిన సభ్యులను విచారించి వివరాలు అందజేయాలని పీడీ శ్రీహరి, సిబ్బందిని ఆదేశించారు.

తెలుగు తమ్ముళ్ల ఉత్సాహం

మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపడంపై దేవరాజుగట్టు నుంచి పెద్దారవీడు వరకు గురువారం తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా భారీ ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, పెద్దసంఖ్యలో నాయకులు, కార్య కర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, పెద్దారవీడు

మిత్రుడి మరణంతో
మెదిలిన ఆలోచన!

● రక్తదానంతో పలువురికి ప్రాణదానం
● కనిగిరి మిత్రమండలి సభ్యుల ఆదర్శం

వారి మిత్రుడు రహదారి ప్రమాదంలో గాయపడడంతో తీవ్ర రక్తస్రావమైంది. తక్షణమే రక్తం ఎక్కిస్తే తప్ప ప్రాణం దక్కదని వైద్యులు తెలిపారు. ఆ సమయంలో కాపాడుకునేందుకు రక్తదాతల కోసం స్నేహితులు వెతుకులాడారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో రక్తం అందక వారి స్నేహితుడు ప్రాణాలొదిలాడు. ఏడేళ్ల కిందట జరిగిన ఈ ఘటనతో తమ మిత్రుడిలా మరొకరు రక్తం అందక ప్రాణాలు పోగొట్టుకోకూడదని స్నేహితులందరూ నిర్ణయించుకున్నారు. రక్తదానంపై అందరికీ అవగాహన కల్పిస్తూ రక్తం అవసరమైనవారికి స్వయంగా రక్తదానం చేస్తూ, పలువురితో చేయిస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు కనిగిరి మిత్రమండలి సభ్యులు.
–న్యూస్‌టుడే, కనిగిరి

రక్తదాతల పేర్లు నమోదు చేయిస్తున్న మిత్ర మండలి సభ్యులు

కనిగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరికైనా రక్తం అవసరమైతే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది మిత్రమండలి సభ్యులే. రక్తదానంతో కలిగే ఉపయోగాలు, ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడడంపై అవగాహన కల్పిస్తూ రక్తదానంపై చైతన్యపరుస్తున్నారు. ఇందుకోసం రక్తదాత పేరు, బ్లడ్ గ్రూప్, చరవాణి నంబరు వివరాలతో రిజిస్టరును కొనసాగిస్తున్నారు. ఆపదలో ఉన్నవారి వద్దకు నేరుగా వెళ్లి వారికి ఏ గ్రూపు రక్తం అవసరమో గుర్తించి రిజిస్టరు చూసుకుని సంబంధిత దాతకు ఫోన్ చేసి రక్తదానం చేయిస్తూ పలువురి ప్రాణాలు కాపాడుతున్నారు. ఇలా గడిచిన ఏడేళ్లలో సుమారు 300 మందికిపైగా రక్తదానం చేశారు. 'రక్తదానం చేసేందుకు ముందుకొచ్చేవారి పేర్లు, చరవాణి నంబర్లు నమోదు చేసుకుని ఎవరైన రక్తం అవసరమైతే వివరాలు తెలిపి రక్తం అందిస్తుండడం ఎంతో ఆనందంగా ఉంటుంది' అని మిత్ర మండలి సభ్యులు సోమిశెట్టి శ్రీనివాసులు, పచ్చవ చంద్రశేఖర్, సభ్యులు చెబుతున్నారు.

జేఎంబీ గొప్పదనం చర్చించుకోవాల్సిందే

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగర నడిబొడ్డున చారిత్రక సజీవ సాక్ష్యం జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ (జేఎంబీ) చర్చి. జిల్లాలోని అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ (ఏబీఎం) చర్చిలన్నింటికీ కేంద్ర స్థానమిది. యర్రగుంట్ల పేరయ్య అనే వ్యక్తి ఆహ్వానం మేరకు జాన్ ఎవరెట్ క్లౌ అనే క్రైస్తవ మెషినరీ 1866లో ఒంగోలు నగరంలో డాక్టర్ లైమన్ జువెట్ అనే మిషనరీ జ్ఞాపకార్థం ఈ చర్చిని స్థాపించారు. ప్రస్తుతం ఉన్న ఈ చర్చి నిర్మాణం 1908లో పూర్తిగా బ్రిటీషర్ల నిర్మాణ పద్ధతిలో జరిగింది. దీనిని కాస్త ఎత్తులో నుంచి చూస్తే శిలువ ఆకారం కనిపిస్తుండడం విశేషం. 2016లో 150 ఏళ్ల వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణలతో మెరిసిపోతోంది. చర్చి వ్యవస్థాపకుడు జాన్ ఎవరెట్ క్లౌ పేరిట ఒంగోలు రైలునిలయం రోడ్డులో క్లౌపేట ఏర్పాటైంది. –న్యూస్‌టుడే, ఒంగోలు

శుద్ధజలం.. పెద్ద బలం!

తొలి విడతగా 12 చోట్ల ఏర్పాటు

● విద్యార్థులకు రక్షిత తాగునీరు
● వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా తాజాగా విద్యార్థులకు సురక్షిత తాగునీరందించాలన్న ఉద్దేశంతో ఆర్వో ప్లాంట్లు (శుద్ధజల కేంద్రాలు) ఏర్పాటుకు నిధులు కేటాయించింది. జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో వచ్చే నెలాఖరు నాటికి ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు వసతి గృహాలకు పురపాలక, పంచాయతీలకు సంబంధించిన తాగునీటి కుళాయిలు, బోర్ల ద్వారా వచ్చే తాగునీరందిస్తున్నారు. పశ్చిమ ప్రకాశంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఫ్లోరైడ్ సమస్య విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. - న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఒంగోలులోని ఆనంద నిలయం ప్రభుత్వ వసతిగృహంలోని ఆర్వో ప్లాంటు నీటిని పట్టుకుంటున్న విద్యార్థినులు

జిల్లాలోని ఒంగోలు, యర్రగొండపాలెం, చీమకుర్తి, దొనకొండ, మార్కాపురం, కంభం, త్రిపురాంతకం, గిద్దలూరు, దర్శి, కొత్తపట్నం కేంద్రాల్లోని 12 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో తొలి విడతగా వారం రోజుల కిందట ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. మిగతా వాటిల్లోనూ డిసెంబరు నెలాఖరునాటికి ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. వంద మందికిపైగా విద్యార్థులుంటే రెండో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన ట్యాంకులు అమర్చుతున్నారు. ఒక్కో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక చొరవతో తొలివిడతగా 12 వసతిగృహాలకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు.

వసతిగృహాలు	సంఖ్య	విద్యార్థులు
సాంఘిక	81	7,969
బీసీ	64	4,823
గిరిజన	28	3,853

ఆడపిల్ల పుడితే ఆరు వేలు

ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిరుపేద గర్భిణులందరికి పథకం ద్వారా నగదు పంపిణీ చేసేందుకు కార్యచరణ రూపొందించింది. ఈ బాధ్యతను మహిళాశిశు సంక్షేమశాఖకు అప్పగించింది. పథకంలో అర్హులైన వారికి రెండు విడతల్లో రూ.11 వేలు చొప్పున అందిస్తారు. మొదటి కాన్పు అయితే రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ఈ మొత్తాన్ని పోషకాహారం, టీకాలకు వినియోగించాలని సూచించారు. తెల్లరేషన్ కార్డుదారులంతా పథకానికి అర్హులే. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంప్రదిస్తే వివరాలు నమోదు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నెలల కాలంలో సుమారు 21 వేల మంది తల్లులు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు.
–న్యూస్‌టుడే, అర్థవీడు

శనగ.. రైతు దగ!

మద్దతు ధరకు ఎదురుచూపులు

ప్రస్తుతం పప్పుశనగ ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో ఈఏడాది కేవలం 30 వేల హెక్టార్లలో నామమాత్రంగా సాగైంది. అదే గతేడాది 50 వేల హెక్టార్లలో సాగైంది. మార్కెట్ సంక్షోభంతో జిల్లావ్యాప్తంగా 90 లక్షల క్వింటాళ్ల మేర శనగ నిల్వలు శీతల గిడ్డంగుల్లో మగ్గుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అనుకూలించకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు.
–న్యూస్‌టుడే, బేస్తవారపేట

శీతల గిడ్డంగుల నుంచి విత్తనాలకు తరలిస్తున్న శనగలు

విదేశాల నుంచి దిగుమతి..

ఆస్ట్రేలియా, కెనడా, టాంజానియా, మయన్మార్ నుంచి ఎర్ర శనగలు, తెల్ల శనగలు దిగుమతి అవుతుండటంతో ఇక్కడ శనగల ధరలు పతనమయ్యాయి. వినాయక చవతి నాటికి ఎర్రశనగలు క్వింటా ధర రూ.6,500 ఉండగా, ప్రస్తుతం రూ.5,500కు పడిపోయింది. నాణ్యమైన సరకు క్వింటాకు రూ.5,500 నుంచి రూ.5,600కే లభిస్తుండడంతో విదేశీ శనగల కొనుగోలుకు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికీ దిగుమతులు సాగుతుండడంతో జిల్లా రైతులకు శరాఘాతంగా మారింది.

అవే విత్తనాలుగా..

ప్రభుత్వం 25 శాతం రాయితీపై అందిస్తున్న జేజీ-11 రకం శనగలను జిల్లాకు 17,732 క్వింటాళ్లు కేటాయించారు. పశ్చిమ ప్రాంత మండలాల్లో రైతులు ఎక్కువగా వినియోగించలేదు. చాలా మంది రైతులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేయలేక శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న శనగలనే విత్తనాలుగా వాడుకున్నారు. రబీ సీజన్ డిసెంబరు వరకు కొనసాగుతుండడంతో సాగుకు మక్కువ చూపుతున్నారు.

వరుడు ఆమెగా.. వధువు అతడిగా!

యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామంలో తరతరాల నుంచి ఓ వింత ఆచారం కొనసాగుతోంది. గ్రామంలో గురు వారం యాదవ కులానికి చెందిన బత్తుల శివగంగరాజు, నందిని వివాహం వైభవంగా జరిగింది. ఇరు కుటుంబాల ఆచారం ప్రకారం వరుడు పెళ్లికుమార్తెగా, వధువు పెళ్లికుమారుడిగా ముస్తాబు చేసి ఘనంగా ఊరేగించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాల్లో తరతరాలుగా వస్తున్న ఆచారమని వధూవరుల కుటుంబసభ్యులు చెబుతున్నారు.
–న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

ఇదో మినీ భారత్

గెలాక్సీ పురిగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి మినీ భారత్‌గా విరాజిల్లుతోంది. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా 10కి పైగా రాష్ట్రాలకు చెందిన 20 వేల మందికిపైగా కార్మికులు ఇక్కడ గ్రానైట్ క్వారీలు, అనుబంధ పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ గ్రానైట్ క్వారీల్లో పనిచేసేందుకు తొలుత 1980 దశకంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్మికులు జీవనోపాధి నిమిత్తం వలస వచ్చారు. అనంతరం దాదాపుగా దేశంలోని సగానికిపైగా రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు రాజస్థాన్, ఒడిశా, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అసోం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జమ్ముకశ్మీర్ ఝార్ఖండ్, తదిర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు ఏళ్లుగా ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. క్వారీల్లో జాకీ పనులు మొదలుకుని పరిశ్రమల్లో రాళ్ల కోయడం, పాలిష్ చేయడం, లారీలకు ఎక్కించడం తదితర పనులు చేస్తుంటారు. ఇలా వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది కార్మికుల జీవనంతో చీమకుర్తిలో భిన్నంలో ఏకత్వం కనిపిస్తోంది. –న్యూస్‌టుడే, చీమకుర్తి

ఇసుకపై మొంథా మోత!

గత నెలలో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చాలా ప్రాంతాల్లో నీటి నిల్వలున్నాయి. నదులు, వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలకు ఆటంకం ఏర్పడడం, రవాణాకు ఇబ్బందులు ఎదురవ్వడంతో లభ్యత తగ్గింది. దీంతో ప్రస్తుత అవసరాలకు సరిపడా నిల్వల్లేకపోవడంతో డిమాండు పెరిగి ధర కూడా పెరిగింది. –ఈనాడు, ఒంగోలు

మార్కాపురంలోని ఇసుక నిల్వ కేంద్రం

▸ నీటి నిల్వలతో తవ్వకాలకు ఆటంకం
▸ కొరతతో అధిక ధరలకు కొనుగోలు

టన్నుపై అదనపు బాదుడు

లారీ మొత్తం మీద 40 టన్నుల వరకు ఇసుక కావాల్సి ఉంటే, అసలు ధరపై టన్నుకు రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు. ట్రాక్టరుకు పట్టే 4 టన్నులు లేదా మినీ లారీల్లో తరలించేందుకు 10 టన్నుల వరకు కొనుగోలు చేస్తే టన్నుకు రూ.300 నుంచి రూ.400 వరకు అదనంగా పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. మార్కాపురంలోనూ ఇదే పరిస్థితి. ఒంగోలు పరిసరాల్లోనూ ఇదే మాదిరి టన్నుకు రూ.200 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

జిల్లాలో సగటున 600 టన్నుల నుంచి వేయి టన్నుల వరకు ఇసుక వినియోగం ఉంటుంది. ప్రధానంగా నెల్లూరు జిల్లాలోని సంగం బ్యారేజీ నుంచి పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి రవాణా చేస్తున్నారు. ఒంగోలు చుట్టుపక్కలకు పాలేరు నుంచి తీసుకొస్తారు. సంగం బ్యారేజీ నుంచి ఇసుక సరఫరా కొంత తగ్గింది. జిల్లాలోని 12 యార్డుల్లో టన్ను ఇసుకకు రూ.100 నుంచి రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనే అదనపు వసూళ్లు ఉండగా, ప్రస్తుతం మరింత పెంచారు.

రూ. వేలల్లో పెంచేశారు

కనిగిరి నియోజకవర్గంలోని పామూరు ఇసుక నిల్వ కేంద్రంలో టన్ను రూ.750 వరకు విక్రయించాల్సి ఉండగా, రూ.900పైనే ధరకు విక్రయిస్తున్నారు. పొదిలిలో స్థానికంగా ముసిలో లభించే ఇసుక ట్రాక్టరు రూ.2 వేలు చొప్పున అమ్మేవారు. అదిప్పుడు రూ.3,500కు పెంచేశారు. సంగం బ్యారేజీ నుంచి వచ్చే నాణ్యమైన ఇసుకకు టన్నుపై రూ.1,300 చొప్పున వెచ్చించాల్సిందే. గిద్దలూరు నియోజకవర్గం పరిధిలో కంభం ఇసుక నిల్వ కేంద్రంలో టన్ను ఇసుక రూ.1,350 చొప్పున విక్రయిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

వర్షాకాలం నేపథ్యంలో జిల్లా పరిధిలో 30 వేల టన్నుల ఇసుక యార్డుల్లో నిల్వ చేశాం. ప్రస్తుత అవసరాలు ఎంతమేర ఉన్నాయన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఒక వేళ ఎక్కడైనా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం.
– రాజశేఖర్, భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి

కరివేపాకని తీసిపడేయలేదు!

కరివేపాకే కదా వారు తీసిపడేయలేదు. ఉపాధి మార్గంగా మార్చుకున్నారు చీమకుర్తి మండలం గుండువారి లక్ష్మీపురం గ్రామస్థులు. సుమారు 15 ఏళ్ల కిందట నాలుగెకరాలతో ప్రారంభమైన కరివేపాకు సాగు ప్రస్తుతం వంద ఎకరాలకుపైగా చేరింది. ఏడాది పొడవునా నికరంగా ఆదాయం వస్తుండడంతో ఇక్కడ రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నాలుగు నెలలకొక ఒక పంట చొప్పున ఏడాదిలో మూడు పర్యాయాలు కోతకు వస్తూ ఆదాయం ఇస్తోంది. ప్రతి రోజు 5 టన్నుల మేర దిగుబడులు ఒంగోలు, కావలి, నెల్లూరు, తిరుపతికి ఎగుమతి అవుతోంది. అన్ని ఖర్చులు పోను ఏడాదికి ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని ఇక్కడ రైతులు చెబుతున్నారు. –న్యూస్‌టుడే, చీమకుర్తి

(c) eenadu

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

మినుముకు తెగులు.. రైతన్నకు గుబులు

- పల్లాకు, పచ్చ పురుగుతో పెరుగుతున్న నష్టం

జిల్లాలో పశ్చిమ ప్రకాశంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో 4,118 హెక్టార్లలో మినుము పంటను కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, దర్శి, కొండపి, తదితర ప్రాంతాల్లో సాగు చేశారు. నిజానికి ఖరీఫ్, రబీలో 26,341 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా 23 శాతం మాత్రమే పంట వేశారు. కారణం సరిగ్గా వర్షాలు పడక పోవడం. అయితే సాగు చేసినచోట అధిక వర్షాలు, మంచు కురవడంవల్ల పల్లాకు తెగులు సోకింది. ఒక పొలం నుంచి మరో పొలానికి వైరస్‌లా సోకింది. దీంతో వందలాది హెక్టార్లలో పంట దెబ్బతింది. ఇలాంటి పరిస్థితి జిల్లాలో అన్ని చోట్ల ఉంది. రైతులు ఏంచేయాలో పాలుపోక తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

- న్యూస్‌టుడే, కనిగిరి

కంచర్లవారిపల్లిలో పల్లాకు తెగులు సోకి రంగు మారిన మినప చేను / ఆకులను తినేస్తూ నష్టాన్ని తెస్తున్న పచ్చ పురుగు

స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించండి

మొంథా తుపాను ప్రభావంతో అధికంగా వర్షాలు పడటం, వాతావరణ ప్రభావం వల్ల మినుముకు పల్లాకు వైరస్, ఇతర తెగుళ్లు సోకాయి. దీని నివారణకు స్థానిక వ్యవసాయాధికార్లను రైతులు సంప్రదించాలి. ఎరువులు, పురుగు మందులు ఎంత మేర వాడాలనేది వారిచ్చిన సూచనల మేరకు పాటించాలి.

- శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి

పశ్చిమ ప్రకాశంలో ఎక్కువ

పశ్చిమ ప్రకాశంలో మినుము పంట అధికంగా సాగు చేస్తారు. ఒక్కో రైతు ఎకరాకు రూ.30,000 ఖర్చు అవుతుంది. ఈ ఏడాది పల్లాకు వైరస్‌తో పాటు, ముడత, బూజు తెగుళ్లు సోకడంతో తీవ్రంగా నష్ట పోయారు. కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కనిగిరి, పామూరు, వెలిగండ్ల, పీసీపల్లి, సీయస్ పురం మండలాల్లో ప్రభావం అధికంగా ఉంది. ఆకు పల్లాకు తెగులుతో పాటు ఇతర తెగుళ్ల వల్ల పూత వచ్చి, పిందె దశకు బూజు పట్టిపోయి ఎండి పోతోంది. దీంతో పాటు పచ్చ పురుగు మరింత నష్టం చేకూరుస్తోంది.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ

ధాన్యం సేకరణకు సకల చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వరి ధాన్యం సేకరణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో గురువారం వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు జిల్లాలో తీసుకున్న చర్యల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. లేట్ ఖరీఫ్ దృష్ట్యా వరి ధాన్యం సేకరణ డిసెంబరు లేదా జనవరి నెల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వ పనితీరు ... గృహాల్లో కమ్యూనిటీ కాంప్లెక్స్ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి నిర్మల జ్యోతి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వల పరిశీలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కరవది, దేవరంపాడు, పెల్లూరు పీఏసీఎస్‌లో నిల్వ ఉంచిన ఎరువులను గురువారం డీఏవో శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం నిల్వలతో పాటు అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.



కెనరా బ్యాంక్ Canara Bank

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎం. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ఫోన్: 7901626759

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు
(తేది 29.11.2018 నాటి మునుపటి డిమాండ్ నోటీసును రద్దు చేయడం ద్వారా)

టు:
ఋణగ్రహీత : M/s వినాయక పేపర్ ప్రొడక్ట్స్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్: శ్రీ పుట్టా వెంకటరావు, తండ్రి: పుట్టా సుబ్బారావు, యస్.నెం. 212/4, చెరువుకొమ్ముపాలెం రోడ్డు, పెల్లూరు, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్ – 523274.
హామీదారులు: (1). శ్రీమతి పుట్టా సుశీల, భర్త: పుట్టా వెంకటరావు, డి.నెం. 1-201, పోతుల చెంచయ్యనగర్, టంగుటూరు పోస్ట్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523274. (2). కిరణ్ కుమార్ పులిచెర్ల, తండ్రి: వెంకటేశ్వర్లు, 2-254, టంగుటూరు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్, 523274.

డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్ నుండి M/s వినాయక పేపర్ ప్రొడక్ట్స్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్: శ్రీ పుట్టా వెంకటరావు, తండ్రి: పుట్టా సుబ్బారావు (ఇక మీదట ఋణగ్రహీత/లు గా రిఫర్ చేయబడును) గారు పొందిన లోన్ / ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేదీ 31.10.2025 నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
SOD అకౌంట్ నెం. 3644140000382	రూ. 32,00,000/- తేది: 03.05.2013	రూ. 72,79,529.38	10.35% + పీనల్ చార్జ్ & ఇతర ఖర్చులు
టర్మ్‌లోన్ అకౌంట్ నెం. 3644791000191	రూ. 35,00,000/- తేది: 19.12.2012	రూ. 31,06,239.47	10.85% + పీనల్ చార్జ్ & ఇతర ఖర్చులు
టర్మ్‌లోన్ అకౌంట్ నెం. 3644991000208	రూ. 17,00,000/- తేది: 21.12.2016	రూ. 25,40,937.37	10.60% + పీనల్ చార్జ్ & ఇతర ఖర్చులు

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 28.11.2018 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా తేది **31.10.2025 నాటికి రూ.1,29,26,706.22/- (అక్షరాల ఒక కోటి ఇరవై తొమ్మిది లక్షల ఇరవై ఆరు వేల ఏడు వందల ఆరు రూపాయలు మరియు ఇరవై రెండు పైసలు మాత్రమే)**+ తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి
ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, పెల్లూరు గ్రామం, చెరువుకొమ్ముపాలెం రోడ్, సర్వే నెం. 212/4, డోర్ నెం. 40-99-71 & 72, ప్లాట్ నెం. 6 నందు 410.33 చ॥మీ॥ల లేదా 343.08 చ॥మీ॥ల విస్తీర్ణంలో ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ & మొదటి అంతస్తు గల ఇండస్ట్రియల్ బిల్డింగ్ ఆస్తి. (సేల్ డీడ్ నెం. 6008/2011). **హద్దులు: తూర్పు:** 30 అ॥ల రోడ్డు, **పడమర:** మాగం గోపి చంద్రశేఖర్ రావు యొక్క భూమి, **దక్షిణం:** ప్లాట్ నెం.7 స్థలం, **ఉత్తరం:** ప్లాట్ నెం.5. సెర్సాయ్ ఐడి: 400045826662.
టైటిల్ హోల్డర్ పేరు : శ్రీ పుట్టా వెంకటరావు, తండ్రి: పుట్టా సుబ్బారావు.

తేది : 19.11.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తిరుపతి కెనరా బ్యాంక్

జాతీయస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలునగరం,ఎస్.ఎన్. పాడు: రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను డీఈవో ఎ.కిరణ్‌కుమార్ అభినందించారు. ఈనెల 24 వరకు తిరుపతి జిల్లా చంద్రగిరి లో జరిగిన అండర్ 14 రాష్ట్రస్థాయి హాకీ పోటీలో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన మైనంపాడు విద్యార్థి పి.గిరివర్ధన్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. అదే విధంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగిన అండర్ 19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొన్న మైనంపాడు హైస్కూలు ప్లస్ విద్యార్థి తన్నీరు సాయి శ్రీవాణి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీకి ఎంపికైంది. వీరిద్దరూ త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం డీవీఎల్ నరసింహరావు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, టి.రవికుమార్‌ను డీఈవో అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సిద్ధం

ముండ్లమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-14 విభాగంలో బాల, బాలికల జట్లను సంసిద్ధం చేశారు. ముండ్లమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు శిక్షణ ముగించుకొని గురువారం అనకాపల్లి వెళ్లారు. వ్యాయామోపాధ్యాయుడు సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరికి శిక్షణ ఇచ్చారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత తెలిపారు.

అండర్-14 ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలికల జట్టు

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

టంగుటూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యంపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. 106 మంది లబ్ధిదారులకు రూ.55 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఈదర ప్రభాకర్, బొక్కా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న మంత్రి స్వామి

ఎస్బీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా నియమితులైన టి. చిరంజీవిరావు గురువారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కొన్నాళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న చిరంజీవిరావును నియమిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన చిరంజీవిరావు రాయలసీమ జిల్లాల్లో ఎస్సై, సీఐ హోదాల్లో పనిచేశారు. నూతన డీఎస్పీని ఎస్‌బీ కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

బాపట్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సీసీఎస్, అమృతలూరు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కొమ్ము వెంకట సాయి, సాయికృష్ణ, సంపంగి నాని, సయ్యద్ నాగూర్ వలి, పందుల రమేష్ బాబు, ప్రకాశం జిల్లా పొదిలి మండలం రామాపురానికి చెందిన బండి శివారెడ్డి (ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు) దొంగల ముఠాగా ఏర్పడ్డారు. చెడు వ్యసనాలకు బానిసలై విలాసాలకు నగదు కోసం రెండేళ్ల నుంచి మోటార్ సైకిళ్ల చోరీ చేయటం ప్రారంభించారు. యద్దనపూడి మండలం చిమటావారిపాలేనికి చెందిన సుబ్బారావు అమృతలూరు మండలం ఇంటూరులో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా అపహరించారు. అతడి ఫిర్యాదు మేరకు అమృతలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును సీసీఎస్ పోలీసులకు ఎస్పీ అప్పగించారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ నేతృత్వంలో సీఐ ప్రేమయ్య, అమృతలూరు ఎస్సై రవితేజలతో రెండు పోలీసు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి వారి నుంచి రూ.16.50 లక్షల విలువైన 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య, చుండూరు సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఏపీసీ దాసరి అనిల్‌కుమార్ కోరారు. జిల్లాలోని 28 కేజీబీవీలకు చెందిన ప్రిన్సిపల్స్‌తో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ మొత్తం 1,077 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారన్నారు. గత ఏడాది మంచి ఫలితాలు వచ్చాయని, ఈఏడాది వందశాతం ఉత్తీర్ణతకు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. వందరోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలన్నారు.

గంజాయి విక్రేతల పట్టివేత

స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ అజయ్‌కుమార్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: గంజాయి విక్రేతలను దోర్నాల పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు యర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెద్దారవీడు మండలం కలనూతలకు చెందిన పుచ్చకాయల శ్రీను, దోర్నాలకు చెందిన అడపాల శ్రీను, గంటవానిపల్లెకు చెందిన సీహెచ్ సురేష్ దోర్నాల మండలం శ్రీశైలం రహదారిలోని బోడేనాయక్ తండా అడ్డరోడ్డు వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చారని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై మహేష్ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లగా..వారిని చూసి నిందితులు అటవీ ప్రాంతంలోకి పరుగులు తీశారు. పోలీసులు వెంబడించి పట్టుకుని వారి వద్ద ఉన్న 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు. సమావేశంలో ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస నాయక్ చీరాలకు మార్పు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా వైద్యవిధాన పరిషత్ సమన్వయ కర్తగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాస నాయక్‌కు రివర్షన్ ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులిచ్చారు. సివిల్ సర్జన్ స్పెషలిస్టు కేడర్‌కు చెందిన ఎం.శ్రీనివాసనాయక్ గతంలో చీరాల ఆసుపత్రిలో పనిచేస్తుండగా డీసీహెచ్‌ఎస్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కొంతకాలంగా ఆయన పనితీరు సంతృప్తికరంగా లేకపోవడంతో తిరిగి చీరాల ఆసుపత్రికి మారుస్తూ రివర్షన్ ఇచ్చారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 640 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 108, రిటైల్ లైవ్ - 135, చికెన్ విత్ స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్- 223

విద్యుదాఘాతంతో మత్స్యకారుడి మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలం పాకల చెల్లెమ్మగారి పాలెంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పట్టపుపాలేనికి చెందిన కాటంగారి జాలయ్య (39), తమ నివాస గృహానికి విద్యుత్తు సరఫరా కాకపోవడంతో సమీపంలోని స్తంభం వద్ద తీగలను సరిచేస్తున్నారు. ఒక్కసారిగా తీగలు తెగి మీద పడడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అతడు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

షిఫ్ట్ ఆపరేటర్ ఆత్మహత్య: కంభం, న్యూస్‌టుడే : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జంగంగుంట్లలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నరసింహారావు కథనం మేరకు..గ్రామానికి చెందిన గొంగటి శ్రీనివాసులు (44) రావిపాడు విద్యుత్తు ఉప కేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మద్యానికి బానిసై, అనారోగ్యానికి గురయ్యారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ముగ్గురు పిల్లలున్నారు.

మహిళను వేధించిన కేసులో జవాన్ అరెస్టు

రాచర్ల : స్థానిక పంచాయతీకి చెందిన ఆర్మీ జవాన్ మల్లెబోయిన వినోద్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు. .2025 ఫిబ్రవరి నెలలో రాచర్లకు చెందిన ఓ మహిళను జవాన్ వేధించడంతో కేసు నమోదైంది. న్యాయస్థానం నోటీసులు అందజేసినా ఆయన వాయిదాలకు వెళ్లలేదు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని దిల్లీ వెళ్లి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఒంగోలు నగరం, నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: పనిచేస్తున్న పాఠశాలలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన స్కూలు అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడు బక్కమంతుల వినయ్‌ని సస్పెండ్ చేస్తూ డీఈవో ఎ.కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులిచ్చారు. నాగులుప్పలపాడు మండలం హెచ్ నిడమానూరు హైస్కూలు ప్లస్‌లో పనిచేస్తున్న ఈ ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తల్లిదండ్రులు, విద్యార్థినులు, పాఠశాల హెచ్.ఎం. శ్రీనివాసరావు ఏంఈవోలు రవి, రమణయ్యలు డీఈవో కిరణ్‌కుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈవో ఆదేశాలమేరకు ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర్, జీసీడీవో హేమలత పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. అభియోగాలు యథార్థమని తేలటంతో వారిచ్చిన నివేదిక మేరకు డీఈవో ఆయన్ని సస్పెండ్ చేశారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు : ఉపాధ్యాయుడు బక్కమంతుల వినయ్‌పై పోక్సో కేసు నమోదైంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రజియా సుల్తానా ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భోజనం పెట్టలేదని భక్తులపై దాడి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఒకరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన హరిదాసు రత్తయ్య, కుటుంబసభ్యులు, ఇతరులు అమ్మవారి దర్శనానికి గురువారం ఆలయానికి వచ్చారు. అమ్మవారి సత్రాల్లో ఉండి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సమయంలో స్థానిక మహిళ వచ్చి భోజనం పెట్టమని భక్తులను అడగడంతో వారు నిరాకరించారు. దీంతో ఆమెతోపాటు మరో ఇద్దరు దాడి చేసి కర్రలతో కొట్టారు. దీంతో రత్తయ్య తలకు తీవ్ర గాయం కాగా, వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నందిగామలో ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. చికిత్స అనంతరం ఒంగోలుకు వెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టించిన ర్యాపిడ్ రైడ్

- రూ.48.10 లక్షల సొత్తు రికవరీ

న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం: రైల్లో ప్రయాణికుడి సొత్తు (విలువ రూ.48.10 లక్షలు) కాజేసిన దొంగను సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ గురువారం ఒంగోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

- **హైదరాబాద్ నుంచి నెల్లూరుకు వెళ్తుండగా.. :** బెంగళూరు డాలర్స్ కాలనీకి చెందిన కలికి కోదండరామిరెడ్డి కుటుంబంతో కలిసి ఈ నెల 13న హైదరాబాద్ నుంచి నెల్లూరుకు ఏసీ బోగీలో ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యలో వారి లగేజీలోని 350 గ్రాముల బంగారం, ఇంపోర్టెడ్ వాచీలు, రూ.40వేలు నగదు అపహరణకు గురయ్యాయి. గుర్తించిన బాధితులు నెల్లూరు జిల్లా కావలిలో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చీరాల- ఒంగోలు స్టేషన్ల మధ్య చోరీ జరిగినట్లు గుర్తించి ఒంగోలు రైల్వే పీఎస్‌లో కేసు నమోదు చేశారు. కేసు ఛేదన కోసం నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో ఒంగోలు సీఐ మౌలాషరీఫ్; నెల్లూరు సీఐ ఎ.సుధాకర్, క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌ల నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.
- **అన్ని సీసీ ఫుటేజీలను విశ్లేషించారు :** సీసీ ఫుటేజీల ఆధారంగా ఓ వ్యక్తి నెల్లూరులో రైలుదిగి దుస్తులు మార్చుకుని అక్కడి నుంచి తిరిగి విజయవాడకు ప్రయాణించినట్లు సీఐ సుధాకర్ బృందం గుర్తించి సమాచారాన్ని షరీఫ్ బృందానికి చేరవేసింది. నిందితుడు హైదరాబాద్‌కు ర్యాపిడో బైక్‌పై వెళ్లినట్లు గమనించి బైక్ నంబర్ ఆధారంగా తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బాలానగర్ కొత్తపేట న్యూగ్రీన్‌సిటీలో నివాసముండే మహ్మద్ షకీల్ అహ్మద్ ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి నుంచి చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ కొండయ్య, ఎస్సై సుబ్బమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్, చిత్రంలో ఒంగోలు, నెల్లూరు రైల్వే సీఐలు మౌలా షరీఫ్, సుధాకర్, క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య తదితరులు

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

రాజధాని అమరావతిలో గజం 5000/- & 10000/- రాజధానిలో ఎకరం పొలం 70 లక్షలు, గుంటూరులో డూప్లెక్స్ విల్లా 1.60 Cr. Ph: 90523 45356.

JOBS

Wanted Ex. Service Man at Medapi TOLL PLAZA. Cont: Narise Siva Ganesh. ✆ 91542 14147.

WANTED Pro'sfor Jr.College Chirala forDetails ✆80088 12235 sendresumeto wat-'sapp: 8328387500 attend-Interview on1-12-25by 10AM.

తనిష్క్ జ్యువెలరీ స్టోర్‌లో పనిచేయుటకు ఫ్లోర్ మేనేజర్ కావలెను. జీతం : 25K to 35K+ ఇన్సెంటివ్స్. సంప్ర: సస్యగ్రూప్, ఒంగోలు. 9281452802.

కావలెను. త్రిపురాంతకం మండలం, మేడపి టోల్‌ప్లాజా వద్ద పని చేయుటకు Ex. సర్వీస్‌మ్యాన్ కావలెను. వి.సం.ప్ర: N. శివగణేష్ ✆ 9154214147.

సూపర్‌వైజర్స్ కావలెను. A1కళ్యాణ మండపం, ఒంగోలు నందు పనిచేయుటకు ఇద్దరు (మహిళలైన, పురుషులైన) కావలెను. సెల్: 98494 49012.

త్రోవగుంట పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ (స్త్రీ/పు) కావలెను. డ్యూటీ: 12 గం॥లు. జీతం: 14 వేలు. సం॥ప్ర: 81796 95848.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ని, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

DRIVERS

డ్రైవర్స్ కావలెను. ఒంగోలుటౌను ఫ్రూట్స్ షాపుకు TATA ACE, INDRA V-30 వ్యాన్‌కు బ్యాడ్జ్ లైసెన్స్‌కల నేషనల్ డ్రైవర్స్ కావలెను. ✆ 6304388821.

EENADU CLASSIFIEDS అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500 Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

వక్తల్లా రాణించి.. బహుమతులు సాధించి..

కంభం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కె. తిరుపతమ్మ (సీనియర్ ఎంపీసీ), కె. నవీన్ (సీనియర్ హెచ్‌ఈసీ), జి.వి. శరణ్య (జూనియర్ ఎంపీసీ) విద్యార్థులు మొదటి మూడు బహుమతులను వరుసగా సాధించారు. వారికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జి.తిరుమలయ్య, అధ్యాపకులు ఎస్.కృష్ణయ్య, ఎ.తిరుపాలు, ఎన్‌కే నాయక్‌రసూల్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కంభం : బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

◗ పొదిలి: పొదిలిలోని శ్రీ రామచంద్ర ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితంపై చరవాణి ప్రభావం' అనే అంశంపై పోటీలు జరిగాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఇందులో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి కె.కార్తీక్ (పదో తరగతి), ద్వితీయ బహుమతి పి.చైతన్య (పదో తరగతి), తృతీయ బహుమతి జె.శ్రీలాస్య (9వ తరగతి) గెలుచుకున్నారు. వారికి పాఠశాల డైరెక్టర్ ధరణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుక, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ధాన్యం కేంద్రాలు ఏర్పాటుచేయరూ!

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి దాసరి పుల్లయ్య కోరారు. మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించినప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం సత్వరం స్పందించాలని గురువారం ఆయన ఓ ప్రకటనలో కోరారు.

టెట్ నిర్వహణ బాధాకరం

అర్ధవీడు, న్యూస్‌టుడే: ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ పరీక్షలు (టెట్) నిర్వహించడం బాధాకరమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య అన్నారు. మండల పరిధిలోని పాపినేనిపల్లి, అర్ధవీడు, దొనకొండ పలు పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే కోరుకున్న పాఠశాలలకు రిలీవ్ చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిక్, కార్యదర్శి నబీఖాన్, మండల అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే నగర్ కూడలిలో అశోక చిహ్నం

అశోకచిహ్నం ఏర్పాటు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: స్థానిక ఆర్కే నగర్ కూడలిలో గురువారం అమర జవాన్ల స్తూపంపై మూడు సింహాల అశోక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం మండల కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి, జిల్లా కార్యదర్శి పల్లెబోయిన వెంకటరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పాఠశాల తనిఖీ

రాచర్ల, న్యూస్‌టుడే : స్థానిక ఏబీఎం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో -1 మొయినుద్దీన్ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు, పలు రకాల దస్త్రాలు పరిశీలించారు. సీఆర్పీ రామలింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించి.. పుడమి పులకించి

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం :

● పశ్చిమంలో జలకళ

క్షామ పరిస్థితులు కన్పించే పశ్చిమ ప్రాంతంలో జలకళ కన్పిస్తోంది. ప్రధానంగా గిద్దలూరు, కొమరోలు తదితర ప్రాంతాల్లో జల చిత్రంలో గణనీయమైన మార్పు వచ్చింది. ఇటీవలి భారీ వర్షాలతో భూగర్భ జలాలు ఉబికి వస్తున్నాయి.

గత నెలలో కురిసిన వర్షాలతో నల్లమల లోని ఎనుమలేరు, సగిలేరు, గుండ్లకమ్మ, జంపలేరు, రాళ్లవాగు, చీమలేరు, పెద్దవాగులు పొంగి ప్రవహించాయి. దీంతో చారిత్రక కంభం చెరువు నిండి అలుగు పారింది. గతంలో 200 అడుగుల లోతులోకి చేరి భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుతం భూగర్భ జలం పెరగడంతో బోర్లన్నీ రీఛార్జి అవుతున్నాయి. ప్రస్తుతం 50 నుంచి 60 అడుగుల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని పలు చెరువులు వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. చెక్‌డ్యామ్‌లు, చిన్న నీటికుంటలు వాననీటితో నిండాయి. మండలాల వారీగా అక్టోబరు-25 నాటికి భూగర్భ జలాల పరిస్థితి కింద పేర్కొన్న విధంగా ఆశాజనకంగా ఉంది.



తాళ్లపల్లె ఎనుమలేరుపై చెక్‌డ్యామ్‌లో జలకళ

అర్ధవీడు	బేస్తవార పేట	కంభం	గిద్దలూరు	కొమరోలు	మార్కాపురం	దోర్నాల	పెద్దారవీడు	పుల్లలచెరువు	రాచర్ల	వై.పాలెం	తర్లుపాడు	త్రిపురాంతకం
7.5	15.52	10.98	41.40	10.23	13.49	33.05	18.15	21.35	14.70	17.29	15.83	11.80

వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఆయన గురువారం గంటవానిపల్లెలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. సర్పంచి యక్కంటి రమాదేవి, ఎంపీడీవో ప్రసూనదేవి, పీఆర్ డీఈ ప్రసాద్, మండల తెదేపా అధ్యక్షుడు షేక్ మాబు, నాయకులు సుధాకర్‌రెడ్డి, శేషాద్రి, సుబ్బారెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

◗ పెద్దారవీడు: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్ బాబు అన్నారు. కొత్తపల్లిలో 'రైతన్నా మీకోసం'లో పాల్గొని మాట్లాడారు. కన్వీనర్ మెట్టు శ్రీనివాస రెడ్డి, సొసైటీల అధ్యక్షులు బోడిరెడ్డి, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కొత్తపల్లి గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, నక్కా శ్రీను పాల్గొన్నారు.

గంటవానిపల్లెలో భూమి పూజ చేస్తున్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్‌బాబు, సర్పంచి రమాదేవి

స్తంభాలు వేశారు.. వీధి దీపాలు మరిచారు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా ఇటీవల కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే వాటికి వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళ చీకట్లు అలముకుంటున్నాయి. విద్యుత్తు శాఖ, పంచాయతీ అధికారులు వీటిపై దృష్టి పెట్టలేదు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుంచి మాచర్ల రహదారి వరకు మూడుచోట్ల తప్ప ఎక్కడా వీధి దీపాలు లేవని స్థానికులు వాపోతున్నారు. దీంతో రాత్రి వేళ వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు లోనవుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్యను సంప్రదించగా ఆర్డీఎస్ కింద విద్యుత్తు అధికారులు స్తంభాలు వేసి వెళ్లిపోయారన్నారు. సామగ్రి తీసుకొచ్చి త్వరలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు.

వై.పాలెం జాతీయ రహదారిలో కనిపించని వీధి దీపాలు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పెద్దారవీడు, న్యూస్‌టుడే: దేవరాజుగట్టు కాశినాయన ఆశ్రమంలోని శివాలయం, అన్నపూర్ణమ్మ వారి దేవాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవం, పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

పెద్దారవీడు : దేవరాజుగట్టులో క్రేన్‌తో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అమ్మవారి సేవలో శివ స్వామి

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: కోటిలింగాల శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి గురువారం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామాజిక అన్నదాన సత్రాల వద్ద ప్రముఖ వ్యాపారవేత్త పాటిబండ్ల కృష్ణ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ పైకప్పునకు ఆయన కొబ్బరి కాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఆయన వెంట యామర్తి ధనుంజయరావు తదితరులు ఉన్నారు.

ఆలయంలో ధ్యానం చేస్తున్న శివస్వామి

వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ముగిసిన పొగాకు అమ్మకాలు

పొదిలి: పొదిలి వేలం కేంద్రంలో పొగాకు అమ్మకాలు గురువారంతో ముగిశాయి. 2024-25 పంట కాలంలో రైతులు 15.04 మి.కిలోల పొగాకు ఉత్పత్తి చేశారు. మార్చి పదిన వేలం కేంద్రాలు ప్రారంభించగా, 208 రోజులపాటు వేలం ప్రక్రియ సాగింది. 36 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి. సరాసరి ధర కిలోకు రూ.300 తగ్గకుండా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయగా వేలం ముగిసే నాటికి రూ.202.18 మాత్రమే రైతుకు దక్కింది. అత్యధిక ధర కిలో రూ.360, కనిష్ఠ ధర కిలో రూ.50 పలికింది. చివరిరోజు 1341 బేళ్లను వేలానికి తీసుకురాగా, 724 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. సరాసరి ధర కిలో రూ.94 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

పెద్దారవీడు, న్యూస్‌టుడే

?: మా వీధిలో నాలుగు స్తంభాలకు దీపాలు వెలగడం లేదు. సమస్యను పరిష్కరించగలరు. – ఎ.మల్లికార్జునరెడ్డి, దేవరాజుగట్టు

✓: గ్రామం మొత్తం పరిశీలించి మరమ్మతులకు గురైన వాటిని తొలగించి, అవసరమైన చోట కొత్త దీపాలను ఏర్పాటు చేస్తాం. – జాన్ సుందరం, ఎంపీడీవో, పెద్దారవీడు.

పకడ్బందీగా గృహ సర్వే

బేస్తవారపేట, న్యూస్‌టుడే: పీఎంఏవై కింద గ్రామాల్లో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని గిద్దలూరు గృహ నిర్మాణశాఖ డీఈఈ ఖదీర్ బాషా కోరారు. గురువారం బేస్తవారపేట, సోమవారపేట తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలిసి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30లోగా సర్వే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలు నమోదు కాకుంటే ఇళ్ల మంజూరుకు అవకాశం ఉండదన్నారు. ఏఈ విజయకుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బేస్తవారపేట : సర్వేచేస్తున్న డీఈఈ ఖదీర్ బాషా, ఏఈ విజయకుమారి

బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు

కంభం వాసులను గ్రామసింహాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇవి గుంపులుగా తిరుగుతూ స్థానికులపై దాడి చేస్తున్నాయి. వై జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారి పైనా, ప్రభుత్వ వైద్యశాల దాటిన తర్వాత, రావిపాడు రోడ్డు, చౌక్ సెంటర్, కందులాపురం కూడలిలో వీటి బెడద ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. న్యూస్‌టుడే, కంభం

అటు వెళ్లినా..ఇటు వెళ్లినా ముప్పే

ఈ చిత్రం మార్కాపురం పట్టణం - ఒంగోలు ప్రధాన మార్గంలోనిది. ఇటీవలి భారీ వర్షాలకు మార్కాపురం చెరువు అలుగు పారే ప్రదేశంలోని వై కూడలి వద్ద చప్టా ప్రమాదకరంగా మారింది. అక్కడ రక్షణదిమ్మెలు ఏర్పాటు చేయకపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

యర్రగొండపాలెం పట్టణం: పట్టణంలోని ఎన్జీవో కాలనీలో గురువారం రూ.10లక్షల విలువ గల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అరుణాబాయి పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం

కంభం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీవో జీవరత్నం తెలిపారు. మండలంలోని తురిమెళ్ల గ్రామంలో గురువారం ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మాదా సుభద్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పనులు గుర్తిస్తున్న ఏపీవో జీవరత్నం, తదితరులు

తెదేపా బలోపేతానికి కృషి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకుడు పొదిలి శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సాధారణ ఎన్నికల్లో పార్టీకి తక్కువ ఓట్లు పోలైన ప్రాంతాల్లోని పోలింగ్ బూత్ కన్వీనర్లతో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర మంత్రి లోకేశ్ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టారన్నారు. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధిష్ఠానానికి తెలియజేస్తామన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు షేక్ మాబు, నాయకులు పబ్బతి సుబ్బారావు, శేషాద్రి, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు, చిత్రంలో పార్టీ నాయకులు

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన అంతర్ జిల్లాల ఎస్జీఎఫ్ కరాటే ఛాంపియన్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో షేక్ జోయాసిద్ధిఖి 50 కేజీలు, హుస్సేన్ బాషా 66 కేజీల విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు.

విజేతలతో నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి

కతారి రాజు సేవలు చిరస్మరణీయం

పొదిలి, న్యూస్‌టుడే: గ్రామీణ వైద్యునిగా, మాజీ ఎంపీపీగా దివంగత కతారి రాజు ఎనలేని సేవలు అందించారని పొదిలి ఏఎంసీ ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్ చెప్పారు. రాజు ఏడో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కతారి భరత్‌చంద్ర ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెదేపా సీనియర్ నాయకులు కాటూరి వెంకటనారాయణబాబు, నాయకులు మస్తాన్‌వలి, ఖాశింపీరా, సంధానిబాషా, యస్థాని, కె. చిన్నరాజు, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం వడ్డిస్తున్న తెదేపా నాయకులు

సీఐ సతీష్ హత్య కేసు సీబీఐకి అప్పగించాలి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : సీఐ సతీష్ కుమార్ హత్య కేసును సీబీఐకి అప్పగించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం తహసీల్దారు ఎం.ఆంజనేయరెడ్డిని కలసి విన్నవించారు. సతీష్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అద్దంకి మధుసూదన్ రావు, నాయకులు కంచర్ల కోటయ్య గౌడ్, మాదాసు రంగనాయకులు పాల్గొన్నారు.

తహసీల్దారు ఆంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మార్కాపురంలో సంబరాలు

☛ కొత్త జిల్లాకు సీఎం ఆమోదం

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపడంతో పశ్చిమ ప్రాంతంలో సంబరాలు అంబరాన్నంటాయి. పలుచోట్ల ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. వివిధ కూడళ్లలో మిఠాయిలు పంచిపెట్టారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తాడేపల్లిలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. తమ ప్రాంతవాసుల చిరకాల కోరిక నెరవేర్చారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పశ్చిమ ప్రాంత వాసుల కష్టాలు గట్టెక్కుతాయని ఆయన అన్నారు. దాదాపు వంద నుంచి నూటయాభై కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు వెళ్లే అవస్థలు దూరమవుతాయన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వచ్చే అవసరముండదని ఆయనన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తనకు సూచించినట్లు ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు.

మార్కాపురంలోనే కొనసాగించాలని..

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నియోజకవర్గాన్ని మార్కాపురం డివిజన్‌లోనే కొనసాగించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. ఆయన గురువారం సచివాలయంలో సీఎంను కలిసి తమ నియోజకవర్గాన్ని కనిగిరి డివిజన్‌లో కలిపితే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు.


సీఎంని కలిసిన ఎమ్మెల్యే కందుల, అశోక్‌రెడ్డి

◗ మార్కాపురం అర్బన్ : స్థానిక 25వ వార్డులో కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌ఛార్జి కందుల రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇబ్రహీం, నాయకులు పుల్లారావు, కొండయ్య, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

◗ తర్లుపాడు: మార్కాపురం జిల్లా ఏర్పాటును స్వాగతిస్తూ తెదేపా, జనసేన ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. తెదేపా పార్టీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపరెడ్డి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గోపీనాథ్, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు కంచర్ల కాశయ్య, బాషాపతిరెడ్డి, తెదేపా, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తర్లుపాడు: తెదేపా కృతజ్ఞతా సభలో పాల్గొన్న నాయకులు

జనరల్ నోటీస్

నా క్లయింటు అయిన **అయ్యగారి నాగ వెంకట కిరణ్ కుమార్ తండ్రి** సుబ్రహ్మణ్య శర్మ, డోర్ నం. 3-237, రావిపాడు, పాతగన్నవరం, తూర్పు గోదావరి జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీ పురస్కరించుకొని యావన్మందికి తెలియజేయుట ఏమనగా

ప్రకాశం జిల్లా, పొదిలి మండలం, రాములవీడు గ్రామ కాపురస్తులు అయిన జక్కుల వెంకట సుశీల భర్త పుల్లయ్య, జక్కుల పుల్లయ్య తండ్రి చిన్న వెంకటేశ్వర్లు వారి వద్ద ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నా క్లయింటు అయిన **అయ్యగారి నాగ వెంకట కిరణ్‌కుమార్ గారు** కొనుగోలు చేయుటకు సిద్ధముగా ఉన్నారు. కావున సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవరికి అయినను అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ పేచీలు గానీ, తగాదాలు గానీ, కోర్టు కేసులు గానీ, అగ్రిమెంట్లు గానీ, తనఖాలు గానీ, బ్యాంకు ఋణములు గానీ, ఏమైనా ఉన్నచో నా క్లయింటుకు గానీ, నాకు గానీ ఈ తేదీ మొదలు, ఐదు రోజులలో తెలియపరచగలరు. లేని యడల నా క్లయింటు పై సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తి సంబంధించి ఎటువంటి సివిల్ కేసులు గానీ, క్రిమినల్ కేసులు గానీ చట్టపరంగా బద్ధపరచజాలదు. కావున యావన్మందికి తెలియచేయడం అయినది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, ఒంగోలు రి.డి, పొదిలి స.డి, పొదిలి మండలం, రాములవీడు గ్రామ పంచాయతీ, రాములవీడు గ్రామ సర్వేనెం. 137/1రు సబ్ డివిజన్ కాబడి సర్వే నెం. 137/1ఎ దాఖలా య. 3.00 సెంట్లు గల మెట్ట భూమికి హద్దులు. **తూర్పు:** పొటెండ్ల నరసింహారావు గారి భూమి. **దక్షిణం:** జక్కుల రమణయ్య గారి భూమి. **పడమర:** పొటెండ్ల నరసింహారావు గారి భూమి. **ఉత్తరం:** నాగిరెడ్డి కొండారెడ్డి గారి భూమి.

ఈ హద్దులలోని య. 3.00 సెంట్లు భూమి మరియు మాములు దారి హక్కులతో సహా. (పొదిలి సబ్ రిజిస్టర్ ఆఫీసు నందు రిజిస్టర్ దస్తావేజు నెం. 4627/2020 ప్రకారం).

డిటో గ్రామం

సర్వేనెం. 137/5రు దాఖలా య. 0.51 సెంట్లు గల మెట్ట భూమికి హద్దులు. **తూర్పు:** శంభు చంద్రశేఖర్ గారి భూమి. **దక్షిణం:** జక్కుల శ్రీను గారి భూమి. **పడమర:** పొటెండ్ల నారాయణ గారి భూమి. **ఉత్తరం:** జక్కుల పుల్లయ్య గారి భూమి.

ఈ హద్దులలోని య.0.20 సెంట్లు భూమి మరియు మాములు దారి హక్కులతో సహా. (పొదిలి సబ్ రిజిస్టర్ ఆఫీసు నందు రిజిస్టర్ దస్తావేజు నెం. 4171/2019 ప్రకారం మరియు పూర్వీకుల ఆస్థి య. 0.31 సెంట్లు మొత్తం వెరశి య. 0.51 సెంట్లు).

ఇట్లు/- **బొమ్మరాజు సురేష్‌కుమార్**
అడ్వకేటు, పొదిలి, ప్రకాశం జిల్లా
సెల్: 9866280305, 9008309933

ప్రదేశం: పొదిలి
తేది: 26.11.2025

(c) eenadu

కనిగిరి
•కనిగిరి •దర్శి •కొండపి

విజేతలతో దర్శి భాష్యం పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రసంగించారు.. ప్రశంసలు పొందారు

దర్శి, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం దర్శి భాష్యం ఉన్నత పాఠశాలలో జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు తమ అభిప్రాయాలను చక్కగా తెలిపారు. బాగా మాట్లాడి తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఎ.అవినాష్, ఎస్.వైష్ణవి, వై.లక్ష్మీనరసింహలకు ప్రిన్సిపల్ జగదీశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్మైలీ, శ్రీనివాసులు, సుజాత, సరస్వతి, సుధాకర్ పాల్గొన్నారు.
● సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండ బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన షేక్ రేష్మాశ్రీ, టి.వి.షణ్ముఖప్రియ, సయ్యద్ మోసిన్‌లకు ఉపాధ్యాయులు రవిచంద్ర, మాధవి, పవన్‌కుమార్, కోటేశ్వరమ్మ, ఉమామాధవి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాచలంపల్లిలో ఆల్ ఇండియా క్రిస్టియన్ చర్చి కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవదానం, జాన్, దేవప్రసాద్‌లు క్రిస్మస్ సందేశం అందించారు. దర్శి పట్టణంలో కర్టిస్ మెమోరియల్ చర్చిలోనూ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

నేడు పామూరులో ఉద్యోగ మేళా

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని ఈటీఎన్ అండ్ ఎల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో 15కు పైగా బహుళ జాతీయ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ సుబ్బారావు, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బాలికలకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలి

తాళ్లూరు: బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎంపీడీవో పి.అజిత సూచించారు. తాళ్లూరులోని కేజీబీవీ పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. ఎంఈవో జి.సుబ్బయ్య, ఎస్వో సుజిత, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: కడప జిల్లా పులివెందులలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రకాశం జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఇందులో ప్రతిభ కనబరిచిన ఉమామహేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి. భార్గవి, సి.హెచ్.హర్షిణి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతిస్వామి, విద్యార్థులను హెచ్ఎం మాధవి, ఎస్ఎంసీ ఛైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు రూ.2.5 లక్షల చెక్కు అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

దర్శి, న్యూస్‌టుడే: పట్టణంలోని 7వ వార్డు గాంధీ నగర్‌కు చెందిన బట్టువరపు శ్రీనివాసులుకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 2.5 లక్షల చెక్కును అతడి కుటుంబ సభ్యులకు తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అందజేశారు. ● దర్శిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆమె కోరారు. అమరావతిలో మంత్రిని కలిసి రూ.2 కోట్ల నిధుల అంచనాలతో వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించటం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఊరూరా ఉపాధి

టంగుటూరు మండలం పొందూరులో గ్రామ చిత్రపటం వేసి పనులను గుర్తిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, టంగుటూరు

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. కొండపి నియోజకవర్గంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పల్లె ప్రజలు పాల్గొని వ్యక్తిగత, సామాజిక పనులను గుర్తిస్తున్నారు.

అందరికీ ఉపయోగపడేలా..

ఉపాధి హామీ పథకంలో రైతులు, కూలీలకు లాభదాయకంగా ఉండేలా వ్యక్తిగత పనులు, కమ్యూనిటీ పనులు చేసుకునే వెసులుబాటు ఉంది. వ్యక్తిగత పనుల్లో ఇంటింటా ఇంకుడు గుంతలు, రైతు పొలంలో ఫారంపాండ్, కందకాలు, పొలం గట్లపై మొక్కలు పెంపకం, పశువుల షెడ్లు వంటివి చేపడతారు. కమ్యూనిటీ పనుల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, బోర్‌వెల్ రీఛార్జి, కమ్యూనిటీ ప్లాంటేషన్, పంట కాలువలు, రోడ్ల నిర్మాణం, డొంక దారుల మరమ్మతులు పనులను గుర్తిస్తారు. కొండపి నియోజకవర్గంలో ఇంత వరకు 3,198 వ్యక్తిగత, 1,158 సామాజిక పనులను గుర్తించారు. కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 88 గ్రామ సభలు నిర్వహించారు. మరికొన్నింటిలో ఇంకా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది జరిగిన పనుల వివరాలు, కూలీలకు చెల్లించిన వేతనాలపై అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య చర్చలు నిర్వహిస్తారు.

కొండపి నియోజకవర్గంలో గుర్తించిన పనుల వివరాలు

మండలం	వ్యక్తిగత	సామాజిక
1. టంగుటూరు	319	201
2. కొండపి	200	125
3. సింగరాయకొండ	1,656	200
4. పొన్నలూరు	37	90
5. మర్రిపూడి	636	380
6. జరుగుమల్లి	350	162

సందడిగా శిక్షణ పూర్తి

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొద్దికూరపాడులో మహిళలకు బ్యూటిషియన్ కోర్సుపై శిక్షణ గురువారంతో ముగిసింది. 80 రోజుల నుంచి జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ట్రైనరు సునీత మహిళలకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. వారికి పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తామని ఆమె తెలిపారు

రహదారికి మరమ్మతులు

తాళ్లూరు, న్యూస్‌టుడే: విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా పెద్ద టిప్పర్లలో అధిక లోడుతో గ్రావెల్ తరలింపు వల్ల తాళ్లూరు-వెల్లంపల్లి రహదారిలో శివరాంపురం వరకు గుంతలు పడ్డాయి. దీంతో స్థానికులు వాహనాలను అడ్డగించారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామని ఆ కంపెనీ సిబ్బంది ఇచ్చిన హామీతో భాగంగా రహదారికి మరమ్మతులు చేయించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తాళ్లూరు: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ కార్మికులు గురువారం ఎంపీడీవో పి.అజితకు వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, యూనిఫాం, ఇతర వస్తువులు అందజేయాలని కోరారు. యూనియన్ నాయకులు పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

సి.ఎస్.పురం: మహిళలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు డీపీఎం రజనీకాంత్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వీవోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. మహిళలు వ్యవసాయ, వ్యాపార రంగాల్లో రాణించాలని, సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలన్నారు.
● బాల్య వివాహాలతో అనర్థం: జరుగుమల్లి: బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎన్జీవో మహేంద్ర గురువారం మండలంలోని నర్సింగోలు, చిర్రికూరపాడు గ్రామాల్లో పర్యటించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

లాభసాటి వ్యవసాయానికి కృషి

రైతులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జిల్లెళ్లపాడులో రైతన్నా మీకోసం కార్యక్రమంలో మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాసు, తెదేపా మండల అధ్యక్షుడు [illegible] పాల్గొన్నారు.

రైతులకు రుణాలివ్వాలి..
కనిగిరి: బ్యాంకింగ్ రంగంలో మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని క్లస్టర్‌రోడ్డులో ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నూతన శాఖను ప్రారంభించారు. తక్కువ వడ్డీతో రైతులకు రుణాలు అందించాలన్నారు. బ్యాంకు ఛైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సాగు అనుబంధ రంగాలపై అవగాహన అవసరం

మామిడి తోటను పరిశీలిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్, శాస్త్రవేత్తలు

దర్శి, న్యూస్‌టుడే: శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి, వారు సాగు చేస్తున్న పంటల్లో చీడపీడల సమస్యల నుంచి గట్టెక్కించే బాధ్యత తీసుకోవాలని గుంటూరు లాం కృషి జోన్ సహ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డా.దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం ఆయన దర్శి కేవీకేలో పర్యటించారు. రికార్డులను పరిశీలించటంతో పాటు, పలు రకాల క్షేత్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే నూతన వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పద్ధతులను రైతులకు చేరువ చేసేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు, వివిధ వ్యాపారాలుగా మార్చేందుకు అవకాశమైన వృత్తివిద్య, నైపుణ్య శిక్షణ సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డా.రమేష్, శాస్త్రవేత్తలు మానస, వెంకటేశ్వర్‌రెడ్డి, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా

తాళ్లూరు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని రాష్ట్ర నాటకరంగ కార్పొరేషన్ డైరెక్టరు బి.ఓబుల రెడ్డి తెలిపారు. తురకపాలెంలో గురువారం పాడి రైతులకు యాభైశాతం రాయితీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. సర్పంచి గుర్వారెడ్డి, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏవో బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

టంగుటూరులో ముగిసిన పొగాకు వేలం ప్రక్రియ

వేలంలో పాల్గొన్న అధికారులు, కంపెనీల ప్రతినిధులు

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారంతో 2024-25 పంటకాలానికి కొనుగోలు ప్రక్రియ ముగిసింది. మొత్తంగా ఈ ప్రక్రియలో 2,857 మంది రైతులు పాల్గొన్నారు. రూ.357.23 కోట్ల విలువైన పొగాకు పంటను విక్రయించారు. ఈ ఏడాది మార్చి 6న వేలం ప్రారంభమైంది.

చివరిలో ఊరించిన ధరలు..

మూడేళ్లు అధిక లాభాలు అర్జించిన పొగాకు రైతులు 2024-25 పంటకాలం కలిసొస్తుందని భావించారు. అధిక వర్షాలు, వాతావరణం సహకరించక [illegible] దిగుబడి రాక, నాణ్యత లోపించడంతో ఖర్చులైన వస్తేచాలనుకున్నారు. వేలం కేంద్రంలో వ్యాపారుల కుమ్మక్కవడంతో మొదటి నుంచి ధరలను దిగ్గోశారు. ఎఫ్-1, ఎఫ్-2, ఎంఎఫ్-2, ఎఫ్-3 వంటి నాణ్యమైన గ్రేడ్‌లను చివరి వరకు రూ.280కి మించి కొనుగోలు చేయలేదు. ఎంఎఫ్-3, ఎఫ్-4, ఎఫ్-5 వంటి బ్రౌన్ రకాలు, ఎఫ్-6, ఎఫ్-7, ఎంఎఫ్-7, ఎఫ్-8, ఎఫ్-9 వంటి పచ్చలు, ఎఫ్-10ల వంటి గ్రేడ్‌లదీ అదే పరిస్థితి. చివరి అంకంలో మాత్రం ధరలను పెంచి రైతులను ఊరించారు.

పత్తి.. పొలంలోనే ఎదురుచూసి!

దొనకొండ మండలంలో పత్తి, పొగాకు పంటలు ఒక్కసారిగా చేతికి అంది రావడంతో కూలీలకు డిమాండు పెరిగింది. 7 వేల ఎకరాల్లో పత్తి, 1800 ఎకరాల్లో పొగాకును ఈ ఏడాది సాగు చేశారు. మొంథా తుపానుకు కొంత మేర నష్టం వాటిల్లగా.. మిగిలిన పంటనైనా దక్కించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కేజీ పత్తి సేకరణకు రూ.15లు, పొగాకు కోయడానికి రోజుకు ఒకరికి రూ. 500లు ఇవ్వాలి. ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయని, ధర లేకపోవటంతో కూలీలకు కూడా సరిపోవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, దొనకొండ

పూడిక తీయక.. మురుగునీరు కదలక

జరుగుమల్లిలో కొంత కాలంగా పారిశుద్ధ్య పనులు సరిగా చేపట్టకపోవడంతో కాలువలు చెత్తతో నిండిపోతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, గృహ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో మురుగునీరు పారడం లేదు. దీంతో దోమలు ఎక్కువై ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ప్రధాన రోడ్డుకి ఆనుకొని ఉన్న కాలువలు శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విద్యులతను వివరణ కోరగా.. త్వరలో కాలువలను శుభ్రం చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, జరుగుమల్లి

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా తాళ్లూరులోని తూర్పుపాలెం వద్ద అంగన్‌వాడీ భవన నిర్మాణం ప్రారంభించారు. రూ. 12.50 లక్షలు మంజూరు చేయగా రూ.ఏడున్నర లక్షల మేరకు విడుదల చేశారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో పనులు చివరి దశలో నిలిచిపోయాయి. ఈ విషయమై దర్శి సీడీపీవో పరిమళను సంప్రదించగా.. వెంటనే విచారించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేందుకు కృషి చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

రోడ్లు వేసి.. కాలువలు మరిచి

తాళ్లూరు మండలం తూర్పుగంగవరం వీధులు మురుగుమయం అవుతున్నాయి. పక్కాగా సీసీ రోడ్లు వేసినా.. కాలువలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాళ్లూరువైపు, హరిదాసు నగర్ ప్రాంతంలో మురుగునీరంతా రహదారిపైనే పారుతోందిద. దీంతో వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ.. వీలైనంత త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

స్వామి శరణం.. అయ్యప్ప శరణం

కనిగిరి పట్టణంలోని శిర్డీ సాయిబాబా దేవస్థానం ప్రాంగణంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి పడి పూజ వైభవంగా జరిగింది. అరటి బోదెలతో ఏర్పాటు మండపం ఏర్పాటు చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో హాజరై భక్తి గీతాలు ఆలపించారు. శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గురుస్వామి పెరుగు శ్రీధర్, ప్రముఖ వైద్యుడు మురళి, దరిశి బుజ్జి, వెయ్యి మంది వరకు అయ్యప్ప మాలధారులు, ఇతర భక్తులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కనిగిరి

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?:పీసీపల్లి మండలంలోని లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని నాయుడుగారి లింగన్నపాలెంలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. -గ్రామస్థులు
✓: వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తాం. -యషిత, పీసీపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు

?:మర్రిపూడి పంచాయతీలోని దుగ్గిరెడ్డిపాలెం బీసీ కాలనీ కాలువలో చెత్త పేరుకుపోయింది. దీంతో దోమలకు నిలయంగా మారింది. -బాలయ్య, స్థానికుడు
✓: వెంటనే పారిశుద్ధ్యపనులు చేయిస్తాం. -బీవీ.నాయుడు, పంచాయతీ కార్యదర్శి

?:హెచ్ఎంపాడులో మురుగు కాలువల్లో నీరు కదలడం లేదు. దీంతో దోమలలు వ్యాపిస్తున్నాయి. - వై.వెంకటకొండయ్య, మాజీ సర్పంచి
✓: ఆర్థిక సంఘం నిధులతో కాలువలు, వీధులను శుభ్రం చేయిస్తాం. -ఎం.రంగసుబ్బారాయుడు, ఎంపీడీవో

?:కురిచేడు మండలం పడమర నాయుడుపాలెం నుంచి వి.వై.కాలనీ వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. తారు రోడ్డు వేయాలి. - రామకృష్ణ, స్థానికుడు
✓: తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైతే పనులు చేపడతాం. - మహేష్, సర్పంచి

- న్యూస్‌టుడే, పీసీపల్లి, మర్రిపూడి, హనుమంతునిపాడు, కురిచేడు

లారీ ఢీకొని తీవ్ర గాయాలు

టంగుటూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన టంగుటూరు పరిధిలోని బాపూజీ కాలనీ సమీపంలో 16వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఒంగోలు నుంచి టంగుటూరు వైపు ద్విచక్ర వాహనంపై అతడు వస్తుండగా.. వెనుక వస్తున్న కంటైనర్ లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.
❑ **ఇంటికెళ్తున్న విద్యార్థికి..:** హనుమంతునిపాడు: ఎలికావారిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. హెచ్ఎంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరకసాని రామకృష్ణ బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా పక్క నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది.

వివాదాస్పద భూముల్లో పంటల సాగుపై విచారణ

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: కోర్టు కేసుల్లో ఉన్న భూముల్లో పంట నమోదు చేశారంటూ వచ్చిన ఫిర్యాదుపై గురువారం హెచ్ఎంపాడులో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రజనీకుమారి విచారణ చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దొడ్డిచింతల పంచాయతీ ఉపేంద్రపురంలో దిల్లీకి చెందిన ప్రైవేటు కంపెనీ 2004లో 25 ఎకరాలు కొనుగోలు చేసింది. ఈ భూముల్లో వెలిగండ్ల మండలం నరసమాంబపురం, తమ్మినేనిపల్లి గ్రామాలకు చెందిన అయిదుగురు రైతులు కౌలుపత్రాలు పొంది ప్రస్తుతం కందిపంట వేశారు. ఇదే భూములకు సంబంధించి నెల్లూరుకు చెందిన పి.కృష్ణప్రసాద్ అనే వ్యక్తి గతంలో కోర్టులో కేసు వేశారు. అనంతరం తమకు సంబంధించిన భూములను రైతులు అక్రమంగా సాగు చేస్తున్నారని, వాటికి పంట నమోదు కూడా చేయించారని గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా డీడీఏ రజనీకుమారి తోపాటు కనిగిరి ఏడీఏ జైనలబ్దీన్, గతంలో ఇక్కడ ఏవోగా విధులు నిర్వహించిన కె.వి.రమణ, ప్రస్తుత ఏవో రవికుమార్‌లు తహసీల్దార్ నాగుల్‌మీరా సమక్షంలో రైతులను విచారించారు.

మట్టి తరలిస్తున్న వాహనాల స్వాధీనం

పీసీపల్లి: అక్రమంగా మట్టితరలిస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని మారెళ్ల చెరువు వద్ద గురువారం జరిగింది. పీసీపల్లిలోని ఓ వెంచర్‌కు అనుమతి లేకుండా మారెళ్ల చెరువు నుంచి మట్టి తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు తహసీల్దార్ ఉష తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

ఆక్రమణల పరిశీలన

తాళ్లూర, న్యూస్‌టుడే: తూర్పుగంగవరం-దర్శి ప్రధాన రహదారిలో తూర్పుగంగవరం శివారున రహదారి పక్కనున్న బండి దారి పోరంబోకు స్థలాలను ఆ గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు ఆక్రమించాడు. తన స్థలం, పొలాలకు వీలుగా ఉపయోగించుకుంటున్నాడు. ఈ విషయమై గ్రామానికి చెందిన కొందరు తహసీల్దారు బీవీ.రమణారావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. అక్కడి ఆక్రమణలను గుర్తించారు. ఆ ప్రదేశంలోకి ఎవరూ ప్రవేశించేందుకు వీల్లేదని బోర్డును ఏర్పాటు చేయాలని వీఆర్వోను ఆదేశించారు.

పారిశుద్ధ్య లేమి.. వ్యాధులకు బలిమి

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

సింగరాయకొండ మండలంలోని పది గ్రామాల్లో మొంథా తుపాను వల్ల కురిసిన వర్షాలకు ఖాళీ ప్రాంతాల్లో నీరు నిలిచి దోమల బెడద ఎక్కువైంది. దీనికి తోడు వీధుల్లో చెత్త తరలింపు, కాలువల్లో పూడిక తొలగించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరవయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మండలంలోని పలు గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణంతో డెంగీ వంటి వ్యాధులు విజృంభించాయి. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో నిండిపోయిన కాలువ..

సింగరాయకొండ బుంగబావి కూడలి వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు పూడికలతో నిండిపోయాయి. పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయి డ్రైనేజీ పూర్తిగా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు పూడికను ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో కాలువలు మొత్తం వ్యర్థాలతో మూసుకుపోయాయి. వర్షాలు పడినపుడు నీరు ముందుకు కదలక రోడ్డుపై పారుతుంది. బుంగబావి చెరువులో గృహాల నుంచి వచ్చే మురుగుతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. మండలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఈవోపీఆర్డీ రమేష్‌ను వివరణ కోరగా.. వెంటనే ఆయా పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బుంగబావి చెరువులో పచ్చగా మారిన నీరు, తేలిన వ్యర్థాలు

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : ప్లాట్ నెం.14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
కార్యాలయ చిరునామా : ఒంగోలు-2 : డి.నెం. 37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, ఒంగోలు (పి & మం) ప్రకాశం జిల్లా.

డిమాండ్ ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు ఒంగోలు-2 (డి.నెం. 37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, ఒంగోలు (పి & మం), ప్రకాశం జిల్లా) నందు బ్రాంచి ఆఫీస్ కలిగి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.
ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా పరిగణించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.
చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర. సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	1) బోయిరెడ్డి సాయి ఈశ్వర్, తండ్రి : మధుసూధనరావు, డి.నెం. 2-220, తిలక్ రోడ్డు, మూలగుంటపాడు, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్ - 523101. 2) బోయిరెడ్డి మాలతి, భర్త : మధుసూధనరావు, డి.నెం. 2-220, తిలక్ రోడ్డు, మూలగుంటపాడు, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్ - 523101. 3) చుండూరి సురేష్, తండ్రి : నరసింహులు, రైల్వే స్టేషన్ రోడ్డు, వెంకటాచలం, నెల్లూరు జిల్లా.	31-12-2019 / Rs. 10,00,000/-	18-10-2025 / రూ. 36,68,340/- (అక్షరాలా ముప్పై ఆరు లక్షల అరవై ఎనిమిది వేల మూడు వందల నలభై రూపాయలు మాత్రమే) వడ్డీ, కాస్ట్ & ఇతర ఖర్చులు మొదలగున్నవి.
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. ONGL3TF1805290004		
	ఆస్తి వివరములు : ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 1930/2018, సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్, శ్రీ బోయిరెడ్డి మాలతి, భర్త : మధుసూధనరావు గారి పేరిట ఉన్నది. ప్రకాశం జిల్లా, సింగరాయకొండ సబ్ డిస్ట్రిక్ట్, సింగరాయకొండ మండలం, మూలగుంటపాడు గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, బ్లాక్ నెం. 2, సర్వే నెం. 119/3, సమీప డి.నెం. 2-220 వద్ద గల ఖాళీ ఇంటి స్థలము. హద్దులు : తూర్పు : కుంచాల కృష్ణయ్య గారి స్థలము - 18.2 అ॥, పడమర : పాకాల కృష్ణారావు గారి స్థలము - 17.6 అ॥, ఉత్తరం : మంచాల పణ్ముకి గారి స్థలము - 60.6 అ॥, దక్షిణం : తోట రమణమ్మ గారి ఇంటి స్థలములు - 59.4 అ॥. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.02 1/2 సెంట్లు లేదా 119 చ॥గ॥లు లేదా 99.96 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము, తోట రమణమ్మ ఇల్లు మరియు స్థలాలకు తూర్పున మరియు ఈ షెడ్యూల్ ఆస్తికి దక్షిణం వైపున పంచాయితీ రోడ్డుకు చేరుకోవడానికి 5 అ॥ వెడల్పు గల మార్గం.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.
సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.
ప్రదేశం : ఒంగోలు
అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

బహుమతులు అందజేస్తున్న కేరళ హైస్కూలు ప్రిన్సిపల్ మైఖేల్

మాటలు మెచ్చారు.. బహుమతి ఇచ్చారు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చేపట్టిన ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా గురువారం స్థానిక కేరళ హైస్కూలులో ఉపన్యాస పోటీ నిర్వహించారు. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై జరిగిన పోటీలో 7,8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. పదోతరగతి విద్యార్థి వై.విమల జానకి ప్రథమ, 9వ తరగతి విద్యార్థి జి.ధీరజ్ ద్వితీయ, 8వ తరగతి విద్యార్థి సోహ నోబుల్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ సిబీ మైఖేల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరులో మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా 30 రోజుల పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి తెలిపారు. గురువారం శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు సెక్రటరీ శేఖర్‌రెడ్డి, సామాజిక సేవా కార్యకర్త శామ్యూల్, శిక్షకులు శివపార్వతి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహం.. సామాజిక దురాచారం

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: 'బాల్య వివాహం ఒక సామాజిక దురాచారం. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధిని అడ్డుకుంటుంది. పోలీసు అధికారులు, సిబ్బందిగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రయత్నం చేస్తాం.. పిల్లల విద్య, భద్రత కోసం నా గళాన్ని వినిపిస్తాను. బాల్య వివాహ రహిత భారత సృష్టికి నేను మద్దతుగా ఉంటాను.' అని పోలీసులు గురువారం ప్రతిజ్ఞ చేశారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందితో ఈ ప్రతిజ్ఞ చేయించారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

పరికరాలిలా.. జిమ్ ఎలా..?

• మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న సందర్శకులు

నగరపాలక సంస్థ పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఔత్సాహికులకు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. పరికరాలు మరమ్మతులకు వచ్చినా అధికారులు పట్టించుకోక పోవడంతో సందర్శకులు విమర్శిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

నాటు బాబూరావు పార్కులో సక్రమంగా లేని పరికరాలు

విశ్రాంతితోపాటు వ్యాయామం చేద్దామనుకుంటే..

జిల్లాలో ఒంగోలు నగరం పూర్తిగా ఆధునిక పంథాలో సాగుతోంది. గతంలో ఓ మాదిరి అపార్ట్‌మెంట్లు, విల్లాలు ఉంటే ఇప్పుడు శివారు ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. సమీప గ్రామాల్లో పనిచేసే వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు నగరంలో ఉండేందుకు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీనికితోడు కలెక్టరేట్, ఇతర ముఖ్య ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉండటంతో వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారు. వీరికితోడు స్థానికంగా నివసించే కుటుంబాల వారు సెలవు రోజుల్లోను, ఖాళీ సమయాల్లో పార్కులకు వచ్చి విశ్రాంతి పొందడానికి ప్రభుత్వం, మున్సిపాలిటీ ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు మున్సిపాలిటీ చొరవ చూపుతోంది. ఇందుకోసం రూలక్షలు వెచ్చిస్తోంది. ఇంతవరకు బాగానే ఉంటున్నా వీటిలో ఏర్పాటుచేస్తున్న పరికరాల నిర్వహణ మాత్రం సక్రమంగా ఉండటంలేదు. కొన్ని విరిగిపోతున్నాయి. కొన్ని ఊడిపోతున్నాయి. దీంతో వ్యాయామం కుదరక సందర్శకులు, పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

8 పార్కుల్లో ఏర్పాటుచేసినా..

నగరంలో 24 పార్కులు ఉండగా ఎనిమిది పార్కుల్లో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది మంది పురుషులు, మహిళలు వినియోగిస్తారు. సరైన నిర్వహణ లేక కొన్ని పనిచేయడంలేదు. వాటిపై జిమ్ చేయడానికి వెళ్లినవారు నిరుత్సాహంతో వెనుతిరగాల్సి వస్తోంది. నాటుబాబూరావు పార్కు, ఒకటో వేసవి చెరువు పక్కన గల జిమ్, గాంధీపార్కు, హౌసింగ్‌బోర్డు కాలనీ, భాగ్యనగర్ పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాల్లో పాడైనవాటిని బాగుచేయాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి ఉత్పత్తులు వినియోగించాలి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించే పంటలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిని అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గురువారం కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ ప్రోగ్రాంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ బంగ, బర్గఢ్, ఒడిశాకు చెందిన వ్యవసాయ సంస్థల బృందం సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను, ఆహార ఉత్పతులు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. తమ రాష్ట్రాల్లో కూడా ప్రకృతి వ్యవసాయ పంటలు సాగుచేసే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, దాదాటిర్, నరసింహులు, రత్నజ్యోతి, రెడ్డప్ప, యల్లమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు మండలంలోని టి.అగ్రహారం గ్రామంలో ఏకశిలా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నెల్లూరు జిల్లా కలిగిరి మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన నారాయణం వెంకట రమణ దీక్షితులు ఆధ్వర్యంలో రెండు రోజులుగా విశేష పూజలు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గురువారం ఉదయం విష్వక్‌సేన పూజ, కుంభారాధన చేశారు. అనంతరం వేద మంత్రాల నడుమ విగ్రహ స్థాపన చేశారు. అనంతరం స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించారు.

ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

విద్యాసంస్థల బంద్ జయప్రదానికి పిలుపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 4న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యా సంస్థల బందును జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.వినోద్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలులో విశ్వవిద్యాలయం, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యా సంస్థల బంద్ జయప్రదం కోరుతూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మోయలేని భారాలు మోపుతున్న కూటమి ప్రభుత్వం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేద ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా అధ్యక్షత వహించారు. ఏఐసీసీ కార్యదర్శి మాట్లాడుతూ ఏపీలో వైకాపా, తెదేపాలు బీజేపీతో పొత్తుపెట్టుకొని మతం చిచ్చుపెడుతున్నాయన్నారు. జిల్లాలో గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నియోజకవర్గ బాధ్యులు బీఆర్ గౌస్, శ్రీపతి సతీష్, సుబ్బారెడ్డి, కె.కృష్ణారెడ్డి, మన్నం ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు. జాన్‌బాబు, బీవై కిరణ్, ఆర్.సతీష్‌లు పీసీసీ సమన్వయకర్తలు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి జావెద్

మెప్మాలో అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మెప్మా పొదుపు సంఘాల రుణాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని మాజీ మంత్రి, జనసేన నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పేద మహిళలకు చేయూతనందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెప్మా ద్వారా పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. కొందరు అధికారులు, సిబ్బంది రాజకీయ ప్రతినిధుల అండతో అక్రమాలకు పాల్పడటం దారుణమన్నారు.



జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఒంగోలు క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు అదరగొట్టారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభచూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటారు. ఒంగోలు లాయర్‌పేట శ్రీచైతన్య విద్యార్థి గన్నవరపు షణ్ముఖ వర్ధన్ బాలుర విభాగంలోనూ, సంతనూతలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని దండు ఆశాశ్రీ బాలికల విభాగంలోనూ అత్యద్భుత ప్రతిభతో మెరిశారు. షణ్ముఖ వర్ధన్‌ను శ్రీచైతన్య ప్రిన్సిపల్ జోసెఫ్ తంబి సత్కరించారు. ఆర్ఐ అనిల్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రమణ్యం అభినందించారు.

షణ్ముఖవర్ధన్

రాష్ట్ర స్థాయి పోటీలకు నవ్యశ్రీ ఎంపిక

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పి.నవ్యశ్రీ జిల్లా వాలీబాల్ జట్టుకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వీరాస్వామి, వ్యాయామ ఉపాధ్యాయిని స్వరూప వాణిలు తెలిపారు. డిసెంబరులో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో నవ్యశ్రీ జిల్లా జట్టుకి ప్రాతినిధ్యం వహించనుందని వారు తెలిపారు.

వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పశువైద్య విద్యలో డిగ్రీ లేకుండా 'వెటర్నరీ' పదం వాడకూడదని ఉద్యోగులను అపోహలకు గురి చేసిన రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ పీవీ.లక్ష్మయ్యను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ జిల్లా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ టీవీ.రమేష్, నాయకులు ఎం.కోటేశ్వరరావు, కె.శంకరరావు, పి.శ్రీనివాసరావు, బి.ప్రభావతి, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం కావాలి

ఒంగోలు కలెక్టరేట్: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించి స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన పురోగతి గురించి ఆరా తీశారు. సమావేశంలో డీఆర్వో ఓబులేసు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు మాధురి, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజమే ధ్యేయం

మద్దిపాడు, న్యూస్‌టుడే: లింగవివక్ష లేని సమాజమే ధ్యేయంగా అందరం కృషి చేయాలని వెలుగు ఏపీఎం కాకుమాను సుబ్బారావు గురువారం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని మండల సమాఖ్య కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో సమావేశమై, మహిళా సమాజ వృద్ధే ధ్యేయంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తదుపరి మండల సమాఖ్య సభ్యులతో లింగ వివక్ష నిర్మూలన కోసం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీసీలు వెంకటసుబ్బయ్య, మోహన్, లక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మానవ హారం నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

కలెక్టరేట్‌లో మరో లిఫ్టు ఏర్పాటు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌కు మరో లిఫ్టు అందుబాటులో రానుంది. ఒకేసారి 13 మంది వినియోగించుకునేలా లిఫ్టు నిర్మాణానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చర్యలు తీసుకున్నారు. అందు కోసం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ నుంచి రూ.47 లక్షలు మంజూరు చేశారు. తొలివిడతగా రూ.23.50 లక్షలు విడుదల చేశారు.

జేసీ దృష్టికి ఉద్యోగుల సమస్యలు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా సర్వేయర్ల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో గురువారం సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా సర్వే ఏడీ గౌస్‌బాషాను కలిసి ఉద్యోగుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

ప్రయోగశాల భవనానికి భూమిపూజ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు మండలం కరవది గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రయోగశాలల నిమిత్తం నూతనంగా నిర్మించనున్న భవనానికి గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ పోలవరపు వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పథకాల అమలు

సంతనూతలపాడు: ప్రభుత్వం రైతులను ఆదుకొనేందుకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం సంతనూతలపాడులో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఆధారిత పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.

యువత రక్తదానం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెంలో గురువారం బాలాజీ క్లినిక్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్త దాన శిబిరాలు నిర్వహించారు. బాలాజీ నర్సింగ్ హోం వైద్యులు బాలాజీ నాయక్, కిరణ్మయిలు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

మున్సిపల్ పాఠశాలకు కిటికీలు, బీరువాల వితరణ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: క్విస్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత నిడమానూరి సూర్యకల్యాణ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్ట్ తరపున స్థానిక బాలాజీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రూ.2 లక్షలు విలువైన బీరువాలు, కిటికీలు అందజేశారు. హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, భాజపా జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మరిచారా.. వదిలేశారా..

సంతనూతలపాడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక పారిశుద్ధ్య పరిస్థితులు కొరవడి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఇక్కడ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి అక్కడే వదిలేశారు. అవి పూర్తిగా ఎండిపోయినా పంచాయతీ వారు వాటిని తీయకుండా చూసీ చూడనట్లు పోతున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సంతనూతలపాడు

రోడ్డుపై గుంత.. రాకపోకలకు చింత

చీమకుర్తి పురపాలక సంఘం పరిధిలోని వడ్డిపాలెం రామ్మూర్తి ఇంటి ప్రాంతంలో కల్వర్టుకు ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. దాదాపుగా ఆరేడు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. రహదారి మధ్యలో ఏర్పడిన గుంత వద్ద రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ఇప్పటికే పలువురు స్వల్పంగా గాయాల పాలయ్యారు. పురపాలక సంఘం వారు స్పందించి గుంతకు తక్షణం మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిష్టర్డు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్: డి.నెం.37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, కర్నూల్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001, వెబ్‌సైట్: www.shriramfinance.in

డిమాండ్ నోటీసు

[illegible]

లోను అగ్రిమెంట్ నెం.	ONGL2TF2107310002
NPA తేది	07-10-2022
డిమాండ్ నోటీసు తేది	21-10-2025
బకాయి మొత్తం	రూ.21,75,849/- [illegible]
లోను ఋణం మొత్తం	రూ.15,00,000/-

[illegible]

ప్రదేశం: ఒంగోలు   సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
టౌన్ బ్రాంచి-08999, సెయింట్ షాపింగ్ మాల్ ప్రక్కన, ఒంగోలు
ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకము

[illegible]

రిజిస్ట్రేషన్ నెం.	కంపెనీ / మోడల్	మోడల్ / కలర్	రిజర్వు ధర	ధరావత్తు
AP39GL 3352	FORD FIGO 1.2 Petrol	2020 / Red	2,90,000/-	29,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: 15-12-2025, ఉ. 12.00 గంటల నుండి మ. 01.00 గం. వరకు

[illegible]

తేది: 27-11-2025, ప్రదేశం: ఒంగోలు   సం/- అధీకృత అధికారి, SBI, టౌన్ బ్రాంచ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిష్టర్డు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్: డి.నెం.37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, కర్నూల్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001, వెబ్‌సైట్: www.shriramfinance.in

డిమాండ్ నోటీసు

[illegible]

లోను అగ్రిమెంట్ నెం.	ONGL3TF1706290002
NPA తేది	30-06-2018
డిమాండ్ నోటీసు తేది	04-11-2025
బకాయి మొత్తం	రూ.73,14,948/- [illegible]
లోను ఋణం మొత్తం	రూ.15,00,000/-

[illegible]

ప్రదేశం: ఒంగోలు   సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కన్నుపడితే.. కబ్జానే

ప్రభుత్వ భూమిలో జామాయిల్ సాగు

60 ఎకరాల మేత పోరంబోకులో జామాయిల్ సాగు

లింగసముద్రం, న్యూస్‌టుడే: ఆయనది లింగసముద్రం.. ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ పంచన చేరడం.. అధికార పార్టీ నాయకుల అండదండలతో భూములను ఆక్రమించి పంటలు సాగు చేయడం అలవాటు. అదే తీరులో ఇప్పుడు తిమ్మారెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 1లో ఉన్న పశువుల మేత పోరంబోకుపై కన్నేశారు. ఇక్కడ ఎకరా రూ.5 లక్షల నుంచి రూ. పది లక్షల వరకు పలుకుతుండగా- ఏకంగా 60 ఎకరాలను ఆక్రమించారు. ఇందులో ఇప్పటికే 40 ఎకరాల్లో జామాయిల్ సాగు చేయగా.. మరో 20 ఎకరాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు మూడు నెలల కిందట 'ఈ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదంటూ' ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారమంతా తెలిసినా.. అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైకాపా పాలనలోనూ.. గత వైకాపా ప్రభుత్వంలో 20 ఎకరాలు ఆక్రమించి.. జామాయిల్ సాగు చేశారు. రెండు రోజుల కిందట 20 ఎకరాల్లో మొక్కలు నాటారు. ప్రస్తుతం మరో 20 ఎకరాలు సాగుకు సిద్ధం చేశారు. ఈయనతో పాటు మరో ఇద్దరు 30 ఎకరాల మేర పంటలు సాగు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

● దీనిపై తహసీల్దారు ఎం.వెంకటేశ్వర్లు వివరణ కోరగా.. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులపై శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పోటీ.. హోరాహోరీ

నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో.. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో.. క్రీడా సంబరాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. వివిధ కళాశాలల క్రీడాకారులు ఆయా అంశాల్లో హోరాహోరీగా తలపడుతున్నారు. కబడ్డీ, వాలీ బాల్ పోటీలు సందర్శకులను అబ్బురపరిచాయి.

– ఈనాడు, నెల్లూరు

ఎఫ్ఆర్ఎస్.. అపహాస్యం!

ఉన్నతాధికారుల హెచ్చరికలు బేఖాతరు

వైద్య ఆరోగ్యశాఖలో ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) అపహాస్యమవుతోంది. అధికారులు నోటీసులతో సరిపెడుతుండగా.. అవి మాకో లెక్కా అన్నట్లు ఉద్యోగులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినా.. పరిస్థితిలో మార్పు కనిపించకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 52 పీహెచ్‌సీలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 497 హెల్త్ వెల్నెస్ కేంద్రాలు ఉండగా- ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులతో పాటు 14 మంది పారా మెడికల్ సిబ్బంది పని చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఈ శాఖ పరిధిలో మొత్తం మూడు వేల మంది వరకు పని చేస్తుండగా... వైద్యాధికారులు, ఉద్యోగ సిబ్బంది ప్రత్యేక యాప్ ద్వారా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంది.

ఆగ్రహించినా.. మరుసటి రోజే...

ఈ నెల 26వతేదీ 18 మంది వైద్యాధికారులతో పాటు సీహెచ్‌వోలు, హెల్త్ ఎడ్యుకేటర్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు, అటెండర్లు తదితర మొత్తం 416 మంది గైర్హాజరు అయినట్లు జాబితా తయారైంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు... ఎఫ్ఆర్ఎస్ పాటించేలా పలు సూచనలు చేశారు. అయినప్పటికీ 27వ తేదీ 17 మంది వైద్యాధికారులతో పాటు మొత్తంగా అన్ని విభాగాల్లో 430 మంది హాజరుకాలేదని జాబితా తయారవడం గమనార్హం.

తీవ్ర అలసత్వం...

ముఖ ఆధారిత హాజరుపై కొందరు సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మరికొందరు విధులకు హాజరు కాకుండానే.. ఎక్కడ ఉంటే అక్కడ నుంచే వేస్తున్నారు. పనిచేసే చోట కాకుండా.. బయట వేస్తే.. జీతాలిచ్చే అధికారులు(డీడీవో) నిర్ధారించి.. ఆమోదించాల్సి ఉంది. ఇక డీఎంహెచ్‌వో కార్యాలయం, పలు పీహెచ్‌సీల్లో సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ వేసి.. వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌హెచ్ఎం కింద పనిచేసే ఒప్పంద ఉద్యోగులు వేయకుంటే.. జీతంలో కోత పడుతుంది. రెగ్యులర్ ఉద్యోగులకు అలాంటి పరిస్థితి లేకపోవడం.. పర్యవేక్షణ వ్యవస్థ పేరుకే అన్నట్లు మారడం వల్లే వ్యవస్థ ఇంకా గాడిన పడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

● దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి వి.సుజాత మాట్లాడుతూ... ముఖ ఆధారిత హాజరు పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. సక్రమంగా వేయకుంటే నోటీసులు ఇస్తున్నాం. విధులకు హాజరై ఎఫ్ఆర్ఎస్ వేయకుంటే సెలవుగా పరిగణిస్తామని అన్నారు.

సముచితమేనా ?

కలిగిరి, న్యూస్‌టుడే: విద్యుత్తు వాహనాలు వినియోగించే కొందరు ప్రభుత్వ సిబ్బంది, ఉపాధ్యాయులు తమ ఇళ్ల వద్ద కాకుండా.. పనిచేసే కార్యాలయాల్లో వాటికి ఛార్జింగ్ పెడుతుండటం.. అందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవడం చర్చనీయాంశమైంది. గురువారం కలిగిరిలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఓ కారుకు ఛార్జింగ్ పెట్టగా.. దాన్ని చూసిన ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఉన్నత స్థాయి ఉద్యోగులు, మండల కార్యాలయాల్లోని కొందరికి ప్రభుత్వం వాహన ఛార్జీలు ఇస్తోందని, పెట్రోల్, డీజిల్ రూపంలో బిల్లులు పెట్టుకునే వెసులుబాటు ఉందని.. అయినప్పటికీ.. సొంత ఈవీ వాహనాలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఛార్జింగ్ పెట్టడం ఏమిటని మాట వినిపించింది. దీనిపై కలిగిరి ఎంపీడీవో కె. ప్రత్యూష మాట్లాడుతూ.. 'ఈవీ కారు ఛార్జింగ్ కోసం జిర్రావారిపాలెంలో తొలుత ఓ ఇంటిని అద్దెకు తీసుకుని.. కరెంట్ మీటరు ఏర్పాటు చేసుకున్నా. అక్కడికి వెళ్లి కారు ఛార్జింగ్ పెట్టుకోవడం.. అవసరానికి తీసుకురావడం ఇబ్బందిగా మారింది. దీంతో మీటరును కార్యాలయానికి మార్పించా. దాని ద్వారానే ఛార్జింగ్ పెడుతున్నా. నా పేరుతో ప్రత్యేక మీటరు ఏర్పాటు చేసుకుని బిల్లు చెల్లిస్తున్నా' అన్నారు.

కలిగిరి మండల పరిషత్తు కార్యాలయంలో ఛార్జింగ్ పెట్టిన కారు

పన్ను లేనా... ఇంటి నుంచే చెల్లిద్దాం

మీ కోసం

న్యూస్‌టుడే, దుత్తలూరు: పంచాయతీల్లో వివిధ రకాల పన్నులను ఇంటి నుంచే చెల్లించవచ్చు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్, యాప్‌ను ప్రారంభించింది. జిల్లాలోని 722 పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపుల నిమిత్తం దీన్ని అమల్లోకి తీసుకొచ్చింది. చెల్లించాల్సిన వారికీ వీటి ద్వారానే సమాచారం పంపుతారు. తద్వారా అదే పోర్టల్ నుంచి చెల్లించవచ్చు. పంచాయతీ సిబ్బంది వస్తే.. యాప్‌లో వివరాలు చూసి.. క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ఇల్లు, కుళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, సెల్ టవర్లు, వేలం రుసుం.. ఇలా ఏదైనా ఇంటి నుంచే కట్టవచ్చు.

స్వర్ణ పంచాయతీ యాప్..

ఇలా చెల్లింపు ఆన్‌లైన్‌లో swarnapanchayat.apcfss.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేమెంట్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఏడు రకాల పన్నుల వివరాలు వస్తాయి. వాటిలో చెల్లించాల్సిన దాని వద్ద క్లిక్ చేయాలి. అనంతరం సంవత్సరం, జిల్లా, మండలం, పంచాయతీ, గ్రామం వివరాలు నమోదు చేయాలి. అప్పుడు అసెస్‌మెంట్ నంబరు, యజమాని పేరు, ఇంటి నంబరు, పాత అసెస్‌మెంట్ నంబరు చూపిస్తుంది. వీటిలో ఒక దానిపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి పన్ను వివరాలతో పేమెంట్ క్లిక్ ద్వారా నగదు చెల్లించవచ్చు.

నగర మేయర్‌గా దేవరకొండ సుజాత!

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగర మేయర్‌గా దేవరకొండ సుజాతను ఎన్నుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మేయర్‌గా ఉన్న పొట్లూరు స్రవంతిని గద్దె దించేందుకు 40 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నోటీసును జేసీ వెంకటేశ్వర్లుకు అందించిన విషయం తెలిసిందే. కాగా 53వ డివిజన్ కార్పొరేటరుగా ఉన్న సుజాతను నూతన మేయర్‌గా ఎన్నుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. డిసెంబరు 15వ తేదీలోగా అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

వసతిగృహం జాడ.. ఏఐ నీడ!

పొరపాట్ల నివారణకు ప్రభుత్వం చర్యలు

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

వార్డెన్ల పనితీరు మెరుగుపరచడంతో పాటు వసతిగృహాల్లో ఏ చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వరాదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం కృత్రిమ మేధ ఆధారిత ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) పేరుతో రూపొందించిన ఈ యాప్‌లో ప్రతి చిన్న పనిని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలన్న మార్గదర్శకాలు వెలువడ్డాయి. ఆ క్రమంలో తిన్న ఆహార ప్లేట్లు కడగడం మొదలు పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు, ఆవరణ, గదులు, తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రత తదితరాలన్నీ యాప్ ద్వారా ఉన్నతాధికారుల పరిశీలనకు ఎప్పటికప్పుడు చేరుతున్నాయి. దీంతో ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా వార్డెన్లు అప్రమత్తమయ్యారు.

కనిపెట్టవచ్చు ఇలా..

ఏఐతో హాస్టళ్లలో అక్రమాలు ఇట్టే కనిపెట్టవచ్చని చెబుతున్నారు. భోజనాలు ఫొటో తీస్తే.. అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యకు అది సరిపోతుందా? లేదా? అన్న విషయాన్ని లెక్కగట్టి చెబుతుంది. పదార్థాల నాణ్యత పక్కాగా ఉన్నదీ లేనిదీ స్పష్టం చేస్తుంది. ఇలాగే అన్ని విషయాల్లో ప్రమాణాలను గుర్తిస్తుంది. తద్వారా అవకతవకలకు, వాటికి పాల్పడిన ఉద్యోగులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. జిల్లాలోని 59 బీసీ, 71 ఎస్సీ వసతిగృహాల్లోని వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూవోలు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఫొటోలు తీస్తున్నారు.

● దీనిపై బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారిణి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ.. ఏఐ ఆధారిత యాప్‌ను ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నాం. వసతిగృహ అధికారులందరికి అవగాహన కల్పించాం. కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వాటిని ఉన్నతాధికారులకు నివేదించాం.

'ఇటీవల అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటనపై కోర్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించింది. ఆ నేపథ్యంలో ఆయన వివిధ శాఖల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్లు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో హెచ్‌పీటీఎస్ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవడం గమనార్హం.'

అద్దె కట్టరు.. అడిగినా పలకరు

అయిదు దుకాణాలు సీజ్

దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలక సంస్థకు ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య సముదాయాలను కొందరు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. నగరపాలక సంస్థకు మద్రాస్ బస్టాండ్, బారకాసు, సుబేదారుపేట, స్టోన్‌హౌస్‌పేట, ట్రైకస్ రోడ్డు, పప్పుల వీధి, ప్రకాశం పంతులు వాణిజ్య సముదాయాలతో పాటు పలు వ్యాపార దుకాణాలు ఉన్నాయి. వీటిలోని దుకాణాలను వ్యాపారాల నిమిత్తం కౌన్సిల్‌లో తీర్మానం చేసి అద్దెకు ఇస్తుంటారు. కానీ, ఈ సముదాయాల్లో పాటదారులకంటే.. సబ్ లీజుదారులే ఎక్కువగా ఉంటున్నారు. ప్రతి నెలా పదో తేదీలోపు అద్దె సొమ్మును నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంది. పాటలో దక్కించుకున్న వారు సబ్ లీజుదారుల నుంచి ప్రతి నెలా ముక్కు పిండి వసూలు చేసుకుంటున్నా.. కార్పొరేషన్‌కు మాత్రం చెల్లించడం లేదు.

కేపీసీ షాపింగ్ కాంప్లెక్స్‌లో...

దుకాణం నంబరు	అద్దె బకాయి రూ.లలో
1	2,61,288
2	2,61,288
3	3,21,724
4	3,21,724
7	3,21,724

రాజకీయ అండదండలతో...

వేలం పాటలో దుకాణాలు దక్కించుకున్న వారు.. వాటిని వేరొకరికి నాలుగు రెట్లు అధికానికి అద్దెకు ఇస్తున్నారు. నగరంలోని అన్ని నగరపాలక సంస్థ వాణిజ్య దుకాణ సముదాయాల్లోనూ ఇదే పరిస్థితి. రూ. 7వేల నుంచి రూ. పదివేలకు దక్కించుకున్న గదిని.. రూ. 20 వేల నుంచి రూ.30వేలకు ఇతరులకు అద్దెకు ఇచ్చారు. కొందరు పాటదారులు నిర్దేశిత అద్దె చెల్లించడం లేదు. అలాగని రెన్యువల్ కూడా చేసుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ తీరున వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో గురువారం స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె బకాయిలు చెల్లించని 1, 2, 3, 4, 7 దుకాణాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీవీఎస్ కిరణ్, సచివాలయ పరిపాలన కార్యదర్శి శర్వణన్ సీజ్ చేశారు.

చెరువు కాదు.. దారే

నెల్లూరు నగరంలో చిన్నపాటి వర్షానికే కొన్ని ప్రాంతాల్లోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మాగుంట లేఅవుట్‌లోని డీమార్ట్ పడమర వైపు ఉన్న రోడ్డు ఇలా తయారైంది. వాహనదారులు తెలియక ఇటువైపు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడల్లా ఇదే సమస్య తలెత్తుతోందని, నగరపాలక సంస్థ అధికారులు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

తుపాను నేపథ్యంలో అప్రమత్తం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 29 నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. కందుకూరు సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, షెల్టర్లు గుర్తించి అవసరమైన వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప అధికారులు, సిబ్బందికి సెలవులు మంజూరు చేయవద్దని సూచించారు.

అలసత్వమే.. పెద్ద అడ్డంకి

అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాల్లో కొరవడిన పురోగతి

విడవలూరు మండలం దంపూరు అంగన్‌వాడీ కేంద్రమిది..

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నిధులకు కొరత లేదు.. భవన నిర్మాణాల మంజూరు ఆగలేదు.. కానీ, పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం.. స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు పట్టించుకోని కారణంగా.. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రం భవనాల నిర్మాణాలు పూర్తి కాని పరిస్థితి నెలకొంది. చాలా చోట్ల పసి బిడ్డలు అద్దె భవనాల్లో.. అరకొర వసతుల మధ్య.. అవస్థలు పడాల్సి వస్తోంది.

60 శాతం కూడా... ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో అంగన్‌వాడీ భవనానికి రూ.అయిదు లక్షలు అందుతుండగా.. రూ. రెండు లక్షలు స్త్రీశిశు సంక్షేమశాఖ, మరే ఇతర నిధుల నుంచి కేటాయిస్తున్నారు. ఇలా ప్రతి భవనానికి రూ. ఏడు లక్షల చొప్పున మంజూరవుతున్నాయి. 2018 నుంచి ఇప్పటి వరకు 494 మంజూరవగా.. వీటిలో 60 శాతం కూడా పూర్తి కాకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

● దీనిపై ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ.. అద్దె, మంజూరై కొత్త భవనాలపై శ్రద్ధ పెడతాం. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించి.. నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటాం అన్నారు.

732 చోట్ల... కొడవలూరు మండలంలో 13, కావలి మండలంలో 20కిపైగా, కోవూరు మండలంలో 12 చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1037కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 732 అద్దె భవనాల్లో, 1165 అద్దె రహిత భవనాల్లో నడుస్తున్నాయి. వీటిల్లో 1,27,277 మంది పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రం భవనాలను పూర్తి చేస్తే అవస్థలు తీరే అవకాశం ఉంది.

విస్తరణ విస్మరణ

167జీబీ రోడ్డును కావలి నుంచి సీతారామపురం వరకు జాతీయ రహదారిగా విస్తరించారు. ఎర్త్ వర్క్‌లో భాగంగా ఇరువైపులా మట్టితో కట్టలు పోయగా.. ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురయ్యాయి. రోడ్డు ఎత్తు 18 అడుగుల మేర పెరగడం.. మూల మలుపులు ఎక్కువగా ఉండటం.. రోడ్డు పక్కన హెచ్చరికలు, రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – ఈనాడు, నెల్లూరు

ఆరోగ్య ఉపకేంద్రం ఉండాలే

మర్రిపాడు మండలం ఇర్లపాడు పంచాయతీ ఇస్కపల్లి వద్ద గత ప్రభుత్వంలో రూ. 21 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం భవనమిది. నాటి నుంచి ప్రారంభానికి నోచుకోలేదు. దాంతో చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గుత్తేదారుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో అప్పగించలేదని సమాచారం. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారిస్తే.. ప్రజాధనానికి సార్థకత చేకూరే అవకాశం ఉంది. – న్యూస్‌టుడే, మర్రిపాడు

గంజాయి రవాణా.. ఆపై దొంగనోట్ల చలామణి

నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా, విక్రయంతోపాటు నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ముఠాను నెల్లూరు గ్రామీణ పోలీసులు కటకటాల వెనక్కు నెట్టారు. ఆ వివరాలను గురువారం నెల్లూరు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ జి.శ్రీనివాసరావు వెల్లడించారు. 'అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీకి చెందిన షేక్ హసన్ అలియాస్ మున్నా అలియాస్ అశోక్ అలియాస్ కార్తీక్, ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన షేక్ రియాజ్ అలియాస్ ఇలియాజ్, షేక్ ముస్తఫా, పిడతాపోలూరుకు చెందిన బెల్లంకొండ అనిల్ ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి ఒడిశా నుంచి గంజాయిని తెప్పించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దాంతో పాటు నకిలీ నగదు చలామణి చేస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న నెల్లూరుగ్రామీణ పోలీసులు నిఘా ఉంచారు. బుధవారం షేక్ హసన్ అలియాస్ కార్తీక్ చెన్నై వైపు వెళుతూ..పోలీసులను చూసి కారు దిగి పారిపోయే ప్రయత్నం చేయగా.. పట్టుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా.. అసలు విషయం బయటపడింది. రియాజ్, ముస్తఫా, బెల్లంకొండ అనిల్‌తో కలిసి నకిలీ నోట్లను సేకరించి చలామణితో పాటు ఒడిశాకు చెందిన దేవా నుంచి రైలు మార్గంలో గంజాయి తెప్పించి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. అతడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ధనలక్ష్మీపురంలోని శ్రీసాయి సిటీ లేఅవుట్‌లోని ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ సంచిలో రూ. 37,50,000 నగదు, 22.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ జి.వేణు, సిబ్బందిని డీఎస్పీ, ఉన్నతాధికారులు అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న నెల్లూరుగ్రామీణ డీఎస్పీ శ్రీనివాసరావు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పుట్టినరోజు శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

ధర తగ్గి.. దైన్యం!

చేపల సాగుదారుల ఆందోళన

మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న రూప్‌చంద్ చేపలు

జిల్లాలో చేపల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెరిగిన ఫీడ్, సీడ్ ధరలు దీనికి తోడు నకిలీ సీడ్‌తో చేపల సాగు కుదేలవుతోంది. మరో వైపు వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఈ పరిస్థితుల్లో చేపల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలో 20 వేల ఎకరాల్లో ఉన్న సాగు.. ప్రస్తుతం 16,217 ఎకరాలకు తగ్గిపోయింది. సాగులో సమస్యలపై 'ఈనాడు- ఈటీవీ' పరిశీలన కథనం.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

జిల్లా చేపల సాగుకు పెట్టింది పేరు. తీర ప్రాంతంలోని ఇందుకూరుపేట, కావలి, విడవలూరు, కొడవలూరు, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల్లో సాగు ఎక్కువగా ఉంది. గత ఐదు సంవత్సరాల నుంచి తెల్ల చేపలు సాగు చేస్తున్న రైతులు ఫీడ్ ధరలు అమాంతం పెరగడం, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించడంతో నష్టాలు చవి చూస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు. కిలో చేపలు రూ.90 నుంచి రూ.100 విక్రయించినా గిట్టుబాటు కావడంలేదని కనీసం కిలో రూ.125 అమ్మితేనే లాభాలు వస్తాయి. కొత్తగా కొంతమంది రెండేళ్ల నుంచి రూప్‌చంద్ చేపలు సాగు చేస్తున్నారు. ఏడాదిపాటు లాభాలు ఆర్జించారు. రెండో ఏట నుంచి కిలో రూ.100 నుంచి రూ.80కి తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేయడంతో నష్టపోతున్నామని తెలిపారు.

నకిలీ ఫీడ్, కెమికల్స్, సీడ్ ఎక్కడైనా అమ్ముతున్నా.. రైతులు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని **మత్స్యశాఖ జె.డి. శాంతి** తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

జిల్లాలో 67 ఫీడ్, కెమికల్స్ దుకాణాలు ఉన్నాయి. వీటిపై మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడి నకిలీ ఫీడ్, కెమికల్స్ రాజ్యమేలుతున్నాయని చేపల రైతులు ఆరోపిస్తున్నారు. ఫీడ్‌ను చేపలకు వేయడం వల్ల పెరుగుదల లేదని.. దీంతో బరువు రాక నష్టాలు వస్తున్నట్లు తెలిపారు.

ఎకరానికి రూ.40 వేల నష్టం

రూప్‌చంద్ సాగు సాగు చేపట్టిన సంవత్సరం రోజులు కిలో వంద రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేయడంతో మంచి లాభాలు ఉండేవి. ప్రస్తుతం కిలో రూ.80కి తగ్గించడంతో ఎకరానికి రూ.40 వేల నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు.

.. వెంకట కృష్ణారెడ్డి, రైతు, నిడుముసిలి, ఇందుకూరుపేట మండలం

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

ఆవాస్ ప్లస్ సర్వేలో లోపాలు రానీయొద్దు

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: జిల్లాలో పేదలకు నిర్మిస్తున్న ఇళ్ల సర్వేలో నిబంధనలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన నెల్లూరు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా అర్బన్ ఏఈలు, గ్రామీణ డీఈలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఆవాస్ ప్లస్ సర్వే ఎలా చేయాలో వివరించారు. ఆప్షన్-3 వెరిఫికేష్ విధానం యాప్‌ను ఎలా వినియోగించాలనే విషయాలను వివరించారు. సర్వే విషయం, యాప్‌లో సమాచారం నమోదులో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూసుకోవాల్సి బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం వెంకటేశ్వరపురంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్, అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

వెంకటేశ్వరపురంలో గృహాలను పరిశీలిస్తున్న ఎండీ అరుణ్‌బాబు

ఆస్పత్రిలో మురుగు పరుగు

నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రసూతి, చిన్నపిల్లల విభాగం ఎదుట మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో పరిసరాల్లో దుర్వాసన వస్తున్నట్లు రోగుల బంధువులు తెలిపారు. పైపులైనుకు మరమ్మతులు చేసి ప్రవాహాన్ని అరికట్టాలని కోరుతున్నారు –ఈనాడు, నెల్లూరు

అపసవ్యం.. అపాయం

వాహనదారులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తుండడంతో ట్రాఫిక్ మళ్లించారు. బుజబుజ నెల్లూరు వద్ద కొందరు వాహనదారులు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. కొందరు యూటర్న్ తీసుకొని రావాల్సిన చోట దగ్గర దారిలో అపసవ్య దిశలో వెళ్తున్నారు. –ఈనాడు, నెల్లూరు

సబ్‌కలెక్టర్ హిమవంశీ, ఎమ్మెల్యే ఇంటూరికి వినతిపత్రాలు అందజేస్తున్న గ్రామస్థులు

ఇళ్లూ తీసుకుని పరిహారం చెల్లించండి: రావూరు వాసులు

గుడ్లూరు: బీపీసీఎల్ పరిశ్రమకు భూములు మాత్రమే కాదు గ్రామంలోని గృహాలు కూడా తీసుకోవాలని రావూరు గ్రామస్థులు సబ్‌కలెక్టరు హిమవంశీకి వినతిపత్రాలు అందజేశారు. గురువారం రావూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ భూములు కోల్పోయాక గ్రామంలో ఎలా జీవించాలని ప్రశ్నించారు. ఉద్యోగాలిస్తామని ప్రకటించి మౌఖిక పరీక్షలు నిర్వహించారని, నియామక పత్రాలు ఇవ్వలేదని మండిపడ్డారు. డొంకలు, నీటి కుంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు. **త్వరలో నియామకపత్రాలు ఇస్తాం..** భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. త్వరలో ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. భూములిచ్చిన వారికి త్వరలో పరిహారం ఇస్తామన్నారు. భూసేకరణ ప్రత్యేకాధికారి రాజశేఖర్, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి, తెదేపా నాయకులు హరికృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఉదయం క్రీడాకారుల ఎంపిక ఉంటుందని ఎంఏపీ అసోసియేషన్ కార్యదర్శి విజయలక్ష్మి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 30 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు. 44వ రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ఎంపికలు చేపడుతున్నట్లు వివరించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	రూ.12,077
సవర ధర:	రూ.96,616
వెండి గ్రాము :	రూ.168.80

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	122
లేయర్	130
బ్రాయిలర్స్	222
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	246
లేయర్ మాంసం	221

త్వరలో జాతీయరహదారికి భూసేకరణ : ఆర్డీవో

కలిగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కలిగిరి మెయిన్ రోడ్డు పొడవునా, జాతీయ రహదారి విస్తరణ కోసం అవసరమైన భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, వీలైనంత త్వరలో పూర్తిచేస్తామని కావలి ఆర్డీవో ఎస్.వంశీకృష్ణ తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు ఆక్రమణలను గురువారం పరిశీలించారు. వీటిలో గ్రామకంఠం, పట్టా భూములు, ర.భ స్థలాల వివరాలు విడివిడిగా పరిగణనలోకి తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని సూచించారు. ర.భ శాఖ రోడ్డు ఆక్రమణల ప్రత్యేక కేటగిరీగా చూపాలన్నారు. గ్రామకంఠం స్థలంలోని ఆక్రమణలను నిర్మాణాల పరిహారం విషయం పరిశీలిస్తామన్నారు. జాతీయరహదారి గుత్తేదారు సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం మాత్రమే అగ్రిమెంట్‌లో ఉందని వారు తెలపగా.. రోడ్డు నిర్మాణం లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై చర్చించేందుకు కావలిలోని తన కార్యాలయానికి రావాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సోని, ఆర్ఐ లీలాసుజి, వీఆర్వోలు శేషయ్య, మురళి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీవో ఎస్.వంశీకృష్ణ

మాట్లాడుతున్న ఎంపీ సుధ రామకృష్ణన్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి

మనుబోలు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రేణులంతా కృషి చేయాలని ఎంపీ సుధా రామకృష్ణన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కల్యాణ మండపంలో జరిగిన సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు గ్రామ, మండల, జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్తు అందించేందుకు ఏర్పాట్లు

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ కె.రాఘవేంద్రం పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఉన్న అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ సోలార్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వమే రాయితీతో ఏర్పాటు చేస్తుందని.. పథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి అవగాహన కల్పించాలని తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్తు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆదేశించారు. ఆయా హెడ్ క్వార్టర్లలో సిబ్బంది నివాసాలు ఉండాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఈ రాఘవేంద్రం

బాలలు.. నాట్యమయూరాలు

సంప్రదాయ నృత్యంలో గుర్తింపు

జాన్వినక్షత్ర నర్తిస్తే..

పట్టణ పరిధిలోని మద్దూరుపాడుకు చెందిన కొండా వెంకట జాన్వినక్షత్ర రెండు సంవత్సరాలుగా భరతనాట్యంలో ప్రదర్శనలిస్తోంది. మూడో తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఇప్పటివరకు 30కు పైగా ప్రదర్శనల్లో పాల్గొంది. గత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో వివిధ ఆలయాల్లో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో బృంద, వ్యక్తిగత నృత్యాలు చేసి ముచ్చటైన అభినయాలతో అలరించింది. వినాయకచవితి సందర్భంగా స్థానిక మండపాలతోపాటు కాణిపాకంలో జరిగిన వేడుకల్లోనూ ప్రదర్శనతో ఔరా అనిపించింది. కొండబిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల్లోనూ ఆకట్టుకుంది. ఈమె తండ్రి కొండా తిరుమలరావు ప్రైవేట్ ఉద్యోగి, తల్లి కృష్ణప్రియ గృహిణి.

న్యూస్‌టుడే, కావలి

సంప్రదాయ నృత్యంలో చిన్నారులు ఆరితేరారు. పసిప్రాయంలోనే ప్రదర్శనలిచ్చే స్థాయికి చేరుకున్నారు కావలికి చెందిన బాలికలు. చిన్నారుల ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణకు చేర్చారు. పసిప్రాయంలోనే కాలికి గజ్జె కట్టారు. అనితరసాధ్యమైన నృత్యరీతులను అభ్యసించారు. చిరుప్రాయంలోనే ప్రదర్శనలిచ్చి మెప్పిస్తున్నారు. నటరాజ తనయలుగా పేరు తెచ్చుకున్నారు. పట్టణంలోని పెండెల ఉమావాణి, గుంటుపల్లి బేబీ శ్రీజాహ్నవి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

నిఖిత.. అభినయిస్తే..

ఏడో తరగతి చదువుతున్న సాయన నిఖిత ఏడు సంవత్సరాల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తోంది. ఈమె అభినయిస్తే అందరూ ప్రశంసించాల్సిందే. పట్టణంలోని దక్షిణ జనతాపేటకు చెందిన ఈ బాలిక ఉత్తర భారతదేశంలోని పలు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. ఇప్పటివరకు 50కిపైగా వేదికల్లో నర్తించి అలరించింది. వివిధ పోటీలకు వెళ్లి విజేతగా నిలిచింది. ప్రశంసలు అందుకోవడంతోపాటు బహుమతులు సాధించింది. తండ్రి ఫణికుమార్, తల్లి పవనసుధ ప్రోత్సాహంతో నేర్చుకున్నట్లు ఈ బాలిక చెబుతోంది.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

నెల్లూరు మెయిన్ బ్రాంచ్, 16/3, ఆర్ ఆర్ వీధి, నర్తకి ప్లాజా ఎదురుగా, నెల్లూరు - 524001. ఫోన్. 0861-2328559, E-Mail : iob0064@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు తేది:31-10-2025 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.35,09,339.55 పై (అక్షరాల ముప్పై ఐదు లక్షల తొమ్మిది వేల మూడు వందల ముప్పై తొమ్మిది రూపాయల యాభై ఐదు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతి పై తేది.12-12-2025న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com. నందు గల ఇ-వేలం ప్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత/తనఖాదారు పేరు మరియు చిరునామా: శ్రీ జయంత్ కుమార్ గుంటకట్ల, తండ్రి : జి. ఆనందం, ఫ్లాట్ నెం.304, శ్రీ అనిత అపార్ట్‌మెంట్స్, డిడి కాలనీ, అహోబిళ మట్ వెనుక, హైదరాబాద్, తెలంగాణ – 500013. **శాశ్వత/లోకల్ చిరునామా: శ్రీ జయంత్ కుమార్ గుంటకట్ల,** తండ్రి : జి. ఆనందం,ఫ్లాట్ నెం.101, మొదటి అంతస్తు, లోటస్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అల్లిపురం ఏరియా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 524002. **ఆఫీస్ చిరునామా: శ్రీ జయంత్ కుమార్ గుంటకట్ల,** తండ్రి : జి. ఆనందం, రోల్ నెం.39797, మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, తిరుపతి బ్రాంచ్, 603, మసీదు వీధి, వివి మహల్, మున్సిపల్ ఆఫీస్ దగ్గర, తిరుపతి – 517501, ఆంధ్రప్రదేశ్.

NPA తేది.25.02.2025 | **డిమాండ్ నోటీసు తేది : 01.03.2025**

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.01.03.2025 నాటికి రూ.55,75,590.17/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: 19-06-2025

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.19.06.2025 నాటికి రూ.56,56,992.17/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తుల వివరములు:

ప్రైమ్ సెక్యూరిటీ : ఐటమ్ నెం.1: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, అల్లిపురం ఏరియా, సర్వే నెం.9, సబ్ డివిజన్ ఎస్.నెం.9/బి లోని ఎ.3.31 సెంట్లు విస్తీర్ణం లే అవుట్ ప్లాన్‌గా మారినది, దీనిలో ప్లాట్ నెం.17 (విస్తీర్ణం 36 అంకణములు మరియు 8 చ॥అ॥లు), ప్లాట్ నెం.18 (విస్తీర్ణం 35 అంకణములు) మరియు ప్లాట్ నెం.19 (విస్తీర్ణం 35 అంకణములు), మొత్తం విస్తీర్ణం 106 అంకణములు మరియు 8 చ॥అ॥లు లేదా 848.888 చ॥గ॥ల స్థలం. **హద్దులు: తూర్పు :** మన్నవ మంగారావు గారికి చెందిన స్థలం, **దక్షిణం :** ప్లాట్ నెం.20, **పడమర :** 30 అ॥ల వెడల్పు లే అవుట్ రోడ్డు, **ఉత్తరం :** ప్లాట్ నెం.16.

ఈ హద్దులలోని మొత్తం విస్తీర్ణం 106 అంకణములు మరియు 8 చ॥అ॥లలోని 6.04 అంకణములు లేదా 48.32 చ॥గ॥ల అవిభాజ్యపు విస్తీర్ణం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

ఐటమ్ నెం.2: పైన తెలిపిన ఐటమ్ నెం.1 లో తెలిపిన 6.04 అంకణములు లేదా 48.32 చ॥గ॥ల అవిభాజ్యపు వాటాతో "లోటస్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు నందు కామన్ ఏరియాతో కలిపి 1250 చ॥అ॥ల విస్తీర్ణంతో గల ఆర్‌సిసి నివాస ఫ్లాట్ నెం.101 యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** కామన్ కారిడార్ కొంతమేర మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.102కు మధ్య గల ఉమ్మడి గోడ కొంతమేర.

ఈ హద్దులలోని "లోటస్ రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు నందు కామన్ ఏరియాతో కలిపి 1250 చ॥అ॥ల విస్తీర్ణంతో గల నివాస ఫ్లాట్ నెం.101 అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

రిజర్వుధర: రూ.30,60,000/- | **ధరావత్తు ధర : రూ.3,06,000/-** | **బిడ్ పెంపుదల మొత్తం: రూ.20,000/-**

వేలం తేది మరియు సమయం: తేది.12-12-2025, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 11-12-2025, సాయంత్రం 4.00 గంటలలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

అస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.08-12-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:02-12-2025 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.11-12-2025, సా॥ 4.00 గం॥ల వరకు

* (ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ :https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు: బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు మెయిన్ బ్రాంచ్, 16/3, ఆర్ ఆర్ వీధి, నర్తకి ప్లాజా ఎదురుగా, నెల్లూరు – 524001. ఫోన్. 08925950064, E-Mail : iob0064@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network, రిజిష్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి – 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 26-11-2025, ప్రదేశం : నెల్లూరు | సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ఉపాధికి వస్తే ఊపిరిపోయింది

వాహనం ఢీకొని వలస కూలీ మృతి

జలదంకి, న్యూస్‌టుడే : ఉపాధి కోసం పొట్ట చేతబట్టుకొని రాష్ట్రాలు దాటి వచ్చాడు. వరి నాట్లు వేసే పనులకు వెళుతున్నాడు. వంటకు సరకులు తీసుకెళుతుండగా కారు ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. దీంతో తోటి కూలీలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈఘటన మండలంలోని తొమ్మిదోమైలు కూడలిలో గురువారం జరిగింది. ఎస్సై లతీఫున్నీసా వివరాల మేరకు.. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తమ సింగ్‌నగర్ పట్టణం సమీపంలోని సిరి రాంపూర్ గ్రామానికి చెందిన దూకి రామ్‌రాయ్ (48) మరికొందరితో కలసి వరి నాట్లు వేసే పనులకు మండలంలోని తొమ్మిదో మైలుకు వచ్చారు. గ్రామంలోని కూడలిలో నిత్యావసర సరకులు తీసుకోవడానికి వచ్చి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి కలిగిరి వైపు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టగా.. అక్కడికక్కడే మృతి చెందాడు. తోటివారు వచ్చి బోరుబోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. జాతీయరహదారి మీదుగా వెళుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని వలస కూలీలను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

దొంగను పట్టించిన ర్యాపిడ్ రైడ్

రూ. 48.10 లక్షల సొత్తు రికవరీ

ఒంగోలు నేరవిభాగం : రైల్లో ప్రయాణికుడి సొత్తు (విలువ రూ.48.10 లక్షలు) కాజేసిన దొంగను సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలను నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ గురువారం ఒంగోలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బెంగళూరుకు చెందిన కలికి కోదండరామిరెడ్డి కుటుంబంతో కలిసి ఈ నెల 13న హైదరాబాద్ నుంచి నెల్లూరుకు వస్తున్నారు. మార్గంమధ్యలో వారి లగేజీలోని 350 గ్రాముల బంగారం, ఇంపోర్టెడ్ వాచీలు, రూ.40 వేల నగదు అపహరణకు గురయ్యాయి. బాధితులు కావలిలో ఫిర్యాదు చేశారు. చీరాల- ఒంగోలు మధ్య చోరీ జరిగినట్లు గుర్తించి ఒంగోలు రైల్వే పీఎస్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో ఒంగోలు సీఐ మౌలాషరీఫ్, నెల్లూరు సీఐ ఎ.సుధాకర్, క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌ల నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

అన్ని సీసీ ఫుటేజీలను విశ్లేషించారు.. నిందితుడు హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. అక్కడికి ఎలా వెళ్లాడని పరిశీలించగా ర్యాపిడో బైక్‌పై వెళ్లినట్లు గుర్తించి బైక్ నంబర్ కోసం రెండు కిలోమీటర్ల పరిధిలో అన్ని సీసీ కెమెరాల ఫుటేజీలని విశ్లేషించి.. రైడ్ ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగిసిందనే విషయాన్ని తెలుసుకున్నారు. నిందితుడి ఇంటిని పక్కాగా గుర్తించి నిఘా పెట్టారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బాలానగర్ కొత్తపేట న్యూగ్రీన్ సిటీలో నివాసముండే మహ్మద్ షకీల్ అహ్మద్ ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ముత్తుకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కృష్ణపట్నం బీచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి పోర్టు పోలీసులకు సమాచారమిచ్చారు. బాగా ఉబ్బి, దుర్వాసన వస్తుండడంతో నాలుగైదు రోజుల క్రితం మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. పంచనామా నిమిత్తం తరలించిన పోలీసులు మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

హత్యాయత్నం కేసులో భర్తకు రెండేళ్ల జైలుశిక్ష

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఆత్మకూరు సమీపంలో 2021లో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ కందుకూరు అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. 2021 అక్టోబరులో కొల్లూరుపాడు గ్రామానికి చెందిన కట్టా సౌభాగ్యం కుమార్తె నాగినికి 11 సంవత్సరాల కిందట దగదర్తికి చెందిన ఎస్.శ్రీనివాసులుతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యపై అనుమానంతో హింసిస్తున్నాడు. ఈనేపథ్యంలో ఆమె కందుకూరు నుంచి కొల్లూరుపాడుకు స్కూటీపై వెళుతుండగా కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో శ్రీనివాసులుకు న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

వాహనము అమ్మబడును
MARUTI - ALTO K10 VXI - 2023 MODEL AP-39 - UX- 7305
సుందరం ఫైనాన్స్ లిమిటెడ్, దర్గామిట్ట, నెల్లూరు.
Ph 83319 98436 94409 09786

FINANCIAL SERVICES

Live Trading in your Demat account. Join us & Grow Together. Minimum account Balance 5 lakhs for details DSR money growth ✆ 9059521999

REAL ESTATE

PLOT FOR SALE

2400 S.ft. Plot @ M.G.Brothers Real Estate Sundra Nagar, Varigonda & Sulochana Gradens, Chintareddypalem, Nellore. Please Whatsapp if your are interested to Contact ✆ +91 99400 54183, Brokers Excuse.

ఆత్మకూరు బస్టాండ్ Opp: అల్లీపురం, కొత్తకాలువ సెంటర్, 3వ మైలు, పొదలకూరు దగ్గర నుడా అప్రూవ్ ప్లాట్స్, అం:లక్ష, స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంకులోన్.Cont 9121459131

ప్రముఖ పుణ్యక్షేత్రమైన గొలగమూడి వెంకయ్యస్వామి సన్నిధిలో 32 ఎ॥ల గేటెడ్ కమ్యూనిటీ డిటిసిపి అప్రూవ్ నుడా & తుడా కమర్షియల్ ప్లాట్స్ తక్కువ ధరలో.Cont: 9346948665

TO LET

2BHK Flat for Rent హరనాథపురం 5వ వీధి HP పెట్రోల్‌బంకు ఆనుకుని ఉన్న Vensa Hanu Residency, 4వ ఫ్లోర్, flat No.402 ✆9100277551

COMMERCIAL

నెల్లూరు వేదాయపాళెం సావిత్రి నగర్‌లోని మెయిన్ రోడ్డుగల కమర్షియల్ బిల్డింగ్ 1000 S.Ft,గల బ్యాంకులకు గానీ, ఆఫీసులకు గానీ బాడుగకు. ✆ 9440351708

JOBS

మినిబైపాస్‌రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HPCL పెట్రోలు బంకులో పనిచేయుటకు పంపు బాయ్స్, గర్ల్స్ కావలెను. జీ: 15,000 Contact ✆8919923469, 8341828889

ఫోర్స్ మోటార్స్ కంపెనీ షోరూం నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అమృత మోటార్స్, బుజబుజనెల్లూరు. ✆ 9581299916, 9492934103

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K Contact ✆96402 58899, 96404 68899

MARKETING/ SALES

ముత్తుకూరు రోడ్ నందు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు బాయ్స్ కావలెను. contact : 7013059017

SECURITY GUARDS

నెల్లూరు సిటీలో ప్రముఖ హాస్పిటల్‌లో సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జీతం: 15,000/-, 4 వీక్లీఆఫ్స్, PF, ESI. 9441699083, 8919148706, 8247036280

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇల్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇల్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

పంట సాగులో ఇబ్బందులా..? స్వయం ఉపాధిపై ఆసక్తా!

కేవీకే ప్రధాన శాస్త్రవేత్తతో ఫోన్ ఇన్ నేడు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పంటల సాగులో ఇబ్బందులు ఎదురవుతున్నాయా..? మెలకువలు కావాలనుకుంటున్నారా..? తెగుళ్లు సోకడం చేటుచేస్తున్నాయా..? గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, యువ రైతులు, ఔత్సాహికులు, స్వయం ఉపాధి పొందేందుకు వృత్తి నైపుణ్యం, ప్రయోగాత్మక శిక్షణ కావాలనుకుంటున్నారా..? ఇలాంటి విషయాలు, సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 'ఈనాడు' మీతో మా నిలుస్తోంది. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రసాద్‌బాబుతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మీ సమస్యలు ఫోన్ చేసి ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందొచ్చు.

ఫోన్ చేయాల్సిన తేదీ: 28-11-25, శుక్రవారం
సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ నంబర్లు: 74163 84968, 085122 46559

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

సస్యరక్షణ చర్యలతో నాణ్యమైన నారు

లింగసముద్రం, న్యూస్‌టుడే: తెగుళ్లు సోకకుండా రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన పొగనారు వస్తుందని కందుకూరు పొగాకు బోర్డు వేలం కేంద్రం అధికారి చంద్రశేఖర్ సూచించారు. గురువారం మొగిలిచర్లలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మా గ్రామంలోని ఎస్సీ కాలనీకి 104 వాహనం సక్రమంగా రావడం లేదు. దీంతో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ఇబ్బంది పడుతున్నారు. **- కొండయ్య, ఏపినాపి**

సమాధానం: వైద్యసేవలు ప్రజలకు సక్రమంగా అందేలా చూస్తాం. **- బి.గీతారెడ్డి, వైద్యాధికారిణి - న్యూస్‌టుడే కలిగిరి**

? పాపిరెడ్డి కావలి సమీపంలోని చెరువులోకి మురుగునీరు వదులుతున్నారు. కలుషితమైన ఆ నీటిని పొలాలకు పెట్టలేకపోతున్నాం. **- పోలు వెంకటేశ్వర్లు, రైతు, కావలి**

✓ ప్రస్తుతం సరైన అవుట్‌లెట్ లేనందున చెరువులో కలుస్తుంది. త్వరలో నీటి శుద్ధి ప్లాంట్ పనులు పూర్తి కావస్తాయి. అది వస్తే సమస్యలుండవు. **- సాయిరాం, డీఈ, కావలి పురపాలక సంఘం - కావలి, న్యూస్‌టుడే**

? గ్రామంలో ఆటవి భవనాల సమీపంలో రూ దారిపై వ్యర్థాలు వేస్తున్నారు. దుర్గంధం భరించలేకున్నాం. **- టి.వికాస్, గుడ్లూరు**

✓ పారిశుద్ధ్య కార్మికులతో తీయిస్తాం. **-నరేశ్, పంచాయతీ కార్యదర్శి - గుడ్లూరు, న్యూస్‌టుడే**

? మా గ్రామంలోని ప్రధాన వీధిలో ఉన్న సీతామాలక్ష్మమ్మ అరుగు దగ్గర మలుపుల్లో కొండరాళ్లు అడ్డుగా పెట్టారు.
- జి.బి.కృష్ణారెడ్డి, మాచవరం

✓పరిశీలించి ఆప్రాంతంలోని రాళ్లను తీయిస్తాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి**
- కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రసంగంలో మెరిసి.. పతకాలు పట్టి

బహుమతులు అందిస్తున్న పాతూరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాఠశాలల్లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. వీటిలో భాగంగా 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాతూరు పురపాలకోన్నత పాఠశాలలో షేక్ వాసిం వలి, షేక్ నదియా, సీహెచ్ సువర్ణ విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత బహుమతులు అందజేశారు. రత్నం పాఠశాలలో షేక్ ఇర్షాద్, ఏ.శివమనస్వి, వై.తేజశ్రీ వరుస స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ సాంబశివారెడ్డి బహుమతులు అందజేశారు.

విద్యార్థులతో రత్నం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబశివారెడ్డి

ప్రతిభా పాటవ పోటీలు

కందుకూరు పట్టణం: పట్టణంలోని ఓవీ రోడ్డులో ఉన్న నక్షత్ర జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఏఐతో భవిష్యత్తులో కలిగే మార్పులు' అనే అంశం పై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జి.నాగసాత్విక, జి.వి.శ్రీజ, డి.పూజిత విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అకడమిక్ ఇన్‌ఛార్జి విష్ణు, అధ్యాపకులు రఫి, అనిల్ బహుమతులు అందజేశారు.

బహుమతులిస్తున్న నక్షత్ర కళాశాల అధ్యాపకులు

తవ్వుకో.. అమ్ముకో!

యథేచ్ఛగా ఇసుక వ్యాపారం

న్యూస్‌టుడే, దుత్తలూరు

ప్రభుత్వం ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేందుకు ప్రజలకు అవకాశం ఇచ్చింది. దీన్ని అక్రమార్కులు సంపాదనకు మార్గంగా మలుచుకున్నారు. ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ తవ్వకాలు సాగిస్తున్నారు. వీరికి నాయకుల అండదండలు ఉండడంతో రేయింబవళ్లు తవ్వి తరలిస్తున్నారు. దీంతో వాగులు, వంకలు రూపుకోల్పోతున్నాయి. మరోవైపు సామాన్యులు దీనికోసం నానాఇబ్బందులు పడుతున్నారు. దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, ఉదయగిరి, కొండాపురం మండ

పిల్లాపేరు వాగులో..

ఉదయగిరి నుంచి కొండాపురం మండలం వరకు పిల్లా పేరు వాగు ప్రవహిస్తోంది. ఇందులో ఎక్కడపడితే అక్కడ తవ్వుతున్నారు. ఇక ఆయా వాగులు, వంకల్లో తోడేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా పట్టించుకునే నాథులే లేకుండాపోయారు.

పిల్లా పేరు వాగులో ఇసుక తీస్తున్న భారీ యంత్రం

లాల్లో ఈ అక్రమ రవాణా మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా సాగుతోంది. పట్టపగలే జాతీయ రహదారులపైగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండడం విశేషం.

ట్రాక్టరు ట్రక్కు రూ.2500లకు పైనే

ట్రాక్టరు ట్రక్కు ఇసుకను రూ. 2500 నుంచి రూ. మూడు వేల వరకు అమ్ముతున్నారు. పల్లెల నుంచి పట్టణ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి మండలం నుంచి నిత్యం పది ట్రాక్టర్ల వరకు తరలిస్తున్నారంటే ఇది ఏ స్థాయిలో జరుగుతుందో తెలుసుకోవచ్చు. పిల్లాపేరు వాగులో భారీ స్థాయిలో గోతులు పడ్డాయి. మేత కోసం వెళ్లిన మూగజీవాలు వాటిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నాయి.

నిఘా పెడతాం

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకుంటాం. తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో సిబ్బందితో నిఘా పెడతాం. ఇసుక కావాల్సిన వారు తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకోవాలి. నిత్యం తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణా జరగకుండా చూస్తాం. **– వంశీకృష్ణ, కావలి ఆర్డీవో**

రూ. 8.27 కోట్లతో అభివృద్ధి పనులు: కాకర్ల

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలో రూ.8.27 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. తెదేపా మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు అధ్యక్షతన గురువారం మండలంలో రూ.2.43 కోట్లతో నిర్మించిన నార్తుకొండాయపాలెం- పామూరుపల్లి తారు రోడ్డు, ప్రధాన రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు, అంతర్గత సీసీ రోడ్లను తన సతీమణి ప్రవీణతో కలసి ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 143 పంచాయతీలు, 56 ఎంపీటీసీలు, 8 జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకొనేలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రావెళ్ల నాగేంద్ర, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొనిగిపోగు వెంగయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి నాదెండ్ల రాజేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు

వింజమూరు : కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల సురేష్, అనూష వారి పిల్లల ఉత్తర క్రియలు గురువారం జరిగాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరైవారికి నివాళులు అర్పించారు. ఆయన వెంట తెదేపా మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు ఉన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 167బి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భరోసా కల్పించారు. పట్టణంలోని కార్యాలయంలో భూములు కోల్పోతున్న ఓగూరు, పలుకూరు గ్రామాలకు చెందిన 30 మంది రైతులు గురువారం ఆయన్ను కలిసి వినతి పత్రాలు అందించారు. ఎకరా మార్కెట్ ధర రూ.1.50 కోట్ల వరకు ఉంటే ప్రభుత్వం నామమాత్రపు ధరను నిర్ణయించిందని రైతులు తెలిపారు.

29న జాబ్‌మేళా : కందుకూరు పట్టణం: ఈనెల 29వ తేదీ పట్టణంలోని శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల ఆవరణలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగబోయే జాబ్‌మేళాను నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రాలను కళాశాల ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్, ప్రిన్సిపాళ్లు గీతాశ్రీనివాసరావు, పాతూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా అర్జీల పరిష్కారం : ఆర్డీవో

దుత్తలూరు, న్యూస్‌టుడే : పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలకు త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం పీజీఆర్ఎస్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అనంతరం కొన్నింటిని పరిశీలించి అర్జీదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేటి నుంచి గండిపాలెంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

ఉదయగిరి : మండలంలోని గండిపాలెం గ్రామంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి అసోసియేట్ డీన్ గోపీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలో ప్రారంభవుతుందన్నారు. నాలుగో తేదీ వరకు వైద్య శిబిరం, పశు వైద్య శిబిరాల నిర్వహణతోపాటు రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. చివరి రోజు శాస్త్రవేత్తలతో రైతులకు సదస్సు ఏర్పాటుచేస్తామని వివరించారు.

నిఘా నిద్దరోతోంది

మండలకేంద్రమైన దుత్తలూరు కూడలిలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. హైవే అధికారులు ఏర్పాటు చేసి వాటి గురించి పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. కూడలిలో ఏం జరిగినా తెలియని పరిస్థితి నెలకొంది. ఈవిషయమై ఎస్ఐ ఆదిలక్ష్మి మాట్లాడుతూ త్వరలో వాటిని వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు. **- దుత్తలూరు, న్యూస్‌టుడే**

తుప్పు పట్టిస్తున్నారు!

వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు తుప్పుపట్టి పనికి రాకుండాపోతున్నాయి. వీటిని వేలం వేసినా ఆదాయం వచ్చే అవకాశం లేదు. అందుకు నిదర్శనమే పట్టణంలోని గ్రామీణ స్టేషన్‌లో ఉన్న వాహనాలు. పెద్దసంఖ్యలో ఉండడంతో ఒక దానిపై ఒకటిగా పెట్టారు. **- కావలి, న్యూస్‌టుడే**

కుంగిన రోడ్డు.. పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని విశ్వనాథపురం ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో సిమెంట్ రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. **- లింగసముద్రం, న్యూస్‌టుడే**

నిర్మించారు... వదిలేశారు

గ్రామంలోని ఏసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్ర వద్ద నిర్మించిన మరుగుదొడ్డి వినియోగంలోకి రాకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది రూ. 60 వేలు మంజూరు కాగా గుత్తేదారు పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. దీంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులును అడగ్గా. వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. **-దుత్తలూరు, న్యూస్‌టుడే**

క్వాలిటీ కంట్రోల్ బృందం ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని కొండాయపాలెం పంచాయతీ గంగిరెడ్డిపల్లిలో గృహ నిర్మాణ లేఅవుట్‌లో గుత్తేదారులు నిర్మించిన ఇళ్లను గురువారం థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలించింది. ఇన్‌ఛార్జి ఏఈ షరీఫ్, ఇంజినీరింగ్ సహాయకుల సమక్షంలో ఈబృందం పరీక్ష చేసి బేస్‌మెంట్లు తదుపరి నిర్మాణాలకు పనికొస్తాయా లేదా అని గుర్తించింది. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ ఫీడరులో చేస్తున్న మరమ్మతులతో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ యుగంధర్ తెలిపారు. ఫీడరు పరిధిలోని కొల్లూరుపాడు, ఉలవపాడులోని కొన్ని ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొలం విషయంలో వివాదం

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని చాకిచర్ల పంచాయతీ 391-1 సర్వే నంబరులో పొలం మాదంటే మాదని పాలకీర్తి వెంకయ్య, మిరియం బ్రహ్మయ్య మధ్య రెండు రోజులుగా వివాదం చోటు చేసుకుంది. ఈనేపథ్యంలో మిరియం బ్రహ్మయ్య మరికొందరితో కలిసి తన పొలంలోని మామిడి మొక్కలను తొలగించారని తహసీల్దారు శ్రీనివాసులుకు వెంకయ్య గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేయాలని వీఆర్‌వో మోహనరావును తహసీల్దారు ఆదేశించారు.

మన్నేరులో మృతదేహం

ఉలవపాడు, న్యూస్‌టుడే: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం మండలంలోని మన్నేటి కోట గ్రామ సమీపంలోని మన్నేరులో గురువారం లభ్యమైంది. ఎస్ఐ అంకమ్మ వివరాల ప్రకారం.. మన్నేటి కోట ఎస్సీ కాలనీకి చెందిన బి.ప్రభుదాసు (44) రెండు రోజులుగా కనిపించలేదని తనయుడు కోటయ్య ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఉదయం మన్నేరులో చేపల వేటకు వెళ్లిన యువకులు మడుగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు తెలిపారు. ఈ సమాచారంతో పోలీసులు వచ్చి వెలికితీయించారు. స్థానికులు ప్రభుదాసుగా గుర్తించారు.

'చంపుతామని బెదిరిస్తున్నారు'

కావలి, న్యూస్‌టుడే: మా కాపురంలో ఓ నాయకుడు చిచ్చు రేపి హతమారుస్తామని బెదిరిస్తున్నారని కావలికి చెందిన గీతాంజలి అనే యువతి ఆరోపించారు. గురువారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం దగదర్తి మండలంలోని మనుబోలుపాడుకు చెందిన యువకుడితో వివాహమైందన్నారు. ఆ ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు మా ఇంటికి పదేపదే వస్తూ అనైతికంగా వ్యవహరిస్తుండేవాడన్నారు. అత్తింటి ప్రోద్బలంతోనే అలా జరుగుతున్నందున విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇటీవల కేసు వాయిదా నిమిత్తం రాగా.. కోర్టు ఆవరణలోనే నా తల్లి కామాక్షిపై దాడికి పాల్పడ్డారని వాపోయారు. పోలీసు కేసు కూడా నమోదైందన్నారు. దీంతో ఆ నాయకుడు, మరికొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారన్నారు. పోలీసులు మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఐఎంఏ సేవలు విస్తృతమవ్వాలి

అధ్యక్షుడిగా ఎన్నికైన రామస్వామిని అభినందిస్తున్న ప్రముఖులు

కావలి, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి బ్రాంచి చేసే సేవలు రాష్ట్రస్థాయిలో విస్తృతం కావాలని ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షులు తటవర్తి రమేష్ కోరారు. నూతనంగా ఎన్నికైన ఐఎంఏ అధ్యక్షులు మంచికంటి రామస్వామిని గురువారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవల్లో వైద్యులు ముందుండాలని కోరారు. ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తే సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు చక్రి, పలువురు నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి సహకారం: బీద

సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద

అల్లూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగం వచ్చే వరకు బాధ్యత తీసుకుంటామని ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ప్రకటించారు. గురువారం మండలంలోని ఇస్కపల్లి జడ్పీ ప్లస్ పాఠశాలలో జేఆర్ఆర్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు 422 సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉండే మహిళల ఉపాధి కోసం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. సొంత గ్రామం అభివృద్ధికి నిధులు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జడ్పీటీసీ సభ్యురాలు వీణమ్మ, పెన్నా డెల్టా ఆయకట్టు సంఘం వైస్‌ఛైర్మన్ బీద గిరిధర్, హెచ్‌పీఆర్ అధినేత హరి శ్రీనివాస్, వైద్యులు లోకనాథం, దేవరాల సుబ్రమణ్యం, సర్పంచి రంజిత్‌కుమార్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడిగా మజీద్

ఎంపికైన ఉదయగిరి తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యవర్గం

ఉదయగిరి, న్యూస్‌టుడే : ఉదయగిరి తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌మజీద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎన్నికల అధికారి షేక్ మహ్మద్‌జావీద్, సహాయ ఎన్నికల అధికారి వి.ఫణీంద్ర సమక్షంలో గురువారం కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. తాలుకా అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌మజీద్, అసోసియేట్ అధ్యక్షుడిగా జగన్‌మోహన్, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్‌గా ఎండీ రియాజ్, ఉపాధ్యక్షులుగా ఖాజాముబారక్, వి.రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పెంచలరావు, సంయుక్త కార్యదర్శులుగా మన్సూర్‌అలీ, లింగరాజు, శ్రీదేవి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బి.సుధాకర్‌రెడ్డితోపాటు ఎన్నికల అధికారులు, ఉద్యోగులు సన్మానించారు.

ప్రాథమిక స్థాయిలోనే కుష్ఠు బాధితులను గుర్తించాలి

రికార్డులు తనిఖీ చేస్తున్న సుజాత

కావలి, న్యూస్‌టుడే: ప్రాథమిక దశలోనే కుష్టు బాధితులను గుర్తించాలని జిల్లా వైద్యారోగ్య అధికారి సుజాత సిబ్బందిని ఆదేశించారు. గురువారం పట్టణంలో కుష్టు బాధితుల సర్వేని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే బాధ్యతాయుతంగా చేయాలన్నారు. లక్షణాలు కలిగిన వారిని గుర్తించకుంటే, ఆయా ప్రాంతాల సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు వైద్యారోగ్య అధికారి ఖాదర్‌వలి, ఉపవైద్యాధికారిణి బ్రిజిత, నరసారెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

దగదర్తి : సీజనల్ వ్యాధులపై డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య అధికారి సుజాత పేర్కొన్నారు. దగదర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి ఎంత మంది రోగులు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు అఖిల, అలేఖ్య, సీహెచ్‌వో కొండారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ విజయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పూజల్లో పాల్గొన్న బ్యాంకు అధికారులు, స్థానికులు

సీతారామపురం: సీతారామపురంలోని కెనరా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు తిరుపతి సర్కిల్ కార్యాలయం జనరల్ మేనేజర్ మితంత్య, నెల్లూరు రీజనల్ కార్యాలయం ఏజీఎం నాగరాజు అన్నారు. గ్రామంలోని బ్యాంకును నవీకరించగా.. గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రశంసా పత్రాలతో క్రీడాకారులు

వింజమూరు, న్యూస్‌టుడే : గ్రామంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మేరా యువ భారత్ క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాలీబాల్, ఖోఖో, పరుగు, షాట్‌పుట్ పోటీల్లో స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల, నేతాజీ వికాస్, వైఆర్ జూనియర్ కళాశాలలు ఊటుకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. శ్రీహరి, ఎంపీడీవో కె. శ్రీనివాసులురెడ్డి, జిల్లా యూత్ అధికారి కె. మహేంద్రరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ మాలకొండయ్య, కళాశాలల పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరలు సాచిన డెంగీ

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ర.భ అతిథిగృహం వెనుక వైపు రామ్మూర్తిపేటలో డెంగీ ప్రబలింది. ఆ ప్రాంతంలోని బహుళ అంతస్తుల భవనంలో నివసించే మహిళకు డెంగీ పాజిటివ్ రావడంతో స్థానికులంతా బెంబేలెత్తిపోతున్నారు. కొద్ది రోజుల క్రితం వచ్చిన మొంథా తుపాన్ అనంతరం జ్వరాలు విజృంభించాయి. తొలుత సాధారణ జ్వరాలుగా భావించారు. ఎంతకీ తగ్గకపోవడంతో పరీక్షల అనంతరం విషజ్వరాలుగా నిర్ధారించుకుంటున్నారు. చికిత్స చేయించుకున్నా తగ్గడం లేదు.

పట్టణంలోని ప్రాంతీయాసుపత్రిలో సేవలు అందకపోవడంతో పేదలు సైతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అక్కడ రక్తపరీక్షలు, ఔషధాలు, ఇతర ఫీజుల పేరిట భారీగా ఖర్చులవుతున్నా, ఆరోగ్యం మాత్రం అంతంతగానే కుదుటపడుతోంది. కొందరు నెల్లూరు, చెన్నై వెళుతున్నారు. ప్రస్తుతం రామ్మూర్తిపేట అపార్ట్‌మెంట్‌లో డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించిన మహిళ చెన్నైలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికంగా వైద్యారోగ్య శాఖ యంత్రాంగానికి పట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొంటుంది. చాలామంది పేదలు పనులకు వెళ్లలేక.. చికిత్సకు భారీగా ఖర్చులవుతుండంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమాచారం అందగానే పురపాలక సంఘం తరపున పారిశుద్ధ్య సిబ్బంది విస్తృతంగా చర్యలు తీసుకున్నారు. దోమల నివారణ మందులను ఇళ్ల లోపల భాగాల్లో, మరుగుదొడ్లు తదితర ప్రాంతాల్లో పిచికారీ చేయించారు. వీధుల్లో ఫాగింగ్ చేస్తున్నారు. ప్రధాన బాధ్యత స్వీకరించాల్సిన వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఈ సమాచారం లేదు. గురువారం జిల్లా వైద్యారోగ్య అధికారి, అదనపు వైద్యారోగ్య అధికారి, తదితరులు కావలికి రాగా వారికి కూడా ఈ విషయం తెలియకపోవడం గమనార్హం.

అపార్ట్‌మెంట్‌లో మందు పిచికారీ చేస్తున్న కార్మికుడు

డెంగీ కేసు వాస్తవమే

ఓ మహిళకు డెంగీ నిర్ధారణ కావడం వాస్తవమే. కార్తిక మాసం సందర్భంగా చన్నీటి స్నానాలు చేశారు. ఉపవాసాలతో జ్వరం బారినపడ్డారు. స్థానికంగా తొలుత చికిత్స తీసుకున్నారు.
బ్రిజిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కావలి

రైతులకు సంక్షేమ పథకాలు

సీతారామపురం : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు పసుపులేటి వికాస్‌బాబు అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం నాయకులతో కలసి రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాబు, జనసేన నాయకులు కాశీరత్తయ్య, నీలి రత్తయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్లు అల్లూరయ్య, ఏడుకొండలు, ఏఈవో సుధీర్, వీపీఏ పవన్ తదితరులు పాల్గొన్నారు.

తడకలూరులో దొంగల హల్‌చల్

ఇద్దరిని పట్టుకున్న గ్రామస్థులు

గ్రామస్థుల చేతికి చిక్కిన దొంగలు

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని తడకలూరులో నలుగురు దొంగలు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో హల్‌చల్ చేశారు. రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి గ్రామస్థుడైన వెంకటేశ్వర్లు ఇంట్లో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో వారింట్లోని కోళ్లు అరవడంతో పక్కింటి వారు లేచి చూశారు. గోడపై ఒకరు కూర్చుని ఉండగా మిగిలిన వారు ఇంటి ఆవరణలో తచ్చాడుతుండడం చూసి కేకలు వేశారు. దీంతో గ్రామస్థులు అక్కడకు చేరుకుని ఇద్దరిని పట్టుకోగా.. మిగిలిన వారు పరారయ్యారు. వారి వద్ద స్క్రూడ్రైవర్లు తదితర వస్తువులను గుర్తించారు. వారు వచ్చిన ద్విచక్రవాహనంతో పాటు ఇద్దరిని గురువారం పోలీసులకు అప్పగించారు. రెండు నెలలుగా పొలాల్లో మోటార్లు, స్టార్టర్లు చోరీ అవుతున్నాయి. ఈ విషయమై ఎస్సై జంపాని కుమార్ మాట్లాడుతూ చోరీకి నలుగురు వ్యక్తులు వచ్చారని, వారిలో ఇద్దరిని పట్టుకున్నట్లు చెప్పారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు. వారిని కూడా పట్టుకుని గతంలో చేసిన చోరీలపై కూడా విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: మర్రిపాడు మండలం ఇస్కపల్లిలో పలు చోట్ల వీధి దీపాలు పాడై వీధుల్లో అంధకారం నెలకొంది. రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – **రత్తయ్య**

సమాధానం : నూతన వీధిదీపాలు ఏర్పాటు చేయమని పంచాయతీ కార్యదర్శికి చెబుతాం. – **నాగేశ్వర ప్రసాద్, ఎంపీడీవో**

? సంగం బస్టాండు కూడలి వద్ద తాగునీటి ట్యాంకు నుంచి వృథా నీరు రోడ్డు మీదకు వస్తుండడంతో అక్కడ అపరిశుభ్రంగా మారింది. రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. – **కోదండరామయ్య, సంగం**

✓ వెంటనే మరమ్మతులు చేయించి నీరు రాకుండా చర్యలు చేపడతాం. – **నరసయ్య, పంచాయతీ కార్యదర్శి**

? అనంతసాగరం మండలం వడ్డిపాలెంలో మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. –**పెంచలయ్య, గ్రామస్థుడు**

✓ సిబ్బందిని పంపి కాలువలోని పూడిక తీయిస్తాం. –**తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి**

? తోటపల్లిగూడూరు మండలం చింతోపు నుంచి పేడూరుకు వెళ్లే మార్గంలో కోడూరు కాలువపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – **చంద్రశేఖర్, స్థానికుడు**

✓ పరిశీలించి త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తాం. – **అలీ, నీటిపారుదలశాఖ ఏఈ**

? తోటపల్లిగూడూరు మండలం పాతకోడూరు నుంచి కొత్తపట్టపుపాళేనికి వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్న అవస్థలు తప్పడం లేదు.– **రామలింగయ్య, స్థానికుడు**

✓ ప్రభుత్వానికి నివేదిక పంపించాం. మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. –**రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ**

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

చేజర్ల, న్యూస్‌టుడే: ఆస్తి వివాదంలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. బోడిపాడుకు చెందిన చెంచురామిరెడ్డి తన పొలంలో పొక్లెయిన్‌తో పని చేయించుకుంటుండగా రవీంద్ర తన తండ్రి, సోదరుడితో కలిసి దాడిచేశారు. గాయపడిన చెంచురామిరెడ్డిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తిరుమలరావు తెలిపారు.

వేధింపులు భరించలేకున్నాం

విడవలూరు కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు సీడీపీవో.. అంగన్‌వాడీ వర్కర్లను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమెపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు రెహానా బేగం డిమాండ్ చేశారు. కోవూరులోని సీతా పోలయ్య భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు ప్రాజెక్టు ఏర్పడి 38 ఏళ్లయిందని, మొత్తం 320 కేంద్రాలు ఉన్నాయన్నారు. పనిచేయని ఫోన్లు ఇచ్చి, వివిధ యాప్‌లతో తీవ్ర ఒత్తిడితో పనిచేస్తున్న వారిని చులకనగా చూడడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం జిల్లా నాయకురాలు రెహానా బేగం

పోషకాహారం అందించకుంటే కఠిన చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఇందుకూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల పరిధిలో కేంద్రాల నిర్వహణపై ఫిర్యాదులొస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి పలువురు సమస్యలు తెలపగా నమోదు చేసుకున్నారు. పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు

ప్రశ్న: తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రం సరిగా తెరవడం లేదు. కార్యకర్త అందుబాటులో లేరు. పలుమార్లు సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. –**సుభాషిణి, స్థానికురాలు**

సీడీపీవో: సమస్య నాదృష్టికి వచ్చింది. ఇప్పటికే సూపర్‌వైజర్ తనిఖీ చేశారు. కార్యకర్తకు మెమోఇచ్చాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

✎ ఇందుకూరుపేట, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు కొన్నేళ్లుగా పూర్తి కాలేదు. పిల్లలు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. – **శ్రీనివాసులు, ముత్తుకూరు**

➡ అసంపూర్తి భవనాల నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం.

✎ ఇందుకూరుపేట మండలం మైపాడులో అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు, కొరుటూరులో కార్యకర్త లేరు. – **రమణమ్మ, మైపాడు.. వెంకటేశ్వర్లు, కొరుటూరు**

➡ సిబ్బంది నియామకంపై ప్రభుత్వానికి నివేదించాం. అనుమతి రాగానే నియమిస్తాం.

✎ సక్షం పేరుతో కొన్ని కేంద్రాలకు టీవీలు, శుద్ధజల పరికరాలు పంపిణీ చేశారు. ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాల్లో వినియోగించకుండా మూలనపడేశారు. – **సుజాత, తోటపల్లిగూడూరు**

➡ ప్రభుత్వం అందజేసిన పరికరాలు వినియోగించాలి. కచ్చితంగా ఏర్పాటు చేసి పిల్లలకు అవగాహన కల్పించాలి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

✎ సిబ్బందికి ప్రభుత్వం అందజేసిన చరవాణులు సక్రమంగా పనిచేయడం లేదని చెబుతున్నారు. పని భారం పెరగడంతో పిల్లల బోధనపై ప్రభావం పడుతోంది. –**చిరంజీవి, తోటపల్లిగూడూరు**

➡ చరవాణుల సమస్యపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే కొత్తవి ఇస్తాం. పిల్లల బోధనపై ప్రభావం లేకుండా సమన్వయం చేస్తున్నాం.

✎ తీర ప్రాంతాలతో పాటు, పలు చోట్ల కేంద్రాల పరిశీలనలో సూపర్‌వైజర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొందరు నగదు తీసుకుంటూ పట్టించుకోవడం లేదు. – **చిరంజీవి, ముత్తుకూరు**

➡ నగదు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు అవాస్తవం. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

✎ ముత్తుకూరు మండల పరిధిలోని ఎక్కువ కేంద్రాల్లో పోషకాహారం పంపిణీ సరిగా చేయడం లేదు. సకాలంలో ఇవ్వకుండా పక్కదారి పడుతున్నాయి. – **సులోచనమ్మ, కృష్ణపట్నం**

➡ ప్రస్తుతం పంపిణీ అంతా ఆన్‌లైన్ విధానంలో చేస్తున్నాం. సిబ్బంది నిర్లక్ష్యంపై పరిశీలిస్తాం.

✎ తీర ప్రాంతాల్లో బాల్య వివాహాలు గోప్యంగా జరుగుతున్నాయి. ఇందుకూరుపేట, ముత్తుకూరు మండలాల పరిధిలో సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. – **సుధాకర్, కోడూరు**

➡ సిబ్బంది బాల్య వివాహాలు చేస్తే జరిగే అనర్థాల గురించి వివరిస్తున్నారు. ఎవరైనా స్పందించకుంటే మండల అధికారులకు ఫిర్యాదు చేస్తే నేరుగా పరిశీలిస్తారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడాపోటీలు

పొదలకూరులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు : జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 విభాగం రగ్బీ పోటీలకు సదుపాయాలు ఏర్పాటు చేశారు. గురువారం వ్యాయామ ఉపాధ్యాయుల రాష్ట్ర పరిశీలకులు మహబూబ్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 రగ్బీ పోటీలకు ఏర్పాటు చేస్తున్న కోర్టులు పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణయ్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వాసు, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి దేవిక, ప్రధానోపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నూతన విద్యావిధానంపై అవగాహన

వెంకటాచలం: అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి, అభివృద్ధి చెందిన దేశంగా మార్చే బాధ్యత యువతపై ఉందని వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. వీఎస్‌యూలో జాతీయ నూతన విద్యావిధానంలోని అంశాలపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు.

ధ్రువపత్రాలు లేని వాహనాలు స్వాధీనం

ఆత్మకూరు, కోవూరు, మనుబోలు, న్యూస్‌టుడే: నేరాలను, అసాంఘిక కార్యకలాపాలను అదుపుచేయడమే కార్డన్ సెర్చ్ లక్ష్యమని డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణ పరిధిలోని టిడ్కో గృహసముదాయంలో తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ● ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇనమడుగు అట్ల కాలనీలో అవగాహన కల్పించారు. ● మనుబోలు ఎస్సై రాకేశ్ స్థానిక అడ్డరోడ్డు కూడలి వద్ద ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు.

తిరుపతి జిల్లాలో కలపొద్దని సంతకాల సేకరణ

కలువాయిలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

కలువాయి, రాపూరు, న్యూస్‌టుడే: కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను నెల్లూరు జిల్లాలో ఉంచాలని కలువాయిలో జనసేన ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ నిర్వహించారు. మూడు బృందాలుగా ఏర్పడి అన్ని వీధుల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం తెచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, రాంకిషోర్ తదితరులున్నారు. ● తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఉన్న సర్వేపల్లి నియోజకవర్గం నెల్లూరులో ఉండగా, తిరుపతికి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మూడు మండలాలను ఆ జిల్లాలో కలపడం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రంగయ్య పేర్కొన్నారు. రాపూరులో గురువారం ఆయన మాట్లాడారు.

విజ్ఞాన సదస్సులో అబ్బురపరిచారు

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు భోపాల్‌లో 52వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థినులు పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు నళినిరాణి, కామాక్షమ్మ పర్యవేక్షణలో గణితంలో ప్రాజెక్టు అప్లికేషన్ ఆఫ్ త్రికోణమితి అనే అంశంపై కీర్తిశ్రీ, రాజశ్రీ చేసిన ప్రదర్శనకు ప్రశంసలు లభించాయి. దేశంలోని 36 రాష్ట్రాల నుంచి 240 ప్రాజెక్టులు ప్రదర్శించారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపికవగా జిల్లా నుంచి కోడూరు గురుకులం విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిని పాఠశాలల జిల్లా సమన్వయకర్త ప్రభావతమ్మ, ప్రిన్సిపల్ ఏస్తేరమ్మ తదితరులు అభినందించారు.

అభినందిస్తున్న జిల్లా సమన్వయకర్త ప్రభావతమ్మ, ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ



జ్యోతిరావు పూలే 136వ వర్ధంతి

సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడైన శ్రీ జ్యోతిరావు పూలే గారికి 136వ వర్ధంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకుంటూ..

కోవూరు మండల ప్రజలు

చెత్త కుప్పలు తొలగించండి

కోవూరు పట్టణంలోని కోనేటిమిట్ట వద్ద చెత్త కుండీ నిండి వ్యర్థాలు రోడ్డుపై పడుతున్నాయి. గాలి వీస్తే గృహాల్లోకి చెత్త వస్తోందని స్థానికులు వాపోతున్నారు. సచివాలయం, పంచాయతీ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.– **న్యూస్‌టుడే, కోవూరు**

ఇరుకు రోడ్లు.. వాహనదారుల పాట్లు

కోవూరు పటణ పరిధిలో పీటర్ కాలువ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు రోడ్డు నిత్యం రద్దీ ఉండే మార్గంలో దుకాణాల ఎదుట వాహనాలు నిలపడంతో అవస్థలు తప్పడం లేదు. దీనికి తోడు నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో మరింత ఇరుకుగా మారింది. అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ చూపి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు. – **న్యూస్‌టుడే, కోవూరు**

ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఈవో దుర్గయ్య

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: తోటపల్లిగూడూరులోని ప్రసన్న కామాక్షిదేవి సమేత ఖరేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఛైర్‌పర్సన్‌గా నియమితులైన మన్నెం నీలిమతో పాటు మరో ఎనిమిది మంది సభ్యులతో ఈవో దుర్గయ్య ప్రమాణం చేయించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షులు రఘుబాబు, తెదేపా నాయకులు జితేంద్రగౌడ్, చిన బాబిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉపన్యాసంలో మెరిశారు.. బహుమతులు సాధించారు

ఆత్మకూరు, పొదలకూరు న్యూస్‌టుడే: ఆత్మకూరు, పొదలకూరు మండలాల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. పాఠశాలల్లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం'అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వికేఎంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు

ఆత్మకూరులో బహుమతులు అందిస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

● పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ పరిధిలోని వరదాపురంలోని శ్రీసాయినాథ్ హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో భవ్యశ్రీ (ప్రథమ), భానుశ్రీ(ద్వితీయ), అనిల్‌రెడ్డి(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో అలకనంద(ప్రథమ), ఆయిషా(ద్వితీయ), నిఖిల్(తృతీయ) స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రతిభ చూపిన వారితో కరస్పాండెంట్, డైరెక్టర్, హెచ్‌ఎం

బహుమతులు అందిస్తున్న వారితో ప్రధానోపాధ్యాయిని

● ఆత్మకూరు పట్టణంలోని శ్రీనివాస ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సాత్విక్‌కుమార్(ప్రథమ), నిషిత(ద్వితీయ), నిర్మా(తృతీయ) స్థానాల్లో నిలిచారు. కరస్పాండెంట్ సురేష్‌బాబు, డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, పధానోపాధ్యాయుడు మస్తాన్‌షరీఫ్, వసుంధర, నెహేమియా విజేతలకు బహుమతులు అందజేశారు.

● ఆత్మకూరులోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో బి. దీక్షిత(ప్రథమ), సయ్యద్ సబ్రిన్(ద్వితీయ), మైత్రిక(తృతీయ) స్థానాలు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని సిస్టర్ ఎస్తెర్ ఫ్లోరామేరి, ఉపాధ్యాయులు రవిబాబు, కొండమ్మ, బషీరున్నీసా బహుమతులు అందజేశారు.

రామేశ్వరం వెళ్లొచ్చేలోగా దోచేశారు

చౌకచర్లలో పది సవర్ల బంగారం అపహరణ

విడవలూరు, న్యూస్‌టుడే: తీర్థయాత్రలకు వెళ్లి తిరిగొచ్చేలోగా ఇంట్లో బంగారు ఆభరణాలు దోచేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. విడవలూరు మండలం చౌకచర్లకు చెందిన దోనిపర్తి సుకన్య ఆరేళ్ల క్రితం భర్త మృతి చెందగా ఒంటరిగా నివసిస్తోంది. ఈ నేపథ్యంలో వివాహాలై నెల్లూరులో ఉంటున్న తన ఇద్దరు కుమార్తెల వద్దకు తరచూ వెళ్లొస్తోంది. ఈనెల 16న రామేశ్వరం తీర్థయాత్రకు వెళ్లి 23న నెల్లూరుకు చేరుకున్నారు. కుమార్తె ఇంట్లో ఉండి గురువారం చౌకచర్లకు రాగా ఇంటి తలుపులు ధ్వంసం చేసి ఉండడంతో గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. పది సవర్ల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

సైబర్ మోసం.. రూ.35 వేల నగదు స్వాహా

సంగం, న్యూస్‌టుడే: గాంధీజనసంఘంలో సైబర్ మోసంతో ఒక దుకాణ యజమాని రూ. 35వేల నగదు కోల్పోయారు. మోసగాళ్లు అక్కడితో ఆగక ఆన్‌లైన్‌లో ఫిర్యాదు ఉందంటూ బెదిరించిన ఘటన గురువారం చోటుచేసుకుంది.. నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి సమీపంలోని దుకాణం వద్దకు ఉదయం ఆగంతకుడు మరి కొందరితో కలసి ద్విచక్రవాహనంపై వచ్చారు. ఒకరు మాత్రమే యజమాని కృష్ణ వద్దకు వెళ్లి తమ ఫోన్‌లో రూ. 50 వేలు ఉందని, దాన్ని మీకు జమచేస్తామని, తనకు నగదు కావాలని అడగడంతో ఆయన సమ్మతించారు. నాలుగు దఫాలుగా రూ. 35 వేలను కృష్ణ ఖాతాకు బదిలీ చేశారు. ఫోన్‌లో చూసుకోగా జమైనట్లు గుర్తించి అంతే నగదు వారికి చెల్లించారు. మధ్యాహ్నం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కృష్ణకు ఫోన్ చేసి నీ ఖాతాకు ఎవరిదో నగదు జమైందని, దానిపై పోలీసు కేసు నమోదైందంటూ బెదిరించారు. అనుమానం వచ్చి తన ఫోన్‌లో నగదు నిల్వ పరిశీలిస్తే ఒక రూపాయి కూడా జమ కాలేదని స్పష్టమైంది. దీంతో తాను మోసానికి గురయ్యానంటూ సంగం పోలీసులను ఆశ్రయించారు.

పోక్సో కేసు నమోదు

రాపూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గరిమెనపెంటకు చెందిన ప్రకాశ్ అనే వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసున మోదు చేశారు. కొంత కాలంగా కలిసి జీవిస్తూ వివాహానికి నిరాకరిస్తున్నాడంటూ గిరిజన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

దాయాది కడసారి చూపునకు వెళుతూ కోమాలోకి..!

ఆత్మకూరు, అనుమసముంద్రపేట, న్యూస్‌టుడే: దాయాది కడసారి చూపునకు వెళుతూ ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లిన ఘటన ఆత్మకూరు నెల్లూరుపాళెంలో గురువారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... ఏఎస్‌పేట మండలం తెల్లపాడుకు చెందిన రామలింగారెడ్డి గురువారం వింజమూరు మండలం కాటేపల్లిలో తన దాయాది మృతిచెందడంతో కడసారి చూసేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. అదే గ్రామంలో ఉన్న సోదరుడు నగదు కావాలని చెప్పడంతో తీసుకొని నెల్లూరుపాలెం వద్ద పెట్రోలు పట్టించుకొని బయటకు వచ్చారు. కడప నుంచి నెల్లూరు వైపు వెళ్లే కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. జిల్లా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లారు. మెరుగైన వైద్యసేవలకు నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ సాయిప్రసాద్ కేసునమోదు చేసి, అతని వద్ద ఉన్న నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు మండల పరిధిలోని పాటూరులోని మహాలక్ష్మమ్మ ఆలయంలో గురువారం విద్యుదాఘాతంతో విలువైన సామగ్రి దగ్ధమైంది. అమ్మవారి పట్టు చీరలు, ఇన్వర్టర్, మైకుసెట్, పంచలోహ అభరణాలు దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని స్థానికులు వివరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, వెంకటాచలం, మర్రిపాడు, న్యూస్‌టుడే: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి... వివరాలిలా ఉన్నాయి.. బుచ్చి టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం నిద్రమత్తులో కారు డ్రైవర్ వేగంగా ఆటోను ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కలిగిరికి చెందిన జయరామిరెడ్డి కారులో నిద్రమత్తులో ముంబయి రోడ్డుపై వెళుతుండగా ఉదయగిరి నుంచి నెల్లూరుకు వస్తున్న ఆటోను ఢీకొన్నారు. ఉదయగిరికి చెందిన ఆటోడ్రైవర్ సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ● బుచ్చిలోని గాంధీబొమ్మ సమీపంలో కారు అదుపుతప్పి ఆటోను కొట్టడంతో ముందున్న పాల వ్యాన్‌ను ఢీకొంది. ఆటోలో ఉన్న మహిళలకు గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ వైద్యశాలకు స్థానికులు తరలించారు. ● గొలగమూడి రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మార్కెటింగ్ శాఖ ఉద్యోగులకు తీవ్రగాయాలయ్యాయి. యార్డు సహాయకులుగా పని చేస్తున్న హరికృష్ణ, శ్రీహరిలు ద్విచక్ర వాహనంపై వెళుతూ. జాతీయ రహదారిపై గొలగమూడి రోడ్డు వద్ద మలుపు తిరుతుండగా సర్వేపల్లికి వెళుతున్న వాహనం ఢీకొంది. హరికృష్ణకు కాలు విరగ్గా, శ్రీహరికి తీవ్రగాయాలవగా ఆసుపత్రికి తరలించారు. ● మర్రిపాడు మండలంలోని పొంగూరు కండ్రిక సమీపంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారు. కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గులోడుతో బద్వేల్ వైపు వెళుతున్నాయి. ముందు వెళుతున్న లారీ ఆగడంతో వెనుకవస్తున్న మరో లారీ ఢీకొంది. ఘటనా స్థలాన్ని పోలీసులు, ఎంవీఐ రాములు పరిశీలించారు.

వేలము నోటీసు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

డిప్యూటి రిజిస్ట్రార్ / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ - నెల్లూరు వారి ఉత్తర్వులు మేరకు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు నందలి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, నెల్లూరు టౌన్ బ్రాంచ్‌నకు అనుబంధ సంఘం అయిన మనుబోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. V 4123 మనుబోలు నందు ఈ క్రింది తెలుపబడిన బకాయిదారులు తమ కుటుంబ అవసరముల నిమిత్తం అప్పు తీసుకుని ఇంతవరకు పూర్తిగా చెల్లించనందున వారిపై మనుబోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. V 4123, మనుబోలు వారు డిక్రీ పొందియున్నారు. సదరు డిక్రీ మొత్తములు రాబట్టుకొనుటకు గాను ఈ క్రింద చూపబడిన స్థిరాస్తులను సేల్ ఆఫీసరు, డిఆర్ / ఓయస్‌డి వారి కార్యాలయము, నెల్లూరు వారిచే ఈ క్రింద తెలుపబడిన తేదీలలో బహిరంగముగా ఆయా ప్రదేశములలో వేలము వేయబడును. వేలము పాటకు సంబంధించిన ఇతర షరతులను ముఖ్య కార్యనిర్వహణాధికారి, మనుబోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మనుబోలు వారి వద్ద నుండి గాని లేక సేల్ ఆఫీసర్ వారి కార్యాలయము జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నెల్లూరు బ్రాంచ్ వారి నుండి గాని పొందవచ్చును.

వరుస సంఖ్య	తీర్పు బకాయిదారుని పేరు, చిరునామా	జప్తు పిటిషన్ నెంబరు	రావలసిన బాకీ మొత్తము	వేలము వేయబడు స్థిరాస్తి వివరములు: సర్వే నెం.	విస్తీర్ణం ఎకరాలలో	వేలము వేయబడు తేది మరియు సమయం	వేలము వేయబడు స్థలము
1.	శ్రీ యాళ్ళ నరేష్ S/o వెంకయ్య, రాజవోలుపాడు (గ్రా) వడ్లపూడి మనుబోలు మండలం నెల్లూరు జిల్లా	391/ 2021–22	రూ. 21, 21,353/- + వడ్డీ + ఇతర ఖర్చులు	810-6B 810-6A 810-5 810-4 538 5041 వెరశి ఆస్థి ఉన్న ప్రాంతము : రాజవోలుపాడు (గ్రామం) మనుబోలు (మం), నెల్లూరు	0.41 0.40 0.34 0.37 2.00 0.51 4.03	తేది 06.12.2025 ఉ॥ 11-00 గం॥కు	గ్రామ సచివాలయము, వీరంపల్లి గ్రామం మనుబోలు మండలం నెల్లూరు జిల్లా
2.	శ్రీ యాళ్ళ ప్రసాద్ S/o రమణయ్య రాజవోలుపాడు (గ్రా) వడ్లపూడి మనుబోలు మండలం నెల్లూరు జిల్లా	398/ 2021–22	రూ. 21, 21,353/- + వడ్డీ + ఇతర ఖర్చులు	815-2 815-1 523 447 430-1 427-1 వెరశి ఆస్థి ఉన్న ప్రాంతము : రాజవోలుపాడు (గ్రామం) మనుబోలు (మం), నెల్లూరు	0.03 1.62 1.49 0.71 0.21 0.91 4.97	తేది 08.12.2025 ఉ॥ 11-00 గం॥కు	గ్రామ సచివాలయము, వీరంపల్లి గ్రామం మనుబోలు మండలం నెల్లూరు జిల్లా

Sd/- **Konki Ramesh,** Sale officer,

Sri Potti Sriramulu Nellore District Co-Operative central Bank, Nellore. Cell: **89191 95731**

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం : ప్లాట్ నెం.14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

కార్యాలయ చిరునామా : ఒంగోలు-2 : డి.నెం. 37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, ఒంగోలు (పి & మం) ప్రకాశం జిల్లా.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు **ఒంగోలు-2** (డి.నెం. 37-1-171, 1వ అంతస్తు, గుప్తాస్ గ్రాండ్, పూర్ణిమ హోటల్ ఎదురు, ఒంగోలు (పి & మం), ప్రకాశం జిల్లా) **నందు బ్రాంచి ఆఫీస్** కలిగి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

క్ర సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1	**1) బోయిరెడ్డి సాయి ఈశ్వర్,** తండ్రి : మధుసూధనరావు, డి.నెం. 2-220, తిలక్ రోడ్డు, మూలగుంటపాడు, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్ - 523101. **2) బోయిరెడ్డి మాలతి,** భర్త : మధుసూధనరావు, డి.నెం. 2-220, తిలక్ రోడ్డు, మూలగుంటపాడు, సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్ - 523101. **3) చుండూరి సురేష్,** తండ్రి : సరసింహులు, రైల్వే స్టేషన్ రోడ్డు, వెంకటాచలం, నెల్లూరు జిల్లా.	31-12-2019 Rs. 10,00,000/-	18-10-2025 రూ. 36,68,340/- (అక్షరాలా ముప్పై ఆరు లక్షల అరవై ఎనిమిది వేల మూడు వందల నలభై రూపాయలు మాత్రమే) వడ్డీ, కాస్ట్ & ఇతర ఖర్చులు మొదలగున్నవి.
	ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **ONGL3TF1805290004**		
	ఆస్తి వివరములు : ఆస్తికి చెందిన డాక్యుమెంట్ నెం. 1930/2018, సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్, **శ్రీ బోయిరెడ్డి మాలతి, భర్త : మధుసూధనరావు గారి పేరిట ఉన్నది.** ప్రకాశం జిల్లా, సింగరాయకొండ సబ్ డిస్ట్రిక్ట్, సింగరాయకొండ మండలం, మూలగుంటపాడు గ్రామ పంచాయితీ మరియు గ్రామ అకౌంట్స్, బ్లాక్ నెం. 2, సర్వే నెం. 119/3, సమీప డి.నెం. 2-220 వద్ద గల ఖాళీ ఇంటి స్థలము. **హద్దులు : తూర్పు :** కుంచాల కృష్ణయ్య గారి స్థలము - 18.2 అ॥, **పడమర :** పాకాల కృష్ణారావు గారి స్థలము - 17.6 అ॥, **ఉత్తరం :** పంచాల షణ్ముక్ గారి స్థలము - 60.6 అ॥, **దక్షిణం :** తోట రమణమ్మ గారి ఇంటి స్థలములు - 59.4 అ॥. పై సరిహద్దుల మధ్య ఎకరా 0.02 1/2 సెంట్లు లేదా 119 చ॥గ॥లు లేదా 99.96 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము, తోట రమణమ్మ ఇల్లు మరియు స్థలాలకు తూర్పున మరియు ఈ షెడ్యూల్ ఆస్తికి దక్షిణం వైపున పంచాయితీ రోడ్డుకు చేరుకోవడానికి 5 అ॥ వెడల్పు గల మార్గం.		

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : ఒంగోలు — **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.**

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

ఆలయం వద్ద పడిపూజ చేస్తున్న అర్చకులు

అయ్యప్పస్వామికి మహా దీపారాధన

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: వేదాయపాలెం అయ్యప్ప ఆలయంలో కేరళ సంప్రదాయం ప్రకారం జరుగుతున్న మండల పూజల్లో భాగంగా గురువారం స్వామివారికి మహా దీపారాధన వైభవం నిర్వహించారు. అర్చకులు పడిక ర్వార దీపం పూజలతో పాటు విశేష పూజలు చేపట్టారు. శ్రీవేలి ఉత్సవం, భగవతి పూజ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కమిటీ సభ్యులు, అర్చకులు, ఉభయకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అండర్-12 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక 30న

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: ఈ నెల 30న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలోని క్రికెట్ ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు అండర్-12 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజశేఖర్ రెడ్డి, కె.శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ సొంత కిట్, తెల్లని దుస్తులు డ్రస్ కోడ్‌తో హాజరు కావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య : వైకుంఠపురం మెయిన్‌రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పిల్లలను కరుస్తుండటంతో బయటకు పంపించాలంటే భయపడుతున్నాం. **–ఆనంద్‌నాయుడు**

? వేదాయపాలెం అయ్యప్ప గుడి నుంచి సాయిబాబా గుడి మధ్య కుక్కల సమస్యతో రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **–రాజేష్, స్థానికుడు**

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. **– డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలక సంస్థ, వెటర్నరీ అధికారి**

? ట్రంకురోడ్డు బాబు ఐస్‌క్రీమ్ ఎదురు వీధిలో స్తంభాలకు విద్యుద్దీపాలు వెలగడం లేదు. బ్యాంకులు ఉన్న ప్రాంతం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. **– గోపాలరావు,**

? ఎన్టీఆర్‌నగర్ సరస్వతినగర్‌లోని ఎస్ఎన్2/ఎ3/1 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రెండు నెలలుగా చీకటి నెలకొంది. **–అనిల్‌కుమార్**

✓ విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తాం.
– ముజాహిద్దీన్, డీఈ – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్, స్టోన్‌హౌస్‌పేట)

ప్రతిభతో మెరిసి.. బహుమతి పట్టి..

బహుమతులు సాధించిన డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్స్ నెక్ట్స్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్స్ నెక్ట్స్ ఒలింపియాడ్ స్కూల్లో గురువారం విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ఎస్‌కె.రష్మిక ప్రథమ, డి.యువనిత్య ద్వితీయ, జి.హారతి తృతీయ బహుమతులు సాధించారు. వీరికి ఆ పాఠశాల సీవో ఎలిజబెత్, ఉపాధ్యాయులు పెంచలయ్య బహుమతులు ప్రదానం చేశారు.

సిగ్నల్స్ సరే.. అవగాహనేదీ?

నిబంధనలు పాటించని వాహనదారులు

● నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఎర్ర లైటు పడగానే వాహనాలు ఆగిపోవాలి. కార్లు, పలు ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. కానీ, ఆటోలు పట్టించుకోకుండా నేరుగా వెళ్లిపోయాయి. మిగతా వారంతా ఆకుపచ్చ లైటు వచ్చేవరకు ఆగి అనంతరం ముందుకుసాగారు.

● నగరంలోని ఏడు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటి ఏర్పాటు విషయం, నిబంధనలు ఇంకా నగర ప్రజలకు తెలియలేదు. వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

నిబంధనలు పాటించకుండా నేరుగా వెళుతున్న వాహనాలు

నగరంలో ప్రధాన సమస్య ట్రాఫిక్. వాహనాలు ఏటా పెరగడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ క్రమంలో ట్రాఫిక్ సిగ్నళ్ల వ్యవస్థ అందుబాటులోకి వస్తే కొంతవరకు సమస్య పరిష్కారమవుతుందనే అభిప్రాయంతో ఇటీవల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. కనకమహల్ సెంటరు, వీఆర్సీ సెంటరు, ఏసీ కూరగాయల మార్కెట్, పోలీసు కార్యాలయం, రామలింగాపురం, హరనాథపురం, కేవీఆర్ పెట్రోల్ బంకు కూడళ్లలో వీటిని అందుబాటులోకి తెచ్చారు. అంతా బాగానే ఉన్నా.. వీటి ఏర్పాటు ఇంకా చాలా మందికి తెలియడం లేదు.

మితిమీరిన వేగంతో వెళుతూ..

నగరంలో పెరిగిన వాహనాల రద్దీ నేపథ్యంలో వరుస క్రమంలో వెళితే ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదు. కానీ ఆటో వాలాల దూకుడు, ద్విచక్ర వాహనాల రయ్.. రయ్.. ప్రయాణాలు, నగర బస్సుల మితిమీరిన వేగంతో వాహనాలు ఎక్కడ పడితే ఆగిపోతున్నాయి. నిబంధనలు పాటించకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. నగరంలో ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లతో సమస్యకు కాస్త ఉపశమనం దొరకనుంది. వాహనాలు వరుస క్రమంలో వెళ్లేందుకు, నిబంధనలు పాటించడానికి వ్యవస్థ ఉపయోగపడనుంది. వ్యవస్థపై పక్కాగా ప్రజలకు అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏయే రంగు సిగ్నల్ వేస్తే ఆగాలి.. మళ్లీ ఎప్పుడు వెళ్లాలి.. మధ్యలో సమయం ఎంత ఉంటుంది తదితర వివరాలు తెలిసేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి. ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని నగరవాసులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వాహనాలు

కపాడిపాలెంలో కార్డన్ సెర్చ్

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని కపాడిపాలెంలో గురువారం నగర పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. నగర ఇన్‌ఛార్జి డీఎస్పీ గిరిధర్ ఆధ్వర్యంలో సంతపేట ఇన్‌స్పెక్టరుతో వైవీ సోమయ్యతో పాటు చిన్నబజారు, నవాబుపేట, దర్గామిట్ట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు, వేణుగోపాల్ రెడ్డి, కల్యాణ్ రాజు, కె.సాంబశివరావు, నగరంలోని పలువురు ఎస్సైలు తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను తనిఖీ చేసి వారి వేలిముద్రలు సేకరించారు.

వసతి గృహాలకు వంటపాత్రలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ పరిధిలో నిర్వహిస్తున్న వసతిగృహాలకు వంటపాత్రలు వచ్చాయని జిల్లా అధికారిణి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. జిల్లాకు చెందిన 73 అల్యూమినియం వంట పాత్రలు, 53 మిక్సీలు వసతిగృహాలకు అందించామన్నారు.

వైద్యవృత్తి పవిత్రమైంది

నెల్లూరు(వేదాయపాలెం): వైద్యవృత్తి సేవాభావంతో కూడిన పవిత్రమైందని.. వైద్యుడిగా మారడానికి విద్యార్థులు ఎక్కువగా శ్రమించాల్సి ఉందని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మాధవి పేర్కొన్నారు. గురువారం మొదటి సంవత్సర విద్యార్థులకు 'ఎమోషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్' అనే అంశంపై మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.


సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సున్నితత్వాన్ని వీడాలని, ఇబ్బందులు వస్తే ప్రొఫెసర్లు, సహ విద్యార్థులతో పంచుకోవాలన్నారు. యోగా, ధ్యానంతో ఏకాగ్రత మానసిక పరిణతి పొందుతారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మస్తాన్ బాషా, వైద్యులు జెనిఫర్, శరత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు

నెల్లూరు(విద్య): నగరంలోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వికలాంగులశాఖ జిల్లా అధికారి మహమ్మద్ ఆయూబ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా గొలగమూడి గ్రామాన్ని దత్తత తీసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలు పరిరక్షించాం

మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ. వందల కోట్ల విలువజేసే 29 పార్కు స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇబ్బందులను అధిగమించి అన్యాక్రాంతం అవుతున్న పార్కు స్థలాలను పరిరక్షించడం తన రాజకీయ జీవితంలో ఎంతో సంతృప్తి ఇచ్చిందని చెప్పారు. 29 పార్కులకు మహనీయుల పేర్లు పెట్టాలని నిర్ణయించామని.. ఇందుకు ప్రజలు పేర్లు సూచించాలని కోరారు. ప్రత్యర్థులు చేసే విమర్శలపై తాను సమాధానం చెప్పే రోజు రాకూడదని వారు కోరుకోవాలన్నారు. తాను సమాధానం చెబితే చాలా మంది నోరు కూడా తెరవలేరని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సాబీర్ ఖాన్, కరణం హజరత్ నాయుడు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు చలో విజయవాడ

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : భారతదేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవడంతో 60 శాతానికి పైగా ఉన్న బీసీ కులాల వారు నష్టపోతున్నారని బీసీ నవచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శీలం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలో బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చర్చావేదిక చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు డిసెంబరు 22న చలో విజయవాడ చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీ నవ చైతన్యవేదిక ప్రధాన కార్యదర్శి దోనెపూడి కోటేశ్వరరావు, మోడెం నాగరాజు, సుధాకర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయం సాధించాలంటే.. విమర్శలు పట్టించుకోవద్దు

చిరంజీవిని సత్కరిస్తున్న కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: సమాజంలో వారు ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలంటే విమర్శలు పట్టించుకోవద్దని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ చిరంజీవి తెలిపారు. గురువారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు, విద్యార్థులు నిజజీవితంలో ఎదుర్కొనే సమస్యలను అధిగమించి ముందుకు ఎలా వెళ్లాలో మెలకువలు సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలంటే మంచి నడవడిక, పట్టుదల, శ్రమ అలవర్చుకోవాలని చెప్పారు. ఆర్థికంగా ఎదగాలంటే లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం డాక్టర్ చిరంజీవిని సత్కరించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధవి, నెల్లూరి సేవాకేంద్రం నాగేశ్వరరావు, వీఆర్సీ వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, మెప్మా సిబ్బంది, పొదుపు సభ్యులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

330 ట్యాబ్‌ల పంపిణీ

తరగతి గది బోధనలో సమస్యలను అధిగమించి స్వీయ అభ్యసనం ద్వారా వెనుకబడిన విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపునకు పర్సనాలిటీ అడాప్ట్ లర్నింగ్ (పాల్) ల్యాబ్‌లు ఉపయోగపడతాయని సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ డి.వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం నగరంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్‌ల ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలలు 11కి 330 ట్యాబ్‌లు అందించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

అరకొరగా పూడిక తీత

నెల్లూరు చెరువు సమీపం నుంచి ఉత్తరం వైపు వెళ్లే ప్రధాన కాలువలో ఏడాదిగా పూడిక తీయక ఎండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల తరువాత కార్మికులు కొంత భాగం పూడిక తీసి వదిలేశారు. పూర్తిస్థాయిలో పనులు జరగక పోవడంతో తిరిగి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుతోందని స్థానికులు వాపోయారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

ప్రధాన రహదారి.. ప్రమాదకరం

నగరంలో ప్రధానమైన జీఎన్‌టీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదురుగా కల్వర్టుపై భారీగా గుంత పడటంతో రాత్రి పూట కన్పించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికులు కర్రను అడ్డుగా పెట్టి ప్రమాదాలను నివారిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

ట్యాంక్ ప్రాంగణం.. వ్యర్థాలకు నిలయం

ఖుజబుజ నెల్లూరు వాటర్ ట్యాంక్ ఆవరణం వ్యర్థాలకు నిలయంగా మారుతోంది. కొందరు చెత్తాచెదారాలు వేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పేరుకుపోతున్న వ్యర్థాల వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

వాల్వ్ లీకేజీతో నీటి వృథా

నెల్లూరు నగరం గాంధీ నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో వాల్వ్ లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు వృథాగా పోవడమే కాదు తాగునీరు కలుషితం అవుతోంది. వాటర్ ట్యాంకు పక్కనే లీకేజీ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

రేడియో యూనిట్ అపహరణ

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: డ్రైవర్స్ కాలనీ బిట్-2 దగ్గర గల ఎయిర్‌టెల్ టవరులో ఉన్న రేడియో యూనిట్ కనిపించ లేదు. దాని విలువ రూ.45వేలు ఉంటుందని నిర్వాహకులు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విచారించి న్యాయం చేయండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రభుత్వం తమకు పంపిణీ చేసిన నివేశన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని కలువాయికి చెందిన రమాదేవి, విజయమ్మ, అనూష తదితరులు కోరారు. గురువారం జేసీ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 2019లో ఒక్కొక్కరికి 2.50 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేసి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు పనులు మొదలు పెడితే ఓ వ్యక్తి ఆ స్థలం తనదంటూ అడ్డుకుంటున్నాడని విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

దోచుకోవడమే వారి పని: జయవర్ధన్

నెల్లూరు(మార్కెట్ సెంటర్): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి సోదరులు దోచుకోవడం పనిగా పెట్టుకున్నారని మేయర్ భర్త జయవర్ధన్ ఆరోపించారు. జర్నలిస్ట్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాము అవినీతికి పాల్పడ్డామని ఆరోపిస్తున్న మీ నాయకులు.. వినాయక చవితికి వసూలు చేసిన రూ. కోట్ల చందా ఎక్కడికి పోయాయో.. చెప్పాలని.. మాగుంట లేఅవుట్‌లో రూ.కోట్ల విలువైన ఇల్లు, బెంగళూరులో షాపింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్‌లో విల్లా ఎలా వచ్చాయో ప్రజలకు తెలపాలన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి దోచుకుంటున్నారని, ఎవరైనా ప్లాట్లు వెంచర్లు వేసినా వాటాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

కుళాయిలను క్రమబద్ధీకరించాలి

మాట్లాడుతున్న ఇంజినీరింగ్ అధికారులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోకి రాని కుళాయిలను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ తెలిపారు. గురువారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డిసెంబరు 13వ తేదీ జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా కుళాయి పన్ను బకాయిలున్న భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని కార్యదర్శులు, ఫిట్టర్లను ఆదేశించారు. సమావేశంలో హార్టికల్చర్ ఏడీ నరసింహారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యం ఏదీ?

మాట్లాడుతున్న ముదిరాజు సంఘం నాయకులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ముదిరాజులకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సురేష్ అన్నారు. గురువారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 23 లక్షల మంది ముదిరాజ్ సంఘ జనాభా ఉంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన కులస్థులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా వెంకట అభిలాష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మోహన్, మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ, ఐ.క్రాంతి, శ్రీనివాసులు, అంకయ్య, హరి, బత్తల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

మాట్లాడుతున్న పరిశీలకులు హసన్ మౌలానా

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: పార్టీని బలోపేతం చేసుకుందాం.. ఇందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో మీరే చెప్పండి అంటూ ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడులోని వేళాచ్చేరి శాసనసభ్యులు హసన్ మౌలానా జిల్లా నాయకులను కోరారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం, అనంతరం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులు కమలాకర్ రావు, పి.శ్రీనివాసులరెడ్డి, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఐ సినిమాస్.: స్క్రీన్.1 తేరే ఇష్క్ మె (హిందీ), స్క్రీన్. 2 ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు), స్క్రీన్ .3 రాజు వెడ్స్ రాంబాబు (తెలుగు), **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 2. జూటోపియా 2.3డీ (తెలుగు, ఇంగ్లిష్), స్క్రీన్ 3 రాజు వెడ్స్ రాంబాబు (తెలుగు) రివాల్వర్ రీటా(తెలుగు), స్క్రీన్ 4. తేరే ఇష్క్ మె (హిందీ), స్క్రీన్.5.. ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు), **రెయిన్ సినిమా:** స్క్రీన్..1 జూటోపియా 2..3డీ (తెలుగు, ఇంగ్లిష్), రివాల్వర్ రీటా (తెలుగు), స్క్రీన్..2..ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు), స్క్రీన్.3.. తేరే ఇష్క్ మె (హిందీ), స్క్రీన్..4.. రాజు వెడ్స్ రాంబాబు (తెలుగు), రివాల్వర్ రీటా (తెలుగు)

రోడ్లు ధ్వంసం.. రాకపోకలకు అంతరాయం

జేమ్స్‌గార్డెన్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

నెల్లూరు(మార్కెట్ సెంటర్, స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ దగ్గరున్న జేమ్స్‌గార్డెన్‌ను సమస్యలు వేధిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన రహదారి నుంచి ఆత్మకూరు బస్టాండ్ లోపలకు వచ్చే మార్గం దారుణంగా మారింది. ఎవరికివారు అడ్డగా తవ్వేయడంతో గోతులమయమైంది. వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ రహదారి దిగువకు ఉండటంతో వర్షాకాలం నీరు చేరుతోంది. నీటితో నిండిన గుంటలను గుర్తించలేని ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో కొంత భాగం నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నెల క్రితం పూర్తి చేశారు. పనులు చేసేందుకు ఉన్న సిమెంట్ రోడ్డును తవ్వేయడంతో అస్తవ్యస్తంగా మారింది. మట్టిరోడ్డుగా మారి రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జేమ్స్‌గార్డెన్‌లో భారీ భవంతులతోపాటు రైల్వేట్రాక్ పక్కన పలువురు పేదలు నివాసం ఉంటున్నారు. వారంతా మున్సిపల్ కుళాయిల ద్వారా వచ్చే తాగునీటిని వినియోగిస్తున్నారు. నీరు మురికిగా వస్తుండటంతో తాగలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్ని సార్లు మలినాలు, దుర్వాసనతో వస్తుండటంతో క్యాన్ నీరు కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ఈ ప్రాంతంలో కాలువల ద్వారా ప్రవహిస్తోంది. దీంతో దోమలు పగలు రాత్రి తేడా లేకుండా దాడి చేస్తుండటంతో వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకురావాలి

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నూతనంగా వివాహమైన కమ్యూనిటీ హెల్త్ అధికారిణి పి.మౌనిక, వెటర్నరీ అసిస్టెంట్ బి.శివకుమార్ తమవంతు సాయం అందించడం అభినందనీయమని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తెలిపారు. గురువారం నెల్లూరులోని జనహిత వాత్సల్య చిన్నారులు, వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసరాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను ఆదుకునేందుకు అధికారులు, ఉద్యోగులు ముందుకు రావాలని కోరారు.

నిబంధనలు తప్పనిసరి

నెల్లూరు (వేదాయపాలెం, రవాణా), న్యూస్‌టుడే: ఆటోవాలాలు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వీఆర్సీ మైదానంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: వేద సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఆరివిత్తూర్ విశ్వనాథ శ్రౌతుల వారి 105 జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నెల్లూరులో ట్రంకురోడ్డు సమీపాన ఉన్న టి.వి.ఎస్. కల్యాణ్ సదన్ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సంగీత కచేరి, అవధానం అలరించింది.

శివారు.. సమస్యలతో బేజారు

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

ఖాళీ స్థలాలు.. అనారోగ్య కేంద్రాలుగా మారాయి. నగరంలో 54 డివిజన్‌లు ఉండగా 10లక్షల వరకు జనాభా నివసిస్తున్నారు. అభివృద్ధి చెందుతూ జనావాసాల సంఖ్య పెరుగుతున్నా.. నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల సంఖ్య అధికంగానే ఉంది. భూముల ధర అంకెలం రూ.లక్షలు పలుకుతుండడంతో అనేక మంది స్థలాలను స్థిరాస్తులుగా ఉంచుకుంటున్నారు. కొందరు ఉపాధి, ఉద్యోగాలు నిమిత్తం ఇతర ప్రాంతాలు, దేశాలకు వెళ్లడంతో ఇక్కడ స్థలాలు వదిలేస్తున్నారు.

అనారోగ్య కేంద్రాలుగా స్థలాలు..

నిర్మాణాలు చేసే సమయంలో అనేక మంది భవిష్యత్తు దృష్ట్యా రోడ్డు కంటే 4 అడుగుల నుంచి 6 అడుగులు వరకు ఎత్తులో నిర్మాణాలు చేస్తుండటంతో పక్కనే ఉన్న స్థలాలు తటాకాలుగా మారిపోతున్నాయి. నివాసాల నుంచి వచ్చే మురుగునీరు ఖాళీ ప్లాట్‌లలో నిలిచిపోతోంది. వర్షాకాలంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది. నగర పరిధిలో పార్కులు అభివృద్ధి చెందుతున్నా..

చెరువును తలపిస్తున్న బృందావనం గార్డెన్స్ పార్కు స్థలం

శివారు ప్రాంతాల్లో మురికి కూపాలుగా మారాయి. నగరంలోని నాలుగో మైలు సమీపం బృందావనం గార్డెన్స్ పార్కు స్థలం నిదర్శనం. స్థానికంగా సక్రమంగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరంతా వచ్చి పార్కు స్థలంలో నిలిచిపోతోంది. ముళ్లచెట్లు, గడ్డి, బురదనీరుతో నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఆ ప్రాంతమంతా వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి పార్థసారథి నగర్, బాబానగర్, మూడో మైలు, అల్లీపురం తదితర ప్రాంతాల్లో నెలకొంది. వ్యాధుల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన **బొడవుల రఘురాములు తండ్రి జయరాములు, హరినాథపురం, నెల్లూరు సిటి** అనువారు ఇచ్చిన అనుమతి మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **1.కంటే శైలేంద్రబాబు, 2. కంటే మధుసూదనరావు,** వీరల తండ్రి **చెంచుసుబ్బయ్య, రేబాల గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా** అనువారల వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు **శైలేంద్రబాబు, మధుసూదనరావు గార్లు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **సుద్దపల్లి మురళీకృష్ణ** తండ్రి **కొండయ్య గారి** వద్దనుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేదీ: 15-01-2005 డాక్యుమెంటు నెం. 432/2005** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **మురళీకృష్ణ గారు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **గల్లా వెంకటకృష్ణయ్య తండ్రి నరశింహులు** వీరివలన GPA పొందిన ఏజెంటు **చిల్లకూరు గోపాల్‌రెడ్డి తండ్రి సుబ్బరామిరెడ్డి (GPA తేదీ: 18-05-1992 డాక్యుమెంటు నెం. 313/1992 of SRO, Nellore)** అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేదీ: 29-09-1993 డాక్యుమెంటు నెం. 5209/1993** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **వెంకటకృష్ణయ్య గారు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **పూడి శాంతి** తండ్రి **వేణుగోపాల్ గారి** వద్దనుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది 15-10-1984 డాక్యుమెంటు నెం. 6633/1984** ద్వారా కొనుగోలు చేసినారని సదరు **శాంతి గారు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **వాడ లక్ష్మయ్య** వగైరాల నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం **తేదీ: 27-08-1981 డాక్యుమెంటు నెం. 3417/1981** ద్వారా కొనుగోలు చేసినారని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, ఆడుమానములు, జప్తులు, క్లయిమ్‌లు, లీజులు, అగ్రిమెంట్లు, కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి ఆక్షేపణలు వున్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజులలోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

SPSR నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా నెల్లూరు సబ్ రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని, నెల్లూరు బిట్-1 ఏరియా (డోరు నెం. 26/1/1920, కొండాయపాళెం సమీపంలో) P.No. 611, C.A.S. No. 597/2రు య. 0-96ట్లులో య. 0-46ట్లులో య. 0-15ట్లులో 21 అంకణములా 14 చదరపు అడుగులు లేక 169.55 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** పల్లమాల రాధాకృష్ణయ్య గారి భూమి, **దక్షిణం:** 40'-00"లు వెడల్పుగల లేఅవుట్ రోడ్డు, **పడమర:** పి.భాస్కరరావు గారి ప్లాటు, **ఉత్తరం:** పల్లమాల నారాయణస్వామి గారి భూమి, ఈ హద్దులలోని **21 అంకణములా 14 చదరపు అడుగులు లేక 169.55 చదరపు గజములు ఖాళీ స్థలము.** ఇందుకు సంబంధించిన యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతోటి.

పెనుబాక గంగాధర రెడ్డి, B.Com., B.L.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు-3. సెల్: 98493 49333

(c) eenadu

చిత్రావతి కలుషితం.. ప్రజారోగ్యంతో చెలగాటం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో భూగర్భ మురుగుపారుదల వ్యవస్థ గాడి తప్పింది. అధికారులు, పాలకుల అలసత్వంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శుద్ధి ప్లాంటు సక్రమంగా పని చేయకపోవడంతో మురుగును నదిలోకి వదిలేస్తున్నారు. పట్టణంలోని సాయినగర్ నుంచి కర్ణాటకనాగేపల్లి కాజ్‌వే వరకు నది కలుషితం అయింది. నివారణ చర్యలు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. సాయినగర్, గోకులంలో ప్లాంట్లు నుంచి శుద్ధి కేంద్రానికి సరఫరా చేయకుండా నదిలోకి వదిలేస్తున్నారు. ప్రతి రోజూ పట్టణానికి 26 లక్షల లీటర్లు నీరు సరఫరా అవుతోంది. కాగా 18 లక్షల లీటర్ల మేర మురుగు బయటకు

మురుగు నీటితో చిత్రావతి నది

వస్తోంది. సాయినగర్, గోకులం వద్ద సక్రమంగా మోటార్లు పని చేయడం లేదు. దాన్ని అలాగే వదిలేశారు. ఎస్ఎస్ ఆసుపత్రి వద్ద శుద్ధి ప్లాంటు పునాదికే పరిమితమైంది.

★ పుట్టపర్తి పట్టణ పరిధిలోని చిత్రావతి నది పరిసరాలను ఆధ్యాత్మిక, పర్యాటకంగా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్నా.. మరోవైపు మురుగు నీరు, వ్యర్థాలతో నింపేస్తున్నారు. దీంతో నది పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా నదిలోకి మురుగు వెళ్లకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి అనంతపురం మీదుగా బిలాస్‌పూర్-యలహంక మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైళ్లు డిసెంబరు 2 నుంచి 31 వరకు మంగళ, బుధవారాల్లో ప్రయాణించనున్నాయి. రైలు (08261) ప్రతి మంగళవారం బిలాస్‌పూర్‌లలో ఉదయం 11 గంటలకు బయలుదేరి మంత్రాలయం, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం మీదుగా బుధవారం సాయంత్రం 6.30కు యలహంక చేరుకుంటుంది.

ఎందుకిలా చేశావు మావయ్యా..!

■ బావపై కోపంతో నాలుగేళ్ల మేనల్లుడి దారుణహత్య

కదిరి పట్టణం, నంబుల పూలకుంట, తలుపుల, న్యూస్‌టుడే: చేయి పట్టుకొని నడిపిస్తుంటే మావయ్యకు తానంటే ఎంత ప్రేమో అని ఆ నాలుగేళ్ల బాలుడు మురిసిపోయాడు. అడిగినవన్నీ కొనిస్తుంటే తానే లోకమనుకున్నాడు. బైకుపై షికారుకు తీసుకెళ్తుంటే సంబరపడిపోయాడు. ముళ్లపొదల్లోకి తీసుకెళుతుంటే మావయ్య అనే ధీమాతో వెంట నడిచాడు. గొంతుపై చేయివేసి నులుముతుంటే మామే కాలయముడని తెలుసుకోలేకపోయాడు. ఎందుకిలా చేశావు మావయ్యా.. అని అడగాలనుకున్నా, అప్పటికే ఊపిరి ఆగిపోయింది. ఈ విషాద ఘటన శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం మరికొమ్మదిన్నె వద్ద చోటుచేసుకుంది. హత్యోదంతాన్ని గురువారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఘటనా స్థలంలో రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

చిన్నారి హర్షవర్ధన్

గొంతు నులిమి చంపేశాడు..

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గరికిపల్లిలో ఉంటున్న చంద్రకళ, గంగాధర్‌ల కుమారుడు హర్షవర్ధన్(4). బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. ఈమేరకు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం బాలుడి మృతదేహాన్ని గరికిపల్లికి 24 కిలోమీటర్ల దూరంలోని నంబుల పూలకుంట మండలం మరికొమ్మదిన్నె వద్ద ముళ్లపొదల్లో గుర్తించారు. బాలుడి మేనత్త భర్త ప్రసాద్ ప్రణాళిక ప్రకారం ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి హతమార్చాడు. గంగాధర్‌పై కక్షతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమారుడి చికిత్సకు బావ గంగాధర్‌ను ప్రసాద్ సాయమడిగాడు. అంతకుముందు గంగాధర్ డబ్బు సాయం చేశాడు. తన వద్ద ప్రస్తుతం డబ్బు లేదన్నాడు. మరోవైపు ప్రసాద్‌కు ఆయన భార్యతో ఏర్పడిన గొడవలో సర్దిచెప్పకపోవడం కోపం తెప్పించింది. ఈ నేపథ్యంలో గంగాధర్‌పై కక్ష తీర్చుకునేందుకు పథకం ప్రకారం హర్షవర్ధన్‌ను ఎత్తుకెళ్లి గొంతు నులిమి హత్యచేసి ముళ్లపొదల్లో పడేశాడు. త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని ఎస్పీ వివరించారు. అదృశ్యం కేసును పోలీసులు హత్య కేసుగా మార్చారు.

ముక్కుపచ్చలారని కొడుకుపై ముద్దులెన్నో గుమ్మరించి మురిపంగా చూసిన తల్లి.. బుడిబుడి అడుగుల వెనకే పరిగెత్తుతూ కాలు కందనీయకుండా రక్షించిన ఆమె లాలన.. నిరంతరం శరీరంలోని అణువణువూ తన బిడ్డ గురించే ఆలోచించిన ఆ మనసు.. ఎందుకో మూగబోయింది. ఏ కన్నీళ్లు చుట్టుముట్టాయో, ఏ వేదన మరణ శాసనం రాసిందో.. తాను లేకపోతే బిడ్డ బతకలేడని చేయకూడని ఘోరాన్ని తన చేతులతోనే చేసింది. బిడ్డను చంపేసి చివరకు తానూ ఆత్మహత్య చేసుకుంది.

భర్త రవి, కుమారుడు సహస్రతో అమూల్య

నీవే నేనని.. నేను పోతే నీకెవరని?

● కొడుకును చంపి.. ఆత్మహత్య చేసుకున్న మహిళ
● భర్త రామగిరి మండల డిప్యూటీ తహసీల్దార్

అనంత నేరవార్తలు (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో గురువారం రాత్రి ఘోరం జరిగింది. ఓ మహిళ తన మూడున్నర ఏళ్ల వయసున్న కుమారుడిని చంపి, తాను ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. బోయ అమూల్య (30), బోయ రవి దంపతుల కుటుంబం నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియానికి ఎదురుగా ఎల్ఐసీ కాలనీ రిషితేజ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. వీరికి మూడున్నరేళ్ల కుమారుడు సహస్ర ఉన్నాడు. భర్త రవి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి భార్య అమూల్య తమ ఫ్లాట్లో ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే గదిలోనే చాప మీద చిన్నారి మృతి చెంది ఉన్నాడు. పిల్లాడి మెడపై గాయాలు ఉన్నాయి. పక్కనే కత్తి పడి ఉండటంతో తల్లే తొలుత కుమారుడిని చంపి, తర్వాత తాను అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన భర్త.. ఇంటి ప్రధాన తలుపు వేసి ఉండటంతో భార్యకు పలుమార్లు ఫోన్ చేశాడు. సమాధానం లేకపోవడంతో అపార్టుమెంటువాసులు, ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ ఘటనా స్థలానికి చేరుకుని ప్రధాన తలుపు, పడకగది తలుపులు పగలగొట్టి తెరిచి లోపలికి వెళ్లారు. ఘటనపై భర్తతోపాటు స్థానికులను విచారించారు. మృతదేహాలను సర్వజన వైద్యశాలకు తరలించారు. అఘాయిత్యానికి కారణాలు తెలియరాలేదు. మృతురాలిది కర్నూలు నగరం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదును బట్టి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. భార్యాభర్తలు రెండు రోజుల క్రితం గొడవపడినట్లు తెలిసింది. ఇద్దరి మధ్య మనస్పర్థల కారణంగానే ఘోరానికి పాల్పడి ఉంటుందని సమాచారం.

అధికారులు అడగరు.. అక్రమార్కులు ఆగరు

కొత్తచెరువులో యథేచ్ఛగా ఎర్రమట్టి దందా

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, కొత్తచెరువు: సామాన్యులకు ట్రాక్టరు మట్టి, ఇసుక కావాలంటే పలు నిబంధనలతో అడ్డుచెప్పే అధికారులు.. కళ్లముందే టిప్పర్లలో ఎర్రమట్టి తరలిపోతున్నా.. పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో యథేచ్ఛగా జరుగుతున్న మట్టిదందా తీరిది. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో ఎవరైనా మరణిస్తే చెరువులోతట్టు ప్రాంతంలో ఉన్న స్థలంలో అంత్యక్రియలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పుట్టపర్తి రోడ్డులోని పాలిమేరగుండు వద్ద కొండ పోరంబోకు భూమిని శ్మశానవాటికకు కేటాయించారు. సర్వే నంబరు 1458-2లో 1.03 ఎకరాలు, 1453-3లో 2.46.. మొత్తం 3.49 ఎకరాలు. . దీనిపక్కనే డంపింగ్ యార్డు కోసం సర్వేనంబరు 1452-1లో మరో 95 సెంట్లు ఇచ్చారు. కొండగుట్టను చదును చేసే పనిని కొందరు రెట్టింపు ఆదాయవనరుగా మార్చుకున్నారు. ఇందుకు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

కొత్తచెరువు పాలిమేరగుండు కొండగుట్టవద్ద తవ్వకాలు

మట్టి తవ్వకాలకు పంచాయతీ నిధులు

కేటాయించిన స్థలం కొండ పోరంబోకు కావడంతో గుట్టను చదును చేయాల్సి ఉంది. దీంతో పంచాయతీ అధికారులు విలేజ్ లెవల్ కమిటీ (వీఎల్‌సీ) తీర్మానం మేరకు ఇద్దరు వ్యక్తులకు పనులు అప్పగించారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. టన్నుల కొద్దీ ఎర్రమట్టిని తవ్వడానికి పంచాయతీ నిధులు కేటాయిస్తోంది. అలాగని తవ్విన మట్టి, రాళ్లను పంచాయతీకి సంబంధించి ప్రజాప్రయోజన పనులకేమైనా వినియోగిస్తున్నారా...అంటే లేదు. ఓ నాయకుడికి చెందిన పొలంలో ఉన్న గుంతలను పూడ్చడానికి తరలిస్తుండటం గమనార్హం. శ్మశానస్థలం చదును పేరుతో ఇతరులకు పనులిచ్చి అటు ప్రభుత్వ ధనానికి గండికొడుతూ.. నాయకుడికి లాభం చేకూరుస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రెండువిధాలా గండి పడుతోంది.

కళ్లెదుటే టిప్పర్లు తిరుగుతున్నా..

కొండలు, గుట్టలు తవ్వాలంటే.. అటు పంచాయతీగాని, ప్రైవేట్ వ్యక్తులు గాని మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉన్న కొత్తచెరువు రహదారి మీదుగా అధికారులు నిరంతరం తిరుగుతుంటారు. ఇదే రహదారిపై నుంచి నిత్యం ఎర్రమట్టి టిప్పర్లలో తరలిపోతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు ధర్మవరం రోడ్డులోని నాగిరెడ్డిపల్లికాలనీ సమీపంలో ఉన్న దాసరిపాముగుట్టను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. మట్టి, రాళ్లు సదరు నాయకుడి ప్రైవేటు స్థలానికే వెళుతోంది. నిర్దేశించిన స్థలంకంటే ఎంత విస్తీర్ణంలో దోపిడీ జరుగుతోందన్న విషయాన్నీ ఎవరూ తేల్చడం లేదు.

తగిన చర్యలు తీసుకుంటాం

- జనార్దన్‌రెడ్డి, కొత్తచెరువు ఇన్‌ఛార్జి ఈఓ

వీఎల్‌సీ తీర్మానం మేరకు పనులు అప్పగించిన మాట వాస్తవమే. మట్టి తరలిపోతున్న విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లాం. మట్టి తవ్వకం పనులు మైనింగ్ అధికారులు అడ్డుకోవాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

అనంతపురం (మూడో రోడ్డు), న్యూస్‌టుడే: డిసెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. గురువారం జిల్లా కోర్టులో పోలీసు, రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీ కాబడిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు రాజీ చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రాజీకాదగిన క్రిమినల్ కేసులు డిసెంబరు 13న జరుగు జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. అడిషనల్ జిల్లా జడ్జి సత్యవాణి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్, జూనియర్ సివిల్ జడ్జిలు బాల కోటేశ్వరరావు, హారిక, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

డిగ్రీ కళాశాలల్లో నూతన పాఠ్యాంశాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో నూతన పాఠ్యాంశాలు అమలు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత పేర్కొన్నారు. సీడీసీ డీన్ ఆచార్య రామగోపాల్ అధ్యక్షతన గురువారం ఎస్కేయూ అనుబంధ కళాశాలలు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో నూతన సిలబస్ రూపొందించామన్నారు. ప్రతి విభాగానికి చెందిన ఛైర్మన్లు, అధ్యాపకులు డిగ్రీ పాఠ్యాంశాలు విద్యార్థులకు అవసరమేయ్య విధంగా రూపకల్పన చేశారన్నారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడానికి, ఉపాధి పొందడానికి అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేశామన్నారు. పారిశ్రామిక రంగాలతో అనుసంధానం చేస్తూ సిలబస్ రూపొందించామన్నారు. పరీక్షల విభాగం పర్యవేక్షణ అధికారి శ్రీరాములు నాయక్, ఆచార్య మునినారాయణప్ప పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనిత

స్వామీ.. కోనేర్లు బాగయ్యేనా?

■ 'ఉపాధి హామీ' ఇచ్చినా ఊసేలేని పనులు

అనంతపురం (లక్ష్మీనగర్), న్యూస్‌టుడే: పలు ఆలయాల పరిధిలోని కోనేరుల పునరుద్ధరణ పనులపై డ్వామా అధికారులు దృష్టి సారించటం లేదు. నెలలు గడుస్తున్నా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరమ్మతు పనులు పూర్తి చేయని దుస్థితి. శిథిలావస్థకు చేరిన వాటిని గుర్తించి.. బాగు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మరమ్మతులు చేపట్టాలని రెండు నెలల క్రితమే సర్కారు ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు అధ్వానస్థితికి చేరిన కోనేరులను అధికారులు గుర్తించారు. పూడికను తీసేందుకు పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ నిధులను వినియోగించాలని... కూలీలతో పనులు చేయించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మండల ఇంజినీర్లు పరిశీలించి.. అంచనాలను తయారు చేసి పంపించారు. పొడవు, వెడల్పును బట్టి పునరుద్ధరణకు రూ.80 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని నివేదించారు. ఇప్పటిదాకా పెన్నోహోబిలంలో ఒకటి, లేపాక్షిలో ఒక కోనేరు పనులు చేశారు. అనంతపురం జిల్లాలో గుర్తించినవి 57, శ్రీసత్యసాయిలో 17 కోనేర్లు ఉన్నాయి.

గుంతకల్లు మండలం తిమ్మాపురంలోని కోనేరు దుస్థితి

★ పూడికతీత పనులు చేపట్టడానికి భారీ క్రేన్‌లను వినియోగించాల్సి ఉంది. అవి అందుబాటులో లేకపోవడం, ఉపాధి కూలీలు కోనేరులో పనులు చేసేందుకు ముందుకు రావటం లేదని అధికారులు చెబుతున్నారు.

అనంతపురం జిల్లాలో గుర్తించినవి..

అనంతపురం, ఆత్మకూరు, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె, గుత్తి, శింగనమల, గుంతకల్లు, కూడేరు, కుందుర్పి, పెద్దపప్పూరు, యాడికి, యల్లనూరులో ఒకటి చొప్పున.. కంబదూరు, పామిడి, తాడిపత్రిలో రెండు చొప్పున, బుక్కరాయసముద్రం, కణేకల్లులో 3 చొప్పున, ఉరవకొండ 5, వజ్రకరూరు 6, పెద్దవడుగూరు 11, విడపనకల్లులో 10 కోనేరులను మరమ్మతుల కోసం గుర్తించారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..

అమరాపురం, బత్తలపల్లి, బుక్కపట్నం, చిలమత్తూరు, కనగానపల్లి, లేపాక్షి, పుట్టపర్తి, సోమందేపల్లి, తాడిమర్రిలో ఒకటి చొప్పున, రొళ్ల, నల్లచెరువు 2, కదిరి 4 చొప్పున మరమ్మతులు చేయాల్సి ఉంది.

అవసరమైన చర్యలు చేపడతాం

- సలీంబాషా, విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

ఉపాధి హామీ పథకం కింద పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పలు కోనేరుల్లో నీరు ఉండటంతో మరమ్మతులు చేసేందుకు వీలు కావటం లేదు. త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. కొన్ని పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తిరస్కరించారు.

ఆటిజం బాధితులకు ఆసరా

● జిల్లా వ్యాప్తంగా అదనపు కేంద్రాల ఏర్పాటు

చిన్నారికి ఫిజియోథెరపి చేస్తున్న శిక్షకుడు

జిల్లా - శ్రీసత్యసాయి
భవిత కేంద్రాలు: 32
విద్యార్థులు: 3,251
ఆటిజం పిల్లల కేంద్రాలు: 06
ఒక్కో కేంద్రం ఏర్పాటుకు నిధులు: రూ.27.75లక్షలు

గోరంట్ల, హిందూపురం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగుల్లో అచేతన స్థితిలో ఉన్నవారిని గుర్తించి వారి భవిష్యత్తు కొంతైనా మార్పు రావాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అలాంటి వారికోసం ఆటిజం పేరుతో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే ప్రక్రియ చివరి దశకు చేరుకోగా త్వరలోనే ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఆటిజం అంటే.. భవిత కేంద్రాలకు వచ్చే వారిలో బుద్ధిమాంద్యతతోపాటు వివిధ రకాల వైకల్యం ఉన్న వారిని చిరువయసులోనే గుర్తించి 18 ఏళ్లు వచ్చే సమయానికి వారిలో వీలైనంత మార్పు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటుచేస్తున్న కేంద్రాలు.

జిల్లాలో ఎక్కడెక్కడంటే

ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ (పీఎంశ్రీ) పథకంలో ఎంపికైన ఆరు పాఠశాలలను గుర్తించారు. హిందూపురం మండలం కే.బసవనపల్లి, కదిరి, మడకశిరలో బాలికల పాఠశాలలు, పెనుకొండ ప్రభుత్వ పాఠశాల, కొత్తచెరువు ఆదర్శ ప్రాథమిక పాఠశాల, ధర్మవరం పురపాలిక. ఇవి భవిత కేంద్రాలకు సమాంతరంగా కొనసాగుతాయి.

రెండు గదులతో..

ప్రతి కేంద్రంలో ప్రత్యేకంగా రెండు గదులు నిర్మించి అక్కడ ఎంపిక చేసిన ఇద్దరు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మెరుగైన వైద్యచికిత్సలతో పాటు స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, సైకాలజీ నిపుణులతో ప్రత్యేక బోధన అందించడం.

★ జిల్లాలో ఆరు పీఎంశ్రీ పాఠశాలల్లో ఆటిజం కేంద్రాలు ఏర్పాటుకు గుర్తించాం. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేస్తూ, సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాం, త్వరలోనే సేవలు అందుబాటులోకి రానున్నాయి.

- పుల్లన్న, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

మూడేళ్ల కష్టాలకు ముగింపు

■ జిల్లాలో మారనున్న రెండు మండలాల రెవెన్యూ డివిజన్ పరిధి

గోరంట్ల పట్టణం

గోరంట్ల, పెనుకొండ, న్యూస్‌టుడే: జిల్లాలు ఏర్పడ్డాయని అందరూ మూడేళ్ల క్రితం సంతోషపడితే గోరంట్ల, అమడగూరు మండల ప్రజలు మాత్రం మానసిక వేదనకు గురయ్యారు. ఎందకంటారా నాడు ఏ నియోజకవర్గంలో ఉన్న మండలాలను అదే రెవెన్యూ డివిజన్‌లో ఉండేవి. అలాంటిది పెనుకొండలోని గోరంట్లను, కదిరిలో ఉన్న అమడగూరును పుట్టపర్తిలో కలపడంతో ఆ మండలాల ప్రజలు మూడేళ్లు నరకయాతన పడ్డారు.

ఇబ్బందులు పడ్డ గోరంట్ల రైతులు

ముఖ్యంగా గోరంట్ల మండలం బూదిలి, వడిగేపల్లి, పాలసముద్రం రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూములను పారిశ్రామికవాడల ఏర్పాటుకు తీసుకున్నారు. ఆ సమయంలో పరిహారం పంపిణీ విషయంలో చాలా సమస్యలు తలెత్తాయి. అవన్నీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. అప్పటివరకు పెనుకొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఉన్న దస్త్రాలు డివిజన్ మార్పుతో పుట్టపర్తికి చేరినట్లు అధికారులు చెబుతూ వస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు రెండు కార్యాలయాల్లోనూ పరిష్కారం లభించక రెండుచోట్లకు తిరగడం తమవంతైందని వాపోయారు. ఈ క్రమంలో మళ్లీ డివిజన్ పెనుకొండకు మార్పు జరిగితే తమ భూపంపిణీ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మహర్దశ

ఒక నియోజకవర్గ పరిధిలోని మండలాలన్నీ ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయంతో శ్రీసత్యసాయి జిల్లాలో రెండు మండలాల పరిధి మారబోతోంది.

పుట్టపర్తిలోకి అమడగూరు

పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు మండలం కదిరి రెవెన్యూ డివిజన్ ఏర్పడినప్పటి నుంచి అక్కడే ఉంది. అయితే తాజా నిర్ణయంతో పుట్టపర్తి డివిజన్ పరిధిలోకి రానుంది. ఇప్పటికే పోలీసు డివిజన్ కూడా ఒకనియోజకవర్గ పరిధిలో ఉన్న నిబంధనతో కదిరి నుంచి పుట్టపర్తికి మారింది.

పరిష్కారంపై ఆశాభావం

-చంద్రానాయక్, బీఎన్‌తండా, గోరంట్ల మండలం

గోరంట్ల మండలాన్ని పెనుకొండ నుంచి పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌కి మార్చడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. 2008లో ప్రత్యేక ఆర్థిక మండలి కోసం ప్రభుత్వం సేకరించిన పొలాల సమయంలో నాభూమి పోయింది. అప్పట్లో నాపేరు చంద్రానాయక్ బదులుగా చంద్రాబాయి అని చెక్కులో రాశారు. ఆ సమస్య నేటికి పరిష్కారం కాక పెనుకొండ, పుట్టపర్తికి తిరుగుతున్నా. కనీసం ఇప్పుడైనా సమస్య పరిష్కారం అవుతుందని ఆనందంగా ఉంది.

మొండికేసిన పీఏబీఆర్ గేటు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ అత్యవసర గేటు (షట్టర్) మొండికేసింది. పైకి ఎత్తడానికి శతవిధాల యత్నిస్తున్నా ఇంచు కూడా కదల్లేదు. ఐదు రోజులుగా శ్రమిస్తున్నారు. హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, డీఈలు కవిత, శ్రీనివాసులు, ఏఈ ఓబిరెడ్డి, తదితరులు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. సుమారు ఇరవై మంది సిబ్బంది విశ్వప్రయత్నం చేస్తున్నా గేటు కదలకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక అధికారులు తలపట్టుకుంటున్నారు. చివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ జలవనరుల మెకానికల్ సలహాదారు కన్నయ్య నాయుడు ప్రధాన సహాయకుడు కేవీ కృష్ణారావు, రాష్ట్ర జలవనరుల మెకానికల్ విభాగం సెంట్రల్ డిజైనర్ సంస్థ(సీడీఓ) ఈఈ విజయ్ శరత్, ఏఈ ప్రదీప్‌తో కూడిన సాంకేతిక అధికారుల బృందం పీఏబీఆర్ జలాశయానికి వచ్చింది. కుడి కాలువ సర్వీసు, అత్యవసర గేట్లను నిశితంగా పరిశీలించారు. వారి సమక్షంలోనూ అత్యవసర గేటును పైకి ఎత్తడానికి యత్నించినా ఫలితం శూన్యం. ఆఖరు ప్రయత్నంగా అత్యవసర గేటుకు పెద్ద రంధ్రాలు పెట్టి నీటిని విడుదల చేయాలని భావిస్తున్నామని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు. కర్ణాటకలోని మంగళూరు నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు సమాచారం అందించారు.



(c) eenadu

తానా అంతర్జాతీయ సమ్మేళనానికి ఆహ్వానం

జయశ్రీ

శైలజ

గుంతకల్లు: అమెరికాకు చెందిన తానా ఈనెల 30న నిర్వహించనున్న (అంతర్జాలంలో) అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి గుంతకల్లు మండలం తిమ్మాపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇరువురు బాలికలు ఎంపికయ్యారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జయశ్రీ, శైలజలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ రెడ్డి, తెలుగు పండితుడు చంద్రమోహన్ తెలిపారు. బాలికలు ఇరువురు ఇంతకుముందే తానాకు వారి కథలను తెలియజేయడంతో సమ్మేళనంలో పాల్గొనడానికి ఎంపిక చేశారన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో పరిమళించిన క్రీడాకారుల ప్రతిభ

పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ పాటవాలతో పతకాలు సాధించారు. కోనసీమలో జరిగిన ఈ పోటీల్లో ఆటగాళ్లు ప్రత్యర్థులను చిత్తుచేసి పతకాలతో సగర్వంగా తిరిగొచ్చారు. బాలుర విభాగంలో కేఎండీ రియాన్ సూరజ్ బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. టీమ్ ఈవెంట్‌లో జి.గౌతం, ఎం.కార్తిక్, రియాన్ సూరజ్‌లు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. శాబర్ టీమ్ ఈవెంట్‌లో రాకెట్ల జడ్పీ ఉన్నత పాఠశాల బాలురు దర్శన్, హర్షవర్ధన్, సి.వసంత్‌లు కాంస్య పతకాలు సాధించారు. బాలికల ఫాయిల్ విభాగంలో వందన, అంజనా మనోజ్ఞ, ఎ.మానస, సురేఖలు, శాబర్ విభాగంలో నందిని, ఎ.అంకిత, విజయలక్ష్మి, కె.నందినిలు మూడో స్థానంలో నిలిచారు. పతకాలతో తిరిగొచ్చిన క్రీడాకారులను జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, ఫెన్సింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, డీఎస్ఏ ఫెన్సింగ్ శిక్షకుడు ప్రతాప్, పీడీలు చంద్రశేఖర్, రవికుమార్‌లు అభినందించారు.

నేడు కదిరిదేవరపల్లి పరిధిలో రైల్వే ట్రాక్ పరిశీలన

కంబదూరు, న్యూస్‌టుడే: కదిరిదేవరపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం సాధారణ ట్రాక్ పరిశీలన చేసేందుకు బళ్లారి నుంచి కంబదూరుకు రైలు రానున్నట్లు సంబంధిత నైరుతి రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మధ్యాహ్నం రైలు వచ్చే సమయానికి మూగ జీవాలతో పాటు ప్రజలు ట్రాక్‌పై లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతితో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

RAMOJI GLAMPING

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్త రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో... ఊయలలో... మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలిమంట కాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

నేటి నుంచి ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీలు

లక్ష్మీనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సులను ఈ నెల 28 నుంచి డిసెంబరు 4 వరకు తనిఖీలు చేస్తామని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో బస్సుల్లో ప్రధానంగా భద్రతాపరమైన అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్లు ఏర్పాటు వాటి పనితీరు, రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. బస్సులను నిబంధనలకు అనుగుణంగా నడపాలని తెలియజేస్తూ యజమానులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించే తనిఖీల్లో బస్సుల్లో లోపాలున్నా, రికార్డులు సక్రమంగా లేకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జ్యోతుల పరస.. భూతప్పల ఉత్సవం

భక్తరపల్లి, జిల్లడగుంటలో బ్రహ్మోత్సవాలకు వేళాయె..

అలంకరణలో జిల్లడగుంట ఆంజనేయస్వామి

ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వాములను భక్తులు కొలుస్తున్నారు. వ్యాపారులు అప్పట్లో ఈ భక్తరపల్లిలో తిరిగేవారని, ఆ సమయంలో భోజనం వండుకొనేందుకు మూడు సాలిగ్రామాలను పొయ్యిగుండ్లుగా పెట్టి భోజనం వండారని, అప్పట్లో ఒక సాలిగ్రామం పెద్దదై ఉండిపోయిందని అందులో లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించారని పెద్దలు, అర్చకులు చెబుతున్నారు.

ఈనెలాఖరు నుంచి డిసెంబరు 8 వరకు

ప్రతి ఏడాది డిసెంబరు మాసంలో భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో ప్రధాన పట్టం జ్యోతుల పరస, భూతప్పల ఉత్సవం. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారు. ● ఈనెల 30న అంకురార్పణ, డిసెంబరు 1న ధ్వజారోహణం, 2న పవమాన హోమం, 3న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 4న బ్రహ్మరథోత్సవం, 5న జ్యోతుల పరస, భూతప్పల ఉత్సవం, 6న పూలపల్లకి, 7న కంబాల నరసింహస్వామికి జ్యోతుల ఉత్సవం, 8న వసంతోత్సవం.

భక్తితో నైవేద్యం

బ్రహ్మోత్సవాలలో ప్రధాన పట్టం భూతప్పల ఉత్సవం. జిల్లడగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి భూతప్పలను ఊరేగింపుగా తీసుకొచ్చి నైవేద్యం సమర్పిస్తారు. అక్కడి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునే క్రమంలో మొక్కుబడి ఉన్న భక్తులు తడిబట్టలతో స్వామివారు వచ్చే దారిలో అడ్డంగా పడుకుంటారు. భూతప్పలు భక్తులపై నడుచుకుంటూ వెళ్తారు. వారి కాలి స్పర్శ తగిలితే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని... సంతానం కలుగుతుందని, పెళ్లి జరుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటారు.

వీఆర్‌కు యాడికి సీఐ

యాడికి, న్యూస్‌టుడే: యాడికి యూపీఎస్ సీఐ ఈరన్నను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఇక్కడ గతేడాది ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ నెల జిల్లా ఎస్పీ జగదీశ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సమయంలో నేరాల నియంత్రణ, దస్త్రాల నిర్వహణ అసంపూర్తిగా ఉండటం తదితర లోపాలు వెలుగుచూశాయి. పరిపాలన విభాగంలో భాగంగా ఉన్నతాధికారుల నుంచి వీఆర్‌కు పంపుతూ గురువారం ఆదేశాలు అందాయి. ఇక్కడికి ఇన్‌ఛార్జిగా పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్యను కేటాయించారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ గడువు పెంపు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గత బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబరు 3 వరకు గడువు పొడిగించారని సంచాలకులు ఖుష్బు కొఠారి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 7న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది.

రైతులకు ఆదాయం పెంచడమే లక్ష్యం

మాట్లాడుతున్న కేంద్ర నోడల్ అధికారి సుజాత శర్మ, కలెక్టర్ ఆనంద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అన్నదాతలు నష్టపోకుండా మార్కెటింగ్ ఆధారంగా ఆదాయం పెంచడమే లక్ష్యం. మంచి దిగుబడి వచ్చే పంటలనే సాగు చేసేలా వారిలో అవగాహన కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శి, పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం నోడల్ అధికారి సుజాత శర్మ పేర్కొన్నారు. గురువారం అనంత పర్యటనకు ఆమెకు కలెక్టర్ ఆనంద్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఆ తర్వాత కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో వ్యవసాయం, దాని అనుబంధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. సుజాతశర్మ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నెలకున్న అంతరాలను గుర్తించి.. వాటిని ఏ విధంగా తొలగించాలో అధ్యయనం చేయాలి. ఆదాయం మెండుగా వచ్చేలా రానున్న ఆరేళ్లకు కార్యాచరణ తయారీ చేయాలని సూచించారు. ధన్‌ధాన్య కృషి యోజన పరిధిలోకి 11 శాఖలకు చెందిన 36 పథకాలను కలిపి అమలు చేస్తున్నామన్నారు. నిర్దేశిత శాఖల అధికారులు సమన్వయం, సఖ్యతతో పనిచేస్తేనే ఫలితాలు వచ్చేదన్నారు. మామిడి, అరటి వంటి పంటలకు సంబంధించి 30శాతం స్థానికంగా అమ్మకాలు సాగాలి. తక్కిన 70శాతం ఎగుమతి చేసేలా ఉండాలన్నారు. కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణ శర్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి లేఅవుట్ క్రమబద్ధీకరణ చేయాలి

వినతులు స్వీకరిస్తున్న వరుణ్, జేసీ శివనారాయణ శర్మ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అహుడా పరిధిలోని ప్రతి లే అవుట్ క్రమబద్ధీకరణ కావాలని ఛైర్మన్ వరుణ్, జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. గురువారం అహుడా కార్యాలయంలో ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అక్రమ లేఅవుట్‌లో ఎక్కడైనా వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఐజీల్లో ప్రతి ఫ్లాట్ కొనుగోలు దారుకు మెరుగైన సేవలు అందాలన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కంబదూరు పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి అశ్వర్థరెడ్డిపై సస్పెన్షన్ వేటుపడింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వహించిన కారణంగా అతన్ని సస్పెండ్ చేసినట్లు డీపీఓ నాగరాజునాయుడు తెలిపారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్లో ఇంటిపన్ను వివరాలు నమోదు చేయడంలో భాగంగా 3,714 కుటుంబాలకు ఒకే ఫోన్ నంబరు అనుసంధానం చేయడం వల్ల అతన్ని సస్పెండ్ చేశారు. వివరాలు సరిగా నమోదు చేయని కార్యదర్శులను సస్పెండ్ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే ఆయనపై చర్యలు తీసుకున్నారు. అలాగే డీపీఓ నాగరాజునాయుడుపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ కమిషనర్ వీసీలో హెచ్చరించారు.

వసతిగృహాల్లో నాణ్యతకు పెద్దపీట

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం ఏపీ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్టీజీఎస్ స్వామిత్వ, సంక్షేమ గురుకుల వసతిగృహాలు తదితర అంశాలపై ప్రభుత్వ కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలపై శ్రద్ధ చూపుతోందన్నారు. పురపాలికల్లో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి విద్యా సంస్థలో మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పోలీసు, ఎక్సైజ్, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

ముచ్చురామిలో మామిడి చెట్ల నరికివేత

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం గ్రామీణ మండలం ముచ్చురామిలో బుధవారం రాత్రి రామ్మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన తోటలో మామిడి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఈమేరకు బాధిత రైతు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు గ్రామానికి వెళ్లి తోటను పరిశీలించారు. గతంలోనూ రెండుసార్లు ఇదే తోటలో మామిడి చెట్లను నరికివేశారని పోలీసులతో బాధితుడు వాపోయాడు. వివరాలు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

The A.P. State Seeds Development Corporation Limited
UNIT OFFICE :PRASANNAYAPALLI : ANANTHAPURAMU
Email :apseedsantp@gmail.com

APSSDC

తేది: 28-11-2025

టెండరు ప్రకటన

అనంతపురము యూనిట్‌కు సంబంధించిన ఈ క్రింద తెలియపరిచిన మొలక శాతం తగ్గిన వేరుశనగకాయలు, వేరుశనగ రిజెక్షన్ మరియు కొర్రలు టెండరు/ వేలము పద్ధతిలో తేది: 03.12.2025న కొనుగోలు చేయుటకు ఆసక్తిగల వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నది. ఆసక్తిగలవారు రూ.500.00 చెల్లించి టెండరు షెడ్యూల్‌ను అనంతపురము ఆఫీసు నందు తేది: 01.12.2025 నుండి తేది: 03.12.2025 మధ్యాహ్నం 1 గంIIలోపు పొందవచ్చును. టెండరుతోపాటు క్రింద తెలియపరిచిన ధరావత్తు (E.M.D) ని APSSDC Ltd., Ananthapuramu వారి పేరు మీద చెల్లించి అదేరోజు మధ్యాహ్నం 2 గంIIలలోపు టెండరు బాక్సులో వేయవలెను. తేది:03.12.2025న మధ్యాహ్నం 3గంII లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును.

వ సం	సరుకు విరములు	పరిమాణం (క్వింటాళ్లలో/ నంబర్లలో)	ధరావత్తు సొమ్ము (EMD) In Rs.
1	వేరుశనగకాయలు TCGS-1694 రకము	71.10	50,000/-
2	కొర్ర SIA-3156	23.36	
3	వేరుశనగకాయలు TCGS-1694 రిజెక్షన్	24.80	
	Total	119.26	

సంప్రదించవలసిన సెల్ నెం: 1) జిల్లా మేనేజరు (విత్తనములు), ఏ.పి.యస్.యస్.డి.సి లిమిటెడ్, అనంతపురము 9849908751. 2) T.మదన్ మోహన్ Asst. Accountant, 9885081314

ఇట్లు: సం/-జిల్లా మేనేజర్ (సీడ్స్), ఏ.పి.సీడ్స్, అనంతపురము

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

JOBS

Royaloak Furniture - Walk - In - Interview. Sales Executives & Asst. Manager. Date: 30-11-2025. Venue: Royaloak Furniture Showrooom, Anantapur.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆ 96402 58899, 96404 68899

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in BLOSSOMS SCHOOL, Aravind Nagar, ATP. Mob: 90307 77676.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

గాడితప్పిన సాగునీటి కాలువల పర్యవేక్షణ

● అధ్వానంగా రహదారులు ● అధికారుల తీరుపై రైతుల అసహనం

అధ్వానంగా గుంతకల్లు బ్రాంచ్ కాలువ రోడ్డు

గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే : హెచ్చెల్సీ సర్కిల్ గుంతకల్లు డివిజన్ పరిధిలోని కాలువలకు సంబంధించిన రోడ్లు పాడైపోయాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. రోడ్లు సక్రమంగా లేక పోవడంతో డివిజన్‌లో పని చేసే ఇంజినీర్లు, సిబ్బంది కాలువను, ఆయకట్టును పర్యవేక్షించడానికి అక్కడికి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా కాలువల పర్యవేక్షణ దారితప్పింది. దీంతో నీటి సరఫరాను సక్రమంగా అమలు చేయక పోతుండటంతో ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు.

గుత్తి ఉపకాలువ రోడ్డూ అంతే

గుత్తి ఉపకాలువకు సంబంధించి గుంతకల్లు నుంచి గుంతకల్లు కొట్టాల వారు రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. వాహనాలు వెళ్లలేవు. ఇక గుత్తి బైపాస్ కాలువను ఏర్పాటు చేసి 20 ఏళ్లవుతున్నా ఇప్పటికీ కెనాల్ రోడ్డు నిర్మించలేదు. ఫలితంగా సిబ్బంది కాలువను పరిశీలించడానికి కాలువ మీదుగా వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. కాలువ నిర్మాణ సమయంలోనే రోడ్డు వేయాల్సింది.. అలా చేయకపోడంతో ఆయకట్టు పర్యవేక్షణ నామమాత్రంగా ఉంటోంది. గుంతకల్లు బ్రాంచ్ కాలువ, గుత్తి ఉపకాలువ కింద దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు ఉండటం గమనార్హం.

గుత్తి బైపాస్ కాలువకు రోడ్డు వేయని తీరు

నాలుగు మండలాల గుండా కాలువ

డివిజన్ పరిధిలోని గుంతకల్లు బ్రాంచ్ కాలువ పొడవు 58 కి.మీ.లు. ఈ కాలువ ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల గుండా వెళుతోంది. కాలువకు, రోడ్డుకు చెందిన నిర్మాణాలు చాలాచోట్ల నేలమట్టమయ్యాయి. కొన్ని చోట్ల వంతెనల రక్షణగోడలు కూలిపోయాయి. రోడ్డుమీదుగా వాహనాల్లో వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉంది. గుంతలకు మట్టి తోలినా ప్రయోజనం ఉండటం లేదు. వర్షాకాలంలో గుంతల్లోకి నీరు చేరుతోంది. బురద దారిలో వాహన రాకపోకలకు కష్టంగా ఉంటోంది. తాత్కాలిక మరమ్మతుల పేరుతో నిధులు వృథా చేస్తున్నారు.

ప్రణాళికలు తయారు చేస్తున్నాం

కాలువల పక్క దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించాం. అవసరమైన ప్రణాళిక తయారు చేస్తున్నాం. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. గుంతకల్లు బ్రాంచ్‌కాలువకు కొంత వరకు మరమ్మతులు చేశాం. ఇంకా పూర్తిస్థాయిలో పనులు చేయాల్సి ఉంది. దీంతో పాటు గుత్తి బైపాస్ కాలువకు ఆయకట్టు రోడ్డును నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- వెంకటరమణ, ఈఈ, గుంతకల్లు డివిజన్**

వక్క అక్రమ రవాణాపై డీలర్లకు తాఖీదులు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి ఈ-వేబిల్లు లేకుండా దిల్లీకి వక్కలను రవాణా చేస్తున్న మూడు లారీలను గుత్తి సమీపంలో నవంబరు 18న స్వాధీనం చేసుకుని, సదరు డీలర్లకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తాఖీదులు జారీ చేశారు. ఒక్కొక్క లారీకి రూ.20 లక్షలు ప్రకారం మూడు లారీలకు రూ.60 లక్షలు అపరాధ రుసుం కట్టాలని అధికారులు తాఖీదు జారీ చేశారు. అపరాధ రుసుం చెల్లించడానికి నిబంధనల ప్రకారం డీలరుకు 30 రోజులు గడువిచ్చి, ఆ తర్వాత అపరాధ రుసుం చెల్లించడానికి ముందుకు రాని పక్షంలో వక్కలు వేలం వేసి, ఆ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నారు.

ప్రైవేట్ బ్యాంకు వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంకు వద్ద కమ్మాన్‌చెట్ల వీధికి చెందిన శైలు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బ్యాంకులో బాధితురాలు కొంత బంగారు ఉంచిందన్నారు. అది దొంగ బంగారు కావడంతో కర్ణాటక పోలీసులు ఇటీవలే బ్యాంకు వచ్చి బంగారు పై అనుమానం ఉందని దానిని బ్యాంకర్లకు లేఖ ఇవ్వగా ఆ ఉద్యోగులు ఆ ఖాతాను హోల్డ్‌లో ఉంచారన్నారు. బంగారు తీసుకొచ్చేందుకు బ్యాంకు వద్దకు ఆమె వచ్చింది. పోలీసుల అనుమతి కావాలని అక్కడి అధికారులు చెప్పగా, తన బంగారు ఇవ్వడంలో ఎందుకు ఇలా చేస్తున్నారని ఆవేశానికి లోనైంది. బ్యాంకు వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు దీనిపై విచారణ చేపడుతున్నారు.

మనోవేదనతో రైతు బలవన్మరణం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నకోట్లకు చెందిన రైతు లక్ష్మీనారాయణ (72) ఆత్మహత్యకు యత్నించి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. లక్ష్మీనారాయణ కొన్నేళ్లుగా కిడ్నీ సమస్య, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మనోవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో 25న భార్య ఇంట్లో లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్యహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సుబ్బలక్ష్మమ్మ, ముగ్గురు కుమారులున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

నాలుగు ఎకరాల సీడ్ జొన్న పంట ధ్వంసం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని కల్లుదేవనహళ్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రిస్వామి, గిరిజమ్మ అనే రైతులకు సంబంధించిన సీడ్ జొన్న కంకిని కోత కోసి పొలంలో పడేసి తీవ్రంగా నష్టపరిచినట్లు బాధితులు తెలిపారు. తల్లి, కుమారుడు గ్రామంలో తమ ఎకరా భూమితో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని ప్రైవేట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని సీడ్ జొన్న పంట సాగు చేశారు. బుధవారం పొలంలో తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. అర్ధ రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఎకరాకు పైగా జొన్న కంకిని కోత కోసి కింద పడేసి సొప్పును ధ్వంసం చేశారు. రూ.లక్ష వరకు అప్పుచేసి పెట్టుబడి పెట్టామని, గిట్టని వారే ఈఘాతుకానికి ఒడిగట్టారని లబోదిబోమని వాపోయారు. తమకు అన్యాయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతిపై ఆందోళన

సీఐకి సంఘటన వివరాలు వివరిస్తున్న బాధిత బంధువులు

హిందూపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజుల కింద జన్మించిన శిశువు(మగ బిడ్డ) గురువారం మృతి చెందటంపై బాధిత బంధువులు రాత్రి ఆసుపత్రి వద్ద నిరసనకు దిగారు. పట్టణం మోడల్‌కాలనీకి చెందిన సందీప్ భార్య దివ్య మొదటి కాన్పునకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఈమెకు సాధారణ ప్రసవం కాకపోవటంతో వైద్యులు సిజేరియన్ చేశారు. ఈ సందర్భంగా తల్లీబిడ్డ ఇద్దరు సురక్షింతగా ఉండటంతో ఆసుపత్రిలోనే చికిత్సలు పొందుతున్నారు. గురువారం అకస్మాత్తుగా శిశువు మృతి చెందటంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. బిడ్డ పరిస్థితి బాగోలేదంటే తాము ఎక్కడికైనా తీసుకెళ్లి వైద్యం చేయించేవారమని, వైద్యులు ఆ విషయం ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఇప్పటికే రెండు మూడు సంఘటనల్లో తాము నష్టపోయామని ప్రాణాలు అంటే ఇంత చులకనా అని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకొన్న వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు ఆసుపత్రి వద్దకు చేరుకొని బాధిత బంధువులతో మాట్లాడారు. జరిగిన సంఘటన సీఐకి వివరించిన బంధువులు తమకు జరిగిన ఈ అన్యాయం ఇతరులకు జరగకుండా శిశువు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ తమకు ఫిర్యాదు అందిస్తే ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేస్తామని చెప్పటంతో బాధితులు నిరసన విరమించారు.

ప్రమాదవశాత్తు ఒకరు.. మందలించారని మరొకరు

పురంలో యువతీయువకుల మృతితో విషాదం

హిందూపురం,న్యూస్‌టుడే: హిందూపురం, పూలకుంటకు చెందిన యువతి, యువకులు గురువారం మృతిచెందటంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. పూలకుంటకు చెందిన హనుమంతు(19) గురువారం ఉదయం తన స్వగ్రామానికి వచ్చి తిరిగి బెంగళూరుకు వెళ్లే సమయంలో గ్రామీణ మండలం అప్పలకుంట వద్ద బస్సును దాటే సందర్భంగా పొగమంచు కారణంగా ప్రమాదానికి గురై తలకు బలమైన దెబ్బ తగలటంతో దుర్మరణం చెందాడు. ఇతడి తండ్రి అంజినప్ప బెంగళూరులో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తుండగా హనుమంతు టీవీ టవర్స్‌లో పనిచేస్తున్నాడు. ఇతని మృతి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సంఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య


భానుతేజ

టీవీ, చరవాణులను అధికంగా చూస్తోందని కుటుంబ సభ్యులు మందలించటంతో పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన భానుతేజ(18) గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు. భానుతేజ సేవామందిర్‌లోని ఎన్‌లైట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ బీబీఏ చదువుతున్నట్లు వివరించారు. విద్యార్థిని తండ్రి నరసింహులు ఉల్లిపాయల వ్యాపారం చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె ఇలా చనిపోవటంతో కుటుంబం విషాదానికి లోనైయింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రధాన కూడలిలో ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు, స్థానికులు

తలుపుల, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని నాలుగేళ్ల హర్షవర్ధన్‌ను హత్య చేసిన నిందితుడు ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు, స్థానికులు గురువారం రాత్రి తలుపుల ప్రధాన కూడలిలో వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంధువులపై ఏవైనా గొడవలుంటే వారితోనే చర్చించి తేల్చుకోవాలే తప్ప అమాయకులైన పిల్లల జోలికి వెళ్లడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితుడిని కఠినంగా దండించాలన్నారు. ర్యాలీలో సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, హసన్, సిద్ధయ్య, తలుపుల ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

హిందూపురం
•హిందూపురం •పెనుకొండ •మడకశిర

ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి వాహనం వితరణ

వాహన ప్రారంభోత్సవంలో ఎల్వీప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రశాంత్‌గార్గ్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి

మడకశిర గ్రామీణం: ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నీలకంఠాపురం శాంతజయపురం నేత్ర వైద్య కేంద్రానికి ఎన్.కె ఆర్‌ఎన్ ప్రసాద్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో రోగుల సౌకర్యం కోసం వాహనాన్ని గురువారం వితరణ చేశారు. కార్యక్రమానికి ఎల్వీప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రశాంత్‌గార్గ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి దంపతులు, ఆర్డీటీ సంస్థల డైరెక్టర్ మాంచో ఫెర్రర్, శాంతజయపురం తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర క్రీడలకు విద్యార్థిని ఎంపిక

రక్షితను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు వహీదాఖానం

హిందూపురం గ్రామీణం,న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర క్రీడా పోటీలకు ముద్దిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బి.రక్షిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.వహీదాఖానం, పీడీ బి.అరుణకుమారి తెలిపారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన అండర్-17 విభాగం రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థిని పాల్గొని ప్రతిభ కనబరచి అంతర్రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. సహకరించిన కరాటే మాస్టర్ నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కొంకల్లు ఎస్సీ కాలనీలో వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. -హనుమంతరాయప్ప.
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో తొలగిస్తాం. -కవిత సర్పంచి
సమస్య: గుడిబండ ఇందిరమ్మ కాలనీలో అంధకారంలో ఉంటున్నాం. -నాగరాజు.
సమాధానం: వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -కరుణాకర్‌గౌడు, సర్పంచి.
-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: పట్టణంలోని రహమత్‌పూర్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలోని కాలువలు శుభ్రం చేయడం లేదు. -సునీల్‌కుమార్
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. -శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.
-న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

సమస్య: కొటిపి బసవేశ్వరకాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేయడంలేదు. -లీలావతమ్మ
సమాధానం: రెండు రోజుల్లో కాలువలు శుభ్రం చేయిస్తాం. - శివకుమార్, ఈవోఆర్డీ
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య విన్నారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని సమస్యలను ప్రజలు "ఈనాడు"లో ప్రచురితమయ్యే 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పూలకుంట పంచాయతీలోని ఇందిరమ్మకాలనీలో సర్పంచి మంజునాథ్ స్పందించి అధికారులతో మాట్లాడి స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేయించి సౌకర్యం కల్పించారు.

సాధన చేద్దాం...ఫలితాలు సాధిద్దాం

ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

☛ 'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ☛ పాఠశాలల్లో అభ్యసన స్థాయి సమీక్షలు

హిందూపురం అర్బన్, పరిగి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. 'పది' పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ప్రతి ఒక్కరూ శ్రమిస్తుంటారు. వారికి ఉపాధ్యాయులు తోడ్పాటు నందిస్తారు. ఈ ఏడాది 'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. విభిన్నస్థాయిలో అన్ని పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థుల అభ్యసన స్థాయిపై సమీక్షలు చేపట్టారు.

వంద రోజుల కార్యాచరణ

'పది' విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గంలోని 38 ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8.30 నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 3.30 నుంచి 5.30 గంటల మధ్య అదనపు తరగతులు కొనసాగిస్తున్నారు. రోజుకో పాఠ్యాంశంపై తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ఎఫ్ఏ-1 పరీక్ష ఫలితాల ఆధారంగా విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. డిసెంబరు 1 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నారు.

మండలాల వారీ ఇలా...

మండలం	పరీక్షా కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య
లేపాక్షి	4	846
హిందూపురం	17	3200
చిలమత్తూరు	2	432
పరిగి	4	708

తల్లిదండ్రులకూ బాధ్యత

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలని విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు. పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడంలో వారిని భాగస్వాములను చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్ల వద్ద చదివించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇవీ...

- విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజన
- వెనుకబడిన వారిని సైతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయుల కృషి
- పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం
- వార్షిక పరీక్షల తరహాలో నమూనా పరీక్షలు నిర్వహించి వారిలో భయాన్ని పోగొట్టడం

దైవభక్తితోనే మోక్షం

గుడిబండ, న్యూస్‌టుడే: దైవభక్తితోనే మోక్షం లభిస్తుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. గుడిబండ మండలం మోరుబాగల్ కరియమ్మ నూతన ఆలయం మహా సంప్రోక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని విశేషపూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పురుషోత్తం, రాజేంద్ర, నాయకులు గిరిధర్, కాంతరాజు, ప్రసన్నకుమార్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని డి.రామగిరిలో వాల్మీకి విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవిలు ప్రతిష్ఠించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షుడు మోహన్, వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని ఫిర్యాదు

రొద్దం : బూచెర్లలో తన పేరుతో ఉన్న 10 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన వెంకటేశులు ఆక్రమించడానికి యత్నిస్తున్నాడని బాధితుడు పెద్దనాగప్ప గురువారం తహసీల్దార్ ఉదయశంకర్ రాజుకు ఫిర్యాదు చేశారు. ఎపీఎం నంబరులోని 39-5 సర్వే నంబరులో సబ్‌డివిజన్ చేసి..తన 10 సెంట్ల ఆస్తిని అతని పేరుతో మార్చుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశాడన్నారు. వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, తొలగించాలని ఆయన కోరారు. దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రైతుకు హామీ ఇచ్చారు.

వృద్ధురాలిపై దాడి.. హిందూపురం తరలింపు

గోరంట్ల: గుర్రివారిపల్లిలో రామక్క అనే వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇక్కడ ప్రథమ చికిత్స చేసి హిందూపురం పంపించారు. అయితే సంఘటన ఎలా జరిగిందన్న విషయంపై స్పష్టతలేదు. దాడి జరిగిన సమయంలో ఇంటిలో రామక్కతో పాటు కోడలు శాంతమ్మ ఉన్నట్లు తెలిపారు. శాంతమ్మ మెడలోని నల్లపూసల దండను తెంపినట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనంలో ప్రతిభ

పరిగి : ఇటీవల మాస్టర్ ఆర్ట్ ముంబయి వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం, చేతి రాత పోటీలలో ధనాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. గురువారం వారికి హెచ్‌ఎం జ్యోతిర్మయి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

పరిశ్రమ సహకారం.. విద్యార్థులకు సౌకర్యం

గుడిపల్లి పారిశ్రామిక వాడలోని కియా అనుబంధ పరిశ్రమ ఎస్ఎల్‌పీపీ ఆర్థిక సహకారంతో సోమందేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎట్టకేలకు భోజన సమస్య తీరింది. ఆడిటోరియంలో విద్యార్థులు భోజనం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఆయా పాఠశాలలో 950 మంది విద్యార్థులు ఉండగా.. 40 మంది వరకు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన నాడు-నేడు పనులు పూర్తి కాకపోవడంతో ఆవరణ అపరిశుభ్రంగా మారింది. వీటిమధ్య చెట్ల కింద మట్టిలో కూర్చొని మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులు కొన్నేళ్లుగా అష్ట కష్టాలు పడ్డారు. అయితే గత హెచ్‌ఎం, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు ఎస్ఎల్‌పీపీ యాజమాన్యం ముందుకొచ్చి తమ కంపెనీ సామాజిక బాధ్యత కింద రూ.లక్షల నిధులతో పాఠశాల ఆవరణలో ఆడిటోరియం నిర్మించింది. రెండు వేల మందికి పైగా కూర్చొనేందుకు వీలుగా అన్ని సౌకర్యాలతో కూడిన భారీ స్థాయి ఆడిటోరియం నిర్మించి, విద్యార్థుల ఉపయోగార్థం ఉపాధ్యాయులకు అప్పగించింది. ప్రస్తుతం విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా అందులో భోజనాలు చేస్తున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌పీపీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. -న్యూస్‌టుడే, సోమందేపల్లి.

ఆడిటోరియంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

ఉత్తీర్ణత సాధిస్తే నాలుగేళ్లు ఉపకార వేతనం

పెనుకొండ, న్యూస్‌టుడే: ఎనిమిదో తరగతి విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి (ఎన్‌ఎంఎంఎస్) నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే నాలుగేళ్లపాటు ఏటా రూ.12 వేల ఉపకార వేతనం అందుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నబీ పేర్కొన్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుచేసుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇద్దరికి కలిపి ఓ స్టడీమెటీరియల్ పుస్తకం అందజేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు.

అధ్యక్షా.. నాకో అవకాశం

● మాక్ అసెంబ్లీలో డ్రగ్స్ నివారణ చర్చలో మేఘన

లేపాక్షి, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా బుధవారం అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. అందులో మండలం పులమతి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మేఘన ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పాల్గొని ఆదరగొట్టింది.

మేఘన ఏమన్నారంటే...

డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తనకు మాట్లాడే అవకాశం దక్కింది. గత వైకాపా ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ వాడకం విచ్చలవిడిగా ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటి నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోంది. ముఖ్యంగా అసాంఘిక శక్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడికక్కడ కేసులు నమోదు చేయడమే గాక సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడం ఎంతో హర్షణీయం. గైడ్ టీచర్ అనిత ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందని దీనివల్ల బిల్లులు ప్రవేశ పెట్టడం, ఆమోదించడం, తదితర విషయాలన్నీ తెలుసుకున్నట్లు మేఘన పేర్కొంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ముచ్చటించడం, భోజనం తినడం, ఫొటోలు దిగడం మర్చిపోలేను.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మేఘన

చరవాణిని పరిమితంగా వినియోగించాలి

ఎల్ఆర్‌జీ విద్యాలయంలో విజేతలతో ప్రధానోపాధ్యాయులు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం సమీపంలోని ఎల్ఆర్‌జీ విద్యాలయంలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్‌ల ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 10వ తరగతి చదువుతున్న పి.గగనప్రియ ప్రథమ, 9వ తరగతి చదువుతున్న ఎన్‌కే శ్రీనిత్య ద్వితీయ, 10వ తరగతికి చెందిన జి.దీక్షిత తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి విద్యాలయం ప్రధానోపాధ్యాయులు బి.సుధ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

మడకశిర : పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో టి.అక్షయ ప్రథమ, ఎం.జోహా ద్వితీయ, ఎన్.మనోహర్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు

సాయి చూపిన మార్గంలో పయనించండి

సాయిగీతాలపై నృత్యం చేస్తున్న చిన్నారులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రతి సాయి భక్తుడు సత్యసాయి చూపిన మార్గంలో పయనిస్తే ఇతరుల పట్ల ఏవిధంగా నడుచుకోవాలో అర్థమవ్వడమేగాక, సన్మార్గంలో నడిచి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని సత్యసేవా సమితి కన్వీనర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సత్యసాయి శతజయంతిని పురస్కరించుకుని ఆరో రోజు గురువారం రాత్రి పట్టణంలోని పాండురంగనగర్‌లో ఉన్న సత్యసాయిసేవాసమితిలో మహిళలు వేదపారాయణం, నామసంకీర్తనలు ఆలపించారు. బృంగి నృత్య కళానిలయం శిక్షకురాలు సుప్రియా వారి శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

అచలేశ్వరుడికి కుంభాభిషేక మహోత్సవం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతనతో ముందుకెళితే అనుకున్న విజయం సునాయాసంగా సిద్ధిస్తుందని, దక్షిణామూర్తి విశ్వరూపంగా మారిన అచలేశ్వరుడి ఆలయం మొదటిగా 'పురం'లో ప్రతిష్ఠించడం సంతోషదాయకమని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న అచలేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా గురువారం ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, కలశ స్థాపన చేశారు. ఆలయ నిర్వాహకులు గురురాజ, సత్యనారాయణ, వడియప్పన్, అభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్, ఆలయ నిర్వాహకులు

విద్య, క్రీడలపై ఆసక్తి కనబర్చాలి

హిందూపురం సాంస్కృతికం: ప్రతి విద్యార్థి విద్యకు ఎంత ప్రాముఖ్యత ఇస్తారో అంతే క్రీడలకూ ఇవ్వాలని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న జ్ఞానజ్యోతి కిడ్స్‌కార్నర్‌లో గురువారం క్రీడల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 'పురం' డీఎస్పీ మహేశ్‌కుమార్, ఎంఈఓ ప్రసన్నలక్ష్మీలు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్న తనం నుంచే సంస్కృతి, సంప్రదాయాలపై తెలియజేస్తే వారు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదుగుతారన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. పాఠశాల ఛైర్మన్ బాలకృష్ణ, ప్రిన్సిపల్ సత్యకుమార్, కరస్పాండెంట్ కావ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప, చిత్రంలో డీఎస్పీ మహేశ్‌కుమార్

అర్హులందరికీ ఇల్లు, స్థలం మంజూరు చేయండి

పెనుకొండ, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు హరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాంధీ కూడలిలో పార్టీ శ్రేణులతో కలిసి కరపత్రాలను ప్రదర్శించారు. పేదవాడి సొంతింటి కోసం ఈ నెల 29న పెనుకొండలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై దాడులు

ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొంటున్న మున్సిపల్ సిబ్బంది

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థంగా అమలు చేయడానికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చర్యలు చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లను టోకుగా విక్రయించే దుకాణాలపై మున్సిపల్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ధనలక్ష్మి రోడ్, వి.డి.రోడ్ తదితర ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 54 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని రూ.10 వేల జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ పర్యావరణానికి తీవ్రమైన హాని చేయడమే కాక, క్యాన్సర్‌కు కారణమవుతోందని, వినియోగించడం మానుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

నేటి నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీ

అగళి : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ, పంచాయతీరాజ్ పనులకు శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.10.30 కోట్ల పనులకు సంబంధించి తనిఖీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

బీటీ రోడ్డుగా మార్చండి

టికేపల్లి, గుణేమోరుబాగల్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. చెరువుకు ఆనుకుని ఉన్న ఈ రోడ్డు వర్షం వస్తే చాలు గుంతలు ఏర్పడి నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో నాగరాజునాయక్ మాట్లాడుతూ బీటీ రోడ్డుగా మార్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

దుర్గంధం.. భరించలేకున్నాం

మండలంలోని బీ.జీ.హళ్లి గ్రామం దళిత కాలనీలో మురుగు కాలువలు వ్యర్థ పదార్థాలతో నిండి వృథా నీరు ముందుకు కదలడం లేదు. కాలువలు దుర్గంధం వెదజల్లుతూ దోమలు విపరీతంగా పెరిగాయి. దీంతో రోగాలు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ విషయంపై ఈవో ఆర్డీ సుధాకర్ మాట్లాడుతూ పరిశీలించి కాలువలను శుభ్రం చేయిస్తామన్నారు.
-న్యూస్‌టుడే, రొళ్ల

'నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేపడతాం'

గోరంట్ల, న్యూస్‌టుడే: గిరిజన ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు చేపడతామని గిరిజన ప్రజా సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జుననాయక్ పేర్కొన్నారు. గోరంట్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన నేపథ్యంలో జీవీఎస్ నాయకులు గురువారం పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. పరిసరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రసాద్‌నాయక్, గోపాల్‌నాయక్, శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు రూ.2 లక్షల విరాళం

చెక్కు అందజేస్తున్న బూదిలి సోదరులు

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక హిందూపురం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న స్థలంలో చేపట్టిన యోగివేమన విగ్రహ ఏర్పాటుకు బూదిలి గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, గోరంట్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి సోదరులు రూ.2 లక్షల విరాళం అందజేశారు. వారి తల్లిదండ్రులు లక్ష్మీనారాయణమ్మ, నారాయణరెడ్డి, సోదరులు చంద్రమోహన్‌రెడ్డి, విజయసింహారెడ్డిల జ్ఞాపకార్థం చెక్కు రూపంలో రెడ్డిసంఘం నాయకులకు అందజేశారు. అలాగే ఈవిగ్రహ ఏర్పాటు కోసం గురువారం పెద్ద ఎత్తున విరాళాలను దాతలు అందజేసినట్లు నాయకులు పేర్కొన్నారు. రూ.ఏడులక్షలకు పైగా ఒకేరోజు విరాళాల రూపంలో అందడంతో హర్షం వ్యక్తం చేశారు.

కరవు రైతులకు ఊరట

ఓ వైపు పెట్టుబడి సాయం.. మరోవైపు పంట నష్టపరిహారం

రైతు ఎండబెట్టిన వేరుసెనగ తీగ

మడకశిర, న్యూస్‌టుడే : కరవుతో సతమతమవుతున్న రైతులకు ప్రభుత్వం కరవు మండలాలుగా ప్రకటించడంతో ఊరట లభించింది. ముఖ్యంగా ఖరీఫ్‌లో వేరుసెనగ, కంది, మొక్కజొన్న, పత్తి, రాగి పంటలు చేతికందక రైతులు నష్టపోయారు. గతంలో కరవు బృందం పర్యటించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు మండలాలను గుర్తించింది. ఇందులో పెనుకొండ డివిజన్ పరిధిలో అగళి, హిందూపురం, మడకశిర, రొళ్ల మండలాలు తీవ్ర కరవుగా, అమరాపురం, గుడిబండ, లేపాక్షి, సోమందేపల్లి మండలాలు మధ్యస్థంగా గుర్తించారు. దీంతో దాదాపు 99వేల మంది రైతులకు పంట నష్టపరిహారం అందనుంది.

నష్టాల్లో రైతన్న..

రైతులు గత పదేళ్లుగా వేరుసెనగ సాగులో అతివృష్టి లేదా అనావృష్టి, వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయారు. ప్రతి ఏటా పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక అప్పుల పాలవుతున్నారు. జిల్లాలోనే మారుమూలన ఉన్న మడకశిర ప్రాంతంలో వెయ్యి అడుగులు తవ్వినా నీరు లభ్యం కాకపోవడంతో అత్యధికంగా రైతులు వర్షాధార పంటల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. పంటలు పండక సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయింది.

దిగుబడి అంతంత మాత్రమే..

పెనుకొండ డివిజన్ పరిధిలో అత్యధికంగా మడకశిర నియోజకవర్గంలోనే వేరుసెనగ సాగు చేస్తారు. ఖరీఫ్ ప్రారంభంలో రైతులు వేరుసెనగ, కంది పంట సాగు చేద్దామని దాదాపు 23,973 హెక్టార్లలో నేలను చదును చేసుకుని సిద్ధంగా ఉంచుకున్నారు. అయితే వర్షాలు సమయానికి పడక పోవడంతో 11,480 హెక్టార్లలో వేరుసెనగ సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.10వేల నుంచి రూ.15వేలు పెట్టుబడి పెట్టారు. పూత, ఊడలు దిగే సమయంలో సకాలంలో వర్షాలు పడలేదు. ఎకరాకు 10 బస్తాల కాయలు దిగుబడి రావాల్సి ఉండగా కనీసం 4 బస్తాలు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట	పరిహారం (హెక్టారుకు రూ.)
వేరుసెనగ, పత్తి :	17,000
కంది :	10,000
మొక్కజొన్న	12,500
రాగి, జొన్న :	8,500

ప్రభుత్వ సాయం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర సాయంతో కలిపి ఇప్పటికే అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.14వేలు అందించి ఆదుకుంది. మరో వైపు కరవు మండలాల రైతులకు పెట్టుబడి సాయంతో పాటు పంట నష్ట పరిహారం కూడా అందుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాక్‌అసెంబ్లీ మరిచిపోని అనుభూతి

విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఎస్ రాయాపురం (గుడిబండ), న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో ఏర్పాటు చేసిన మాక్ అసెంబ్లీ మరిచిపోని అనుభూతి అని గుడిబండ మండలం ఎస్.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పి.సంధ్య అన్నారు. ఈమె మడకశిర నియోజకవర్గం శాసనసభ్యురాలిగా బుధవారం అమరావతిలో నిర్వహించిన మాదిరి అసెంబ్లీలో పాల్గొంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని మాక్ అసెంబ్లీ అనుభవాలను విద్యార్థులకు వివరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు పాండురంగప్ప, మంజులమ్మ, కల్పనరాణి, శ్రీనివాసులు, అరుణ, వేణుగోపాల్, నరసింహమూర్తి, పుష్పావతి, గ్రామ పెద్దలు విద్యార్థినిని అభినందించారు.

విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

లేపాక్షి : జాతీయ విపత్తుల నిర్వహణా సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జ్యోతిబాఫులె బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సహజ విపత్తులు, మానవ నిర్మిత విపత్తులపై ఇన్‌స్పెక్టర్ శాంతిలాల్, హెడ్ కానిస్టేబుల్ పాటిల్, రామకృష్ణలు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు, దట్టమైన పొగలు అల్లుకున్నప్పుడు ఎలా ప్రాణాపాయ స్థితి నుంచి సురక్షితంగా తప్పించుకోవాలో తెలిపారు. ప్రిన్సిపల్ సుందర్‌రాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ చందన తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

చిలమత్తూరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు గురువారం చిలమత్తూరులో తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అంజినప్ప, శ్రీదేవి, విజయలక్ష్మి, వెంకటేశు, ఆదినారాయణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

బాల్య వివాహ రహిత సమాజమే ధ్యేయం

ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు, సంస్థ సభ్యులు

కృషి కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: 2030 సంవత్సరానికి బాల్య వివాహ రహిత సమాజంగా మార్చడానికి తమ సంస్థ కృషి చేస్తోందని సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు అన్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా జస్ట్ రైట్ సంస్థ సహకారంతో సమత సంస్థ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను, చట్టపర శిక్షలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

వ్యాస రచన పోటీల్లో ప్రతిభ

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ధర్మవరం పట్టణం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపారు. గురువారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ సత్యసాయి శతజయంతి ఉత్సవాలు పురస్కరించుకుని ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు జరిగాయన్నారు. డిగ్రీ స్థాయిలో ట్రస్టు 'నన్ను నేను మార్చుకుంటే ప్రపంచం మారుతుంది' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించిందన్నారు. తమ బీఏ మొదటి ఏడాది విద్యార్థిని నీరజ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆంగ్ల విభాగంలో ద్వితీయ, తృతీయ బహుమతులను భానుప్రకాష్, దూద్‌పీర్ గెలుచుకున్నట్లు చెప్పారు. తెలుగు మాధ్యమంలో అలేఖ్య మొదటి స్థానంలో నిలిచిందన్నారు. విజేతలను అధ్యాపక బృందం అభినందించింది.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: కదిరి బ్రాహ్మణపల్లి పంచాయతీ కుమ్మరవాండ్లపల్లిలో కుళాయికి బిరడా బిగించకపోవడంతో నీరు వృథాగా పోతోంది.
- చిన్నా, గ్రామస్థుడు

సమస్య: కదిరి బ్రాహ్మణపల్లి ప్రధాన వీధిలోని రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
-బాబ్‌జాన్, గ్రామస్థుడు

సమాధానం: కుమ్మరవాండ్లపల్లిలోని కుళాయికి బిరడా బిగిస్తాం. ప్రధాన వీధుల్లోని రహదాలపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **-ఆనంద్, పంచాయతీ కార్యదర్శి**

-న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

విద్యాలయాలా... శౌచాలయాలా?

● ఎక్కడపడితే అక్కడ మూత్రవిసర్జన ● పట్టించుకోని పురపాలిక యంత్రాంగం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఇలా...

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ పురపాలిక పరిధిలోని విద్యాలయాల వద్ద నెలకొన్న అపరిశుభ్రతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల ప్రహరీల వద్ద ఇష్టానుసారంగా మూత్రవిర్జన చేస్తుండడంతో ఈ దుస్థితి నెలకొంది. బడి లోపలకు వెళ్లేటప్పుడు భరించలేని దుర్వాసన వస్తోందని, పగటిపూట కుట్టే దోమలతో పిల్లలు జబ్బుల బారినపడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. చాలా పాఠశాలల సమీపంలోనే డ్రైనేజీ కాలువలు, చెత్త నిల్వల కేంద్రాలు ఉన్నాయి. వాటిని సకాలంలో శుభ్రం చేయకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. దుర్వాసన భరించలేక చాలామంది విద్యార్థులు మధ్యాహ్నం పూట భోజనాలకు ఇళ్లకు వెళుతున్నారు. మరోవైపు ఉదయం నుంచి సాయంత్రం వరకు దుర్వాసన భరిస్తూ పాఠాలు బోధించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఓవైపు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరిట పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నా, ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల వద్దా చేపట్టాలని కోరుతున్నారు.

ఎక్కడెక్కడ అపరిశుభ్రత అంటే...

● పట్టణంలోని ఫ్రూట్ మార్కెట్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్దే మూత్రవిసర్జన చేస్తున్నారు. ఆ వాసన తరగతుల గదులకు చేరుతోంది. గోడ వద్ద మూత్రవిసర్జన చేయరాదంటూ ఉపాధ్యాయులు కంచె వేసినా కొందరు తొలగించారు.

● 1వ వార్డు గూడ్స్‌షెడ్డు కొట్టాలు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ఆనుకునే పెద్ద మురుగుకాలువ ఉంది. అక్కడికి రోజూ పందులు వస్తుంటాయి. పలుమార్లు పాఠశాలల్లోకి చొరబడుతున్నాయి. కాలువను శుభ్రం చేయాలని పలుమార్లు కోరినా పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదు.

● శాంతినగర్ ఉన్నత పాఠశాల ఆవరణలో పురపాలక తాగునీటి ట్యాంకు ఉంది. దీని చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా మారింది. మద్యం ప్రియులు అక్కడే సేదతీరుతూ మలమూత్ర విసర్జన చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

గట్టి చర్యలు తీసుకుంటాం

పట్టణంలోని పలు పురపాలిక పాఠశాలల వద్ద నెలకొన్న అపరిశుభ్రతపై ఫిర్యాదులు వచ్చాయి. ఆయా పాఠశాలలకు వెళ్లి పరిస్థితిని పరిశీలిస్తాం. పురపాలక శాఖాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాం.

-గోపాల్‌నాయక్, ఎంఈఓ

జాతీయస్థాయి రంగోత్సవ్‌లో సత్తా

విజేతలతో ఉపాధ్యాయ బృందం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పుట్టపర్తిలోని చిన్నంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి రంగోత్సవ్ పోటీల్లో అద్భుత ప్రతిభచూపి గెలుపొందారు. పుట్టపర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రాఫ్ట్, ఆర్ట్ ఉపాధ్యాయుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో సెప్టెంబరులో రంగోత్సవ్ (జాతీయ చిత్రకళా పోటీలు) జరిగింది. 1 నుండి 10వ తరగతి చదివే 106 మంది విద్యార్థులు చిత్రలేఖనం, హ్యాండ్‌రైటింగ్, టాటూ డిజైనింగ్ పోటీల్లో పాలుపంచుకున్నారు. గురువారం ఫలితాలు వెల్లడయ్యాయి. 50 మంది విద్యార్థులు 25 స్వర్ణ, 13 రజత, 12 కాంస్య పతకాలు సాధించారు. పదో తరగతి విద్యార్థులు జి.వైష్ణవి చిత్రలేఖనంలో జాతీయ స్థాయిలో 4వ స్థానంలో నిలిచి క్యామెల్ కలరింగ్ కిట్, మహమ్మద్ అలీ ఆర్ట్ మెరిట్ పత్రం, 9వ తరగతి విద్యార్థి కన్సోలేషన్ బహుమతులు పొందారు. చంద్రమోహన్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణకు లీడర్‌షిప్ ఎడ్యుకేషన్ అవార్డు, పాఠశాలకు ఇండియాస్ యాక్టివిటీస్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయి.

భూసమస్యలు వేగంగా పరిష్కరించండి

ముదిగుబ్బ: ఇరు వర్గాలతో మాట్లాడి భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆర్డీఓ మహేష్ సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి గురువారం ముదిగుబ్బలో పర్యటించారు. ఈ సందర్భంగా కస్తూర్బా కాలనీ, తిమ్మనేని పాళ్యం వెళ్లి అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నారాయణస్వామి, సిబ్బంది ఉన్నారు.

పలు కోర్సులకు ఉచిత శిక్షణ

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మీడియా అనలిస్టు కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ స్మిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థులకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు చరవాణి సంఖ్య 93901 76421ను సంప్రదించాలన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి యత్నం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 15వ వార్డులోని గీతానగర్‌లో గురువారం పన్నుల వసూలకు వెళ్లిన మంజునాథ్ అనే సచివాలయ ఉద్యోగిపై, అదే కాలనీలో ఉంటున్న సత్యమయ్య కుటుంబం దాడికి యత్నించింది. ఉద్యోగులు ఆటోలో తిరుగుతూ సత్యమయ్య ఇంటి వద్దకు రాగానే, అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించాలని, ఇంటి పన్ను కట్టాలని మంజునాథ్ వారిని అడిగారు. దీనిపై ఇరువురికి మాటామాటా పెరిగి కొట్టుకునే వరకు వెళ్లారు. స్థానికులు గమనించి వారించారు.

వీఆర్వోలకు తాఖీదుల జారీకి సిఫార్సు

కరపత్రాలందుకున్న రైతులతో ఎంపీడీవో, అధికారులు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇంటింటా చేపడుతున్న 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో మండలంలోని గ్రేడ్-1 వీఆర్వోలు పాల్గొనడం లేదని, వారికి తాఖీదులు జారీ చేయాలంటూ తహసీల్దార్ మురళీకృష్ణకు ఎంపీడీవో పోలప్ప సిఫార్సు చేశారు. గురువారం మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ మిద్దివారిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అక్కడి నుంచి ఆయన కుమ్మరవాండ్లపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని తనిఖీ చేశారు. ఆధార్ నవీకరణ, ఇతర సేవలకు ప్రభుత్వ నిబంధనల మేరకే రుసుం తీసుకోవాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏజీపీగా ఎంపీ సుబ్బరావు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం సీనియర్, జూనియర్ డివిజన్ కోర్టులకు ఏజీపీ(ప్రభుత్వ సహాయ న్యాయవాది)గా సీనియర్ న్యాయవాది ఎంపీ సుబ్బరావు నియమితులయ్యారు. ఈమేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి జారీ చేసిన నియామకపు ఉత్తర్వులను గురువారం సుబ్బరావు అందుకున్నారు. 27 ఏళ్లుగా ధర్మవరం కోర్టులో న్యాయవాదిగా ఆయన సివిల్, క్రిమినల్ కేసులు వాదిస్తున్నారు. బార్ సంఘం అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఏజీపీగా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించడం ప్రశంసనీయమని, విద్యార్థి దశలోనే వారు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్ అన్నారు. ఆయన గురువారం తన కార్యాలయంలో విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో మాక్ పార్లమెంట్ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధుల అవతారమెత్తి 21వ శతాబ్దంలో భారతదేశపు పాత్ర, ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రాథమిక హక్కులు, లింగభేదం, సమానత్వం తదితర అంశాలపై చర్చించారు. ఇందులో చక్కటి ప్రతిభ చూపిన ఎంజేపీ (రేగాటిపల్లి), కేజీబీవీ (మోటుమర్ల), జడ్పీ ఉన్నత (చిగిచెర్ల) పాఠశాలల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు అధికారులు బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖాధికారులు గోపాల్‌నాయక్, రాజేశ్వరి దేవి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పరిశ్రమలపై అవగాహన తప్పనిసరి

వేదికపై మాట్లాడుతున్న డీవీఎస్ఆర్ మూర్తి

కదిరి, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే పారిశ్రామిక అవగాహన కలిగి ఉండాలని ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకుడు డీవీఎస్ఆర్ మూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో 'పరిశ్రమల ఏర్పాటు-స్వయంఉపాధి'పై అవగాహన సదస్సు జరిగింది. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు పూర్తయిన తర్వాత సొంతంగా పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదగాలన్నారు. ఇందుకు ఎంఎస్ఎంఈ సహకారం ఇస్తుందని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి ఓబులేసు, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీరమారుతి మాట్లాడారు. ఎంచుకున్న పరిశ్రమల ఏర్పాటుకు డీఐసీని సంప్రదించాలన్నారు. పీఎం ఈజీపీ ద్వారా రాయితీ రుణాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్మిత, అధ్యాపకులు శ్రీనివాసరావు, హైదర్‌వలి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు నీరజ, నారాయణ, రెడ్డెప్ప, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బురద దారిపై రాకపోకలు ఎలా?

కదిరి పట్టణ పరిధి పిల్లవంకకాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో స్థానికులు రాకపోకలు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వానొచ్చినా మట్టి రోడ్డు బురదమయంగా మారుతుందని, అడుగు తీసి అడుగు వేయడం గగనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు వాహనచోదకులు అదుపుతప్పి కిందపడి గాయాల బారిన పడుతున్నారు. దీనిపై పురపాలిక ఏఈ సందీప్ దృష్టికి తేగా, వచ్చే నెల 9వ తేదీ నుంచి పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేయడానికి టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు.
-న్యూస్‌టుడే, కదిరి పట్టణం

మొక్కలు నాటారు.. నీరు మరిచారు

పట్టణంలోని చిత్రావతి నది కాజ్‌వే నుంచి దుర్గాదేవి ఆలయం వరకు నది ఒడ్డున వివిధ రంగుల పూల మొక్కలు నాటారు. రెండు రోజులు నీరుపోసి వదిలేశారు. అవన్నీ ఎండిపోతున్నాయి. ఈ మార్గంలోనే జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కరికీ ఎండుతున్న మొక్కలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై పురపాలిక కమిషనర్ క్రాంతికుమార్ దృష్టికి తేగా మొక్కలకు నీరందించి సంరక్షిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, పుట్టపర్తి

తాగునీటి వృథా పట్టదా...

తలుపుల పంచాయతీ పీతిరికుంటలోని నీటిపథకం బోరు లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. ఈ పథకం నుంచి ఎగువపేటకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. బోరు వద్ద జాయింట్ పైపులను సక్రమంగా బిగించలేదు. లీకేజీపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కొన్ని కాలనీలకు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి తాగునీటి వృథా అరికట్టాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, తలుపుల

దారి చూపాలంటూ వినతి

తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలంలోని కటారుపల్లి పంచాయతీ మద్దన్నగారిపల్లి నుంచి కస్తూర్బా పాఠశాల సమీపం కటారుపల్లికి దారి చూపాలంటూ మద్దన్నగారిపల్లి, గజ్జలవారిపల్లి గ్రామస్థులు తహసీల్దార్ బాబురావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం నుంచి కదిరి-మద్దన్నగారిపల్లి మీదుగా కటారుపల్లి వరకు మినహాయింపు దారి ఉండేదన్నారు. కాలక్రమంలో కదిరి-రాయచోటి ప్రధాన రహదారిగా ఏర్పడటంతో ఈ దారి మూసుకుపోవడంతో ఆక్రమణకు గురవుతోందన్నారు. వెంటనే సర్వే చేయించి దారికి హద్దులు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ దారిని పునరుద్ధరిస్తే ద్వారనాల, మద్దన్నగారిపల్లి, జురుకువారిపల్లి తదితర గ్రామస్థులు కటారుపల్లికి వెళ్లేందుకు సౌకర్యం సమకూరుతుందన్నారు. స్పందించిన తహసీల్దార్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండలంలోని రాఘంపల్లిలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశువుల ఎదుగుల, ఏడాదికో దూడ అమలు నమూనాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ, ఏపీఎల్‌డీఏ వెంకటేశు, ఏడీ పద్మజా తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ఇసుక వాహనాలు సీజ్

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండల పరిధి కొడవండ్లపల్లి మద్దిలేరు వాగును గురువారం ఆర్డీఓ మహేష్ ముదిగుబ్బ పర్యటనలో భాగంగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఇసుక తరలిస్తున్న వాహనాలను పరిశీలించారు. మూడు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లకు అనుమతి లేదని గుర్తించారు. వాటిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించి సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేయించి కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు.

బత్తినపల్లిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

బాధితుడితో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

కొండకమర్ల (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: కొండకమర్ల పంచాయతీ బత్తినపల్లిలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన బాధితులను జిల్లా వైద్యాధికారిణి ఫైరోజాబేగం పరామర్శించారు. ఆమె గురువారం బత్తినపల్లిలో పర్యటించి ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పాల్గొని మాట్లాడారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, మంచి ఆహారం తీసుకోవాలన్నారు. నీళ్ల విరేచనాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులకు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అస్వస్థతకు గురైన బాధితుల ఇళ్లకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్, డీపీఎంఓ నాగేంద్ర నాయక్, వైద్యాధికారులు భానుప్రకాష్, కమల్‌రోహిత్, సీహెచ్‌ఓ ప్రమీలమ్మ తదితరులున్నారు.

సిద్ధరాంపురంలో ఇంటర్ మోరల్ గేమ్స్

సాధించిన కప్‌తో విద్యార్థులు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని సిద్ధరాంపురం ఉన్నత పాఠశాలలో గురువారం ఇంటర్ మోరల్ గేమ్స్ నిర్వహించారు. పూర్వ విద్యార్థులతో సహకారంతో జరిగిన ఈ గేమ్స్ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీస్తుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, పీఈటీ రజనీకాంత్ తెలిపారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. బాలికల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సావిత్రిబాయి పులె జట్టు కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో సర్దార్ పటేల్ జట్టు విజేతగా నిలిచింది. ఆయా విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ చెన్నుడు, వైస్‌ఛైర్మన్ నరసింహుడు, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పుట్టపర్తి: అయ్యప్పకు హారతి ఇస్తున్న మాలధారులు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని మరువపల్లిలో గురువారం అయప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో అయప్ప మూలవిరాట్‌కు విశేష పూజలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పల్లకీలో స్వామిని ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో మాలధారులు స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

పుట్టపర్తి, న్యూస్‌టుడే: అయ్యప్ప శరణుఘోషతో పురవీధులు మార్మోగాయి. హనుమాన్ ఆలయంలో కన్నెపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. గురుస్వామి పుట్టన్న ఆధ్వర్యంలో పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కన్నెస్వాములు పూజలో పాల్గొన్నారు.

బెదిరింపులపై మేడాపురం సర్పంచి ఫిర్యాదు

ధర్మవరం, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు గ్రామ పంచాయితీ పనులు చేయవద్దని బెదిరిస్తున్నారంటూ గురువారం మేడాపురం సర్పంచి రామాంజినేయులు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గాలిమిషన్ నరసింహులు, వెంకటేష్, పసల జగదీష్, డీలర్ కిష్టయ్య, పసల వెంకీ తనను కులం పేరుతో దూషిస్తున్నారని, గ్రామ సచివాలయంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను బెదిరించడమే కాకుండా కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీఎస్పీని సర్పంచి కోరారు.

వృద్ధాశ్రమానికి దుప్పట్ల వితరణ

అమడగూరు మండలం గాజులపల్లి సమీపంలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి గురువారం ఓడీసీ శ్రీవిజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత మస్తాన్ భార్య షమీఉన్నీసా నిత్యావసర సరకులు, దుప్పట్లు, దుస్తులు, పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పెద్దలను ఎలా గౌరవించాలి, ఆపదలో ఉన్న వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించాలో తెలియజేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ లావణ్య, ఉపాధ్యాయులు చంద్రమోహన్, అరుణ, వృద్ధాశ్రమ నిర్వహకురాలు అరుణజ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, అమడగూరు (ఓబుళదేవరచెరువు)**

చెరువుకట్టకు మరమ్మతులేవీ

అక్కమ్మకొండ దగ్గర దెబ్బతిన్న కట్టరాళ్లు

అక్కమ్మగారి కొండ దగ్గర దెబ్బతిన్న రాతికట్టడం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: బుక్కపట్నం చెరువు కట్ట రాతికట్టడం దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారిందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన ఈ చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.92 టీఎంసీలు. నాలుగైదు శతాబ్దాలుగా చిత్రావతి ప్రవాహంతో పూడిక పేరుకుని సామర్థ్యం 0.62 టీఎంసీలకు తగ్గింది. సాగు విస్తీర్ణం ప్రత్యక్షంగా 3,275 ఎకరాలు, పరోక్షంగా 3వేల ఎకరాలు ఉంది. దశాబ్దం క్రితం చెరువు మరమ్మతులు చేపట్టారు. అప్పట్లో కట్ట పటిష్ఠత, సాగునీటి పంపిణీ వ్యవస్థ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొత్తచెరువు నుంచి బుక్కపట్నం వెళ్లే చెరువుకట్ట మార్గంలో అక్కమ్మగారి కొండ వద్దనున్న కట్ట నిర్మాణంలో రాళ్లు చెదిరిపోయాయి. చెట్ల వేర్లు లోపలికి చొచ్చుకుపోవడంతో తూము దగ్గర కట్టరాళ్లు ముందుకు చొచ్చుకు వచ్చాయని, ఎప్పుడు కూలుతాయో తెలియడం లేదని కర్షకులు భయాందోళన చెందుతున్నారు.

మరువ పారుతున్న చెరువు

ప్రస్తుతం చిత్రావతి నది ప్రవాహానికి తోడు కృష్ణా జలాలను వదలడంతో చెరువు నిండి మరువ పారుతోంది. కట్టరాళ్లు చెదిరిన చోట నీటి అలలతో కట్ట మట్టి కోతకు గురవుతోందని రైతులు చెబుతున్నారు. మరోవైపు సాగునీటి ప్రధాన గట్ల పటిష్ఠ పనులు తూముల నుంచి కాకుండా ఆయకట్టు చివరలో సిమెంటు నిర్మాణాలు చేపట్టారు. దీనివల్ల సాగు నీరు ముందుకు సాగక మధ్యలోనే వృథా అవుతోంది. ప్రధాన తూముల దగ్గర పంపిణీ వ్యవస్థ ఆయా సాగునీటి కాలువల ఆయకట్టు విస్తీర్ణం మేరకు చేపట్టకపోవడంతో సాగునీరు వంకల పాలవుతోందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ జమునాబాయిని వివరణ కోరగా, దెబ్బతిన్న రాతికట్టడాన్ని పరిశీలిస్తామన్నారు. చెరువు పరిధిలో మరమ్మతుల కోసం గతంలో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య: ఐదుగురి అరెస్టు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మహిళ ఆత్మహత్యకు కారణమైన ఐదుగురిని బత్తలపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని ఉప్పర్లపల్లిలో 16న పూరే ప్రమీల అనే మహిళపై ఐదుగురు దాడిచేసి గాయపరిచారు. అవమానంగా భావించిన ఆమె ఇంట్లో ఉరేసుకొని చనిపోయింది. దీనికి కారణమైన నెట్టికంటి కోడలు హేమావతి, ఆమె తల్లి రామాంజనమ్మ, సూరప్ప, ఉప్పర్లపల్లికి చెందిన సుంకన్న, ఆదిలక్ష్మిని అరెస్టు చేసినట్లు ఎస్సై సోమశేఖర్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ, కొత్తచెరువు, న్యూస్‌టుడే: ముదిగుబ్బ, కొత్తచెరువులో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. ముదిగుబ్బకు చెందిన అక్రంబాషా ద్విచక్ర వాహనంపై దొరిగల్లు రోడ్డువైపు వెళ్తుండగా, అనంతపురం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 సిబ్బంది రవి, జగన్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● కొత్తచెరువులో పోతులప్ప గుడి దగ్గర జరిగిన ప్రమాదంలో కురుబ రామన్న అనే వ్యక్తి గాయపడ్డాడు. రాత్రి 8.30 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

గొర్రెల వ్యాపారిపై ఫిర్యాదు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన గొర్రెల వ్యాపారి మాబు తమవద్ద జీవాలు కొనుగోలు చేసి డబ్బు ఇవ్వకుండా వెళ్లిపోయాడని కత్తేకొట్టాల గ్రామానికి చెందిన గొర్రెల యజమానులు గురువారం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి చరవాణి పనిచేయడం లేదని వాపోయారు. ధర్మవరం మండలం కత్తేకొట్టాల, రావులచెరువు, కనగానపల్లి ప్రాంతాల్లోని గొర్రెలకాపరులకు వ్యాపారి నుంచి రూ.కోటి వరకు సొమ్ము రావాల్సి ఉందని పేర్కొన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకొని విచారణ చేస్తున్నట్లు ధర్మవరం గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఘర్షణపై పరస్పరం..

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొండమనాయుని పాళ్యం ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణపై పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు కదిరి గ్రామీణ పోలీసులు తెలిపారు. జగదీష్ అనే వ్యక్తిపై ఆంజనేయులు, వేమనారాయణ, మరో ఇద్దరు దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

(c) eenadu

మంచు ముసుగు

జిల్లాలో ఐదు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఓ వైపు చలి వణికిస్తోంది.. మరోవైపు పొగమంచు దట్టంగా కురుస్తోంది. అనారోగ్య సమస్యలతో చిన్నారులు, వృద్ధులు సతమతమవుతున్నారు. పంటలపై మంచు తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిపై ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లావేరు మండలం తాళ్లవలస సమీపంలో జాతీయ రహదారిపై విస్తారంగా కురుస్తున్న పొగ మంచును చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, లావేరు

దాటిస్తారా.. దాట వేస్తారా..?

ఎల్‌ఎన్‌పేట మండలం దబ్బపాడు-తురకపేట గ్రామాల మధ్య కడపలగెడ్డపై వంతెన పనులు నిలిచిపోయాయి. జూన్‌లో నిర్మాణం ప్రారంభించగా వరద ప్రవాహం కారణంగా పనులు ఆపేశారు. ప్రస్తుతం నీరు తగ్గినా నిర్మాణం ముందుకు సాగట్లేదు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ జేఈ గోపాల్ వద్ద ప్రస్తావించగా పనులు పునఃప్రారంభిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

బియ్యానికి బదులు రాగులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని రేషన్ దుకాణాల్లో డిసెంబరు కోటా కింద బియ్యానికి బదులు మూడు కిలోల రాగులు పంపిణీ చేయనున్నట్లు సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పీర్లకొండంత జనం

ఇచ్ఛాపురం పట్టణంలోని పీర్లకొండకు యాత్రికులు పోటెత్తారు. మార్గశిర గురువారం కావడంతో ఒడిశాతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దిగువ మెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి, దీపాలు వెలిగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

తప్పుతోంది గమనం.. తరుముతోంది గండం..!

నాగావళి తీరాన అక్రమార్కుల విధ్వంసం

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే కలెక్టరేట్

అక్రమార్కుల విధ్వంసానికి ఏకంగా నదీ గమనాలే మారిపోతున్నాయి.. నది గర్భాలను చెరువులుగా మార్చేసి యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణ శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని నాగావళి నది కడలిలో కలిసే ప్రాంతమే.. ప్రమాదం పొంచి ఉన్నా గత వైకాపా పాలకులు అక్రమార్కులకు వత్తాసు పలికారు. కనీస చర్యలు తీసుకోలేదు. ఫలితంగా నది గమనం మార్చుకొని ప్రమాదకరంగా మారింది.

90 డిగ్రీలు తిరిగిన నది..

రొయ్యల అక్రమ చెరువుల కారణంగా నాగావళి నది 90 డిగ్రీలు ఒంపు తిరిగి బొంతలకోడూరు నుంచి పేజీపేట వైపు పయనిస్తోంది. కిలోమీటరుకు పైగా పయనిస్తూ సముద్రం, నది ఏకమయ్యాయి. సముద్రం 200 మీటర్ల వరకు ముందుకొచ్చి పేజీపేట వద్ద తీరాన్ని కమ్మేసింది. ఇటీవల నిర్మించిన బీచ్ రోడ్డు కోతకు గురైంది. రక్షణ చెట్లు అలల దాటికి దెబ్బతిన్నాయి. నాగావళి నది వరదలొస్తే పేజీపేట గ్రామాన్ని ముంచెత్తే ప్రమాదం ఏర్పడింది.

● నాగావళి నది ఓ వైపు నుంచి ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు వద్ద బంగాళాఖాతంలో కలవాలి. కానీ పెద్దగనగళ్లవానిపేట పరిధిలో సర్వే నంబరు 106లో 80 ఎకరాల విస్తీర్ణంలో 46 రొయ్యల చెరువులు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇది సముద్రానికి నది కలిసే ప్రాంతానికి మధ్యలో ఉంది. పైగా ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టి చెరువులను విస్తరించడంతో నది తన మార్గాన్ని మార్చుకుంటూ వచ్చింది.

గత పాలకుల అలసత్వమే..

నది గమనం మార్పునకు గత పాలకుల అలసత్వమే కారణం. అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడీ పరిస్థితి ఉండేది కాదు. కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించాం. ఇప్పటికే తాత్కాలిక పనులకు టెండర్లు పిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టి పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

రూ.98 కోట్లు అవసరం..

★ వైకాపా హయాంలో స్థానికులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో నష్టం జరిగిపోయింది.

★ అక్రమార్కులతో చేతులు కలిపి సొమ్ము చేసుకున్నారు తప్ప వారి ఆగడాల్ని అడ్డుకోలేకపోయారు.

★ నది గమనాన్ని సరి చేయాలంటే రూ.98 కోట్లు అవసరమని కూటమి సర్కారు అంచనా వేసింది.

★ జలవనరులశాఖ ఆధ్వర్యంలో నది గట్టు వైపు సముద్రంలోకి యథావిధిగా వెళ్లేలా రాతి వేసే గట్టు నిర్మాణానికి తాత్కాలిక పనులకు రూ.2 కోట్లతో అంచనాలు రూపొందించారు.

★ ఎమ్మెల్యే చొరవతో వాటిని ఉన్నతాధికారులకు నివేదించారు.

ఉరిమే ఉత్సాహం..

గ్రామీణ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం



శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు జెమ్స్ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన యుగ్మ-25 వేడుకలు ఆద్యంతం సందడిగా సాగాయి. సినీనటుడు జగపతిబాబు ముఖ్య తిథిగా హాజరయ్యారు. ఈ సంద

నందిగాం ఇక టెక్కలి డివిజన్..

టెక్కలి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి నందిగాం మండలం చేరింది. నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లోకి ఉండాలన్న ప్రభుత్వ విధానంతో ఇది కొలిక్కివచ్చింది. మంత్రి అచ్చెన్నాయుడు ఎన్నికలముందు ఇచ్చిన హామీ నెరవేరింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వం పలాస డివిజన్ ఏర్పాటు చేసిన సమయంలో నందిగాం మండలాన్ని ఆ డివిజన్‌లో కలిపింది. పోలీసుశాఖతో పాటు ఇతర అన్నిశాఖలకు సంబంధించిన కార్యాలయాల పనులకు టెక్కలికి వచ్చే నందిగాం మండల ప్రజలు రెవెన్యూ పరమైన అంశాలకు మాత్రం పలాస వెళ్లాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజా మార్పుతో సమస్యలకు పరిష్కారం లభించినట్లయింది. – న్యూస్‌టుడే, టెక్కలి

వీళ్లు.. రింగ్‌లో కింగ్‌లు..!

బాక్సింగ్‌లో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే సులువుగా విజయాలు సొంతం చేసుకోవచ్చని నిరూపిస్తున్నారీ క్రీడాకారులు పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వీరంతా బాక్సింగ్‌లో రాణిస్తున్నారు. రింగ్‌లో దిగితే పదునైన పంచ్‌లు విసురుతూ పతకాల పంట పండిస్తున్నారు. శిక్షకుడు ఉమామహేశ్వరరావు తర్ఫీదుతో రాటుదేలుతూ జాతీయ స్థాయిలో మెరిసి జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. ఓ వైపు చదువుకుంటూనే.. మరోవైపు అంతర్జాతీయ బాక్సర్లుగా పేరు తెచ్చుకునేందుకు నిరంతరం సాధన చేస్తున్నారు.

ఏడేళ్లుగా.. అలుపెరగకుండా..

శ్రీకాకుళం నగరానికి చెందిన **ఎస్.దేవీప్రసాద్** ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి శ్రీనివాసరావు కూలి పనులు చేస్తుంటారు. తల్లి విజయలక్ష్మి గృహిణి. ఏడేళ్ల నుంచి బాక్సింగ్ సాధన చేస్తున్నాడు. ఇటీవల విశాఖపట్నం, మచిలీపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించాడు. దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. రాజమహేంద్రవరంలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లోనూ బంగారు పతకం పొంది. అరుణాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాడు. అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడిగా ఎదగడమే తన లక్ష్యమని తెలిపాడు.

ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యమే ధ్యేయం..

శ్రీకాకుళం నగరం ఆర్కే నగర్‌కు చెందిన **బి.దీవెన్‌కుమార్** పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి దుర్గారావు ప్రభుత్వాసుపత్రిలో, తల్లి అన్నపూర్ణ న్యాయశాఖలో ఉద్యోగులు. వారి ప్రోత్సాహంతో బాక్సింగ్ రింగ్‌లో సత్తా చాటుతున్నాడు. ఇటీవల విజయనగరంలో జరిగిన అండర్-17 పాఠశాల క్రీడల్లో బంగారు పతకం, పుదుచ్చేరిలో జరిగిన సౌత్‌జోన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రజత పతకాలు కైవసం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ చూపి.. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఒలింపిక్స్‌లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించడమే తన ధ్యేయమని అంటున్నాడు దీవెన్‌కుమార్.

అటు చదువు.. ఇటు ఆట..

శ్రీకాకుళంలోని వరం నగరపాలకోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న **ఎ.రామ్‌చరణ్ రెడ్డి** మూడేళ్లుగా బాక్సింగ్ సాధన చేస్తున్నాడు. తండ్రి రమణారెడ్డి వ్యాన్ డ్రైవర్. తల్లి విజయలక్ష్మి గృహిణి. ఓ వైపు చదువుకుంటూనే ఆటపై ఆసక్తితో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నాడు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజతం, అండర్-17 ఛాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకాలు అందుకున్నాడు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-17 విభాగంలో పసిడి పతకం సాధించి.. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. క్రీడాకోటాలో ఉన్నతోద్యోగం పొందడమే తన లక్ష్యమని చెబుతున్నాడీ క్రీడాకారుడు.

ఆచితూచి దోచేస్తున్నారు..!

ధాన్యం సేకరణ ప్రక్రియలో మిల్లర్ల దందా

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, నరసన్నపేట

ధాన్యం సేకరణ ప్రక్రియలో మిల్లర్ల దందా మొదలైంది. నాణ్యత లేదని, తేమ శాతం ఉందని.. అదనపు తూకం వేసి దోచేస్తున్నారు. నరసన్నపేటలోని కంబకాయలో ఈ నెల 26న జరిగిన ఘటనే అందుకు ఉదాహరణ. 50 బస్తాలకు ట్రక్ షీట్ జారీ అయినప్పటికీ బస్తాకు ఆరు కిలోలు అదనంగా ఇవ్వాల్సిందేనని రైతు సింహాచలంపై మిల్లర్లు ఒత్తిడి తీసుకొచ్చారు. ఇది అన్యాయమని ఆ రైతు ఏకంగా తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపినా న్యాయం జరగలేదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

కంబకాయ రైతు సేవా కేంద్రంలో విచారణ చేస్తున్న అధికారులు

ఇదీ జరుగుతోంది..

అధికారులు మిల్లర్లకు తేమ శాతం కొలిచే వెసులుబాటు కల్పించడంతో కొందరు దాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. ట్రక్‌షీట్ జనరేట్ అయినప్పటికీ తేమ ఎక్కువగా ఉందని చెప్పి అదనపు తూకం వేస్తున్నారు. రాళ్లు, గడ్డి, తాలు, మొలకెత్తని, పక్వానికి రాని, రంగు మారిన గింజలు ఉన్నాయని చూపి ఏకంగా బస్తాకు నాలుగు నుంచి ఆరు కిలోల వరకు దోచేస్తున్నారు. సగటున ఎకరాకు 25 బస్తాల చొప్పున దిగుబడి వస్తే ఏవేవో సాకులు చెబుతూ రెండు బస్తాలు తీసేసుకుంటున్నారు.

★ ఆర్‌ఎస్‌కేతో పాటు మిల్లుల వద్ద తేమ శాతం, నాణ్యత పరీక్షిస్తుండటంతో గందరగోళ పరిస్థితి నెలకొంటోంది.

★ అధికారులు ఏమీ చేయలేక చేతులెత్తేస్తుండటంతో అంతిమంగా రైతులే నష్టపోతున్నారు.

ఏం జరగాలి..

రైతు ధాన్యం అమ్మేందుకు ఆర్‌ఎస్‌కేకు వెళ్లాక వీఏఏ షెడ్యూల్ ఇస్తారు. నిర్దేశించిన తేదీ ప్రకారం కళ్లంలోకి సాంకేతిక సహాయకుడు వెళ్లి.. రెండు కిలోల ధాన్యాన్ని తీసుకొస్తారు. తేమ శాతం, నాణ్యతను పరిశీలించి.. ట్రక్ షీట్ జనరేట్ చేస్తారు. అంతటితో రైతు పాత్ర అయిపోతుంది. ఆ ధాన్యం కస్టోడియన్ అధికారి ద్వారా మిల్లుకు చేరాక.. రైతు ఖాతాలో నగదు జమవ్వాలి.

ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ 34.55 శాతం పూర్తయిందని తెలిపారు. వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ఎదురొచ్చిన మృత్యువు..!

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరి దుర్మరణం

పలాస మండలం గరుడఖండి వద్ద ఘటన

పొట్ట కూటి కోసం
ఉన్నఊరిని వదిలేశారు..
కష్టాన్నే నమ్ముకుని..
కుటుంబాలను
నెట్టుకొస్తున్నారు..
వీరి ధైర్యాన్ని చూసి
విధికి కన్నుకుట్టిందేమో..
ప్రయాణిస్తున్న దారిలో
మృత్యువు ఎదురొచ్చింది..
ఒక్కసారిగా బతుకులను
చెల్లాచెదురు చేసేసింది..

కాశీబుగ్గ, పాతపట్నం, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పలాస మండలం గరుడఖండి సమీప పాత జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం మండలం సరాళి గ్రామానికి చెందిన తలగాపు భీమారావు(27) పలాస మండలం వీరభద్రాపురంలో గురువారం బంధువుల గృహప్రవేశానికి వచ్చారు. పెద్దనాన్న కుమారుడు వేణుతో కలిసి ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సుశాంత్‌కుమార్ పైకా(23) మరో ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ నుంచి వస్తున్నారు. గరుడఖండి సమీపంలో రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో భీమారావు అక్కడికక్కడే మృతి చెందారు. సుశాంత్ కుమార్ పైకా కొద్ది దూరం ఎగిరి రోడ్డు పక్కన పడి ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర గాయాలపాలైన వేణును స్థానికులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, ఎస్సై నరసింహమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

సుశాంత్‌కుమార్ పైకా

భీమారావు

వలసొచ్చి.. ప్రాణాలొదిలి..

ఒడిశాలోని గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి ఠాణా పరిధి డెరబ గ్రామానికి చెందిన సుశాంత్‌కుమార్ పైకా కుటుంబంతో కలిసి 20 రోజుల కిందట కాశీబుగ్గ వచ్చారు. స్థానికంగా ఓ గుడ్ల పరిశ్రమలో పనిలో చేరినట్లు సుశాంత్ అన్నయ్య అరుణ్ కుమార్ తెలిపారు. ఈయనకు భార్య రీనా గొమాంగో, రెండేళ్ల కుమారుడు ఐస్ కుమార్ ఉన్నారు.

ఇంటి పెద్దను కోల్పోయారు..

భీమారావుకు తల్లి లక్ష్మి, తమ్ముడు తేజేశ్వరరావు ఉన్నారు. తండ్రి కొన్నేళ్ల కిందటే మృతి చెందడంతో ఆర్థిక పరిస్థితి బాగోక సరాళి నుంచి విశాఖ వెళ్లిపోయారు. ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు. భీమారావు పైప్‌లైన్ కంపెనీలో పని చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

మాయ చేశారు.. న్యాయం చేయండి..!

గ్రేడ్-3 ఆరోగ్య కార్యదర్శుల ఆందోళన

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

జిల్లా వైద్యారోగ్యశాఖలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆరోగ్య శాఖ సిబ్బంది ఉద్యోగ నియామక జాబితా మాయం కావడం పెద్ద దుమారం రేపుతోంది. అధికారుల తీరుతో తమకు ఉద్యోగోన్నతులు రావట్లేదని సచివాలయాల్లో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల్లోని గ్రేడ్-3 ఆరోగ్య కార్యదర్శులు ఆందోళన చేస్తున్నారు.

ఇంతకీ ఏమైంది..?

★ వైకాపా హయాంలో జరిగిన ఆరోగ్య సిబ్బంది నియామకాల్లో అభ్యర్థులకు పరీక్షల్లో వచ్చిన మార్కులు, వెయిటేజీ, ఇతర అంశాలను క్రోడీకరించి రాష్ట్ర అధికారులు ర్యాంకులు ఇచ్చి ప్రాధాన్యత జాబితా తయారు చేశారు. దాన్ని జిల్లాలోని ఉన్నతాధికారుల కమిటీ ధ్రువీకరించింది.

★ కూటమి అధికారంలోకి వచ్చాక మిగతా జిల్లాల్లో గ్రేడ్-3 ఆరోగ్య కార్యదర్శులకు ఏఎన్ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించింది. జిల్లాలో మాత్రం జాబితా మాయం కావడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

ఇదే కారణమా...

కార్యాలయంలో ఓ కీలక అధికారి, మరో ఇద్దరు చిరుద్యోగులు కొందరు ఆరోగ్య కార్యకర్తల నుంచి ఉద్యోగోన్నతులు ఇప్పిస్తామని భారీగా డబ్బులు వసూలు చేసి ఆ ప్రకారం జాబితా సిద్ధం చేశారు. ఆ అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయని భావించి ఏకంగా జాబితాలనే మాయం చేసినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. 'కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్న జాబితాను ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించి.. సిబ్బందికి న్యాయం చేస్తాం' అని డీఎంహెచ్‌వో కె.అనిత స్పష్టం చేశారు.

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు

ఉత్తీర్ణత శాతం పెంచేందుకే సంకల్ప్ – 2026

ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సురేష్‌కుమార్

ముఖాముఖి

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

'కూటమి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు తీసుకొచ్చింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. సకాలంలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేశాం. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సంకల్ప్-2026 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం' అని ఇంటర్ విద్యాశాఖాధికారి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఇన్‌ఛార్జి) ఆర్.సురేష్‌కుమార్ తెలిపారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారనేది 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వివరించారు.

పరీక్షలు ఎప్పుడంటే..

★ **ప్రయోగ:** జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు(వృత్తి విద్యా కోర్సులకు), ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు(సాధారణ కోర్సులకు)

★ **వార్షిక:** ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు

అందరూ పాసవ్వడమే లక్ష్యం..

ఫలితాల ఆధారంగా కళాశాల స్థాయిలో విద్యార్థులకు ఎ, బి, సి గ్రేడ్‌లు కేటాయిస్తున్నారు. వాటి ఆధారంగా విద్యార్థి ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో.. వాటిల్లో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేందుకు కళాశాలలో ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఉత్తీర్ణులు కావడమే లక్ష్యంగా ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అధ్యయన తరగతుల్లో కేటగిరీల వారీగా చదివిస్తారు. ఏ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు రివిజన్‌తో పాటు బి, సి గ్రేడ్ విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులు చదివిస్తారు.

★ దాదాపు అన్ని చోట్ల సిలబస్ పూర్తయ్యింది. ఎక్కడైనా కాకుంటే డిసెంబరు 12లోగా పూర్తి చేసి రివిజన్ ప్రారంభించాలి.

★ ఇంటర్ పరీక్షలతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచే విద్యార్థులను ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఇందుకు ప్రతి రోజూ ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నాం.

★ సాయంత్రం అధ్యయన తరగతుల నిర్వహణ, విద్యార్థులను చదివించే బాధ్యతను కేర్ టేకర్లకు అప్పగించాం. సబ్జెక్టులవారీగా విద్యార్థుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని వారికి సూచించాం.

50 రోజుల ప్రణాళిక..

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ప్రథమ, ద్వితీయ ఇంటర్ 12,816 మంది చదువుతున్నారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేందుకు ఇంటర్ విద్యాశాఖ సంకల్ప్-2026 కార్యక్రమాన్ని ఈ నెల 24 నుంచి అమలు చేస్తోంది. ఫిబ్రవరి 20 వరకు 50 రోజుల పాటు కొనసాగుతుంది. విద్యార్థుల వ్యక్తిగత అధ్యయనాన్ని మెరుగుపరిచేందుకు ఇది దోహదపడనుంది.



(c) eenadu

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

- పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

RAMOJI GLAMPING

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

దేవుడి తర్వాత స్థానం వైద్యులదే..

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: దేవుడి తర్వాత స్థానం వైద్యులదేనని.. మంచి మనసున్న వారే మంచి వైద్యులు కాగలరని ప్రముఖ నటుడు వీరమాచినేని జగపతిబాబు అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు జెమ్స్ ఆసుపత్రి 15వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాల డీన్ లక్ష్మీలలిత అధ్యక్షతన యుగ్మ-25 పేరిట వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ సమస్య ఉన్న జిల్లాలో ఎంతో మంది అవయవ దానం చేయడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. అవయవ దానంలో జెమ్స్ ఆసుపత్రి గొప్ప విజయం సాధించిందని కొనియాడారు. ఇక్కడ మానసిక, శారీరక దివ్యాంగులకు ఉపాధి కల్పించడం ప్రశంసనీయమన్నారు. జెమ్స్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ జీవితంలో ఎస్..నో..సరిగా చెప్పడం నేర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా సేవలందించడం గర్వకారణమని తెలిపారు. మాదకద్రవ్యాల నివారణ, నారీశక్తి పేరిట రూపొందించిన గోడప్రతులను పోలీసు అధికారులతో కలిసి జగపతిబాబు ఆవిష్కరించారు. జెమ్స్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జెమ్స్ ఆసుపత్రి ఫౌండర్ డాక్టర్ సుధీర్, కార్యదర్శి అద్విక్ తదితరులు పాల్గొన్నారు.

జగపతిబాబుతో ఎమ్మెల్యే గొండు శంకర్, జెమ్స్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు

కష్టపడకుండానే విద్యుత్తు సౌకర్యం..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

విద్యుత్తు కనెక్షన్ పొందాలంటే ఇప్పటివరకు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. దరఖాస్తు చేశాక అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసేవారు. ఆ తర్వాత స్తంభాలకు అయ్యే ఖర్చుతో పాటు సర్వీసు లైన్లు, అభివృద్ధి రుసుం అధికారికంగా నిర్ణయించేవారు. అయినా సిబ్బంది అనధికార వసూళ్లకు పాల్పడేవారు. వినియోగదారులకు సత్వర సేవలందించేందుకు ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) నూతన సంస్కరణలు తీసుకొచ్చింది. కొత్త కనెక్షన్, అదనపు లోడ్‌కు కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలు నిర్ణయించింది. అదనపు ఛార్జీలు ఎత్తి వేసి వినియోగదారులపై భారం తగ్గించింది. కావాల్సిన వారికి సత్వరమే కనెక్షన్ ఇస్తున్నామని ఈపీడీసీఎల్ ఎస్ఈ ఇంజినీరు కృష్ణమూర్తి తెలిపారు.

కొత్త ఛార్జీలు ఇలా..

గృహ అవసరాల కనెక్షన్లు(ఎల్‌టీ): ఒక కిలోవాట్‌కు రూ.1,500, 1 నుంచి 20 కిలోవాట్స్ వరకు అదనంగా ప్రతి కేవీకి రూ.2 వేలు చొప్పున, 20 నుంచి 150 కిలోవాట్స్ వరకు ప్రతి కేవీకి రూ.12,600 చొప్పున చెల్లించాలి.

వాణిజ్య కనెక్షన్లకు: ఒక కిలోవాట్‌కు రూ.1,800, 20కిలోవాట్ల వరకు రూ.1800తో పాటు కిలోవాట్‌కు అదనంగా రూ.2వేలు, 20 నుంచి 150 కిలోవాట్స్ వరకు రూ.12,600 చొప్పున చెల్లించాలి.

హెచ్‌టీ కనెక్షన్లకు: 75 నుంచి 150 కిలోవాట్స్ వరకు ప్రతి కేవీకి రూ.4,400 చొప్పున చెల్లించడంతో పాటు నియంత్రికలను వినియోగదారులే ఏర్పాటు చేసుకోవాలి.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

మందస, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని, ఫిర్యాదులపై తక్షణం స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. మందస పోలీసు స్టేషన్‌ను గురువారం సందర్శించి వార్షిక తనిఖీ చేపట్టారు. దస్త్రాలు పరిశీలించి, ప్రాధాన్య క్రమంలో అపరిష్కృత కేసులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల నివారణ, రహదారి ప్రమాదాలపై అవగాహన, సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్ పరిసరాలు సందర్శించి మొక్క నాటారు. ఎస్సై కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యక్షా అన్నారు.. అదరగొట్టారు!

- మాక్ అసెంబ్లీలో గళం విప్పిన సిక్కోలు బిడ్డలు

సూచిక: ● పేరు ★ చదువు ❑ నేపథ్యం ◗ ఏం నేర్చుకున్నారు ❖ అనుభూతి

జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. శాసనసభ సమావేశాలను టీవీలో చూసిన తాము ప్రత్యక్షంగా హాజరై గళం విప్పడం మంచి అనుభూతి కలిగించిందని తెలిపారు. ప్రజాప్రతినిధులుగా వ్యవహరించడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని అభిప్రాయపడ్డారు.

– న్యూస్‌టుడే, జి.సిగడాం, బూర్జ, సారవకోట, పాతపట్నం, నరసన్నపేట, టెక్కలి, కంచిలి గ్రామీణం, పలాస, కాశీబుగ్గ

- ● పొన్నాడ ప్రదీప్
- ★ జి.సిగడాం మండలం డి.బొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి
- ❑ తండ్రి రామకృష్ణ వలస కూలీ, తల్లి పుణ్యవతి వ్యవసాయ పనులకు వెళ్తారు
- ◗ బిల్లులు ఆమోదించడం.. జీరో అవర్‌లో ప్రశ్నలు అడగడం
- ❖ మారుమూల గ్రామం నుంచి అబ్జర్వర్, గనుల మంత్రిగా వ్యవహరించాను. పర్యావరణ అంశాలపై ప్రసంగించాను.

- ● కొనపల సాయిదీక్షిత్
- ★ బూర్జ మండలం ఓవీపేట ఆదర్శ పాఠశాలలో పదో తరగతి
- ❑ తండ్రి దాలిస్వామి గుత్తేదారు, తల్లి తేజ గృహిణి
- ◗ యువత రాజకీయాల్లోకి రావాలని
- ❖ ఎమ్మెల్యేగా వ్యవహరించాను.. అవకాశం వస్తే విద్య, వైద్యం, ఆర్థిక అక్షరాస్యతపై మాట్లాడాలనుకున్నాను.

- ● మాసవరపు గుణచరణ్
- ★ సారవకోట మండలం బుడితి ఉన్నత పాఠశాలలో పదో తరగతి
- ❑ అప్పారావు ఆటో డ్రైవర్, తల్లి రజని గృహిణి
- ◗ జీరో అవర్, బిల్లులు ప్రవేశపెట్టడం
- ❖ అసెంబ్లీని చూడటం.. అవకాశం వస్తే ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రసంగించాలనుకున్నా.

- ● జర్జాన ప్రవీణ్‌కుమార్
- ★ పాతపట్నం మండలం గులుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి
- ❑ తండ్రి కాంతారావు వ్యవసాయం చేస్తారు, తల్లి పద్మ గృహిణి
- ◗ ప్రజలకు, ప్రభుత్వానికి ఉన్న అనుబంధం తెలుసుకున్నా
- ❖ రాష్ట్రాన్ని ముందుకు నడిపించే శాసనసభలో కూర్చోవడం.. అవకాశం వస్తే పంటలకు మెరుగైన గిట్టుబాటు ధర రావాలని అడగాలనుకున్నా.

- ● రష్మిక సంతోషి
- ★ టెక్కలి బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి
- ❑ తండ్రి గిరిధరరావు హోంగార్డు, తల్లి కోమలి గృహిణి
- ◗ అసెంబ్లీలో చట్టాలు చేయడం
- ❖ ఎప్పటికీ మర్చిపోలేను. అవకాశం వస్తే అక్షరాస్యత శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడాలనుకున్నా.

- ● వైశ్యరాజు భరత్‌సాయి
- ★ నరసన్నపేట మండలం కంబకాయ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి
- ❑ తండ్రి రాము చిరు వ్యాపారి, తల్లి నాగమణి గృహిణి
- ◗ స్పీకర్ బాధ్యతలు, ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, విపక్షాల వ్యవహారశైలి, బిల్లులు ఆమోదం పొందే తీరు
- ❖ స్పీకర్ సీటు వద్ద రక్షకుడిగా వ్యవహరించడం తృప్తినిచ్చింది. అవకాశం వస్తే ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

- ● ఆరాధ్య పాణిగ్రాహి
- ★ కంచిలి మండలం ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి
- ❑ తండ్రి బాలకృష్ణ పాణిగ్రాహి వ్యవసాయం చేస్తారు. తల్లి సంగీత పండా గృహిణి
- ◗ ప్రశ్నలు అడగడం, అధికార, విపక్షాల వ్యవహారశైలి, బిల్లులు ఆమోదం పొందే తీరు
- ❖ ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడం ఆనందంగా ఉంది. అవకాశం వస్తే ప్లాస్టిక్ నిషేధంపై ప్రసంగించాలనుకున్నా.

- ● ఆర్‌సీహెచ్ లాల్లా
- ★ కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి
- ❑ తల్లి అగ్గన మేఘన పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్
- ◗ ప్రశ్నోత్తరాల సమయం, బిల్లులు ప్రవేశపెట్టడం.
- ❖ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల సందేశం ప్రత్యక్షంగా వినడం. అవకాశం వస్తే ఉద్దానంలో కిడ్నీ వ్యాధిపై మాట్లాడాలనుకున్నా.

- ● తమ్మినాన నవ్యశ్రీ
- ★ కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి
- ❑ తండ్రి నాగేశ్వరరావు దర్జీ, తల్లి హరిప్రియ గృహిణి
- ◗ బిల్లులు ప్రవేశపెట్టడం, ఎమ్మెల్యేలు, సభాపతి మధ్య సమన్వయం,
- ❖ అసెంబ్లీలో కూర్చునే అవకాశం రావడం.. అవకాశం వస్తే ఉద్దానంలో ఇంటింటికీ శుద్ధజలం పంపిణీ చేసే ప్రాజెక్టు రూపకల్పనపై మాట్లాడాలనుకున్నా.

స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొన్న జిల్లా విద్యార్థుల బృందం

ఇసుక మేటల తొలగింపు

స్పందనకు వందనం

లావేరు మండలం అదపాక కూడలి సమీపంలోని జాతీయ రహదారిపై సుమారు అర కిలోమీటరు మేర ఇసుక చేరడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నెల 25న ఈనాడులో 'ఇసుక మేట.. ప్రమాద బాట..!' శీర్షికన ప్రచురితమైన కథనానికి హైవే అధికారులు స్పందించారు. గురువారం సుమారు 3 ట్రాక్టర్ల ఇసుకను సేకరించి తరలించారు. – న్యూస్‌టుడే, లావేరు

ఏపీవోకు డిప్యుటేషన్‌పై జీవీఎంసీలో నియామకం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ట్రెజరీ అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ అకౌంట్స్ అధికారిగా పని చేస్తున్న జి.నాగార్జునరావును విశాఖ మహా నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో డిప్యూటీ ప్లానింగ్ అధికారిగా డిప్యుటేషన్‌పై నియమిస్తూ పురపాలక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం డిప్యుటేషన్‌పై శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ఏడాది పాటు జీవీఎంసీలో డిప్యూటీ ప్లానింగ్ అధికారిగా పని చేయడానికి ప్రభుత్వం అనుమతించింది.

పాఠశాలలకు కోడి గుడ్ల సరఫరా ఇంకెప్పుడు?

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలంలోని హిమగిరి, కైజోల మండల పరిషత్తు, దానగోరలోని ప్రాథమిక పాఠశాలలకు సోమవారం నుంచి కోడిగుడ్లు సరఫరా కావడం లేదు. దీని కారణంగా మధ్యాహ్న భోజనంలో గుడ్డు కూరకు ఇబ్బందవుతోంది. గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీ పనితీరు బాగోలేదని, అధికారులూ అంతగా పట్టించుకోవడం లేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం పలాస ఎంఈవో-2 సత్యం దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారానికి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాను మరణించి..నలుగురిలో జీవించి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటర్ రెండో సంవత్సరం కుమార్తె మృతి చెందిన దుఃఖంలోనూ ఆ కుటుంబ సభ్యులు ఔదార్యం చాటుకున్న ఉదంతమిది. లావేరు మండలం గోవిందపురం పంచాయతీ పరిధి ఇజ్జాడపాలెం గ్రామానికి చెందిన ఇజ్జల ధనలక్ష్మి (17) మూర్ఛతో బాధపడుతున్న ఆమెను ఈ నెల 22న కుటుంబ సభ్యులు రాగోలు వద్ద జెమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే హిపోక్సియా వ్యాధి బారిన పడటంతో సోకడంతో జీవన్మృతి అయినట్లు వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవ దానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని కిమ్స్, ఒక కిడ్నీని విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రులకు, మరో కిడ్నీ, కాలేయాన్ని జెమ్స్ ఆసుపత్రికి కేటాయించారు. చనిపోయి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపడం గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది గురువారం మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధ్రువపత్రాలు అందజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు ఇంజెక్షన్లు చేయకూడదని. . ఆసుపత్రులు నిర్వహించకూడదని డీఎంహెచ్‌వో డా.కె.అనిత స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయలో గురువారం పీఎంపీ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికే చికిత్స అందించాలని.. సెలైన్ పెట్టడం, కుట్లు వేయకూడదని పేర్కొన్నారు. ఇన్ పేషెంట్లుగా చేర్చుకోకూడదని హెచ్చరించారు. వైద్యం చేసిన సమయంలో ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే సంబంధిత పీఎంపీపై చర్యలు తీసుకుంటామన్నారు. పీఎంపీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి.శిమ్మన్న, ఎన్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో జీవిత ఖైదు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, పొందూరు గ్రామీణం, పాతబస్టాండ్, న్యూస్‌టుడే: భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన పేర్కొన్న వివరాల మేరకు రణస్థలం మండలం బాణాం గ్రామానికి చెందిన జీరు వెంకటరమణకు సమీప బంధువైన రమణమ్మతో వివాహమైంది. కొంతకాలం కాపురం చేసిన తర్వాత అనుమానిస్తూ గొడవ పడుతున్నాడని ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. 2018 మార్చి 14న భర్త తండ్రి మృతి చెందారని తెలిసి రాగా వాగ్వాదానికి దిగి కత్తితో నరికి హత్య చేశాడు. ఈ కేసులో బెయిల్‌పై కారాగారం నుంచి బయటకు వచ్చాక న్యాయస్థానంలో విచారణకు నిందితుడు గైర్హాజరు కావడంతో అరెస్టు వారెంటు జారీ అయింది. గుంటూరులో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ పూర్తవడంతో గురువారం నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ అదనపు న్యాయమూర్తి పి.భాస్కరరావు తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నిందితులు ఇంటర్ విద్యార్థులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరుగుతున్న పలు వాహనాల చోరీ కేసును ఛేదించి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. టెక్కలికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు మైనర్లు చెడు స్నేహాలు, జల్సాలకు అలవాటు పడి పదో తరగతి నుంచే చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. రాత్రివేళల్లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకుని వీరు చోరీలకు పాల్పడుతున్నారని, వాటిని రోటరీనగర్ సాయిబాబా మందిరం వెనకభాగంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో భద్రపరిచి ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు ఆలోచన చేశారన్నారు. ఈక్రమంలో దొంగిలించిన వాహనంపై ప్రయాణిస్తూ వలేసాగరం వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. నిందితుల్ని శ్రీకాకుళం జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపర్చామని, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో టెక్కలి పోలీసులు

వాహన ప్రమాద కేసుల్లో సత్వర పరిహారం

మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: వాహన ప్రమాద కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం అందించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం బాధితులు, పలువురు అధికారులతో చర్చించారు. ప్రమాద సమయంలో నిర్లక్ష్య ధోరణితో బాధితులను వదిలేస్తున్న ఘటనలపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో ఈశ్వరమ్మ, ఏఎస్సై పి.ధర్మారావు, ఉప తహసీల్దారు (పాలకొండ) ఎం.నాగేంద్రప్రసాద్, ట్రాఫిక్ సీఐ వి.రామారావు పాల్గొన్నారు.

EENADU e Classifieds
JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్స్, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

శ్రీకాకుళం ఆఫీసు నందు మరియు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయుటకు టెలీకాలర్స్, ఆఫీస్ ఇన్‌ఛార్జ్ M/F కావలెను. 10K శాలరీ Cont: 7670877376.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసింబిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

అవసరం మేరకు రుణం తీసుకోవచ్చు

మాట్లాడుతున్న డీజీఎం కృష్ణంనాయుడు పక్కన ఏజీఎం చిట్టిబాబు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: స్త్రీనిధికి ప్రత్యేకించి లక్ష్యాలు ఉండవని, మహిళలు అవసరం మేరకు రుణం తీసుకోవచ్చని అయిదు జిల్లాల స్త్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజరు కృష్ణంనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఏజీఎం చిట్టిబాబుతో కలిసి ఎల్.కోట వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పొదుపు సంఘాలకు నవంబరు నాటికి రూ.482.48 కోట్లు రుణం ఇచ్చేందుకు లక్ష్యం పెట్టుకున్నామని, ఇప్పటివరకు రూ.459.55 కోట్లు అందజేశామన్నారు. దీంతో ఈ జోన్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఏటా 97 శాతం రికవరీ అవుతున్నట్లు చెప్పారు. రుణాల వినియోగంలో మొదటి స్థానంలో శ్రీకాకుళం, తర్వాతి స్థానాల్లో విజయనగరం, మన్యం, విశాఖ, అల్లూరి సీతారామరాజు ఉన్నాయన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

గోవుల సంరక్షణపై దృష్టి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామికి భక్తులు సమర్పించే గోవులు, దూడలను గోశాలలో ఒకే చోట ఉంచడం, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంతో పర్యవేక్షణ కొరవడింది. ఇటీవల రెండు దూడలు మృతి చెందిన విషయం వెలుగులోకి రావడంతో ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ నాయకులు అధికారుల తీరును ఎండగట్టారు. ఈ నేపథ్యంలో ఈవో వాటి సంరక్షణపై దృష్టి సారించి నూతనంగా షెడ్డు నిర్మించారు. భక్తులు అరటిపండ్లు పెట్టకుండా నిలువరించడానికి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశామని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

నూతనంగా నిర్మించిన గోవుల సంరక్షణ కేంద్రం

కొసమాల పీఏసీఎస్‌లో సిబ్బంది చేతివాటం?

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: కొసమాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థలో సిబ్బంది చేతివాటం వెలుగు చూసింది. కొంతకాలంగా పీఏసీఎస్ పరిధిలో రుణాలు పొందిన ఖాతాదారులు చెల్లిస్తున్న మొత్తాలను పక్కదారి పట్టిస్తూ సొంతానికి వినియోగించినట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు రూ.8 లక్షలకు పైగా అవకతవకలు జరిగినట్లు పాలనా యంత్రాంగం గుర్తించింది. లోపాలను సరిచేసేందుకే రికవరీ చేస్తున్నట్లు పాలనాయంత్రాంగం పేర్కొంటోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే కొంత మొత్తం వసూలు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు మాట్లాడుతూ రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు.

పైవంతెన స్తంభాల పనులకు శంకుస్థాపన

రణస్థలం కూడలిలో జాతీయ రహదారిపై వంతెన నిర్మాణం గడువు ముందే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురువారం స్తంభాల పనులకు శంకుస్థాపన చేశారు. 4.5 కిలోమీటర్ల నిర్మించనున్నట్లు వెల్లడించారు. –న్యూస్‌టుడే, రణస్థలం

ఇక లెక్క పక్కా..!

- వసతిగృహాల పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, పొందూరు

వైకాపా పాలనలో వసతిగృహాలు నిర్లక్ష్యానికి గురికావడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం అలాంటి తప్పిదాలు, అవకతవకలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షణ ఉండేలా పటిష్ఠ చర్యలు చేపట్టింది. కృత్రిమ మేధ సాంకేతికతతో 'హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం' (హెచ్‌పీటీఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు ఉదయం నుంచి నిద్రకు ఉపక్రమించే వరకు జరిగిన ప్రతి అంశాన్ని అందులో నమోదు చేయాలి. అమలులో లోపాలుంటే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తప్పవని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

శుభ్రతకు ప్రాధాన్యం

- రోజు వారీ పనులు, వారాంతం, నెల వారీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి.
- పిల్లల హాజరు, వంట చేస్తున్న పరిసరాలు, ఆహార పదార్థాల నాణ్యత, ఆవరణ, గదులు, కంచాలు కడగడం, మరుగుదొడ్లు, తాగునీరు శుభ్రంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నట్లు నిక్షిప్తం చేసేలా ఐచ్ఛికాలు పొందుపరిచారు.
- ఏ చిన్న పొరపాటు జరిగినా సంక్షేమాధికారులకు యాప్ ద్వారా హెచ్చరికలు వెళ్తాయి.

కేటగిరీ	వసతిగృహాలు	విద్యార్థులు
బీసీ	81	7,000
ఎస్సీ	40	3,500
ఎస్టీ	43	4,500

జి.సిగడాం మండలం సంతవురిటి బీసీ వసతిగృహంలో పిల్లలు చదువుతుండగా నమోదు చేస్తున్న సంక్షేమాధికారి అప్పారావు

సాంకేతిక చిక్కులతో సతమతం

- యాప్ వినియోగంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సంక్షేమాధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- లింక్ పంపి కొత్త విధానంలో పని తీరు నిక్షిప్తం చేయాలని చెప్పడం మినహా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట

- హెచ్‌పీటీఎస్ యాప్‌తో వసతి గృహాల్లో అక్రమాలు జరగకుండా అడ్డుకట్ట వేయనున్నారు.
- భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యకు ఆ ఆహారం సరిపోతుందా..లేదా అనే విషయాన్ని కృత్రిమ మేధ ద్వారా తెలుసుకోవచ్చు.
- ఆహార పదార్థాల నాణ్యత సక్రమంగా ఉందా? అనే విషయం తెలుసుకునే వెసులుబాటు ఉంది.
- అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు.

పారదర్శకతకు ఉపయోగం

వసతిగృహాల నిర్వహణ పారదర్శకంగా ఉండేందుకు హెచ్‌పీటీఎస్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. వినియోగంపై సంక్షేమాధికారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇకపై కార్యకలాపాల వివరాలన్నీ యాప్‌లోనే నిక్షిప్తం చేయాలి.

– అనురాధ, జిల్లా బీసీ వసతి గృహాల సంక్షేమాధికారిణి, శ్రీకాకుళం

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

పాతబస్టాండ్, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: రాజస్థాన్‌లో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లా క్రీడాకారిణి గుజ్జల వర్షిత కాంస్య పతకం సాధించింది. గురువారం జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో 179 కిలోల బరువు ఎత్తి సత్తా చాటింది. గార మండలం ఆడవరం గ్రామానికి చెందిన ఆమె డా.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున పాల్గొంది.

30న బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: అంతర జిల్లాల బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఆ సంఘ కార్యదర్శి బీఏ దేవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో ఉదయం 7 గంటలకు జరిగే పోటీలకు హాజరు కావాలని సూచించారు. క్రీడాకారులు 1985 జనవరి 1 నుంచి 2006 డిసెంబరు 31 మధ్య జన్మించి ఉండాలని స్పష్టం చేశారు.

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

అమ్మవార్లకు చల్లదనం పూజలు

దేవపూడిలో జీడిపిక్కల కార్మికులు గురువారం గ్రామ అమ్మవార్లకు చల్లదనం పూజలు నిర్వహించారు. పరిశ్రమ అధికారి కొయిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి, ఒరిసలమ్మ, మంకినమ్మ, దుర్గాదేవి, రేవమ్మ అమ్మవార్లకు ముర్రాటలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

లింగ ఆధారిత వివక్షను ప్రతిఘటిద్దాం

సోంపేట, న్యూస్‌టుడే: లింగ ఆధారిత వివక్షను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని వెలుగు ఏపీఎం ఎస్.ప్రసాదరావు కోరారు. 'మార్పు కోసం' ముందడుగు కార్యక్రమంలో భాగంగా సోంపేట వెలుగు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కేజీబీ కళాశాల విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి లింగ వివక్షతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జి.జయశంకర్, పి.గణపతి, మహిళా సమాఖ్య సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపన్యసించారు బహుమతులు పట్టేశారు

విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో సత్తా చాటి బహుమతులు పట్టేశారని స్మార్ట్ స్కూల్ ఛైర్మన్ ఏబీకే శాస్త్రి, డైరెక్టర్ ఎల్.రమేష్ అన్నారు. పాఠశాల ఆవరణలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 7, 8, 9, 10వ తరగతులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం'పై ఉపన్యాస పోటీలు నిర్వహించగా జె.చైత్ర(10వ తరగతి), కె.వర్షన్(7వ తరగతి), ఎం.లిఖిత(9వ తరగతి) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఛైర్మన్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ కేవీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎల్.హారతి, వి.నాగజ్యోతి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

ఆక్రమణలపై మూడు రోజుల్లో నివేదిక

బిరుసువాడ ఆక్రమణ గురించి వివరిస్తున్న రైతు ప్రతినిధులు

సోంపేట, న్యూస్‌టుడే: బిరుసువాడలోని ఆక్రమణలపై మూడు రోజుల్లో నివేదిక ఇస్తామని మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ మహేష్ అన్నారు. కోదండరామస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ ఆనంద్, కూటమి, వైకాపా నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు గురువారం ఆక్రమణలు గుర్తించి చెరువులు, బందలు, కాలువలను అధికారులకు చూపించారు. రెండు బందలు, కాలువలు, కల్లంబంద రెండెకరాలకు పైగా ఆక్రమణలకు గురైందని చర్యలు తీసుకోకపోతే రాజకీయాలకతీతంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో వీధి దీపాలు కొన్ని చోట్ల నిత్యం వెలుగుతుంటే, మరికొన్ని చోట్ల రాత్రులు చిమ్మ చీకట్లు అలముకుంటున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిరంతరం వెలుగుతున్న పంచాయతీలకు అధిక బిల్లులు వస్తుండగా.. చిమ్మ చీకట్లు అలముకున్న పంచాయతీల్లో ప్రజలు రాత్రులు బయటకొచ్చేందుకు భయపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు ఎప్పటికప్పుడు విద్యుత్తు పొదుపుపై ప్రచారం చేస్తున్నా, అమలు చేయడంలో విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్కడ ఆరవు.. ఇక్కడ వెలగవు

వేధిస్తున్న వీధి దీపాల సమస్య

నిత్య వెలుగులు

ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు, లక్ష్మణపురం, కొళిగాం, పాయింతాడి, మండపల్లి, ముసిరిఖండ, బాలకృష్ణాపురం, కంచిలి మండలం కుత్తుమ, పోలేరు, బూరగాం, కవిటి మండలం బొరివంక, బీ.గొనసపుట్టుగ, సోంపేట మండలం పలాసపురం, జింకిభద్ర, బారువ, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, డెప్పూరు, పెద్ద ఉప్పలాం, ఒంకులూరు, హనుమంతునాయుడుపేట, వజ్రపుకొత్తూరు, గరుడభద్ర, మందస మండలం సొండిపూడి, పలాస మండలం కమలపురం, టెక్కలిపట్నం, మొదలైన ప్రాంతాల్లో వీధి దీపాలు పగలు వెలుగుతూనే ఉన్నాయి. ఇచ్ఛాపురం, పలాస పురపాలిక పరిధిలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు ఆరడం లేదు. దీంతో విద్యుత్తు వృథాతోపాటు పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికైనా పగలు వెలుగులు ఆరేట్లు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిమ్మ చీకట్లు

ఇచ్ఛాపురం మండలం ఈదుపురం, వెల్లో రహదారి, జగన్నాథపురం, ఎం.తోటూరు, లక్ష్మణపురం, బెల్లుపడ కాలనీ, కస్పా వీధి, ఎన్‌టీఆర్ కాలనీ, కంచిలి మండలం గిరిజన గ్రామాలతోపాటు సువ్వగెడ, అంబేడ్కర్ కాలనీ, పలాస నియోజకవర్గంలో ధర్మపురం, గల్లి, గొల్లపాడు, రెడ్డి, శివసాగర తీర రహదారుల పరిసరాలు, పలాస పురపాలిక సంఘం పాత జాతీయ రహదారితోపాటు పలు చోట్ల వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. విష పురుగులు, శునకాల సంచారంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నియోజకవర్గాల వివరాలు

మండలం	పంచాయతీలు	వీధి దీపాలకు ఖర్చు(రూ.లక్షల్లో)
ఇచ్ఛాపురం	21	21.36
ఇచ్ఛాపురం పురపాలిక	23 వార్డులు	11.34
కంచిలి	31	20.72
కవిటి	23	31.16
సోంపేట	23	38.69
పలాస	19	1.84
పలాస పురపాలిక	31వార్డులు	25.15
మందస	41	34.93
వజ్రపుకొత్తూరు	37	29.30

విద్యుత్తు వృథా ఇలా

వంద ఎల్‌ఈడీ దీపాలున్న గ్రామంలో పన్నెండు గంటలపాటు దీపాలు వెలిగితే సుమారు ఇరవై యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. బిల్లుపరంగా చూస్తే రూ.100 నుంచి 140 వరకు ఖర్చవుతుంది. పగలు కూడా దీపాలు వెలుగుతుండటంతో వృథా రూ.లక్షల్లో ఉంటుంది. 'వీధి దీపాలు నిత్యం వెలుగుతున్న దగ్గర నియంత్రిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. వెలగని దీపాల గురించి పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామ'ని పలాస ఈఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279, 9063144707

సమస్య: చిదంబరేశ్వరాలయం వద్ద రత్నకన్యక వెళ్లే రోడ్డు మలుపులో చెట్టుకొమ్మలు రోడ్డు వరకు పెరిగి ప్రమాదకరంగా మారాయి. – ఎస్.విశ్వనాథం, ఇచ్ఛాపురం

సమాధానం: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - డి.విక్రమ్, ఏఈ, ర.భ.శాఖ ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బోరు పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

పురపాలక సంఘం పరిధి రెండో వార్డులో మందిరిబీడి బోరుబావి పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. బోరు చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ నల్లి రమేష్ స్పందించారు. పుర సిబ్బంది ద్వారా సమస్యను పరిష్కరింపచేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అచ్చెన్నాయుడిని కలిసిన బాబూరావు

పలాస: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని టీటీడీ బోర్డు ఛైర్మన్ వజ్జ బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. 'ట్రెడ్ ప్రమోషన్ కార్యదర్శ సమావేశం సందర్భంగా విజయవాడలో మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. వార్డు ఇన్‌ఛార్జి శంకరరావు పాల్గొన్నారు.

మూసుకుపోతున్న రోడ్డు

కవిటి మండలం నెలవంక నుంచి గొనసపుట్టుగ వెళ్లే పంచాయతీరాజ్ శాఖ రోడ్డు పొదలు, పనికిరాని మొక్కలతో మూసుకుపోయింది. ఎదురుగా వాహనాలు వస్తే తప్పించుకోవడం కష్టంగా ఉందని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా నిధులు రాగానే మొక్కల తొలగింపు కార్యక్రమం చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రేకుల షెడ్డు ఏర్పాటు చేయరూ..

పూండి గేటుకు సమీపంలో అండర్ పాసేజ్ ఏర్పాటు చేయడంతో ప్రయాణం మెరుగుపడింది. వర్షం పడితే మాత్రం వరద నీరు అండర్ పాసేజ్ మీదుగా వెళ్లడంతో అవస్థలు తప్పడం లేదు. ప్రారంభించి రెండేళ్లు అయినా రేకుల షెడ్డు నిర్మించకపోవడంతో రోడ్డు పాడవుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐన్‌చార్జి స్టేషన్ మాస్టర్ పాడిని వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. –న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

రాకపోకలకు నరకయాతన

బెండికొండ వద్ద మండలానికి చెందిన సుమారు 10 పంచాయతీలకు 300 మందికి పైగా జగనన్న కాలనీ స్థలాలు కేటాయించారు. 30 మంది వరకు గృహప్రవేశాలు చేయగా.. మరో 50 మంది నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడ ఒక్క వీధికీ రహదారి లేకపోవడంతో ముళ్లు, గుంతల నడుమ, పెద్ద పెద్ద రాళ్లపై రాకపోకలు చేస్తూ నరకయాతన అనుభవిస్తున్నామని నివాసితులు వాపోతున్నారు. పంచాయతీరాజ్ శాఖ జేఈ నాగభూషణ్‌ను వివరణ కోరగా రహదారి ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. –న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

శిథిలం.. భయం భయం

డొంకూరు సాగర తీర ప్రాంతంలోని మత్స్యకార సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రభాకరరావును వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ముగురు పోదు సమస్య తీరదు

ఎగువ నుంచి వచ్చిన వర్షపు, వాడుకనీరు ముందుకు పారేలా ఉండాల్సిన వరద కాలువ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. పట్టణానికి చేరుకోవాల్సిన వాహనాలన్నీ ఇదే మార్గంలో వస్తున్నాయి. బడిపిల్లలు, ఆసుపత్రికి రోగులు ఇలానే రాకపోకలు సాగిస్తున్నారు. కాలువను పూర్తిస్థాయిలో నిర్మించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కమిషనర్ నల్లి రమేష్ స్పందిస్తూ కౌన్సిల్ తీర్మానం మేరకు సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రైతు సేవా పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్, నాయకులు

స్వర్ణాంధ్ర సాధనలో రైతన్నే కీలకం

సోంపేట, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సాధనలో రైతన్న కీలకం కావాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మామిడిపల్లిలో గురువారం నిర్వహించిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతు సేవా పథకాలు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వ్యవసాయం, ఉద్యానం, పశుసంవర్ధక, ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల పరంగా ప్రభుత్వ చేపడుతున్న పథకాలను అన్నదాతలు సద్వినియోగపర్చుకుని తలసరి ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. మాలగోవిందపురం, మాకన్నపురాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏవో పోలారావు, ఏఎంసీ ఛైర్మన్ విజయలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.జగన్నాథం, తెదేపా మండలాధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

జీఆర్‌పురం మైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

క్రీడలతో మానసికోల్లాసం

సోంపేట, కంచిలి గ్రామీణం, హరిపురం (మందస), న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని వక్తలు అన్నారు. సోంపేట మండలం గొనకపాడు, కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం జడ్పీ, మందస మండలం గుడారిరాజమణిపురం ఉన్నత పాఠశాలల్లో మండలస్థాయి (గ్రిగ్స్) పోటీలు ప్రారంభమయ్యాయి. ★ గొనకపాడులో జరిగిన పోటీల్లో సీనియర్ ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో కర్తలిపాలెం, బారువ, పాలవలస, సోంపేట మోడల్ పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ★ పెద్ద శ్రీరాంపురంలో సీనియర్ బ్యాడ్మింటన్ విభాగంలో ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాల, జూనియర్స్ విభాగంలో మకరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల, సీనియర్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో ఎంఎస్‌పల్లి ఆదర్శ, డీజీపురం జడ్పీ ఉన్నత, జేఎంజే, జూనియర్స్ విభాగంలో వాలీబాల్, కబడ్డీ పోటీల్లో కంచిలి గురుకుల, డీజీపురం ఉన్నత పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఎంఈవోలు జోరాడు, కృష్ణంరాజు, లక్ష్మణరావు, భాస్కరరావు, తెదేపా కంచిలి మండలాధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

బిల్లులు ఇస్తారా... వదిలేసుకోమంటారా

మాట్లాడుతున్న పురాధ్యక్షుడు గిరిబాబు

పలాస, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులుగా వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం తాపత్రయం పడుతుంటే అధికారులు బిల్లులు చేయకుండా సంవత్సరాలుగా వదిలేస్తున్నారని, చేసిన పనులకు బిల్లులు ఇస్తారా లేక వదులుకోమంటారా అంటూ కౌన్సిలర్లు గీత, దుర్గాశంకర్‌పండా ధ్వజమెత్తారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ సాధారణ సమావేశం పురాధ్యక్షుడు బళ్ల గిరిబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. గతంలో పనిచేసిన అధికారులు బిల్లులు చేయలేదని డీఈఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్ తెలపడంతో పురాధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారి బిల్లు పెట్టకపోతే వాస్తవ పరిస్థితి మీరంతా చూసి పనులు జరిగితే ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. కుళాయి కనెక్షన్‌కు తెల్ల రేషన్‌కార్డుదారులు గతంలో రూ.1200, రూ.4500 చొప్పున కడితే సరిపోయేదని, ప్రస్తుతం రూ.10వేలు అంటున్నారని కౌన్సిలర్లు సూర్యనారాయణ, మాధవరావు పేర్కొన్నారు. గడపగడప పనులు పూర్తయినా బిల్లులు మంజూరు చేయకుండా వదిలేశారని, సాధారణ నిధుల ద్వారా బిల్లులు చెల్లించాలని కౌన్సిల్ తీర్మానం చేసినా ఇంతవరకు చెల్లిందలేదని ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. లేబర్‌కాలనీలో పవర్‌బోరు మీటరు తీసుకెళ్లిపోయారని కోఆప్షన్ సభ్యుడు బి.సంతోష్‌కుమార్ తెలిపారు. నూతన పుర కమిషనర్ ఇ.శ్రీనివాసులను కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సత్కారించారు. ఆర్ఐ అమరనాథ్, విద్యుత్తు శాఖ ఏఈలు వివేకానంద, నాగభూషణరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు బాలికలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం కాదా లక్ష్మీకాంతమ్మ పుర బాలికోన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బల్ల శ్రీనివాసరావు తెలిపారు. అండర్-14 విభాగంలో ఎంపికైన జి.చందన, కొంతల కావేరి, చాట్ల హరిత, గుజ్జు యామినిశ్రీ అనకాపల్లి జిల్లా లంకెలపాలెంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాల వద్ద విద్యార్థులు, పీఈటీ లతను ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటరమణ, కృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభకు అభినందన

పలాస, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇందులో కీలక పాత్ర పోషించిన చిన్నబడాం ఉన్నత పాఠశాలకు చెందిన నెయ్యిల కీర్తన, వ్యాయామోపాధ్యాయిని టి.గీతను గురువారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు జగదీశ్వరరావు, షణ్ముఖరావు, గోవిందరావు, నగేష్, నిర్మల, జయలక్ష్మి అభినందించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల వర్షాలకు డొంకూరు తీరంలో ఇసుక తిన్నెలపై ఆరబెట్టిన మత్స్య సంపద తడిచిముద్దయ్యింది. వీటి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని మత్స్యకారులు పేర్కొన్నారు. జూన్‌లో వేట నిషేధం తర్వాత తుపానులు, అల్పపీడనాలు కారణంగా వేట సాగక పూట గడవని పరిస్థితి ఏర్పడిందని, చాలా నెలల తర్వాత వేటకు వెళ్లి తెచ్చుకున్న సంపద నేలపాలవ్వడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయామని వాపోతున్నారు.

ఇసుక తిన్నెలపై ఆరబెట్టిన మత్స్య సంపద

మొంథా ముంచింది.. పరిహారం ఏమైంది..

మరో వారం రోజుల్లో మత్స్య సంపదను ఒడిశాలోని కటక్, భువనేశ్వర్, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా తదితర ప్రాంతాలకు చేరవేసే వాళ్లమని, ఏటా అక్టోబరు వస్తే చాలు ఏదో ఒక విపత్తు వచ్చి భారీగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుపాను సమయంలో చలపరాయి హనుమంతరావు, కోడ తుంబనాథం, చిరంజీవులు, పాపయ్య, దేవరాజు, దేసయ్య తదితర 15 మందికి చెందిన చేపలు ఇసుకలో కలిసిపోయాయని, కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించి మత్స్య సంపద కాపాడుకోవడానికి కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని, తుపానులో నష్టపోయిన బాధితులకు నష్టపరిహారమివ్వాలని కోరుతున్నారు. నష్టపోయిన వారికి ప్రభుత్వం ఆదుకుంటామని చెప్పినప్పటికీ సకాలంలో పరిహారాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని డొంకూరు మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.గురుమూర్తి పేర్కొన్నారు. 'తుపానుతో నష్టపోయిన మత్స్య సంపదపై అంచనాలు సుమారు రూ.8లక్షల వరకు ఉంటుంది. దీని విషయమై ప్రభుత్వానికి పంపించాం. వచ్చిన వెంటనే పరిహారం అందిస్తామ'ని ఇచ్ఛాపురం ఎఫ్‌డీవో మురళీనాయుడు అన్నారు.

ఆదుకుంటాం..

మొంథా తుపానుకు సంబంధించి నియోజకవర్గంలో ఇప్పటికే పలు సమస్యలు పరిష్కరించాం. మత్స్య సంపద విషయం కలెక్టర్ దృష్టిలో ఉంది. నష్టపోయిన మత్స్యకారులకు త్వరలోనే నష్టపరిహారం అందిస్తాం. తీరంలో సౌకర్యాలతోపాటు కోల్ట్ స్టోరేజీ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తా. - బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

కార్యవర్గాల ఎన్నిక

కాశీబుగ్గలో ధ్రువపత్రం అందుకుంటున్న కార్యవర్గ సభ్యులు

ఇచ్ఛాపురంలో..

కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పలాస యూనిట్ ఎన్‌జీవోస్ కార్యవర్గ ఎన్నిక కాశీబుగ్గలో గురువారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా బోనెల గోపాల్, పి.ఉపేంద్రరావు, సహచర అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్ పట్నాయక్, కోశాధికారిగా ఉదయ్‌శంకర్ పాత్రోను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ★ ఇచ్ఛాపురం తాలూకా (ఇచ్ఛాపురం, కవిటి మండలాలు) నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘ అధ్యక్షుడిగా ఇచ్ఛాపురం ఉప తహసీల్దారు శ్రీహరి పట్నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇచ్ఛాపురం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో రెండు మండలాల అధికారులు, సిబ్బందితో ఎన్నికల సమావేశాన్ని జిల్లా జేఏసీ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం నిర్వహించారు. వాసుదేవరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా రామారావు, నీల, షేక్ గఫూర్, సంయుక్త కార్యదర్శులుగా మల్లేశ్వరరావు, భీమాశంకర్, నీలవేణి, నీరజ కోశాధికారిగా ఎస్‌డీ పవన్‌కుమార్ ఎన్నికయ్యారు కార్యవర్గాలను సాయిరాం సత్కరించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెదేపా పట్టణ కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. దానంపేటలో పట్టణ రిసోర్స్ పర్సన్ రవికుమారి అధ్యక్షతన వెంకటేశ్వర మహిళా సమాఖ్య సమాఖ్య కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా వసంత దేవి, కార్యదర్శిగా బొబ్బిలి పుష్ప, ఉపాధ్యక్షురాలిగా లండ జ్యోత్స్న, సంయుక్త కార్యదర్శిగా సరితారాణి మహరణ, కోశాధికారిగా గంట లత ఎన్నికయ్యారు. వీరితో కోటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగొస్తూ రామేశ్వరం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస మండలం వీరరామచంద్రాపురానికి చెందిన పి.సాయి, పెదంచలకు చెందిన ఐ.నవీన్ మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలను బంధువులు స్వగ్రామాలకు తీసుకొస్తున్నారు. రేపు రాత్రికి స్వస్థలాలకు చేరుకునే అవకాశం ఉంది. గాయపడిన వారిలో రాజు, తారకేశ్వరరావులను మెరుగైన వైద్యం కోసం రామనాథపురం నుంచి మదురైలోని ఆసుపత్రికి తరలించారు. గణపతి, గణేష్ రామనాథపురం ఆసుపత్రిలో బాగానే ఉన్నట్లు సమాచారం. ● వీరరామచంద్రాపురంలోని బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించి ధైర్యం చెప్పారు. దుర్యోధనరావు, రవి పాల్గొన్నారు.

గోతిలో పడి ఆవు మృతి

వజ్రపుకొత్తూరు: గరుడభద్ర రహదారి సమీపంలో కేబుల్ విస్తరణ పనుల్లో భాగంగా తవ్విన గోతిలో మేలుజాతి ఆవు పడి మృతి చెందింది. మేత కోసం వచ్చిన క్రమంలో ఆవు గోతిలో పడి ఇరుక్కుపోయింది. ప్రాణాలతో బయటకు లాగేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని బాధిత రైతు భాస్కరరావు వాపోయారు. రూ. లక్ష విలువైన ఆవు మృత్యువాత పడటంతో నష్ట పరిహారం అందించాలని కోరారు.

క్రీడా దుస్తుల వితరణ

హరిపురానికి చెందిన పసిడి వ్యాపారి కె.సత్యవీర్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు క్రీడా దుస్తులు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోపీచందు, వ్యాయామోపాధ్యాయుడు లోకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంచిలి గ్రామీణం : కర్తలి మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర గురువారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

పింఛను కోతలో తగ్గింపు.. పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలికలో పనిచేసిన ఇద్దరి అధికారుల పింఛను కోతలో తగ్గింపు వర్తింపచేస్తూ గురువారం జీవో విడుదలైంది. గతంలో పుర కమిషనర్‌గా పనిచేసిన ఎం.వి.డి.ఫణిరాం, డిప్యూటీ డీఈగా పనిచేసిన భాస్కరరావులకు చిన్నబడాం నుంచి అంతరకుడ్డ రహదారి నిర్మాణంలో ఆరోపణలతో 20 శాతం వరకు పింఛను కోత కోస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఇద్దరు ప్రభుత్వానికి అప్పీల్ చేయడంతో తాజాగా కమిషనర్‌గా పనిచేసి ఎం.వి.డి ఫణిరాంకు 8శాతం, భాస్కరరావుకు 5శాతం పింఛను కోత విధించేలా జీవో నం.1344, 1345ను ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ పేరిట 27వ తేదీన జారీచేసింది.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు ఆకాంక్షించారు. అమరావతిలో మాక్ అసెంబ్లీలో ఇచ్ఛాపురం నియోజకవర్గం తరఫున పాల్గొన్న ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఆరాధ్య పాణిగ్రహిని గురువారం సత్కరించారు. గైడ్ టీచర్ రమేష్, సాంఘికశాస్త్ర ప్రాజెక్టును తయారుచేసిన విద్యార్థులతోపాటు ఇటీవల వివిధ పోటీల్లో విజేతలను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాజపాలో చేరిక

పార్టీలో చేరిన రైతు కుల సంఘ నాయకులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం, సాగునీటి వనరుల అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీలో చేరుతున్నట్లు రైతు కుల సంఘ నాయకులు తిప్పన కూర్మారెడ్డి తెలిపారు. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని, బాహుదానది గ్రోయిన్ల పరిస్థితిని మారకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో భాజపా నాయకులు సిరిపురం తేజేశ్వరరావు, వేణుగోపాలరావు సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. బర్ల ప్రసాద్, జన్నెల వరప్రసాదరావు, దుర్గాశి బాలరాజు, సల్లా మేఘనాథం, అనపాన చంద్రయ, తిప్పన యాదవరెడ్డి చేరారు.

తాత్సారం ఎందుకు.. కాశీబుగ్గ: పలాసకు చెందిన వ్యాపారి కె.శ్రీనివాసరావు తనను కులం పేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు కంబిరిగాం వీఆర్వో వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. బుధవారం ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి 11 వరకు కేసు నమోదు చేయని పరిస్థితిపై పలాస మండలానికి చెందిన వీఆర్వోలంతా కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తిని గురువారం కలిసి విన్నవించారు. కేసు నమోదుకు తాత్సారం ఎందుకని, ఇలా అయితే ఉద్యోగాలు ఎలా చేస్తామని ప్రశ్నిస్తున్నారు. దీనిపై సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ ఫిర్యాదును పరిశీలిస్తున్నామన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం.. కవిటి గ్రామీణం: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఎంఈవో ధనంజయ అన్నారు. బొర్లపుట్టుగ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన కొర్రాయి పద్మనాభం రూ. 15వేలతో పాఠశాల చుట్టూ సిమెంటు స్తంభాలు వేసి కంచెను నిర్మించారు. ప్రధానోపాధ్యాయులు మురళి, జ్యోతి, ఎస్ఎంసీ ఛైర్మన్, తల్లిదండ్రులు ఆయనను అభినందించారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మాకో దారి చూపండి..

ఎల్ఎన్‌పేట మండలం తురకపేట గ్రామంలో జగనన్న కాలనీకి రహదారి సౌకర్యం కల్పించండని స్థానికులు వాపోతున్నారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి కనీసం రోడ్డు ఆనవాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి రహదారైనా నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

రేపు టెక్కలిలో ఉద్యోగ మేళా

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న స్కిల్‌హబ్ కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న వారు హాజరు కావొచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

గళం విప్పి.. బహుమతులు పట్టి

టెక్కలి మండలం పోలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమవుతాయని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎన్.కృష్ణారావు తెలిపారు. పోటీల్లో కూన భార్గవి (9వ తరగతి), లక్ష్మీప్రియ దాస్ (10వ తరగతి), పెద్దింటి ఇషాక్ (9వ తరగతి) వరుస మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

రీసర్వే చేయాలి.. కొత్తూరు, న్యూస్‌టుడే: పాడలి, దుగ్గుపురం రెవెన్యూ గ్రామాల్లోని మిగులు భూములకు రీసర్వే చేయాలని మండలంలోని గూనభద్ర ఆర్అండ్ఆర్‌కాలనీ పంచాయతీ సర్పంచి పి.సాధుబాబు, నిర్వాసితులు కోరారు. ఈ మేరకు టెక్కలిలో ఆర్డీవో కృష్ణమూర్తికి ఈ సమస్యపై వినతిపత్రం అందించారు. తమ సమస్యపై ఆర్డీవో సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

నత్తనడక.. నీరివ్వక

– న్యూస్‌టుడే, సారవకోట, పోలాకి, నరసన్నపేట గ్రామీణం, జలుమూరు

అసంపూర్తిగా జల్‌జీవన్ మిషన్ పనులు

కేంద్రప్రభుత్వం ఉన్నతమైన ఆశయంతో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేసింది. ప్రతి ఇంటికి కుళాయిలు అమర్చి తాగునీరందించాలని నిర్ణయించింది. ఆశయం బాగున్నా అమలు సరిగా లేకపోవడంతో తాగునీటి కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2020లో ప్రారంభమైన ఈ పథకం పనులు నేటికీ నత్తనడక సాగుతున్నాయి.

● రెండు, మూడు మండలాలకు సంబంధించిన ఒకే గుత్తేదారుకు బాధ్యతలు అప్పగించడం, సకాలంలో బిల్లులు అందని కారణంతో పనులు ముందుకు సాగడం లేదు. గార, శ్రీకాకుళం, సారవకోట మండలాలకు సంబంధించి ఒకే గుత్తేదారు పనులు చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చితో గడువు ముగియనున్నప్పటికీ 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

కోదడ్డపనస వద్ద అసంపూర్తిగా ట్యాంక్ నిర్మాణం

నరసన్నపేట నియోజకవర్గ వివరాలు			
మండలం	పంచాయతీలు	మంజూరైనవి	పూర్తయినవి
సారవకోట	35	141	39
పోలాకి	31	90	15
నరసన్నపేట	34	139	78
జలుమూరు	40	136	37

★ పోలాకి మండలంలో పల్లిపేట, కింజరాపువానిపేట, అంపలాం, తెల్లవానిపేట, ప్రియాగ్రహారం తదితర గ్రామాల్లో కుళాయిలు, పైపులు వేసి వదిలేశారు. నరసన్నపేట మండలంలో కామేశ్వరరావు, బాలసీమ, ముద్దాడపేట తదితర గ్రామాల్లో పైపులు అమర్చినప్పటికీ నీరు సరఫరా చేయడం లేదు.

లచ్చన్నపేటలో ఇళ్ల ముందు నిరుపయోగంగా ఉన్న పైపులు

● సారవకోట మండలంలో వాండ్రాయి, కోనవానిపేట, చోడసముద్రం, అన్నుపురంలో సవరపేట, మదనాపురం, పెద్దగుజ్జువాడ తదితర గ్రామాల్లో పైపులు అమర్చినప్పటికీ నీరు సరఫరా కావడం లేదు. మండలంలో 52 ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా 19 పూర్తికాగా, 10 వివిధ దశల్లో ఉన్నాయి. మర్రిపాడులో ఈ పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు లాంఛనంగా ప్రారంభించినప్పటికీ నీరు అందట్లేదని సర్పంచి భానుమతి మండల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

● జలుమూరులో పెద్దదూగాం, లింగాలవలస, లచ్చన్నపేట, హరికృష్ణంపేట, దరివాడ, జోనంకి తదితర గ్రామాల్లో పైపులు వేసినా చుక్కనీరు ఇవ్వడం లేదు.

సకాలంలో పూర్తికి కృషి..

జల్‌జీవన్ మిషన్ పనులు మార్చిలోగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచిస్తున్నాం. చేసిన వాటికి బిల్లులు అందక గుత్తేదార్లు పనులు వేగవంతం చేయడం లేదు. త్వరలోనే చెల్లింపులు జరిగే అవకాశం ఉంది.

– మధుబాబు, శ్రీనివాసరావు, కనకేశ్వరరావు ఏఈలు

రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ

బుడితి మిల్లు వద్ద సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సారవకోట, పోలాకి, న్యూస్‌టుడే: బుడితి కూడలిలోని ఓ రైస్ మిల్లును జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లు ఆవరణలో ధాన్యం బస్తాల నిల్వలను పరిశీలించారు. రైతుల వివరాలు తెలియజేయాలని ఏవో వెంకటరావుకు సూచించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ షరీఫ్ పాల్గొన్నారు. ★ ధాన్యం తెచ్చే వాహనాల వల్ల రైతులు ఇబ్బంది పడకూడదని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. ఈదులవలస గ్రామంలో రైస్ మిల్లును ఆమె తనిఖీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో పాల్గొన్నారు.

గీతాయజ్ఞానికి ఎమ్మెల్యే విరాళం

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని కె.గోపాలపురంలో శివానంద కుటీర్‌లో 10 రోజులుగా జరుగుతున్న శ్రీమద్భగవద్గీత జ్ఞానయజ్ఞంలో గురువారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు రూ.50 వేలు నగదు విరాళం ఇచ్చారు.

విద్యుత్తు స్తంభాలు తొలగించరూ

పాతపట్నం మండలం సీతారాంపల్లి రైలు రహదారి అండర్ పాసేజ్ వద్ద పాతపట్నం నుంచి టెక్కలి వెళ్లే ప్రధాన మార్గంలో విద్యుత్తు స్తంభాలు పక్కకు తొలగించకుండానే రోడ్డు నిర్మించారు. రెండేళ్లు కావొస్తున్నా స్తంభాలు మార్చకపోవడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇదే విషయాన్ని విద్యుత్తు శాఖ ఏఈ వద్ద ప్రస్తావించగా స్తంభాలు తొలగించేందుకు రైల్వే శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. వచ్చిన తరువాత సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

రాళ్లు తేలి అధ్వానం..

గులుమూరు నివగాం బీటీ రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల వంశధార నది పోటెత్తడంతో గులుమూరు-ఆకులతంపర మధ్య రోడ్డు పైనుంచి వరద పొలాల్లోకి ప్రవహించడంతో మార్గం దెబ్బతింది. సోమరాజపురం నుంచి మదనాపురం మీదగా నివగాం వరకు ఉన్న రెండు కి.మీ పొడవునా గుంతలు ఏర్పడి వాహనాలు దిగబడిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఏఈ గోపాలరావు మాట్లాడుతూ రోడ్డు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, హిరమండలం

పూడ్చేయండి సారూ..

టెక్కలిలోని తెలుగు బ్రాహ్మణవీధి నుంచి తెలుకల వీధికి వెళ్లే మార్గంలో రహదారి పక్కనే ఉన్న బంద ప్రమాదకరంగా మారింది. పూడికలు పేరుకుపోయి, చెత్త పడేస్తుండటంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం రక్షణ కంచె లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. బందను పూడ్చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

దుర్వాసన.. దోమల మోత

కొత్తూరు మండలంలోని ఆసుపత్రి కూడలి నుంచి నేతాజీనగర్ కాలనీకి వెళ్లే దారిలోని హడ్డుబంగి గెడ్డలో పూడిక పేరుకుపోయింది. దీంతో దుర్వాసన, దోమల మోతతో ఇక్కట్లు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. పూడిక తొలగించి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కర్లెమ్మ పంచాయతీ కార్యదర్శి రాధారాణి తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

వద్దన్నా వినరే..

జాతీయరహదారిపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపివేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల పలు ప్రమాదాలు చోటుచేసుకున్నా లారీలు ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కరించడమే ప్రజాదర్బార్ లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం మర్రిపాడు పంచాయతీలో జరిగిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మోహనరావు, ఏఎంసీ ప్రతినిధి భైరిసింగి దినకర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సందడిగా గ్రిగ్స్ పోటీలు

మెళియాపుట్టి: జాడుపల్లిలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

కూటమి ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని వక్తలు అన్నారు. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో గురువారం మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాలీబాల్ కబడ్డీ, ఖోఖో క్రీడల్లో విద్యార్థులు సత్తాచాటి నియోజకవర్గ పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బృందం

జలుమూరు: విజేతలతో ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు తదితరులు

ఉర్లాంలో క్రీడా జ్యోతితో ఎమ్మెల్యే రమణమూర్తి

నేడు సర్వసభ్య సమావేశం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ టి.హేమసుందరరావు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ఎ.గణేష్, బి.ప్రసాద్, పి.వంశీ, ఎస్.అయ్యప్ప పాల్గొని సత్తాచాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభినందించారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

రైతులకు అన్యాయం చేస్తే చర్యలు

జలుమూరు, కొత్తూరు, సంతబొమ్మాళి, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: రైతుల వద్ద నుంచి మిల్లర్లు ధాన్యం దోపిడీకి పాల్పడితే మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. జలుమూరు మండలం కూర్మనాథపురంలో 'రైతన్నా..మీ కోసం' కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు.● రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని నరసాపురం ఎంపీటీసీ సభ్యుడు ఎం. రామచంద్రరావు పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం నరసాపురంలో ఆయన పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుతో లాభం

జలుమూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపేటలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ధాన్యం రవాణా వాహనాల్లో జీపీఎస్ సమస్య

నరసన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో జీపీఎస్ సమస్యలతో ధాన్యం రవాణా చేసే వాహనాలు మిల్లుల వద్ద రిలీజ్ కాక నిలిచిపోయాయి. నరసన్నపేట మండలంలో 15 వాహనాల్లో ఈ సమస్య తలెత్తింది. వాహనాలు మిల్లుల వద్దకు చేరుకుని ధాన్యం అన్‌లోడ్ చేసినా, జీపీఎస్‌లో చూపించడంలేదని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై పౌరసరఫరాల డీటీ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా, సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గుణచరణ్‌కు అభినందన

సారవకోట, న్యూస్‌టుడే: అమరావతిలో ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న బుడితి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మాసవరపు గుణచరణ్‌ను ఎంఈవోలు ఎం.వెంకటరమణ, కె.భూలక్ష్మి అభినందించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యుడు ఎం.మురళీకృష్ణ, హెచ్‌ఎం జి.రాము, ఎస్ఎంసీ ఛైర్మన్ బీమారావు పాల్గొన్నారు.

డిపాజిట్ల రూపంలో 50 శాతం పొదుపు మొత్తాలు

సారవకోట: మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు పొదుపు చేసిన మొత్తంలో 50 శాతం సదరు బ్యాంకుల్లోనే ఫిక్సిడ్ డిపాజిట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఏపీఎం శ్రీనివాస్ బాబా అన్నారు. ఈ మేరకు బ్యాంకు అధికారులను కలిసి ప్రభుత్వ సూచనలు తెలియజేశారు

పెట్రోలు బంకు ఏర్పాటుకు శంకుస్థాపన

టెక్కలి పట్టణం: స్థానిక పాత పోలీస్‌స్టేషన్ స్థానంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శంకుస్థాపన చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బంకును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కేవీ రమణ, డీఎస్పీ డి.లక్ష్మణరావు, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, సీఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లన్నకు తెదేపా నేతల పూజలు

రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో రూ.3 కోట్ల నిధులు మంజూరుకావడంపై తెదేపా నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, తెదేపా నేతలు పాల్గొన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు ఆధ్వర్యంలో తెదేపా నాయకులు కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు.

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం, కోటబొమ్మాళి

ఆహార పొట్లాల వితరణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో అభయం ఫుడ్‌బ్యాంకు 1,200 రోజులు పూర్తి చేసుకున్నట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో దండాసి రాజేష్, మోహిని దంపతులు కుమార్తె రక్షిత పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. సంఘ ప్రతినిధులు లాడి కామేశ్వరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సత్తా

టెక్కలి పట్టణం: టెక్కలిలోని బీఎస్‌జేఆర్ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి బొడ్డ గణేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 24, 25న పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించి అర్హత సాధించాడని ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారుడిని కరస్పాండెంట్ కోట మురళీధర్, శిక్షకుడు బాబూరావు, అధ్యాపకులు అభినందించారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: సుందరాడ పంచాయతీ కూర్మాన్నపేట వద్ద 7 లీటర్ల నాటుసారాతో ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు టెక్కలి ఆబ్కారీ సీఐ షేక్ మీరాసాహెబ్ తెలిపారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యం కొనండయ్యా..!

మిల్లు నుంచి వెనక్కి వచ్చిన ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతు మాధవరావు

సారవకోట, న్యూస్‌టుడే:సారవకోట మండలంలోని బద్రి గ్రామ పరిధిలో ఉన్న సుమారు 400 ఎకరాల్లో వరి చేను కోతలు, నూర్పిడి ప్రక్రియ పూర్తయ్యింది. 100 ఎకరాలకు చెందిన ధాన్యం మిల్లులకు చేరాయని, మిగతా భూములకు సంబంధించి సుమారు 3 వేల బస్తాలు గ్రామం చుట్టూ ఉన్న కల్లాల్లో నిల్వ ఉన్నట్లు రైతులు తెలిపారు. ధాన్యం నుంచి నూక అధికంగా వస్తుండటంతో కొనుగోలు చేయడానికి మిల్లర్లు ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ట్రాక్టర్లతో మిల్లులకు చేర్చిన ధాన్యాన్ని దించకుండా తిప్పిపంపించారని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేను తడవడంతో నూక శాతం పెరిగిందని, ఈ విషయాన్ని అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తమ ధాన్యం కొనుగోలు జరిగే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏవో వెంకటరావు వద్ద ప్రస్తావించగా తహసీల్దార్, పౌరసరఫరాల విభాగం డీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీనివాసనగర్‌లో అభివృద్ధి పరుగు

– న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

శ్రీనివాసనగర్ అంటేనే సమస్యల కాలనీ అని పేరు ఉండేది. మురుగు కాలువలు లేక, వీధి రోడ్లు అధ్వానంగా ఉండి స్థానికులు నానాపాట్లు పడుతుండేవారు. ఇప్పుడా సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారమయ్యే పరిస్థితి వచ్చింది. టెక్కలి పట్టణంలో మొదటి ప్రాధాన్యతగా శ్రీనివాసనగర్‌ను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభివృద్ధి చేశారు. ఈ క్రమంలోనే దశాబ్దాల తరబడి పేరుకుపోయిన ముంపు సమస్య, లోతట్టు ప్రాంతాల రహదారి సమస్యకు ముగింపు పలికారు.

కాలనీ పేరు : శ్రీనివాసనగర్
వీధులు : 14
మొత్తం నివాస గృహాలు : 580
జనాభా : 1,950

● శ్రీనివాసనగర్‌లో సమస్యల పరిష్కారాన్ని కేవలం రాజకీయ అవసరం కోసమో, మొక్కుబడి బిల్లుల కోసమో కాకుండా ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేస్తున్నారు. స్వయంగా రాష్ట్ర మంత్రి పర్యవేక్షణతో ఎక్కడికక్కడ తగు సూచనలు చేయడంతో ఇంజినీరింగ్ అధికారులు మరింత అప్రమత్తంగా పనులు చేయిస్తున్నారు.

● ఇప్పటికే రూ.70 లక్షలతో రహదారులు, కాలువలు నిర్మించారు. వీటికి తోడు శ్రీనివాసనగర్ పైభాగంలో ఉన్న పిల్లల బంద గట్టుపై ఆక్రమణలు తొలగించి బాపారెడ్డి కాలనీ వరకు రహదారి నిర్మించనున్నారు. ఇప్పటి వరకు సరైన కాలువల్లేక ఇళ్లల్లోకి మురుగు వచ్చేది. ఇప్పుడు పటిష్ఠమైన మురుగు వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రతి వీధికి పక్కాగా సిమెంటు రహదారులు నిర్మించారు. వెయ్యికి పైగా మధ్యతరగతి కుటుంబాలు ఉంటున్న ఈ కాలనీ టెక్కలి నడిబొడ్డున అభివృద్ధి చెందింది. మరో రూ.కోటితో అవసరమైన పనులు ప్రారంభించారు. ఎక్కడా పనులు పెండింగు అనే ప్రస్తావన లేకుండా అన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపిస్తున్నారు.

అభివృద్ధి చేసిన కాలువ, రహదారి

● ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మురుగునీరు నిల్వ ఉండటంతో బావులన్నీ కలుషితమయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంటోంది. పట్టణ నడిబొడ్డునే ఉన్న ఈప్రాంతానికి పూర్తిగా కుళాయిలు లేవు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుచేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన కాలువలు, రహదారులు మాదిరిగానే కుళాయిల ఏర్పాటు చేస్తే కూడా ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో పనులు.. శ్రీనివాసనగర్‌లో ఎక్కడా సమస్య అంటూ లేకుండా పూర్తిస్థాయిలో పనులు చేయిస్తున్నాం. అన్ని వీధులకు రహదారులు, కాలువలు నిర్మిస్తాం. రాష్ట్ర మంత్రి ప్రత్యేక చొరవతో నిధుల లేమి లేకుండా సహకరిస్తున్నారు. పెండింగ్ పనులు సైతం పూర్తిచేస్తాం.

– ఎస్ఎల్ నాయుడు, మండల ఇంజినీరింగ్ అధికారి, టెక్కలి

ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం

కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సూరజ్‌సింగ్ ఠాగూర్‌ను అభినందిస్తున్న పార్టీ నేతలు

టెక్కలి: కాంగ్రెస్‌లో ప్రజల మనోభావాలకు ప్రాధాన్యత ఉంటుందని పార్టీ జాతీయ కార్యదర్శి సూరజ్‌సింగ్ ఠాగూర్ అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గురువారం టెక్కలిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, పీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట శివప్రసాద్, జిల్లా నేతలు పాల్గొన్నారు.

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఉపన్యాసం భేష్..

ఆమదాలవలస పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ లక్ష్మీనగర్ పాఠశాలలో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం'పై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో డి.యశస్వి(10వ తరగతి), పి.బాలామణి (10వ తరగతి), కె.మేఘన (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణయ్య, ఉపాధ్యాయులు సీహెచ్.వి.ఎస్ మూర్తి, బి.శ్యాంసుందరరావు, టి.భారతి, కె. సుజాత, బి.జనార్దనరావు విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

చక్కగా మాట్లాడారు.. బహుమతులు పొందారు

శ్రీకాకుళం నగర పరిధి అరసవల్లిలోని విజ్ఞాన్ స్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. కె.మధుశ్రీ (7వ తరగతి), ఎన్.నిహారిక (8వ తరగతి), ఆర్.భవ్యశ్రీ (10వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ అప్పారావు తదితరులు బహుమతులు అందజేశారు. -న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

30న జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదుల వనభోజనాలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ఈ నెల 30న న్యాయవాదుల వనభోజనాలు నిర్వహించనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం కిల్లిపాలెం సచివాలయం లే-అవుట్‌లో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ముగిసిన శిర్డీ సాయి సప్తాహ పారాయణం

శ్రీకాకుళం సాంస్కృతికం: శ్రీకాకుళం నగరం విశాఖ బీ కాలనీ శిర్డీ సాయి మందిరంలో వారం రోజులుగా నిర్వహించిన సప్తాహ పారాయణం గురువారం ముగిసింది. మహా పూర్ణాహుతి, మహా అన్నదానం జరిగాయి. ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

● మారుతి: మదన తరహా ● కె ర్యాంప్: ది గర్ల్‌ఫ్రెండ్ ● కీర్తన: జటాధర ● కీర్తి: స్కూల్ డేస్ ● ఎస్‌వీసీ(రామలక్ష్మణ): రివాల్వర్ రీటా ● సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి ● సన్‌ప్యాలెస్: తేరే ఇష్క్ మైనే ● సరస్వతి: ఆంధ్రా కింగ్ తాలూకా - న్యూస్‌టుడే, పాతబస్టాండ్

స్తంభం సరి చేశారు

స్పందనకు వందనం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం కింతలి కనిమెట్ట గ్రామాల మధ్య విద్యుత్తు స్తంభం ఒక వైపునకు వాలిపోయింది. రాకపోకలు చేసేవారు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ నెల 25న 'వాలింది.. భయపెడుతోంది..' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో విద్యుత్తు శాఖ ఏఈ సుధీర్ స్పందించి స్తంభం సరి చేశారు.

నరికేసి.. నాశనం చేసి..!

● అక్రమంగా కలప రవాణా ● పట్టించుకోని అధికారులు

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

గొడ్డలి వేటుకు పచ్చని చెట్లు నేలకొరుగుతున్నాయి. అక్రమార్కులు ఇష్టానుసారంగా నరికేస్తూ.. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో విలువైన కలప ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది.

➤ వాల్టా చట్టం ప్రకారం ఎక్కడైనా చెట్లు నరికేస్తే తహసీల్దారు అనుమతి పొందాలి. అనంతరం నరికిన చోట కొత్తగా మొక్కలను నాటాలి. ఈ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు. పర్యవేక్షించాల్సిన అటవీ శాఖ, రెవెన్యూశాఖ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వారికి సొమ్ములు అందడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

➤ టేకు, వేప, నేరేడు, నిద్రగన్నేరు, గుగ్గిలం చెట్లు గృహ నిర్మాణాల కోసం వినియోగిస్తారు. దీంతో కొంతమంది విక్రయించేందుకు చెట్లు నరికేస్తున్నారు.

➤ పొందూరు మండలంలో 5 డిపోల్లో కలప నిల్వలు ఉన్నాయి. ఇక్కడే కాకుండా నరికేసిన కలప రాజాం, పాలకొండ, రణస్థలం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

➤ బూర్జ మండలంలో చీడివలస, లాభాం, కొరగాం, ఆమదాలవలసలో నాగావళి నది తీర ప్రాంత గ్రామాలైన జీకే వలస, కొరపాం, కొత్తవలస, ముద్దాడపేట, దూసితోపాటు వంశధార తీర పల్లెలు చెవ్వాకులపేటలో అక్రమంగా దందా సాగుతోంది.

డిపోలో నిల్వ ఉంచిన దుంగలు

➤ సరుబుజ్జిలి మండలంలో రొట్టవలస గ్రామంలో మూడు డిపోలు ఉన్నాయి. వంశధార నది తీర ప్రాంతం కావడంతో ఒడ్డున ఆనుకున్న భారీ వృక్షాలపై వేటు పడుతోంది. ఆమదాలవలస, పాలకొండ, రాజాం, సరుబుజ్జిలి ఇతర ప్రాంతాల డిపోలకు రాత్రి వేళల్లో తరలిస్తున్నా. పట్టించుకునే నాథుడు లేరు.

➤ 'కలప అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. నిఘా ఉంచాలని వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చాం'అని తహసీల్దార్లు ఆర్.వెంకటేశ్, పద్మావతి, మధుసూదన, రాంబాబు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే

?: కృష్ణాపురం నుంచి శ్రీకాకుళం పాలకొండ ప్రధాన కూడలి వరకు రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించారు. -మోహనరావు, స్థానికుడు. ☛: త్వరలోనే తొలగిస్తాం. - టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

?: పార్వతీశంపేట కూడలి, సంపతేశ్వర దేవాలయం ఆవరణలో మద్యం తాగుతున్నారు. -రామ, స్థానికురాలు ☛: నిఘా ఏర్పాటు చేస్తాం. -బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

?: గార మండలం బందరువానిపేటలో కాలువలు లేక మురుగు సమస్య తీవ్రంగా ఉంది. - స్థానికుడు ☛: రూ.15 లక్షలతో కాలువలు అభివృద్ధి చేస్తాం. - పైడి రూప్‌రాణి, పంచాయతీ కార్యదర్శి, బందరువానిపేట

?: శ్రీకాకుళం నగర పరిధి జానకిరామ్ నగర్ కాలనీ రిజర్వు స్థలంలో శిథిలావస్థ చేరుకున్న ఉద్యానవనాన్ని పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలి. - డి.నిరంజన్ ☛: నిధుల లభ్యత మేరకు పార్కు పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. - కె.శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ - న్యూస్‌టుడే, గార, శ్రీకాకుళం నగరం

వైభవంగా పడి పూజ

శ్రీకాకుళం నగర పరిధి పాతబస్టాండ్ సమీపంలో గురువారం అయ్యప్ప పడి పూజ, భజన వైభవంగా నిర్వహించారు. భవానీశంకర్ ఆధ్వర్యంలో రంగాలక్ష్మి శ్రీను గురుస్వామి పర్యవేక్షణలో క్రతువు జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు శరణుఘోషతో ఆ ప్రాంతం మారుమోగింది. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో) ● టమాటాలు 56 ● వంకాయలు 40/50 ● బెండ 54 ● పచ్చిమిర్చి 50 ● కాకర 50 ● బీర 50 ● క్యాలీఫ్లవర్ 25/30/35 ● క్యాబేజీ బుట్ట 30 ● క్యారెట్ 44/50 ● దొండ 30 ● బంగాళదుంపలు 22 ● ఉల్లిపాయలు 20/24 ● గోరుచిక్కుడు 54 ● ఆనప 30 ● అరటికాయ(జత) 18. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

మట్టి తొలగించండి

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం కూడలి వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఇరువైపులా పెద్ద ఎత్తున మట్టి పేరుకుపోయింది. కుశాలపురం గ్రామం, సింహద్వారం, నవభారత్, ఫరీదుపేట, చిలకపాలెం తదితర ప్రాంతాల్లో మట్టి పేరుకుంది. జాతీయ రహదారి ప్రాధికారసంస్థ డిప్యూటీ మేనేజర్ సి.హెచ్.సతీష్ దృష్టికి తీసుకెళ్లగా మట్టి తొలగిస్తామన్నారు. –న్యూస్‌టుడే,ఎచ్చెర్ల

అడుగడుగునా గోతులే

ఎచ్చెర్ల మండలం జరజాం పంచాయతీలోని తంగివానిపేట నుంచి సంతసీతారాంపురం వెళ్లే మట్టి రహదారి అడుగడుగునా పెద్ద పెద్ద గోతులతో నిండింది. రాత్రి వేళల్లో రహదారిపై దీపాలు లేకపోవడంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు వేయడంతోపాటు దీపాలు వేయాలని కోరుతున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి డి.సూర్యచంద్ర వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

పైరు కాదు.. పనికిరాని మొక్కలు

పెద్ద వెంకటాపురం సాగునీటి చెరువులో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దట్టంగా పనికిరాని మొక్కలు పెరిగాయి. దీంతో నీరు గట్లపై నుంచి బయటకు పోతోంది. రైతులు పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. నీటిపారుదల శాఖ జేఈ దాలయ్య వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా తొలగిస్తామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

శునకాల స్వైరవిహారం

శ్రీకాకుళం నగర పరిధి భైరివానిపేట పరిసర ప్రాంతాల్లో శునకాలు గుంపుగా సంచరిస్తూ స్థానికులపై దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి వేళ బయటకు రావడానికి భయపడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి పి.సుధీర్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

కాలువలు నిర్మించరూ..!

పొందూరు మండలం కొంచాడ గ్రామ పరిధిలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో మురుగు కాలువ లేకపోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. గ్రామస్థులు, రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్థానిక ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

లింగ వివక్ష తగదు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో లింగవివక్షత చూపకూడదని వెలుగు ఏపీఎం నారాయణరావు, సర్పంచి ప్రతినిధి సనపల అప్పలనాయుడు అన్నారు. గురువారం ఆమదాలవలస మండలం కొర్లకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో లింగవివక్షతపై మాట్లాడారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

ఐశ్వర్య ఉత్సవ్‌ను జయప్రదం చేయండి

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 13 నుంచి 18 వరకు తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలోని ఏకం క్షేత్రంలో నిర్వహించే ఐశ్వర్య ఉత్సవ్ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చంద్రశేఖర దాసా(ఏకం క్షేత్రం) పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏకం అనుగ్రహ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో మెట్ట మోహనరావు అన్నారు. గురువారం ఆమదాలవలస మండలం కట్యాచార్యులపేట గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

న్యాయం చేయాలి

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం పెనసాం పంచాయతీ సేతుభీమవరం గ్రామ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు పడకపోవడంతో వారంతా గురువారం న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రెండు విడతల్లో కూడా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. న్యాయం చేయని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి అన్నాభిషేకం

శ్రీకాకుళం నగరం గుడి వీధిలోని ఉమారుద్రకోటేశ్వరాలయం వద్ద సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం సుబ్రహ్మణ్యస్వామికి అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఆలయ పనులు ప్రారంభం.. ఆమదాలవలస గ్రామీణం: ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామంలో గురువారం ఆంజనేయస్వామి ఆలయ పనులు ప్రారంభించారు. గ్రామస్థులు పాల్గొని భూమి పూజ చేశారు.

అలరించిన నాదస్వర నీరాజనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులోని బాపూజీ కళా మందిరంలో ఆరామ ద్రావిడ సంఘం, సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో దివంగత ఇప్పిలి జోగారావు జయంతి వేడుకలు, సంగీత మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన కేరళకు చెందిన కళాకారులు కన్నన్, ఆనంద్ సోదరుల నాదస్వర సంగీత నీరాజనం అలరించింది. నాదస్వర కళాకారుడు రాళ్లపాటి అచ్చెన్నను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి జోగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్మశానంలో ధాన్యం ఆరబోత

రైతులు ధాన్యం ఆరబోతకు స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సరుబుజ్జిలి మండలం వీరమల్లిపేట గ్రామంలో శ్మశానవాటికలోని సీసీ రహదారిలో పలువురు అన్నదాతలు ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. అనంతరం వాటిని బస్తాలకు ఎత్తి అక్కడ ఉంచేస్తున్నారు. – న్యూస్‌టుడే,సరుబుజ్జిలి

ఆహారం బాగుండాలి

పొందూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు సౌకర్యాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవో వాసుదేవరావు అన్నారు. పొందూరు పట్టణంలో బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని తెలిపారు. విద్యార్థుల ప్రగతికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం బురిడికంచరాం గ్రామంలో సచివాలయాన్ని సందర్శించారు.

పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో వాసుదేవరావు

పర్యటించి.. సమస్యలు తెలుసుకుని..!

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రధాన రహదారిలోని పలు వార్డుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే కూన రవికుమార్ పర్యటించారు. వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు. మెట్టక్కివలస, పాతినవారివీధి, పూజారిపేట, తహసీల్దారు కార్యాలయం, కాలేజీ రోడ్లలో కలియతిరుగుతూ నివాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు నీటితో అవస్థలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, పారిశుద్ధ్య నిర్వహణ ఇతర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే అన్ని వార్డుల్లో కాలువలతో కూడిన రహదారులు, విద్యుత్తు దీపాలు, తాగునీటి సౌకర్యం, పార్కులు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

దుకాణదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

జి.సిగడాం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, భాజపా మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి అన్నారు. జి.సిగడాం మండలం పాలకండ్యాం, సంతవురిటి గ్రామాల్లో గురువారం 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు.

యాంత్రీకరణతో మొక్కజొన్న సాగులో దిగుబడి బాగు

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం గుమ్మడాంలో యాంత్రీకరణ పద్ధతిలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డబుల్ మార్కర్ యంత్రం ద్వారా మొక్కజొన్న విత్తనాలు వేసే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. దుక్కి దున్నకుండా నేరుగా విత్తనం వేసుకోచ్చని సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. తక్కువ ఖర్చు, రైతుకు సమయం ఆదా అవుతుందని, దిగుబడి బాగుంటుందన్నారు.

అవయవదానం.. మరొకరికి ప్రాణదానం

పొందూరు, న్యూస్‌టుడే: ఒక మనిషి అవయదానంతో మరో ఎనిమిది మందికి ప్రాణ దానం చేయొచ్చని ప్రభావతి జాగృతి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ అవయవదానం సందర్భంగా పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెయిన్ డెడ్‌తో వేలాది మంది మృతి చెందుతున్నప్పటికీ అవగాహన లోపం కారణంగా అవయవదానానికి ముందుకు రావడం లేదన్నారు. విద్యార్థులు కుటుంబాల్లో, గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రణస్థలం, పొందూరు గ్రామీణం, ఎచ్చెర్ల, లావేరు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వాడలో మండలస్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ● పొందూరు మండలం పిల్లల వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ● ఎచ్చెర్ల మండలం బడివానిపేట జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన ఉప్పాడ మధు, చందులు రాష్ట్రస్థాయి బాలికల అండర్-14 పోటీల్లో సత్తా చాటారు. 9వ తరగతి చదువుతున్న మధు కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం 7వ తరగతి చదువుతున్న చందు 80 మీటర్ల హర్డిల్స్‌లో 3వ స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. ● లావేరు మండలం వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. బాలికల బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ సీనియర్, జూనియర్ విభాగాల్లో మొదటి స్థానం, కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు తెలిపారు.

సరికొత్త రుచులు అందించండి

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాకు సరికొత్త రుచులు అందించాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, తెలుగు మహిళ శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ ఖుషి గ్రాండ్‌ను గురువారం వారు ప్రారంభించారు. యజమాని పాగోటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

హోటల్ ఖుషి గ్రాండ్‌ను ప్రారంభిస్తున్న మెండ దాసునాయుడు, గొండు స్వాతి

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

గార (వాడాడ), న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం వాడాడలో గురువారం 'రైతన్నా..మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కరపత్రాలు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అన్నీ శిథిలం.. అయినా నిర్లక్ష్యం..!

● దైన్యస్థితిలో పశువైద్య కేంద్రాలు

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి

ఆమదాలవలస నియోజకవర్గంలో పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో సిబ్బంది విధులు నిర్వహణకు సమస్యలు తలెత్తుండగా వైద్య సేవలు అందక పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆమదాలవలస ప్రాంతీయ పశువైద్య కేంద్రం

● ఆమదాలవలస పట్టణంలో ప్రాంతీయ పశువైద్య కేంద్రం ఏళ్ల కిందట నిర్మించారు. నిర్వహణ లేకపోవడంతో పాత, కొత్త రెండు భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. వర్షాలు కురిస్తే ఔషధాలు, దస్త్రాలు తడిసి ముద్దవుతున్నాయి. మండలంలోని వంజంగి, దూసి, కనుగులవలస, కొర్లకోట, అక్కులపేట గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం పడితే సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు.

● బూర్జ మండలంలో అల్లెన, సరుబుజ్జిలి మండలంలో షళంత్రి పశువైద్య కేంద్రాల్లో పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. పెద్ద పరిమాణంలో పెచ్చులు ఊడి సిబ్బందిపై పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని, కొన్ని కేంద్రాలకు మరమ్మతులు చేయాలన్నారు.

● 'ఆమదాలవలస నియోజకవర్గంలోని పశువైద్య కేంద్రాల నూతన భవనాలు నిర్మాణం విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. డబ్బు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.' అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు.



లోపల పెచ్చులూడిన పైకప్పు

మండలం	ప్రాంతీయ కేంద్రాలు	ఆసుపత్రులు	గ్రామీణ
ఆమదాలవలస	1	5	0
సరుబుజ్జిలి	1	3	0
బూర్జ	3	0	4
పొందూరు	1	2	2

ప్రాంగణ నియామకాల్లో 70 మంది ఎంపిక

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం చిలకపాలెం సమీపంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ రెండు రోజులపాటు ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించింది. 150 మంది పాల్గొనగా 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

మహారాజశ్రీ పలాస సివిల్ జడ్జి(స్) (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S 108/2024

Between:
తంగుడు రామారావు ...వాది
And:
పొట్నూరు లక్ష్మణరావు వగైరాలు ...ప్రతివాది
To
1) పొట్నూరు లక్ష్మణరావు తండ్రి లేటు సత్యన్నారాయణ సుమారుగా వయస్సు 60 సం॥లు వ్యాపారం, నివసించు చిరునామా మంగువారితోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా .... 1 వ ప్రతివాది
2) పొట్నూరు హైమావతి, భర్త లక్ష్మణరావు, సుమారుగా వయస్సు 56 సం॥లు నివసించు చిరునామా మంగువారితోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా ... 2 వ ప్రతివాది
3) పొట్నూరు కవిత, తండ్రి లక్ష్మణరావు, భర్త హరికృష్ణ తంగుడు, సుమారుగా వయస్సు 35 సం॥లు నివసించు చిరునామా మంగువారితోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా .... 3 వ ప్రతివాది
4) పొట్నూరు వెంకట సత్యం శ్రీహర్ తండ్రి లక్ష్మణరావు, సుమారుగా వయస్సు 31 సం॥లు. వ్యాపారం, నివసించు చిరునామా మంగువారితోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా ... 4 వ ప్రతివాది
5) సూరు రఘు తండ్రి పేరు తెలియదు. సుమారుగా వయస్సు 56 సం॥లు వ్యాపారం నివసించు చిరునామా అరసవల్లి గ్రామము, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం జిల్లా Phone Number : 9296106171, 8520857771 ...10 వ ప్రతివాది

యిందు వాది సదరు ప్రతివాదుల పై U/o VII Rule 1 and Section 26 C.P.C దావా పలాస సివిల్ జడ్జి(స్) (జూనియర్ డివిజన్) కోర్టులో O.S 108/2024 లో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారు ఆర్డరు ప్రకారం అనేక పర్యాయములు దావా సమన్సు (నోటీసులు) పంపగా అమలు కాని పక్షమున మరలా కోర్టు వారు ఆర్డరు ప్రకారం యిందు సమన్సు (నోటీసులు) పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు పై కోర్టులో తే 17/12/2025దీని ఉదయం గం॥ల 10.30 ని॥లకు మీరు గాని మీ వకీలు ద్వారా గాని స్వయంగా హాజరు అయి ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించెదరు.

పిటిషనర్ తరుపున న్యాయవాది
పలాస
తాండ్ర మురళీ మోహనరావు, అడ్వకేట్, పలాస.
తేది: 28/11/2025
9676616774, 7995979944

మహారాజశ్రీ పలాస సివిల్ జడ్జి(స్) (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A 719/2024 in O.S. 108/2024

Between:
తంగుడు రామారావు ...పిటిషనర్
And:
పొట్నూరు లక్ష్మణరావు వగైరాలు ...రెస్పాండెంట్లు
To
1) పొట్నూరు లక్ష్మణరావు, తండ్రి లేటు సత్యన్నారాయణ సుమారుగా వయస్సు 60 సం॥లు వ్యాపారం, నివసించు చిరునామా మంగువారి తోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా ...1వ రెస్పాండెంటు
2) పొట్నూరు హైమావతి, భర్త లక్ష్మణరావు, సుమారుగా వయస్సు 56 సం॥లు నివసించు చిరునామా మంగువారి తోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా ...2వ రెస్పాండెంటు
3) పొట్నూరు కవిత, తండ్రి లక్ష్మణరావు, భర్త హరికృష్ణ తంగుడు, సుమారుగా వయస్సు 35 సం॥లు నివసించు చిరునామా మంగువారి తోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా ...3వ రెస్పాండెంటు
4) పొట్నూరు వెంకట సత్యం శ్రీహర్ తండ్రి లక్ష్మణరావు, సుమారుగా వయస్సు 31 సం॥లు, వ్యాపారం, నివసించు చిరునామా మంగువారి తోట, శ్రీకాకుళం టౌన్ మరియు మండలం మరియు జిల్లా ...4వ రెస్పాండెంటు
5) సూరు రఘు, తండ్రి పేరు తెలియదు, సుమారుగా వయస్సు 56 సం॥లు వ్యాపారం, నివసించు చిరునామా అరసవల్లి గ్రామము, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం జిల్లా Phone Number: 9296106171, 8520857771. ...10వ రెస్పాండెంటు

యిందు పిటిషనర్ సదరు రెస్పాండెంట్లుపై U/o XXXIX Rule 1 of C.P.C పిటిషన్ పలాస సివిల్ జడ్జి(స్) (జూనియర్ డివిజన్) కోర్టులో I.A 719/2024లో రెస్పాండెంటులు అయిన మీకు కోర్టు వారు ఆర్డరు ప్రకారం అనేక పర్యాయములు I.A నోటీసులు పంపగా అమలు కాని పక్షమున మరలా కోర్టు వారు ఆర్డరు ప్రకారం యిందు I.A నోటీసులు పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు పై కోర్టులో తే 17-12-2025దీన ఉదయం గం॥ల 10.30 ని॥లకు మీరు గాని, మీ వకీలు ద్వారా గాని స్వయంగా హాజరు అయి ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించెదరు. పిటిషనర్ తరుపున న్యాయవాది

తాండ్ర మురళీమోహనరావు
పలాస, అడ్వకేట్, పలాస, Srikakulam Dist.,
తేది: 28/11/2025. Mobile: 9676616774, 7995979944

(c) eenadu

ప్రకృతి తలపై పాపిటలా..

శేషాచలం అడవులు ప్రకృతి అందాలకు చిరునామా. భక్తులకు ఎన్నో దృశ్యాలు కనువిందు చేస్తాయి. అడవుల మధ్యన శ్రీవారి మెట్టు మార్గం తలపై పాపిటలా ఇలా కనిపిస్తోంది. ఉదయం కురిసే పొగమంచుకు శేషాచలం పరిసరాలు ముగ్ధమనోహరంగా మారుతున్నాయి.

– ఈనాడు, తిరుపతి

ఆత్మవిశ్వాసానికి ఈ అంధులే స్ఫూర్తి

• మూడేళ్లలో 1017 మంది బలవన్మరణం
• ఎక్కువ మంది విద్యార్థులే

వారంతా అంధులు.. ఒకరి తోడు లేకుండా బయటకు రాలేరు.. ప్రపంచాన్ని పూర్తిస్థాయిలో చూడలేరు.. వారే ఆత్మవిశ్వాసంతో అడుగేసి.. ప్రపంచాన్ని జయించారు.. క్రికెట్ వరల్డ్‌కప్ విజేతలుగా నిలిచారు..

అలాంటిది.. అన్ని అవయవాలు బాగున్నా.. చిన్న చిన్న సమస్యలతో.. ఇంట్లో గొడవలతో.. మార్కులు తక్కువ వచ్చాయని.. ఓటమి ఎదురైతే కొందరు నిరాశ చెందుతున్నారు.. మనస్తాపంతో ప్రాణాలు తీసుకుంటున్నారు..

మనందరం అంధుల క్రికెట్ విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. వారిలా ఒడుదొడుకులు ఎదురైనా.. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా విజేతలుగా నిలవాల్సిన సమయం వచ్చింది.

• గత నెలలో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని ల్యాబ్ రికార్డులు సమర్పించలేదు. అధ్యాపకురాలు తిట్టడంతో మేడపై నుంచి దూకి ప్రాణాలు కోల్పోయింది.

ధైర్యంగా ముందుకు..

మన అంధుల క్రికెట్ జట్టులోని క్రీడాకారిణులు సైతం ఎన్నో హేళనలు ఎదుర్కొన్నారు. అసలు కళ్లే కనిపించవు.. వీరు ఎలా ఆడుతారని చాలా మంది చిన్నచూపు చూశారు. బయట నుంచి చేసే వెక్కిరింతల్ని పట్టించుకోలేదు. ధైర్యంగా ముందుకు సాగి పెద్ద జట్లను సైతం మట్టి కరిపించారు. దేశం తలెత్తుకునేలా చేశారు. మనం కూడా చిన్న చిన్న అవమానాలకు ప్రాణాలు తీసుకోకుండా ఒక్క క్షణం ఆలోచించాలి. కించపర్చిన వారి నుంచే పొగడ్తలు దక్కించుకునేలా కృషి చేయాలి.

ఒడుదొడుకులు..

ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆటుపోట్లు ఎదురవుతాయి. జట్టు కెప్టెన్ దీపిక, మరో తెలుగమ్మాయి కరుణతో పాటు మిగిలిన అమ్మాయిల కుటుంబాలన్నీ వెనుకబడినవే. కానీ వారు కష్టాలకు ఎదురెళ్లి భవిష్యత్తు కోసం అడుగులు వేశారు. చివరికి విజేతలుగా నిలిచారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని, సమస్యలతో పోరాటం చేస్తే గెలుపు సొంతం అవుతుంది.

• కొంత కాలం క్రితం కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో నగరంలోని ఓ వ్యక్తి కోచింగ్ పోస్టు కుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

• గతేడాది జీవకోనకు చెందిన ఓ విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో మార్కులు సక్రమంగా రాలేదని నిరాశ చెందింది. తల్లిదండ్రులు ఏమనుకుంటారోనని ఆత్మహత్య చేసుకుంది.

తల్లిదండ్రుల బాధ్యత..

విద్యార్థులపై పరీక్షల సమయంలో ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. పరీక్ష బాగా రాయలేదని ప్రాణాలు తీసుకుంటున్నారు. పిల్లలను బాధ్యతగా చూసుకోవాల్సింది తల్లిదండ్రులే. అందరికీ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక అమ్మానాన్నలే ఆదర్శం. అయిదు నెలలకే కుమార్తెకు అంధత్వం వచ్చినా తన లక్ష్యం చేరే వరకు అండగా నిలిచారు.

తల్లిదండ్రులు గమనించాలి..

తరచూ మనస్తాపానికి గురయ్యేవారు, ఆత్మహత్యే శరణ్యమని భావించే వారిని కుటుంబ సభ్యులు గుర్తించి చేరదీయాలి. చదవలేమని, తక్కువ మార్కులు వచ్చాయని బాధపడే విద్యార్థులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి సలహాలు అందించాలి. ఏడవడం, చిరాకు, నిద్రలో ఇబ్బందులు పడేవారు వ్యాయామం చేయాలి. ఆరోగ్యకర ఆహారం తీసుకొని, ఎక్కువ సేపు నిద్రపోవాలి. – డాక్టర్ మల్లికార్జునరావు, ప్రొఫెసర్, రుయా మానసిక వైద్య విభాగం

సలహా పొందండి..

• మీరు మానసిక సమస్యలతో బాధ పడుతున్నారా.. ఒత్తిడికి లోనవుతున్నారా.. మనసులో వచ్చే చెడు ఆలోచనల నుంచి బయట పడాలని అనుకుంటున్నారా.. టోల్ ఫ్రీ నంబరు **14416**ను సంప్రదించండి. నిపుణులు మీతో మాట్లాడి సమస్య నుంచి బయట పడే ప్రయత్నం చేస్తారు.

జిల్లాలో వివరాలు..

సంవత్సరం	ఆత్మహత్యలు
2023	300
2024	389
2025 (ఇప్పటి వరకు)	328

– న్యూస్‌టుడే, తిరుపతి(నేరవిభాగం)

సంక్షేమ గృహాల్లో.. ఘుమఘుమలు

వంట సిబ్బందికి తిరుపతిలోని పాకశాస్త్ర సంస్థలో ప్రత్యేక శిక్షణ

ఈనాడు డిజిటల్, తిరుపతి: సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లోని విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాటిలో పనిచేసే వంట సిబ్బందికి పోషకాహార విలువలతో కూడిన ఆహారం తయారు చేయడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తోంది.

ఎంతమందికి: రాష్ట్రంలోని 1050 సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో పనిచేస్తున్న వంటమనుషులు, సహాయకులకు. రెండో విడతలో 190 గురుకుల పాఠశాలల సిబ్బందికి..

వంటల తయారీపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

ముగిసిన మొదటి విడత శిక్షణ

ప్రభుత్వం మొదటి విడతలో రాయలసీమతోపాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సిబ్బంది 90 మందికి శిక్షణ పూర్తిచేసింది. వసతిగృహాల్లో అమలవుతున్న మెనూ ఆధారంగా ఆయా పదార్థాలను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. వంటశాలతో పాటు ముడిసరకులు ఎంపిక, నిల్వ చేయడంపైనా అవగాహన కల్పించారు.

• శిక్షణ ఎక్కడంటే.. : తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్
• కాలం : 5 రోజులు
• అంశాలు: • వంటగది నిర్వహణ • వ్యక్తిగత పరిశుభ్రత • పోషక విలువలు తగ్గిపోకుండా ఆహార పదార్థాల తయారీ

ట్యాంకు కాదు.. ఇల్లే

ఈ ఇంటిని చూడండి.. అచ్చం నీళ్ల ట్యాంకులా కనిపిస్తోంది కదూ.. తిరుపతి నుంచి ఏర్పేడుకు వెళ్లే మార్గంలో గుత్తివారిపల్లి వద్ద ఓ యజమాని ఇలా నిర్మించారు. నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇంటి స్థలం పోగా మిగిలిన కొద్దిపాటి స్థలంలో వాటర్ ట్యాంకులా వృత్తాకారంలో ఇంటిని నిర్మించుకున్నారు.

–ఈనాడు, తిరుపతి

కబ్జా చెయ్.. కట్టేయ్

వెంకటగిరిలో పాల కేంద్రం ముందు భాగంలో ఆక్రమణలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: జిల్లా వ్యాప్తంగా ప్రధాన కాలువలు, చెరువు స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. స్థానిక అధికార, ప్రతిపక్ష నాయకుల అండదండలతోనే ఇందతా జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఆధ్యాత్మిక నగరం.. ఆక్రమణల పరం

మధురానగర్, శివజ్యోతి నగర్‌లో ప్రధాన కాలువలపై షెడ్లు, ప్రహరీలు, పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. దొడ్డాపురం, రెడ్డి&రెడ్డి కాలనీ మురుగు కాలువలను పూడ్చేసి వాటిపై వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎంఆర్‌పల్లె, గాంధీ రోడ్డు, రైతు బజారు వంటి ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేశారు.

ఖాళీ కనిపిస్తే.. పాగానే

వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాల కేంద్రం సర్కిల్ నుంచి క్రాస్ రోడ్డుకెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలు నిర్మించుకున్నారు. విద్యుత్తు ఉపకేంద్రం ముందు భాగంలోని ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.

జాతీయ రహదారి వెంబడే..

నాయుడుపేట పట్టణం ఎల్ఏసాగరం సర్వే నంబరు 59లో ఎకరా వరకు ఆక్రమణకు గురైంది. 71వ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఎల్ఏసాగరం, అన్నా చెరువు, చాంద్రాయి చెరువుల స్థలాలు కబ్జాదారులు ఆక్రమించేశారు. బిరదవాడ వద్ద 16వ జాతీయ రహదారి పక్కనే రెండెకరాల వరకు కబ్జా కోరల్లో చిక్కుకుంది..

రూ.25 కోట్ల వరకు అక్రమ కట్టడాలు..

గూడూరులో వివిధ ప్రాంతాల్లో సుమారు 10 నుంచి 15 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. సుమారు రూ. 20-25 కోట్ల మేర స్థలాల్లో అక్రమ కట్టడాలు నిర్మించారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణలను గుర్తించి తొలగిస్తాం. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.
– డా.వెంకటేశ్వర్, కలెక్టర్

కోతాపురి

• వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యంరాజు పుత్తూరు పరిధిలోని గుజ్జు పరిశ్రమకు తోతాపురి కాయలు తోలాడు. వారం రోజుల కిందట టన్నుకు రూ. 3,900 చొప్పున ఖాతాలో జమచేశారు. ప్రభుత్వం టన్నుకు రూ. 8 వేలు చెల్లించాలని ఆదేశించినా పరిశ్రమ యజమాన్యం పెడచెవిన పెట్టింది. దీనికితోడు కూలి కింద రూ. 100 తీసుకున్నట్లు చెప్పడంతో రైతు కంగుతిన్నాడు. అటు తూకాల్లోనూ మోసం చేశారని, బయట తూకానికి.. గుజ్జు పరిశ్రమలోని తూకానికి మూడు టన్నులకు 300 కిలోల వ్యత్యాసం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మారని పరిశ్రమల తీరు.. ప్రభుత్వం ప్రోత్సాహక నగదును రూ. 4 వేల చొప్పున రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమచేసింది. పరిశ్రమల యజమానులు మాత్రం రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. కనీసం పెట్టుబడి రాలేదని వాపోతున్నారు.

టన్నుకు రూ.3,900 జమ | గుజ్జు పరిశ్రమల నిర్వాకం | సీఎం ఆదేశాలు బేఖాతరు

పుత్తూరు, న్యూస్‌టుడే: మామిడి రైతులను ఆదుకుంటామని, ప్రభుత్వం రూ. 4 వేలు ప్రోత్సాహక నగదు ఇస్తుందని గుజ్జు పరిశ్రమల యజమానులు రూ. 8వేలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు స్పష్టంగా ఆదేశించారు.. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో పర్యటించి ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయాలని పరిశ్రమలకు సూచించారు.. ఇటీవల చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సైతం అధికారులతో చిత్తూరులో సమీక్షించి ప్రభుత్వం నిర్దేశించిన ధర ఇవ్వాలని చెప్పారు.. అయినా పరిశ్రమల యజమానులు పట్టించుకోకపోవడం గమనార్హం. . కిలోకు ప్రభుత్వం చెప్పిన రూ. 8 కాకుండా రూ. 3.9 ఇచ్చి రైతులను ముంచుతున్నారు. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

• ఉమ్మడి జిల్లాలో మొత్తం విస్తీర్ణం: 1.12 లక్షల హెక్టార్లు
• తోతాపురి విస్తీర్ణం: 55 వేల హెక్టార్లు
• ఈ ఏడాది దిగుబడి: 5.50 లక్షల టన్నులు
• ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు కొనుగోలు చేసినది: 5.50 లక్షల టన్నులు
• రూ.4వేలు చొప్పున ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహక నగదు: రూ.185 కోట్లు

జనవరి వరకూ ఇస్తారంట?

మరికొందరు పరిశ్రమల యజమానులు వచ్చే ఏడాది జనవరిలో రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని చెబుతున్నారు. అదీనూ ఎంత ఇస్తామనేది చెప్పకపోవడం గమనార్హం.

ప్రకృతి చెక్కిన.. పులిగుండు



న్యూస్‌టుడే, పెనుమూరు: భూమికి 15 వందల అడుగుల ఎత్తులో, శివ లింగాకారంలో రెండు కొండల కలయికతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది పులిగుండు. పెనుమూరు మండలంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ రెండు కొండలను స్థానికులు శివ పార్వతులుగా కొలుస్తారు. వీటిని చూసేందుకు పలు ప్రాంతాల ప్రజలు తరలి వస్తుంటారు.

చరిత్ర కథలు వేర్వేరు..

గతంలో ఇక్కడ పులి సంచరించడంతో దీన్ని పులిగుండుగా పిలుస్తారని పూర్వీకుల మాట. దీంతో పాటు మరో కథ ప్రచారంలో ఉంది. పెనుమూరు ఉత్తర దిశలో పాళ్యం అడవులున్నాయి. రాజుల కాలంలో కార్వేటినగరం సంస్థానాధీశుల పాలనలో పాళేగాళ్ల ఏలుబడిలో ఈ ప్రాంతం ఉండేదని. . మహమ్మదీయులు దాడిచేసిన సమయంలో వారు ప్రాణరక్షణకు గుండుపైకి చేరి ప్రాణాలు నిలుపుకున్నారని పలువురు చెబుతుంటారు.

భారీగా భక్తుల రాక..

పులిగుండు తూర్పు దిశలో స్వయంభు గుంటీశ్వర ఆలయం ఉంది. ఇక్కడ రాతి గుండుకు పూజలు చేస్తారు. ముందు భాగంలో మరో శివ లింగం ఉంటుంది. ప్రతి పౌర్ణమినాడు శివ పార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగిస్తారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి, మహా శివరాత్రి రోజు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. కొండ పైభాగంలో శివుడు, పార్వతి, గణపతి, అయ్యప్ప ఆలయాల నిర్మాణం చేపట్టారు. చలన చిత్రాల చిత్రీకరణలు జరుగుతాయి.

క్రమబద్ధీకరణకు 5,248 దరఖాస్తులు

డిసెంబరు నెలాఖరుతో ముగియనున్న గడువు

తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాల క్రమబద్ధీకరణపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఉత్తర్వు 30 మార్గదర్శకాలను అనుసరించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని వాటిపై హక్కులు కల్పించనుంది.

• ఇప్పటివరకు 128 గ్రామాల నుంచి దరఖాస్తులు అందాయి. తగిన పత్రాలు లేకపోవడంతో ఇప్పటివరకు 719 దరఖాస్తులు తిరస్కరించారు.

డివిజన్ల వారీగా వివరాలు

డివిజన్	దరఖాస్తు
గూడూరు	230
శ్రీకాళహస్తి	542
సూళ్లూరుపేట	110
తిరుపతి	4366

తిరుపతి ప్రజలకు ఊరట...

కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన క్రమబద్ధీకరణతో తిరుపతి అర్బన్ మండలానికి ఊరటనిచ్చింది. తిరుపతి డివిజన్‌లో 4366 దరఖాస్తులు అందగా వాటిలో 3,975 దరఖాస్తులు తిరుపతి అర్బన్ నుంచే ఉన్నాయి.

ఈనెల 27 వరకు మొత్తం 5,248 దరఖాస్తులు అందాయి.

అర్హతలు ఇలా..

❑ 2019 అక్టోబరు 15 ముందు జరిగిన ఆక్రమణలు. ❑ 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. ❑ ఆక్రమిత భూమి 151 నుంచి 300 వరకు ఉంటే.. బీపీఎల్, ఏపీఎల్ జాబితాలోకి వచ్చే దరఖాస్తుదారులు 15 శాతం ప్రాథమిక విలువ, 50 శాతం రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాలి. ❑ 301 గజాలపైన ఉన్నవారు నిర్దేశించిన రుసుం చెల్లించాలి. రేషన్‌కార్డు, విద్యుత్తు బిల్లు 300 యూనిట్ల కంటే తక్కువ ఉన్నవారిని పరిగణనలోకి తీసుకుటారు.

సొమ్ములు వారికి.. శోకం వీరికి!

• వైకాపా హయాంలో శ్రీకాళహస్తిలో నగదు తీసుకుని స్థలాల కేటాయింపు
• ప్రభుత్వ జాగాల్లో కట్టడంతో తాజాగా కూల్చివేతలు

రేణిగుంట మండలం కొత్తపాలెంలో ఇంటిని కూల్చేస్తున్న అధికారులు

ఈనాడు– తిరుపతి– న్యూస్‌టుడే, రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ భూముల్లో తమకు కాసులు ఇచ్చిన వ్యక్తులు, పేదలకు స్థలాలు చూపి కోట్ల రూపాయలు సంపాదించారు. రెవెన్యూ యంత్రాంగం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వీటిని కేటాయించారు. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు- రూ. 8 లక్షల వరకు వసూలు చేశారు. అప్పట్లో రెవెన్యూ సిబ్బంది ఎవరూ అడ్డు చెప్పకపోవడంతో నిర్మాణదారులు ఇళ్లు కట్టేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తేనెతుట్టె కదిలింది. అప్పటి బాగోతాలపై అధికారులు విచారణ మొదలు పెట్టడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో నిర్మాణాలను ఒకొక్కటిగా కూల్చేస్తుండటంతో పేదలు కన్నీరుమున్నీరవుతున్నారు.

• చోటామోటా నాయకులంతా కలిపి పేదల నుంచి రూ. 15 కోట్ల వరకు వసూలు చేశారు.

• ఏర్పేడులోనూ దాదాపు 20 మంది నుంచి డబ్బులు తీసుకున్నారు. • శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లోనూ సుమారు 1,300- 1,400 గృహాలకు సంబంధించి వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు వీటిని కూల్చేసే పనిలో పడ్డారు. ఈ వ్యవహారంలో అంతిమంగా నష్టపోయింది పేదలే.

నేతలపైనా చర్యలు తీసుకుంటేనే

పేదల ఇళ్లపైకి పొక్లెయిన్లు తీసుకెళ్లి ప్రతాపం చూపుతోన్న అధికారులు అక్రమార్కులైన వైకాపా నేతలపై మాత్రం చర్యలు తీసుకోవడానికి ఆసక్తి చూపడంలేదు. బాధితులను విచారిస్తే నాయకుల పేర్లు, వారికి ఎంత చెల్లించారన్నది తెలుస్తుంది. తదనుగుణంగా అవసరమైతే వారిపైనా కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి వ్యవహారాల్లో తలదూర్చరు.

ఒక్క రేణిగుంటలోనే 700 మందికి

పేదలు, ఎలాంటి అర్హత లేని వ్యక్తులు ఎవరైనా గత ప్రభుత్వంలో వైకాపా నాయకులను సంప్రదిస్తే సంబంధిత పంచాయతీ నుంచి ఇంటి పన్ను రసీదు ఇప్పించారు. ఎస్పీడీసీఎల్ నుంచి విద్యుత్తు కనెక్షన్‌నూ తీయించారు. మిమ్మల్ని ఇక ఎవరూ అడగరని చెప్పి ఐదేళ్లలో ఒక్క రేణిగుంట మండలంలోనే 700 మందికి ప్రభుత్వ, అభ్యంతరాలున్న ప్రాంతాల్లో స్థలాలు చూపారు. కుర్రకాలువ, కొత్తపాలెం, సీబీఐడీ కాలనీ, వివేకానంద కాలనీ, చెంగారెడ్డిపల్లి, సీఆర్ఎస్ వెనుక ఇంటి పట్టాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అందులో కొందరు అప్పు చేసి గృహాలు నిర్మించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారంపై అప్పట్లో అభ్యంతరాలు తలెత్తినా లెక్క చేయలేదు.

...న పీజీ స్పాట్ ప్రవేశాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలోని పలు పీజీ కోర్సులకు డిసెంబరు ఒకటో తేదీన పేమెంట్ అండ్ స్పాన్సర్ కేటగిరీ విభాగంలో స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, కోర్సు ఫీజుతో హాజరు కావాలని తెలిపారు.

సంప్రదించాల్సి నంబరు 0877-22 48589

షోడశదిన సుందరకాండ పారాయణానికి అంకురార్పణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో శుక్రవారం నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు జరగనున్న షోడశదిన సుందరకాండ పారాయణానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్టానం ఉంటుంది.

వేడుకగా మహంతు ఉత్సవం

అలంకరణలో అమ్మవారు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు పద్మావతి అమ్మవారికి గురువారం మహంతు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తిక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు ఆలయం సమీపంలోని హథీరాంజీ మఠానికి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయానికి తీసుకొచ్చారు. మఠం తరఫున అమ్మవారికి సారె సమర్పించారు. స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్‌కు విజయవాడలో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీబాషా గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 91774 29494, 85200 04646 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు, ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
పూర్తి వివరాలకు:
80085 13290

(c) eenadu

ఆఖరు నిమిషంలో.. అసలేం జరిగింది

■ గూడూరును జిల్లాలోనే కొనసాగించడంపై సర్వత్రా చర్చ

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరును తిరుపతి జిల్లాలోనే కొనసాగించాలన్న నిర్ణయం. .ఇందుకుగల కారణాలపై ప్రజల్లో సర్వత్రా చర్చ నడుస్తోంది. గూడూరు నెల్లూరు జిల్లాలో కలిస్తే అభివృద్ధికి దూరమవుతామన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కృష్ణపట్నం ఓడరేవులో కొంత భాగం.. సాగరమాల, క్రిసిటీ, పరిశ్రమలు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ యార్డ్ వంటి ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో నెల్లూరులో విలీనం చేస్తే సమన్వయం కొరవడి పనులు మందగిస్తాయన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాజకీయ ప్రాబల్యం తగ్గుతుందన్న కోణంలోనూ అధిష్ఠానం వద్ద కొందరు నేతలు మంతనాలు చేసినట్లు చెబుతున్నారు. గురువారం కొందరు గూడూరువాసులు తమను నెల్లూరులో కలపాలంటూ సీఎంకు లేఖలు రాశారు.

ఎమ్మెల్యే అసంతృప్తి.. ముఖ్యమంత్రి ఫోన్

గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఎంతో కృషి చేశారు. రెండుసార్లు అసెంబ్లీలోనూ చర్చించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కలుస్తూ వచ్చారు. తీరా ప్రతిపాదనలు చూశాక అసంతృప్తి చెందారు. దాంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ఎమ్మెల్యే పాశింకు ఫోన్‌చేసి విలీనం చేయకపోవడానికిగల కారణాలు వివరించినట్లు తెలిసింది.

నాలుగు మండలాలు మదనపల్లెలోకి

ఈనాడు- చిత్తూరు: పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాలను కొత్తగా ఏర్పాటవుతోన్న మదనపల్లె జిల్లాలోకి చేరుస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు మాత్రం చిత్తూరు జిల్లాలోనే కొనసాగించారు. చౌడేపల్లె, పుంగనూరు మండలాలను మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో, సదుం, సోమల నూతనంగా ఏర్పాటయ్యే పీలేరు డివిజన్‌లో కలిపారు. బంగారుపాళ్యం మండలం ఇప్పటివరకు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉండగా తాజాగా చిత్తూరులో చేర్చాలని నిర్ణయించారు. ప్రజలు తమ అభ్యంతరాలను 30 రోజుల్లోగా కలెక్టర్‌కు తెలపవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒకే డివిజన్ పరిధిలోకి వెంకటగిరి

వెంకటగిరి గ్రామీణం (బాలాయపల్లి) : రెండు జిల్లాలు మూడు డివిజన్ల పరిధిలో ఉన్న వెంకటగిరి నియోజవర్గాన్ని ఒకే రెవెన్యూ డివిజన్ కిందికి తెస్తూ ప్రభుత్వం నోటిషికేషన్ విడుదల చేసింది. వైకాపా పాలనలో నెల్లూరు జిల్లాలోని కలువాయిని ఆత్మకూరు డివిజన్.. రాపూరు, సైదాపురాన్ని నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చి. . వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలను గూడూరు డివిజన్లో కొనసాగించి తిరుపతి జిల్లాలో విలీనం చేశారు. ఆంధ్రప్రదేశ్ జిల్లాల నిర్మాణం 1974 సంఖ్య 7 ప్రకారం మెరుగైన పరిపాలన, అభివృద్ధి కోసం ఒక నియోజకవర్గాన్ని ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి తీసుకురావడంతో పాటు ఒక జిల్లాలో ఉంచాలనే ప్రక్రియ మేరకు వెంకటగిరి నియోజకవర్గాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్ కిందికి తెస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

29న ఉద్యోగ మేళా

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీతమ్స్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 29 శనివారం స్థానిక సీతమ్స్ కళాశాలలో 18 బహుళజాతి సంస్థలతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, 18-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

29 మందికి ఉద్యోగోన్నతి

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జిల్లా, మండల పరిషత్తు, జిల్లా పంచాయతీ, డివిజన్ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ (గ్రేడ్-1 కార్యదర్శులు, ఎగువశ్రేణి సహాయకుల్లో 29 మందికి డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు(డిప్యూటీ ఎంపీడీవో)గా ఉద్యోగోన్నతి కల్పించి నియామకం చేస్తూ చిత్తూరు డీఎల్‌డీవో రవికుమార్ గురువారం తెలిపారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడేవారు.. ప్రకృతిలో గడపాలనుకునే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రిట్రీట్‌కు గ్లాంపింగ్ వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రులు బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనేలా సుందర ప్రపంచంలో సరికొత్త రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు పొందొచ్చు. క్యాంప్.. ఫైయర్‌లో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకునే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: శెట్టిపల్లి లేఅవుట్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం జేసీ మౌర్య, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి తదితరులతో కలిసి లేఅవుట్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. పనులు పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో నూతన పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోల నియామకానికి సంబంధించిన ప్రతిపాదన సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి వివేక్‌యాదవ్ వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించగా డీఆర్వో నరసింహులుతో కలిసి పాల్గొన్నారు. త్వరలో ఈఆర్‌వోలు, ఏఈఆర్వోలు, ఈడీటీఈలు, ఈఎస్‌ఏలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, జేసీ మౌర్య

● జిల్లాలో వచ్చే నెల 5 నుంచి మెగా పీటీఎం 3.0 కార్యక్రమాలు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మెగా పీటీఎం నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు.

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక గురువారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున శ్రీవారి సుప్రభాత సేవలో న్యాయమూర్తి పాల్గొని శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ నగేష్ భీమపాక తదితరులు

మొగిలీశ్వరస్వామి ఆలయ ఆదాయం రూ.2,93,020

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: స్వయంభు మొగిలీశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన దుకాణాలు, వాహనాల పార్కింగ్, కొబ్బరిచిప్పల సేకరణ, పాదరక్షలు భద్రపరచుటకు ఏడాది కాలపరిమితితో గురువారం ఈవో మునిరాజ, సీనియర్ అసిస్టెంట్ శ్వేత, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్ నేతృత్వంలో బహిరంగ వేలం నిర్వహించారు. దుకాణాలకు రూ. 1,10,520, ఇతరవాటి ద్వారా రూ. 1,82,500 ఆదాయం వచ్చిందని, తలనీలాల సేకరణకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేశామన్నారు. తెదేపా నాయకులు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాధించిన బహుమతులతో విద్యార్థి

ఎత్తుకు పైఎత్తు.. ప్రత్యర్థి చిత్తు

చెస్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న శైలేష్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: చదరంగంలో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతున్నాడు గూడూరు రెండో పట్టణం మాళవ్యానగర్‌కు చెందిన రవిరాజు, సంకీర్తిల కుమారుడు శైలేష్ కుమార్. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. చిన్న వయసులోనే ఎత్తుకు పైఎత్తు వేస్తూ శత్రువుల ఆలోచనలను చిత్తు చేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నాడు. ఇటీవల విజయవాడలో జరిగిన పోటీల్లో కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత గోవా గవర్నర్ ఆశోక్‌గజపతి రాజు కూడా చిన్నారి శైలేష్‌లోని ప్రతిభ చూసి అభినందించారు. ఈ నెల 22న విజయవాడలో జరిగిన అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్ పాల్గొని సత్తా చాటాడు.

ఈ ఏడాది ప్రదర్శనలు

● గూడూరులో జరిగిన ఓపెన్ స్కూల్ పోటీల్లో టౌన్ ఛాంపియన్‌షిప్. ● నెల్లూరులో ఆల్ ఇండియా వన్డే ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఛాంపియన్‌షిప్. ● వెంకటగిరిలో ఆల్ ఇండియా వన్డే ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో బెస్ట్ అన్ రేటెడ్ ప్లేయర్ అవార్డు. ● స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గూడూరు డివిజన్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-14 విభాగంలో ద్వితీయ బహుమతి. ● గూడూరులో అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన మెమోరియల్ టోర్నమెంట్ సీనియర్ కేటగిరీలో ఛాంపియన్‌షిప్. ● నెల్లూరులో ఏపీ రాష్ట్ర స్థాయి 5 జిల్లాల ఓపెన్ టోర్నమెంట్‌లో అండర్-11 విభాగంలో మూడో బహుమతి. ● కేరళలో అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్ ప్రతిభ.

తిరుమలలో.. చలితీవ్రత

తిరుమలలో చలితీవ్రత భారీగా పెరిగింది. రెండు రోజులుగా వాతావరణం మారడంతో అత్యధికంగా 24 డిగ్రీల సెల్సియస్ ఉండగా అత్యల్పంగా 16 డిగ్రీల సెల్సియస్ ఉంది. పొగమంచు, చిరుజల్లులతో భక్తులు మరింత ఇబ్బంది పడుతున్నారు. స్వెటర్లు, శాలువాలు, ఉన్ని దుప్పట్లు ధరించి చలి నుంచి రక్షణ పొందుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

నలుగురు లాటరీ విక్రేతల అరెస్టు

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరులో లాటరీ టికెట్లు విక్రయిస్తూ అమాయకులను దోచుకుంటున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. 'లయన్.. యాపిల్.. సింగం' పేరిట లాటరీ టికెట్ల విక్రయాలపై గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ మహేశ్వర్ పలుచోట్ల దాడులు చేపట్టి లాటరీ విక్రయిస్తున్న భాగ్యరాజ్, రామచంద్ర, మూర్తి, సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 17,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆93812 87629.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి - చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్‌కు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 9505502346

CONSULTANCY

GENERAL

తిరుపతి మరియు తిరుపతి పరిసర ప్రాంతాలలో స్థలం కొనాలన్నా అమ్మాలన్నా మమ్మల్ని సంప్రదించగలరు. Ph: 99890 76007, 90320 76007.

TO LET

COMMERCIAL 3 Sheds for Ware House/ Godown/ Offices Each Shed -1800 sft. Near Taj Hotel, Tiruchanur Bypass Road, Tirupati. Niranjan. 94414 94697. Email: ravi.kambham@gmai.com.

2400 Sft గోడౌన్ (37X61) & వాచ్‌మెన్ రూం (10X10) బాడుగకు ఇవ్వబడును. RC రోడ్, అవిలాల పార్క్ ఎదురుగా, తిరుపతి ✆ 85200 38198, 80740 25167.

JOBS

A Premier Construction Firm is highly Exp. Senior Sales & Marketing Executive Specialising in Residential Flats Tirupati Area. Over 5 Yrs Exp in Sales & Marketing ✆ +91-7780641034.

Parinaya Creation's (A Premium Gift Shop for All Occasions) Wanted Cashier with Computer Billing Knowledge is Must ✆ 63009 00677, 79934 34242

Parinaya Creation's (A Premium Gift Shop for All Occasions) Wanted Sales Girl/Boy with Good Communication Skills ✆ 63009 00677, 79934 34242.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

విజయ డిజిటల్ డెంటల్‌కి లేడీ అటెండర్ (ఇంటర్/ డిగ్రీ) కావలెను. కళాంజలి ఎదురుగా రేణిగుంట రోడ్, తిరుపతి. టైం: 9-2 & 4-9, ఇంటర్వ్యూ 29/11.

ప్రముఖ ఇంటర్నేషనల్ కొరియర్ సంస్థ బెంగుళూరు బ్రాంచ్ కొరకు TATA ACE డ్రైవర్స్ కావలెను, ఎకామిడేషన్ కలదు. 9014530584, 9291901305

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్ట్ పద్దతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్. 8341177761/8019647888

WANTED

తిరుపతిలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ HS Enterprises నందు పనిచేయుటకు

★ AC Technicians-6 Salary:18,000- 20,000

★ AC Technician Helpers-06 Salary:12,000- 15,000

★ Auto Drivers-02 Salary:15,000- 18,000

అక్కారంపల్లి రోడ్, తిరుపతి

8008803316

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600

Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రత్యామ్నాయం లేకుండానే మూత

■ తితిదే ఆదేశించినా స్పందించని స్విమ్స్

■ మందుల కోసం రోగుల వెతలు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆసుపత్రిలో మందుల దుకాణాన్ని స్విమ్స్ నిర్వహించాలని తితిదే ఆదేశించినా.. ఆ దిశగా ఇప్పటికీ అడుగులు పడటం లేదు. ఇప్పటివరకు మందుల దుకాణం నిర్వహణకు దరఖాస్తు చేసుకోలేదు. మందుల కొనుగోలులో పాటించాల్సిన విధివిధానాలు.. సిబ్బంది నియామకం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో తితిదే అధికారులు టెండర్ కాలపరిమితి ముగిసిందంటూ శ్రీపద్మావతి మందుల దుకాణాన్ని మూసివేశారు. దీంతో స్థానికంగా చికిత్స పొందే రోగులు మందుల కోసం స్విమ్స్ వరకు రావాల్సి వస్తోంది. పడకల్లో ఉన్న రోగులకు రాత్రివేళ అవసరమైన మందుల కోసం వచ్చి.. వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

శ్రీపద్మావతి ఆసుపత్రి ముందు జనరిక్ పేరిట మందుల దుకాణాన్ని పులివెందులకు చెందిన వ్యక్తికి అప్పటి ప్రభుత్వం కట్టబెట్టింది. కాలపరిమితి పూర్తయ్యాక తితిదే టెండర్లు ఆహ్వానించింది. వరుసగా నాలుగుసార్లు టెండర్లు నిర్వహించినా ఎవరినీ ఎంపిక చేయలేదు. ఆఖరు టెండర్‌లో మొదటి బిడ్డర్‌కు కేటాయించకుండా జాప్యం చేశారు. ఇదంతా పులివెందుల వ్యక్తికి మేలు చేసేందుకు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇదే సమయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందించి స్విమ్స్ ఆధ్వర్యంలో స్వయంగా మందులు దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. దీనివల్ల రోగులకు మంచి మందులు అందుబాటులో ఉంచడంతో పాటు.. ఆదాయ సముపార్జన, కొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని భావించారు.

మూసివేసిన పద్మావతి మందుల దుకాణం

అవస్థలు తప్పవా?

స్విమ్స్ ఇదివరకు రెండుసార్లు స్వయంగా మందుల దుకాణాలు నిర్వహించింది. ఆ అనుభవంతో గుత్తగా మందులు కొనుగోలు చేస్తే కొంతవరకు ధర తగ్గే అవకాశం ఉంది. వైద్యులు సూచించిన మందులు ఉంచడంతో రోగులకు మేలు జరుగుతుంది. ఇలా చేయాలంటే కొనుగోలు.. అమ్మకాల విధివిధానాలు రూపొందించాల్సి ఉంది. అదే సమయంలో దుకాణం ఏర్పాటుకు అవసరమైన లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే నెలరోజులు పట్టే అవకాశం ఉంది. నెలరోజుల కిందటే తితిదే ఛైర్మన్ ఏర్పాట్లు చేసుకోమని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దానికితోడు గతంలో అమ్ముడుపోని మందులు వెనక్కు ఇవ్వడం.. కాలం చెల్లిన మందుల విషయంలో కొంత ఇబ్బంది పడినట్లు సమాచారం. ప్రస్తుతం విధివిధానాలు లేకుండా ముందుకెళితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవనే భయంతో జాప్యం చేస్తున్నారనే భావన వ్యక్తమవుతోంది.

'ఏపీ ఫైబర్‌నెట్ కేసు కొట్టివేయడం శుభపరిణామం'

తిరుపతి (భవానీనగర్) న్యూస్‌టుడే: ఏపీ ఫైబర్‌నెట్‌పై గత వైకాపా ప్రభుత్వ హయాంలో నమోదు చేసిన కేసును కోర్టు కొట్టివేయడం శుభపరిణామమని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నగర అధ్యక్షుడు జె.డబ్ల్యూ. విజయ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. ఏపీ ఫైబర్‌నెట్‌ని ఎలాగైనా నాశనం చేయాలన్న ఉద్దేశంతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో అక్రమ కేసులు పెట్టి వేలాదిమంది ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడేలా చేసిందన్నారు. మళ్లీ పూర్వవైభవం తీసుకురావడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తారన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. నేతలు ఆనంద్, శంకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఈఎస్‌లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

యాదమరి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నేడు, రేపు(శుక్ర, శనివారాల్లో) స్థానిక పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ పోటీలను నేడు ఉదయం 9 గంటలకు ఎస్పీ తుషార్ డూడీ ప్రారంభిస్తారన్నారు. అతిథులుగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయ నాయుడు, పీఈఎస్ విద్యాసంస్థల ఛాన్సలర్ జవహర్ దొరస్వామి పాల్గొననున్నారని, శనివారం సాయంత్రం నాలుగు గంటలకు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణబాబు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు.. ప్రపంచ యాత్ర

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోటి మొక్కలు నాటించాలనే సుదుద్దేశంతో ఐదేళ్లుగా ప్రపంచమంతా సైకిల్ యాత్ర చేస్తున్నట్లు కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో యాత్రలో భాగంగా పర్యటిస్తున్న అతడికి ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తెదేపా మండల అధ్యక్షుడు స్వామిదాస్ ఘనస్వాగతం పలికారు. అతడి కృషిని అభినందించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు తిరుపతి జిల్లా మామండూరు పరిధిలోని కాకిరేవులపెంట వద్ద గురువారం నిర్వహించిన దాడుల్లో 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. దాడుల్లో రైల్వే కోడూరు సబ్‌కంట్రోల్ పాయింట్ ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్సై కె.అలీబాషా, ఎఫ్ఆర్వో జాన్‌శామ్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సీఐపై పోలీసులకు ఫిర్యాదు

భాకరాపేట : భార్యాభర్తల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి తాను స్పెషల్ బ్రాంచ్ సీఐనంటూ తనని బెదిరిస్తున్నాడని బాధితుడు పోలీసులను ఆశ్రయించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. జంగావాండ్లపల్లి పంచాయతీ అప్పేపల్లికి చెందిన రెడ్డీశ్వర్, భానుశ్రీ భార్యాభర్తలు. ఇటీవల వీరి కాపురంలో విభేదాలు తలెత్తడంతో భానుశ్రీ తరఫున కె.వి.పల్లి మండలం చిన్నకమ్మపల్లికి చెందిన శివకుమార్ జోక్యం చేసుకున్నాడు. తాను కడప స్పెషల్ బ్రాంచ్ సీఐనంటూ బెదిరిస్తున్నట్లు రెడ్డీశ్వర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర గురువారం తెలిపారు. శివకుమార్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

విభేదాలు పొడచూపాయా?

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారుల మధ్య లుకలుకలు చర్చనీయాంశంగా మారాయి. కొద్దిరోజులుగా బోర్డు ఛైర్మన్ తరఫున ప్రైవేటు వ్యక్తులు తనిఖీలు నిర్వహించడం విమర్శలకు దారితీస్తోంది. ఛైర్మన్ కార్యాలయానికి సీసీ కెమెరాల వీక్షణ ఏర్పాట్లను అధికారులు తొలగించడంపై ఆయన వర్గీయుల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతోంది. తనిఖీలపై సిబ్బంది ఈవోకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

మొగిలి ఘాట్‌రోడ్డులో ఏనుగు హల్‌చల్

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: చిత్తూరు-పలమనేరు మార్గమధ్యలో మొగిలి ఘాట్‌రోడ్డులో గురువారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఆ మార్గంలో వెళ్లే పలువురు వాహనదారులు చరవాణిలో ఫొటోలు తీసి వైరల్ చేశారు. చరవాణిలో ఒంటరి ఏనుగు దృశ్యాలను ఫొటోలు తీస్తుండటంతో తాపీగా జాతీయ రహదారి పక్కనే చెట్ల పొదల్లోకి వెళ్లిందని పేర్కొన్నారు. దీంతో అటవీ ప్రాంతంలో ఆరు వరుసల రహదారి పనులు చేస్తున్న కూలీలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. రాత్రివేళ షెడ్లలోనే ఉండాలని, లైట్లు వెలిగించి అగ్గిమంటలు వేసుకోవాలని సూచించారు. పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. అటవీ ప్రాంత సరిహద్దులోని మొగిలివారిపల్లె, గౌరీశంకరపురం, పార్వతీపురం రైతులు వ్యవసాయ బావుల వద్ద రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కారం చల్లి వృద్ధ దంపతులపై కత్తితో దాడి

■ వైకాపా మండలాధ్యక్షుడి తల్లి మృతి

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి వైకాపా మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తల్లిదండ్రులపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో వృద్ధురాలు మరణించిన ఘటన పుల్లారెడ్డికండ్రిగలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. దాడిలో తల్లి జయమ్మ(68) మృతిచెందగా తండ్రి మహదేవరెడ్డి(77) తీవ్రంగా గాయపడ్డారు. వివరాల మేరకు.. మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తి పట్టణంలో నివసిస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. స్వగ్రామమైన పుల్లారెడ్డికండ్రిగలో తల్లిదండ్రులు జీవనం సాగిస్తున్నారు. ఇటీవల గ్రామ శివారులో విలాసవంతమైన నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి వృద్ధులపై కారం చల్లి కత్తితో దాడి చేశారు. వృద్ధురాలు జయమ్మ మెడలోని బంగారు నగలు లాక్కొని కత్తితో పొడవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. దాడిలో మహదేవరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఉదయాన్నే పనిమనిషి రక్తపు మడుగులో ఉన్న దంపతులను గుర్తించి మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందించింది. తీవ్రంగా గాయపడిన మహదేవరెడ్డిని వైద్యం నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఆసుపత్రికి తరలించారు. ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసుల బృందం పుల్లారెడ్డికండ్రిగకు చేరుకొని ఆధారాలు సేకరించారు. పనిమనిషిని విచారించడంతో పాటు వివిధ కోణాల్లో దర్యాప్తు చేశారు.





జయమ్మ (పాతచిత్రం) ▶ చికిత్స పొందుతున్న మహదేవరెడ్డి

తెలిసిన వారే చేశారా?

అప్పుడప్పుడు ఇంటికి వచ్చివెళ్లే వ్యక్తి తమపై దాడిచేశాడని మహదేవరెడ్డి ఆరోపించారు. పేరు తెలియదని ముఖంచూస్తే గుర్తుపడతానని ఆయన పోలీసులకు వివరించారు. సమాచారం అందుకున్న ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైకాపా నేతలు ఆసుపత్రికి వెళ్లి మహదేవరెడ్డిని పరామర్శించారు.

ఆటోను ఢీకొన్న వాహనం: మహిళ మృతి

గుడిపాల, న్యూస్‌టుడే: చిత్తూరు-వేలూరు మార్గంలో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి వద్ద గురువారం టూరిస్టు వాహనం ఆటోను ఢీకొన్న సంఘటనలో శ్రీలేఖ(37) మృతిచెందగా బుజ్జి(45)కి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై రామ్మోహన్ కథనం మేరకు.. మండలంలోని పల్లూరు ఆదిఆంధ్రవాడకు చెందిన శ్రీలేఖ, బుజ్జి.. ఆటోలో చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నారు. వీరి ఆటోను వేలూరు వెళ్తున్న టూరిస్టు వాహనం వెనక నుంచి ఢీకొనడంతో ఆటోలో ఉన్న శ్రీలేఖ తీవ్రంగా గాయపడగా, బుజ్జికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీలేఖ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

మరమ్మతులు పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, గడువులోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు.

సీబీఐతో విచారణ చేయించాలి

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: ఆరేళ్ల క్రితం తెలంగాణలో జరిగిన దిశ అత్యాచారానికి సరైన న్యాయం జరగలేదని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది విజయ కిరణ్ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: వేదాంతపురం అగ్రహారం రాయలచెరువు ప్రధాన రోడ్డు పక్కన వ్యర్థాలు తొలగించారు. ఇటీవల ఈనాడులో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పీ4 కుటుంబాల మ్యాపింగ్ పూర్తిచేయండి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో గురువారం నగరపాలిక కమిషనర్ ఎన్. మౌర్య అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 7,455 బంగారు కుటుంబాలను గుర్తించి, ఇప్పటివరకు 6,411 మంది మార్గదర్శకులతో అధికారులు మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన 1044 కుటుంబాలను త్వరలోనే మ్యాపింగ్ చేయాలన్నారు. కమిషనర్ ఎన్. మౌర్య తాను దత్తత తీసుకున్న ఐదు కుటుంబాల్లో ఓ కుటుంబానికి తోపుడుబండిని అందజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రైతులను లక్షాధికారులు చేయడమే లక్ష్యం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రైతులను లక్షాధికారులుగా చేయటమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం కేకేవీపురంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు వివరించారు. ఇటీవల మండలంలోని 4,307 మంది రైతులకు రూ. 2.91 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. తెదేపా మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, భాజపా మండల అధ్యక్షుడు జనార్దన్ నాయుడు, నాయకులు ఉమాపతినాయుడు, సుబ్రహ్మణ్యం యాదవ్, రాఘవేంద్ర నాయుడు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో, రూ. 300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. బుధవారం శ్రీవారిని 73,670 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ. 4.00 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

13 వేల టోకెన్లు జారీ : శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు గురువారం 13 వేల సర్వదర్శన టోకెన్లు జారీచేశారు. వీరికి శుక్రవారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం లభిస్తుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు.

ఉచిత ప్రచారం.. కుదరదిక

రుసుం వసూలుకు ప్రభుత్వ నిర్ణయం

మహిళా వర్సిటీ మార్గంలోని హోర్డింగ్

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి దేశవిదేశాల నుంచి శ్రీవారి భక్తులు, పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వ్యాపారాభివృద్ధి, రాజకీయ ప్రచారానికి ప్రముఖులు, బహుళజాతి సంస్థలు ప్రాధాన్యం ఇస్తుంటాయి. అందుకే నగర వ్యాప్తంగా అడుగడుగునా హోర్డింగ్‌లు, క్యాండిలివర్స్, బస్టాప్‌లు వంటి భారీ ప్రచార సాధనాలు కనిపిస్తుంటాయి. వీటిద్వారా ప్రచారం చేసుకునేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే నగరపాలికకు వచ్చే ఆదాయం మాత్రం నామమాత్రమే. 2016 నుంచి పలువురు వ్యక్తులు, ప్రకటన ఏజెన్సీలు ప్రకటన రుసుములు చెల్లించేందుకు ఆసక్తి కనబరచడం లేదు. న్యాయవివాదాలు, ప్రకటన ఏజెన్సీల వినతుల్ని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ప్రస్తుత ప్రచార విధానానికి స్వస్తి చెప్పి డిస్‌ప్లే డివైజెస్ ఫీజు వసూలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

వాటికి కాలం చెల్లనుంది?

రాష్ట్ర పురపాలిక శాఖ ప్రకటన రుసుములకు సంబంధించి ఉన్న ఇబ్బందుల్ని తొలగిస్తూ మూడేళ్ల కాలపరిమితితో ప్రకటన ఏజెన్సీలకు అనుమతులు ఇవ్వనుంది. ఆయా విభాగాల్లో అనుమతులు పొందిన వ్యక్తులు, ఏజెన్సీలు మాత్రమే ప్రకటనల్ని ప్రదర్శించాలి. అందుకోసం డిస్‌ప్లే డివైజెస్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అనుమతి లేని ప్రకటన బోర్డులను వెంటనే తొలగిస్తారు. 2016 నుంచి చాలామంది నగరపాలికలకు ఎలాంటి రుసుములు చెల్లించకపోయినా కొత్తగా భారీ క్యాండీలివర్‌లు, హోర్డింగ్‌లు అనుమతిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో అనధికారికంగా ఉన్న బోర్డులు, హోర్డింగ్‌లకు కాలం చెల్లడం ఖాయమంటున్నారు.

ఆదాయానికి భారీగా గండి

నగరంలో గుర్తింపుకంటే అనధికారిక ప్రకటన బోర్డులు, వస్తువులు, స్థలాలు ఎక్కువగా ఉంటున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం అవినీతి ఆర్జన మార్గాల్లో ప్రకటన బోర్డులు కూడా ఓ వనరుగానే చెప్పొచ్చు. ఒక హోర్డింగ్‌కు అనుమతి పొంది రెండుమూడు ఏర్పాటు చేయడం ఆనాదిగా వస్తోంది. బహుళజాతి సంస్థల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ అది నగరపాలిక ఖజానాకు చేరడం లేదు. పురపాలిక చట్టం 1965 అనుసరించి ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఖాళీ జాగాలు, గోడలు, హోర్డింగ్‌లు, వాహనాలపై ప్రజలకు కనిపించేలా ప్రదర్శించే ప్రతి ప్రకటనకు రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

ఇదీ పరిస్థితి

- వేలసంఖ్యలో ప్రచార బోర్డులు ఉన్నప్పటికీ నగరపాలికకు వచ్చే ఆదాయం రూ. కోటి మించని దుస్థితి. వాస్తవానికి ఏటా రూ. 3 కోట్ల వరకు ప్రకటన రుసుముల డిమాండ్ ఉంది.
- ప్రకటనల ప్రదర్శన ద్వారా ఏటా రూ. 10 కోట్ల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంది.

నగరంలో బస్‌షెల్టర్లు	56
హోర్డింగ్‌లు	215
కెమెరా స్తంభాలు	423
ట్రాఫిక్ నియంత్రణ గొడుగులు	22
ప్రకటన ఏజెన్సీ కేంద్రాలు	44

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

చంద్రగిరి, న్యూస్‌టుడే: బుచ్చినాయుడుపల్లి పంచాయతీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గురువారం శ్రమదానం చేశారు. బుచ్చినాయుడుపల్లి గ్రామంతో పాటు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన్న మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ప్రోగ్రాం అధికారి రమేష్‌బాబు, సర్పంచి రవినాయుడు, ప్రిన్సిపల్ శ్రీప్రకాష్, అధ్యాపకులు రవి, రాజనాల, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, సిబ్బంది

కాలువల్లో చెత్త తొలగించాలి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరంలోని కాలువలు పొంగి మురుగు రోడ్లపైకి రాకుండా కాలువల్లో పేరుకున్న చెత్త, వ్యర్థాలను తొలగించాలని నగరపాలిక కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. 19వ డివిజన్‌లోని దుర్గానగర్, శేషాద్రినగర్, పోలీస్ క్వార్టర్స్, జడ్జిల క్వార్టర్స్‌లో ఆమె అధికారులతో కలిసి తనిఖీ చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న గడ్డి, ముళ్లకంపలను తొలగించాలని ఆదేశించారు. వెంట శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసీకుమార్, వైద్యాధికారి యువ అన్వేష్, డీఈ మహేష్, ఏసీపీ మధు తదితరులున్నారు.

నిర్లక్ష్యం తోడుగా ప్రమాదం

రోడ్డుపైనే కంచెలేని విద్యుత్తు నియంత్రిక తోడ గ్యాస్ సిలిండర్ల సరఫరా వాహనాలను నిర్లక్ష్యంగా వదలడంపై విస్మయం వ్యక్తమవుతోంది. స్థానిక కొర్లగుంట మారుతీనగర్‌లోని గురువారెడ్డి సమాధుల సమీప ప్రాంతంలో ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతోపాటు గ్యాస్ సరఫరా వాహనాలు ఆపకుండా నియంత్రించాలని ప్రజలు సూచిస్తున్నారు. **- న్యూస్‌టుడే, తిరుపతి (బైరాగిపట్టెడ)**

గోడలే.. స్తంభాలు



స్థానిక చింతకాయల వీధి నుంచి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో బెస్తవీధి వద్ద ఇనుప విద్యుత్‌స్తంభం భవనం గోడలోకి ఇమిడిపోయింది. వర్షాల నేపథ్యంలో ఏదేని అనుకోని ఘటన జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.. స్తంభాలకు ప్రైవేటు కేబుళ్లు ఇబ్బడిముబ్బడిగా కన్పిస్తున్నాయి. **-ఈనాడు, తిరుపతి**

వ్యర్థాల.. ఆసుపత్రి

తిరుపతిలోని పాత ఆసుపత్రి ఆవరణలో డంపింగ్ చేసిన వ్యర్థాలు.. మురుగునీరు కలిసి దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.. ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **-ఈనాడు, తిరుపతి**

ఆహ్లాదం.. దిగజారింది

తిరుపతి రాజన్నపార్కులోని చిన్నపిల్లల ఆటవస్తువులు మరమ్మతుకు గురై ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి.. సాయంత్రం, సెలవురోజుల్లో పిల్లలు ఇక్కడికి వచ్చిన ఆడుకుంటుంటారు. మరమ్మతుకు గురైన ఆటవస్తువుల కారణంగా ఏదేని అనుకోని ఘటన జరిగి చిన్నారులు గాయాలపాలుకాక ముందే అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **-ఈనాడు, తిరుపతి**

శిథిల.. ప్రయోగశాల

స్థానిక భవానీనగర్ నుంచి పాత ప్రసూతి ఆసుపత్రికి వెళ్లే మార్గంలోని జిల్లా ప్రజారోగ్య ప్రయోగశాల భవనం ఇది.. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం గోడలు వెలుస్తుండటం, ప్రహరీ కూలిపోయి ప్రమాదకరంగా మారడంతో ఇక్కడ పనిచేసే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉంది.. **- ఈనాడు, తిరుపతి**

విజేతలతో హెచ్ఎం షాజహాన్, ఉపాధ్యాయిని లావణ్య

లక్ష్యాలు చేరాలంటే.. నిత్యసాధన అవసరం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు చేరాలంటే ప్రతినిత్యం సాధన అవసరమని, నేటి సాంకేతిక ప్రపంచంలో పరిజ్ఞానాన్ని పెంచుకొని ఎదగాలని ప్రశాంత్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల హెచ్ఎం షాజహాన్ సూచించారు. స్థానిక కొర్లగుంట మారుతినగర్‌లోని ఆ పాఠశాలలో గురువారం 'ఈనాడు- ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో 7, 8, 9, 10 తరగతులకు 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన పి. పూజిత, ఎం. లోహితసాయి, కె. శైలజలకు 'ఈనాడు' అందించిన బహుమతులు, ప్రశంసా పత్రాలను ఉపాధ్యాయిని లావణ్యతో కలిసి హెచ్ఎం అందజేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధన సమితి సభ్యులు

సీఎం దృష్టి రైల్వే డివిజన్ ప్రతిపాదన

తిరుపతి(రైల్వే): తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా చేయాలన్న సాధన సమితి ప్రతిపాదనను జిల్లా తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి తీసుకెళ్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్‌కుమార్, సభ్యులు గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గిరిధర్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడే విశాఖపట్నం రైల్వే జోన్‌లో తిరుపతి డివిజన్ చేస్తే ఇక్కడి ప్రయాణికులకు మరిన్ని రైల్వేసేవలు లభిస్తాయని తెలిపారు. అనంతరం సమితి సభ్యులు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడును, తిరుపతి నగరపాలిక మేయర్ డా. శిరీష, కమిషనర్ మౌర్యలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, బుజ్జిబాబు నాయుడు, నీలేష్ కుమార్, కృష్ణయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రయథ్లాన్‌లో.. దూకుడు

హైజంప్ సాధనలో

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. ట్రయథ్లాన్‌లో సత్తా చాటుతున్నారు. వారిలోని నైపుణ్యాలు గుర్తించిన పీఈటీ విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరాజులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించి శిక్షణ ఇప్పించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా జిల్లాస్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారే దుర్గసముద్రం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు.

పరుగు.. ఆపక

నా పేరు హరీష్. గ్రామీణ మండలం భాగ్యనగరంలో ఉంటున్నాం. అమ్మ అల్లెమ్మ. నాన్న రవి కారు డ్రైవింగ్ చేస్తూ మమ్మల్ని పోషిస్తున్నాడు. నేను 8వ తరగతి చదువుతున్నా. పీఈటీ తోడ్పాటుతో రోజూ సాయంత్రం గంటపాటు పాఠశాల మైదానంలో అథ్లెటిక్స్‌లో సాధన చేశారు. పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో రేణిగుంటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. బాపట్లలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. సింగర్ కావాలన్నదే నా లక్ష్యం.

నమ్మకం.. వమ్ముచేయక

నా పేరు దయ. మాది భాగ్యనగరం. అమ్మ కోకిల. నాన్న నరేష్ పెయింటింగ్ దుకాణంలో వాహన డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఆటల్లో చురుగ్గా ఉండటంతో హెచ్ఎం, పీఈటీలు ప్రోత్సహించారు. వారి నమ్మకాన్ని నిలబెట్టడానికి రోజూ సాయంత్రం గంటపాటు పరుగు, హైజంప్‌లో సాధన చేశా. రేణిగుంటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటా. రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలవడమే లక్ష్యం.

పతకమే.. లక్ష్యం

నా పేరు లతీష్‌కుమార్. మాది దుర్గసముద్రం. అమ్మ సుమతి. నాన్న చంద్రశేఖర్ లోడర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాకు ఆటలంటే ఇష్టం. పాఠశాలలో పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో ముందుండేవాడిని. రోజూ సాయంత్రం పాఠశాల పూర్తయిన తర్వాత మైదానంలో తోటి విద్యార్థులతో ప్రాక్టీస్ చేసేవాళ్లం. హెచ్ఎం, పీఈటీల ప్రోత్సాహంతో రేణిగుంటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించా. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. బాపట్లలో జరిగిన ట్రయథ్లాన్-బి పోటీల్లో పాల్గొన్నా. ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: రాఘవేంద్రనగర్‌లో వీధి కుక్కల సమస్య చాలా తీవ్రంగా ఉంది. వీధుల్లో తిరుగుతూ కరిచేందుకు ఎగబడుతున్నాయి. శాశ్వత పరిష్కారం చూపండి. **- స్థానికులు, రాఘవేంద్రనగర్**

సమాధానం: వీధికుక్కల తరలింపు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం. **- డా. గుణశేఖర్, నగరపాలిక పశువైద్యాధికారి**

సమస్య: అలిపిరి నుంచి జూపార్క్‌కు వెళ్లే మార్గంలో అపరిశుభ్ర వాతావరణంలోనే చిరువ్యాపారులు ఆహారాన్ని భక్తులకు అందిస్తున్నారు. **- జగదీష్, చెర్లోపల్లి**

సమాధానం: పరిశీలించి పరిశుభ్రత మెరుగుపరుచుకునేలా చర్యలు చేపడతాం. **- డా. యువఅన్వేష్, నగరపాలిక వైద్యాధికారి**

ఆచార్య కాశీంను సన్మానిస్తున్న అధ్యాపకులు

స్త్రీవాద రచనలతో చైతన్యం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: భారతీయ సాహిత్యానికి స్త్రీవాద రచనలు కొత్త ఊపిరి పోశాయని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ సి. వాణి పేర్కొన్నారు. వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో గురువారం 'పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి' సదస్సు నిర్వహించారు. ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కాశిం మాట్లాడుతూ పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఆలోచనా ధోరణి మారిందని చెప్పారు. అనంతరం కడప యోగివేమన వర్సిటీ తెలుగు శాఖాధ్యక్షులు వినోదిని 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ' అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందచేశారు. తెలుగు శాఖాధిపతి కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించిన సదస్సులో అధ్యాపకులు సుభాషిణి, యువశ్రీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగి ఉండాలి

పాకాల, న్యూస్‌టుడే: విద్యార్థిగా సేవా శిబిరాలు నిర్వహించడంతోపాటు నిజజీవితంలోనూ సామాజిక స్పృహ కలిగి ఉంటేనే సార్థకత ఉంటుందని ఎంఈవో బాబ్జీ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని ఇరంగారిపల్లిలో వారంరోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం ముగింపు సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్వీరమేష్‌కుమార్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీవో మాసులామణి, హెచ్ఎం మునిరాజారెడ్డి, కళాశాల అధ్యాపకులు ఆదిశేఖర్‌రెడ్డి, రేఖ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్వీ రమేష్‌కుమార్

పాత సాగు పద్ధతులతోనే కొత్త ఒరవడి

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పూర్వపు పద్ధతుల్లోనే ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారని ఆ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. నీరజ అన్నారు. చిన్నరామాపురం, శేషాపురం, నారావారిపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో గురువారం ఆమె సమావేశం అయ్యారు. ముఖ్యమంత్రి ఆశయ సాధనకు అనుగుణంగా ఐసీఆర్పీలు, ఎఫ్ఎంటీలు, డీపీఎంలు పనిచేస్తున్నారని వారిని ఆమె అభినందించారు. రైతన్నా మీకోసం నిర్వహణ, ప్రకృతి వ్యవసాయంలో లాభాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ దిగుబడుల లాభాలను నారావారిపల్లె ఆసుపత్రిలోని రోగులకు వివరించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ఎ. షణ్ముగం, ఎఫ్ఎంటీ శంకర్ పాల్గొన్నారు.

నారావారిపల్లెలో వివరాలు సేకరిస్తున్న ఈడీ అరుణ



మెట్ల పైనుంచి పడి వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఇంటి మెట్ల పైనుంచి పడి వ్యక్తి మృతి చెందినట్లు తిరుపతి పడమర పీఎస్ సీఐ మురళీమోహన్ తెలిపారు. స్థానిక మంచినీళ్ల గుంట సమీపంలో మాఫిర్(37) నివాసం ఉంటున్నాడు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అవివాహితుడైన అతను బుధవారం రాత్రి ఇంటి మెట్లు ఎక్కుతూ జారి కింద పడ్డాడు. రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో మతిస్థిమితం లేని వ్యక్తి బటన్‌నైఫ్‌తో గొంతు, కడుపు కోసుకుని ఆత్మహత్య యత్నించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు వివరాల మేరకు.. కొంతకాలంగా తిరుమలలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తి అకస్మాత్తుగా బటన్‌నైఫ్‌తో తనను తానే తీవ్రంగా గాయపరచుకుని ఆర్‌బీ సెంటర్ వద్ద పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అంబులెన్స్‌లో తితిదే అశ్విని ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్ అత్యవసర విభాగానికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు.

రేపు వర్సిటీల ఒప్పందం

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధన అంశాల్లో ప్రగతి సాధించాలని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఈనెల 29న ఒప్పందం కుదుర్చుకోనున్నాయి.

అధ్యక్షుడిగా అవకాశం కల్పించండి

తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని ఆ విభాగం రాష్ట్ర కార్యదర్శి మనోహర్ నాయక్ కోరారు. విజయవాడలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో గురువారం తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ ఏకగ్రీవం

ఉమామహేశ్వరి

చంద్రగిరి, న్యూస్‌టుడే: పనపాకం పంచాయతీ పాకాలవారిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ ఛైర్‌పర్సన్‌గా తెదేపా మద్దతుదారులైన పాశం ఉమామహేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్నాళ్లుగా పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక వాయిదాపడుతూ వచ్చింది. ఈ క్రమంలో గురువారం హెచ్ఎం రమేష్ సమక్షంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను తెదేపా మండల అధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, రమణ, కుమార్, రమేష్, నరసింహులు, జగన్నాథం అభినందించారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో విలువల వికాసం

విద్యార్థుల శ్రమదానాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ శ్రీలత

నాగలాపురం: ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంతో విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు వారిలో విలువల వికాసం పెంపొందుతుందని ప్రిన్సిపల్ శ్రీలత పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కృష్ణాపురం గ్రామంలో ఏడు రోజుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. గ్రామంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. ఎంఈవో బాబయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ బాధ్యుడు వేలాయుధం పాల్గొన్నారు.

కక్ష సాధింపు సరికాదు

డిపో ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నేతలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులపై కక్ష సాధింపు విధానాలు సరికాదని ఎన్ఎంయూ అసోసియేషన్ నాయకులు అన్నారు. తిరుపతి జిల్లా కమిటీ పిలుపు మేరకు గురువారం రెండో రోజూ శ్రీకాళహస్తి డిపో ఆవరణలో నిరసన తెలియజేశారు. గ్యారేజీకి అవసరమైన పరికరాలను సరఫరా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీ చార్ట్ వేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మి, శేఖర్, వైఎస్ కుమార్, ఎల్‌వీకే రావు, డిపో కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ద్వారకానగర్ వంతెనకు భూమిపూజ

తొలి ఇటుకను అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నాగలాపురం, న్యూస్‌టుడే: టీపీ కోట రోడ్డు ఆధునికీకరణకు రూ.11 కోట్లు, కన్నావరం రహదారికి రూ.5 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. నాగలాపురం, పిచ్చాటూరు మండలాలను అనుసంధానించే ద్వారకా నగర్ వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ.9 కోట్ల అంచనాతో వంతెన పనులు ప్రారంభమయ్యాయి. ఆరు నెలల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. డీఈ ప్రభాకర్‌రెడ్డి, ఏడీఏ రమేష్‌చంద్ర, ఎంపీపీ సింధూశ్యామన్, జడ్పీటీసీ సభ్యులు సుమతి మహేష్‌రెడ్డి, సర్పంచులు చిన్నదురైసుధ, మహేంద్రన్, తహసీల్దారు హనుమాన్ నాయక్, ఎంఈవో బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్కార్ట్ వద్దు: వార్డు సభ్యునిగా సైతం గెలవని శంకర్‌రెడ్డి వెంట నేతలు, పోలీసులు, అధికారులు భారీ కాన్వాయ్‌గా వెళ్లడంపై ఎమ్మెల్యే కోనేటి అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల ఎస్కార్ట్ ఇకపై తనకు వద్దని, ప్రేమతో ఆదరించే కార్యకర్తలే బలమని చెప్పారు. ఎంపీడీవో బాలాజీ నాయక్, పంచాయతీ ఈవోలు రాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు.

ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న 108 వాహన యూనియన్ నాయకులు

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలో ఈఎంటీగా పనిచేస్తూ అకాల మరణం చెందిన రేవతి కుటుంబానికి 108 వాహన యూనియన్ నాయకులు గురువారం ఆర్థిక సహాయాన్ని అందించారు. సదాశివపురానికి చెందిన రేవతి 15న మృతి చెందడంతో జిల్లాలోని 108 ఉద్యోగులంతా కలిసి వారి కుటుంబానికి తమ వంతు సాయంగా రూ.66,500 అందించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. 108 వాహన రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మహేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్, జిల్లా కార్యదర్శి మునిరాజా, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

నారాయణవనం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీసొరకాయలస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలో మూలమూర్తికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి ఊయల సేవ జరిపి అఖండ దీపారాధన చేపట్టారు.

ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

అవస్థల ఆస్పత్రికి.. చేయాలి చికిత్స

- గత ప్రభుత్వంలో నిలిచిన లిఫ్ట్ పనులు
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, దివ్యాంగులు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: పెద్దాస్పత్రిగా పేరొందిన శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి జిల్లాలోని తూర్పు మండలాల్లోని పేదలు వైద్యం కోసం రోజూ వందలాది మంది వస్తుంటారు. ఆర్థిక స్థోమత లేక.. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక.. ఇదే తమకు దిక్కని భావిస్తారు. కానీ ఇక్కడకు వచ్చే రోగులను మాత్రం అరకొర సౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఆస్పత్రిని వంద పడకలుగా రూ.12 కోట్ల నిధులతో అదనపు భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే గత పాలకుల పుణ్యమా అంటూ చేపట్టిన లిఫ్ట్ నిర్మాణం అర్ధాంతరంగా వదిలేయడంతో వైద్యసేవలు పొందేందుకు పైఅంతస్థులకు వెళ్లాల్సి రావడంతో గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధులు నిత్యం నరక యాతన పడుతున్నారు. దీనికి తోడు అంతర్గత రోడ్లు దెబ్బతిని కనీసం నడిచేందుకు వీల్లేని పరిస్థితి.

లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు వదిలిన స్థలం

చంటి బిడ్డతో అవస్థలు పడుతున్న మహిళ

కొంటోంది. ఈఎన్‌టీ సేవలు, చర్మ వ్యాధులు, చిన్నపిల్లల వార్డు, గైనకాలజీ వార్డు, ఆపరేషన్ థియేటర్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటి సేవలు, చికిత్సలన్నీ పై అంతస్థుల్లోనే నిర్వహిస్తున్నారు. ఈ వైద్య సేవలను పొందేందుకు పై అంతస్థుకు మెట్ల మార్గంలో వెళ్లేందుకు బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. సహాయకులు తమ వారిని చక్రాల కుర్చీలో తోసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవ్వరైనా ఎక్కిదిగాల్సిందే..!

ఆస్పత్రిలో లిఫ్ట్ అందుబాటులో లేక రోగులు, సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. ఎవరైనా సరే మెట్లు ఎక్కిదిగాల్సిన దుస్థితి నెలకొంటోంది.

ప్రతిపాదనలు పంపించాం

ఆస్పత్రిలో గతంలోనే లిఫ్ట్ ఏర్పాటు ఆగిపోయింది. రోగుల అవసరాల దృష్ట్యా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే లిఫ్ట్ ఏర్పాటు చేస్తాం. **- మురళీకృష్ణారెడ్డి, సూపరింటెండెంట్**

నిబంధనలకు తిలోదకాలు

పూర్తిగా నాణ్యతకు తిలోదకాలు వదిలేసి హడావుడిగా పనులు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందన్న కారణంతో అసంపూర్తి పనులతోనే 2024 జనవరిలో భవనాన్ని ప్రారంభించేశారు. ఫలితంగా వర్షమొస్తే చాలు భవనం ఉరుస్తోంది. శవాగారం మొత్తం పెచ్చులూడి పడటంతో గతంలోని నాణ్యత ఏపాటిదో తేటతెల్లమైంది. దీంతో పాటు అదనపు భవనాలను నిర్మించినప్పుడు అవసరమయ్యే ప్రధానమైన లిఫ్ట్‌కు స్థలాన్ని కేటాయించి ఏర్పాటును విస్మరించారు. రూ.12 కోట్ల నిధులు సరిపోలేదని కారణంగా చూపారు. నిలిచిన ఈ పనులపై అధికారంలో ఉన్న గత పాలకులు అప్పట్లో నోరు విప్పకపోవడం గమనార్హం.

నేతలు చెప్పిందే చేశారు

శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆస్పత్రిని వంద పడకలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నాడు-నేడు పనుల కింద గత వైకాపా ప్రభుత్వం అదనపు భవనాల నిర్మాణ పనులను తలపెట్టింది. ఇందుకోసం ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ రూ.12 కోట్ల అంచనా విలువతో ప్రైవేటు గుత్తేదారు సంస్థకు పనులను అప్పగించింది. అయితే పనులు దక్కించుకున్న సంస్థ నిర్వాహకులు వైకాపా నేతలు చెప్పిందల్లా ఆడారన్న తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

గోపురంపై వెలిగిన అక్షరాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని రాజగోపురం తిరిగి విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా దర్శనమిస్తోంది. గోపురంపై విద్యుత్తు దీపాలు సక్రమంగా వెలగకపోవడంపై 'శివయ్య వెలుగులు లేవయ్యా' అని మంగళవారం 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆలయ అధికారులు దీపాలను బాగు చేయించారు. దీంతో రాజగోపురం ఎంతో కళాత్మకంగా దర్శనమిస్తోంది.

గుంత పూడ్చివేత: వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని కదూరు వద్ద రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతను ఎట్టకేలకు పూడ్చివేశారు. గ్రామంలో రహదారిపై ఏర్పడిన గుంత కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై గురువారం 'మేమున్నాం.. మీకు తోడుగా' లో ప్రచురితమైన సమస్యకు అధికారులు స్పందించారు. గుంతపై కంకర తోలి తాత్కాలికంగా పూడ్చారు.

విజేతలతో ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి

నేర్పుతో.. బహుమతులు సొంతం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని సత్తా చాటి బహుమతులు సొంతం చేసుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో చరణ్, హర్షవర్ధన్, షేక్ మహమ్మద్ సుఫియాన్ నిలిచారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. రుక్మాంద రెడ్డి, గోపాల్, భాస్కర్ పాల్గొన్నారు.

3న చొక్కాని మహోత్సవం

తాళ వృక్ష బెరడును సిద్ధం చేస్తున్న కూలీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తమిళ కార్తిక పూర్ణిమను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో చొక్కాని మహోత్సవం నిర్వహించనున్నారు. వేడుకలకు సంబంధించి తాళ వృక్ష పత్రాలను అగ్నికి ఆహుతి చేయడం సంప్రదాయంగా వస్తోంది. వచ్చే నెల 3న నిర్వహించే ఉత్సవానికి సంబంధించి తాళ వృక్ష బెరడును సిద్ధం చేసే పనుల్లో కూలీలు నిమగ్నమయ్యారు. ఆలయంలోని నగిరి కుమారుల మండపం వద్ద విశేష ఉత్సవాన్ని జరపనున్నారు.

ఆగ్నేయ గణపతికి మహాకుంభాభిషేకం

విమాన కలశానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆగ్నేయ గణపతి మహా కుంభాభిషేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం యాగ పూజలను వేదోక్తంగా జరిపారు. యాగ కలశాల్లోని పవిత్ర జలంతో విమానం కలశానికి అభిషేకాలు జరిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కొట్టేసాయి, ఈవో టి. బాపిరెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు గురప్ప శెట్టి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని

సత్యవేడు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్యవేడు విద్యార్థిని ఇషాంక తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం గెలుచుకుంది. నవంబరు 25న రాజమహేంద్రవరంలో 69వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మాస్టర్ స్కూల్ విద్యార్థిని ఇషాంక పాల్గొన్నారు. పోటీల్లో ఆమె తృతీయ స్థానం సాధించింది. విద్యార్థినిని స్కూల్ అధినేత శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు, కరాటే శిక్షకులు భువనేశ్వర్ అభినందించారు.

చెరకు కట్ట.. రాకపోకలు సాగేదెట్టా?

ఏర్పేడు మండలంలోని చెల్లూరు- పాయల్ సెంటర్ రహదారిపై చెరకు కట్టలు నిల్వ చేయడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడం దీనికి తోడు రోడ్డు పొడవునా చెరకు కట్టలు వేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ మార్గంలో స్థానికులతో పాటు బయట ప్రాంతాల వారు సదాశివ రిజర్వాయర్, కోనలోని ఆలయానికి వెళ్తుంటారు. రోడ్డుపై చెరకు కట్టలు వేయడంతో చోదకులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు అవస్థలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

వేలం వేయరు.. అప్పగించరు

రెండేళ్ల క్రితం రేణిగుంట మంచినీళ్లగుంత వద్ద తుడా వారు రూ.లక్షలు ఖర్చుచేసి మూడు దుకాణాలను నిర్మించారు. వాటిని వేలం వేసి పంచాయతీకి లాభాలు తీసుకువస్తామని నాటి తుడా పెద్దలు ప్రగల్భాలు పలికారు. నిర్మాణాలు పూర్తి అయినా నేటికీ పంచాయతీకి అప్పగించలేదు. కనీసం వేలం కూడా నిర్వహించకపోవడంపై పలువురి నుంచి విమర్శలు వస్తున్నాయి. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

మెనూ ప్రకారమే భోజనం అందించండి

సత్యవేడు, న్యూస్‌టుడే: మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎంఈవో రవి స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని దళవాయి అగ్రహారం మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న తీరును ఆయన పరిశీలించారు.

నేడు ప్రజాదర్బార్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో శుక్రవారం జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హాజరై సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'రైతుల మేలు కోరేదే కూటమి ప్రభుత్వం'

మాట్లాడుతున్న నరసింహ యాదవ్

కేవీబీపురం, న్యూస్‌టుడే: రైతుల మేలు కోరుతూ, వారికి కావాల్సిన సంక్షేమ పథకాలను అందించేందుకే కూటమి ప్రభుత్వం ఉందని జిల్లా తెదేపా అధ్యక్షుడు నరసింహ యాదవ్, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని అంజూరులో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని తెలుగు తమ్ముళ్లు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ వారి ఖాతాలో కేజీకి రూ.4 చెల్లించిన విషయాన్ని వివరించారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, రామాంజు నాయుడు, జయరాంరెడ్డి, సురేష్‌చౌదరి పాల్గొన్నారు. **ఏర్పేడు, న్యూస్‌టుడే:** పచ్చి రొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని చిత్తూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని అంజిమేడు, పాతవీరాపురం, ఇసుకతాగేలిలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సమావేశంలో మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులతో భూమి సారవంతంగా మారుతుందని వివరించారు. ఏవో సాగరిక, ఇందిరమ్మ, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కుదుపుల ప్రయాణం.. గుంతలతో సావాసం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాకు సరిహద్దులోని సత్యవేడు నియోజకవర్గంలో రహదారులు దుస్థితికి చేరుకున్నాయి. చోదకులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. దశాబ్దాల కాలంగా రహదారులను ఆధునికీకరించాలన్న స్థానికుల అభ్యర్థనలు అరణ్య రోదనగానే మిగిలిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డులో వెళ్లే వారికి కుదుపుల ప్రయాణం గుంతలతో సావాసం పరిపాటిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత దారుణంగా తయారయ్యాయి.

సరిహద్దుల్లో దుస్థితికి చేరిన రోడ్లు

ఇక్కడే అధికం

- సత్యవేడు మండలం ఇరుగొళం నుంచి తమిళనాడు మాదరపాకంనకు పల్లెల మీదుగా వెళ్లే దారి అడుగడుగునా గుంతలతో నిండిపోయింది. రహదారిలో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే.
- సత్యవేడు-తొండుకులినకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. సత్యవేడు - చెన్నై(కవర్ పేట)కి వెళ్లే ప్రధాన రహదారిది ఇదే పరిస్థితి. కన్నావరం నుంచి వీఆర్‌కండ్రిగ రహదారి నానాటికి అవస్థలను పెంచుతోంది.
- పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బీ పేట రహదారి గుంతలతో నిండి తమిళనాడు వైపుగా వెళ్లే వారికి నరకాన్ని చూపిస్తోంది.
- బీఎన్ కండ్రిగ-సూళ్లూరుపేట మార్గంలో రహదారి ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయి. సూళ్లూరుపేట మండల పరిధి వరకు రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, వరదయ్యపాళెం నుంచి ప్రారంభమయ్యే సగం రహదారి పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

తొండూరుకు వెళ్లాలంటే ఆలోచించాల్సిందే

తడ నుంచి తొండూరునకు వెళ్లే రహదారి

దేశంలోనే ఉత్తమ సెజ్‌గా కీర్తి గడించిన శ్రీసిటీ పరిధిలో ఉంటూ, జిల్లా, రాష్ట్రానికి సరిహద్దులో గల తొండూరు కనీసం రహదారికి నోచుకోవడం లేదు. జాతీయ రహదారి నుంచి శ్రీసిటీకి వెళ్లడానికి తొలి ముఖద్వారమైన తొండూరుకు వెళ్లాలంటే తడ మీదుగా వెళ్లాల్సి ఉంది. వర్షం వస్తే ఈ రహదారి రొచ్చుగా మారుతోంది. ఆటోలు, ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఆపద సమయాల్లో వైద్యం కోసం వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి. 2018లో తెదేపా హయాంలో ఈ రహదారి ఆధునికీకరణకు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో మంజూరైన నిధులను దారి మళ్లించింది. దీంతో రహదారికి గ్రహణం పట్టింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కేవీబీపురం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాట్రపల్లి గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కథనం మేరకు కాలనీలో నివాసం ఉంటున్న సుధాకర్(26), సుగుణ దంపతులకు నలుగురు సంతానం. భర్త నిత్యం మద్యం తాగి వస్తుండటంతో కుటుంబంలో కలహాలు ఉండేవి. దీనికితోడు అప్పుల భారం పెరగడంతో భార్యాభర్తల మధ్య వివాదం మరింత పెరిగింది. గురువారం ఉదయం ఇంట్లో ఉన్న విషగుళికలను తిని సుధాకర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి 25న ఉదయం పొలానికి వెళ్లి, ఇంటికి తిరిగొచ్చి చూడగా భార్య(26), కుమారుడు(10), కుమార్తె(07) కనిపించలేదు. వెంటనే పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. అదృశ్యంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

వ్యవసాయ మోటార్ల స్టార్టర్లు చోరీ

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని జీఎన్ కండ్రిగ నుంచి పాలమంగళం వరకు అరుణా నది పక్కన పొలాల్లోని 18 మోటార్ల స్టార్టర్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఒకేసారి 18 చోట్ల స్టార్టర్లను చోరీ చేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దొంగలు ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడి ఉంటారని రైతులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు స్టార్టర్లు అపహరించిన వ్యక్తులను పట్టుకొని చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో భక్తులు పోగొట్టుకున్న నగదు పర్సును భద్రతాధికారులు తిరిగి వారికి అప్పగించారు. ముంబయికి చెందిన యోగేష్ దిలీప్ పాటిల్ గురువారం రాహు కేతు పూజలు చేయించుకునేందుకు శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి వచ్చారు. రాయల వారి శాంతి మండపంలో పూజలు చేయించుకునే సమయంలో నగదు పర్సును పక్కనే ఉంచి మర్చిపోయారు. విషయాన్ని మైక్ ద్వారా భద్రతాధికారులు ప్రకటించారు. పర్సులో ఉన్న రూ.60 వేల నగదుతో పాటు ముఖ్యమైన పత్రాలను భద్రతా అధికారులు వారికి తిరిగి అప్పగించారు.

భక్తునికి నగదు అప్పగిస్తున్న భద్రతాధికారులు

సమర్థతకు ఘన సత్కారం

విద్యార్థిని హిమజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రజాప్రతినిధి పాత్రను సమర్థంగా పోషించిన విద్యార్థినికి ఘన సత్కారం లభించింది. బోనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హిమజ మాక్ అసెంబ్లీలో అదరగొట్టారు. ఎమ్మెల్యే పాత్రను సమర్థంగా పోషించి గురువారం పాఠశాలకు వచ్చిన సందర్భంగా విద్యార్థిని హిమజను ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. ప్రశ్నోత్తరాల్లో ఆమె పోషించిన తీరును విద్యాశాఖ మంత్రి లోకేశ్ సైతం ప్రశంసించారని ఉపాధ్యాయులు తెలిపారు.

బాల్యవివాహాలు అరికట్టడం అందరి బాధ్యత

వంద రోజుల ప్రణాళికను ప్రారంభిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యతని కమిషనర్ భవానిప్రసాద్ అన్నారు. పురపాలక కార్యాలయ సమావేశపు హాలులో గురువారం బాల్య వివాహాల నియంత్రణకు 100 రోజుల ప్రణాళిక 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు ఐసీడీఎస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సీడీపీవో శాంతి దుర్గ, ప్రగతి సంస్థ జిల్లా సమన్వయకర్త ఎం.రాజారెడ్డి, ఎంఈవోలు బాలయ్య, భారతి, డిప్యూటీ తహసీల్దార్ అనిల్, కోటయ్య పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. రూ.50 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. పాత ఎల్‌సీగేట్ నంబర్ 28 వద్ద అండర్‌పాస్‌ను మూసేయడంతో వంతెన నిర్మించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భక్తులకు ఉపయోగకరంగా స్టేషన్‌లో తాగునీటి వసతి కల్పించి, ప్యాసింజర్ రైలు నడిపేలా రైల్వేశాఖ మంత్రికి విన్నవిస్తామని వెల్లడించారు. రైల్వే అధికారులు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి

(c) eenadu

విజేతలకు బహుమతులు అందించిన ఉపాధ్యాయులు

ప్రతిభ చూపి.. బహుమతి సాధించి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రత్నం ఇంగ్లిష్ మాధ్యమం పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జి.మోక్ష సాయి, వి.సాయిహాసిని, యం.రిషితశ్రీ గెలుపొందారు. వీరికి ప్రిన్సిపల్ వెంకటేష్, ఉపాధ్యాయులు వర్షిణి, సుప్రియ, చిన్నయ్య, బాల, బాలచంద్ర, వినోద్, సురేష్, శ్రీనివాసులు, వనిత బహుమతులు అందజేశారు.

నాయుడుపేటలో నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ సీనియర్ నేత ఎస్.చంద్రారెడ్డి పేర్కొన్నారు.

మాజీ ఎంపీ నెలవల పుట్టినరోజు వేడుకలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేటలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసంలో గురువారం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బాధ్యులు చేరుకుని నెలవలకు పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, పార్టీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, నేత సంచి కృష్ణయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక నవజీవన్ సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ స్టాల్ ద్వారా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌ఛార్జి అమర్‌నాథ్, సంస్థ మేనేజరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చేనిగుంటలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

తడ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని చేనిగుంటలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మమేకమై సమస్యల గురించి ఆరా తీశారు. పార్టీ మండలాధ్యక్షుడు మురళి రెడ్డి, బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్, తడ పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ పళని, కూటమి నాయకులు సుదర్శన్‌రావు, నీలకంఠం, సుధాకర్, తేజారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు
రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	122
లేయర్	130
బ్రాయిలర్స్	222
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	246
లేయర్ మాంసం	221

తుప్పు.. ఎవరిదీ తప్పు!

కంపచెట్లలో ఆట పరికరాలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పోలిశెట్టిగుంట పార్కులోని ఆట పరికరాలు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. పురపాలికగా రూపాంతరం చెంది 20 సంవత్సరాలు కావొస్తోంది. తొలి పాలకవర్గంలో పోలిశెట్టిగుంటను పార్కుగా అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఈ పరికరాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పలు ఆట పరికరాలు చోరీ, దుర్వినియోగానికి గురయ్యాయి. ఉన్న పరికరాలు వాడే పరిస్థితి లేకుండా పోయింది. కొద్దిపాటి పరికరాల చుట్టూ ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దుస్థితికి చేరాయి. రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యింది.

రూ.కోటి ఖర్చు చేసినా నిరుపయోగమే..

పార్కు అభివృద్ధికి వైకాపా పాలనలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.కోటికి పైగా వెచ్చించి నడకదారి, చుట్టూ ఇనుప కంచె, ఆట పరికరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ పార్కు చుట్టూ ఇనుప కంచె వేసి వదిలేశారు. నడకదారి అసంపూర్తిగా ఉంది. మరోవైపు కట్టను పటిష్ఠం చేయాల్సి ఉండగా ఆ దిశగా పెద్దగా చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం నడకదారి మొత్తం పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వాకింగ్ చేసే పరిస్థితి లేదు. మొక్కలు కట్టను పూర్తిగా కమ్మేయడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. పట్టణ నడిబొడ్డున ఆహ్లాదకరంగా ఉండాల్సిన ఈ పార్కు నిర్లక్ష్యంతో అధ్వానంగా మారింది. చిన్నారులు ఆటలాడుకునే పరికరాలు తుప్పు పట్టాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

ఈ పార్కు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారికి అడ్డాగా మారింది. రాత్రి కాగానే మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. దానికి తోడు గంజాయి బ్యాచ్ కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. పట్టపగలే అనేక మంది ఈ కట్టపై మద్యం సేవిస్తూ ఆ మార్గంలో వెళ్లే మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. గతంలో ఈ సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి ఉంది. నిత్యం పోలీసులు ఈ ప్రాంతంలో పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

బూదనంలో రైతన్నా మీకోసం

చిల్లకూరు, న్యూస్‌టుడే: బూదనంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గురువారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం సందేశ పత్రాన్ని గ్రామస్థులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ గోపీనాయక్, తెదేపా మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, స్థానిక తెదేపా నేతలు సూరానేని రామచంద్రరావు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్ విద్యుత్తు ఉపకేంద్రం ప్రాంగణంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం డిప్యూటీ సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగదీష్‌నాయుడు, డీఈ నరేంద్రరెడ్డి, ఏడీ చిన్నయ్య, అధికారులు భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు.

శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

కృత్రిమ మేధపై పట్టు సాధించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదిశంకర డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఐబీఎంపై గురువారం నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. వైస్ ఛాన్స్‌లర్ వీఎస్ఎస్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కృత్రిమ మేధపై పట్టు సాధించాలని చెప్పారు. డీన్ వేణుమాధవ్, రిజిస్ట్రార్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులు ఫైనాన్స్ ద్వారా సులభంగా అందించే రుణాలను పొంది సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని పురపాలక కార్యాలయంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డీసీవో మున్వీర్, మెప్మా సీఎంఎం చందన, సీవోలు విష్ణు, శ్రీనివాసులు, కృష్ణయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. మంగళపూరు సమీపంలోని కలర్ ఫైన్ పరిశ్రమలో ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రావు, అధికారి కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పారా బేసిక్ కోర్సులో విద్యార్థి ప్రతిభ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ తృతీయ ఏడాది, ఎన్‌సీసీ విద్యార్థి కంటేపల్లి చరణ్ ఆగ్రాలో జరిగిన 23 రోజుల శిక్షణలో తన సత్తా చాటారు. రాష్ట్రం నుంచి ఈ విద్యార్థి ఒక్కడే ఎంపికయ్యాడు. శిక్షణలో మిలిటరీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ వారితో సమానంగా పోటీ పడి శిక్షణ పూర్తి చేసి ధ్రువీకరణపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నాడు. రాష్ట్రానికి గౌరవం పెరిగేలా తన ప్రతిభ చాటాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణకుమారి, ఎన్‌సీసీ కెప్టెన్ శివారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ ప్రవీణకుమారి, అధ్యాపకుడు

అధ్యాపకుడి మృతికి సంతాపం

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పని చేసిన రాజా అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు.

29న ఆర్వీ వర్ధంతి

కోట, న్యూస్‌టుడే: కోటలో ఈ నెల 29వ తేదీన అంబేడ్కర్ ఆశయసాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత ఉద్యమనేత ఆర్వీ రమణయ్య వర్ధంతి సభ ఆర్వీ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటకృష్ణయ్య తెలిపారు.

బిల్లులు రాలేదు.. రోడ్డు వేయలేదు

కోట, న్యూస్‌టుడే: కోట-అడ్డరోడ్డు సమీపంలోని ప్రధాన రోడ్డు గుంతలమయమై ప్రమాదకరంగా ఉంది. తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రహదారులు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కోట ఆర్టీసీ బస్టాండ్ సమీపం నుంచి అడ్డరోడ్డు వరకు రోడ్డు వేసేందుకు రూ.1.82 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే బిల్లులు రాలేదని గుత్తేదారు బీసీ గురుకుల కళాశాల సమీపం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి వదిలేశారు. వేసిన రోడ్డు కూడా మరో లేయరు వేయాల్సి ఉంది. దీంతో కళాశాల సమీపం నుంచి అడ్డరోడ్డు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా గుంతలతో నిండి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన అవసరముంది. ఈ విషయమై రహదారులు భవనాల శాఖ ఇన్‌ఛార్జి ఏఈ మల్లికార్జునరావును వివరణ కోరగా త్వరలోనే గుత్తేదారుతో పనులు పూర్తి చేయిస్తామన్నారు.

కోట-అడ్డరోడ్డు సమీపంలో గుంతలతో ప్రధాన రోడ్డు

ప్రమాదకరంగా స్తంభాలు

పెద్దమాంబట్టు ఎస్సీ కాలనీ వద్ద 33 కేవీ విద్యుత్తు స్తంభాలు ప్రమాదం అంచున ఉన్నాయి. చెరువు కలుజు నీరు పారే కాలువలో స్తంభాలుండటం వల్ల నీటి ఉద్ధృతికి అవి ఎక్కడ కూలి ఇళ్ల మీద పడతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిస్కం ఏఈ మురళీని వివరణ కోరగా స్తంభాలను పక్కకు జరిపిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, తడ**

ఆదమరిస్తే కాలువలోకే

మల్లాం మార్గంలోని పంటకాలువపై నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడలు లేవు. ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు వన్‌వేలో ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో లేదా ఆదమరిచినా, రాత్రి సమయాల్లో కాలువలో పడి క్షతగాత్రులవుతున్నారు. అధికారులు మాత్రం రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. **- న్యూస్‌టుడే, చిట్టమూరు**

గుంతల్లోనే ప్రయాణం

మండలంలోని చిన్న ఉలసాపడల నుంచి సూళ్లూరుపేట వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. దారంతా భారీ గుంతలు ఉండటంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణానికి భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

ఇంటిపై విద్యుత్తు తీగలు

బల్లవోలు ఎస్సీ కాలనీలో ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్తు తీగలు వెళ్తుండటంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు తీగలు తెగిపడిన సందర్భాలున్నాయి. బలమైన ఈదురు గాలులు వీస్తే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, చిల్లకూరు**

తొలగని చెత్త.. తప్పని అవస్థ

నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని కోళ్లమిట్ట రహదారికి ఇరువైపులా చెత్త వేయడం వల్ల రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థాలను పశువులు చిందరవందర చేయడంతో వాహనదారులకు అంతరాయం ఏర్పడుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. పరిశుభ్రత పనులు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**



మాట్లాడుతున్న కోడూరు మీరారెడ్డి

'గూడూరుని జిల్లా కేంద్రం చేయాలి'

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఎంతో చరిత్ర కలిగిన గూడూరుని జిల్లా కేంద్రంగా చేయాలని గూడూరు ప్రజా సమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. అన్ని వనరులున్న గూడూరుని జిల్లా కేంద్రంగా చేయాలని, అలా కుదరని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి ముందుకు సాగాలని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తంరావు, సుబ్బారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందించిన డీఎస్పీ గీతాకుమారి తదితరులు

నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరుని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తే శుక్రవారం విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ షఫీ తెలిపారు. అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గూడూరులో గురువారం ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29, 30 తేదీల్లో ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ క్రీడలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ మైదానంలో మండల స్థాయి పోటీలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదర్శ విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తా

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదర్శ కళాశాలకు చెందిన విద్యార్థి చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచాడని ప్రిన్సిపల్ తులసీజ్యోతి తెలిపారు. గురువారం విద్యార్థిని ఆమెతోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలో ప్రతిభ చాటాడు. 800 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 1500 మీటర్ల పరుగులో రెండో స్థానంలో నిలిచాడు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

II మండలాలుగా గూడూరు డివిజన్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు డివిజన్‌లోని ప్రస్తుతం గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరితో 8 మండలాలు ఉన్నాయి. ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటు, మండలాలు, డివిజన్ కేంద్రాల పునర్విభజనలో సైదాపురం, కలువాయి, రాపూరు మండలాలను కలుపుతూ గురువారం జీవో విడుదల చేసింది. దీంతో గూడూరు డివిజన్‌లోని మండలాల సంఖ్య 11కి చేరుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966

కోట, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల సమీపంలోని విద్యుత్తు నియంత్రికకు ఏర్పాటు చేసిన పీఠం దెబ్బతింది. కిందకు వాలి ప్రమాదకరంగా ఉంది. రక్షణ కంచె లేదు. **- రాజేశ్వరి, విద్యార్థిని**

సమాధానం: త్వరలోనే పరిశీలిస్తాం. మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- అనంతరావు, ఏఈ**

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక ప్రైవేటు కళాశాలల నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు కొంత మంది యువత ద్విచక్ర వాహనాలపై విద్యార్థినులను వెంబడిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. **-విద్యార్థినులు**

సమాధానం: గస్తీ నిర్వహిస్తాం. తప్పకుండా ఆకతాయిలపై చర్యలు తీసుకుంటాం. **-చెంచుబాబు, డీఎస్పీ**

సమస్య: బజారువీధుల్లో దుమ్ము లేస్తోంది. **-మురళి**

సమస్య: సీఎస్‌తేజా సెంటర్, ఎన్ఎస్ఆర్ కాలనీల వద్ద సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. పాములు సంచరిస్తున్నాయి. **-చందు, స్థానికుడు**

సమాధానం: వీధులు శుభ్రం చేయిస్తాం. వీధి దీపాలు మరమ్మతులు చేస్తున్నాం. **-ఎస్కే ఫజులుల్లా, కమిషనర్**

మగువ.. ఉపాధి తోవ

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధితో రాణిస్తున్నారు. పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. వ్యాపారాలతో కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. బాలాయపల్లి మండలంలో కొందరు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

నిత్యావసరాల దుకాణంతో అమరావతి

కాలగంధ గ్రామానికి చెందిన అమరావతి తొలుత స్వయం సహాయక సంఘం నుంచి రూ.5 వేలు రుణం తీసుకున్నారు. నిర్ణీత కాలానికి చెల్లిస్తూ రావడంతో క్రమంగా పరపతి పెంచుకుని స్త్రీనిధి తదితర రూపాల్లో రూ.3 లక్షల మేరకు రుణాలు తీసుకున్నారు. గ్రామంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇలా వచ్చే రాబడులతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు లేకుండా స్థిరపడింది. పెరటి కోళ్ల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. గుడ్లతో వ్యాపారాన్ని అనుబంధంగా సాగిస్తున్నారు అమరావతి.

పచ్చళ్ల తయారీతో శ్యామల

పల్లిపాడుకు చెందిన శ్యామల స్వయం సహాయ సంఘం నుంచి కొంత రుణంగా తీసుకుని ఊరగాయల వ్యాపారం చేపట్టారు. స్థానికంగా అందుబాటులో ఉండే నిమ్మకాయలతో మొదలుపెట్టి పలు రకాల పచ్చళ్ల తయారీ నేర్చుకున్నారు. ఆమెకు భర్తతో పాటు కుమారుడు సహకరించడంతో వ్యాపారాన్ని కొంత పెంచుకుంటూ తిరుపతిలోనూ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పచ్చళ్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారం ద్వారా సొంతింటి కల నేరవేర్చుకుని సంతృప్తి వ్యక్తం చేస్తోంది ఆ కుటుంబం.

పాడి వ్యాపారంలో మమత

భైరవరానికి చెందిన మమత ఒకప్పుడు రోజు వారీ కూలీ. పనులు దొరక్క కుటుంబం పడే ఇబ్బందుల నుంచి నేడు ఆవులను పోషిస్తూ పాడి ద్వారా లాభాలు ఆర్జిస్తున్నారు. 2008లో స్వయం సహాయక సంఘంలో చేరిన ఆమె అంచెలంచెలుగా బ్యాంకు పరపతి పెంచుకున్నారు. సంఘం ద్వారా రూ.67 వేలు రుణం తీసుకుని రెండు ఆవులు కొన్నారు. వాటి ద్వారా ఆవుల సంఖ్య పెరిగింది. రోజూ పాల ఉత్పత్తులను గ్రామంలోనే విక్రయిస్తున్నారు. నెయ్యి కూడా తయారు చేసి ఎంతో కొంత ఆదాయం పొందుతున్నారు.

రైలు ఢీకొని తెదేపా నాయకుడి మృతి

బాబు (పాత చిత్రం)

బాలాయపల్లి, గూడూరు పట్టణం: బాలాయపల్లి మండలం నిండలి పంచాయతీ వాక్యం గ్రామానికి చెందిన నర్రావుల బాబు(49) రైలు ఢీకొని మృతి చెందారు. గూడూరు రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాం పరిధిలో గురువారం ఉదయం పట్టాలు దాటేటప్పుడు రైలు ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై చెన్నకేశవ తెలిపారు. ప్రాంతీయ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గ్రామ తెదేపాలో చురుకైన నాయకుడిగా పనిచేసే బాబు మృతికి పలువురు స్థానిక నాయకులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అప్పు విషయమై మహిళపై దాడి

కోట, న్యూస్‌టుడే: మద్దాలికండ్రిగకు చెందిన అల్లెమ్మకు ఇవ్వవలసిన బాకీ అడిగినందుకు ధర్మయ్య, ఆయన కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచారని బాధితురాలు గురువారం ఎస్సై పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలు అల్లెమ్మ కోట ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స పొందారు.

రహదారి మరమ్మతు

స్పందనకు వందనం

కోట, న్యూస్‌టుడే: మల్లాం సమీపంలోని రొయ్యల వాగు వంతెనపై దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు చేశారు. 'ఈనాడు'లో ఇటీవల వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు.

(c) eenadu

ఈనాడు విశాఖపట్నం
శుక్రవారం 28 నవంబరు 2025 సిటీ 5

చేసిందే పని.. అవినీతి గని!

★ విశాఖలో 'రాక్రీట్' ఇష్టారాజ్యం
★ వైకాపా హయాంలో ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు

అసంపూర్తి గృహాల దుస్థితి

ఈనాడు, విశాఖపట్నం: వైకాపా ప్రభుత్వ హయాంలో 'జగనన్న కాలనీల' పేరుతో రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడినట్లు గృహనిర్మాణ శాఖ తేల్చింది. అవి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వైకాపాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సంబంధీకులకు చెందిన ఈ సంస్థ జిల్లాలో పలు మండలాల్లో ఇష్టానుసారంగా చేసిన పనులపై 'విజిలెన్స్' దృష్టిసారించింది. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వారు చేసిందే పనిగా సాగింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆపేసి, యంత్రాలను వదిలేశారు. ఆనందపురం మండలంలో పోక్లెయిన్లు, ఇతర వాహనాలను అలానే ఉంచేశారు. అక్కడే సిమెంటు బస్తాలు, ఇనుప చువ్వలు వదిలేశారు. అవన్నీ ఎండి వానకు తడవడంతో అప్పట్లో పాడైపోయాయి. చేసిన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని నాడు జాగ్రత్త పడినా విచారణలో వెలుగులోకి వచ్చాయి.

20 వేలు కేటాయిస్తే..

జిల్లాలోని లేఅవుట్లలో లక్షకుపైగా ఇళ్ల కోసం గృహ నిర్మాణశాఖ మ్యాపింగ్ చేసింది. వాటిల్లో రాక్రీట్ ఇన్‌ఫ్రా కొన్ని లేఅవుట్లలో 20 వేల ఇళ్లప్పగించారు. నిర్మాణాలు చేపట్టినా నాణ్యత లోపంగానే ఉన్నాయి.

■ సబ్బవరం మండలం పైడివాడఅగ్రహారంలో రాక్రీట్ సంస్థ నిర్మాణాలు చిన్నపాటి వర్షానికే పునాదులతో సహా కొట్టుకు పోయాయి. కొన్ని చోట్ల గోడలకు బీటలు వచ్చాయి.

■ నడుపూరు, గంగవరం, నంగినాపాడులో చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ లేఅవుట్ల నుంచి రూ.2 కోట్ల వరకు రికవరీకి ప్రతిపాదించినట్లు సమాచారం.

ఇక్కడ పడితే.. అంతే..!

ఇటీవల మొంథా తుపాను తీవ్రతతో నగరంలో కురిసిన వర్షాలకు అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నడకమార్గంపై ఉన్న శ్లాబ్ కూలిపోయింది. నిర్మాణ వ్యర్థాలు తొలగించడంతో, ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దేవాదాయ శాఖ, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పునర్నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. -న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

'డ్రగ్స్' కేసులో బిగుస్తున్న ఉచ్చు

వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డికి ఉన్న లింకులపై ఆరా

ఈనాడు-విశాఖపట్నం: విశాఖలో డ్రగ్స్ వినియోగం చాపకింద నీరులా సాగుతోంది. యువతను డ్రగ్స్‌కు బానిసలుగా చేసిన వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డిని పోలీసులు మాదకద్రవ్యాల కేసులో నిందితుడిగా చేర్చారు. ఇటీవల స్నేహితుడి ద్వారా ఎల్‌ఎస్‌డీ స్ట్రిప్స్ బెంగళూరు నుంచి తెప్పించి, విశాఖ టాస్క్‌ఫోర్స్‌కు కొండారెడ్డి ఆధారాలతో పట్టుబడ్డారు. ఈ కేసులో అరెస్టై జైలుకు వెళ్లారు...ఇక్కడి నుంచి పీటీ వారెంట్‌పై విజయవాడ పోలీసులు తీసుకెళ్లారు. ఎండీఎంఏ విక్రయాల కేసులో కొండారెడ్డిని మాచవరం పోలీసులు నిందితుడిగా చేర్చారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

అలా చిక్కారు: నాదికల్లులో పని చేస్తున్న ఓ ఉద్యోగి కుమారుడు శ్రీవాత్సవ్ బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. అతనికి ఇంటర్‌లో పరిచయమైన కొండారెడ్డితో స్నేహం కుదిరింది. అతని ద్వారా బెంగళూరు నుంచి ఎండీఎంఏ విశాఖ వచ్చేది. అలాగే...విశాఖకు చెందిన హర్షిత్ అనే యువకుడితో పరిచయం పెంచుకుని, ఆయన డ్రగ్స్ అలవాటు ఉండటంతో ఇద్దరూ కలిసి బెంగళూరులో 20 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. అందులో ఒక ప్యాకెట్టు ఇద్దరూ వినియోగించి 19 జిప్ కవర్లలో 2 గ్రాముల చొప్పున ఉంచి బస్సులో విశాఖ వస్తూ విజయవాడలో దొరికిపోయారు. ఈ కేసు విచారణ జరుగుతుండగా... విశాఖకు చెందిన వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు స్నేహితుల ద్వారా బెంగళూరు నుంచి ఎల్‌ఎస్‌డీ స్ట్రిప్స్ తెప్పిస్తూ పట్టుబడ్డారు.

● విజయవాడ కేసులో పట్టుబడ్డ నిందితులు, వారికి డ్రగ్స్ సరఫరా చేసిన బెంగళూరుకు చెందిన ముఠా సభ్యులకి కొండారెడ్డితో లింకులున్నట్లు విచారణలో తెలిసింది. ఈ నేపథ్యంలో విజయవాడ కేసులో ఏ11గా కొండారెడ్డిని చేర్చినట్లు సమాచారం.

వెలుగులోకి రాని డ్రగ్స్ పార్టీలు: వైకాపా హయాంలో విశాఖలో విచ్చలవిడిగా సాగిన మత్తు దందా మూలాలు బలంగా పాతుకుపోయాయి. కొండారెడ్డి ఓ పామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలు ఇవ్వడం, తనవెంట తిరిగే అనుచరులకు అలవాటు చేయడం కూడా వెలుగులోకి వచ్చాయి. పలువురు పుట్టినరోజు వేడుకలు, ఇతర సందర్భాల్లో డ్రగ్స్ వాడకం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. ఇలాంటి పార్టీలపై పోలీసులు నిఘా పెట్టి నిరోధించాల్సి ఉంది.

మరో కేసులో ముగ్గురు మహిళలు: విశాఖ, హైదరాబాద్ ఈగల్ టీమ్స్ గురువారం జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఓ హోటల్‌లో ముగ్గురు నైజీరియా మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఓ సర్వీసు అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, సరఫరాలో చురుగ్గా పాల్గొంటున్నట్లు అధికారులు గుర్తించారు. వీరిపై గతంలో ఎన్‌డీపీఎస్ కేసులున్నాయి. హైదరాబాద్‌లో ఉన్న వ్యక్తులతో డ్రగ్స్ సంబంధించి లింకులు కొనసాగిస్తున్నట్లు ఈగల్ టీంలు గుర్తించారు. ఈ నేపథ్యంలో అరెస్టు చేసి హైదరాబాద్ తరలించారు.

మిద్దె పంటకు దక్కింది పురస్కారం

గాజువాక, న్యూస్‌టుడే: 'మిద్దె పంట'లో భాగంగా వివిధ పండ్ల, పుష్పజాతుల మొక్కలను పెంచుతున్న మాసవరపు ఐశ్వర్యకు నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అవార్డు అందించింది. దిల్లీలోని గాంధీ స్మృతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో దీనిని అందించారు. పదేళ్లుగా మిద్దె, ఆర్గానిక్ పంటలు, వేస్ట్ మేనేజ్‌మెంట్, గోఆధారిత వ్యవసాయంతో గార్డెనింగ్‌లో విశేష ప్రతిభ చూపుతున్నందుకు ఐశ్వర్య ఆర్‌డబ్ల్యూఏల రాష్ట్ర, జాతీయ ప్రతినిధుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. నేచర్ గార్డెన్స్ (ప్రకృతి ఒడి) సంస్థకు ఆమె వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

అవార్డు అందుకుంటున్న ఐశ్వర్య

అది 'కార్లు... చూడండి'!!

సింహాచలంలో ఆలయ రాజగోపురం ఎదురుగా నిలిపిన వాహనాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడం కన్నా వాహనాల పార్కింగ్ చోటు వెతుక్కోవడానికే అధిక సమయం పడుతోందని భక్తులు వాపోతున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సొంత వాహనాల్లో వచ్చే వారు గణనీయంగా ఉంటున్నారు. సింహగిరికి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు.

వాహనాలు నిలిపేదిక్కడ..

- రాజగోపురం ఎదురుగా
- జోడుభద్రాల ప్రాంగణం
- గజపతి సత్రం మార్గం
- వసతి గృహాల ప్రాంతం
- హిల్‌టాప్ రహదారి
- పాదాలమ్మ గుడి ప్రాంగణం
- ద్విచక్ర వాహనాలకు లోవతోట
- అన్నదాన భవనం సమీపంలో

● ఇవి నిండిపోతే వైకుంఠవాసుల మెట్ల మార్గం, హిల్‌టాప్ రహదారి కొండపైకి వాహనాలు మళ్లిస్తున్నారు. కొన్నిసార్లు మాడవీధులకు ఇరువైపులా భక్తులు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ సింహగిరిపై ట్రాఫిక్ సమస్యలొస్తున్నాయి.

అరకొర వసతులు: అప్పన్న కొండకు నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సుమారు 1,500 వరకు నాలుగు చక్రాలు, 3 వేల వరకు ద్విచక్రవాహనాలు వస్తున్నాయి. కాని, 250 కార్లు, 500 ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు మాత్రమే సింహగిరిపై స్థలం అందుబాటులో ఉంది. రద్దీ రోజుల్లో భక్తుల దర్శనానికి కనీసం రెండు గంటల సమయం పడుతోంది. అనంతరం పార్కింగ్ నుంచి వాహనాలను బయటకు తీసుకురావడం భక్తులకు కష్టతరంగా మారుతోంది. ప్రముఖులెవరైనా వస్తే రాజగోపురం వరకు వాహనాలను తీసుకెళ్తున్నారు.

ముందస్తు ప్రణాళికతో ఉపశమనం..: అప్పన్న కొండకు వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా రాబోయే అవసరాలకు తగినట్లు పార్కింగ్ ప్రాంగణాలను అభివృద్ధి చేయకుంటే అవస్థలు తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు. సింహగిరిపై ఉన్న ఖాళీ ప్రదేశాలను సద్వినియోగం చేసుకోవడం లేదని విమర్శలున్నాయి. తొలుత పార్కింగ్ ప్రదేశాలను నిర్మించి ఇతర నిర్మాణాలపై దృష్టి సారించి ఉంటే ప్రయోజనకరంగా ఉండేదన్న సూచనలొస్తున్నాయి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

'తొలి గురువారం' పూజలకు పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే: మార్గశిర మాసం తొలి గురువారం కావడంతో పాతనగరంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం అర్ధరాత్రి నుంచే భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వేకువజామున పసుపు నీళ్లు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అర్చకులు వేద మంత్రాలతో వివిధ పూజలు, హోమం, క్షీరాభిషేకం పూర్తి చేసి, అమ్మవారిని అలంకరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ శోభారాణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

★ అమ్మవారి దర్శనానికి ఉచితంతో పాటు, రూ.100, రూ.200, రూ.500 టికెట్లు దేవస్థానం అందుబాటులో ఉంచింది. ఉచితం, రూ.100, రూ.200 క్యూలైన్లలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. భక్తులకు జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం చేశారు.

టౌన్ కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్‌ను మళ్లించారు. క్షేత్రస్థాయిలో భద్రత ఏర్పాట్లను సీపీ శంఖబ్రతబాగ్చీ పర్యవేక్షించారు,

దర్శనాలకు వరుసలో వేచి ఉన్న భక్తులు

మ్యుటేషన్‌కు లంచం మెలిక

'అనిశా'కు చిక్కిన వీఆర్‌ఓ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: భూముల మ్యుటేషన్‌కు లంచం తీసుకుంటూ అనకాపల్లి మండలానికి చెందిన వీఆర్‌ఓ ఎం. సూర్యనారాయణ గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. అనిశా డీఎస్పీ ఎన్.ఎస్.ఎస్. రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... అక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు సంజీవరావు ఈ ఏడాది మే నెలలో మృతిచెందారు. ఆయన పేరునున్న మూడున్నర ఎకరాల భూమిని భార్య దేముడమ్మ పేరు మీదికి మార్చడానికి సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్నారు. అక్కిరెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న సూర్యనారాయణ మొత్తం 24 సర్వే నంబర్లుగా ఉన్న మూడున్నర ఎకరాల భూమిలో 19 సర్వే నంబర్లలో భూమి మ్యుటేషన్ చేశారు. మిగిలినది చేయాలంటే రూ. 50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితులు విషయం అనిశా దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఓ బాధిత రైతు కుటుంబం నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

వీఆర్‌ఓ సూర్యనారాయణ

జీవితాలిచ్చేవారికి.. జీతాలివ్వలేమా?

సాగరతీరంలో లైఫ్‌గార్డ్సుకే రక్షణ కరవు

మల్కాపురం, న్యూస్‌టుడే: ఒకసారి మృత్యువు అంచు వరకు వెళ్లిన వ్యక్తిని కాపాడితే.. అతనికి మళ్లీ కొత్త జీవితాన్నిచ్చినట్లే. అంతటి సాహసం చేసి తమ ప్రాణాలను పణంగా పెడుతున్న 'లైఫ్‌గార్డ్స్' ప్రతిరోజు భయం భయంగా.. భద్రత లేని విధులు నిర్వహిస్తున్నారు.

13 బీచ్‌లలో: పర్యాటకులు సముద్ర స్నానాలకు వచ్చినప్పుడు కెరటాల ధాటికి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతుంటారు. ఈ నేపథ్యంలో నగరంలోని భీమిలి నుంచి గంగవరం వరకు ఉన్న బీచ్‌లలో లైఫ్‌గార్డ్సు (గజ ఈతగాళ్లు) వ్యవస్థను తీసుకువచ్చారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో వీరిని నియమించారు. 2012 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది. 13 బీచ్‌లలో 44 మంది ఎప్పుడూ విధుల్లో ఉంటారు.

బీచ్‌లో కెరటాలకు చిక్కుకున్న విదేశీయుడిని కాపాడిన లైఫ్‌గార్డ్సు

జీతాలకు ఎదురుచూపులే: వీరికి నెలకు వేతనం రూ. 18,000లుగా నిర్ణయించారు. ఇ.ఎస్.ఐ., పీఎఫ్‌లకు రూ. 3 వేల వరకు వేతనం నుంచి తీస్తారు. మిగిలిన రూ. 15 వేలు వారి చేతికి అందుతుంది. అయితే ఏ నెలలోనూ వీరికి సమయానికి జీతం రాదు. ఒక్కోసారి నాలుగు నెలలకు, మూడు నెలలకు, రెండు నెలలకు ఇస్తుంటారు.

ఇదీ సంగతి: లైఫ్‌బాయ్‌లు, లైఫ్‌జాకెట్లు, రెస్క్యూడ్రోన్‌లు, లైఫ్ లైన్‌లు, ప్లాస్టిక్ ట్యూబ్‌లు అన్ని చోట్లా వీరికి ఇవ్వలేదు.

● ఎండైనా.. వానైనా బీచ్‌లలో నిలబడి ఉండాల్సిందే.

● బీమా సౌకర్యం కల్పిస్తామని, ప్రీమియం కడతామని అధికారులు తొలుత హామీ ఇచ్చారు. రూ. 50 లక్షల వరకు కవరేజ్ ఉండేలా చూస్తామన్నారు. కానీ, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు.

సమస్యలు వాస్తవమే: 'లైఫ్‌గార్డుల సమస్యలపై గుత్తేదారులతో చర్చించాం. సకాలంలో వేతనాలను చెల్లించేలా, ఈఎస్ఐ, పీఎఫ్‌తోపాటు బీమా కవరేజ్ ఉండేలా చూస్తాం. అలానే వారు అడుగుతున్న పరికరాలు సమకూర్చేందుకు మావంతు ప్రయత్నం చేస్తాం' అని జీవీఎంసీ స్పోర్ట్స్ అథారిటీ విభాగం ప్రతినిధి **అప్పలరాజు** పేర్కొన్నారు.

ఏయూ స్థలంలో ఆక్రమణ అడ్డగింత

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం సమీపంలో శ్రీపోలమాంబ గుడి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కొందరు ఆక్రమణకు యత్నించగా ఏయూ అధికారులు అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మించేందుకు ఆలయ సిబ్బంది బుధవారం రాత్రి యంత్రాలతో గోతులు తవ్వించారు. విషయం తెలిసిన వెంటనే రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు అక్కడికి చేరుకొని వారి చర్యను అడ్డుకున్నారు. ఆ స్థలం ఏయూకు చెందినదని, దాన్ని ఎలా కబ్జా చేస్తారంటూ ప్రశ్నించారు. స్థలానికి సంబంధించి ఏమైనా హక్కు పత్రాలుంటే చూపాలని నిలదీయగా వారు వెనుదిరిగారు.

గోతులు తవ్విన చోట స్థలాన్ని పరిశీలిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు తదితరులు

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగించనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం పవన్‌కుమార్ తెలిపారు.

సంత్రాగచ్చి- యలహంక (02863/64) : డిసెంబరు 4 నుంచి 25 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, మర్నాడు తెల్లవారుజామున 2.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 2.45 గంటలకు బయలుదేరి యలహంకకు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబరు 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు యలహంకలో బయలుదేరే రైలు, అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 11.07 గంటలకు బయలుదేరి సంత్రాగచ్చికి వెళ్తుంది. యశ్వంత్‌పూర్ నుంచి రాకపోకలు సాగించాల్సి రైలును యలహంకకు మార్పు చేశారు.

చర్లపల్లి- బ్రహ్మపుర (07027/28) : డిసెంబరు 5 నుంచి జనవరి 30 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు చర్లపల్లిలో బయలుదేరే రైలు, మర్నాడు తెల్లవారుజామున 3.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 3.45 గంటలకు బయలుదేరి బ్రహ్మపుర వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబరు 6 నుంచి జనవరి 31 వరకు ప్రతి శనివారం ఉదయం 11.30 గంటలకు బ్రహ్మపురలో బయలుదేరే రైలు, సాయంత్రం 4.45 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 4.47 గంటలకు బయలుదేరి చర్లపల్లికి వెళ్తుంది.

జూలో 'దళపతి' జన్మదిన సందడి

ఎండాడ, న్యూస్‌టుడే: విశాఖ జూలో నీటి ఏనుగు హిప్పోపొటామస్ (జూనియర్ దళపతి) 8వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, పలు కళాశాల విద్యార్థులు, సందర్శకులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు. జూనియర్ దళపతికి ఇష్టమైన కాయగూరలు, అరటిపళ్లు, క్యారెట్ పెట్టారు. అనంతరం జూ క్యూరేటర్ జి.మంగమ్మ కేక్ కోసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా సీపీఈ జూనియర్ కళాశాల ఈ దళపతిని ఒక్కరోజు.. ఇతర జంతువులు రెడ్-నెక్డ్ వాలబీ, బ్లాక్ స్వాన్, లెమర్‌లను ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. కార్యక్రమంలో సీపీఈ కళాశాల సీఈఓ బి.ఆదినారాయణ, వెటర్నరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి ఏనుగు (దళపతి)కు పండ్లు తినిపిస్తున్న జూ సిబ్బంది

ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ విభాగం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో పల్మనాలజీ సూపర్ స్పెషాలిటీ ప్రత్యేక వైద్య విభాగం త్వరలో అందుబాటులోకి రానుంది. క్షయ కాని వ్యాధులకు ఈ విభాగంలో సీనియర్ వైద్యుల ద్వారా వైద్య సేవలందించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్ తెలిపారు. ఈ విభాగం ద్వారా ఆస్తమా, సీవోపీడీ, ఐఎల్‌డీ, లంగ్ క్యాన్సర్ లాంటి వ్యాధులకు ఈ విభాగంలో వైద్యసేలందిస్తామని పేర్కొన్నారు. క్షయ ఆసుపత్రిగా ఉన్నందున వివిధ సమస్యలతో బాధపడుతున్నవారు ఇక్కడ వైద్యం పొందలేకపోతున్నారని, ఈ నేపథ్యంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఓపీ విభాగం పక్కనే దీన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

రోజూ అలా... కావాలి తళతళ!!

నగరంలో సదస్సులుంటేనే అద్దంలా శుభ్రత

నిత్యం ఈ కసరత్తు సాగాలంటున్న నిపుణులు

ఈనాడు-విశాఖపట్నం: నగరంలో ఇటీవల జరిగిన భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో పర్యావరణహిత కార్యక్రమాలకు పెద్దపీట వేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి, ఉత్పన్న మయ్యే వ్యర్థాలను రీసైక్లింగ్, ప్రాసెసింగ్‌కు సకాలంలో తరలించారు. బీచ్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రాంగణంలో మంచినీటికి మట్టి, గాజు సీసాలు, కాగితపు పెన్నులు ఉపయోగించారు. పక్కా ప్రణాళికగా జీరో వేస్ట్ సాధించి జీవీఎంసీ ప్రశంసలు అందుకుంది. ఇందుకు 20 రోజులముందే పకడ్బందీగా ప్రణాళిక రూపొందించారు. అయితే సదస్సులు, ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పుడు మాత్రమే పెట్టే ప్రత్యేక శ్రద్ధ... ప్రతిరోజూ వ్యర్థాల నిర్వహణ విషయంలోనూ చూపాల్సి ఉంది. అలా చేస్తేనే స్వచ్ఛసర్వేక్షణ్‌లో ముందంజలో ఉంటామని నిపుణులు సూచిస్తున్నారు.

సదస్సు సమయంలో వాహనంతో బీచ్‌లో శుభ్రం చేస్తూ..

ఎంతలా స్పందించారో: సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా విమానాశ్రయం నుంచి ప్రాంగణం వరకు, బీచ్‌రోడ్డు, పార్కింగ్ ప్రదేశాల్లో ఒప్పంద కార్మికులను వెయ్యి మందితో మూడు షిఫ్టుల్లో పని చేయించారు. వీరితో పాటు జీవీఎంసీ సిబ్బంది 600 మంది పనిచేశారు. సదస్సు ప్రాంగణాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు 60 మంది రెండు రోజుల పాటు పనిచేశారు. నిత్యం రెండు టన్నుల చొప్పున వ్యర్థాలు తొలగించారు. తడి చెత్తను బయోగ్యాస్ ప్లాంటుకు ప్రత్యేక వాహనాల్లో ఎప్పటికప్పుడు తరలించారు. గాజు సీసాలను ప్రత్యేక చర్యలతో పునర్వినియోగానికి ఉపయోగపడేలా చేశారు. అంతేకాదు...బీచ్‌లలో చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు వాహనాలతో తొలగించేవారు.

ఇప్పుడేం జరుగుతుందంటే: 'క్లాప్' వాహనాలు 70 శాతం మాత్రమే ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తున్నాయి. గెడ్డలు, కొండవాలు ప్రాంతాల్లోకి వాహనాలు పూర్తిగా వెళ్లడం లేదు. తడి, పొడి చెత్త వేర్వేరుగా క్లాప్ వాహనంలో వేయాల్సి ఉన్నా పాటించడం లేదు. సేకరించిన చెత్తను ట్రాన్స్‌పోర్టు స్టేషన్‌లో పెట్టి అక్కడి నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తారు. అయితే గుత్తేదారులు చెత్తను ఇక్కడ నుంచి ఎప్పటికప్పుడు తరలించాల్సి ఉన్నా అక్కడే నిల్వపెట్టేస్తున్నారు. భవన వ్యర్థాలతో బ్రిక్స్, టైల్స్ తయారు చేసే యూనిట్లు ఉన్నా పూర్తి స్థాయిలో పని చేయడం లేదు.

నగరంలో రోజూ ఉత్పత్తయ్యే చెత్త: 1,100 టన్నులు	
చెత్తసేకరించే క్లాప్ వాహనాలు: 608	ట్రాన్స్‌పోర్టు స్టేషన్లు: భీమిలి, చీమలాపల్లి, ముడసర్లోవ, ఓల్డ్‌టౌన్, గాజువాక
పనిచేస్తున్న కార్మికులు: 870	

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు!

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నగరంలో రౌడీషీటర్ల హల్‌చల్ ఏమాత్రం ఆగడం లేదు. రౌడీషీట్‌ను 'బ్రాండ్'గా మార్చుకొని రోజురోజుకు పేట్రేగిపోతున్నారు. వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారు. బృందాలుగా వెళ్లి దాడులకు తెగబడుతున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది.

★ ఒక్క పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో 46 మందిపై రౌడీషీట్లు తెరిచి ఉన్నాయి. గడిచిన ఏడాదిగా 20 నుంచి 28 ఏళ్ల వయసున్న యువకులు 16 మందిపై కొత్తగా రౌడీషీట్లు తెరిచారు. గతేడాది డిసెంబర్‌లో సత్ప్రవర్తన కింద 8 మందిపై షీట్లను రద్దు చేశారు.

పీఎంపాలెం స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

★ నేరాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లినా మార్పు రాని వారిపై పోలీసులు రౌడీషీట్ తెరుస్తుంటారు. ఎక్కువగా భూ వ్యవహారాల్లో తలదూర్చే వారు ఈ జాబితాలో కనిపిస్తున్నారు.

★ రౌడీషీటర్ల వేధింపులు తాళలేక...వారితో ఉన్న వివాదాలతో పలువురు అవకాశం చూసి ప్రతీకారం తీర్చుకుంటున్నారు. గత జులైలో కంచరపాలెం శ్మశానవాటిక వద్ద మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కత్తితో బెదిరించిన రౌడీషీటర్ ఎల్లాజి(34)ని ఓ వ్యక్తి పారతో కొట్టడంతో మృతి చెందాడు. అదే నెలలో ఎయిర్‌పోర్టు స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉన్న లోహిత్ (21)ను కొందరు యువకులు కత్తులతో పొడిచి చంపారు. 2022లో ఉషోదయ కూడలిలో అంతర్గత ద్వేషంతో రౌడీషీటర్ అనిల్‌కుమార్‌ను ఇద్దరు స్నేహితులు కత్తితో పొడిచి చంపేశారు. 2023లో నాటి ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్, దాడి ఘటనలో రౌడీషీటర్లే నిందితులుగా ఉన్నారు. ★ పీఎంపాలెంలో ఓ యువకుడిపై హత్యాయత్నం చేసిన కేసులో ఆర్‌హెచ్‌కాలనీకి చెందిన రౌడీషీటర్ కీలకంగా వ్యవహరించాడు.

★ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని 22 పోలీసు స్టేషన్లలో సుమారు 350 మంది వరకు రౌడీషీటర్లు ఉన్నట్లు సీపీ శంఖబ్రతబాగ్చీ ఇటీవల వెల్లడించారు. వారిలో 180 మందికి పైగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించామని, వీరందరికీ కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు.

ఉత్పత్తితో వేతనాలను ముడిపెడితే ప్రతిఘటిస్తాం

ధర్నాలో పాల్గొన్న ఉక్కు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో ఉత్పత్తితో వేతనాలను ముడిపెడుతూ ఈనెల 15న విడుదల చేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని.. లేకుంటే ప్రతిఘటిస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. ప్రధాన పరిపాలన భవనం ఎదుట గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ధర్నా నిర్వహించారు. ఉద్యోగులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా పూర్తి వేతనాలు చెల్లించకుండా కార్మికులను అర్ధాకలితో పస్తులు పెడుతున్నారని.. అదీ చాలక ఇప్పుడు ఉత్పత్తితో ముడిపెట్టడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో డి. ఆదినారాయణ, కె. ఎస్.ఎన్.రావు, పి.వి. రమణమూర్తి, ఎం. రాజశేఖర్, యు. రామస్వామి, జె. అయోధ్యరామ్, సిటూ జిల్లా నాయకులు ఎం. రామారావు, పాడి త్రినాథ్, సీహెచ్. సన్యాసిరావు, డి. అప్పారావు, డి.వి. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

నేడు జాబ్‌మేళా

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జైలురోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, సుమారు 700 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని ఎమ్మెల్యే సూచించారు.

'జీవీఎంసీ డీపీఓ'గా నాగార్జునరావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ యూసీడీ విభాగం డీపీఓ(ఉపకార అధికారి)గా జి.నాగార్జునరావును నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళంలో బజానావాశ అసిస్టెంట్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఏడాది పాటు డిప్యుటేషన్‌పై జీవీఎంసీకి బదిలీ చేశారు.

శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామివారి దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం-530028

సీల్డ్ టెండరు ప్రకటన

Cell No.: 7981881543/ 9397317178 08/07/2025, Dt.: 24/11/2025

శ్రీ స్వామివారి దేవస్థానం భూపరిరక్షణ విభాగమునకు గస్తీ తిరుగుటకు 2022 సం॥ లేదా తదుపరి సంవత్సరములకు చెందిన మోడల్ గల మంచి కండిషన్‌లో గల బొలేరాలు 7 సీట్లు (6+1) పెయింట్ గలవి (పూర్తి టిఎస్ 1కి, 15కి.మీ.ల లెక్కింపు పద్ధతిపై రెండు సంవత్సరములకు కాంట్రాక్టు ప్రాతిపదికను సీల్డు టెండరు పిలవబడుచున్నది. సీల్డు టెండర్ షెడ్యూలు కొరకు తేది. 29/11/2025 నుండి తేది.07/12/2025 వరకు సాయంత్రం గం॥ 05.00ల వరకు రూ॥ 500/-లు చెల్లించి కొనుగోలు చేసుకొనవలెను. మరియు తేది.08/12/2025న సీల్డు టెండర్ ఉదయం గం॥ 9.00ల నుండి కొండదిగువ కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము నందు సీల్డ్ టెండర్ నిర్వహించబడును. టెండర్ బాక్స్ నందు తేది.08/12/2025న ఉదయం గం॥ 9.00ల నుండి 3.00 గం॥ల లోపున సీల్డ్ టెండర్లు వేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయ పనివేళల యందు సంప్రదించవచ్చును.

సం/- **ఎన్. సుజాత,** కార్యనిర్వహణాధికారి

చేపలరేవులో సౌకర్యాలపై ఆరా

మత్స్యకారులతో మాట్లాడుతున్న పెద్దిరాజు

పన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ చేపలరేవులో సౌకర్యాలు, మత్స్య సంపద లభ్యతపై ఏపీ మత్స్యకార సంక్షేమం, అభివృద్ధి శాఖ చైర్మన్ కొల్లు పెద్దిరాజు ఆరా తీశారు. గురువారం ఆయన చేపలరేవు(హార్బర్)ను సందర్శించి, మత్స్యకారులతో మాట్లాడారు. రాయితీ డీజిల్ వినియోగం, మత్స్య ఉత్పత్తుల మార్కెటింగ్ ఇతర అంశాలపై ఆరా తీశారు. హార్బర్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం జాలారి ఎండాడలో మత్స్యశాఖ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పెదజాలారిపేటలో 7హెచ్ అవుట్ బోర్డు మోటార్ తయారీ, కోల్డ్ స్టోరేజ్ ఐస్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు ఆశాజ్యోతి, లక్ష్మణరావు, కొండబాబు, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు రిఫరీగా ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా అంతర్ వర్సిటీ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు రిఫరీగా నగరానికి చెందిన తూర్పు కోస్తా రైల్వే ఉద్యోగి **దండు కిరణ్‌సాగర్** ఎంపికయ్యారు. పోటీలు డిసెంబరు 1 నుంచి 5 వరకు రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో జరగనున్నాయి. కిరణ్‌సాగర్‌ను నగరానికి చెందిన క్రీడా సంఘాల ప్రతినిధులు ఐ.వెంకటేశ్వరరావు, బి.అప్పన్నరెడ్డి అభినందించారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకునే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌లో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్స్, రొమాంటిక్ రిట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలిమంటలు కాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్ ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా **76598 76598**కు ఫోన్ చేయండి.

గస్తీ విన్యాసాల్లో ఐఎన్ఎస్ సహ్యాద్రి

సింధియా, న్యూస్‌టుడే: ఇండో-పసిఫిక్ రీజియన్‌లో జరిగిన గస్తీ విన్యాసాల్లో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సహ్యాద్రి పాల్గొందని గురువారం నేవీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే సహ్యాద్రి నౌక ద్వైపాక్షిక, బహుళపక్ష విన్యాసాల్లో పలు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని కలిగి ఉందన్నారు. ప్రస్తుతం మనీలాలో అక్కడి నౌకాదళ విన్యాసాల్లో చురుకైన పాత్రను పోషించనుందని చెబుతున్నారు.

విన్యాసాల్లో పాల్గొన్న ఐఎన్ఎస్ సహ్యాద్రి

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ... విశ్వాసానికి మరో పేరు!

అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్ డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం - 530003. మొబైల్ : 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

బ్రాంచ్ ఆఫీస్: పంజాబ్ నేషనల్ బ్యాంక్, అశీల్‌మెట్ట (105610) : ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: నెట్టిమి కోటేశ్వరరావు (A/ No. 0913300126229), మెస్సర్స్ అనిల్ రోడ్ క్యారియర్స్ (A/ No.0913250000408), నెట్టిమి కోటేశ్వరరావు (ప్రొప్రయిటర్), నెట్టిమి ధరణీ కుమార్ (హామీదారు), నెట్టిమి కోటేశ్వరరావు, తండ్రి : నెట్టిమి మురళీధర్ రావు, డోర్ నెం.38-34-16/3, శ్రీ హర్ష నగర్, మర్రిపాలెం, విశాఖపట్నం- 530018. నెట్టిమి కోటేశ్వరరావు, ప్రొప్రయిటర్ : అనిల్ రోడ్ క్యారియర్స్, ఎన్‌హెచ్-5, అక్కిరెడ్డిపాలెం, వార్డు నెం.65, సుజుకీ షోరూమ్ దగ్గర, విశాఖపట్నం-530012. నెట్టిమి ధరణీ కుమార్, హామీదారు: అనిల్ రోడ్ క్యారియర్స్, డోర్ నెం.21-147-1/5, ఉమా మహేశ్వర ఎన్‌క్లేవ్, వెంకటాద్రి నగర్, సింహాచలం-530028. డిమాండ్ నోటీసు తేది. 20-01-2025, బకాయి మొత్తం: తేది. 20-01-2025 నాటికి రూ.58,40,799.13 పై + తేది.21.01.2025 నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి. లాంఛనాత్మక స్వాధీనతా తేది : 28-03-2025

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 30-12-2025, మధ్యాహ్నం 3 గం॥ల లోపు

ఇ -వేలం తేది మరియు సమయం : 30-12-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు

విశాఖపట్నం - 530018, విశాఖపట్నం జాయింట్ ఎస్‌ఆర్‌ఓ, జివిఎమ్‌సి పరిధిలో, కర్నాల వీధి, అల్లిపురం వార్డు, టి.ఎస్.నెం.739 లోని మొత్తం 210.83 చ॥గ॥లు లేదా 176.28 చ॥మీ॥ల విస్తీర్ణంలో 20 చ॥గ॥లు లేదా 16.72 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంతో ఆర్‌కె రెసిడెన్సీ, క్రింది అంతస్తు నందు పాత అసెస్మెంట్ నెం.100001/30262, కొత్త అసెస్మెంట్ నెం.1086193649, డోర్ నెం.33-10-1తో, 560 చ॥అ॥ల ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాలు మరియు బాల్కానీలతో సహా)తో గల ఫ్లాట్ నెం.1. హద్దులు : తూర్పు: మెట్లు & కె. త్రినాధరావు గారికి చెందిన ఆస్తి, దక్షిణం : 5 అ॥ల దారి ఆ తరువాత డా॥ సన్యాసి గారికి చెందిన ఆస్తి, పడమర: కె. జగన్నాధరావు గారికి చెందిన ఆస్తి, ఉత్తరం : పార్కింగ్ ప్రదేశం & రోడ్డు.

రిజర్వు ధర : రూ.23.20 లక్షలు, బయానా (ఇఎమ్‌డి) : రూ.2.32 లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

సెక్యూర్డ్ క్రెడిటర్ వారికి తెలిసినంత వరకు ఉన్న ఎన్‌కంబరెన్స్ వివరములు : బ్యాంక్ రికార్డ్స్ ప్రకారం ఏవిధమైన ఎన్‌కంబరెన్స్ లేవు

నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.30.12.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయజేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 27-11-2025 ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

రూ. 1.12 కోట్ల చోరీ సొత్తు స్వాధీనం

'రికవరీ మేళా'లో బాధితులకు అప్పగింత

బాధితుడికి బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన పలు చోరీ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తును గురువారం సీపీ శంఖబ్రతబాగ్చీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'రికవరీ మేళా'లో సీపీ మాట్లాడారు. అక్టోబరు నెలలో మొత్తం 55 చోరీ కేసులు నమోదవగా, 77 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 888.331 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3,10,500 నగదు, 22 ద్విచక్ర వాహనాలు, 500 సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు కలిపి మొత్తం రూ.1,12,03,480 విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామన్నారు. నగరంలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో 309 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, భద్రతా చర్యలను బలోపేతం చేస్తున్నామన్నారు.

ఫిబ్రవరికి బయోమైనింగ్ కార్యాచరణ పూర్తి చేయాలి

బయో సీఎన్‌జీ కర్మాగారంలో పరిశీలిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా

కొమ్మాది, న్యూస్‌టుడే: కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో ఉన్న బయో సీఎన్‌జీ (బయోగ్యాస్), బయోమైనింగ్ కర్మాగారాలను కేంద్రగృహ, పట్టణ వ్యవహారాల శాఖ, స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా, కమిషనర్ కేతన్‌గర్గ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. బయోగ్యాస్ ప్లాంట్ ఎప్పుడు మొదలైంది? రోజులో ఎన్ని టన్నుల ఉత్పత్తి జరుగుతుంది? గ్యాస్ రేటు ఏ విధంగా ఉంది? వ్యర్థాలను సేకరించే విధానం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను వైజాగ్ బయో ఎనర్జీ ఫ్యూయల్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో కేఎస్‌రాజు తెలియజేశారు. 2026 ఫిబ్రవరి నెలాఖరుకు బయోమైనింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎల్.రాజారవికుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ పి.ఎస్.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

పిల్లలను దత్తత తీసుకున్న వారితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యదర్శులు అనిల్‌మాలిక్, సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిల్లల హక్కులను పరిరక్షించడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్‌మాలిక్ అన్నారు. ఆ శాఖకు చెందిన సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏయూ వైవీఎస్‌మూర్తి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన 'జాతీయ దత్తత అవగాహన -2025' ముగింపు సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలు లేని వారు కలత చెందకూడదనే ఉద్దేశంతో ఒక చట్టబద్ధమైన వ్యవస్థ ద్వారా ఎంతో మందికి ఊరట కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఏటా నవంబరులో జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాలు చేపడుతున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు (దివ్యాంగులు) గల పిల్లలకు ప్రేమతో కూడిన శాశ్వత కుటుంబం సంరక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు, ఏజెన్సీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ సీఈవో భావనా సక్సేనా కూడా మాట్లాడారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి, వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, గతంలో చట్టబద్ధంగా పిల్లలను దత్తత పొందిన వేర్వేరు రాష్ట్రాలకు చెందిన తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల్ని దత్తత తీసుకున్న వారు తమ తమ అనుభవాలను వెల్లడించారు. భవిష్యత్తులో పిల్లలను దత్తత తీసుకోవాలని భావిస్తున్న వారికి ఇదొక ప్రేరణగా నిలిచింది.

బీఎల్వోలకు అవగాహన తప్పనిసరి

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వెలగటౌన్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టే వివిధ కార్యక్రమాలపై బీఎల్వోలకు సమగ్ర అవగాహన కల్పించాలని, ఆ మేరకు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని, జిల్లాకు సంబంధించిన విషయాలు వివరించారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలు, రేషనలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియతో పాటు, ఇతర అంశాలపై నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఒకటి నుంచి పులులు, జంతుగణన

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పులులు, ఇతర జంతువుల గణనకు అటవీ సిబ్బంది సమాయత్తమవుతున్నారు. ప్రతి నాలుగేళ్లకు ఈ గణన నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబరు ఒకటి నుంచి ఎనిమిది వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గతంలో జంతుగణన పుస్తకంలో నమోదు చేసేవారు. ఈ ఏడాది నుంచి ఆధునిక సాంకేతిక విధానం ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. దీనికోసం నర్సీపట్నంలో అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా చింతపల్లి డివిజన్‌ల సిబ్బందికి లంబసింగిలో శిక్షణ ఇచ్చారు.

అశ్రునయనాలతో సీఎం రమేష్ తల్లికి అంత్యక్రియలు

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ (83) అంత్యక్రియలను వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో గురువారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. అంత్యక్రియలకు మంత్రి కొల్లురవీంద్ర, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పుల్లారావు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు(చిత్రంలో). సీఎం రమేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. - న్యూస్‌టుడే, ఎర్రగుంట్ల

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్‌డ్	184	206
స్కిన్‌లెస్	210	216

EENADU eClassifieds

AUTO

VEHICLES FOR SALE

Honda Amaze 2013 Model, Maruti Swift Dzire-2018 Model, Hyundai Grand I10 -2018 Model. Cars Available for sale. Contact Phone: 8886635055.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUILDING CONSTRUCTION

LRS BPS LRS Contact for BPS/LRS Plan Approvals PILLA BRAHMAJI RAO Rtd. Building Inspector GVMC PRESENT LICENSED SURVEYOR ✆92904 41348

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121 Sq.Yds. Cellar + G+1 Building for sale. East Facing Excellent Vastu. Prime Location. 22K Rents Guaranteed. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురంకి అతిచేరువలో 100చ॥గ॥ స్థలం కేవలం 5,50,000/- మాత్రమే. 30అ॥రోడ్డు, NH-16కు దగ్గర్లో. స్పాట్ రిజి. Contact Ph: 7780686073, 9676241297.

TAGARAPUVALASA

Thagarapuvalasa Y Jn & Near Raghu college, NH facing plots @ Dakammarri VUDA approved, Ready to construct. ✆ 9992273747.

GENERAL

ఉడా అప్రూవ్డ్ లేఅవుట్ నందు ఇంటిస్థలం అమ్మకానికి కలదు 200 చ॥గ॥ 13.99 లక్షలు మాత్రమే, స్పాట్ రిజిస్ట్రేషన్ మరియు బ్యాంకు లోను. Cont: 9390893787.

JOBS

Required a Manager in Vehicle Finance Company 5-7 Yrs. Exp. in Vehicle Finance Company (2&3 Wheeler Recovery) Contact: 9182018251.

Wanted Accountant for Construction Company with Knowledge in Tally, Excel, Word. 2+ yrs. Exp. Now! Ph: 9963453919.

Marketing Executives 30K, Telecallers 15K, Digital (GMP, Web, Social Media seo) 20K. Contact: 9381756318, 9948011609.

Wanted Receptionist (F) Age 30 Above, Any Degree, English & Hindi Must; Collection Executives (M) @ Akkayyapalem. 9348738659.

WANTED A Well Established Org. Starts New Projects in 2 States. Urgently Required in AP State, VSP Branches. ❖**DIVISIONAL MANAGERS: M/F** Qlf: Retd. Gazetted Officers. Monthly Package: 1,60,000 (Salary + Allowances Negotiable) INTERVIEWS ON : 28th & 29th - Nov-25 INTERVIEW TIMINGS 10.00 AM to 7PM Con: Y.K.Rao DOCTORS COLONY, VSP Ph: 8121100599

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు స్త్రీ/పురు॥ కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు/ హౌస్‌వైఫ్స్‌కి ప్రాధాన్యత. ఫిక్స్‌డ్ శాలరీ+ కమీషన్ Contact Ph: 8885866999.

మహీంద్రా ట్రాక్టర్ వారి అనకాపల్లి, తగరపువలస బ్రాంచ్‌లలో పనిచేయుటకు మెకానిక్స్, హెల్పర్ (ఐటిఐ, టెన్త్ క్వాలిఫికేషన్ మరియు ఎక్స్‌పీరియన్స్), సూపర్‌వైజర్, స్పేర్ పార్ట్స్ సేల్స్ మెన్ (డిగ్రీ/ DAE/ DMEతో పాటు ఆటోమొబైల్ రంగంలో అనుభవం గలవారు) కావలెను. సంప్రదించండి: శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్, అనకాపల్లి, Contact సెల్: 80085 77055, 80085 77078.

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి ప్రస్తుతం ఉన్న రోడ్డు ద్వారా 19KM (ఫ్యూచర్‌లో స్ట్రెయిట్ రోడ్డు వల్ల 11KM లోపు) విజయనగరం రైల్వేస్టేషన్‌కి 5KM బస్టాండ్‌కి, ఐనాక్స్‌కి, షాపింగ్ సెంటర్స్‌కి 4 లేదా 4.5 Kms దూరంలో విజయనగరం- రాయపూర్ హైవేకి, వైజాగ్- విజయనగరం హైవేకి 800 మీ. దూరంలో కార్నర్‌లో VMRDA & RERA అప్రూవల్ ప్లాట్స్ కమీషన్ బేసిస్‌లో సేల్స్ కొరకు మార్కెటింగ్ ఉద్యోగం చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు నుండి ధరఖాస్తులు కోరుతున్నాం. Contact Phone Number: 6302273234.

వాంటెడ్ మార్కెటింగ్ మేనేజర్స్ M/F-3 ఉమెన్ యాడ్ ఎగ్జిక్యూటివ్స్-5 డిటిపి /Tally ఆపరేటర్-2 జీతం 15000 to 28000+TA, DA ✆ 8465870102.

వైజాగ్ రెస్టారెంట్‌లో పనిచేయడానికి యువకులు కావలెను (వెయిటర్లు) భోజనం & వసతి కల్పించబడును అనుభవం అవసరం లేదు ✆ 9676575827.

మా వైజాగ్ బ్రాంచ్‌కు సూపర్‌వైజర్లు, వర్కర్లు కావలెను. ఇండియన్ పెస్ట్ కంట్రోల్, మద్దిలపాలెం, భారత్ పెట్రోల్ పంప్ ఎదుట, వైజాగ్. ✆ 83670 33999.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, all (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal: 18-25K, Age 35లోపు, స్పాట్ జాయిన్ ✆ 7995439539.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ను, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ.18K ✆96402 58899, 96404 68899

మెస్‌లో వంటచేయుటకు లేడీస్ /జెంట్స్ కావలెను. * Cleaning చేయుటకు స్త్రీ /పు॥ కావలెను. Ct: గుంటూరు మెస్, శంకరమఠం రోడ్. Ph: 8179439944.

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైఫ్స్. Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9676595920.

స్కూల్ టీచర్స్ & హెల్పింగ్ టీచర్స్ 20 నుండి 45 వయసున్న స్త్రీలు అర్జెంటుగా సంప్ర॥ జీతం 15 వేలు - 25 వేలు గాజువాక/కూర్మన్నపాలెం ✆ 8096767935.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction

కార్యాలయ చిరునామా:- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డోర్ నెం.14-1-1/2బి, 2వ అంతస్తు, మోర్ ఎదురుగా, మహరాణిపేట, విశాఖపట్నం-530002. మరియు ద్వారకానగర్ వద్ద శాఖ కార్యాలయం.

స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

తేది **12.09.2025** నాటి ఉద్దేశిత అమ్మకం ప్రకటన 30 రోజుల గడువు ముగిసినందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9 (1) తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన ఇప్పుడు జారీచేయడమైనది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) తో చదువబడు సదరు చట్టం 54/2002 లోని సెక్షన్ 13 (8) ప్రకారం మీ విముక్తి హక్కును వినియోగించుకోవడంలో మీరందరూ విఫలమైనందున, ఇ-వేలం విక్రయానికి ఈ నోటీసు జారీ చేయబడింది. ఇది ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు తెలియజేయడమైనది.

1. పఠాన్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, తండ్రి: జేన్ షాహిద్ ఖాన్, డోర్ నెం. 57-24-24, ఐటిఐ జంక్షన్ దగ్గర, తుమ్మదపాలెం, కంచరపాలెం, విశాఖపట్నం-530008. (ఋణగ్రహీత)
2. Md. ఉబైద్ అలీషా, తండ్రి: Md. అఖిల్ అలీషా, డోర్ నెం. 37-7-78/2, 1వ అంతస్తు, గణపతినగర్, కంచరపాలెం, విశాఖపట్నం-530008. (హామీదారు).
3. అదవి నాగమణి, భర్త: పఠాన్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, డోర్ నెం. 57-24-24, ఐటిఐ జంక్షన్ దగ్గర, తుమ్మదపాలెం, కంచరపాలెం, విశాఖపట్నం-530008. (హామీదారు). ఈ విషయం మీకు తెలియజేయడమైనది.

1. మేము M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి చెన్నై, తేది 9-11-2022, C.P. No: 69-76 ఆఫ్ 2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు తర్వాత 30-11-2022 తేదీనాటి పేరు మార్పునను సరించి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ యొక్క రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ద్వారా ధృవీకరించబడిన ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడినది. కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ చేయబడింది, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి ఆర్‌బిఐ లో నమోదు చేయబడింది. అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డోర్ నెం. 14-1-1/2B, 2వ అంతస్తు, మోర్ ఎదురుగా, మహరాణిపేట, విశాఖపట్నం-530002 మరియు శాఖ కార్యాలయం ద్వారకానగర్ (ఇకపై కంపెనీ/రుణదాతగా సూచిస్తారు) వద్ద కలిగి ఉన్న మేము దిగువ తెలిపిన విధంగా నోటీసు మీకు జారీచేస్తున్నాము.

2. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌చే మంజూరు చేయబడిన రుణ ఖాతా నెం. VZGCTTF1812240001 లోని బకాయి రూ. 56,30,625/- (అక్షరాల యాభై ఆరు లక్షల ముప్పై వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే), వర్తించు తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించమని మిమ్ములను కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "SARFAESI చట్టం"గా సూచిస్తారు) లోని సెక్షన్ 13(2) క్రింద 21.10.2022 తేది గల డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. డిమాండ్ చేసిన మొత్తాన్ని చెల్లించడంలో మీరు నిర్లక్ష్యం చేసినారు మరియు విఫలమయ్యారు.

3. దాని పర్యవసానంగా, సెక్యూర్డ్ క్రెడిటార్ SARFAESI చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సెక్షన్ 13(4) క్రింద తేది 03.02.2023 గల నోటీసును జారీచేసినారు, తదనుగుణంగా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తులను 21.12.2024న అడ్వకేట్ కమీషనర్‌తో భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. దిగువ వివరించిన హామీ గల స్థిరాస్తులను బహిరంగ వేలం మరియు/లేదా చట్టం మరియు రూల్స్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం సూచించిన ఇతర పద్ధతుల ద్వారా విక్రయించాలని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతిపాదిస్తుంది. తేది 21.10.2022 నాటి డిమాండ్ నోటీసులో సూచించిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రావల్సిన బకాయి రూ. 56,30,625/- (అక్షరాల యాభై ఆరు లక్షల ముప్పై వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) మరియు వర్తించు తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, న్యాయపరమైన మరియు ఇతర యాదృచ్ఛిక ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు చట్టం మరియు రూల్స్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం ఈ నోటీసు పత్రికా ప్రచురణ తేది నుండి 30 రోజుల వ్యవధితో "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే & అక్కడ ఏముందో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ బహిరంగ ఇ-వేలం ద్వారా దిగువ ఆస్తిని విక్రయించబడును.

ఆస్తి వివరములు	ధరావత్తు (EMD) జమచేయు వివరాలు	వేలం తేది & సమయం	సంప్రదించాల్సిన వ్యక్తి మరియు ఆస్తి తనిఖీ తేది.
మధురవాడ సబ్-రిజిస్ట్రార్, డాక్యుమెంట్ నెం. 6928/2018 ప్రకారం పఠాన్ అబ్దుల్ ఖాదర్ జిలానీ గారికి చెందిన, తనఖా పెట్టిన ఆస్తి: విశాఖపట్నం జిల్లా, మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధి లోని, మధురవాడ సబ్-జిల్లా, మధురవాడ గ్రామ అకౌంట్స్, యస్.నెం. 203/16 భాగం, 202/2 భాగం (టౌన్ సర్వేయర్, జీవియంసి విశాఖపట్నం జారీ చేసిన ఎండార్స్‌మెంట్ సి.ఎ. నెం. 2151/18/సిసిపి తేదీ 15.11.2018 ప్రకారం) రేవెళ్లపాలెం, సమీప డోర్ నెం. 7-40, ప్లాట్ నెం. 51 లోని 230 చ॥గ॥ లేదా 192.309 చ॥మీ॥కి హద్దులు మరియు కొలతలు: తూర్పు: ప్లాట్ నెం. 52 స్థలం - 35.0 అ॥లు లేదా 10.66 మీ॥, దక్షిణం: ప్లాట్ నెం. 50 స్థలం - 60.0 అ॥లు లేదా 18.29 మీ॥, పడమర: 20 అ॥ల వెడల్పు రోడ్డు - 33.0 అ॥లు లేదా 10.05 మీ॥, ఉత్తరం: ఇతరుల భూమి - 60.0 అ॥లు లేదా 18.29 మీ॥. పైన పేర్కొన్న 230 చ॥గ॥ లేదా 192.309 చ॥మీ॥ విస్తీర్ణంలోని ఓపెన్ సైట్. ఈ ఆస్తి విశాఖపట్నం యస్.ఆర్.ఒ. డాక్యుమెంట్ 8839/2018 కు అనుగుణంగా ఉంటుంది.	ధరావత్తు (EMD) సొమ్మును RTGS/ NEFT ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి జమ చేయాల్సిన అకౌంట్ వివరములు బ్యాంకు పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, శాఖ: బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ముంబాయి-400710 ఖాతా నెం. 230010200005265, IFSC కోడ్: UTIB0000230	29 డిసెంబర్ 2025, సమయం: ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 01.00 గం.ల వరకు	Md. పరవరిష్, మొబైల్ నెం: 9000404168 వై. శాతాజీ, మొబైల్ నెం: 77806 27930 కస్టమర్ కేర్ నెం: 022-40081572 ఆస్తి తనిఖీ తేది: 24.12.2025, సమయం: ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 05-00 గం. ల వరకు.

రిజర్వు ధర మొత్తం: రూ. 66,86,100/- ; ధరావత్తు మొత్తం: రూ. 6,68,610/- ; బిడ్ పెంపుదల మొత్తం: రూ. 25,000/- గుణిజాల్లో

బిడ్ సమర్పించుటకు ఆఖరు తేది: 26 డిసెంబర్ 2025, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల లోపు

ఇ-వేలం తేది అనగా 29.12.2025 లోగా పైన తెలిపిన మొత్తముతో పాటు చెల్లింపు తేదీనాటికి ఆగు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవల్సిందిగా లేనియెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని మరియు బకాయి శేషం ఏదేని ఉన్నచో అది వడ్డీ మరియు వ్యయంతో రాబట్టుకోబడునని ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవడానికి, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్‌ను సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ, మొదలైనవాటిలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ వారిని సంప్రదించవచ్చును. పేరు: శ్రీ గౌరవ్ నంబూదిరి, ఫోన్ నెం. 9833922941 ఇ-మెయిల్ : gaurav.n@samil.in మరియు ఆస్తికి సంబంధించిన వివరాలు కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి ఎమ్‌డి. పరవరీష్ గారిని ఫోన్: 9000404168 నందు ఆఫీసు పనిదినములలో పనివేళల నందు సంప్రదించవచ్చును.

ఎట్టి కారణములు చూపకుండానే ఏదేని లేదా అన్ని బిడ్లను తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ యొక్క వెబ్ సైట్ (https://eauctions.Samil.in/home) పై నిర్వహించబడును. టెండరు దాఖలు/ బిడ్ ఫారం పొందుటకు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు.

అమ్మకం యొక్క పూర్తి నియమనిబంధనల వివరాలకై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్లో ఇవ్వబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు.

తేది: 27-11-2025, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **ఆంధ్ర కింగ్ తాలూకా**

స్క్రీన్-2 - **రాజు వెడ్స్ రాంబాయి**

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: వాడచీపురుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల తిక్కవానిపాలెం, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, ఊటగెడ్డపాలెం, దళాయిపాలెం, దోసూరు గ్రామాలకు ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

భాగవత సప్తాహం గురించి వివరిస్తున్న చీమలపాటి వెంకటరమణమూర్తి

భాగవత సప్తాహం ప్రారంభం

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే : నాయుడుతోట సమీప రవినగర్‌లోగల శ్రీ బాలత్రిపురేశ్వరి పీఠం నిర్వాహకులు దివాకరుణి శ్రీరామచంద్రశేఖర్ శర్మ సన్నిధానంలో గురువారం భాగవత సప్తాహం ప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. బ్రహ్మశ్రీ చీమలపాటి వెంకటరమణమూర్తి భక్తులకు భాగవత సప్తాహం ప్రాధాన్యతను వివరించారు. వారం రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం గొట్టివాడ జగనన్న కాలనీలో మురుగు కాలువలు లేవు. శ్మశాన వాటికకు దారి లేక ఇబ్బందులు పడుతున్నాం. **-రమేష్, గొట్టివాడ.** ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలు పరిష్కరిస్తాం. **-సాలాపు మీన, సర్పంచి, గొట్టివాడ**

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 93వ వార్డు ఇంజినీర్స్ కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. **-రాజారావు, ఇంజినీర్స్‌కాలనీ** ✓: ఇంజినీర్స్ కాలనీలో వెలగని వీధి దీపాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **-హరిబాబు, ఏఈ, జీవీఎంసీ జోన్-8**

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి దుర్గా ఆదర్శనగర్ ఎస్/25/5 స్తంభానికి ఉన్న వీధి దీపం గత పదిహేను రోజులుగా వెలగడం లేదు. రాత్రి వేళ చీకట్లో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. **-మహేశ్, దుర్గా, ఆదర్శనగర్** ✓: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలోనే మరమ్మతు చేయిస్తాం. **- సోమేశ్, వీధి దీపాల నిర్వహణ ఏఈ, 96వ వార్డు.**

గురుకుల బాలికలు.. యోగాలో మెరికలు..

పరవాడ, న్యూస్‌టుడే

మండలంలోని తానాం జ్యోతిబాపులే గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు యోగాలో రాణిస్తున్నారు. వీరు ప్రిన్సిపల్ రమామోహిని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రమం తప్పకుండా యోగాలో పట్టు సాధించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించి డిసెంబరు మూడో వారంలో పలు రాష్ట్రాల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతల మనోగతం వారి మాటల్లోనే..

★ యోగా వల్ల ఏకాగ్రత, చురుకుదనం పెరిగింది. తల్లిదండ్రులు సతీష్, అన్నపూర్ణ వ్యవసాయ కూలీలు. స్వగ్రామం దేవరాపల్లి మండలం వద్దపాలెం. 250కి పైగా ఆసనాలు వేస్తా. అండర్-17 రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో పసిడి పతకం సాధించి మహారాష్ట్రలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. రాష్ట్ర స్థాయిలో 12స్వర్ణం, 10 రజత, 6 కాంస్య పతకాలు సాధించా. **- వి.వైష్ణవి, 9వ తరగతి**

అక్కలిద్దరూ యోగాలో రాణించడంతో ఆసక్తి పెంచుకున్నా. తండ్రి కనకారావు వ్యవసాయకూలీ. తల్లి వరలక్ష్మి గృహిణి. స్వగ్రామం తానాం. ఇటీవల అండర్-19 ట్రెడిషనల్, రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో 2 పసిడి పతకాలు సాధించి పశ్చిమబెంగాల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందా. రాష్ట్రస్థాయిలో 3 పసిడి పతకాలు, జిల్లాస్థాయిలో ఒక స్వర్ణం, రెండు రజత, కాంస్య పతకాలు సాధించా. **-హారిక, ఇంటర్ ద్వితీయ సంవత్సరం**

★ తండ్రి మహేశ్వరరావు సెక్యూరిటీ గార్డు. తల్లి వరలక్ష్మి టైలర్. స్వగ్రామం అనకాపల్లి. ఇటీవల అండర్-19లోని ఆర్టిస్టిక్ పెయిర్ యోగా పోటీల్లో పసిడి పతకం సాధించి పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించా. 80 ఆసనాలు వేస్తా. యోగా టీచర్ కావడమే లక్ష్యం. **-పి.రామసాహితి, పదోతరగతి**

★ నాలుగేళ్లుగా సాధన చేస్తున్నా. స్వగ్రామం వేపగుంట. అండర్-17 రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో పసిడి పతకం సాధించి మహారాష్ట్రలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించా. ఇప్పటి వరకు 8 స్వర్ణ, 10 కాంస్య, 10 రజత పతకాలు సాధించా. 2026లో జపాన్‌లో జరిగే ఏషియన్ పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యం. **-కౌశిక, 9వ తరగతి**

మూడేళ్లుగా సాధన చేస్తున్నా. స్వగ్రామం సబ్బవరం సమీప మొగలిపురం. తండ్రి అప్పలనాయుడు లారీడ్రైవర్. తల్లి పూర్ణిమ గృహిణి. ఇటీవల జరిగిన అండర్-14 ఆర్టిస్టిక్ సోలో, రిథమిక్ పెయిర్ యోగా పోటీల్లో 2 పసిడి పతకాలు సాధించి త్వరలో ఢిల్లీలో జరిగే యోగా పోటీలకు ఎంపికయ్యా. రాష్ట్ర స్థాయిలో ఒక స్వర్ణం, జిల్లా స్థాయిలో రెండు పసిడి పతకాలు సాధించా. **-యోష్నలక్ష్మి, 8వ తరగతి**

అనర్గళ ఉపన్యాసం.. దక్కిన బహుమానం..

ఉపన్యాసమిస్తున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులందించిన కళాశాల యాజమాన్యం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఉపన్యాస కళతో నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయని చినముషిడివాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల డీన్ ఎం.శ్రీనివాసు అన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విద్యార్థులు జి.సాయిజేస్విత (ప్రథమ), ఎస్కే అబ్దుల్ ఖాదర్(ద్వితీయ), ఏబీసీ సిద్ధార్థ(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు డీన్ శ్రీనివాసు, ప్రిన్సిపల్ పి.రాజుబాబు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

రహదారి భద్రతపై అవగాహన

పరవాడ, న్యూస్‌టుడే: జేఎన్ ఫార్మాసిటీలోని అడ్వాన్ ఫార్మా కంపెనీలో గురువారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

ఆక్రమణల పరిశీలన

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: చీమలాపల్లి ప్రాథమిక పాఠశాల ఆక్రమణలను విద్యాశాఖ అధికారులు చంద్రశేఖరరావు, ఈఈ డి.వి.నరసింహారావు గురువారం పరిశీలించారు. ఈనెల 11న 'ప్రహరీ నిర్మించక... ఆక్రమణలు ఆగక' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ సర్వశిక్షా అధికారులు స్పందించారు. ఆక్రమణలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పెద్దలు అయిత ఎర్రయ్య, రాములు పాఠశాల పరిస్థితులను అధికారులకు వివరించారు. ఇక్కడ గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు నివేదించి ఆక్రమణలను అడ్డుకునేందుకు కృషిచేస్తామన్నారు.

దుర్గంధం బెడద

సబ్బవరం, న్యూస్‌టుడే: 88వ వార్డు వెదుళ్ల నరవ శివారు కొత్తూరులో కొద్ది రోజులుగా మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం వెంటాడుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

దర్పణం

గోతులు తవ్వారు.. పనులు మరిచారు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని పెందుర్తి - ఆనందపురం రహదారిలో భూగర్భ విద్యుత్తు తీగల పనుల కోసం తవ్విన గోతులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో ఇటీవల విద్యుత్తు తీగల ఏర్పాటు కోసం రహదారి పక్కన గోతులు తవ్వి పనులు పూర్తయ్యాక వాటిని తిరిగి పూడ్చే పనులు పది రోజులుగా జరగడం లేదని స్థానికులు తెలిపారు. రహదారిని ఆనుకుని ఉన్న గోతులను దాటుకుని ఇళ్లు, దుకాణాలకు రాకపోకలు సాగించాల్సి వస్తోందంటున్నారు. ఒకవేళ అదుపు తప్పి పడిపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు.

పెందుర్తి రాజుచెరువు ప్రాంతంలో ఇలా..

విద్యార్థులకు అభినందన

విద్యార్థులతో హెచ్‌ఎం ప్రమీల, ఉపాధ్యాయ సిబ్బంది

ఇస్లాంపేట (పరవాడ), న్యూస్‌టుడే: జడ్పీ హైస్కూల్లో పరవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని ఉపాధ్యాయ సిబ్బంది తెలిపారు. దక్షిణభారత్ హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేటలో ఇటీవల ప్రచారక్ సోఫియా, తబస్సుమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పరీక్షకు పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు హాజరై ఉత్తీర్ణత సాధించారు. వీరిని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ప్రమీల అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది రాజేష్, సాజిదాబేగం, మహమ్మద్ హక్, ఆనందరావు, రావు, రిజ్వాన్ పాల్గొన్నారు.

హైమాస్ట్ దీపం ఉన్నా..లేనట్లే..



సబ్బవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో ఉన్న హైమాస్ట్ విద్యుత్తు దీపం గాలికి తిరిగిపోయి ఆకాశం వైపు వెలుగులు పంచుతోంది. సంబంధిత అధికారులు వెంటనే దీన్ని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

మహాలక్ష్మీ దేవికి మార్గశిర మాస పూజలు

సబ్బవరం, న్యూస్‌టుడే: దేవీపురం రాజరాజేశ్వరీదేవి పీఠంలో మార్గశిర మాస పూజలు ఘనంగా జరిపారు. గురువారం మహాలక్ష్మీ దేవికి అష్టమాతృకాభిషేకం లక్ష్మీ అష్టోత్తర శత నామావళితో కుంకుమార్చన, మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. నిర్వాహకులు కె.ప్రభాకర్ మాట్లాడుతూ మార్గశిర మాసంలో డిసెంబరు 4న విద్యారణ్యస్వామి సంపుటిత సూక్త హోమం, డిసెబరు 11న స్వర్ణ మహాలక్ష్మి త్రిశతి నామావళి హోమం, డిసెంబరు 18న మహాలక్ష్మీ సహస్రనామావళి హోమం జరుగుతాయన్నారు.

మహాలక్ష్మీ దేవికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని సేవించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మహాలక్ష్మి అమ్మవారు

దేవాడ(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి టి.దేవాడ గ్రామంలో గురువారం శ్రీకొత్త మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ గ్రామపెద్దలు, నాయకులు, కమిటీ ప్రతినిధులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సంప్రదాయ ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

మాట్లాడుతున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆ మేరకు గురువారం చినముషిడివాడలోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి వార్డు, గ్రామ సచివాలయం పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేయాలన్నారు. మారుమూల ప్రాంతాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. శక్తి యాప్‌పై విస్తృతంగా ప్రచారం చేసి మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న బాలలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో గురువారం గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. బాలబాలికలు వారి తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలకు పాదపూజ చేశారు. అనంతరం బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సున్నం వేసేందుకు వచ్చి చోరీ



వివరాలు వెల్లడిస్తున్న నేర విభాగం ఎస్ఐ డి.సూరిబాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: సున్నాలు వేయడానికి వచ్చి చోరీ చేసిన నిందితులను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి గురువారం పెందుర్తి నేర విభాగం ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత గోశాల దరి సింహపురి లేఅవుట్‌కు చెందిన ఎం.నూకరాజు గత నెల 9న భార్యతో కలిసి ఊరు వెళ్లి వచ్చారు. ఇంట్లో భద్రపరిచిన ఆభరణాలు చూడగా కనిపించలేదు. దీంతో పెందుర్తి నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో నూకరాజు ఇంట్లో సున్నాలు వేయడానికి వచ్చిన పొట్నూరు వినోద్‌కుమార్ (32) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి సుమారు రూ.5లక్షలు విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతులు గురువారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సీనియర్ సహాయకుడు వి.సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ

నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి

సంకల్ప్-2026 విద్యా సామగ్రి అందిస్తున్న ప్రిన్సిపల్ శిరీషారాణి

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇంటరులో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శిరీషరాణి అన్నారు. పబ్లిక్ పరీక్షలకు ఇంకా 3 నెలలు మాత్రమే ఉన్నందున తీసుకుంటున్న చర్యలపై ఆమె గురువారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఫిబ్రవరి 23 నుంచి ఈ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. తమ కళాశాలలో 590 మంది విద్యార్థులు ఉన్నారని వారిని ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 'సంకల్ప్-2026' మెటీరియల్‌ను అధ్యాపకులు ఉదయ్‌కుమార్ తదితరులతో కలిసి ఆమె విద్యార్థులకు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే : పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఎస్.హర్షవర్ధన్, సోమేశ్వరరావు పాల్గొని కాలనీవాసులకు క్యాన్సర్ స్క్రీనింగ్, ఈసీజీ, మధుమేహం, బీపీ, తదితర ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 160 మంది కాలనీవాసులు పాల్గొన్నట్లు కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత భవిత

విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులంతా బాల్యం నుంచే ప్రణాళికతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలోని కెరియర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకుని చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. పదోతరగతి కీలకమని పరీక్షలు బాగా రాసి శతశాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్సై విజయకుమారి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పరవాడ, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని పరవాడ ట్రైనీ ఎస్సై విజయకుమారి అన్నారు. పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. డీఐఈవో వినోద్ బాబు, పలువురు అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: గంజాయి కేసుకు సంబంధించి పరారీలో ఉన్న నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ కేసుకి సంబంధించిన నిందితుడు పాంగి గోవింద్ (30) అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగుపుట్టు మండలానికి చెందినవాడు. గత ఏడాది జులై నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పెందుర్తి కూడలిలో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వేదికగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయి. బాలబాలికల జట్లకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈవో అప్పారావునాయుడు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో క్రీడా మైదానాన్ని తీర్చిదిద్ది, క్రీడాకారులకు తగిన వసతులు ఏర్పాట్లు చేసినట్లు హెచ్ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 పాత జిల్లాల నుంచి 13 బాలుర, 13 బాలికల ఖోఖో జట్లు హాజరు కానున్నాయన్నారు. వీటి నిర్వహణకు వివిధ కమిటీలు ఏర్పాటు చేసి 80 మందిని సభ్యులుగా నియమించినట్లు చెప్పారు.

సిద్ధం చేసిన ఖోఖో కోర్టులు

కన్నీటి వీడ్కోలు

జననం: 25-04-1947

మరణం: 27-11-2025

కీ॥శే॥ **శరకం అరుణ** గారు

W/o (లేటు) శరకం సూర్యనారాయణ మూర్తి గారు

Sr. Manager (Communications), Airport Authority of India

మా మాతృమూర్తి కీ॥శే॥ శరకం అరుణ గారు తేది. 27-11-2025 గురువారం నాడు మానుండి భౌతికంగా దూరమైనారని తెలియజేయుటకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

కుమారుడు - కోడలు : శరకం వెంకటేష్ - స్వర్ణ

కుమార్తెలు - అల్లుళ్ళు : పెంటకోట లీలా - భాస్కరరావు (లేటు)

యల్లపు జగదీశ్వరి - సూర్యనారాయణమూర్తి

ఆళ్ళ వరలక్ష్మి - శ్రీనివాస్

మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు మునిమనుమరాళ్ళు

అంతిమయాత్ర: తేది. 28-11-2025 శుక్రవారం

ఉదయం 9 గం॥లకు పెందుర్తి, పులగానిపాలెం రోడ్డు, శివాలయం జంక్షన్‌లో గల మా స్వగృహము నుండి బయలుదేరును. సెల్: 90323 82206

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- మఫ్టీ పోలీస్
రాములమ్మ- 12 ఏ రైల్వే కాలనీ
తాతా- రాజు వెడ్స్ రాంబాయి
సప్తగిరి- ఆంధ్రా కింగ్ తాలూక

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 33/11కేవీ తొలిపావంచా ఉప కేంద్రం పరిధిలోని 11కేవీ ధారపాలెం ఫీడర్‌పై నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాత అడివివరం కూడలి, కుమ్మరిదిబ్బ, ధారపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: మిథిలాపురి వుడా కాలనీ (మధురవాడ) శివాలయం దారిలో ఎక్కడికక్కడ రోడ్లపై వ్యర్థాలతో ఇబ్బంది పడుతున్నాం. - కాలనీవాసులు
✓: పరిశీలించి శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.- రవి, వార్డు ఇన్‌స్పెక్టర్

?: పీఎంపాలెంలో విజేత సూపర్‌మార్కెట్ కూడలిలో స్పీడ్‌బ్రేకర్స్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. - పట్నాయక్, పీఎంపాలెం
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

?: చాణిక్యపురి లేఅవుట్ (పీఎంపాలెం) స్టేట్ బ్యాంక్ పరిసరాల్లో కేబుల్ కోసం గోతులు తవ్వి వదిలేస్తున్నారు. - అసోసియేషన్ సభ్యులు ✓: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - హేమ, విద్యుత్ ఏఈ

?: గాయత్రీనగర్(పీఎంపాలెం)లో వీధి దీపాలు వెలగడం లేదు. - గాయత్రీనగర్ వాసులు ✓: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. - గాయత్రీ, విద్యుత్ ఏఈ

?: పీఎంపాలెం ఆఖరి బస్‌స్టాప్ నుంచి బాబా కళాశాల వరకు రోడ్డు గుంతలతో దర్శనమిస్తోంది. - పీఎంపాలెం వాసులు
✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, ఏఈ

?: గంభీరం (ఆనందపురం) ఐఐఎం దారిలో ఎక్కడికక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు. -రాంబాబు ✓: రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. - ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు

స్పందనకు వందనం

పూడిక తొలగించారు

ఎండాడ, న్యూస్‌టుడే: మిథిలాపురి వుడా కాలనీ (మధురవాడ)లో బ్యాంక్ ఆఫ్ బరోడా రోడ్డులోని కాలువల్లో పూడిక తొలగించక దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి కాలువల శుభ్రతకు చర్యలు తీసుకున్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

ఈనెల 30 వరకూ దరఖాస్తులకు అవకాశం

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: పేదలకు పక్కా ఇళ్ల మంజూరుకు గృహ నిర్మాణశాఖ వివరాలు సేకరిస్తోంది. ఆయా గ్రామాల్లోని సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి వివరాలను నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉంటే గృహనిర్మాణ పథకం కింద ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయాన్ని అందించనున్నారు. స్థలం లేని అర్హులకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలాన్ని ఇచ్చి పక్కా ఇంటిని నిర్మించనున్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకి సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

■ పక్కా ఇళ్ల కోసం ఈనెల అయిదో తేదీ నుంచి జరుగుతున్న ఇంటింటి సర్వే 30వ తేదీకి ముగియనుంది. దీనిపై ప్రజలకు సరైన అవగాహన లేక గందరగోళానికి గురికావడంతో చాలాచోట్ల ఇళ్ల నిర్మాణానికి, స్థలాలకు అతి తక్కువ మంది సర్వే చేయించుకున్నారు.

■ గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలాలు ఉండి ఇంటిని నిర్మించుకునే వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ. 2.89 లక్షల ఆర్థికసాయాన్ని అందించనున్నారు. కేంద్రం నుంచి రూ. 1.50 లక్షలు, రాష్ట్రం తరపున రూ. లక్ష, ఉపాధి నిధులు రూ. 39 వేలు ఇస్తున్నారు. ఉపాధి నిధుల కింద ఇస్తున్న మొత్తంలో రూ. 12 వేలు మరుగుదొడ్డి నిర్మాణానికి కాగా మిగిలిన రూ. 27 వేలు ఉపాధి కూలీలకు పని కల్పించనున్నారు.

■ ఇక పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకుంటే వారికి రూ. 2.50 లక్షలు ఇవ్వనున్నారు. వీరికి ఉపాధి పథకం నిధులు ఇవ్వరు. సచివాలయ సిబ్బంది ద్వారా 90 రోజుల్లో ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో అసంపూర్తిగా పునాదులు, గోడలు కట్టిన ఇళ్ల లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

ఈనెల 5 నుంచి ఇప్పటి వరకూ దరఖాస్తులు/సర్వేలో పేర్లు నమోదు చేసుకున్న వారి వివరాలు	
● భీమిలి మండలం	- 236
● పద్మనాభం మండలం	- 652
● ఆనందపురం మండలం	- 66

■ **రూ.4లక్షల వరకు పెంచే ప్రతిపాదన:** పీఎంఏవై కింద ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయం మొత్తాన్ని రూ. 2.89 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ పెంచే ప్రతిపాదన ఉంది. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది వద్ద యాప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలి. గ్రామ సభల్లో ఆమోదం పొందాక అర్హులకు పథకాన్ని వర్తించనున్నారు. - కె.సూరిబాబు (గృహనిర్మాణ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారి)

స్ఫూర్తి రగిలించి.. విజేతగా నిలిచి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఎండాడ, న్యూస్‌టుడే: ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం మెరుగుపడుతుందని హెచ్‌ఎం ఉషారాణి తెలిపారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు చేపట్టారు. కె.జాహ్నవి (9వ తరగతి), ఎం.శ్రీవల్లి(9వ), ఆర్.రుద్రతేజ(7వ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు జి.శారద, సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

ప్రసంగిస్తున్న విద్యార్థిని

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పర్యావరణాన్ని రక్షిస్తేనే మనుగడ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: నూతన వ్యాపార పర్యావరణానికి మేలు చేసేలా ఉన్నప్పుడే దీర్ఘకాల మనుగడ సాధ్యమని అమెరికాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అనగుప్ప గుణశేఖరన్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'సుస్థిర సమాజ ఏర్పాటుకి సరికొత్త వాణిజ్య నమూనాలు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సమాజహితంగా నూతన వాణిజ్య నమూనాలను రూపొందించాలన్నారు. వ్యర్థాల నుంచి రీసైక్లింగ్ పద్ధతిలో సంపదను సృష్టించే విధంగా సర్క్యులర్ ఎకానమీ ప్రపంచ దేశాలకు అవసరమన్నారు.

★ వ్యవసాయ, వైద్య, విద్య, వాణిజ్య రంగాల్లో కృత్రిమమేధ రానున్న రోజుల్లో బలమైన ప్రభావం చూపనుందని హాంకాంగ్ విశ్వవిద్యాలయం డిజిటల్ ఇన్నోవేషన్ నిపుణుడు డాక్టర్ కె.ప్రసన్న పేర్కొన్నారు. ★ సదస్సు నిర్వాహక కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజాపణి పప్పు, సహ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.సాయి సుదర్శ్, విదేశాలకు చెందిన 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్య నిపుణులు, అమెరికా, చైనా, యూకే, కెనడా తదితర దేశాల విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు.

సదస్సులో అమెరికా వర్సిటీ డీన్ ప్రొఫెసర్ గుణశేఖరన్, తదితరులు

6న జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అవంతి విద్యా సంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబర్ 6న 'కోడ్‌క్వెస్ట్-2కె25' పేరిట జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆ విద్యా సంస్థల ఛైర్మన్, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ఆవరణలో దీనికి సంబంధించిన పోస్టరును గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. నూతన ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్లపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు డా.మురళీకృష్ణ, బి.జగదీశ్వరరావు, శేషు, డా.ఎ.చంద్రశేఖర్, డా.మోహనరావు, దొర, తదితరులు పాల్గొన్నారు.

వల పండింది

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ తీరంలో గురువారం మత్స్యకారుల వలకు పలు జాతుల చేపలు చిక్కాయి. కవ్వల్లు, పసుపుపారలు, కదుర్లు తదితర చేపలు అధిక సంఖ్యలో లభ్యమవడంతో వీరు సంతోషం వ్యక్తం చేశారు. ★ ఇదే వలలో చిక్కిన రుచికరమైన దాదాపు ఏడు కేజీల కోనాం చేపను రూ. 5 వేలకు విక్రయించారు.

వలలో చేపలు

బంగారుతల్లికి జేజేలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: దసపల్లా లేఅవుట్ (తాటిచెట్లపాలెం)లోని బంగారమ్మ ఆలయంలో గురువారం అమ్మవారిని పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అర్చకులు పి.వెంకటేశ్‌శర్మ సమక్షంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు.

పుష్పాలంకరణలో అమ్మవారు

జిల్లా పారా అథ్లెటిక్స్‌లో సత్తా

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థి దిలీప్ జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్‌లో ప్రథమ స్థానం సాధించినట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. సమగ్ర శిక్షా, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం సంయుక్తంగా జరుగుతున్న పోటీల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటాడు. ఈ మేరకు సమగ్ర శిక్షా అడిషనల్ డైరెక్టర్ జె.చంద్రశేఖర్ చేతులమీదుగా బహుమతి అందుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న దిలీప్

చిప్పాడలో ఉచిత వైద్య శిబిరం

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిప్పాడ (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. చిప్పాడ, మూలకుద్దు, కంచేరుపాలెం, కొసనవానిపాలెం, సిటీనగర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల బృందం పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించింది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, దివీస్ సీఎస్ఆర్ మేనేజరు సురేశ్ కుమార్ దేవెళ్ల, లైజనింగ్ అధికారులు నర్సింహ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో నెల్లూరులో అండర్-17 విభాగంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు బి.లిఖిత, జి.చంద్రకళ, సీహెచ్.నవీన్, ఎ.గిరీష్‌కుమార్‌లు అర్హత సాధించారన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులతో పాటు విశాఖ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి లలిత్‌కుమార్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ అచ్యుతరావు తదితరులు అభినందించారు.

రూ.3 కోట్లతో యూజీడీ పనులకు శ్రీకారం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డులో పలు కాలనీల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు సుమారు రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెదేపా కార్పొరేటర్ మొల్లి హేమలత పేర్కొన్నారు. గురువారం మారికవలస రాజీవ్‌గృహకల్ప, వైఎస్ఆర్ కాలనీల్లో యూజీడీ మరమ్మతులు చేపట్టే పనులకు ఆమె భూమిపూజ చేశారు. గత వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతుల చేపట్టలేదని, దీంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో లీకులు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడేవారనాను. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, ఈగల రవికుమార్, కొండపు రాజు, ముచ్చిరామునాయుడు, ఓలేటి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ మొల్లి హేమలత తదితరులు

నిలపని బస్సులు... ఆగని అవస్థలు

పద్మనాభం కూడలిలో మహిళలు, విద్యార్థులు

పద్మనాభం: కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'స్త్రీ శక్తి పథకం' తీసుకొచ్చింది. అయితే ఆర్టీసీ బస్సుల సిబ్బంది తీరుతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్టాపుల్లో బస్సులు నిలపకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉద్యోగులు, కార్మికులు సకాలంలో విధులకు హాజరుకాలేక అవస్థలకు గురవుతున్నారు. విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. పద్మనాభం వంటి పెద్ద కూడలిలో నిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఉద్యోగులు, విద్యార్థులు వాపోతున్నారు. ముఖ్యంగా విజయనగరం-సింహాచలం మార్గంలో తిరిగే మెట్రో, పల్లె వెలుగు బస్సులు స్టాపుల్లో నిలపడం లేదు. ఉదయం, సాయంత్రం వేళ నిత్యం ఇదే పరిస్థితి అని ఆవేదన చెందుతున్నారు. ఆటోలపై వెళ్దామంటే దూర ప్రయాణాలకు తడిసిమోపుడవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి స్టాపులోనూ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'నగరాల' ఛైర్మన్ మృతికి సంతాపం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 17న మృతి చెందిన రాష్ట్ర నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ మరుపిళ్ల తిరుమలేష్‌కు గురువారం మధురవాడలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విశాఖ జిల్లా నగరాల సామాజికవర్గం కమిటీ కార్యదర్శి జె.అప్పలరాజు, తెదేపా నాయకులు పిళ్లా నర్సింగరావు, సీపీఐ నాయకులు మరుపిళ్ల పైడిరాజు, వాండ్రాసి అప్పలరాజు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు నాగోతి అనిత, పోతిన పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విశాఖ వేదికగా సీఐటీయూ మహాసభలు

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: విశాఖ వేదిగా వచ్చేనెల 31వ తేదీ నుంచి జనవరి నాల్గో తేదీ వరకూ తొలిసారిగా జరిగే అఖిలభారత సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి పిలుపునిచ్చారు. చిట్టివలసలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో సభల గోడపత్రికను సంఘం నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబరు 27 నుంచి జనవరి రెండో తేదీ వరకూ శ్రామిక్ ఉత్సవ్ పేరిట వివిధ సాంస్కృతిక, అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జనవరి నాల్గో తేదీన ఆర్కేబీచ్‌లో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు, రాము, పి.పెంటరాజు, ఎన్.నాయుడు, బమ్మిడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విరిగి.. వ్యక్తికి తీవ్రగాయాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు వల్లభ గణపతి ఆలయం నుంచి సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహ కూడలికి వెళ్లే రహదారిలో గురువారం ఎండిన చెట్టుకొమ్మ మీద పడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలిలా.. నగరానికి చెందిన ప్రసాద్ తన భార్యతో ద్విచక్రవాహనంపై వస్తుండగా హఠాత్తుగా చెట్టు కొమ్మ విరిగి మీదపడటంతో తల భాగంలో తీవ్రగాయాలయ్యాయి. భార్య సురక్షితంగా బయటపడింది. బాధితుడిని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. సాగర్‌నగర్‌కాలనీలో ముఖ్య రహదారుల పరిసరాలు, జన సంచార ప్రదేశాల్లో ఎక్కువగా ఎండిన చెట్లుతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పయనం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో జరిగిన రగ్బీ, జూడో పోటీల్లో భీమిలి సన్ స్కూలుకు చెందిన విజేతలు ఈనెల 28 నుంచి 30 మధ్య జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పయనమయ్యారు. రగ్బీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థి ఎన్.సాత్విక్‌రామ్, బి.హర్షిత నెల్లూరు జిల్లా పొదలకోడూరు జెడ్పీ హైస్కూల్లో జరిగే రాష్ట్ర పోటీల్లో.. జూడో పోటీల్లో గెలుపొందిన టి.ప్రియమనస్విని, సి.హెచ్.గుణసాత్విక్ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల జెడ్పీ హైస్కూల్లో జరిగే జూడో పోటీలకు హాజరవుతున్నారని పాఠశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

గరుడ వాహనంపై గోవిందుడి వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు.



పూజలు చేస్తున్న అర్చకులు

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతులు గురువారం రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సీనియర్ సహాయకుడు వి.సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ

డిసెంబర్‌లో విమానయాన కార్యశాల

తాటితూరు(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: తగరపవలస సమీపంలోని సింగనబంద ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో డిసెంబర్ 13, 14 తేదీల్లో రెండ్రోజుల విమానయాన కార్యశాలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి చెప్పారు. విమానం అసెంబ్లింగ్, డ్రోన్ల తయారీ-ఫ్లైయింగ్, రాకెట్ డిజైన్-లాంచింగ్, ఫ్లైట్ సిమ్యులేషన్ వంటి అనుభవాత్మక కార్యకలాపాలు ఉంటాయన్నారు. పలు అంతర్జాతీయ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొననున్నట్లు తెలిపారు.

విద్యుత్తు కనెక్షన్‌కు ఆర్థిక సాయం

తగరపువలస, న్యూస్‌టుడే: తాటితూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జి.పవన్, జి.వెన్నెల విద్యార్థులు ఉంటున్న పూరి పాకకు విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు ఆ పాఠశాల ఛైర్మన్ సోమేశ్వరరావు, ఎల్ఐసీ అడ్వయిజరు అకిరి ఉమామహేశ్వరరావు ముందుకొచ్చారు. ఇటీవల విద్యార్థుల గృహాల సందర్శనకు వెళ్లగా వారి ఇంటికి విద్యుత్తు కనెక్షన్ లేకపోవడాన్ని గమనించిన దాతలు గురువారం రూ. 10 వేల ఆర్థికసాయం చేశారు. అలాగే పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు రాజేశ్వరరావు రూ. 2 వేల అందించారు. ఈ మొత్తంతో ఇంటిని విద్యుద్దీకరించుకోవాలని సూచించారు.

విద్యుత్తు సదుపాయం లేని విద్యార్థుల పూరిపాక ఇదే

నీళ్ల ట్యాంకు కూల్చి.. రేకులషెడ్ల నిర్మాణం

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. వాటిని సంరక్షించాల్సిన యంత్రాంగం వెనకుండి ప్రోత్సహించడంతో రూ. లక్షలు విలువ చేసే భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎనిమిదో వార్డు పరిధి రామానాయుడు స్టూడియో కొండ దిగువన ఉన్న తిమ్మాపురంలో ఆక్రమణలు పెచ్చుమీరుతున్నాయి. గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు దశాబ్దాల క్రితం తక్కువ ఎత్తులో నీళ్లట్యాంక్ నిర్మించి చుట్టూ కుళాయిలు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా నివాసాలు, జనాభా సంఖ్య పెరగడంతో కొండ పై భాగంలో ఎత్తైన ట్యాంక్ నిర్మించారు. దీంతో కొండ దిగువన ఉన్న సంబంధిత ట్యాంకు వినియోగానికి దూరమైంది. ఇదే అదనుగా భావించిన కొందరు ఆక్రమార్కులు రూ. 60 లక్షలు విలువ చేసే నీళ్లట్యాంకు స్థలంపై కన్నేశారు. రాత్రికి రాత్రి ట్యాంకును నేలకూల్చి దర్జాగా రెండు రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. ఆక్రమ నిర్మాణానికి సమీపంలో సచివాలయం ఉన్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణంలో ఉన్న రేకులషెడ్లు

ఉచిత పశువైద్య శిబిరం

పద్మనాభం, న్యూస్‌టుడే: పాడి రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి ఛైర్మన్ గాడు వెంకటప్పడు అన్నారు. బి.ఆర్.తాళ్లవలస గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 32 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. 50 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. రెడ్డిపల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ జి.అనూష, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ డి.శంకరరావు, ఎం.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడినట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. ఎండాడ నుంచి జూపార్కు వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సుమారు 65ఏళ్ల వయసు గల వ్యక్తి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ క్రమంలో తలకు గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడిని ఆసుపత్రికి తరలించారు. ఏపీ 31 సీడబ్ల్యూ 4165 నంబరు గల వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, వివరాలు తెలిసిన వారు ఆరిలోవ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

గాయపడిన వ్యక్తి

(c) eenadu

విశాఖ తూర్పు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

హెచ్‌బీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ఎంవీపీ కాలనీ, నక్కవానిపాలెం 11కేవీ విద్యుత్తు ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-1 ఇ.ఇ. పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల నక్కవానిపాలెం శివాలయం వీధి, క్రాంతినగర్, 60 అడుగుల రహదారి, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంతం, సత్యం కూడలి, శారద నికేతన్, కేఆర్ఎంకాలనీ, ఎంఎంటీసీకాలనీ, డాక్టర్స్‌కాలనీ, అల్లూరి సీతారామ రాజు విగ్రహం ఏరియా, సీతమ్మధార రైతుబజార్, ఆక్సిజన్ టవర్స్, ఏపీఎస్ఈబీకాలనీ, ఎ.ఎస్.ఎన్ క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు పరిధి వివేకానంద కాలనీలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల ఇద్దరు పిల్లలు కుక్కకాటుకు గురయ్యారు. -బి.సూర్యనారాయణ, వివేకానంద కాలనీ ✓: కుక్కల పట్టివేతను పెంచి సమస్య పరిష్కరిస్తాం. -రాము, సంబంధిత విభాగ ప్రతినిధి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: లాసన్స్‌బే కాలనీలో కొళాయి పైపు లీకు కారణంగా తాగునీరు వృథా అవుతోంది. ఈ కారణంగా గత పది రోజులుగా నీటికి ఇబ్బందులు పడుతున్నాం. -రామకృష్ణ, వెంకటరావు, స్థానికులు ✓: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. -శంకర్, జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్, నీటి సరఫరా విభాగం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 23వ వార్డు చైతన్యనగర్ ప్రాంత రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. -నాగరాజు, చైతన్యనగర్ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. -సత్యనారాయణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 15వ వార్డు పరిధి ఉమానగర్, పాత వెంకోజీపాలెం ప్రాంత కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై గురువారం 'ఈనాడు'లో వెలువడిన వార్తాంశానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ స్పందించారు. సిబ్బందితో పూడికలు తీయించి సమస్య పరిష్కరించారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్ప్'

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

ఇంటర్మీడియట్ విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్ప్-2026' పేరిట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చేపట్టారు. ఇవి నవంబరు 24 నుంచి ప్రారంభమయ్యాయని 50 రోజుల పాటు కొనసాగుతాయని జిల్లా ఇంటర్ విద్యాధికారిణి పి. ఉమారాణి తెలిపారు.

★ జిల్లాలో పది ప్రభుత్వ కళాశాలలుండగా.. వాటిలో ప్రథమ విద్యార్థులు 2,893 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2,465 మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరిందరికీ ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత శాతం మెరుగుపడేందుకు ఇంటర్ బోర్డు కమిషనర్ పి. రంజిత్ బాషా ఆదేశాల మేరకు వీటిని నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చేందుకు ఫిబ్రవరి 20వ తేదీ వరకు వీటిని కొనసాగిస్తారు. అదే నెల 23వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

వి.ఎస్. కృష్ణా జూనియర్ కళాశాల ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

★ క్వార్టర్, యూనిట్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి. కేటగిరీలుగా విభజించి వారి సామర్థ్యాలను తెలుసుకుంటున్నారు. ఇందుకోసం అధ్యాపక సిబ్బంది కేర్‌టేకర్‌గా వ్యవహరిస్తున్నారు. అవసరమైతే మరో 30 నిమిషాల పాటు అదనంగా స్టడీ అవర్ పెంచనున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, ప్రయోగ పరీక్షల రికార్డులు వంటివి గతంలో పంపిణీ చేశాం. సిలబస్ కూడా పూర్తి చేశాం. ప్రస్తుతం పునఃశ్చరణ ప్రక్రియ చేపట్టి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కళాశాలల ప్రధానాచార్యులు, అధ్యాపకులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. -పి.ఉమారాణి, జిల్లా ఇంటర్ విద్యాధికారిణి (డీఐఈవో)

13, 14 తేదీల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా డిసెంబరు 13, 14 తేదీల్లో పూర్వవిద్యార్థు సమ్మేళనం నిర్వహించనున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఎంవీపీకాలనీ మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జేసీ కళాశాల ఆవరణలో జరగనున్న ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగిలిన వివరాల కోసం 94417 35674 నంబరుకు ఫోనులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.భాస్కరరావు, జి.రంగాచార్యులు, డాక్టర్ పూడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విశాలాక్షినగర్ బీవీకే కళాశాలలో గురువారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇంటర్ చదువుతున్న వివిధ గ్రూపుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలో దాగి ఉన్న ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో ఇ.గణేష్ (ఎంపీసీ) ప్రథమ, కె.సాయి ప్రసన్న (ఎంపీసీ) ద్వితీయ, ఎస్.జానీ (సీఈసీ) తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ రమ ఉచిత, అధ్యాపకులు బహుమతులందించి అభినందించారు.

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బహుమతులు అందుకున్న విజేతలతో బీవీకే కళాశాల ప్రిన్సిపల్ రమ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. వార్డులో సుమారు రూ.60 లక్షల వ్యయంతో రహదారులు, కాలువ మరమ్మతుల పనులు చేపడుతున్నారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ అధికారులను సూచించారు. కార్పొరేటర్ జి.లావణ్య, నాయకులు కళ్ల శంకర్, నాగరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. ఎ.ఎస్.ఆర్. జిల్లా హుకుంపేట మండలానికి చెందిన శోభ నందిని (19) మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడి నుంచి కళాశాలకు వెళ్లేది. ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈమెకు ఓ వ్యక్తితో ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అదే ఇందుకు కారణం కావచ్చునని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ పేర్కొన్నారు.

ఏయూలో 5, 6 తేదీల్లో కార్యశాల

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి జగదీశ్వరరావు తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో జియోస్పేషియల్ టెక్నాలజీ వినియోగంపై డిసెంబరు 5, 6 తేదీల్లో పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక కార్యశాల నిర్వహించనున్నట్లు జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య జి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు జియో ఇంజినీరింగ్ విభాగంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జియో స్పేషియల్ స్మార్ట్ థింకింగ్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఇస్రో సహకారంతో దీన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

ఆకట్టుకున్న వంటకాల ప్రదర్శన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: గ్రామీణ తహసీల్దారు కార్యాలయం సమీపంలోని రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్య ఆధ్వర్యంలో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ నడుస్తోంది. ఇందులో పలు వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తూ వివిధ రాష్ట్రాల వంటకాల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. ఈ కోర్సుల్లో భాగంగా గడిచిన నాలుగు నెలల్లో నేర్చుకున్న అంశాలపై గురువారం ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయగా చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో పది, ఇంటర్ విద్యార్హతతో ఏడాది వ్యవధి గల వివిధ కోర్సులను నామమాత్రపు రుసుముతో శిక్షణ అందిస్తున్నామని, శిక్షణ కాలంలో గౌరవ వేతనం కూడా పొందే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రదర్శన తిలకిస్తున్న అతిథులు, సందర్శకులు

భవిత కేంద్రం విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు గురువారం వైద్యుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థితో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

తర్వాత విద్యార్థి ఇంటి చిరునామాకు ధ్రువపత్రాలు పంపించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సమగ్ర శిక్షా ఏపీసీ చంద్రశేఖర్, సహిత విద్య సమన్వయకర్త నీరజ, మండల విద్యాశాఖాధికారులు రవీంద్రబాబు, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా పారాస్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు గురువారం జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఈ పోటీల్లో వివిధ మండలాల నుంచి 100 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీసీ జె.చంద్రశేఖర్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త నీరజ, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

వృద్ధుడి ఆత్మహత్య

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలో నివాసముంటున్న దోల రాము (67) నాలుగు నెలల కిందట గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. మద్యం తాగకూడదని వైద్యులు చెప్పినా ఆయన వినలేదు. ఈ క్రమంలో 26వ తేదీ రాత్రి భోజనం చేశాక గదిలో నిద్రపోయిన వ్యక్తి మర్నాడు ఉదయం ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు పరిసరాల్లో పరిశీలించగా కొబ్బరి చెట్టుకు ఉరేసుకుని విగత జీవిగా కనిపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడినట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. ఎండాడ నుంచి జూపార్కు వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సుమారు 65ఏళ్ల వయసు గల వ్యక్తి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ క్రమంలో తలకు గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడిని ఆసుపత్రికి తరలించారు. ఏపీ 31 సీడబ్ల్యూ 4165 నంబరు గల వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, వివరాలు తెలిసిన వారు ఆరిలోవ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఏయూ దూర విద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న యూజీ, పీజీ పరీక్షలను గురువారం ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్ పరిశీలించారు. ఆయన ఎస్.కోటలోని వివేకానంద డిగ్రీ కళాశాల, కొత్తవలసలోని ప్రగతి పీజీ, డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అకాడమీ వార్షికోత్సవాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖ మ్యూజిక్ అకాడమీ 56వ వార్షికోత్సవాలు పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన కె.ఎస్. విష్ణుదేవ్ గాత్ర కచేరీ అందరినీ ఆకట్టుకుంది. అకాడమీ సభ్యులు కె.వి.రామ్మూర్తి, వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సింహాచలం ఆర్టీసీ డిపో సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) గురువారం తెల్లవారుజామున రోడ్డుపై మృతిచెంది ఉండటాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద ఆధారాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలించినా దొరకలేదు. అటుగా వెళ్లే బస్సు లేదా భారీ వాహనం ఢీకొట్టడంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. సీఐ లెంక సన్యాసినాయుడు పర్యవేక్షణలో ఎస్సై అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సున్నం వేసేందుకు వచ్చి చోరీ

పెందుర్తి, న్యూస్‌టుడే : సున్నాలు వేయడానికి వచ్చి చోరీ చేసిన నిందితులను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి గురువారం పెందుర్తి నేర విభాగం ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత గోశాల దరి సింహపురి లేఅవుట్‌కు చెందిన ఎం.నూకరాజు గత నెల 9న భార్యతో కలిసి ఊరు వెళ్లి వచ్చారు. ఇంట్లో భద్రపరిచిన ఆభరణాలు చూడగా కనిపించలేదు. దీంతో పెందుర్తి నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో నూకరాజు ఇంట్లో సున్నాలు వేయడానికి వచ్చిన పొట్నూరు వినోద్‌కుమార్ (32) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి సుమారు రూ.5లక్షలు విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ★ చినముషిడివాడ సప్తగిరినగర్‌కు చెందిన వి.లలిత గత నెల 18న నగరానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చినముషిడివాడ వెళ్లేందుకు ఎన్ఏడీ కూడలిలో ఆగి ఉన్న ఆటో ఎక్కారు. అప్పటికే ఆమె ఎక్కిన ఆటోలో ఇద్దరు మహిళలున్నారు. చినముషిడివాడలో దిగిన తర్వాత లలిత హ్యాండ్‌బ్యాగు చూసుకోగా బ్యాగులోని సుమారు రూ.60వేలు విలువైన చెవిదిద్దులు కనిపించలేదు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ సూరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనలో కె.కోటపాడు మండలం గొట్లాం గ్రామానికి చెందిన రావుల గంగోత్రి (30), కొత్తవలస దరి చీడివలస గ్రామానికి చెందిన మేకల అప్పల నరసమ్మ(40)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సూరిబాబు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సూరిబాబు

సర్వే ఆఫ్ ఇండియాతో ఏయూ అవగాహన ఒప్పందం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: సర్వే ఆఫ్ ఇండియాతో ఆంధ్ర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం పాలకమండలి సమావేశ మందిరంలో ఒప్పంద పత్రాలపై ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ సర్వేయర్ జనరల్ జె.వరుణకుమార్ సంతకాలు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు శిక్షణ, పరిశోధనల్లో సహకారం అందిస్తారని తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే సదస్సుల్లో ఏయూ భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు వజీర్ మహమ్మద్, డి.లలిత, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బి.సి.ఫరీడా, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీసీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు చూపుతున్న రిజిస్ట్రార్ కె.రాంబాబు, అడిషనల్ సర్వేయర్ జనరల్ వరుణకుమార్ తదితరులు

పర్యావరణాన్ని రక్షిస్తేనే మనుగడ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: నూతన వ్యాపారం పర్యావరణానికి మేలు చేసేలా ఉన్నప్పుడే దీర్ఘకాలం మనుగడ సాధ్యమని అమెరికాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అనగప్ప గుణశేఖరన్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'సుస్థిర సమాజాభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సమాజహితంగా నూతన వాణిజ్య నమూనాలను రూపొందించాలన్నారు. వ్యర్థాల నుంచి రీసైక్లింగ్ పద్ధతిలో సంపదను సృష్టించే విధంగా సర్క్యులర్ ఎకానమీ ప్రపంచ దేశాలకు అవసరమన్నారు. ★ వ్యవసాయ, వైద్య, విద్య, వాణిజ్య రంగాల్లో కృత్రిమమేధ రానున్న రోజుల్లో బలమైన ప్రభావం చూపనుందని హాంకాంగ్ విశ్వవిద్యాలయం డిజిటల్ ఇన్నోవేషన్ నిపుణుడు డాక్టర్ కె.ప్రసన్న పేర్కొన్నారు.★ సదస్సు నిర్వాహక కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు, సహ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎన్.సాయి సుధాకర్, విదేశాలకు చెందిన 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్య నిపుణులు, అమెరికా, చైనా, యూకే, కెనడా తదితర దేశాల విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతపై అప్రమత్తత

మాధవధార, న్యూస్‌టుడే : విద్యార్థుల భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రత నిబంధనలు పాటిస్తూ... పాఠశాలల బస్సులు, ఆటోలు నడపాలని రవాణాశాఖ డీటీఓ ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మర్రిపాలెం వుడాకాలనీలో పాఠశాలల బస్సులు, ఆటోలు నడిపే డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీఓ మాట్లాడుతూ... నిత్యం వాహనాల కండిషన్ పరిశీలించుకుని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి బస్సులో అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండాలని, అత్యవసర ద్వారం తెరిచే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తే చర్యలు తప్పవన్నారు.

ఘనంగా 'తొలి గురువారం' పూజలు

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే : మార్గశిర మాసం తొలి గురువారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

అభిషేకం చేసేందుకు బిందెలతో నీటిని తీసుకొచ్చిన మహిళలు

ఆరిలోవలో..: ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ సెక్టార్5లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం అనంతరం సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం పూజలు ప్రారంభమైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్పొరేటర్ సునీత తదితరులు తొలి పూజలో పాల్గొన్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

చెట్టు కొమ్మ విరిగి.. వ్యక్తికి తీవ్రగాయాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు వల్లభ గణపతి ఆలయం నుంచి సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహ కూడలికి వెళ్లే రహదారిలో గురువారం ఎండిన చెట్టుకొమ్మ మీద పడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలిలా.. నగరానికి చెందిన ప్రసాద్ తన భార్యతో ద్విచక్రవాహనంపై వస్తుండగా హఠాత్తుగా చెట్టు కొమ్మ విరిగి మీదపడటంతో తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. భార్య సురక్షితంగా బయటపడింది. బాధితుడిని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. సాగర్‌నగర్‌కాలనీలో ముఖ్య రహదారుల పరిసరాలు, జన సంచార ప్రదేశాల్లో ఎక్కువగా ఎండిన చెట్లుతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెల్ టవర్ వద్దంటూ నిరసన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తొమ్మిదోవార్డు పరిధి.. ఎస్సీ ఎస్టీ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీలకు సమీపంలో కొత్తగా చేపట్టే సెల్‌టవర్ పనులను ఆపేయాలంటూ గురువారం స్థానికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కాలనీ సంఘం ప్రతినిధులు బెంజిమెన్, కోటేశ్వరరావు, డాక్టర్ రాంప్రసాద్ నాయక్, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మద్దిలపాలెం గీతా బార్ వద్ద ఓ వ్యక్తి మద్యం అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారం మేరకు ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్, సిబ్బంది దాడులు నిర్వహించారు. పారిపోతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల షాపులు మూసేసిన తరువాత మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నాడనే ఆరోపణ మేరకు ఈ దాడులు చేపట్టి దొరబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సి.ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.ఎస్.ఐ ఆదిరాజు పేర్కొన్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

గరుడ వాహనంపై గోవిందుడి వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు.

పూజలు చేస్తున్న అర్చకులు

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతులు గురువారం రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సీనియర్ సహాయకుడు వి.సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న సీనియర్ సహాయకుడు సూర్యనారాయణ

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

మాధవధార: వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై గురువారం కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి. కంచరపాలెం సమీప ఇందిరానగర్-4లో నివాసం ఉంటున్న అప్పలనాయుడు(60) రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదని భార్య సత్యవతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13, 14 తేదీల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా డిసెంబరు 13, 14 తేదీల్లో పూర్వ విద్యార్థి సమ్మేళనం నిర్వహించనున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఎంవీపీకాలనీ మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జేసీ కళాశాల ఆవరణలో జరగనున్న ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగిలిన వివరాల కోసం 94417 35674 నంబరుకు ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.బాస్కరరావు, జి.రంగాచార్యులు, డాక్టర్ పూడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

న్యూస్‌టుడే, గురుద్వారా : ?: సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనుక గేటు రహదారిలో ఇష్టానుసారంగా వాహనాలను నిలిపేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. –అర్జున్, స్థానికుడు. ✓: పరిశీలించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం. – రామారావు, ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ.

న్యూస్‌టుడే, జ్ఞానాపురం: ?: జీవీఎంసీ 41వ వార్డు కాలనీల మురుగునీరు కాలువల్లో పూడిక వ్యర్థాలను తొలగించడం లేదు. తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. –రాజ్‌కుమార్, జ్ఞానాపురం ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. –ప్రసాద్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

న్యూస్‌టుడే, అల్లిపురం: ?: జీవీఎంసీ 34వ వార్డు అచ్చియమ్మపేట కూడలిలోని వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. –కండేల రాజు, అచ్చియమ్మపేట ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి, మరమ్మతులు చేయిస్తాం. –ఎం.మల్లయ్యనాయుడు, జెడ్సీ

న్యూస్‌టుడే, జగదాంబకూడలి : ?: జీవీఎంసీ 29వ వార్డు పరిధి కలెక్టరేట్ బస్‌స్టాప్ వద్ద ఆటోలను అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. –శారద, ప్రయాణికురాలు. ✓: పరిశీలించి ఆటోడ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. – వరప్రసాద్, సీఐ, ఒకటో పట్టణం.

న్యూస్‌టుడే, మాధవధార : ?: జీవీఎంసీ 51వ వార్డు వుడాకాలనీ శాంతి ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న గెడ్డ వ్యర్థాలతో నిండిపోయింది. తీవ్ర దుర్వాసన, దోమల బెడద పెరిగింది. –పి.అన్నపూర్ణ, స్థానికురాలు ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. – వెంకటరమణ, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

స్పందనకు వందనం

ఎట్టకేలకు శుభ్రత పనులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : డాబా గార్డెన్స్ పన్నుల శాఖ కార్యాలయం ఎదుట ఉన్న చెత్తకుండీలో వ్యర్థాలు తరలించడం లేదని 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గురుద్వారా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం ఉదయం లెక్కించారు. 92 రోజులకు రూ. 2,73,319 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. శ్రీవారి సేవా సంఘం, ఆలయ సిబ్బంది లెక్కింపు చేపట్టారు.

లెక్కింపులో పాల్గొన్న శ్రీవారి సేవా సంఘం సభ్యులు

5, 6న ఏయూలో కార్యశాల

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యలో జియో స్పేషియల్ టెక్నాలజీ వినియోగంపై డిసెంబరు 5, 6 తేదీల్లో పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక కార్యశాల నిర్వహించనున్నట్లు జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య జి.జగదీశ్వర రావు పేర్కొన్నారు. ఈ మేరకు జియో ఇంజినీరింగ్ విభాగంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జియో స్పేషియల్ స్మార్ట్ థింకింగ్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఇస్రో సహకారంతో దీన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. ఎ.ఎస్.ఆర్. జిల్లా హుకుంపేటకు చెందిన శోభా నందిని (19) మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణా కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడి నుంచి కళాశాలకు వెళ్తోంది. ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈమెకు ఓ వ్యక్తితో ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అదే ఇందుకు కారణం కావచ్చునని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ పేర్కొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి విజయవాడకు చెందిన పేతల రామకృష్ణ, నూకరత్నం దంపతులు గురువారం రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సీనియర్ సహాయకుడు వి.సూర్యనారాయణకు అందజేశారు.

ప్రణాళికతో.. లక్ష్యసాధన..!

'పది'లో మెరుగైన ఫలితాలపై దృష్టి

సామర్థ్యాల ఆధారంగా...

మాధవధార, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వీలుగా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, డిసెంబరు ఒకటి నుంచి వంద రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టనున్నారు.

★ అందులో భాగంగా ఏ రోజు ఏ పాఠం బోధించాలి..? ఏయే పరీక్షలు నిర్వహించాలనే వివరాలతో పాఠశాల విద్యాశాఖ నుంచి జారీ చేసే ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

★ విద్యార్థులకు ఎఫ్ఏ-1, -2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించనున్నారు. వారిలో సి, డి గ్రూపులకు చెందిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అవసరమైతే కొందరు విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుంటారు.

★ డిసెంబరు నుంచి విద్యార్థులందరికీ రోజువారీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు పీరియడ్స్, స్టడీ అవర్స్ నిర్వహించాల్సి ఉంటుంది.

తరగతి గదిలో విద్యార్థులకు బోధన

★ రోజూ పాఠ్యాంశ నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని, విద్యార్థులతో పరీక్ష రాయించాలి. అంతర్గత పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులు ఎప్పటికప్పుడు పరిశీలించి, పూర్తిస్థాయిలో తర్ఫీదు ఇచ్చేలా చర్యలు తీసుకుంటారు.

విశాఖ ఉత్తరంలో..

ఉత్తర నియోజకవర్గంలో మొత్తం 8 ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 635 మంది విద్యార్థులు పది తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక పూర్తి చేశారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై విద్యాశాఖ అధికారులు పరిశీలన చేసి, అవసరమైన చోట వసతులు కల్పనకు ఆదేశాలు ఇచ్చారు. గత అనుభవాల దృష్ట్యా ఈసారి మెరుగైన ఫలితాలు సాధించేలా, ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

గురుద్వారా, న్యూస్‌టుడే : సీఏ చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించొచ్చని సీఏలు ఎ.శ్రీధర్, పి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్ ప్రిజమ్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం డిగ్రీ ప్రథమ సంవత్సరం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 'సీఏ-భవిష్యత్తు కార్యాచరణ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన శ్రీధర్, ప్రశాంత్‌కుమార్ పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డి.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

ఘనంగా 'తొలి గురువారం' పూజలు

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే : మార్గశిర మాసం తొలి గురువారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణ

ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

అభిషేకం చేసేందుకు బిందెలతో నీటిని తీసుకొచ్చిన మహిళలు

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 37వ వార్డు జబ్బార్‌తోటలో రూ.42 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, కార్పొరేటర్ జానకీ రామ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

రేబిస్ సోకకుండా ముందస్తు చర్యలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : వీధుల్లో సంచరించే కుక్కల్ని పట్టుకుని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కేంద్రాలకు తరలించే ప్రజారోగ్యం సిబ్బందికి యాంటీ రేబిస్ టీకాలు వేశారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పర్యవేక్షించారు. వీధుల్లో కుక్కల్ని పట్టుకునే సందర్భంలో, పొరపాటున అవి కరిచినా.. సిబ్బందికి రేబిస్ వ్యాధి సోకకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా టీకాలు వేశామన్నారు. నగరంలో ఎక్కడికక్కడ వీధి కుక్కలకు ఆహారం అందించే వారు, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించొద్దని నరేష్‌కుమార్ సూచించారు.

సిబ్బందికి టీకాలు వేస్తున్న దృశ్యం

అర్హులందరికీ గృహాల మంజూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మాధవధార, న్యూస్‌టుడే : టిడ్కో గృహాల మంజూరుకు సంబంధించి బ్యాంకు అభ్యంతరాలతో పాటు, గృహాలు మంజూరు కాని వారి సమస్యల్ని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. గురువారం మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో 50, 51వ వార్డులకు చెందిన టిడ్కో లబ్ధిదారులు, బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. లబ్ధిదారులు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి, గృహ మంజూరు ప్రక్రియ పూర్తి చేయించుకోవాలన్నారు. ఈ విషయంలో బ్యాంకు ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కూటమి నాయకులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

'అవినీతిపరులకే అందలం'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ మెకానికల్ విభాగం ఇంజినీరింగ్ అధికారులు అవినీతి గుత్తేదారులను అందలం ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నారని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'చెత్త తరలింపు కేంద్రాల నుంచి సీసీఎస్ ప్రాజెక్టు ద్వారా చెత్త తరలించిన రాశా సంస్థ రూ.87 లక్షల మేర అక్రమాలకు పాల్పడిందని అధికారులు గుర్తించారు. ఆ మేరకు నోటీసులు జారీ చేసినా, ఇప్పటి వరకు ఆయా నిధులు వసూలు చేయలేకపోయారు. మరో కొత్త బాధ్యతలను రాశా సంస్థకు అప్పగించేలా ముగ్గురు మంత్రులు, ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు జీవీఎంసీ కమిషనర్‌పై ఒత్తిడి చేస్తున్నారు. బ్లాక్‌లిస్టులో ఉన్న రాజరాజేశ్వరి సంస్థకు మరో కాంట్రాక్ట్ దక్కేలా అధికారులు ప్రయత్నించడం దారుణం. ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి'' అని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తియాదవ్

29న విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మాధవధార, న్యూస్‌టుడే : ఎన్ఎస్‌టీఎల్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శనివారం చేపట్టే నిర్వహణ పనుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపేస్తామని జోన్-2 ఈఈ బీకే.నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాధవధార, కళింగనగర్, మాధవధార ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి, మాధవనగర్, సీతన్నగార్డెన్స్, వుడాకాలనీ, ఎన్ఏడీ, కరాస పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

మాధవధార, న్యూస్‌టుడే : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై గురువారం కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలి. కంచరపాలెం సమీప ఇందిరానగర్-4లో నివాసం ఉంటున్న అప్పలనాయుడు(60) రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదని భార్య సత్యవతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షల వెల్లువ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు,కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, మూర్తియాదవ్, బాణాల శ్రీనివాసరావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

సృష్టి ఫెర్టిలిటీ నిందితురాలు నమ్రత బెయిల్‌పై విడుదల

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ ఇతర నగరాల్లో కలకలం సృష్టించిన హైదరాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డా. నమ్రత (ఏ1 నిందితురాలు) గురువారం బెయిల్‌పై మహిళా జైలు నుంచి విడుదలయ్యారు. సరోగసీ, ఇరత అంశాలపై ఆమెపై 8 కేసులు నమోదయ్యాయి. అన్ని కేసుల్లోనూ న్యాయస్థానాల నుంచి బెయిల్ లభించింది. ఆగస్టులో ఈమెను నగరంలోని గోపాలపురం ఠాణా పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా గురువారం కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో టౌన్‌కొత్తరోడ్డు కూడలిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మజ్జిగతో పాటు, అవసరమైన వారికి చిల్లర నాణేలు అందజేశారు. బ్యాంకు మేనేజర్ కె.విశ్వనాథం, డిప్యూటీ మేనేజర్ జె.శంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రంలో సేవలు అందిస్తున్న సభ్యులు

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం

మురళీనగర్, న్యూస్‌టుడే : జీవీఎంసీ 49వ వార్డు సత్యానగర్ సన్‌రైజ్ ఆసుపత్రిలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి హాజరైన వారికి డాక్టర్ జి. శ్రీధర్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నిత్యం వ్యాయామం చేయాలన్నారు.

శిబిరానికి హాజరైన స్థానికులు

ముగిసిన అన్నదాన కార్యక్రమం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : కైలాసపురం శ్రీ ఉమా కాశీవిశ్వేశ్వర, శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఆలయ ధర్మకర్త దివంగత లాలం దేవుడు కుమారుడు లాలం అర్జున్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు, భవానీ భక్తులకు 41 రోజుల నుంచి అన్నదానం చేశారు. ఆఖరి రోజు కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు పైలా ముత్యాలనాయుడు, వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, పోర్టు యూనియన్ నాయకులు గొర్లె చందు, బత్తిన మురళీ పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఉల్లాసంగా... ఉత్సాహంగా..!

మురళీనగర్: మురళీనగర్ వనితావాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పైనాపిల్‌కాలనీలోని టీఎస్ఆర్ రిసార్ట్స్‌లో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి నేతృత్వంలో సుమారు 30 మంది మహిళలు హాజరై రోజంతా సందడి చేశారు. సంఘం రీజనల్ కౌన్సిలర్ యు.శుభ పాల్గొన్నారు.

వన సమారాధనకు హాజరైన మహిళలు

విద్యార్థుల భద్రతపై అప్రమత్తత

మాధవధార, న్యూస్‌టుడే : విద్యార్థుల భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రత నిబంధనలు పాటిస్తూ... పాఠశాలల బస్సులు, ఆటోలు నడపాలని రవాణాశాఖ డీటీఓ ఆర్.సి.హెచ్.శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మర్రిపాలెం వుడాకాలనీలో పాఠశాలల బస్సులు, ఆటోలు నడిపే డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీఓ మాట్లాడుతూ... నిత్యం వాహనాల కండీషన్ పరిశీలించుకుని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి బస్సులో అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండాలని, అత్యవసర ద్వారం తెరిచే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి రమణ, కంచరపాలెం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనకు హాజరైన డ్రైవర్లతో డీటీఓ శ్రీనివాసరావు

'ఎన్‌కౌంటర్లన్నీ.. ప్రభుత్వ హత్యలే..!'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఎన్‌కౌంటర్ల ద్వారా ప్రజా తిరుగుబాటును ఆపలేరని వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు అన్నారు. గురువారం నగరంలోని సరస్వతీపార్కు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి, అనంతరం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు జేవీ.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... మావోయిస్టులతో పాటు, వారికి అండగా ఉంటున్న ఆదివాసీలను చట్ట విరుద్ధంగా చంపేయడం అన్యాయమన్నారు. ఇటీవల జరిగిన ఘటనల్లో బాధ్యులపై కేసులు నమోదు చేసేలా కోర్టులు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు వై.కొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు, కె.రెహమాన్, గోవిందరాజులు, ఎం.లక్ష్మి, టి.శ్రీరామ్మూర్తి, కె.పద్మ, కె.నిర్మలా, పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో కళాకారులు, ప్రజానాట్య మండలి సభ్యులు ఆలపించిన విప్లవగేయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమరవీరులకు నివాళి అర్పించారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు

కాలభైరవ స్వామికి పూజలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జిల్లా జడ్జి కోర్టు సమీపంలో ఉన్న శ్రీ కాలభైరవ స్వామిని గురువారం ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయ అర్చకులు జగన్నాథశర్మ మాట్లాడుతూ... శుక్రవారం ఉదయం 11 గంటలకు స్వామికి అష్టభైరవ హోమం నిర్వహిస్తామన్నారు.

రైళ్ల గమ్యాల కుదింపు, రీషెడ్యూల్, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : తూ.కో. రైల్వే వాల్తేర్ డివిజన్ కొత్తవలస- కిరండూల్ లైన్‌లో పలు చోట్ల చేపడుతున్న ఎల్‌హెచ్ఎస్ పనుల దృష్ట్యా రైళ్ల గమ్యాలు కుదించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. డిసెంబరు 2, 9, 16న విశాఖ- కిరండూల్ (58501/02) రైళ్లతో పాటు మరికొన్ని రైళ్లు కొరాపుట్ వరకే రాకపోకలు సాగిస్తాయి.

★ డిసెంబరు 1, 2, 8 9న ఉదయం 8.25 గంటలకు బయలు దేరాల్సిన హావ్‌డా- సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.25 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

★ ఈనెల 27, డిసెంబరు 3, 4, 10, 11న సాయంత్రం 7 గంటలకు బయలు దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- హావ్‌డా (12840) రైలు రాత్రి 9 గంటలకు బయలుదేరుతుంది.

★ ఈనెల 27, డిసెంబరు 2, 3, 4, 5, 8, 9, 10, 11న విశాఖ-బ్రహ్మపుర(58532), ఈనెల 28, డిసెంబరు 3, 4, 5, 6, 9, 10, 11, 12న బ్రహ్మపుర - విశాఖ (58531) రైళ్లు పలాస వరకే రాకపోకలు సాగిస్తాయి.

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : భద్రత పనుల నేపథ్యంలో చేపట్టిన పలు రైళ్ల దారి మళ్లింపు విధానం మరికొంత కాలం కొనసాగుతుందని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె. పవన్‌కుమార్ తెలిపారు. ఆయా రైళ్లు ఈనెల 23 నుంచి డిసెంబరు 31 వరకు దుర్గాపూర్‌కు బదులుగా అసన్‌సోల్- అండాల్-సైంథియా జంక్షన్ మీదుగా నడుస్తాయన్నారు.

★ ఈనెల 29, డిసెంబరు 6, 13, 20, 27న ఎస్ఎంవీటి బెంగళూర్- కామాఖ్య (12551), ఈనెల 26, డిసెంబరు 3, 10, 17, 24, 31న కామాఖ్య- బెంగుళూర్(12552), డిసెంబరు 1, 8, 15, 22, 29న తాంబరం-సిల్చాట్ టౌన్(15629), ఈనెల 28, డిసెంబరు 5, 12, 19, 26న సిల్చాట్ టౌన్- తాంబరం(15630), ఈనెల 27, డిసెంబరు 4, 11, 18, 25న

తాంబరం- న్యూటిన్ సుకియా(15929), డిసెంబరు 1, 8, 15, 22, 29న న్యూటిన్ సుకియా- తాంబరం (15930), ఈనెల 26, డిసెంబరు 3, 10, 17, 24, 31న

ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- న్యూ జల్పైగురి (22611), ఈనెల 28, డిసెంబరు 5, 12, 19, 26న న్యూ జల్పైగురి- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22611) రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయన్నారు.

మెగా జాబ్‌మేళాలో కొలువులు

కంచరపాలెం, న్యూస్‌టుడే : ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం వంద మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 73 మంది కొలువులు సాధించారు. వారందరికీ నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ, బ్రాంచ్ హెడ్ విద్యాసాగర్, ఇతర ప్రతినిధులు అరుణశ్రీ, అర్చన, రమేష్ అభినందించారు.

ఉద్యోగాలు పొందిన వారితో ప్రిన్సిపల్ కె.వి.రమణ, తదితరులు

చకచకా నిర్మాణ పనులు

కంచరపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 48వ వార్డులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. బాపూజీనగర్‌లో కాలువ నిర్మాణం, ప్రధాన గెడ్డ ఆధునికీకరణ, సామాజిక భవన నిర్మాణం, ఇతర పనులను గురువారం భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావు

సర్వే ఆఫ్ ఇండియాతో ఏయూ అవగాహన ఒప్పందం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: సర్వే ఆఫ్ ఇండియాతో ఆంధ్ర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం పాలకమండలి సమావేశ మందిరంలో ఒప్పంద పత్రాలపై ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ సర్వేయర్ జనరల్ జి.వరుణకుమార్ సంతకాలు చేశారు. అయిదేళ్ల కాలానికి చేసుకున్న ఈ ఒప్పందం మేరకు పరిశోధన, ఇంటర్న్‌షిప్ తదితర అంశాల్లో సర్వే ఆఫ్ ఇండియా ఏయూకు అవసరమైన సమాచారం అందిస్తుందని, సర్వే ఆఫ్ ఇండియాలో అర్హత కలిగిన సిబ్బంది ఏయూలో ఎం.ఇ., ఎం.టెక్, పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పిస్తామని వీసీ తెలిపారు. ఆ సంస్థ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే సదస్సులకు ఏయూ ఆతిథ్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు వజీర్ మహమ్మద్, డి.లలిత, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బి.సి. ఫరీడా, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

'మా చిత్రం ఆకట్టుకుంటుంది'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : అమ్మ త్యాగం ప్రధాన అంశంగా సీస్ ఫిల్మ్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'విచిత్ర' కుటుంబ కథా చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర దర్శకుడు సైపుద్దీన్ మాలిక్ అన్నారు. గురువారం జగదాంబ థియేటర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంట్లో పిల్లలు పెద్దయిన తర్వాత సంపాదనే ప్రధాన ధ్యేయంగా తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. తోడు లేని తల్లిదండ్రులు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఇలాంటి అంశాలతో తీర్చిదిద్దిన చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు. నగరానికి చెందిన పలువురు కళాకారులు చిత్రంలో నటించారన్నారు.

PASSPORT MISSING
I KATARI DURGA PRASAD, S/o. Late K. Appa Rao, Residing at D.No. 29-19-2, Lalitha Nagar, Daba gardens, Visakhapatnam-530020. I Lost My Passport bearing No. B5523369 while travelling from Jagadamba to Dabagardens on 09-10-2025. If anybody finds please contact Ph No. 9494563079.

(c) eenadu

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సింహాచలం ఆర్టీసీ డిపో సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) గురువారం తెల్లవారుజామున రోడ్డుపై మృతిచెంది ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద ఆధారాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలించినా దొరకలేదు. అటుగా వెళ్లే బస్సు లేదా భారీ వాహనం ఢీకొట్టడంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. సీఐ లెంక సన్యాసినాయుడు పర్యవేక్షణలో ఎస్సై అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాజువాక

● గాజువాక ● విశాఖ పశ్చిమం

వైభవంగా అంబలం పూజ

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో గురువారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజను తెదేపా వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మాలధారులు పూజల్లో పాల్గొన్నారు.

అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 52వ వార్డు పాతకరాసలో నేలబావులను శుభ్రం చేయడం లేదు. – కన్నారావు, పాతకరాస

✔: పరిశీలించి చర్యలు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీకాలనీలోని అంగన్‌వాడీ, మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వీధిదీపాలు వెలగడం లేదు. – నందు, ఎస్సీబీసీకాలనీ, ✔: దీపాల మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ?: పట్టణంలో చిరువ్యాపారులకు ప్రత్యేక హాకర్ జోన్లను అందుబాటులోకి తేవాలి. రోడ్లపై దుకాణదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి. – భాస్కరరావు, మల్లేశ్వరరావు, గాజువాక

✔: త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది. – శేషాద్రి, జెడ్సీ

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి..

■ తహసీల్దార్‌తో మొరపెట్టుకున్న స్థానికులు

■ 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఫోన్ ఇన్'

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే

'తహసీల్దార్ గారూ..! కాలుష్యంతో సతమతమవుతున్నాం. అదానీ గంగవరం పోర్టు సిమెంటు కంపెనీ వద్దే వద్దు.. స్థలాలు కబ్జా అవుతున్నాయి. దృష్టిపెట్టగలరు. ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ జరగడం లేదు. పట్టించుకోండి' అంటూ పలువురు పెదగంట్యాడ తహసీల్దార్ పి.అమల దృష్టికి తీసుకెళ్లారు. 'ఈనాడు-మీతోడు' కార్యక్రమంలో భాగంగా గురువారం పెదగంట్యాడ తహసీల్దార్ అమలతో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

ఈనాడు మీతోడు

సమస్యలు తెలుసుకుంటున్న పెదగంట్యాడ తహసీల్దార్ పి.అమల

1 సిమెంటు యూనిట్ తరలించాల్సిందే..

ప్రశ్న : పెదగంట్యాడలో అదానీ సిమెంటు కంపెనీని జనావాసాలకు మధ్యలో ఎలా ఏర్పాటు చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. దయచేసి ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దు. చెత్త డంపింగ్ యార్డు వల్ల దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం.

– కొత్తకోట గోవిందరావు, శిల్లా సూర్యారావు, కోన రమణ, పెదగంట్యాడ. గొందేశి గురప్పరెడ్డి, నామాల అర్జున్, నెల్లిముక్కు. మహలక్ష్మినాయుడు దయాల్‌నగర్, నరేంద్ర, డెయిరీకాలనీ. ఎంవీ రమణ, మంత్రి గోపీ, నడుపూరు. ఎన్.రమణ, శ్రీనివాస్, సిటూ నాయకులు.

➠ తహసీల్దార్ : ప్రజా వ్యతిరేకతను ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. ప్రజా నిర్ణయానికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోం..!

2 పశువుల ఆసుపత్రి స్థలం కబ్జా..

ప్రశ్న : పెదగంట్యాడలో పాత పశువుల ఆసుపత్రి జాగాను పరిరక్షించాలి. ఆక్రమణదారుల గుప్పిట్లో ఉంది. గతంలో కలెక్టర్, జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదులు చేశాం. – జి.ఎరుకునాయుడు, అప్పారావు, నెల్లిముక్కు

తహసీల్దార్: స్టీల్‌ప్లాంటు ఎస్డీసీతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

3 దుమ్ముతో సతమతం

ప్రశ్న : మండల శివారు పిట్టవానిపాలెంలో హిందుజా, ఎన్టీపీసీ యాష్‌లారీలు, బొగ్గులారీల దుమ్ము, ధూళివల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. – పిట్టా సంజీవరావు, పిట్టవానిపాలెం

➠ తహసీల్దార్ : ఆయా యాజమాన్యాలతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

4 భారీ వాహనాలతో ఇబ్బంది:

ప్రశ్న: గంగవరం రోడ్డులో భారీ వాహనాలతో నానా ఇబ్బందులు పడుతున్నాం. పెదగంట్యాడ రోడ్డు పక్కన అనధికార దుకాణాలతో సమస్యలు ఎదురవుతున్నాయి. – ప్రసాద్, గంగవరం. శైలజ, పెదగంట్యాడ

➠ తహసీల్దార్ : సంబంధిత అధికారులకు పరిస్థితిని నివేదిస్తాం.

5 ఇళ్ల పట్టాల సమస్య..

ప్రశ్న: దయాల్‌నగర్‌లో ఉంటున్నాం. ఇంటి పట్టా ఉన్నా 296 జీవో కింద రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. నూకాలమ్మ రోడ్డులో రాకపోకలు సాగించలేక పోతున్నాం. ప్రభుత్వ జాగాలో ఆక్రమించుకున్న వారికి రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. – విజయకుమార్, సంతోషి, బొడ్డేడి ఉదయకుమారి, అప్పలరాజు, ఎ.నాగమణి, దయాల్‌నగర్. మాదాబత్తుల పార్వతి, సీతానగరం. శివనాగరాజు, సింహగిరికాలనీ.

➠ తహసీల్దార్ : సంబంధిత డాక్యుమెంట్లతో కార్యాలయానికి వచ్చి సంప్రదించండి.

6 బోర్డులు పీకేస్తున్నారు..

ప్రశ్న: బీసీ రోడ్డు శివాలయం ఎదురుగా ఉక్కు జాగాలో ఇటీవల ఆక్రమణల బోర్డులను తొలగించి రెవెన్యూ వారు కొత్తగా హెచ్చరిక బోర్డులు పాతారు. రాత్రికి రాత్రే వాటిని తొలగించారు. దయాల్‌నగర్ కొండపైనా ఆక్రమణలు జరుగుతున్నాయి. పెదగంట్యాడ రిక్షా కాలనీలో సర్వే నెం.89లో మినీ కల్యాణ మండపానికి కేటాయించిన స్థలం ప్రైవేటు వ్యక్తి ఆధీనంలో ఉంది. నడుపూరు ఉక్కు కల్యాణ మండపం స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారు. వికాస్‌నగర్ ఐటీఐ రోడ్డులో అనధికార కట్టడాలపై చర్యల్లేవు.

– మూల గిరిబాబు, నెహ్రూనగర్, దేవిశెట్టి చిన్నారావు, రిక్షాకాలనీ, పితాని భాస్కరరావు, నడుపూరు. శ్రీనివాస్, గాజువాక

➠ తహసీల్దార్ : బోర్డులు తొలగించే వారిపై చర్యలు తీసుకుంటాం. కొండపై ఆక్రమణలపై ఇప్పటికే వీఆర్వో, సచివాలయాల సిబ్బందిని ఆదేశించాం. రిక్షాకాలనీ స్థలం ఉక్కు పరిధిలో ఉంది. ఎస్డీసీ దృష్టికి సమస్యను తీసుకెళతాం. నడుపూరు ఆక్రమణలను తొలగిస్తాం. వికాస్‌నగర్ ఐటీఐ రోడ్డులో అనధికార కట్టడాలను కూల్చివేశాం.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే : లార్సన్ అండ్ టుబ్రో సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) సంయుక్తంగా జీవీఎంసీ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు సెమ్స్ సీవోవో కమాండర్ (రిటైర్డ్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. 27 ఏళ్ల వయసులోపు ఉండి ఐటీఐ ఫిట్టర్, టర్నర్, మెషనిస్టు, వెల్డర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, డిప్లమోలో మెకానికల్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. సంబంధిత కోర్సుల్లో 45 రోజుల ఉచిత శిక్షణ, ఉపాధి చూపి స్టైఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 99481 83865, 0891-2704010లో సంప్రదించాలన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం 33/11కేవీ విద్యుత్తు ఫీడరు పరిధిలో ఈనెల 29న విద్యుత్తు నిర్వహణ, మరమ్మతు పనులు జరుగుతాయని ఆపరేషనల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఆ రోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీహరిపురం మార్కెట్ ఏరియా, కోరమాండల్ గేటు, శ్రీహరిపురం మెయిన్‌రోడ్డు, జవహర్‌నగర్ రోడ్డు, పాత రామాలయం, అన్నమ్మకాలనీ ఏరియాలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

స్పందనకు వందనం

అనధికార కట్టడాల తొలగింపు

బీసీరోడ్డు (పెదగంట్యాడ), న్యూస్‌టుడే: బీసీరోడ్డు వికాస్‌నగర్ వద్ద రాత్రికి రాత్రే వెలసిన అనధికార కట్టడాలను మండల రెవెన్యూ, ఉక్కు భూసేకరణ సిబ్బంది గురువారం తొలగించారు. 'ఈనాడు'లో ఈనెల 26న 'రాత్రికి రాత్రే ఆక్రమణలు' శీర్షికన వార్త వచ్చిన సంగతి తెలిసిందే. స్పందించిన సంబంధిత అధికారులు షెడ్ల గోడలను నేలకూల్చారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధిలోని ఉక్కు పునరావాస కాలనీల్లో లోవోల్టేజీ సమస్యను తక్షణం పరిష్కరించాలని స్థానిక అఖిలపక్ష నాయకులు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాదంను కోరారు. ఈ మేరకు గురువారం కశింకోటలోని కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పునరావాస కాలనీల పరిధిలో సుమారు 20వేల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయన్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్తు సమస్యల వల్ల ఉపకరణాలు పాడవుతున్నాయన్నారు. స్థానికంగా ఉపకేంద్రం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. అఖిలపక్ష నాయకులు బి.సత్యనారాయణ, చందూరమేష్, బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏఈ ప్రసాదంకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

భక్తిశ్రద్ధలతో శ్రీవారి శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీవారి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి అర్చకులు శ్రీవారి శాంతి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం పంపిణీ చేశారు. శాంతి కల్యాణ విశిష్టతను భక్తులకు అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనర్గళ ప్రసంగాలతో అదరహో...!

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న గిరీశ్ విద్యానికేతన్ పాఠశాల ప్రతినిధులు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక, న్యూస్‌టుడే : 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గాంధీనగర్ గిరీశ్ విద్యానికేతన్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన కావ్యాంజలి, చరిష్మ, ప్రణవిలకు పాఠశాల డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

శరత్ పాఠశాలలో..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: బాబూజగ్జీవన్‌రామ్‌నగర్ శరత్ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ప్రణీతి, త్రిశాంతి, కుసుమలకు పాఠశాల డైరెక్టర్ ఎ.రాము, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శరత్ పాఠశాల ప్రతినిధులు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సర్వే ఆఫ్ ఇండియాతో ఏయూ అవగాహన ఒప్పందం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: సర్వే ఆఫ్ ఇండియాతో ఆంధ్ర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం పాలకమండలి సమావేశ మందిరంలో ఒప్పంద పత్రాలపై ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ సర్వేయర్ జనరల్ జి.వరుణకుమార్ సంతకాలు చేశారు. అయిదేళ్ల కాలానికి చేసుకున్న ఈ ఒప్పందం మేరకు పరిశోధన, ఇంటర్న్‌షిప్ తదితర అంశాల్లో సర్వే ఆఫ్ ఇండియా ఏయూకు అవసరమైన సమాచారం అందిస్తుందని, సర్వే ఆఫ్ ఇండియాలో అర్హత కలిగిన సిబ్బంది ఏయూలో ఎం.ఇ., ఎం.టెక్, పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పిస్తామని వీసీ తెలిపారు. ఆ సంస్థ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే సదస్సులకు ఏయూ ఆతిథ్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు వజీర్ మహమ్మద్, డి.లలిత, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బి.సి.ఫరీడా, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో సినిమాలు

శ్రీనరసింహ : రాజు వెడ్స్ రాంబాయి
నరసింహం : ఆంధ్ర కింగ్ తాలూకా
మౌర్య : రివాల్వర్ రిటా
ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-1: సిసు: రోడ్డు టు రివేంజ్, స్క్రీన్-2: 12ఏ రైల్వే కాలనీ, స్క్రీన్-3: రాజు వెడ్స్ రాంబాయి, స్క్రీన్-4: ప్రేమంటే

ఉచిత వైద్య శిబిరం

పంతులుగారి మేడ(గాజువాక), న్యూస్‌టుడే: చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్‌లో గురువారం లీ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ భాస్కరరావు, వైద్య బృందం రాధిక, కిరణ్, మాధురి తదితరులు ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అ వీ ఇ వీ

■ భారీ అన్నసమారాధన

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠిమహోత్సవంలో భాగంగా గురువారం జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీకూడలిలోని ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు.

■ ఈతపోటీల్లో విద్యార్థి ప్రతిభ

చేతన్ శివాశిష్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ విశాలాక్షి

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ఉక్కునగరం లిటిల్ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థి జి.చేతన్ శివాశిష్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దిల్లీలో ఈనెల 29 నుంచి డిసెంబర్ 5 వరకూ జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ పి.విశాలాక్షి విద్యార్థిని అభినందించారు.

■ పాటల సీడీ ఆవిష్కరణ

మల్కాపురం, న్యూస్‌టుడే : తెదేపా శ్రేణుల్లో చైతన్యం కలిగించేలా ఎమ్మెల్యే పి.గణబాబుపై రూపొందించిన పాటల సీడీ ఆవిష్కరణ కార్యక్రమం ఆయన తనయుడు మౌర్యసింహ చేతుల మీదుగా జరిగింది. 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. తెదేపా నగరాల రాష్ట్ర డైరెక్టర్ మజ్జి సోమేష్, ఎన్సీ సెల్ రాష్ట్ర అధికార పార్టీ ప్రతినిధి నీలాపు జోగి, పార్టీ నాయకులు సర్వసిద్ధి శ్రీలక్ష్మీ, కోరిబిల్లి రాము, రామ్మోహన్‌నాయుడు, నర్సింగ్‌రావు, పోతాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

■ శిరస్త్రాణాల పంపిణీ

గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తనయుడు మౌర్యసింహ జన్మదినం సందర్భంగా గురువారం గోపాలపట్నంలోని పశ్చిమ తెదేపా ప్రధాన కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. యువకులకు శిరస్త్రాణాలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 89వ వార్డు తెదేపా అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్, మార్కెట్ కమిటి ఛైర్మన్ ఎలమంచిలి అపర్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం ఏబీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి నీరుపిన్ని జీవన్‌సాయి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో వైజాగ్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మజాదీపక్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈశ్వరరావులు విద్యార్థిని అభినందించారు.

చీరలు పంపిణీ చేస్తున్న మౌర్యసింహ

పేదలకు టీఎన్‌టీయూసీ వితరణ

సింధియా, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గ తెదేపా యువ నాయకులు పెతకంశెట్టి మౌర్యసింహ పుట్టినరోజు సందర్భంగా గురువారం పారిశ్రామిక ప్రాంతంలో కొత్త నక్కవానిపాలెం వద్ద జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మౌర్యసింహ పాల్గొని కేక్ కోశారు. అనంతరం వెయ్యి మందికి అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో తెదేపా ఉరుకూటి హరి, అబ్బులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరమ్మ సారె వేడుక

సారెతో మహిళల ఊరేగింపు

హైస్కూలు రోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే: గాజువాక హైస్కూలురోడ్డు గౌరీ మందిరంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా అమ్మవారికి సారె వేడుక జరిపారు. వివిధ రకాల పిండివంటలు, పండ్లతో సారెను పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవమూర్తులకు గౌరీ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక పూజలు జరిపారు.

సేవలతో విద్యార్థులకు గుర్తింపు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సేవా రంగంవైపు విద్యార్థులు అడుగులు వేయాలని జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ అన్నారు. గురువారం రామచంద్రనగర్‌లో చైతన్య మహిళా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రతినిధులు ఎం.శంకరనారాయణ, ఆర్.రాధ, కుమారి, గ్రామ పెద్దలు శరత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్, చిత్రంలో శంకరనారాయణ తదితరులు

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపారు. ఎ.ఎస్.ఆర్. జిల్లా హుకుంపేటకు చెందిన శోభా నందిని (19) మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణా కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడి నుంచి కళాశాలకు వెళ్తోంది. ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈమెకు ఓ వ్యక్తితో ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అదే ఇందుకు కారణం కావచ్చునని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ పేర్కొన్నారు.

'ఎన్‌కౌంటర్లన్నీ.. ప్రభుత్వ హత్యలే..!'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఎన్‌కౌంటర్ల ద్వారా ప్రజా తిరుగుబాటును ఆపలేరని వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు అన్నారు. గురువారం నగరంలోని సరస్వతీపార్కు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి, అనంతరం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు జేవీ.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... మావోయిస్టులతో పాటు, వారికి అండగా ఉంటున్న ఆదివాసీలను చట్ట విరుద్ధంగా చంపేయడం అన్యాయమన్నారు. ఇటీవల జరిగిన ఘటనల్లో బాధ్యులపై కేసులు నమోదు చేసేలా కోర్టులు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఉక్కు మార్గంలో చీకట్లు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే

స్టీల్‌ప్లాంటు బీసీ గేటు పోర్టు ఫ్లైఓవర్ వంతెన మార్గంలో చీకటి కష్టాలు తొలగడం లేదు. పెదగంట్యాడ గాంధీ సెంటర్ నుంచి గేటుకు వెళ్లేంత వరకూ రాకపోకలు సాగించే వారంతా బిక్కుబిక్కుమంటున్నారు. ఇటు ఉక్కు యాజమాన్యంగానీ, జీవీఎంసీగానీ కన్నెత్తి చూడడం లేదంటున్నారు. రాత్రిషిఫ్ట్ విధులకు వెళ్లి వచ్చేవారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోర్టు వంతెన మార్గంలో వెలగని దీపాలు

మేటలు గుట్టలుగా..

గాజువాక, న్యూస్‌టుడే

ఎక్కడెక్కడి నుంచో కొట్టుకువచ్చిన పూడిక కారణంగా బీసీరోడ్డు ప్రధాన మురుగుకాలువలు, కల్వర్టులు జామవుతున్నాయి. తరచూ ఈ ఇబ్బందులు తలెత్తడంతో గురువారం జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది శానిటేషన్ డ్రైవ్ చేపట్టి గుట్టలుగా పోగులుపడ్డ పూడికను వెలికితీశారు. దయాల్‌నగర్, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలన్నీ దిగువ కల్వర్టుల వద్ద నిలిచిపోయాయి. ఈ పరిస్థితి దృష్ట్యా ఎక్కడికక్కడ డ్రైను మార్గాల్లో ఐరస్ మెస్‌లను ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

మూసుకుపోయిన గెడ్డలో వ్యర్థాలు తీస్తూ..

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారుడికి సంజీవని అని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గురువారం గోపాలపట్నంలోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని పది కుటుంబాలకు రూ.7,76,717 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బి.విజయ్‌కుమార్, పి.అజయ్‌కుమార్, రమణ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

నేను పైలా దమయంతి W/o. పైలా శ్రీనివాసరావు, ప్లాట్ నెం. 503, షణ్ముఖ ప్లాజా, వినాయకనగర్, ఉడాకాలనీ, టింపనీ స్కూల్ దగ్గర, గాజువాక, విశాఖపట్నం - 530026. తేది. 06-08-2025 న నాయొక్క డాక్యుమెంట్స్‌ని ఇంటి నుండి ఆఫీస్‌కి (పెదగంట్యాడ) వెళ్ళుతుండగా మార్గమధ్యలో నా ప్లాట్ యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి. డాక్యుమెంట్ నెం. 1189/2011. ఈ ప్లాట్ యొక్క డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది నెం.కి సంప్రదించండి.
Cell: 7799773055, 7569814668

ఎప్పుడూ పనులేనా..

నౌసేనాబాగ్ నుంచి మల్కాపురం వైపుగా వెళ్లే రహదారి మధ్యలో జరుగుతున్న తవ్వకాలు

మల్కాపురం, న్యూస్‌టుడే : అభివృద్ధి పనుల కోసం రోడ్ల మీద తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఒకపని పూర్తయిందని ఊపిరిపీల్చుకునేలోపు మరోపని మొదలవుతోంది. దీనివల్ల అసలు రోడ్లు ఎప్పుడు గోతులు లేకుండా ఉంటాయని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. సంవత్సరం మొత్తం పనులు జరుగుతూనే ఉంటే ఇంకా రోడ్లు బాగుండేదెప్పుడు అని అడుగుతున్నారు. పెద్దపెద్ద డ్రిల్లింగ్ యంత్రాలు తీసుకొచ్చి గోతులు తవ్వేస్తున్నారు. పనులు అయ్యాక వాటిని పూడ్చినా.. ముందు ఉండే గట్టితనం తర్వాత జరిగే మరమ్మతులకు ఉండదు. పారిశ్రామికవాడలో మల్కాపురం మొదలుకొని అటు సింధియా గేటు దాకా ఇదే పరిస్థితి. అలాగే గాజువాక డిపో నుంచి మల్కాపురం ప్రధాన సేవా రహదారిలోనూ అడుగుకో కొయ్యి చందాన తయారయ్యింది. అసలే మొన్నటి మొంథా తుపాను వర్షాలకు దారులన్నీ గోతులు పడగా.. ఈ పనుల వల్ల రహదారులు ఛిద్రమవుతున్నాయి. ఓ ప్రణాళిక ప్రకారం పనులు జరపాలేగాని.. సంవత్సరం మొత్తం పనులు జరుగుతుంటే ఎలాగని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నౌసేనాబాగ్ కేవీ పాఠశాల సమీప రహదారి మధ్యలో తవ్విన గొయ్యి



(c) eenadu

ఈనాడు
విజయనగరం

విద్యార్థి భేరి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభల సందర్భంగా గురువారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గురజాడ కళాభారతి వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వాలు విద్యను దూరం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ అఖిలభారత సహాయ కార్యదర్శి ఇషి గోష్ ఆరోపించారు. మహాసభల్లో ఆమె మాట్లాడారు. నూతన జాతీయ విధానం తెచ్చి అనేక పాఠశాలలను మూసివేశారన్నారు. మన్యం జిల్లాలో తరచూ విద్యార్థులు చనిపోతుండడం బాధాకరమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇషిగోష్

ర్యాలీగా తరలివెళుతున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

బుజ్జాయి.. ఆరోగ్యమస్తు..!

భారతి

పార్వతీపురం మండలం పిండిలోవకు చెందిన ఈ బాలిక పేరు భారతి. ఏడాది వయసున్న ఈమె 10 కిలోల బరువుండాలి. 7.3 కిలోలే ఉండడంతో పౌష్టికాహార పునరావాస కేంద్రంలో ఈ నెల 21న చేర్పించారు. ప్రస్తుతం 7.8 కిలోలకు బరువు పెరిగింది.

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతంపేట

ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా 50 నుంచి 60 మంది చిన్నారులు పునరావాస కేంద్రాల్లో చేరి వయసు, ఎత్తుకు తగ్గ బరువు పెరుగుతున్నారు. అదే ఇంటి వద్ద పిల్లాడి పొట్ట నిండేలా అన్నం పెడుతున్నా... నీరసంతో చాలా మంది బాలలు వయసు, ఎత్తుకు తగ్గ బరువు ఉండడం లేదు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులకు పిల్లలకు ఇచ్చే పోషకాహారంపై అవగాహన లేమి అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పోషకాహార లోపంతో అనారోగ్య సమస్యలు

చాలా మంది చిన్నారులను పౌష్టికాహార లోపం వేధిస్తోంది. పది నెలల శిశువులు 8 కిలోలు, ఏడాది బిడ్డ 10 కిలోల బరువుండాలి. అలా ఉండట్లేదని సర్వేలో తేలింది. వయసుకు తగ్గ ఎదుగుదల లేని పిల్లలు 7,450 మంది, పొడుగుకు తగ్గ బరువు లేనివారు 10,240 మంది ఉన్నారు. కొందర్ని పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు తరలిస్తుండడంతో మార్పు ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

3 ఉమ్మడి జిల్లాలో పౌష్టికాహార పునరావాస కేంద్రాలు

7 వేల మంది ఎదుగుదల లేనివారు

10 వేల మంది తక్కువ బరువున్న వారు

చిన్నారులు: **2.10** లక్షల మంది

6-8 నెలల వరకు.. బియ్యం, మినపప్పు, కందిపప్పు, పెసరపప్పును వేయించి పొడి చేసుకొని ఒకటి లేదా రెండు స్పూన్ల చొప్పున ఉడికించాలి. కొంచెం ఉప్పు, నెయ్యి కలిపి మొదటి ఆహారంగా అందించాలి.

పౌష్టికాహార పునరావాస కేంద్రంలో బరువు తక్కువ పిల్లలు

ఈ ఆహారం తప్పనిసరి.. పిల్లల ఆహారంలో ధాన్యాలు, పప్పు దినుసులు, ఆకు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు, మాంసం ఉండేలా చూసుకోవాలని న్యూట్రిషియన్ జ్యోతి తెలిపారు.

8 నెలల తర్వాత.. మెత్తగా ఉడికించిన అన్నం, పప్పును నెయ్యితో కలిపి తినిపించాలి. రాగిపిండి, బెల్లంతో చేసి జావ తాగించాలి. కిచిడి, పులగం ఇవ్వాలి.

ఏడాది దాటాక

ఉప్మా, పప్పు ఆకుకూరలు, కూరగాయలతో సాంబారు, రవ్వపాయసం, కిచిడీ, పులగం క్యారెట్, గుడ్డు వంటివి అలవాటు చేయాలి.
- చికెన్, మటన్ వంటివి మితంగా ఇవ్వాలి.
- చిన్నారులకు రోజుకు 5నుంచి 6సార్లు ఆహారం ఇవ్వాలి.
- మెత్తగా వండిన అన్నానికి పప్పు కలిపి తినిపించాలి.
- క్యారెట్, బంగాళ దుంప మెత్తగా ఉడికించి బియ్యం, పెసర పప్పుతో కలిపి పొంగలి చేసి ఇవ్వొచ్చు.
- ఉడికించిన గుగ్గిళ్లు, పెసలు, అలసందలు, అయిదేళ్లలోపు వారికి ఇవ్వడం మంచిది.
- చక్కెరతో తయారు చేసిన బాలామృతం ఇస్తే మంచి బలవర్ధకం.

కొమరాడ మండలం వనధార గ్రామానికి చెందిన నాలుగేళ్ల నితీష్ 14 కిలోల బరువుండాలి. 11 కిలోలే ఉండడంతో కేంద్రంలో ఈ నెల 17న చేర్పించారు. పది రోజుల్లో 11.7 కిలోలకు చేరినట్లు నిర్వాహకుడు తెలిపాడు.

నితీష్

ప్రత్యేక శ్రద్ధచూపుతున్నాం..

బాలలకు ఏ ఆహారం ఇవ్వాలో అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోతే వైద్యుల సూచనలతో పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు పంపిస్తున్నాం. - కనకదుర్గ, పీడీ, ఐసీడీఎస్

నేస్తం... సేవే సమస్తం

వాట్సప్ వేదికగా యువ బృందం చొరవ

న్యూస్‌టుడే, చీపురుపల్లి

కొవిడ్ సమయం.. అంతా లాక్ డౌన్.. బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి. ఆ సమయంలోనే ఆ యువతలో ఓ ఆలోచన మెదిలింది. చరవాణులతో కాలక్షేపం చేయడం కంటే నలుగురికి ఉపయోగపడితే మేలని భావించారు. 'నేస్తం' పేరుతో బృందంగా ఏర్పడ్డారు. వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. చిన్నగా మొదలైన బృందం నేడు 'షేర్ అండ్ కేర్'గా రూపాంతరం చెంది.. 15 గ్రూపుల్లో సభ్యుల సంఖ్య సుమారు మూడు వేలకు చేరింది.

కరోనా సమయంలో వందలాది మంది రోగులకు ఔషధాలు, ఆహారం, నిత్యావసరాలు అందించారు. ఈ బృంద సభ్యులు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరి తదితర జిల్లాల్లో ఉన్నారు. సేవలను ఆయా ప్రాంతాలకు విస్తరించారు. ఓ గ్రూపునకు 250 మంది ఉండేలా నిబంధన పెట్టుకున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు సేవపై ఆసక్తి ఉన్న వారిని సభ్యులుగా చేర్చుకున్నారు.

రక్తదానం చేస్తున్న బృంద సభ్యులు

రక్త దానం.. ప్రాణ దానం

అత్యవసర సమయాల్లో రోగులకు రక్తాన్ని ఇవ్వడం.. ఆరోగ్యంతో ఉన్న పేదలకు విరాళాలు సేకరించి అందజేస్తూ.. ఉపయోగపడుతున్నారు. రక్తం అవసరమైతే.. వివరాలు వాట్సాప్‌లో పంపి ఆ ప్రాంతంలోని బృంద సభ్యులను అప్రమత్తం చేస్తారు. అత్యవసర సమయాల్లో దాతలను అప్పటికప్పుడే సిద్ధం చేస్తున్నారు. ఇంతవరకు మూడు వేలకు పైగా రక్తదానం చేశారు.

బాధితులకు అండగా..

రోడ్డు ప్రమాదాలు.. అనారోగ్యాల బారినపడి ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు సాయం చేస్తున్నారు. ★ చీపురుపల్లి జి.అగ్రహారానికి చెందిన ఓ యువకుడు కొన్నాళ్ల క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం కోసం విరాళాలు సేకరించి రూ. 2.02 లక్షలు ఇచ్చారు. ★ రావివలసకు చెందిన అయిదేళ్ల బాలుడు మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుంటే రూ.1.07 లక్షలు.. పెరిపిలో ఓ బాలుడికి రూ.50 వేలు.. వంగపల్లిపేటకు చెందిన యువతికి రూ.70 వేలు అందించారు. ★ కొద్ది నెలల కిందట చీపురుపల్లికి చెందిన ఓ యువకుడు రహదారి ప్రమాదానికి గురవగా.. రూ.3 లక్షలు ఇచ్చి అండగా నిలిచారు.

పక్కదారి పడితే పట్టేస్తుంది!

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, విజయనగరం మయూరి కూడలి

ఏఐ కొత్త యాప్‌తో హాస్టళ్లలో అక్రమాలకు అడ్డుకట్ట

వసతిగృహాల్లో పర్యవేక్షణ లోపం, శుభ్రత, భోజనాలపై నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల కురుపాంలోని గిరిజన గురుకుల వసతి గృహంలో పచ్చకామెర్లతో వందల మంది ఆసుపత్రి పాలయ్యారు. ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఇదేగాక భోజనం పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యానికి చెక్ పెట్టేందుకు వసతి కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత పెంచేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం('హెచ్‌పీటీఎస్') పేరుతో ఏఐ (కృత్రిమ మేధ) వ్యవస్థతో పనిచేసే ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. దీన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి కేంద్రాల వార్డెన్ చరవాణుల్లో ఇన్‌స్టాల్ చేశారు. వీటి మోనటరింగ్ కోసం జిల్లా కేంద్రానికి ఓ యాప్‌ను ఇచ్చారు.

బీసీ వసతి కేంద్రంలో ఏఐ సాంకేతికతతో అప్‌లోడ్ చేసిన ఫొటోలు

వసతి కేంద్రాలు, విద్యార్థుల వివరాలిలా..

జిల్లా	హాస్టళ్లు	విద్యార్థులు
పార్వతీపురం	116	23,000
విజయనగరం	100	11,450

యాప్ ఇలా పనిచేస్తుంది..

యాప్ నిర్వహణపై జీవీఎల వార్డెన్లకు శిక్షణ ఇచ్చారు. ఆ మేరకు వసతి కేంద్రాల్లో రోజూ పనులు ఫొటో తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ప్రతి మెనూ వివరాలు, ఆవరణ, మరుగుదొడ్లు, గదులు శుభ్రత చిత్రాలు అప్‌లోడ్ చేయాలి.

ప్రయోజనమిదీ..

వసతి కేంద్రాల్లో పారదర్శకత పెంచేలా ఈ యాప్‌ను తీసుకొచ్చింది. రోజూ చేపట్టే పనులతో పాటు వారాంతం, నెలవారీ కార్యక్రమాలు పక్కాగా అమలయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా సిబ్బందికి తక్షణమే హెచ్చరికలు వెళ్తాయి.

అడ్డుకట్ట వేయడానికి..

ఈ యాప్ ద్వారా వసతి కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్టపడనుంది. ఏ సమస్య ఉన్నా తెలుస్తుంది. వెంటనే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.
- జ్యోతిశ్రీ, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సంక్షేమాధికారులు

5న ముఖ్యమంత్రి మన్యం జిల్లా పర్యటన?

పార్వతీపురం, సీతంపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు డిసెంబరు మొదటి వారంలో రానున్నట్లు తెలుస్తోంది. దీనికోసం జిల్లా యంత్రాంగం ముందస్తు కసరత్తు చేస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో కనీస విషయ సామర్థ్యం కనిపించేలా విద్యాశాఖ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రానున్న రోజుల్లో విద్యార్థులందరికీ కనీస విషయ సామర్థ్యాన్ని కల్పించాలని అందిస్తామనే గ్యారంటీని ప్రభుత్వం ఇవ్వనుంది. డిసెంబరు 5 నుంచి ఈ కార్యక్రమం అమలయ్యే అవకాశం ఉంది. దీన్ని మన్యం జిల్లా వేదికగా ప్రారంభించే వీలుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. భామినిలో పాల్గొనే సమావేశంలో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రకటించనున్నట్లు సమాచారం. సీఎం పర్యటనకు సంబంధించిన అధికార యంత్రాంగం నివేదికలు సిద్ధం చేసే దిశగా కసరత్తు చేస్తోంది. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం ఈ విషయమై సమావేశమై చర్చించారు. పర్యటనకు సంబంధించి అధికారికంగా ప్రకటన ఏదీ ఇంకా వెలువడలేదు.

ప్రాధాన్యమన్నారు.. పాట్లు మిగిల్చారు..!

ఈనాడు, విజయనగరం

సచివాలయాల పరిధిలో ప్రాధాన్యత భవనాలు నిర్మిస్తాం.. ఈ వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసి.. ఆయిదేళ్ల కాలయాపన చేసింది. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ గ్రంథాలయాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు మంజూరు చేసింది. ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. గుత్తేదారులకు కేటాయించింది. తీరా ప్రారంభించాక అన్నింటికీ నిధులివ్వలేమని గ్రహించి.. ప్రాధాన్య పనులే పూర్తిచేయాలని ఆదేశించింది. డిజిటల్ గ్రంథాలయాలు, బల్క్‌మిల్క్ యూనిట్ల పనులు పక్కనెట్టేసింది. మిగిలినవీ అసంపూర్తి నిర్మాణాలతో వెక్కిరిస్తున్నాయి.

విజయనగరం జిల్లా తెర్లాం మండలంలో 21 సచివాలయాలు ఉన్నాయి. ఉద్దవోలులో కోర్టులో కేసు కారణంగా పనులు ఆపేయడంతో సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. పూనువలసలో టైప్-2 భవనం అసంపూర్తిగా నిలిపోయింది. ఎం.ఆర్.అగ్రహారంలో పునాదుల స్థాయిలోనే వదిలేశారు. వెల్‌నెస్ కేంద్రంలోనే వైద్య సేవలు, సచివాలయ సేవలు అందిస్తున్నారు. **లోచర్లలో వెల్‌నెస్ కేంద్రం** పునాదులపై స్తంభాల స్థాయిలో ఆపేశారు.

కూటమి సర్కారుకు భారం

గత ప్రభుత్వం చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన సచివాలయ, ఆర్ఎస్‌కే, వెల్‌నెస్ కేంద్రాల భవనాల పూర్తికి ఉభయ జిల్లాల్లో సుమారు రూ.320 కోట్లు అవసరం. గుత్తేదారులకు బకాయిలు, నిధుల కేటాయింపు కూటమి సర్కారుకు భారమైంది. గత 18 నెలల్లో అంచెలంచెలుగా నిధులు మంజూరు చేశారు. దీంతో భవనాలు అందుబాటులోకి ఉన్నవీ శిథిలావస్థకు చేరుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ అత్యధికంగా సచివాలయ భవనాలు పూర్తయినా బిల్లుల పెండింగ్ వల్ల అన్నింటినీ అప్పగించలేదు. ఇలా వందకు పైగా ఉన్నాయి. 35 రైతు సేవా కేంద్రాల భవనాలు అప్పగించాల్సి ఉంది. మంజూరైనవి అత్యధికంగా ప్రభుత్వ స్థలాల్లో చేపట్టారు. ప్రైవేటు స్థలాల్లో చేపట్టిన వాట్లో కోర్టు వివాదాలున్నాయి. నిధుల లభ్యత మేరకు పనులు పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

విజయనగరం జిల్లా వివరాలు..

భవనం	మంజూరు	పూర్తయినవి	వ్యయం (రూ.లక్షల్లో)
గ్రామ సచివాలయాలు	530	395	43.06
రైతు సేవా కేంద్రాలు	496	305	23.94
వెల్‌నెస్ సెంటర్లు	435	196	20.80

క్రీడా వికాసం కనుమరుగేనా..?

చీపురుపల్లి- గరివిడి పట్టణాల మధ్య అగ్నిమాపక కేంద్రం వెనుక ఏడెళ్ల కిందట రూ.2 కోట్లతో చేపట్టిన క్రీడా వికాస కేంద్రం పనులు నేటికీ పూర్తికాలేదు. తెదేపా హయాంలో రెండు పట్టణాల మధ్య రూ.25 కోట్ల విలువ చేసే అయిదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని దీనికి కేటాయించారు. ఇండోర్ స్టేడియం, క్రీడాకారుల డ్రెస్సింగ్ గదులు, విశ్రాంత గదులు, మరుగుదొడ్ల పనులు 50 శాతానికి పైగా అప్పట్లోనే పూర్తయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోకుండా వదిలేసింది. గతంలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా ఉన్నవి పూర్తిచేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కొద్ది నెలల కిందట పలుచోట్ల నిధులు కేటాయించింది. చీపురుపల్లి స్టేడియం విషయం అలానే ఉండిపోయింది. నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి

చేయి తడిపితేనే దస్త్రం కదిలేది

ఈనాడు, విజయనగరం

సబ్ రిజిస్ట్రార్ల పనితీరుపై విచారణ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి నిరోధక శాఖ సోదాల్లో భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమ వసూళ్లు బయటపడుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు.. భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే కక్షిదారులు, అధికారులకు మధ్య దళారీ పాత్ర పోషిస్తున్నారు. ఏ రిజిస్ట్రేషన్‌కైనా చేతులు తడపనిదే దస్త్రం ముందుకు కదలని పరిస్థితి. తాజాగా రాజాం కార్యాలయంలో తీరుపై ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట 40 మందికి పైగా డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారు. రిజిస్ట్రేషన్లకు వచ్చే వారితో ముందే వారు మాట్లాడి పనికి ఇంతని చెబుతున్నారు. వీరు, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది కలిసి రుసుముల పేరుతో ప్రజలను పిండేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ వేణు సైతం దళారులతోనే మాట్లాడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్ ఉపేంద్రరావు

తరచూ తనిఖీలు చేస్తుంటాం..

రాజాం కార్యాలయంలో తనిఖీలపై డీఆర్ ఉపేంద్రరావు వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా తరచూ కార్యాలయాల తనిఖీల్లో భాగంగా రాజాంలో పరిశీలించానన్నారు. సమస్యలపై ప్రజల అర్జీలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సరిదిద్దుకోకపోతే చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వానికి ఎమ్మెల్యే ఫిర్యాదు

రాజాం ఎస్ఆర్వో కార్యాలయంలో అక్రమ వసూళ్లు జోరుగా సాగుతున్నాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆ శాఖ ఉన్నతాధికారులు అక్కడ ఏం జరుగుతుందో నివేదించాలని ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపేంద్రరావు రాజాం కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఇక్కడ లోపాలు సరిదిద్దుకోవాలని డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం లేకుండా చూడాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్ఆర్వో వేణును డీఆర్ హెచ్చరించినట్లు సమాచారం.

తప్పులు చెప్పి.. తప్పించుకోవద్దు

ఈనాడు – విజయనగరం, న్యూస్‌టుడే, అర్బన్: జిల్లాలో సుఖ ప్రసవాలపై తప్పులు చెప్పొద్దని రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ వి.జోగేశ్వరరావు సూచించారు. కమిటీ సభ్యులతో గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయం, ఉద్యానం, పశుసంవర్ధక, సూక్ష్మ సేద్యం, జలవనరులు, వైద్యారోగ్య, విద్య, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల వారీగా మంజూరైన నిధులు, వినియోగం, ఇతర అవసరాలపై సమీక్షించారు. ప్రసవాల తీరుపై డీఎంహెచ్‌వో జీవనరాణిని ప్రశ్నించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 42 శాతం శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని ఆమె బదులిచ్చారు. 80 శాతానికి పైగా చేస్తున్నారని, మీరు చెప్పిన గణాంకాలు సరిగా లేవని చెప్పారు.

మాట్లాడుతున్న అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులు

మహిళలకు అభినందన..: సేంద్రియ పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకం కోసం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడంపై పొదుపు మహిళలను అభినందించారు. ఇది రాష్ట్రమంతటా ప్రారంభిస్తామన్నారు. మహిళల అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలని, ఉపాధి పథకం నిధులతో పాఠశాలల ప్రహరీలు, లింకు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరాజు, వి.కల్యాణి, ఎమ్మెల్యేలు, సభ్యులు వెంకటరాజు, జయకృష్ణ, జేసీ, డీఆర్వో పాల్గొన్నారు.

విజయనగరం 2.. మన్యం 3

స్త్రీనిధి రుణ వినియోగంలో ఇవీ స్థానాలు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: స్త్రీనిధికి ప్రత్యేకించి లక్ష్యాలు ఉండవని, మహిళల అవసరం మేరకు రుణం తీసుకోవచ్చని అయిదు జిల్లాల స్త్రీనిధి డిప్యూటీ జనరల్ మేనేజరు కృష్ణంనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఏజీఎం చిట్టిబాబుతో కలిసి ఎల్.కోట వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పొదుపు సంఘాలకు నవంబరు నాటికి రూ. 482.48 కోట్లు రుణం ఇచ్చేందుకు లక్ష్యం పెట్టుకున్నామని, ఇప్పటివరకు రూ. 459.55 కోట్లు అందజేశామన్నారు. దీంతో ఈ జోన్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఏటా 97 శాతం రికవరీ అవుతున్నట్లు చెప్పారు. రుణాల వినియోగంలో మొదటి స్థానంలో శ్రీకాకుళం, తర్వాతి స్థానాల్లో విజయనగరం, మన్యం, విశాఖ, అల్లూరి సీతారామరాజు ఉన్నాయన్నారు. విజయనగరం జిల్లాలో విజయనగరం, మెంటాడ, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి, వంగర మండలాలు వెనుకబడి ఉన్నాయని చెప్పారు.

తీర్థయాత్రలకు వెళ్లొద్దామా..

అందుబాటులో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

పంచారామాల యాత్రకు సిద్ధంగా ఉన్నభక్తులు

కార్తికమాసం పూర్తయింది. దీక్షాధారులతో పాటు సాధారణ భక్తులు, ప్రకృతి ప్రేమికులు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో రైళ్లన్నీ కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ ధరలు పెంచేశారు. ఈ నేపథ్యంలో తాము తక్కువ రేట్లకే తీసుకెళతామంటోంది ఆర్టీసీ. సద్వినియోగం చేసుకోవాలని కోరుతోంది.

మాలధారులకు ప్రత్యేకంగా..

- అయ్యప్ప భక్తుల బృందం కోసం విజయనగరం నుంచి 7, 11 రోజుల యాత్రలను అందుబాటులోకి తెచ్చారు.
- విజయనగరం నుంచి కాణిపాకం, శ్రీపురం, గురువాయురు, ఎరుమేలి, పంబ, శ్రీరంగం, కంచి, తిరుపతి, శ్రీకాళహస్తి, బెజవాడ, ద్వారపూడి, అన్నవరం, సింహాచలం పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న తర్వాత బస్సు తిరిగి విజయనగరం చేరుకుంటుంది.

- 35 సీట్లతో కూడిన సూపర్‌లగ్జరీ ఉంటుంది. బస్ బుక్ చేసుకుంటే రూ. 2,54,700 అవుతుంది. అంటే ఒక్కొక్కరికీ సుమారు రూ. 7,300 వరకు పడుతుంది. అల్ట్రాడీలక్స్ సర్వీసు అయితే (38 మంది స్వాములు) రూ. 2,71,000 చెల్లించాలి.

పదకొండు రోజులైతే..

◆ విజయనగరం నుంచి విజయవాడ, శ్రీశైలం, మహానంది, కాణిపాకం, శ్రీపురం, గురవాయురు, ఎరుమేలి, పంబ, త్రివేండ్రం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, కంచి, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అన్నవరం, సింహాచలం క్షేత్రాలకు పదకొండు రోజుల యాత్రను ప్రవేశపెట్టారు. సూపర్‌లగ్జరీ అయితే రూ. 3,12,300, అల్ట్రాడీలక్స్ బస్సుకు రూ. 3,32,500గా నిర్ణయించారు.

వెళ్లేదిలా...

ధనుర్మాసం యాత్ర ప్రతి శనివారం రాత్రి ప్రారంభమవుతుంది. విజయనగరంలోని కాంప్లెక్స్ నుంచి 8 గంటలకు బస్సు మొదలవుతుంది. ఆదివారం ఉదయం ద్వారకా తిరుమల, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్తారు. మధ్యాహ్నం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, అప్పన్నపల్లి బాలబాలాజీ ఆలయాలను దర్శిస్తారు. సాయంత్రం అన్నవరం చూసుకుని సర్వీసు బయలుదేరుతుందని ప్రజారవాణాధికారిణి వరలక్ష్మి, డిపో ప్రబంధకుడు శ్రీనివాసరావు తెలిపారు.

సౌకర్యాలివీ..
- పుల్‌పుష్ బ్యాక్ సీట్లు
- ఆడియో, వీడియో
- మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు
- ట్రాకింగ్ సదుపాయం
- ఆన్‌లైన్‌లోనే టికెట్ బుకింగ్
- కాంప్లెక్స్‌లలో ప్రత్యేక కౌంటర్లు
- దర్శనాలకు ఏర్పాట్లు

సంప్రదించాల్సిన నంబర్లు: ✆ డిపో ప్రబంధకుడు- 99592 25620 ✆ అసిస్టెంట్ ప్రబంధకుడు- 73829 24103 ✆ సిస్టం సూపర్‌వైజర్- 94403 59596

(c) eenadu

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

అంతర విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

శిక్షకుడు రాముతో కలిసి బంగారు పతకం చూపిస్తున్న పల్లవి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రాజస్థాన్ రాష్ట్రంలో జరుగుతున్న ఖేలో ఇండియా అంతర విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన ఎస్.పల్లవి సత్తా చాటి బంగారు పతకం సాధించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ఆమె పాల్గొన్నట్లు శిక్షకుడు రాము తెలిపారు. 69 కిలోల కేటగిరీలో స్నాచ్ 90 కిలోలు, క్లీన్‌అండ్‌జర్క్ విభాగంలో 110 కిలోలు కలిపి 200 కిలోల బరువులెత్తి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెదేపా విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రవిశేఖర్, మండలాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ తదితరులు అభినందించారు.

డోలీ మోతలు పట్టించుకోండి సారూ..!

గిరిజనులను రహదారి కష్టాలు ఇంకా వెంటాడుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నేటికీ డోలీ మోతలు తప్పడం లేదు. తాజాగా కురుపాం మండలం ఒబ్బంగి పంచాయతీ పరిధిలోని తోలుంగూడ గ్రామానికి చెందిన వృద్ధుడు మండంగి కింబాపు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఊరికి రహదారి సదుపాయం లేక స్థానికులు డోలీ కట్టి సుమారు ఏడు కిలోమీటర్లు మోస్తూ నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాకిలి కూడలి ప్రధాన రహదారి నుంచి తోలుంగూడ మీదుగా లిక్కిడి కూడలి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోసంగూడ, కుంబరివలస, గోమాయిగూడ, విప్పమానుగూడ గిరిజనులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

మంచానికి తాళ్లు కట్టి వృద్ధుడిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న గ్రామస్థులు

ఆ పంచాయతీ ఉండదిక!!

● గ్రామాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు
● అక్రమాలకు అడ్డుకట్ట

– న్యూస్‌టుడే, రాజాం

గ్రామ పంచాయతీల్లో పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అభివృద్ధికి కీలకమైన పన్నుల రాబడిపై దృష్టిపెట్టింది. పూర్తి పారదర్శకతకు ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఆస్తి, తాగునీటి కుళాయిలు, చెరువుల లీజులు, ఆశీలు, భవనాలు, భూముల క్రమబద్ధీకరణ.. తదితర ప్రక్రియలన్నీ శతశాతం ఈ విధానంలోనే సాగాలని నిర్దేశించింది. ఆఫ్‌లైన్ పద్ధతిలో వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నిధుల దుర్వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట పడనుందని భావిస్తోంది.

పెరగనున్న ఆదాయం..

కొన్ని గ్రామాల్లో రాజకీయ కారణాలతో చాలా నిర్మాణాలకు పన్నులు వేయడం లేదు. లెక్కల్లో తేలిన వాటితో సరిపోల్చితే ప్రస్తుతం ఉన్న అసెస్మెంట్లు చాలా తక్కువగానే ఉంటున్నాయని గుర్తించారు. దీన్ని సరిచేసేందుకు సచివాలయాల వారీగా ఇటీవల ప్రతి నిర్మాణం కొలత తీసుకుని యాప్‌లో నిక్షిప్తం చేశారు. కొలతల ఆధారంగా పన్నులు విధించాలని అధికారులు సూచించారు. పాత పద్ధతికి పూర్తిగా ముగింపు పలకడంతో ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఇకపై పన్ను బకాయిల నోటీసులను సైతం వాట్సాప్, సంక్షిప్త సమాచారం రూపంలో యజమానులకు చేరవేస్తారు. అందులో ఉండే క్యూఆర్‌కోడ్, యూపీఐ ఐడీ ద్వారా చెల్లింపులు పూర్తి చేయవచ్చు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

● పంచాయతీలు : 777
● అసెస్మెంట్లు : 3,94,228
● ఆస్తిపన్ను డిమాండు: రూ.24.26 కోట్లు
● వసూలైంది: రూ.2.10 కోట్లు

కానరాని వసూళ్లు..

ఆర్థిక సంవత్సరం పూర్తి కాక ముందే వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని అధికారులు ఆదేశించారు. మూడు నెలల ముందే రాబట్టాలని స్పష్టం చేశారు. కానీ జిల్లాలో ఇంత వరకు కేవలం 8.66% మాత్రమే చెల్లింపులు జరిగాయి. మొండి బకాయిలు రూ.4.56 కోట్ల మేర పేరుకుపోగా, రూ.38.67 లక్షలు అందాయి.

పక్కాగా అమలు..

పంచాయతీల్లో ఆన్‌లైన్ చెల్లింపులు పక్కాగా అమలు చేయాలని చెప్పాం. డిజిటల్ పేమెంట్ రూపంలోనే ఇక నుంచి పన్ను వసూళ్ల ప్రక్రియ సాగుతుంది. ఈ నిధుల నేరుగా ఖాతాలోకి జమవుతాయి. ఎక్కడా అక్రమాలకు తావుండదు. యజమానులకు ముందుగానే అవగాహన కలిగించాలి. నిబంధనలు ఉల్లంఘించినా, రసీదులు ఇచ్చి నగదు తీసుకున్నా డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, ఈవోలపై చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జునరావు, డీపీవో

ఒత్తిడితెచ్చి సంతకాలు పెట్టించుకున్నారు

ఈనాడు, విజయనగరం

గది తలుపులేసి నాతో సంతకాలు చేయించారు.. అని ఇటీవల సస్పెండైన కొత్తవలస తహసీల్దారు అప్పలరాజు ఒకరిద్దరు రాష్ట్ర మంత్రులు, తెదేపా సీనియర్ నాయకులకు మొర పెట్టుకున్నట్లు తెలిసింది. నిబంధనలు తుంగలో తొక్కి ప్రభుత్వ భూములు సబ్ డివిజన్ చేసి, కొంతమేర ప్రైవేటు వ్యక్తుల పేర్లు రాసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడవడంతో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆయన్ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పలువురు నేతలను సంప్రదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం. 'విధుల్లో చేరిన నాటి నుంచే కీలక ప్రజాప్రతినిధుల అనుచరులు నాపై ఒత్తిడి పెంచారు. నాకు చెప్పకుండా ఎక్కడా సంతకం పెట్టకూడదని.. మేము చెప్పిందల్లా చేస్తే ఇక్కడ పనిచేయగలవు.. లేకుంటే సస్పెండైనా.. బదిలీ అయినా అవుతావని బెదిరించడంతో సంతకాలు చేశా.. ఇచ్చింది తీసుకున్నా..' అని ఆవేదన చెందినట్లు సమాచారం.

కంటకాపల్లి సర్వే నం.245లోని భూముల చిత్రపటం

కంటకాపల్లి భూములపై కన్ను.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎస్.కోట నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల కబ్జాకు కుట్ర జరుగుతోంది. విశాఖ నగరాన్ని ఆనుకుని ఉండడంతో ఎకరా రూ.కోట్లలో పలుకుతుండడంతో అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు కళ్లు మూసుకుంటున్నారు. కొత్తవలస మండలంలోని కంటకాపల్లి సర్వే నం.245లోని రూ.కోట్ల విలువైన భూములపై కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. సర్వే నం.245-1లో 210 ఎకరాలు, సర్వే నం.245-2లో 169.02 ఎకరాలున్నాయి. నం.245-1లో పోరంబోకు కొండ, 245-2లో గయాలు(అభివృద్ధి చేసిన వృథా భూమి)గా అధికారిక దస్త్రాల్లో నమోదై ఉంది. ఇందులోని 132 ఎకరాల్లో మామిడితోటలు, జీడి తోటలు ఉన్నాయి.

వాదోపవాదాలు..

గతంలో అసిస్టెంట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఇచ్చిన ఆర్డర్ మేరకు ఆ భూములు తమవేనని ఓవైపు రైతులు.. ఎండీఆర్‌లో 1, 2 సబ్ డివిజన్లున్నా, ఎఫ్ఎంబీలో లేకపోవడంతో ప్రభుత్వానివేనని అధికారులు వాదిస్తున్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గతంలో కోర్టు ఆదేశించింది. అప్పట్నుంచి తమను యజమానులుగా దస్త్రాల్లో నమోదు చేయాలని రైతులు జేసీని కోరుతున్నారు. వారి దరఖాస్తుపై క్షేత్రస్థాయి పరిశీలనతో నివేదించాలని కింది స్థాయి అధికారులను జేసీ ఆదేశించారు. అయితే భూములని గుర్తించలేమని అప్పటి తహసీల్దారు నివేదించగా, తర్వాత వచ్చిన తహసీల్దారు అనుకూలంగా రాయించినట్లు సమాచారం. ఇది ప్రస్తుతం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. కంటకాపల్లి భూములు, తహసీల్దారు వ్యవహారాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా తప్పులు చేసిన అధికారులపై చర్యలు తప్పవన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలపై దృష్టిపెట్టాలి

విజయనగరం విద్యావిభాగం, పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే బాలలంతా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకెళ్లాలని ఎస్పీ దామోదర్ సూచించారు. సీఎస్ఆర్ నిధులతో ఎస్‌బీఐ సమకూర్చిన 16 సైకిళ్లను విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు గురువారం ఆయన అందజేశారు. అన్ని రంగాల్లోనూ బాలలు రాణించాలన్నారు. అంతర్జాలం, సామాజిక మాధ్యమాలను ఉపయోగపడేలా వినియోగించాలని కోరారు. వాటికి బానిసలు కావొద్దన్నారు. ఎస్‌బీఐ ప్రాంతీయ ప్రబంధకుడు ఎం.సురేష్‌బాబు, ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.లలితకుమారి, రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లతో విద్యార్థినులు, చిత్రంలో ఎస్పీ దామోదర్ తదితరులు

రూ.345.11 కోట్ల ఆదాయమే లక్ష్యం

రాజాం, న్యూస్‌టుడే: జిల్లాలోని 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా అక్టోబరు నాటికి రూ.194.99 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. రూ.188.06 కోట్లు సాధించామని **జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఉపేంద్రరావు** తెలిపారు. రాజాంలోని కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. తెర్లాం, కొత్తవలస, విజయనగరం కార్యాలయాలు మిగిలిన వాటి కంటే కాస్త వెనుకబడినట్లు గుర్తించామన్నారు. మార్చి నెలాఖరు నాటికి రూ.345.11 కోట్లు సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, దళారులను ఆశ్రయించొద్దని చెప్పారు. అవగాహన లేకపోతే తమ కార్యాలయంలో సహాయం అందించేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టాంపు వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ వేణు ఉన్నారు.

ఉన్నత విద్యకు పదో తరగతి తొలిమెట్టు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు పదో తరగతి తొలిమెట్టని జిల్లా డీఈవో మాణిక్యంనాయుడు అన్నారు. ఎల్.కోట ఉన్నత పాఠశాలలో పదో తరగతికి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గురువారం పరిశీలించారు. సొంత ఆలోచనలతో ముందుకు సాగితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. లక్ష్యాలు నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

కేంద్రాలు ప్రారంభించకుండా... ధాన్యం ఎక్కడివి!

సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్

నిర్వాహకులను ప్రశ్నిస్తున్న సబ్‌కలెక్టర్

పాలకొండ, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండానే మిల్లుల్లో ధాన్యం బస్తాలు ఎలా వచ్చాయంటూ సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్ మిల్లు నిర్వాహకులను ప్రశ్నించారు. గురువారం మండలంలోని సింగన్నవలస వద్ద ఉన్న మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ధాన్యం బస్తాలు ఎలా వచ్చాయంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. వాతావరణ పరిస్థితులు బాగోలేనందున రైతులే బస్తాలను ఉంచినట్లు వారు చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. గొట్టమంగళాపురంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేపై ఆరా తీశారు. పాలకొండలో నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు.

విద్యుత్తు లేదని భవనాన్ని వదిలేశారు?

పాచిపెంట మండలంలోని కొటికిపెంట నిర్వాసిత కాలనీలో గత ప్రభుత్వ హయాంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనమిది. స్థానికులకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా సిద్ధం చేశారు. పనులు పూర్తయినా విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ఇలా వదిలేశారు. దీంతో చుట్టూ పెద్దఎత్తున మొక్కలు పెరిగాయి. లోపలికి వెళ్లేందుకు సైతం వీలు లేకుండా పోతోంది. రాత్రి వేళల్లో మందుబాబులు, గంజాయి తాగేవారు తిష్ఠ వేస్తున్నారు. ఆకతాయిలు ఇప్పటికే కిటికీ అద్దాలు, తలుపులను పగలగొట్టారు. దీనిపై పీఆర్ జేఈ ఫరూక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి కనెక్షన్ ఇప్పిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

నిరుపయోగంగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ఆకతాయిల కారణంగా దెబ్బతిన్న కిటికీల అద్దాలు

చూచిరాతల నిరోధానికి ప్రత్యేక కమిటీ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) దూరవిద్య పరీక్షల్లో చూచిరాతలపై ప్రత్యేక కమిటీ వేస్తున్నట్లు దూరవిద్య కేంద్రం ఏయూ రెక్టార్ పులిపాటి కింగ్, సంచాలకుడు డి.అప్పలనాయుడు చెప్పారు. కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. కమిటీ నివేదిక ఆధారంగా పరీక్షలు కొనసాగించాలా? లేదా అన్నది నిర్ణయిస్తామన్నారు. ఇటీవల ఈ కేంద్రంలో జరిగిన డిగ్రీ, పీజీ పరీక్షల్లో ఏడుగుర్ని తనిఖీ బృందం పట్టుకున్న విషయం తెలిసిందే.

ఇండియన్ బ్యాంక్ | విజయనగరం శాఖ
డి.నెం.8-1-93/94, శ్రీ కన్యకాపరమేశ్వరి గుడి దగ్గర,
ఎమ్.జి. రోడ్డు, విజయనగరం - 535001, ఆంధ్రప్రదేశ్. ఫోన్. 08922-276999

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు)

టు : ఋణగ్రహీత /తనఖాదారు(లు): 1. మెస్సర్స్ శ్రీ లక్ష్మి స్వరూప్ కిరాణా మరియు జనరల్ స్టోర్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి కట్టమూరి లక్ష్మి, డి.నెం. 8-2-36, రామ్‌నాయుడు రోడ్డు, పి.డబ్ల్యు.రోడ్డు, విజయనగరం, ఆంధ్రప్రదేశ్ - 535001. 2. శ్రీ కట్టమూరి రమేష్ (హామీదారు/తనఖాదారు), తండ్రి : సత్యనారాయణ, డి.నెం.14-4-35, ఫ్లాట్ నెం.జి3, రత్న అసోసియేట్స్ అపార్ట్‌మెంట్, పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురుగా, కొలగట్ల వీధి, విజయనగరం, ఆంధ్రప్రదేశ్ - 535002. 3. శ్రీ కట్టమూరి జె స్వరూప్, తండ్రి : శ్రీ కట్టమూరి రమేష్, డి.నెం.14-4-35, ఫ్లాట్ నెం.జి3, రత్న అసోసియేట్స్ అపార్ట్‌మెంట్, పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురుగా, కొలగట్ల వీధి, విజయనగరం, ఆంధ్రప్రదేశ్ - 535002.
డియర్ సర్ / మేడమ్
విషయం : మీ (మెస్సర్స్ శ్రీ లక్ష్మి స్వరూప్ కిరాణా మరియు జనరల్ స్టోర్స్) యొక్క 1- OCC-TRADE FINANCE-MSE-REPO A/c No. 6609030044, 2- FITL-NEW - REPO-7000567445 & 3- MSME_GECLS 1.0_EXTN-REPO-7136192459 ఇండియన్ బ్యాంక్, ఎమ్‌జి రోడ్డు బ్రాంచ్, విజయనగరం - గురించి.

వ. నెం.	సౌకర్యం యొక్క స్వభావం	అక్కౌంట్ నెం	పరిమితి (రూ.లక్షలలో)	తేది:18-11-2025 నాటికి బకాయి
1	OCC-TRADE FINANCE-MSE-REPO	6609030044	రూ.35,00,000/-	రూ.39,99,659/-
2	FITL-NEW-REPO	7000567445	రూ.5,10,000/-	
3	MSME GECLS 1.0 EXTN REPO	7136192459	రూ.6,00,000/-	

మీరు చెల్లించవలసిన బకాయి తేది:18-11-2025 నాటికి రూ.39,99,659/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు సదరు సొమ్ము పై తేది:19-11-2025 నుండి ఒప్పందం చేసుకొనిన రేటు ప్రకారం తదుపరి జమకూడు వడ్డీతో సహా చెల్లించుటలో విఫలమైనారు.

ఇందుమూలంగా తేది:19-11-2025 నోటీసు ద్వారా చెల్లించవలసిన బకాయి మొత్తం తేది:18-11-2025 నాటికి రూ.39,99,659/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) చెల్లించవలెనని ఈ నోటీసు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీకు పంపినసూ మాకు తిరిగి వచ్చినది. తేది:19.11.2025 నుండి అంగీకరించబడిన వడ్డీ మరియు ఇతర ఖర్చులు నోటీసు తేదీ నుండి 60 రోజులలో తేది.18.11.2025 నాటికి చెల్లించవలసిన రూ.39,99,659/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) బకాయి చెల్లించుటలో విఫలమైన యెడల బ్యాంక్ వారు ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ప్రకారం తమ అధికారములను ఉపయోగించి క్రింద ఇవ్వబడిన షెడ్యూలులలోని వివరముల ప్రకారం స్వాధీనం చేసుకొను అధికారం కల్గియున్నారు.

సదరు చట్టంలో సెక్షన్ 13(8) ప్రకారం ఋణగ్రహీతలు తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసియున్నది. ఈ నోటీసు బ్యాంకు వారికి ప్రస్తుతము అమలులో వున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగం వాటిల్లకుండా జారీచేయడమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు

తనఖా ఆస్తులు : విజయనగరం జిల్లా, విజయనగరం సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, విజయనగరం మున్సిపాలిటీ, కొత్తపేట దక్షిణం వార్డు లోని గౌడు వీధి రోడ్డు పడమర భాగంలో, డోర్ నెం.11-8-12, టి.ఎస్.నెం.451 లోని అసెస్మెంట్ నెం.1093032056, ఎస్.సి. నెం.44066, క్రింది అంతస్తు మరియు మొదటి అంతస్తులతో కూడిన ఆర్‌సిసి స్లాబ్డ్ ఇంటి యావత్తు ఆస్తి. మొత్తం విస్తీర్ణం : 241.66 చ॥గ॥లు (202.02 చ॥మీ॥లు), క్రింది అంతస్తు ప్లింత్ ఏరియా : 1950 చ॥అ॥లు, మొదటి అంతస్తు ప్లింత్ ఏరియా : 1950 చ॥అ॥లు., మొత్తం ఇంటి ప్లింత్ : 3900 చ॥అ॥లు., హద్దులు : తూర్పు : మున్సిపల్ రోడ్డు, దక్షిణం : మదిల వెంకటరావు గారి ఆస్తి, పడమర : రాజీవ్ స్టేడియం, ఉత్తరం : కె. రమేష్ కుమార్ మరియు ఇతరుల సగ భాగం యొక్క ఆస్తి.

గమనిక : SARFAESI చట్టం, 2002 నిబంధనల ప్రకారం మీకు జారీ చేయబడిన మా మునుపటి నోటీసులన్నింటినీ మరియు ఆ తర్వాత తీసుకున్న చర్యలను, ఆ చట్టంలోని సంబంధిత నిబంధనలు మరియు దాని క్రింద రూపొందించబడిన నియమాల ప్రకారం అందుబాటులో ఉన్న మా హక్కులు మరియు పరిష్కారాలకు భంగం కలిగించకుండా మేము ఇందుమూలముగా రద్దు చేస్తున్నాము మరియు / లేదా ఉపసంహరించుకుంటున్నాము.

తేది : 19-11-2025
ప్రదేశం : విజయనగరం

సం/- అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్

కంట్లో కారం కొట్టి పుస్తెలతాడు చోరీ

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం మండలంలోని తూడి- పాలమెట్ట గ్రామాల మధ్య పొలం నుంచి వస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తి గురువారం అపహరించాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మహిళ నడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చి కంట్లో కారం కొట్టి ఆభరణాన్ని తెంచుకుపోయాడు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చీపురుపల్లిలో బంగారు గొలుసు అపహరణ..

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణంలోని కొత్తాగ్రహారం శివాలయం దారిలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. స్థానికంగా నివాసం ఉండే మహంతి అనూష తన ఇద్దరి పిల్లలను తీసుకుని బుధవారం రాత్రి సమీపంలోని శివాలయానికి వెళ్లారు. తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్తుండగా.. కుమారుడు గేటు బయట ఉండిపోయాడు. తీసుకెళ్లడానికి వెనుకకు వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుపోయారు. గొలుసును బలవంతంగా లాగేయడంతో మెడ వద్ద గాయమైంది. కేసు నమోదు చేసి, దర్యాప్తునకు మూడు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్సై దామోదరరావు తెలిపారు.

గంజాయి కేసులో అయిదుగురికి జైలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన గంజాయి కేసులో అయిదుగురు నిందితులకు 18 నెలల చొప్పున జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.మీనాదేవి గురువారం తీర్పునిచ్చారని ఎస్పీ దామోదర్ తెలిపారు. నగరానికి చెందిన బి.వెంకటేశ్వరరావు, ఎం.శాంతి, జి.మస్తానీ, బాబూ సింగ్, ఎ.ప్రసాద్‌రావు పాత రైల్వే క్వార్టర్స్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారని సమాచారం రావడంతో తమ సిబ్బంది దాడి చేసి, పట్టుకున్నారన్నారు. తనిఖీల్లో భాగంగా వారి నుంచి 8 కిలోల గంజాయి పట్టుబడిందని, ఈ మేరకు అప్పటి ఎస్సై ఎ.నరేష్ కేసు నమోదు చేయగా, సీఐ బి.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేపట్టి రిమాండుకు తరలించారన్నారు. దీంతో కోర్టులో నేరారోపణ రుజువైందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జగదీష్ (పాతచిత్రం)

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన పూసపాటిరేగ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నడిపల్లికి చెందిన పులపా జగదీష్(28) నాతవలస టోల్‌గేట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసేవారు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పాత కొప్పెర్ల వద్ద అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ఈక్రమంలో నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రులు ఉన్నారు. కుమారుడి మృతితో బోరుమంటున్నారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. జగదీష్ తండ్రి శ్రీనివాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

వసతిగృహంలో విద్యార్థుల ఘర్షణ

ఇద్దరికి తీవ్ర గాయాలు

గాయాలతో కమిలి పోయిన విద్యార్థి వీపు

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలంలోని పెదఖేర్జల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్వగ్రామాలైన పూడేసు, కోనకు గురువారం వెళ్లిన బాధిత బాలలు తల్లిదండ్రులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆరో తరగతి చదువుతున్న వరుణ్‌తో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థి తాడంగి ఆరెంజ్ శరీరంపై తట్లు తేరాయి. ఒక వస్తువు విషయంలో విద్యార్థుల మధ్య గొడవ జరగడంతో బుధవారం రాత్రి ఆరుగురు కలిసి వీరిద్దరిపై దాడిచేసినట్లు తెలుస్తోంది. ఏటీడబ్ల్యూవో రజని వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా.. ఘటనపై ఆరా తీస్తున్నామన్నారు. వాస్తవ పరిస్థితి తెలుసుకుని తదుపరి విషయాలను వెల్లడిస్తామని చెప్పారు.

నలుగురిపై అట్రాసిటీ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఓ గృహిణిని ఇబ్బందులకు గురి చేసినందుకు గానూ నలుగురిపై పోలీసులు అట్రాసిటీ, వేధింపుల కేసు నమోదు చేశారు. సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తవలసలోని రాంజీనగర్ ప్రాంతానికి చెందిన కొట్యాడ జ్ఞానేశ్వరి విజయనగరంలోని పూల్‌బాగ్ కాలనీకి చెందిన కేశవరాము ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం కావడంతో భర్త, అత్తమామలు, ఆడపడుచు తరచూ అవమానిస్తూ, వరకట్నం కోసం వేధిస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ అట్రాసిటీ, వరకట్న వేధింపుల నేరాల కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఉద్యోగి మృత్యువాత?

మోహనరావు (పాతచిత్రం)

పాచిపెంట, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ఓ ఉద్యోగి సాగునీటి బట్టిలో పడి దుర్మరణం పాలైన ఘటన పాచిపెంట మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకట సురేశ్ అందించిన వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం గురివినాయుడుపేట పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంటుగా ఎస్.మోహనరావు(50) పనిచేస్తున్నారు. రామభద్రపురంలో నివాసముంటూ విధులకు హాజరవుతున్నారు. బుధవారం కార్యాలయానికి వచ్చి, సాయంత్రం తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తూ పాంచాలి గ్రామం సమీపంలోని సాగునీటి బట్టిలో పడి మృతి చెందారు. గ్రామస్థుల సమాచారంతో గురువారం ఉదయం ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

EENADU e Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

233 చ॥గ॥లు, N/F స్థలం అమ్మకం. ఆకాశపు ఎంక్లేవ్ ప్లాట్ నెం.11, Sitam కాలేజ్ Opp. గాజులరేగా VZM. 9949478595, 9440501951

KVR Estates శక్తిధార్ ఫేజ్-1లో రోడ్డు పోటు ప్లాట్ పర్ సేల్ 238 గజాలు గవర్నమెంటు రేటు గజం 8000కే అమ్మకం ✆ 9493707594.

విజయనగరం దగ్గరలో (చెల్లూరు-రాయపూర్) హైవే ఫేసింగ్ VMRDAవెంచర్‌లో రెడీగా ఇల్లు కట్టుకొనుటకు గజం 15వేలు & 167, 183, 200, 300 గజాలు కలవు. ✆9391276529

JOBS

మహీంద్రా ట్రాక్టర్ వారి అనకాపల్లి, తగరపువలస బ్రాంచ్‌లలో పనిచేయుటకు మెకానిక్స్, హెల్పర్ (ఐటిఐ, టెన్త్ క్వాలిఫికేషన్ మరియు ఎక్స్‌పీరియన్స్), సూపర్‌వైజర్, స్పేర్ పార్ట్స్ సేల్స్ మెన్ (డిగ్రీ/ DAE/ DMEతో పాటు ఆటోమొబైల్ రంగంలో అనుభవం గలవారు) కావలెను. సంప్రదించండి: శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్, అనకాపల్లి, సెల్: 80085 77055, 80085 77078.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో గురువారం కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో) ★ టమాటా: 70 ★ వంకాయలు: 60 ★ దొండ: 38 ★ బీర: 56 ★ బెండ: 56 ★ కాకర: 52 ★ చిక్కుడు: 56 ★ ఆనపకాయ (ఒకటి): 30 ★ అరటి (ఐదు): 20 ★ మునగ: 70 ★ ఉల్లి: 30 ★ బంగాళదుంపలు: 30 ★ అల్లం: 75 ★ వెల్లుల్లి: 75 ★ పచ్చిమిర్చి: 50 ★ క్యాబేజీ: 35 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

రాజాం ★ ఎస్‌వీసీ సీతారామ: ఆంధ్రా కింగ్ తాలూకా ★ ఎస్‌వీసీ సీతారామ మినీ: రాజు వెడ్స్ రాంబాయి ★ ఎస్‌వీసీ అప్సర: రివాల్వర్ రీటా – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో.. ★ లక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలూకా ★ వాసవి: రాజు వెడ్స్ రాంబాయి ★ టీటీఆర్: రివాల్వర్ రీటా – న్యూస్‌టుడే, బొబ్బిలి

సుబ్రహ్మణ్యస్వామి దివ్య కల్యాణం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని బైపాస్ రహదారిలో ఉన్న దాటితల్లి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి గురువారం దివ్యకల్యాణం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు హాజరై కల్యాణ క్రతువు తిలకించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? జయతి గ్రామంలో సేకరించిన చెత్తను ఇష్టానుసారం మార్గంలో ఉన్న కోనేటిగెడ్డ వద్ద వేస్తున్నారు. నీరు కలుషితమవుతోంది. - అప్పలనాయుడు ★ వేరొక చోట వేసేలా చూస్తాం. - విమలకుమారి, పంచాయతీ విస్తరణాధికారిణి – న్యూస్‌టుడే, మెంటాడ

? రామభద్రపురం- బూసాయవలస రహదారిపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య వస్తోంది. - ప్రయాణికులు ★ పరిశీలించి, సమస్య పరిష్కరిస్తాం. - ప్రసాదరావు, ఎస్సై – న్యూస్‌టుడే, రామభద్రపురం

? రామవరం మీదుగా అయ్యన్నపేట వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. - స్థానికులు ★ మరమ్మతులకు ప్రతిపాదనలు చేశాం. - కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ – గంట్యాడ గ్రామీణం

వీధుల్లో పరిశుభ్రత పనులు

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారం, వంగపల్లిపేట, కొత్తగవిడివీధి, విజయకాలనీ, బెల్లానవీధి ప్రాంతాల్లో వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 27న 'పట్టణం.. సమస్యల సుడిగుండం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించి, ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

రేషన్ సరుకుల మాయంపై తనిఖీ

రాజాం: పట్టణంలోని బొబ్బిలి రహదారిలో ఉన్న పౌరసరఫరాల సంస్థ గోదాములో సరుకుల మాయంపై గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ టెక్నికల్, అకౌంట్స్ సహాయ ప్రబంధకులు శ్రీరామ్, వెంకటరమణ గోదామును పరిశీలించారు. అవుట్‌లు, పంపిణీ తదితర అంశాలను క్రోడీకరించి పరిశీలించాల్సి ఉందన్నారు.

వినియోగంలోకి మరుగుదొడ్లు

గంట్యాడ, గ్రామీణం: నరవ గ్రామంలో సామూహిక మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. దీనిపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. తాగునీటి పైపు ఏర్పాటు చేసి, వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రజల అవస్థలు తీరాయి.

విద్యార్థులకు అవగాహన అవసరం

మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

గరివిడి, న్యూస్‌టుడే: విద్యార్థులకు బాలల హక్కులు, లైంగిక నేరాలపై అవగాహన ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు అన్నారు. గురువారం గరివిడి మండలం శివరాం ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కుల గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ గురించి చెప్పారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. సీఐ శంకరరావు, ఎస్సై లోకేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణ, గ్రామస్థులు కె.శ్రీనివాసరావు, జి.దాలినాయుడు పాల్గొన్నారు. ● మెరకముడిదాం (గరివిడి): మెరకముడిదాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఎస్సై లోకేష్ కుమార్ అవగాహన కల్పించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధన కృషి చేయాలన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం.. రాజాం: గోపాలపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.తిరుపతిరావు తెలిపారు. చీపురుపల్లి, బొబ్బిలి రహదారుల్లోని ప్రాంతాలు, వస్త్రపురికాలనీ, కంచరాం, ఆగూరు, డోలపేట, అమరాం, గడిమిడిదాం, రామినాయుడువలస గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

అభివృద్ధి కరవు.. సమస్యల ఏకరవు

న్యూస్‌టుడే– చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీలో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణం గరివిడి వరకు విస్తరించింది. చీపురుపల్లి కేంద్రంగా రెవెన్యూ, డీఎస్పీ, డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. పలు విద్యా సంస్థలు ఉన్నాయి. కానీ అభివృద్ధి నోచుకోవడంలేదు. 2009లో తెదేపా ప్రభుత్వం చీపురుపల్లిని నగర పంచాయతీగా ఉన్నతీకరించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్లీ మేజర్ పంచాయతీగా చేశారు. 22 ఏళ్లు గడిచినా.. అభివృద్ధికి బాటలు పడడంలేదు. ప్రధానంగా రహదారులు విస్తరణకు నోచుకోవడంలేదు. ప్రజల సౌకర్యార్థం ఉద్యానాలు లేవు.

ఉద్యానం లేదు..

ఏళ్లు గడుస్తున్నా ఉద్యానాల నిర్మాణం జరగడంలేదు. మేజర్ పంచాయతీకి ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్నా పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంలేదు. రావివలస రోడ్డుకు ఆనుకుని తోటపల్లి కాలువ సమీపంలో ఖాళీగా ఉన్న స్థలంలో పార్కు నిర్మించి, నడక ట్రాక్ సదుపాయం కల్పించాలని ప్రజలు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సి ఉంది.

పార్కు నిర్మాణానికి అనుకూలంగా తోటపల్లి కాలువ పరిసరాలు

రహదారుల విస్తరణ ఎప్పటికో..

చీపురుపల్లి, గరివిడి పట్టణాలు భౌగోళికంగా దాదాపు కలిసిపోయాయి. రెండు ప్రధాన రహదారులను విస్తరించాలన్న ప్రతిపాదనలు ఏళ్లు గడుస్తున్నా కాగితాలకే పరిమితమయ్యాయి. అభివృద్ధి చేస్తే చీపురుపల్లి రూపురేఖలు మారిపోతాయి. ఇరుకు రోడ్లతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. విజయనగరం, విశాఖపట్నం, రాజాం, పాలకొండ, ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు సాగించే విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లి- గరివిడి మధ్య రోడ్డు ఇరుకుగా ఉంది.

జాతర సమయంలో ఇక్కట్లు..

చీపురుపల్లిలో శ్రీకనకం ప్రధాన రహదారిలో గరి బంటా నుంచి పుర్రేయవలస కూడలి వరకు రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు. ఏటా మూడు రోజులపాటు జరిగే అమ్మవారి జాతరకు నాలుగు లక్షలకు పైగా భక్తులు వస్తుంటారు. డివైడర్ నిర్మించి, సెంటర్ లైటింగ్ ఏర్పాటుచేస్తే జాతర సమయంలో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి.

ప్రతిపాదనలు పంపాం..

రహదారుల విస్తరణకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, ఉన్నతాధికారులు ఆదేశిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈఈ కె.మురళీ బాబు తెలిపారు. పార్కు నిర్మాణానికి గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతిపాదనలు పంపినట్లు ఈవో వై.యూనీరాణి పేర్కొన్నారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి నుంచి గర్భాం వైపు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం ఉదయం రంగరాయపురం వద్ద పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ సాయికృష్ణ తెలిపారు. పిరిడి గ్రామానికి చెందిన రాపాక శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని సమీపంలోని డిపోకు, వ్యాన్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించామన్నారు. బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు చేసి, మెరకముడిదాం మండలం గర్భాం తరలిస్తున్నట్లుగా నిందితుడు చెప్పారన్నారు. పూర్తి దర్యాప్తు నిర్వహించి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రసంగంలో ప్రతిభ

గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ప్రతిభా పాటవ పోటీలు' జరిగాయి. 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్.అరవింద్ (10వ తరగతి), పి.వేణు (7వ తరగతి), పి.ఇలక్కియ (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

ఉత్సాహంగా ఉపన్యాసం

బొబ్బిలి పట్టణంలోని సింహాలతోట కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ప్రతిభా పాటవ పోటీలు' జరిగాయి. 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చారు. టి.శ్యామల (9వ తరగతి), టి.నాగశివనందిని (8వ తరగతి), ఎం.దీపిక (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రత్యేకాధికారి పి.సన్యాసిరావు, సిబ్బంది కె.శైలజ, జి.గీతాభవాని విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

వసతులు లేక.. ఇబ్బందులు తీరక

రాజాం పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో మౌలిక వసతులు లేక రైతులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని 2014లో రూ.8 లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం ఫ్లోరింగ్, స్లాబు, కిటికీలు, తలుపులు శిథిలావస్థకు చేరాయి. మందులు, పరికరాలు భద్రపరుచుకోవటానికి అవసరమైన గదులు లేవు. వర్షం వస్తే పరిసరాలన్నీ తడిసిపోతున్నాయి. ఆవరణ బురదమయమవుతోంది. విషయం ఏడీ జయప్రకాశ్ వద్ద ప్రస్తావించగా.. రూ.80 లక్షలతో కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం

ప్రధాన రహదారిపై అంధకారం

గజపతినగరం మండల కేంద్రంలో చంపావతి నది వంతెన నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు జాతీయ రహదారిపై సెంటర్ దీపాలు వెలగడంలేదు. చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గజపతినగరం, పురిటిపెంట పంచాయతీలు వీటి నిర్వహణ బాధ్యత చూస్తున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉపకేంద్రం వరకు సమస్య మరింత తీవ్రంగా ఉంది. విషయం విద్యుత్తుశాఖ ఏఈ కృష్ణ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

మూలకు చేరిన శుద్ధజల యంత్రం

వంగర మండలం ఎం.సీతారాంపురం ఉన్నత పాఠశాలలో శుద్ధ జల యంత్రం అలంకారప్రాయంగా మారింది. రెండేళ్లుగా మరమ్మతులకు గురై మూలకు చేరినా.. అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి సీసాలతో తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇక్కడ 249 మంది చదువుతున్నారు. పాఠశాల ఆవరణలోని బోర్లు కూడా పనిచేయడంలేదు. సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని, చర్యలు చేపడతామని తెలిపారని హెచ్‌ఎం కె.కోటీశ్వరరావు అన్నారు. – న్యూస్‌టుడే, వంగర

2 గదులు.. 5 తరగతులు

రామభద్రపురం మండలం ఎనుబోరువు గిరిజన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సరిపడా గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరండాల్లో చదువులు సాగించాల్సిన దుస్థితి. ఇక్కడ ఐదు తరగతుల్లో 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేవలం రెండు గదులు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదనపు భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. విషయం ఎంఈవో తిరుమల ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. అదనపు భవనాల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

కుప్పలు.. చోదకులకు తిప్పలు

సంతకవిటి మండలం కొండగూడెం నుంచి శ్రీహరినాయుడుపేట వెళ్లే రహదారిలో కుప్పనూర్పుల వద్ద పలుచోట్ల వరికుప్పలు రోడ్డు పక్కనే ఉండటంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయం ఎంపీడీవో సురేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. రైతులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

చదరంగంతో ఆలోచనాశక్తి మెరుగు

విజేతలను అభినందిస్తున్న అధికారులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో విజయనగరానికి చెందిన శ్రీచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్‌స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. గురువారం విజేతలకు తహసీల్దారు డి.ధర్మరాజు, ఎస్సై ఎల్.దామోదరరావు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అండర్-8, 12, 16 విభాగాల్లో మొదటి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. చదరంగంతో ఆలోచన విధానంలో మార్పు వస్తుందని అధికారులు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఏడీఎన్ఎస్‌వీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అవస్థలు తీరేలా..!

విద్యుత్తు స్టవ్‌లు అందించేందుకు చర్యలు

న్యూస్‌టుడే– సంతకవిటి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇప్పటికే ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నారు. బొమ్మలతో ఆకట్టుకునేలా పుస్తకాలను అందించారు. కొన్నిచోట్ల గ్యాస్, కర్రల పొయ్యిలతో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కొత్తగా విద్యుత్తు స్టవ్‌లను అందించేందుకు చర్యలు ప్రారంభించారు. సంతకవిటి, రేగిడి, వంగర, రాజాం మండలాల్లోని 339 కేంద్రాలకు రూ.10.17 లక్షలతో ఇండెంట్‌ను పంపించారు.

నివేదికలు పంపించాం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు ఒక్కొక్కరికీ రోజూ 75 గ్రాముల రైస్, 15 గ్రాముల పప్పు, గుడ్డు, 100 గ్రాముల పాలు అందించాలి. ప్రభుత్వం ఒక్కొక్క కేంద్రానికి రెండేసి గ్యాస్ సిలిండర్‌లు అందించింది. కొన్ని సందర్భాల్లో సమయానికి గ్యాస్ సరఫరాకాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటువంటి సమస్యలు తీర్చేందుకు విద్యుత్తు స్టవ్‌లు ఉపయోగపడతాయి. ప్రభుత్వం ఆదేశాలతో నివేదికలు తయారు చేసి పంపించామని **రాజాం ఐసీడీఎస్ సీడీపీవో టి.కనకదుర్గ** తెలిపారు.

మండలం	కేంద్రాలు	చిన్నారులు
సంతకవిటి	89	1,701
రాజాం	96	1,836
రేగిడి	85	1,625
వంగర	69	1,321

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: గుర్ల మండలం గరికివలస ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి 30 వరకు అనకాపల్లిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పీడీ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులు కేసలి పావని, సమానం లక్ష్మి, బర్నాల నీలవేణిని హెచ్‌ఎం శ్రీదేవి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తదితరులు అభినందించారు.

వసతులు కల్పించండి సారూ..!

గంట్యాడ మండలం మదనాపురం, నీలావతి, నందాం గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా వసతుల లేక అక్కడ నివసించడంలేదు. పరిసరాల్లో తుప్పలు పెరిగి, విషసర్పాలు సంచరిస్తున్నాయి. విషయం గంట్యాడ గృహనిర్మాణశాఖ ఏఈ రాజ్‌గోపాల్, పీఆర్ ఏఈ కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా.. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

విద్యార్థికి అభినందన

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: కె.కొత్తవలసలోని జ్యోతి బాపులే బాలుర వసతి గృహం పదోతరగతి విద్యార్థి జమ్ము పవన్‌కుమార్ ఇటీవల అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్నారు. పలు సమస్యలపై చక్కగా మాట్లాడడంతో అసెంబ్లీ వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు. తోటి విద్యార్థులు, ప్రిన్సిపల్ సీతారాం, ఉపాధ్యాయులు గురువారం అభినందనలు తెలిపారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం పక్కిలో గురువారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఉద్యానాధికారి వెంకటరత్నం ఆధ్వర్యంలో పంటలో సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు హాజరై రైతులకు అవగాహన కల్పించారు. మామిడి తోటల్లో పూత, పిందె సమయంలో సస్యరక్షణ చర్యలు అవసరమన్నారు. అంతర పంటగా అనాస, పెసర, మినుములు వేసుకోవాలన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

ర్యాలీలో స్థానికులు, చిన్నారులు

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం మండలం బొమ్మినాయుడువలస, గారా చీపురుపల్లి గ్రామాల్లో బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ సహకారంతో గ్రామాల్లో కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎన్‌జీవో ప్రతినిధి పద్మ తెలిపారు.

29న ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 29న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల సమన్వయకర్త గాడి సత్యవతి తెలిపారు. ఎంఈవోలు మోహనరావు, వర్మరాజు ఆధ్వర్యంలో మెంటాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరగనున్నట్లు ఆమె చెప్పారు. ఉపాధ్యాయినులకు త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు ఉంటాయని, ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని తెలిపారు.

నమ్మండి.. ఇది ఏఎంసీ గోదాము

రేగిడి మండలం ఉంగరాడ మెట్టలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగి నిరుపయోగంగా ఉంది. దీన్ని వినియోగించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది. ఇలాగే వదిలేస్తే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటుంది. ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. – న్యూస్‌టుడే, రేగిడి

రబీ పంటలపై అవగాహన.. దత్తిరాజేరు: దాసరిపేట, దత్తి, టి.బూర్జవలస గ్రామాల్లోని రైతులకు ఏడీఏ జ్యోతి గురువారం రబీ పంటలపై అవగాహన కల్పించారు. ఎక్కువగా రాగులు పండించాలని సూచించారు. ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలన్నారు. ఏవో అనూరాధ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గంట్యాడ గ్రామీణం: గంట్యాడ నుంచి ఎస్‌కోట వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం వసాది గ్రామ కూడలిలో ఢీకొంది. ఆటోలో ఉన్న నీలావతి గ్రామానికి చెందిన కె.మంగమ్మ రోడ్డుపై పడడంతో కాలుకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సమాచారం రావాల్సి ఉందని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

34 మంది బైండోవర్

రాజాం గ్రామీణం: సంతకవిటి మండల పరిధిలోని గ్రామాల్లో గతంలో గొలుసు దుకాణాలు నిర్వహిస్తూ దొరికిన 22 మందిని బైండోవర్ చేసినట్లు రాజాం అబ్కారీ సీఐ జైభీమ్ తెలిపారు. గురువారం తహసీల్దారు సుదర్శనరావు ముందు హాజరుపర్చామన్నారు. ఒక్కొక్కరికీ రూ.లక్ష అపరాధ రుసుము, వ్యక్తిగత పూచీకత్తుపై ఏడాదికి బైండోవర్ చేశామన్నారు. ★ గజపతినగరం: మండలంలోని 12 మంది గొలుసు దుకాణదారులను తహసీల్దారు బి.రత్నకుమార్ ఎదుట హాజరుపర్చారు. రూ.2 లక్షలు పూచీకత్తు తీసుకున్నారు.

ఆమె నేత్రాలు సజీవం

గుర్ల: కెల్ల సొసైటీ ఛైర్మన్ విమలారాణి తల్లి కె.సరోజిని గురువారం (70) మృతిచెందారు. నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకురావడంతో చీపురుపల్లి డివిజన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బి.వి.గోవిందరాజులు, సభ్యుడు దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో కార్నియాలు సేకరించారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడి మృతికి నివాళి

తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్సుపల్లి అప్పలస్వామి (87) గురువారం ఉదయం స్వగృహంలో మృతి చెందారు. ఈయన 15 ఏళ్లు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పనిచేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన అప్పలస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు నివాళులర్పించారు.

సెలూన్ దుకాణం దగ్ధం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని కేర్ ఆసుపత్రి రహదారిలో డోలపేటకు చెందిన పి.తవుడు సెలూన్ దుకాణం గురువారం దగ్ధమైంది. రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. చెత్తకు పెట్టిన నిప్పు వ్యాపించి, ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపకాధికారి అశోక్ తెలిపారు. రూ.20 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు చెప్పారు.

అనుమతులు రాక.. నిర్మాణాలు పూర్తికాక

రేగిడి మండలం తునివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం అసంపూర్తిగా ఉంది. గత ప్రభుత్వం హయాంలో పనులు ప్రారంభించారు. సకాలంలో బిల్లులు విడుదలచేయక మధ్యలోనే ఆపేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త భవనానికి స్లాబు కూడా పూర్తయింది. ఫ్లోరింగ్ వేసి, కిటికీలు అమర్చి, సున్నాలు వేస్తే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విషయాన్ని ఎంఈవో వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పూర్తి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రేగిడి

అధికారులు సమావేశాలకు హాజరవ్వాలి

మాట్లాడుతున్న నాయకులు

బొండపల్లి, న్యూస్‌టుడే: మండల సర్వ సభ్య సమావేశానికి అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీపీ చల్లా చల్లంనాయుడు అన్నారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి తహసీల్దారు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పక్షపాతం చూపకుండా విధిగా పాల్గొనాలన్నారు. రెవెన్యూ అధికారులు మ్యుటేషన్లు అకారణంగా తిరస్కరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు, సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మద్దతు

గరివిడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని నాయకులు సూచించారు. గురువారం గరివిడి మండలం వెదుళ్లవలసలో కొనుగోలు కేంద్రాన్ని నాయకులు ఎం.సూర్యనారాయణ, ఎన్.రామునాయుడు ప్రారంభించారు. ★ **చీపురుపల్లి గ్రామీణం, రామభద్రపురం, గంట్యాడ గ్రామీణం:** రామలింగాపురం పీఏసీఎస్‌లో ఏఎంసీ ఛైర్మన్ ఆర్.రామారావు, ఆరికతోటలో పీఏసీఎస్ ఛైర్మన్ ప్రసాదరావు, లక్కిడాంలో మండలాధ్యక్షుడు కె.భాస్కరరావు కేంద్రాలను ప్రారంభించారు. ★ **బాడంగి:** బాడంగి మండలం పినపెంకిలో రైస్ మిల్లును తహసీల్దారు వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు జరపాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలో జాతీయ రహదారిపై పరిమితికి మించిన వేగంతో నడుపుతున్న వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేసి, కేసులు నమోదు చేశారు. ★ **తెర్లాం:** ఏఎస్సై భాస్కరరావు తెర్లాం అడ్డు రోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. మైనర్లు, మద్యం తాగిన వారు ద్విచక్రవాహనాలు నడపకూడదని సూచించారు.

శిథిల భవనం.. ప్రమాదకరం

గంట్యాడ మండలం బుడతనాపల్లిలో గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. కూలేందుకు సిద్ధంగా ఉంది. గతంలో ఎంతో మందికి విజ్ఞానాన్ని అందించేది. ప్రస్తుతం మూతపడింది. విద్యార్థులు ఈ ప్రాంతంలో ఆటలు ఆడుతుంటారు. ఎప్పుడు కూలుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. తక్షణమే చర్యలు చేపడతామని ఎంపీడీవో రమణమూర్తి అన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

(c) eenadu

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల •ఎస్.కోట

అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస: మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా తిరుగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సీహెచ్.షణ్ముఖరావు సూచించారు. విశాఖపట్నంలోని దువ్వాడ, స్టీల్ ప్లాంట్ ప్రాంతాల్లో ఈ ముఠా కనిపించినట్లు సమాచారం అందిందన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

తెరపై ఈనాడు

● ఎన్సీఎస్: ఆంధ్రాకింగ్ తాలూకా ● శ్రీకృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి ● ఆదిత్య: కె.ర్యాంప్ ● లీలామహల్: రివాల్వర్ రీటా ● రంజనీ స్క్రీన్- I: ఆంధ్రా కింగ్ తాలూకా ● శివరంజనీ స్క్రీన్-2: రివాల్వర్ రీటా ● హిమగిరి: 12ఎ రైల్వే కాలనీ ● సప్తగిరి: మఫ్టీ పోలీస్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

గృహ నిర్మాణాలపై సమస్యలా..?

నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలంలోని ఇళ్ల మంజూరులో సందేహాలు, సమస్యలు ఉన్నాయా.? ఎలా దరఖాస్తు చేసుకోవాలి.. ఏయే ధ్రువపత్రాలు కావాలి తదితరాలు. గతంలో ఇళ్లు మంజూరై బిల్లుల్లో జాప్యమా? సమస్యలను గృహనిర్మాణశాఖ ఏఈ ఆర్.పవన్‌చైతన్య దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఫోన్ చేయడమే..

– న్యూస్‌టుడే, నెల్లిమర్ల

● తేదీ: 29.11.25 (శనివారం)
● సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు..
● నంబర్లు: 70939 30279, 85008 99929

తాగునీటి సమస్యతో సతమతం

కాళీఘాట్ కాలనీలో ప్రధాన కాలువ దుస్థితి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో విస్తరించిన కాళీఘాట్ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇళ్ల ముందు, వెనుక భాగాల్లో వాడుక నీరు నిలిచిపోతోంది. అపార్టుమెంట్ల వద్ద నిర్మించిన కాలువల అవుట్‌లెట్లను ప్రధాన కాలువకు కలపలేదు. దీంతో మురుగు రోడ్లపై పారుతోంది. దోమలు, పందుల బెడద ఎక్కువగా ఉంది. కొన్నిచోట్ల సీసీ దారులు నిర్మించినప్పటికీ పక్కన కాలువలేవు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ★ కాళీఘాట్ కాలనీ, క్రాంతి కాలనీలో తాగునీరు సక్రమంగా అందడం లేదు. కుళాయి నీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నట్టు మహిళలు చెబుతున్నారు. పైపులైన్లు వేసినప్పటికీ ఇంటర్ కనెక్షన్లు ఇవ్వలేదు. లేఅవుట్ పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ప్రధాన రహదారులపై పశువులు ఉంటున్నాయి. నిధుల లభ్యత మేరకు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. తాగునీటి పనులకు చర్యలు తీసుకుంటామన్నారు.

రామాయణ పఠనంతో విద్యార్థులకు ప్రయోజనం

విజయనగరం గ్రామీణం: విద్యార్థులు రామాయణం చదివితే విలువలు, క్రమశిక్షణ, నిజాయతీ, పెద్దలను గౌరవించడం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని రామనారాయణంలోని వాల్మీకి పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఆచార్య హనుమంతు లజపతిరాజ్ అన్నారు. గురువారం ఈ కేంద్రాన్ని గాజువాక ఆదర్శ పాఠశాల విద్యార్థులు సందర్శించగా.. వారికి సూచనలు చేశారు. పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

అద్దింట్లో విధులు.. పట్టించుకోరు..!

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, అయ్యన్నపేట

నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. సచివాలయాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, అద్దె గృహాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఉద్యోగులు, సిబ్బంది అరకొర సౌకర్యాల నడుమ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి.

కొత్తాగ్రహారం-2లో మేడపైన సచివాలయం

నెలలో రూ.4.64 లక్షలు..

పేదలకు సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. నగరంలోని 50 డివిజన్ల పరిధిలో 61 సచివాలయాలను ఏర్పాటు చేశారు. 53 అద్దె గృహాల్లో, ఎనిమిది సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో దానికి అద్దె రూ.10 వేలు నుంచి రూ.12 వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ ప్రకారం అక్టోబర్‌లో రూ.4.64 లక్షలు చెల్లించారు. ఈ మధ్య దాసన్నపేట మీ సేవా కేంద్రానికి 6, 12వ సచివాలయాలను తరలించారు. ఇవి డిసెంబరు నుంచి కొనసాగనున్నాయి.

ఇబ్బందులు..

సచివాలయాల పరిధిలో 332 సేవలు అందుబాటులో ఉండడంతో అన్ని వర్గాల ప్రజలు వివిధ పనుల మీద ఇక్కడికి వస్తుంటారు. సదుపాయాల్లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తాగ్రహారం, పేర్లవారి వీధి, లక్ష్మీగణపతి కాలనీ, కేఎల్‌పురంలో మేడపైన ఉండడంతో వృద్ధులు, దివ్యాంగులు మెట్లు ఎక్కేందుకు ఇక్కట్లు పడుతున్నారు. అయిదేళ్ల నుంచి అద్దె చెల్లిస్తున్నారే తప్ప, సొంత భవనాలు నిర్మించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత భవనాల కొరత...

నగరపరిధిలో 151 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఎనిమిది మాత్రమే సొంత భవనాల్లో నడుస్తున్నాయి. ఆరు పాఠశాలలు, కమ్యూనిటీ హాలులో నడుస్తున్నాయి. సరైన సౌకర్యాలు లేక ఇటు చిన్నారులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దె ఎస్‌ఎఫ్‌టీ రూ.10 చొప్పున, గరిష్ఠంగా రూ. ఆరు వేలు ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇరుకు గదులతో ఇక్కట్లు తప్పడం లేదు. ★ నగరంలోని 12 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో రెండు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అధికారుల మాట..: పట్టణ ప్రాంతంలో సొంత భవనాల ఏర్పాటుకు నిధులు మంజూరు కావడం లేదు. దీంతో అద్దె భవనాల్లో నడుపుతున్నాం. అద్దె గదుల్లో నిర్వహిస్తున్న సచివాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మారుస్తున్నాం. నగర పాలక సంస్థ చెల్లించిన అద్దె నిధులు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వానికి పంపిస్తాం.

– ప్రసన్న, సీడీపీవో, పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం

నగరంలో ప్లాస్టిక్ నిషేధం తప్పనిసరి

మాట్లాడుతున్న సహాయ కమిషనరు అప్పలరాజు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని డివిజన్లలో పరిసరాల శుభ్రత బాధ్యత వార్డు కార్యదర్శులదేనని నగర పాలక సంస్థ సహాయ కమిషనరు కె.అప్పలరాజు అన్నారు. గురువారం వెల్ఫేర్, విద్యా కార్యదర్శులతో మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధాన్ని తప్పక అమలు చేయాలని ఆదేశించారు. ★ 2002లో నమోదైన ఓటర్లను 2005 సంవత్సరంతో సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులకు కమిషనరు పి.నల్లనయ్య సూచించారు. ★ కేఎల్‌పురం గంజిపేటలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న షెడ్‌ను సిబ్బంది తొలగించారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
EP 78/2019 OS 684/2014

Between:
శ్రీమతి గోకాడ లక్ష్మి ... డిక్రీ హోల్డర్
And
శ్రీమతి రాజాన రాజేశ్వరి ... జడ్జిమెంట్ డెటార్

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటిషన్‌లో మొత్తం సొమ్మును యిందలి JDR వద్ద నుండి రాబట్టు నిమిత్తం [illegible]

DHR విలువ: రూ. 75,000/-లు Amin విలువ: రూ. 5,00,000/-లు
మార్కెట్ విలువ: రూ. 12,64,770/-లు JDR విలువ: నిల్లలేదు

శ్రీ బెల్లాన రవి, Advocate, Ex. గవర్నమెంట్ ప్లీడర్, Ex. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్
ఫ్లాట్ నెం. 5, కృష్ణాలయం, 100 Ft. రింగురోడ్, విజయనగరం, సెల్: 9440522779

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ
[illegible]

టెండర్ - కమ్ - బహిరంగ వేలం ప్రకటన

[illegible]

తే 27-11-2025 కార్యనిర్వహణాధికారి
విజయనగరం

ప్రకటన

[illegible]

Sri J.S. Sivaram
Smt. N. Srilatha, Advocates,
O/o Late K.V. Krishna Rao, D.No. 18-6-1, Vakkalankavari Street, Vizianagaram

నీటి వృథా అరికట్టరూ..!

ఎల్.కోట మండలంలోని రంగాపురం పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టు తాటిపూడి జలాశయం ద్వారా వస్తున్న రక్షిత నీరంతా మురుగు కాలువలోకి వృథాగా పోతోంది. కుళాయిలు, పైపులకు మూత లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రజలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదు. ఇబ్బందులు పడుతున్నామని, స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో కుమార్‌ని న్యూస్‌టుడే ప్రశ్నించగా నీటి వృథా అరికట్టడానికి చర్యలు చేపడతామని చెప్పారు.

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

బస్సు కోసం పరుగో పరుగు

స్త్రీ శక్తి పథకం అనంతరం విజయనగరం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. దీంతో సర్వీసులు సరిపోవడం లేదు. సీట్లు సరిపోక గొడవలు జరుగుతున్నాయి. విజయనగరం డిపో పరిధిలో మరో 30 వరకు వాహనాలు అవసరం అవుతాయని భావిస్తున్నారు. ఈక్రమంలో నిత్యం తోపులాట సాగుతోంది. ఏదైనా బస్సు వస్తే ఒక్కసారిగా పరుగు తీస్తున్నారు. కొందరు బోల్తా పడుతున్నారు. గురువారం నగరంలోని కాంప్లెక్స్‌లో ఆ పరిస్థితి కనిపించింది. ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రజా రవాణా అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, అయ్యన్నపేట

వ్యవసాయానుబంధ రంగాలతో ఆదాయం

డెంకాడ, న్యూస్‌టుడే: వ్యవసాయ విధానాలపై రైతులు సమగ్ర అవగాహన కలిగుండాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. డెంకాడలోని రైతు ఫణిరాజు పొలంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, విజయనగరం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం చర్చాగోష్ఠి నిర్వహించారు. రైతులు వ్యవసాయంతోపాటు కోళ్లు, గొర్రెలు, పశువుల పెంపకం చేపట్టి, అధికాదాయం పొందాలన్నారు. నైరా కళాశాల అసోసియేటెడ్ జి.జోగినాయుడు, ఆత్మ పథక సంచాలకులు అనురాధ, ఎంపీపీ బి.వాసుదేవరావు, చంద్రశేఖర్, భాస్కరరావు, ఏడీఏ నాగభూషణరావు, ఏవో టి.సంగీత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, విశాఖ తెదేపా ఉత్తర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ సూచించారు. గురువారం నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల వద్ద అభ్యుదయం సైకిల్ యాత్రను ప్రారంభించారు. విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలన్నారు. తెదేపా మండల, పట్టణాధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, అప్పలనాయుడు, నాయకులు శ్రీనివాసరావు, వేణు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుందాం.. చరవాణికి దూరంగా ఉందాం

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో గురువారం విజయనగరంలోని కంటోన్మెంట్ సెయింట్ మేరీస్ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఎస్.ఆర్.టి.పి.దివ్య(పదో తరగతి), పి.మగన్(ఎనిమిదో తరగతి), కె.యశస్విని(ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ప్రధానాచార్యుడు డి.రాంబాబు, ఉపాధ్యాయులు సి.హెచ్.జయలక్ష్మి, జి.సుమకుమారి, కె.మమత, ఎ.ఇందు, శారద, షామిజాన్ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ★ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో కె.శ్రీవర్షిణి(ప్రథమ ఎంపీసీ), ఎ.జయశ్రీ(ద్వితీయ ఎంపీసీ), సి హెచ్.భవానీ(ద్వితీయ ఎంఈసీ) తొలి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. కళాశాల జోనల్ ప్రిన్సిపల్ కె.శ్రీధర్, పరిపాలనాధికారి కె.మధు, ప్రధానాచార్యుడు ఎ.రాము నాయుడు, ఉప ప్రధానాచార్యులు ఎ.నీలకంఠరావు, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

సెయింట్ మేరీస్ పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానాచారిణి, ఏవో, ఆర్ఐ, ఉపాధ్యాయులు

శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈవో, ప్రధానాచార్యుడు

శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అందుబాటులోకి మల్లివీడు ఫీడరు

ఎల్.కోట, న్యూస్‌టుడే: మల్లివీడులోని 34/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో రూ.30 లక్షలతో కొత్తగా నిర్మించిన 11 కేవీ ఫీడర్‌ను ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ప్రారంభించారు. లోడ్ పెరుగుతూ సరఫరాలో అంతరాయం వస్తుండడంతో దీన్ని నిర్మించామన్నారు. ఈఈ పి.హరి, ఏడీ బి.వెంకటరావు, ఏఈ వెంకటసత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక

జామి, న్యూస్‌టుడే: భీమసింగి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అల్లి దివ్యశ్రీ రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.చంద్రశేఖర్ కుమార్ తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు అనకాపల్లి జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొననుంది. గురువారం హెచ్ఎం, పీడీ బి.శ్రీను, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతూ మృతి

ఎల్.కోట: చికిత్స పొందుతూ రెల్లిగైరమ్మపేటకు చెందిన సీతిన పార్వతి (73) గురువారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఈ నెల 16న ఇంట్లో కట్టెల పొయ్యిపై వంట పూర్తయిన తర్వాత మంటలు వ్యాపించాయి. ఆర్పేందుకు నీరు అనుకుని టిన్నర్‌ని వేయడంతో మంటలు పెరిగి చీరకంటుకుని గాయాలయ్యాయి. విజయనగరం మహారాజ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మేనల్లుడు సన్యాసిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అన్నదాతలకు అన్నివిధాలా అండ

విజయనగరం గ్రామీణం: అన్నదాతలను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ అధ్యక్షుడు కర్రోతు నర్సింగరావు సూచించారు. గురువారం విజయనగరం మండలం జొన్నవలసలో ఎంపీటీసీ సభ్యుడు పి.రాజేష్‌బాబు ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు చంద్రునాయుడు, వ్యవసాయాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైదానం బాగుకు వినతి

ఎస్.కోట: పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల క్రీడామైదానం బాగు చేయాలని స్థానిక యువకులు ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఎస్.కోటలో పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ తదితరులు ఉన్నారు.

రుణాలతో సుస్థిర జీవనోపాధులు

నెల్లిమర్ల: డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకు రుణాలతో సుస్థిరమైన జీవనోపాధులను ఏర్పాటు చేసుకోవాలని వెలుగు డీఆర్‌డీఏ డీపీఎం ఎ.చిరంజీవి సూచించారు. గురువారం కొత్తపేటలో మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఏపీఎంలు పద్మ, సురేష్, సింహాచలం, భవానీ, అప్పలనాయుడు, దధికుమార్, భాగ్యలక్ష్మి, సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

రేపు పింఛనుదార్ల సర్వసభ్య సమావేశం

కొత్తవలస: కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాలకు చెందిన ప్రభుత్వ పింఛనదార్ల తాలూకా సంఘం సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు బి.అప్పారావు, కార్యదర్శి జి.వి.రమణ గురువారం తెలిపారు.

ప్రైవేటీకరణ విడనాడాలి

నెల్లిమర్ల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు డిమాండ్ చేశారు. గురువారం కొండవెలగాడలో కోటి సంతకాల సేకరణ పత్రాలను ఆవిష్కరించారు. జడ్పీటీసీ జి.సన్యాసినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన అవకాశాలు

కొత్తవలస: ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తోందని, వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం ఎ.వెంకటరమణ సూచించారు. దెందేరు, సంతపాలెంలో లింగ సమానత్వం, రైతన్నా మీకోసం కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యాన, విద్యుత్తు, రెవెన్యూశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి లక్ష పుష్పార్చన

విజయనగరం పూల్‌బాగ్‌లోని లక్ష్మీగణపతికాలనీలో వేంచేసిఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో గురువారం లక్ష నామాలతో లక్ష పుష్పార్చన సేవ జరిగింది. ఆలయ ధర్మకర్త, స్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఈ క్రతువు సాగింది. వేకువజామున స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నిజరూపంలో కనకమహాలక్ష్మి

నగరంలోని సిటీబస్టాండ్ అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువైఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారు మార్గశిరమాసం మొదటి గురువారం సందర్భంగా భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

పైడితల్లి సేవలో వేగుళ్ల

శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావుతో పాటు మరో ముగ్గురు సభ్యులు గురువారం రైల్వేస్టేషన్ సమీపంలోని వనంగుడిలో కొలువుదీరిన పైడితల్లిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో శిరీష వారికి స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఆరోగ్యంపై దృష్టిసారించాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మి, వైద్యాధికారి సింహాద్రినాయుడు తదితరులు

కొత్తవలస, న్యూస్‌టుడే: కౌమారదశలో ఉన్నవారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమాన్ని(ఆర్‌కేఎస్‌కే) అమలు చేస్తోందని వైద్యాధికారి బి.సింహాద్రినాయుడు చెప్పారు. వియ్యంపేటలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులంలో ప్రిన్సిపల్ ఎన్.వి.ఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, హింస, ప్రమాదాలు, ఆత్మహత్యలు, కుటుంబ సమస్యలు, పౌష్టికాహారం తదితరాలపై వివరించారు. పీహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వీ పద్మావతి, ఈవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు సిబ్బంది

డెంకాడ, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని 5వ పోలీసు బెటాలియన్ అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి పిలుపునిచ్చారు. కమాండెంట్ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు చింతలవలస బెటాలియన్ యూనిట్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సహాయ కమాండెంట్ డి.వి.రమణమూర్తి, యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

మాకు ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తి, మా అందరి హృదయాలలో చిరస్మరణీయమైన స్థానం సంపాదించి, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి మమ్ములను ఉన్నతులుగా తీర్చిదిద్ది దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...

కీ॥శే॥ పెంటపాటి సత్యనారాయణ గారు
బాలాజీనగర్, విజయనగరం
జననం: 25-03-1950, మరణం: 18-11-2025

భార్య: లక్ష్మి
అక్కచెల్లెళ్లు: అరుంధతి, పుణ్యవతి, కమలావతి
అల్లుడు: సుజాత - శ్రీరామ్‌కుమార్
మరదలు: రమాదేవి
తమ్ముని కుమారులు / కోడళ్లు: సందీప్ - మనీమాల, సుధీర్ - మధు
కుమారుడు / కోడలు / మనుమరాలు: పెంటపాటి సునీల్ - జాహ్నవి - దీప్తు సాయి
కుమార్తె / అల్లుడు / మనుమలు: ఉల్లి సుధ - కిరణ్ - సాయి రోహిత్, సాయి రిషిక
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

పెద్దకర్మ: తే. 28-11-2025న శుక్రవారం నాడు బాలాజీనగర్, నియర్ వెంకటేశ్వర కోవెల దగ్గర మా స్వగృహం నందు జరుపబడును.

ఈనాడు
పశ్చిమగోదావరి
శుక్రవారం నవంబరు 28, 2025

నా అందం.. ఆ దాతల చలవ

ఒకప్పుడు భీమవరంలో అధునాతన భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల మధ్య చెత్త, తూడుతో దర్శనమిచ్చే ఎడ్వర్డు చెరువు దాతల సౌజన్యంతో ఇప్పుడు ఇలా అందంగా మారింది. దీనికి రోటరీ క్లబ్, జూపూడి సూర్యకృష్ణ పార్కుగా అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ పచ్చదనం, వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. బోటు షికారు త్వరలో ఏర్పాటు చేస్తామని పుర కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. పార్కు అభివృద్ధికి జూపూడి సంజయ్ రూ.45 లక్షలు ఇచ్చారు. రోటరీ క్లబ్ భీమవరం రూ.17 లక్షలు సమకూర్చింది. మరో రూ.3 లక్షలతో పనులు చేయిస్తున్నారు.
- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

గట్టుకాయు స్వాహా

ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో నరసాపురం పంట కాలువ గట్టుపై, గరిగమ్మ కాలువ గట్టుపై కొందరు నిర్మాణాలు చేపట్టారు. చిన్నపాటి షెడ్డుతో మొదలుపెట్టి పక్కా భవనాలను నిర్మించి అద్దెకు ఇస్తున్నారు.

కాలువలు		విస్తీర్ణం (కి.మీ.)
మేజర్	13	295
మీడియం	41	328
మైనర్	454	959

ఆక్రమణల గుర్తింపు
సుమారు 140 చోట్ల

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, తణుకు, పెనుమంత్ర, భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే

కాలువ గట్టు కనిపిస్తే చాలు.. మరుసటి రోజు కనిపించదు. అంతలా మింగేస్తున్నారు అక్రమార్కులు. ఫలితంగా.. గట్లు కుచించుకుపోయి శివారు ప్రాంతాలకు సాగు..తాగునీరు అందని పరిస్థితి.

జిల్లాలోని తొమ్మిది ప్రధాన పంట కాలువలు ఉండగా, వాటికి అనుసంధానంగా వందల సంఖ్యలో బోదెలు ఉన్నాయి. వాటి పరిధిలో 4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. చాలావరకు ఆక్రమణలకు గురవడంతో నీటి ప్రవాహం తగ్గి సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. నీరు సకాలంలో దిగువకు ప్రవహించే పరిస్థితి లేక వరదలు, భారీ వర్షాల సమయంలో పల్లపు ప్రాంతాల్లో చేలు, ఆవాస ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. సుమారు 45 కిలోమీటర్ల పొడవు.. 95 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే నిడదవోలు-నరసాపురం కాలువ వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైంది. గోస్తనీ-వేల్పూరు కాలువ పరిధిలో మాముడూరు లాకుల వద్ద నిర్మాణాలు చేపట్టారు.

- మొగల్తూరులోని పాతకాలువ నుంచి లాకుల వరకు, సీతారామపురం నుంచి రామన్నపాలెం వరకు, నరసాపురం ప్రధాన కాలువ నుంచి వేములదీవి కాలువ గట్లపై ఆక్రమణలు వెలిశాయి. ఫలితంగా సుమారు 15 గ్రామాలు తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

సమన్వయ లోపం

జల వనరులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో జీఅండ్‌వీ కెనాల్ నుంచి రెండు కిలోమీటర్లు ఉండే గునుపూడి ఛానల్-1 పరిధిలో 250 ఎకరాలు కొన్నిచోట్ల కబ్జాలతో బక్కచిక్కిపోయింది. ఆచంట మండలంలో బ్యాంకు కెనాల్ గట్లను ఆక్రమించుకుని మొక్కలు వేసుకున్నారు. వల్లూరు, దేవ, జగ్గరాజు కాలువ గట్లు, 200 ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఆచంట-వేమవరం పరిధిలోని పంట బోదె కూడా కనిపించకుండా పోతోంది.

కుందేళ్లు కాదు ఎలుకలే

వీటిని చూసి కుందేళ్ల పిల్లలు అనుకుంటున్నారేమో.. కాస్త నిశితంగా చూడండి. మన చిన్నప్పుడు సర్కస్‌లో అరుదుగా కనిపించే కాశీ ఎలుకలు ఇవి. కుందేళ్లను పోలి ఉండే ఇవి ఇటీవల కాలంలో మన ప్రాంతంలో దాదాపు కనుమరుగయ్యాయి. కానీ పాలకోడేరు మండలం మోగల్లు గోస్తనీ నది వద్ద ఉన్న మహావనంలో వీటిని చూడవచ్చు. మొక్కలు, జంతువులపై మక్కువ కలిగిన హేచరీబాబు వీటిని హైదరాబాదు నుంచి తెప్పించి అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. రంగు రంగుల బొచ్చుతో సందడి చేస్తున్న ఈ ఎలుకలను చూసేందుకు ప్రకృతి ప్రేమికులు ముచ్చట పడుతున్నారు. సుమారు 600 నుంచి 700 గ్రాముల బరువు ఉంటే ఇవి 8 నుంచి 10 సంవత్సరాల వరకు జీవిస్తాయని హేచరీబాబు తెలిపారు. పచ్చగడ్డి, కూరగాయలు, క్యారెట్ వంటివి వీటి ఆహారం.
- న్యూస్‌టుడే, పాలకోడేరు

కేకు.. సహజ వర్ణాల సోకు

ఉద్యోగ విరమణకు సంబంధించి తయారీ

ఆహార పదార్థాల్లో రసాయనాల వినియోగం పెరిగిపోతున్న నేటి రోజుల్లోనూ సహజ రంగులతో విభిన్న ఆకృతుల్లో కేకులు తయారీ క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా పల్లెల్లోనూ ఈ ఒరవడి పెరుగుతోంది. వినియోగదారుల అభిరుచి మేరకు వారు చెప్పిన థీమ్‌లో కేకులు తయారు చేస్తున్నారు. రంగుల కోసం స్ట్రాబెర్రీ, సీతాఫలం, కివీ, అరటి పండ్లు వినియోగిస్తామని.. పంచదార, ఫలాల మిశ్రమాన్ని 90 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికిస్తే బొమ్మల తయారీకి అనువైన పిండి సిద్ధమవుతుందని తయారీదారు చెప్పారు. వివిధ రకాల ఫలాల మిశ్రమంతో ఎలాంటి రంగునైనా సిద్ధం చేయవచ్చని చెబుతున్నారు. ఓ వైద్యుడి పుట్టినరోజు సందర్భంగా తయారు చేసిన కేకు ఇటీవల సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది.

డాక్టర్స్ థీమ్

- న్యూస్‌టుడే, పాలకొల్లు

బాబోయ్ ఖాతార్నాకులు

కమీషన్ ఆశ చూపి ఎర

ఈనాడు డిజిటల్, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉంగుటూరు, న్యూస్‌టుడే

నిరుద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు మోసాలకు దిగుతున్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతా నంబరు చెప్పినా.. కొత్తగా తెరిచి ఇచ్చినా కొంత కమీషన్ ఇస్తామని ఆశ చూపి దాని ద్వారా అంతర్జాల ఐడీ, పాస్‌వర్డ్‌లతో బెట్టింగ్, ఇతరత్రా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. తాజాగా భీమవరంలో విశ్రాంత ఉద్యోగి నుంచి కాజేసిన నగదును ఈ విధంగా సేకరించిన ఖాతాలకు మళ్లించడం ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అంశాన్ని గుర్తు చేస్తోంది.

ఇటీవల అంతర్జాతీయ సైబర్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలిచ్చి సహకరిస్తున్న వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వారు నగరాలు, పట్టణాల్లో స్థిరపడిన తమ బంధువులు, మిత్రులకు అదనపు ఆదాయ మార్గం చూపుతామని నమ్మించి బ్యాంకుల్లో ఖాతాను తెరుస్తున్నారు. వాటిలో నగదును జమచేసి యూపీఐ ద్వారా వేర్వేరు ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు. ఇలాంటి కేసులు భీమవరం, పెదఅమిరం, నరసాపురం, మొగల్తూరు, జంగారెడ్డిగూడెం, ఏలూరు తదితర ప్రాంతాల్లో బయట పడుతున్నాయి.

- నరసాపురం పట్టణానికి చెందిన యువకుడికి తాను పని చేసే యజమాని ద్వారా మరో యువకుడు పరిచయమయ్యాడు. అతని పేరు మీద బ్యాంకు ఖాతా తెరిస్తే నెల వారీ కొంత సొమ్ము ఇస్తానని చెప్పాడు. అది ఉపయోగించి క్రికెట్ బెట్టింగ్‌ల్లో రూ.లక్షల్లో లావాదేవీలు చేయడంతో ఐటీ శాఖ నుంచి నోటీసులు అందడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు ఆ యువకుడు.

గతంలో ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన ముగ్గురు యువకులు సొంతూళ్లో తెలిసిన వారితో బ్యాంకు ఖాతా తెరిస్తే కమీషన్ ఇస్తామన్నారు. కొందరు వారి వివరాలతో పాటు మరికొందరి ఆధార్ నంబర్లు సేకరించి ఇచ్చారు. వారికి తెలియకుండానే బ్యాంకు ఖాతాలు తెరిచి రూ.లక్షల్లో లావాదేవీలు చేయగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

యువతే లక్ష్యంగా

నిరుద్యోగులు, చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించే యువతను వలలో వేసుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలిస్తే డబ్బులిస్తామని ఆశ చూపుతున్నారు. ఖాతాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు మధ్యవర్తులకు ఇస్తున్నారు. వారు రూ.5 వేల వరకు ఖాతాదారులకు అందజేస్తున్నారు.

దొరకని మూలాలు..

ఖాతాదారుల ఫోన్ నంబరుకు ఎస్‌ఎంఎస్‌లు వెళ్లకుండా తమకు ఫార్వర్డ్ అయ్యేలా చేస్తున్నారు. ఖాతాల్లో జమవుతున్న నగదు బినామీ ఖాతాలకు మళ్లిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు పంపుతున్నారు. స్థానిక పోలీసుల దర్యాప్తు తుది వరకు వెళ్లకపోవడం నిందితులకు కలిసొస్తుంది.

☛ 'తెలిసిన వారైనా బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వొద్దు. వాటిని దుర్వినియోగం చేసి ఏదైనా కేసు నమోదైతే యజమానిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని' ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.

సివిల్స్ పరీక్షార్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సివిల్ సర్వీసు-2026కు సంబంధించి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి నాగరాణి తెలిపారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం డిసెంబరు 3 వరకు పొడిగించినట్లు చెప్పారు. అభ్యర్థులు విద్యార్హత, ఆదాయ, కుల ధ్రువపత్రాలు జత చేసి.. ఒకటో పట్టణం వెన్నవల్లివారిపేటలోని బీసీ అధ్యయన కేంద్రంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు డిసెంబరు 7న రాజమహేంద్రవరంలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటున్నారు. వివరాలకు 86861 80018, 90302 11920 నంబర్లను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రంథాలయం.. కొలువుల దేవాలయం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

గ్రంథాలయం అనే దేవాలయంలో చదివి ఉద్యోగం సాధించి మార్గదర్శకులుగా నిలిచారు ఈ యువత. అదెక్కడో కాదు.. భీమవరంలోని వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయమే వీరిని ఉన్నతి స్థితిలో కూర్చొబెట్టింది. ఇప్పటికే ఎందరో కొలువులు పొందారు.

అయిదేళ్లు కష్టపడ్డా

నా చిన్నతనంలో అమ్మ, నాన్న మృతి చెందడంతో భీమవరంలో అమ్మమ్మ, తాత రేవు భీమరాజు, చినవెంకటనరసమ్మ వద్ద చదివా. భీమవరంలో ప్రైవేట్ పాఠశాలలో పార్ట్ టైమ్‌గా పనిచేస్తూ, ట్యూషన్స్ చెప్పుకొంటూ మిగిలిన సమయంలో గ్రంథాలయంలో చదువుకున్నా. అయిదేళ్ల సాధనతో డీఎస్సీలో గణిత ఉపాధ్యాయుడిగా కొలువు పొందా.
- బొడ్డు వెంకటేశ్వరరావు, చినగొల్లపాలెం

కోచింగ్ లేకుండానే...

మా ఇంట్లో ఎవరూ చదువుకోలేదు. కోచింగ్ లేకుండా గ్రంథాలయంలోనే చదువుకుని డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి అరవల్లి జడ్పీ పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తి చేశా. ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేస్తూ నా భార్య ప్రోత్సహించడంతో ఎనిమిది నెలలు గ్రంథాలయంలో చదువుకుని విజయం సాధించా.
- బోణం వెంకటేశ్వరరావు, రాయలం

సివిల్ కానిస్టేబుల్ అయ్యా

2021లో ఎంఏ ఇంగ్లీషు పీజీ పూర్తి చేసి ఎస్ఐ కావాలనే లక్ష్యంతో సివిల్ పరీక్ష రాసి విజయం సాధించలేకపోయా. సివిల్ కానిస్టేబుల్ పరీక్షకు కేవలం ఒక ఏడాది వయసు కాల పరిమితి ఉండడంతో గ్రంథాలయాన్నే నమ్ముకున్నా. నా భర్త ప్రోత్సాహం, తోటి స్నేహితుల సహకారంతో సివిల్ కానిస్టేబుల్ అయ్యా. విజయనగరంలో శిక్షణ పొందుతున్నా.
- జి.లక్ష్మీదుర్గ, భీమవరం

అమ్మ ప్రోత్సాహంలా ఉంది

నేను పుట్టి పెరిగింది మోగల్లు. నాన్నకు అనారోగ్యంగా ఉండడంతో అమ్మ డైలీ పనులకు వెళ్లి నన్ను చదివించారు. భీమవరం శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు ఉన్నాయని తెలిసి సిద్ధమయ్యా. గ్రంథాలయం నాకు అమ్మగా నిలిచింది. 2023లో రైల్వే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రస్తుతం కర్ణాటకలో రైల్వే ట్రాక్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్నా. - చింతా సత్యనారాయణ, మోగల్లు

పరుగు వేగంలో.. పతకాలు మెడలో..

జాతీయ స్థాయిలో దూసుకెళ్తున్న యువత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: క్రీడల్లో నేటి యువత మెరికలు. అథ్లెటిక్స్‌లో చిరుతల్లా దూసుకెళ్తున్నారు. జాతీయస్థాయిలో పతకాలు సొంతం చేసుకుంటూ ఒలింపిక్స్‌పై గురి పెట్టారు. ఆ దిశగా దూసుకెళ్తున్నారు భీమవరం పట్టణంలోని డీఎన్నార్ విద్యాసంస్థల విద్యార్థులు. నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో గత మూడేళ్లుగా వరుసగా ప్రథమంలో నిలుస్తూ ఓవరాల్ ఛాంపియన్లుగా నిలుస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 14 వరకు బెంగళూరులో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్‌లో నన్నయ్య విశ్వవిద్యాలయం తరఫున పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ బి.వి.నరసింహరాజు తెలిపారు.

దూకుడుగా..



భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 100, 400 మీటర్ల విభాగాల్లో విజేతగా నిలిచా. అంతర్ విశ్వవిద్యాలయ స్థాయి అండర్-20 విభాగంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికై సత్తా చాటా. ఒలింపిక్స్‌కు అర్హత సాధనే లక్ష్యం.
- వి.రాజేష్

చిరుతలా..



100 మీటర్ల విభాగంలో ప్రథమస్థానంలో నిలుస్తున్నా. అక్టోబరులో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో 100 మీటర్లను 10.63 సెకన్ల రికార్డును ఛేదించాడు. నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల పరుగు పందెంలో అండర్-18 విభాగంలో ప్రథమంతో బంగారు పతకం సొంతం చేసుకున్నా.
- కె.ఎస్.ఎస్ సొహెల్‌బాబు

ఫుల్ జోష్

భీమవరం: బస్సెక్కుతున్న మహిళలు

ఆర్టీసీకి కలిసొచ్చిన స్త్రీ శక్తి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోన్న స్త్రీశక్తి ఉచిత ప్రయాణ పథకం మహిళలతో పాటు ఆర్టీసీకి కలిసొచ్చింది. ఒకప్పుడు నష్టాల బాటలో నడిచిన సంస్థకు జవసత్వాలూ వచ్చాయి. కొన్ని మార్గాల్లో బస్సుల సంఖ్య పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇక నరసాపురం నుంచి రాజమహేంద్రవరం, ద్వారకాతిరుమల, మచిలీపట్నం ప్రాంతాలకు ఓఆర్ వంద శాతం దాటిపోవడం పట్ల అధికారులు సైతం ఆశ్చర్యపడుతున్నారు.

ఆదాయం రూ.44 లక్షలు

గతంలో జిల్లాలో రోజుకు 79 వేల మంది ప్రయాణించే వారు. ఇప్పుడు ఆ సంఖ్య 1.32 లక్షలకు పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో నిత్యం 321 సర్వీసులు తిప్పుతున్నాం. గతంలో రోజుకు ఆదాయం రూ.35 లక్షలు వచ్చేది. ఇప్పుడు రూ.44 లక్షలకు పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల ఏర్పాటుపై దృష్టి పెట్టాం.
- వరప్రసాద్, జిల్లా ప్రజారవాణాధికారి

జిల్లాలోని భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల పరిధిలోని కొన్ని మార్గాల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గతం కంటే బాగా పెరిగింది. ఆ వివరాలు ఇవీ..

మార్గం	గతం	ప్రస్తుతం
భీమవరం – ఏలూరు	75	96
భీమవరం – తాడేపల్లిగూడెం	70	91
భీమవరం–రాజమహేంద్రవరం	73	98
నరసాపురం–రాజమహేంద్రవరం	77	107
నరసాపురం– ద్వారకాతిరుమల	74	104
నరసాపురం– మచిలీపట్నం	63	101
తాడేపల్లిగూడెం–భీమవరం	70	98
తాడేపల్లిగూడెం–ద్వారకాతిరుమల	63	95
తణుకు – భీమవరం	58	83
తణుకు – నరసాపురం	60	92
తణుకు – రాజమహేంద్రవరం	67	91

దాచేసి దోచేయాలనా? 6లో మా బడి.. చదువులమ్మ ఒడి

శ్రీరస్తు.. గృహమస్తు

సమీపిస్తున్న దరఖాస్తుల గడువు

ఆకివీడు, అత్తిలి, భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై 2.0)లో భాగంగా సొంత స్థలం ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.2.50 లక్షల సాయం చేయనుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,310 మంది ఇంటి నిర్మాణ సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకూ 4,990 మంది వివరాలను ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేశారు. ఇంకా 2,320 మంది వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

జిల్లాలో పీఎంఏవై 2.0 గ్రామీణ్ సర్వే వివరాలు ఇలా..	
వచ్చిన దరఖాస్తులు	7,310
సర్వే పూర్తయినవి	4,990
ఇంకా సర్వే చేయాల్సినవి	2,320

సొంత స్థలం ఉన్నవారు

సచివాలయ, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది దరఖాస్తుదారుల వివరాలను ఇంటింటికీ వెళ్లి ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంకా 2,320 మంది వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. సర్వే పూర్తి చేయడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ విషయమై గృహ నిర్మాణ శాఖ పీడీ పిచ్చయ్య మాట్లాడుతూ.. నెలాఖరులోగా సర్వే పూర్తి చేస్తామన్నారు. అలాగే సొంత స్థలం ఉన్న వారు పీఎంఏవై 2.0 గ్రామీణ్ పథకంలో ఇంటి నిర్మాణ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఇప్పటికైతే ఉన్నా.. ఇక ఉండనేమో..



విద్యార్థినుల వసతిగృహం ఇలా...

రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ వ్యాయామ కళాశాల దుస్థితి ఇదీ. ఏలూరు జిల్లా గోపన్నపాలెంలో ఉంది. గత పాలనలో ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థుల వసతి భవనాలు శిథిలావస్థకు చేరాయి. గోడలు బీటలువారాయి. మరుగుదొడ్లు, స్నానాల గదులకు తలుపుల్లేవు. కళాశాలలో చేరేందుకు 440 మందికి అవకాశం ఉండగా ప్రస్తుతం 108 మంది మాత్రమే చదువుతున్నారు. వ్యాయామ సాధన చేసే భవనం కూలిపోయింది. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించిన తరగతి గదుల కొత్త భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. దీనిపై ప్రిన్సిపల్ నతానియేల్ మాట్లాడుతూ సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ రూ.25 లక్షలు మంజూరు చేశారని వాటితో అసంపూర్తిగా ఉన్న భవనంలో కొంతమేర గదులు పూర్తి చేస్తామన్నారు. - ఈనాడు, ఏలూరు

భవనంలో పుట్టలు

ఆలోచించు.. ఆనందించు!

ఆధునిక ప్రగతి పేరుతో చెట్లను నరికేస్తున్నాం. నేటి యువతకు వాటి అవసరాన్ని తెలియజేసేలా మనిషి తన భవిష్యత్తు (చెట్టు)ను నరికేస్తుంటే ఒక పాప ఆపుతున్నట్లు, వృక్షాలు ప్రకృతిని ప్రాధేయపడుతున్నట్లుగా ఉన్న శిల్పం అందరినీ ఆకట్టుకుంటుంది. డాక్టర్ బి.వి.రాజు ఇంజినీరింగ్ కళాశాలలో జీవితాన్ని తగ్గించుకోవద్దు అంటూ మోడు వారిన వృక్షాన్ని కాస్త అర్థవంతంగా తీర్చిదిద్దడంతో ఆలోచింపచేస్తోంది. - ఈనాడు డిజిటల్, భీమవరం

రమణీయం.. విహారం..

ఉండి మండలం చెరుకువాడలో సుబ్రహ్మణ్యస్వామికి తెప్పోత్సవం

(c) eenadu

ఉన్నత స్థితికి చేరుకోవాలి

పోటీల ప్రారంభం సందర్భంగా క్రికెట్ ఆడుతున్న నాగరాణి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. డిసెంబరు 3న నిర్వహించనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం డీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. కాసేపు దివ్యాంగుల ఆటల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఎం.మోహన్ దాస్, డీఎన్ఆర్ కళాశాల వీసీ గోకరాజు పాండురంగరాజు, సెట్విన్ గాదిరాజు సత్యనారాయణరాజు, రామకృష్ణరాజు, పీడీ టీవీ నరసింహరాజు పాల్గొన్నారు.

నేనూ.. పరుగెడతా..
కనిపించనంత దూరం విసిరేస్తా..

పారాహుషార్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో పారా క్రీడా పోటీలు గురువారం జరిగాయి. డీఎస్ఏ విద్యా సంస్థల ఆవరణలోని గ్రామాలైన క్రీడామైదానంలో జరిగిన పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. క్రికెట్, షాట్‌పుట్, 100 మీటర్ల పరుగు, బ్యాడ్మింటన్‌లో అండర్- 17, అండర్-20, 20 పైబడిన వయసుల వారిగా పోటీలు నిర్వహించగా 90 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని మనోధైర్యంతో సత్తా చాటారు.

5న తల్లిదండ్రుల సమావేశం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో డిసెంబరు 5న తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాన్ని పండగలా నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయం నుంచి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ నిర్వహించిన దూరదృశ్య సమావేశంలో ఆమె క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, పిల్లలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి

ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 100 రోజుల ప్రచార కార్యక్రమాన్ని కలెక్టర్ నాగరాణి గురువారం ప్రారంభించారు. ఈ నెల 27 నుంచి మార్చి 8 వరకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. దానికి కోసం కృషి చేస్తామంటూ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ నయిమ్ అస్మీ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మి, సామాజిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి అరుణకుమారి పాల్గొన్నారు.

7,267 ఎపిక్ కార్డుల అందజేత

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఓటర్లుగా నమోదు చేసుకున్న వారికి ఇప్పటి వరకు 7,267 ఎపిక్ కార్డులు అందజేశామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్ అమరావతి నుంచి గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. జిల్లాలో బీఎల్‌వోలు, ఏఈఆర్‌లకు శిక్షణ పూర్తి చేశామని వివరించారు. ఆర్డీవోలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్‌బానో పాల్గొన్నారు.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. అలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడే వారు.. ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌లో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్స్, రొమాంటిక్ రిట్రీట్‌కు గ్లాంపింగ్ వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించేలా కొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంధ్యారాగ ఆటలతో బాల్య అనుభూతులు, పుష్ప కాంతి.. ఉయ్యాలలో.. మానసిక ప్రశాంతత పొందే చుట్టూ నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకునే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

మా బడి.. చదువులమ్మ ఒడి..

- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి కృషి
- రూ.50 లక్షలతో వసతుల కల్పన

ప్రైమరీ ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న శ్రీమన్నారాయణ

కలిదిండి, న్యూస్‌టుడే: దాతృత్వం అనేది ఒక వరం. దాతలు ప్రోత్సహిస్తూ.. మంచి కార్యక్రమాలకు చేయూతగా నిలవడమూ వరమే. ఉన్నత మనసు.. సేవా దృక్పథం ఉంటేనే అది సాధ్యం. ఈ దిశగా బంధు, మిత్రుల నుంచి విరాళాలు సేకరించి బడి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు కైకలూరు మండలం రాచపట్నానికి చెందిన మాగంటి శ్రీమన్నారాయణ(బిన్ని). ఆయన ప్రోత్సాహంతో కలిదిండి మండలంలోని ఆరుతెగపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.50 లక్షల విరాళాలు దాతల ఆదాయం.

శ్రీమన్నారాయణ ఇదే బడిలో చదువుకున్నారు. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో బడిలో అధ్వానంగా, దాని నిర్వహణ నిధులు, భోజన శాల, మోడల్ గ్రంథాలయం, మరుగుదొడ్లు, సోలార్ ప్యానెల్స్, మీటింగ్ హాలు ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుతం రూ.20 లక్షలతో సైన్స్ ల్యాబ్, రూ.5లక్షలతో సైకిల్ షెడ్డు నిర్మాణానికి ఇటీవలే భూమి పూజ చేశారు. సదుపాయాల కల్పనకు నిధులు సమకూర్చడంతో పాటు పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ పూర్తి చేయిస్తున్నారు.

చదువుకున్న పాఠశాలపై మమకారం.. చదువుకున్న బడిపై ఎనలేని మమకారం నాది. దీని అభివృద్ధికి అవసరమైన పనుల కోసం బంధు, మిత్రులతో మాట్లాడి విరాళాలు ఇవ్వాలని అడుగుతుంటా. వాళ్ల తోడ్పాటుతోనే పనులు ఏర్పాటవుతున్నాయి. ఇది ఎంతో సంతోషాన్నిస్తోంది. - మాగంటి శ్రీమన్నారాయణ

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ-ఎస్టీలపై దాడులకు సంబంధించి నమోదవుతున్న కేసుల విచారణ వేగంగా జరిగేలా చూడాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. కేసులపై ఎఫ్ఐఆర్, చార్జిషీట్ నమోదులో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది మే నుంచి అక్టోబరు వరకు 14 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సమావేశంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవోలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిరాజు, నరేష్, రాజశేఖర్, దొరబాబు, జగపతిరామయ్య పాల్గొన్నారు.

ఖైదీలకు ఉపాధి కల్పిస్తే పరివర్తనకు దోహదం

పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్న అంజనీకుమార్

కైకలూరు, న్యూస్‌టుడే: ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారిలో పరివర్తన వచ్చేందుకు దోహదపడుతుందని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ అన్నారు. కైకలూరు సబ్ జైలు సమీపంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును గురువారం ఆ శాఖ డీఐజీ ఎం.వర ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలో ఇప్పటికే 23 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులపైనే ఆధారపడకుండా, బీపీ ద్వారా స్వయంగా ఆదాయం పొందే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అధునాతన సౌకర్యాలతో కూడిన పెట్రోల్ బంకుల్లో ఖైదీలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇందులో అధికశాతం ఉద్యోగ అవకాశాలు ఖైదీలు, వారి కుటుంబ సభ్యులకు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో జైలులో ఆత్మవిశ్వాసం పెంపొంది కుటుంబాలు గౌరవప్రదంగా జీవనం సాగిస్తాయని తెలిపారు. అనంతరం రూ.1.63 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కైకలూరు సబ్ జైలు భవన నిర్మాణాన్ని సందర్శించారు. జైళ్ల శాఖ జిల్లా అధికారులు ఎస్.శివశంకర్, ఆర్వీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విజయకేతనం పుస్తకాలందుకున్న విద్యార్థులతో పద్మశ్రీ

ఉత్తమ ఫలితాలు సాధిద్దాం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆకాంక్షించారు. స్థానిక శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా పరిషత్తు నిధులతో రూపొందించిన విజయకేతనం అభ్యసన సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలు అద్భుతమైన ప్రతిభతో పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో గదులు, కాటేజీల ఖాళీల వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు.

సత్రం పేరు	ఖాళీలు	
27న రాత్రి 10గంటల సమయానికి	28న	29న
ధర్మప్పారాయ నిలయం	75	80
తితిదే సత్రం	08	16
రాణి చిన్నమ్మారావు సత్రం	30	30
కాటేజీలు	22	27
బాలాజీ	04	02

సంప్రదించాల్సిన నంబర్లు:
90375 69891, 90375 67892
ఆన్‌లైన్ బుకింగ్ కోసం: www.aptemples.ap.gov.in

కూతపెడితే.. ప్రత్యర్థులు చిత్తే

కబడ్డీలో రాణిస్తున్న వైవీఎన్నార్ విద్యార్థులు

కైకలూరు, న్యూస్‌టుడే: కఠోర సాధన.. సాధించాలనే పట్టుదల ఉంటే విజయం సొంతమవుతుందని నిరూపిస్తున్నారు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. కబడ్డీ ఆటపై మక్కువతో ప్రదేశం ఏదైనా తమదైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు ఈ కళాశాల క్రీడా కుసుమాలు. ఆటలో మెలకువలు ఒడిసి పట్టి జాతీయ, రాష్ట్ర, జట్లకు ప్రాతినిధ్యం వహిస్తూ భళా అనిపిస్తున్నారు.

దేశపు జెర్సీ ధరిస్తా..

కబడ్డీ ఆటంటే అమితమైన ఆసక్తి. పాఠశాల, కళాశాల తరఫున జిల్లా స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించా. ప్రస్తుతం వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నా. కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీల్లో కళాశాల తరఫున పాల్గొని మంచి ఆటతీరు కనబర్చడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యా. మూడేళ్లలో అంత రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి ప్రశంసా పత్రాలు కైవసం చేసుకున్నా. దేశపు జెర్సీ ధరించి దేశం తరఫున ఆడాలనేది కోరిక. - భాను

క్రీడాకారుడిగా రాణిస్తా..

స్నేహితుల ప్రోత్సాహంతో కాస్త్రీయంగా కబడ్డీ దినచర్య అయ్యింది. కళాశాలలో పీడీ శివ నాగరాజు ఇచ్చిన శిక్షణ ఆట తీరులో మార్పు తెచ్చింది. ప్రస్తుతం బీకాం మూడో సంవత్సరం చదువుతున్నా. ఇటీవల విజయవాడ, విశాఖపట్నం, కడపతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ఆటగాడిగా ద్వితీయ స్థానం సాధించా. దీంతో జాతీయ స్థాయి సీనియర్ జట్టుకు ఎంపిక చేశారు. నిత్య సాధనతో మంచి క్రీడాకారుడిగా గుర్తింపు సాధిస్తా. - సిద్ధార్థ

మరికొందరికి శిక్షణ ఇస్తా..

పాఠశాల స్థాయి నుంచి కబడ్డీ ఆడటే ఇష్టం. పదుల సంఖ్యలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జట్టుకు నాయకత్వం వహించా. బీఏ మూడో సంవత్సరం చదువుతున్నా. ఛత్తీస్‌గఢ్, గుజరాత్ రాష్ట్రాల్లో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ జట్టు తరపున మూడు సార్లు పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానం సాధించాం. ఇటీవల విజయవాడ, విశాఖపట్నంలో నిర్వహించిన పోటీల్లో సీనియర్ విభాగంలో జాతీయ జట్టులో చోటు సాధించా. ప్రభుత్వ కొలువు సాధించి కబడ్డీపై ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇవ్వాలని కోరిక. - సుభాశ్

నిరంతరం శ్రమిస్తున్నా..

కబడ్డీ అంటే ఆసక్తితో పాఠశాల స్థాయి నుంచి అనేక పోటీల్లో పాల్గొన్నా. బీఏ మూడో ఏడాది చదువుతున్నా. ఉదయం వ్యాయామ ఉపాధ్యాయులు నా ఆటతీరు చూసి ప్రోత్సహించారు. విజయవాడ, విశాఖపట్నం, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అంతరాష్ట్ర పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ జట్టులో స్థానం సాధించా. ప్రో కబడ్డీలో ఆడాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నా. - నరసింహ

సజావుగా ధాన్యం కొనుగోలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాతావరణ పరిస్థితులపై వారం రోజులుగా రైతులను అప్రమత్తం చేస్తున్నట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం కలెక్టర్లు, జేసీలతో సమావేశం నిర్వహించారు. దానిలో జేసీ కలెక్టరేట్ నుంచి పాల్గొని జిల్లా పరిస్థితులను ఆయనకు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం ధాన్యం సేకరణ సజావుగా సాగుతుందని వివరించారు.

విద్యార్థులు నైపుణ్యవంతులు కావాలి

మార్టేరు, న్యూస్‌టుడే: పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) అమలుతో విద్యార్థులు విద్యలో రాణించడంతోపాటు నైపుణ్యవంతులుగా తయారవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశమని సమగ్ర శిక్షా రాష్ట్ర పరిశీలకుడు బి.కిశోర్‌బాబు అన్నారు. మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాల పాల్ ల్యాబ్‌లో చేస్తున్న విద్యుత్తు పనులు, సామగ్రి నాణ్యతను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సమగ్ర శిక్షా ఏఎంఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన పాఠశాలల్లో పాల్ ల్యాబ్‌కు 30 ట్యాబ్లు, ఇతర సామగ్రి అందిస్తామని చెప్పారు. వారానికి రెండు పీరియడ్లు ఈ ల్యాబ్‌కు కేటాయించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

మూత్రపిండాల వ్యాధి గ్రస్థురాలి ఇంటికి ముఖ్యమంత్రి!

1న పింఛను అందజేయనున్న చంద్రబాబు

అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, చిత్రంలో ఆప్కాబ్ ఛైర్మన్, డీఎస్పీ తదితరులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి గురువారం పరిశీలించారు. గొల్లగూడెం-నల్లమాడు రోడ్డులో కారుమూరి తేజకు చెందిన వ్యవసాయ భూమిలో(2016లో ఏర్పాటు చేసింది) హెలిప్యాడ్, దాని సమీప చెరుకూరి శ్రీదేవి లేఅవుట్‌లో కార్యకర్తల సమావేశానికి సన్నాహాలు చేస్తున్నారు. గొల్లగూడెం నుంచి దూబచర్ల ర.భ.శా. రోడ్డులో వినియోగంలో లేని పెట్రోలు బంకు పక్కన కొక్కండ నాగ బ్రహ్మాచార్యులుకు చెందిన వ్యవసాయ భూమిలో ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నారు. దానికి సుమారు 50 మీటర్ల దూరంలో రోడ్డుకు మరో వైపునున్న వేములపల్లి వెంకటేశ్వరరావు వ్యవసాయ భూమిని పార్కింగ్‌కు కేటాయించారు. గోపినాథపట్నంలో డయాలసిస్‌తో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మి ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు పింఛన్ ఇవ్వనున్నారు. గొల్లగూడెంలో ఎవరికి పింఛన్ ఇస్తారో లేదో స్పష్టత రావాల్సి ఉంది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విస్తృత ఏర్పాట్లు చేయండి: కలెక్టర్.. ఏలూరు వన్‌టౌన్: ఉంగుటూరు మండలంలో డిసెంబరు 1న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని, తదనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం అధికారులతో దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. హెలిప్యాడ్, సభా స్థలి ప్రాంతాలను వెంటనే పరిశీలించాలని, అనువైన ప్రాంతాలు గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జేసీ అభిషేక్ గౌడ, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, డీఆర్డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

చెత్త వేయొద్దని ఆందోళన

రహదారిపై నిరసన ప్రదర్శనలో స్థానికులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మా గ్రామంలో చెత్త వేయొద్దంటూ రుస్తుంబాద శివారు మండావారి గరువు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. పట్టణంలో సేకరించిన చెత్తను సిబ్బంది ట్రాక్టర్లు, లారీలపై ఆ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో వేసేందుకు గురువారం తీసుకెళ్లారు. అక్కడ చెత్త వేస్తే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడే వంటలు, భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరసన కొనసాగింది. ఈ సమాచారాన్ని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ మైలాబత్తుల సోని, తహసీల్దారు ఐవీవీ సత్యనారాయణ, సీఐలు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఉద్రిక్తత పెరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ అక్కడికి వెళ్లి ఆర్డీవో దాసి రాజుతో చరవాణిలో మాట్లాడారు. అనంతరం ఆర్డీవో అక్కడికి చేరుకుని జానకిరామ్‌తో కలిసి ఆందోళనకారులతో చర్చించారు. అక్కడ చెత్తవేసే ప్రాంతాన్ని చూశారు. అనంతరం మంగళగుంటపాలెంలోని అర్బన్ లేఅవుట్ ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో దీనిపై చర్చించేందుకు శుక్రవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని ఆర్డీవో తెలిపారు.

ఆగిన పనులకు ఊపిరి

రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం

పెనుమదం, గుమ్ములూరు మధ్య నిర్మాణం జరిగిన భాగం

పోడూరు, ఆచంట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలు రోడ్ల నిర్మాణానికి ఎన్‌డీబీ(జాతీయ అభివృద్ధి కార్యక్రమం) నిధులు మంజూరైనా కొన్ని చోట్ల పనులు ప్రారంభించలేదు. జిల్లాలోని ఆచంట-పాలకొల్లు, తణుకు- భీమవరం రోడ్ల నిర్మాణం మొదలుపెట్టినా 30 శాతం కూడా పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం ఆయా పనులు పూర్తిచేసేందుకు పూనుకుంది.

అయిదేళ్లు సరిపోలేదు.. 2019లో ఆచంట- పాలకొల్లు రోడ్డులో ఆచంట పరిధిలో సుమారు 300 సీసీ రోడ్డు, గుమ్ములూరు-పెనుమదం మధ్య కాలువకు రక్షణ గోడ, 1200 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించారు. పోడూరు మండల పరిధిలో పనులు పూర్తయినా.. ఆచంట పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి తవ్వేసి వదిలేశారు. తణుకు- భీమవరం మధ్య గవర్లపాలెం వంటి చోట్ల పనులు జరిగినా, ఈడూరు, కోరుకొల్లు ప్రాంతాల్లో 70 శాతం పనులు ఆగిపోయాయి. వైకాపా ప్రభుత్వం గుత్తేదారుకు సకాలంలో సొమ్ములు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

గుత్తేదారుకు బకాయిల చెల్లింపు.. కూటమి ప్రభుత్వం గుత్తేదారు బకాయిల్లో కొంతమేర చెల్లించింది. ఆచంట, తణుకు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో ఆగిపోయిన పనులు పూర్తిచేయడానికి కృషి చేస్తున్నారు. ఆచంటలో ప్రత్యామ్నాయ బైపాస్ రోడ్డు నిర్మాణం రూ.18 లక్షలతో నిర్మిస్తున్నారు. దీనిని వినియోగంలోకి తీసుకొచ్చి ఆచంట-పాలకొల్లు పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. ఆచంట పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని త్వరలోనే మొదలు పెడతారని పాలకొల్లు ఆర్అండ్‌బీ డీఈ రమణ తెలిపారు. తణుకు-భీమవరం రోడ్డు పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని తణుకు డీఈ వరలక్ష్మి తెలిపారు.

శ్రేణుల్లో ఉత్సాహం నింపడానికే శిక్షణ తరగతులు

మాట్లాడుతున్న మాధవ్, వేదికపై ఎంపీ పురందేశ్వరి, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

దేవీచౌక్, న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసేందుకు ప్రశిక్షణవర్గ తరగతులు ప్రేరణగా నిలుస్తాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని రివర్‌బే ఫంక్షన్ హాలులో గోదావరి జోన్ ప్రశిక్షణవర్గ తరగతులు గురువారం నిర్వహించారు. ఆరు జిల్లాలకు (ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా) చెందిన మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాధవ్ మాట్లాడుతూ పార్టీ చరిత్ర, వికాసం వంటి అంశాలపై ప్రశిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ తరగతులకు సుదీర్ఘ చరిత్ర ఉందని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర సంఘటన సహ కార్యదర్శి మధుకర్, భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యక్షులు నిర్మలా కిషోర్, కార్యదర్శులు దత్తు, ఆదిలక్ష్మి, రాష్ట్ర సీనియర్ నాయకుడు సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

ఏలూరు జ్ఞానికా TVS షోరూమ్‌లో వర్క్ చేయుటకు షోరూమ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్, సర్వీస్ ఎగ్జిక్యూటీవ్స్, సీనియర్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సంప్రదించండి ✆ 94922 25959.

దక్షిణభారత దేశంలో ప్రముఖచేపల రొయ్యలమందుల తయారీ ISO సర్టిఫైడ్ కంపెనీకి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, కైకలూరు, అమలాపురం, ఆకివీడు, గణపవరం హెడ్‌క్వార్టర్స్‌గా మాఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు అనుభవంగల పురుషఅభ్యర్థులు కావలెను. లోకల్‌వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం & అలవెన్సులుకలవు. 2 వీలర్ తప్పనిసరి. సంప్ర|| అల్ట్రాటెక్ మినరల్స్, గుంటూరు. మెయిల్: ultratechminerals@gmail.com. Ph: 9573308158. గమనిక: ఆక్వారంగంలో అనుభవం కల్గిన అభ్యర్థులు మాత్రమే సంప్ర.

సూర్య హాస్పటల్ కొవ్వూరు నందు పనిచేయుటకు నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఓటి టెక్నీషియన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 94919 92277.

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ✆96402 58899, 96404 68899.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.15 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

బాలికపై వేధింపులు.. పోక్సో కేసు నమోదు

మొగల్తూరు, న్యూస్‌టుడే: బాలికను వేధిస్తున్న యువకుడిపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై వై.నాగలక్ష్మి తెలిపారు. ఎల్‌బీచర్లకు చెందిన తిరుమలశెట్టి చిరుసాయితేజ గత కొంతకాలంగా భీమవరం గ్రామీణ మండలానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

దాచేసి దోచేయాలనా?

- గోదాముల్లో రూ.8.25 కోట్ల విలువైన సామగ్రి
- బహిర్గతం చేసిన ఏలూరు ఎమ్మెల్యే చంటి


అధికారిని ప్రశ్నిస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసి రూ.కోట్లాది రూపాయల విలువైన గృహ వినియోగ పరికరాలను గృహనిర్మాణ సంస్థ అధికారులు వినియోగించకుండా గుట్టుగా గోదాముల్లో దాచి ఉంచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి గురువారం ఈ కుట్రను భగ్నం చేశారు. యుద్ధప్రాతిపదికన ఆయన నగర శివారు కొమడవోలులోని హౌసింగ్ లేఅవుట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పక్కనే ప్రైవేటు గోడౌనుల్లో దాచి ఉంచిన లబ్ధిదారులకు చెందిన తలుపులు, కరెంట్ సామగ్రి, వైర్లు, టైల్స్, ఇతర వస్తువులను కనుగొన్నారు. పెద్దఎత్తున ఈ సామగ్రి అంతా ఎందుకూ పనికిరాకుండా ఉండటాన్ని చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ తరువాత హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎందుకు చెప్పలేదని అక్కడున్న అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా బడేటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ లబ్ధిదారులకు చెందిన తలుపులు, ఇతర కరెంట్ సామగ్రి హౌసింగ్ ఉద్యోగులు కొందరు తరలించుకుపోతున్నారనే విషయాన్ని తెలుసుకుని వెంటనే తనిఖీలకు వచ్చానన్నారు. ఓ ప్రైవేటు గోదాములో సుమారు 15,536 మంది లబ్ధిదారులకు చెందిన రూ 8.25 కోట్ల విలువైన సొత్తును ఇలా ఎందుకు మురగపెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామన్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు... తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.
80080 12494

భీమవరం

• భీమవరం • ఉండి

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

కొవ్వొత్తుల ప్రదర్శనలో అధికారులు, కార్యకర్తలు

ఆకివీడు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను ప్రోత్సహించిన. . పెళ్లి చేయాలని పట్టుబట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వాణీవిజయ రత్నం హెచ్చరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఆకివీడు మాదివాడ కూడలి వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలు 2026 మార్చి 8వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

వంతెనకు నిధుల మంజూరుపై హర్షం

చంద్రబాబు, రఘురామ చిత్రపటాలకు క్షీరాభిషేకం

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: కోపల్లెలో దశాబ్దాల కాలం నాటి వంతెన సమస్య పరిష్కారానికి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప సభాపతి రఘురామ చిత్రపటాలకు గురువారం తెదేపా ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. ఉండి డీసీ ఛైర్మన్ తోట ఫణిబాబు, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి పెన్మెత్స విశ్వనాథరాజు, పెదఅమిరం సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, కోపల్లె ఉప సర్పంచి బూడి వెంకటపద్రాలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

? యనమదుర్రు వెళ్లే రహదారి పక్కన ఉన్న పాత యనమదుర్రు కాలువలో చెత్త దుర్వాసన వస్తోంది. ప్లాస్టిక్ సంచులతో డ్రెయిన్ నిండిపోయింది. **- ఎం.రాంబాబు, ప్రైవేటు ఉద్యోగి**

? బ్యాంకు కాలనీలోని డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు రెండ్రోజులకు ఒకసారి వస్తారు. అప్పుడు కూడా సరిగ్గా తీయరు. **- శ్రీను, స్థానికుడు**

✔ డ్రెయిన్లను వెంటనే శుభ్రం చేయిస్తాను. చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటాం.
- ఎ.రాంబాబు, పురపాలక సహాయ కమిషనర్

వీరవాసరం, న్యూస్‌టుడే: ? మత్స్యపురి పంచాయతీకి వెళ్లే రహదారిలో మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. **- రవి**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైతే కచ్చా డ్రెయిను తవ్విస్తాం. **- కల్యాణి, పంచాయతీ కార్యదర్శి**

? రాయకుదురు-వీరవల్లిపాలెం రహదారిలో వీధి దీపాలు పగలే వెలుగుతున్నాయి. **- రామారావు**

✔ పరిశీలించి ఆపిస్తాను.
- సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి పెదపేటలో వీధి దీపాల పునరుద్ధరణ పనులు పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో గురువారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి పెదపేటలో పర్యటించి దీపాలు వేయించారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే ★ కొమరాడ పంట కాలువలో చెత్త పేరుకుపోయిందంటూ ఈ నెల 22న ప్రచురితమైన వార్తకు ఏఈ ప్రసాదరాజు స్పందించి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.★ చినఅమిరం పంచాయతీ తమ్మిరాజు-వెంకట్రాజునగర్‌లో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని 23న ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ స్పందించి శుభ్రం చేయించారు.

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ఈ నెల 26న 13వ వార్డు బేతనిపేట పరిధిలో పలు చోట్ల వీధి దీపాలు వెలగకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యకు పురపాలక ఏఈ సాంబశివరావు స్పందించారు. గురువారం పరిశీలించి మరమ్మతులు చేయించారు.

పాలకోడేరు ఎస్సైకు రివార్డు

పాలకోడేరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ డిజిటల్ అరెస్టు ముఠా గుట్టు రట్టు చేసి కీలక నిందితులను అరెస్టు చేసిన పోలీస్ బృందంలో ఉన్న పాలకోడేరు ఎస్సై మంతెన రవివర్మను ఎస్పీ అద్నాం నయీం అస్మి గురువారం అభినందించారు. భీమవరంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సైకు రివార్డును అందజేశారు.

నేడు ప్రమాణ స్వీకారం

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు.

మిద్దెపై ఆరోగ్య పంట

ఉండి, న్యూస్‌టుడే

పచ్చగా.. ఎంతో అందంగా మార్కెట్లల్లో కనిపిస్తున్న కూరగాయలు, ఆకుకూరలను చూసి అవి తాజాగా ఎలా పండించారని అనుకుంటాం. రకరకాల క్రిమిసంహారక మందులు చల్లిన ఉత్పత్తులవి. సంతలు, దుకాణాలు, ఇంటింటికొచ్చే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు అవన్నీ రసాయన అవశేషాలున్నవే. ఈ దశలో ఆరోగ్యంగా ఎలా జీవించాలి దేవుడా. .! అని సందేహిస్తున్నారా...! మీ ఆరోగ్యం .. మీ ఇంటి మిద్దెపైనే ఉందనే విషయాన్ని గుర్తించమని చెబుతున్నారు ఈ గృహిణులు. వారు పండించే వాటిని తమ అవసరాలకు సరిపోగా మిగిలినవి ఇతరులకు పంచిపెడుతున్నారు. ఇటీవల ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మిద్దె తోటల పెంపకంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు.

చిన్నప్పటి నుంచి మొక్కలంటే బాగా ఇష్టం. 20 ఏళ్ల నుంచి మా ఇంటి మిద్దెపై ఎన్నో రకాల మొక్కలు పెంచుతున్నాను. నాకు ఎవరి సహకారం ఉండదు. సేంద్రియ పద్ధతిలో అనేక రకాలు ఉత్పతులు పండిస్తాను. నేను మందులు వాడనని తెలుసుకొని భీమవరంలో సన్మానించారు. నేను పండించినవి ఇతరులకు పంచిపెడతాను. **- ఎన్.జాన్సీ లక్ష్మీబాయి, భీమవరం**

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..

మెట్టినింటికొచ్చాక కుటుంబ సభ్యుల సహకారంతో మా డాబాపై డ్రమ్ములు, డబ్బాలు, ట్రేలు, బకెట్లు, పనికిరాని డబ్బాల్లో రెండేళ్ల కిందట కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు నాటాను. వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుంటా. జామ, నారింజ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్స్, అనేక రకాల కూరగాయలు పండుతున్నాయి. కాలుష్య రహిత ఆహార పదార్థాలు తింటున్నామనే సంతృప్తితో ఉన్నాం.
- అల్లూరి లీలాభవాని, చిలుకూరు

సామర్థ్యమున్న బస్సులే తిప్పాలి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని విద్యాసంస్థలు పిల్లల కోసం సామర్థ్యమున్న బస్సులనే తిప్పాలని జిల్లా రవాణాధికారి కృష్ణారావు తెలిపారు. ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, నిబంధనలకు విరుద్ధంగా తిప్పితే మొదట నోటీసులు ఇస్తామని, తర్వాత భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అక్రమ రవాణాపై అవగాహన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పీఎస్ఎం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్యశృతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శన చేశారు.

ఉపన్యసించారు.. బహుమతి పట్టారు

'ఈనాడు' ప్రతిభ పాటవ పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను భీమవరంలోని సెయింట్ మేరీస్, బార్డోలి ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు. అనవసర విషయాలకు చరవాణి ఉపయోగించడంతో సమయం వృథాతో పాటు ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో వివరించారు.

విద్యార్థినులతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

సెయింట్ మేరీస్ పాఠశాలలో ఎస్‌కే షర్మిన్ (10వ తరగతి), డి.రాజ్‌కుమార్ (9వ తరగతి), డి.సంజనప్రియ (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపల్ విజయ కుటిన్హ బహుమతులు అందజేశారు.

సెయింట్ మేరీస్ పాఠశాలలో విజేతలతో ప్రిన్సిపల్

బార్డోలి పాఠశాలలో ఇ.ప్రసన్న (10 వ తరగతి), ఎస్.జెస్సీ ప్రావీణ్య (10వ తరగతి), జి.లాస్యశ్రీ (7వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలవగా కరస్పాండెంట్, ప్రిన్సిపల్ గంధం శ్రీదేవి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

కరపత్రాలు అందజేస్తున్న సీతారామలక్ష్మి, నాయకులు

రైతుకు అండగా ప్రభుత్వం

తోకలపూడి (వీరవాసరం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెదేపా భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త, పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. తోకలపూడిలో 'అన్నదాత సుఖీభవ.. రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం రైతులకు చేసే సాయాన్ని వివరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,03,761 మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ.68.97 కోట్లు జమ చేసిందన్నారు. ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాత, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, తెదేపా మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చింతపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

★ తెదేపా నాయకులు కూటమి మిత్ర ధర్మాన్ని విస్మరిస్తున్నారని తోలేరు సర్పంచి, మండల జనసేన ఉపాధ్యక్షుడు వేండ్ర లీలాకృష్ణ విమర్శించారు. ప్రభుత్వంలో భాగమైన జనసేన, భాజపా నాయకులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలు చేయడం సరికాదన్నారు.

మాట్లాడి పరిష్కరించండి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ అర్జీలపై ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడాకే పరిష్కరించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. గడువులోగా సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో గ్రామవార్డు సచివాలయాల జిల్లా అధికారి దోసిరెడ్డి పాల్గొన్నారు.

క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: యంగ్ మైండ్ ఇంటర్నేషనల్ క్లబ్ కలవపూడి శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జువ్వలపాలెంలో గురువారం జరిగింది. క్లబ్ జిల్లా గవర్నర్ బిషప్ ఏజేసీ శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా ఎస్.యాకోబు, కార్యదర్శిగా ఎం.రత్నకుమార్, కోశాధికారిగా డి.శామ్యూల్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

పాలకోడేరు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు రాష్ట్రస్థాయి పోటీలు దోహదపడతాయని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి తెలిపారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ అండర్-14 బాలుర, బాలికల పోటీలను గురువారం డీఈవో నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 390 మంది క్రీడాకారులు తరలిరాగా తొలిరోజు లీగ్ మ్యాచ్‌లు ఉత్సాహంగా జరిగాయి.

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, డీఈవో నారాయణ

ఎంఈవో-2 హరిఆనందప్రసాద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మల్లేశ్వరరావు, హెచ్ఎం కాశీజగన్నాథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్టిబాబు, ఎండీ ఖుద్దీస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని భీమవరం ఏఆర్‌కేఆర్ పురపాలకోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. తెలుగు, ఆంగ్లం, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. డీఈవో ఇ.నారాయణ, సమగ్రశిక్షా ఏసీపీ పి.శ్యాంసుందర్, పాల్ ల్యాబ్స్ డీఎన్‌వో కిశోర్‌బాబు పరిశీలించారు.

కార్పొరేట్ల కోసమే చట్టాల సవరణ

మాట్లాడుతున్న అశోక్ ధావలే

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్రంలోని మోదీ సర్కార్ కార్పొరేట్ల కోసమే కార్మిక చట్టాలు, వ్యవసాయ చట్టాలను మార్పు చేసిందని భారత్ కిసాన్ సభ ఆల్ ఇండియా అధ్యక్షుడు అశోక్ ధావలే విమర్శించారు. గురువారం భీమవరం ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలు, ప్రభుత్వాల బాధ్యతలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మంతెన సీతారాం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో అశోక్ ధావలే మాట్లాడుతూ గడిచిన 40 ఏళ్లలో 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రధాని మోదీ హయాంలోనే లక్ష మంది ఉన్నారన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పాల్గొన్నారు.

రైతు భవనానికి నిధి: దిల్లీలో నిర్మిస్తున్న రైతు భవనానికి రైతు కార్యాచరణ సమితి నేతలు పాతపాటి మురళీరామరాజు, కలిదిండి గోపాలకృష్ణరాజు, పేరిచర్ల లక్ష్మణవర్మ, ఆర్.రఘురామరాజు, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ తరపున రూ.1.25 లక్షలు విరాళంగా అందజేశారు.

బల్ల దాటితేనే ఇంట్లోకి

డ్రెయినేజీపై ఏర్పాటు చేసుకున్న చెక్కలు

శృంగవృక్షం (పాలకోడేరు), న్యూస్‌టుడే: శృంగవృక్షం ప్రధాన వీధుల్లో ఆక్రమణలు తొలగించిన అనంతరం డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివాలయం వీధి, పాఠశాల వీధిలో గతంలో మురుగు కాలువను ఆక్రమించి నిర్మాణాలతో పూర్తిగా పూడ్చివేశారు. దీంతో కొద్దిపాటి వర్షం వచ్చినా నీరంతా రోడ్లను ముంచెత్తడం పరిపాటిగా మారింది. సమస్యను ఎమ్మెల్యే, ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో సుమారు రెండు నెలల కిందట రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలు, నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. ఫలితంగా మురుగు నీరు సజావుగా పారుతోంది. ఇళ్ల ముందు కాలువ మాదిరిగా తయారైన డ్రెయినేజీ దాటలేక నానా యాతన పడుతున్నారు. పలువురు తాత్కాలికంగా బల్లలను ఏర్పాటు చేసుకుని ఇళ్లలోకి, షాపుల్లోకి రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా పక్కా డ్రెయినేజీ నిర్మించి ఇక్కట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని, త్వరలోనే పనులు చేపడతామని కార్యదర్శి కోదండరామయ్య తెలిపారు.

కనుల వైకుంఠం.. తెప్పోత్సవం

చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే: చెరుకువాడలోని రాజులపేటలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 75 వార్షికోత్సవంలో భాగంగా గురువారం రాత్రి మంచినీటి చెరువులో కనులపండువగా తెప్పోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఊంజల్ సేవ అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

చెరుకువాడ: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

స్వామివార్ల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: షష్ఠి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీరామపురం కూడలిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర, రామలింగేశ్వరస్వామి రథోత్సవం గురువారం కోలాహలంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని రథోత్సవం ప్రారంభించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామివార్లకు కల్యాణం నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.27.03 లక్షలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించగా 40 రోజులకు రూ.27,03,849 సమకూరింది. అన్నసమారాధనలోని హుండీ ద్వారా రూ.1,27,617 వచ్చినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు.

డబ్బులు లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ఏఎంసీ ఛైర్మన్ వెంకట్రావు, నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: షష్ఠి మహోత్సవాలను పురస్కరించుకుని ఆనాల చెరువు వద్ద ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గురువారం అభిషేకాలు, పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, వాయిద్యాల నడుమ స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా, జె.సుబ్రహ్మణ్యంరాజు, కిమిడి నాగరాజు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం కనీస బాధ్యతని కృష్ణబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. తీవ్రంగా గాయపడి భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొగల్తూరుకు చెందిన బాలుడు బాబీకి చికిత్స నిమిత్తం రూ.15 వేలను ఆయన అందజేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

అండలూరు (వీరవాసరం), న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసే అంశంపై అండలూరు, మారంపల్లి, శిరగారపల్లి, వడలి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గురువారం అండలూరులో పంచాయతీ కార్యదర్శి మాణిక్యం ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై డీపీఆర్సీ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

కుట్టు మిషన్ల పంపిణీ

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాత అన్నారు. గంటా రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చినఅమిరంలో 23 మంది మహిళలకు గురువారం కుట్టుమిషన్లను ఆమె అందజేశారు.

చికిత్స పొందుతూ మృతి

అనాకోడేరు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనాకోడేరు గ్రామానికి చెందిన పరువు జాన్‌రత్నం (75) మృతి చెందినట్లు రైటర్ మహేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఈనెల 18న ఇంటి వద్ద జాన్‌రత్నం ద్విచక్ర వాహనం స్టార్ట్ చేస్తూ కిందపడి గాయపడ్డాడు. అతని కుమారుడు రవిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విజేతలకు బహుమతులు

జాయ్‌ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాయకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అమరావతి మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థిని యేలేటి జాయ్, తల్లిదండ్రులను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా ఓటర్ల జాబితా తనిఖీ: ఉండి, న్యూస్‌టుడే : ఓటర్ల జాబితా తనిఖీ ప్రక్రియను వేగవంతం చేయాలని నియోజకవర్గ సహాయ ఓటర్ల నమోదు అధికారి కె.నాగార్జున ఆదేశించారు. ఉండి రెవెన్యూ కార్యాలయంలో ఉండి, కాళ్ల మండలాల్లోని బూత్ స్థాయి అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 2002లో 215 పోలింగ్ కేంద్రాల్లో 2,07,920 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం 238 కేంద్రాల్లో 1,58,406 మంది నమోదయ్యారని తెలిపారు. కాళ్ల తహసీల్దార్ సుందర్ సింగ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రత్నకుమార్ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించండి: ఉప్పులూరు (ఉండి), న్యూస్‌టుడే: గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని, అప్పుడే నూరు శాతం సత్ఫలితాలు సాధ్యమవుతాయని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఉప్పులూరులో స్వచ్ఛ గ్రామం. . హరిత గ్రామం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చెత్తగుట్టల తొలగింపు, వీధులను శుభ్రపరచడం, ముగ్గు, బ్లీచింగ్ సూపర్ శానిటేషన్ పనులు చేశారు. ఏడు ట్రాక్టర్ల చెత్తను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ నెల 14 నుంచి గ్రామంలో జ్వరాల నియంత్రణకు యండగండి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో చేస్తున్న కృషి ఫలించిందని వివరించారు. ఇంటింటికీ వెళ్లి మరోసారి జ్వరాల సమాచారాన్ని సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సీఎస్వీ రెడ్డి, సర్పంచి యర్రా దుర్గారావు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

రహదారి నిర్మాణం పరిశీలన: భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం-శ్రీరామపురం రహదారి నిర్మాణ పనులను కలెక్టర్ నాగరాణి గురువారం పరిశీలించారు. డిసెంబరు 15 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పురపాలక అధికారులకు సూచించారు. ఎం.ఇ పి.త్రినాథరావు, డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టార్పాలిన్ మ్యాట్‌లు అందజేత: భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గునుపూడిలోని శ్రీఉమా సోమేశ్వర మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రూ.4 వేలు విలువైన టార్పాలిన్ మ్యాట్‌లను అందజేసినట్లు మానవతా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహనవర్మ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు: భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని పీపీ రోడ్డు, జువ్వలపాలెం రోడ్డులోని రహదారులు, డ్రెయిన్లపై ఆక్రమణలను పురపాలక అధికారులు గురువారం తొలగించారు. కొన్నిచోట్ల అడ్డదిడ్డంగా ఉన్న సామగ్రిని పురపాలక కార్యాలయానికి తరలించారు.

రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పెదవీరప్ప: ఉండి, న్యూస్‌టుడే: వైకాపా రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పాములపర్రు మాజీ సర్పంచి తాటిపట్టి పెదవీరప్ప నియమితులయ్యారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్ నరసింహరాజును గురువారం కలిసి ధన్యవాదాలు తెలిపారు.



(c) eenadu

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నేడు డయల్ యువర్ కమిషనర్

పాలకొల్లు, న్యూస్‌టుడే: మీరు పాలకొల్లు వాసులా? పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల మరమ్మతులు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారా? మీ సమస్యలను 'ఈనాడు' ఆధ్వర్యంలో పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటికి పరిష్కారం చూపేందుకు 'డయల్ యువర్ కమిషనర్' శుక్రవారం నిర్వహించనున్నాం. మీరు చేయాల్సిందల్లా.. పేర్కొన్న తేదీన, దిగువ తెలిపిన నంబర్‌కు ఫోన్ చేయడమే!

తేదీ: 28-11-2025, శుక్రవారం
ఉదయం 9 నుంచి 10 గంటల వరకు
ఫోన్ నంబర్: 08814-222820

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన న్యూలైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ నగర్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు బిషప్ వై. డేవిడ్‌రాజు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. వైద్యులు సునీల్ రాజ్, హారిక రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యూలైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వై. జాన్‌కుమార్, పాస్టర్ జానరత్నం తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వంతో నాయకత్వ లక్షణాలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: వక్తృత్వంతో నాయకత్వ లక్షణాలు మెరుగు పడతాయని ప్రధానోపాధ్యాయుడు ఏవీ మురళీధర్ అన్నారు. మండలంలోని నీటితిప్ప జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి మూడు స్థానాల్లో కొల్లాటి శృతి (ఏడో తరగతి), కొల్లాటి దీవెన (పదో తరగతి), దిద్దే హరిబాబు (పదో తరగతి) నిలిచారు. వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ముంచుకొస్తున్న గడువు.. దొరకని జాగా

పట్టణం జనాభా: సుమారు 65 వేలు
వార్డులు: 31
సేకరించే చెత్త: 35- 40 టన్నులు

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో డంపింగ్ యార్డు సమస్య జటిలంగా మారింది. వశిష్ఠ గోదావరి గట్టుపై చెత్తవేయొద్దని, ఇప్పటికే వేసిన దాన్ని వచ్చేనెల 3వ తేదీ నాటికి తొలగించాలని హరిత ట్రైబ్యునల్ సదరన్ బెంచ్ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. చెత్త తొలగించడం ఒక ఎత్తయితే.. ప్రస్తుతం సేకరించిన చెత్త వేసేందుకు జాగా లేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఏటిగట్టుపై లారీకి ఎగుమతి చేస్తున్న చెత్త

కొలిక్కి రాని స్థల సమస్య.. డంపింగ్‌యార్డు స్థల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. గతంలో సేకరించిన భూమిలో చెత్త వేయడానికి సాంకేతిక కారణాలు, ప్రజాభ్యంతరాలు అడ్డంకిగా మారాయి. సుమారు ఏడాదికాలంగా స్థల సమస్య ఉన్నా పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కారానికి చేసిన కృషి అంతంత మాత్రమే. నూతనంగా రుస్తుంబాద శివారు మండావారి గరువు సమీపంలోని పేదల కాలనీకి కేటాయించిన రెండెకరాల లేఅవుట్‌లో చెత్త వేసేందుకు నిర్ణయించారు. అక్కడా ప్రజలు అభ్యంతరం తెలపడంతో యంత్రాంగం ఆఘమేఘాలపై పరుగులు పెడుతున్నారు.

ఆర్థిక భారం.. పట్టణంలో శుద్ధి చేసిన చెత్తను గుంటూరులోని జిందాల్ పరిశ్రమకు చేరవేసేందుకు పురపాలక సంఘం సొంత నిధులు వెచ్చించాల్సి వస్తుంది. రోజుకు రెండు లారీల్లో చెత్త తరలిస్తున్నారు. ఒక లారీ చెత్త రవాణాకు రూ.24 వేలు వెచ్చిస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో చెత్త తరలించడం సాధ్యం కావడంలేదు.

నియంత్రణ శూన్యం.. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలుకు అధికారులు చర్యలు చేపట్టడంలేదు. పట్టణంలో స్వచ్ఛత మచ్చుకైనా కనబడటం లేదు. ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి.

పరిష్కారానికి చర్యలు.. మండవారిగరువు ప్రాంతంలో గుర్తించిన స్థలాన్ని ఇకపై డంపింగ్ యార్డుగా వినియోగించం. చెత్త సమస్య త్వరలోనే పరిష్కారం కానుంది. చెత్త శుద్ధి చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను గుంటూరు తరలిస్తాం. తడి చెత్తతో ఎరువులు తయారు చేయిస్తాం.
-ఎం.అంజయ్య, కమిషనర్, పురపాలకసంఘం, నరసాపురం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట	: 90631 44737
పాలకొల్లు	: 80085 74510	పెనుగొండ	: 80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర	: 91212 29087

పెనుగొండ, న్యూస్‌టుడే: ? పెనుగొండ సామాజిక ఆరోగ్య కేంద్ర సమీపంలో డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. -అంజిబాబు
✔ చెత్తను తొలగింపజేస్తాం. -శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? శనివారపుపేటలోని డ్రెయిన్‌లో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. దీంతో డ్రెయిన్లో మురుగు పారడం లేదు. -జె. సూర్యనారాయణ
✔ పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -పోతురాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? జగన్నాథపురంలో వీధిదీపాలు సక్రమంగా వెలగడంలేదు. రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. - నాగరాజు, జగన్నాథపురం
✔ వీధిదీపాలకు మరమ్మతులు చేయించాల్సిందిగా పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తా. - నవీన్‌కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ? స్థానిక అచ్చుగట్లపాలెం బొర్రావారితోటలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళలో ఇబ్బందికరంగా ఉంటుంది. - నాని
✔ మరమ్మతులు చేయిస్తాం. - రాజ్‌కుమార్, పురపాలక డీఈ

స్పందనకు వందనం

వెలిగిన దీపాలు.. పెనుగొండ, న్యూస్‌టుడే: చెరుకువాడ పరిధి బాపూజీపురంలో మూడు వీధి దీపాలు వెలగడం లేదని ఈ నెల 23న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి నక్కా శ్యామలాసోని, ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి స్పందించి సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు గ్రామీణ పంచాయతీ పరిధి చిట్టాయి చెరువుగట్టు, బ్యాంకు కాలనీ మార్గాల్లో 'దీపాలు లేక.. ఉన్నా వెలగక' శీర్షికతో ఈ నెల 19న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు స్పందించి అక్కడ కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

పార్టీలో చేరిన వారితో నాయకర్, కొత్తపల్లి

జనసేనలో చేరిక

మొగల్తూరు, న్యూస్‌టుడే: రామన్నపాలెం పంచాయతీ జెట్టిపాలెనికి చెందిన బీసీ సంఘ నాయకులు గురువారం జనసేనలో చేరారు. గ్రామానికి చెందిన కడలి బాబులు, ఏసు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆధ్వర్యంలో జనసేన తీర్థం తీసుకున్నారు. నేతలు వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, సర్పంచి బందిల ఎలీషా, ఉప సర్పంచి మేకల పరశురామ్, జనసేన మండలశాఖ అధ్యక్షుడు కొల్లాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

పెనుగొండ, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని గురువారం సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీవోఏలు స్థానిక తూము సెంటర్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేసేవరకు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో పెనుగొండలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు కానూరి తులసీ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు షేక్ పాదుషా, సీఐటీయూ జిల్లా నాయకుడు నాగిశెట్టి గంగారావు పాల్గొన్నారు.

చెట్లు తరలించిన 'పుష్ప' ఎవరో తేల్చండి

పురపాలక సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

సభ్యుల వాగ్వాదం

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో నేలకూలిన చెట్లను అక్రమంగా తరలించుకుపోయిన 'పుష్ప' ఎవరో తేల్చి, వారిపై 24 గంటల్లో చట్టపరమైన చర్యలు చేపట్టిన అనంతరం సమావేశం నిర్వహించాలని వార్డు కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో సమావేశాన్ని ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ ఈ నెల 28 మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. పురపాలక కౌన్సిల్ సమావేశాన్ని గురువారం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. గతంలో తాగునీటి పథకంలో విద్యుత్తు మోటార్ల విక్రయానికి పాల్పడ్డారని, ఇప్పుడు వృక్షాలను విక్రయిస్తున్నారని, భవిష్యత్తులో పురపాలక సంఘ ఆస్తులూ అమ్మేస్తారని వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని అన్నారు. కూలిన చెట్లను తొలగించడానికి అటవీశాఖ అధికారుల అనుమతి, విక్రయానికి వేలం పాట నిర్వహించాల్సి ఉండగా పడుగుల తోటలో కూలిన వందేళ్ల వయసున్న చెట్ల విషయంలో అవేమీ ఎందుకు పాటించలేదని వార్డు కౌన్సిలర్ సఖినేటిపల్లి సురేశ్ నిలదీశారు. పట్టణంలో చాలా చెట్లు నేలకూలాయని వాటన్నిటినీ ఎవరు అక్రమంగా తరలించారో తేల్చి చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ వన్నెంరెడ్డి శ్రీనివాస్ కోరారు.

గతంలో తాగునీటి పథకం వద్ద విద్యుత్తు మోటార్లు దొంగిలించి అమ్మకానికి పాల్పడిన సిబ్బందిపై పోలీసులకు చేసిన ఫిర్యాదును ఎందుకు వెనక్కి తీసుకున్నారు..?, వారిని తిరిగి విధుల్లోకి ఎలా తీసుకున్నారో తెలియజేయాలని కౌన్సిలర్ కోటిపల్లి సురేశ్ అన్నారు.

తుపాను సమయంలో తమ వార్డులోకి అధికారులు ఎవరూ ఎందుకు రాలేదని కౌన్సిలర్ అడిదల శ్యామల నిలదీశారు. తుపాను సహాయక చర్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వార్డు కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

చెట్లు తరలించుకుపోయిన బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, దీనిలో పురపాలక సంఘ సిబ్బంది హస్తం ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ స్పష్టం చేశారు. చెత్త తరలింపునకు స్థలాల గుర్తింపు, తాగునీరు, వీధిదీపాలు, రహదారులు వంటి ప్రధాన సమస్యలపై సమావేశంలో చర్చించకపోవడంపై పట్టణ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

పైపులైను విస్తరణకు సహకరించండి

పోడూరు, న్యూస్‌టుడే: ఆయిల్, సహజ వాయువుల సంస్థ ద్వారా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా నిర్మిస్తున్న పైపులైన్ విస్తరణ రైతులంతా సానుకూలంగా స్పందించి సహకారం అందించాలని తహసీల్దార్ సయ్యద్ మహ్మద్ ఫాజిల్ కోరారు. కవిటం రెడ్డి కల్యాణ మండపంలో పోడూరు, కవిటం రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూసేకరణ చేసి రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తున్నారు. పైపులైన్ వేసిన తరువాత ఆ భూమి రైతుల అధీనంలోనే ఉంటుందన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచులు తుల సువర్ణరాజు, చుట్టుగుళ్ల పూర్ణిమ, ఓఎన్‌జీసీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం చందపర్రు, సింగోడియాన్ ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐఐఎఫ్ఎల్ సంస్థ గురువారం బ్యాగులు సమకూర్చింది. విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సంస్థ సభ్యులు ఆకాంక్షించారు.

తనిఖీల్లో పారదర్శకత అవసరం

మాట్లాడుతున్న మల్లికార్జునరావు

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా మండలంలో 2024-25లో చేపట్టిన సుమారు రూ.5 కోట్ల విలువైన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు మాట్లాడుతూ వివిధ శాఖల పరిధిలో చేపట్టాల్సిన తనిఖీలపై పలు సూచనలు చేశారు. పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శుద్ధి జలాల వృథా

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని పార్కురోడ్డు శ్రీ సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న కంట్రోలు వాల్వు నుంచి శుద్ధి జలాలు లీకై వృథాగా పోతున్నాయి. కుళాయిలకు తాగునీటి సరఫరా చేసిన సమయంలో ఈ జలాలు లీకై రహదారి పైకి, అక్కడ నుంచి డ్రెయిన్లకు చేరుతున్నాయి. నీటి సరఫరా నిలిపివేసిన అనంతరం రోడ్డుపైకి చేరిన నీరు పైపులోకి చేరి తాగు నీరు కలుషితమవుతోంది. నీటినిల్వతో రహదారి ధ్వంసమై ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 'న్యూస్‌టుడే' ఈ సమస్యను పురపాలక సంఘ డీఈ ఆర్.గంగావరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఎయిర్‌వాల్వుకు వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తానన్నారు.

ప్రమాద ప్రయాణాలు.. ఆగేదెలా..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: రోజు రోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నా వాటిని కొందరు పట్టించుకోకుండా ప్రమాదకరమైన ప్రయాణాలు చేస్తున్నారు. యువత మితిమీరిన వేగం, అడ్డదిడ్డంగా నడపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిర్దేశించిన సంఖ్యలో ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోవల్సి ఉండగా.. పాలకొల్లులో చిన్నారులను వెనుక భాగంలో కూర్చోబెట్టి నడుపుతున్నారు.

లక్షలు పోశారు... నిర్లక్ష్యంగా వదిలేశారు...

ఒకటి రెండు కాదు...ఏకంగా రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఆ మంచినీటి పథకాన్ని నిరుపయోగంగా వదిలేశారు. మార్టేరులో వైకాపా ప్రభుత్వంలో జలజీవన్‌మిషన్ పథకం కింద 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మించారు. వివిధ ప్రాంతాలకు పైపులైన్లు, మంచి నీటి కుళాయిలు సైతం ఏర్పాటు చేశారు. విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దీంతో ట్యాంకు పరిసర ప్రాంతం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా మారడంతో పాటు నిర్మాణం సైతం దెబ్బతింటోంది. నిర్మాణ పనులకు అంచనాలు రూపొందించినప్పుడు విద్యుత్తు సౌకర్యం కల్పనకయ్యే వ్యయాన్ని పట్టించుకోకపోవడంతో భారీ నీటి పథకం సేవలకు దూరమైంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందు మాట్లాడుతూ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, మార్టేరు

మంచినీటి ట్యాంకు

చెత్త కొండ.. ఎత్తకుండా

ఆచంట: సంపద సృష్టి కేంద్రం వద్ద..

ఆచంట, న్యూస్‌టుడే: మండల కేంద్రం ఆచంట సంపద సృష్టి కేంద్రం వద్ద చెత్త కొండలా పెరిగిపోయింది. దాని సమీపంలో ఉంటున్న నివాసితులు, దుకాణాల యజమానులు దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. గతంలో సామాజిక ఆరోగ్యకేంద్రం సమీపంలో కూడా చెత్త తరలించేవారు. తాజాగా సీహెచ్‌సీకి డయాలసిస్ కేంద్రం మంజూరు కావడంతో అక్కడ వేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో సంపద సృష్టి కేంద్రం వద్ద చెత్త వేస్తున్నారు. వేమవరం, వల్లూరు, పెనుమంచిలి, కొడమంచిలి తదితర గ్రామాల్లో మేజర్, మీడియం డ్రెయిన్ల గట్లపైకి తరలిస్తున్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి ఎంపీడీవో కె.బులిసూరన్నను సంప్రదించగా.. ఆయా ప్రాంతాలను పరిశీలించి చర్యలకు కార్యదర్శులను ఆదేశిస్తామన్నారు.

సాయిబాబాకు అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పార్కు వీధి, స్వరాజ్య రామం వీధిలోని శిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సహస్ర నామార్చనలు చేసి పంచ హరతులిచ్చారు. ఉదయం నుంచి బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ఉమారామలింగేశ్వరాలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 267 రోజులకు రూ.497279 వచ్చిందని ఆలయ ఈవో ఏవీ.సత్యనారాయణ తెలిపారు. ట్రస్టీబోర్డు ఛైర్మన్ ఎన్.గజేశ్వరరావు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న షష్ఠి ఉత్సవాలు

యలమంచిలి, న్యూస్‌టుడే: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా గురువారం గుంపర్రులో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామిని మినీ రథంపై ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు. యలమంచిలిలో విద్యుత్తు వెలుగుల నడుమ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

పంచపాలిక పూజలు.. పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పాంచాహ్నిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో ఉదయం పంచపాలిక పూజలు, హోమాలు జరిపించారు. సాయంత్రం బలిహరణ, సదస్యం చేయించారు.

సీతారామస్వామికి శాంతి కల్యాణం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో సీతారామచంద్రస్వామి ఆలయం సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి హోమాలు, సీతారామస్వామివారికి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.

వ్యాసరచన, క్విజ్ పోటీలు

చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం లంకలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని గురువారం ప్రధానోపాధ్యాయుడు కె.రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రాజ్యాంగ ప్రవేశిక పఠనం, మాక్ అసెంబ్లీ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన సహాయకుడు గొల్ల జనార్దన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మైక్ సెట్ అందజేత.. నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని ఎస్ఎల్ఎన్ పాఠశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పోటీలు నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది చదలవాడ జ్ఞానప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఆశా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కలిగితి రాజబాబు పాఠశాలకు ఆడియో మైక్ సిస్టమ్ బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి. జాన్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు యు.పెద్దిరాజు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆర్వో ప్లాంటు బహూకరించిన సర్పంచి పద్మావతి

దాతల సహకారం అభినందనీయం

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఇలపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమని తెదేపా సీనియర్ నాయకుడు, సొసైటీ అధ్యక్షుడు కేతా సత్తిబాబు అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సర్పంచి దండు పద్మావతి రూ.1.85 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్‌ను గురువారం పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పి.నాగేశ్వరి, పాఠశాల ఛైర్మన్ చికిలే కృష్ణబాబు, తెదేపా గ్రామాధ్యక్షుడు పాతపాటి సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెలివిజన్ వితరణ.. పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ ప్రశాంత నిలయ వృద్ధాశ్రమానికి ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ రూ.30 వేల విలువైన టెలివిజన్ బహూకరించడం అభినందనీయమని ఆశ్రమ గౌరవ అధ్యక్షుడు బి.వి.రమణ తెలిపారు. భవిష్యత్తులో తన వంతు సహకారం అందిస్తానని ఎస్సై వివరించారు.

స్థానిక ఎన్నికలకు ముందే బీసీ కులగణన చేయాలి

సమావేశంలో ప్రసంగిస్తున్న తులసిగిరి

మొగల్తూరు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ కులగణన పూర్తి చేయాలని నేషనల్ బీసీ సమైక్య సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు గుత్తుల తులసీగిరి ప్రభుత్వాన్ని కోరారు. మొగల్తూరులో గురువారం సంఘ నాయకుడు కడలి చంటీశ్వరరావు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 శాతం పైబడి బీసీ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన బీసీ రక్షణచట్టం, 50 ఏళ్లకే సంక్షేమ పింఛను హామీలు అమలుకు చేయాలన్నారు. ఈ సందర్భంగా సంఘ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరమామిడి గంగారామ్, కండిబోయిన సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ అధ్యక్షుడు కడలి శ్రీమన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు బెల్లపు భూలోకం, మండలశాఖ గౌరవ అధ్యక్షుడు వాటాల కృష్ణమూర్తి, అధ్యక్షుడు మామిడిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి

నరసాపురం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అన్నదాతలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో దాసి రాజు సూచించారు. వర్షం ప్రభావంతో అన్నదాతలు ఏ విధంగా నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు వేగంగా తరలిస్తామన్నారు. కల్లాల్లోని ధాన్యం తడవకుండా బరకాలు సరఫరా చేస్తామని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కష్టపడాలి

ఆచంట: మాట్లాడుతున్న జస్బీర్ సింగ్

పాలకొల్లు మార్కెట్, ఆచంట, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఏఐసీసీ సభ్యుడు జస్బీర్ సింగ్ అన్నారు. పాలకొల్లు పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు నియామకంపై సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. పరిశీలకుడిగా ఆయన హాజరయ్యారు. సమావేశంలో నాయకులు భాస్కరరావు, హరికిరణ్, అర్జునరావు, శివాజీ పాల్గొన్నారు. ★ క్షేత్ర స్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలకు విలువిచ్చి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం చేస్తున్నామని ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు జస్బీర్ సింగ్ స్పష్టం చేశారు. ఆచంటలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు డి.మురళీమోహనరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సతీష్, సత్యనారాయణ మాట్లాడారు.

రైతులకు ప్రభుత్వ రాయితీలు

ఎ.వేమవరంలో మాట్లాడుతున్న సురేశ్‌బాబు

ఆచంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అనేక రాయితీలు ఇవ్వడంతో పాటు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని జడ్పీటీసీ సభ్యుడు యు.సురేశ్‌బాబు అన్నారు. గురువారం ఆచంట వేమవరం, కరుగోరుమిల్లి, శేషమ్మచెర్వు గ్రామాల్లో 'రైతన్నా మీకోసం' సమావేశాల్లో పాల్గొన్నారు. ఏవో నాగరాజు, తెదేపా మండల అధ్యక్షుడు సీతారాం తదితరులు రైతులకు కరపత్రాలు పంచి అవగాహన కలిగించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రైతులతో మాట్లాడుతున్న నూకరాజు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి వై.నూకరాజు అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు, కొత్తపేట, చందపర్రు, లంకలకోడేరు, వెలివెల గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో రసాయనాల వాడకంతో ఉత్పత్తులు విషపూరితంగా మారుతున్నాయన్నారు. తక్కువ ఖర్చుతో స్వయంగా కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకోవడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

బాల్య వివాహాలు అరికడదాం

ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం టౌన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పెంటపాడు మండల పర్యవేక్షణాధికారిణి సుజాత అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ధాన్యం సంచుల కొరత లేదు

ఇరగవరం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సంచులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని వ్యవసాయాధికారి వై. రామవెంకటేశ్వరరావు తెలిపారు. రేలంగి, కావలిపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి తేమ శాతం కొలిచే యంత్రం పనితీరును పరిశీలించారు. మండలంలో 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే కోసిన చేలలో ధాన్యం ఒబ్బిడి చేసి మిల్లుకు తరలించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు (గ్రామీణం)	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? నవ్వారుపేటలో పందుల సంచారంతో పరిసరాలు కలుషితమవుతున్నాయి. - శివాజీ
✔ అవసరమైన చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? సవిత్ర్యపేటలోని ఖజానా రోడ్డులో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - నరేంద్ర
✔ సమస్య పరిష్కరిస్తాం. - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

టిడ్కో... గూడు ఎప్పటికో..?

తణుకు, న్యూస్‌టుడే

తణుకు టిడ్కో లబ్ధిదారుల సొంతింటి కల సాకారం కావడం లేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 913 మందికి ప్రధాన మంత్రి ఎన్టీఆర్ ఆవాస యోజన కింద చేపట్టిన టిడ్కో ఇళ్ల సముదాయాల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందాన మిగిలిపోయింది. సొంతింటి కల నెరవేరుతుందని అప్పులు చేసి కిస్తీలు చెల్లించారు. ప్రారంభంలో దాదాపు 60 శాతం పనులు పూర్తి చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోవడంతో నేటికీ నిర్మాణాలు పూర్తికాక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక అద్దె ఇళ్లలోనే లబ్ధిదారులు మగ్గుతున్నారు.

మోసగించిన వైకాపా..

గత వైకాపా హయాంలో నిర్మాణాలు నిలిచిపోవడంతో లబ్ధిదారులు పలుమార్లు ఆందోళనలు చేపట్టి ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో నిర్మాణాలు పూర్తి చేసి అప్పగిస్తామని నమ్మబలికి వివిధ బ్యాంకుల ద్వారా రూ.లక్షల్లో రుణాలు మంజూరు చేయించి నిర్మాణాలు గాలికొదిలేశారు. దీనికి తోడు రుణాల పేరుతో వచ్చిన సొమ్ములు మొత్తం ఏమయ్యాయో నేటికీ తెలియని దుస్థితి. దీంతో బకాయిలు చెల్లించాలంటూ బ్యాంకర్లు లబ్ధిదారులను ఒత్తిడి తెస్తుండడంతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మరో పక్క భవనాల ఊచలు తుప్పు పట్టి నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పరిసరాల్లో తుప్పలు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి.

పడిపోయిన సిబిల్ స్కోర్లు

బకాయిలు చెల్లించాలని బ్యాంకుల సిబ్బంది లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఒక పక్క అద్దెలు చెల్లించలేక మరో పక్క బ్యాంకర్ల సందేశాలు, ఫోన్ కాల్స్‌తో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మరోపక్క సిబిల్ స్కోర్లు పడిపోతున్నాయి. కనీసం చరవాణి కొనుగోలు చేయాలన్నా సిబిల్ స్కోర్ లేదని తిరస్కరిస్తుండడంతో అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణం ఇల్లు అప్పగించాలి..

మా నాన్న పేరుతో టిడ్కోలో 435 చదరపు అడుగుల ఫ్లాట్ కోసం రూ.25 వేలు చొప్పున రెండు డీడీలు తీసి చెల్లించాం. గత వైకాపా ప్రభుత్వంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రూ.2.4 లక్షలు రుణం ఇప్పించారు. ఇంటి నిర్మాణం పూర్తి చేయకపోగా రుణ బకాయి చెల్లించాలని బ్యాంకు ఒత్తిడి చేస్తోంది. మున్సిపాలిటీలో అడిగితే సరైన సమాధానం దొరకడం లేదు. తక్షణం నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్లు అప్పగించాలి. లేదా స్థలమైనా కేటాయించాలి. - సంతోష్

'ఆసుపత్రికి ఎకరా భూమి ఇస్తాం'

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మదర్ వన్నిని ఆసుపత్రికి 10 డయాలసిస్ యంత్రాలు సమకూర్చుతున్నట్లు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు బి.విజయ మార్ రాజు ప్రకటించారు. అందుకు దాదాపు సుమారు రూ.80 లక్షలు ఖర్చవుతుందని.. తాడేపల్లిగూడెం జాతీయ రహదారి వెంబడి లయన్స్ ఆ ఆసుపత్రి నిర్మాణం కోసం ఎకరా పొలం విరాళంగా ఇవ్వనున్నట్లు పట్టణానికి చెందిన చలంచర్ల మురళీ ప్రకటించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు భరోసా

గణేశ్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జనసైనికుల చేతులమీదుగా తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన ఇద్దరికి రూ.1.6 లక్షలకు సంబంధించి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో అందించారు. అడపా ప్రసాద్, చాపల రమేష్, కొవ్వూరి లక్ష్మారెడ్డి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

ఇరగవరం, న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఏలేటిపాడు సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న రైస్ మిల్లులో డ్రయ్యర్ నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ, గౌరవంతో అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఏలేటిపాడు సొసైటీ పేకేరు, ఏలేటిపాడు, అయితంపూడి గ్రామాల పరిధిలో రైతులకు బహుముఖ సేవలందిస్తూ ఇతర సొసైటీలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైస్‌మిల్లు, పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, పాల కేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు కర్రి వీర్రెడ్డి, డైరెక్టర్లు పోతిరెడ్డి శ్రీనివాసరావు, చోడే సంజీవరావు, నాయకులు పాల్గొన్నారు.

ఏలేటిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

ప్రతి ఒక్కరూ దాతృత్వం అలవర్చుకోవాలి

తణుకు, న్యూస్‌టుడే: దాతృత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చిలుకూరి విశ్వేశ్వరరావు సతీమణి చిలుకూరి కృష్ణవేణి జ్ఞాపకార్థం సజ్జాపురంలోని 14వ నంబర్ మున్సిపల్ స్కూల్ ఆవరణలో నిర్మించిన ఆర్వో ప్లాంటును రాధాకృష్ణ గురువారం ప్రారంభించారు. దొమ్మేటి వెంకట సుధాకర్ తల్లిదండ్రులు గోవిందమ్మ సూర్యం, ఇందిరాదేవి జ్ఞాపకార్థం రూ.లక్ష పాఠశాల అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలను రాధాకృష్ణ అభినందించారు.

ఘనంగా సుబ్బారాయుడి గ్రామోత్సవం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సుబ్బారాయుడు గురువారం సాయంత్రం నెమలి వాహనంపై అత్తిలి వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. నాగరాజు డ్యాన్స్ అకాడమి పెనుగొండ వారి ఆధ్వర్యంలో దీపాలను నెత్తిపై పెట్టుకొని చిన్నారులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది.

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తాం

హౌసింగ్‌బోర్డుకాలని, సాలిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలో మురుగునీటి పారుదల సక్రమంగా సాగేలా డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో డ్రెయినేజీ, పారిశుద్ధ్య వ్యవస్థను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీల అవుట్‌లెట్లు సరిగా లేకపోవడంతో మురుగునీటి పారుదల సక్రమంగా లేదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించరాదని.. ప్రజారోగ్య పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. సర్వేయర్ బి.రామకృష్ణ, తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, సహాయ కమిషనర్ సీతారాం, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరమణ, టీపీఓ జగదీష్, నాయకులు చాపల రమేష్, మద్దాల మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల పరీక్ష ప్రయోగశాలకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ భవన సముదాయంలో రూ. 1.6 కోట్లతో నిర్మిస్తున్న పురుగు మందుల పరీక్ష ప్రయోగశాలను నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, స్థానిక వ్యవసాయ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

నేడు పాలూరులో రైతన్నా మీకోసం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : పాలూరులో శుక్రవారం ఉదయం కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం ఏర్పాటు చేశామని తహసీల్దార్ దశిక వంశి, వ్యవసాయాధికారి రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాలూరులో రైతులతో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు.

యువజన సంఘ సహాయ కార్యదర్శిగా వెంకటరామకృష్ణ

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన పులపర్తి వెంకట నాగేశ్వరరావుని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర యువజన సంఘం సహాయ కార్యదర్శిగా నియమించామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు అభినయ్, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ తదితరులు అభినందనలు తెలిపారు.

అబ్బుర పరచిన ఉపన్యాసాలు

కొబ్బరితోట, సుబ్బారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కొబ్బరితోటలోని ఈవీఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జి.లక్ష్మీనారాయణ, సీహెచ్.యువకిరణ్, టి.డింపుల్ సాయిదుర్గశ్రీలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీఎస్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

• 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటలోని సత్యసాయి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై గురువారం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జె.బిందు బసంతి, సీహెచ్.పవన్‌కల్యాణ్‌రామ్, కె.రామ వీర బాబులకు పాఠశాల ప్రిన్సిపల్ లవకుమారి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

తణుకు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం దువ్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చరవాణి మాకొద్దు అంటూ దానివల్ల కలిగే అనర్థాలపై అనర్గళంగా ఉపన్యాసాలిచ్చారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఎ.ఇందుప్రియ, కె.కార్తికేయ, ఎన్.సత్యశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు పి.జయరాజు, వి.నిర్మల, జయరాజు బహుమతులు అందజేశారు.

• పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో జె.దీపిక, వి.సాయి త్రినాథ్, పి.రిబ్కా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.వరలక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.సుభద్రదేవి, పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచండి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచాలని తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వేంకటేశ్వరరావు సూచించారు. గురువారం అత్తిలిలోని ఎస్సీ బాలికలు, బీసీ బాలుర వసతి గృహాలను సందర్శించి తగు సూచనలిచ్చారు. విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకటరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనరల్ నోటీస్
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), తణుకు, ప.గో.జిల్లా వారి కోర్ట్ లో
ఐ.పి.నెం.44/2025 (క్రెడిటార్ ఐ.పి)
బిట్వీన్
పెన్మెత్స సుబ్రహ్మణ్యం రాజు వగైరా ...పిటిషనర్స్
మరియు
1. కాళ్ళకూరి నాగ వెంకట సత్యనారాయణ ...రెస్పాండెంట్స్
2. గుంటూరి హరి రాజు
3. ది అఫీషియల్ రిసీవర్, ప.గో.జిల్లా
పిటిషనర్స్ తరపున ఇచ్చిన జనరల్ నోటీస్
పై గ్రంథం నందు నలుగురు పిటిషనర్స్ 1వ రెస్పాండెంట్ ను ఇన్సాల్వెంట్ (అప్పు చెల్లించలేనివాని) గా ప్రకటించమని. 1వ రెస్పాండెంట్ 2వ రెస్పాండెంట్ పేరున ది.15-07-2025 న ద.నెం. 3507/2025రు న వ్రాయించిన రిజిష్టర్ క్రయదస్తావేజు చెల్లనిదిగా రద్దు చేయమని, సదరు ఆస్తిని 3వ రెస్పాండెంట్ కు నిర్వహణ నిమిత్తం అప్పగించాల్సినదిగా, ఖర్చులు వగైరా పరిహారములు కోరుచూ దాఖలు చేసినందున, సదరు విషయమై ఎవ్వరికైనా ఎట్టి ఆక్షేపణలున్నా ది.23-12-2025 న ఉదయం గం.10-30 లకు స్వయంగా లేదా వకీలు ద్వారా హాజరై కోర్ట్ వారికి తెలియజేయని ఎడల పై గ్రంథం యావన్మంది పరోక్షమున విచారణ మరియూ తీర్మానం జరుగునని యావన్మందికీ తెలియజేయడమైనది.
గోటేటి భాస్కరమూర్తి,
తణుకు — గోటేటి సత్యవెంకట వర ప్రసాద్
ది.28-11-2025 — అడ్వకేట్స్, తణుకు

ప్రకటన
మహా రాజ శ్రీ తణుకు నాల్గవ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు లో
E.P.No.7/2021 in O.S.No. 60/2016
బిట్వీన్,
DHr/వాది : చంద్రంకి శ్రీనివాస్
మరియు
JDr/ప్రతివాధి : పంజా సోమరాజు
పై నెంబరు దావా లొ డిక్రీ బాకి రికవరి నిమిత్తం ఈ జె.డి.ఆర్. తాలూకు E.P. schedule దాఖలా ఆస్తి ది. 18.12.2025 సం.రం. తీదీన ఉదయం గం.10-30 ని. లగాయుతూ వేలం వేయబడును. కావలసిన వారు పాడుకొనవచ్చును.
వేలంకాబడే ఆస్థి వివరం
An extent of Ac.0.50 cents covered in R.S.No.37/2 and 37/3C (Old R.S. No.37/3), Skinnerapuram Village, Skinnerapuram, Grampanchayat area, Attili Mandal, Attili Sub-Registry, W.G.Dt which is as **bounded by: East** : Land of Nookala Seethamma and land in R.S.No.37/3C, **West** : Land of Nookala Bala Ramudu and others, **North** : Land of Padala Satyanarayana Reddy and others, **South** : Land of Velagala Suryanarayana Reddy and others.
Within the above boundaries an extent of Ac.0.50 cents of agricultural land along with easmantary rights therein etc.,
DHR's Value is : Rs.6,00,000/-
Amina Value : Rs.10,00,000/-
SRO Value : Rs.5,00,000/-
JDR value : తెలపలేదు
// By Order //
ఇందుకూరి వెంకట నరసింహరాజు,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది
తేదీ.24-11-2025 తణుకు, 9948193227

ఉద్దరాజుకు నివాళి..

తణుకు, న్యూస్‌టుడే: రైతులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాజీ ఎంపీ దివంగత ఉద్దరాజు రామం ఎనలేని కృషి చేశారని సీపీఎం సీనియర్ నాయకుడు రంగారావు, పట్టణ కమిటీ సభ్యుడు గుబ్బల గోపి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, అఖిల భారత రైతు సంఘం మాజీ అధ్యక్షుడు ఉద్దరాజు వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక అమరవీరుల భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పని చేశారన్నారు. తుది శ్వాస విడిచే వరకు రైతులు, కార్మికులు, ప్రజలు పక్షాన సమాజం మార్పు కోసం పనిచేశారని కొనియాడారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పుచ్చులపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన రామం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రామం జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువతరం ముందుకు సాగాలని తెలిపారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

నమూనాలు పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

ఇరగవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ఇరగవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సుస్థిర వ్యవసాయం, సాగునీటి వనరుల నిర్వహణ, హరిత ఇంధనం, ఆరోగ్యం-పరిరక్షణ, నూతన టెక్నాలజీ ఆవిష్కరణ, నీటి సంరక్షణ- నిర్వహణ, గణిత నమూనా తయారీ వంటి ఏడు అంశాలపై విద్యార్థులు నమూనాలు ప్రదర్శించారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీ పడ్డారు. ఎంఈవో-2 జి.ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు కె.మునీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన అవసరం

కడకట్ల, పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అవగాహన కలిగి ఉండాలని.. అందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తాడేపల్లిగూడెం, పెంటపాడు విద్యాశాఖాధికారులు వి.హనుమ, పీఎంకే జ్యోతి, టీవీ రామకృష్ణ అన్నారు. తాడేపల్లిగూడెం కోడె వెంకట్రావు పురపాలక ఉన్నత పాఠశాల, పెంటపాడు ఎస్టీవీఎన్ ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను వారు తిలకించి మాట్లాడారు.

ప్రదర్శన తిలకిస్తున్న అధికారులు హనుమ, జ్యోతి

పేరు మార్పుపై అభ్యంతరాల స్వీకరణ

మార్టేరు, పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అభ్యంతరాల స్వీకరణకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యంతరాలు, సలహాలను 30 రోజుల్లోగా కలెక్టర్‌కు తెలుగు లేదా ఇంగ్లిషులో తెలియజేయాలని ఈ ఉత్తర్వుల్లో సూచించింది.

సామర్థ్యమున్న బస్సులే తిప్పాలి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని విద్యాసంస్థలు పిల్లల కోసం సామర్థ్యమున్న బస్సులనే తిప్పాలని జిల్లా రవాణాధికారి కృష్ణారావు తెలిపారు. ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, నిబంధనలకు విరుద్ధంగా తిప్పితే మొదట నోటీసులు ఇస్తామని, తర్వాత భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పత్తి లారీలో అగ్నిప్రమాదం

తణుకు, న్యూస్‌టుడే: పత్తి బేళ్లతో ఉన్న లారీ అగ్ని ప్రమాదానికి గురైన ఘటన గురువారం రాత్రి తణుకు సమీపాన సత్యవాడ రోడ్డులో చోటుచేసుకుంది. భారీ ఎత్తున ఎగసిపడిన మంటలు చూసి అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు, ఫైర్ సిబ్బంది కథనం మేరకు తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని ఓ పరిశ్రమ నుంచి పత్తి లోడుతో లారీ గుంటూరు వెళ్తోంది. లారీని కాటా వేయించేందుకు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న తణుకు గౌతమి సాల్వెంట్స్ పరిశ్రమలోకి వెళ్లింది. ఈ క్రమంలో లోడుపై నుంచి పొగ రావడం గమనించి అక్కడి సిబ్బంది, లారీ డ్రైవర్ హుటాహుటీన వాహనాన్ని పరిశ్రమ నుంచి బయటకు తీసుకొచ్చి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. లారీలో సుమారు 71 పత్తి బేళ్లు ఉన్నాయని. . చాలావరకు దగ్ధమైనట్లు చెబుతున్నారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: శాసనసభలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించిన సందర్భంగా గురువారం తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఎటువంటి ముందస్తు సన్నద్ధత లేకుండా నిర్వహించిన మాక్ పార్లమెంట్లో విద్యార్థులు అధికార, ప్రతిపక్ష హోదాలో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని లాల్‌బీబీ తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐకమత్యంగా మెలగండి

తణుకు, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని గురువారం తేతలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కోట సూర్యవెంకట విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ ప్రతిజ్ఞ చేయించి రాజ్యాంగ పీఠిక చదివించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ వేషధారణలో పదో తరగతి విద్యార్థి వేంద్ర అంజి ఆకట్టుకున్నాడు.

అంబేడ్కర్ వేషధారణ విద్యార్థితో ఉపాధ్యాయులు

సోమసుందరరావు మృతికి సంతాపం

తణుకు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, హీరో షోరూమ్ అధినేత ఒంటెద్దు సోమసుందరరావు (77) బుధవారం ఆయన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన పైడిపర్రు, తేతలి లయన్స్ క్లబ్ స్థాపించి దాని ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన భార్య ధన కస్తూరి బాయి గతంలోనే మృతి చెందారు. ఆయనకు కుమారుడు తణుకు పట్టణ తెదేపా ఉపాధ్యక్షుడు ఒంటెద్దు రాజా, కుమార్తె పుత్సల కాశీ అన్నపూర్ణ దేవి, మనుమడు, మనువరాళ్లు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు రూరల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కట్టా శివకుమార్‌ను అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి పురస్కరించుకొని బుధవారం బందోబస్తు డ్యూటీ వేశారు. రాత్రి 10.30 గంటల సమయంలో అత్తిలి బస్ స్టాండు కూడలిలో విధులు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీరామ హోటల్‌కు వెళ్లే దారిలో వాహనాన్ని అడ్డుగా పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శివకుమార్ వాహనం తీసివేయాలన్నారు. దీంతో ముగ్గురు వ్యక్తులు అతడితో కొట్లాటకు దిగి గాయపరిచి విధులకు ఆటంకం కలిగించారు. శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

వేధింపులపై కేసు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భర్త శ్రీను, అత్త పాపమ్మ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మరపట్ల రాజేశ్వరి ఫిర్యాదు చేశారని తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీసులు తెలిపారు. రాజేశ్వరి కొంత కాలం క్రితం జీవనోపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లింది. అనంతరం భర్తను కూడా తీసుకెళ్లింది. కొంత కాలం తర్వాత ఇల్లు నిర్మించుకున్నారు. బాకీలు ఉండడంతో ఊరు వెళ్లొచ్చేసరికి తనను, తన పిల్లలను ఇంటి నుంచి గెంటేయడంతో పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని గ్రామీణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ గురువారం తెలిపారు.

సూర్యదేవాలయం అభివృద్ధికి కృషి

నూతన కార్యవర్గంతో అతిథులు

తణుకు, న్యూస్‌టుడే: పట్టణంలోని సూర్యదేవాలయం అభివృద్ధికి నూతన కమిటీ మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. దేవాలయం అభివృద్ధి నూతన కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ అధ్యక్షుడిగా గమిని రామచంద్రరావుతోపాటు ధర్మకర్తలుగా కొయ్యాని సత్యనారాయణ, బడేటి సాయిరాం, కల్వకుంట భవాని, చర్ల వెంకటసుబ్బలక్ష్మి, యజ్ఞాడ కృష్ణ, లంక దేవి కుమారి, గంటా శ్రీదేవి, ఎలుబూడి నాగమణి, అంబుల సత్యనారాయణను ఎన్నుకున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్మరణ

జననం: 13-03-1982 | మరణం: 18-12-2004

బండారు రాధిక, B.A.,
పి.యిటి., జడ్.పి. హెచ్. స్కూల్, శెట్టిపేట

నిరంతర క్రమశిక్షణ, చిత్తశుద్ధి, కఠోర సాధనతో
ఉత్తమ క్రీడాకారిణిగా జాతీయస్థాయికి ఎదిగి,
పిన్న వయసులోనే ఉద్యోగంలో పదిమంది మన్ననలు అందుకున్న
నీవు మా హృదయాలలో "చిరంజీవి"వి., అయిన
నీ దారుణ అకాల అస్తమయం - మాయని గాయమైంది.
మా గుండెల్లో నీవు నింపిన అభిమానం తరిగిపోనిది.
తిరిగి రాదిక అనే లోకాలకు తరలిపోయిన మా ప్రియతమ "రాధికా"
శివ సాయిధ్యంలో నీ ఆత్మకు ప్రశాంతినీ, తల్లడిల్లే మా హృదయాలకు
తట్టుకునే శక్తినీ ప్రసాదించమని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

నాన్న: బండారు జ్ఞానప్రసాద్ — అమ్మ: నిర్మల, M.A., B.Ed.
B.Sc., M.A., M.Ed., M.Phil.

చెల్లెళ్ళు: — మరుదులు:
హారిక B.Tech., MBA-USA, — చైతన్య B.Tech, ఆర్య
జాగృతి M.A., M.Ed. — చంద్రశేఖర్ MCA,
లక్ష్మీలలిత్య, దేవేష్ జ్ఞాననందన్
జిగీష B.Tech. — ప్రదీప్‌కుమార్ M.S., జెష్విక్
మేనమామ: G. గోపి B.A., మేనత్తలు, మామయ్యలు,
అక్కలు, బావలు, అన్నయ్యలు, వదినలు మరియు పిల్లలు

పోరు విభిన్నం.. ప్రతిభ అమోఘం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: శారీరక వైకల్యం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంలో ఇతరులకు ఏమాత్రం తీసిపోమని నిరూపించారు విభిన్న ప్రతిభావంతులు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప మున్సిపల్, ఇండోర్ స్టేడియాల్లో గురువారం నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 72 మంది హాజరై గెలుపునకు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు.

ఆమెకు అందలం.. ఆటకు లక్ష్మీ కటాక్షం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: వీరపునాయునిపల్లె మండలం ఎర్రమల్లపల్లె గ్రామానికి చెందిన శ్రీచరణి ఈ ఏడాది ఉమెన్స్ క్రికెట్ స్టార్‌గా నిలిచింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ వేస్తూ ప్రత్యర్థులకు పరుగులివ్వకుండా కట్టడి చేస్తోంది. తన ప్రతిభతో రాణిస్తూ జిల్లా క్రీడా ఖ్యాతిని నలుదిశలా చాటుతోంది. తాజాగా గురువారం నాటి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఆమెను దిల్లీ జట్టు మరోసారి దక్కించుకోవడం ఇందుకు నిదర్శనం.

2024
డబ్ల్యూపీఎల్-2025 యాక్షన్‌లో దిల్లీ జట్టు శ్రీచరణిని రూ. 55 లక్షలకు దక్కించుకుంది. అదే ఆమెకు తొలి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్.

2025
డబ్ల్యూపీఎల్‌లో శ్రీచరణి చక్కటి బౌలింగ్‌తో రాణించడంతో భారత మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత వరల్డ్ కప్‌కు ఎంపికై అక్కడా రాణించింది.

● లభించిన ప్రతి అవకాశాన్ని శ్రీచరణి సద్వినియోగం చేసుకుంది. దీంతో డబ్ల్యూపీఎల్-2026కు గాను దిల్లీ జట్టు ఆమెను రూ. 1.30 కోట్లకు దక్కించుకుంది.

హాయ్.. నేను బెన్ బెన్ రోబో

కడప విద్య, న్యూస్‌టుడే: చిత్రంలో శునకంలా కనిపిస్తున్నది ఓ రోబో. పేరు బెన్ బెన్. కడప నగర శివార్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఇది సందడి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, ఏఐఎం, యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ కలిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌లకు శిక్షణ ఏర్పాటు చేశారు. ల్యాబ్ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు చేరవేయడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రైవేట్ సంస్థ రూపొందించిన బెన్ బెన్ అనే రోబో పనితీరును గురువారం ప్రదర్శించారు. శిక్షణకు హాజరైన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో కరచాలనం చేస్తూ.. ప్రాంగణంలో కలియతిరుగుతూ బెన్ బెన్ రోబో ఆకట్టుకుంది.

రాజు రాసిన ముడుపుల చిట్టా!

సిట్ చేతికి చేరిన జాతకాల డైరీ

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టిన కట్టా రాజు రాసిన డైరీ ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో లభించిన ఈ డైరీలో పలువురికి వాటాల చెల్లింపుల వివరాలుండటమే అందుకు కారణం. మామూళ్లతో పాటు నకిలీ మద్యం సరఫరా చేసిన బెల్ట్ షాపుల నిర్వాహకులతో సాగించిన లావాదేవీలనూ అందులో పొందుపర్చినట్లు సమాచారం. సదరు డైరీని సిట్ అధికారులకు ఎక్సైజ్ అధికారులు అప్పగించారు.

నిందితుడు కట్టా రాజు

అధికారుల్లో ఆందోళన మొదలు

నకిలీ మద్యం కేసులో ఏ1 నిందితుడైన జనార్దన్‌రావు ప్రధాన అనుచరుడు కట్టా రాజు. ఇతను ములకలచెరువులోని ఓ మద్యం దుకాణాన్ని అతను ఈ ఏడాది మే నుంచి తన అధీనంలోకి తీసుకున్నారు. సమీపంలో ఖాళీగా ఉన్న డాబాను లీజుకు తీసుకుని నకిలీ మద్యం తయారీ చేపట్టారు. కొందరు ఎక్సైజ్ అధికారులకు నెలవారీ మామూళ్లిస్తూ వచ్చారు. డైరీలో విజయవాడ ఎస్‌టీఎఫ్ స్క్వాడ్, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ స్క్వాడ్, స్థానికంగా ఉన్న ఎక్సైజ్ కార్యాలయం, ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లకు నెలవారీగా ఎంత మొత్తంలో చెల్లించిందీ పేర్కొన్నారు. ఈ విషయాలు బయటికి పొక్కకుండా అధికారులు ఇప్పటి వరకు గోప్యంగా ఉంచారు. సిట్ అధికారులు ఆరా తీస్తుండటంతో వివిధ విభాగాల అధికారుల్లో ఆందోళన మొదలైంది.

నిర్వాహకుల నుంచీ వివరాలు

ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పీటీఎం మండలాల్లో నడిచిన గొలుసు దుకాణాల నిర్వాహకుల పేర్లు డైరీలో ఉన్నట్లు సమాచారం. నిందితులు జనార్దన్‌రావు, బాలాజీ, నకిరేకంటి రవితో పాటు జయచంద్రారెడ్డి అకౌంటెంట్ తీసుకున్న నగదు వివరాలు అందులో నమోదయ్యాయి. దీంతో కట్టా రాజు డైరీలోని వివరాల ఆధారంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పుడు ఆరా తీస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి వివరాలు రాబడుతున్నారు.

నేడు తంబళ్లపల్లె కోర్టుకు నిందితులు

కేసులో ఏ1గా ఉన్న జనార్దన్‌రావుతో పాటు ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాస్‌రావు, రమేష్‌బాబు, షేక్ అల్లాబక్షలను తంబళ్లపల్లె కోర్టులో శుక్రవారం హాజరు పర్చనున్నారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న నిందితులను తీసుకొచ్చేందుకు ఎక్సైజ్ పోలీసులు ఇప్పటికే వెళ్లారు. జనార్దన్‌రావును కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించనున్నారు.

కాళ్లరగకుండానే కనెక్షన్ పొందొచ్చు

ముకోసం

కమలాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు కనెక్షన్‌కు గతంలో కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. 30 మీటర్లు దాటితే స్తంభాల ఖర్చు భరించాల్సి వచ్చేది. అందుకుగాను దరఖాస్తు చేసుకున్న తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించి రుసుం నిర్ణయించేవారు. వీటికి సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అదనంగా ఉండేవి. ఇవి కాకుండా సిబ్బంది అనధికారికంగా మరికొంత వసూలు చేసేవారు. ఇకపై వినియోగదారులకు ఈ తిప్పలు తప్పనున్నాయి. సేవలు సులభంగా అందించేలా ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) కొత్త కనెక్షన్ల జారీలో సంస్కరణలు తెచ్చింది. కనెక్షన్, అదనపు లోడ్ కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలు నిర్ణయించింది. సత్వర కనెక్షనూ అందించేలా అధికారులకు దిశానిర్దేశం చేసింది.

గృహావసరాల కనెక్షన్లు(ఎల్‌టీ)		వాణిజ్యం	
కిలోవాట్	చెల్లింపు	01- 20	రూ. 1,800
01- 20	రూ. 1,500	20- 150	రూ. 12,800
(అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ. 2 వేలు చెల్లించాలి)		(అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేలు చెల్లించాలి)	
20- 150	రూ. 12,800		
హెచ్‌టీ : 75 - 150 రూ. 4,400 (ప్రతి కిలోవాట్‌కు)		● నియంత్రికను వినియోగదారుడే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.	

మా సారుకు శాలువా కప్పాలి.. మీరంతా కాసులివ్వాలి!

◆ కట్టడి చేయాల్సినోళ్లే కట్టు తప్పారు
◆ వసూళ్ల దందా సాగించిన ఉద్యోగులు

కడప, న్యూస్‌టుడే: 'మా పెద్ద సారు పదవీ విరమణ చేశారు. ఆయనకు మేము సన్మానం చేయాలి. అందుకుగాను మీరంతా పెద్ద మొత్తంలో చందాలు సమర్పించుకోవాలి' అంటూ కింది స్థాయి ఉద్యోగులు వసూళ్ల దందాకు పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రభుత్వ శాఖల్లో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకుండా నిఘా పెట్టడం ఆ శాఖ నిఘా పని. గుండు పిన్ మొదలు బంగారు నగల తయారీ వరకు ఆ శాఖ పర్యవేక్షిస్తుంది. అటువంటి శాఖకు చెందిన ఉమ్మడి కడప జిల్లా అధికారి నాలుగు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశారు. ఇదే అదనుగా ఇద్దరు ఉద్యోగులు కట్టు తప్పారు. పెద్ద సార్ పదవీ విరమణ సన్మానమంటూ వ్యాపారుల వద్ద రూ. లక్షలు వసూలు చేశారు. గనులు, ఎరువుల వ్యాపారులు, బియ్యం మిల్లర్లు, రేషన్ దుకాణాలు, గిడ్డంగులు, పెట్రోల్ బంకులు, ఎలక్ట్రికల్ దుకాణాలు, బంగారు అంగళ్లు, ఇసుక రీచులు, కంకర మిల్లులను జల్లెడ పట్టారు. రూ. లక్షల్లో వసూలు చేశారు. కడపలో పేరు మోసిన ఓ కర్మాగారం యజమాని నుంచి ఏకంగా రూ. 12 లక్షలు రాబట్టారు.

ఫొటో చూపి బెదిరింపులు

వసూళ్ల దందాకు పాల్పడిన వారిలో ఓ ఉద్యోగి తనకు పోలీసు శాఖలోని ఓ ఉన్నతాధికారి తెలుసంటూ చెప్పుకొనేవారు. అందుకు సాక్ష్యంగా అతని వద్ద ఉన్న చిత్రాలను వ్యాపారులకు చూపించి భయపెట్టేవారు. కొందరు వ్యాపారులు నగదు ఇచ్చేందుకు విముఖత చూపడంతో కల్తీ చేస్తున్నావని.. కేసులవుతాయని బెదిరించి వసూలు చేశారు. మొత్తంగా సుమారు రూ. 50 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. వేధింపులతో విసిగి వేసారిన వ్యాపారులు వారి ఆగడాలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు స్పందించి వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

రెండు జిల్లాల్లోనూ వసూళ్లు

విపత్తును గెలవాలని...

రాత్రివేళ పొగమంచు, పగటి పూట ఎండ దంచు.. ఇలాంటి విభిన్న వాతావరణ పరిస్థితుల నుంచి అరటి పంటను రక్షించుకోడానికి రైతులు కవర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గెలలకు వీటిని తొడిగితే కాయల పరిమాణం, రంగు, నాణ్యత దెబ్బ తినవని, పురుగులు, చీడపీడల నుంచీ రక్షణ లభిస్తుందంటున్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. గరిష్ఠంగా ఒక రైతుకు రెండు హెక్టార్ల వరకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందని ముద్దనూరు డివిజినల్ ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సంప్రదించాలని సూచించారు.

- న్యూస్‌టుడే, కొండాపురం

5న సివిల్స్ శిక్షణకు పరీక్ష

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: బీసీ సంక్షేమ శాఖ నిర్వహించే సివిల్స్ శిక్షణార్థులకు డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. అభ్యర్థులు పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జతచేసి పాత రిమ్స్ ఆవరణంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

11.05 లక్షల మందితో మదనపల్లె జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, కడప: మదనపల్లె జిల్లా ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసింది. కొత్త జిల్లా ఏర్పాటుపై అభ్యంతరాలకు రానున్న 30 రోజుల వరకు గడువుగా పేర్కొంది. పరిపాలనను మరింత బలోపేతం చేయడం, ప్రజాసేవల అందుబాటును పెంచడం దృష్ట్యా జిల్లాగా ఏర్పాటు చేయడానికి ప్రాథమిక నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. జిల్లా ఏర్పాటుపై ఈ ప్రాంతంలో నివసించే, ప్రభావితమయ్యే వ్యక్తుల నుంచి అభ్యంతరాలు, సూచనలు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించింది.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

● కొత్తగా ఏర్పాటయ్యే పీలేరు రెవెన్యూ డివిజన్‌లో పీలేరు, సోమల, సదుం, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం ఉంటాయి. ● ఈ మండలాలన్నీ ప్రస్తుతం అన్నమయ్య, చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి.

● **ఒంటిమిట్ట, సిద్దవటం పైనా...:** ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప రెవెన్యూ డివిజన్ నుంచి రాజంపేటలో కలుపుతూ ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పరిపాలన సౌలభ్యం, అభివృద్ధి ప్రభావంతం చేయడానికి కలుపుతూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అభ్యంతరాలుంటే రానున్న 30 రోజుల వ్యవధిలో రాత పూర్వకంగా జిల్లా కలెక్టర్‌కు తెలిపాలని సూచించింది.

విడుదలైన ప్రాథమిక ప్రకటన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

● మదనపల్లె జిల్లా ప్రధాన కార్యాలయంగా ఉంటుంది. 21 మండలాలతో కొత్త జిల్లా ఏర్పాటవుతుంది.

● మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలున్నాయి.

● 11.05 లక్షల మంది జనాభాతో మదనపల్లె జిల్లా ఏర్పాటవుతుంది.



అతివా.. తగునా!

జమ్మలమడుగు - తాడిపత్రి ప్రధాన రహదారి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటుగా వందల సంఖ్యలో వేగంగా దూసుకెళ్తుంటాయి. ఇంతటి కీలక మార్గంలో ఓ మహిళ చేసిన అతిపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి సరకులు రవాణా చేస్తుండటంతో పాటు వాటిపై ఆమె ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణించింది. నిబంధల్ని బేఖాతరు చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రయాణించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

(c) eenadu

పోలీసులకు దొరికిన డిజిటల్ టోకరా ముఠా

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి ఓ విశ్రాంత ఉద్యోగి దాచుకున్న సొమ్మును దోచుకున్నారు. ఎవరికీ చెప్పలేక సదరు వృద్ధుడు గుండెపోటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న అతని పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి టోకరా ముఠాను పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కడప జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐ సీతారామిరెడ్డి, సైబర్ ఠాణా సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డితో కలిసి ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్.. చిత్రంలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐలు సీతారామిరెడ్డి, మధుమల్లేశ్వర్‌రెడ్డి

ప్రాణాలు కోల్పోయిన బాధితుడు

పులివెందులకు చెందిన ప్రకాష్‌రెడ్డి విశ్రాంత ఉపాధ్యాయుడు. పదవీ విరమణ తర్వాత వచ్చిన నగదుతో పాటు మరికొంత కలిపి మొత్తం రూ. 1,62,83,000 బ్యాంకులో జమ చేశారు. దిల్లీకి చెందిన రాకేష్, తివారీ అనే వ్యక్తులు ప్రకాష్‌రెడ్డికి ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు పేరిట భయభ్రాంతులకు గురి చేశారు. యూనిఫారం ధరించిన పోలీసులతో పాటు, సీఐడీ, సీబీఐ కార్యాలయాలను వాట్సప్‌లో చూపడంతో ప్రకాష్‌రెడ్డి నిజమని నమ్మారు. వారు చెప్పిన ఖాతాల్లోకి విడతల వారీగా రూ. 1,62,83,000 జమ చేయించుకున్నారు. ఇంకా డబ్బులు కావాలని అడగడంతో ప్రకాష్‌రెడ్డి పులివెందుల నుంచి కడపకు బస్సులో వస్తూ మార్గమధ్యంలో గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. విషయం అతని పిల్లలకు తెలియడంతో వెంటనే పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదే పదే అవే మోసాలు

కేసు నమోదు చేసిన పులివెందుల పోలీసులు.. కడప సైబర్ ఠాణా సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలిస్తుండగా పులివెందుల- కదిరి సమీపంలోని తలుపుల క్రాస్ రోడ్డు వద్ద చిక్కారు. వీరు చిక్కరాజు మధు(బెంగళూరు యలచేనహళ్లి), ఆదిత్య మనోహర్(జయనగర్), అర్జున్ నేలమాకల అలీసిద్దయ్య(కర్ణాటక్ రాష్ట్రం మాండ్యా), రోషన్, సురేష్, హరీష్(బెంగళూరు)గా గుర్తించారు. నిందితుల నుంచి రూ.1.05,300 నగదు, నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. కీలక నిందితులైన రాకేష్, తివారీ పరారీలో ఉన్నారు. వీరిలో మధు గతంలోనూ సైబర్ నేరంలో అరెస్టై బెయిల్‌పై బయటికి వచ్చాడు. రోషన్‌పై బెంగళూరు శివాజీనగర్ ఠాణాలో ఓ కేసు ఉంది. అర్జున్, రాకేష్‌పై వివిధ రాష్ట్రాల్లో 22 ఫిర్యాదులున్నాయి.

రామోజీ గ్లాంపింగ్.. అవుట్‌డోర్ క్యాంపింగ్

● పర్యాటకులకు ప్రకృతి మధ్య సరికొత్త విడిది

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: నిత్యం తీరిక లేని జీవన శైలితో గడుపుతున్న ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి ఒడిలో విశ్రాంతి, సౌకర్యవంతమైన విడిది కోరుకుంటున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేక సౌకర్యాలతో 'రామోజీ గ్లాంపింగ్' సిద్ధం చేసింది. విహారాన్ని ఇష్టపడుతూ..ప్రకృతిలో గడపాలనుకొనే వారికి స్వర్గధామంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

RAMOJI GLAMPING

ఉత్సాహం నింపేలా.. ఆకర్షణీయ, ఆధునిక సౌకర్యాలతో రామోజీ గ్లాంపింగ్ విడిది ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో అతిథులను ప్రకృతికి అనుసంధానిస్తుంది. కుటుంబాలు, జంటలు, సమూహాల కోసం రూపొందించిన ఈ గ్లాంపింగ్ ఆనందంగా విశ్రాంతి పొందేందుకు దోహదపడుతుంది. ప్రశాంత వాతావరణంలో బసతో మర్చిపోలేని అనుభూతిని కలిగిస్తుంది. బిజీ దినచర్య నుంచి విరామం తీసుకోవడానికి, డిజిటల్ ప్రపంచం నుంచి దూరంగా, ప్రకృతిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుంది. ఏకాంత సమయంలో రిఫ్రెష్‌మెంట్‌కు, రొమాంటిక్ రీట్రీట్‌కు గ్లాంపింగ్‌ను వేదిక చేసుకోవచ్చు.

మనసుకు హత్తుకొనేలా..

పర్యాటకులు ఒక రాత్రి, రెండు రాత్రుల బస ఎంచుకోవచ్చు. మనసుకు హత్తుకొనే సుందర ప్రపంచంలో సరికొత్తగా రోజును ప్రారంభించాలనుకొనేవారికి గ్లాంపింగ్ మంచి ఎంపిక అవుతుంది. ట్రెక్కింగ్, ప్రకృతి నడక, యోగా చేయవచ్చు. సంప్రదాయ ఆటలతో బాల్య అనుభూతులు, పుస్తకాలతో.. ఊయలలో.. మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చు. సాయంత్రం వేళ సంగీతం వింటూ, నక్షత్రాలను చూస్తూ కథలు చెప్పుకొంటూ.. చలికాచుకుంటూ ఆనందాల విహారాన్ని గుర్తుండిపోయేలా మలచుకోవచ్చు.

ఆకర్షణీయ ప్యాకేజీలు..

రామోజీ గ్లాంపింగ్‌ను ఆస్వాదించాలనుకొనే సమూహాలు, కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు www.ramojifilmcity.com సందర్శించండి. లేదా 76598 76598కు ఫోన్ చేయండి.

బంగారం కేసులో ఆ వసంత్ ఎవరో తేల్చండి!

● ఈ విషయం ఎస్పీ, డీఐజీ దృష్టికి తీసుకుపోతాం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు బంగారం వ్యాపారి తన కంటే శ్రీనివాసులు, వెంకటస్వామి కేసులో వ్యాపారులు, పోలీసుల మధ్యలో మూడో వ్యక్తి వసంత్ ఎవరో, ఎవరికి సంబంధించిన వారో డీఎస్పీ తేల్చాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసుకు సంబంధంలేని వ్యక్తి తుపాకీ గురిపెట్టడం, విచక్షణారహితంగా కొట్టి మానవత్వం లేకుండా వ్యవహరించడంతో పోలీసులు నిర్లక్ష్యం వహించారన్నారు. నిర్దోషులను కొట్టించడమే కాక, వారి ఆస్తులను దోపిడీ చేసేందుకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఆయన గురిపెట్టిన తుపాకీ ఎవరిదని ప్రశ్నించారు. ఆయన ఎవరో తేల్చాల్సిన బాధ్యత డీఎస్పీ, పోలీసులపై ఉందన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలు జరుగుతుంటే డీఎస్పీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను ఆమె ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. శ్రీనివాసులు భార్య డీఎస్పీని కలిసేందుకెళ్లి మూడు గంటలు వేచి ఉన్నా కనికరించలేదన్నారు. కనీసం బయటకు వచ్చి మాట్లాడలేదన్నారు. బాధితులు ఆదుకునేందుకు ఉండాల్సిన డీఎస్పీ కదలకుండా కుర్చీని మామూళ్లు మేస్తూ కూర్చున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతుంటే విషయమేంటని ప్రజలకు తెలపాల్సిన బాధ్యత ఆమెకు లేదా అని ప్రశ్నించారు. శ్రీనివాసులు సోదరులను అక్రమంగా నిర్బంధించే ముందురోజు వసంత్ అనే వ్యక్తి మూడు, నాలుగు గంటలు డీఎస్పీతో ఆమె కార్యాలయంలో మాట్లాడారన్నారు. వసంత్ ఎవరో తేల్చి ప్రొద్దుటూరుకు తీసుకువచ్చి కేసు నమోదు చేయాలని, కోర్టులో నిలబెట్టాలని డిమాండు చేస్తున్నారన్నారు. ప్రజలంతా మౌనంగా చూస్తున్నారని ఈ విషయాన్ని ఇంతటితో వదలమని తెలిపారు. ఎస్పీ, డీఐజీ దృష్టికి తీసుకు పోతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, తెదేపా నాయకులు బాలుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి, పక్కన నాయకులు

అశ్రునయనాల మధ్య ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి అంత్యక్రియలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ (83) అంత్యక్రియలను గురువారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామమైన పోట్లదుర్తిలో బుధవారం తెల్లవారుజామున సీఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ తుది శ్వాసను విడిచారు. మునిస్వామి నాయుడు, రత్నమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కలరు. కుమారులు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, సీఎం సురేష్, సీఎం రాజేష్ అశ్రునయనాలతో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను నిర్వహించారు. ఎంపీ సీఎం రమేష్ ఇంటి వద్ద నుంచి చింతకుంట రత్నమ్మ పార్థివదేహానికి అంతిమయాత్ర నిర్వహించి పెన్నానది తీరం వద్ద దహన సంస్కారాలు జరిపారు. కన్నతల్లి పాడెను మోసి రత్నమ్మ దహన సంస్కార కార్యక్రమంలో సీఎం రమేష్ పాల్గొన్నారు.

తల్లి రత్నమ్మ అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎంపీ సీఎం రమేష్

● హాజరైన ప్రముఖులు..

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి కొల్లు రవీంద్ర, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేంద్ర, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాల్గొని సీఎం రమేష్ తల్లి రత్నమ్మ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంత్యక్రియలకు హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ ఈటెల రాజేంద్ర, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పత్తిపాటి పుల్లారావు, బొజ్జల సుధీర్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు తదితరులు

● పలువురి పరామర్శ..

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తల్లి రత్నమ్మను కోల్పోవడం చాలా బాధాకరమని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో ఎంపీ సీఎం రమేష్ నివాసం వద్ద నిర్వహించిన రత్నమ్మ అంత్యక్రియల కార్యక్రమంలో వారు పాల్గొని మీడియాతో మాట్లాడారు. సీఎం రమేష్ తల్లి ఒక ఉమ్మడి కుటుంబానికి పెద్దగా ఉంటూ ముందుకు నడిపించారని తెలిపారు.

జవివే జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో గురువారం జరిగిన జన విజ్ఞాన వేదిక (జవివే) జిల్లా శాఖ సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జవివే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా పల్లవోలు రమణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ఫరూక్, డాక్టర్ రాంగోపాల్, డాక్టర్ అవ్వారు అర్జున్, సుధాకర్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ బయారెడ్డి, సురేశ్‌బాబు, శేషారెడ్డి, నాగార్జునరెడ్డి, ఇలియాస్‌బాషా, ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సనావుల్లా, భాస్కరయ్య, రాజశేఖర్, గౌరీశంకర్, మల్లికార్జున, రామలింగరాజు, రమణ, కోశాధికారిగా విశ్వనాథ, కార్యదర్శులుగా మహబూబ్‌బాషా, కిరణ్, భాగ్యలక్ష్మి, అరుణ్‌కుమార్, తేజ, కార్యవర్గ సభ్యులుగా అజయ్‌కుమార్, రాజేశ్, అకిరానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పల్లవోలు రమణ

వెంకటరమణ

నేటి నుంచి విద్యాసంస్థల బస్సులు తనిఖీ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థల బస్సుల తనిఖీలను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డీటీసీ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 4 వరకు తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా రక్షణ పరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారం, స్పీడ్ గవర్నర్లు తదితర వాటిని పరిశీలిస్తామన్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం బస్సుల్లో ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటన్నింటినీ సరి చేసుకోవాలన్నారు. ఇది వరకే విద్యాసంస్థల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామన్నారు. ఎలాంటి పరికరాలున్నాయో తనిఖీ చేస్తామన్నారు. జిల్లాలో సుమారు 610 విద్యాసంస్థల బస్సులు రోడ్లపై తిరుగుతున్నాయని చెప్పారు.

శిశువు మృతి.. ఆసుపత్రి వద్ద ఆందోళన

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్యులు అందుబాటులో లేకుండా ప్రసవం జరగడంతోనే తమ శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ ప్రొద్దుటూరులోని అమృతనగర్‌కు చెందిన ఓ బాలింత కుటుంబ సభ్యులు, బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. బాధితుల వివరాల మేరకు.. గర్భందాల్చినప్పటి నుంచి ఈ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకున్నారు. ఈనెల 22న ప్రసవం నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా రాత్రి సమయంలో పురిటి నొప్పులు ఎక్కువ కాగా వారు నర్సులు, వైద్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యులు వచ్చేలోపే సాధారణ ప్రసవంగా పుట్టిన శిశువు ఏడ్వక పోవడంతో పురిటి పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం శిశువు మృతిచెందింది. దీంతో వైద్యులు అందుబాటులో లేకపోవడం, నర్సులే కాన్పు చేయడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని బాధితులు ఆరోపించారు. దీనిపై ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ.. ఈ విషయంలో తమ నిర్లక్ష్యం లేదని తల్లికి ఏదైనా జరిగితే తమ బాధ్యతని తెలిపారు. శిశువు పరిస్థితి తెలుసుకుని చిన్నపిల్లల వైద్యుల వద్దకు పంపామన్నారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారుల దాడులు

● తూకాల్లో తేడాపై రూ. 1.75 లక్షల జరిమానా

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడు, పోరుమామిళ్లలోని రైస్ మిల్లులపై గురువారం రాత్రి జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. తూకాల్లో తేడా, బస్తాలపై సరైన వివరాలు లేకపోవడంతో రెండు రైస్ మిల్లులకు రూ.1.75 లక్షలు జరిమానా వేశారు. కలసపాడులోని మూడు రైస్ మిల్లులపై దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో రెండు రైస్ మిల్లుల గోడౌన్లు మూసివేసినట్లు తెలిసింది. శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో బియ్యం బస్తాల్లో తూకాల్లో తేడా, బస్తాలపై వివరాలు పూర్తిగా లేకపోవడంపై రూ.1.50 లక్షలు జరిమానా వేసినట్లు విజిలెన్స్ అధికారి అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ మహమ్మద్‌గౌస్ తెలిపారు. పోరుమామిళ్లలో మరో రైస్ మిల్లులో రూ. 25 వేలు జరిమానా వేశామన్నారు. దాడుల్లో డీసీటీవోలు గీతావాణి, బాబూమోసెస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పురపాలక పోరుమామిళ్లరోడ్డులోని డిగ్రీ కళాశాల వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇందిరమ్మకాలనీకి చెందిన మునగాల వెంకటరమణ (65) మృతి చెందారు. కాలనీ నుంచి సైకిల్‌పై వనిపెంట వైపునకు వెళ్తూ ఉండగా ప్రమాదం చోటు చేసుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

Kadapa Urban Development Authority (KUDA)
e-Procurement - Notice for Expression of Interest
01. EOI Notice No:- 03/2025-26/KUDA/QC, Dated: 28.11.2025
KUDA invites For 3rd PARTY QUALITY CONTROL ASSURANCE FOR WORKS in Kadapa Urban Development Authority.
For more details, visit: https://tender.apeprocurement.gov.in
Mobile No. 9052720786
Sd/- Vice Chairperson,
KUDA, Kadapa.

పోలీసుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వండి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రతి ఒక్క పోలీసు ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే సమర్థంగా విధులు నిర్వహిస్తారని జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ అన్నారు. నిరంతరం విధుల్లో సతమతమవుతున్న పోలీసులు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గురువారం స్థానిక పోలీసు ఆసుపత్రిలో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. పోలీసులు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పలురకాల వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంజీవరావు, శిల్ప, కృష్ణవంశీ, జయశ్రీ, సిద్ధార్థరెడ్డి, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, పోలీసు ఆసుపత్రి వైద్యురాలు రేష్మా, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, చిత్రంలో అదనపు ఎస్పీ ప్రకాశ్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య తదితరులు

భూ రీ సర్వే దస్త్రాల పరిశీలన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ జయరాజు గురువారం కడప కలెక్టరేట్‌లోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఆన్‌లైన్‌తో పాటు రీ సర్వే జరుగుతున్న తీరు, అందుకు సంబంధించిన పలు దస్త్రాలను పరిశీలించారు. గురువారం ఆయన కడపకార్యాలయంతో పాటుగా వైఎస్సార్ జిల్లాలోని పలు మండలాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. రెండు రోజులపాటు ఆయన జిల్లాలోని పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఏడీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రీసర్వే విధి విధానాలను పరిశీలించేందుకు ఉన్నతాధికారులు వచ్చారన్నారు. ఆయన పలు సూచనలు కూడా ఇచ్చారని అందుకు అనుగుణంగానే రీసర్వే చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఏడీ మురళీకృష్ణ, డీఐ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ జయరాజు

వేగవంతంగా ఓటరు నమోదు ప్రక్రియ

దృశ్యమాధ్యమ సమీక్షలో పాల్గొన్న జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఇతర అధికారులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ వేగవతంగా జరుగుతోందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఎన్నికలకు సంబంధించి జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో దృశ్యమాధ్యమంలో సమీక్ష చేసి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇప్పటికే ఎస్ఐఆర్‌పై సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు 3,34,154 మంది ఓటర్లను మ్యాపింగ్ చేశామన్నారు. ఓటర్ల మార్పులు చేర్పులకు సంబంధించి 32,382 అభ్యంతరాల్లో 24,716 దరఖాస్తులను పరిష్కరించాలమని, 6920 దరఖాస్తులను తిరస్కరించినట్లు వివరించారు కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

★ లక్ష్యం మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ దృశ్యమాధ్యమంలో సమీక్ష చేసి ధాన్యం కొనుగోలు, నేరనియంత్రణ, గంజాయి, మత్తు పదార్థాల నివారణ, మున్సిపల్ సేవలు, సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు తదితర అంశాలపై ఆయన సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయం'

కమలాపురం, న్యూస్‌టుడే : సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి జరుగుతోందని ఏఐసీసీ కోఆర్డినేటర్, కన్యాకుమారి ఎంపీ విజయ్‌వసంత్ పేర్కొన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా గురువారం స్థానిక శ్రీశిరిడీ సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు అశోక్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో విజయ్‌వసంత్ మాట్లాడారు. బూత్, మండల, జిల్లా స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. 2029లో రాష్ట్రం, కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమటం వెంకట నరసింహులు, జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, జిల్లా మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, నియోజకవర్గ బాధ్యుడు మాట్లాడారు. నియోజకవర్గ మాజీ బాధ్యుడు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో అడుగులేస్తేనే బంగారు భవిత

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరని డీఎస్‌డీవో షేక్ గౌస్‌బాషా, విభిన్న, టీజీ - సీనియర్ సిటిజన్ల సంక్షేమ అధికారి కృష్ణకిశోర్ అన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కడప మున్సిపల్, ఇండోర్ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో రాణించాలని సూచించారు. శారీరక వైకల్యం గురించి ఆలోచిస్తూ ఉంటే రాణించలేరన్నారు. అందుకే ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు

కడప మున్సిపల్, ఇండోర్ స్టేడియాల్లో విభిన్న ప్రతిభావంతులకు గురువారం నిర్వహించిన బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, చెస్, వాలీబాల్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. మొత్తం 72 మంది పోటీలకు హాజరయ్యారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో వీరికి పోటీలు నిర్వహించారు. శిక్షకులు అమృతరాజ్, వివేకానందరెడ్డి తదితరులు పోటీలు పర్యవేక్షించారు. అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, డిస్క్, పరుగు పోటీలు నిర్వహించారు. అలాగే బ్యాడ్మింటన్ పోటీలకు చక్కటి స్పందన లభించింది. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని గుంటూరులో డిసెంబరు 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేశారు.

షాట్‌పుట్ విసురుతూ..

30న భవన నిర్మాణ కార్మికుల సదస్సు

మారుతీనగర్, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని నవంబరు 30న కడపలో జరిగే రాలయసీమ, నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్తు కూడలిలోని కార్మికుల అడ్డా వద్ద కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి కార్మికులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా దాని గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాదుల్లా, ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, శ్రీను, కన్న, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| © 7382114647.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Kotapati Vahini Priya, R/o D.No.3/16, Venkatypalli, Ponnaolu, Siddavatam(M), YSR Dist, AP. Declare that I have changed my name from Rajeswari (Old Name) to Kotapati Vahini Priya (New Name). Henceforth, I shall be known as Kotapati Vahini Priya for all purposes.

REAL ESTATE

CONSULTANCY

తిరుపతి మరియు తిరుపతి పరిసర ప్రాంతాలలో స్థలం కొనాలన్నా అమ్మాలన్నా మమ్మల్ని సంప్రదించగలరు. Ph: 99890 76007, 90320 76007.

JOBS

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషంట్స్‌ని, పిల్లలను చుసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ:18K ©9640258899, 96404 68899

ప్రొద్దుటూరు D&C అసోషియేట్స్‌లో పనిచేయుటకు ఇంటర్/డిగ్రీ చదివి Comp. Operatorగా పనిచేయుటకు మహిళలు కావలెను. శాలరీ: 10 - 12K స్టార్టింగ్. © 9642484707.

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్ట్ పద్ధతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎసీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్. 8341177761/8019647888

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

AUTO వాహనాల అమ్మకం
REAL ESTATE ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు.. కొనుగోళ్లు..
JOBS ఉద్యోగాల భర్తీ..
TO LET ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు
PERSONAL CLASSIFIEDS మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు
BUSINESS SERVICES బ్యూటీ పార్లర్లు, ఫొటోగ్రఫీ, బిజినెస్ వ్యాపారాలు...
5 లైన్ల బ్లాక్ & వైట్ ప్రకటన రూ.350/- B/W రూ.410/- Col మాత్రమే
*GST 5% అదనం
ఈనాడు క్లాసిఫైడ్స్
వివరాలకు సంప్రదించండి:
కడప: 9989997626 8008514248
ప్రొద్దుటూరు: 8008597620

(c) eenadu

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల విస్మరణ తగదు

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పూర్తిగా విస్మరించిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, మహేబూబు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక అనిబిసెంట్ పాఠశాలలో వారు మాట్లాడారు. ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం తీరు సరిగా లేదన్నారు. అధికారంలోకి రాకముందు అనేక హామీలిచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడం లేదన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో భాగస్వాములను చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్రుడు, గంగాధర్, ఫయాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయానికి రూ.2.20 లక్షల విరాళం

చాపాడు, న్యూస్‌టుడే: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయానికి ఎన్ఆర్ఐ భరణికృష్ణ, శిరీష దంపతులు రూ.2.20 లక్షలు విరాళం ఇచ్చారు. సింగపూర్ దేశంలో స్థిరపడిన ఈ దంపతులు గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ పెరుగు వీరనారాయణయాదవ్, ఈవో శంకర్‌బాలాజీ దాతలకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయ ఛైర్మన్ వీరనారాయణతో భరణికృష్ణ దంపతులు

పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడాలొద్దు

ప్రదర్శనలో పాల్గొన్న వెలుగు మహిళలు, అధికారులు, సిబ్బంది

మైదుకూరు, న్యూస్‌టుడే: పిల్లల పెంపకంలో ఆడ, మగ అనే తేడా ఉండరాదని సీడీపీవో శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జెండర్ సమానత్వంపై సమావేశం నిర్వహించి ప్రదర్శన చేశారు. సీడీపీవో మాట్లాడుతూ అబ్బాయిలకు దీటుగా అమ్మాయిల్ని పెంచాలని సూచించారు. ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్న నేపథ్యంలో భ్రూణహత్యలు నివారించాలని సూచించారు. ఏపీఎం శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ ఆడపిల్లలు ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నారని వారిని తల్లిదండ్రులు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి మహిళ శక్తివంతురాలు కావాలని సీఏ రమణా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, ఏపీఎం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముద్దనూరు, న్యూస్‌టుడే: మండల పరిధి నల్లబల్లె గ్రామంలో గురువారం వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు. శిఖర ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, వేదపారాయణం, హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వీరాంజనేయస్వామిని దర్శించుకునేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు వచ్చారు.

నాణ్యత డొల్ల.. రహదారులు గుల్ల

దెబ్బతిన్న రూ.కోట్ల విలువైన రోడ్లు

పెద్దశెట్టిపల్లె- కాకిరేనిపల్లె మార్గంలో వర్షపు నీటి ఉద్ధృతికి కోతకు గురైన తారు రోడ్డు

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

నిర్మాణంలో నాణ్యత లోపించడంతో ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టి పల్లె - కాకినేనిపల్లె వరకు గ్రామీణ అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏర్పాటు చేసిన 5.50 కి.మీ మార్గంలో అరకొరగా 6 చోట్ల వంతెన (మోరీ)లు భారీ వర్షపు నీటి ఉద్ధృతి కారణంగా తారు రహదారి దెబ్బతినడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రెండు దఫాలుగా పైనుంచి వెల్లువగా వచ్చిన వర్షానికి బీటీ రోడ్డు అంచులు, సిమెంటు దిమ్మెలు కోతలకు గురికావడంతో నాణ్యత, మన్నిక మున్నాళ్ల ముచ్చటను తలపిస్తున్నాయి. ఏషియన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇన్వెస్టుమెంట్ బ్యాంకు (ఏబీబీఐ) సౌజన్యంతో ప్యాకేజీ టెండరులో భాగంగా రూ.3.60 కోట్లతో తారు రోడ్డుకు ఖర్చు చేశారు. కానీ 2021లో పంచాయతీరాజ్ ఇంజినీర్లు (పీఐయూ) క్షేత్ర స్థాయిలో వర్షపునీటి ఉద్ధృతి తట్టుకునే విధంగా వంతెనల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో భారీ వర్షాలకు పెద్దముడియం, జమ్మలమడుగు గ్రామీణ ప్రాంతాల నుంచి దిగువలో ఉన్న కాకిరేనిపల్లెకు పెద్ద ఎత్తున వరద వెల్లువ తీవ్రంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో 5.50 కి.మీ మధ్యలో ఆరు చోట్ల ఏర్పాటు చేసిన రెండు అడుగుల సిమెంటు పైపుల నుంచి వర్షపునీరు వెళ్లలేక గత సెప్టెంబరులో దెబ్బతిన్న తారు రోడ్డును పీఆర్ ఎస్ఈ మద్దెన, పీఐయూ డీఈ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. జమ్మలమడుగు నుంచి పెద్దశెట్టి పల్లె మలుపు వద్ద తారు కంకర పొరలుగా లేచిపోయింది. ఈ విషయమై పీఆర్‌లోని పీఐయూ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా భారీ వర్షపు నీటి ఉద్ధృతి తట్టుకోవడానికి రూ.30 లక్షలతో అదనంగా 8 చోట్ల కొత్తగా వంతెన నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనకు ఆమోదం రాగానే వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. దెబ్బతిన్న తారురోడ్డుకు మరమ్మతులు చేపడతామని తెలిపారు.

జమ్మలమడుగు - పెద్దశెట్టిపల్లె మలుపు వద్ద దెబ్బతిన్న బీటీ రహదారి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: బద్వేలు ఆర్టీసీ గ్యారేజీలో నీటిఊట ఏర్పడింది. విధులను నిర్వర్తించాలంటే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యారేజీ వెనుక భాగంలో మురుగునీరు నిలిచి ఉన్న కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. **- ఆర్టీసీ ఉద్యోగులు**

✓: ఆర్టీసీ గ్యారేజీలో నీటి ఊట ఎత్తకుండా చర్యలు చేపడతాం. పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్యారేజీ వెనుక మురుగునీరు నిల్వలేకుండా చేస్తాం **- చైతన్య నిరంజన్, బద్వేలు ఆర్టీసీ డీఎం**

?: బద్వేలు పురపాలకలోని మైదుకూరు, నెల్లూరు, సిద్దవటం, పోరుమామిళ్ల రోడ్లలో ఇటీవల కురిసిన వర్షానికి గుంతలు పడ్డాయి. పాదచారులు వాహన చోదకులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టగలరు. **- పుర ప్రజలు, బద్వేలు**

✓: రహదారులలోని గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- నరసింహారెడ్డి, బద్వేలు పురపాలక సంఘ కమిషనర్,**

- న్యూస్‌టుడే, బద్వేలు

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు డిసెంబరు ఒకటి నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ గురుమూర్తిరెడ్డి, జిల్లా నైపుణ్య అధికారి విజయ్ తెలిపారు. 18 ఏళ్లు పూర్తయిన ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. డిసెంబరు ఒకటో తేదీ వరకూ గడువు ఉందని అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 88862 97300 నంబరును సంప్రదించాలన్నారు.

ప్రొద్దుటూరులోని సంగమేశ్వర పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ శివచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు

ప్రొద్దుటూరులోని గౌతమ్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు, డైరెక్టర్ మునిస్వామి, ఉపాధ్యాయులు

ఉపన్యాస పోటీల్లో విజేతలు

ప్రొద్దుటూరు విద్య, మైదుకూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ప్రొద్దుటూరు పట్టణంలోని పలు పాఠశాలల్లో పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగమేశ్వర పాఠశాల విద్యార్థులు షణ్ముక ప్రియ (8వ తరగతి), బషీర్ (8వ తరగతి), మహమ్మద్‌ఇయాద్ హుస్సేన్ (9వ తరగతి) వరుస విజేతలుగా నిలిచారు. వారికి కరస్పాండెంట్ శివచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ● ప్రొద్దుటూరు పట్టణంలోని గౌతమ్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో హర్షిణిశ్రీ (9వ తరగతి), సాన్విగురులక్ష్మి (9వ తరగతి), యక్షిత (8వ తరగతి) విద్యార్థినులు వరుస విజేతలుగా నిలిచారు. వారికి కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు, డైరెక్టర్ మునిస్వామి, ఉపాధ్యాయులు బహుమతులు అందించారు.

● ప్రొద్దుటూరు మండల పరిధిలోని శ్రీచక్ర పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో జశ్వంత్ (9వ తరగతి), షారోన్ (8వ తరగతి), మహిత (7వ తరగతి) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ఛైర్‌పర్సన్ ప్రశాంతి, ప్రిన్సిపల్ సంజయ్ బహుమతులు అందించారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రొద్దుటూరు శ్రీచక్ర పాఠశాల ఛైర్‌పర్సన్ ప్రశాంతి, ప్రిన్సిపల్ సంజయ్

బహుమతులు అందుకున్న విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఎ.ఖదీర్, ప్రిన్సిపల్ ఎ.వెంకట్రామిరెడ్డి

● మైదుకూరు లిటిల్ స్కాలర్ పాఠశాల విద్యార్థులు ఎం.శ్రీనిధి, కేవీ. యతీష్ కుమార్, బి.త్రినాథ్‌లు వరుస విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఎ.ఖదీర్, ప్రిన్సిపల్ ఎ.వెంకట్రామిరెడ్డి ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు అందజేశారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

పోరుమామిళ్లలోని మంగన్నపల్లిలో రైతులకు కరపత్రాలను అందజేస్తున్న రితేష్‌రెడ్డి

పోరుమామిళ్ల, ఎర్రగుంట్ల, కొండాపురం, ముద్దనూరు, చాపాడు, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెదేపా బద్వేలు నియోజకవర్గం ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి అన్నారు. పోరుమామిళ్ల మండలంలోని మంగన్నపల్లిలో గురువారం 'అన్నదాత సుఖీభవ - రైతన్న మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మంగన్నపల్లి గ్రామంలో పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 కుటుంబాలు తెదేపాలో చేరాయి. వీరికి రితేష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ నారిశెట్టి సుప్రజ, సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు భైరవప్రసాదు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● ఎర్రగుంట్ల మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గం ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని తెలిపారు. ఏటా రైతులకు పెట్టిబడి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగరాజు, మాలెపాడు ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ● ముద్దనూరు మండలంలోని మంగపట్నం గ్రామంలో ఎన్డీయే నాయకులు భూపేష్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణవేణి, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి పర్యటించారు.

కొండాపురంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు భూపేష్‌రెడ్డి, శివనారాయణరెడ్డి

● కొండాపురంలో తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, భాజపా మండల ఇన్‌ఛార్జి శివనారాయణరెడ్డి బెడుదూరు, బురుజుపల్లె రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏపీఏఐఎంఎస్ యాప్ సేవలను ఏవో రామాంజులరెడ్డి వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ నాగరాజు, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్ పాల్గొన్నారు.

● చాపాడులోని అల్లాడుపల్లె గ్రామంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని, దీంతో ఆరోగ్యంతోపాటు, సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో దేవీపద్మలత పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో కరపత్రాలతో రైతులకు వివరిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, చిత్రంలో ఏవో

సెక్యూరిటీ గార్డును బంధించి.. ప్లాంట్‌లో సామగ్రి దహనం

ముద్దనూరు, న్యూస్‌టుడే: మండల పరిధి చిన్నదుద్యాల గ్రామ సమీపంలో ఉన్న తార ప్లాంట్‌లోని వస్తువులను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేసినట్లు ఎస్సై మైనుద్దీన్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు... చిన్న దుద్యాల గ్రామ సమీపంలో ఉన్న తార ప్లాంట్‌లో రాత్రి సమయంలో అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డును గదిలో బంధించి ప్లాంట్‌లోని విలువైన వస్తువులను కాల్చివేశారన్నారు. దీంతో ప్లాంట్ సూపర్వైజర్ కొర్రపాటి ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మైనూద్దీన్ తెలిపారు.

విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ఖాజీపేట, న్యూస్‌టుడే: బాలికలకు విద్యాబుద్ధులు చెప్పి మార్గదర్శకంగా ఉండాల్సిన ఓ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఖాజీపేటలో జరిగింది. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో ఓ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతను ప్రేమ లేఖలు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నాడని బాధిత విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం బయటపడటంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడిని విధుల నుంచి తప్పించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

వేధింపుల కేసు నమోదు.. పోలీసుల విచారణ

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థినిని (16) వేధిస్తున్నట్లు గురువారం ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎగువరామాపురానికి చెందిన నాలి పవన్‌కుమార్ అనే యువకుడు కొంత కాలంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై విద్యార్థినిని వేధించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు ఎస్సై తిమోతి తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు నుంచి తిరుపతికి ఉదయం ఆరుగంటలకు వెళ్లే ఆర్టీసీ బస్సుకు కొత్త మాధవరం వద్ద గురువారం ఏడు గంటలప్రాంతంలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ముందు వెళ్తున్న లారీ చోదకుడు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ గమనించి బ్రేక్ వేశారు .దీంతో అదుపు తప్పి లారీని తగిలింది. దీంతో బస్సులోని కొందరు ప్రయాణికులకు మూగ గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం తీవ్రతకు ఆర్టీసీ బస్సు ఎడమ వైపు ఉన్న అద్దం పగిలింది. లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లి పోవడంతో జరిగిన ఘటనను ఒంటిమిట్ట పోలీసుల దృష్టికి బద్వేలు ఆర్టీసీ డ్రైవర్ తీసుకుపోయారు. మార్గమధ్యలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అదే బస్సులోనే డ్రైవర్ తీసుకెళ్లారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు (65) మృతి చెందారు. అనారోగ్యంతో ఈ నెల 22న ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారని, మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. సంబంధికులు ఎవరైనా ఉంటే ఆసుపత్రి అవుట్‌పోస్టులో సంప్రదించాలని తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ముద్దనూరు, న్యూస్‌టుడే: ముద్దనూరు-తాడిపత్రి రహదారిలో చింతకుంట గ్రామ సమీపంలో గురువారం ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధి చింతకుంట గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక తాడిపత్రి వైపు నుంచి వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో రెండు లారీలు దెబ్బతినగా డ్రైవర్లకు ఏ ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

అనుమతుల్లేని ఆసుపత్రులపై చర్యలకు డిమాండ్

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు పట్టణంలో అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం బద్వేలు ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుభవం లేకపోయినా చిన్నపిల్లలకు సైతం ఆర్ఎంపీలు వైద్యం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నాయకులు మునిరత్నం, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: బీసీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొలువలి వేణుగోపాల్ అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే నాయీబ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తోందన్నారు. దేవాలయాల పాలక మండలిలో సభ్యులుగా చేస్తున్నారన్నారు. ఆలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచారన్నారు. సామాజిక పింఛన్లు, అన్న క్యాంటీన్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం చెప్పిన విధంగా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కృష్ణయ్య, తిరుమలనాథ్, మురళి, బాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొలువలి వేణుగోపాల్, పక్కన నాయకులు

కాంగ్రెస్‌తోనే హక్కుల పరిరరక్షణ

సమావేశంలో ప్రసంగిస్తున్న కన్యాకుమారి పార్లమెంట్ సభ్యుడు విజయ్ వసంత్

మైదుకూరు, న్యూస్‌టుడే : రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐసీసీ పరిశీలకుడు, కన్యాకుమారి పార్లమెంట్ సభ్యుడు విజయ్ వసంత్ అన్నారు. గురువారం స్థానిక షాదీఖానాలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా అభిప్రాయ సేకరణకు వచ్చిన సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ స్థానిక ప్రతినిధులతో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సరైన నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు కమిటీ నియోజకవర్గాల పర్యటన చేస్తున్నట్లు పార్లమెంట్ సభ్యుడు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ ప్రతినిధులు సోమశేఖర్, నరసింహులు, డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ చాపాడు రామ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భాజపా మండల అధ్యక్షుడిగా రవిచంద్ర

మండల అధ్యక్షుడిని సత్కరిస్తున్న భాజపా నాయకులు

బి.కోడూరు: భాజపా బి.కోడూరు మండల అధ్యక్షుడిగా పోలుబోయిన రవిచంద్రను జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం బి.కోడూరులో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మెజారిటీ బూత్ కమిటీ అధ్యక్షుల ద్వారా మండల కమిటీ నియామకం జరిగినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు. ఏకగ్రీవంగా ఎంపికైన రవిచంద్రను జిల్లా ఉపాధ్యక్షుడితో పాటు జిల్లా నాయకులు పుష్పాల శ్రీనాథ్‌రెడ్డి, ఉట్టి శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

చక్కని రాత.. భవిష్యత్తుకు బాట

కొండాపురం, న్యూస్‌టుడే: చక్కని చేతిరాత విద్యార్థుల ఉన్నత భవితకు ఎంతో తోడ్పాటునిస్తుందని చౌటిపల్లె జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి గురువారం అన్నారు. జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు 25 రోజులుగా చేతిరాతపై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.

అన్నక్యాంటీన్ పరిశీలన

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్ నిర్వహణ తీరును గురువారం పురపాలక సంఘ కమిషనరు వెంకటరామిరెడ్డి ఆరా తీశారు. స్థానిక తాడిపత్రి బస్టాప్‌లో ఉన్న ఈ క్యాంటీన్‌కు వెళ్లి ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి రోజూ వెయ్యి టోకెన్లు ఇచ్చే వారని ఇప్పుడు ఆ సంఖ్య 1,400 చేరిందన్నారు. క్యాంటీన్ ఎదుట బస్టాప్, ఎదురుగా ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నందున భోజనం చేసే వారి సంఖ్య పెరుగుతోందన్నారు.

CHANGE OF NAME
I, GUNAGANURU SREELAKSHMI DIVYA (Old Name), resident of Door No.3/204-1-5A, Sriramulapeta, Yerraguntla Town and Mandal, Y.S.R. Kadapa District, hereby declare that I have changed my name as GUNAGANURU SREE LAKSHMI DIVYA (New Name) for all future purposes.

గిట్టుబాటు ధర లేక.. రైతులు విలవిల

● సకాలంలో వర్షాలు పడక తగ్గిన దిగుబడులు
● పత్తి మార్కెట్ ధర రూ.6500.. ఇచ్చేది రూ.4000

– న్యూస్‌టుడే, రాజుపాళెం

ఆరుగాలం శ్రమించిన పత్తి పంటకు అటు దిగుబడులు రాక.. ఇటు ధరలు లేక.. రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. జిల్లాలో అత్యధికంగా రాజుపాళెం మండలంలో 10 వేల పైగా ఎకరాల్లో సాగు చేసేవారు. ధరలేక పోవడం, మళ్లీ గులాబీ పురుగు రావడంతో చాలా వరకు తగ్గిపోయింది. మండలంలో 930 ఎకరాలు పండించారని అధికారులు అంటుండగా దాదాపు 1000 ఎకరాల వరకు సాగు చేసినట్లు అంచనా. జిల్లాలో 70 వేల ఎకరాలు వరకు విస్తరించాల్సిన పరిస్థితి ప్రస్తుతం 10 వేల ఎకరాలు కూడా లేదని తెలుస్తోంది. ఈసారి ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు పడక పోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.

రాజుపాళెం: సాగులోని పత్తి పంట

● మార్కెట్‌లో నాణ్యమైన పత్తి క్వింటాలు రూ.6500 ధర ఉందంటున్నారు. నాణ్యత లేనిది కేవలం క్వింటా రూ.4000 లోపు పలకడంతో రైతులు కుదేలవుతున్నారు. కొందరు పంటను తొలగించి ప్రత్యామ్నాయంగా ఇతర వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఇలా రైతులు పత్తి పంట సాగు చేయలేక మానుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు నట్టేట్ట ముంచుతున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో కూలీలు, పురుగు మందులు, ఎరువుల ధరలు పెరుగుతూ ఉంటే పత్తి ధర ఎందుకు తగ్గుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కడప నగరంలోని తన నివాసంలో గురువారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాధవి ప్రజా దర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతిగా ఉందని, ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. కడప నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే క్రమంలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేశ్‌చంద్ర, తెదేపా నగర అధ్యక్షుడు మన్సూర్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ జట్టుకు విద్యార్థి ఎంపిక

సాయిమోహన్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయిని ముబీనరెహానా

కడప విద్య, న్యూస్‌టుడే : ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో కడప నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిమోహన్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని ముబీనారెహానా అన్నారు. త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చంద్రగిరిలో జరిగిన అండర్-14 బాలుర విభాగంలో తమ పాఠశాల విద్యార్థి రిహాన్‌బాషా జిల్లా జట్టు నుంచి పాల్గొని ప్రతిభ చూపారన్నారు.

స్వర్ణ కమలాపురమే ధ్యేయం

కమలాపురం, న్యూస్‌టుడే : 2047 నాటికి స్వర్ణ కమలాపురం నియోజకవర్గంగా చేయడమే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలోని మూడో వార్డు సచివాలయంలో నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ యూనిట్ (సీవీఏపీయూ) కార్యాలయాన్ని ఆర్డీవో జాన్ ఎర్విన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయంలో ప్రభుత్వం సిబ్బందిని నియమించిందని, ఇందులో మేము కూడా భాగస్వాములుగా ఉంటామన్నారు. ఆర్డీవో ప్రత్యేకాధికారిగా ఉంటారన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా అన్ని వర్గాల ప్రజలు అర్జీలు ఇస్తే తాము పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యాలయ బాధ్యుడు మహేశ్, కమిషనర్ ప్రహ్లాద్, మండల కన్వీనర్ రాఘవరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కమలాపురం: ఓ ఛానల్ రిపోర్టర్ గత కొంత కాలంగా వేధిస్తున్నాడని మండలం అంగన్వాడీ కేంద్రం ఆయా, కార్యకర్త, సూపర్‌వైజర్‌తో కలిసి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డికి ఫిర్యాదు చేశారు.

కలెక్టర్ కార్యాలయమే కంపు కొడుతోంది సారూ!

గృహనిర్మాణశాఖ కార్యాలయం ఎదుట దిబ్బలా మారిన దుస్థితి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : చెత్త.. ఎన్నో రోగాలకు కారణమవుతోంది. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.. స్వచ్ఛ కడప సాధనకు ప్రజలు సహకరించాలి.. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయొద్దు.. చెత్త తరలించే వారికే అందించండి.. అంటూ సభలు, సమావేశాల్లో ఊదరగొడుతున్న అధికారులు తమ కార్యాలయాల పరిసరాల్లో పరిస్థితుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా జిల్లా కార్యాలయ ప్రాంగణం చెత్తకు నిలయంగా మారిందనడంలో సందేహంలేదు. కలెక్టరేట్ లోని మూడు బ్లాకుల్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఉండే ప్రాంగణం మినహా మిగిలిన ఓ, డీ బ్లాకులు అధ్వానంగా ఉన్నాయి. ఓ బ్లాకులో కనీసం మరుగుదొడ్లు కూడా లేవంటే అతిశయోక్తికాదు. ఇక్కడ ఎక్కడ చెత్తా చెదారం, నీటినిల్వలు ఉండటంతో దుర్వాసన వస్తోంది. దీంతో పాటు ఇక్కడే కుక్కలు కూడా స్వైర విహారం చేస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఓ బ్లాకులో జిల్లా పంచాయతీ కార్యాలయం, గనుల శాఖ, గృహనిర్మాణం, ఖజానా శాఖలున్నా కనీసం చెత్త ఊడ్చేవారే లేకపోవడం విశేషం. గతంలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమం చేపట్టి పరిసరాలు శుభ్రంగా ఉంచాల్సి ఉంది. అయితే ఆ దిశగా కలెక్టరేట్ నిర్వహణ విభాగం, వివిధ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా ఉన్న పరిస్థితులను చూసి వచ్చే సందర్శకులు పెదవి విరుస్తున్నారు.

ఓ బ్లాకులోని ఖజానా కార్యాలయం ఎదుట పోగైన చెత్త

మూట జారితే.. తప్పదు ప్రమాదం

ఈ చిత్రం చూశారా..? పులివెందులనుంచి వీరపునాయునిపల్లె వెళ్లే మార్గంలో ఆటోలో ప్రయాణికులతోపాటు బియ్యం మూటలను వేసుకుని ప్రయాణిస్తున్నారు. ఆ మూటలపై ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. ఈ మాత్రం కుదుపులకు గురైనా.. మూట జారినా దానిపై కూర్చున్న ప్రయాణికుడు కింద పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఏదైనా ప్రమాదం జరగకముందే పోలీసులు ప్రమాదకరంగా ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటో చోదకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పులివెందుల

డీఎల్‌డీఏ ఈఓగా రాజ తిమ్మారెడ్డి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లా పశుగణాభివృద్ధి (డీఎల్‌డీఏ) సంస్థ కార్యనిర్వహణ అధికారిగా (ఈఓ) రాజ తిమ్మారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప, పులివెందుల డివిజన్లకు నియమించిన ఆ సంఘాలకు బాధ్యతలు చేపట్టారు.

నీటిపారుదల శాఖ ఈఈగా చెంగల్రాయుడు

కడప (గ్రామీణ), న్యూస్‌టుడే : నీటిపారుదల శాఖ రెగ్యులర్ డివిజన్ ఈఈగా చెంగల్రాయుడు నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా డీఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి ఈఈగా పనిచేసిన వెంకట్రామయ్య తెలుగుగంగ ఎస్ఈగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన గురువారం విధుల్లో చేరారు.

ట్రాఫిక్ సీఐ బాధ్యతల స్వీకరణ

కడప నేరవార్తలు : కడప ట్రాఫిక్ సీఐగా సురేశ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ విభాగంలో పని చేస్తున్న సురేశ్‌రెడ్డికి కడపకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చమ్మ ఇంటిని ఇప్పించండి

మారుతీనగర్, న్యూస్‌టుడే : ఆక్రమణదారుని ఆత్యాశకు, అధికారుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైందని రాచపాళెం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. మానసిక ఒత్తిడికి గురై న్యాయం కోసం పోరాడి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలు పిచ్చమ్మ మృతదేహానికి శివానందపురంలో నాయకులు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన వద్ద అప్పు చేసిందని తప్పుడు పత్రాలు సృష్టించి ఓ వడ్డీ వ్యాపారి వృద్ధురాలని కూడా చూడకుండా కొట్టి సామాన్లు బయట పడేసి మానసిక వికలాంగురాలైన కుమార్తెను గాయపరిచిఇంటిని కూల్చివేసిన విషయం నగర ప్రజలకు తెలుసన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చమ్మ ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుని ఆమె కుమార్తెకు న్యాయం చేయాలని డిమాండు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సూచించారు. స్థానిక గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో కడప పోలీసు సబ్ డివిజన్ సిబ్బందితో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమీపిస్తుండడంతో రౌడీషీటర్లు, గొడవలు సృష్టించే వారిపై నిఘా ఉంచాలని ఎస్పీ పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్, జూదం, మట్కా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా భద్రతకు, గంజాయి, డ్రగ్స్ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాల్లో పోలీసులు పల్లెనిద్ర చేయాలన్నారు. భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాల విషయంలో న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. శక్తి బృందాల పనితీరు మెరుగుపరచాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు, వ్యాపార సముదాయాలు, ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో శక్తి బృందాలచే పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, సుధాకర్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, చిత్రంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్సైలు

ఉపన్యాస పోటీల్లో మెరిసిన విద్యార్థులు

ఉపన్యాసం చేస్తున్న విద్యార్థిని .. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసిన కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరం ఆర్యాపురంలోని పవన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వై.చరణ్ (7వ తరగతి), బి.సింధుజ (7వ తరగతి), ఎస్.విష్ణుప్రణీత్ (8వ తరగతి) నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మాజీ ముఖ్యమంత్రి చెప్పేవన్నీ అబద్ధాలే

అరటి పంటను చూపుతున్న పులివెందుల వ్యవసాయ కమిటీ ఛైర్మన్ అమర్నాథ్ యాదవ్ తదితరులు

పులివెందుల, న్యూస్‌టుడే: అరటి రైతుల సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలన్నీ అబద్ధాలే అని, ప్రస్తుతం టన్ను రూ.11వేలు పలుకుతోందని పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అమర్నాథ యాదవ్, సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామసూరారెడ్డి అన్నారు. గురువారం వారు నల్లపురెడ్డిపల్లెలోని అరటి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట సరిగా పండని అరటి తోటలను ఎంచుకుని పరిశీలించి కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జయరామిరెడ్డి, సాయిరెడ్డి, నల్లపురెడ్డిపల్లె రైతులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో తేడాలు తగదు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, ఎర్రగుంట్ల, మైదుకూరు, బద్వేలు, కమలాపురం మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయిలు వందల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. అధికారులు పన్ను వసూళ్లలో పేదలు, పెద్దలు అనే తేడాలు చూపిస్తున్నారని మండిపడ్డారు. గురువారం కడప ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవించే సమాచార హక్కు చట్టం ద్వారా జిల్లాలోని మున్సిపాలిటీల బకాయిలు ఇవ్వాలని కోరగా ఏ ఒక్కరూ స్పందించలేదు. తిరిగి అప్పీల్ చేయడంతో సమాచారం ఇచ్చారన్నారు. కడపలో 684 మంది, బద్వేలు 148, పులివెందుల 106, జమ్మలమడుగు 71, ప్రొద్దుటూరు 568, కమలాపురం 8, ఎర్రగుంట్ల 13, మైదుకూరులో 53 మంది ఒక్కొక్కరు రూ.50 వేల నుంచి రూ.85 లక్షల వరకు పన్ను బకాయిలున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, నాయకులు నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, బాల ఓబయ్య, శంకర్‌నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రముఖ కాంట్రాక్టర్ రామలింగా రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పవన్‌భార్గవ్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఇందిరానగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమం, అజాద్‌బృంద వృద్ధాశ్రమంలోని పేదలకు గురువారం అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం చింతకొమ్మదిన్నె గంగమ్మతోపులో ఉండే ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వేంపల్లెలోని అమ్మ అనాథ శరణాలయంలో అన్నదానం, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.

ఆహార పొట్లాలు అందజేస్తున్న కాంట్రాక్టర్ రామలింగారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు

మహిళ మెడలోని గొలుసు చోరీ

పులివెందుల : పులివెందులలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్న లీలావతమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును గురువారం దొంగ లాక్కుని వెళ్లాడు. పులివెందులకు చెందిన ఆమె తన భర్త సుబ్బారావుతో కలిసి వైఎస్సార్ క్రీడా మైదానంలో వాకింగ్‌కు వెళ్లింది. నడక చేస్తుండగా పక్కనే ఉన్న గోడ దూకి వచ్చిన దొంగ ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాగడంతో.. దాన్ని ఆమె గట్టిగా పట్టుకుంది. సగం గొలుసు తెంపుకొని చోరుడు పరారీ అయ్యాడు. గొలుసు మొత్తం 50 గ్రాములు ఉండగా.. సగం దొంగపాలైందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పులివెందుల ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు.

రైలు ఢీకొని 28 గొర్రెల మృతి

చింతకొమ్మదిన్నె: తాడిగొట్ల గ్రామానికి చెందిన కాలిబోయిన సురేంద్రకు చెందిన 28 గొర్రెలను గురువారం రైలు ఢీకొనడంతో మృతి చెందాయి. ఆయన తన గొర్రెలను మేపుకోవడానికి కృష్ణాపురం రైల్వే కట్టపైకి వెళ్లారు. అయితే రైలు వస్తున్న సమయంలో మేస్తున్న గొర్రెల వద్దకు కుక్కలు రావడంతో అవి బెదిరి ఉన్నఫలంగా పట్టాలపైకి పరుగులు తీశాయి. దీంతో వాటిని రైలు ఢీకొంది. 28 గొర్రెలు మృతి చెందడంతో దాదాపు రూ. 4 లక్షల వరకు నష్టపోయానని బాధితుడు సురేంద్ర వాపోయారు. ప్రభుత్వం నుంచి తనకు సాయం అందించాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో..

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండలంలోని కె.యర్రగుడి తండాలో దేశే గాంగేనాయక్‌కు చెందిన ఆరు గొర్రె పిల్లలు గురువారం కుక్కలదాడిలో మృతి చెందాయి. రూ.40 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. గ్రామంలో వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందుతున్నా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన వాపోయారు.

అన్నమయ్య జిల్లాలో విలీనం చేయొద్దు!

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే నిర్ణయం తీసుకోవడం చాలా అన్యాయమని ఆ మండలాల తెదేపా నాయకులు అన్నారు. గురువారం కడపలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడును, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, తెదేపా రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కడపకు కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలాన్ని 80 కి.మీ దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ప్రజల, అధికారుల కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకుని గతంలో రాజంపేట డివిజన్‌లో ఉన్న

డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

గ్రంథాలయాభివృద్ధికి సహకారం

రాఘు రామకృష్ణ రాజుకు పుస్తకం అందిస్తున్న సాహితీ పీఠం నిర్వాహకులు

బిల్టప్, న్యూస్‌టుడే : బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని జానమద్ది సాహితీ పీఠం నిర్వాహకులు జానమద్ది విజయభాస్కర్ గురువారం కడప విమానాశ్రయంలో రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణ రాజును కలిసి సత్కరించారు. అనంతరం జానమద్ది స్మారక తెలుగు భాష వైభవాన్ని తెలిపే తెలుగు భేరి పుస్తకాన్ని అందజేశారు. రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ బ్రౌన్ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి సాయికుమార్, ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు కేశవులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కడప విద్య, న్యూస్‌టుడే : అడ్వెంచర్ క్యాంపులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్) ప్రధానాచార్యులు డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకూ మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన రాక్ క్లైమ్బింగ్ క్యాంపులో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లు బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థి సయ్యద్‌అలీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి మహమ్మద్‌లను గురువారం తన ఛాంబర్‌లో ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య, అధికారి లెఫ్టినెంట్ మహేశ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేశ్‌బాబు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో రైతేరాజు

వేముల, పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : భవిష్యత్తులో రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం వేముల మండలంలోని వి.కొత్తపల్లెలో, పెండ్లిమర్రి మండలం పాతసంగటిపల్లెలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులతో మాట్లాడి ఏఏ పంటలు సాగుచేశారని తెలుసుకున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ముందుకెళ్లాలని సూచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

వేంపల్లె, న్యూస్‌టుడే : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో చట్టాలు, రాజ్యాంగ విలువలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తాళ్లపల్లె, వేంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు చంద్రకళ, రెడ్డిసాయి, ఈశ్వర్‌లకు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

సహచర పోలీసుల ఔదార్యం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సీఐ వై.సతీశ్‌కుమార్‌కు అతని బ్యాచ్‌కు చెందిన ఏపీ, తెలంగాణ పోలీసులు ఆర్థిక సాయం చేశారు. సేకరించిన రూ.14,01,000 నగదును అతని కుటుంబానికి అందజేసి ఔదార్యం చాటారు. సతీశ్‌కుమార్ మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పోలీసులున్నారు.

జగన్.. బెంగళూరుకు పయనం

కడప జిల్లా నాయకులతో మాట్లాడుతున్న జగన్

పులివెందుల, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మూడు రోజుల పర్యటనను ముగించుకుని బెంగళూరుకు పయనమయ్యారు. గురువారం ఉదయం 8 గంటలకు హెలికాప్టర్‌లో వెళ్లాల్సి ఉండగా పొగమంచు కారణంగా గంటన్నర ఆలస్యంగా.. ఉదయం 9.45 గంటలకు బయలుదేరి వెళ్లారు. ఆయనకు కడప జిల్లా వైకాపా నాయకులు వీడ్కోలు పలికారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : రాజంపేట శాసనసభ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నియోజకవర్గ బాధ్యుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. ఒంటిమిట్ట బస్టాండు ప్రాంతంలో తెదేపా నూతన కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం చక్కగా పనిచేస్తుందన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి కష్టమొచ్చినా తెదేపా కార్యాలయంలో అర్జీలు సమర్పిస్తే అధికారులకు తెలియజేసి న్యాయం చేస్తామని వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, క్లస్టర్ కన్వీనరు ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, ఎంవీ రమణ, బొబ్బిలిరాయుడు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు భవిష్యత్తు

మెడిఫెస్ట్ 2కె25 ఫ్రెషర్స్ పార్టీలో పాల్గొన్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కళాశాల యాజమాన్యం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : పారా మెడికల్ కోర్సులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మూలవంక సమీపాన కల్యాణ మంటపంలో ముక్తియార్ విద్యా సంస్థల మెడిఫెస్ట్ 2కె25 ఫ్రెషర్స్ పార్టీ రాష్ట్ర షేక్ షిర్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్ ముక్తియార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల ఛైర్మన్ ముక్తియార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ అలీ అక్బర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యం

వేంపల్లె, న్యూస్‌టుడే : మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని పట్టణ సీఐ నరసింహులు అన్నారు. వేంపల్లెలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, కాపువీధి, ఇంకా పలుచోట్ల మహిళల భద్రత, పోక్సో చట్టం, బాలికలు ఎదుర్కొనే మానసిక, ఇతర వేధింపులపై ఎలా వ్యవహరించాలన్న అంశంపై ఆయన అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో లింకులు పంపించినా వాటికి స్పందించరాదన్నారు. శక్తియాప్ మహిళల రక్షణకు కవచంలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు నోటీసులు జారీ చేయాలని డిమాండ్

వేముల: వేముల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పలు సమస్యలు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతుబజారులో కూరగాయల ధరలు



కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా.. బంగాళదుంప-40, క్యాబేజి-28, క్యారెట్-50, బీన్స్-38, బీట్‌రూట్-38, కీర-30, దోస-40, దొండకాయలు-50, ముల్లంగి-40, అల్లం-60, 80, క్యాలీఫ్లవర్-38, క్యాప్సికం-60, టమాట-35, 40, మిరపకాయలు-45, వంకాయలు-25, బెండకాయలు-38, బీర-45, కాకర- 45, మటిక్కాయ-45, చిక్కుడు-58, అలసందకాయలు-50, అనపకాయలు-60, ఉల్లిపాయలు-20, 25, మునగకాయలు-60.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

రిహాన్‌ను అభినందిస్తున్న డీఎస్‌డీవో గౌస్‌బాషా, కోచ్ అమృతరాజ్

కడప క్రీడలు: ఇటీవల మదనపల్లెలో జరిగిన స్కూల్‌గేమ్స్ అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కడపకు చెందిన రిహాన్ రాణించి జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లో డిసెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఏపీ జట్టు తరపున బాలుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. బాలుడు గత మూడు సంవత్సరాలుగా కోచ్ అమృతరాజ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఈ మేరకు వారిద్దరూ గురువారం డీఎస్‌డీవో షేక్ గౌస్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి విషయాన్ని తెలిపారు. డీఎస్‌డీవో గౌస్‌బాషా వారిని అభినందించారు. జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో కూడా సత్తాచాటి జిల్లాకు కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు.

మొక్కే కదాని వదిలేస్తే.. మానులవుతున్నాయ్!



కడప నుంచి తాడిపత్రికి వెళ్లే జాతీయ రహదారిలోని కమలాపురం నియోజకవర్గంలోని గొట్లూరు వద్ద ఉన్న వంతెనకు రావి మొక్కలు పెరిగి పెద్ద చెట్లుగా మారుతున్నాయి. విస్తరించిన ఊడలతో ఎలాంటి కట్టడాలకైనా చీలికలు తెచ్చే ఈ మొక్కలను నిర్లక్ష్యంగా వదిలేశారు. విస్తరించిన ఊడలు వంతెనకు తెచ్చేలా పెరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వంతెన ఉనికికే ప్రమాదం. ఇప్పటికైనా వాటిని తొలగించాల్సిన అవసరం ఉంది.– ఈనాడు, కడప

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu